శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము

(మొదటి భాగము)

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
మహర్షులు పాండవులం జూడవచ్చుట	12 - 1 - 1	01
నారదుఁడు ధర్మరాజునకుఁ గర్ణుని చరితంబు సెప్పుట	12 - 2 - 1	09
ధర్మరాజు స్త్రీలకు రహస్య రక్షణంబు లేకుండ శపియించుట	12 - 6 - 11	20
అర్జునుఁడు ధర్మజున కుచిత వచనంబుల మనస్తాపోపశమంబు సేయుట	12 - 8 - 1	23
నకులుఁడు ధర్మజునకు మనస్తాపోపశమంబు సేయుట	12 - 12 - 1	34
ద్రౌపది ధర్మజునకు హితవచనంబుల మనస్తాపోపశమంబు సేయుట	12 - 14 - 1	39
జనకున కతని సతితో నైన సంవాదం బర్జునుఁడు ధర్మజునికిఁ జెప్పుట	12 - 18 - 1	51
దేవస్థానుం డను ముని ధర్మజునకు హితోపదేశంబు సేయుట	12 - 20 - 1	56
పారాశర్యుఁడు సుద్యుమ్న చరితంబు ధర్మజునకుఁ జెప్పుట	12 - 24 - 1	63
లిఖితుండు సుద్యుమ్ననిచేత నిక్కృత్తకరుం డగుట	12 - 24 - 19	65
పారాశర్యుఁడు ధర్మజునకు సేనజిత్తువాక్యంబు లుపన్యసించుట	12 - 26 - 13	74
జనకున కశ్మకుండు సెప్పిననీతి వ్యాసుఁడు ధర్మజునకుఁ జెప్పుట	12 - 2 - 82	82
ధర్మరాజునకుఁ గృష్ణుఁడు షోడశరాజుల చరిత్రంబులు సెప్పుట	12 - 29 - 16	89
శ్రీ కృష్ణుఁడు ధర్మజునకుఁ బర్వత నారదుల వృత్తాంతంబు సెప్పుట	12 - 30 - 4	100
శార్దూలంబుచేఁ జచ్చిన సువర్ణష్ఠివి నారదువలనఁ బునర్జీవితుఁ డగుట	12 - 31 - 41	109
కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు ధర్మాధర్మంబు లెఱిఁగించుట	12 - 36 - 1	119
వ్యాసుఁడు ధర్మజునకు బ్రాయశ్చిత్త విశేషంబు లెఱిగించుట	12 - 36 -1	122

కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు నపాత్రపురుషుల నెఱింగించుట	12 - 37 - 23	131
ధర్మరాజు సపరివారంబుగాఁ గరినగరంబుఁ బ్రవేశించుట	12 - 38 - 34	140
చార్వాకుం డను రాక్షసుఁడు బ్రాహ్మణ నిగ్రహంబునఁ జచ్చుట	12 - 39 - 22	145
ధర్మరాజు పట్టాభిషేక మహోత్సవము	12 - 40 - 9	151
ధర్మజుఁడు శ్రీకృష్ణు నుచిత వచనంబుల స్తుతించుట	12 - 43 - 1	159

ద్వితీయాశ్వాసము

ధర్మనందనుని ప్రవర్తనము	12 - 45 - 3	167
ధ్యానాసక్తుఁడైన శ్రీకృష్ణునింగని ధర్మజుఁడు సంభాషించుట	12 - 45 - 13	169
భీష్ముఁడు శ్రీకృష్ణుని భక్తియుక్తుండై స్తుతించుట	12 - 47 - 7	178
శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకు బరశురాముని చరిత్రంబు చెప్పుట	12 - 49 - 1	195
పరశురాముఁడు కార్తవీర్యార్జునిఁ జంపుట	12 - 49 - 41	201
భూదేవి కశ్యపునితోఁ బరశురామునిచేఁ జావనిరాజులఁ జెప్పుట	12 - 49 - 66	206
కృష్ణుఁడు ధర్మజునకు ధర్మము లుపదేశింప భీష్ము నియమించుట	12 - 50 - 29	213
ధర్మరాజు కృష్ణాదులతోడ భీష్మపాలికిం బోవుట	12 - 53 - 27	222
భీష్ముఁడు ధర్మరాజును సప్రేమంబుగా గారవించుట	12 - 55 - 1	231
భీష్ముఁడు ధర్మజునకు విప్రులలో దండార్హుల నిరూపించుట	12 - 56 - 29	238
భీష్ముండు ధర్మజునకు దండనీతి జన్మప్రకారం బెఱింగించుట	12 - 59 - 11	247
వైన్యుం డనురాజు చరిత్రంబు భీష్ముఁడు ధర్మజునకుం జెప్పుట	12 - 59 - 201	252
భీష్ముఁడు ధర్మజునకు వర్ణాశ్రమ ధర్మంబు లెఱింగించుట	12 - 60 - 1	258
రాష్ట్రజనుల కర్హధర్మంబులు భీష్ముఁడు ధర్మజునకుఁ దెలుపుట	12 - 67 - 2	268
బృహస్పతి వసుమనుం డను రాజునకుం జెప్పిన రాజధర్మ ప్రకారము	12 - 68 - 1	273
వాయుదేవుఁడు పురూరవునకుఁ జెప్పిన రాజధర్మ ప్రకారము	12 - 73 - 2	286
కుబేరునకు ముచుకుందునకుఁ గలిగిన సంవాదము	12 - 75 - 3	291
కేకయరాజ రాక్షస సంవాద ప్రకారము	12 - 78 - 6	299
కాలక వృక్షీయ క్షేమదర్శ సంవాద ప్రకారము	12 - 83 - 1	306

బండారంబు వృద్ధిసేయు తెఱంగు భీష్ముండు ధర్మజునకుఁ జెప్పుట	12 - 89 - 1	316
మాంధాతృన కుతథ్యుఁడు సెప్పిన హితవాక్యముల ప్రకారము	12 - 91 - 1	319
వసుమనుం డను రాజునకు వామదేవుండు సెప్పిన ధర్మప్రకారము	12 - 93 - 1	322
ధర్మజునకు భీష్ముండు సమరంబున పాడి దెల్పుట	12 - 96 - 6	326
ఇంద్రాంబరీష సంవాద ప్రకారము	12 - 99 - 1	329
సమరానివర్తనంబు వలని ఫలము	12 - 100 - 1	336

తృతీయాశ్వాసము

కాలనిరూపణాదులగు రణోపాయంబుల ప్రకారంబు	12 - 101 - 2	339
ధర్మజునకు భీష్ముఁడు శకునాపశకునములు దెలుపుట	12 - 103 - 2	344
రాజు పగఱయెడ నుండవలయు విధము	12 - 104 - 2	346
కాలకవృక్షీయ మహాముని క్షేమదర్శికిఁ జెప్పిన హితవాక్యములు	12 - 105 - 2	348
ధర్మజునకు భీష్ముండు గణజనులం బాలించు ప్రకారంబు సెప్పుట	12 - 108 - 10	353
ధర్మరాజునకు భీష్ముండు ధర్మసూక్ష్మత తెఱం గెఱింగించుట	12 - 109 - 3	355
పాపనిస్తరణ ప్రకారము	12 - 111 - 2	357
వ్యాఘ్రగోమాయువు సంవాదము	12 - 112 - 2	359
భీష్ముండు ధర్మజునకు సహాయ సంపన్నత్వం బావశ్యకం బగుట సెప్పుట	12 - 113 - 1, 2	367
సముద్ర సరిత్సంవాదము	12 - 114 - 2	369
కుర్కుర నీచత్వముం దెలుపునట్టి యితిహాసము	12 - 117 - 2	371
భీష్ముఁడు ధర్మజునకు దండనీతి ప్రభావం బెఱింగించుట	12 - 121 - 8	377
వసుహోముఁడు మాంధాతృనకుఁ జెప్పిన దండోత్పత్తి ప్రకారము	12 - 122 - 1	379
భీష్ముఁడు ధర్మరాజునకు ధర్మార్థకామంబుల తెఱం గెఱింగించుట	12 - 123 - 3	383
భీష్ముఁడు ధర్మజునకు సుమిత్రుఁ డను రాజు చరిత్రంబు సెప్పుట	12 - 125 - 8	392
భీష్ముఁడు ధర్మజునకుఁ గాపవ్యోపాఖ్యానము సెప్పుట	12 - 131 - 1	399
భీష్ముఁడు ధర్మజునకు దీర్ఘదర్శి మొదలగు మత్స్యముల తెఱం గెఱింగించుట	12 - 135 - 1	402
పలితరోమశు లను మూషికమార్జాలంబుల సంవాద ప్రకారము	12 - 136- 18	407

బ్రహ్మదత్తునితోఁ బూజని యను శకునికైన సంవాద ప్రకారము	12 - 137 - 4, 5	419
కణికుఁడు శత్రుంజయున కుపదేశించిన హితవచనముల ప్రకారము	12 - 138 - 4	424
విశ్వామిత్ర చండాల సంవాదము	12 - 139 - 12	428
భీష్ముఁడు ధర్మజునకు శరణాగత రక్షణ సుకృతం బెఱింగించుట	12 - 141 - 4	436
కపోతంబు దన శరీరమును బోయ కాహారంబుగా నిచ్చుట	12 - 142 - 43	441
భీష్ముఁడు ధర్మజునకు గృధ్రజంబుకోపాఖ్యానము సెప్పుట	12 - 149 - 1	454
భీష్ముఁడు ధర్మజునకు బవన శాల్మలీతరు సంవాదంబులు సెప్పుట	12 - 150 - 1	460
భీష్ముఁడు ధర్మజునకు దమంబు ప్రభావం బెఱింగించుట	12 - 154 - 6	467
భీష్ముఁడు ధర్మజునకు దపంబు విధము సెప్పుట	12 - 155 - 1	469
భీష్ముఁడు ధర్మజునకు సత్య స్వరూపాదులు సెప్పుట	12 - 156 - 3	470
భీష్ముఁడు ధర్మజున కరిషడ్వర్గాదులు దెలుపుట	12 - 157 - 3, 4	471
భీష్ముఁడు నకులునకు ఖడ్గ ప్రభావంబు తెఱం గెఱింగించుట	12 - 160 - 9	477
ధర్మజునితో విదురాదులు ధర్మార్థ కామంబుల తారతమ్యంబు సెప్పుట	12 - 161 - 4	482
భీష్ముఁడు ధర్మజునకు నాడీజంఘుని చరిత్రంబు సెప్పుట	12 - 162 - 28	486
నాడీజంఘుఁడు దుష్టబ్రాహ్మణునిచే మృతుండై మరల జీవించుట	12 - 166 -23	494

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ సంక్రామణనిపుణ వి । లాస కటాక్షా! నివృత్తి లంపటచిత్తో
ల్లాసన దక్షా! వేద । వ్యాస వచోవిభవ లక్ష్య! హరిహరనాథా ! 1

ప్రతిపదార్థం: శ్రీ= సంపదను; సంక్రామణ= కలుగజేయటంలో; నిపుణ= మంచి నేర్పరి అయిన; విలాస కటాక్షా!= అందమైన క్రీగంటిచూపు కలవాడా!; నివృత్తి లంపట= సంసారబంధంనుండి విరక్తి చెందటంలో ఆసక్తమయిన; చిత్త= మనస్సుకు; ఉల్లాసన దక్షా!= ఉత్సాహాన్ని కలిగించటంలో సమర్థుడా!; వేదవ్యాస= వేదవ్యాసముని యొక్క; వచో విభవ= వాక్యసంపదకు అంటే ఆ మహర్షి రచించిన బ్రహ్మసూత్రాలలో, మహాభారత పురాణాదులలో గల వాఙ్మయవైభవాని కంతా; లక్ష్య!= లక్ష్యమైనవాడా!, గురి అయినవాడా!, హరిహరనాథా!= ఓ హరిహరనాథస్వామీ!

తాత్పర్యం: భక్తులకు కోరిన సంపద లన్నింటిని ప్రసాదించే నిపుణమైన అందమైన క్రీగంటి చూపులు కలవాడవూ, సంసారబంధాలను వదలి వైరాగ్య చిత్తవృత్తితో ఉన్న విరక్తుల హృదయాలకు ఎల్లప్పుడూ ఆనందోత్సాహాలను కలిగించేవాడవూ, వేదవ్యాస మునీంద్రులవారి వాఙ్మయ వైభవానికంతా గమ్యమైన వాడవూ అయిన ఓ హరిహరనాథస్వామీ! (సావధానంతో నేను చెప్పబోయే ఈ కావ్యార్థాలను అవధరించుము.)

విశేషం: ఆశ్వాసారంభంలో కృతిపతిని సంబోధిస్తూ కందపద్యం చెప్పటం ఆంధ్రకావ్య సంప్రదాయం. అందులో వాడబడే విశేషణాలు ఒక్కొక్కసారి ఆశ్వాస కథార్థాలను వ్యంజింపజేస్తూ ఉండవచ్చును. పాండవులకు శ్రీకృష్ణుడి కటాక్షం వలన రాజ్యసంపదలు దక్కటం, ధర్మరాజుకు మనస్తాపం పోగొట్టే ఉపదేశాలు వ్యాస శ్రీకృష్ణాదులు చేయటం, ధర్మజుడు శ్రీకృష్ణుడిని స్తుతించటం మొదలైన అంశాలున్న ఈ ప్రథమాశ్వాసానికి తగినట్లుగా హరిహరనాథుడికి విశేషణాలు తిక్కన వేయటం విశేషం.

మహర్షులు పాండవులం జూడవచ్చుట (సం. 12-1-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లు సకల బంధుమిత్ర జనంబులకు నుదకకర్మం బాచరించి పాండవులు గంగా తీరంబున నశుచిత్వం బపనయించుటకయి యొక్కసమస్థలంబునం బటకుటీర సంవిధానంబు సేయించి, ధృతరాష్ట్ర విదుర సర్వభరత భార్యాసమేతంబుగా నచ్చట మాసమాత్రంబు నిలిచి; రట్టియెడం గృష్ణద్వైపాయన నారద దేవల దేవస్థాణు కణ్వులు మొదలుగాఁగల మునీంద్రు లనేకులు శిష్యవర్గ సహితంబుగా ధర్మనందను సందర్శనంబునకుం జనుదెంచిన, నజ్జననాథుండు ప్రత్యుత్థాన ప్రణామ పాద్యా సనాకలనంబులను దత్కాలోచితార్చనంబులను నమ్మహాత్ములం బ్రీతులం గావించి, కృష్ణనిజానుజయుక్తంబుగా వారలనుపాసించి యుండ, వారలు బహువిధంబులగు ప్రియవచనంబుల నక్కురువంశసత్తము సంభావింప నారదుం డమ్మహనీయద్విజులం గలయం గనుంగొని యక్కొంతేయాగ్రజుతోడం దాను గుశల ప్రశ్నంబు లగుమాట లాడంగలవాఁ డగుట వారి కెఱింగించి యమ్మహీపతియాననం బాలోకించి. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= జనమేజయ మహారాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అట్లు= ఆ విధంగా (అంటే వెనుకటి పర్వంలో చెప్పిన విధంగా అని); సకల బంధుమిత్ర జనంబులకున్= బంధువులందరికీ, స్నేహితుల బృందాల కందరికీ; ఉదకకర్మంబు= నీటితో ఇచ్చే తర్పణాలు అనే అపరకర్మల విధానాన్ని; ఆచరించి= నిర్వహించి; చేసి; పాండవులు= పాండవులు; గంగాతీరంబునన్= గంగానది ఒడ్డున; అశుచిత్వంబున్= మైలను (మృతాశౌచాన్ని); అపనయించుటకయి= తొలగించుకొనటం కొరకు; ఒక్క సమస్థలంబునన్= మిట్ట పల్లాలు లేని ఒక నేలమీద; పటకుటీర సంవిధానంబు= గుడ్డతో చేసిన గుడారాలను కట్టించటం; చేయించి= జరిపి; ధృతరాష్ట్ర, విదుర, సర్వభరత భార్యాసమేతంబుగాన్= ధృతరాష్ట్రుడితో, విదురుడితో సమస్త భరత వంశీయుల భార్యలతో సహా; అచ్చటన్= ఆ ప్రదేశంలో; మాసమాత్రంబు= నెలరోజులు మాత్రమే; నిలిచిరి= ఉన్నారు; అట్టి+ఎడలన్= ఆ సందర్భంలో; కృష్ణద్వైపాయన నారద దేవల దేవస్థాణు కణ్వులు మొదలుగాన్+కల ముని+ఇంద్రులు+అనేకులు= వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, కణ్వుడు మొదలైన మహామునులు అనేకులు; శిష్యవర్గ సహితంబుగాన్= శిష్యుల సమూహాలతో కూడుకొని; ధర్మనందనుని సందర్శనంబునకున్= ధర్మరాజును దర్శించుకొనటానికి; చనుదెంచినన్= రాగా; ఆ+జననాథుండు= ఆ రాజు (ధర్మరాజు); ప్రత్యుత్థాన, ప్రణామపాద్య+ఆసన+ ఆకలనంబులను= అతిథులకు నిలిచి ముందేగి ఆహ్వానం చెప్పటం, నమస్కారం చేయటం, కాళ్ళకు నీళ్ళివ్వటం, కూర్చోవటానికి ఆసనమివ్వటం చేతనూ; తత్+కాల+ఉచిత+అర్చనంబులను= ఆ సమయానికి తగిన అనేక అతిథి పూజావిధుల చేత; ఆ+మహాత్ములన్= ఆ వచ్చిన గొప్పవారిని; ప్రీతులన్+కావించి= సంతుష్టులనుగా చేసి; కృష్ణ, నిజ+అనుజయుక్తంబుగాన్= శ్రీకృష్ణుడితోనూ, తన సోదరులతోనూ కూడికొని; వారలన్= పెద్దలను; ఉపాసించి+ఉండన్= సేవిస్తూ ఉండగా; వారలు= అక్కడ చేరిన పెద్దలు; బహువిధంబులు+అగు= పలు రకాలైన; ప్రియవచనంబులన్= మంచి మాటలతో; ఆ+కురువంశ సత్తమున్= కురువంశంలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజును; సంభావింపన్= గౌరవింపగా; నారదుండు= నారదమహర్షి; ఆ+మహనీయ ద్విజులను= పెద్దలైన ఆ బ్రాహ్మణులను; కలయన్+కనుంగొని= తేరిపార చూచి; ఆ+కౌంతేయ+అగ్రజుతోడన్= కుంతీపుత్రులలో పెద్దవాడైన ఆ ధర్మరాజుతో; తాను= తాను (నారదుడు); కుశల ప్రశ్నంబులు+అగు మాటలు= యోగక్షేమాలు తెలిసికొనే మాటలు; ఆడన్+కలవాఁడు+అగుటన్= మాట్లాడాలని అనుకొంటున్న వాడనే సంగతి; వారికిన్= అక్కడి పెద్దలకు; ఎఱింగించి= తెలిపి; ఆ+మహీపతి ఆననంబు= ఆ రాజుమొగం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! జనమేజయ మహారాజుకు వైశంపాయన మహర్షి ఈ విధంగా చెప్పాడు - పాండవులు తమ చనిపోయిన బంధుమిత్రుల కందరికీ జలతర్పణాలను ఇచ్చారు. మృతాశౌచాన్ని పోగొట్టుకొనటానికి గంగానదీ తీరంలో ఒక సమతల ప్రదేశంలో గుడ్డల గుడారాల నెత్తించారు. ధృతరాష్ట్ర, విదురాదులనూ, భరతవంశీయుల భార్యలనూ ఆ గుడారాలలో ఒక నెలరోజులు ఉంచారు. ఆ సందర్భంలో ధర్మరాజును దర్శించటానికి వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, కణ్వుడు మొదలైన మునీంద్రు లెందరో శిష్యులతో సహా విచ్చేశారు. ధర్మరాజు వారందరికీ ఎదురుపోయి, నమస్కరించి, అర్ఘ్యపాద్యాది పూజావిధులతో సత్కరించి వారిని సంతోషపెట్టాడు. శ్రీకృష్ణుడూ, సోదరులూ ఎల్లప్పుడూ తనతో కలిసి ఉంటూ ఉండగా ఆ మహర్షులను ధర్మజుడు సేవించాడు. ఆ రాజును వారందరు ప్రియవచనాలతో పలకరించారు. ఆ తరువాత ఆ మహాత్ములందరి పక్షాన ధర్మరాజును కుశల ప్రశ్నలతో కూడిన మాటలతో సమ్మానించటానికి నారదుడు ముందుకు వచ్చాడు. ఆ మహర్షి పెద్దల నందరిని కలయజూచి ధర్మరాజు ముఖంవైపు చూచి ఇట్లా అన్నాడు:

విశేషం: పితృకర్మలు చేసి పవిత్రులైన పాండవులను ఆశీర్వదించి భావి శుభాలను నిర్దేశించటానికి మునిపరిషత్తు నారదముఖంగా మాట్లాడుతున్నది.

శా. ' గోవిందుం డనిశంబు శోభన మెదం గోరంగఁ బార్థుండు ద
ర్పావేశోజ్జ్వల బాహుసార మహనీయస్ఫూర్తి శోభిల్ల గాం
డీవోల్లాస విభాసియై సమరపాండిత్యంబు వాటింప సం
భావింపన్ జగమెల్ల రాజ్య మిటు లొప్పం గొంటె రాజోత్తమా! 3

ప్రతిపదార్థం: రాజ+ఉత్తమా!= రాజులలో శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; గోవిందుండు= శ్రీకృష్ణుడు; అనిశంబున్= ఎల్లప్పుడు; శోభనము= శుభమును; ఎదన్= మనస్సులో; కోరంగన్= (నీకు కలుగుతూ ఉండాలని) సంకల్పించగా; దర్ప= గర్వంచేత; ఆవేశ= ఉత్సాహంచేత; ఉజ్జ్వల= ప్రకాశించే; బాహుసార= భుజబలంయొక్క; మహనీయస్ఫూర్తి = గొప్పదైన స్ఫూర్తితో; శోభిల్లన్ = ప్రకాశించగా; పార్థుండు= అర్జునుడు; గాండీవ+ఉల్లాస విభాసి ఐ= గాండీవం వలన కలిగే ఉత్సాహం చేత ప్రకాశించినవాడై; సమరపాండిత్యంబు= యుద్ధవిద్యా నైపుణ్యం; పాటింపన్= ఒప్పారగా; జగము+ఎల్లన్= లోకమంతా; సంభావింపన్= నిన్ను గౌరవిస్తూ ఉండగా; ఇటులు= ఈ విధంగా (కురుక్షేత్ర యుద్ధంలో విజయాన్ని సాధించి - అని భావం); రాజ్యము= రాజ్యాన్ని లేదా ప్రభుత్వాన్ని; ఒప్పన్= ఉచితమైన విధంగా; కొంటె!= తీసికొన్నావు కదా!

తాత్పర్యం: 'ధర్మజా! నీ అదృష్ట మేమని చెప్పాలి! అటు శ్రీకృష్ణుడు సదా తన మనస్సులో నీకు మేలు కలగాలని కోరుతూ ఉండగా, ఇటు గర్వోత్సాహాలతో ఉప్పొంగే బాహుబలంతో ప్రకాశించే పార్థుడు గాండీవ పరాక్రమంతో యుద్ధ విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఉండగా, ప్రజలందరూ నిన్ను గౌరవిస్తూ ఉండగా నీవు ఈ రాజ్యాన్ని ఈ విధంగా సగౌరవంగా సార్థకంగా పొందావు.

విశేషం: ధర్మరాజు విజయానికి గల హేతువులను చెప్పుతూ, అతడి రాజ్యప్రాప్తిలో ఉన్న ఒప్పిదాన్ని ప్రశంసించటం ఇందులోని విశేషం.

చ. ' భువన భయంకరంబు లగు పోరులఁ దమ్ములతోడఁ గూడ నీ
వు వెడలఁబాటు లెస్స; యలవుం జలమున్ వెలయించుచోట ధ
ర్మువున కొకింతయుం దొలఁగఁ ద్రొక్కమి యెంతయుమేలు; దీనఁ గౌ
రవకులముఖ్య! యుమ్మలిక గ్రాఁచితె? చిత్తముఁ బ్రీతిఁ బొందెనే?' 4

ప్రతిపదార్థం: కౌరవకులముఖ్య!= కౌరవకులంలో శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; ఈవు= నీవు; భువనభయంకరంబులు+అగు పోరులన్= భూలోకానికంతా లేదా లోకాల కన్నింటికీ భయాన్ని కలిగించే యుద్ధాలలో; తమ్ముల తోడన్+కూడన్= తమ్ముళ్ళందరితో; వెడలన్+పాటు= బయటపడటం; లెస్స=మంచిది, ఒప్పిదమైనది; అలవున్= బలాన్నీ; చలమున్= మాత్సర్యాన్నీ; వెలయించు చోటన్= ప్రదర్శించేటప్పుడు కూడా; ధర్మువునకున్= ధర్మమార్గానికి; ఒకింతయున్= ఏమాత్రంకూడా; తొలఁగన్+త్రొక్కమి= అడుగు ప్రక్కకు వేయకుండా ఉండటం; ఎంతయున్ మేలు= ఎంతయో శ్రేష్ఠం; దీనన్= దీనివలన; ఉమ్మలికన్=దుఃఖమును; క్రాఁచితె= తొలగించుకున్నావా; చిత్తమున్= మనస్సు; ప్రీతిన్= సంతోషాన్ని, తృప్తిని; పొందెనే?= పొందిందా?

తాత్పర్యం: 'కురువంశంలో ప్రసిద్ధుడా! ధర్మరాజా! లోకాల నన్నింటినీ భయపెట్టగలిగే భయంకర యుద్ధాలు సంభవించినప్పుడు నీ తమ్ములతో బయటపడడం మంచిది. యుద్ధాలలో పంతాలు పెరిగి బలాలనూ, మాత్సర్యాలనూ ప్రదర్శించే పట్టులలో సైతం ధర్మమార్గం నుండి ఏమాత్రం తప్పకుండా ఉండే నీ నియతి నీలోని ఎంతో మంచిగుణం. ధర్మరాజా! మరి - దీనివల్ల నీ దుఃఖాన్ని తొలగించుకున్నావా; ఇప్పుడు నీ మనస్సు సంతోషాన్ని పొందిందా?'

విశేషం: యుద్ధావేశంలో కూడా ధర్మం వీడని నియతి ధర్మజుడికి ఇక్కట్టులు తెచ్చిపెట్టినా, ఆ నియతీ, పాండవుల ఐకమత్యమూ చివరకు విజయాన్ని సాధించిపెట్టాయని నారదుడు ధర్మజుడిని అభినందించాడు. ధర్మజుడిది ధర్మయుద్ధమని (కలహభోక్త) నారదుడు ప్రశంసించటం ఇందులోని విశేషం.

వ. అనిన విని యజ్జనవిభుం డమ్ముని విభున కిట్లనియె. 5

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+జన విభుండు= ఆ ధర్మరాజు; విని; ఆ+ముని విభునకున్= మునిపతియైన ఆ నారదుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: నారదుడి మాటలు విని ధర్మరాజు అతడితో ఇట్లా అన్నాడు:

సీ. ‘ కృష్ణుండు మామీఁదఁ గృపసేయుటయు, బ్రాహ్మ । ణానుగ్రహంబున ననిల పుత్ర
పార్థుల పటు బాహు బలమున మేదిని । యంతయుఁ జేకుఱునట్టి దయ్యె;
నైనను నతిఘోర మగు నఖిల జ్ఞాతి । వధ మొనరించుట వలన నధిక
గుణుని సౌభద్రునిఁ గుల భూషణంబుఁ బాం । చాలీ తనూజ పంచకముఁ గోలు

తే. పోకఁ జేసియు గెల్పు గెల్పుగ మదీయ । బుద్ధి గైకొన దయ్యెడు సిద్ధముఖ్య!
యదియుఁ గాక వేఱొక్కండు మదిఁ గలంచు । చున్నయది; దాని నేర్పడ విన్నవింతు. 6

ప్రతిపదార్థం: సిద్ధముఖ్య!= ముని శ్రేష్ఠుడవైన నారదా!; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; మామీఁదన్= మామీద (పాండవులమీద); కృపచేయుటయున్= దయచూపటం; బ్రాహ్మణ+అనుగ్రహంబునన్= బ్రహ్మవేత్తలయొక్క దయవలన; అనిలపుత్ర పార్థుల పటు బాహుబలమునన్= భీమార్జునుల గొప్పదైన భుజబలంచేత; మేదిని+అంతయున్= రాజ్యమంతా; చేకుఱునట్టిది+అయ్యెన్= చేతికి దక్కేదిగా అయింది; ఐననున్= అయినప్పటికి; అతిఘోరము+అగు= మిక్కిలి దారుణమైన; అఖిల జ్ఞాతివధము= జ్ఞాతుల నందరినీ చంపటం; ఒనరించుటవలనన్= చేయటంవలన; అధికగుణునిన్= ఉత్తమగుణాలు కలవాడైన; కులభూషణంబున్= వంశానికి అలంకారమైన; సౌభద్రునిన్= అభిమన్యుడినీ; పాంచాలీ తనూజ పంచకమున్= ద్రౌపదికి పుట్టిన పుత్రపంచకాన్నీ; కోలుపోకన్+చేసియున్= కోల్పోవటంవలన; మదీయబుద్ధి= నా బుద్ధి; గెల్పు= ఈ గెలుపును; గెల్పుగన్= విజయంగా; గైకొనదు+అయ్యెడున్= గ్రహించజాలకపోతున్నది; అదియున్+కాక= అంతేకాక; మదిన్= నా మనస్సును; వేఱు+ఒక్కండు= మరొకటి; కలంచుచున్న అది= కలతపెట్టుతున్నది; దానిన్= ఆ సంగతిని; ఏర్పడన్= స్పష్టంగా; విన్నవింతున్= మనవి చేస్తాను.

తాత్పర్యం: ‘ఓ మునీంద్రా! శ్రీకృష్ణుడు మామీద సదా కృపాదృష్టిప్రసరిస్తూ ఉండటం చేతనూ, బ్రహ్మజ్ఞుల అనుగ్రహం చేతనూ, భీమార్జునుల మహాబాహుబలంతోనూ ఈ రాజ్యమంతా మాకు దక్కింది. అయినా, జ్ఞాతుల నందరినీ యుద్ధంలో అతిదారుణంగా వధచేయటం వలనా, వంశభూషణుడు, గుణవంతుడు అయిన అభిమన్యుడిని, పాంచాలీపుత్ర పంచకాన్నీ కోల్పోవటం వలనా నాకు కలిగిన విజయాన్ని విజయంగా స్వీకరించటానికి నా బుద్ధి అంగీకరించటంలేదు. అంతేకాక నా మనస్సును మరొక్క విషయం కలత పెట్టుతున్నది. దానిని మీకు స్పష్టంగా విన్నవించుకొంటాను.

చ. ఘనభుజ విక్రమోన్నతుఁడు, కౌరవకోటికిఁ బట్టుకొమ్మ మ
మ్మని మొనఁ దూలపుచ్చిన మహోత్కుఁడు గర్ణుఁడు గొంతి తొల్తచూ
లని యుదక ప్రదాన సమయంబున నాయమచేత వింటి; నా
తని కుదకంబు లిచ్చుటకుఁ దా మముఁ బంచుట గోరి చెప్పినన్. 7

ప్రతిపదార్థం: ఘనభుజ విక్రమ+ఉన్నతుఁడు= గొప్పవైన భుజాల పరాక్రమంలో శ్రేష్ఠుడు అయినవాడు; కౌరవకోటికిన్= కౌరవబృందానికి; పట్టుకొమ్మ= ఆధారమైనవాడు; మమ్మున్= మమ్మల్ని (పాండవులను); అని మొనన్= యుద్ధవ్యూహాగ్రంలో; తూలపుచ్చిన= చిన్నపుచ్చిన; మహాత్ముఁడు= గొప్పవాడు అయిన; కర్ణుఁడు= కర్ణుడు; గొంతితొల్తచూలు+అని= కుంతికి పుట్టిన మొదటి బిడ్డ అని; తాన్= తాను (ఆ కుంతి); ఆతనికిన్= కర్ణుడికి; ఉదకంబులు= తర్పణాలు; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; మమున్= మమ్మల్ని (పాండవులను); పంచుటన్= పంపించటంకొరకు; కోరి= ఆసక్తితో, కావలెనని; చెప్పినన్= చెప్పగా; ఉదకప్రదాన సమయంబునన్= తర్పణాలిచ్చే సమయంలో; ఆయమచేతన్= కుంతిచేతనే; వింటిన్= విన్నాను.

తాత్పర్యం: తన భుజపరాక్రమంతో కౌరవుల కందరికీ ఆదరువుగా ఉన్నవాడూ, మమ్మల్ని రణరంగంలో చిన్నపుచ్చినవాడూ అయిన కర్ణుడు కుంతీదేవి మొదటిబిడ్డ అనే సంగతి తెలిపి, కర్ణుడికి జలతర్పణాలివ్వాలని మాకు చెప్పాలని కోరికపడి స్వయంగా వచ్చి మేము తర్పణాలిచ్చే సమయంలో ఆమె చెప్పితే విన్నాను.

వ. అప్పుడు దొడంగి యంతరంగంబు నిప్పులం బొరఁటినట్లయ్యెడి; నక్కుంతీమహాదేవి దాను దివాకరువరంబున నప్పురుషవరుం బడసి పాఱవైచుటయుం, బిదప నతండు ధార్తరాష్ట్రులపాల దొరయైయుండ మాకును వారికిం గలహంబు పుట్టిన నది మాన్పించుటకై యక్కొడుకు కడకుం జని యేకాంతంబునం బుట్టువు దెలుపుటయు, లోనయిన తద్విషయ వార్త లనుదినంబును జెప్పుచుండు. 8

ప్రతిపదార్థం: అప్పుడు+తొడంగి= అప్పటినుండి; అంతరంగంబు= మనస్సు; నిప్పులన్= నిప్పుకణాలలో; పొరఁటినట్లు+అయ్యెడిన్= పొరలించినట్లుగా అవుతున్నది; ఆ+కుంతీ మహాదేవి= ఆ కుంతీమహాదేవి; తాను= స్వయంగా; దివాకరుని వరంబునన్= సూర్యుడి వరంతో; ఆ+పురుషవరున్= ఆ పురుషశ్రేష్ఠుడైన కర్ణుడిని; పడసి= కని, పొంది; పాఱవైచుటయున్= (నీటిలో) వదలిపెట్టటమున్నూ; పిదపన్= ఆ తరువాత; అతండు= కర్ణుడు; ధార్తరాష్ట్రులపాలన్= ధృతరాష్ట్రుడి పుత్రులైన కౌరవుల కడ; దొర ఐ= రాజై (అంగదేశాధిపతి అయి); ఉండన్= ఉండగా; మాకును= మాకూ (పాండవులకూ); వారికిన్= వారికి (కౌరవులకూ); కలహంబు= తగాదా; పుట్టినన్= కలుగగా; అది= దానిని; మాన్పించుటకై= శాంతింపచేయటానికి; ఆ+కొడుకు కడకున్= కొడుకైన ఆ కర్ణుడి వద్దకు పోయి; ఏకాంతంబునన్= ఒంటరిగా ఉన్నప్పుడు; పుట్టువు= అతడి జన్మను గురించిన విషయం; తెలుపుటయున్= తెలియచెప్పటమున్నూ; లోనయిన= మొదలయిన; తద్విషయవార్తలు= అతడి సంగతులకు సంబంధించిన విశేషాలు; అనుదినంబును= ప్రతిరోజూ; చెప్పుచుండున్= చెపుతూ ఉంటుంది.

తాత్పర్యం: అప్పటినుండి నా మనస్సు నిప్పులలో దొరలించినట్లుంటుంది, ఆ కుంతీదేవి సూర్యవరప్రసాదంతో ఆ మహాత్ముడిని కని నీటిలో విడిచిపెట్టిన సంగతీ, ఆ తరువాత కర్ణుడు కౌరవుల వద్ద అంగరాజై ఉండగా వారికీ, మాకూ యుద్ధంరాగా, దానిని మాన్పించటానికై ఆమె ఒంటరిగా ఆ కొడుకు దగ్గరికి పోయి అతడి జన్మరహస్యం చెప్పిన సంగతీ, మొదలైన ఎన్నో అతడి విశేషాలను గురించి ప్రతిరోజూ మాకు చెపుతూ ఉంటుంది.

సీ. ఆ యమ దనపుత్రుఁ డవుట యెఱింగించి । 'తమ్ములలోనికి రమ్ము నీవు'
నావుడు నాతండు 'నాకుఁ గృతఘ్నత । వాటిల్లదే కురుపతిఁ దొఱంగి
వచ్చిన; నదిగాక వాసవితోడి క । య్యంబున కితఁ డోడె ననరె; యతఁడు
బెరయ నొండెను నన్ను బెరసి యొండెను నేవు; । రింతియకాని నీ వెపుడు నీకుఁ

ఆ. దనయు లార్వు రనకు' మనియె; నిద్ధేవి 'ద । క్కనుజు లెల్లవారి కభయ మొసఁగు'
మనిన 'నట్ల కాక' యని మమ్ము నలువురఁ । బట్టెఁ గాని తెగఁడ ప్రాణములకు. 9

ప్రతిపదార్థం: ఆ+అమ్మ= ఆమె, కుంతి; తన పుత్రుఁడు+అవుట= తన కుమారు డౌతాడని; ఎఱింగించి= కర్ణుడికి తెలిపి; తమ్ముల లోనికిన్= నీకు తమ్ములైన పాండవులలోకి; నీవు; రమ్ము= వచ్చిచేరుము; నావుడున్= అనగా విని; ఆతండు= కర్ణుడు; కురుపతిన్= దుర్యోధనుడిని; తొఱంగి వచ్చినన్= వదలివస్తే; నాకున్= నాకు; కృతఘ్నత= ఉపకారికి అపకారం చేసిన దోషం; పాటిల్లదే!= కలుగదా? (కలుగుతుందని భావం.); అది+కాక= అంతేకాకుండా; ఇతఁడు= ఇతడు (కర్ణుడు); వాసవితోడి కయ్యంబునకున్= అర్జునుడితోడి యుద్ధానికి; ఓడెన్= భయపడ్డాడు; అనరె?= అనరా? (అంటారని భావం); అతఁడు= అర్జునుడు; బెరయన్+ఒండెను= కలిసికొని; నన్నున్= నన్ను (కర్ణుడిని); బెరసి+ఒండెను= కలిపికొని గాని; ఏవురు= అయిదుమంది; అంతియకాని= అంతేకాని; నీవు= నీవు(కుంతి); ఎపుడున్= ఎప్పుడైనా సరే; నీకున్= నీకు (కుంతికి); తనయులు= కుమారులు; ఆర్వురు= ఆరుగురు; అనకుము= అని చెప్పవద్దు; అనియెన్= అన్నాడు; ఈదేవి= కుంతీదేవి; తక్కు= మిగిలిన; అనుజులు= తమ్ములు; ఎల్లవారికిన్= అందరికి; అభయము= భయంలేదు అనేమాట; ఒసఁగుము= ఇమ్ము; అనినన్= అని అనగా; అట్లు+అ+కాక!= ఆ విధంగానే అగుగాక!; అని; మమ్మున్ నలువురన్= మా నలుగురను; పట్టెన్= బంధించాడు కాని; ప్రాణములకున్= ప్రాణాలు తీయటానికి అంటే చంపటానికి; తెగఁడు+అ= సాహసించనేలేదు.

తాత్పర్యం: కర్ణుడు తన కుమారు డనే విషయం అతడికి తెలిపి 'నీవు నీ తమ్ములలోనికి వచ్చి చేరు' మని అడిగింది. ఆ మాట కతడు ఇట్లా సమాధానం చెప్పాడుఃఁ 'నేను దుర్యోధనుడిని వదలివస్తే కృతఘ్నతాదోషం కలుగుతుంది. అంతేకాక నేను అర్జునుడితో యుద్ధం చేయటానికి జంకి ఆ వైపు వచ్చా నని కూడా అంటారు. నన్ను కలుపుకొని కాని, లేదా అర్జునుడిని కలుపుకొని కాని నీకు కొడుకు లెప్పుడైనా అయిదుగురే కాని ఆరుగురని మాత్రం అనబోకుము.' ఆ మాటలు విని కుంతి 'ఆ మిగిలిన కొడుకులకు అభయాన్ని ఇమ్ము' అని కర్ణుడిని కోరింది. ఆయన 'అట్లాగే కాని' మ్మని వరమిచ్చాడు. ఆ వాగ్దానం మేరకు మమ్ములను నలుగురినీ పట్టి బాధించాడే కాని, ప్రాణాలు తీసే ప్రయత్నం చేయలేదు.

విశేషం: కర్ణుడి సత్యవాక్య నిష్ఠను, తల్లిపై చూపిన గౌరవాన్నీ, అతడి ఉదాత్త ప్రవృత్తినీ ఇందులో ధర్మజుడు వ్యంగ్యంగా కీర్తించాడు.

ఆ. తొల్లి తాన దాఁచెఁ దల్లి; పదంపడి । యతఁడు సెప్పవలవ దనఁగ దాఁచె;
నిట్లుగాఁగ నెఱుఁగ మేవురమును నతం । డిట్టిఁ డగుట; దాన నింత వుట్టె. 10

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం, మొదట్లో; తల్లి= కుంతీదేవి; తాన్+అ= తానే స్వయంగా; దాఁచెన్= రహస్యంగా ఉంచింది; పదంపడి= తరువాత; అతఁడు= కర్ణుడు; చెప్పన్ వలవదు= చెప్పవద్దు; అనఁగన్= అన్నట్లుగా; దాఁచెన్= రహస్యంగా ఉంచింది; ఇట్లుకాఁగన్= ఈ విధంగా కావటంచేత; అతండు= కర్ణుడు; ఇట్టిఁడు= ఇటువంటివాడు - అంటే కుంతీమహాదేవి మొదటి సంతానమైన వాడు కర్ణుడు; అగుటన్= కావటం; ఏవురమును= అయిదుగురం (పాండవులం); ఎఱుఁగము= ఎరుగం; దానన్= దానివలన; ఇంత= ఇంతటి వైపరీత్యం; పుట్టెన్= పుట్టింది.

తాత్పర్యం: కర్ణుడి జన్మవృత్తాంతాన్ని మొదట్లో తల్లి అయిన కుంతీదేవి స్వయంగా తానే రహస్యంగా ఉంచింది. ఆ తరువాత కర్ణుడు చెప్పటం సమంజసం కాదన్నట్లుగా గోప్యంగా దాచి ఉంచింది. అట్లా కావటంచేత కర్ణుడు కౌంతేయు డన్న సత్యాన్ని మే మైదుగురం తెలిసికొనలేకపోయాం. దానివలన ఇంతటి విపత్తు వాటిల్లింది.

విశేషం: ధర్మజుడి విషయవిశ్లేషణ వివేకం ఇందులో స్పష్టం.

క. అతఁడు దుర్యోధనునకుఁ । బ్రీతిగ జూదంబునాఁడు పెక్కాడెను ధ
ర్మేతరములు; వానికి మ । చ్చేతోగతి కోపభరము సెందక యుండున్. 11

ప్రతిపదార్థం: జూదంబునాఁడు= ద్యూతం ఆడే రోజున; ఆతఁడు= కర్ణుడు; దుర్యోధనునకున్= దుర్యోధనుడికి; ప్రీతిగన్= సంతోషమయ్యేటట్లు; ధర్మ+ఇతరములు= అధర్మాలు; పెక్కు= అనేకాలు; ఆడెను= మాట్లాడాడు; వానికిన్= ఆ అధర్మవాక్యాలకు; మత్+చేతో గతి= నా చిత్తవృత్తి; కోపభరము= కోపతీవ్రతను; చెందక= పొందకుండా; ఉండున్= ఉండేది.

తాత్పర్యం: అలనాడు కురుసభలో కపటపుజూదం జరిగిన నాడు కర్ణుడు దుర్యోధనుడిని సంతోషపెట్టటానికి అధర్మాల నెన్నింటినో పలికాడు. అయినా అతడి మాటలకు నా మనస్సు కోపాతిశయాన్ని పొందకుండానే ఉండేది.

విశేషం: రక్తసంబంధం వలన కర్ణుడిపట్ల ధర్మజుడి అంతఃకరణం ఆర్ద్రంగా స్పందించేది; కాని, ఆ సంబంధం ఏమిటో ఆయనకు తెలిసేది కాదు. అది ఇప్పుడు తెలిసింది. గతంలోని అనుభవాలను అతడు మననం చేసుకొంటున్నాడు.

ఆ. అతనిమేను కుంతి యట్టుల కైవడి । యరయ నేను జూచి యాత్మ నెద్ది
కారణంబొ యిట్లుగా ననుచుండుదు ; । నేమి సేయువాఁడ నింకఁ జెపుమ! 12

ప్రతిపదార్థం: అరయన్= చూడగా; అతని మేను= కర్ణుడి శరీరం; కుంతి+అట్టుల= కుంతివలె; కైవడి= పోలిక (కలిగింది); నేను= నేను (ధర్మరాజు); చూచి= దానిని గమనించి; ఇట్లు+కాన్= ఈ విధంగా కావటానికి; ఎద్దికారణంబొ= కారణ మేమిటో అని; ఆత్మన్= నా హృదయంలో; అనుచుండుదున్= అనుకొంటూ ఉంటాను; ఇంకన్= ఇంత జరిగిపోయిన తరువాత ఇప్పుడు; ఏమి చేయువాఁడన్+చెపుమ!= ఏం చేసేది చెప్పండి నారదా!

తాత్పర్యం: చూస్తే కర్ణుడి శరీరం కుంతి పోలికలు కలిగి ఉండేది. నేను దానిని గమనించి అట్లా కావటానికి కారణ మేమై ఉంటుందా? అని మనస్సులో మథనపడుతుండేవాడిని. కాని, అంతా అయిపోయిన తరువాత ఇప్పుడు ఏమి చేసేది చెప్పండి నారదా!

క. కౌరవులు సేయు నవమతి । కారణముగఁ గోప మెత్తుఁ, గర్ణుని వదనాం
భోరుహముం గనుఁగొన శమ । మారున్ నావశముగాక యంతన బుద్ధిన్. 13

ప్రతిపదార్థం: కౌరవులు= ధార్తరాష్ట్రులు; చేయు= చేసేటటువంటి; అవమతి= అవమానం; కారణముగన్= నెపంగా; కోపము= కోపం; ఎత్తున్= మెండుగా కలిగేది; కర్ణుని= కర్ణుడియొక్క; వదన+అంభోరుహమున్= పద్మంవంటి ముఖాన్ని; కనుఁగొనన్= చూడగానే; అంతన్+అ= వెంటనే; నా వశము+కాక= నా వశంతప్పి; బుద్ధిన్= నా మనస్సులో; శమము+ఆరున్= శాంతి కలుగుతుంది, శాంతి నిండుతుంది.

తాత్పర్యం: కౌరవులు చేసే అవమానాలకు నాకు కోపం బాగా రెచ్చిపోతుండేది, కాని, కర్ణుడి ముఖకమలం చూస్తే చాలు. వెంటనే నాకు తెలియకుండానే నా మనస్సులో శాంతం నిండిపోతుండేది.

విశేషం: రక్తసంబంధం ఉండటం చేత కర్ణుడిపట్ల ధర్మజుడికి కోపం రాకపోగా, అతడి ముఖం చూస్తే మనస్సులో ఒకవిధమైన శాంతి కలిగేది. ఇది ధర్మజుడి నిర్మలమైన అంతఃకరణ ప్రవృత్తిని తెలుపుతున్నది.

ఉ. గాండివి నొవ్వఁబల్కి తిటు; 'గర్ణునిఁ జంపక వచ్చితేని త
మ్ముండవు గావు నాకు' నని మూర్ఖత; సోదరఘాతి నైన క
ష్టుండ; మనంబునం బెఱుగు శోకము నెట్లు సహింతుఁ? దప్పె; నా
తండును నేము నైన విబుధప్రకరంబును మాకు నడ్డమే!' 14

ప్రతిపదార్థం: కర్ణునిన్= కర్ణుడిని; చంపక= చంపకుండా; వచ్చితి(వి)+ఏని= యుద్ధభూమినుండి తిరిగివచ్చావా; నాకున్= నాకు (ధర్మరాజుకు); తమ్ముండవు కావు= సోదరుడవు కావు; అని; మూర్ఖతన్= తెలిసి తెలియనితనంతో, తెలివితక్కువతనంతో; ఇటు= ఈ విధంగా; గాండివిన్= అర్జునుడిని; నొవ్వన్= బాధపడేటట్లు; పల్కితిన్= మాట్లాడాను; సోదరఘాతిని+ఐన= సోదరుడిని చంపిన (వాడినైన); కష్టుండన్= పాపిష్ఠిని; మనంబునన్= హృదయంలో; పెఱుగు= పెంపొందే; శోకమును= దుఃఖాన్ని; ఎట్లు= ఏ విధంగా; సహింతున్?= భరించగలిగేది? (భరించలేనని భావం); తప్పెన్= అంతా తారుమారయింది లేదా మాకా అదృష్టం తప్పింది; ఆ తండునున్= ఆ కర్ణుడూ; ఏమున్= మేమునూ; ఐనన్= కలిసిఉన్నట్లయితే; మాకున్= మా అందరికి; విబుధ ప్రకరంబును= దేవతల గణాలు కూడా; అడ్డమే?= ఎదురు నిలువగలిగేవా? లేదా, మా కొక లెక్కా?

తాత్పర్యం: 'కర్ణుడిని చంపకుండా రణరంగంనుండి తిరిగి వచ్చావా? నీవు నాకు తమ్ముడివే కా' వని తెలివితక్కువతనంతో అర్జునుడు నొచ్చుకొనేటట్లు మాట్లాడాను. నిజంగా నేను అన్నను చంపిన పాపిష్ఠిని. నా హృదయంలో పెల్లుబుకే ఈ దుఃఖాన్ని నే నెట్లా ఓర్చుకొనేది? అంతా తారుమారైంది. ఆ కర్ణుడూ, మేమందరమూ కలిసి ఉంటే ఆ దేవతాగణాలు సైతం మాకు అడ్డం నిలువగలిగేవా?'

విశేషం: కర్ణుడి మరణానికి తన ప్రేరణ కారణమైనదని భావించిన ధర్మరాజు తాను చేసిన పాపానికి నిష్కృతి లేదని తీరని వేదన పడుతున్నాడు. ఈ మాటలలో ధర్మజుడి ఋజువర్తనం, బంధుప్రీతి, భ్రాతృప్రేమ, ధర్మనిరతి, ఆర్ద్రచిత్తవృత్తి, పరితాప పశ్చాత్తాపాలు కనపడుతున్నాయి.

వ. అని పలికి, 'మునీంద్రా! యమ్మార్తాండనందను రథచక్రంబు భూమిం గ్రుంగుటకుం గారణం బెద్ది? దాని, నవ్వీరుండు పరశురాముని చేత శప్తుండయిన తెఱంగును నెఱింగింప వలయు; భువనంబుల వర్తనంబులు నీకుం దేటపడనియవి లేవు; గావున ని న్నడిగెద' నని ప్రార్థించుటయు, 'నవ్విధంబంతయు వివరించెద వినుం' మని యమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె: 15

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ముని+ఇంద్రా!= ముని శ్రేష్ఠుడవైన ఓ నారదా!; ఆ+మార్తాండ నందను= సూర్యుడి కుమారుడైన ఆ కర్ణుడియొక్క; రథచక్రంబు= రథచక్రం; భూమిన్= నేలలో; క్రుంగుటకున్= క్రుంగటానికి; కారణంబు+ఎద్ది?= కారణం ఏది?; దానిన్= దానిని; ఆ+వీరుండు= పరాక్రమ వంతుడైన ఆ కర్ణుడు; పరశురామునిచేతన్= పరశురాముడివలన; శప్తుండు= శపించబడిన వాడయిన; తెఱంగును= విధానాన్ని; ఎఱింగింపన్ వలయున్= తెలియజేయాలి; భువనంబుల= (పదునాల్గు) లోకాలలో; వర్తనంబులు= జరిగే విశేషాలలో; నీకున్= నీకు; తేటపడనివి= తెలియనివి; లేవు= ఉండవు; కావునన్= కాబట్టి; నిన్నున్= నిన్ను (నారదుడిని); అడిగెదన్= అడుగుతున్నాను; అని; ప్రార్థించుటయున్= వేడుకోగా; ఆ+విధంబు+అంతయున్= ఆ జరిగిన విధమంతటినీ; వివరించెదన్= వివరంగా చెపుతాను; వినుము; అని; ఆ+మహాత్ముండు= ఉత్తముడైన ఆ నారదుడు; ఆ+మహీపతికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'నారదమునీంద్రా! ఆ కర్ణుడి రథచక్రం రణరంగంలో భూమిలో క్రుంగిపోవటానికి గల కారణ మేమిటి? ఆ వీరుడు పరశురాముడి చేత శపించబడిన విధం ఎటువంటిది? నాకు తెలియజెప్పండి. మీకు పధ్నాలుగు లోకాలలో జరిగే విశేషాలన్నీ తెలిసికొనే శక్తి ఉన్నది కాబట్టి ఈ సంగతిని మిమ్ముల నడుగుతున్నాను' అని ప్రార్థించాడు ధర్మరాజు. అతడు అడిగిన విధంగా నారదుడు ఆ విశేషాలను వివరించటానికి పూనుకొని ఇట్లా అన్నాడు.

నారదుడు ధర్మరాజునకుఁ గర్ణుని చరితంబు సెప్పుట (సం. 12-2-1)

సీ. ' మునిదత్త మగు మంత్రమున గొంతి కన్నియ । నాఁడు వేడుక దిననాథుఁ దనకుఁ
బ్రత్యక్షముగఁ జేసి పడయుటఁ దా సిగ్గు । పెంపున సుతు వెలయింప దయ్యెఁ ;
కన్యాత్వవికలత గాకుండఁ దా సూర్య । వరము గల్గుటఁ జేసి వంశవర్య
యై పాల్చె; దేవరహస్య మిత్తెఱఁ, గిట్లు । పాఱవైవఁగఁ బడ్డ పట్టి సూతుఁ

తే. డెత్తికొనిపోయె; సూతజుం డితఁ డనంగఁ । బెరిఁగి కర్ణుండు నీ నేర్పు భీములావు
నరుని విలుబల్మి యతనికి హరికిఁ గలుగు । చెలిమి గని తద్ద వగఁ బొందుఁ జిత్త మెరియ. 16

ప్రతిపదార్థం: గొంతి= కుంతి; కన్నియనాఁడు= కన్నెగా ఉన్నప్పుడు; ముని దత్తము+అగు మంత్రమునన్= దుర్వాస మహర్షి చేత ప్రసాదించబడిన మంత్రంతో; వేడుకన్= ఆసక్తితో; దిననాథున్= సూర్యుడిని; తనకున్= తనకు (కుంతికి); ప్రత్యక్షముగన్+చేసి= ఎదుట తోచువాడినిగా చేసికొని; సుతున్= కొడుకును; పడయుటన్= పొందటంచేత; తాన్= తాను(కుంతి); సిగ్గుపెంపునన్= మిక్కిలిసిగ్గుచేత; వెలయింపదు+అయ్యెన్= బయటపెట్టలేకపోయింది; కన్యాత్వ వికలత= (కొడుకును కన్న తరువాత కూడా) కన్యాత్వం భగ్నంకావటం; కాకుండన్= జరుగకుండా; సూర్యవరము= సూర్యుడిచ్చిన వరం; కల్గుటన్+చేసి= ఉండటం చేత; తాన్= తాను (కుంతి); వంశవర్య+ఐ= వంశంలో ఉత్తమురాలై, ఉత్తమ ఇల్లాలై; పాల్చెన్= ఒప్పారింది; ఈ+తెఱఁగు= ఈ విధంగా కావటం; దేవరహస్యము= దేవతలకు మాత్రమే తెలిసిన రహస్యం; ఇట్లు= ఈ విధంగా; పాఱవైవఁగన్+పడ్డ= త్యజించబడిన, వదలిపెట్టబడిన; పట్టి= కొడుకును; సూతుఁడు= రథసారథి ఒకడు; ఎత్తికొనిపోయెన్= పెంచుకొనటానికి తీసికొనిపోయాడు; ఇతఁడు= కర్ణుడు; సూతజుఁడు= సూతుడికి పుట్టినవాడు; అనంగన్= అని పేరుపడి; పెరిఁగి= పెద్దవాడై; కర్ణుండు= కర్ణుడు; నీ నేర్పు= నీకున్న నేర్పరితనం; భీములావు= భీముడిబలం; నరుని విలుబల్మి= అర్జునుడి కోదండపటిమ; అతనికిన్= అర్జునుడికి; హరికిన్= శ్రీకృష్ణుడికి; కలుగు= ఉండే; చెలిమి= స్నేహం; కని= చూచి; చిత్తము= మనస్సు; ఎరియన్= బాధపడేటట్లు, మండేటట్లు; తద్ద= అమితంగా; వగన్= చింతను; పొందున్= పొందుతూ ఉండేవాడు.

తాత్పర్యం: కుంతీదేవి కన్నెగా ఉన్నకాలంలో దుర్వాసోమహర్షి ఇచ్చిన మంత్ర ప్రభావం వలన సూర్యదేవుడిని ఆసక్తితో ప్రత్యక్షం చేసికొని కొడుకును కన్నందువలన మిక్కిలిసిగ్గుతో ఆ వాస్తవాన్ని ప్రకటించలేకపోయింది. కొడుకును కన్నప్పటికీ ఆమెకు కన్యాత్వం భగ్నం కాకుండా ఉండేటట్లు సూర్యదేవుడివరం ఉండటం వలన ఆమె ఉత్తమ గృహిణిగా ప్రసిద్ధి కెక్కింది. ఇదంతా దేవరహస్యం. ఆ విధంగా కుంతిచేత నదిలో విడువబడిన ఆమె కొడుకును సూతుడు చూచి ఇంటికి ఎత్తుకొనిపోయాడు. అందువలన కర్ణుడు సూతుడికి పుట్టినవాడనీ, సూతకులంలో పుట్టినవాడనీ లోకంలో ప్రసిద్ధి కెక్కుతూ పెరిగాడు. ధర్మరాజు నేర్పరితనం, భీముడి బాహుబలం, అర్జునుడి కోదండపాండిత్యం, అర్జునుడికీ శ్రీకృష్ణుడికీ గల స్నేహం - ఇవన్నీ చూచి హృదయం మండి కర్ణుడు బాగా బాధపడుతూ ఉండేవాడు.

క. నకుల సహదేవ నయ శా । స్త్ర కళావేదిత్వమునకు జను లనురాగా
ధికులై మిమ్ముం గొనియా । టకు నాతఁడు మనసు చేఁప్పడం జింతిల్లున్. 17

ప్రతిపదార్థం: ఆతఁడు= కర్ణుడు; నకుల సహదేవ= నకులసహదేవుల; నయశాస్త్ర కళావేదిత్వమునకున్= నీతి శాస్త్రాలయందు, కళలయందూ గల పాండిత్యానికీ; జనులు= ప్రజలు; అనురాగ+అధికులు+ఐ= మిక్కిలి ప్రీతి గలవారై; మిమ్మున్= మిమ్మల్ని (పాండవులను); కొనియాటకున్= మెచ్చుకొంటూ ఉంటున్నందుకు; మనసు= హృదయం; చేఁప్పడన్= బాధపడగా, కలతచెందగా; చింతిల్లున్= విచారపడుతూ ఉండేవాడు.

తాత్పర్యం: నకుల సహదేవుల కుండే నీతి, శాస్త్రకళాపాండిత్యాన్నీ ప్రజలు మిక్కిలి ప్రీతితో (మిమ్ములను) మెచ్చుకొంటూ ఉండటం కర్ణుడికి నచ్చేదికాదు. అతడు దానికి మనసు కలతపడగా బాధపడుతూ ఉండేవాడు.

వ. ఇది తదీయ స్వభావం: బట్టుగాక దైవఘటనంబు నట్టిద; యమ్మాత్సర్యంబున నక్కర్ణుండు మీయెడ నీసు గలవాఁడయి దుర్యోధనుం గూడికొనియెఁ; బదంపడి ధనంజయు ధనుర్విద్యాతిశయం బుపలక్షించి, కుంభసంభవు పాలికిం జని, యేకాంతంబునందనకు బ్రహ్మాస్త్రంబు సాంగోపాంగంబుగా నుపదేశింప వలయు నని యడిగి, 'యేను సమరంబున సవ్యసాచికి సమానుండ నగుటఁ గోరి వచ్చితి; నీవు సర్వశిష్య సమాదరుండవు; భవత్ప్రసాదంబునగృతాస్త్రుండ నయి వెలయవలదే?' యనవుడు నద్దిననాథనందనునకు నగ్గురుం డిట్లనియె. 18

ప్రతిపదార్థం: ఇది= ఇటువంటిది; తదీయ= అతడి (కర్ణుడి); స్వభావంబు= నైజం; అట్లు+కాక= అంతేకాకుండా; దైవఘటనంబును= విధి సంవిధానంకూడా; అట్టిది+అ= అటువంటిదే; ఆ+కర్ణుండు= అటువంటి కర్ణుడు; ఆ+మాత్సర్యంబునన్= అటువంటి ద్వేషంతో; మీఎడన్= మీపట్ల; ఈసు= అసూయ; కలవాఁడు+అయి= పొందినవాడై; దుర్యోధనున్+కూడుకొనియెన్= దుర్యోధనుడితో చేరాడు; పదంపడి= ఆ తరువాత; ధనంజయు= అర్జునుడియొక్క; ధనుః+విద్యా+అతిశయంబు= విలువిద్యలోని మేటి తనాన్ని; ఉపలక్షించి= గమనించి; కుంభసంభవుపాలికిన్+చని= ద్రోణాచార్యుడి వద్దకుపోయి; ఏకాంతంబునన్= ఒంటరిగా ఉన్నప్పుడు; తనకున్= తనకు (కర్ణుడికి); బ్రహ్మ+అస్త్రంబు= బ్రహ్మమంత్రంతో ప్రయోగించే బాణాన్ని; స+అంగ+ఉప+అంగంబుగాన్= అంగ ఉపాంగాలతో సహా (ప్రయోగ ఉపసంహరణాదులతో సహా అని భావం); ఉపదేశింపన్ వలయున్= ఉపదేశించుము; అని అడిగి= అని ప్రార్థించి; ఏను= నేను(కర్ణుడు); సమరంబునన్= యుద్ధం చేయటంలో; సవ్యసాచికిన్= అర్జునుడికి; సమానుండన్= సమమైన నేర్పు కలవాడిని; అగుటన్= కావాలని; కోరి= అభిలాషపడి; వచ్చితిన్= వచ్చాను; ఈవు= నీవు (ద్రోణాచార్యుడు); సర్వశిష్యసమ+ఆదరుండవు= శిష్యులనందరిని సమంగా ఆదరించే వాడివి; భవత్+ప్రసాదంబునన్= నీ దయచేత; కృత+అస్త్రుండన్+అయి= మంత్ర సహిత మహాబాణమైన బ్రహ్మాస్త్రాన్ని పొందినవాడనయి; వెలయన్ వలదే?= ప్రకాశించవద్దా? (తప్పక ప్రకాశించాలి అని భావం); అనవుడున్= అనగా విని; ఆ+దిననాథ నందనునకున్= ఆ సూర్యకుమారుడైన కర్ణుడితో; ఆ+గురుండు= ఆ ఆచార్యుడైన ద్రోణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అది అతడి స్వభావం. అంతేకాక విధి సంవిధానం కూడా అటువంటిదే. మీమీది ద్వేషంతో ఆ కర్ణుడు అసూయ పెంచుకొని, దుర్యోధనుడితో చేతులు కలిపాడు. ఆ తరువాత అర్జునుడి విలువిద్యలోని మేటితనాన్ని గమనించి ఒకసారి ద్రోణాచార్యుడి వద్దకు వెళ్ళాడు. ఆయన ఏకాంతంగా ఉన్నప్పుడు తనకు బ్రహ్మాస్త్రాన్ని సాంగోపాంగంగా ఉపదేశించుమని కోరాడు. 'నేను యుద్ధం చేయటంలో అర్జునుడికి సమానుడను కావాలని కోరి వచ్చాను. నీవా - శిష్యులనందరినీ సమానంగా చూచేవాడవు. కాబట్టి నీదయవలన బ్రహ్మాస్త్రాన్ని పొంది ప్రకాశించవద్దా!' అని అన్నాడు. ఆ మాటలు విని కర్ణుడితో ద్రోణు డిట్లా అన్నాడు:

తే. ' వ్రత సమన్విత భూసుర వర్యుఁ డొండె । నిరుపమాన తపః పుణ్యనృపతి యొండెఁ
గాని యన్యులు బ్రహ్మాస్త్రదానమునకుఁ । బాత్రములు గారు; నీకు నీఁబాడి గాదు.' 19

ప్రతిపదార్థం: వ్రత= వేదశాస్త్రాలలో చెప్పబడిన విధివిధానాలతో; సమన్విత= కూడుకొన్న (జీవితవిధానం గల); భూసురవర్యుఁడు= బ్రాహ్మణశ్రేష్ఠుడు; ఒండు+ఎన్= ఒక్కడు మాత్రమే; నిరుపమాన= సాటిలేని; తపః= తపస్సువలన కలిగిన; పుణ్య= పుణ్యచిత్తవృత్తిగల;

నృపతి= రాజు (క్షత్రియుడు); ఒండు+ఎన్= ఒక్కడు మాత్రమే; కాని= వీరిద్దరు తప్ప; అన్యులు= ఇతరులు; బ్రహ్మ+అస్త్ర దానమునకున్= బ్రహ్మాస్త్రాన్ని ఇవ్వటానికి; పాత్రములు= యోగ్యులు; కారు= కారు (కాజాలరు కాబట్టి); నీకున్= నీకు (కర్ణుడికి); ఈన్= ఇవ్వటానికి; పాడి= న్యాయం, ధర్మం; కాదు.

తాత్పర్యం: 'వేదోక్త విధి విధానాలను జీవితవ్రతంగా పాటించే బ్రాహ్మణ శ్రేష్ఠుడుగాని, సాటిలేని తపఃప్రభావం వలన పుణ్యశీలుడైన రాజు కాని బ్రహ్మాస్త్రాన్ని దానం చేస్తే స్వీకరించటానికి యోగ్యులౌతారు కాని ఇతరులుకారు. కాబట్టి నీకు నేను బ్రహ్మాస్త్రాన్ని దానం చేయటం ధర్మంకాదు.'

వ. అనుటయు, నట్లకాక యని నిజమందిరంబునకుం జని, మఱునాఁడు గదలి మహేంద్రమహీధరంబున కరిగి పరశురామునిం గాంచి, వినయంబునం బ్రణమిల్లి, 'యేను బ్రాహ్మణుండ, భృగువంశజాతుండ, నస్త్రవిద్యాపేక్ష నిన్నాశ్రయింప వచ్చితి' ననిన నమ్మునివరుండు ప్రీతుండై కర్ణుం బరిగ్రహించి, యస్త్రపరిశ్రమంబు సేయించుచుండె; నట్టియెడ నాశ్రమ పరిసరంబున నొక్కచోఁ దనయంతన లాఘవాభ్యాసంబు సేయుచుండ నొక్క మహాద్విజుని హోమధేనువు వత్సంబడ్డంబు వాఁటి బాణగోచరంబై మృతిం బొందిన గని యవ్విప్రుండు గోపంబున శాపం బిచ్చిన, దానం దేరు ధరణిం గ్రుంగె; జామదగ్న్యుండు శపించిన తెఱంగునుం జెప్పెద; నవ్వీరుం డతనికి భక్తుండై పరిశ్రమం బాచరింప నతండు బ్రహ్మాస్త్రంబు లోనుగా ననేకాస్త్రంబు లొసంగెఁ; బదంపడి యొక్కనాఁడు. 20

ప్రతిపదార్థం: అనుటయున్= ఆ విధంగా ద్రోణు డనగా కర్ణుడు విని; అట్లు+అ కాక అని= అట్లాగే కానివ్వండి అని; నిజమందిరంబునకున్= తన (కర్ణుడి) ఇంటికి; చని= వెళ్ళి; మఱునాఁడు= ఆ మరుసటిరోజున; కదలి= ప్రయాణమై; మహేంద్ర మహీధరంబునకున్= మహేంద్రపర్వతానికి; అరిగి= వెళ్ళి; పరశురామునిన్+కాంచి= పరశురాముడిని దర్శించి; వినయంబునన్= అణకువతో; ప్రణమిల్లి= నమస్కరించి; ఏను= నేను(కర్ణుడను); బ్రాహ్మణుండన్= విప్రుడను; భృగువంశజాతుండన్= భృగుడి వంశంలో పుట్టినవాడను; అస్త్రవిద్యా+అపేక్షన్= మంత్ర సహితాలైన బాణవిద్యల మీది కోరికచేత; నిన్నున్= నిన్ను (పరశురాముడిని); ఆశ్రయింపన్= అండగొనుటకు; వచ్చితిన్= వచ్చాను; అనినన్= అని చెప్పగా; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడైన పరశురాముడు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; కర్ణున్= కర్ణుడిని; పరిగ్రహించి= శిష్యుడిగా స్వీకరించి; అస్త్రపరిశ్రమంబు= మంత్ర సహితమైన బాణాల అభ్యాసం; చేయించుచుండెన్= చేయిస్తూ ఉన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆశ్రమ పరిసరంబునన్= ఆశ్రమ సమీపంలో; ఒక్కచోన్= ఒకచోట; తన అంతన్+అ= తనంతట తాను, స్వయంగా; లాఘవ+అభ్యాసంబు= నేర్పుకొరకు చేసే అలవాటు పరిశ్రమ; చేయుచున్+ఉండన్= చేస్తూ ఉండగా; ఒక్క మహాద్విజుని= ఒక మహిమాన్వితుడైన బ్రాహ్మణుడియొక్క; హోమధేనువు వత్సంబు= యజ్ఞకార్యాదులకు పాలు, పెరుగు, నెయ్యి మొదలైన ద్రవ్యాలను అందించే ఆవుయొక్క దూడ; అడ్డంబు+పాటి= అడ్డంగా పరుగెత్తి; బాణగోచరంబు+ఐ= బాణానికి విషయమై -అంటే బాణం తగిలినదై; మృతిన్+పొందినన్= చనిపోగా; ఆ+విప్రుండు= ఆ హోమధేనువు యజమానుడు అయిన బ్రాహ్మణుడు; కని= చూచి; కోపంబునన్= కోపంతో; శాపంబు+ఇచ్చినన్= శాపం ఇవ్వగా; దానన్= దానిచేత; తేరు= (కర్ణుడి)రథం; ధరణిన్= భూమిలో; క్రుంగెన్= దిగబడింది; జామదగ్న్యుండు= జమదగ్ని కుమారుడైన పరశురాముడు; శపించిన తెఱంగునున్= శపించిన విధానాన్ని కూడా; చెప్పెదన్= చెప్పెదను; ఆ+వీరుండు= ఆ వీరుడైన కర్ణుడు; అతనికిన్= పరశురాముడికి; భక్తుండు+ఐ= భక్తుడై; పరిశ్రమంబు= బాణవిద్యాభ్యాసాన్ని; ఆచరింపన్= చేయగా; అతండు= పరశురాముడు; బ్రహ్మ+అస్త్రంబు లోనుగాన్= బ్రహ్మాస్త్రం మొదలుగా; అనేక+అస్త్రంబులు= మంత్రసహితమైన బాణాలను పెక్కింటిని; ఒసంగెన్= ఇచ్చాడు; పదంపడి= తరువాత; ఒక్కనాఁడు= ఒకరోజున.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు అట్లా అనగానే మంచిదని కర్ణుడు తన ఇంటికి తిరిగిపోయి, మరునాడు బయలుదేరి మహేంద్రపర్వతానికి వెళ్ళి పరశురాముడిని దర్శించి వినయంతో నమస్కరించాడు. 'నేను బ్రాహ్మణుడిని,

భృగువంశంలో పుట్టాను. అస్త్రవిద్య నేర్చుకొనాలన్న కోరికతో నిన్ను ఆశ్రయించటానికి వచ్చాను' - అని అన్నాడు. ఆ మాటలకు సంతోషపడి పరశురాముడు కర్ణుడిని శిష్యుడిగా స్వీకరించాడు. ఆపైన కర్ణుడు అస్త్రవిద్యలో అభ్యాసం చేస్తూ ఉన్నాడు. ఒకనాడు అతడు ఆశ్రమసమీప ప్రదేశంలో అస్త్రవిద్యాభ్యాసం చేస్తూ ఉండగా అతడి బాణం ఒక బ్రాహ్మణ శ్రేష్ఠుడి హోమధేనువు దూడకు తగలటంచేత అది చనిపోయింది. దానికి ఆ బ్రాహ్మణుడు కోపించి కర్ణుడికి శాపంపెట్టాడు. దానివలన అతడి రథం నేలలో క్రుంగిపోయింది. ఇది ఇట్లా ఉండగా పరశురాముడు కూడా కర్ణుడిని శపించిన విధాన్ని వివరిస్తాను. కర్ణుడు భక్తుడై పరశురాముడిని సేవించటం వలన ఆయన అతడికి బ్రహ్మాస్త్రం మొదలుకొని అనేకాస్త్రాలను నేర్పాడు. ఆ తరువాత ఒకనాడు.

తే. కర్ణునుత్సంగమున మస్తకంబుఁ జేర్చి , । గురుఁడు నిద్రింప వికృతాతి ఘోరరూప
మళక మనియెడు నొకకీట మద్దినేంద్ర । తనయ క్రీఁదొడఁ దొలిచె సత్వరముగాఁగ. 21

ప్రతిపదార్థం : గురుఁడు= గురువైన పరశురాముడు; కర్ణుని= కర్ణుడియొక్క; ఉత్సంగమునన్= తొడమీద; మస్తకంబున్= తలను; చేర్చి= ఉంచి; నిద్రింపన్= నిదురపోవగా; వికృత+అతిఘోరరూపము= వికారమైన; అతి భయంకరమైన ఆకారంగల; అళకము+అనియెడు= అళకం అనేపేరుగల; ఒక కీటకము= ఒక పురుగు; ఆ+దిన+ఇంద్రతనయున్= ఆ సూర్యుడి కుమారుడైన కర్ణుడియొక్క; క్రీఁదొడన్= క్రింది తొడభాగాన్ని; సత్వరము+కాఁగన్= వేవేగంగా; తొలిచెన్= తొలిచింది.

తాత్పర్యం: పరశురాముడు కర్ణుడి తొడమీద తలపెట్టి నిద్రపోయాడు. వికారమైన, భయంకరమైన ఆకారం కలిగిన అళకం అనే పురు గొకటి కర్ణుడి క్రిందితొడభాగాన్ని వడివడిగా తొలిచివేసింది.

వ. అతండును గురునకు నిద్రాభంగం బగుట కోర్వక ధైర్యంబునం గీటకృతంబున కోర్చి యచలుండై యుండె; నెత్తు రొండొండ పరఁగి పరశురామ శరీరంబు సోఁకిన, నమ్మహాత్ముండు మేల్కని 'రక్తం బెక్కడి' దని యడిగినఁ, దొడయెత్తి కీటంబుం జూపి 'యిది దొలుఁచుచుండ మీనిదుర సెడుటకుం జాలక కదలకుండితి' ననియె; నమ్ముని గనుంగొనిన నక్కీటంబు. 22

ప్రతిపదార్థం: అతండును= కర్ణుడుకూడ; గురునకున్= గురువైన పరశురాముడికి; నిద్రాభంగంబు+అగుటకున్= నిదురచెడిపోవటానికి; ఓర్వక= సహించక; ధైర్యంబునన్= ధైర్యంతో; కీటకృతంబునకున్= పురుగు చేసినదానికి; ఓర్చి= సహించి; అచలుండు+ఐ= చలించనివాడై (స్థిరుడై); ఉండెన్= ఉన్నాడు; నెత్తురు= రక్తం; ఒండు+ఒండన్= క్రమక్రమంగా; పరఁగి= వ్యాపించి; పరశురామ శరీరంబు సోఁకినన్= పరశురాముడి దేహాన్ని తాకగా; ఆ+మహా+ఆత్ముండు= గొప్పవాడైన ఆ పరశురాముడు; మేల్కని= నిద్రనుండి లేచి; రక్తంబు+ఎక్కడిది?= ఈ నెత్తురు ఎక్కడిది?; అని అడిగినన్= అని ప్రశ్నించగా; తొడ+ఎత్తి= తొడను పైకెత్తి; కీటంబున్+చూపి= తొడక్రింద నున్న పురుగును చూపి; ఇది= ఈ పురుగు; తొలుఁచుచున్+ఉండన్= తొలుస్తూ ఉండగా; మీ నిదుర= మీ నిద్ర; చెడుటకున్= పాడగుటకు; చాలక= ఇష్టపడక; కదలక+ఉండితిన్= కదలకుండా ఉండిపోయాను; అనియెన్= అని అన్నాడు; ఆ+ముని= ఆ పరశురాముడు; కనుఁగొనినన్= చూచినవెంటనే; ఆ+కీటంబు= ఆ పురుగు.

తాత్పర్యం: కర్ణుడు గురువుకు నిద్రాభంగం కావటానికి ఇష్టపడక, ధైర్యంతో ఆ పురుగు చేసే కొరుకుడుకు సహించి కదలకుండా ఉన్నాడు. నెత్తురు కారటం మొదలుపెట్టి క్రమంగా సాగి పరశురాముడి శరీరాన్ని తాకింది. ఆ స్పర్శకు పరశురాముడు మేల్కొని 'ఈ రక్తం ఎక్కడిది?' అని అడిగాడు. కర్ణుడు తొడ ఎత్తి కీటకాన్ని చూపి 'ఇది తొలుస్తూ ఉండగా మీ నిద్ర చెడకుండా ఉండాలని ఆ బాధను సహించి నేను కదలకుండా కూర్చున్నాను' అన్నాడు. పరశురాముడు ఆ కీటకాన్ని చూడగానే (తరువాతి పద్యంతో అన్వయం).

క. మృతిఁబొంది రాక్షసుండై । ఖతలంబున నుండి పలుకుఁ 'గరుణాకర! నీ
కతమున దారుణ శాప । ప్రతిహతి వాటిల్లె; నిపుడు ప్రకృతి వడసితిన్. 23

ప్రతిపదార్థం: మృతిన్+పొంది= (ఆ పురుగు) చనిపోయి; రాక్షసుండు+ఐ= రాక్షసరూపాన్ని పొంది; ఖతలంబునన్+ఉండి= ఆకాశప్రదేశంలో నిలువబడి; పలుకున్= ఈ విధంగా మాట్లాడింది; కరుణాకర!= దయామయా!; నీకతమునన్= నీ కారణంగా; దారుణ శాపప్రతిహతి= భయంకరమైన శాపముయొక్క నివృత్తి; పాటిల్లెన్= కలిగింది; ఇపుడు= శాపం తొలగిపోయిన తరువాత; ప్రకృతి= నిజరూపాన్ని; పడసితిన్= పొందాను.

తాత్పర్యం: పరశురాముడు చూడగానే ఆ పురుగు చనిపోయి రాక్షసరూపం పొంది ఆకాశప్రదేశంలో నిలిచి ఇట్లా పలికింది. 'ఓ దయామయా! నీ కారణంగా నాకు భయంకరమైన శాపం నివృత్తి చెందింది. నేను నా పూర్వరూపాన్ని పొందగలిగాను.

విశేషం: ఈ పద్యంలో పరశురాముడి చూపులకే అంత శక్తి ఉండగా, ఆతడి వచస్సుకు ఎంతటి శాపానుగ్రహశక్తి ఉంటుందో ధ్వనిమయంగా కథకుడు సూచిస్తున్నాడు.

వ. ' గ్రస్తుం డనుపేరం బరఁగు నొక్క రక్కసుండ; భృగుపత్ని నపహరించి తదీయశాపంబునఁ గీటంబనై యుండి, భవదీయ విలోకనామృత సేకంబున సుఖి నైతి' నని చెప్పి, నమస్కరించి నిజేచ్ఛం జనియె; రాముండు రాధేయుధైర్యంబు మనంబున నిరూపించి యతనితోడ. 24

ప్రతిపదార్థం: గ్రస్తుండు+అనుపేరన్+పరఁగు= గ్రస్తుడు అనే పేరుతో ఒప్పారే; ఒక్కరక్కసుండన్= ఒక రాక్షసుడను; భృగుపత్నిన్= భృగుమహర్షిభార్యను; అపహరించి= దొంగిలించి; తదీయశాపంబునన్= అతడి శాపంవలన; కీటంబను+ఐ+ఉండి= పురుగునై ఉండి; భవదీయ= నీయొక్క; విలోకన= చూపులనెడి; అమృతసేకంబునన్= అమృతపు చిలకరింపుచేత; సుఖిని+ఐతిన్= సుఖం కలవాడనైనాను; అని చెప్పి= అని తన కథను చెప్పి; నమస్కరించి= దండాలు పెట్టి; నిజ+ఇచ్ఛన్+చనియెన్= తన ఇష్టం వచ్చిన విధంగా వెళ్ళిపోయాడు; రాముండు= పరశురాముడు; రాధేయుధైర్యంబున్= కర్ణుడి ధీరభావాన్ని; మనంబునన్= హృదయంలో; నిరూపించి= లెక్కకట్టి; అతనితోడన్= కర్ణుడితో.

తాత్పర్యం : గ్రస్తుడు అనే పేరుతో పిలువబడే ఒక రాక్షసుడిని నేను. భృగుమహర్షి భార్యను అపహరించి అతడి శాపానికి గురి అయి కీటకంగా ఉంటూ వచ్చాను. ఓ పరశురామా! నీ చూపులనే అమృతపు చిలకరింపుల వలన నేను మరల నిజరూపాన్ని పొంది సుఖంగా ఉన్నాను' - అని చెప్పి నమస్కరించి స్వేచ్ఛగా వెడలిపోయా డా రాక్షసుడు. ఆ తరువాత పరశురాముడు కర్ణుడు ప్రదర్శించిన అపూర్వధైర్యాన్ని మనసులో లోతుగా భావించి అతడితో- (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: రూపకం.

క. ' ఈతాల్మి లేదు బ్రాహ్మణ । జాతికి; నీ వెవ్వఁడవు నిజం' బనవుడు 'నే
సూతజుఁడ' ననియె వెఱచుచు । నాతం; డా మునివరేణ్యుఁ డతి కుపితుండై. 25

ప్రతిపదార్థం: బ్రాహ్మణజాతికిన్= బ్రాహ్మణజాతికి; ఈ తాల్మి= ఇటువంటి ఓర్పు; లేదు= ఉండదు; నిజంబు= నిజంగా; నీవు+ఎవ్వఁడవు?= నీవు ఎవరవు?; అనవుడున్= అనగా విని; ఏన్= నేను; సూతజుఁడన్= సూతపుత్రుడను - అని; ఆతండు= కర్ణుడు; వెఱచుచున్= భయపడుతూ; అనియెన్= అన్నాడు; ఆ మునివరేణ్యుండు= ఆ మునిశ్రేష్ఠుడైన పరశురాముడు; అతికుపితుండు+ఐ= మిక్కిలి కోపించినవాడై.

తాత్పర్యం : 'బ్రాహ్మణజాతికి ఇటువంటి ఓర్పు ఉండదు. నిజంగా నీ వెవడవు?' అని అడుగగా 'నేను సూతపుత్రుడ' నని కర్ణుడు భయపడుతూ సమాధానం చెప్పాడు. అందుకు పరశురాముడు మిక్కిలి కోపించి.

వ. ' నీవు బ్రాహ్మణుండ నని కపటంబున మత్పరిగ్రహంబు వడసితివి; తత్ఫలం బనుభవింపు' మని యస్త్రవిద్యావిభవంబు వికలంబుగా శపియించెఁ; గర్ణుండునుం జేయునది లేక వగచుచు వచ్చి దుర్యోధనుం గాంచి. 26

ప్రతిపదార్థం: బ్రాహ్మణుండను+అని= నేను బ్రాహ్మణుడను అని; నీవు= నీవు(కర్ణుడు); కపటంబునన్= వంచనతో; మత్+పరిగ్రహంబున్= నా శిష్యత్వమును; పడసితివి= పొందావు; తద్+ఫలంబు= దాని ఫలితాన్ని; అనుభవింపుము= పొందుము; అని= అని పలికి; అస్త్ర విద్యావిభవంబు= మంత్ర బాణవిద్యావైభవం; వికలంబు+కాన్= భగ్నమై పోయేటట్లు; శపియించెన్= శాపం పెట్టాడు; కర్ణుండునున్= కర్ణుడు కూడా; చేయునది లేక= చేయగలిగిందేమీ లేక; వగచుచున్= విచారపడుతూ; వచ్చి= తిరిగివచ్చి; దుర్యోధనున్= దుర్యోధనుడిని; కాంచి= చూచి.

తాత్పర్యం: 'బ్రాహ్మణుడను అని పలికి నీవు వంచనతో నా శిష్యత్వాన్ని గ్రహించావు. దాని ఫలితాన్ని అనుభవించుము. నా వలన నేర్చుకొన్న అస్త్రవిద్యా సంపద మొత్తం భగ్నమైపోవుగాక!' అని శపించాడు. కర్ణుడుకూడా చేయగలిగిం దేమీ లేక విచారపడుతూ వచ్చి దుర్యోధనుడిని చూచి.

ఆ. ' అధిప! పరశురాము నాశ్రయించితిఁ; గృతా । స్త్రుండ నైతి, నన్ను భండనమున
మార్కొనంగ లేరు మగ లిజ్జగంబున' । ననుడు నతఁడు ప్రముదితాత్ముఁ డయ్యె. 27

ప్రతిపదార్థం: అధిప!= ప్రభూ! దుర్యోధనా!; పరశురామున్+ఆశ్రయించితిన్= పరశురాముడిని శరణువేడాను; కృత+అస్త్రుండను+ఐతిన్= గైకొనబడిన అస్త్రములు కలవాడి నైనాను (అస్త్రవిజ్ఞానాన్ని పొందాను); ఈ జగంబునన్= ఈ లోకంలో; మగలు= వీరులు; భండనమునన్= యుద్ధంలో; నన్నున్; మార్కొనంగన్‌లేరు= ఎదుర్కొనలేరు; అనుడున్= అనగా విని; అతఁడు= దుర్యోధనుడు; ప్రముదిత+ఆత్ముఁడు= సంతోషించిన హృదయం కలవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: 'ప్రభూ! నేను పరశురాముడిని ఆశ్రయించి అస్త్రవిద్యను గడించాను. ఇప్పు డీలోకంలో వీరు లెవ్వరూ యుద్ధంలో నన్ను ఎదుర్కొనేవారు లేరు' అని అనగా విని దుర్యోధనుడు సంతుష్టాంతరంగు డయ్యాడు.

విశేషం: కర్ణుడు అబద్ధా లాడటంలో వెనుకాడ డని మరొకసారి రుజువైంది - అవి సుయోధనుడికి సంతోషం కలిగిస్తే చాలు.

వ. ఇవి మీ యన్న వోయిన పోక; లిట్లు దుర్యోధనునకు ననుంగైయుండఁ, గళింగపతి యగు చిత్రాంగదుండు శుభాంగి యను నిజపుత్రికి స్వయంవర మహోత్సవంబు సేయించువాఁడై చాటించిన, శిశుపాలుండును, నీలుండును, జరాసంధుండును, రుక్మియు లోనుగా రాజు లనేకులు తదీయరాజధాని యగు రాజపురంబునకుం జనిరి; దుర్యోధనుండును దోహలంబున సముచిత చతురంగ బలసమేతుండును గల్పిత రథారూఢుండును గర్ణసహాయుండునునై యరిగె; నట్లు గూడిన భూపతులకుం దగుసంవిధానంబు లాచరించి. 28

ప్రతిపదార్థం: ఇవి= ఇప్పుడు చెప్పినవి; మీ+అన్న= మీ అన్న అయిన కర్ణుడు; పోయినపోకలు= నడచిన విధాలు; ఇట్లు= ఈ విధంగా; దుర్యోధనునకున్= దుర్యోధనుడికి; అనుంగు+ఐ+ఉండన్= ప్రియస్నేహితుడై ఉండగా; కళింగపతి+అగు చిత్రాంగదుండు= కళింగదేశానికి రాజైన చిత్రాంగదుడు; శుభాంగి+అను నిజపుత్రికిన్= శుభాంగి అనే పేరుగల తన కొమార్తెకు; స్వయంవర మహా+ఉత్సవంబు= స్వయంగా కన్యవరుడిని నిండుసభలో ఎన్నుకొనే వేడుకను; చేయించువాఁడు+ఐ= నిర్వహింపదలచి;

చాటించినన్ ప్రకటన చేయించగా; శిశుపాలుండును, నీలుండును, జరాసంధుండును, రుక్మియున్; లోనుగాన్= మొదలుగా; రాజులు+అనేకులు= పెక్కుమంది రాజులు; తదీయ రాజధాని+అగు= చిత్రాంగదుడి రాజధాని అయిన; రాజపురంబునకున్+చనిరి= రాజపురానికి వెళ్ళారు; దుర్యోధనుండును= దుర్యోధనుడు కూడా; దోహలంబునన్= ఉత్సాహంతో; సముచిత= యోగ్యమైన; చతుఃఅంగబలసమేతుండును= రథగజ అశ్వపదాతులనే నాలుగు అంగాలుగల సైన్యంతో కూడుకొని; కల్పితరథ+ఆరూఢుండును= సిద్ధం చేయబడిన రథాన్ని ఎక్కినవాడై; కర్ణసహాయుండును+ఐ= కర్ణుడి సహాయం తీసికొన్నవాడుకూడా అయి; అరిగెన్= వెళ్ళాడు; అట్లు= ఆ విధంగా; కూడిన భూపతులకున్= సమావేశమైన రాజులకు; తగు సంవిధానంబు= ఉచితమైన సదుపాయాలు; ఆచరించి= చేసి.

తాత్పర్యం: మీ అన్న అయిన కర్ణుడు నడచిన విధా లటువంటివి. ఆ విధంగా కర్ణుడు దుర్యోధనుడికి ఆప్తమిత్రుడై ఉండగా కళింగరాజ్యాన్ని పరిపాలించే చిత్రాంగదుడనే రాజు తన పుత్రిక శుభాంగికి స్వయంవర మహోత్సవాన్ని చాటాడు. దానికి శిశుపాలుడు, నీలుడు, జరాసంధుడు, రుక్మి మొదలైన రాజు లెందరో చిత్రాంగదుడి రాజధానీ నగరమైన రాజపురానికి చేరారు. దుర్యోధనుడు కూడా ఉత్సాహంతో చతురంగ బలాలను వెంటబెట్టుకొని, కర్ణసహాయుడై, రథమెక్కి రాజపురానికి వెళ్ళాడు. అట్లా సమావేశమైన రాజులకందరికీ చిత్రాంగదుడు సముచిత సత్కారాలు చేసి.

సీ. కాళింగుఁ డాత్మీయ కన్యాస్వయంవర । కార్యంబు నడప, నక్కన్య సఖులు
దాదులు పేర్వేర ధరణీపతులఁ జూపి । చెప్పంగఁ జూచుచుఁ జేతఁ బుష్ప
మాలిక యొప్పఁ దన్మధ్య వీథికి నల్ల । నడచుచుఁ గురుపతిఁ గడచిపోయె;
నతఁ డల్గి యచ్చపలాక్షిఁ బోనీ కాఁగి । పట్టి, రథంబుపైఁ బెట్టఁ బనిచి

ఆ. యేఁగుచున్న, రాజు లెల్ల సంక్షోభించి, । కూడుకొని యుదగ్ర ఘోరభంగిఁ
దాఁకి; రవ్విభుండుఁ దలఁకక బలశౌర్య । ములు పొగడ్త కెక్కఁ బోరె నధిప! 30

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; కాళింగుఁడు= కళింగదేశాధిపతి చిత్రాంగదుడు; ఆత్మీయకన్యా స్వయంవర కార్యంబు= తన కూతు స్వయంవరోత్సవ కార్యక్రమాన్ని; నడపన్= నిర్వహించగా; ఆ+కన్యసఖులు, దాదులు= స్వయంవరకన్య అయిన శుభాంగి యొక్క చెలికత్తెలు; పెంచిన దాదులు; పేరు+పేరన్= ఒక్కొక్కరి పేరు చెప్పుతూ; ధరణీపతులన్= రాజులను; చూపి= చూపించి; చెప్పంగన్= పరిచయం చేయగా; చూచుచున్= (శుభాంగి వారిని) చూస్తూ; చేతన్+పుష్పమాలిక ఒప్పన్= చేతిలో కల్యాణపుష్పమాల ఒప్పారగా; తద్+మధ్యవీథికిన్= రాజుల నడుమనున్న బాటలో; అల్లన్= మెల్లగా; నడచుచున్= ముందుకు సాగుతూ; కురుపతిన్= దుర్యోధనుడిని; కడచిపోయెన్= దాటిపోయింది; అతఁడు= దుర్యోధనుడు; అల్గి= కోపించి; ఆ+చపలాక్షిన్= చలించేకన్నులు గల ఆ శుభాంగిని; పోనీక= ముందుకు పోకుండ; ఆఁగిపట్టి= ఆపి పట్టుకొని; రథంబుపైన్= రథంమీద; పెట్టన్= ఉంచటానికి; పనిచి= ఆజ్ఞాపించి; ఏఁగుచున్నన్= సభను వీడిపోతూ ఉండగా; రాజులు+ఎల్లన్= రాజులందరూ; సంక్షోభించి= కలతచెంది; కూడుకొని= ఒక్కటై; ఉదగ్రఘోరభంగిన్= అతి భయంకరమైన విధంగా; తాఁకిరి= ఎదుర్కొన్నారు; ఆ+విభుండున్= ఆ రాజు(దుర్యోధనుడు) కూడ; తలఁకక= భయపడక; బలశౌర్యములు= బలపరాక్రమాలు; పొగడ్తకెక్కన్= కీర్తించబడేటట్లుగా; పోరెన్= యుద్ధం చేశాడు.

తాత్పర్యం: ధర్మరాజా! చిత్రాంగదుడు తన కూతురైన శుభాంగికి స్వయంవర మహోత్సవ కార్యాన్ని నిర్వహిస్తున్నాడు. చెలికత్తెలు, దాదులు పేరుపేరున రాజులను చూపి పరిచయం చేస్తూ ఉండగా ఆ కన్య వారిని చూస్తూ చేతిలో

కల్యాణపుష్పమాలను ధరించి రాజుల నడుమనున్న దారిని మెల్లగా నడుస్తూ దుర్యోధనుడిని దాటిపోయింది. అందుకు రారాజుకు కోపం వచ్చింది. ఆమెను ముందుకు సాగకుండా ఆపి పట్టి, రథంమీద ఉంచటానికి ఆజ్ఞాపించి, తాను సభను వీడి వెళ్ళనారంభించాడు. సభలోని రాజులందరూ కలవరపడి, గుమిగూడి అతిభయంకరమైన విధంగా అతడిని ఎదుర్కొన్నారు. దుర్యోధనుడు కూడా వెనుకాడక అందరూ అతడి బలపరాక్రమాలను పొగడేటట్లు యుద్ధం చేశాడు.

వ. అట్టియెడ. **30**

తాత్పర్యం: ఆ సమయంలో.

శా. భల్లంబుల్ పరఁగించి యుగ్రముగ భూపాలోత్తమాంగంబులన్
డొల్లం జేయుచుఁ, జిత్ర లాఘవము నాటోపంబు దర్పంబు రా
జిల్లం గుంభిఘటారథవ్రజ హయశ్రేణీ పదాతి ప్రతా
నోల్లాసంబుల రూపుమాపుచు నవార్యుం డయ్యెఁ గర్ణుం డనిన్. **31**

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధంలో; కర్ణుండు= కర్ణుడు; భల్లంబులన్= బల్లెములను; పరఁగించి= ప్రయోగించి; ఉగ్రముగన్= భయంకరంగా; భూపాల+ఉత్తమ+అంగంబులన్= రాజుల తలలను; డొల్లన్+చేయుచున్= నేలరాలేటట్లు చేస్తూ; చిత్రలాఘవమున్= అద్భుతమైన నేర్పును; ఆటోపంబున్= వేగిరపాటును; దర్పంబున్= గర్వం; రాజిల్లన్= ప్రకాశించగా; కుంభిఘటా= ఏనుగుల గుంపులయొక్క; రథవ్రజ= రథసమూహాలయొక్క; హయశ్రేణీ= గుర్రాలవరుసలయొక్క; పదాతిప్రతాన= కాల్బలాల సముదాయంయొక్క; ఉల్లాసంబులన్= అతిశయాలను; రూపుమాపుచున్= అణుస్తూ; అవార్యుండు= వారించటానికి శక్యం కానివాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: బల్లెములను ప్రయోగించి రాజుల శిరస్సులను భయంకరంగా నేల రాలేటట్లు చేస్తూ, విచిత్రమైన నేర్పు, వేగం, గర్వం ప్రకాశించేటట్లు చేస్తూ ఏనుగుల, రథాల, గుర్రాల, పదాతుల సమూహాలను మట్టుపెట్టుతూ, అందరికీ వారించటానికి శక్యం కానివాడుగా కర్ణుడు యుద్ధరంగంలో నిలిచాడు.

వ. ఇవ్విధంబున విక్రమించు నవ్వీరవర్యుని శౌర్యబాహువీర్యంబులకు భయంబుఁగొని హతశేషులైన భూపతులు పఱచినం బ్రీతుం డగుచు నక్కురుకుమారుండు గన్యారత్నంబుఁ గొని కరినగరంబున కరుగుదెంచె; నప్పగ మనంబునఁ బెట్టికొని పదంపడి జరాసంధుం డక్కమలబంధుపుత్రు నెక్కటిపోరికిం బిలిచినం బోయి. **32**

ప్రతిపదార్థం: ఈవిధంబునన్= పైన చెప్పిన విధంగా; విక్రమించు= పరాక్రమం ప్రదర్శించే; ఆ+వీరవర్యుని= ఉత్తమ వీరుడైన ఆ కర్ణుడియొక్క; శౌర్యబాహు వీర్యంబులకున్= పరాక్రమానికీ, భుజబలానికీ; భయంబున్+కొని= భయపడి; హతశేషులు+ఐన భూపతులు= చావగా మిగిలిన రాజులు; పఱచినన్= పరుగెత్తగా, పారిపోగా; ఆ+కురుకుమారుండు= ఆ దుర్యోధనుడు; ప్రీతుండు+అగుచున్= సంతోషించినవాడౌతూ; కన్యారత్నంబున్= శ్రేష్ఠురాలైన ఆ కన్యను (శుభాంగిని); కొని= గ్రహించి; కరినగరంబునకున్= హస్తినాపురానికి; అరుదెంచెన్= వచ్చాడు; జరాసంధుండు= జరాసంధుడు; ఆ+పగన్= ఆ కచ్చెను; మనంబునన్= మనసులో; పెట్టికొని= ఉంచుకొని; పదంపడి= ఆ తరువాత ఒకసారి; కమలబంధు పుత్రున్= సూర్యుడి కుమారుడైన కర్ణుడిని; ఎక్కటి పోరికిన్= ఒంటరిగా చేసే పోరుకు (అంటే ద్వంద్వయుద్ధానికి); పిలిచినన్= ఆహ్వానించగా; పోయి.

తాత్పర్యం: ఆ విధంగా బలపరాక్రమాలను ప్రదర్శించే వీరవర్యుడైన కర్ణుడిని చూచి, చావగా మిగిలిన రాజులు భయపడి పలాయనం చిత్తగించారు. దుర్యోధనుడు సంతోషించి కన్యారత్నమైన శుభాంగిని తీసికొని హస్తినాపురానికి చేరుకొన్నాడు. అయితే, అప్పటి పగను మనసులో పెట్టుకొన్న జరాసంధుడు కర్ణుడిని ఒంటరిపోరుకు (ద్వంద్వయుద్ధానికి) ఆహ్వానించాడు. కర్ణుడు వెళ్ళాడు.

సీ. ఎక్కటెక్కటిపోరి యిద్ధదివ్యాస్త్ర సం । చయవంతుఁ డగు జరాసంధు బాణ
ధనురాది వివిధసాధనములు దనచేతఁ । దన యస్త్రశస్త్రసంతాన మెల్ల
నాతనిచే మడియంగ రథంబులు । డిగ్గి పెంపారెడు నగ్గలికల
నాతండుఁ దాను బాహాసంగరమునకుఁ । జొచ్చి పెనంగఁగ నొచ్చి యతని

ఆ. యంగసంధి వికల మగుటయుఁ బోరు సా । లించి యతఁడు గారవించి తనకు
మహితవిభవ మైన మాలినీ నగర మీ । నధికతేజ మెసఁగ నరుగుదెంచె. 33

ప్రతిపదార్థం : ఎక్కటి+ఎక్కటి= ఒంటరొంటరిగా; పోరి= యుద్ధంచేసి; ఇద్ధ దివ్య+అస్త్ర సంచయవంతుఁడు+అగు= ప్రకాశించే మహిమాన్వితాలైన మంత్రపూరిత బాణ సమూహాలతో కూడుకొన్నవాడైన; జరాసంధు= జరాసంధుడియొక్క; బాణధనుః+ఆది వివిధ సాధనములు= బాణాలు, విల్లమ్ములు మొదలైన పలురకాలైన పనిముట్లు; తనచేతన్= తన (కర్ణుడి) చేతను; తన+అస్త్ర శస్త్ర సంతానము+ఎల్లన్= కర్ణుడి మంత్రసహితబాణాలయొక్కయు, మంత్రరహిత బాణాలయొక్కయు సమూహాలన్నింటిని; ఆతనిచేన్= జరాసంధుడిచేతను; మడియంగన్= ధ్వంసంకాగా; ఆతండున్+తానున్= జరాసంధుడూ, కర్ణుడూ; రథంబులు= రథాలను; డిగ్గి= దిగి; పెంపు+ఆరెడు= అతిశయించే; అగ్గలికలన్= పూనికలతో, బాహాసంగరమునకున్= బాహుయుద్ధానికి; చొచ్చి= ప్రవేశించి; పెనంగఁగన్= ద్వంద్వయుద్ధం చేయగా; నొచ్చి= నొప్పిచెంది; అతని+అంగసంధి= జరాసంధుడి శరీరంలోని కీలు; వికలము+అగుటయున్= విరగగా; పోరు= యుద్ధం; చాలించి= మాని; అతడు= జరాసంధుడు; గారవించి= సన్మానించి; తనకున్= కర్ణుడికి; మహితవిభవము+ఐన= అధికసంపద కలిగినదైన; మాలినీనగరము= మాలిని అనే పేరుగల పట్టణాన్ని; ఈన్= ఈయగా; అధికతేజము= మిక్కిలి పరాక్రమం; ఎసఁగన్= ఒప్పారగా, ప్రకాశించగా; అరుగుదెంచెన్= తిరిగి వచ్చాడు.

తాత్పర్యం: కర్ణ జరాసంధు లిరువురూ అసహాయవీరులై యుద్ధంచేశారు. కర్ణుడు జరాసంధుడి దివ్యాస్త్ర సముదాయాన్ని, ధనురాది సాధనాలనూ ధ్వంసం చేశాడు. జరాసంధుడు కూడా కర్ణుడి అస్త్రశస్త్రాలను వమ్ముచేశాడు. ఆపైన ఇరువురూ రథాలపై నుండి నేలమీదకు దిగి, పెరిగిన పట్టుదలతో బాహాబాహీ యుద్ధానికి పూనుకొని తలపడ్డారు. జరాసంధుడు బాధపొంది కీలు విరుగగొట్టుకొన్నాడు. అంతటితో పోరు ఇరువురూ చాలించారు. జరాసంధుడు కర్ణుడి పౌరుషానికి మెచ్చి గారవించి, అధిక సంపదలకు నిలయమైన మాలినీనగరాన్ని అతడి కిచ్చాడు. కర్ణుడు అమిత తేజంతో తిరిగి వచ్చాడు.

వ. ఈ రెండ వదానంబులు నీవును గొంత యెఱుంగు; దిట్లు ప్రసిద్ధబలపరాక్రముండైన కర్ణు నుదీర్ణత్వంబు
సెఱుచుటకునై సహజ కవచకుండలంబులు భిక్షించి పుచ్చుకొని నాకలోకపతి నీకు హితం బాచరించె;
దానంజేసి ధనంజయుం డతనిం దెగటార్పం జాలె' నని చెప్పి వెండియు. 34

ప్రతిపదార్థం: ఈరెండు+అవదానంబులు= జరిగిన ఈ రెండు మంచి పనులు; నీవును= నీవుకూడ; కొంత+ఎఱుంగుదు(వు)= కొంత తెలిసికొని ఉంటావు; ఇట్లు= పైన చెప్పబడిన విధంగా; ప్రసిద్ధబల పరాక్రముండు+ఐన= ప్రకటమైన బలపరాక్రమాలు కలవాడైన; కర్ణు= కర్ణుడియొక్క; ఉదీర్ణత్వంబు= గొప్పతనమును; చెఱుచుటకునై= పాడుచేయటానికై; నాకలోకపతి= స్వర్గలోకాధిపతిఅయిన

ఇంద్రుడు; సహజ కవచకుండలంబులు= పుట్టుకతో నైజంగా వచ్చిన కవచాన్నీ, కుండలాలనూ; భిక్షించి= అడిగికొని; పుచ్చుకొని= తీసికొని; నీకున్= నీకు (ధర్మరాజుకు); హితంబు= మేలు; ఆచరించెన్= చేశాడు; దానన్+చేసి= అది కారణంగా; ధనంజయుండు= అర్జునుడు; అతనిన్= కర్ణుడిని; తెగటార్పన్+చాలెన్= చంపగలిగాడు; అని చెప్పి= ఈ విధంగా చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: జరిగిన ఈ రెండు మంచి పనులు నీకు కూడా కొంత తెలిసి ఉండవచ్చును. అట్లా బలపరాక్రమాలలో జగత్ప్రసిద్ధుడైన కర్ణుడి గొప్పతనాన్ని ధ్వంసం చేయదలచి ఇంద్రుడు అతడి కవచకుండలాలను భిక్షగా అడిగి పుచ్చుకొన్నాడు. దానివలన ధర్మజా! నీకు మేలు జరిగింది. దానివలననే అర్జునుడు కర్ణుడిని సంహరించగలిగాడు' - అని చెప్పి, మరల ఇట్లా అన్నాడు:

చ. ' వినుము నరేంద్ర! విప్రుఁ డలివెన్, జమదగ్నిసుతుండు శాప మి
చ్చె, నమరభర్త వంచనము సేసె, వరం బని కోరి కుంతి మా
న్పె నలుక, భీష్ముఁ డర్ధరథుఁ జేసి యడంచెఁ, గలంచె మద్రరా
జనుచిత మాడి, శౌరి విధి యయ్యె, నరుం డనిఁ జంపెఁ గర్ణునిన్. 35

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ధర్మరాజా!; వినుము= గ్రహించుము; విప్రుఁడు= బ్రాహ్మణుడు; అలివెన్= కోపగించాడు; జమదగ్నిసుతుండు= జమదగ్నిమహర్షి కుమారుడైన పరశురాముడు; శాపము+ఇచ్చెన్= శాపం పెట్టాడు; అమరభర్త= దేవతల రాజైన ఇంద్రుడు; వంచనము= మోసం; చేసెన్= చేశాడు; కుంతి= కుంతీదేవి; వరంబు+అని= వర మనే పేరుతో; కోరి= అడిగి; అలుకన్= తన పుత్రులమీది కోపాన్ని; మాన్పెన్= తగ్గించింది; భీష్ముఁడు= భీష్ముడు; అర్ధరథున్= ఒక రథికుడితో కూడ సమంగా పోరలేని వీరుడిగా; చేసి= నిర్ణయించి; అడంచెన్= అణచాడు; మద్రరాజు= మద్రదేశ ప్రభువు శల్యుడు; అనుచితము+ఆడి= అయోగ్యాలైన మాటలు మాట్లాడి; కలంచెన్= హృదయాన్ని కలవరపెట్టాడు; శౌరి= కృష్ణుడు; విధి= తలవ్రాత; అయ్యెన్= అయ్యాడు; అనిన్= యుద్ధంలో; నరుండు= అర్జునుడు; కర్ణునిన్= కర్ణుడిని; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: ధర్మరాజా! నేను చెప్పేది విని గ్రహించుము. బ్రాహ్మణుడు కర్ణుడిని కోపగించి శపించాడు. ఆ తరువాత పరశురాముడు శాపం పెట్టాడు. ఇంద్రుడు మోసంచేసి సహజకవచకుండలాలను గ్రహించాడు. కుంతి వరమనే నెపంతో కోరి కోపాన్ని మాన్పింది; భీష్ముడు కర్ణుడిని అర్ధరథుడిగా చేసి అగౌరవపరిచాడు; శల్యుడు అనుచిత సంభాషణలతో కర్ణుడి హృదయాన్ని కలతపెట్టాడు. కృష్ణుడు అతడికి దాటరాని విధిగా నిలిచాడు. ఇన్ని జరుగగా అర్జునుడు కర్ణుడిని రణరంగంలో వధించగలిగాడు!

విశేషం: కర్ణుడి జీవితాన్నంతా ఒక్క పద్యంలో ఇమిడ్చిన రచన ఇది. పండిత లోకంలో అమిత ప్రచారంలో ఉన్న పద్య మిది. ఎంతటి మహాత్ముడైనా దైవబలం లేకపోతే ఎట్లా కుప్పకూలిపోతాడో చెప్పటానికి విజ్ఞులు ఈ పద్యాన్ని ఒక స్ఫూర్తిగా సంభాషణలలో వాడుకొంటూ ఉంటారు.

వ. అట్లుంగాక. 36

తాత్పర్యం: అట్లా కాకపోతే.

క. హర సురపతి యమ వరుణులు । గురుకృపులును దివ్యబాణకోటు లొసఁగుటన్
నరుశక్తి కర్ణతేజ । స్ఫురణము నార్పంగఁ జాలెఁ జువ్వె నృపాలా! ' 37

ప్రతిపదార్థం: నృపాలా!= ధర్మరాజా!; హర, సురపతి, యమ, వరుణులు, గురుకృపులును= శివుడు, ఇంద్రుడు, యముడు, వరుణుడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు; దివ్యబాణకోటులు= మహిమాన్వితాలైన లెక్కకు మించిన బాణాలను; ఒసంగుటన్= ఇవ్వటంవలన; నరుశక్తి= అర్జునుడి పరాక్రమం; కర్ణతేజఃస్ఫురణమున్= కర్ణుడియొక్క ప్రతాపదీప్తిని; ఆర్పంగన్+చాలెన్+చువ్వె!= ఆర్పగలిగింది సుమా!

తాత్పర్యం: ధర్మరాజా! శివుడు, ఇంద్రుడు, యముడు, వరుణుడు, ద్రోణుడు, కృపుడు మొదలైనవారందరూ లెక్కకు మించిన దివ్యబాణాలను ఉపదేశించటంవలన అర్జునుడి ప్రతాపతేజం కర్ణుడి పరాక్రమతేజాన్ని ఆర్పగలిగింది సుమా!'

వ. అనిన విని శోకవ్యాకులుండైన యన్నరపతి గన్నీరొలుక నిట్టూర్పు నిగిడించినం దత్సమీపంబున నున్న కుంతి గనుంగొని యడ లుడుపుటకై యతనితో నిట్లనియె. 38

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని; శోకవ్యాకులుండు+ఐన= దుఃఖంచేత కలతచెందినవాడైన; ఆ+నరపతి= ఆ రాజైన యుధిష్ఠిరుడు; కన్నీరు+ఒలుకన్= కన్నీరు కారగా; నిట్టూర్పు నిగిడించినన్= దీర్ఘనిశ్వాస వదలగా; తద్+సమీపంబునన్= ఆ సమీపప్రాంతంలో ఉన్న; కుంతి= కుంతీదేవి; కనుంగొని= చూచి; అడలు= దుఃఖాన్ని; ఉడుపుటకున్+ఐ= ఉపశమింపచేయటానికి; అతనితోన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: అని నారదుడు చెప్పగా విని తీవ్రమైన దుఃఖంచేత కలతచెంది ధర్మరాజు కన్నీరు మున్నీరు కాగా, దీర్ఘనిశ్వాస విడుస్తూ ఉండగా అతడి సమీపంలో ఉన్న కుంతీదేవి అతడి అవస్థను చూచి, అతడి శోకాన్ని మాన్పాలని అతడితో ఇట్లా అన్నది:

చ. ' జననముఁ దెల్పి యేఁ బిలువ 'సత్యము సుమ్ము కుంతి భాషణం'
బని తనుజత్వజాతకృప నంబుజమిత్రుఁడు వల్కె; నేమిటన్
గొనకొన నేరఁడయ్యె నినుఁ గూడ సుయోధనుఁ బట్టి; యట్టి క
ర్ణున కయి నీవు నేటికి మనోవ్యథఁ బొందఁగ నిట్లు పుత్రకా!' 39

ప్రతిపదార్థం: పుత్రకా!= కుమారా! (ధర్మరాజా!); ఏన్= నేను (కుంతి); జననమున్+తెల్పి= పుట్టుకను గూర్చిన సత్యాన్ని తెలియజెప్పి; పిలువన్= (పాండవుల పక్షంలో చేరుమని) పిలువగా; అంబుజమిత్రుఁడు= సూర్యుడు; తనుజత్వ జాత కృపన్= కన్నకొడుకనే భావంతో కలిగిన కరుణతో; కుంతిభాషణంబు= కుంతీదేవిమాటలు; సత్యము సుమ్ము!= నిజం సుమా!; అని; పల్కన్= పలికాడు; (కాని); సుయోధనున్+పట్టి= దుర్యోధనుడిని ఆశ్రయించి; నినున్= నిన్ను (ధర్మరాజుతో); కూడన్= చేరటానికి; ఏమిటన్= ఏ విధంగా కూడా; గొనకొనన్ నేరఁడు+అయ్యెన్= యత్నించజాలకపోయాడు; అట్టి= అటువంటి; కర్ణునకున్+అయి= కర్ణుడి గురించి; నీవు; ఇట్లు= ఈ విధంగా; మనోవ్యథన్= మానసిక వేదనను; పొందఁగన్+ఏటికిన్?= పొందటం ఎందుకు?

తాత్పర్యం: 'కుమారా! పుట్టుకను గురించిన నిజాన్ని చెప్పి అతడిని నీవైపు నేను ఆహ్వానించినప్పుడు, ఆ సూర్యభగవానుడు కూడా కన్నకొడుకనే భావంతో కలిగిన కరుణతో 'కుంతి చెప్పిన మాట నిజం; నమ్ము నాయనా!' అని పలికాడు. కాని, కర్ణుడు దుర్యోధనుడిని ఆశ్రయించి నీవైపు రావటానికి ఏ విధంగానూ ప్రయత్నం చేయలేకపోయాడు. కాబట్టి అటువంటి కర్ణుడికొరకు నీ వెందుకు ఈ విధంగా మానసిక వేదనను పొందుతావు?' (వలదని భావం).

వ. అనుటయు నవ్వచనంబులు దనకు నసహ్యంబు లైనం గటకటంబడి యద్దేవి నాలోకించి 'భవదీయ మంత్రకార్య గోపనంబునం గాదె యింత పుట్టె' నని పలికి, యంత నిలువక 40

ప్రతిపదార్థం: అనుటయున్= అని కుంతీదేవి పలుకగా; ఆ+వచనంబులు= ఆ మాటలు; తనకున్= ధర్మరాజుకు; అసహ్యంబులు+ఐనన్= ఏవగింపు కలిగించినవి కాగా; కటకటంబడి= బాధచెంది; ఆ+దేవిన్= ఆ రాణిని (కుంతిని); ఆలోకించి= చూచి; భవదీయ= నీయొక్క; మంత్రకార్య= రాజనీతి చర్యలను; గోపనంబునన్= రహస్యంగా ఉంచటం వలన; కాదె!= కాదా!; ఇంత= ఇంతటి విపరీతపరిణామం; పుట్టెన్= కలిగింది; అని పలికి= అని చెప్పి; అంతన్ నిలువక= అంతటితో ఆగక.

తాత్పర్యం: అని మాట్లాడిన కుంతీదేవి పలుకులు ధర్మరాజుకు ఏవగింపు కలిగించటంతో అతడు బాధపడి కుంతీదేవిని చూచి ఇట్లా అన్నాడు: 'నీవు నిర్వహించిన ఈ రాచకార్యాన్ని రహస్యంగా ఉంచటం వలననే ఇంతటి విపరీత పరిణామం కలిగింది' అని అంటూ అంతటితో ఆగక - (తరువాతి పద్యంతో అన్వయం).

ధర్మరాజు స్త్రీలకు రహస్య రక్షణంబు లేకుండ శపియించుట (సం. 12-6-11)

తే. ' అంగనాజనమ్ములకు రహస్య రక్ష। ణంబునందలి శక్తి మనంబులందుఁ
గలుగకుండెడు మెల్లలోకముల' నని శ। పించె నా ధర్మదేవతాప్రియసుతుండు. 41

ప్రతిపదార్థం: ఆ ధర్మదేవతాప్రియనందనుండు= యమధర్మరాజు ప్రియకుమారుడు ఆ ధర్మరాజు; ఎల్ల లోకములన్= అన్ని లోకాలలోనూ; అంగనాజనమ్ములకున్= స్త్రీజనులకు; రహస్యరక్షణంబునందలి శక్తి= గోప్యంగా ఉంచదగినవాటిని రహస్యంగా ఉంచి కాపాడే విధానంలో ఉండే బిగువు; మనంబుల+అందున్= మనస్సులలో; కలుగక+ఉండెడు(ఉండెడున్+ఎల్ల= ఉండెడుమెల్ల) కలుగకుండా ఉండుగాక!; అని శపించెన్= అని శాపంపెట్టాడు.

తాత్పర్యం: అన్ని లోకాలలో ఉండే ఆడవారికి రహస్యాలను రహస్యంగా కాపాడే శక్తి వారి మనస్సులలో లేకుండా పోవుగాక! అని ధర్మరాజు శపించాడు.

విశేషం: 'ఆడవారి నోళ్ళల్లో ఆవగింజైనా నానదు' అనే సామెత ఇట్లా పుట్టిందేమో!

వ. ఇట్లు మహాతేజోధనుం డగు నజ్జననాథుం డట్లు శపియించి కుంతి చేసిన కర్ణగోపనంబు ప్రసంగంబుగా నంతరంగంబు గృతపడిన కార్యంబులదెస నిగుడం దనకతంబున మృతిఁబొందిన యుభయపక్ష బంధుమిత్రకోటులం దలంచి యుమ్మలించి విశేషించి కర్ణుచావునకుఁ దూరవగచి విహ్వలించి వివ్వచ్చునాననం బాలోకించి యిట్లనియె. 42

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మహాతేజోధనుండు+అగు= గొప్పదైన ప్రకాశం (ప్రతాపం) ధనంగా కలవాడైన; ఆ+జననాథుండు= ఆ ధర్మరాజు; అట్లు= ఆ విధంగా; శపియించి= శాపంపెట్టి; కుంతి= కుంతీదేవి; చేసిన= ఒనర్చిన; కర్ణగోపనంబు= కర్ణుడిని గురించిన అంశాలను రహస్యంగా ఉంచిన అంశం; ప్రసంగంబుగాన్= చర్చనీయాంశం కాగా; అంతరంగంబు= మనస్సు; కృతము+పడిన= కడచిన; కార్యంబులదెస= పనులవైపు; నిగుడన్= ప్రసరించగా; తన కతంబునన్= తన కారణంగా; మృతిన్+పొందిన= చనిపోయిన; ఉభయపక్ష= రెండు (కౌరవ పాండవ) పక్షాలకు చెందిన; బంధుమిత్ర కోటులన్= అసంఖ్యాకులైన బంధువులను, మిత్రులను; తలంచి= స్మరించి; ఉమ్మలించి= శోకించి; విశేషించి= అధికంగా; కర్ణుచావునకున్= కర్ణుడి మరణానికి; తూరన్ వగచి= నొచ్చేటట్లుగా దుఃఖించి; విహ్వలించి= దుఃఖాతిశయం వలన శరీరం వశం తప్పినవాడై; వివ్వచ్చు+ఆననంబు= అర్జునుడి ముఖాన్ని; ఆలోకించి= చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: తేజోవంతుడైన ధర్మరాజు ఆ విధంగా శపించి, కుంతీదేవి కర్ణుడి విషయాలు దాచి ఉంచటమనే అంశం చర్చనీయాంశం కాగా, అతడి మనస్సు కడచిన కార్యములపట్ల ప్రసరించింది. అది కారణంగా కౌరవపాండవ

పక్షాలలో అసంఖ్యాకంగా ప్రాణాలు కోల్పోయిన బంధుమిత్రులు జ్ఞాపకం వచ్చారు. దానికి అమితంగా దుఃఖించాడు. విశేషించి కర్ణుడి మరణం అతడి మనస్సును గాయపరచింది. శోకతీవ్రతచేత శరీరం తూలినట్లయింది. అప్పుడు ధర్మరాజు అర్జునుడి మొగంవైపు చూచి ఈ విధంగా అన్నాడు:

క. ' మన కేటిరాజ్య? మొండొక । జనపదమున కేఁగి భైక్షచర్యావిధి జీ
వనము నడిపికొనియుండుద । మనఘా! యట్లయిన సుఖుల మవుదుము సుమ్మీ!' 43

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! అర్జునుడా!; మనకున్= మనకు (పాండవులకు); ఏటిరాజ్యము?= రాజ్యమేమిటికి? (ఎందుకు? అని భావం; వలదు అని తాత్పర్యం); ఒండు+ఒక= మరియొక; జనపదమునకున్= జనస్థానానికి; ఏఁగి= వెళ్ళి; భైక్షచర్యావిధిన్= బిచ్చమెత్తుకొనే కార్యక్రమంతో; జీవనము= బ్రదుకు; నడిపికొని+ఉండుదము= సాగించుకొంటూ ఉందాము; అట్లు+అయినన్= ఆ విధంగా చేసినట్లయితే; సుఖులము= సుఖించినవారం; అవుదుము= అవుతాము; సుమ్మీ!= సుమా!

తాత్పర్యం: 'పాపరహితుడవైన పార్థుడా! మన కెందుకీ రాజ్యం? మరొక జనస్థానానికి వెళ్ళి అక్కడ బిచ్చమెత్తుకొనే కార్యక్రమంతో బ్రదుకును సాగించుకొంటూ ఉందాము. అట్లాగైతే మనం సుఖంగా ఉంటాము సుమా!'

విశేషం: ధర్మజుడు శోకతీవ్రత చేత విరక్తిని ప్రకటిస్తున్నాడు.

వ. అని వెండియు. 44

తాత్పర్యం: అని ఇంకా (ఇట్లా అన్నాడు ధర్మజుడు).

సీ. ' జ్ఞాతుల నందఱఁ జంపితి, మది యాత్మ । వధము కాదే! రాజవర్తనంబుఁ
గాల్పు; మహింస నిక్కము దాల్మి మత్సర । వర్జన మిది వనవాసజనుల
కాగమ విహితంబు లటె; యింత యొప్పునే? । వనమున వసియింపవలయు వింటె;
యసుఖదంబైన రాజ్యామిషంబునకుఁ గు । క్కల భంగిఁ దమలోనఁ గాటులాడి

తే. కులము నెల్లను బొలియింపఁ గుత్సితంపు । బ్రదుకు వచ్చెనె యను వగపాలు వడఁగఁ
బ్రమద మొసఁగదు త్రైలోక్యరాజ్య మైనఁ । గాన నే నొల్ల మహి; మీర కైకొనుండు. 45

ప్రతిపదార్థం: జ్ఞాతులన్+అందఱన్= సగోత్రికులనందరిని; చంపితిమి= ప్రాణాలు తీశాము; అది= ఆ విధంగా చేయటం; ఆత్మవధము+అ= మనలను మనం చంపుకొనటమే; కాదే!= కాదా!; రాజవర్తనంబున్= క్షత్రియధర్మాన్ని; కాల్పుము= కాల్చివేయుము; (అనగా దానిని తిరస్కరించుము అని భావం); అహింస= హింసచేయకుండటం; నిక్కము= ఋజువర్తనం; సత్యాన్ని పాటించటం; తాల్మి= ఓర్పు; మత్సర వర్జనము= అసూయను విడనాడటం; ఇది= ఇటువంటి గుణాలు కలిగి ఉండే వర్తనం; వనవాస జనులకున్= తపోవనాలలో నియమనిష్ఠలతో నివసించేవారికి; ఆగమ విహితంబులు+అటె!= వేద సమ్మతాలట కదా!; అంత+ఒప్పునే?= ఎంత సముచితంగా ఉంది?; వనమునన్+వసియింపన్ వలయున్= మనం వనంలోనే (తపోవనంలోనే) నివసించాలి; వింటివి+ఎ?= విన్నావా? (గ్రహించావా, తెలిసిందా? అని భావం); అసుఖదంబు+ఐన= దుఃఖాన్ని కలిగించేదైన; రాజ్య+ఆమిషంబునకున్= రాజ్యమనే మాంసం కొరకు; కుక్కలభంగిన్= కుక్కలవలె; తమలోనన్= తమలోతాము; కాటులాడి= కరచుకొని (తగాదాలాడుకొని); కులమున్+ఎల్లన్= వంశాన్నంతటిని; పొలియింపన్= నశింపచేయటానికి; కుత్సితంపుబ్రదుకు= హేయమైన జీవితం జీవించవలసి; వచ్చెనె?= వచ్చిందా?; అను= అనే విధమైన; వగ= దిగులు; పాలుపడఁగన్= పొందేటట్లుండే; త్రైలోక్యరాజ్యము+ఐనన్= మూడులోకాలను (భూలోకం, స్వర్గలోకం, పాతాళలోకం) పాలించే పరిపాలనమైనా; ప్రమదము= సంతోషాన్ని; ఒసఁగదు= కలిగించదు; కానన్= కాబట్టి; ఏన్= నేను (ధర్మరాజు); మహిన్= రాజ్యాన్ని; ఒల్లన్= కోరను; మీరు+అ= మీరే; కైకొనుండు= తీసికొనండి.

తాత్పర్యం: 'సగోత్రికుల నందరినీ చంపాను, అది ఆత్మవధ కాదా? ఈ క్షత్రియధర్మాన్ని తగులబెట్టుము. అహింస, సత్యం, ఓర్పు, అనసూయ - ఇటువంటి గుణాలు వనవాసం చేసేవారి కుండదగిన వని వేదాలు చెప్పాయి. నిజంగా, ఎంత సముచితంగా ఉంది! మనం వనంలో నివసిద్దాం; గ్రహించావా? సుఖాన్నివ్వని రాజ్యమనే మాంసఖండం కొరకై కుక్కలు ఎగబడి కాట్లాడుకొన్నట్లుగా తమలో తాము యుద్ధం చేసికొని, వంశాన్నంతా నాశనం చేసికొనే హేయమైన బ్రదుకు బ్రదుకవలసి వచ్చెనే అనే దుఃఖం మిగిలించేదై ముల్లోకాల నేలే ప్రభుత్వమైనా నాకు సంతోషాన్ని కలిగించదు. కాబట్టి నేను రాజ్యాన్ని స్వీకరించను, మీరే తీసికొనండి.

మ. ధృతరాష్ట్రుండు దనూజుకీడు సమబుద్ధిం జూడ కన్నీచుఁ డే
గతిఁ జన్నం జననిచ్చెఁ గాని మగుడంగాఁ దివ్వఁ డయ్యెన్; నిరా
కృతశీలుండగు నా సుయోధనుఁడు సంక్షీణంబు సేసెం గులం;
బతనిం జంపఁగఁ గోపమాఱె; మది శోకాక్రాంత మయ్యెం దుదిన్. 46

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సమబుద్ధిన్= సమదృష్టితో; తనూజు కీడు= కుమారుడైన దుర్యోధనుడికి కాగల ఆపదను; చూడక= గమనించక; ఆ+నీచుఁడు= ఆ అధముడైన దుర్యోధనుడు; ఏగతిన్= ఏవిధంగా; చన్నన్= నడిస్తే, వ్యవహరిస్తే; చనన్+ఇచ్చెన్= నడవనిచ్చాడు, వ్యవహరించనిచ్చాడు; కాని; మగుడంగాన్+తివ్వఁడు+అయ్యెన్= మరలింపజేయటానికి యత్నించినవాడు కాడు; నిరాకృతశీలుండు+అగు= నిరాకరించబడిన శీలంగలవాడైన; ఆ+సుయోధనుఁడు= ఆ దుర్యోధనుడు; కులంబు= వంశాన్ని; సంక్షీణంబు+చేసెన్= బాగా నాశనం చేశాడు; అతనిన్= ఆ దుర్యోధనుడిని; చంపఁగన్= యుద్ధంలో చంపివేయగా; కోపము= కోపం; ఆఱెన్= చల్లారింది; తుదిన్= చివరకు; మది= హృదయం; శోక+ఆక్రాంతము+అయ్యెన్= తీవ్రమైన దుఃఖంతో నిండినదైపోయింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ధర్మాధర్మాలయందు పక్షపాతం లేని సమదృష్టితో చూడక తన కొడుకైన దుర్యోధనుడికి రాబోయే కీడును వారించలేకపోయాడు. నీచుడైన ఆ సుయోధనుడు ఎట్లా నడిస్తే అట్లా నడవనిచ్చాడే కాని మరల్చటానికి ఎన్నడూ ప్రయత్నం చేయలేదు. గర్హించదగిన శీలంగల ఆ దుర్యోధనుడు వంశాన్నంతా నాశనం చేసి పెట్టాడు. అతడిని చంపటంవలన కోపంమాత్రం చల్లారింది. కాని, చివరకు మనసు శోకంతో నిండి దుర్భరమైపోయింది.

విశేషం: పగవలన బంధుజన హింసవలన కలిగే శోకం యుద్ధసమయంలో ధర్మరాజుకు గోచరించలేదు; ఆ తరువాత జ్ఞాతులకు ఉత్తరకర్మలు చేస్తున్నప్పుడు అతడి హృదయం శోక సముద్రమై పోయింది. పగ తీరిన తరువాతి వగ ఇది.

వ. ఆ దుర్జనుండు కర్జం బెఱుంగక దుర్మానంబు వాటించిన సైరించి తొలంగనైతి; రాజ్యపరిగ్రహపరత్వంబు మచ్చిత్తంబునం గలిమించేసి కిల్బిషం బత్యంతంబు నాచరింప వలసెఁ; బరిగ్రహ దోషంబు పరిగ్రహత్యాగంబునం గాని పోదు; పరిగ్రహత్యాగశీలుండు జన్మమరణ దుఃఖంబులం బొరయం డని శ్రుతులు సెప్పెడు; నొకనికి సకలధర్మంబులు ననుష్ఠింప శక్యం బగునే? యపరిగ్రహం బొక్కటన శుద్ధుండ నయ్యెద; మీరు భూమిపాలన పరిగ్రహ తత్పరత్వంబున వర్ణాశ్రమధర్మరక్షణంబు సేయుం; డేను గాననంబునకుం జని మునిజన సకాశంబున సుఖినై యుండెద' ననిన విని యింద్రాంశసంజనితత్వకలితతేజోధనుం డగు నద్ధనంజయుండు దనయూష్మలత్వంబునకు నవ్వాక్యంబులు దుస్సహంబు లైనం బదరి దరస్మితంబునఁ దద్వికారంబుఁ గప్పి యప్పుడమిటేని కిట్లనియె: 47

ప్రతిపదార్థం: ఆ దుర్జనుండు= ఆ దుర్మార్గుడైన దుర్యోధనుడు; కర్జంబు= చేయదగిన కార్యం; కర్తవ్యం; ఎఱుంగక= తెలియజాలక; దుర్మానంబు= దురభిమానాన్ని; పాటించినన్= అనుసరించగా; సైరించి= దానిని ఓర్చి; తొలంగన్+ఐతిన్= పట్టువీడలేకపోయాను; రాజ్యపరిగ్రహపరత్వంబు= రాజ్యాన్ని గ్రహించాలన్న ఆసక్తి; మత్+చిత్తంబునన్= నా మనసులో; కలిమిన్+చేసి= కలిగి ఉండటంచేత; కిల్బిషంబు= పాపాన్ని; అత్యంతంబున్= అత్యధికంగా; ఆచరింపన్ వలసెన్= చేయవలసి వచ్చింది; పరిగ్రహదోషంబు= రాజ్యస్వీకరణదోషం; పరిగ్రహత్యాగంబునన్+కాని= స్వీకరించినదానిని వదలివేయటం వలనగాని; పోదు= తొలగిపోదు; పరిగ్రహత్యాగశీలుఁడు= స్వీకరించినదానిని త్యాగం చేయగల మనఃప్రవృత్తి (స్వభావం) కలవాడు; జన్మమరణదుఃఖంబులన్= పుట్టుకచావుల వలన కలిగే శోకాలను; పొరయండు+అని= పొందడని; శ్రుతులు= వేదాలు; చెప్పెడున్= చెపుతూ ఉంటాయి; ఒకనికిన్= ఒంటరివాడికి; సకలధర్మంబులున్= ధర్మాలనన్నింటిని; అనుష్ఠింపన్= ఆచరించటానికి; శక్యంబు+అగునే!= సాధ్యం అవుతుందా?; అపరిగ్రహంబు= స్వీకరించకుండటం-త్యాగం; ఒక్కటన్+అ= ఒక్కదానిచేతనే; శుద్ధుండన్+అయ్యెదన్= పవిత్రుడనౌతాను; మీరు= మీరు(భీమాదులు); భూమిపాలన పరిగ్రహ తత్పరత్వంబునన్= నేలను పాలించే ధర్మాన్ని స్వీకరించటంలోని ఆసక్తితో; వర్ణ+ఆశ్రమ ధర్మరక్షణంబున్= వర్ణాలను, ఆశ్రమధర్మాలను కాపాడటం; చేయుండు= నిర్వహించండి; ఏను= నేను(ధర్మరాజు); కాననంబునకున్= అడవికి; చని= వెళ్ళి; మునిజన సకాశంబునన్= ఋషుల సమూహాలసమీపంలో; సుఖిని+ఐ= సంతోషం కలవాడనై; ఉండెదన్= ఉంటాను; అనినన్= అని పలుకగా; ఇంద్ర+అంశసంజనితత్వ కలిత తేజోధనుండు+అగు= ఇంద్రుడియొక్క కళతో పుట్టిన స్వభావంతో కూడుకొన్న పరాక్రమమనే సంపద కలవాడైన; ఆ+ధనంజయుండు= ఆ అర్జునుడు; తన= తనయొక్క; ఊష్మలత్వంబునకున్= ఉబ్బరికాన్ని, పరాక్రమానికి; ఆ+వాక్యంబులు= ఆ ధర్మరాజు పలికిన మాటలు; దుస్సహంబులు+ఐనన్= సహింపజాలనివి కాగా; పదరి= కోపించి; దరస్మితంబునన్= చిరునవ్వుతో; ఆ+వికారంబున్= ఆ మనోభావాన్ని; కప్పి= కప్పిపుచ్చి; ఆ+పుడమిఱేనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'దుర్మార్గుడైన ఆ దుర్యోధనుడు కర్తవ్యాన్ని తెలిసికొనకుండా దురభిమానంతో వ్యవహరించినా సహించి, కర్తవ్యంనుండి నేను వైదొలగలేదు. రాజ్యాన్ని పొందాలనే ఆసక్తి నామనసులో బలంగా ఉండటంచేత అమితమైన పాపాన్ని ఆచరించవలసి వచ్చింది. రాజ్య స్వీకారదోషం రాజ్యపరిత్యాగంవలన గాని పోదు. త్యాగశీలుడు జననమరణ దుఃఖాలను పొందడని వేదాలు చెప్పుతున్నాయి. ఒక్కడికి ధర్మాలన్నీ చేయటం సాధ్యపడదు. నేను (రాజ్య)త్యాగం వలన పరిశుద్ధుడనౌతాను. మీరు రాజ్యపాలన స్వీకరించి ఆసక్తితో వర్ణాశ్రమ ధర్మరక్షణం చేయండి. నేను తపోవనానికి వెళ్ళి మునిజనసమూహ సన్నిధానంలో సుఖంగా ఉంటాను' - అని ధర్మరాజు అనగా ఇంద్రతేజోధనుడైన అర్జునుడు తన పరాక్రమానికి ఆ వాక్యాలు సహింపశక్యంగానివి కాగా కోపించి, చిరునవ్వుతో ఆ మనోవికారాన్ని కప్పిపుచ్చి, ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు:

అర్జునుఁడు ధర్మజున కుచిత వచనంబుల మనస్తాపోపశమంబు సేయుట: (సం. 12-8-1)

క. ' ఓహో! యిట్టివి గలవే? । బాహాదర్పమునఁ బరులఁ బరిమార్చి తుదిన్
మాహాత్మ్యం బెడలఁగ భి । క్షాహారత నొందఁ దలఁప నగునె నరేంద్రా! 48

ప్రతిపదార్థం: ఓహో!= ఆహా! (ఆశ్చర్యార్థకం); ఇట్టివి కలవే?= ఇటువంటివి (మాటలు) ఎక్కడైనా ఉన్నాయా? (ఇటువంటి మాటలు నేనెన్నడూ వినలేదనీ, వినదగినవి కావనీ భావం; సహజవిరుద్ధమని భావం); బాహాదర్పమునన్= భుజబలగర్వంచేత; పరులన్= శత్రువులను; పరిమార్చి= చంపి; నర+ఇంద్రా!= రాజువైన ధర్మరాజా!; తుదిన్= చివరకు; మాహాత్మ్యంబు= ఆ గొప్పతనమంతా; ఎడలఁగన్= తొలగిపోయేటట్లుగా; భిక్షా+ఆహారతన్= తిరిపెమెత్తి భుజించటాన్ని; ఒందన్= పొందటానికి; తలఁపన్= కోరటం; అగునె?= న్యాయమా? (కాదని భావం).

తాత్పర్యం: 'ఓహో నా కాశ్చర్యం వేస్తున్నది. ఇటువంటి మాటలు ఎక్కడైనా ఉంటాయా? భుజబలంతో శత్రువులను యుద్ధంలో చంపి, చివరకు ఆ గొప్పతనమంతా కుప్పకూలేటట్లు బిచ్చమెత్తుకొనటాన్ని కోరటం నీకు తగునా ధర్మరాజా!

సీ. ధర్మపథంబున ధరణి సేకుఱినఁ బా । లింపక సత్త్వంబు పెంపు మాలి
విడుచుట యొప్పునే; వినుఁ మిట్టులైన ము । న్నేల భూపాలుర నెల్లఁ జంపి?
తడలి రాజ్యము దక్కి యడవికిఁ జనిన బే । లందురు గాక, మే లండ్రె జనులు?
కిల్బిషశంక గల్గిన నశ్వమేధాది । పుణ్యకర్మంబులఁ బోదె? వంశ

ఆ. ధర్మ మెడలఁ గృపణకర్మంబుఁ గోరి; త । ర్థంబు సువ్వె సకలధర్మకారి;
'యొడమి లేనివాఁడ నడపీనుఁ' గను నహు । షోక్తి వినమె? దాని నూఁద వలదె? 49

ప్రతిపదార్థం: ధర్మపథంబునన్= న్యాయమార్గంలో; ధరణి= రాజ్యం; చేకుఱినన్= సమకూరగా; పాలింపక= ఏలకుండా; సత్త్వంబుపెంపు= బలగౌరవాన్ని; మాలి= వదలి; విడుచుట= రాజ్యపాలనాన్ని వదలిపెట్టటం; ఒప్పునే?= న్యాయమౌనా? (కాదని భావం); వినుము= నేను చెప్పే మాటలు శ్రద్ధగా విని గ్రహించుము; ఇట్టులు+ఐనన్= ఈ విధంగా రాజ్యాన్ని త్యాగం చేసేటట్లయితే; మున్ను= పూర్వం; భూపాలురన్+ఎల్లన్= రాజుల నందరినీ; ఏల= ఎందుకు; చంపితి?= చంపావు?; అడలి= భయపడి; రాజ్యము తక్కి= రాజ్యాన్ని కాదని; అడవికిన్= (తపో) వనానికి; చనినన్= వెళ్ళినట్లయితే; జనులు= ప్రజలు; బేల= పిరికిపంద అని; అందురు= అంటారు; కాక= అట్లు కాక; మేలు= శుభం, యోగ్యం; అండ్రె?= అని అంటారా? (అనరని భావం); కిల్బిషశంక= పాపం కలుగుతుందనే అనుమానం; కల్గినన్= కలిగినట్లయితే; (అది); అశ్వమేధ+అది= అశ్వమేధయాగం మొదలైన; పుణ్యకర్మంబులన్= పుణ్యకార్యాలతో; పోదె?= తొలగిపోదా?; వంశధర్మము= వంశపరంపరగా వస్తున్న రాజ్యపాలనమనే ధర్మం; ఎడలన్= దూరమయ్యేటట్లు; కృపణకర్మంబు= దీనులు ఆచరించే ధర్మాన్ని; కోరితి(వి)= కోరావు; సకలధర్మకారి= సర్వ ధర్మాలను నెరవేర్చేది; అర్థంబు+చువ్వె!= సంపదయే (ధనమే) సుమా!; ఒడమి లేనివాఁడు+అ= ధనం లేనివాడు మాత్రమే; నడపీనుఁగు= నడుస్తున్న పీనుఁగు వంటివాడు (బ్రదికి ఉండికూడా చచ్చినవాడితో సమానమైనవాడు; ఏమీ సాధించలేని నిరర్థకు డని భావం); అను= అని ప్రసిద్ధికెక్కిన; నహుష+ఉక్తి= నహుషుడి సూక్తి (సుభాషితం); వినమె?= వినమా? (ప్రసిద్ధమని భావం); దానిని= ఆ మాటను; ఊఁదవలదె?= ఊతగా తీసికొనవలదా? (గణించవద్దా? అని భావం).

తాత్పర్యం: ధర్మమార్గంలో రాజ్యం వశమైతే దానిని పాలించకుండా, పరాక్రమాతిశయాన్ని ప్రదర్శించకుండా వదలివేయటం న్యాయం కాదు. నీ కిటువంటి సంకల్పమే ఉంటే ముందుగా రాజులనందరినీ ఎందుకు చంపావు? భయపడి రాజ్యం వదలి అడవులకు పోతే, నిన్ను బేలవని అందరూ గేలిచేస్తారు. జనులెవ్వరూ నీ పనిని మెచ్చుకోరు. పాపం కలిగిందన్న అనుమానం ఏర్పడితే అశ్వమేధయాగంవంటి పుణ్యకార్యాలు చేస్తే అది తొలగిపోదా? మన వంశధర్మం వీగి పోయేటట్లు ఈ దీనమైన చర్యను నీ వెన్నుకొన్నావు. సకలధర్మాలను నెరవేర్చగలిగింది సంపదయే కదా! ధనంలేనివాడు నడపీనుగువంటివాడనే నహుషవాక్యం లోక ప్రసిద్ధం. దానిని గణించవలదా?

విశేషం: ప్రయత్న పూర్వకంగా సాధించుకొన్న రాజ్యాన్ని అనుభవించాలి - అనే తనప్రతిపాదనకు చంద్రవంశజులలో ప్రసిద్ధుడై, ఇంద్రపదవి నధిష్ఠించిన నహుషుడి సూక్తిని ప్రమాణంగా చూపాడు అర్జునుడు. అర్జునుడి వాక్యాలు తర్కబద్ధంగా సాగుతున్నాయి.

క. సరిగా నెన్నుదు రార్యులు । దరిద్రునిం బతితునిం గృతఘ్నుని జడునిన్
దొరకొను ధర్ముఁ గామముఁ । బరమగతియు నర్థమునన పౌరవముఖ్యా! 50

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశజులలో గొప్పవాడవైన ఓ ధర్మరాజా!; ఆర్యులు= ఉత్తములు; దరిద్రునిన్= ధనంలేనివాడిని; పతితునిన్= భ్రష్టుడైనవాడిని; కృతఘ్ననిన్= మేలు చేసినవారి మేలు మరచుటయే కాక వారికి అపకారం చేసేవాడిని; జడునిన్= మూర్ఖుడిని; సరిగాన్= సమానంగా; ఎన్నుదురు= లెక్కిస్తారు; అర్థమునన= ధనంచేతనే; ధర్మమున్, కామమున్, పరమగతియున్= ధర్మకామమోక్షాలు; దొరకొనున్= కలుగుతాయి.

తాత్పర్యం: బీదవాడినీ, పతితుడినీ, కృతజ్ఞత లేనివాడినీ, మూర్ఖుడినీ సమంగా భావిస్తారు ఉత్తములు. కాబట్టి ఓ ధర్మరాజా! ధన ముంటేనే పురుషార్థాలు ఫలిస్తాయి.

క. కలిమియ చుట్టలఁ జేర్చుం; । గలిమియ చెలులను ఘటించుఁ గలిమియ శౌర్యో
జ్జ్వలుఁ డనిపించుం; గలిమియ । పలువురు సద్బుద్ధి యనఁగఁ బరఁగం జేయున్. 51

ప్రతిపదార్థం: కలిమి+అ= సంపదయే; చుట్టలన్= బంధువులను (చుట్టాలకు రూపాంతరం); చేర్చున్= కూరుస్తుంది; కలిమి+అ= సంపదయే; చెలులను= మిత్రులను; ఘటించున్= సమకూరుస్తుంది; కలిమి+అ= సంపదయే; శౌర్య+ఉజ్జ్వలుఁడు+అనిపించున్= ప్రతాపంచేత వెలుగొందేవాడని భావింప జేస్తుంది; కలిమి+అ= సంపదయే; సద్బుద్ధి+అనఁగన్+పరఁగన్+చేయున్= మంచిబుద్ధిగలవాడని వలె ఒప్పేటట్లు చేస్తుంది.

తాత్పర్యం: సంపదయే చుట్టాలను రప్పిస్తుంది; సంపదయే మిత్రులను సమకూరుస్తుంది; సంపదయే ప్రతాపాన్ని ప్రకాశించేటట్లు చేస్తుంది; సంపదయే సద్బుద్ధి అని ఒప్పేటట్లు చేస్తుంది.

విశేషం: ఇందులో 'కలిమియ' అనే పదం నాలుగుసార్లు ప్రయోగించటం దాని ప్రాధాన్యం నొక్కి చెప్పటానికే; వినేవాడి మనసుపై గాఢమైన ప్రభావం వేయటానికే. అర్జునుడి అనునయవాక్యశిల్పం తిక్కన కవితలో తళుక్కుమంటున్నది.

క. ఏవాని బంధుమిత్రులు । జీవధనంబులును డప్పిఁ జెందును గృశునిం
గా వాని నెన్నఁగాఁ దగుఁ, । గేవల తనుకార్శ్యయుతుఁడు గృశుఁడె నరేంద్రా! 52

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా! ధర్మరాజా!; ఏవాని= ఎవడియొక్క; బంధుమిత్రులు= చుట్టాలు, స్నేహితులు; జీవధనంబులును= ప్రాణాలు, సంపదలు (ప్రాణాలతో ఉన్న సంపదలు - అంటే ఆశ్రితులు అని కూడా గ్రహించవచ్చును); డప్పిన్+చెందును= దాహంతో పరితపిస్తారో(దప్పిక కొనుట - అనేది తెలుగు నుడికారం. కనీససౌకర్యాల కొరకు అర్రులు సాచటాన్ని ఇక్కడ డప్పిగొనటంగా గ్రహించాలి); వానిన్= అటువంటి వాడిని; కృశునిన్+కాన్= చిక్కినవాడిగా, క్షీణించినవాడిగా, బలహీనుడిగా; ఎన్నఁగాన్+తగున్= లెక్కించతగుతుంది; కేవల తను కార్శ్యయుతుఁడు= ఒడలు మాత్రమే సన్నబడినవాడు; కృశుఁడె?= చిక్కినవాడా?; కృశించినవాడా?; బలహీనుడా? (కాడని భావం).

తాత్పర్యం: ఓ రాజా! ఎవడి బంధుమిత్రులు ఆశ్రితులు ప్రాణాలు సంపదలు దప్పికతో కృశించి కొట్టుమిట్టాడుతుంటారో అతడు నిజంగా బలహీను డనబడతాడు కాని ఒడలు చిక్కి సన్నబడినవాడు కాడు.

వ. కావున నర్థోపార్జనంబును బంధుమిత్రపరితోషంబును భూపతులకుం బరమ పురుషార్థం; బదియునుం
గాక. 53

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అర్థ+ఉపార్జనంబును= ధనం సంపాదించటమున్నూ; బంధుమిత్రపరితోషంబును= చుట్టాల, మిత్రుల సంతోషమున్నూ; భూపతులకున్= రాజులకు; పరమ పురుషార్థంబు= ముఖ్యంగా సాధింప దగింది (అదే వారికి మోక్షమనే అర్థం చమత్కారం); అదియునున్+కాక= అంతేకాకుండా (ఇది మరొక అంశానికి ఉపక్రమణిక).

తాత్పర్యం: కాబట్టి ధనసంపాదన, బంధుమిత్రులను సంతోషపెట్టటం రాజులకు ప్రధానకర్తవ్యం (మోక్షప్రదం). అంతేకాక (తరువాతి పద్యంతో అన్వయం).

తే. జ్ఞాతి నాశనమునఁ గాదె సకల దేవ । తలు ప్రవర్ధన మొందుట; ధనము లడిచి
పాడిచి యొప్పనివారిచేఁ బుచ్చికొనక । యడఁగియుండంగఁ జేరునే యండ్రు బుధులు. 54

ప్రతిపదార్థం: జ్ఞాతి నాశనమునన్+కాదె= సగోత్రికులు చనిపోవటం వలననే కాదా!; సకల దేవతలు ప్రవర్ధన మొందుట= సమస్త దేవతలు వృద్ధి పొందటం; ధనములు= సంపదలు; అడిచి= కొట్టి; పాడిచి= పోట్లాడి; ఒప్పనివారిచేన్= శత్రువులచేత; పుచ్చికొనక= గ్రహించక; అడఁగి+ఉండంగన్= అణకువతో ఉంటే; చేరునే= సంపదలు వస్తాయా?; అని; బుధులు= పండితులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: సగోత్రికులు చావటంవలన కదా దేవతలు సైతం అభివృద్ధి చెందారు. సంపదలను కొల్లగొట్టి, పోరు చేసి శత్రువులనుండి గ్రహించక అణగిమణగి ఉంటే సంపదలు సమకూరుతాయా? - అని పండితులు అంటారు.

వ. వేదంబులు నిట్లు సెప్పుఁ బృథివి బలువునం గైకొని పార్థివు లర్థంబు లుపార్జించి పర్జన్యాదులగు నాదిత్యుల నధ్వరక్రియాజాతంబునం బ్రీతులంజేసి యుత్తమలోకంబులు వడయుదు; రిట్టితెరువు వట్టి దిలీప నృగ నహుషాంబరీష మాంధాతలు నడచుట వినమె? తత్పదవి నీ కొదవి యున్నయది; తదీయ ప్రకారంబున బహుళదక్షిణవిధానంబుగాఁ బ్రభూతంబైన యజ్ఞంబు సేయవైతేనిఁ జూవె నకిల్బిషుండ వగుట; యశ్వమేధంబు సేసిన రాజు లెల్ల నవభృథంబునం బరిపూతాత్ము లగుదు' రని పలికిన న య్యజాతశత్రుండు. 55

ప్రతిపదార్థం: వేదంబులును= వేదాలుకూడా; ఇట్లు+చెప్పున్= ఈ విధంగా చెప్పుతాయి; పార్థివులు= క్షత్రియులు, రాజులు; పృథివిన్= రాజ్యాన్ని; బలువునన్= బలంతో; కైకొని= ఆక్రమించి, గ్రహించి; అర్థంబులు= సంపదలు, ధనాలు; ఉపార్జించి= సంపాదించి; పర్జన్య+ఆదులు+అగు= పర్జన్యుడు మొదలైన; ఆదిత్యులన్= వేల్పులను; అధ్వరక్రియాజాతంబునన్= యజ్ఞక్రియల సముదాయంచేత; ప్రీతులన్+చేసి= సంతుష్టులను చేసి; ఉత్తమలోకంబులు+పడయుదురు= పుణ్యలోకాలను పొందుతారు; ఈ+తెరువు+పట్టి= ఈ త్రోవననుసరించి; దిలీప, నృగ, నహుష, అంబరీష, మాంధాతలు అనే మహారాజులు; నడచుట= ప్రవర్తించటం; వినమె?= వినమా? ప్రసిద్ధి కాదా?; తద్+పదవి= అటువంటి అధికారం; నీకున్+ఒదవి+ఉన్న అది= నీకు కలిగి ఉన్నది; తదీయ ప్రకారంబునన్= అదే విధంగా; బహుళదక్షిణ విధానంబుగాన్= అనేకవిధాలైన దక్షిణ లిచ్చే పద్ధతిలో; ప్రభూత= శ్రేష్ఠమైన; దైవయజ్ఞంబు= దేవసంబంధమైన యజ్ఞాన్ని; చేయవైతివి+ఏనిన్+చూవె!= చేయకపోతే సుమా!; అకిల్బిషుండవు+అగుటన్= పాపం లేనివాడ వగుటచేత; అశ్వమేధంబు+చేసినరాజులు+ఎల్లన్= అశ్వమేధయాగం చేసిన రాజులందరూ; అవభృథంబునన్= యజ్ఞం ముగిసిన తరుణంలో చేసే పవిత్రమంత్ర జలస్నానంవలన; పరిపూతులు+అగుదురు= పవిత్రు లౌతారు; అని పలికినన్= ఈ విధంగా అర్జునుడు పలుకగా; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: వేదాలు కూడా ఇట్లా చెప్పుతున్నాయి. క్షత్రియులు బల పరాక్రమాలతో రాజ్యాలను గెలుచుకొని, సంపదలు సంపాదించి, పర్జన్యుడు మొదలైన దేవతలను యజ్ఞకార్య సముదాయంతో సంతోషపెట్టి స్వర్గాదిలోకాలను పొందుతారు. అదే పద్ధతి నాశ్రయించి దిలీపుడు, నృగుడు, సగరుడు, నహుషుడు, అంబరీషుడు, మాంధాత మొదలైన రాజులు నడచుకొనటం వినలేదా? అటువంటి ఉత్తమగతి నీకు అనువై ఉన్నది. వారు నడచిన మార్గంలోనే నీవు కూడా నడచి అనేక దక్షిణలతో కూడిన బహుళ యజ్ఞాలు చేయకపోతే పుణ్యాత్ముడవు కావు. అశ్వమేధయాగం చేసిన రాజు లందరూ అవభృథస్నానంతో పవిత్రు లౌతా' రని పలుకగా విని, ధర్మరాజు (తరువాతి పద్యంతో అన్వయం).

క. వెడవెడ నప్పలుకులు చెవి । నిడి, కొండొకసేపు చింత యెసకంబున పా
ల్పడి యూరకుండి చిత్తం । బడలునఁ జిక్కువడ నిట్టు లను నర్జునుతోన్. 56

ప్రతిపదార్థం: ఆ+పలుకులు= ఆ విధంగా అర్జునుడు పలికిన మాటలను; వెడవెడన్= మందంగా (అంత ఆసక్తి లేకుండా); చెవిన్+ఇడి= విని; కొండొకసేపు= కొంతసేపు; చింత= దిగులు యొక్క; లేదా ఆలోచనయొక్క ఎసకంబున పాల్పడి = అతిశయానికిలొంగి; ఊరక+ఉండి= మాటలాడక కూర్చుండి; చిత్తంబు= మనస్సు; అడలునన్= దుఃఖంతో; చిక్కు+పడన్= కలతపడగా; అర్జునుతోన్= అర్జునుడితో; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు మాట్లాడిన మాటలను యుధిష్ఠిరుడు అనాసక్తంగానే విన్నాడు. కొంతసేపు దిగులులో, ఆలోచనాతిశయంలో మునిగిపోయాడు. మనస్సు దుఃఖంతో కలతచెందగా అర్జునుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: తిక్కన మానసికావస్థలను అభినయసుందరంగా వ్యక్తీకరించటానికి ఈ పద్యం ఉదాహరణం. 'చెవి నిడి' - అనే ప్రయోగంతో ధర్మజుడు చెవు లొప్పగించి విన్నా మనసార వినలేదని సూచన; మరికొంతసేపు ఆలోచనలో మునిగిపోవటం అతడిలో మార్పు రాలేదనటానికి చిహ్నం.

క. ' నేమపుఁ దెరు వొక్కటి గల; । దే మెచ్చితి దాని; నడుగు మెయ్యది యని సు
త్రామసుత! యడుగకున్నను । నేమి? వినుము చెప్పెదను మునీంద్రుల కెక్కన్. 57

ప్రతిపదార్థం: సుత్రామసుత!= ఇంద్రుడి పుత్రుడవైన అర్జునా!; నేమము+తెరువు= నియమమార్గం; ఒక్కటి= ఒకటి; కలదు= ఉన్నది; దానిన్= ఆ మార్గాన్ని; ఏన్= నేను; మెచ్చితిన్= అభిమానించాను; ఏ+అది+అని= అది యేమిటని; అడుగక+ఉన్నను= ప్రశ్నించకపోయినా; ఏమి?= ఏమైనది?; ముని+ఇంద్రులకున్+ఎక్కన్= ఋషి శ్రేష్ఠులకు నచ్చేటట్లుగా; చెప్పెదను వినుము= చెప్పుతాను వినుము.

తాత్పర్యం: అర్జునా! నాకొక నియమమార్గం నచ్చింది. అది ఏమిటని నీవు అడుగక పోయినా మునీంద్రులు మెచ్చేటట్లు చెప్పుతాను వినుము.

విశేషం: ధర్మజుడి మనసులోని అనిష్టం మాటవెటకారంలో ధ్వనిస్తున్నది.

సీ. ' సారహీనము లగు సంసారసుఖములు । విడిచి, యేకాకి నై యడవి కేఁగి,
తాపస వాక్యామృతములు వీనులఁ గ్రోలి, । చెలిమి వేర్పాటను చిరమరలకుఁ
జొరక, నిందాస్తుతుల్ సరిగాఁ గొనుచుఁ గత్తి । నొకఁడు వ్రేసినను వేఱొక్కరుండు
చందనం బలఁదిన డెంద మయ్యిరువుర । యెడ సమంబుగ మూఁగజడుఁ డనంగ

తే. మెలఁగి, తగువేళఁ బర్ణశాలలకు నరిగి । యెత్తఁగా భిక్ష యెవ్వార లెట్టు లేమి
యిడినఁ గైకొని నాలుగే నెడల మాత్ర । గన్నదానఁ ధృప్తుండనై యున్న మేలు. 58

ప్రతిపదార్థం: సారహీనములు+అగు= నీరసములైన; సంసారసుఖములు= సంసారానికి సంబంధించిన అనేక సుఖాలు; విడిచి= వదలిపెట్టి; ఏకాకిని+ఐ= ఒంటరిగా; అడవికిన్+ఏఁగి= అరణ్యానికి పోయి; తాపసవాక్య+అమృతములు= మునులయొక్క అమృతంవంటి వాక్యాలను; వీనులన్= చెవులతో; క్రోలి= త్రావి; చెలిమి వేర్పాటను= స్నేహం,విరోధం,అనురెంటిలో; చిరమరలకున్= భేదభావాలకు; చొరక= ప్రవేశించక; నిందాస్తుతుల్= నిందలను, ప్రశంసలను; సరిగాన్+కొనుచున్= సమచిత్తంతో గ్రహిస్తూ; ఒకఁడు+కత్తిన్+వ్రేసినను= ఒకడు కత్తితో నరికినా (హింసించినా); వేఱు+ఒక్కరుండు= మరొకడు; చందనంబు+అలఁదినన్=

మంచి గంధం పూసినా (సేవించినా); ఆ+ఇరువుర ఎడన్= ఆ ఇద్దరిపట్ల; డెందము= హృదయం; సమంబుగన్= సమభావంతో మెలగేటట్లు; మూఁగజడుఁడు+అనంగన్= మాటలు రాని మూర్ఖుడో మొద్దో అన్నట్లు; తగువేళన్= తగినసమయంలో; పర్ణశాలలకున్+అరిగి= ఆశ్రమవాసులు నివసించే పూరిళ్ళకు వెళ్ళి; భిక్ష+ఎత్తఁగాన్= భిక్ష అడుగగా; ఏ+వారలు= ఎటువంటివారైనా; ఎట్టులు= ఏ విధంగానైనా; ఏమి+ఇడినన్= ఏది భిక్షగా ఇచ్చినా; కైకొని= స్వీకరించి; నాలుగు+ఏను+ఎడల మాత్రన్+కన్నదానన్= నాలుగు అయిదుచోట్ల (ఇండ్లలో) కలిగిన (లభించిన) దానితో; తృప్తుండను+ఐ= తృప్తి పొందినవాడనై; ఉన్నన్+మేలు= ఉండటం మంచిది.

తాత్పర్యం: నీరసాలైన సంసారసుఖాలను వదలి ఒంటరివాడనై అడవికిపోయి, మునుల బోధామృతాలను చెవులారా వింటూ, స్నేహవైరాలపట్ల కలత చెందకుండా, నిందలను, ప్రశంసలను సమచిత్తంతో గ్రహిస్తూ, ఒకడు కత్తితో గాయం చేసినా, మరొకడు మంచిగంధంతో పూతలు పూసినా వారిరువురిపట్లా సమంగా స్పందిస్తూ, మూగవాడైన మూర్ఖుడివలె మెలగుతూ, తగిన వేళలలో ఆశ్రమాలలో భిక్షనడిగికొని, ఎవరేదిపెడితే దానిని తీసికొని, నాల్గుదిక్కులలో కలిగిన దానితో తృప్తిపడుతూ ఉండటం మేలు.

విశేషం: అలం: ఉపమ. ద్వంద్వాతీతమైన చిత్తంతో, అసంగుడై స్థితప్రజ్ఞుడివలె మునివృత్తితో జీవించటం ఉత్తమధర్మమని యుధిష్ఠిరుడు వివరించి చెప్పాడు.

క. అటుగాక కర్మగతి లం । పటుఁడ నగుదు నేని నల్పఫల భాగితమై
నట యిట దిరుగుచు మోక్ష ని । కట వృత్తికి బాహిరుండఁ గానె కుమారా! 59

ప్రతిపదార్థం: అటు+కాక= అట్లా కాకుండా; కర్మగతిన్= కర్మలను ఆచరించే పద్ధతిలో; కుమారా!= వత్సా! , అర్జునా!; లంపటుఁడన్= అత్యాసక్తి కలవాడను; అగుదున్+ఏనిన్= అయినట్లయితే; అల్పఫలభాగితము+ఐ= స్వల్పమైన ఫలమిచ్చేది కావటంచేత; అట+ఇట+తిరుగుచున్= పెక్కురకాలుగా నిలకడలేక తిరుగుతూ; మోక్షనికట వృత్తికిన్= మోక్షానికి సమీపంలో ఉన్న చిత్తవృత్తికి; బాహిరుఁడన్= దూరమయినవాడిని; కానె?= కానా? (ఔతానని భావం).

తాత్పర్యం: అట్లా కాకుండా కర్మమార్గంలో కూరుకొనిపోతే ఓ అర్జునా! అది స్వల్పఫలా న్నిచ్చేదే కాబట్టి నేను పరిపరివిధాల తిరుగుతూ మోక్షప్రవృత్తికి దూరమైపోయేవాడిని కానా?

వ. కావున నాకు దొరకొన్న విమలప్రజ్ఞామృతం బనుభవింపక తక్కుదునే? యిది శాశ్వతపదప్రదం' బనిన విని యనిలతనయుం డతని కిట్లనియె. 60

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నాకున్= నాకు(ధర్మరాజుకు); దొరకొన్న= కలిగిన; సిద్ధించిన; విమలప్రజ్ఞా+అమృతంబు= అమృతంవంటి నిర్మలజ్ఞానాన్ని; అనుభవింపన్= అనుభవించకుండా; తక్కుదునే?= విడువగలనా?; ఇది= ఈ జ్ఞానం; శాశ్వతపదప్రదంబు= మోక్షా న్నిచ్చేది; అనినన్+విని= అనగా విని; అనిలతనయుండు= వాయుపుత్రుడైన భీముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: కాబట్టి నాకు సిద్ధించిన అమృతంవంటి నిర్మలజ్ఞానాన్ని అనుభవించకుండా ఉండగలనా? ఈ జ్ఞానం మోక్షా న్నిచ్చేది' - అని ధర్మరాజు పలుకగా భీము డా మాటలు విని ఇట్లా అన్నాడు.

క. ' శ్రుతివిహిత కర్మజాత । స్థితి యోగ్యుఁడ వైన నీకుఁ జేయఁగ వశమే
యతిలోకజ్ఞానసమ । న్వితయతిజనకృత్య? మటు వివేకింపు మెదన్. 61

ప్రతిపదార్థం: శ్రుతివిహిత= వేద సమ్మతమైన; కర్మజాతస్థితియోగ్యుఁడవు= కర్మల సమూహముయొక్క ఉనికికి తగినవాడవు; ఐన నీకున్= అయిన నీకు; అతిలోకజ్ఞానసమన్విత= ఆధ్యాత్మజ్ఞానంతో కూడుకొన్న; యతిజనకృత్యము= మునిజనుల ఆచారం; నీకున్= నీకు; చేయఁగన్+వశమే?= ఆచరించటం సాధ్యమౌతుందా?; అటు= ఆ విధంగా; ఎదన్= చిత్తమునందు; వివేకింపుము= ఆలోచించుము.

తాత్పర్యం: వేదాలలో చెప్పిన కర్మలను ఆచరించే స్థితికి యోగ్యుడవైన నీకు లోకాతీతజ్ఞాన సమన్వితమైన మునుల ఆచారాన్ని అవలంబించడం సాధ్యమౌతుందా? నీవే నీ మనస్సులో ఆలోచించుకొనుము!

చ. అడలున రాజధర్మములయందు జనించె నసూయ నీకు ని
ప్పుడు; మును నిస్పృహుండ వయి పోవఁగఁ గన్నఁ గులంబువారు ని
ప్పుడమి నృపాలురున్ బ్రతికిపోదురు నెమ్మది; నట్టులైన నే
ముడుగుదు మస్త్రజీవన సముద్ధతిఁ, జొత్తుము భైక్షవృత్తికిన్. 62

ప్రతిపదార్థం: అడలునన్= దుఃఖంచేత; నీకున్= నీకు (ధర్మరాజుకు); ఇప్పుడు= ఈ తరుణంలో; రాజధర్మముల+అందున్= రాజులు(క్షత్రియులు) నిర్వహించే ధర్మాలపట్ల; అసూయ= ఈర్ష్య; జనించెన్= పుట్టింది; మును= పూర్వం; నిస్పృహుఁడవు+అయి= అనాసక్తుడవై; పోవఁగన్+కన్నన్= పోయిఉన్నట్లయితే; కులంబువారు= క్షత్రియులు, వంశజులు; ఈ పుడమి నృపాలురున్= ఈ భూమిపై గల రాజులు; నెమ్మదిన్= ప్రీతితో; బ్రతికిపోదురు= ప్రాణాలతో బ్రతికిపోయి ఉండేవారు; అట్టులు+ఐనన్= అదే విధంగా జరిగి ఉన్నట్లయితే; ఏము= మేము (భీమాదులని భావం); అస్త్రజీవన సముద్ధతిన్= ఆయుధాలనుపట్టి జీవించే గర్వోన్నతిని; ఉడుగుదుము= వదలిఉండే వాళ్ళం; భైక్షవృత్తికిన్= బిచ్చమెత్తి బ్రతికే వృత్తిలో; చొత్తుము= ప్రవేశించేవారం.

తాత్పర్యం: 'నీ కిప్పుడు కలిగిన దుఃఖంచేత రాజధర్మాలమీద అసూయ కలిగింది కాని, ముందుకాలంలో నిజంగా నీవు అనాసక్తుడవై ఉన్నట్లయితే మనవంశజులు, భూమిని పాలించే రాజులూ ప్రాణాలతో బ్రతికిపోయి ఉండేవారు. మే మీ అస్త్రజీవన గర్వోన్నతిని వదలి ఉండేవాళ్ళం; బిచ్చమెత్తుకొని బ్రతికే పద్ధతిలో ప్రవేశించి ఉండేవాళ్ళం.

క. వాఁడి యగు నలుక లోకము । పోఁడిమి సెడఁ గయ్య మట్లు పాడిచి వనటమై
నేఁ డింక నడవికిం జను । వాఁడం గా కనినఁ బుడమివారలు నగరే! 63

ప్రతిపదార్థం: వాఁడి+అగు+అలుకన్= తీక్ష్ణమైన కోపంతో; లోకము పోడిమి+చెడన్= లౌకిక సుఖాలు, సంపదలు చెడేటట్లుగా; కయ్యము= యుద్ధమును; అట్లు= అంత భీకరంగా; పాడిచి= పోట్లాడి, యుద్ధంచేసి; నేఁడు= ఈనాడు; వనటమైన్= దుఃఖంచేత; ఇంకన్= ఇకమీదట; అడవికిన్= అరణ్యానికి; చనువాఁడన్+కాక+అనినన్= వెళ్తాను సుమా అని అంటే; పుడమివారలు= లోకులు; నగరే?= నవ్విపోరా? ఎగతాళిచేయరా?

తాత్పర్యం: ఆనాడు అంత తీవ్రమైన కోపంతో లౌకిక సుఖాలు చెడిపోయేటట్లు అంత భీకరంగా యుద్ధం చేసి, నేడు అడవికి పోతున్నానని అంటే లోకులు అవహేళన చేయరా?

సీ. పనివడి త్రవ్వి కూపమునందు నుదకంబు । పానంబు సేయని వాని భంగి,
యున్నతతరు వెక్కి జున్ను సేకుఱఁ గొని । తేనియ యానని వాని భంగి,
యాఁకొని యొడఁగూర్చి యన్నంబు తళియకు । వచ్చినఁ గుడువనివాని భంగి,
తమకించి యొకభంగిఁ దనవశంబుగఁ జేసి । మానినిఁ గవయని వాని భంగి,

ఆ. గాదె కురువరేణ్య! ఘనశక్తి శౌర్య సం । పన్నులైన పగఱ భండనమున
నోర్చి పూజ్యరాజ్య మొల్లక యడవికి । నేఁగు; టీవ యెఱుఁగు దిత్తెఱంగు. 64

ప్రతిపదార్థం: పనివడి= అక్కరపడి; త్రవ్వి= లోతుగా త్రవ్వి; కూపమునందున్= బావిలోని; ఉదకంబు= నీరు; పానము+చేయనివాని భంగి= త్రాగనివాడి విధమూ; ఉన్నతతరువు+ఎక్కి= ఎత్తైన చెట్టును ఎక్కి; జున్ను+చేకుఱున్+గొని= తేనెతెట్టెను సాధించి; తేనియ+ఆననివాని భంగి= తేనెను రుచిచూడని వాడి విధమూ; ఆఁకలి+కొని= ఆకలి వేసి; ఒడఁగూర్చి= సమకూర్చుకొని; అన్నంబు= ఆహారం; తళియకున్= కంచంలోనికి; వచ్చినన్= రాగా; కుడువని వాని భంగి= తిననివాడి విధమూ; తమకించి= త్వరపడి; ఒక భంగిన్= ఒక ఉపాయంతో; తన వశంబుగన్+చేసి= తనకు లొంగేటట్లు సిద్ధంచేసి; మానినిన్= స్త్రీని; కవయనివాని భంగి= కూడనివాడి విధమూ; కాదె?= కాదా? (అగును అని భావం); ఘనశక్తి శౌర్యసంపన్నులు+అయిన= అపారమైన బలపరాక్రమ సంపద గలవారైన; పగఱన్= శత్రువులను; భండనమునన్= యుద్ధంలో; ఓర్చి= జయించి; పూజ్య= గౌరవించదగిన; రాజ్యము= ప్రభుత్వమును; ఒల్లక= అంగీకరించక; అడవికిన్+ఏఁగుట= అడవికి పోవటం; కురువరేణ్య!= కురువంశజులలో శ్రేష్ఠుడవైన ధర్మరాజా!; ఈవ= నీవే; ఈ+తెఱుంగు= ఈ విధాన్ని; ఎఱుఁగుదు(వు)= తెలిసినవాడవు.

తాత్పర్యం: అక్కరపడి బావి త్రవ్వి అందులోని నీటిని త్రాగనివాడి విధంగా, ఎత్తైన చెట్టు నెక్కి తేనెతెట్టెను పట్టి తేనెను రుచిచూడని వాడి విధంగా, ఆకలివేయగా సమకూర్చుకొన్న అన్నం కంచంలో ఉంచుకొని తిననివాడి విధంగా, త్వరపడి ఒక ఉపాయంతో వనితను తనకు వశంచేసికొని కూడా ఆమెను కూడని వాడి విధంగా, అపార బలసంపన్నులైన శత్రువులను యుద్ధంలో జయించి, సాధించిన పూజ్యమైన సామ్రాజ్యాన్ని గ్రహించకుండా అడవికి పోవటం కూడా అటువంటిదే కదా! కురుశ్రేష్ఠుడవైన ధర్మరాజా! ఈ సంగతి నీకు కూడా తెలుసు.

విశేషం: అలం: ఉపమ. మాలోపమతో ప్రతిపాద్యాంశాన్ని సమర్థించే ఈ వాక్య విన్యాసం. భీముడి స్వభావాన్నీ, అన్నగారి మనసును మార్చటానికి చేస్తున్న తీవ్రయత్నాన్నీ ధ్వనింపజేస్తున్నది.

క. నీ వడవి కరుగ నొడఁబడి । నీ వెనుకన వచ్చునపుడు నిందింతురు మ
'మ్మీ వెఱ్ఱి లితని మాన్పం । గా వలఁతులు గార' యని జగజ్జను లధిపా! 65

ప్రతిపదార్థం: నీవు= నీవు (ధర్మజుడు); అడవికిన్= అరణ్యానికి; అరుగన్= వెళ్ళటానికి; ఒడఁబడి= అంగీకరించి; నీ వెనుకన్+అ= నీ వెంటనే; వచ్చునపుడు= వచ్చే సందర్భంలో; అధిపా!= ఓ రాజా!; జగత్+జనులు= లోకులు; ఈ వెఱ్ఱులు = ఈ వెర్రివారు (భీమాదులు); అతనిన్= ధర్మరాజును; మాన్పంగాన్= అడవులకు పోకుండా మానేటట్లు చేయటానికి; వలఁతులు+కారు+అ= సమర్థులు కారు; అని= అనిఅంటూ; మమ్మున్= మమ్ములను (భీమాదులను); నిందింతురు= దూషిస్తారు.

తాత్పర్యం: నీవు అడవికి పోవటానికి అంగీకరించి, నీ వెనుక మేముకూడా కలిసి వస్తున్నప్పుడు - ఓ ధర్మరాజా! లోకు లందరూ 'ఈ వెర్రివాళ్ళు ధర్మరాజును అడవికి పోకుండా మాన్పే సామర్థ్యం లేనివారు' అని మమ్మల్ని నిందిస్తారు.

విశేషం: భీముడి అభిమానం ఈ మాటలలో ధ్వనిస్తున్నది.

క. భోగములఁ బాపి నిందా । భాగులఁగాఁ జేసి యడవి పాల్వఱిచెదవే
నీ గారవంపుఁ దమ్ముల । సాగరవృతధరణిఁ గలుగు జనములు వగవన్.' 66

ప్రతిపదార్థం: నీ గారవంపు+తమ్ములన్= నీ అనుగు తమ్ములను; భోగములన్= సంపదలనుండి; పాపి= దూరంచేసి; నిందాభాగులన్+కాన్+చేసి= నిందల పాలయ్యే వారినిగా చేసి; సాగరవృత= సముద్రంచేత చుట్టబడిన; ధరణిన్= భూమిపై; కలుగు= నివసించే; జనులు= ప్రజలు; వగవన్= దుఃఖించగా; అడవిపాల్+పఱిచెదనే?= అడవులపాలు చేస్తావా?

తాత్పర్యం: నీ అనుగు తమ్ములను భోగాలనుండి దూరంచేసి, నిందల పాలయ్యే వారినిగా చేసి, అడవులపాలు చేస్తావా? నాలుగు సముద్రాలచేత చుట్టబడిన ఈ భూమిమీద నివసించే ప్రజలంతా దుఃఖిస్తారు.

క. ' కేవల నిష్కర్మత మో । క్షావహ మగునేని గిరులు నవనీజములున్
భూవర! ముక్తిం బడయం । గా వలవదె; యడవి నునికి కైవల్యదమే? 68

ప్రతిపదార్థం: భూవర!= రాజా! (ధర్మరాజా!); కేవల నిష్కర్మత= నిష్ఫలమైన కర్మరాహిత్యం (నిరర్థకమైన పనిలేనితనం); మోక్ష+ఆవహము+అగునేని= ముక్తిని కలిగించేదే అయితే; గిరులున్= పర్వతాలూ; అవనీజములున్= చెట్లూ; ముక్తిన్= మోక్షాన్ని; పడయంగాన్+వలవదె?= పొందవద్దా?; అడవిన్= అడవిలో; ఉనికి= ఉండటం; కైవల్యదము+ఏ?= మోక్షాన్ని ఇచ్చేదా? (కాదని భావం).

తాత్పర్యం: 'ఓ రాజా! ఏ ప్రయోజనం లేని కర్మరాహిత్యమే మోక్షాన్ని కలిగించేదైతే కొండలూ, చెట్లూ ముక్తిని పొందగలిగి ఉండాలి కదా! కాబట్టి అడవిలో ఉండటమే మోక్షం కలిగించే దవుతుందా?

క. ఫలములయెడ బ్రహ్మార్పణ । కలనపరుం డగుచుఁ గార్య కర్మము నడపన్
వలయుం; దత్త్వజ్ఞానము । దలకొనినం గర్మశమము దానై కలుగున్. 69

ప్రతిపదార్థం: ఫలముల ఎడన్= కర్మఫలాలపట్ల; బ్రహ్మ+అర్పణ కలనపరుండు+అగుచున్= బ్రహ్మమునకు (దైవానికి) సమర్పించాలనే స్పృహతో కూడుకొన్నవాడు ఔతూ; కార్యకర్మము= లౌకిక వ్యవహారాలు, వేదవిహిత కర్మము= వేదాలలో విధించబడిన విధిని; నడపన్+వలయున్= ఆచరించాలి; తత్త్వజ్ఞానము= ఆత్మ తత్త్వాన్ని గూర్చిన జ్ఞానం కొరకు; తలకొనినన్= పూనుకొంటే; కర్మశమము= కర్మలు ఉపశమించటం; తానై= తనంతట తానే; కలుగున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: విధ్యుక్తకర్మలను ఫలంమీద కోరికలేకుండా బ్రహ్మార్పణభావంతో సాగించాలి. ఆత్మతత్త్వజ్ఞాన సాధనకు పూనుకొంటే కర్మరాహిత్యం తనంతట తానే కలుగుతుంది.

వ. కావునం గర్మహీనత్వం బపవర్గకరంబుగా' దనవుడు నర్జునుండు ధర్మనందను నుద్దేశించి 'దేవా! యొక్కయితిహాసంబు గల దవధరింపు' మని యిట్లనియె. 70

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కర్మహీనత్వంబు= కర్మలు చేయకుండా ఉండటం; అపవర్గకరంబు+కాదు= మోక్షాన్ని కలిగించేది కాదు; అనవుడున్= అని భీముడు అనగా; అర్జునుండు= అర్జునుడు; ధర్మనందనున్+ఉద్దేశించి= ధర్మరాజుతో; దేవా!= ప్రభూ!; ఒక్క+ఇతిహాసంబు= పరంపరగా చెప్పుకొనే కథ ఒకటి; కలదు= ఉన్నది; అవధరింపుము= విను, చిత్తగించుము; అని+ఇట్లు+అనియెన్= అని ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: కాబట్టి కర్మలు చేయకపోవటం మోక్షాన్ని కలిగించ లేదు' అని భీము డనగా, ఆ తరువాత అర్జునుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: 'రాజా! ఒక ఇతిహాసం ఉన్నది. చెప్పుతాను వినుము.'

విశేషం: భీమవాక్యాలకు దృష్టాంతరూపమైన ఇతిహాసాన్ని చెప్పుతూ అర్జునుడు మిత్రసమ్మితంగా హితవును బోధిస్తున్నాడు.

సీ. ‘ కొందఱు బ్రాహ్మణుల్ గొండుక లాత్మ కు । లోచితాచారంబు లుడిగి కాన
లకుఁ జన్న వజ్రి వారికిఁ గృప చేసి ప । తత్త్రిరూపమునఁ దత్పార్శ్వమునకు
నరిగి, ‘మీ కైకొన్న తెరు వొప్ప’ దనవుడు । విని, వా రఖిల మార్గవేది యద్భు
తాస్పద మీపక్షి యని దాని కభిముఖు । లై ‘సత్పథం బెద్ది యనఘ! చెపుమ!’

తే. యనిన ‘నలుగాలివాన గోవును, నశేష । శబ్దముల మంత్రమును, లోహజాతిఁ గాంచ
నమును, మనుజుల విప్రుండు సమధికత్వ । భాజనము లండ్రు వేదప్రపంచవిదులు.’ 71

ప్రతిపదార్థం: కొందఱు బ్రాహ్మణుల్+కొండుకలు= కొందరు బ్రాహ్మణ బ్రహ్మచారులు; ఆత్మకుల+ఉచిత+ఆచారంబులు= తమ కులానికి అనువైన ఆచారాలను; ఉడిగి= వదలి; కానలకున్= అడవులకు; చన్నన్= పోగా; వజ్రి= ఇంద్రుడు; వారికిన్= వారిఅందు; కృపచేసి= దయచూపి; పతత్త్రిరూపమునన్= పక్షి ఆకారంలో; తద్+పార్శ్వమునకున్+అరిగి= వారి దగ్గరకు వెళ్ళి; మీ కైకొన్న తెరువు+ఒప్పదు= మీరు ఎన్నుకొన్న మార్గం ఉచితమైనది కాదు; అనవుడున్= అనగా విని, వారు= ఆ బ్రాహ్మణులు; ఈపక్షి= (పక్షిరూపంలో ఉన్న ఇంద్రుడు) ఈ పక్షి; అఖిలమార్గవేది= సర్వ ధర్మమార్గాలను తెలిసినది; అద్భుత+ఆస్పదము= ఆశ్చర్యాన్ని కలిగించేది; అని= అని అనుకొని; దానికిన్= ఆ పక్షికి; అభిముఖులు+ఐ= ఎదురుగా నిలిచినవారై; అనఘ!= ఓ పాపరహితుడా!; సత్+పథంబు= ఉత్తమమార్గం; ఎద్ది= ఏదో; చెపుమ!= చెప్పుము!; అనినన్= అనగా; నలు+కాలివానన్= నాలుగు కాళ్ళ జంతువులలో; గోవును= ఆవును; అశేషశబ్దములన్= అనంత శబ్దాలలో; మంత్రమును= బీజాక్షరసహితమైన మంత్రాన్ని; లోహజాతిన్= లోహసముదాయంలో; కాంచనమును= బంగారాన్ని; మనుజులన్= మానవులలో; విప్రుండు= బ్రాహ్మణుడు; వేదప్రపంచ విదులు= వేదజగత్తుకు సంబంధించిన జ్ఞానం కలవారు; సమధికత్వ భాజనములు+అండ్రు= ఆధిక్యానికి ఆలంబనాలని అంటారు.

తాత్పర్యం: ‘బ్రాహ్మణ బ్రహ్మచారులు కొందరు తమ కులాచారాలను వదలి అడవులకు వెళ్ళారు. ఇంద్రుడు వారిని చూచి జాలిపడి ఒక పక్షిరూపం దాల్చి వారి సమీపానికి చేరి, ‘మీ రెన్నుకొన్న మార్గం మంచిదికాదు’ అని అన్నాడు. ఆ పక్షిమాటలు విని ఆ బ్రాహ్మణబాలురు ‘ఈ పక్షి అనేక ధర్మమార్గాలు తెలిసింది, అద్భుత’ మని దానిముందు చేరి ‘పుణ్యాత్మా! సన్మార్గం ఏమిటో చెప్పు’ మని కోరారు. అప్పు డా పక్షి ఇట్లా చెప్పనారంభించింది. ‘నాలుగు కాళ్ళున్న జంతువులలో గోవు, అనంత శబ్దరాశిలో మంత్రం, లోహజాతిలో బంగారం, మానవులలో బ్రాహ్మణుడు అధికులు అని వేదవిదులు పేర్కొంటారు’.

విశేషం: మనుజుల విప్రుండు - అజడమైన మనుజశబ్ద సప్తమికి ద్వితీయ రావడం విశేషం. సూ. కొన్ని యెడల నజడంబు తృతీయా సప్తములకును ద్వితీయ చూపట్టెడి. ప్రౌఢ కారక - 18. ‘జకంబు తృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగానగు - బాలవ్యా. కారక. 22 అనుసూత్రమునకు సవరింపు.

వ. ఇ ట్లుత్తముం డైన విప్రుం డుత్తమ మంత్రోపాశ్రితంబులగు విహిత కర్మంబులు నడపుట రత్నకాంచన సాంగత్యంబునుం బోలె లోక సంస్తుత్యంబై యుండు; నాలస్యంబునఁ గ్రోధంబున శోకంబునఁ దదనుష్ఠానంబు విడుచుట పాతకం; బజ్ఞానులగు నర్థహీనులు సన్న్యాసకాల వివేకంబు లేక వేగిరపడి యుభయభ్రష్ఠులగుదురు; గృహస్థ ధర్మంబున వర్తించి యతిథి దేవ పితృసంతృప్తి సేయుచు శిష్టాన్న భోజన పరులగు పుణ్యులకుం బుణ్యలోకంబు లఱచేతిలోనివి గావె?; బ్రహ్మార్పితం బయిన సత్కర్మకలాపంబు మహానందంబుఁ జేయు ననుటయు. 72

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఉత్తముండు+ఐన= శ్రేష్ఠుడైన; విప్రుండు= బ్రాహ్మణుడు; ఉత్తమ మంత్ర+ఉప+ఆశ్రితంబులు+అగు= శ్రేష్ఠములైన మంత్రాలను; ఆశ్రయించిన వైన; విహితకర్మంబులు= యోగ్యములైన ఆచరణములను; నడపుట= సాగించటం; రత్న కాంచన సాంగత్యంబునున్+పోలెన్= రత్నానికీ, బంగారానికీ ఏర్పడిన కలయికవలె; లోక సంస్తుత్యంబు+ఐ+ఉండున్= జనులచేత కీర్తించదగినదై ఉంటుంది; ఆలస్యంబునన్= అలసభావంచేతగాని; క్రోధంబునన్= కోపంవలనగాని; శోకంబునన్= దుఃఖితవ్రతవలనగానీ; తద్+అనుష్ఠానంబు= దానిని ఆచరించటం; విడుచుట= వదలిపెట్టటం; పాతకంబు= పాపం; అజ్ఞానులు+అగు= మూఢులైన; అర్థహీనులు= ప్రయోజనం లేనివారు, ధనంలేనివారు; సన్న్యసకాల వివేకంబు లేక= సన్న్యాసం ఎప్పుడు తీసికొనాలో తెలియనివారై; వేగిరపడి= తొందరపడి (సన్న్యాసాశ్రమం తీసికొని); ఉభయ భ్రష్టులు+అగుదురు= ఇహపరాలకు చెందని పతితులౌతారు; గృహస్థ ధర్మంబునన్= గృహస్థాశ్రమ ధర్మంలో; వర్తించి= కర్మలను ఆచరించి; అతిథి దేవపితృసంతృప్తి+చేయుచున్= అతిథులను, దేవతలను, పితృదేవతలను సంతోషపెట్టుతూ; శిష్ట+అన్నభోజనపరులు= శుద్ధమైన అన్నాన్ని భుజించటంలో ఆసక్తి గలవారైన; పుణ్యులకున్= పుణ్యాత్ములకు, పవిత్రులకు; పుణ్యలోకంబులు= పుణ్యులు పొందే స్వర్గాదిలోకాలు; అరచేతిలోనివి= అరచేతిలో ఉన్నట్లు అందుబాటులో ఉండేవి; కావె?= కావా?; బ్రహ్మ+అర్పితంబు+అయిన= పరమాత్మకు నివేదించిన; సత్+కర్మకలాపంబు= పుణ్యకర్మల సమూహం; మహా+ఆనందంబున్= గొప్పదైన ఆనందాన్ని (బ్రహ్మానందాన్ని); చేయును= కలిగిస్తుంది; అనుటయున్= అని అనగా.

తాత్పర్యం: ఈ విధంగా బ్రాహ్మణోత్తముడు ఉత్తమమంత్రాల నాశ్రయించిన యోగ్యమైన కర్మలను అనుష్ఠించటం రత్నానికీ, బంగారానికీ పొత్తు కుదిరినట్లు శ్లాఘించదగినదై ఉంటుంది. అలసత్వం వలనగాని, క్రోధంవలనగాని, శోకం వలనగాని ఆ కర్మలను చేయకుండా వదలటం పాపం. అజ్ఞానులైన అర్థహీనులు సన్న్యాసం ఎప్పుడు తీసికొనాలో తెలియక త్వరపడి ఇహపరాలకు భ్రష్టులౌతారు. గృహస్థాశ్రమ ధర్మాన్ని నిర్వర్తించి అతిథులనూ, దేవతలనూ, పితృదేవతలనూ సంతృప్తి పరుస్తూ, శిష్టమైన ఆహారాన్ని భుజిస్తూ జీవితం సాగించే పుణ్యాత్ములకు స్వర్గాది పుణ్యలోకాలు కరతలామలకాలు. బ్రహ్మార్పణభావంతో చేసే సత్కర్మలు బ్రహ్మానందాన్ని కలిగిస్తాయి' - అని అనగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. విని వారు దెలిసి మరలం । జనిరి గృహస్థత్వ ధర్మ సదనుష్ఠానం
బునకు; నటు లగుట నేలుము । జనవల్లభ! పుడమి; నడపు జన్నము లెలమిన్.' 73

ప్రతిపదార్థం: వారు= ఆ బ్రాహ్మణులు; విని= ఆ మాటలు విని; తెలిసి= వాటి అర్థాన్ని తెలిసికొని; గృహస్థత్వ ధర్మసత్+అనుష్ఠానంబునకున్= గృహస్థాశ్రమానికి సంబంధించిన ధర్మాలను లెస్సగా అనుష్ఠించటానికి; మరలన్+చనిరి= తిరిగి తమ నివాసాలకు వెళ్ళారు; అటులు+అగుటన్= అది న్యాయం కాబట్టి; జనవల్లభ!= ఓ రాజా! (ధర్మరాజా!); పుడమిన్= రాజ్యాన్ని; ఏలుము= పాలించుము; ఎలమిన్= ప్రీతితో; జన్నములు= యజ్ఞాలు; నడపు= సాగించుము.

తాత్పర్యం: ఈ విధంగా వా రామాటలు విని, తాత్పర్యాన్ని గ్రహించి, గృహస్థాశ్రమంలో నిర్వహించవలసిన ధర్మాలను ఆచరించటానికి ఇండ్లకు తిరిగి వెళ్ళిపోయారు. అది అందరికీ వర్తిస్తుంది. కాబట్టి ఓ రాజా! నీవు రాజ్యాన్ని పాలించుము; ప్రీతితో యజ్ఞాలను నడపించుము.'

వ. అని చెప్పె; నప్పుడు నకులుం డన్నరనాథున కిట్లనియె. 74

ప్రతిపదార్థం: అని చెప్పెన్= అని అర్జునుడు చెప్పాడు; అప్పుడు= ఆ తరువాత; నకులుండు= నకులుడు; ఆ+నరనాథునకున్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పిన తరువాత నకులుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

నకులుఁడు ధర్మజునకు మనస్తాపోపశమంబు సేయుట (సం. 12-12-1)

సీ. 'దేవతల్ వేదవిధి ప్రవర్తకులు; బ్రా । హ్మణులును వారలయట్ల శ్రుతుల
కింకరులై కాదె కిల్బిషంబులఁ బాసి । వారిచందమున శాశ్వత విభూతి
నొందుట; యజ్ఞాదు లుడుగుట సంపరి । త్యాగమే?; పాడిమై నర్థముల ను
పార్జించి దేవతా బ్రాహ్మణ పూజగా । నిడుచుఁ దత్ఫలకోటి విడుపుగాక;

ఆ. క్రోధశోకహర్ష కోటుల గృహముతో । విడిచి యోగ మూఁది వృక్షమూల
వాసనిరతి నుండువాఁడెపో సంపరి । త్యాగి; నృపుల కది సమర్థ మగునె? 75

ప్రతిపదార్థం: దేవతల్= దేవతలు; వేదవిధి ప్రవర్తకులు= వేదాలలో చెప్పబడిన విధులను (నియమాలను) ప్రవర్తింపచేసేవారు; బ్రాహ్మణులును= బ్రాహ్మణులు కూడా; వారల+అట్లు+అ= దేవతలవలెనే; శ్రుతులకింకరులు+ఐ= వేదాలకు దాసులై; కాదె= కాదా; కిల్బిషంబులన్+పాసి= పాపాలనుండి విముక్తులై; వారి చందమునన్= దేవతల విధంగా; శాశ్వత విభూతిన్+ఒందుట= నిత్యమైన మహిమను పొందటం; యజ్ఞ+ఆదులు+ఉడుగుట= యజ్ఞాలు మొదలైనవి వదలిపెట్టటం; సంపరిత్యాగమే?= సన్న్యాసమౌతుందా? (కాదని భావం); పాడిమైన్= న్యాయంగా; అర్థములన్+ఉపార్జించి= సంపదలను గడించి; దేవతా బ్రాహ్మణ పుజగాన్+ఇడుచున్= దేవతలకు, బ్రాహ్మణులకు చేసే అర్చనగా వాటిని అర్పణం చేస్తూ; తత్ఫలకోటి విడుపు కాక= వాటివలన కలిగే అనేక ఫలాలను త్యాగం చేయటమే సంపరిత్యాగం అవుతుంది; క్రోధశోక హర్ష కోటులన్= కోపాల, తాపాల, సంతోషాల సమూహాన్ని; గృహముతోన్= గృహస్థాశ్రమంతోపాటు; విడిచి= పరిత్యజించి; యోగము+ఊఁది= యోగాన్ని ఆశ్రయించి; వృక్షమూలవాస నిరతిన్= చెట్ల మొదళ్ళలో నివసించే ఆసక్తితో; ఉండువాఁడె పో!= ఉండేవాడే సుమా!; సంపరిత్యాగి= నిస్సంగుడు; నృపులకున్= రాజులకు; అది= ఆ నిస్సంగత్వం; సమర్థము= యోగ్యమైనది; అగునె?= అవుతుందా? (కాదని భావం).

తాత్పర్యం: వేదవిధిని ప్రవర్తింపచేసేవారు దేవతలు. వారివలె బ్రాహ్మణులుకూడా వేదకింకరులై పాపవిముక్తులై నిత్యమహిమను పొందుతారు. యజ్ఞాదులను మానివేయటం అసంగమౌతుందా? న్యాయంగా సంపదలు గడించి దేవతలకు, బ్రాహ్మణులకు పూజలుగా ఇస్తూ, తత్ఫలాలను విడవటమే నిస్సంగప్రవృత్తి అవుతుంది. క్రోధం, శోకం, హర్షం మొదలైన భావాలతోపాటు గృహస్థాశ్రమాన్ని వదలి యోగాన్ని ఆశ్రయించి వృక్షమూలంలో నివసిస్తూ ఉండేవాడే సంపరిత్యాగి. రాజులకు అది యోగ్యం అవుతుందా? (కాదని భావం).

క. తక్కిన మూఁ డాశ్రమములు, । నొక్కదెస గృహస్థ ధర్మ మొకదెసఁ దులయం
దెక్కింప వానితో న । య్యొక్కటి సరిదూఁగె నందు రుర్వీశ! బుధుల్. 76

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ!= భూపాలా! ధర్మరాజా!; తుల అందున్= త్రాసులో; ఒక్క దెసన్= ఒకవైపున; తక్కిన మూఁడు+ఆశ్రమములు= గృహస్థాశ్రమం కాక మిగిలిన మూ డాశ్రమాలూ (బ్రహ్మచర్య, సన్న్యాస, వానప్రస్థాశ్రమాలు); ఒక దెసన్= మరియొక వైపున; గృహస్థ ధర్మము= గార్హస్థ్యాశ్రమం; ఎక్కింపన్= ఎత్తి ఉంచగా; వానితోన్= ఆ మూడింటితో; ఆ+ఒక్కటి= ఆ గార్హస్థ్యాశ్రమం ఒక్కటి; సరి+తూఁగెన్= సమంగా తూగిందని; బుధులు= పండితులు; అందురు= అంటారు.

తాత్పర్యం: ఒక త్రాసులో ఒకవైపు బ్రహ్మచర్య, సన్న్యాస, వానప్రస్థాశ్రమాలను మూడింటిని, మరొకవైపు గృహస్థాశ్రమ ధర్మాన్నీ ఎక్కించగా ఆ మూడింటితో ఇది ఒక్కటి సరితూగిందని పండితులంటారు ధర్మరాజా!

విశేషం: మహాభారతం గృహస్థాశ్రమధర్మ ప్రాశస్త్యాన్ని ప్రతిపాదించటానికే పుట్టిందని ఇటువంటి సూక్తుల వలన ధ్వనించబడుతున్నది.

వ. కావున గృహస్థ ధర్మంబ యాదరణీయం; బట్లుంగాక. 77

తాత్పర్యం: కాబట్టి గృహస్థధర్మం గౌరవించదగింది. అట్లా కాక (తరువాతి పద్యంతో అన్వయం).

క. జతనంబున నర్థము సం । చితముగఁ గావించి క్రతువిశేషంబుల దే
వతలం దృప్తులఁ జేయమి । యతికిల్బిషకారి యందు రాగమవేదుల్. 78

ప్రతిపదార్థం: జతనంబునన్= ప్రయత్నంతో; అర్థము= ధనాన్ని; సంచితముగన్= కూడబెట్టేదిగా; కావించి= చేసి; క్రతువిశేషంబులన్= యజ్ఞవిశేషాలతో; దేవతలన్= దేవతలను; తృప్తులన్+చేయమి= సంతృప్తులుగా చేయకుండా ఉండటం; అతికిల్బిషకారి= మిక్కిలి పాపహేతువని; ఆగమవేదుల్= వేదవిద్వాంసులు; అందురు= అంటారు.

తాత్పర్యం: ప్రయత్నపూర్వకంగా ధనాన్ని కూడబెట్టి విశేషక్రతువులు చేసి దేవతలను తృప్తి చేయకపోతే మిక్కిలి పాపం కలుగుతుందని వేదవిదులు అంటారు.

చ. వినుము! తమోమయం బయిన విశ్వముఁ దా వెలిఁగించు నీశ్వరుం
డన నొకరుండు; వర్ణతతి నాశ్రమకోటిని వాఁడుఁ గాదె చే
సె; నిఖిల కర్మయోగ సవిశేషత గల్గుటయుం దదీయ క
ల్పనను; తదాజ్ఞకుం దొలఁగఁ బాడియె శోకము గారణంబుగన్. 79

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; తమోమయంబు+అయిన= అంధకారంతో నిండినదయిన; విశ్వమున్= జగత్తును; ఈశ్వరుండు+అనన్+ఒకరుండు= ఈశ్వరు డనే పేరు కలిగిన ఒకడు; తాన్+వెలిఁగించున్= తన ప్రకాశంతో వెలుగు నింపుతాడు; వర్ణతతిన్= వర్ణాలను; ఆశ్రమ కోటిని= ఆశ్రమ సమూహాన్ని; వాఁడు+కాదె+చేసెన్= వాడేకదా ఏర్పరిచింది; తదీయ కల్పనను= ఆతడి కల్పనచేతనే; నిఖిల కర్మయోగ సవిశేషత= సమస్త కర్మయోగ విశేషభావం; కల్గుటయున్= ఏర్పడటం కూడా; తద్= అటువంటి ఆ ఈశ్వరుడియొక్క; ఆజ్ఞకున్= శాసనానికి; శోకము+కారణంబుగన్= శోకం కారణంగా; తొలఁగన్= దూరం కావటం; పాడియె?= న్యాయమా? (కాదని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. అంధకార బంధురమైన ఈ విశ్వంలో ఈశ్వరుడనే వాడొకడు వెలుగును ప్రసాదిస్తాడు. అతడే కదా వర్ణ సముదాయాన్నీ, ఆశ్రమకోటినీ ఏర్పరచింది! సమస్త కర్మయోగ విశేషభావం కలగటం ఆయన కల్పనయే. శోకం కారణంగా ఆతడి ఆజ్ఞను మీరటం న్యాయమా? (కాదని భావం).

వ. హింసాదోషంబు గలుగునను శంకకుం బనిలే; దవధరింపుము. 80

తాత్పర్యం: హింసచేసిన పాపం కలుగుతుందనే అనుమానం పడవలసిన పని లేదు; వినుము.

క. పరుల వధింపక యెవ్వఁడు । ధర యేలెం జెపుమ పూర్వ ధరణీశులలోఁ?
బొరయదు పాపము సుగతిక । యరిగిరి వా; లీవు నట్ల యగు టొప్పు నృపా! 81

ప్రతిపదార్థం: నృపా!= రాజా! (ధర్మరాజా!); పూర్వధరణీ+ఈశులలోన్= మున్నున్న రాజులలో; ఏ+వాఁడు?= ఎవడు?; పరులన్= శత్రువులను; వధింపక= చంపక; ధర= భూమిని; ఏలెన్= పాలించాడో; చెపుమ= తెల్పుము; పాపము= దోషం; పొరయదు= (వారికి) కలుగదు; వారు= ఆ పూర్వ చక్రవర్తులు; సుగతికిన్+అ= ఉత్తమ గతికే (మోక్షానికే); అరిగిరి= వెళ్ళారు; నీవున్= నీవు కూడా; అట్లు+అ= ఆ విధంగానే; అగుట= కావటం; ఒప్పున్= సబబు.

తాత్పర్యం: రాజా! పూర్వ చక్రవర్తులలో శత్రువులను చంపకుండా ఎవడు రాజ్యాన్ని పాలించాడో చెప్పుము. వారికి పాపం కలుగలేదే! వారు ఉత్తమగతులనే పొందారు. కాబట్టి నీవు కూడా ఆ విధంగా కావటం సముచితం.

క. రక్ష ప్రజ గోరు నిజయో । గక్షేమార్థముగ; జన సుఖస్థితి నడపన్
దక్షుఁ డగు రాజు నడప కు । పేక్షించినఁ బాప మొందదే కురుముఖ్యా! 82

ప్రతిపదార్థం: కురుముఖ్యా!= కురుశ్రేష్ఠుడవైన ధర్మరాజా!; నిజయోగక్షేమ+అర్థముగన్= తమ యోగక్షేమాల కొరకు; ప్రజ= ప్రజలు; రక్షన్= రక్షణను; కోరున్= కోరుతూ ఉంటారు; జనసుఖస్థితి= ప్రజలు సుఖంగా జీవించే వ్యవస్థను; నడపన్= సాగించటానికి; దక్షుఁడు+అగు= సమర్థుడైన; రాజు= ప్రభువు; నడపక= నిర్వహించక; ఉపేక్షించినన్= నిర్లక్ష్యం చేస్తే; పాపము+ఒందదా?= పాపం కలుగదా?.

తాత్పర్యం: తమ యోగక్షేమాల కొరకు ప్రజలు రక్షను కోరుతుంటారు. ప్రజలు సుఖంగా ఉండగలిగే వ్యవస్థను నడపగలిగిన సమర్థుడైన ప్రభువు దానిని నిర్వహించకుండా నిర్లిప్తంగా ఉంటే పాపం పొందదా ధర్మరాజా!

తే. గోవులను ఘోటకంబులఁ గుంజరముల । దాసులను బ్రీతి నిమ్మెల్ల ధాన్యములను
గ్రామముల మందిరముల నిష్కముల వేడ్క । నొసఁగు తత్తత్సుపాత్రత్వయుక్త విధుల. 83

ప్రతిపదార్థం: గోవులను= ఆవులను; ఘోటకంబులన్= గుర్రాలను; కుంజరములన్= ఏనుగులను; దాసులను= సేవకులను; ఎల్లధాన్యములను= అన్ని రకాలైన ధాన్యాలను; గ్రామములన్= ఊళ్ళను (అగ్రహారాదులు); మందిరములన్= గృహాలను; నిష్కములన్= బంగారు నాణెములను; పెక్కు= అధిక సంఖ్యలో; తద్+తద్+సుపాత్రత్వయుక్త విధులన్= దానం చేస్తున్న ఆయా వస్తువులను స్వీకరించదగినవారి ఉత్తమ యోగ్యతలతో కూడుకొన్న నియమాలతో; ప్రీతిన్= సంతోషంగా; ఇమ్ము= దానమిమ్ము.

తాత్పర్యం: ఆవులను, గుర్రాలను, ఏనుగులను, సేవకులను, బహుధాన్యాలను, గ్రామాలను, గృహాలను, బంగారు నాణెములను, అవి దానం చేయదగిన అర్హత ఉన్నవారికి విధివిధానంగా నీవు దానం చేయుము.

వ. వీని నన్నింటి రిత్తవో విడిచి పోయెద ననుట నీ యట్టి మహానుభావునకుం దగునే?' యని పలికినం
దదనంతరంబ సహదేవుం డమ్మహీపతి కిట్లనియె. 84

ప్రతిపదార్థం: వీనిన్= పైన చెప్పిన వాటినన్నింటిని; రిత్త+పో+విడిచి= నిష్ప్రయోజనంగా వదలిపెట్టి; పోయెదన్+అనుట= (అడవికి) పోతాననటం; నీ+అట్టి= నీ వంటి; మహా+అనుభావునకున్= ఉత్తముడికి; తగునే?= యోగ్యమౌతుందా?; అని పలికినన్= అని మాట్లాడగా; తదనంతరంబు+అ= ఆ తరువాతనే; సహదేవుండు= సహదేవుడు; ఆ+మహీపతికిన్= ఆ రాజుకు (ధర్మరాజుతో); ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: వీటినన్నింటిని వదలి అడవికి పోతాననటం నీవంటి ఉత్తములకు తగునా?' అని పలుకగా ఆ తరువాత సహదేవుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: భీముడు, అర్జునుడు, నకులుడు పలికిన మాటలు ఆయా పాత్రల స్వభావానికి అనుగుణంగా ఉండటం గమనించదగిన అంశం. వక్తల మాటల తీరులు వేరైనా వక్తవ్యాంశ తాత్పర్యం ఒక్కటే!

సీ. 'వెలి వెలి వస్తువుల్ విడిచెఁబో నరుఁడు గ । ర్మిష్ఠతం గాదె శరీర యాత్ర
నడపువాఁ; డది మోక్షణంబు గానేరదు; । శారీర సౌఖ్యసంసక్తి వదలి
బాహ్యపదార్థముల్ పాటించి నిజవంశ । ధర్మముల్ వదలక తగఁ జరింపు
మమత బంధంబు నిర్మమత మోక్షంబును । జేయు; నింత యెఱింగి చేసి రధిప!

తే. రాజ్య మెలమి మన్వాదు; లరణ్యమునకు । నరిగి నీ వందు వలయు ద్రవ్యముల మీఁదఁ
జేయవలదె మమత్వంబు; వేయు నేల? । యదియు సంసార చక్రవాహకము గాదె? 85

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; నరుఁడు= మానవుడు; వెలివెలి వస్తువుల్= పైపై పదార్థాలు; విడిచెన్+పో= విడిచిపెట్టాడనుకొన్నా; శరీరయాత్ర= జీవితయాత్ర; కర్మిష్ఠతన్+కాదె= కర్మలయందలి నిష్ఠతోనే కదా; నడుపువాఁడు= సాగించేవాడు; అది= ఆ విధం; మోక్షణంబు= మోక్షం (బంధవిముక్తి); కానేరదు= కాజాలదు; శారీర సౌఖ్యసంసక్తి= శరీర సుఖం మీది రక్తి; వదలి= త్యజించి; బాహ్యపదార్థముల్= లౌకిక విషయాలను; పాటిస్తూ= ఆచరిస్తూ; నిజవంశధర్మముల్= తన వంశంలో చేయవలసిన కర్తవ్యాలను; వదలక= వీడక; తగన్= ఒప్పునట్లు; చరింపు= వర్తించుము; మమత= మోహం; బంధంబు= సంసార సంగమును కలిగించేది; నిర్మమత= మోహం లేకపోవటం; మోక్షంబును+చేయున్= మోక్షాన్ని కలిగిస్తుంది; ఇంత= ఈ తాత్పర్యాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; మను+ఆదులు= మనువు మొదలైనవారు; రాజ్యము= పరిపాలనం; ఎలమిన్= ప్రీతితో; చేసిరి= నిర్వహించారు; నీవు= నీవు (ధర్మరాజు); అరణ్యమునకున్= అడవికి; అరిగి= వెడలి; వలయు ద్రవ్యముల మీఁదన్= కావలసిన వస్తువులమీద; మమత్వంబున్= మమకారాన్ని; చేయన్+వలదె?= చేయవద్దా? (పెంచుకొనవద్దా? అని భావం); వేయున్+ఏల?= పలుమాట లెందుకు?; అదియున్= ఆ విధంగా అరణ్యంలో నివసించటం; సంసార చక్రవాహకము+కాదె?= సంసార చక్రపు (చావు పుట్టుకల వలయానికి) ఇరుసువంటిది కాదా?

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! మానవుడు పైపై విషయాలను ఎన్ని వదలినా కర్మఠుడై శరీరయాత్ర సాగిస్తూ ఉంటాడు. అది మోక్షం కాజాలదు. శరీరసుఖ ఆసక్తిని మానుకొని బాహ్య విషయాలను పాటిస్తూ స్వీయవంశానుగుణాలైన ధర్మాలను విడువకుండా తగునట్లు జీవితాన్ని సాగించుము. మమకారం బంధాన్నీ, నిర్మోహం మోక్షాన్నీ కలుగజేస్తాయి. మన్వాదులు దీనిని తెలిపి రాజ్యం చేశారు. నీవు అరణ్యానికి వెడలినా అక్కడ జీవించటానికి కావలసిన ద్రవ్యాలమీద మమత్వాన్ని కలిగి ఉండవలసిందే కదా! వేయిమాట లెందుకు? అదే సంసారచక్రానికి ఆధారం కదా!

తే. నీవ చుట్టంబుఁ బక్కంబు, నీవ చెలియు, । నీవ తల్లియుఁ దండ్రియు, నీవ గురువు,
నీవ దైవంబుఁ గావున నా విషాద । భాషణంబులు సైరింపు భరతముఖ్య!. 86

ప్రతిపదార్థం: భరతముఖ్య!= భరతవంశ శ్రేష్ఠుడవైన ధర్మరాజా!; నీవు+అ= నీవే (ధర్మరాజే); చుట్టంబు= బంధువు; పక్కంబు= తోడు; నీవ చెలియున్= నీవే నెచ్చెలివి; నీవ తల్లియున్= నీవే అమ్మవు; తండ్రియున్= జనకుడవు; నీవ గురువు= నీవే ఆచార్యుడవు; నీవ దైవంబు= నీవే వేల్పువు; కావునన్= కాబట్టి; నా విషాద భాషణంబులు= నా కన్నీటి మాటలు; సైరింపు(ము)= మన్నించుము.

తాత్పర్యం: ఓ భరతవంశశ్రేష్ఠా! నీవే నా బంధువవు, నీవే నా తోడువు, నీవే నా నెచ్చెలివి, తల్లివి, తండ్రివి, గురువవు, దైవానివి. కాబట్టి నా కన్నీటి మాటలను మన్నించుము.

క. తథ్యము లైనను దలఁప న । తథ్యము లైనను సభక్తి తాత్పర్యము వై
తథ్యంబుఁ బొరయకుండఁగఁ । బథ్యంబుగఁ గొనుము నాదు పలుకులు కరుణన్.' 87

ప్రతిపదార్థం: నాదు పలుకులు= నా మాటలు; తథ్యములు+ఐనను= సత్యాలైనా; తలఁపన్= ఆలోచించగా; అతథ్యములు+ఐనను= అసత్యాలైనా; సభక్తి తాత్పర్యము= భక్తిభావంతో కూడుకొని ఉన్నవి; వైతథ్యంబున్= అసత్యభావాన్ని; పొరయక+ఉండఁగన్= కలుగకుండగా; కరుణన్= దయతో; కొనుము= స్వీకరించుము (అంగీకరించుము).

తాత్పర్యం: నా మాటలు సత్యాలైనా, అసత్యాలైనా భక్తిభావంతో కూడికొని ఉన్నాయి. కాబట్టి వాటికి అసత్యస్వభావం కలుగకుండా దయతో అంగీకరించుము'.

విశేషం: సహదేవుడు భక్తితో ధర్మజుడిని అనునయించే యత్నం చేశాడు. చివరి రెండు పద్యాలు శరణాగతభావాన్ని వెలువరిస్తున్నట్లున్నాయి. భక్తుల కోర్కెలను మన్నించే దైవం వాటిలోని సత్యాసత్యాలను పరిగణించడని పలికి సహదేవుడు వేస్తున్న ముందుకాళ్ళకు బంధాలు ఈ మాటలు. ధర్మజుడిపై ఆతడికి గల భక్తి, అనురక్తి ఇందులోని వ్యంగ్యం.

వ. అనియె; నిట్లు దమ్ములందఱును బోధించు పలుకులు విని ధర్మనందనుం డూరకయుండె; నతనియెడ సవిశేష బహుమానయు, నతనిచేత సంతతోపలాలితయు, ధర్మాధర్మ నిదర్శన శీలయు నగు పాంచాలి భద్రగజప్రతిమానులైన యప్పవమానతనయ ధనంజయ నకుల సహదేవుల మధ్యంబున యూథపతివోలె నున్న యన్నరేంద్రు నల్లన చేరి, 'యేనును నాయెఱింగినంత సెప్పెద' నని యనుజ్ఞఁ గొని యవ్విభు వదనంబున నిజ విశాలలోచన రోచులు పరఁగ వినయం బాననంబున నతిశయిల్ల నిట్లనియె. 88

ప్రతిపదార్థం: అనియెన్= సహదేవు డట్లా పలికాడు; ఇట్లు= ఈ విధంగా, క్రమంగా; తమ్ములు+అందఱును బోధించు పలుకులు విని= తమ్ములందరు ప్రబోధిస్తూ చెప్పిన మాటలు విని; ధర్మనందనుండు+ఊరక+ఉండెన్= ధర్మరాజు మిన్నక ఉన్నాడు; అతని యెడన్= ధర్మరాజుపట్ల; సవిశేషబహుమానయున్= అతిశయించిన గౌరవమర్యాదలు కలది; అతనిచేతన్= ధర్మరాజుచేత; సంతత+ఉపలాలితయున్= ఎల్లప్పుడూ బుజ్జగించబడుతూ ఉండేది; ధర్మ+అధర్మ నిదర్శన శీలయును+అగు= ధర్మాన్నీ అధర్మాన్నీ నిరూపించగల స్వభావం కలది అయిన; పాంచాలి= ద్రౌపది; భద్రగజప్రతిమానులు+ఐన= శ్రేష్ఠమైన ఏనుగులతో సమానులైన; ఆ+పవమాన తనయ ధనంజయ నకుల సహదేవుల మధ్యంబునన్= ఆ భీమార్జున నకుల సహదేవుల నడుమ; యూథపతివోలెన్+ఉన్న= గజరాజువలె ఉన్న; ఆ+నరేంద్రున్= ఆ రాజును; అల్లన చేరి= మెల్లగా సమీపించి; ఏనును= నేను కూడా; నా+ఎఱింగినంత= నా తెలిసినంత; చెప్పెదన్= చెప్పుతాను; అని= అని; అనుజ్ఞన్+కొని= అనుమతిని తీసికొని; ఆ+విభువదనంబునన్= ధర్మజుడి ముఖమునందు; నిజవిశాల లోచన రోచులు= తన విశాలమైన కనుచూపుల కాంతులు; పరఁగన్= వ్యాపించగా; వినయంబు= అణకువ; ఆననంబునన్= ముఖంలో; అతిశయిల్లన్= వికసించగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ విధంగా తమ్ములందరూ బోధించిన మాటలు విని ధర్మరాజు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ధర్మరాజుపట్ల అధికమైన గౌరవమర్యాదలు కలదీ, అతడిచేత ఎల్లప్పుడూ లాలించబడుతూ ఉండేదీ, ధర్మాధర్మాలను నిరూపించే స్వభావం కలదీ అయిన ద్రౌపది భద్రగజాలతో సమానులైన ఆ భీమార్జున నకుల సహదేవుల నడుమ గజయూథపతివోలె నున్న ధర్మరాజును మెల్లగా సమీపించి 'నేను కూడా నా తెలిసినంత చెప్పుతాను' అని అనుమతి తీసికొని ధర్మజుడి ముఖంపై తన విశాలనేత్రాల చూపుల వెలుగులు వ్యాపింపచేసి వినయం ముఖాన వికసించగా ఇట్లా అన్నది.

విశేషం: అలం: ఉపమ. భీమాదులు పలికినప్పటికంటె ద్రౌపది పలికేటప్పుడు అభినయాన్ని విశేషంగా వర్ణించటం తిక్కనగారి పాత్రోచిత నాటకీయ ఘణితి.

ద్రౌపది ధర్మజునకు హితవచనంబుల మనస్తాపోపశమంబు సేయుట (సం. 12-14-1)

సీ. ' శోకాగ్ని దనికిన సొగయు నీ తమ్ముల । నుపపన్న వాక్యామృతోపయుక్తిఁ
దేర్పుము; గానలం ద్రిమ్మరునాఁడు వీ । రాయాసములఁ బడు టవధరించి
సమయ కాలము సన్నఁ జని సుయోధనుఁ జంపి । భోగంబులను బహుత్యాగములను
యాగంబులను సద్విహారముల్ సలుపుద । మని యూరడింపవే; యరిగణంబుఁ

తే. ద్రుంచి రాజ్యంబు సేకొంటి; తొఱఁగి పోదు । గాక యని యిప్పు డుడికింప నీకుఁ దగునె?
ధర్మమును సత్యమును నుచితంబు నిన్నుఁ । గడవ నెఱిఁగెడువారలు గలరె యధిప!' 89

ప్రతిపదార్థం: అధిప!= ప్రభూ! (ధర్మరాజా!); శోక+అగ్ని= శోకమనే అగ్ని; తనికినన్= సమీపించగా, తాకగా; సొగయు= చొక్కు; నీ తమ్ములన్= నీ సోదరులైన భీమాదులను; ఉపపన్న వాక్య+అమృత+ఉపయుక్తిన్= ఉపపత్తులు కలిగిన వాక్యాలనే అమృతమును ఉపయోగించటం వలన; తేర్పుము= తేటపడేటట్లు చేయుము, తేరుకొనేటట్లు చేయుము; కానలన్= అరణ్యాలలో; త్రిమ్మరునాఁడు= తిరుగాడే సమయంలో; వీరు= భీమాదులు; ఆయాసములన్= కష్టాలను; పడుట= పొందటం; అవధరించి= గమనించి; సమయకాలము= నియమసమయం; చన్నన్= కడచిపోగా; చని= (దండెత్తి)పోయి; సుయోధనున్+చంపి= దుర్యోధనుడిని చంపి; భోగంబులను= సంపదలను అనుభవించుటలను; బహుత్యాగములను= పలురకాల త్యాగాలను; యాగంబులను= యజ్ఞాలను; సత్+విహారముల్= ఉచితములైన విలాస క్రీడలతో వేడుకగా తిరుగుటలు; సలుపుదుము+అని= చేద్దామని; ఊరడింపవే?= బుజ్జగించలేదా?; అరిగణంబున్= శత్రు సమూహాన్ని; త్రుంచి= చంపి; రాజ్యంబు= ప్రభుత్వాన్ని; చేకొంటి(వి)= చేపట్టావు; తొఱఁగిపోదున్+కాక!= దానిని వదలిపోతాను సుమా!; అని= అని; ఇప్పుడు= ఈ సమయంలో; ఉడికింపన్= తపింపచేయటం, ఎదుటివారికి ఉలుకు పుట్టించటం; నీకున్= నీకు (ధర్మరాజుకు); తగునె?= ఉచితమా? (కాదని భావం); ధర్మమును= ధర్మాన్నీ; సత్యమును= సత్యాన్నీ; ఉచితంబు= ఔచిత్యాన్నీ గురించి; నిన్నున్+కడవన్= నిన్ను మించేటట్లుగా; ఎఱిఁగెడువారలు= తెలిసినవారు; కలరె?= కలరా?(లేరని భావం).

తాత్పర్యం: 'ధర్మరాజా! శోకాగ్ని సోకటంవలన బాధపడుతున్న నీ తమ్ములను సోపపత్తికాలైన అనునయ వాక్యాలనే అమృత సేచనంతో ఓదార్చుము. అరణ్యవాసంలో వీరు అనేక కష్టాలను అనుభవించటాన్ని తెలిసికొని, నియమసమయం ముగిసిపోగా దుర్యోధనుడిని చంపి, భోగాలను, అనేక త్యాగాలను, యజ్ఞాలను, వినోదవిహారాలను చేద్దామని వీరిని ఊరడించలేదా!. శత్రువులను సంహరించి రాజ్యాన్ని స్వీకరించావు, ఇప్పుడు 'రాజ్యాన్ని త్యజించి పోతాను సుమా!' అని వీరిని తపింపచేయటం న్యాయమా? ధర్మమును గురించి, సత్యాన్ని గురించి, ఔచిత్యాన్ని గురించి నిన్ను మించి తెలిసినవా రున్నారా?' (లేరని భావం).

విశేషం: భీమాదులు ఉపక్రమించే పద్ధతిలోనూ, ద్రౌపది మొదలు పెట్టే విధంలోనూ కొట్టవచ్చిన మార్పు గమనించతగింది. ఆమె 'ధర్మాధర్మ నిదర్శన శీల' అని నిరూపితమయ్యేటట్లు మాటలనేర్పు కూర్పబడింది.

వ. అని ముట్టనాడి, మఱియును. 90

తాత్పర్యం: అని మర్మం తాకేటట్లుగా (గుండెకు గుచ్చుకొనేటట్లు) మాట్లాడి, (ఇంకా ఇట్లా అన్నది).

క. ' పేదమన సగుట ధర్మువు । గాదు నరేంద్రునకు; జగము గావం బ్రోవం
గాదె నృపు లోకపాలాం । శోదితుఁగాఁ జేసెఁ బద్మయోని చతురతన్. 91

ప్రతిపదార్థం: నర+ఇంద్రునకున్= రాజునకు; పేదమనసు+అగుట= బేల అయిన మనసు కలవాడు కావటం; ధర్మువు+కాదు= సహజధర్మం కాదు; పద్మయోని= బ్రహ్మ; చతురతన్= నేర్పుతో; నృపున్= క్షత్రియుడిని, రాజును; జగమున్= లోకమును; కావన్= రక్షించటానికి; ప్రోవన్= పోషించటానికికాదా?; లోకపాల+అంశ+ఉదితున్+కాన్= దిక్పాలకుల అంశతో పుట్టినవాడయ్యేటట్లుగా; చేసెన్= సృష్టించాడు.

తాత్పర్యం: రాజు ధైర్యస్థైర్య గుణాలను కోల్పోయిన బేల అయిన మనసు కలవాడుగా ఉండటం ధర్మం కాదు. బ్రహ్మ నైపుణ్యంతో రాజును లోకాన్ని రక్షించటానికీ, పోషించటానికీ కదా దిక్పాలకాంశంతో సృష్టించాడు!

క. నరరూపంబునఁ బరఁగెడు । పరదేవత గాక నృపుఁడు బాలుఁ డయిన న
ప్పురుషు నెడ నేమి వొమ్మని । తిరిగిన దుర్మతులఁ బొందదే కీ డధిపా! 92

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; నృపుఁడు= రాజు; నరరూపంబునన్= మానవాకారంతో; పరఁగెడు= విహరించే; పరదేవత= శ్రేష్ఠమైన దైవం; కాక= కాకుండా; బాలుఁడు= పసివాడు (అప్రౌఢుడని భావం); అయినన్= అయితే; ఆ+పురుషుని+ఎడన్= ఆతడిపట్ల; ఏమి+పొమ్ము+అని= ఏమి లాభమని (జాతీయం) నిర్లక్ష్య భావంతో; తిరిగిన= చరించే, వర్తించే; దుర్మతులన్= దుర్మార్గులవలన; కీడు= ఆపద; పొందదే?= కలుగదా? (కలుగుతుంది అని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! ప్రభువు మానవాకారంతో నడయాడే పరదైవంవలె కాకుండా బాలుడివలె అప్రౌఢుడైతే ఆతడిపట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శించే దుర్మార్గులవలన కీడు తప్పక వాటిల్లుతుంది.

ఉ. నేరక చేర నొక్కనిన నీఱుగఁ జేయుఁ గృశానుఁ డిద్ధ ధా
త్రీరమణాగ్ని గాల్చు నతితీవ్రత వంశము నెల్ల; నిట్లుగాఁ
గౌరవకోటి దర్పమునఁ గానక నిన్నుఁ బరాభవించి దు
ర్వారభవత్ప్రకోపశిఖిఁ గ్రాఁగె; మదిన్ వగ పేల దీనికిన్. 93

ప్రతిపదార్థం: కృశానుఁడు= అగ్ని; నేరక= తెలియక; చేరన్= సమీపించగా; ఒక్కనిన= ఒకడిని మాత్రమే; నీఱుగన్= బూదిగా; చేయున్= చేస్తాడు; ఇద్ధ= ప్రకాశితమైన; ధాత్రీరమణ+అగ్ని= రాజు అనెడి అగ్ని; అతి తీవ్రతన్= అత్యంతమైన వేడిమితో (పరాక్రమంతో); వంశమును+ఎల్లన్= కులాన్నంతా - వెదురు; కాల్చున్= కాల్చివేస్తుంది; ఇట్లుకాన్= ఈ విధంగానే; కౌరవకోటి= కౌరవసమూహం; దర్పమునన్= గర్వంచేత; కానక= వెనుక ముం దాలోచించక; నిన్నున్= నిన్ను (ధర్మరాజును); పరాభవించి= అవమానించి; దుర్వార= ఆపుటకు వీలుకాని; భవత్+ప్రకోప శిఖిన్= నీ యొక్క క్రోధమనే అగ్నిలో; క్రాఁగెన్= తగులబడింది; దీనికిన్= ఈ జరిగిన దానికి; మదిన్= హృదయంలో; వగపు= దుఃఖం; ఏల?= ఎందుకు?.

తాత్పర్యం: లోకంలో అగ్ని దగ్గరకు ఎవరైనా తెలియక సమీపిస్తే అతడి నొక్కడినే అది బూది చేసివేస్తుంది. కాని, ప్రకాశవంతుడైన రాజనే అగ్ని అతితీవ్రతతో వంశాన్నే (వెదురు) కాల్చివేస్తుంది. అందువలననే ని న్నా కౌరవులు గర్వాతిశయంతో కన్నుమిన్నుగానక అట్లా అవమానించి నీ తిరుగులేని కోపాగ్నిలో దగ్ధమై పోయారు. ఈ జరిగిన దానికి నీ మనస్సులో దుఃఖ మెందుకు?

విశేషం: ఇందులో రూపకానుప్రాణితోపమాలంకారం సార్థకంగా వాడబడింది. 'వంశ' శబ్దంలో శ్లేషాలంకారం. వంశము= (నానా) కులము, వెదురు.

సీ. నృపునందు విధి దండనీతి ప్రతిష్ఠించెఁ । గావున నపరాధగతి యెఱింగి
దండించు నృపతికి రెండు లోకంబులుఁ । జేకుఱుఁ; దోషంబు సేయ నుదుట
నచ్చొత్తి వెడలంగ నడుచు విప్రుని నైన । భూవరుం; డిది మెచ్చు దేవకోటి;
సభ కేకవస్త్ర రజస్వల యనక నన్ । దలవట్టి యీడ్చిన తప్పుఁ; దనదు

తే. తొడలు సూపిన తప్పును, దుష్ట కష్ట । తర వచనములఁ బఱిచిన తప్పు, ననుజు
నందు దుర్యోధనునియందు ననుఁగు నందుఁ । గాంచి దండించి; తిట్టిది కల్మషంబె? 94

ప్రతిపదార్థం: నృపునందున్= రాజునందు; విధి= బ్రహ్మ; దండనీతి= దుష్టులను శిక్షించే పద్ధతి; ప్రతిష్ఠించెన్= స్థాపన చేశాడు; కావునన్= కాబట్టి; అపరాధగతి= చేసిన నేరము యొక్క విధమును; ఎఱింగి= తెలిసికొని; దండించు= శిక్షించే; నృపతికిన్= రాజుకు; రెండు లోకంబులున్= ఇహపరలోకాలు; చేకుఱున్= సిద్ధిస్తాయి; భూవరుండు= రాజు; దోషంబు+చేయన్= పాపంచేస్తే; విప్రునిన్+ఐనన్= బ్రాహ్మణుడిని సైతం; నుదుటన్+అచ్చొత్తి= (జాతీయం) ముఖాన ముద్రవేసి, (దొంగలకు వేసే ఒక శిక్ష); వెడలంగన్ అడుచున్= బహిష్కరిస్తాడు; అది= ఆ పనిని; దేవకోటి= దేవతల సమూహం; మెచ్చున్= కీర్తిస్తుంది; సభన్= (ఆనాటి కపట ద్యూత) సభలో; ఏకవస్త్ర= ఒకచీర తాల్చిన; రజస్వల= ఋతుమతి; అనక+నన్= అనిభావించక నన్ను (ద్రౌపదిని); తల+పట్టి= జుట్టుపట్టుకొని; ఈడ్చిన తప్పున్= లాగిన దోషాన్ని; తనదు తొడలు+చూపిన తప్పునున్= (ద్రౌపదిని కూర్చుండుమని సైగ చేస్తూ) తొడను చూపించిన దోషాన్ని; దుష్టకష్టతర వచనములన్= దుర్మార్గాలు, అమితమైన బాధను కలిగించేవి అయిన మాటలతో; పఱిచిన తప్పున్= పాటుపడజేసిన దోషాన్ని; అనుజునందున్= తమ్మునందును (దుర్యోధనుడి తమ్ముడైన దుశ్శాసనుడి అందు); దుర్యోధనుని అందున్= సుయోధను నందును; అనుఁగునందున్= దుర్యోధనుడికి ప్రీతిపాత్రుడైన కర్ణుడియందు; కాంచి= చూచి; దండించితి(వి)= శిక్షించావు; ఇట్టిది= ఇటువంటిది; కిల్బిషంబె?= పాపమా? (కాదని భావం).

తాత్పర్యం: బ్రహ్మదేవుడు రాజునందు దండనీతిని ప్రతిష్ఠించాడు. కాబట్టి అతడు అపరాధం చేసినవారి పద్ధతుల ననుసరించి అనువుగా దండిస్తే ఇహపరాలూ సిద్ధిస్తాయి. తప్పు చేస్తే బ్రాహ్మణుడిని సైతం ముఖంమీద ముద్రకొట్టి దేశంనుండి వెడలగొట్టుతాడు. దీనిని దేవతలు మెచ్చుతారు. ఆనాడు ఆ సభలో ఒంటి చీర తాల్చినదానిని, రజస్వలను అయిన నన్ను జుట్టుపట్టి ఈడ్చిన తప్పు, తన తొడలు చూపిన తప్పు. దుష్టములైన, అత్యంత కష్టములైన మాటలాడి పాటుబడజేసిన తప్పు గణించి వరుసగా తమ్ముడైన దుశ్శాసనుడిని, దుర్యోధనుడిని, అతడి ప్రియమిత్రుడైన కర్ణుడిని దండించావు; ఇది పాప మెట్లా అవుతుంది?

క. గరదుని, గృహదాహకు, మం । త్రరహస్య విభేది, వధవిధాయిఁ, బరసతీ
హరు, బంధుఘాతిఁ, బరధన । హరణ పరునిఁ, జంపి పుణ్యుఁ డగు నృపుఁ డనఘా! 95

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవైన పుణ్యాత్ముడా! (ధర్మరాజా!); గరదునిన్= విషం పెట్టేవాడిని; గృహదాహకున్= ఇల్లు తగులబెట్టేవాడిని; మంత్రరహస్య విభేదిన్= రాజకీయ తంత్రమర్మాలను బయటపెట్టేవాడిని; వధ విధాయిన్= వధను విధించేవాడిని; పరసతీహరున్= ఇతరుల భార్యలను దొంగిలించేవాడిని; బంధుఘాతిన్= బందుగులను చంపేవాడిని; పరధనహరణపరునిన్= ఇతరుల ధనాన్ని దొంగిలించటంలో ఆసక్తి కలవాడిని; చంపి= ప్రాణాలు తీసి; నృపుఁడు= రాజు; పుణ్యుఁడు= పుణ్యుడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: విషం పెట్టేవాడినీ, ఇల్లు తగులబెట్టేవాడినీ, రాజకీయ తంత్ర రహస్యాలను బయటపెట్టేవాడినీ, వధను విధించే వాడినీ, పరసతులను హరించే వాడినీ, బంధువులను చంపేవాడినీ, ఇతరుల సంపదలు దొంగిలించేవాడినీ చంపి రాజు పుణ్యుడౌతాడు ధర్మజా!

విశేషం: ఈ విశేషణాలన్నీ దుర్యోధనుడికి వర్తించటం గమనించదగిన అంశం.

క. దండార్హులైన వారల । దండింపకయున్నఁ జువ్వె ధాత్రీవిభు నా
ఖండల సన్నిభు నైనఁ బ్ర । చండపుఁ గిల్బిషము వొందు జగతీనాథా! 96

ప్రతిపదార్థం: జగతీనాథా!= భూనాథా! ధర్మజా!; దండ+అర్హులు+ఐన వారలన్= దండింప (శిక్షింప) దగినవారిని; దండింపక+ఉన్నన్= శిక్షించకుండా ఉంటే; ఆఖండల సన్నిభున్+ఐనన్= ఇంద్రుడితో సమానమైనవాడైనా; ధాత్రీవిభున్= రాజును; ప్రచండము+కిల్బిషము= మహాపాపం; పొందున్= కలుగుతుంది; చువ్వె!= సుమా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! శిక్షించదగిన వారిని శిక్షించక ఉంటే ఇంద్రతుల్యుడైన ప్రభువునకు సైతం మహాపాపం కలుగుతుంది సుమా!

క. పేదలకును సాధులకును । వేదములకుఁ దాపసులకు వేయేల సమ
స్తాదిత్యులకును దండమ । కాదె బ్రదుకుఁ జేయు రాజు గావింపంగన్. 97

ప్రతిపదార్థం: రాజు= ప్రభువు; కావింపంగన్= వర్తింపజేయగా; దండము+అ= దుష్టులను శిక్షించటమే; పేదలకును= బీదవారికీ; సాధులకును= మంచివారికీ; వేదములకున్= వేదాలకూ; వేయి+ఏల= పలుమాట లెందుకు?; సమస్త+ఆదిత్యులకున్= వేల్పులందరికీ; బ్రతుకున్+చేయున్+కాదె!= సుఖంగా జీవించేటట్లు చేస్తుంది కదా! (రక్షణ కల్పిస్తుంది కదా అని భావం).

తాత్పర్యం: రాజు ప్రవర్తింపజేసే దండం పేదలకూ, మంచివారికీ, వేదాలకూ, ఇన్ని మాట లెందుకు? దేవత లందరికి కూడా సుఖజీవనాన్ని కలిగించే రక్షగా రూపొందుతుంది కదా!

వ. కావున. 98

తాత్పర్యం: కాబట్టి.

ఆ. ఉచిత దండవృత్తి నుర్వీ ప్రజాభి ర । క్షణము నోపి చేఁత గాక రాజ
వంశజునకు ధర్ముమా? భూసురార్హంబు । లైన శమదమాదు లాత్మ నిడుట.' 99

ప్రతిపదార్థం: ఉచిత దండవృత్తిన్= యోగ్యమైన దండ ప్రవృత్తితో; ఉర్వీ ప్రజా+అభిరక్షణమును= భూ ప్రజలను రక్షించటం; ఓపి= సామర్థ్యంతో; చేఁతగాక= చేయుటకాక; రాజవంశజునకున్= రాజవంశంలో పుట్టిన వాడికి; భూసుర+అర్హంబులు+ఐన= బ్రాహ్మణులకు యోగ్యాలైన; శమదమ+ఆదులు= అంతరింద్రియ, బహిరింద్రియ నిగ్రహాదులను; ఆత్మన్+ఇడుట= మనస్సులో ఉంచుకొనటం; ధర్ముమా?= ధర్మమా? (కాదని భావం).

తాత్పర్యం: పాపాత్ములను సముచితంగా శిక్షించే ప్రవృత్తి కలిగి, భూప్రజలను రక్షించే బాధ్యతను సామర్థ్యంతో చేయటంకాక రాజవంశజులు బ్రాహ్మణు లనుసరించే అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహాదులను మనసునందు పోషించటం ధర్మమా?' (ధర్మం కాదని భావం).

వ. అని యంత నిలువక చనవు మెఱసి మేలంపుఁ జందంబున. 100

ప్రతిదార్థం: అని= అని మాట్లాడి; అంతన్+నిలువక= అంతటితో ఆగక; చనవు మెఱసి= అనురాగం ఒలుకబోసి (ఎంతో సన్నిహిత భావం వెలుగొందేటట్లు మెలగి); మేలపుఁ జందంబునన్= (మేలము+చందంబునన్)= పరిహాసమాడుతున్నట్లు.

తాత్పర్యం: ఈ మాటలు పలికి, అంతటితో ఆగకుండా, బాగా చనవు తీసికొని పరిహాసమాడుతున్నట్లు (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. ' వైదిక ధర్మచారి జనవత్సల! నీ మదిఁ బట్టుకొన్న యు
న్మాదము హీనమానవు మనంబునఁ బుట్టిన వెట్టివోలె న
స్యాదులఁ దీర్చు టొప్పదు; నిజానుజ వర్గము మీఁదఁ గల్గున
త్యాదర సాంద్రసార కరుణామృత మానఁగ నిమ్ము నెమ్మదిన్.' 101

ప్రతిపదార్థం: వైదిక ధర్మచారి జనకవత్సల!= వైదిక ధర్మాలను ఆచరించే ప్రజలయందు దయాభావం కలవాడా! ధర్మరాజా!; నీ మదిన్= నీ మనస్సు; పట్టుకొన్న= ఆవహించిన; ఉత్+మాదము= పిచ్చి; హీనమానవు మనంబునన్= నీచుడైన మనిషియొక్క మనస్సులో; పుట్టిన= కలిగిన; వెట్టి పోలెన్= పిచ్చివలె; నస్యాదులన్= నస్యము మొదలైన వాటితో(పొడుములు పీల్చటం వలన); తీర్చుట= పోగొట్టటం, తీర్చటం; ఒప్పదు= తగదు; నెఱ+మదిన్= నిండు మనస్సుతో; నిజ+అనుజవర్గము మీఁదన్= నీ సోదర బృందం మీద; కల్గు+అతి+ఆదర= కలిగి ఉండే మిక్కిలి మర్యాద వలన; సాంద్ర= దట్టమైన; సార, కరుణా+అమృతము= చిక్కని దయ అనెడి అమృతం; ఆనఁగన్+ఇమ్ము= ఆస్వాదించేటట్లు చేయుము.

తాత్పర్యం: ' వైదికధర్మాలను ఆచరించే జనులపై ప్రేమకల ధర్మరాజా! నీ మనస్సున ఆవహించిన పిచ్చి సామాన్య మానవుడి మనస్సులో కలిగిన పిచ్చివలె పొడుములు పీల్చటం మొదలైన వాటివలన పోగొట్టటం సాధ్యంకాదు. నీ నిండు మనస్సును (మనసారా) నీ తమ్ముళ్ళపై ఉన్న అధికమైన చిక్కని దయ అనే అమృతాన్ని త్రాగనిమ్ము'. (నీకు కలిగిన పిచ్చికి మందు సోదరప్రేమే అని భావం).

విశేషం: అలం: ఉపమ. నస్యాదుల్ని పీల్పించి వెర్రిని కుదర్చటం లోక విదితమే!

వ. అని పలికి యిట్లనియె. 102

తాత్పర్యం: అని చెప్పి, (ద్రౌపది) మరల ఇట్లా అన్నది.

క. ' నాయట్లు వడిన యంగన । లేయెడలం గలరె? యిట్టి యేనును ధర్మా
పాయము నీకగు, ననుఁ వెఱఁ । బాయన గృహధర్మవృత్తిఁ బౌరవముఖ్యా!' 103

ప్రతిపదార్థం: పౌరవ ముఖ్యా!= పురువంశంలో పుట్టిన వారిలో శ్రేష్ముడా! ధర్మరాజా!; నా+అట్లు= నా వలె; పడిన= అగచాట్లు పడ్డ; అంగనలు= స్త్రీలు; ఏ+ఎడలన్= ఎక్కడకూడా; కలరు+ఎ?= ఉన్నారా? (లేరని భావం); ఇట్టి= ఇటువంటి; ఏనును= నేను కూడా; నీకున్= నీకు (ధర్మరాజుకు); ధర్మ+అపాయము= ధర్మహాని; అగున్= ఔతుంది; అను= అనే; వెఱన్= భయంతో; గృహధర్మ వృత్తిన్= కుటుంబ ధర్మాన్ని నిర్వహించే స్వభావాన్ని; పాయను+అ= వదలిపెట్టను.

తాత్పర్యం: 'ధర్మరాజా! నా వలె కష్టాలు పడిన వనితలు ఎక్కడైనా ఉన్నారా? ఇటువంటి నేను నీ కెక్కడ ధర్మలోపం కలుగుతుందో అనే భయంతో గృహస్థ ధర్మపద్ధతిని వీడకుండా ఉన్నాను'.

వ. అని వెండియు. 104

తాత్పర్యం: అని మరల (ఇట్లా అన్నది).

క. ' కౌరవులు దమదురితమునఁ । దా రెరిసిరి; కల్మషంబు దానఁ గలదె? భూ
భారము వహింపు, బహుయ । జ్ఞారంభణ మాచరింపు మఖిలహితముగన్. 105

ప్రతిపదార్థం: కౌరవులు= దుర్యోధనాదులు; తమ, దురితమునన్= తాము చేసికొన్న పాపంవలన; తారు= తాము; ఎరిసిరి= నశించారు; దానన్= దానివలన (వారి కర్మంవలన వారు చనిపోయినందు వలన); కల్మషంబు= పాపం; కలదె?= (నీకు) కలుగుతుందా? (కలుగదని భావం); భూభారము= రాజ్యభారాన్ని (పరిపాలన బాధ్యతలను; వహింపు(ము)= పూనుము; అఖిల, హితముగన్= అందరికీ మేలు జరిగేటట్లుగా (లోక కల్యాణం కొరకు); యజ్ఞ+ఆరంభణము= యజ్ఞాలు మొదలు పెట్టి; ఆచరింపుము= చేయుము.

తాత్పర్యం: కౌరవులు తమ పాపం పండి తాము నశించారు. వారి చావునకు వారే కారకులైనప్పుడు నీకు పాపం ఎట్లా కలుగుతుంది? కాబట్టి విచారం మాని, రాజ్యపరిపాలనాన్ని చేపట్టుము; సర్వలోక కల్యాణం కలిగేటట్లు అనేక యజ్ఞాలను ఆరంభించి నిర్వహించుము.

క. సురగురుఁడును శుక్రుండును । బరిపాటిగ దండనీతిఁ బలికిరి దానం
బరిణతుఁడవు; నీ వనుజులు । పరికరముగ నడపు ధర్మభాసుర! దానిన్.' 106

ప్రతిపదార్థం: ధర్మభాసుర!= ధర్మాచరణంచేత ప్రకాశించేవాడా! ధర్మరాజా!; సురగురుఁడును= దేవతలకు గురువైన బృహస్పతీ; శుక్రుండును - (రాక్షస గురువైన) శుక్రాచార్యుడూ; దండనీతిన్= యుద్ధంలో పాటించవలసిన రాజనీతిని గురించి; పరిపాటిగన్= క్రమంగా; పలికిరి= చెప్పి ఉన్నారు; దానన్= ఆ రాజనీతిలో; పరిణతుఁడవు= పండితుడవు (మంచి అనుభవమున్నవాడవు); దానిన్= ఆ రాజనీతిని; నీవు= (ధర్మరాజా!); అనుజులు= తమ్ములు (భీమాదులు); పరికరముగన్= సాధనంగా, ఉపకరణంగా; నడపు(ము)= సాగించుము.

తాత్పర్యం: ధర్మరాజా! బృహస్పతీ, శుక్రాచార్యుడూ యుద్ధనీతిని ప్రచురంగా తెలియచెప్పారు. ఆ నీతిలో నీవు మంచి అనుభవజ్ఞుడవు. దానిని నీ తమ్ములను ఉపకరణాలుగా చేసికొని ఆచరణలో పెట్టుము'.

వ. అనినం బాంచాలితో మఱుమాట లాడక యూరకయున్న యన్నరేంద్రునకు నింద్రనందనుం డిట్లనియె. 107

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పాంచాలితోన్= ద్రౌపదితో; మఱు మాటలు+ఆడక= సమాధానపు మాటలు పలుకకుండా; ఊరక+ఉన్న= మిన్నకున్న; ఆ+నర+ఇంద్రునకున్= ఆ రాజుకు - ధర్మరాజుతో; ఇంద్రతనయుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పాంచాలి అనగా, ఆమెతో మారుపలుక కుండా ధర్మరాజు మిన్నకున్నాడు. అప్పుడు ఆయనతో అర్జునుడు ఇట్లా అన్నాడు.

సీ. ' దక్షుఁడై భూపతి దండనీతి నయింప । కున్న సన్న్యాసులు నుత్పథ ప్ర
వర్తను లగుదురు; వావిరి నన్యోన్య । ధనధాన్య పశుభూమి దారహరణ
మాచరింతురు జను; లప్పాప మవ్విభు । నొందు; దండము హింసయుఁగఁ దలంప
వలదు; దుర్వృత్తుల వధియించు రుద్రుని । గోవిందు వాసవు గుహునిఁ జూడు;

తే. మా మహాత్ములు దక్కు నున్మార్గ చరుల । దండితులఁ జేత వినమె! యధర్మ మడంగు;
ధర్మ మెసఁగు దండమున నర్థంబుఁ గామ । మును నదూష్యంబులై సిద్ధిఁ బొందు నధిప! 108

ప్రతిపదార్థం: అధిప!= రాజా! (ధర్మరాజా!); భూపతి= రాజ్యాన్ని పాలించే రాజు; దక్షుఁడు+ఐ= సమర్థుడై; దండనీతి= యుద్ధనీతిని; నయింపక+ఉన్నన్= ఆచరించకపోతే (నడిపించకపోతే); సత్+న్యాసులున్= సన్న్యాసాశ్రమం తీసికొన్న వారుకూడా; ఉత్+పథ, ప్రవర్తనులు= గర్వమార్గంలో నడిచేవారు; అగుదురు= ఔతారు; జనులు= ప్రజలు; వావిరిన్= అధికంగా; అన్యోన్య, ధన, ధాన్య, పశు, భూమి, దార హరణము= ఒకరి ధనాన్ని, పంటలను, పశువులను, భూమిని, భార్యను మరొకరు దొంగిలించటం; ఆచరింతురు= చేస్తారు; ఆ+పాపము= ఆ విధంగా ప్రజలుచేసే పాపం; ఆ+విభున్= ఆ రాజును; ఒందున్= పొందుతుంది; దండము= యుద్ధం చేయటం - దండోపాయం; హింసయుఁగన్= హింసగా; తలంపన్‌వలదు= భావించవద్దు; దుఃవృత్తులన్= దుర్మార్గులను; వధియించు= చంపే; రుద్రునిన్= రుద్రుడిని; గోవిందున్= విష్ణువును; వాసవున్= ఇంద్రుడిని; గుహునిన్= కుమార స్వామిని; చూడుము= కనుగొనుము; ఆ+మహాత్ములు= ఆ గొప్పవారు; తక్కున్= మిగిలిన; ఉత్+మార్గచరులన్= చెడునడవడికతో మెలగే వారిని; దండితులన్+చేఁత= శిక్షింపబడిన వారినిగా చేయటం; వినము+ఎ?= విని ఉండలేదా?; దండమునన్= దండంచేత; అధర్మము= అన్యాయం; అడఁగున్= నశించిపోతుంది; ధర్మము+ఎసఁగున్= ధర్మం అతిశయిస్తుంది; అర్థంబున్= ధనసంపాదన రూపమైన అర్థ పురుషార్థం; కామమును= కామపురుషార్థం; అదూష్యంబులు+ఐ= నిందలేనివై; సిద్ధిన్+పొందున్= ఫలితాన్ని పొందుతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! పాలకుడు సమర్థుడై దండనీతిని పాటించకపోతే సన్న్యాసులు కూడా అక్రమమార్గాలను అనుసరిస్తారు. ప్రజలు ఒకరి ధనాన్ని, ధాన్యాన్ని, పశువులను, భూమిని, భార్యలను మరొకరు అపహరిస్తారు. వాటివలన కలిగే పాపం ఆ రాజుకు చెందుతుంది. దండనీతిని హింసగా భావించవద్దు. రుద్రుడు, విష్ణువు, ఇంద్రుడు, గుహుడు మొదలైనవారిని చూడుము - ఎట్లా అవినయ ప్రవృత్తులైనవారిని దండిస్తారో? ఆ మహాత్ములు ఆ విధంగా మిగిలిన దుర్మార్గులను దండించటం చేతనే ఆయా గౌరవాలను పొందుతున్నారు. దండనీతివలన అధర్మం అణగారుతుంది. ధర్మం వర్ధిల్లుతుంది. అర్థకామాలు నిందలపాలు కాకుండా ఫలవంతా లౌతాయి.

వ. దండంబున సకల జన శ్రీరక్షణంబు సేయంబూనిన భూనాథునకయేల యోగ్యహింసకుం దొలంగ నెట్టివారికి వశంబుగా; దవధరింపుము. 109

ప్రతిపదార్థం: దండంబునన్= దండనీతిచేత; సకల, జన, శ్రీ, రక్షణంబు= ప్రజలందరి సంపదను కాపాడటం; చేయన్+పూనిన= చేయటానికి పూనుకొన్న; భూనాథునకున్+అ= రాజునకు మాత్రమే; ఏల?= ఎందుకు? (రాజుకు మాత్రమే కాదని భావం); యోగ్యహింసకున్= ఉచితమైన హింసనుండి; తొలంగన్= ప్రక్కకు పోవటానికి; ఎట్టివారికిన్= ఎటువంటి వారికైనా సరే; వశంబు, కాదు= వీలుకాదు; అవధరింపుము= (దానికి సమాధానం నేను చెప్పుతాను) వినుము.

తాత్పర్యం: దండనీతి నాశ్రయించి ప్రజలందరి సంపదను రక్షించే రాజుకే కాదు ఉచితమైన హింసనుండి తప్పించుకొనటానికి ఎవరికైనా వీలుండదు. ఎందువలన అంటే నేను చెప్పుతాను వినుము.

ఉ. కాయలఁ బండ్ల నీళులను గల్గవె సూక్ష్మపు జంతువుల్? మునుల్
సేయరె హింస వాని? నుపజీవితఁ ద్రవ్వరె కందమూలముల్?
నీ యెడఁ జూడు! ప్రాణములు నిల్వఁగ నేర వహింస నేరికిన్;
వేయును నేల? భక్ష్యముగ వేధ విధింపఁడె ప్రాణిఁ బ్రాణికిన్? 110

ప్రతిపదార్థం: సూక్ష్మపు జంతువుల్= (నులి) చిన్న పురుగులు సూక్ష్మజీవులు; కాయలన్= చెట్ల కాయలలో; పండ్లన్= పండ్లలో; నీళులను= నీళ్ళలో; కల్గవె?= ఉండవా?; మునుల్= ఋషులు; వానిన్= ఆ సూక్ష్మజీవులను; హింస, చేయరె?= చంపరా?;

కందమూలములన్= కందమూలాలను, దుంపలను; ఉపజీవితన్= వాటిమీద వారు ఆధారపడి ఉండటంచేత; త్రవ్వరె?= వాటిని త్రవ్వివేయరా?; నీ+ఎడన్= నీ పక్షంలో; చూడు(ము)= గమనించుము; ఏరికిన్= ఎవ్వరికీ; అహింసన్= హింసచేయకుండా ఉండటంచేత; ప్రాణములు= ప్రాణాలు; నిల్వఁగన్ నేరవు= నిలువజాలవు; వేయును+ఏల?= పెక్కుమాట లెందుకు?; వేధ= బ్రహ్మదేవుడు; ప్రాణికిన్= ఒక ప్రాణికి; ప్రాణిన్= మరొక ప్రాణిని; భక్ష్యముగన్= తినదగిన ఆహారంగా; విధింపఁడె?= నియమించడా?

తాత్పర్యం: కాయలలో, పండ్లలో, నీళ్ళలో సూక్ష్మజీవులు పుట్టవా? వాటిని మునులు హింసించరా? వారు కందమూలాలను త్రవ్వి వాటిపై జీవించటం లేదా? ఇక నీ పక్షంలో చూడుము. అహింస పాటించినట్లయితే ఎవరికైనా ప్రాణాలు నిలుస్తాయా? ఇంక పలుమాట లెందుకు? బ్రహ్మదేవుడే ఒకప్రాణికి మరొక ప్రాణిని ఆహారంగా ఏర్పాటు చేయలేదా?

క. వినుఁ! పశుహింసా కృతయా । గ నిరూఢుని ధర్మపరునిఁగా వేదంబుల్
గొనియాడెడు సముచిత హిం । సన మరయ నహింస గాన జగతీనాథా! 111

ప్రతిపదార్థం: జగతీనాథా!= రాజా! ధర్మరాజా!; వినుఁ= వినుము; అరయన్= పరిశీలించగా; సముచిత, హింసనము= యోగ్యమైన హింస; అహింస= అహింసయే; కాన= కాబట్టి; పశు, హింసా, కృత, యాగ, నిరూఢునిన్= జంతువులను బలిఇస్తూ చేసే యజ్ఞాలను చేయటంలో నిమగ్నుడైనవాడిని; ధర్మపరునిన్+కాన్= ధర్మాన్ని ఆచరించే వాడిగా; వేదంబుల్= వేదాలు; కొనియాడెడున్= కీర్తిస్తాయి.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. పరిశీలించి చూస్తే యోగ్యమైన హింస అహింసయే ఔతుంది. అందువలననే, జంతుబలు లిచ్చే యాగాలను చేసే నిష్ఠాపరులను వేదాలు ధర్మపరులుగానే కొనియాడుతున్నాయి.

క. అరివీరుల ఘోరంబగు । దురమున వధియించుటేల దోసం బయ్యెన్?
ధరణీశ! పాండు పాలిత । ధరావలయ మాసపడుట దగదే నీకున్? 112

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= ప్రభువా! - ధర్మరాజా!; ఘోరంబు+అగు= దారుణమైన; దురమునన్= యుద్ధంలో; అరివీరులన్= శత్రువీరులను; వధియించుట= చంపటం; ఏల= ఎట్లా; దోసంబు+అయ్యెన్?= తప్పు అయింది?; పాండు, పాలిత, ధరా, వలయము= పాండురాజుచేత పాలించబడిన భూ మండలాన్ని; నీకున్= నీకు; ఆసపడుట= కోరటం; తగదు+ఏ?= తగదా? న్యాయం కాదా?

తాత్పర్యం: ధర్మరాజా! భయంకరమైన యుద్ధంలో శత్రువీరులను చంపటం దోషం ఎట్లా ఔతుంది? పాండురాజు పాలించిన భూమండలాన్ని నీవు ఆశించటం న్యాయం కాదా? (న్యాయమే అని భావం).

క. ఇల నీ కైకొన్న తెఱఁగు । దలఁపఁగ ధర్మంబొ కాదొ దైవం బెఱుఁగున్;
వలవని చింత యుడిగి ధృతి । దలకొని పాలింపు యజ్ఞదక్షుఁడ వగుచున్.' 113

ప్రతిపదార్థం: ఇలన్= ఈ నేలను, రాజ్యాన్ని; నీ+కైకొన్న= నీవు తీసికొన్న; తెఱఁగు= విధానం; తలఁపఁగన్= ఆలోచించగా; ధర్మంబు+ఒ?కాదు+ఒ?= న్యాయమో?, అన్యాయమో?; దైవంబు+ఎఱుఁగున్= దేవుడికి తెలుసు; వలవని= కూడని; చింత= విచారాన్ని; ఉడిగి= మాని; ధృతి= ధైర్యం; తలకొని= వహించి; యజ్ఞదక్షుఁడవు+అగుచున్= యాగాలు చేయటంలో సమర్థుడవౌతూ; పాలింపుము= రాజ్యాన్ని ఏలుము.

తాత్పర్యం: ఈ నేలను నీవు గ్రహించిన విధానం ధర్మమో, అధర్మమో ఆ దేవు డెరుగును. కూడని ఈ విచారాన్ని మానుకొమ్ము. యజ్ఞాలను నిర్వహిస్తూ సామర్థ్యంతో ధైర్యంతో రాజ్యాన్ని పాలించుము'.

క. అని పలుకు పార్థ పలుకులు । విని పలుకక యున్న మనుజవిభుదెసఁ గోపిం
చిన తన మది వెడఁ గుడుపుచు । ననిలసుతుం డిట్టు లనియె నాతనితోడన్. 114

ప్రతిపదార్థం: అని పలుకు, పార్థ, పలుకులు= అని అంటున్న అర్జునుడి మాటలు; విని; పలుకక+ఉన్న= మాటాడకుండా ఉన్న; మనుజ విభు దెసన్= రాజు (ధర్మరాజు) మీద; కోపించిన= కోపపడిన; తనమదిన్= తన మనస్సును; వెడఁగు+ఉడుపుచున్= వికారాన్ని పోగొట్టుకుంటూ; అనిలసుతుండు= భీముడు; అతనితోడన్= ధర్మరాజుతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అనునయంగా చెప్పిన అర్జునుడి మాటలు విని మాట్లాడకుండా ఉన్న ధర్మరాజు పట్ల కోపం తెచ్చుకొన్న తన మనోవికారాన్ని వదలి భీముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

ఉ. ‘ నీవు సమస్త ధర్మ పరినిశ్చయవేదివి; నీ చరిత్ర మే
మే వసుధేశ! వంక యని మెచ్చక చక్కఁగఁ జేయువార మే
నీ వచన ప్రపంచముల కింకఁ జొరం జొర నంచు నుండియున్
వావిరిఁ జెప్పఁగా వలసె వాలిన దుఃఖము దాల్మిఁ గ్రాఁచినన్. 115

ప్రతిపదార్థం: వసుధా+ఈశ= భూమిపతీ! ధర్మరాజా!; నీవు; సమస్త ధర్మ= అన్ని ధర్మాలను; పరినిశ్చయ= పూర్తిగా (చక్కగా, సరిగా) నిర్ధారించటంలో; వేదివి= పండితుడవు; ఏమే= మేమా; నీ చరిత్రము= నీ నడవడికను; వంక+అని= నెపం (కారణం) అని, లోపమని; మెచ్చక= మెచ్చుకొనక; చక్కఁగన్= ముక్కు సూటిగా; చేయువారము?= చేయగలిగినవారము (కామని భావం); ఏను= నేను; ఈ వచన ప్రపంచములకున్= ఈ వాక్యసమూహాలకు; ఇంకన్= ఇటుపైన; చొరన్+చొరన్= ప్రవేశింపనే ప్రవేశింపను; అంచున్+ఉండియున్= అంటూ ఉండి కూడా; వాలిన దుఃఖము= పైన కమ్మిన శోకం (బాధ); తాల్మిన్= ఓర్పును; క్రాఁచినన్= మరుగుపెట్టగా; వావిరిన్= క్రమంగా, నెమ్మదిగా; చెప్పఁగాన్+వలసెన్= చెప్పవలసి వచ్చింది. (మాటాడక తప్పలేదని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! నీవు అన్నిధర్మాలూ సంపూర్ణంగా నిర్ధారించటం తెలిసినవాడవు. మేమా, నీ చరిత్రకు వంకపెట్టి చక్కబెట్టేవాళ్ళం! నేను (భీముడు) నీ మాటల విస్తారంలో ఇంక జోక్యం కలగజేసికొనగూడదని ఉండి కూడా, అమితమైన దుఃఖం నా ఓర్పును నశింపజేయటంవలన చెప్పవలసి వచ్చింది.

వ. అవధరింపుము. 116

తాత్పర్యం: వినుము.

క. ఒడఁగూడిన సామ్రాజ్యము । నడలున దిగఁ ద్రావి చనిన నఖిల జనులు నిన్
గడుఁ బేదమనసువాఁ డని । చెడనాడుదు రనిన, మము నిసీయను టరుదే! 117

ప్రతిపదార్థం: ఒడఁగూడిన= సమకూరిన; సామ్రాజ్యము= విశాలమైన రాజ్యం; అడలునన్= భయంతో; దిగన్+త్రావి= దిగవిడిచి, వదలి; చనినన్= పోతే; నిఖిలజనులు= ప్రజలందరూ; నిన్= నిన్ను; కడున్+పేదమనసువాఁడు+అని= మిక్కిలి పిరికి మనసు కలవాడని; చెడన్+ఆడుదురు= తిట్టుతారు; అనినన్= అనగా; మమున్= మమ్ములను; ఇసీ!= ఛీ! అని; అనుట= అనటం; అరుదే?= అరుదా? ఆశ్చర్యమా?

తాత్పర్యం: లభ్యమైన సామ్రాజ్యాన్ని భయంతో వదలి వెళ్ళినట్లైతే, ప్రజలంతా నిన్ను పిరికివాడని చులకనగా మాట్లాడతారు. అటువంటప్పుడు మమ్ములను ఛీత్కరించటంలో ఆశ్చర్యం ఉండదు.

మ. కపటద్యూతమునం బరాభవము రాఁగా సూనృతం బూఁది భూ
మిప! మమ్ముం జులుకంగఁ జేసి నినుఁ బేర్మిం బాపికొంచున్ దురం
తపు దుఃఖంబుల కోర్చి పోయి; తది యుద్ధక్రీడ నప్పాపక
ర్మపు జాతిం దెగటారఁ జేయఁగఁ బ్రకీర్త్యం బయ్యె లోకంబులన్. 118

ప్రతిపదార్థం: భూమిప! రాజా! ధర్మరాజా!; కపట ద్యూతమునన్= వంచనతో కూడిన జూదంలో; పరాభవము= అవమానం; రాఁగాన్= కలుగగా; సూనృతంబు= పుణ్యాన్ని, సత్యాన్ని; ఊఁది= ఊతగా తీసికొని; మమ్ముల్= మమ్ములను; చులుకంగన్+చేసి= తేలికపరిచి; నినున్= నిన్ను; పేర్మిన్= ప్రీతితో, గొప్పతనం నుండి; పాపికొంచున్= దూరం చేసికొంటూ; దురంతపు(ము)= భరించరాని; దుఃఖంబులకున్= కష్టాలకు; ఓర్చి= సహించి; పోయితి(వి)= వెళ్ళావు; అది= ఆ విధంగా కష్టాలకు ఓర్వటం; యుద్ధక్రీడన్= యుద్ధమనే ఆటలో; ఆ+పాపకర్మపు జాతిన్= ఆ పాపిష్టి వర్గాన్ని (కౌరవ సమూహాన్ని); తెగటారన్+చేయఁగన్= చంపటంచేత; లోకంబులన్= లోకాలలో; ప్రకీర్త్యంబు+అయ్యెన్= గొప్పగా కీర్తించదగినదైనది.

తాత్పర్యం: ధర్మరాజా! మాయాద్యూతంలో ఓడిపోవటం వలన అవమానాల పాలు కాగా, సత్యాన్ని అవలంబించి గ్రహించి, మమ్ములను చులకన చేసి, నీ ఘనతను వదలుకొని, భరించలేని కష్టాలను సహించావు, యుద్ధక్రీడలో దుష్కర్మలు చేసినవారిని చంపటంతో, నీ సత్యనిరతి అన్ని లోకాలలో కీర్తించ దగినదయింది.

వ. దుర్జయులగు విరోధుల నిర్జించి యుపార్జించిన పృథివీప్రముఖ పదార్థంబులు నిరర్థకంబులు సేసి వనంబునకుం
జను చులుకఁదనం బేమిటం బాపికొనువాఁడ? వట్లుం గాక. 119

ప్రతిపదార్థం: దుర్జయులు+అగు= జయించ సాధ్యంకానివారైన; విరోధులన్= శత్రువులను; నిర్జించి= జయించి; ఉపార్జించిన= సంపాదించిన; పృథివీ, ప్రముఖ, పదార్థంబులు= భూమి (రాజ్యం) మొదలైన వస్తువులను; నిరర్థకంబులు చేసి= పనికిమాలిన వాటినిగా చేసి; వనంబునకున్= అరణ్యానికి; చను= వెళ్ళే; చులుకఁదనంబు= తేలికతనం; ఏమిటన్= దేనితో; పాపికొనువాఁడవు?= పోగొట్టుకొంటావు?; అట్లున్+కాక= అట్లా కాకుండా, అంతే కాకుండా.

తాత్పర్యం: అసాధ్యులైన శత్రువులను జయించి సంపాదించిన సామ్రాజ్యం మొదలైన పదార్థాల నన్నింటినీ పనికిమాలిన వాటినిగా చేసి అరణ్యానికి (వెళ్ళటం అని భావించే) చులుకనతనాన్ని ఏ విధంగా పోగొట్టుకొంటావు? అంతేకాక. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఆ సభలోఁ బడినట్టి బన్నంబును, । నడవులఁ దిరిగెడు నవుడు దుష్ట
దైత్యులచేత సైంధవునిచే నొఱపులఁ । బడ్డ విషాదంబుఁ, బరమ ధైర్య
మున కోర్చి కొలిచి మాత్స్యుని పాల నున్న । దుఃఖంబును, ద్రోహులఁ గనుపుగొట్టి
వెలువరించెద నని తలఁచి కృష్ణుని నిశ్చ । యంబూఁది ధర్మంబ యగుటఁ దెలిసి

తే. రణ మొనర్చితి; నిను ధార్తరాష్ట్ర లొండె । నీవు వారల నొండెను జావఁ జూడ
వలయు టప్పు డెఱుంగవే వసుమతీశ! । యిప్పు డడలుట నింద్యంబ; యింత నిజము. 120

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూమికి ప్రభువైనవాడా! ధర్మరాజా!; ఆ+సభలోన్= అలనాటి (మాయాద్యూత) సభలో; పడినట్టి= పొందిన; బన్నంబును= అవమానమున్నూ; అడవులన్= అరణ్యాలలో; తిరిగెడు+అపుడు= తిరిగేటప్పుడు; దుష్టదైత్యుల చేతన్= దుర్మార్గులైన రాక్షసుల వలన; సైంధవునిచేన్= సైంధవుడివలన; ఒఱపులన్+పడ్డ= ఇబ్బందులు పడిన; విషాదంబున్=

దుఃఖాన్నీ; పరమ, దైన్యమునకున్+ఓర్చి= మిక్కిలి తక్కువతనానికి సహించి; కొలిచి= సేవించి; మాత్స్యుని పాలన్+ఉన్న= మత్స్యదేశానికి రాజైన విరాటుడి వద్ద (కొలువులో) ఉన్నప్పటి; దుఃఖంబును= బాధనూ; ద్రోహులన్= మనకు కీడుచేసిన (కౌరవులను) వారిని; కనుపు+కొట్టి= ఖండించి, సంహరించి; వెలువరించెదన్+అని= తొలగించి వేస్తానని; తలఁచి= అనుకొని; కృష్ణుని, నిశ్చయంబు+ఊఁది= శ్రీకృష్ణుడి నిర్ణయాన్ని ఆధారంగా చేసికొని; ధర్మంబు+అ= న్యాయమే; అగుటన్= అయి ఉండటాన్ని; తెలిసి= గ్రహించి; రణము= యుద్ధాన్ని; ఒనర్చితి(వి)= చేశావు; నినున్= నిన్ను (ధర్మరాజును); ధార్తరాష్ట్రులు+ఒండెన్= కౌరవులు కాని; నీవు= (ధర్మరాజు); వారలన్+ఒండెన్= కౌరవులను గాని; చావన్+చూడన్+వలయుట= చావగా తప్పక చూడాలని అనుకొనటం; అప్పుడు= ఆ యుద్ధం మొదలు పెట్టేటప్పుడు; ఎఱుంగవు+ఏ?= ఎరుగవా? (తెలియదా?); ఇప్పుడు= ఈ సమయంలో; (ఇంత జరిగిన తరువాత); అడలుట= దుఃఖించటం; నింద్యంబు+అ= నిందించదగిందే; ఇంత= ఇది మాత్రం; నిజము= సత్యం.

తాత్పర్యం: ఆనాటి కౌరవసభలో పడిన కష్టం, అరణ్యాలలో తిరిగే సమయంలో, దుర్మార్గులైన రాక్షసులు, సైంధవుడు పెట్టిన బాధలవలన కలిగిన దుఃఖం, మిక్కిలి హీనత్వాన్ని ఓర్చుకొని మత్స్యదేశపు రాజైన విరటుడి కొలువులో ఉన్నప్పటి శోకం, తమకు కీడుచేసిన కౌరవులను సంహరించి పోగొట్టాలని అనుకొని, కృష్ణుడి నిర్ణయాన్ని అవలంబించి, అది ధర్మమే కావటం తెలిసి యుద్ధం చేశావు. నిన్ను కౌరవులో, నీవు కౌరవులనో చంపటం తప్పదన్న సంగతి నీకప్పుడు తెలియదా? ఇప్పుడు దుఃఖించటం నింద్యం. ఇది నిజం.

క. పను లేము సేయఁగా దు । ర్జనులం జెఱుచుచును, సాధుజనుల మనుచుచున్
జననాథ! మహాయజ్ఞము । లొనర్చుచును, వెలయు కురు కులోత్తంసమవై'. 121

ప్రతిపదార్థం: జననాథ!= రాజా! ధర్మరాజా!; ఏము= మేము (భీమాదులు); పనులు= చేయవలసిన పనులు; చేయఁగాన్= చేస్తూ ఉండగా; దుర్జనులన్= దుర్మార్గులను; చెఱుచుచును= నశింపచేస్తూ; సాధుజనులను= మంచివారిని; మనుచుచున్= రక్షిస్తూ; మహాయజ్ఞములు+ఒనర్చుచును= గొప్ప గొప్ప యజ్ఞాలుచేస్తూ; కురుకుల ఉత్తంసమవు+ఐ= కురువంశంలో శ్రేష్ఠుడవై; వెలయు(ము)= ప్రకాశించుము.

తాత్పర్యం: ధర్మరాజా! మేమందరమూ నీవు చెప్పిన పనులను చేస్తూ ఉండగా, నీవు దుర్మార్గులను చెండాడుతూ, మంచివారిని రక్షిస్తూ గొప్ప గొప్ప యాగాలను చేస్తూ కురువంశంలో శ్రేష్ఠుడవై ప్రకాశించుము'.

వ. అనిన విని ధర్మతనయుం డిట్లనియె. 122

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు ఇట్లా అన్నాడు:

చ. ' మదమును రాగమున్ భయము మానము లోనగు కిల్బిషంబులన్
హృదయముఁ జొన్పి భూజనుల నేలుట మేలని పల్కె; దార్తికా
స్పదమని రార్యు లామిషముపై తగు; లిమ్మహియెల్ల నేలినం
దుది నరకం బొకండ; నృపతుల్ సుఖులే? యుపశాంతి యొప్పదే! 123

ప్రతిపదార్థం: మదమును= గర్వమూ; రాగమున్= అనురాగమూ, అభిలాషా; భయము= భయమూ, వెరపూ; మానము= అభిమానం, అహంకారం; లోన్+అగు= మొదలైన; కిల్బిషంబులన్= దోషాలలో; హృదయమున్+చొన్పి= మనసును ప్రవేశపెట్టి; భూజనులన్= ప్రజలను; ఏలుట= పాలించటం; మేలు+అని= మంచిదని; పల్కెదు= (నీవు) పలుకుతావు; (కాని) ఆర్యులు= పెద్దలు;

ఆమిషముపైన్= మాంసంమీది; తగులు= ఆసక్తి; ఆర్తికిన్= దుఃఖానికి; ఆస్పదము+అనిరి= చోటైనదని అన్నారు; ఈ+మహి+ఎల్లన్= ఈ భూమినంతా; ఏలినన్= పాలించినప్పటికీ; తుదిన్= చివరకు; నరకంబు= నరకం(పొందటం); ఒకండు+అ= ఒక్కటే (మిగిలేది); నృపతుల్= రాజులు; సుఖులే?= సుఖంగా ఉండగలరా? (కాదని, దుఃఖితులని భావం); ఉపశాంతి= శమనం (అంతరింద్రియ నిగ్రహం); ఒప్పదే?= తగదా? (తగునని భావం).

తాత్పర్యం: గర్వం, అనురాగం, భయం, అహంకారం అనే దోషాలను మనస్సులో నింపుకొని ప్రజలను పాలించటం మేలని నీవు పలుకుతావు. పెద్దలు రాజ్యపాలనం దుఃఖానికి చోటైనదని అంటారు. రాజ్యపాలనమంటే చేప ఎరను ఆశించి తగులుకొన్నట్లే అనిపిస్తుంది. ఒకవేళ, ఇవన్నీ పరిగణించకుండా, భూమినంతా పాలించినా చివరకు నరక మొక్కటే మిగిలేది. నిజానికి రాజులకు సుఖమెక్కడ ఉన్నది? వారికి శాంతి తగదా?

తే. కామభోగముల్ మేలనం గాదు; వాని । విడిచి చూడుము; పొందెదు విపుల సుఖము;
కాయలాకులు నీళ్ళును గాలి యనుభ । వించియున్న మునీంద్రులు వెట్టివారె! 124

ప్రతిపదార్థం: కామభోగముల్= కోర్కెలూ, భోగాలూ అనుభవించటాలు; మేలు+అనన్+కాదు= మంచివి అనలేము; వానిన్= ఆ కామభోగాలను; విడిచి= వదలిపెట్టి; చూడుము= గమనించుము; విపుల సుఖము= విస్తారమైన సంతోషాన్ని (అనంతమైన ఆనందాన్ని); పొందెదు(వు)= పొందుతావు; కాయలు+ఆకులు= పండ్లు, ఆకుకూరలు; నీళ్ళును= నీటినీ; గాలి= గాలీ; అనుభవించి+ఉన్న= తిని జీవించి ఉన్న; ముని+ఇంద్రులు= ఋషిశ్రేష్ఠులు; వెట్టివారె?= పిచ్చివారా? (తెలివి తక్కువవారా?) (కారని భావం).

తాత్పర్యం: కోరికలను తీర్చికొనటం మంచిది అనటానికి వీలులేదు. కామభోగాలను విడిచిపెడితే పొందే అనంతమైన ఆనందాన్ని నీవు గమనించుము. కాయలు, ఆకులు, నీళ్ళు, గాలి మాత్రమే తింటూ కలకాలం ఉన్న మునిశ్రేష్ఠులు పిచ్చివారా? (కాదని భావం).

క. దుర్మతు లామిషగత మగు । కర్మము వాటించి బంధకలితు లగుదు; ర
య్యూర్మి గడచి సువిచారులు । నిర్మమతను ముక్తివడయ నేర్తురు వత్సా! 125

ప్రతిపదార్థం: వత్సా!= చిన్నవాడా! భీమసేనా!; దుర్మతులు= చెడు తలపులు కలవారు; అమిషగతము+అగు= ఎరలో ఉన్న; కర్మము= చేసిన కర్మను; పాటించి= అనుసరించి; బంధ, కలితులు+అగుదురు= సంసార బంధాలతో కూడికొన్నవారు ఔతారు; సువిచారులు= జ్ఞానులు; ఆ+ఊర్మి= కెరటం, కడచి= దాటి; నిర్మమతను= మమకారాలు లేని చిత్త వృత్తితో; ముక్తిన్= మోక్షాన్ని; పడయన్ నేర్తురు= పొందగలుగుతారు.

తాత్పర్యం: నాయనా! భీమసేనా! చెడ్డవారు శరీర సంబంధమైన తాము చేసిన కర్మల ననుసరించి బంధాలలో ఇరుక్కొన్నవారవుతారు. ఎరుక గలిగినవారు ఆ వికారాలకు లోనుకాక వాటిపై మమకారం లేని వారై ముక్తసంగు లౌతారు.

విశేషం: ఊర్మి= బంధకారకమైన కోరిక. ఇది ఆరు విధాలు: 1. క్షుత్, 2. తృష్ణ, 3. శోకం, 4. మోహం, 5. జర, 6. మరణం.

వ. జనకుని వచనంబులు వినమే! వాని నీకుం జెప్పెద నాకర్ణింపుము. 126

ప్రతిపదార్థం: జనకుని= జనకమహారాజు యొక్క; వచనంబులు= మాటలు; వినము+ఏ?= మనం వినలేదా?; వానిన్= ఆ మాటలు; నీకున్= నీకు; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: జనకుడు (అనే రాజర్షి) చెప్పిన మాటలు మనం వినమా? (ప్రసిద్ధే కదా!) వాటిని నీకు చెప్పుతాను వినుము.

ఆ. ' ఒకటి దెసను దృష్ణ యొలయదు గావున । నేమి యర్థములును లేమి లేదు?
కాలఁ జొచ్చె మిథిల గాలదు నాకు నం । దొక్క డైన; నింత నిక్కువంబు.' 127

ప్రతిపదార్థం: ఒకటి దెసనున్= ఒకదానివైపు కూడా; తృష్ణ= కోరిక, ఆశ; ఒలయదు= ప్రసరించదు, పొందదు; కావునన్= కాబట్టి; ఏమి= ఎటువంటి; అర్థములును= సంపదలు కూడా; లేమి= లేకపోవటం అనేది; లేదు= లేదు; మిథిల= మిథిలానగరం; కాలన్+చొచ్చెన్= తగలబడసాగింది; (అయినా); నాకున్= నాకు, నా దృష్టిలో; అందున్= ఆ మిథిలలో; ఒక్కఁడు+ఐనన్= ఒక్కటి కూడా; కాలదు= తగలబడదు; ఇంత= ఇంతవరకు మాత్రం; నిక్కువంబు= నిజం.

తాత్పర్యం: 'దేనిమీదా కోరిక కలగదు కాబట్టి ఎటువంటి సంపదా, ప్రయోజనమూ లేకపోవట మనేది లేదు. అంటే అన్నీ ఉన్నట్లే ఉంటుంది. మిథిలానగరం తగలబడుతున్నా నా దృష్టిలో మాత్రం అందులో ఏ ఒక్క వస్తువూ తగలబడదు. ఇది నిజం'.

క. అని పలుకు జనకుఁ దెగడిరె । జను? లుల్లము శాంతిఁ బొంది సంసారం బొ
ల్లనివాఁడు నింద కర్హుం । డని పలుకుట నీక యొప్పు నధికవిచారా! 128

ప్రతిపదార్థం: అని, పలుకు= అని చెప్పే; జనకున్= జనక మహారాజును; జనులు= ప్రజలు; తెగడిరె?= నిందించారా?; అధిక విచారా!= మిక్కిలి జిజ్ఞాస కలవాడా!(ఆలోచనాపరుడా!); ఉల్లము= మనస్సు; శాంతిన్+పొంది= ప్రశాంతతనుపొంది; సంసారంబు+ఒల్లనివాఁడు= సంసారాన్ని కోరనివాడు; నిందకున్= అపకీర్తికి, పాపానికి; అర్హుండు+అని పలుకుట= యోగ్యుడని చెప్పటం; నీకున్+అ= నీకే; ఒప్పున్= తగి ఉన్నది.

తాత్పర్యం: అని చెప్పిన జనకమహారాజును ప్రజలు కాదన్నారా? నిందించారా? కాబట్టి ఓ ఆలోచనాశీలీ! మనస్సు శాంతిని పొంది సంసారబంధాన్ని త్రెంచుకొన్నవాడు నిందపొందటానికి యోగ్యుడని పలకటం నీకే తగింది.

తే. వినుము! ప్రజ్ఞాధిరూఢుఁడై వనట । దక్కి సంసృతిక్లేశపరుల భూస్థలిఁ జరించు
వారి నచలంబుపై నున్నవాఁడు । సూచునట్ల చూచుట సూవె నే ర్పమలహృదయ!' 129

ప్రతిపదార్థం: అమలహృదయ!= నిర్మలమైన మనస్సు కలవాడా! భీమసేనా!; వినుము; ప్రజ్ఞా+అధిరూఢుఁడు+ఐ= జ్ఞాని అయి; వనట+తక్కి= దుఃఖం వదలి; సంసృతి క్లేశపరులన్= సంసార దుఃఖాలలో ఆసక్తి కలవారిని; భూస్థలిన్= నేలమీద; చరించు వారిన్= తిరిగే వారిని; అచలంబుపైన్= కొండమీద; ఉన్నవాఁడు; చూచు+అట్లు+అ= చూచే విధంగానే; చూచుట= చూడటం; నేర్పు= తెలివి; చూవె!= సుమా!

తాత్పర్యం: మంచి మనసుగల భీమసేనా! వినుము. దుఃఖంనుండి దూరమై ప్రజ్ఞావంతుడైన జ్ఞాని సంసార దుఃఖాలలో ఆసక్తికలవారిని కొండమీద ఉన్నవాడు నేలమీద తిరుగుతున్నవారిని చూచేటట్లు చూడటమే నేర్పు సుమా!'

జనకున కతని సతితో నైన సంవాదం బర్జునుఁడు ధర్మజునికిఁ జెప్పుట (సం. 12-18-1)

వ. అని పలికి మఱి పలుకకున్న యప్పుడమి తేనికిం గవ్వడి యిట్లనియె. 130

ప్రతిపదార్థం: అని పలికి; మఱి= మరల; పలుకక+ఉన్న= మాట్లాడకుండా ఉన్న; ఆ+పుడమిటేనికిన్= ఆ రాజుకు, ధర్మరాజుకు; కవ్వడి= అర్జునుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని పలికి మరిం కేమీ మాట్లాడకుండా ధర్మరాజు మిన్నకుండగా అర్జునుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

క. ' జననాథ! నీవు సెప్పిన । జనక నృపాలునకు నతివిశదమానస యా
తని భార్యకు నీ క్రియ న । య్యెను సంవాదంబు; దాని నేర్పడ వినుమా! 131

ప్రతిపదార్థం: జననాథ!= రాజా! ధర్మరాజా!; నీవు+చెప్పిన= నీవు పేర్కొన్న; జనక నృపాలునకున్= జనక మహారాజుకూ; అతి, విశద, మానస= మిక్కిలి నిర్మలమైన మనస్సు కలిగిన; అతని, భార్యకున్= జనకుడి భార్యకూ; సంవాదంబు= సంభాషణం; ఈ క్రియన్= ఈ విధంగా; అయ్యెన్= అయింది; దానిన్= ఆ సంవాదాన్ని; ఏర్పడన్= స్పష్టమయ్యేటట్లు; వినుమా!= వినుము!

తాత్పర్యం: 'ధర్మరాజా! నీవు పేర్కొన్న ఆ జనకమహారాజుకు, నిర్మలమైన మనస్సు గల అతడి భార్యకూ నడుమ ఈ క్రింది విధంగా సంవాదం జరిగింది. దానిని తేటపడేటట్లు చెప్పుతాను వినుము.

వ. అమ్మహీపతి పూజ్యరాజ్యం బొల్లక విడిచి భిక్షావృత్తికి వెడలఁ జూచినం దదీయ భార్య యతని కిట్లనియె. 132

ప్రతిపదార్థం: ఆ+మహీపతి= ఆ రాజు - జనక మహారాజు; పూజ్య, రాజ్యంబు= గౌరవించదగిన రాజ్యాన్ని; ఒల్లక= అంగీకరించక; విడిచి= వదలిపెట్టి; భిక్షావృత్తికిన్= బిచ్చమెత్తుకొనటానికి; వెడలన్+చూచినన్= పోబోగా; తదీయ= అతడి; భార్య= ఇల్లాలు; అతనికిన్= అతడితో (జనకుడితో); ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఆ రాజు గౌరవించదగిన రాజ్యాన్ని గ్రహించకుండా, వదలి బిచ్చమెత్తుకొని జీవించటానికి పూనుకొనగా, ఆతడి భార్య అతడితో ఇట్లా అన్నది.

సీ. ' పుడమి యేలుట డిగ్గవిడిచి భిక్షార్థివై । పోయిన నతిథి సంపూజనంబు,
దేవ తర్పణ పితృదేవతర్పణములుఁ । గలుగునే? కాషాయములు ధరించి
ముండుఁడై నతఁ డన్నమునకు గృహంబుల । కరుగక యున్నె? గృహస్థుఁ డెల్ల
వారికి నన్నంబు గారుణ్యమునఁ బెట్టు । నన్నదానము సేఁత యధికధర్మ

ఆ. మనుట వినమె? పెట్టు నతనిఁ జేయొడ్డెడు, । వానిఁ దలఁప నందు వరుఁడు పెట్టు
వాఁడ యగుట నిక్కువం; బింత సూడక । యిట్లు దీనవృత్తి కేఁగఁ దలఁతె? 133

ప్రతిపదార్థం: పుడమి+ఏలుట= రాజ్యాన్ని పాలించటం; డిగ్గ విడిచి= వదలివేసి; భిక్షా+అర్థివి+ఐ= బిచ్చం అడుగుకొనే వాడివై; పోయినన్= పోతే; అతిథి, సంపూజనంబు= ఇంటికి వచ్చిన అతిథులను గౌరవించటం; దేవతర్పణ, పితృదేవతర్పణములున్= దేవతలకిచ్చే మంత్ర జలాలూ, పితృదేవతలకిచ్చే తర్పణాలూ; కలుగును+ఏ?= ఏర్పడతాయా?; అతఁడు= రాజ్యమేలవలసినవాడు; ముండుఁడు+ఐ= తలగొరిగించుకొన్నవాడై; కాషాయములు= కావిబట్టలు (కాషాయపు రంగు దుస్తులు); ధరించి= కట్టుకొని; అన్నమునకున్= భిక్షకొరకు; గృహంబులకున్= గృహస్థాశ్రమ వాసులు నివసించే ఇండ్లకు; అరుగక+ఉన్నె?= వెళ్ళకుండా ఉంటాడా?; గృహస్థుఁడు= గృహస్థాశ్రమంలో ఉన్న కుటుంబి (పెళ్ళాం బిడ్డలతో కలిసి ఉండేవాడు); ఎల్లవారికిన్= అందరికీ; కారుణ్యంబునన్= దయతో; అన్నంబు= అన్నాన్ని (భిక్షను); పెట్టున్= పెట్టుతాడు; అన్నదానము+చేఁత= అన్నాన్ని దానం చేయటం (అడిగినవారికి పెట్టటం); అధిక ధర్ముము= గొప్పధర్మం; అనుటన్= అనటం; వినము+ఎ?= వినమా?; పెట్టు+అతనిన్= అన్నం పెట్టే వాడినీ;

చేయి+ఒడ్డెడు వానిన్= చేయి చాచేవాడినీ; తలఁపన్= భావించగా; అందున్= వారిద్దరిలో; పెట్టువాఁడు= అన్నం పెట్టేవాడు; వరుఁడు= శ్రేష్ఠుడు; అగుట= కావటం; నిక్కువంబు= నిజం; ఇంత, చూడక= ఈ మాత్రం గమనించకుండానే; ఇట్లు= ఈ రీతిగా; దీన వృత్తికిన్= జాలిగొలిపే పద్ధతికి; ఏఁగన్+తలఁతె?= వెళ్ళాలని భావిస్తావా?

తాత్పర్యం: 'రాజ్యపరిపాలనను జారవిడిచి బిచ్చమెత్తుకొనే వృత్తిని స్వీకరిస్తే నీ ఇంటిపట్టున అతిథిపూజ లేమి కావాలి? దేవతలకూ, పితృదేవతలకూ నీ విచ్చే మంత్రజలాలూ, తర్పణాలూ ఎవ రివ్వాలి? గృహస్థుడు తలగొరిగించుకొని, కాషాయాంబరాలు కట్టుకొనికూడా భిక్షకొరకు ఇంటింటికి తిరగకుండా ఉండగలడా? గృహస్థాశ్రమంలో ఉన్న సంసారి దయతో అందరికీ అన్నం పెట్టుతాడు. ధర్మాలన్నింటిలో అన్నదానమే ఉత్తమ ధర్మం - అని లోకంలో ప్రసిద్ధంగా వినమా? అన్నం పెట్టేవాడిని, చేయి సాచేవాడినీ సరితూస్తే వారిలో అన్నం పెట్టేవాడే శ్రేష్ఠ డనటం నిజం. ఈ మాత్రం గమనించకుండా ఈ విధంగా దీనుడవై పోవాలని భావిస్తావా?

క. త్రైవిద్యులగు మహాత్ములు । నీ వలనన బ్రదుకఁ దలఁప నిష్క్రియత మెయిన్
నీ విందఱఁ జెఱిచెద; విది । దేవా! ధర్మంబు గాదు; దీని నుడుగవే! 134

ప్రతిపదార్థం: త్రైవిద్యులు+అగు= మూడు వేదాలు తెలిసినవారైన; మహాత్ములు= గొప్పవారు; నీ వలనన్+అ= నీ వలననే; బ్రదుకన్+తలఁపన్= జీవించాలని భావించగా; నిష్క్రియత మెయిన్= క్రియారాహిత్యంతో; నీవు; ఇందఱన్= ఇంతమందిని; చెఱిచెదవు= బ్రతుకులు పాడుచేస్తావు - నిరాశా పరులను చేస్తావు; దేవా!; ప్రభూ! జనక మహారాజా!; ఇది= ఈ పని; ధర్మంబు+కాదు= న్యాయం కాదు; దీనిన్= దీనిని; ఉడుగవే= వదలి పెట్టుము.

తాత్పర్యం: వేదత్రయ విదులైన మహాత్ములు నీవలననే బ్రతుకులు సాగించాలని ఆశపడుతున్నారు. నీవు క్రియారహితుడ వైతే ఇంతమంది నిరాశకు గురికాక తప్పదు. వారి బ్రతుకులు పాడుచేయకుము. ఇది ధర్మం కాదు. కాబట్టి మానుము.

తే. అధిప! మీ తల్లియుల్లంబు నడలు వెల్లి । ముంచి, సతి శోకసంతాపమూర్తిఁ జేసి
వంశవిహిత ధర్మంబుల వదలి వెడలి । పోయి యేగతిఁ బోయెదవో యెఱుంగ. 135

ప్రతిపదార్థం: అధిప!= రాజా! జనకమహారాజా!; మీ తల్లి ఉల్లంబు= మీ కన్నతల్లి మనసు; అడలు వెల్లిన్= దుఃఖప్రవాహంలో; ముంచి= ముంచి; సతిన్= భార్యను; శోక సంతాప మూర్తిన్+చేసి= దుఃఖంచేత వేదన పొందే ఆకారం కలదానిగా చేసి; వంశ విహిత ధర్మంబులన్= వంశ మర్యాదకు యోగ్యమైన ధర్మాలను; వదలి= మాని; వెడలి పోయి= దూరంగా వెళ్ళి; ఏ గతిన్= ఏ విధంగా; పోయెదవో?= ముందుకు పోగలవో? (జీవితాన్ని ఎట్లా కొనసాగిస్తావో?); ఎఱుంగన్= తెలియజాలను (నాకు తెలియటం లేదు).

తాత్పర్యం: రాజా! నీ కన్నతల్లి మనసును దుఃఖసముద్రంలో ముంచి, నీ భార్యను శోకంతో వేదనపొందే ఆర్తమూర్తిగా చేసి, వంశమర్యాద ననుసరించి చేసే ధర్మకర్మ లన్నింటినీ వదలి, దూరంగా తొలగిపోయి ఏ విధంగా నీ జీవితాన్ని సాగిస్తావో నాకు తెలియకుండా ఉన్నది.

క. చలిపందిరి చందంబున । ఫలభరితంబైన తరువుభంగిఁ బ్రజల డ
ప్పులు దీర్ప నమరియుండెడు । నలఘుచరిత్రునకు లఘుత యగునే కోరన్. 136

ప్రతిపదార్థం: చలిపందిరి= ఎండా కాలంలో దప్పిక తీర్చటానికి ఏర్పరచిన తాటాకు పందిరి (చలివేంద్రం) పానీయశాల; చందంబునన్= వలె; ఫల భరితంబు+ఐన= పండ్లతో నిండినదైన; తరువు భంగిన్= చెట్టువలె; ప్రజల= జనులయొక్క; డప్పులు=

దప్పికలు; తీర్పన్= తీర్చటానికి; అమరి+ఉండెడు= ఏర్పాటై ఉన్న; అలఘు చరిత్రునకున్= గొప్పదైన శీలం కలవాడికి; లఘుత= అల్పత్వాన్ని; కోరన్= కోరటం; అగునే?= తగునా? (తగదని భావం).

తాత్పర్యం: ప్రజల దప్పిని, ఆకలిని తీర్చటానికి అనువుగా చలిపందిరి విధంగా, పండ్లతో నిండుగా ఉన్న చెట్టువలె అమరి ఉండిన (ఇది గృహస్థాశ్రమ ధర్మం) ఉత్తమ శీలవంతుడు అల్పత్వాన్ని కోరటం తగునా?

విశేషం: అలం: ఉపమ. చలిపందిరి దప్పి తీరుస్తుంది. ఫలవృక్షం ఆకలి తీరుస్తుంది. గృహస్థుడు రెండూ తీరుస్తాడు.

వ. ఇది ధర్మవిరోధంబు, దీన మోక్షంబు గలుగుననుట నాకుం జూడ సందియం' బని చెప్పె; ననవుడు నయ్యజాతశత్రుండు పురుహూత పుత్రున కిట్లనియె. 137

ప్రతిపదార్థం: ఇది= రాజ్యపాలనను త్యజించటం; ధర్మవిరోధంబు= ధర్మానికి వ్యతిరేకం; దీనన్= దీనివలన; మోక్షంబు= మోక్షం; కలుగును+అనుట= కలుగుతుందనటం; నాకున్+చూడన్= నా దృష్టిలో; సందియంబు= అనుమానం; అని, చెప్పెను= అని అన్నది; అనవుడున్= అనగా; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు; పురుహూత పుత్రునకున్= అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: రాజ్యత్యాగం ధర్మవిరోధం. దీనివలన మోక్షం కలుగుతుందని అనటం నాకు చూడగా అనుమానంగా ఉన్నది' అని జనకుడి భార్య అన్నదని అర్జునుడు తెలిపాడు. ఆ మాటలు విని ధర్మరాజు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

మ. ' శ్రుతి వాక్యంబులు కర్మనిష్ఠ వినుతించున్; నిష్క్రియత్వంబు స
ద్గతిఁ గావించుట యూఁది చెప్పు; నిటు చిత్త ప్రక్రియల్ రెండు చో
దితముల్; వానిని వింటిమన్న కలుచన్ దీపించునే తత్త్వ సం
గత బోధంబు? సుకర్మతం గలుగు నాకం బాత్తవీరవ్రతా! 138

ప్రతిపదార్థం: ఆత్తవీరవ్రతా!= పొందబడిన (సహజమైన) వీరవ్రతం కలవాడా! అర్జునా!; శ్రుతి వాక్యంబులు= వేదవాక్యాలు; కర్మనిష్ఠన్= కర్మాచరణంలోని దీక్షను; వినుతించున్= కీర్తిస్తాయి; నిష్క్రియత్వంబు= కర్మలు చేయకుండా ఉండటం; సద్గతిన్= ఉత్తమలోక స్థితిని; కావించుట= కలిగించటం; ఊఁది= గట్టిగా నొక్కి; చెప్పున్= చెప్పుతాయి; ఇటు= ఈ విధంగా; చిత్తప్రక్రియల్= మానసిక ప్రవృత్తులు; రెండు= రెండు రకాలుగా; చోదితముల్= ప్రేరేపించబడతాయి; వానినిన్= వాటిని; వింటిమి+అన్న కలుచన్= విన్నామనే కలతవలన; తత్త్వసంగత బోధంబు= జ్ఞానంతో కూడికొన్న తెలివి; దీపించునే?= ప్రకాశిస్తుందా?; సుకర్మతన్= సత్కర్మలు చేయటంవలన; నాకంబు= స్వర్గం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'అర్జునా! వేదవాక్యాలు కర్మమార్గంలో నిష్కామయమైన జీవితం గడిపే విధానాన్ని బాగా కీర్తించాయి. అంతేకాదు. నిష్క్రియత్వం సద్గతిని కలిగిస్తుందని కూడా నొక్కి వక్కాణించాయి. ఈ విధంగా రెండు రకాలుగా చిత్తవృత్తులను వేదాలు ప్రేరేపిస్తున్నాయి. వీటి నన్నింటిని విని మనసు కలతపెట్టుకొంటే జ్ఞానవివేకం మన బుద్ధిలో వెలుగొందుతుందా? నిజానికి మంచి కర్మలు చేస్తే స్వర్గం లభిస్తుంది.

తే. తత్త్వబోధంబు గలుగు నతండు నన్నుఁ । దెగడనేరఁడు; నీవు భ్రాతృత్వ సౌహృ
దమునఁ గర్మంబు విడుచు టధర్ము వనిన । పలుకు ప్రియమ జగన్న్యాయ పథము గనుట. 139

ప్రతిపదార్థం: తత్త్వబోధంబు కలుగు నతండు= జ్ఞానబోధ కలవాడు; నన్నున్= నన్ను - ధర్మరాజును; తెగడన్ నేరఁడు= తిట్టలేడు, నిందించలేడు; నీవు= నీవు - అర్జునుడు; భ్రాతృత్వ సౌహృదమునన్= సోదర ప్రేమతో; కర్మంబు విడుచుట= కర్మ పరిత్యాగం;

అధర్మ్మవు+అనిన= అధర్మం అన్న; పలుకు= మాట; జగత్+న్యాయ పథము= లోకన్యాయ మార్గం; కనుటన్= పొందటంచేత; ప్రియము+అ= సంతోషకరమే.

తాత్పర్యం: జ్ఞానబోధ కలవాడు నన్ను తప్పుపట్టడు. నీవు సోదరప్రేమతో కర్మపరిత్యాగం అధర్మం అన్నమాట లోకన్యాయాన్ని అనుసరించి ఉండటం చేత సంతోషకరమే.

సీ. వడముడియును నీవు వాయు వాసవుల । శక్తులు ధరియించిన దుర్జయులరు;
హరి కరుణాతిశయమునఁ దత్తేజంబు । మీయందుఁ దగ సంక్రమించి యుండు;
మీరు సంగరశాస్త్ర సారపారగులరు । గాక తత్త్వజ్ఞాన ఘనమతులరె?
యనఁటికంబమునట్ల యనిరి నిస్సారత । సంసార మనఁగ నిస్సం ప్రబుద్ధు

తే. లది ప్రసిద్ధము; వినుఁ తృష్ణ యడఁచి కర్మ । వృత్తి విడిచి నిరాలంబచిత్తుఁ డైన
యాతఁడో సుఖి దోషదుఃఖాకరంబు । లగు ధనంబులు గోరెడు నతఁడొ? చెపుమ! 140

ప్రతిపదార్థం: వడముడియును= భీముడూ; నీవున్= నీవూ (అర్జునుడు); వాయు వాసవుల= వాయుదేవుడియొక్క, ఇంద్రుడియొక్క; శక్తులు= బలాలు, మహిమలు; ధరియించిన= వహించిన; దుర్జయులరు= జయించటానికి శక్యం కానివారు; హరి= శ్రీకృష్ణుడియొక్క కరుణ+అతిశయమునన్= దయా విశేషంచేత; తద్+తేజంబు= ఆతడి శక్తి ప్రకాశం; మీ+అందున్= మీలో; తగన్= ఒప్పునట్లుగా; సంక్రమించి+ఉండున్= కలిగి ఉంటుంది; మీరు= (భీమార్జునులు); సంగరశాస్త్ర సార పారగులరు= యుద్ధశాస్త్రంలోని తాత్పర్యంలో తీరం ముట్టిన వారు (పండితులు); కాక= ఔతారు కాని; తత్త్వజ్ఞాన ఘనమతులరె?= వేదాంత జ్ఞానంలో గొప్పపండితులా?; సంసారము= ఈ సంసారం; అనఁగన్= అంటే; నిస్సారత= సారం లేకపోవటంలో; అనఁటి కంబము+అట్లు+అ= అరటిబోదె వంటిదే అని; నిస్సంప్రబుద్ధులు= పరిపూర్ణమైన ఎరుక గలవారు; అనిరి= అన్నారు; అది= ఆ మాట; ప్రసిద్ధము= అందరికీ బాగా తెలిసిందే; వినుఁ= వినుము; తృష్ణ= కోర్కె, ఆశ; అడఁచి= అణచికొని; కర్మ వృత్తి= కర్మలయందు వర్తించటం (చేయటం); విడిచి= వదలి; నిరాలంబచిత్తుఁడు+ఐన= ఆధారంలేని మనఃప్రవృత్తి కలవాడైన; ఆతఁడో= వాడో; దోష దుఃఖ+ఆకరంబు+అగు= పాపాలకూ, దుఃఖాలకూ ఆధారాలైన; ధనంబులు= సంపదలను; కోరెడు+అతఁడొ= కోరేవాడో; సుఖి= సుఖంగా ఉండేవాడు; చెపుమ!= చెప్పుము.

తాత్పర్యం: భీముడు, వాయుదేవుడి శక్తిని, నీవు ఇంద్రుడి మహత్త్వాన్ని ధరించి శత్రువులకు గెలవటానికి వీలుకానివారు. అంతేకాక, శ్రీకృష్ణుడి దయావిశేషంచేత అతడి ప్రకాశంకూడా మీలో చేరి ఉన్నది. మీరు యుద్ధవిద్యలో పండితులే కాని, వేదాంత తత్త్వజ్ఞానంలో గొప్పవారు కాదు కదా! సారహీనంగా ఉండటంలో ఈ సంసారం అరటిబోదెవంటిదని ఆత్మజ్ఞానం కలిగినవారు అన్నమాట అందరికీ తెలిసినదే. కోరికలు వదలి, కర్మల నాచరించటం (కర్మసంగం) వదలి చిత్తము దేనిపై లగ్నంచేయకుండా ఉండేవాడు సుఖంగా ఉంటాడా? లేక సమస్తదోషాలకూ, బాధలకూ, నిలయమైన ధనం కోరేవాడు సుఖంగా ఉంటాడా? జాగ్రత్తగా విని (ఆలోచించి) చెప్పుము.

ఉ. ఆదటఁ బూర్వశాస్త్రముల యర్థము లారఁగఁ గ్రోలి తత్త్వసం
వేద సుధారసంబున చవిం జిరసౌఖ్యముఁ బొంద నేర కి
మ్మేదిని నెందునుం దిరిగి మేలని కర్మమ యూఁది చెప్పుచుం
గా దని శాంతి యొప్పనిదిగాఁ జెడనాడుదు రల్పబోధనుల్. 141

ప్రతిపదార్థం: అల్పబోధనుల్= మిడిమిడి జ్ఞానం కలవారు (అల్పజ్ఞానులు); ఆదటన్= ప్రేమతో, భక్తితో; పూర్వశాస్త్రముల+అర్థములు= ప్రాచీన శాస్త్రగ్రంథాలలోని తాత్పర్యాలను; ఆరఁగన్= నిండుగా, పూర్తిగా; క్రోలి= ఆస్వాదించి; తత్త్వ సంవేద సుధారసంబున=

వేదాంత జ్ఞానమనే అమృత రసంలోని; చవిన్= రుచిచేత; చిరసౌఖ్యమున్= దీర్ఘకాల సుఖాన్ని; పొందనేరక= పొందలేక; ఈ+మేదినిన్= ఈ భూమియందు; ఎందునున్+తిరిగి= ఎక్కడైనా సంచరించి; కర్మము+అ= కర్మమార్గమే; మేలు+అని= మంచిదని; ఊఁది చెప్పుచున్= నొక్కి చెప్పుతూ; కాదు+అని= అది కాదని; శాంతి= శాంతం; ఒప్పనిదిగాన్= తగినది కానట్లుగా; చెడన్+ఆడుదురు= నిందిస్తారు.

తాత్పర్యం: శ్రద్ధగా పూర్వమీమాంసా శాస్త్రాలన్నీ పూర్తిగా చదివి, వాటి అర్థాన్ని సంపూర్ణంగా ఆస్వాదించి కూడా, జ్ఞానబోధ కొద్దిగా మాత్రమే కలిగినవారు, తత్త్వజ్ఞానం అనే అమృతంలోని రుచి కారణంగా శాశ్వతసుఖాన్ని (ఆనందాన్ని) పొందలేక, భూమండలంపై ఎక్కడెక్కడో తిరిగి, కర్మమార్గమే మంచిదని నొక్కి వక్కాణిస్తూ, మరల కాదని చెపుతూ శాంతి తగదంటూ చెడుమాటలు మాట్లాడుతూ ఉంటారు.

విశేషం: ఊరక గ్రంథాలు చదివినా, వాటి అర్థం తెలిసికొన్నా ప్రయోజనం లేదు. 'బోధము' అంటే ఈ గ్రంథాలన్నీ దేని గురించి చెపుతున్నాయో ఆ జ్ఞానం ఆత్మను వెలిగించి అనుభూతం కావటం. అది 'స్వల్పం' కనుక, 'తత్త్వము' అనగా అసలు విషయం తెలియక అయోమయంలో పడి, కొంతకాలం మంచిదన్నదానినే తరువాత కాదనటం జరుగుతుంది. అందుకే 'అల్పబోధనుల'నే మాట ప్రయోగించటం జరిగింది.

క. విమల జ్ఞానులు శమమును । దమమును ద్యాగంబు శాశ్వత ప్రచురానం
దమునకు మూలము లండ్రు; ని । జముగాఁ గైకొందు రవి ప్రసన్నవివేకుల్.' 142

ప్రతిపదార్థం: విమల జ్ఞానులు= అచ్చమైన జ్ఞానం కలవారు; శమమును= అంతరింద్రియ నిగ్రహమూ; దమమును= బహిరింద్రియ నిగ్రహమూ; త్యాగంబు= త్యాగశీలమూ; శాశ్వత= స్థిరమైన; ప్రచుర= మిక్కుటమైన; ఆనందమునకున్= ఆనందం పొందటానికి; మూలములు= మొదళ్ళు, కారణాలు; అండ్రు= అంటారు; ప్రసన్న+వివేకులు= కార్యాకార్య విచక్షణా జ్ఞానం కలిగినవారు; అవి= ఆ మాటలు; నిజము+కాన్= నిజమే అని; కైకొందురు= స్వీకరిస్తారు, అంగీకరిస్తారు.

తాత్పర్యం: అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహం, త్యాగబుద్ధీ శాశ్వతమైన అధికమైన ఆనందాన్ని కలిగించటానికి హేతువులని అచ్చమైన జ్ఞానం కలవారు చెప్పారు. చక్కని విచక్షణాజ్ఞానం కలవా రామాటలు వాస్తవమని అంగీకరిస్తారు'.

వ. అనిన విని దేవస్థానుం డమ్మానవపతి కిట్లనియె. 143

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; దేవస్థానుండు= దేవస్థానుడు అనే పేరు కల ముని; ఆ+మానవపతికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలను విన్న దేవస్థానుడనే ముని ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు.

దేవస్థానుం డను ముని ధర్మజునకు హితోపదేశంబు సేయుట (సం. 12-20-1)

సీ. ధనము లుత్కృష్టంబు లను ధనంజయు మాట । పాటిగాఁ గొనుము; సోపానభంగి
నున్నది మార్గంబు యోగసమారోహ । ణమునకు; దానన నడచి కాక
వడి నుల్కిపడ నీకు వచ్చునే? ధనసంగ్ర । హంబు భోగార్థ కృతంబు దుష్ట
మగుటయుఁ గలదు; యజ్ఞార్థ కృతంబైన । నదియ నిచ్చెన బ్రహ్మపదము నొంద;

తే. యజ్ఞపరిశిష్ట ధనభోగ మాత్మకలఁక । యుడుపు; నమ్మెయి శమదమయుక్తి గలుగు;
శమము దమమును దత్త్వ విజ్ఞానదములు । గాన దక్షిణాధిక యజ్ఞకర్త వగుము. 144

ప్రతిపదార్థం: ధనములు= సంపదలు; ఉత్కృష్టంబులు+అను= శ్రేష్ఠమైనవి అనే; ధనంజయు= అర్జునుడి; మాట= పలుకును; పాటిగాన్= న్యాయమైనదిగా; కొనుము= గ్రహించుము; యోగసమారోహణమునకున్= యోగసిద్ధి పొందటానికి ఎక్కవలసిన; మార్గంబు= దారి; సోపాన+భంగిన్= మెట్లవలె; ఉన్నది= ఉన్నది; దానన్+అ= ఆ మెట్ల దారిలోనే; నడచి+కాక= పయనించినట్లయితే తప్ప; నీకున్; వడిన్+ఉల్కిపడన్= వేగంగా భయంతో కంపించటంవలన; వచ్చునే= (యోగసిద్ధి) లభిస్తుందా?; భోగ+అర్థకృతంబు= అనుభవించటమే ప్రయోజనంగా చేసిన; ధన సంగ్రహంబు= ధనాన్ని సంపాదించి కూడబెట్టటం; దుష్టము= చెడ్డది; అగుటయున్+కలదు= అవటం కూడ ఉన్నది; యజ్ఞ+అర్థ+కృతంబు+ఐన= యజ్ఞం కొరకు చేసినదైతే; అది+అ= అదే; బ్రహ్మపదమున్+ఒందన్= బ్రహ్మలోక ప్రాప్తికి; నిచ్చెన; యజ్ఞ= యాగములందు; పరిశిష్ట= మిగిలిన; ధనభోగము= ధనమును అనుభవించటం; ఆత్మ కలఁక= ఆత్మలోని కలతను; ఉడుపున్= పోగొట్టుతుంది; ఆ+మెయిన్= ఆ పద్ధతిలో; శమ+దమ+యుక్తి+కలుగన్= అంతరింద్రియ, బాహ్యేంద్రియ నిగ్రహం; దమమును= బాహ్యేంద్రియ నిగ్రహం; తత్త్వ విజ్ఞానదములు= పరతత్త్వ (బ్రహ్మ)సంబంధమైన జ్ఞానాన్ని ఇస్తాయి; కాన= అందువలన; దక్షిణా+అధిక= అధిక దక్షిణలతో యజ్ఞకర్తవు= యజ్ఞం చేసినవాడవు; అగుము= కమ్ము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! సంపదలు శ్రేష్ఠమైనవి అని చెప్పిన అర్జునుడి మాటలు తప్పక పాటించుము. యోగసిద్ధి (జీవాత్మ పరమాత్మల కలయిక) ఎక్కటానికి చక్కని మెట్లదారి ఉన్నది. ఆ దారిలో వెళ్ళితేనే తప్ప యోగసిద్ధి లభ్యంకాదు. ధనసముపార్జనం తాను భోగాల ననుభవించటానికి చేస్తే తప్పు. యజ్ఞంకొరకు చేస్తే బ్రహ్మపదం పొందటానికి నిచ్చెనవలె ఉపయోగపడుతుంది. యజ్ఞంలో వాడగా మిగిలిన ధనం వాడటం మనోవ్యాకులతను పోగొట్టుతుంది. అట్లా చేయటంవలన శమదమాలు కలుగుతాయి. శమదమాలు బ్రహ్మజ్ఞానాన్నిస్తాయి. అందువలన దక్షిణ లెక్కువగా ఉండే యజ్ఞం చేసినవాడవు కమ్ము.

చ. హరుఁడును సర్వమేధ మను యాగమునం బ్రచుర ప్రకాశతం
బొరయఁగ వేడ్కఁ జేసె విధిపూర్వ దిగీశముఖామరుల్ మహా
ధ్వరములఁ గాదె పేర్కొనుట ధాత్రి సధర్మత నేలి యజ్ఞ త
త్పరత వెలుంగరే నృపులు, పార్థివముఖ్య! మరుత్త ముఖ్యులున్. 145

ప్రతిపదార్థం: పార్థివముఖ్య!= రాజశ్రేష్ఠా! ధర్మరాజా!; హరుఁడును= శివుడుకూడా; సర్వమేధము+అను= సర్వమేధము అనే పేరుగల; యాగమునన్= యజ్ఞంతో; ప్రచుర ప్రకాశతన్+పొరయఁగన్= అధికమైన తేజాన్ని పొందటానికి; వేడ్కన్= వేడుకతో, సంబరంగా; చేసెన్= నిర్వహించాడు, చేశాడు; విధి, పూర్వదిగీశముఖామరుల్= బ్రహ్మ, ఇంద్రుడు మొదలయిన దేవతలు అందరు; మహా+అధ్వరములన్= గొప్పయజ్ఞాలవలన, కాదె= కదా!; పేర్కొనుట= కీర్తి పొందింది; మరుత్త ముఖ్యులున్= మరుత్తు మొదలైన; నృపులు= రాజులు; ధాత్రిన్= భూమిని; సధర్మతన్= ధర్మంతో, ధర్మమార్గంలో; ఏలి= పరిపాలించి; యజ్ఞతత్పరతన్= యజ్ఞం చెయ్యటంలో నిమగ్నులై; వెలుంగరే?= ప్రకాశించటం లేదా?

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడవైన ధర్మరాజా! శివుడు కూడ సర్వమేధం అనే పేరున్న యాగాన్ని చేసి కీర్తిని, తేజాన్ని పొందాడు. బ్రహ్మ, ఇంద్రుడు, మొదలైన దేవతలందరూ గొప్ప యజ్ఞాలు చేసి కదా పేరుపొందింది! మరుత్తు మొదలైన చక్రవర్తులందరూ భూమిని ధర్మమార్గంలో పాలిస్తూ యజ్ఞాలు చేసి ప్రకాశించారు కదా!

వ. వినుము దివస్పతి యడుగ బృహస్పతి సన్మార్గ నిర్దేశకుండై చెప్పిన మార్గంబు. 146

ప్రతిపదార్థం: దివస్పతి= ఇంద్రుడు; అడుగన్= ప్రశ్నించగా; బృహస్పతి= దేవగురువు; సన్మార్గ= మంచి దారిని; నిర్దేశకుండు+ఐ= చూపించినవాడై; చెప్పిన= బోధించినటువంటి; మార్గంబు= పద్ధతి; వినుము= వినుము.

తాత్పర్యం: ఇంద్రుడు అడిగితే బృహస్పతి మంచి మార్గాన్ని సూచిస్తూ చెప్పిన పద్ధతిని వినుము.

ఉ. కామముఁ గ్రోధమున్ మనసుఁ గాడఁగఁ బాఱుట మాన్చి యింద్రియ
స్తోమ విమార్గ వర్తనము ద్రుంచుచు నెవ్వగ లేక రక్షణం
బేమర కెవ్వరిం జెనకి యించుక నొంపక లోక మేలఁగా
నా మహితాత్ము సర్వమహిమాతిశయంబును జెందు వాసవా! 147

ప్రతిపదార్థం: వాసవా!= ఇంద్రుడా!; కామము= కోరిక; క్రోధమున్= కోపమూ; మనసున్= మనస్సును; కాఁడఁగన్+పారుట= కలత పెట్టటం; మాన్చి= మానిపించి, ఆపి; ఇంద్రియస్తోమ= ఇంద్రియాల సమూహం యొక్క; విమార్గ వర్తనము= చెడ్డదారులలో నడవటం; త్రుంచుచున్= (తెగవేస్తూ) అరికట్టుతూ; నెఱ+వగ= అధికమైన బాధను; లేక= పొందక; రక్షణంబు= ప్రజాసంరక్షణం, ప్రజలను కాపాడటం; ఏమరక= అశ్రద్ధ చేయక; ఎవ్వరిన్= ఎవరినీ; చెనకి= ఎదిరించి; ఇంచుక= కొద్దిగా కూడా; నొంపక= బాధించక; లోకము+ఏలఁగాన్= భూమిని పరిపాలించినట్లైతే; ఆ మహితాత్మున్= ఆ మహాత్ముడిని, ఆ మహానుభావుడిని; సర్వ= సమస్తమైన; మహిమ+అతిశయింబును= గొప్పతనం యొక్క ఆధిక్యం; చెందును= ప్రాప్తిస్తుంది.

తాత్పర్యం: అరిషడ్వర్గాలలోనివైన కామక్రోధాలను మనస్సులో వర్తించకుండా ఆపి, ఇంద్రియాలను పక్కదారులు పట్టకుండా అరికట్టి, తాను శోకం పొందకుండా ఉండి, ప్రజలను కాపాడటంలో అప్రమత్తుడై ఉండి ఎవ్వరినీ కొద్దిగా కూడా బాధించక, లోక పరిపాలన చేసే మహాత్ముడిని సమస్తమైన మహత్తరగుణాలు తమంత తాముగా వచ్చి చేరుతాయి.

వ. అనియె మఱియు నాకర్ణింపుము. 148

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; మఱియున్= ఇంకా; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఈ మాటలు చెప్పి, ఇంకా వినుమని ఇట్లా అన్నాడు దేవస్థానుడు.

ఉ. కర్మము మేలు నా విగతకర్మము మేలన రెండు నొప్పునే?
కర్మఫలంబు నర్పితముగాఁ దగ నీశ్వరునందుఁ జేత స
ద్ధర్మముగా కనంగ వివిధంబగు ధర్మపథంబులోన మేల్
ధార్మికవర్య! యేర్పఱుపఁ దా వశమే వగ బుద్ధి గుందఁగన్. 149

ప్రతిపదార్థం: ధార్మికవర్య!= ధర్మమార్గంలో నడిచేవారిలో శ్రేష్ఠుడా!; కర్మము= కర్మాచరణం; మేలు= మంచిది; నాన్= అనగా; విగతకర్మము= కర్మాచరణం లేకుండటం; మేలు= మంచిది; అనన్= అనగా; రెండున్= రెండూ; ఒప్పునే?= కుదురుతాయా?; తగన్= చక్కగా; కర్మఫలంబున్= చేసిన కర్మల యొక్క ఫలితాన్ని; ఈశ్వరున్+అందున్= పరమాత్మయందు; అర్పితముగాన్= సమర్పించే విధంగా; చేఁత= చేయటం; సత్+ధర్మము+కాక= మంచి ఆచరణీయ పద్ధతి అవుతుంది; అనంగన్= అంటూ ఉండగా; వివిధంబు+అగు= అనేకంగా విస్తరించిన; ధర్మపథంబులోనన్= ధర్మమార్గంలో; మేల్= ఇది మంచిది అని;

ఏర్పఱుపన్= నిర్ధారించటానికి; తాన్= తాను; వగన్= శ్రమతో; బుద్ధిన్= మనస్సులో; కుందఁగన్= బాధపడటం; వశమే?= శక్యమా? వీలవుతుందా?

తాత్పర్యం: 'ధర్మమార్గానువర్తివైన ధర్మరాజా! కర్మానుచరణం మంచిది, కర్మత్యాగం మంచిది అంటే - రెండూ సరైనవి ఎట్లా అవుతాయి? కర్మల నాచరిస్తూ, కర్మఫలాన్ని పరమాత్మయందు సమర్పించటం మంచి ధర్మం అవుతుంది. వివిధమైన రూపాలుగా విస్తరించిన ధర్మమార్గంలో ఏది మంచిది? అని మనసులో ఎంత విచారించినా, నిర్ధారించటం వీలవుతుందా?

విశేషం: ఇది ధర్మం అని నిర్ధారించటం కష్టం. కర్మ త్యాగంకన్నా, కర్మఫల త్యాగం శ్రేష్ఠమని చెప్పటం తాత్పర్యం.

ఉ. కావున సిద్ధసిద్ధుల వికారముఁ బొందక ద్రోహ మెయ్యెడన్
వావిరిఁ జేయ కేలు భువనంబు భవత్కుల ధర్మరక్షివై!
భూవరు లిట్లు సేసి, తుదిఁ బుత్రుల గద్దియలందు నిల్పి కా
దే వనవాసు లైరి దృఢదీప్త నిరంజన బోధసంపదన్. 150

ప్రతిపదార్థం: కావునన్= కనుక; సిద్ధి+అసిద్ధుల= కార్యం సిద్ధించినప్పుడు, సిద్ధించనప్పుడూ (జయాపజయాలలో); వికారమున్+పొందక= మనోవికారం (జయానికి పొంగటం, అపజయానికి క్రుంగటం) పొందకుండా; ద్రోహము= నమ్మించి మోసగించటం; ఏ+ఎడన్= ఎక్కడా కూడా; వావిరిన్= క్రమంగా; చేయక= చెయ్యకుండా; భవత్+కుల+రక్షివి+ఐ= నీ కులధర్మాన్ని కాపాడుతున్నవాడివై; భువనంబున్= లోకమును, భూమిని; ఏలు= పాలించుము; భూవరులు= రాజులు; ఇట్లు+చేసి= పైన చెప్పిన విధంగానే ఆచరించి; తుదిన్= చివరకు; పుత్రులన్= కుమారులను; గద్దియల+అందున్= సింహాసనాలపై; నిల్పి= కూర్చోపెట్టి; దృఢ, దీప్త, నిరంజన, బోధ, సంపదన్= స్థిరమైన, ప్రకాశవంతమైన, అమలిన, జ్ఞానబోధ అనే సంపదతో; వనవాసులు+ఐరి= వానప్రస్థాశ్రమానికి వెళ్ళారు; కాదు+ఏ!= కదా!.

తాత్పర్యం: ధర్మరాజా! అందువలన, జయాపజయాలు కలిగినప్పుడు పొంగిపోవటం, క్రుంగిపోవటం వంటి మనోవికారాలు పొందకుండా - అంటే చిత్త స్థైర్యంతో ఎవరినీ నమ్మించి మోసం చేయకుండా, నీ కులధర్మాన్ని కాపాడుకొంటూ భూమిని పరిపాలించవలసింది. పూర్వపు రాజులందరూ ఇదే విధంగా ప్రవర్తించి చివరకు కుమారులను సింహాసనంపై నిల్పి స్థిరమైన ప్రకాశవంతమైన అమలినమైన జ్ఞానబోధ అనే సంపదతో వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించారు కదా!'

వ. అనిన విని నిర్విణ్ణమానసుండై యున్న యన్నకు నర్జునుం డిట్లనియె. 151

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; నిర్విణ్ణమానసుండు+ఐ= నిర్వేదంతో కూడుకొన్న మనస్సు కలవాడై; ఉన్న= ఉండిపోయిన; అన్నకున్= అన్న అయిన ధర్మరాజుతో; అర్జునుండు+ఇట్లనియెన్= అర్జును డీ విధంగా మాట్లాడాడు.

తాత్పర్యం: దేవస్థాను డనే ముని మాట్లాడిన మాటలను విని, నిర్వేదంతో ఉన్న ధర్మరాజును చూచి; అర్జునుడు ఈ విధంగా మాట్లాడాడు.

సీ. ' క్షత్రియ ధర్మ నిష్ఠాపరత్వంబున । సమరంబు సేసితి; శస్త్రనిహతిఁ
బూతాత్ములై రిపుల్ వోయిరి సద్గతి; । కమ్మెయి రాచకర్మ మ్మొనర్చు
విప్రునకైనను సుప్రశస్తం; బది । రౌద్రం బగుట బాలురకును దెల్ల
మైనను నిట్లుండు నార్యోక్తి; నృపనీతి । దురితంబు సేయునే? యొరుఁడు వెట్టఁ

ఆ. గుడువ నృపతి మాత్రకునకును గాదన్నఁ । గౌరవాన్వయాగ్రగణ్యుఁ డైన
నీకుఁ దగునె? విడువు శోకంబు; వజ్రస । న్నిభము గాదె నృపుల నెమ్మనంబు. 152

ప్రతిపదార్థం: క్షత్రియ ధర్మ నిష్ఠాపరత్వంబునన్= రాజధర్మం పాటించటంలో నిమగ్నుడవై ఉండి; సమరంబు= యుద్ధం; చేసితి(వి)= చేశావు; శస్త్ర= ఆయుధాలచేత; నిహతిన్= చంపబడటంచేత; పూత+ఆత్ములు+ఐ= పరిశుద్ధం చేయబడిన ఆత్మలు కలవారై; రిపుల్= శత్రువులు; సత్+గతికిన్= ఉత్తమ లోకాలకు; పోయిరి= వెళ్ళారు; ఆ+మెయి= ఆ పద్ధతి; రాజకర్మమ్ము= రాచరికం; ఒనర్చు= చేసేటువంటి; విప్రునకున్+ఐనను= బ్రాహ్మణుడికి అయినా; సు+ప్రశస్తంబు= బాగా మేలైన విషయం; అది= రాజ్యపాలన, యుద్ధం చేసే విషయం; రౌద్రంబు+అగుట= మిక్కిలి భయంకరమైనది అనే సంగతి; బాలురకును= పిల్లలకు కూడా; తెల్లము= స్పష్టం, బాగా తెలుసు; ఐనను= అయినా కాని; నృపనీతి= రాజనీతి; దురితంబు= పాపం; చేయును+ఏ?= చేస్తుందా?; అని; ఆర్యోక్తి= పెద్దలమాట; ఇట్లు+ఉండున్= ఈ విధంగా ఉన్నది; ఒరుఁడు= ఇతరుడు; పెట్టన్= పెట్టగా; కుడువన్= తినటం; నృపతి మాత్రకునకును= మామూలు రాజైనవాడికి; కాదు+అన్నన్= కుదరదు అనగా; కౌరవ+అన్వయ+అగ్రగణ్యుఁడు+ఐన= కురువంశంలో మొదట లెక్కింపదగినవాడైన; నీకున్= ధర్మరాజుకు; తగునె?= సరి అయినదా? (సరిపడ దని భావం); శోకము= విచారం; విడువు= వదలిపెట్టుము; నృపుల= రాజుల; నెఱ+మనంబు= నిండుమనస్సు; వజ్ర+సన్నిభము= వజ్రాయుధంతో సమానమైనది; కాదు+ఏ= కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజధర్మాన్ని అనుష్ఠించటంలో భాగంగా యుద్ధం చేశావు. ఆ యుద్ధంలో ఆయుధాలు తగలటంతో పవిత్రులైన శత్రువులు ఉత్తమ లోకప్రాప్తిని పొందారు. ఈ విధమైన రాజధర్మ నిర్వహణ రాజ్యభారం నిర్వహించే బ్రాహ్మణుడికైనా శ్రేష్ఠమైనది. రాజ్యభారం వహించటం, యుద్ధం చేయటం, రౌద్రరసంతో కూడుకొన్నవనే సంగతి పిల్లలకైనా తెలుసు. రాజనీతిలో పాపాలు చేయటం ఉండదని ఆ పెద్దలు చెప్పేమాట. మామూలు రాజునకైనా ఇతరులు పెడుతుండగా తినటం తగదు. అటువంటిది, కౌరవవంశంలో శ్రేష్ఠుడవైన నీకు అది తగింది కాదు. కనుక శోకం వదలిపెట్టుము. రాజుల మనస్సులు వజ్రంతో సమంగా ఉండాలి సుమా! (రాజుల మనసులు వజ్రంవలె కఠినంగా మొక్కవోనివిగా ఉండాలని భావం).

వ. అట్లుంగాక. 153

తాత్పర్యం: అంతేకాక.

ఉ. వైరివధంబు నీకును నవశ్యముఁ జేయక పోవరానిదై
వైరులకున్ భవత్సమరవాంఛన సద్గతి కేఁగఁ బాలి దై
చేరె విధాతృ సంఘటనఁ; జింతకుఁ గారణమేమి? ధర్మ వి
స్తార విదుండ వీ; వకట! ధైర్య సమగ్రుఁడవై వెలుంగవే. 154

ప్రతిపదార్థం: విధాతృ= బ్రహ్మయొక్క; సంఘటనన్= కూర్పువలన (ఏర్పాటు వలన); వైరివధంబు= శత్రు సంహారం; అవశ్యమున్= తప్పక; చేయకపోవరానిది+ఐ= చేయకుండ వీలులేనిదై; నీకునున్= నీకూ (ధర్మరాజుకు); భవత్= నీతో; సమర వాంఛన్+అ= యుద్ధం చేసే కోరికతోనే; సద్గతికిన్+ఏఁగన్= మంచి లోకాలకు వెళ్ళటానికి; వైరులకున్= శత్రువులకు; పాలిది+ఐ= భాగస్థమై, వంతుగా; చేరెన్= కూడాయి (సంఘటిల్లాయి); చింతకున్= బాధపడటానికి; కారణము= హేతువు; ఏమి= ఏముంది; అకట!= అయ్యో!; ఈవు= నీవు; ధర్మ విస్తార విదుండవు= ధర్మ స్వరూపం బాగా తెలిసినవాడివి; ధైర్య సమగ్రుఁడవు+ఐ= ధైర్యంతో కూడుకొన్న వాడివై; వెలుంగవు+ఏ= ప్రకాశించుము.

తాత్పర్యం: శత్రువధ చేయక తప్పనట్లు నీకూ నీతో యుద్ధం చేయాలనే కోరికతోనే ఉత్తమగతులకు వెళ్ళటం నీ శత్రువులకూ వంతులుగా చక్కగా సంఘటిత పరచాడు బ్రహ్మ. ఇందులో బాధపడవలసిన దేముంది? నీకు ధర్మస్వరూపం బాగా తెలుసు. అందువలన ధైర్యాన్ని కూడగట్టుకొని ప్రకాశించుము.

వ. రాజధర్మోపాత్తంబై భవదాయత్తంబైన పూజ్యసామ్రాజ్యంబుఁ బరిపాలించుచుఁ బుణ్యక్రియానుష్ఠాన పరుండవగు' మని పలికిన మఱుమాట పలుక కున్న యన్నరేంద్రునకు మునీంద్ర వర్యుండగు పారాశర్యుం డిట్లనియె. 155

ప్రతిపదార్థం: రాజధర్మ+ఉపాత్తంబు+ఐ= క్షత్రియ ధర్మంతో పొందబడినదై; భవత్+ఆయత్తంబు+ఐన= నీ అధీనం అయిన; పూజ్య= పూజించదగిన; సామ్రాజ్యంబున్= మహా సామ్రాజ్యాన్ని; పరిపాలించుచున్= చక్కగా పాలనచేస్తూ; పుణ్యక్రియా= మంచి పనులు; అనుష్ఠాన పరుండవు= ఆచరించటంలో నిమగ్నుడవు; అగుము= కమ్ము; అని పలికినన్= అంటూ అర్జునుడు చెప్పగా; మఱుమాట= మరొక మాట; పలుకక+ఉన్న= మాట్లాడకుండా ఉన్న; ఆ+నర+ఇంద్రునకున్= ఆ రాజశ్రేష్ఠుడితో (ధర్మరాజుతో); ముని+ఇంద్ర+వర్యుండు+అగు= మునులలో శ్రేష్ఠుడైన; పారాశర్యుండు= వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: రాజధర్మానుసారం నీవు పొంది, నీ అధీనంలో ఉన్న మహా సామ్రాజ్యాన్ని పరిపాలిస్తూ, సత్కార్యాలు చేయటంలో నిమగ్నుడవై ఉండవలసింది' అని అర్జును డన్న మాటలకు మారుమాట్లాడకుండా ఉన్న ధర్మరాజుతో వ్యాసమహర్షి ఇట్లా అన్నాడు.

సీ. ' అర్జును పలుకు సత్యంబు సమీచీన; । మార్యజనంబు గృహస్థ ధర్మ
ముత్తమం బని చెప్పు నుర్వీశ! పశుపక్షు । లాదిగ జీవుల కాశ్రయంబు;
నృపులకు నది దక్కఁ దపమును దమమును । బ్రహ్మచర్యమును ధర్మములు గావు;
ధనములఁ దనియుట యని కోహటించుట । ప్రజల రక్షింపమి రాజకోటి

ఆ. కరయఁ బాతకంబు లండ్రు; నీ వక్కడ । వేదచోదనా ప్రవీణ మయిన
మనసు నేల యిట్ల మార్గవృత్తికిఁ జొర । నిచ్చె; దోపి ధరణి యేలు మనఘ! 156

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ!= భూమీపతీ! ధర్మరాజా!; అర్జును పలుకు= అర్జునుడు చెప్పిన మాటలు; సత్యంబు= నిజం, వాస్తవం; సమీచీనము= యుక్తం; ఆర్యజనంబు= పూజ్యులైనవారు, పెద్దలు; గృహస్థధర్మము= గృహస్థాశ్రమ ధర్మం; ఉత్తమంబు+అని= శ్రేష్ఠమని; చెప్పును= చెపుతారు; పశు+పక్షులు+ఆదిగాన్+జీవులకున్= జంతువులు, పక్షులు మొదలైన సమస్త ప్రాణులకు; ఆశ్రయంబు= శరణమైనట్టిది (అయిన); అది= ఆ గృహస్థాశ్రమధర్మం; తక్క= కాక; నృపులకున్= రాజులకు; తపమును= తపస్సును; దమమును= ఇంద్రియ నిగ్రహం; బ్రహ్మచర్యమును= బ్రహ్మచర్యాశ్రమమును పాలించటం (వివాహం చేసికొని గృహస్థాశ్రమ ధర్మాన్ని స్వీకరించక, వేదాధ్యయన పరుడై ఉండిపోవటం); ధర్మములు+కావు= ఆచరించవలసిన విధులు కావు; ధనములన్= సంపదలవలన; తనియుట= సంతృప్తిచెందటం; అనికిన్= యుద్ధానికి; ఓహటించుట= వెనకాడటం; ప్రజలన్= పాలితులను; రక్షింపమి= కాపాడకుండా ఉండటం (అనేవి); అరయన్= పరిశీలించి చూడగా; రాజకోటికిన్= రాజసమూహానికి; పాతకంబులు= నివృత్తి లేని పాపాలు; అండ్రు= అంటారు; అక్కట!= అయ్యో!; నీవు= నీవు; వేద+చోదనా+ప్రవీణము+అయిన+మనసున్= వేదములు చెప్పిన మార్గంలో నడవటంలో నేర్పుగల నీ మనస్సును; ఇట్లు= ఈ విధంగా; అమార్గవృత్తికిన్= కూడని దారిలో చరించటానికి (అపమార్గంలో నడవటానికి); ఏల= ఎందుకు; చొరన్+ఇచ్చెదు?= వెళ్ళనిస్తావు?; అనఘ!= పాపరహితుడ వైన ధర్మరాజా!; ఓపి= సామర్థ్యంతో; ధరణిని= భూమిని; ఏలుము= పరిపాలించుము.

తాత్పర్యం: 'ధర్మరాజా! అర్జునుడు చెప్పిన మాటలు నిజమైనవి, తగినవి. పూజనీయులైన పెద్దలు గృహస్థాశ్రమ ధర్మమే అన్నింటికన్న గొప్పది అని చెపుతారు. ఎందుకంటే, పశు పక్ష్యాది సమస్త ప్రాణులకు అది ఆధారం. గృహస్థ ధర్మం నిర్వహించటంకంటె రాజులకు మరొక పరమధర్మం లేదు. తపస్సు, ఇంద్రియ నిగ్రహం, బ్రహ్మచర్యం రాజధర్మాలు కావు. ఉన్న ధనంతో తృప్తి చెంది ఊరుకొనటం, యుద్ధానికి వెనకాడటం, తనపాలనలోని ప్రజలను రక్షించకుండా వదలెయ్యటం, రాజులకు నివృత్తిలేని పాపహేతువు లవుతాయి. వేద విహితమైన మార్గంలో నడవటంలో నేర్పరివైన నీవు ఈ విధంగా నీ మనస్సును అపమార్గంలోనికి పోనిస్తున్నావెందుకు? పాపరహితుడవైన ధర్మరాజా! సమర్థతతో భూమిని పాలించుము.

విశేషం: చతురాశ్రమాలు: 1. బ్రహ్మచర్యం - విద్యార్జనాకాలం; 2. గృహస్థం - వివాహితుడై ప్రజాతంతువును అవిచ్ఛిన్నంగా కొనసాగించే కాలం; 3. వానప్రస్థం - తన విధులు, బాధ్యతలు తీరినకాలం; 4. సన్న్యాసం - అన్నింటిని భగవంతుడియం దుంచి, సమస్తమున పరమాత్మను దర్శిస్తూ గడిపే కాలం. సనాతన ధర్మం మానవుని జీవితాన్ని ఈ నాలుగు భాగాలుగా విభజించింది.

క. నీ వార్యబోధితుండవు । గావే! వర్ణాశ్రమ ప్రకారములు వినం
గావలయునె ధర్మంబులు । భూవరునకు దండనీతిఁ బోలంగలవే! 157

ప్రతిపదార్థం: నీవు= నీవు (ధర్మరాజు); ఆర్యబోధితుండవు= పూజ్యులచేత జ్ఞాన బోధను పొందినవాడవు; కావు+ఏ?= కావా ఏమి? వర్ణ+ఆశ్రమ+ప్రకారములు= చతుర్వర్ణాల, చతురాశ్రమాల పద్ధతులు; వినంగాన్+వలయును+ఎ?= వినవలసి ఉన్నదా ఏమి?; భూవరునకున్= భూపాలకుడైన రాజునకు; ధర్మంబులు= ఇతర ధర్మాలన్నీ; దండనీతిన్= రాజనీతితో; పోలన్+కలవే?= సమానం కాగలవా?

తాత్పర్యం: 'ధర్మరాజా! నీవు పెద్దలవద్ద జ్ఞానాన్ని పొందలేదా? వర్ణాశ్రమధర్మాలు, పద్ధతులు తెలిసికొనవలసి ఉన్నదా? రాజునకు దండనీతిని (రాజ్యపాలన, యుద్ధనీతి మొదలైనవాటిని) మించిన ధర్మం మరొక్కటి లేదు.

విశేషం: 1. ధర్మరాజు అజ్ఞానంతో ప్రవర్తిస్తే ఆ తప్పు విద్యా బోధన చేసిన గురువుది అనటం ధర్మరాజు గురువును చులకన చేయటం - అది ధర్మరాజు సహించలేడు కదా!

2. మానవ జీవిత కాలాన్ని చతురాశ్రమాలుగా విభజించినట్లే, సమాజం మానవుల వృత్తి, ప్రవృత్తుల రీత్యా నాలుగు భాగాలుగా విభజించబడింది. అవే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు. ఈ వర్ణాలు ఈనాడు సమాజంలో అమలులో ఉన్న కులాలు ఒకటి కావు. రెంటికీ హస్తిమశకాంతరం ఉన్నది.

3. రాజ్యపాలనకు సంబంధించిన అంశాలన్నీ దండనీతిలో భాగం.

వ. సుద్యుమ్నుండను ధరణీశుండు దండనీతిని కాదె యపవర్గంబు వడసె' ననుటయు, నజాతశత్రుం 'డాసుద్యుమ్ను
వృత్తాంతంబు వినవలతు నానతి' మ్మనిన నమ్మహీపతి కమ్మునిపతి యిట్లనియె. 158

ప్రతిపదార్థం: సుద్యుమ్నుండు+అను= సుద్యుమ్నుడు అనే పేరున్న; ధరణీ+ఈశుండు= రాజు; దండనీతిన్+అ= దండనీతి వలననే; కాదు+ఏ= కదా; అపవర్గంబు= మోక్షం; పడసెన్= పొందాడు; అనుటయున్= అనగా; అజాతశత్రుండు= ధర్మరాజు; ఆ సుద్యుమ్ను వృత్తాంతంబు= ఆ సుద్యుమ్నుడనే పేరుగల రాజు చరిత్ర; వినవలతున్= వినాలని కోరుకొంటున్నాను; ఆనతి+ఇమ్ము+అనినన్= సెలవీయవలసింది అనగా; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు (ధర్మరాజుకు); ఆ+మునిపతి= ఆ మునిశ్రేష్ఠుడైన వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'సుద్యుమ్ను డనేరాజు దండనీతిని అనుష్ఠించటం వలననే మోక్షం పొందాడు' అని వ్యాసుడు చెప్పగానే ధర్మరాజు 'ఆ సుద్యుమ్నుడి చరిత్ర వినాలనుకొంటున్నాను చెప్పుము' అని ప్రార్థించగా, ధర్మరాజుకు వ్యాసుడు ఇట్లా చెప్పసాగాడు.

పారాశర్యుఁడు సుద్యుమ్న చరితంబు ధర్మజునకుఁ జెప్పుట (సం. 12-24-1)

క. ' వినుము శంఖుండును లిఖితుం । డన నిరువురు విప్రవర్యు లన్నయుఁ దమ్ముం
డును గలరు బాహుదాతీ । ర నివాసులు ధర్మతత్పర మనోవృత్తుల్. 159

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; బాహుదాతీర నివాసులు= బాహుదా నదీ తీరంలో నివసించే వారైన; ధర్మ+తత్పర+మనోవృత్తుల్= ధర్మమార్గంలో నడవటంలో లగ్నమైన మనోధర్మం కలవారైన; అన్నయున్+తమ్ముండును= అన్నదమ్ములైన; శంఖుండును+లిఖితుండు+అనన్= శంఖుడు, లిఖితుడు అనే పేర్లు కల; ఇరువురు= ఇద్దరు; విప్రవర్యులు= బ్రాహ్మణోత్తములు; కలరు= ఉన్నారు.

తాత్పర్యం: 'ధర్మరాజా! వినుము. బాహుదానదీ తీరంలో, ధర్మమార్గ ప్రవర్తనులైన శంఖుడు, లిఖితుడు అనే పేర్లు కల అన్నదమ్ములైన బ్రాహ్మణోత్తములు ఇద్దరు ఉన్నారు.

సీ. వారి యాశ్రమముల భూరిపుష్ప ఫలాభి । వృద్ధి నొప్పారెడి వివిధ భూరు
హంబులు గల; వొకయపుడు శంఖుండు గృహమ్మున లేకుండ ననుజుఁ డచటి
కరిగి యందొక మ్రాన నారఁబండిన పండ్లు । గని వేడ్కమై గోసికొని తినంగ,
నయ్యన్న యేతెంచి 'యనుజ! యీ ఫలము లె । క్కడియవి చెప్పు' నావుడును వార్చి

తే. ప్రణతుఁడై 'యిచ్చటివ'యని పలికె లిఖితుఁ; । డాతఁ 'డనుమతి లేక కోయంగఁ దగునె?
మ్రుచ్చిమియ కాదె యది? పాప మచ్చుపడియె; । నృపతిచే దండితుండవై నీఁగికొనుము. 160

ప్రతిపదార్థం: వారి= ఆ శంఖలిఖితుల; ఆశ్రమములన్= ఆశ్రమాలలో; భూరి= అధికమైన; పుష్ప+ఫల+అభివృద్ధిన్= పూలు పండ్లు పెంపొందటంచేత; ఒప్పు+ఆరెడి= అందగించే; వివిధ= అనేకములైన; భూరుహంబులు= వృక్షాలు; కలవు= ఉన్నాయి; ఒక+అపుడు= ఒక సమయంలో; శంఖుండు= అన్నగారైన శంఖుడు; గృహమ్మునన్= ఇంటిలో; లేక+ఉండన్= లేకపోగా; అనుజుండు= తమ్ముడు; అచటికిన్+అరిగి= అన్న ఆశ్రమానికి వెళ్ళి; అందున్= అక్కడ; ఒక మ్రానన్= ఒక చెట్టుకు; ఆరన్+పండిన= విరగ కాసిన; పండ్లు+కని= పళ్ళనుచూచి; వేడ్కమైన్= వేడుకతో, ముచ్చటపడి; కోసికొని= తెంపుకొని; తినంగన్= తినగా; ఆ+అన్న= ఆ అన్న అయిన శంఖుడు; ఏతెంచి= వచ్చి; అనుజ!= తమ్ముడా!; ఈ ఫలములు= ఈ పళ్ళు; ఎక్కడి+అవి?= ఎచటివి?; చెప్పు= తెలుపుము; నావుడును= అని అనగా; లిఖితుఁడు= తమ్ముడైన లిఖితుడు; వార్చి= ఆచమించి; ప్రణతుఁడు+ఐ= అన్నకు నమస్కరించినవాడై; ఇచ్చటివి+అ= ఇక్కడివే; అని+పలికెన్= అని చెప్పాడు; ఆతండు= అన్న అయిన శంఖుడు; అనుమతిలేక= అనుజ్ఞ తీసికొనక; కోయంగన్+తగునె?= పళ్ళు కోయవచ్చునా?; అది= అట్లా అనుమతి లేకుండా కోయటం; మ్రుచ్చిమి+అ= దొంగతనమే; కాదు+ఎ?= కాదా?; పాపము= దోషం; అచ్చుపడియెన్= స్పష్టపడింది; నృపతిచేన్= రాజుచేత; దండితుండవు+ఐ= శిక్షించబడినవాడవై; నీఁగికొనుము= పొగొట్టుకొనుము.

తాత్పర్యం: ఆ విప్రసోదరులు శంఖ లిఖితుల ఆశ్రమాలు పూలతోనూ, పళ్ళతోనూ నిండిన చెట్లు కలిగి ఉండి అందగిస్తున్నాయి. ఒకసారి శంఖుడు ఇంట లేనప్పుడు లిఖితుడు అక్కడికి వెళ్ళి, ఒక చెట్టున ఉన్న ఆరముగ్గిన పళ్ళను చూచి, ముచ్చటపడి కోసికొని తిన్నాడు. అంతలో అక్కడికి వచ్చిన శంఖుడు 'ఆ పళ్ళెక్కడివి?' అని

ప్రశ్నించాడు. దానికి లిఖితుడు ఆచమించి, అన్నకు నమస్కరించి, 'ఇచ్చటివే' అని జవాబిచ్చాడు. దానికి శంఖుడు 'అనుమతి లేకుండా పళ్ళు కోయవచ్చా? అది దొంగతనం కాదా? పాపం చేసినట్లు నిర్ధారణ అయింది. రాజుచేత శిక్షించబడి పాపాన్ని పోగొట్టుకొనుము.

వ. రయంబున రాజసన్నిధికిం జని, భవత్కర్మం బుపన్యసించి దండించుట వేఁడు' మని పలికినం దెలిసి 'యట్లకాక' యని లిఖితుండు సుద్యుమ్నుఁ గానంబోయి నగరి వాకిట నిలిచినం, బ్రతిహారు లమ్మహాత్ము నరుగుదెంచుట యమ్మహీపతి కెఱిఁగించిన, నతండు సంభ్రమంబున సామాత్యుండై యాసంశితవ్రతుం డున్నయెడకుం జని వినయంబు సేసి 'మీర లిచ్చటికి వేంచేసిన ప్రయోజనం బేమి? యానతిండు; మీ చెప్పినట్ల చేసెద' నని విన్నవించిన నా విప్రవర్యుం డాతని కిట్లనియె. 161

ప్రతిపదార్థం: రయంబునన్= వేగంగా (వెంటనే); రాజ సన్నిధికిన్= రాజ సమ్ముఖానికి (రాజు వద్దకు); చని= వెళ్ళి; భవత్కర్మంబు= నీవు చేసిన పని; ఉపన్యసించి= చెప్పి; దండించుట= శిక్షించటాన్ని; వేడుము= ప్రార్థించుము; అని పలికినన్= అని చెప్పగా; తెలిసి= తప్పు తెలిసికొని; అట్లు+అ+కాక+అని= అట్లే జరుగును గాక అని (సరే అని); లిఖితుండు; సుద్యుమ్నున్= సుద్యుమ్నుడిని; కానన్+పోయి= చూడటానికి వెళ్ళి; నగరి వాకిటన్= రాజద్వారం వద్ద; నిలిచినన్= నిలువగా; ప్రతిహారులు= ద్వారపాలకులు; ఆ+మహాత్మున్= ఆ మహానుభావుడియొక్క; అరుగుదెంచుట= రాకను; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు; ఎఱిఁగించినన్= తెలియ చెప్పగా; అతండు= ఆ రాజు; సంభ్రమంబునన్= తత్తరపాటుతో (వెనువెంటనే); స+అమాత్యుండు+ఐ= మంత్రులతో కూడుకొన్నవాడై; ఆ సంశిత వ్రతుండు= అనుమానించబడని దీక్ష కలవాడు; ఉన్న+ఎడకున్= నిలిచి ఉన్నచోటికి; చని= వెళ్ళి; వినయంబు+చేసి= వినయంతో; మీరలు= మీరు; ఇచ్చటికిన్= ఇక్కడికి; వేంచేసిన= వచ్చిన; ప్రయోజనంబు+ఏమి?= కారణం ఏమిటి? (ఉద్దేశం ఏమిటి?); ఆనతి+ఇండు= ఆజ్ఞాపించండి; మీ చెప్పిన+అట్లు+అ= మీరు చెప్పిన విధంగానే; చేసెదన్= చేస్తాను; అని విన్నవించినన్= అని ప్రార్థించగా; ఆ విప్రవర్యుండు= ఆ బ్రాహ్మణోత్తముడు; ఆతనికిన్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'రాజు వద్దకు వెళ్ళి, నువ్వు చేసిన పని చెప్పి, దండించుమని అడుగు అని తమ్ముడితో అన్నాడు. అతడు తన తప్పు తెలిసికొన్నవాడై, సరేనని సుద్యుమ్నుడనే రాజును కలవటానికి వెళ్ళి రాజద్వారం వద్ద నిలిచాడు, ప్రతిహారు లాసంగతి రాజునకు తెలుపగా అతడు హుడావుడిగా మంత్రులందరితో కలిసి లిఖితు డున్న చోటికి వచ్చి వినయంగా 'మీ రిచ్చటికి ఏ ప్రయోజనాన్ని ఆశించి వచ్చారు? మీరు చెప్పినట్లుగా నడచుకొంటాను' అని ప్రార్థించాడు. అప్పు డా లిఖితుడు రాజుతో ఈ విధంగా చెప్పాడు.

ఆ. ' చెప్పినట్ల యేను జేసెద నని యొడం ।బడినవాఁడ వింకఁ బలుకు దిరుగఁ
గామి మఱువ కుండఁగా నీకు వలయుఁ జు ।మ్మయ్య దండధారకాగ్రగణ్య!' 162

ప్రతిపదార్థం: దండధారక+అగ్రగణ్య!= పాలనా దండాన్ని ధరించిన రాజులలో శ్రేష్ఠుడా! సుద్యుమ్నా!; ఏనున్= నేను; చెప్పిన+అట్లు+అ= చెప్పిన విధంగానే; చేసెదన్+అని= చేస్తానని; ఒడంబడినవాఁడవు= అంగీకరించావు; నీకున్= నీకు; ఇంకన్= ఇకపై; పలుకు= మాట; తిరుగన్= వెనక్కితీసికొనటం; కామిన్= వీలుకాదని; మఱువక+ఉండఁగాన్= మరచిపోకుండా; వలయున్+చుమ్ము+అయ్య!= ఉండాలి సుమా!

తాత్పర్యం: 'రాజదండాన్ని ధరించిన వారిలో శ్రేష్ఠుడవైన సుద్యుమ్న రాజా! 'నేను చెప్పినట్లు చేస్తానని ఒప్పుకొన్నావు. ఇక మాట తప్పటానికి వీలులేదని మరవవద్దు'.

వ. అని యూఁది పలికి, 'మద్గురుని యనుమతి లేక తదీయ తరుఫలంబులు గోసికొని యుపయోగించితి; నది మ్రుచ్చిమి; మ్రుచ్చుల దండించు తెఱంగున దండించి నన్ను గతకల్మషుం జేయుము; రాజదండితునకు యమదండంబు లేదని పెద్దలు సెప్పుదురు; నిన్నును దండధారణ వైకల్య కిల్బిషంబు వొరయకుండ వలయు' నని తేటపడ నాడిన, నమ్మాటలకు మనంబున విషాంబు నొంది, యమ్మేదినీవరుండు భూసురవరుం బ్రార్థించి. 163

ప్రతిపదార్థం: అని+ఊఁది పలికి= అంటూ నొక్కి వక్కాణించి; మత్+గురుని= నా అన్నయొక్క; అనుమతి లేక= అనుజ్ఞ లేకుండా; తదీయ= అతడియొక్క; తరు= చెట్టుయొక్క; ఫలంబులు= పళ్ళు; కోసికొని+ఉపయోగించితిన్= కోసికొని తిన్నాను; అది= అట్లా చేయటం; మ్రుచ్చిమి= దొంగతనం; మ్రుచ్చులన్= దొంగలను; దండించు+తెఱంగునన్= శిక్షించే తీరులో; దండించిన్= శిక్షించి; నన్నున్= నన్ను; గతకల్మషున్= పోయిన పాపం కలవాడినిగా; చేయుము= చేయుము; రాజదండితునకున్= రాజుచేత శిక్షించబడినవాడికి; యమదండంబు= యముడిచేతి శిక్ష; లేదు+అని= ఉండదని; పెద్దలు= ఆర్యులు; చెప్పుదురు= చెప్పుతారు; నిన్నును= నిన్ను కూడా; దండధారణ= రాజదండాన్ని ధరించి కూడా; వైకల్య కల్బిషంబు= వికలత్వం (సరిగా నిర్వహించకపోవటం) అనే పాపం; పొరయక+ఉండవలయును+అని= పొందకుండా ఉండాలి అని; తేటపడన్= స్పష్టపడేటట్లుగా; ఆడినన్= మాటాడగా; ఆ+మాటలకున్= లిఖితుడు పలికిన మాటలకు; మనంబునన్= మనస్సులో; విషాదంబున్+పొంది= దుఃఖాన్నిపొంది; ఆ+మేదినీవరుండు= ఆ రాజు; భూసురవరున్= బ్రాహ్మణోత్తముడిని; ప్రార్థించి= వేడి.

తాత్పర్యం: అంటూ గట్టిగా చెప్పి, 'నా అన్న అనుమతిలేకుండా, అతడి చెట్టుపళ్ళు కోసికొని తిన్నాను. అట్లా చేయటం దొంగతనమే. కనుక నన్ను దొంగలను శిక్షించే తీరులో దండించి పాపరహితుడిని చేయుము. రాజదండన పొందిన వాడికి యమదండన ఉండదని పెద్ద లంటారు. అట్లా చేస్తే నీకు దండధారివై కర్తవ్యం నుండి తొలగిన పాపం అంటకుండా ఉంటుంది' అని తేట తెల్లంగా చెప్పాడు. ఆ మాటలు విన్న రాజు మనసులో చాలా బాధపడి ఆ విప్రుడిని ప్రార్థించి. (తరువాతి పద్యంతో అన్వయం).

**ఆ. ' అనఘచరిత! యిట్లు నను నియోగించుట । యుడుగు' మని యమాత్యయుతము గాఁగ
భక్తి మెఱసి యెన్నిభంగులఁ జెప్పిన । నియ్యకొనక యున్న నెట్టకేని. 164**

ప్రతిపదార్థం: అనఘ చరిత!= పాపంలేని పవిత్రమైన నడవడిక కలవాడా! లిఖితుడా!; ఇట్లు= ఈ విధంగా; ననున్ నియోగించుట= నన్ను ఆజ్ఞాపించటం; ఉడుగుము+అని= మానుమని; అమాత్యయుతము+కాఁగన్= మంత్రులతో కూడుకొని; భక్తి మెఱసి= భక్తి ప్రకటమయ్యేటట్లు; ఎన్ని భంగులన్= ఎన్ని విధాలుగా; చెప్పినన్= చెప్పినా కాని; ఇయ్యకొనక= అంగీకరించక; ఉన్నన్= ఉండగా; ఎట్టకేని= చిట్టచివర కేదో విధంగా.

తాత్పర్యం: 'పాపరహితమైన (నిర్మలమైన) నడవడిక కలిగిన విప్రోత్తమా! నన్ను ఈ విధంగా ఆజ్ఞాపించటం మానుము' అని మంత్రులతో కలిసి భక్తితో ఎన్నో విధాలుగా వేడుకొన్నా అంగీకరించకపోవటంతో, చిట్టచివరికి. (తరువాతి వచనంతో అన్వయం).

లిఖితుండు సుద్యుమ్ననిచేత నిక్కృత్తకరుం డగుట (సం. 12-24-19)

వ. నిశ్చయించి సముచిత దండనీతి వ్రతశీలుండగు నన్నరపాలుం డమ్మహాద్విజునిం గరయుగచ్ఛేదనంబున దండింతుం జేసిన, నతం డతని దీవించి మగిడి చని శంఖునిం గని నిక్కృత్తంబు లైన హస్తంబులు సూపి 'సమ్యగనుభూత దండితుండ నైతి' ననిన నాతండు ప్రీతుండై. 165

ప్రతిపదార్థం: నిశ్చయించి= నిర్ణయించుకొని (లిఖితుడు కోరినట్లు చేయటానికి నిశ్చయించుకొని); సముచిత= బాగా తగిన; దండనీతి వ్రతశీలుండు+అగు= దండనీతిని అమలు పరచే స్వభావం కలిగినవాడైన; ఆ+నరపాలుండు= ఆ సుద్యుమ్న రాజు; ఆ+మహోద్విజునిన్= ఆ గొప్ప విప్రుడిని; కరయుగ= రెండు చేతులను; ఛేదనంబునన్= ఖండించటంతో; దండితున్+చేసినన్= శిక్షించబడిన వాడినిగా చేయగా; అతండు+అతనిన్= లిఖితుడు సుద్యుమ్నుడిని; దీవించి= ఆశీర్వదించి; మగిడి చని= తిరిగివెళ్ళి; శంఖునిన్+కని= తన అన్న అయిన శంఖుడిని చూచి; నిక్కృత్తంబులు+అయినన= ఖండించబడిన; హస్తంబులు= చేతులను; చూపి= చూపించి; సమ్యక్= చక్కగా; అనుభూత= అనుభవించిన; దండితుండన్+ఐతిన్= శిక్షపొందిన వాడినయ్యాను; అనినన్= అనగా; ఆతండు= ఆ శంఖుడు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై.

తాత్పర్యం: ఒక నిశ్చయానికి వచ్చినవాడై, దండనీతిని చక్కగా అమలు పరిచే స్వభావం కల సుద్యుమ్నుడు ఆ మహానుభావుడైన లిఖితుడి చేతులు రెంటినీ ఖండించి శిక్షించాడు. ఆ లిఖితుడు రాజును ఆశీర్వదించి అన్నగారి వద్దకు వెళ్ళి తన తెగిన చేతులు చూపి, చక్కని దండనను అనుభవించానని చెప్పగా, శంఖుడు సంతోషించి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ధర్మమార్గ ముల్లంఘింపఁ దగదుగాన । వలసె నిష్కృతి కులమెల్ల వెలసె నీ క
తమున సురముని పితృ తర్పణములు సేయు । మరిగి బాహుదాపుణ్యతోయముల ననఘ. 166

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! (ఇక్కడ ఈ ప్రయోగం సార్థకం); ధర్మమార్గము= ధర్మముయొక్క పద్ధతి; ఉల్లంఘింపన్= దాటటం; తగదు= ఉచితం కాదు (కూడదు); కాన= అందువలన; నిష్కృతి= చేసిన దానికి ప్రాయశ్చిత్తం; వలసెన్= చేయవలసి వచ్చింది; నీ కతమునన్= నీ కారణంగా; కులము+ఎల్లన్= వంశమంతా; వెలసెన్= ప్రకాశించింది; అరిగి= వెళ్ళి; బాహుదా పుణ్యతోయములన్= పవిత్రమైన బాహుదా నది నీళ్ళలో; సుర+ముని+పితృ= దేవతలకు, మునులకు, పితరులకు; తర్పణములు= జలాంజలులు; చేయుము= చేయవలసినది.

తాత్పర్యం: 'పాపాలను పోగొట్టుకొన్న లిఖితుడా! ధర్మమార్గాన్ని ఎవరూ తప్పకూడదు. కనుక ప్రాయశ్చిత్తం అవసరమైనది. నీవలన మన వంశమంతా ప్రకాశిస్తున్నది. వెళ్ళి బాహుదానదిలోని పుణ్యప్రదమైన నీటిలో దేవతలకు, మునులకు, పితరులకు తర్పణా లిమ్ము.

వ. వినుము. 167

తాత్పర్యం: (ఇంకా) వినుము.

తే. కల్లు ద్రావుట, గురుపత్నిఁ గవయుటయును, । విప్రుఁ జంపుట, బ్రహ్మ స్వవిషయ మైన
మ్రుచ్చిలుటయును నివి గల క్రూరజనులఁ । బ్రీతిఁబొందుటయును మహాపాతకములు. 168

ప్రతిపదార్థం: కల్లు+త్రావుట= సురాపానం; గురుపత్నిన్= గురువు యొక్క (అన్న, పెద్దవాడు, విద్యా బోధన చేసినవాడియొక్క) భార్యను; కవయుటయును= కూడటం; విప్రున్= బ్రాహ్మణుడిని; చంపుట= చంపటం; బ్రహ్మస్వవిషయము+ఐన= బ్రాహ్మణుడికి చెందిన ధనమునకు సంబంధించిన; మ్రుచ్చిలుటయును= దొంగిలించటం; ఇవి+కల= ఈ నాలుగు లక్షణాలు ఉన్న; జనులన్= మానవులతో; ప్రీతిన్= ఇష్టంతో; పొందుటయును= కలిసి ఉండటం; మహాపాతకములు= పెద్దపాపపు పనులు.

తాత్పర్యం: సురాపానం, గురుపత్నిని కూడటం, బ్రాహ్మణుడిని చంపటం, బ్రాహ్మణుల ధనము దొంగిలించటం- ఈ నాలుగు లక్షణాలు కలవారితో ఇష్టంతో కలిసి ఉండటం మహాపాతకాలు (నిష్కృతిలేని పాపాలు).

వ. ఇమ్మహాపాతకంబు లేనింటిలోన నెద్ది సేసిన నే జాతివాఁడును దండనీయుండ, విశేషించి తస్కరుండు శారీరదండ యోగ్యుండు; రాజదండితులు సుకృతవంతుల భంగిఁ బుణ్యలోక ప్రాప్తులగుదురు; నీ వమ్మహారాజు చేత దండింప బడుటం బుణ్యాత్ముండవును వంశోద్ధారణ సమర్థుండవు నైతివి; సంతోషింపుము పొ'మ్మనినం బోయి లిఖితుండు. 169

ప్రతిపదార్థం: ఈ+మహాపాతకంబులు= ఈ గొప్ప పాపకార్యాలు; ఏనింటిలోనన్= ఐదింటిలో; ఎద్ది+చేసినన్= ఏది ఆచరించినా; ఏ జాతివాఁడును= ఏ వర్ణస్థుడైనా; దండనీయుండు+అ= శిక్షార్హుడే; విశేషించి= ప్రత్యేకంగా; తస్కరుండు= దొంగ; శారీరదండ యోగ్యుండు= శారీరకమైన శిక్షకు తగినవాడు; రాజదండితులు= రాజుచేత శిక్షించబడినవారు; సుకృతవంతుల భంగిన్= పుణ్యకార్యాలు చేసినవారివలె; పుణ్యలోక+ప్రాప్తులు= సత్కార్యాలు చేసినవారు పోయే లోకాలను పొందినవారవుతారు; నీవు= నీవు; ఆ+మహారాజుచేతన్= ఆ సుద్యుమ్నుడిచేత; దండింపఁబడుటన్= శిక్షించబడి ఉండటంచేత; పుణ్యాత్ముండవును= సుకృతివి; వంశ+ఉద్ధరణ+సమర్థుండవును= కులపావనుడవు; ఐతివి= అయ్యావు; సంతోషింపుము= ఆనందించుము; పొమ్ము= వెళ్ళుము; అనినన్= అనగా; లిఖితుండు= లిఖితుడు; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: 'ఈ ఐదు మహాపాతకాలలో ఏ ఒక్కటిచేసినా, ఏ వర్ణస్థుడైనా దండించ తగినవాడే. ప్రత్యేకించి దొంగ శరీరదండనకు అర్హుడు. రాజదండన పొందినవారు పుణ్యాత్ములవలె పుణ్యలోకాలకే పోతారు. నీవు సుద్యుమ్న మహారాజుచేత దండన పొందావు కనుక పుణ్యాత్ముడివి. వంశపావనుడివి అయ్యావు. దీనికి సంతోషించుము. ఇక వెళ్ళుము' అన్నాడు. లిఖితుడు అన్న చెప్పినట్లుగా వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం).

**తే. బాహుదానదియం దవగాహనంబు । సేయఁ బ్రభవించె నాతని చేతు లపుడ
విస్మయం బంది యతఁడు వేవేగ వచ్చె । నన్నపాలికి మగుడఁ బ్రహర్షమెసఁగ. 170**

ప్రతిపదార్థం: బాహుదానదియందున్= బాహుదానదిలో; అవగాహనంబు+చేయన్= మునుగగా; అపుడు+అ= అప్పుడే; ఆతని చేతులు= ఆతడి చేతులు; ప్రభవించెన్= పుట్టాయి, మొలిచాయి; అతఁడు= ఆ లిఖితుడు; విస్మయంబు+అంది= ఆశ్చర్యపోయి; వేవేగ= మిక్కిలి వేగంగా; మగుడన్= తిరిగి; ప్రహర్షము+ఎసఁగన్= మిక్కిలి సంతోషం విజృంభించగా; అన్నపాలికిన్= అన్న దగ్గరికి; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: బాహుదానదిలో మునుగగానే లిఖితుడికి చేతులు మొలిచాయి. అతడు ఆశ్చర్యంతో, ఎక్కువైన ఆనందంతో వేగంగా అన్న దగ్గరకు తిరిగి వచ్చాడు.

విశేషం: బాహు= చేతులు; ద= ఇచ్చునది అనే పేరు ఈ సంఘటనతో ఆ నదికి సార్థకం అయింది.

వ. వచ్చి యరుణ కమలంబులం దెగడు తన కరంబులం జూపిన నతండు 'దీనికి నచ్చెరు పడనేల? యిది మదీయ తపోవిభవంబున దైవకృతం బైన విశేషంబు; నీవు శుచి వగుట దైవంబున కెక్కె; సుద్యుమ్నుండును నీ పుణ్యానుష్ఠానంబున నిజపితృవర్గ సహితంబుగా నిర్మలాత్ముండయ్యె' ననియె; నట్లగుటం జేసి. 171

ప్రతిపదార్థం: వచ్చి; అరుణ= ఎర్రని; కమలంబులన్= తామరలను; తెగడు= తిరస్కరించే; తనకరంబులన్= తన చేతులను; చూపినన్= చూపించగా; అతండు= ఆ శంఖుడు; దీనికిన్= ఈ చేతులు తిరిగి రావటానికి; అచ్చెరువడన్+ఏల?= ఆశ్చర్యపడటం ఎందుకు?; ఇది= ఈ విషయం; మదీయ= నా దైన; తపోవిభవంబునన్= తపస్సుయొక్క గొప్పతనం కారణంగా; దైవకృతంబు+ఐన= భగవంతుడు చేసిన; విశేషంబు= ప్రత్యేకాంశము; నీవు= నువ్వు (లిఖితుడు); శుచివి= పరిశుద్ధుడవు; అగుట= అవటం;

దైవంబునకున్= భగవంతుడికి; ఎక్కెన్= నచ్చింది; సుద్యుమ్నుండునున్= సుద్యుమ్నుడు కూడా; ఈ పుణ్య+అనుష్ఠానంబునన్= ఈ పుణ్యకార్యాన్ని ఆచరించటం వలన; నిజ= తన; పితృవర్గ+సహితంబుగాన్= పితరుల సమూహంతో కూడ; నిర్మల+ఆత్ముండు+అయ్యెన్= పవిత్రాత్ముడయ్యాడు; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; అగుటన్+చేసి= అవటంచేత.

తాత్పర్యం: అన్నవద్దకు వచ్చి ఎర్రతామరలకన్న అందంగా ఉన్న తన చేతులను చూపించగా, ఆ శంఖుడు తమ్ముడితో 'దీనికంత ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఇది నా తపోవిభవం కారణంగా భగవంతుడు చేసిన అద్భుతం. నీవు పరిశుద్ధుడ వని పరమాత్మకు తెలిసింది. ఈ పుణ్యకార్యాచరణవలన సుద్యుమ్నుడు కూడా తన పితరులతో సహా పవిత్రుడయ్యాడు' అన్నాడు. అందువలన - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. జననుత! నీవునుం దగఁ బ్రజాపరిరక్షణ మాచరింపు; నీ
యనుజునిమాట వేదవచనార్థ నిరూఢము; రాజనీతి దం
డనమునఁ గాని యొండున నొడంబడ దెన్నఁడు నార్యకోటియం
దును వగదక్కు మేలు మిలఁ దుష్టిగఁ జేయుము మేటి జన్నముల్.' 172

ప్రతిపదార్థం: జననుత!= ప్రజలచేత కీర్తించబడే ధర్మరాజా!; నీవునున్= నీవు కూడా; తగన్= చక్కగా; ప్రజాపరిరక్షణము= ప్రజలను చక్కగా కాపాడటాన్ని; ఆచరింపు= చేయుము; నీ+అనుజుని+మాట= నీ తమ్ముడు చెప్పినమాట; వేదవచన+అర్థనిరూఢము= వేదవాక్కులలోని అర్థాన్ని తెలియజెప్పేది; ఆర్యకోటి+అందును= పూజనీయులైనవారిలో కూడా; రాజనీతి= రాజ్యపాలనలోని న్యాయం; దండనమునన్+కాని= దండనచేత కాని; ఒండునన్= మరొక విధంగా; ఎన్నడున్= ఎప్పుడూ; ఒడంబడదు= కుదరదు; వగన్= బాధను; తక్కుము= వదలుము; ఇలన్= భూమిని; ఏలుము= పాలించుము; మేటి= గొప్ప; జన్నముల్= యజ్ఞాలు; తుష్టిగన్= తృప్తిగా; చేయుము.

తాత్పర్యం: 'ప్రజలచేత కీర్తించబడే ధర్మరాజా! నీవు కూడా చక్కగా ప్రజలను పాలించుము. నీ తమ్ముడు చెప్పినమాట వేదార్థంతో నిండింది. పూజ్యులైనవారు కూడా రాజనీతిలో దండనమున తప్ప మరొకరీతిగా రక్షణం ఏర్పడదు. కనుక శోకాన్ని వదలుము; భూమిని పాలించుము, గొప్ప గొప్ప యజ్ఞాలను తృప్తిగా చేయుము'.

వ. అని చెప్పి మఱియు నిట్లనియె. 173

ప్రతిపదార్థం: అని చెప్పి= ఈ విధంగా చెప్పి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పారాశర్య డీ విధంగా చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'అడవుల మీరున్నయపుడు నీ తమ్ములు । వివిధ మనోరథావేశ కలిత
హృదయులై యుండుదు; రదయత వీరి । నుపేక్షింప కిల యేలి యెల్లభోగ
ములకును భాజనంబులఁగా నొనర్పుము । తురగ మేధాది క్రతు ప్రయుక్తిఁ
బరఁగుము; వీరలు బహుయజ్ఞములు సేయు । వా రటమీఁద నిర్ద్వంద్వవృత్తి
తే. వెడలెదవు గాక విను మేము వెట్టివార; । మే మహీశ్వర నీ మది మేలుగంటి
మతిథి సుర పితృ విషయము నప్పు చిక్కు। గలిగియుండంగ నది నీకుఁ గాదు గాని. 174

ప్రతిపదార్థం: మహీ+ఈశ్వర!= భూపతీ! ధర్మరాజా!; వినుము= వినవలసింది; అడవులన్= అరణ్యాలలో; మీరు; ఉన్న+అపుడు= నివసించినప్పుడు; నీ తమ్ములు= నీ అనుజులు; వివిధ= అనేకమైన; మనోరథ+ఆవేశ+కలిత+హృదయులు+ఐ= కోరికలతోనూ,

ఆవేశాలతోనూ కూడుకొన్న మనస్సులు కలవారై; ఉండుదురు= ఉండి ఉంటారు; అదయతన్= దయలేకుండగ; వీరిన్= నీ తమ్ములను; ఉపేక్షింపక= నిర్లక్ష్యం చేయక, పట్టించుకొనక పోవటం మాని; ఇల= భూమిని; ఏలి= పాలించి; ఎల్లభోగములకును= అన్ని భోగాలకు; భాజనంబులన్+కాన్= అర్హులయ్యేటట్లుగా; ఒనర్పుము= చేయుము; తురగమేధ+ఆది= అశ్వమేధం మొదలైన; క్రతు= యజ్ఞాలయొక్క; ప్రయుక్తిన్= ప్రయోగంలో (చేయటంవలన); పరఁగుము= నిమగ్నుడవు కమ్ము; వీరలు= నీ తమ్ములు; బహు= అనేకమైన; యజ్ఞములు= యాగాలు; చేయువారు= చేస్తారు; అటమీఁదన్= ఆ తరువాత; నిర్ద్వంద్వవృత్తి= ద్వంద్వాతీతమైన ప్రవృత్తిచేత; వెడలెదవుగాక= ముక్తిని పొందెదవుగాక; ఏము= మేము; వెట్టివారము+ఏ?= తెలివిలేని వారమా?; నీ మది= నీ మనస్సులో; మేలు+కంటిమి= శ్రేయస్సు ఏదో చూచాము; అతిథి సుర పితృ విషయమున్= అతిథుల, దేవతల, పితృదేవతల విషయంలో; అప్పు= ఋణం; చిక్కు= బాధ; కలిగి+ఉండఁగన్= మిగిలిపోయి ఉంటే; అది= ఆ ఋణ శేషం; నీకున్= నీకు; కాదు+కాని= తగదు.

తాత్పర్యం: 'ధర్మరాజా! వినుము. మీరు వనవాసం చేసేటప్పుడు నీ తమ్ములు పెక్కు కోరికలను, ఆవేశాలను పొంది ఉంటారు. నిర్దయతో వారిని నిర్లక్ష్యం చేయవద్దు. భూమిని పాలించి వారికి భోగాలన్నీ అందేటట్లు చూడుము. అశ్వమేధాది యాగాలు చేయుము. నీ తమ్ములు కూడా అనేక యజ్ఞాలు చేస్తారు, ఆ తరువాత ద్వంద్వాలకు అతీతమైన నడవడికతో ముక్తిని పొందగలవు. మేము తెలివిలేని వాళ్ళమా? నీ మదికి హితమైన దానిని గమనించాము, అతిథి, దేవ, పితృ ఋణాల బాధ మిగిలి ఉండటం నీకు తగదు. (వాటిని తీర్చటం మంచిదని సూచన).

విశేషం: అన్నమాట మీద తమ కోరికలను, ఆవేశకావేశాలను, కోపాలను అణచుకొన్న తమ్ములమాట వినటం ధర్మరాజు ధర్మం అని వ్యాసుడి సూచన.

ఆ. న్యాయశాస్త్రవేదియై యింగితాకార । చేష్ట లెఱిఁగి జనుల శిష్టదుష్ట
తావిశేష మరసి దండనీతి యొనర్చు । పతికి నెల్ల మేలుఁ బడయవచ్చు. 175

ప్రతిపదార్థం: న్యాయశాస్త్రవేది+ఐ= న్యాయశాస్త్రాన్ని బాగా తెలిసినవాడై; జనుల= ప్రజల; ఇంగిత= మనసులోని భావనయొక్క; ఆకార= రూపమును; చేష్టలు= చేతలును; ఎఱిఁగి= తెలిసి; శిష్టదుష్టతావిశేషము= మంచితనం, చెడ్డతనాలలోని విశేషాలను; అరసి= పరికించి; దండనీతి+ఒనర్చు= దండనీతిని అమలు పరచే; పతికిన్= రాజునకు; ఎల్లమేలున్= అంతా శుభమునే; పడయవచ్చున్= పొందవీలవుతుంది.

తాత్పర్యం: న్యాయశాస్త్రం బాగా తెలిసి, ప్రజలమనోభావనలు (అభిప్రాయాలు) వాటి రూపరేఖలు, చేష్టలు, మంచి చెడుల తారతమ్యం పట్టిచూసి దండనీతిని అమలు పరిచే రాజునకు అంతా మేలు జరుగుతుంది.

క. అరి యాఱవపాలు గొనుచుఁ । గరుణ గలిగి ప్రజలఁ దండ్రిగతి మధ్యస్థా
చరణంబునఁ బాలించుట । పరమ పదముఁజేర్చు విడువు భయసంశయముల్. 176

ప్రతిపదార్థం: అరి= పన్ను, కప్పం; ఆఱవపాలు= ఆరవవంతు; కొనుచున్= తీసికొంటూ; కరుణ+కలిగి= దయ కలిగినవాడై; ప్రజలన్= పౌరులను; తండ్రిగతిన్= కన్న తండ్రివలె; మధ్యస్థ+ఆచరణంబునన్= పక్షపాతం లేని వర్తనంతో; పాలించుట= పరిపాలన చేయటం; పరమపదమున్= మోక్షానికి; చేర్చున్= చేరుస్తుంది; భయ సంశయముల్= భయాన్ని, అనుమానాన్ని; విడువు= వదలిపెట్టుము.

తాత్పర్యం: ప్రజల ఆదాయం నుండి ఆరవభాగం పన్నుగా తీసికొంటూ, ప్రజలను కన్నతండ్రివలె కరుణా హృదయంతో పక్షపాతం లేని వర్తనంతో పాలనచేస్తే, అది మోక్షపదవికి చేరుస్తుంది. భయాన్ని, సందేహాన్ని వదలుము.

ఆ. ఇవ్విధంబు గాక క్రొవ్వి కామ క్రోధ । కలిత చిత్తవృత్తిఁ దొలఁగ నడచు
పతికి నగుఁ జతుర్థ భాగంబు ప్రజసేయు । పాపములఁ గులప్రదీపచరిత! 177

ప్రతిపదార్థం: కులప్రదీపచరిత!= వంశాన్ని బాగా ప్రకాశింపచేసే నడతకల ధర్మరాజా!; ఈ+విధంబు= ఈ పద్ధతి; కాక= కాకుండా; క్రొవ్వి= పొగరెక్కి, అహంకరించి; కామ= కామంచేత; క్రోధ= కోపంచేత; కలిత= కూడుకొన్న; చిత్తవృత్తిన్= మనోవ్యాపారంతో; తొలఁగన్= తప్పి; నడచు= ప్రవర్తించే; పతికిన్= రాజునకు; ప్రజ+చేయు= పౌరులు చేసే; పాపములన్= పాపకార్యాలలో, చెడుపనులలో; చతుర్థభాగంబు= నాలుగవ వంతు; అగున్= అవుతుంది (వర్తిస్తుంది, చెందుతుంది).

తాత్పర్యం: వంశప్రతిష్ఠను పెంచే ధర్మరాజా! ఈ చెప్పిన పద్ధతిలో కాక, రాజు ననే అహంకారంతో కామక్రోధాలతో కూడుకొన్న మనోవ్యాపారం కలిగి, పద్ధతి తప్పి నడచుకొంటే, ప్రజలు చేసే పాపాలలో నాలుగవవంతు రాజునకు చెందుతుంది.

చ. క్రమమున నైన శాత్రవులఁ గ్రందున నైనను జావఁ జేత ధ
ర్మము వినుఁ పాపకర్ములగు రాజులతోఁ దగ సంధి సేఁత దో
షము విభుఁ డుర్వి యమ్ముకొని సంగరముం దొలఁగింపఁ గూడునే
సమరజితావనీభరణశాలితఁ బోలునె యొండు ధర్ములే. 178

ప్రతిపదార్థం: వినుఁ= ధర్మరాజా! వినుము; క్రమమునన్+ఐన= వరుసగా (ఒక పద్ధతిలో) అయినా; క్రందునన్+ఐనను= సందడిగా (ఒక్కసారిగా) అయినా; శాత్రవులన్= వైరులను; చావన్+చేఁత= చచ్చేటట్లు చేయటం; ధర్మము= చేయవలసిన విధి; పాపకర్ములు+అగు= చెడ్డపనులు చేసే వారైన; రాజులతోన్= రాజులతో; తగన్= చక్కగా; సంధి+చేఁత= సంధిచేయటం; దోషము= తప్పు; విభుఁడు= రాజు; ఉర్వి= భూమిని; అమ్ముకొని= విక్రయించి; సంగరమున్= యుద్ధాన్ని; తొలఁగింపన్+కూడును+ఏ?= తీసివేయటం (ఆపటం) తగినదా?; సమరజిత= యుద్ధంలో గెలువబడిన; అవనీభరణశాలితన్= భూభార దక్షతను; ఒండు ధర్ములే= ఇతర ధర్మాలు (విధులు); పోలును+ఏ?= సరిపోతాయా?

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. నెమ్మది నెమ్మదిగా నైనా, ఒక్కసారిగా అయినా శత్రువులను మట్టుపెట్టటం విధ్యుక్తధర్మం. దుర్మార్గులైన రాజులతో సంధి చేసికొనటం తప్పు. భూమిని అమ్ముకొని యుద్ధాన్ని తొలగించటం (అంటే యుద్ధం చేయకుండా ఉండటం కోసం శత్రువులకు కొంతభూమిని ఇచ్చేయటం), వలన కలిసిరాదు కదా! యుద్ధంలో గెలిచిన రాజ్యభారాన్ని వహించగల సామర్థ్యంతో పోల్చగల ధర్మం మరొక్కటి లేదు.

వ. కావున. 179

తాత్పర్యం: అందువలన.

క. పో రుడుగను సమకూరద । కౌరవపతితోడ సంధి గావింపమి హిం
సారుచి నైతి ననుట యవి । చారత నృపవంశకలితజని యగు నీకున్. 180

ప్రతిపదార్థం: నృపవంశ కలిత జని= రాజవంశముతో కూడుకొన్న పుట్టువు కలవాడవు; అగు= అయిన; నీకున్= నీకు; పోరు= యుద్ధం; ఉడుగను= మానటం; సమకూరదు+అ= కుదరదు (సిద్ధించదు); కౌరవపతితోడన్= దుర్యోధనుడితో; సంధి+కావింపమిన్= సంధి చేయకపోవటం వలన; హింసారుచిన్= హింసయందు ఇష్టం కలవాడిని; ఐతిన్= అయ్యాను; అనుట= అనుకొనటం; అవిచారత= ఆలోచించకపోవటమే.

తాత్పర్యం: ధర్మరాజా! రాజవంశంలో జన్మించిన నీకు యుద్ధం మానటం కుదరదు. దుర్యోధనుడితో సంధిచేయకపోవటంవలన హింసయందు అభిరుచి కలవాడిని అయ్యాను అనుకొనటం ఆలోచనారాహిత్యమే.

శా. భూవిస్తారము నాక్రమించి ప్రజలం బ్రోవంగ దండింపనుం
గావన్ నేర్చి మఖక్రియల్ నడపి సంగ్రామాగ్ని కాజ్యాహుతుల్
గా వైరిక్షతజంబు వేల్చి తనుషంగక్షేపకుండై హయ
గ్రీవుం డుత్తమసిద్ధిఁ బొందె; రణముల్ గీడే నృపశ్రేణికిన్? 181

ప్రతిపదార్థం: హయగ్రీవుండు= హయగ్రీవుడనే రాజు; భూవిస్తారమున్= విస్తృతమైన భూమిని; ఆక్రమించి= స్వాధీన పరచుకొని; ప్రజలన్= జనులను; ప్రోవంగన్= కాపాడగా; దండింపనున్= శిక్షింపగాను; కావన్= రక్షించగాను; నేర్చి= తెలిసికొని; మఖక్రియల్= యజ్ఞకార్యాలు; నడపి= నిర్వర్తించి; సంగ్రామ+అగ్నికిన్= యుద్ధమనే అగ్నికి; ఆజ్య+ఆహుతుల్= నేతితోడి హోమద్రవ్యాలు; కాన్= అయ్యేటట్లు; వైరి= శత్రువుల; క్షతజంబు= నెత్తురును; వేల్చి= హోమంచేసి; తనుషంగక్షేపకుండు+ఐ= శరీర వ్యామోహం వదలినవాడై; ఉత్తమసిద్ధిన్= ఉత్తమగతిని; పొందెన్= పొందాడు; నృపశ్రేణికిన్= రాజ సమూహానికి; రణముల్= యుద్ధాలు; కీడు+ఏ?= హానికరాలా? (కావు అని భావం).

తాత్పర్యం: హయగ్రీవు డనే పేరుగల రాజు విశాలమైన సామ్రాజ్యాన్ని స్వాధీనపరచుకొని, ప్రజలను కాపాడటం, శిక్షించటం, రక్షించటం తెలిసికొని యజ్ఞాలు చేసి, యుద్ధ మనే అగ్నికి శత్రువుల రక్తమనే నేతితో కూడిన హోమ ద్రవ్యం అయ్యేటట్లుగా హోమంచేసి, శరీర వ్యామోహం వదలినవాడై ఉత్తమలోకాలు పొందాడు. రాజులకు యుద్ధాలు హానికరాలు కావు కదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. విశేషాంశాన్ని సామాన్యాంశం సమర్థిస్తున్నది.

వ. సంగరంబునం జంపుటయుం జచ్చుటయును బ్రజాపరిపాలనంబును దగిన తెఱంగున దండించుటయును నుత్తమ క్షత్ర ధర్మంబులు గావున హింసవలని శంక విడిచి యాన్వీక్షకీ త్రయీవార్తా దండనీతు లను రాజవిద్యలయందును బ్రవీణులగు సహాయులతోడం గూడి సర్వ వ్యవహారంబులు నిర్వహింప నిర్వాణం బనతిదూరం బగుఁ; గలంక దక్కు' మని పలికె; సకల లోక గ్రాహ్యవచనుండగు నమ్మహాముని యిట్లు సెప్పం దెలివొందక యున్న ధర్మనందనుం గనుంగొని పురందరనందనుం డుల్లంబునం గోపంబు గదుర మొగంబునం దోఁపనీక యుండె; నప్పాండవాగ్రజుం డత్తపోతధనవర్యు వదనంబునం జూడ్కి నిలిపి నిభృతంబుగా నిట్లనియె. 182

ప్రతిపదార్థం: సంగరంబునన్= యుద్ధంలో; చంపుటయున్= చంపటమూ; చచ్చుటయును= చనిపోవటమూ; ప్రజాపరిపాలనంబును= జనులను పాలించటమూ; తగిన తెఱంగునన్= ఉచితమైన రీతిలో; దండించుటయును= శిక్షించటమూ; ఉత్తమ క్షత్రధర్మంబులు= శ్రేష్ఠులైన రాజులు ఆచరించవలసిన విధులు; కావునన్= కనుక; హింసవలని= హింసను గూర్చిన; శంక= సంశయం; విడిచి= వదలి; ఆన్వీక్షకీ= విజ్ఞానాన్ని తెలిపే విద్య; త్రయీ= ధర్మాధర్మాలు తెలిపే విద్య; వార్తా= అర్థానర్థాలను తెలిపే విద్య; దండనీతులను= దండనీతి నయానయాలను తెలిపే విద్య అనే; రాజవిద్యల+అందును= క్షత్రియ ఉచితమైన విద్యలలో; ప్రవీణులు= పారంగతులు; అగు= అయినటువంటి; సహాయులతోడన్+కూడి= తోడ్పడేవారితో కలిసి; సర్వ= సమస్తమైన; వ్యవహారంబులు= పనులు; నిర్వహింపన్= చక్కగా చేయగా; నిర్వాణంబు= ముక్తి; అనతి దూరంబు+అగున్= దగ్గర అవుతుంది; కలంక= కలత, విచారం; తక్కుము= వీడుము; అని పలికెన్= అంటూ చెప్పాడు (వ్యాసుడు); సకల= సమస్త; లోక= లోకాలవారిచేత; గ్రాహ్య= గ్రహించదగిన,

స్వీకరించదగిన; వచనుండు+అగు= మాటలు కలవాడైన; ఆ+మహాముని= ఆ గొప్పముని; ఇట్లు= ఈ విధంగా; చెప్పన్= చెప్పగా; తెలివి+ఒందక+ఉన్న= బోధకలుగక ఉన్న; ధర్మనందనున్= ధర్మరాజును; కనుంగొని= చూచి; పురందర నందనుండు= ఇంద్రజుడైన అర్జునుడు; ఉల్లంబునన్= మనస్సులో; కోపంబు= కోపం; కదురన్= కలిగినా; మొగంబునన్= ముఖాన; తోఁపనీక= కనబడనీయక; ఉండెన్= ఉన్నాడు; ఆ+పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; ఆ+తపోధనవర్యు= తపస్సే ధనంగా కలవారిలో శ్రేష్ఠుడైన వ్యాసుడి; వదనంబునన్= ముఖమునందు; చూడ్కి= చూపు; నిలిపి= స్థిరంగా ఉంచి; నిభృతంబు+కాన్= వినయంగా, స్పష్టంగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: యుద్ధంలో చంపటం, చనిపోవటం, ప్రజలను పాలించటం, ఉచితమైన రీతిలో దండించటం శ్రేష్ఠమైన రాజధర్మాలు. అందువలన హింసను గూర్చిన సంశయం వదలి, విజ్ఞానాన్ని తెలిపే ఆన్వీక్షకి, ధర్మాధర్మాలు తెలిపే త్రయీ, అర్థానర్థాలను తెలిపే వార్త, నయానయాలను తెలిపే దండనీతి అనబడే నాలుగు క్షత్రియోచిత విద్యలలోనూ పండితులైనవారి సాహాయ్యంతో అన్ని కార్యాలను చక్కగా నిర్వర్తిస్తే మోక్షం అతి సమీపంలో ఉంటుంది. విచారం వదలిపెట్టుము' అన్నాడు వ్యాసుడు. అన్ని లోకాల వారిచేత గ్రహించదగిన మాటలు (అన్ని లోకాలవారు సమ్మతించే మాటలు) కల ముని శ్రేష్ఠుడైన వ్యాసు డీ విధంగా చెప్పగా, వివేకం కలుగకుండా ఉన్న ధర్మరాజును చూచి అర్జునుడికి మనస్సులో కోపం కలిగింది కాని ముఖం మీద దానిని కనబడనీయలేదు. అప్పు డా ధర్మరాజు తపోధన(శ్రేష్ఠుడైన వ్యాసుడి ముఖంపై తన చూపు నిలిపి (ముఖంలోకి చూస్తూ) వినయంగా ఈ విధంగా పలికాడు.

క. ' పతులు మృతులైనఁ బొగిలెడు । సతుల విలాపములు శోక సంతాపం బు
త్థితముగఁ జేయఁగ నే వసు । మతి యేలిన కలఁచుకలఁక మానునె బుద్ధిన్?' 183

ప్రతిపదార్థం: పతులు= భర్తలు; మృతులు+ఐనన్= మరణించగా; పొగిలెడు= కుమిలిపోయే; సతుల= భార్యల; విలాపములు= ఏడుపులు; శోక= విషాదంవలన; సంతాపము= రగులుతున్న బాధను; ఉత్థితముగన్= పైకెగసేటట్లు; చేయఁగన్= చేస్తుండగా; ఏన్= నేను; వసుమతి= భూమిని; ఏలిన= పాలించినట్లైతే; కలఁచు= బాధపెట్టే; కలఁక= కలత; బుద్ధిన్= మనస్సులో; మానును+ఎ?= తగ్గుతుందా? (తగ్గదని భావం).

తాత్పర్యం: 'మహర్షీ! భర్తలు మరణించగా కుమిలిపోయే భార్యల రోదనలు నాలో రగులుతున్న దుఃఖాలవలన పైకి ఎగదట్టుతుండగా, భూమిని నేను పరిపాలిస్తే అది మనసులోని కలతని పోగొట్ట గలదా?' (పోగొట్టలేదు).

వ. అనుటయు నమ్మునివరుం డతని కిట్లనియె. 184

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+మునివరుండు= ఆ మునులలో ఉత్తముడైన వ్యాసుడు; అతనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఈ విధంగా ప్రశ్నించగా, మునిశ్రేష్ఠుడైన వ్యాసు డాతడితో ఇట్లా అన్నాడు.

సీ. ' దుఃఖంబుఁ బొమ్మని త్రోవ, సుఖంబు ర । మ్మని తెచ్చికొన వశమయ్య? వానిఁ
దొలుబామునందలి దుష్కృతంబును సుకృ । తంబు హేతువులుగఁ దగిలి చేయుఁ
బురుషుని కాలంబు; దిరములు గా వవి; పారిఁ । బొరి వచ్చుచుఁ బోవుచుండు;
నర్థముల్ దుర్బుద్ధికైనను సిద్ధించు । నగు కాలమున; నార్యులయ్యుఁ గాని

ఆ. కాలమున ఘటింపఁగా నేర; వనిల వ । ర్షాతపేందురుచులు నధిప! కాల
కల్పితములు; మంత్రశిల్పౌషధంబులు । మేలుసేఁత కాలకీలితంబు. 185

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; దుఃఖంబున్= బాధను; పొమ్ము+అని= వెడలిపొమ్మని; త్రోవన్= త్రోసివేయటానికి; సుఖంబు= సౌఖ్యాన్ని; రమ్ము+అని= రారమ్మని; తెచ్చికొనన్= తీసికొనిరావటానికి; వశము+అయ్యే?= మనవశమా నాయనా?; వానిన్= ఆ సుఖ దుఃఖాలను; తొలుబామునందలి= పూర్వ జన్మయందలి; దుష్కృతంబును= చెడుపనులును, పాపకృత్యాలు; సుకృతంబు= మంచిపనులు, పుణ్యకార్యాలు; హేతువులుగన్= కారణాలుగా; పురుషుని= మానవుడిని; కాలంబు= కాలం, విధి; తగిలి చేయున్= పూనికతో చేస్తుంది; అవి= ఆ సుఖదుఃఖాలు; తిరములు= స్థిరమైనవి, శాశ్వతమైనవి; కావు; పొరిన్+పొరిన్= మరల మరల; వచ్చుచున్= వస్తూ; పోవుచున్= పోతూ; ఉండున్= ఉంటాయి; అగుకాలము= అయిన కాలంలో, కాలం కలిసి వచ్చినప్పుడు; దుర్బుద్ధికిన్+ఐనను= దురాత్ముడికైనా; అర్థముల్= సంపదలు; సిద్ధించున్= లభిస్తాయి; కాని కాలమునన్= కాలం కలిసి రాకపోతే; ఆర్యులు+అయ్యున్= సత్ప్రవర్తన కలిగిన వారికైనా; ఘటింపనేరవు= (ధనములు) లభించవు; అనిల= వాయువు; వర్ష= వాన; ఆతప= ఎండ; ఇందురుచులు= చంద్రకాంతులు, వెన్నెల; కాల కల్పితములు= కాలం కూర్చినట్టివి; మంత్ర= మంత్రాలు, ఆలోచనం; శిల్ప= బొమ్మలు (ఆకృతులు విగ్రహాలు); ఔషధంబులు= మందులు; మేలు+చేఁత= మంచిచేయటం; కాలకీలితంబు= కాలం యొక్క ఏర్పాటే.

తాత్పర్యం: 'ధర్మరాజా! బాధలను పొమ్మని తోసివెయ్యటం, సుఖాలను రమ్మని తీసికొనిరావటం, మనవశంలో లేదు. పూర్వజన్మలో చేసిన మంచి చెడు పనుల కారణంగా, కాలమే సుఖదుఃఖాలను తగినట్లుగా కలిగిస్తుంది. ఆ సుఖదుఃఖాలు కలకాలం నిలిచేవి కావు. మాటి మాటికి వస్తూ, పోతూ ఉంటాయి. కాలం కలిసివస్తే ఎంతటి దుర్మార్గుడికైనా సంపదలు సిద్ధిస్తాయి. కాలం కలిసిరాకపోతే సచ్ఛీలుడికైనా సంపదలు రావు. గాలి, వాన, ఎండ, వెన్నెల మొదలైనవన్ని కాలంచేత చేయబడినవే. ఆలోచన లేక మంత్రములుకాని, కూర్పులు, లేక శిల్పాకృతులు కాని, మందులుకాని ఫలించి మేలు చేయటం కాలఘటనమే.

విశేషం: మంత్రాలు, యంత్రాలు, మందులు పనిచేశాయని మానవులు భ్రమపడతారు. వాస్తవానికి కాలం కలిసి వచ్చినప్పుడే అవి సత్ఫలితాల నిస్తాయి. ఇంకా సరిగా చెప్పాలంటే కాలం కలిసివచ్చినప్పుడే వాటిని ఆశ్రయించటం జరుగుతుంది.

క. కమలంబులుఁ దొవలు వికా । సముఁ బొందుట, లతలుఁ దరులు సకుసుమ ఫలభా
వముఁ బొందుట, పక్షులును మృ । గములును మదకలము లగుట కాలకలితముల్. 186

ప్రతిపదార్థం: కమలంబులున్= తామరలు; తొవలు= కలువలు; వికాసమున్+పొందుట= విచ్చుకొనటం; లతలున్= తీగలు; తరులు= వృక్షాలు; సకుసుమ+ఫల+భావమున్+పొందుట= పూలతోనూ, పళ్ళతోనూ కూడుకొన్న స్థితిని పొందటం; పక్షులును= పిట్టలూ; మృగములును= జంతువులూ; మదకలములు= మదంతో కూడినవి కావటం - సంతానోత్పత్తికి సిద్ధంగా ఉండటం; కాలకలితముల్= కాలంయొక్క కల్పనలే.

తాత్పర్యం: ధర్మరాజా! తామరలు, కలువలు విచ్చుకొనటం (ఇవి సూర్యోదయ చంద్రోదయ సూచకాలు), తీగలూ వృక్షాలూ, పూలతోనూ, పళ్ళతోనూ నిండి ఉండటం (ఇవి ఋతువులకు సూచకాలు), పక్షులూ, మృగాలూ సంతానోత్పత్తికి సిద్ధంకావటం కాలంయొక్క కల్పనలే.

వ. మఱియు జనన మరణంబులును, హానివృద్ధులును, లోనుగా సకలంబును గాలాధీనంబ కావున నీకు శోకింపం బనిలేదు; తొల్లి సేనజి త్తను మానవపతి పుత్ర మరణ శోకార్తుండై యుండి తనలోనన తెలిసి సజ్జన సన్నిధి నుపన్యసించిన వాక్యంబు లాకర్ణింపుము. 187

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ వినుము; జనన+మరణంబులును= పుట్టుక, చావు; హానివృద్ధులును= నశించటం, పెరగటం; లోనుగాన్= మొదలైన; సకలంబును= సమస్తమూ; కాల+అధీనంబు+అ= కాలానికి లోబడి ఉంటుంది; కావునన్= కనుక; నీకున్; శోకింపన్= బాధపడే; పని లేదు= అవసరం లేదు; తొల్లి= పూర్వం; సేనజిత్తు+అను= సేనజిత్తు అనే పేరుగల; మానవపతి= రాజు; పుత్రమరణ= కుమారుడి చావువలన; శోక+ఆర్తుండు+ఐ= విషాదంతో బాధపడిన వాడై; ఉండి; తనలోనన్+అ= తనమనస్సులోనే; తెలిసి= ఎరిగినవాడై, జ్ఞానబోధ పొంది; సత్+జన= ఆర్యుల; సన్నిధిన్= సమక్షంలో; ఉపన్యసించిన= మాటాడిన; వాక్యంబులు= వచనాలు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ధర్మరాజా! అంతేకాదు. చావు పుట్టుకలు, ఎదుగుదల, తరుగుదలలు మొదలైన సర్వమూ కాలానికి లోనై ఉంటాయి సుమా! అందువలన నీవు బాధపడవలసిన పనిలేదు. పూర్వం సేనజిత్తు అనే రాజు పుత్రమరణం వలన మిక్కిలి బాధపడి, జ్ఞానబోధను తనలోనుండే పొందాడు. (బయటినుండి ఎవరూ అతడికి బోధ చేయలేదు). తానెరిగిన దానిని పెద్దల సాన్నిధ్యంలో చెప్పాడు. ఆ మాటలు వినుము.

విశేషం: జ్ఞానం ఎప్పుడూ మనిషికి అంతరంగంలో నిక్షిప్తమై ఉంటుంది. బాహ్యమైన బోధలు దోహదం మాత్రం చేస్తాయి. జ్ఞానబోధ 'తన' (ఆత్మ)లో నుండి మాత్రమే కలుగుతుంది. ఈ వాస్తవాన్ని వ్యాసుడు ధర్మరాజుకు కూడా తెలిపాడు.

పారాశర్యుఁడు ధర్మజునకు సేనజిత్తువాక్యంబు లుపన్యసించుట (సం.12-26-18)

సీ. 'తారు గొందఱకు బాధకు లయి నడచుట । పరులచే బాధలఁ బడుట గలుగు;
నివి కాలభావ్యంబు; లెఱుక కల్గిన నొరుఁ । బఱిచితి నొరులచేఁ బడితి ననుచుఁ
బురుషుండు ప్రియశోకములఁ బొందఁ; డర్థ దా । రాపత్య బాంధవహాని కాత్మఁ
గుందంగ నడలుట మందబుద్ధిత్వంబు; । వగఁ గీడు మానునే? వలవ దడల;

తే. శోకభయకారణంబులు లోకమున న । నేకములు; దానఁ దలసూపు శోకములకు
భయములకు బుద్ధి నెడయూఁడు పండితుండు । మూఢుఁడవి త్రోవనేరండు మునుఁగు వగల. 188

ప్రతిపదార్థం: తారు= తాము; కొందఱకున్= కొంతమందికి; బాధకులు+అయి= బాధించేవారై; నడచుట= ప్రవర్తించటం; పరులచేన్= ఇతరులచేత; బాధలుపడుట= కష్టపడటం; కలుగున్= జరుగుతాయి; ఇవి= ఈ కష్టపెట్టటం, కష్టపడటం అనేవి; కాలభావ్యంబులు= కాల స్వరూపంగా భావించదగినవి; ఎఱుక కల్గినన్= ఈ జ్ఞానం ఉంటే; పురుషుండు= మానవుడు; ఒరున్= పరుని; పఱిచితిన్= నేలకూల్చాను; ఒరులచేన్= ఇతరులచేత; పడితిన్= బాధపడ్డాను; అనుచున్= అంటూ; ప్రియశోకములన్= సంతోషాన్ని, దుఃఖాన్ని; పొందఁడు= కలిగి ఉండడు; అర్థ= ధన; దార= భార్య; అపత్య= సంతతి; బాంధవ= చుట్టాలయొక్క; హానికిన్= నష్టానికి; ఆత్మన్= మనసులో; కుందంగన్= కుమిలిపోయేటట్లు; అడలుట= ఏడ్వటం; మంద బుద్ధిత్వంబు= తెలివితక్కువతనం; వగన్= బాధవలన; కీడు= చేటు; మానును+ఏ?= తగ్గుతుందా?; అడలన్= దుఃఖించటం; వలవదు= కూడదు; లోకమునన్= లోకంలో; శోక, భయ, కారణంబులు= దుఃఖానికి, భయానికి, కారణాలు; అనేకములు= ఎన్నో ఉన్నాయి; దానన్= ఆ కారణంగా; పండితుండు= జ్ఞాని; తల+చూపు= పొడగట్టే, కనిపించే; శోకములకున్= దుఃఖాలకు; భయములకున్= భయాలకు; బుద్ధిన్= మనసులో; ఎడ+ఈఁడు= చోటుఇవ్వడు; మూఢుఁడు= మూర్ఖుడు; అవి= వాటిని; త్రోవనేరండు= తొలగ త్రోయలేడు; వగలన్= బాధలలో; మునుఁగున్= మునిగిపోతాడు.

తాత్పర్యం: 'లోకంలో తాము కొందరిని బాధించటం, కొందరు తమనే బాధపెట్టటం జరుగుతాయి. ఇవన్నీ కాలప్రభావాలనే భావించాలి. ఈ జ్ఞానం ఉన్న మానవుడు తాను బాధించాననో, బాధపడ్డాననో సంతోషాన్ని, దుఃఖాన్ని

పొందడు. ధనం, భార్య, సంతానం, బంధువులు పోయినప్పుడు మనసు కష్టపడేటట్లు బాధ పడటం తెలివితక్కువతనం అవుతుంది. బాధపడితే జరిగిన నష్టం పోతుందా? కనుక బాధపడకూడదు. భయానికి, శోకానికి లోకంలో కారణాలు అనేకం. అందువలననే జ్ఞాని అయినవాడు తన మనస్సులో భయశోకాలకు తావీయడు. మూర్ఖుడు వాటిని తొలగించలేక, బాధలలో మునిగిపోతాడు.

క. వినుఁ డీ సుఖమును దుఃఖము । ననిత్యములు గాన వానియాగమ కాలం
బున ముదమును శోకము మొగ । కొనమియ చు మ్ముఱవు శాంతి గోరు జనులకున్. 189

ప్రతిపదార్థం: వినుఁడు+ఈ= వినవలసింది; సుఖమును= సంతోషం; దుఃఖమును= బాధా; అనిత్యములు= శాశ్వతాలు కావు, తాత్కాలికాలు; కాన= కనుక; శాంతిన్= మనశ్శాంతిని; కోరు= కావాలనుకొనే; జనులకున్= మానవులకు; వాని= ఆ సుఖదుఃఖాల; ఆగమ కాలంబునన్= వచ్చే సమయంలో; ముదమును= సంతోషానికి; శోకమును= బాధకు; మొగకొనమి+అ= అభిముఖం కాకపోవటమే; ఉరవు= ఉచితం; చుమ్ము= సుమా!

తాత్పర్యం: సుఖదుఃఖాలు తాత్కాలికాలు కనుక, శాంతికాముకులైన జనులు సుఖం వచ్చినప్పుడు సంతోషాన్నీ, దుఃఖం వచ్చిప్పుడు బాధనూ పొందకుండా ఉండటం ఉచితం.

తే. మూఢతమబుద్ధు లగువారుఁ బ్రౌఢతమ వి । వేకులును సుఖు; లట్టులు గాక కొంత
ప్రజ్ఞగలవారలై యపప్రతిభు లైన । జనులు దుఃఖార్తు లగుట నిస్సంశయంబు.' 190

ప్రతిపదార్థం: మూఢతమ బుద్ధులు+అగువారు= మిక్కిలి మూర్ఖమైన బుద్ధికలవారూ; ప్రౌఢతమవివేకులును= మిక్కిలి ఘనమైన, గాఢమైన విచక్షణాజ్ఞానం కలిగినవారూ; సుఖులు= సుఖపడతారు; అట్టులు= ఆ విధంగా; కాక= కాకుండా; కొంత= కొద్ది; ప్రజ్ఞకలవారలు+ఐ= స్వతస్సిద్ధమైన తెలివి కలిగినవారై; అపప్రతిభులు+ఐన= సరైన ప్రతిభ లేని వారైనటువంటి; జనులు= మానవులు; దుఃఖ+ఆర్తులు= శోకంతో బాధపడేవారు; అగుట= అవటం; నిస్సంశయంబు= నిస్సందేహం, తప్పనిసరి.

తాత్పర్యం: మూర్ఖచక్రవర్తులూ (ఏమీ తెలియనివారు) జ్ఞానశ్రేష్ఠులూ (అన్నీ తెలిసినవారు) సుఖజీవులు. అట్లా కాకుండా తెలివి ఉండి, ప్రతిభ సరైన దారిలో లేనివారు మాత్రం దుఃఖంతో బాధపడటం తప్పదు'.

విశేషం: తెలిసీ తెలియని వారికే దుఃఖం కలుగుతుంది. మిడిమిడి జ్ఞానం భయహేతువు.

వ. అనియె; నాసేనజితుం డుదాత్త వివేక నిరూఢుం; డతని వచనంబులు విద్వదాదరణీయంబు; లిందలి
యర్థంబు నీ చిత్తంబున నలవరింపుము; వగ యుజ్జగింపు' మని వెండియు. 191

ప్రతిపదార్థం: ఉదాత్త= అధికమైన; వివేక= విచక్షణాజ్ఞానం (మంచి చెడ్డలను నిత్యానిత్యాలను ఏర్పరచి చూడగల తెలివి)లో; నిరూఢుండు= బాగా పాతుకొని స్థిరపడిన వాడైన; ఆ సేనజితుండు= ఆ సేనజితుడు అనేరాజు; అనియెన్= పలికాడు; అతని వచనంబులు= అతడి మాటలు; విద్వత్= పండితులచేత; ఆదరణీయంబులు= ఆదరించదగినవి, అంగీకరించదగినవి; ఇందలి= ఈ మాటలలోని; అర్థంబు= భావం; నీ చిత్తంబునన్= నీ మనస్సులో; అలవరింపుము= అనుసరించుము; వగ= బాధను; ఉజ్జగింపుము= వదలుము; అని= పలికి; వెండియున్= తిరిగి, ఇంకనూ.

తాత్పర్యం: నిత్యానిత్య వివేకజ్ఞానాన్ని చక్కగా నిరూపించినవాడైన సేనజిత్తు ఆ విధంగా ఉపన్యసించాడు. అతడి మాటలు పండితులు ఆదరించదగినవి. ఆ మాటలలోని భావాన్ని నీ మనస్సుకు కాస్త పట్టనిమ్ము. శోకాన్ని వదలిపెట్టుము.' అని చెప్పి వ్యాసుడు ఇంకా ఇట్లా అన్నాడు.

తే. ' వర్ణముల నాశ్రమంబుల వలను మెఱసి । యరసి చక్కని తెరువున నరుగఁ జేసి
ధరణి పాలింపు సముచిత దండధరణ । మాచరింపుము; నీ కిది యర్హవృత్తి. 192

ప్రతిపదార్థం: వర్ణములన్+ఆశ్రమంబులన్= చతుర్వర్ణాలనూ, చతురాశ్రమాలనూ, వలను= వీలు; మెఱసి= ప్రకాశించి, కలిగి; అరసి= పరికించి, చూచి; చక్కని= సరైన, తిన్ననైన; తెరువునన్= దారిలో; అరుగన్+చేసి= నడచేటట్లుచేసి; ధరణిం= భూమిని; పాలింపు= పాలనచేయుము; సముచిత= చక్కగా తగినటువంటి; దండధరణము= దండనీతిని వహించటం; ఆచరింపుము= చేయుము; నీకున్; ఇది= భూ పరిపాలనే; అర్హవృత్తి= తగినటువంటి జీవన విధానం.

తాత్పర్యం: నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలు సరైన దారిలో నడిచేటట్లుగా వాటి ఆనుపానులు బాగా పరికించి తెలిసికొని భూమిని పాలించుము; చక్కని దండనీతిని అమలు పరచుము; నీకు తగిన జీవన విధానం ఇదే.

క. దివికిం జనినను నెవ్వని । వివిధ గుణము లఖిల జనులు వినుతింతురు వాఁ
డవనీశ్వర! సత్పురుషుం । డవునని కయికొండ్రు బుద్ధి నార్యజనంబుల్. 193

ప్రతిపదార్థం: అవనీ+ఈశ్వర!= రాజా!; దివికిన్= స్వర్గానికి; చనిననున్= వెళ్ళినా, (స్వర్గస్థుడైనా); ఎవ్వని= ఎవరి; వివిధ= అనేకమైన; గుణములు= సద్గుణాలను; అఖిలజనులు= జనులందరు; వినుతింతురు= కీర్తిస్తారో; వాఁడు= అతడు; సత్+పురుషుండు+అవును+అని= సజ్జనుడవుతాడని; ఆర్యజనంబుల్= పెద్దలు; బుద్ధిన్= మనస్సులో; కయికొండ్రు= అంగీకరిస్తారు.

తాత్పర్యం: 'ధర్మరాజా! స్వర్గస్థుడైన తరువాత కూడా ఎవరి సద్గుణాలను లోకంలోని వారంతా కీర్తిస్తుంటారో, అట్టివాడు సజ్జను డని పెద్దలు అంగీకరిస్తారు.

వ. కావున సకల జనహృదయ ప్రియహితం బగు పృథ్వీపరిరక్షణంబు నీకుం గులధర్మంబై కర్తవ్యం బగుట యుఱవుగాదె!' యనిన యమ్మునీంద్రునకు నమ్మనుజేంద్రుం డిట్లనియె. 194

ప్రతిపదార్థం: కావునన్= కనుక; సకల= సమస్తమైన; జన= ప్రజల; హృదయ= మనసులకు; ప్రియ= ఇష్టము; హితంబు= మేలు; అగు= అయిన; పృథ్వీ= భూమియొక్క; పరిరక్షణంబు= కాపాడటం; నీకున్= నీకు; కులధర్మంబు+ఐ= నీవు జన్మించిన రాజవంశం యొక్క విధి అయి ఉండి; కర్తవ్యంబు+అగుట= నీవు చేయవలసిన పని అయి ఉండటం; ఉఱవు= ఉచితం; కాదు+ఎ!= కదా!; అనిన= అన్న; ఆ+ముని+ఇంద్రునకున్= ఆ మునిశ్రేష్ఠుడితో; ఆ+మనుజ+ఇంద్రుండు= రాజశ్రేష్ఠుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కనుక సమస్తమైన ప్రజల హృదయాలకు, ఇష్టాన్నీ, మేలునూ కలిగించే రాజ్యపాలనం. నీకు జన్మతః ప్రాప్తించిన కులధర్మం అయి, తప్పక నిర్వర్తించవలసిన కర్తవ్యంగా ఉన్నది' అని ముని అన్నమాటలు విని రాజు ఈ విధంగా పలికాడు.

తే. మఱవవచ్చునె నా కభిమన్యు ద్రౌప । దేయులను గర్ణ మత్స్య భూనాయకుండు
ద్రుపద నృపతియు ధృష్టకేతుండు మాన । సమునఁ బాయుదురే యెట్లు శాంతి గలుగు? 195

ప్రతిపదార్థం: నాకున్; అభిమన్యున్= అభిమన్యుడినీ; ద్రౌపదేయులను= ద్రౌపది పుత్రులైన ఉపపాండవులనూ; కర్ణున్= కర్ణుడినీ; మఱవన్+వచ్చును+ఎ= మరవటం వీలవుతుందా; మత్స్యభూనాయకుండు= మత్స్యదేశరాజు అయిన విరటుడు; ద్రుపదనృపతియున్= ద్రుపద మహారాజూ; ధృష్టకేతుండు= ధృష్టద్యుమ్నుడు; మానసమునన్= మనస్సునందుండి; పాయుదురు+ఎ?= పోగలరా?; ఎట్లు= ఏ విధంగా; శాంతి= మనశ్శాంతి; కలుగున్?= కలుగుతుంది?

తాత్పర్యం: 'మహర్షీ! నాకు అభిమన్యుడినీ, ఉపపాండవులనూ, కర్ణుడినీ మరవటం వీలవుతుందా? (మరవలేనని భావం). విరాటరాజును, ద్రుపదమహారాజును, ధృష్టద్యుమ్నుడినీ మనసులోనుండి తొలగించగలనా? (మరవలేనని భావం). అట్టి స్థితిలో నాకు శాంతి ఎట్లా కలుగుతుంది?

సీ. తొడలపై నర్మిలి నిడికొని న న్నుప । లాలించుచుండు బాల్యమున నట్టి
భీష్మునిఁ జంపితి; బీభత్సు భల్లముల్ । దనువు సెక్కంగ నాతఁడు శిఖండిఁ
జూచుచు నుండుటఁ జూచితి; నది యుల్ల । మలమటఁ బెట్టెడి; నట్లుగాక
యా భంగి నున్నప్పు డాతఁ డాద్రుపదజు । నేయమిఁ దలఁచిన నెరియు మనసు;

తే. పరశురాముని నోర్చిన బల్లిదుండు, । కాశిరాజ కన్యకలకుఁ గాఁగఁ బుడమి
నరపతుల నెల్ల గెలిచిన బిరుదు గలన । నాఱడియ పడు టూహింప నడలు గదురు. 196

ప్రతిపదార్థం: బాల్యమునన్= పసితనంలో; తొడలపైన్= ఒడిలో; అర్మిలిన్= ప్రేమతో; ఇడికొని= కూర్చుండపెట్టుకొని; నన్నున్+ఉపలాలించుచున్+ఉండు= నన్ను బుజ్జగిస్తూ ఉండే; అట్టి= అటువంటి; భీష్మునిన్= పితామహుడిని; చంపితిన్= చంపాను; బీభత్సు= అర్జునుడి; భల్లముల్= బాణాలు; తనువు= శరీరాన్ని; చెక్కంగన్= నాటుకొనగా; ఆతఁడు= ఆ భీష్ముడు; శిఖండిన్= శిఖండిని; చూచుచున్= చూస్తూ; ఉండుటన్= ఉండటం; చూచితిన్= చూచాను; అది= ఆ దృశ్యం; ఉల్లమున్= మనస్సును; అలమటన్= బాధ, చింత; పెట్టెడిన్= పెట్టుతుంది; అట్లు+కాక= అదేకాక; ఆ భంగిన్= ఆ విధంగా; ఉన్నప్పుడు= ఉన్న సమయంలో; ఆతఁడు= ఆ భీష్ముడు; ఆ ద్రుపదజున్= శిఖండిని; ఏయమిన్= బాణాలతో కొట్టకపోవటాన్ని; తలఁచినన్= తలచుకొంటే; మనసు= మనస్సు; ఎరియున్= కష్టపడుతుంది; పరశురామునిన్= భార్గవరాముడిని; ఓర్చిన= ఓడించిన; బల్లిదుండు= వీరుడు; కాశిరాజ కన్యకలకున్+కాఁగన్= కాశీరాజు కుమార్తెలైన అంబ, అంబిక, అంబాలికల కొరకు; పుడమి= భూలోకంలోని; నరపతులన్= రాజులను; ఎల్లన్= అందరినీ; గెలిచిన= ఓడించిన; బిరుదు= ప్రఖ్యాతుడు; కలనన్= యుద్ధంలో; ఆఱడి+అ= కష్టమే, ఇబ్బంది; పడుట= పడటం; ఊహింపన్= తలచుకొంటే; అడలు= బాధ; కదురున్= కలుగుతుంది.

తాత్పర్యం: చిన్నతనంలో ప్రేమగా ఒడిలో కూర్చోపెట్టుకొని బుజ్జగించి ముద్దుచేసిన భీష్ముడిని చంపించాను. అర్జునుడి బాణాలు శరీరంలో నాటుకొంటూ ఉండగా, శిఖండివంక చూస్తూ ఉన్న దృశ్యం నా మనస్సును కష్టపెట్టుతూనే ఉంటుంది. ఆయన ఆ స్థితిలో శిఖండిపై బాణాలు వేయకుండా ఉండటం తలచుకొంటే మనసుకి కష్టంగానే ఉంటుంది. పరశురాముడంతటి వాడినే గెలిచిన యోధుడు, అంబ, అంబిక, అంబాలికలకై భూతలంపై ఉన్న రాజులందరినీ గెలిచిన ప్రసిద్ధుడు అయినటువంటి వాడు యుద్ధభూమిలో ఇరుకున పడటం తలచుకొంటే బాధ కలుగుతుంది.

ఆ. అల్పకాల భోగ్యమైన రాజ్యమునకుఁ । గా ననల్పకీర్తిఘనుని జరఠ
సింహకల్పు వంశశేఖరజన్ముఁ ద్రుం । చితి మనంబు వగలఁ జివుక కున్నె. 197

ప్రతిపదార్థం: అల్పకాల= కొద్దికాలం; భోగ్యము+ఐన= అనుభవించదగినదైన; రాజ్యమునకున్+కాన్= రాజ్యంకొరకు; ఆనల్ప= తక్కువ కాని, అధికమైన; కీర్తిఘనుని= కీర్తిచే గొప్పవాడైన; జరఠ= ముసలిదైన; సింహకల్పున్= సింహంతో; సమానమైనవాడిని; వంశశేఖరజన్ముఁన్= కులంలో తలమానికమై జన్మించినవాడిని; త్రుంచితిన్= సంహరించాను; మనంబు= మనస్సు; వగలన్= బాధలతో; చివుకక+ఉన్నె?= చీకిపోకుండా ఉంటుందా?

తాత్పర్యం: అశాశ్వతమైన రాజ్యభోగంకొరకు గొప్పకీర్తి కలవాడు, గట్టి వృద్ధసింహంతో సమానుడు, కురువంశానికి తలమానికమైనవాడు అయిన భీష్ముడిని సంహరించాను. దానికి నా మనస్సు బాధతో చివికి పోకుండా ఉంటుందా? (ఉండదని భావం).

మ. జన సంపూజ్య పదారవిందుఁ డగు నాచార్యుండు శోకించి నం
దను చొప్పారయ వేఁడి పెద్దయు ననుం దా నమ్మి యర్థింపఁ జా
వని వానిం గరిచావు బుద్ధి నిడి యశ్వత్థామ సచ్చెన్ నిజం
బని యే బొంకితి మేదినీభరణ మర్హంబే గురుద్రోహికిన్? 198

ప్రతిపదార్థం: జన= జనులందరిచేత; సంపూజ్య= చక్కగా పూజించదగిన; పద+అరవిందుఁడు+అగు= పాదపద్మాలు కలవాడైన; ఆచార్యుండు= గురువు; శోకించి= బాధపడి; నందను= పుత్రుడి; చొప్పు+ఆరయన్= జాడతెలుసుకొనగా; వేఁడి= ప్రార్థించి; పెద్దయున్= అధికంగా; ననున్= నన్ను; తాన్= అతడు; నమ్మి= విశ్వసించి; అర్థింపన్= కోరగా; చావనివానిన్= చనిపోనివాడిని; కరిచావు= ఏనుగు మరణాన్ని; బుద్ధిన్+ఇడి= మనస్సులో పెట్టుకొని; అశ్వత్థామ+చచ్చెన్= అశ్వత్థామ చచ్చిపోయాడు; నిజంబు= నిజం; అని; ఏన్= నేను; బొంకితిన్= అబద్ధమాడాను; గురు ద్రోహికిన్= గురువుకు ద్రోహం చేసిన పాపికి; మేదినీభరణము= భూభారం వహించటం; అర్హంబు+ఏ?= తగినదా?

తాత్పర్యం: ప్రజలందరిచేత బాగా పూజింపబడే పాదపద్మాలు కల గురువైన ద్రోణుడు, తనకుమారుడి జాడ తెలియక బాధపడి, నాపై నమ్మకంతో వెదకుమని కోరగా - చచ్చిన ఏనుగును మనస్సులో పెట్టుకొని, చావని గురుపుత్రుడి గురించి 'అశ్వత్థామ చనిపోయాడు. ఇది నిజం.' అని అబద్ధమాడాను. గురుద్రోహికి భూభారం వహించే అర్హత ఉంటుందా? (ఉండదని భావం).

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

ఆ. రాజ్యలాభ లోభరతుఁ డయి కడుఁ బాప । మైన బొంకు మాటలాడి గురునిఁ
గూల్పనేర్చినట్టి క్రూరాత్ముఁ డేగతిఁ । బోవువాఁడు సెపుమ బుధవరేణ్య! 199

ప్రతిపదార్థం: బుధవరేణ్య!= పండితోత్తముడా!; రాజ్యలాభ= రాజ్యం పొందాలనే; లోభరతుఁడు+అయి= లోభబుద్ధికలవాడై; కడున్= మిక్కిలి; పాపము+ఐన= దుష్కర్మమైన; బొంకుమాటలు= అబద్ధపు పలుకులు; ఆడి= పలికి; గురునిన్= ఆచార్యుడిని; కూల్పన్= పడగొట్టటం; నేర్చిన+అట్టి= తెలిసికొన్నటువంటి; క్రూర+ఆత్ముఁడు= దుర్బుద్ధి; ఏగతిన్= ఏ గతికి; పోవువాఁడు= వెళ్ళుతాడో; చెపుము+అ= చెప్పుము.

తాత్పర్యం: అన్నీ తెలిసిన పండితులలో ఉత్తముడైనవాడా! రాజ్యం పొందాలనే దురాశతో నిండిన మనసు కలవాడై మిక్కిలి పాపకార్యమైన అసత్యం పలికి, గురువును చంపటం నేర్చుకొన్న కఠినాత్ముడి గతి పొందుతాడో చెప్పుము.

క. భ్రాత మహాత్ముఁడు గర్ణుం । డాతనిఁ జంపించి యేలు నవనీరాజ్యం
బాతురత సేయుఁ గాక సు । ఖాతిశయము మతికి నొసఁగునయ్య మునీంద్రా! 200

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= మునివర్యా!; కర్ణుండు= కర్ణుడు; భ్రాత= సోదరుడు; మహా+ఆత్ముఁడు= మహానుభావుడు; ఆతనిన్= ఆ కర్ణుడిని; చంపించి= చంపేటట్లు చేసి; ఏలు= పాలించే; అవనీరాజ్యంబు= ధరణీరాజ్యం; ఆతురత= కల్లోలం,

బాధ; చేయున్= కలిగిస్తుంది; కాక= తప్ప; సుఖ+అతిశయము= అధికమైన సుఖాన్ని; మతికిన్= మనస్సుకు; ఒసగును+అయ్య!= ఇస్తుందా? (ఇవ్వదని భావం).

తాత్పర్యం: మునీంద్రా! మహానుభావుడు, సోదరుడు అయిన కర్ణుడిని చంపించి చేసే రాజ్యపాలన బాధకలిగిస్తుందే కాని మనసుకు అధికమైన సుఖాన్ని ఇవ్వగలదా?

చ. కడిఁది మగండు కుంభజుఁడు గావఁగ నొప్పిన మంటవోలె నుం
డెడి మొనఁ జూచి చూచి యిది డెప్పర మ న్వగ లేక పంచితిం
గొడుకుఁ జొరంగ; నత్తెఱఁగు క్రూరత సైఁప సుభద్ర యట్లుఁ గ
వ్వడిక్రియ నేర్తురే యొరులు? వల్లభుఁ డేలగు నట్టిఁ డుర్వికిన్. 201

ప్రతిపదార్థం: కడిఁది= అధికమైన, గొప్ప; మగండు= శూరుడు; అయిన; కుంభజుఁడు= ద్రోణుడు; కావఁగన్= కాపాడుతుండగా; ఒప్పిన= పెద్దదైన; మంట+పోలెన్= అగ్నిజ్వాలవలె; ఉండెడి= ఉన్నటువంటి; మొనన్= సైన్యాన్ని; చూచి= పరికించి; ఇది= ఈ సైన్యం; డెప్పరము= దుస్సహం; అను= అనే; వగ= బాధ; లేక; కొడుకున్= కుమారుడిని, అభిమన్యుడిని; చొరంగన్= దూరుటకు, ప్రవేశించటానికి; పంచితిన్= పంపాను; ఆ+తెఱఁగు= ఆ విధమైన; క్రూరత= కాఠిన్యం; సుభద్ర+అట్లు= సుభద్రవలె; కవ్వడి+క్రియన్= అర్జునుడివలె; ఒరులు= ఇతరులు; సైఁపన్= సహించటం; నేర్తురే?= నేర్వగలరా?; అట్టిఁడు= అట్టివాడు (అట్టి క్రూరుడు); ఉర్వికిన్= భూమికి; వల్లభుఁడు= భర్త, రాజు; ఏల+అగున్?= ఏవిధంగా కాగలడు?

తాత్పర్యం: చాల గొప్ప శూరుడైన ద్రోణుడు కాపాడుతుండగా, పెద్ద అగ్నిజ్వాలవలె ఉన్న సైన్యాన్ని పరికించి కూడా దీనిని తట్టుకొనటం చాల కష్టం అనే బాధ లేక, కుమారుడైన అభిమన్యుడిని అందులో ప్రవేశించటానికి పంపించాను. అటువంటి నా క్రూరత్వాన్ని సుభద్రార్జునులవలె సహించగలవా రెవరైనా ఉంటారా? పసిబాలుడిని యుద్ధానికి పంపినటువంటి క్రూరుడు భూమిని పరిపాలించటానికి అర్హుడెట్లా అవుతాడు? (అభిమన్యుడిని యుద్ధానికి పంపి, మరణానికి కారణం అయినందువలన తనకు రాజ్యార్హత లేదని భావం.)

చ. అడ లెదఁ బొందఁగాఁ దగనియట్టిది ద్రోవది మేరుకల్పులం
గొడుకుల నేవురన్ జముఁడు గొన్న నలందురఁ జూడనేర్తునే?
పుడమి గిరీంద్ర పంచకము పోయినఁ బాడఱినట్టు లున్న య
ప్పడఁతుక యెట్టులోర్చు గృహభారము నెమ్మది నిర్వహింపఁగన్. 202

ప్రతిపదార్థం: అడలు= భయం; ఎదన్= మనసులో; పొందఁగాన్= పొందటానికి; తగని+అట్టిది= వీలుకానిది అయిన; ద్రోవది= ద్రౌపది; మేరు కల్పులన్= మేరుపర్వతంతో సమానమైన వారైన; కొడుకులన్= కుమారులను; ఏవురన్= ఐదుగురిని; జముఁడు= యముడు; కొన్నన్= తీసికొనిపోగా; అలందురన్= దుఃఖిస్తుండగా; చూడ నేర్తునే?= చూడగలనా?; పుడమి= భూమిపై; గిరీంద్ర పంచకము= ఐదు పర్వతరాజాలు; పోయినన్= పోగా; పాడఱినట్టులు+ఉన్న= పాడుపడినట్లుగా ఉన్నటువంటి; ఆ+పడఁతుక= ఆ స్త్రీ, ద్రౌపది; గృహభారము= ఇంటి బాధ్యత; నెఱ+మదిన్= నిండుమనసుతో, మనఃపూర్వకంగా; నిర్వహింపఁగన్= మోయటం; ఎట్టులు+ఓర్చున్?= ఎట్లా భరించగలుగుతుంది?

తాత్పర్యం: భయం బాధ మొదలైనవి మనసులో సహించలేనిది అయిన ద్రౌపది మేరుపర్వతంవలె గంభీరులు ఉన్నతులు అయిన కుమారులు ఐదుగురినీ యముడు తీసికొని పోగా, దుఃఖిస్తుండగా, నేను చూడగలనా? (ద్రౌపది

దుఃఖాన్ని చూడలేనని భావం). గొప్ప పర్వతాలు అయిదింటిని కోల్పోవటంవలన పాడుపడినట్లుగా ఉన్న భూదేవివలె ఉన్న ద్రౌపది గృహభారాన్ని మనఃస్థార్థిగా నిర్వహించగలదా? (లేదేమో నని భావం).

విశేషం: అలం: ఉపమ.

క. ప్రాయోపవేశమున ని । క్కాయంబు దొఱంగు తలఁపు గదిరెడి; సంతా
పాయత్తచిత్తు నకటక । టా యని పోనిండు నను ధృఢవ్రతయుక్తిన్. 203

ప్రతిపదార్థం: ప్రాయోపవేశమునన్= మరణంకొరకు ఎదురుచూస్తూ ఆహారం తీసికొనకుండా ఉండటం అనే పద్ధతితో; ఈ+కాయంబున్= ఈ శరీరాన్ని; తొఱంగు= వదిలే; తలంపు= ఆలోచన; కదిరెడిన్= కలుగుతున్నది; సంతాప+ఆయత్త+చిత్తున్= మిక్కిలి బాధతో సిద్ధపడిన మనస్సు కలవాడిని; అకట+అకటా+అని= అయ్యయ్యో అనుకొని; దృఢవ్రతయుక్తిన్= గట్టి నియమంతో కూడినవాడనైన; ననున్= నన్ను; పోనిండు= వెళ్ళనివ్వండి.

తాత్పర్యం: నిరశనదీక్షతో మరణంకొరకు ఎదురు చూచి శరీరం వదలాలనే ఆలోచన కలుగుతున్నది. ఎంతో బాధవలన దానికి సిద్ధపడిన మనసుకలవాడినై, స్థిరమైన నియమంతో ఉన్న నన్ను అయ్యో అని జాలిపడి వెళ్ళనివ్వండి'.

వ. అని పలికి బంధుమరణ శోక వ్యాకులుం డయి యున్న యున్నరనాథవరేణ్యుతో నమ్మునినాథ వరేణ్యుం డిట్లనియె. 204

ప్రతిపదార్థం: అని పలికి= ఈ విధంగా మాటాడి; బంధుమరణ= చుట్టముల చావువలన కలిగిన; శోక= విషాదంతో; వ్యాకులుండు+అయి= కలతపడినవాడై; ఉన్న= ఉన్నటువంటి; ఆ+నరనాథవరేణ్యుతోన్= ఆ రాజశ్రేష్ఠుడితో; ఆ+మునినాథవరేణ్యుండు= ఆ మునీశ్వరులలో శ్రేష్ఠుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా మాట్లాడి, చుట్టాలందరు చనిపోవటంతో బాధపడి కలతచెందిన మనస్సు కల రాజోత్తముడైన ధర్మరాజుతో మునిసత్తముడైన వ్యాసు డిట్లా అన్నాడు.

ఆ. ' ఇట్లనంగఁ దగునె? యిమ్మెయి నడల నీ । యట్టి ధైర్యఘనున కగునె యనఘ!
బుద్ధి సెప్పవలసెఁ బునరుక్తభాషలఁ । జెవులు మదియుఁ గూడఁ జేర్చి వినుము. 205

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడవైన ధర్మరాజా!; ఇట్లు= ఈ విధంగా; అనంగన్= అనటం; తగునె?= న్యాయమా?; నీ+అట్టి= నీ వంటి; ధైర్య ఘననకున్= ధైర్యంచేత గొప్పవాడైనవాడికి; ఈ+మెయిన్= ఈ విధంగా; అడలన్= భయపడటం; అగును+ఎ?= తగునా?; పునఃఉక్త= మళ్ళీ చెప్పిన; భాషలన్= మాటలతో; బుద్ధి+చెప్పవలసెన్= కర్తవ్యబోధ చేయాల్సి వచ్చింది; చెవులు= కర్ణాలూ; మదియున్= మనస్సునూ; కూడన్+చేర్చి= కలిసేటట్లుగా చేర్చి; వినుము= వినుము.

తాత్పర్యం: 'పుణ్యశీలివైన ధర్మరాజా! నీవీ విధంగా మాట్లాడటం తగదు. నీ వంటి ధైర్యశాలికి ఇట్లా భయపడటం కూడదు. మళ్ళీ మళ్ళీ నీకు కర్తవ్య బోధచేయవలసి వస్తున్నది. ఈ మారు చెవులూ మనసును కూడా చేర్చి వినుము.

తే. పొదలుఁ దఱుఁగుటకై, పొడవొదవుఁ బడుట । కై, కడుం జేరుఁ బాయుటకై, జనించుఁ
బొలియుటకునై సుఖంబులఁ బొందు దుఃఖ । మొందుటకునై పదార్థము లెందు నధిప! 206

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఎందున్= ఎక్కడైనా; పదార్థములు= వస్తువులు; తఱుఁగుటకై= తగ్గటానికి (నశించటానికి); పొదలున్= వృద్ధిపొందుతాయి; పడుటకై= పతనం కావటానికే; పొడవు+ఒదవున్= రూపొందుతాయి; పాయుటకై= వదలి వెళ్ళటానికే;

కడున్= మిక్కిలి; చేరున్= (దగ్గర) సమీపం అవుతాయి; పొలియుటకునై= చనిపోవటానికే; జనించున్= పుట్టుతాయి; దుఃఖము= బాధ; ఒందుటకునై= పొందటానికి; సుఖంబులన్= సుఖాలను; పొందున్= కలిగి ఉంటాయి.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఎక్కడైనా పదార్థం వృద్ధిపొందటం నశించటానికే, ఎత్తుపెరగటం విరగటానికే. దగ్గరకావటం దూరమవటానికే, పుట్టటం గిట్టటానికే, సుఖపడటం కష్టాలు పొందటానికే.

ఉ. మిత్రులచేఁతలన్ సుఖము మేకొను నంటయుఁ, జెందు దుఃఖముల్
శత్రులచెయ్డి నంటయును, సన్మతి దా ధనమూల మంటయున్,
గోత్రవరేణ్య! భోగములకున్ ధనముల్ గరణంబు లంటయుం,
జిత్రచరిత్రుఁడైన విధి చేష్ట దొఱంగిన నీటివ్రా లగున్. 207

ప్రతిపదార్థం: గోత్రవరేణ్య!= రాజోత్తమా! ధర్మరాజా!; మిత్రుల= హితుల; చేఁతలన్= పనులవలన; సుఖము= సౌఖ్యం; మేకొనున్= కలుగుతుంది; అంటయున్= అనటమూ; శత్రుల= వైరుల; చెయ్డిన్= చేతవలన; దుఃఖములు= కష్టాలు; చెందున్= వస్తాయి; అంటయును= అనటమూ; సత్+మతి= సద్బుద్ధి; తాన్= అది; ధనమూలము= ధనం మొదలుగా కలది; అంటయున్= అనటమూ; భోగములకున్= సుఖానుభవాలకు; ధనముల్= సంపదలు; కరణంబులు= సాధనాలు; అంటయున్= అనటమూ; చిత్ర చరిత్రుఁడు+ఐన= మానవమేధకు అంతుచిక్కని నడత కలవాడైన; విధి= విధాత; చేష్ట= కార్యం; తొఱంగిన= విడిచిన, కాదనిన; నీటివ్రాలు= నీటిపైన వ్రాత; అగున్= అవుతుంది.

తాత్పర్యం: రాజశ్రేష్ఠా! ధర్మరాజా! మిత్రులు చేసే పనులవలన సుఖాలు కలుగుతా యని, శత్రువుల పనులవలన దుఃఖాలు కలుగుతా యని, సద్బుద్ధికి ధనం కారణమని, భోగాలకు ధనం సాధనమవుతుందని, అనటం - చిత్రమైన నడత కలవాడైన బ్రహ్మచేతలను కాదన్నచో; నీటి మీద వ్రాసిన వ్రాత అవుతుంది (కల్ల అవుతుంది).

వ. కావున నెవ్వగ నొందం బనిలేదు. 208

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నెఱ+వగన్= ఎక్కువ బాధను; ఒందన్= పొందవలసిన; పని లేదు= అక్కర లేదు.

తాత్పర్యం: అందువలన ఎక్కువ బాధపడవలసిన పని లేదు.

ఆ. ధాత నిన్ను నేమి ధర్మంబు నడపుట । కై సృజించె దాని నాచరించి
యుండు; నీవు నీక యొడయుండవే? ధాతృ । నోదిత ప్రవర్తనుఁడవు గాక!' 209

ప్రతిపదార్థం: ధాత= సృష్టికర్త; నిన్నున్= నిన్ను; ఏమి ధర్మంబు= ఏ ధర్మాన్ని; నడపుటకై= ప్రవర్తింపచేయటానికి; సృజించెన్= సృష్టించాడో; దానిన్= ఆ ధర్మాన్ని; ఆచరించి= అమలు జరిపి; ఉండు= ఉండుము; ధాతృనోదిత= బ్రహ్మచేత ప్రేరేపింపబడిన; ప్రవర్తనుఁడవు+కాక= ప్రవర్తన (నడవడిక) కలిగిన వాడవు అవక; నీకున్+అ= నీకే; నీవు= నీవు; ఒడయుండవు+ఏ?= రాజువా?

తాత్పర్యం: నిన్ను బ్రహ్మ ఏ ధర్మాచరణకొరకు సృష్టించాడో, దానిని అమలు జరపవలసి ఉన్నది. నీకు నీవే రాజు వనుకొంటున్నావా? బ్రహ్మచేత నిర్దేశించబడిన నడత కలవాడివి కాక నీకు నీవే అధిపతివా?' (కావు - అని భావం.)

విశేషం: విధివ్రాత ననుసరించి ప్రవర్తిస్తారే కాని మానవులు స్వయంగా చేయలేరు అని భావం.

వ. అని పలికి యప్పారాశర్యుండు వెండియు నిట్లను 'విదేహరా జగు జనకుండు వివేకపరిపాకంబు నొందక మున్నొకసమయంబున బంధువియోగంబు వాటిల్ల విషాదంబు నొంది, గృహంబు దొఱంగి వెడలు వాఁడయ్యె; నట్టియెడ నతని పాలికి నశ్మకుం డను విప్రవర్యుండు వచ్చిన నవ్వసుమతీపతి సముచిత ప్రకారంబునం బూజితుం జేసి. 210

ప్రతిపదార్థం: అని పలికి= ఇట్లా చెప్పి; ఆ+పారాశర్యుండు= ఆ పరాశరాత్మజుడు వ్యాసుడు; వెండియున్= ఇంకా; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; విదేహరాజు+అగు= విదేహరాజ్యాధిపతి అయిన జనకమహారాజు; వివేకపరిపాకంబున్= నిత్యానిత్య వివేకంలో పరిణతి (పరిపక్వత)ని; ఒందకమున్ను= చెందక ముందు; ఒక సమయంబునన్= ఒకసారి; బంధువియోగంబు= చుట్టాలను కోల్పోవటం; పాటిల్లన్= కలుగగా; విషాదంబును= దుఃఖాన్ని; ఒంది= పొంది; గృహంబు= ఇంటిని; తొఱంగి= వదలి; వెడలువాఁడు+అయ్యెన్= వెళ్ళిపోవటానికి సిద్ధమయ్యాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; అతని పాలికిన్= ఆ జనకుడి వద్దకు; అశ్మకుండు+అను= అశ్మకుడనే పేరుగల; విప్రవర్యుండు= బ్రాహ్మణోత్తముడు; వచ్చినన్= రాగా; ఆ+వసుమతీపతి= ఆ రాజు (జనకుడు); సముచిత= తగిన; ప్రకారంబునన్= పద్ధతిలో; పూజితున్+చేసి= పూజించి.

తాత్పర్యం: ఈ విధంగా మాట్లాడి వ్యాసుడు ఇంకా ఇట్లా చెప్పాడు. 'ధర్మజా! విదేహరాజైన జనకుడు తత్త్వజ్ఞాన పరిపూర్ణుడు కాకముందు, ఒకసారి బంధువులను కోల్పోవటం జరిగి, ఆ బాధతో ఇల్లు వదలి పోదలచాడు. ఆ సమయంలో అశ్మకుడనే బ్రాహ్మణుడు జనకుడివద్దకు వచ్చాడు. జనకు డాతనిని తగినట్లుగా పూజించాడు (తరువాతి పద్యంతో అన్వయం).

జనకున కశ్మకుండు సెప్పిన నీతి వ్యాసుఁడు ధర్మజునకుఁ జెప్పుట (సం. 12-28-2)

తే. ' అర్థములు బంధువులుఁ గల్గినపుడు తద్వి । యోగమైనట్టి యెడను మర్త్యునకు నెద్ది
తలఁపుమై నున్న మదవిషాదంబు లడర । కుండుఁ జెప్పవె యది కృపాయుక్తి నన్నఘ!' 211

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; అర్థములు= ధనములు, సంపదలు; బంధువులున్= చుట్టాలు; కల్గినపుడు= ఉన్నప్పుడూ; తద్= వాటి; వియోగము= ఎడబాటు; ఐన+అట్టి+ఎడను= కలిగిన సందర్భంలోనూ; మర్త్యునకున్= మానవుడికి; ఎద్ది= ఏది; తలఁపుమైన్= ఆలోచనలో, బుద్ధిలో; ఉన్నన్= ఉంటే; మద విషాదంబులు= అహంకారం, దుఃఖం; అడరక+ఉండున్= విజృంభించకుండ ఉంటాయో; అది= దానిని; కృపాయుక్తిన్= దయతో కూడిన వాడవై; చెప్పవు+ఎ?= తెలియచెప్పవా? (చెప్పుమని ప్రార్థన).

తాత్పర్యం: 'మానవుడి బుద్ధిలో ఏది ఉంటే, ధనం, బంధువులు కలిగినపుడు అహంకారం, అవి పోతే దుఃఖం కలుగకుండా ఉంటాయో దానిని దయతో నాకు తెలియజెప్పుము'.

వ. అని యడిగిన నాతం డిట్లనియె. 212

ప్రతిపదార్థం: అని= అంటూ; అడిగినన్= అడుగగా; ఆతండు= ఆ అశ్మకుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: జనకు డట్లా అడగగానే అశ్మకు డీ విధంగా జవా బిచ్చాడు.

సీ. ' దుఃఖంబు సుఖమును దోడివ సంసార । మునకుఁ; దద్వశగతిఁ బోవు నరుని
యాత్మ నంబుదము గా డ్పపహరించిన విధం । బున నవి సెఱుచు; నేపున సుఖైక
భాగియు దుఃఖైకభాగియు లేమి లో । కంబునం దెలియంగఁ గనుట మందు
వానికి; విను జర రానీక త్రోవంగఁ । జావక యుండ వశంబె జలధి

తే. వలయ వేష్టిత క్షితి నేలు వానికైన ।, నధిప! యెద్ది వాటిల్లిన ననుభవించు
నపుడు ప్రాప్తవ్య మిది యని యంతరంగ ।, విభ్రమము లేక యునికి వివేక సరణి. 213

ప్రతిపదార్థం: అధిప!= జనక మహారాజా!; దుఃఖంబు= శోకం; సుఖమును= సంతోషమూ; సంసారమునకున్= గృహస్థజీవనానికి; తోడివి+అ= కలిసి ఉండేవే; తద్= వాటికి; వశగతిన్= లొంగిన విధంగా; పోవు= వర్తించే; నరుని= మానవుడిని; ఆత్మన్= మనస్సును; అంబుదము= మేఘాన్ని; గాడ్పు= గాలి, వాయువు; అపహరించిన విధంబునన్= మాయం చేసినట్లుగా; అవి= ఆ సుఖదుఃఖాలు; చెఱుచున్= చెడగొడతాయి; ఏపునన్= అధికంగా, మిక్కిలి; సుఖ+ఏక+భాగియున్= సుఖమును మాత్రమే అనుభవించే వాడు కాని; దుఃఖ+ఏక+భాగియున్= దుఃఖాన్ని మాత్రమే అనుభవించే వాడు కాని; లోకంబునన్= లోకంలో; లేమి= లేకపోవటం; తెలియంగన్+కనుట= తెలిసేటట్లు చూడటం (తెలిసికొనటం); వానికిన్= ఆ సుఖదుఃఖాలకు; మందు= ఔషధం, ప్రతిచర్య; వినుము= వినుము; జలధి+వలయ+వేష్టిత= సముద్రమనే వలయంచేత చుట్టబడిన; క్షితిన్= భూమిని; ఏలువానికిన్+ఐనన్= పాలించే చక్రవర్తికైనా; జర= ముసలితనమును; రానీక= రానీయక; త్రోవంగన్= ఆవలకు నెట్టటం; చావక= మరణించక; ఉండన్= ఉండటం; వశంబు+ఎ?= చేతులలో ఉన్నదా? వీలవుతుందా?; ఎద్ది= ఏది; పాటిల్లినన్= సంభవించినా, వచ్చినా; అనుభవించు+అపుడు= అనుభవించే సమయంలో; ఇది= ఆ వచ్చినది; ప్రాప్తవ్యము= పొందదగింది; అని= అనుకొని; అంతరంగ విభ్రమము=మనస్సు భ్రమపడటం, చెదరటం; లేక= లేకుండా; ఉనికి= ఉండటం; వివేకసరణి= జ్ఞానమార్గం, తెలిసినవారి పద్ధతి.

తాత్పర్యం: 'జనక మహారాజా! సుఖదుఃఖాలు సంసార జీవనంలో కలిసే ఉంటాయి. గాలి మేఘాన్ని చెదరగొట్టినట్లు, వాటికి లోనై వర్తించే మానవుడి ఆత్మను అవి చెదరగొడతాయి. లోకంలో అధికమైన సుఖాలు మాత్రమే అనుభవించే వారు కాని, దుఃఖాలు మాత్రమే అనుభవించేవారు కాని లేరని తెలిసికొనటమే వాటికి తగిన మందు. సముద్రం చేత చుట్టబడిన భూమండలాన్నంతటినీ పరిపాలించే చక్రవర్తికి అయినా వార్ధక్యాన్ని దగ్గరకు రానీయక దూరంగా నెట్టటం కాని, చనిపోకుండా ఉండటం కాని వశమా? (కాదు కదా!) ఏది ఘటిల్లినా, అది ప్రాప్తం అనుకొని చిత్తం చెదరకుండా ఉండటం జ్ఞానుల పద్ధతి.

విశేషం: అలం: ఉపమ.

క. నరవర! సరసాన్నంబులుఁ ।, బరిమళ సద్వస్తువులును బరమశయన వి
ష్టరములుఁ గాలాధీనత ।, నరుఁ బొందుం, బాయు; వాని నమ్మమియ యుఱున్. 214

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; సరస+అన్నంబులున్= ఆరు రుచులతో కూడిన ఆహారాలు; పరిమళ= సువాసనలు చిమ్మే; సత్+వస్తువులును= మంచి పదార్థాలు; పరమ= ఉత్తమోత్తమమైన; శయనవిష్టరములున్= శయ్యలు, ఆసనాలు; కాల+అధీనతన్= కాలానికి లోబడి; నరున్= మానవుడిని; పొందున్= చేరుతాయి; పాయున్= వదలిపోతాయి; వానిన్= వాటిని; నమ్మమి+అ= నమ్మక పోవటమే; ఉఱున్= తగును.

తాత్పర్యం: రాజా! షడ్రసోపేతమైన ఆహారాలు, సుగంధభరితమైన అనేక ద్రవ్యాలు, ఉత్తమోత్తమమైన శయ్యలు, ఆసనాలు, కాలానుగుణంగా మానవులకు దొరుకుతూ ఉంటాయి, పోతూ ఉంటాయి. వాటిని నమ్మకుండా ఉండటమే మంచిది.

చ. వల నధికంబుగాఁ గలుగు వైద్యులు శాస్త్రము లభ్యసించి మం
దుల నొడఁగూర్చ నేర్చి తనదోషము లారయ బుద్ధి గల్గి యా
ర్తులకుఁ జికిత్స సేసెదరు; రోగము వాయమి లేదె? వారు రో
గు లగుట గానమెట్లు ప్రతికూలవిధిన్ నరునేర్పు ద్రోచునే? 215

ప్రతిపదార్థం: వలను= వీలు, ఆనుకూల్యం; అధికంబు+కాన్= ఎక్కువగా; కలుగు= కలిగిన; వైద్యులు= భిషక్కులు; శాస్త్రములు= రోగనిదానానికి సంబంధించిన శాస్త్రాలను; అభ్యసించి= చదివి; మందులన్= ఓషధులను; ఒడన్+కూర్పన్= తగిన విధంగా కలపటం; నేర్చి= అభ్యసించి; తనుదోషములు= వాత, పిత్త, కఫాది శరీర దోషాలు; ఆరయన్= గుర్తించే; బుద్ధి= తెలివి; కల్గి= ఉండి; ఆర్తులకున్= బాధపడుతున్నవారికి; చికిత్స= వైద్యం; చేసెదరు= చేస్తారు; రోగము= వ్యాధి; పాయమి= పోకపోవటం; లేదు+ఎ?= లేదా;? వారు= ఆ వైద్యులు; రోగులు+అగుట= వ్యాధి పీడితులవటం; కానము+ఎట్లు?= చూడటం లేదా?; నరునేర్పు= మానవుడి కౌశలం; ప్రతికూలవిధిన్= విధివైపరీత్యాన్ని; త్రోచును+ఏ?= నెట్టివేయగలదా? (లేదని భావం).

తాత్పర్యం: అవకాశం అధికంగా కలిగిన వైద్యులు వైద్యశాస్త్రాన్ని బాగా అధ్యయనం చేసి, మందులను సరిగా తయారుచేయటం నేర్చుకొని, శరీరదోషాలను గుర్తించే తెలివి కలిగి ఉండి, రోగులకు వైద్యం చేస్తారు. అయినా, రోగం తగ్గకపోవటం ఉంటుంది కదా! ఆ వైద్యులే రోగులవటం కూడా చూస్తున్నామే. మానవుడి నేర్పు విధివైపరీత్యాన్ని తొలగించలేదు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. మానవుడి మేధకన్న విధి బలీయమని అందరూ విధికి తల ఒగ్గవలసినవారేనని చెప్పటం.

సీ. సద్వంశ జన్మంబు సౌందర్యమును బలం ।బును సుభగతయును భోగములును
భవితవ్యతానురూపంబులు పేదలై । పెంచుట కలయంగఁ బెల్లు పుట్టు
దురు ప్రజ లెంతయు సిరిగలవారు గో । రంగఁ బుట్టరు; దరిద్రపు జనంబు
లాఁకటం దిని ఱాలు నఱిగించు కొందరు; । భోజ్య సంపన్నులు భోజనంబుఁ

తే. బూర్ణముగఁ జేయఁజాలరు భూపవర్య! । వెలఁది జూదంబు పానంబు వేఁట యతిని
షేవితములు గాఁదగ దని చెప్ప వినుచు । వలను గలవార చెడుదురు వానివలన. 216

ప్రతిపదార్థం: సద్వంశ జన్మంబు= కులీనత; సౌందర్యమును= అందచందాలు; బలంబును= శక్తి; సుభగతయును= సౌభాగ్యం, అదృష్టం; భోగములును= అనుభవించదగిన సంపదలూ; భవితవ్యతా+అనురూపంబులు= సుకృతానికి తగినటువంటివి; పేదలు+ఐ= బీదవారై; పెంచుటకున్= పెద్దచేయటానికి; అలయంగన్= అలసిపోతుండగా; ప్రజలు= సంతానం; పెల్లు= అధికంగా; పుట్టుదురు= జన్మిస్తారు; సిరిగలవారు= ధనవంతులు; ఎంతయున్= ఎంతగానో; కోరంగన్= కావాలని కోరుకొన్నా; పుట్టరు= కలుగరు; దరిద్రము+జనంబులు= బీదవారైన మనుష్యులు; ఆఁకటన్= ఆకలితో; ఱాళ్ళను= రాళ్ళను; తిని= తిని; అఱిగించుకొందురు= జీర్ణంచేసికొంటారు; భోజ్యసంపన్నులు= ఆహార సంపద ఎక్కువ ఉన్నవారు; భోజనంబున్ అన్నం తినటం; పూర్ణముగన్= పూర్తిగా, నిండుగా; చేయన్+చాలరు= చేయలేరు; భూపవర్య!= రాజోత్తమా!; వెలఁది= స్త్రీ; జూదంబు= ద్యూతం; పానంబు= సురాపానం; వేఁట= మృగయా వినోదం; అతి= పరిమితిని మించి; నిషేవితములు= సేవించదగినవి, అనుభవించదగినవి; కాన్+తగదు+అని= కాదని; చెప్పన్= (పెద్దలు) చెప్పగా; వినుచున్= వింటూ; వలను+కలవారు+అ=తగినవారు; వానివలనన్= ఆ వ్యసనాల కారణంగా; చెడుదురు= నశిస్తారు.

తాత్పర్యం: ఓ జనక మహారాజా! కులీనత, చక్కదనం, బలం, అదృష్టం, భోగాలు సుకృతానికి తగినట్లు లభిస్తాయి. పెంచటానికి కష్టపడే పేదలకు పిల్లలు ఎంతోమంది కలుగుతారు. కావాలని కోరే ధనవంతులకు సంతానం కలుగదు. బీదలు ఆకలితో రాళ్ళు తిని అరిగించుకొంటారు. సంపన్నులు కడుపునిండా తినలేరు. స్త్రీలు, జూదం, సుర, వేట మొదలైనవి మితిమీరి అనుభవించకూడదని పెద్దలు చెప్పగా వింటూ అన్నీ తగినవారు కూడా వాటివలన నశిస్తూ ఉంటారు.

విశేషం: జ్ఞానం కలిగి ఉండటం, దానిని అమలు పరచటం ఒకటి కాదు.

వ. అట్టివి దైవకృతంబులు గావున నిష్టానిష్ట ప్రాప్తులకుం గారణంబులు గనికొనలేవు; బాంధవలాభంబును దద్వియోగంబును వఱదం గాష్ఠంబులు సంగతంబులై పదంపడి పాసిన చందంబు. 217

ప్రతిపదార్థం: అట్టివి= అటువంటివి; దైవకృతంబులు= భగవంతుడిచేత చేయబడినవి (మానవులు చేసినవి కావు); కావునన్= అందువలన; ఇష్ట+అనిష్ట+ప్రాప్తులకున్= ప్రియమైనవి, అప్రియమైనవి పొందటానికి; కారణంబులు= హేతువులు; కనికొనలేవు= కనిపెట్టలేవు; బాంధవ లాభంబును= బంధువుల ప్రాప్తియు, (చుట్టాలను కలిగి ఉండటం); తద్+వియోగంబును= వారి ఎడబాటును; వఱదన్= ప్రవాహంలో; కాష్ఠంబులు= కట్టెలు; సంగతంబులు+ఐ= కలసికొని; పదంపడి= తరువాత; పాసిన= దూరమైన; చందంబు= తీరు.

తాత్పర్యం: అటువంటివి విధికృతాలు. మానవులు చేసినవి కావు. అందువలన మనం ఇష్టమైనవి పొందటం, ఇష్టం లేనివి ప్రాప్తించటం అనేవాటికి హేతువును కనిపెట్టలేవు. బంధుప్రాప్తి, వారి ఎడబాటు ప్రవాహంలో కొట్టుకొని పోతూ కట్టెలు కలిసికొని, విడిపోవటం వంటిదే.

విశేషం: అలం: ఉపమ.

**తే. మాతృ పితృ దార పుత్రక భ్రాతృ శతస । హస్రకంబులు సంసృతి ననుభవింపఁ
బడియె; నిందులో నెవ్వరి కడలువాఁడు । నరుఁ డనిత్యత యూహించు టరయ నుఱవు. 218**

ప్రతిపదార్థం: మాతృ+పితృ+దార+పుత్రక+భ్రాతృ+శత సహస్రకంబులు= తల్లి, తండ్రి, భార్య, పిల్లలు, సోదరుల వందలవేలు (లక్షలు); సంసృతిన్= సంసారంలో; అనుభవింపఁబడియెన్= అనుభవించబడ్డారు; ఇందులోన్= ఈ లక్షల బంధుత్వాలలో; ఎవ్వరికిన్= ఎవ్వరికొరకు; నరుఁడు= మానవుడు; అడలువాఁడు?= బాధపడుతాడు?; అనిత్యత= అశాశ్వతత్వాన్ని, నిలకడలేనితనాన్ని; ఊహించుట= భావన చేయటం; అరయన్= పరికించగా; ఉఱవు= ఉచితం; తగినది.

తాత్పర్యం: ఈ జననమరణ చక్రరూపమైన సంసారంలో (అనేక జన్మలలో) లక్షలకొద్ది తల్లి, తండ్రి, భార్య, పిల్లలు, సోదరుల బంధం అనుభవించబడింది. ఇందులో ఎవరికొరకని మనిషి బాధపడగలడు? దీనిని లెస్సగా భావించి మానవజీవితం ఎంత అశాశ్వతమైనదో తెలిసికొనటం సముచితం.

విశేషం: సంసారం అంటే జననమరణ చక్రం అనీ జీవితంలోబంధుత్వాదులు అశాశ్వతమనీ తెలియటం జ్ఞానమనీ తాత్పర్యం.

**క. జనన జరామరణ గ్రా । హనిబిడ కాలాబ్ధి మగ్నమని జగము నెఱిం
గినవాఁడు ధర్మవర్తన । మున నుండుం జింత దక్కి భూపవరేణ్యా! 219**

ప్రతిపదార్థం: భూపవరేణ్యా!= రాజులలో ఎన్నదగినవాడా!; జనన= పుట్టుక; మరణ= చావు అనే; గ్రాహ= మొసళ్ళచేత; నిబిడ= దట్టమైన; కాల+అబ్ధి= కాలమనే సముద్రంలో; మగ్నము+అని= మునిగినదని; జగమున్= లోకమును; ఎఱింగినవాఁడు= తెలిసికొన్నవాడు; చింతన్+తక్కి= శోకమును వదలి; ధర్మవర్తనమునన్= ధర్మమార్గ ప్రవర్తన కలిగి; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: జనకమహారాజా! ఈ లోకం చావు పుట్టుకలనే మొసళ్ళతో బాగా నిండిపోయి ఉన్న కాలం అనే సముద్రంలో మునిగిపోయి ఉన్నది - అని తెలిసికొన్న మానవుడు శోకాన్ని వదలి, ధర్మమార్గంలో నడుస్తాడు.

విశేషం: అలం: రూపకం.

క. తన యొడ లెరవనినను మను । జునకును బంధుతతి సతమె? శోకించిన వ
చ్చునె చచ్చిన జంతువు? నె । మ్మన మధికము నొచ్చుఁ గాక మహితవివేకా! 220

ప్రతిపదార్థం: మహిత వివేకా!= గొప్ప విచక్షణా జ్ఞానం కల జనక మహారాజా!; మనుజునకున్= మానవుడికి; తన= తనయొక్క; ఒడలు= శరీరం, తనువు; ఎరవు+అనినను= తిరిగి ఇచ్చివేయటానికి అరువుగా అడిగి (యాచించి) తెచ్చుకొన్నది అనగా; బంధుతతి= బంధువర్గం; సతము+ఎ?= శాశ్వతమా?; చచ్చిన= చనిపోయిన; జంతువు= ప్రాణి; శోకించినన్= ఏడ్చినంత మాత్రాన; వచ్చును+ఎ= తిరిగి వస్తుందా?; నెఱ+మనము= నిండుమనసు (బాధపడటం వలన); అధికము= ఎక్కువగా; నొచ్చున్+కాక= బాధపడుతుంది తప్ప!

తాత్పర్యం: వివేకవంతుడవైన జనకమహారాజా! మానవుడికి తన శరీరమే అడిగి, అప్పుగా తెచ్చుకొన్నటువంటిది. అటువంటప్పుడు బంధువులు శాశ్వతమా? ఎంత బాధపడినా చచ్చిన జీవి తిరిగి రాదు కదా! అట్లా బాధపడటం వలన మనసు మరింత నొచ్చుకొనటం తప్ప ప్రయోజనం లేదు.

విశేషం: జీవుడు శరీరధారి మాత్రమే. ప్రతి జన్మలోనూ జీవుడు తను నివసించటానికి వీలుగా ఒక శరీరం కావాలని అడిగి తెచ్చుకుంటాడు. జీవుడు శరీరం కాదు; శరీరం జీవుడు నివసించే ఇల్లు వంటిది. ఇక బంధుత్వాలు తాత్కాలికాలే.

ఉ. కావున నెవ్వగల్ విడువు; గైకొను మాత్మకలార్హ కర్మ సం
సేవన తత్పరత్వము; విశిష్టజనంబుల సంగతిన్ భవ
ద్భావము కల్మషంబు దెగఁ బాచి శుచిత్వముఁ బొందు; లోకసం
భావిత కీర్తి వయ్యెదు నృపాలక! నా పలు కూఁదు పాటిగాన్.' 221

ప్రతిపదార్థం: నృపాలక!= రాజా!; కావునన్= అందువలన; నెఱ+వగల్= నిండు బాధలు; విడువు= వదలిపెట్టుము; ఆత్మకుల= నీ వంశానికి; అర్హ= తగిన; కర్మసంసేవన= పనిని బాగా చేయటంలో; తత్పరత్వమును= ఆశను, ఇష్టమును; కైకొనుము= స్వీకరించుము; విశిష్టజనంబుల= గొప్ప వ్యక్తుల, మహాత్ముల; సంగతిన్= సాంగత్యంలో; భవత్= నీ; భావము= ఆలోచన (ఊహ) లోని; కల్మషంబు= మలినాన్ని; తెగన్=+పాచి= పోయేటట్లు చేసి; శుచిత్వమున్= పవిత్రతను, నిర్మలత్వాన్ని; పొందు(ము)= సముపార్జించుకో; లోకసంభావిత= లోకంలోని అందరిచేత గౌరవించదగిన; కీర్తివి= కీర్తి కలవాడివి; అయ్యెదు= అవుతావు; నా పలుకు= నా మాట; పాటి+కాన్= తగినదని; ఊఁదు(ము)= గట్టిగా పట్టుకో, ఆచరించుము, నమ్ముము.

తాత్పర్యం: ఓ జనకమహారాజా! అందువలన బాధపడటం మానుము. నీ వంశానుగుణమైన పని (రాజ్యపాలన) ఆచరించటంలో నిమగ్నుడవు అయిపొమ్ము! సత్పురుషుల సాంగత్యంలో నీ మనసులోని మాలిన్యాన్ని పోగొట్టుకొని పవిత్రతను సంతరించుకొమ్ము. అపుడు లోకులందరిచేత గౌరవించబడే కీర్తి కలవాడి వవుతావు. నా మాటను తప్పక నమ్మి పాటించుము'.

వ. అనుటయుం దెలిసి జనకుం డమ్ముని నామంత్రితుంజేసి నిజకర్మతంత్ర నిర్వహణంబునకై గృహంబున నిలిచె; నీవు నట్ల యుమ్మలికం బుజ్జగింపు ముత్తమ క్షాత్ర సరణి సాధితంబైన భూవలయంబుఁ బాలింపుము; తక్కటి తలంపులు దక్కు'మని పలికిన విని పలుక కున్న యగ్రజుం జూచి సవ్యసాచి జనార్దనుతో నిట్లనియె.222

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; తెలిసి= వివేకం కలిగినవాడై; జనకుండు= జనకమహారాజు; ఆ+మునిన్= అశ్మకమునిని; ఆమంత్రితున్+చేసి= వీడుకొలిపి; నిజకర్మ= తన పని అయిన; తంత్ర= స్వరాష్ట్ర పాలన; నిర్వహణంబునకున్+ఐ= వహించటానికి;

గృహంబునన్= ఇంటియందు; నిలిచెన్= ఉండిపోయాడు; నీవును= నీవు కూడా; అట్లు+అ= అదే విధంగా; ఉమ్మలికంబు= శోకం; ఉజ్జగింపుము= వదలుము; ఉత్తమ= శ్రేష్ఠమైన; క్షాత్రసరణి= క్షత్రియోచిత పద్ధతిలో; సాధితంబు+ఐన= పొందినది అయిన; భూవలయంబున్= భూమండలాన్ని; పాలింపుము= ఏలుము; తక్కటి= మిగిలిన; తలంపులు= ఆలోచనలు; తక్కుము= వదలుము; అని; పలికినన్= చెప్పగా; విని= ఆలకించి; పలుకక+ఉన్న= మాటాడక ఉన్న; అగ్రజున్= అన్నగారిని; చూచి= కని; సవ్యసాచి= అర్జునుడు; జనార్దనుతోన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అశ్మకు డన్న ఆ మాటలతో జ్ఞానం కలిగినవాడై జనకమహారాజు ఆ మునికి వీడ్కోలు పలికి, తన విధ్యుక్తధర్మమైన రాజ్యపాలనా తంత్రాన్ని నిర్వర్తించటానికి ఇంట్లోనే ఉండిపోయాడు. నీవు కూడా అదేవిధంగా విషాదాన్ని వదలి, రాజధర్మానికి తగిన పద్ధతిలో సంపాదించిన భూమండలాన్ని ఏలుము. మిగిలిన ఆలోచనలను వదలుము' అని వ్యాసుడు చెప్పగా విని, మారు మాటాడని అన్నగారిని చూచి అర్జునుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

క. ' బహుబంధుమరణ శోక । ప్రహత వివేకమయి ధర్మరాజునకు మనో
మహిమ వికలమయ్యెం; । బర । మహిత వచోవృత్తిఁ దేర్పు మహితవిచారా! 223

ప్రతిపదార్థం: మహితవిచారా!= గొప్ప ఆలోచన కలిగిన శ్రీకృష్ణా!; ధర్మరాజునకున్; బహు= పెక్కు; బంధుమరణ= చుట్టాల చావువలన కలిగిన; శోక= విషాదంచేత; ప్రహత= బాగా దెబ్బతిన్న; వివేకము+అయి= విచక్షణాజ్ఞానం కలిగి; మనోమహిమ= మనసుయొక్క గొప్పతనం; వికలము= చెదరినది; అయ్యెన్= అయింది; పరమహిత= అన్నింటికన్న గొప్పదైన మేలు కలిగించే; వచోవృత్తిన్= మాటల తీరుతో; తేర్పు= తేటపడేటట్లు చేయుము.

తాత్పర్యం: 'గొప్ప భావనలు కల కృష్ణా! బహుబంధుమరణంవలన కలిగిన శోకం కారణంగా ధర్మరాజు వివేకం బాగా దెబ్బతిని, మనసు వికలమైంది. దానిని పరమ శ్రేయోదాయకమైన నీ హితోక్తులతో తేరుకొనేటట్లు చేయుము'.

వ. అనిన నచ్యుతుండు పాండవాగ్రజుఁ జేరంజని, యభివందనం బాచరించి, యతని కరంబు వట్టికొని, వదనంబు విరిదమ్మి చందంబు నొంద మధురాక్షర విన్యాసంబుగా నిట్లనియె. 224

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అచ్యుతుండు= నాశరహితుడైన శ్రీకృష్ణుడు; పాండవ+అగ్రజున్= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజును; చేరన్+చని= సమీపించి; అభివందనంబు+ఆచరించి= నమస్కారం చేసి; అతని= ధర్మరాజు;కరంబు= చేతిని; పట్టికొని= చేతితో పట్టుకొని; వదనంబు= ముఖం; విరిదమ్మి= విచ్చిన తామరపూవు; చందంబును+ఒందన్= వలెకాగా; మధుర+అక్షర+విన్యాసంబు+కాన్= తియ్యని మాటల కూర్పుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అర్జును డట్లా అడగగానే శ్రీకృష్ణుడు ధర్మరాజు దగ్గరకు వెళ్ళి, నమస్కరించి, అతడి చేతిని పట్టుకొని, వికసించిన తామరపూవువలె ఉన్న ముఖంతో, తియ్యగా ఈ విధంగా మాట్లాడాడు.

విశేషం: అలం: ఉపమ.

మ. ' పురుషవ్యాఘ్ర! మనంబు గుంద వగలం బొందంగ నీకేల? సం
గరకేలిన్ భవదీయబంధు లతిలోకంబైన తెంపొప్పఁ బో
యిరి నాకంబున; కట్లుగాక కలగాదే రాజవృత్తంబు దా
నరయన్ రాజుల యేల? యేజనులు నిత్యాయుర్ధనుల్ సెప్పుమా! 225

ప్రతిపదార్థం: పురుషవ్యాఘ్ర!= మనుజోత్తమా! ధర్మరాజా!; నీకు= నీవంటివాడికి; మనంబు= మనస్సు; కుందన్= కుంగిపోయేటట్లు; వగలన్= బాధలను; పొందంగన్= అనుభవించటం; ఏల?= ఎందుకు?; సంగరకేలిన్= యుద్ధమనే ఆటలో; భవదీయ= నీ; బంధులు= చుట్టాలు; అతిలోకంబు+ఐన= మానవాతీతమైన; తెంపు+ఒప్పన్= సాహసం ప్రకటమయ్యేటట్లు; నాకంబునకున్= స్వర్గానికి; పోయిరి= వెళ్ళారు; అట్లు+కాక= ఆ విధంగా కాకపోయినా; రాజవృత్తంబు= రాచకరికము; తాన్= అది; కలగాదే= స్వప్నమే కదా!; అరయన్= పరికించి చూస్తే; రాజులు+అ= రాజులే; ఏల= ఎందుకు?; ఏ జనుల్= ఏ మనుష్యులు; నిత్య+ఆయుర్ధనుల్= శాశ్వతమైన ఆయువనే ధనం కలవారో; చెప్పుమా?= చెప్పుము!

తాత్పర్యం: కృష్ణ డిట్లా అన్నాడు: 'పురుషశ్రేష్ఠుడవైన ధర్మరాజా! నీ వంటివాడు బాధలతో క్రుంగిపోవటం ఎందుకు? రణరంగంలో, కేళీప్రాయంగా నీ బంధువులు మానవాతీతమైన శౌర్యాన్ని ప్రదర్శించి స్వర్గస్థులయ్యారు. రాచరికం అన్నది కలకాక వాస్తవం కాదు కదా! ఒక్క రాజులే ఏమిటి? శాశ్వతమైన ఆయుర్దాయం కల మనుష్య లెక్కడ ఉన్నారు చెప్పుము'.

వ. అని పలికి వెండియు. **226**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికి= మాటాడి; వెండియున్= తిరిగి, ఇంకా.

తాత్పర్యం: శ్రీకృష్ణ డీ విధంగా మాటాడి ఇంకా ఇట్లా అన్నాడు- (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ' తొల్లి సృంజయుఁ డను మహీవల్లభుండు । పుత్రశోకాతురత్వంబుఁ బొందియున్న
నుపశమంబుగఁ బ్రాక్తననృపులఁ జెప్పి । తెలిపె నిమ్మోని యంతకు బలిమి కలిమి.' **227**

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; సృంజయుఁడు+అను= సృంజయు డనే పేరుగల; మహీవల్లభుండు= భూభర్త (రాజు); పుత్రశోక+ఆతురత్వంబున్= పుత్రశోకంవలని బాధను; పొంది+ఉండి= కలిగి ఉండగా; ఈ+మౌని= ఈ ముని - నారదుడు; ఉపశమంబుగన్= ఓదార్పుగా; ప్రాక్తన= ప్రాచీన; నృపులన్= రాజులను (వారి చరిత్రలను); చెప్పి= పలికి; అంతకు= యముడి; బలిమి కలిమి= బలాధిక్యాన్ని; తెలిపెన్= తెలియచెప్పాడు.

తాత్పర్యం: 'పూర్వం సృంజయుడనే రాజు పుత్రశోకంతో బాగా బాధపడుతూ ఉంటే, నారదమహర్షి అతడికి ఓదార్పు కలగటంకొరకు, ప్రాచీన రాజులనుగురించి, యముడి సామర్థ్యాన్ని గురించి తెలియజెప్పాడు'.

వ. అని యెఱింగించి నారదుం జూపి 'యిమ్మహాత్ముం డట్లు మరుత్తసుహోత్రాదులగు రాజుల పరమోత్కృష్ట కర్మంబులును, నట్టివారికిం గాలవశత్వంబునం బొందకుండ రామియుం దెలియ నుపన్యసించిన వాక్యంబు లభిమన్యు మరణశోక వ్యాకులుండ వగు నీకుం దాపోపశమంబుగాఁ గృపాతిశయంబునం బరిపాటి వీరలు సెప్పి'రని పారాశర్యమునీశ్వరు నిర్దేశించి, 'వీరి వచనంబుల యేనునుం జెప్పెద నాకర్ణింపు' మని యిట్లనియె. **228**

ప్రతిపదార్థం: అని= అంటూ; ఎఱిగించి= బోధపరచి; నారదున్+చూపి= నారద మహర్షిని చూపించి; ఈ+మహాత్ముండు= ఈ మహానుభావుడు; అట్లు= ఆ విధంగా; మరుత్తసుహోత్ర+ఆదులు+అగు= మరుత్తుడు, సుహోత్రుడు మొదలైన; రాజులు= చక్రవర్తుల; పరమ+ఉత్కృష్ట+కర్మంబులును= మిక్కిలి శ్రేష్ఠమైన కార్యాలను; అట్టివారికిన్= అటువంటి వారికి కూడా; కాలవశత్వంబునన్+పొందక+ఉండ+రామియున్= కాలధర్మాన్ని (మరణాన్ని) చెందకుండా ఉండకపోవటాన్నీ; తెలియన్= బోధపడేటట్లు; ఉపన్యసించిన= పలికిన; వాక్యంబులు= మాటలు; అభిమన్యు+మరణ+శోక= అభిమన్యుడి మరణం వలన కలిగిన

బాధచేత; వ్యాకులుండవు+అగు= కల్లోల పడినవాడవైన; నీకున్= నీకు; తాప+ఉపశమంబు+కాన్= బాధా నివారిణి అయ్యేటట్లు; కృపా+అతిశయంబునన్= అధికమైన దయతో; పరిపాటిన్= క్రమంగా; వీరలు= వీరు; చెప్పిరి+అని= చెప్పారని; పారాశర్యముని+ఈశ్వరున్= వ్యాసమునిని; నిర్దేశించి= చెప్పి (చూపి); వీరి వచనంబులు+అ= వీరి మాటలే; ఏనునున్= నేను కూడా; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము; అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఈ విధంగా చెప్పి, బోధచేసి, నారదమహర్షిని చూపించి, 'ఈ మహానుభావుడు సృంజయుడికి మరుత్తు, సుహోత్రుడు మొదలైన చక్రవర్తులు చేసిన మహత్కార్యాలన్నీ చెప్పి, వారుకూడా కాలధర్మం చెందటాన్నీ తెలిసేటట్లు చెప్పిన మాటలనే ఇప్పుడు వీరు అభిమన్యుడి మరణంవలన కలతచెందిన నీకు బాధ తగ్గించటానికి ఎంతో దయతో చెప్పారు' అని వ్యాసమహర్షిని చూపించి 'వీరు చెప్పిన మాటలే నేను కూడా చెప్పుతాను వినుము' అని ఈ విధంగా చెప్పటం మొదలు పెట్టాడు.

ధర్మరాజునకుఁ గృష్ణుఁడు షోడశరాజుల చరిత్రంబులు పెప్పుట (సం. 12-29-16)

సీ. 'సంవర్తుఁడను మహాసంయమి దేవతా । గురుతోడి యీసున నరుగుదెంచి,
పూని యుపద్రష్టయై నడపంగ హి । మాచలపాదంబునందు శక్ర
వరుణ ప్రభృతులైన సురలు మహామునీం । ద్రులును సహాయులై మెలఁగుచుండ
శాలా ప్రముఖ భవ్యసాధనమ్ములు గన । కనకమయంబులుగ వస్త్రకాంచనాజ్య

ఆ. దధిపయఃఫలాది తర్పణ ద్రవ్యస । మృద్ధి సకలజనులు మెచ్చఁ బెక్కు
లధ్వరములు సేసె; నట్టి మరుత్తుండు । నిత్యపదవి నుండ నేర్చెనయ్య?' 229

ప్రతిపదార్థం: సంవర్తుఁడు+అను= సంవర్తుడనే పేరుగల; మహాసంయమి= గొప్పముని; దేవతాగురుతోడి= దేవగురువైన బృహస్పతితో; ఈసునన్= అసూయతో, ఈర్ష్యతో; అరుగుదెంచి= వచ్చి; పూని= పట్టుపట్టి; ఉపద్రష్ట+ఐ= కార్యనిర్వాహకుడై; నడపంగన్= జరిపించగా; హిమ+అచల= హిమవత్పర్వతముయొక్క; పాదంబున+అందున్= మొదట్లో; శక్ర= ఇంద్రుడు; వరుణ= వరుణుడు; ప్రభృతులు+ఐన= మొదలైన; సురలు= దేవతలూ; మహాముని+ఇంద్రులును= గొప్ప ఋషి వరులూ; సహాయులు+ఐ= తోడుపడేవారై; మెలఁగుచున్+ఉండన్= ప్రవర్తిస్తూ ఉండగా; శాలాప్రముఖ= యజ్ఞశాల మొదలైన; భవ్యసాధనమ్ములు= శుభప్రదమైన యజ్ఞోపకరణాలు; కనకమయంబులుగన్= బంగారపువిగా; వస్త్ర= వస్త్రములు; కాంచన= బంగారు; ఆజ్య= నేయి; దధి= పెరుగు; పయః= పాలు; ఫల= పండ్లు; ఆది= మొదలైన; తర్పణ= దేవతల తృప్తికొరకు సమర్పించే; ద్రవ్య సమృద్ధి= వస్తువుల ఆధిక్యం; సకల జనులు= సమస్త ప్రజలు; మెచ్చన్= పొగడగా; పెక్కు= అనేకమైన; అధ్వరములు= యజ్ఞాలు; చేసెన్= చేశాడు; అట్టి= అటువంటి; మరుత్తుండు= మరుత్తుడు అనే చక్రవర్తి; నిత్యపదవిన్= శాశ్వతమైన స్థానంలో; ఉండన్+నేర్చెన్+అయ్య?= ఉండగలిగాడా?

తాత్పర్యం: 'ధర్మరాజా! పూర్వం సంవర్తుడనే గొప్పముని దేవగురువైన బృహస్పతిపై అసూయచెంది పట్టుదలగావచ్చి, హిమవన్నగం మొదట తనపర్యవేక్షణలో మరుత్తుచేత ఎన్నో యజ్ఞాలు చేయించాడు; ఆ యజ్ఞాలకు ఇంద్రుడు వరుణుడు మొదలైన దేవతలు, మహర్షులు సహాయులుగా ఉన్నారు. ఆ యజ్ఞశాల, యజ్ఞోపకరణాలు మొదలైనవన్నీ బంగారంతో చేయబడ్డవే. దేవతల తృప్తికొరకు అర్పించిన వస్త్రాలు, బంగారం, నెయ్యి, పాలు, పెరుగు, పళ్ళు మొదలైనవి సమస్త జనాలు మెచ్చుకొనేటంత అధికంగా ఉన్నాయి. అటువంటి గొప్పయజ్ఞాలు చేసిన మరుత్తుడు శాశ్వతంగా తనపదవిలో (రాజుగా) ఉండగలిగాడా? (లేడు కదా అని భావం).

సీ. ' సన్మార్గమున రాజ్య సంపద నొంది భూ । సురపూజ లొనరించి సువ్రతముల
బృందారకులఁ బ్రీతిఁ బొందింపఁ, దన కర్థిఁ । బర్జన్యుఁ డేటేటఁ బసిఁడి వాన
కనకమయములైన కర్కట ఝష నక్ర। కూర్మచయముతోడఁ గురియుచుండ
నయ్యర్థ మెల్ల ధనార్థుల కిచ్చుచుఁ । గురుజాంగలంబునఁ బరమనిష్ఠ

ఆ. నశ్వమేధ ముఖములైన రాజార్హయ । జ్ఞములు పెక్కు సేసి సకల జనులు
పొగడునట్టి పాట నెగడె సుహోత్రుఁ; డ । వ్విభుఁడు దెగియె ననుట వినమె యధిప!' 230

ప్రతిపదార్థం: అధిప!= రాజా! (ధర్మరాజా!); సుహోత్రుఁడు= సుహోత్రుడనే పేరుగల చక్రవర్తి; సత్+మార్గమునన్= మంచిదారిలో, సత్ప్రవర్తనతో; రాజ్యసంపదన్+ఒంది= రాజ్యమనే సంపదను పొంది; భూసుర+ బ్రాహ్మణ; పూజలు+ఒనరించి= పూజలు చేసి; సువ్రతములన్= మంచి వ్రతాలతో, పూజాదికాలతోనూ, మంచి ప్రవర్తనతోను); బృందారకులన్= దేవతలను; ప్రీతిన్+పొందింపన్= సంతసింపజేయగా; తనకున్= సుహోత్రునకు; అర్థిన్= ఇష్టంతో; పర్జన్యుఁడు= ఇంద్రుడు; ఏఁట+ఏఁటన్= ప్రతి ఏడాది; కనకమయములు+ఐన= బంగారంతోచేయబడినవైన; కర్కట= పీతల; ఝష= చేపల; నక్ర= మొసళ్ళ; కూర్మ= తాబేళ్ళ; చయముతోడన్= సమూహంతో; పసిఁడివాన= బంగారువాన; కురియుచున్+ఉండన్= కురిపిస్తూ ఉండగా; ఆ+అర్థము+ఎల్లన్= ఆ ధనమునంతా; ధన+అర్థులకున్= ధనంకోరిన వారికి; ఇచ్చుచున్= ఇస్తూ; కురుజాంగలంబునన్= ఉత్తర కురుభూములలో; పరమ నిష్ఠన్= మిక్కిలి నియమ నిష్ఠలతో; అశ్వమేధముఖములు+ఐన= అశ్వమేధం మొదలైన; రాజ+అర్హ= రాజులకు తగిన; యజ్ఞములు= యాగాలు; పెక్కు= అనేకం; చేసి= ఆచరించి; సకలజనులు= ప్రజలందరు; పొగడు+అట్టి= మెచ్చుకొనేటటువంటి; పాటన్= విధంగా; నెగడెన్= వర్ధిల్లాడు; ఆ+విభుఁడున్= ఆ రాజుకూడా; తెగియెన్= మరణించాడు; అనుట= అనటం; వినము+ఎ?= వినలేదా?

తాత్పర్యం: 'ధర్మరాజా! సుహోత్రుడనే చక్రవర్తి మంచి ప్రవర్తన కలవాడై రాజ్యాన్ని పొంది, బ్రాహ్మణులను పూజించి, మంచి ప్రవర్తనతో, వ్రతాలతో దేవతలను మెప్పించాడు. మెచ్చిన ఇంద్రుడు ప్రతి ఏడాది బంగారు పీతలు, చేపలు, మొసళ్ళు, తాబేళ్ళతో నిండిన బంగారు వాన కురిపించేవాడు. సుహోత్రు డా ధనాన్ని కోరినవారికి ఇస్తూ, ఉత్తర కురుదేశాలలో గొప్ప నిష్ఠాపరుడై రాజోచితాలైన అశ్వమేధాది యజ్ఞాలనెన్నింటినో చేశాడు. ప్రజల మెప్పు పొందే విధంగా ప్రవర్తించాడు. అటువంటి సుహోత్రుడు కూడా చనిపోయాడని విన్నాము కదా!'

సీ. ' కాంచనాలంకార కాంతంబులై రూఢి । కెక్కిన గజములు పెక్కు వేలు,
జవసత్త్వ రూపాది సకల గుణములఁ । బెం పెసఁగిన హయము లనేక లక్ష,
లమలిన స్వర్ణమయములగు కొమ్ములం । గొమరారు పశువులు గోటు, లూర్జి
తాంగక విలసదజావికంబులు గణ । నాతీతములు గన్య లప్రమేయ,

ఆ. లఖిల రత్న విరచితాభరణంబు ల । న్నములు మహీసురావళులకు
నిచ్చి చేసెఁ గ్రతువు లెన్నియేనియు నంగుఁ । డతఁడు నన్యలోకగతుఁడు గాఁడె!' 231

ప్రతిపదార్థం: అంగుఁడు= అంగుడనే రాజు; కాంచన+అలంకార= బంగారు నగలతో; కాంతంబులు+ఐ= ఆకర్షణీయాలై; రూఢికిన్+ఎక్కిన= ప్రశస్తి వహించిన; గజములు= ఏనుగులు; పెక్కువేలు= ఎన్నో వేలు; జవ= వేగం; సత్త్వ= బలం; రూప+ఆది= చక్కని ఆకారం మొదలైన; సకల= అన్ని; గుణములన్= సద్గుణాలతో; పెంపు+ఎసఁగిన= ఆధిక్యం వహించిన; హయములు= గుర్రాలు; అనేక లక్షలు= ఎన్నో లక్షలు; అమలిన= స్వచ్ఛమైన; స్వర్ణమయములు+అగు= బంగారంతో చేయబడినవైన; కొమ్ములన్=

శృంగాలతో; కొమరారు= అందగించే; పశువులు= గోవులు; కోటులు= కోట్లు; ఊర్జిత= దృఢమైన; అంగక= అవయవాలతో; విలసత్= ఒప్పే; అజ+అవికంబులు= మేకలు, గొర్రెలు; గణన+అతీతములున్= లెక్కపెట్టటానికి వీలుకానన్ని; కన్యలు= వివాహయోగ్యలైన యువతులు; అప్రమేయలు= మితిలేనంత మందిని; అఖిల= సమస్త; రత్నవిరచిత+ఆభరణంబులు= రత్నాలతో తయారు చేయబడిన నగలు; న+అల్పములు= తక్కువ కానన్ని (అధిక సంఖ్యాకాలు); మహీసుర+ఆవళులకున్= బ్రాహ్మణ బృందాలకు; ఇచ్చి= ఒసగి; క్రతువులు= యజ్ఞాలు; ఎన్ని+ఏనియున్= ఎన్నో; చేసెన్= చేశాడు; అతఁడున్= ఆ అంగుడు కూడా; అన్యలోక గతుఁడు= పరలోక గతుడు, మరణించినవాడు; కాఁడు+ఎ?= కాలేదా?

తాత్పర్యం: 'ధర్మరాజా! అంగుడనే చక్రవర్తి ఎన్నో యజ్ఞాలు చేశాడు. ఆ యజ్ఞాలలో, బంగారు నగలతో ఆకర్షణీయంగా ఉండి ప్రశస్తమైన పెక్కువేల ఏనుగులను, మంచి వేగం, బలం, రూపాలతో గొప్పవైన అనేక లక్షల గుర్రాలను, మంచి బంగారంతో అలంకరించిన కొమ్ములతో అందగించే కోట్లకొలది గోవులను, దృఢమైన శరీరావయవాలతో ఒప్పే అసంఖ్యాకమైన మేకలను, గొర్రెలను,అంతులేనంతమంది వివాహ యోగ్యలైన యువతులను, నవరత్న ఖచితాలైన నగలను అధిక సంఖ్యలో బ్రాహ్మణబృందాలకు ఇచ్చాడు. ఆ అంగుడు కూడా మరణించాడు కదా!'

సీ. ' ఏడు దీవులయందుఁ గ్రీడాగతులఁ దన । రథము చరింప, నరాతు లనఁగ
వినియు నెఱుంగక విభవ మార్జించుచోఁ । బ్రజల నొప్పింపని పరమపుణ్య
కర్మంబునకు మెచ్చి గారవంబునఁ దన । కక్షయ సాధనము ఫాలాక్షుఁ డొసఁగ
నశ్వమేధములు జాహ్నవిపాంత శిష్ట జ । నాకీర్ణములుగఁ బె క్కాచరించెఁ;

ఆ. దారకములు వృష్టిధారలు లెక్కింప । వచ్చుఁ గాని యతని యిచ్చుగోవు
లెన్నఁ గొలఁది గాదు; సన్నుతిపాత్ర మా । శిబికి నుర్వి నునికి సెల్లె నెట్లు?' 232

ప్రతిపదార్థం: ఏడుదీవుల+అందున్= సప్తద్వీపాలలో; క్రీడాగతులన్= ఆటలకైపోయిన విధంగా; తన= శిబిచక్రవర్తియొక్క; రథము= తేరు; చరింపన్= తిరుగగా; అరాతులు+అనఁగన్= శత్రువులు అనే మాట; వినియున్= వినికూడా; ఎఱుంగక= తెలియక; విభవము= సంపద; ఆర్జించుచోన్= సంపాదించేటప్పుడు; ప్రజలన్= పౌరులను; నొప్పింపని= బాధించని; పరమపుణ్యకర్మంబునకున్= మిక్కిలి మంచి ప్రవర్తనకు; మెచ్చి= మెచ్చుకొని; ఫాలాక్షుఁడు= నిటలనేత్రుడు, శివుడు; తనకున్= శిబికి; గారవంబునన్= ఆదరంతో; అక్షయ ధనము= (నశించని) తరగని సంపదను; ఒసఁగన్= ఇయ్యగా; జాహ్నవి పాంతన్= గంగ ఒడ్డున; శిష్టజన+ఆకీర్ణంబులుగన్= సజ్జనులతో నిండి ఉండేటట్లుగా; అశ్వమేధములు= అశ్వమేధ యజ్ఞాలు; పెక్కు= అనేకాలు; ఆచరించెన్= చేశాడు; తారకములు= చుక్కలు; వృష్టిధారలు= వానలోని చాళ్ళు; లెక్కింపన్+వచ్చున్= లెక్కపెట్టవచ్చును; కాని; అతని+ఇచ్చు= శిబి దానం చేసే; గోవులు+ఎన్నన్= ఆవులను లెక్కపెట్టటం; కొలఁది+కాదు= వీలుకాదు; సన్నుతి పాత్రము= బాగా పొగడదగిన వాడైన; ఆ శిబికిన్= ఆ శిబిచక్రవర్తికి; ఉర్విన్= భూమిపై; ఉనికి= అస్తిత్వం, ఉండటం; ఎట్లు= ఏ విధంగా; చెల్లెన్?= చెల్లింది?

తాత్పర్యం: 'ధర్మరాజా! శిబిచక్రవర్తి ఏడు ద్వీపాలలో యథేచ్ఛగా తన రథాన్ని నడపగలిగేవాడు. అతడికి శత్రువులన్న మాటే వినబడదు. ధనసంపాదనకై ప్రజలను బాధించని అతడి మంచి ప్రవర్తనకు మెచ్చి శివుడు నశించని ధనాన్ని ప్రసాదించాడు. దానితో గంగాతీరంలో సజ్జనులతో నిండి ఉండేటట్లుగా అనేక అశ్వమేధాలు చేశాడు. నక్షత్రాలను, వర్షధారలను అయినా లెక్కించవచ్చును కాని, శిబి దానం చేసిన ఆవులను లెక్కించటం సాధ్యంకాదు. అటువంటి పొగడదగిన శిబికి భూమిపై కాలం ఎట్లా చెల్లింది?'

సీ. ' యౌవనంబునఁ దప మాచరింపఁగఁ దండ్రి । పంపున నరిగిన పెంపుకలిమి,
సేతువు జలధిఁ బ్రఖ్యాతంబుగా నొన । ర్చిన మర్త్యలోక పావన విభూతి
త్రైలోక్యకంటకు దశముఖు బంధు యు । క్తంబుగాఁ జంపిన కలితనమ్ము ,
బాలుర మరణంబు వాటిల్లకుండంగఁ । జేసిన యత్యంత చిత్రమహిమ,

ఆ. గలిగి యశ్వమేధములు మున్నుగా ననే । కాధ్వరము లొనర్చి యఖిల జనులఁ
దల్లివోలె నరసి దశరథరాముండు । కాలవశత నొందెఁ గాదె యధిప! 233

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; దశరథ రాముండు= దశరథ పుత్రుడైన శ్రీరామచంద్ర చక్రవర్తి; తండ్రి పంపునన్= తండ్రి ఆనతి మేరకు; యౌవనంబునన్= తరుణ వయస్సులో; తపము+ఆచరింపఁగన్= తపస్సు చేయటానికి; అరిగిన= వెళ్ళిన; పెంపు కలిమి= ఆధిక్యమనే సంపద; జలధిన్= సముద్రంలో; సేతువు= వారధిని; ప్రఖ్యాతంబు+కాన్= ప్రతిష్ఠాత్మకంగా; ఒనర్చిన= నిర్మించిన; మర్త్యలోక= మానవలోకాన్ని; పావనవిభూతి= పవిత్రీకరించిన వైభవం; త్రైలోక్య కంటకున్= ముల్లోకాలను బాధించే; దశముఖున్= దశకంఠుడైన రావణుడిని; బంధుయుక్తంబు+గాన్= చుట్టాలందరితో కూడా; చంపిన= సంహరించిన; కలితనమ్ము= సామర్థ్యం; బాలుర= పసిపిల్లల; మరణంబు= చావు; పాటిల్లక+ఉండంగన్= సంభవించకుండా; చేసిన= చేసినటువంటి; అతి+అంత= అధికమైన; చిత్రమహిమన్= అద్భుతావహమైన మహత్తును; కలిగి= కలిగి ఉండి; అశ్వమేధములు మున్నుగాన్= హయమేధం మొదలైన; అనేక+అధ్వరములు= ఎన్నో యజ్ఞాలు; ఒనర్చి= చేసి; అఖిల జనులన్= ప్రజలందరినీ; తల్లి+పోలెన్= తల్లివలె; అరసి= చూచి, కాపాడి (కూడ); కాలవశతన్+ఒందెన్= కాలధర్మాన్ని చెందాడు; కాదు+ఎ!= కదా!

తాత్పర్యం: 'ధర్మరాజా!; దశరథ పుత్రుడైన శ్రీరాముడు, తండ్రి ఆజ్ఞానుసారం యౌవనంలో తపస్సు చేయటానికి వెళ్ళటం అనే ఘనత కలిగి, లోకమంతా మెచ్చేవిధంగా సముద్రంలో వారధి నిర్మించి, మానవలోక పావనమనే వైభవాన్ని కలిగి, ముల్లోకాలను బాధించే రావణుడిని బంధువులతో కలిపి సంహరించిన సామర్థ్యం కలిగి, పసివారి మరణాలు జరగకుండా చేసిన అద్భుత మహత్తు కలిగి, అశ్వమేధం మొదలైన ఎన్నో యజ్ఞాలు చేసి, ప్రజలను కన్నతల్లివలె సంరక్షించి కూడా కాలధర్మం చెందాడు కదా!'

సీ. ' పూర్వవంశ్యులఁ గావఁ బూని వియద్గంగ । నవని భాగీరథి యనఁగఁ బఱపి,
శక్రుండు మెచ్చఁ బరాక్రమంబునఁ బేర్చి । యప్రతిహతముగ నశ్వమేధ
యాగంబు లొనరించు నప్పుడు వేయి వే । ల రదంబులందుఁ గన్యల నలంకృ
తలఁ జేసి యునిచి, రథంబు రథంబున । కిభములు నూఱు నూఱేసి యేనుఁ

తే. గేనుఁగునకు గుఱ్ఱములు వేయేసి పాటి । హయముహయమున కట్ల గోచయ మమర్చి
భూరి భూరి యుతంబుగ భూసురులకు । నొసఁగినట్టి భగీరథుం డున్నవాఁడె?' 234

ప్రతిపదార్థం: పూర్వవంశ్యులన్= తమ వంశంలోని పూర్వులను; కావన్+పూని= రక్షించాలని (ఉద్ధరించాలని) దీక్ష వహించి; వియత్+గంగన్= ఆకాశగంగను; అవనిన్= భూమిపై; భాగీరథి+అనఁగన్= భగీరథుడిచేత తీసికొనిరాబడినదనే పేరు పొందేటట్లుగా; పఱపి= ప్రవహింపచేసి; శక్రుండు= ఇంద్రుడు; మెచ్చున్= పొగడే విధంగా; పరాక్రమంబునన్= శౌర్యంతో; అతిశయించి= మించి; అప్రతిహతముగన్= ఎదురులేని విధంగా; అశ్వమేధ యాగంబులు= అశ్వమేధ యజ్ఞాలు; ఒనరించు+అప్పుడు= చేసే సమయంలో; వేయివేల రదంబుల+అందున్= పదిలక్షల రథాలలో; కన్యలన్= వివాహయోగ్యలయిన యువతులను; అలంకృతలను= సర్వాభరణ భూషితలను; చేసి= కావించి; ఉంచి= నిలిపి; రథంబు రథంబునకున్= ప్రతి రథానికి; ఇభములు= ఏనుగులు; నూఱు+నూఱేసి= నూరేసి చొప్పున; ఏనుఁగు+ఏనుఁగునకున్= ఒక్కొక్క ఏనుగుకు; గుఱ్ఱములు= గుర్రాలు; వేయేసి= వెయ్యి చొప్పున; హయము

హయమునకున్= ప్రతి గుర్రానికి; అట్ల= అదే విధంగా, అంటే వెయ్యి చొప్పున; గోచయము= ఆవుల సముదాయం; అమర్చి= ఏర్పాటుచేసి; భూరి= గొప్ప; అధికమైన= భూరియుతంబుగన్= బంగారంతో కూడుకొని ఉండేటట్లుగా; భూసురులకున్= బ్రాహ్మణులకు; ఒసఁగిన+అట్టి= దానం చేసినటువంటి; భగీరథుండు= భగీరథ చక్రవర్తి; ఉన్నవాఁడె?= జీవించి ఉన్నాడా? (లేడు కదా అని భావం).

తాత్పర్యం: 'ధర్మరాజా! తన వంశంలోని పూర్వులకు (సగర పుత్రులు) సద్గతులు కల్పించాలని సమకట్టి ఆకాశగంగను భూమిపై భాగీరథి అనే పేరుతో ప్రవహింపచేసి, ఇంద్రుడిని మెప్పించేటంత పరాక్రమంతో అతిశయించి, అశ్వమేధ యాగాలు చేసే సమయంలో పదిలక్షల రథాలపై అలంకృతకన్యల నుంచి ఒక్కొక్క రథంతో నూరేసి ఏనుగులను, ఒక్కొక్క ఏనుగుతోపాటు వెయ్యేసి గుర్రాలను, ఒక్కొక్క గుర్రంతో పాటు వెయ్యేసి గోవులను కూర్చి, అంతులేని బంగారంతో జతపరచి బ్రాహ్మణులకు దానమిచ్చిన వితరణశీలి అయిన భగీరథుడు జీవించి ఉన్నాడా? (లేడు కదా అని అర్థం)'.

విశేషం: పదివేల మంది బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి ఒక రథం, పదివేల ఏనుగులు, కోటి గుర్రాలు, వెయ్యికోట్ల గోవులను బంగారంతో సహా దానం చేశాడట భగీరథుడు.

సీ. ' అర్థి విశ్వావసుం డాదిగాఁ గలుగు గం । ధర్వులు హృద్య వాదన మొనర్ప,
నప్సరో నికురంబ మాటలుఁ బాటలు । నై వినోదింపఁగ, నమర గణము
బహు విధాలంకార భంగుల విన్నాణు । వులు సూప దివ్యమునులు నుతింప,
మనుజ లోకంబెల్లఁ గన కాన్న వస్త్ర భూ । షణ దానములఁ దృప్తి సనఁగ నశ్వ

ఆ. మేధ సమితిఁ జేసి మెప్పించె నింద్రుని । శతతమాధ్వరమున; నతఁడు హయము
నాసపడిన నిచ్చె; నాదిలీపునిఁ జూపు । మా! ధరిత్రి నిపుడు మనుజనాథ!' 235.

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా! ధర్మరాజా!; అర్థిన్= కోరికతో, ఇష్టంతో; విశ్వావసుండు+ఆదిగాన్= విశ్వావసుడు మొదలుగా; కలుగు= ఉన్న; గంధర్వులు= గంధర్వులనే దేవజాతి; హృద్య= మనోహరమైన; వాదనము+ఒనర్పన్= వాద్యాలు మ్రోయిస్తుండగా; అప్సరోనికురంబము= అప్సరసల సమూహం; ఆటలు+పాటలును+ఐ= నృత్యగానాలతో; వినోదింపఁగన్= ఆనందిస్తుండగా; అమరగణము= దేవతాబృందం; బహువిధ= అనేక విధాలైన; అలంకారభంగుల= అలంకారాల (నగలును, ఉపమాది అర్థాలంకారాలు శబ్దాలంకారాలును) రీతులలో; విన్నాణువులు= నేర్పులు; చూపన్= ప్రదర్శిస్తుండగా; దివ్యమునులు=దేవఋషులు; నుతింపన్= పొగడుతుండగా; మనుజలోకంబు+ఎల్లన్= మానవ సముదాయమంతా; కనక+అన్న+వస్త్ర+భూషణ దానములన్= బంగారం, ఆహారం, వస్త్రాలు, ఆభరణాల దానాలతో; తృప్తి+చనఁగన్= సంతృప్తి పొందగా; అశ్వమేధ సమితిన్= అశ్వమేధ యాగాల సముదాయాన్ని; చేసి= ఆచరించి; శతతమ+అధ్వరమునన్= నూరుదాటిన తరువాతి యజ్ఞంలో; ఇంద్రునిన్= శతమఖుడిని; మెప్పించెన్= సంతోషపరచాడు; అతఁడు= ఆ ఇంద్రుడు; హయమును= గుర్రమును; ఆసపడినన్= కోరగా; ఇచ్చెన్= ఇచ్చాడు; ఆ దిలీపునిన్= అటువంటి దిలీప చక్రవర్తిని; ఇపుడు= ఇప్పుడు; ధరిత్రిన్= భూమిపై; చూపుమా!= చూపించుము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! దిలీపచక్రవర్తి అనేక అశ్వమేధయాగాలు చేశాడు. ఆ యాగాలలో విశ్వావసుడు మొదలైన గంధర్వులు ఎంతో ఇష్టంగా మనోహరమైన వాద్యాలు వాయించేవారు. అప్సరసలు నృత్యగానాలతో వినోదింపచేసేవారు. దేవతలు ఎన్నో శబ్ద, అర్థాలంకారాలలో (కవితలలో) భూషణాలను తాల్చే రీతులలో తమ నేర్పును ప్రదర్శించేవారు. దేవర్షులు పొగడుతూ ఉండేవారు. బంగారు, ఆహార, వస్త్ర, ఆభరణ దానాలతో

మానవులు తృప్తి పడుతూ ఉండేవారు. ఇంద్రుడిని కూడా ఆతడు మెప్పించాడు. ఇంద్రుడు అశ్వాన్ని కోరితే ఇచ్చాడు. అటువంటి దిలీపచక్రవర్తిని ఈనాడు భూమిపై చూపించుము' (చూపించలేడని అతడు గతించాడని భావం).

సీ. ' జననమాదిగఁ బాకశాసను కరమునఁ । బ్రభవించు నేయును బాలు ద్రావి,
ద్వాదశదినము లాతఁడు గారవింపంగ । వర్ధిల్లి పండ్రెండు వత్సరముల
ప్రాయమై రాజ్యసంప్రాప్తికి నేతెంచి । యర్కుని యుదయంబు నస్తమయము
నగుపట్లు పాలిమేరలైన మహాక్షేత్ర । మంతయు నొక్కండ యనుభవించె;

ఆ. నన్నపర్వతముల నాజ్యనదుల విప్ర । భోజనము లొనర్చి రాజసూయ
ములును నశ్వమేధములుఁ జేసె మాంధాతృఁ । డింద నిలిచెనే నరేంద్రముఖ్య!' 236

ప్రతిపదార్థం: నర+ఇంద్రముఖ్య!= రాజోత్తమా! ధర్మరాజా!; జననము+ఆదిగన్= పుట్టినప్పటినుండి; పాకశాసను= ఇంద్రుడి; కరమునన్= చేతిలో; ప్రభవించు= పుట్టే; నేయును= నేతిని; పాలున్= పాలను; త్రావి= క్రోలి; ద్వాదశదినములు= పన్నెండు రోజులు; ఆతఁడు= ఆ ఇంద్రుడు; గారవింపంగన్= ఆదరించగా; వర్ధిల్లి= పెరిగి; పండ్రెండు వత్సరముల ప్రాయము+ఐ= పన్నెండు ఏడుల వయసు కలవాడై; రాజ్యసంప్రాప్తికిన్= రాజ్యమును పొందటానికి; ఏతెంచి= వచ్చి; అర్కుని= సూర్యుడి; ఉదయంబున్+అస్తమయమున్+అగుపట్లు= ఉదయించే, అస్తమించే చోట్లు - తూర్పుకొండ, పడమటికొండలు; పాలిమేరలు+ఐన= సరిహద్దులైన; మహాక్షేత్రము+అంతయున్= గొప్పదైన భూమి సమస్తమును; ఒక్కండు+అ= ఒక్కడే; అనుభవించెన్= పాలించాడు; అన్నపర్వతములన్= అన్నపు కొండలతో; ఆజ్యనదులన్= నేతి నదులతో; విప్రభోజనములు+ఒనర్చి= బ్రాహ్మణులకు భోజనాలుపెట్టి; రాజసూయములును; అశ్వమేధములున్; చేసెన్= ఆచరించాడు; మాంధాతృడు= అటువంటి మాంధాతృ చక్రవర్తి; ఇందున్+అ= ఈ నేలపైనే?; నిలిచెన్+ఏ= జీవించి ఉన్నాడా? (జీవించి లేడని భావం).

తాత్పర్యం: 'ధర్మరాజా! మాంధాతృ చక్రవర్తి పుట్టినప్పటి నుండి పన్నెండు రోజులు ఇంద్రుడి చేతినుండి పుట్టిన పాలు నెయ్యి త్రాగి పెరిగాడు. పన్నెండు సంవత్సరాల వయసులో రాజ్యాన్ని స్వీకరించాడు. సూర్యోదయ సూర్యాస్త మయాలయ్యే తూర్పు పడమర కొండలే తన రాజ్యానికి సరిహద్దులుగా భూమినంతా ఒక్కడే పాలించాడు. అశ్వమేధ రాజసూయ యాగాలు చేసి, అన్నపు కొండలు, నేతినదులతో బ్రాహ్మణ సంతర్పణం చేశాడు. అట్టి మాంధాత భూమిపై ఇప్పటివరకు జీవించి లేడు కదా!

సీ. ' అనిమిషాసురయుద్ధమున నసురావలి । సమయించి, వర్ణాశ్రమముల నేర్ప
రించి, భూమి యలంకరించి యగ్నిష్టోమ । హయమేధ వాజపేయాతిరాత్ర
పౌండరీకము లనఁ బరఁగిన యధ్వరం । బు లనేకములు సేసి, భూసురులకు
నఖిల భూములఁ గల యర్థంబు లెల్లను । దనకని యేమియు ననుప కిచ్చె;

ఆ. శుక్రు నల్లఁ డనఁగ శోభిల్లి తనయందు । ధర్మతత్త్వ మూర్జితముగ నియమ
నిష్ఠుఁడై యయాతి నెగడె; శాశ్వతుఁ డయ్యె । నే నృపాల యమ్మహీశ్వరుండు?' 237

ప్రతిపదార్థం: నృపాల!= ఓ ధర్మరాజా! యయాతి; అనిమిష= దేవతల; అసుర= రాక్షసుల; యుద్ధమునన్= రణంలో; అసుర+ఆవలి= రాక్షస సమూహాలను; సమయించి= సంహరించి, చంపి; వర్ణ+ఆశ్రమములన్+ఏర్పరించి= నాలుగు వర్ణాల

నాలుగు ఆశ్రమాల ధర్మాలను విస్పష్టంగా నిర్ధారించి; భూమి+అలంకరించి= ధరణికి సొగసులు కూర్చి (చక్కగా పాలించి); అగ్నిష్టోమ, హయమేధ, వాజపేయ, అతిరాత్ర, పౌండరీకములు; అనన్+పరఁగిన= అనే పేర్లతో ప్రఖ్యాతి పొందిన; అధ్వరంబులు+అనేకములు= లెక్కలేనన్ని యజ్ఞాలు; చేసి= ఆచరించి; అఖిల= సమస్తమైన; భూములన్= ప్రదేశాలలో; కల= ఉన్నటువంటి; అర్థంబులు+ఎల్లను= ధనాలు అన్నీ; తనకున్+అని= తన కొరకు అంటూ; ఏమియున్+ఉనుపక= ఏమీ ఉంచుకొనక; భూసురులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చెన్= దానం చేశాడు; శుక్రు= శుక్రాచార్యుడి; అల్లుఁడు+అనంగన్= అల్లుడుగా; శోభిల్లి= ఒప్పి; తన+అందున్= తనలో; ధర్మతత్త్వము= ధర్మంయొక్క స్వభావం; ఊర్జితముగన్= దృఢంగా నిలువగా; నియమ నిష్ఠుఁడు+ఐ= నియమాలయందు నిష్ఠగలవాడై; నెగడెన్= వర్ధిల్లాడు; ఆ+మహీ+ఈశ్వరుండు= ఆ రాజు; శాశ్వతుఁడు= నిత్యుడు; అయ్యెను+ఏ?= అయ్యాడా? (కాలేదు కదా అని భావం).

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! యయాతి దేవాసుర యుద్ధంలో రాక్షసులను సంహరించాడు. వర్ణాశ్రమ ధర్మాలను స్థిరపరిచాడు. రాజ్యానికి సొగసులు కూర్చాడు. అగ్నిష్టోమం, అశ్వమేధం, వాజపేయం, అతిరాత్రం, పౌండరీకం మొదలైన యజ్ఞాలు అనేకం చేశాడు. అపుడు అన్ని దేశాలలో ఉన్న ధనాలను గ్రహించినా, తన కంటూ ఏమీ ఉంచుకొనకుండా, బ్రాహ్మణులకు దానం చేశాడు, శుక్రాచార్యుడి అల్లుడుగా పేరొంది, ధర్మస్వభావాన్ని తనలో స్థిరంగా నిలిపి, నియమనిష్ఠలు కలవాడై ఒప్పారాడు. అటువంటి యయాతి భూమిపై శాశ్వతంగా ఉండగలిగాడా?' (లేడని భావం).

సీ. ' ఓర్వక పెక్కండ్రు రుర్వీశు లొక్కటఁ । బైనెత్తి వచ్చిన భండనమున
వారిహేతిచ్ఛత్ర వాహనధ్వజములు । నఱకిన నడునడ నడిఁకి వార
లభయంబు వేఁడిన నందఱఁ గృపఁగాచి । యేచి యీపెన్నేల యెల్లఁ దాన
కొని యధ్వరములు పె క్కొనరించి వేడుకఁ । బాయసంబులు నపూపములు మోద

ఆ. కములు లోనుగాఁగఁ గల వంటకముల ను । ర్వీసురావళులకుఁ బ్రీతిఁ జేసి,
దక్షిణలుగ మణివితానంబు లిచ్చిన । యంబరీషుఁ డేమి యయ్యెఁ జెపుమ!' 238

ప్రతిపదార్థం: ఓర్వక= అసూయతో; పెక్కండ్రు= అనేకులు; ఉర్వీ+ఈశులు= భూపతులు, రాజులు; ఒక్కటన్= ఒక్కసారిగా; పైన్+ఎత్తివచ్చినన్= తనపై దండెత్తిరాగా; భండనమునన్= యుద్ధంలో; వారి= ఆ అందరు రాజులయొక్క; హేతి= ఆయుధాలు; ఛత్ర= గొడుగులు; వాహన= వాహనాలు; ధ్వజములు= జెండాలు; నఱకినన్= ఖండించగా; నడునడ నడిఁకి= గడగడ వణకి; వారలు= ఆ రాజులు; అభయంబు= శరణం; వేడినన్= కోరగా; అందఱన్= వారినందరినీ; కృపన్= దయతో; కాచి= కాపాడి; ఏచి= విజృంభించి; ఈ+పెను+నేల= ఈ విశాలమైన భూమిని; ఎల్లన్= అంతటిని; తాను+అ= తానే; కొని= స్వీకరించి; అధ్వరములు= యజ్ఞాలు; పెక్కు= అనేకం; ఒనరించి= చేసి; వేడుకన్= ఇష్టంతో; పాయసంబులున్= పరమాన్నాలు; అపూపములు= పిండివంటలు; (అప్పాలు మొదలైనవి); మోదకములు= కుడుములు; లోనుకాఁగన్+కల= మొదలైన; వంటకములను= పాకాలను; ఉర్వీసుర+ఆవళులకున్= బ్రాహ్మణ సమూహాలకు; ప్రీతిన్= సంతోషంగా; చేసి= కల్పించి, కూర్చి; దక్షిణలుగన్= కానుకలుగా; మణివితానంబులు= రత్నాల రాసులను; ఇచ్చిన= ఇచ్చినటువంటి; అంబరీషుఁడు= అంబరీష చక్రవర్తి; ఏమి+అయ్యెన్= ఏమయ్యాడో; చెపుమ!= చెప్పుము.

తాత్పర్యం: 'ధర్మరాజా! అసూయ చెందిన రాజులందరూ ఒక్కటై తన పైకి దండెత్తిరాగా, యుద్ధంలో వారందరి ఆయుధాలను, గొడుగులను, వాహనాలను, జెండాలను తెగగొట్టగా, వారందరూ గడగడవణకిపోయి శరణు కోరగా, దయతో వారందరినీ కాపాడి, భూమండలాన్నంతా తానొక్కడే పరిపాలించి, ఎన్నో యజ్ఞాలు చేసి, సంతోషంగా

బ్రాహ్మణులకు పరమాన్నాలు, పిండివంటలు, కుడుములు మొదలైన పాకాలను కల్పించి (చేయించి పెట్టి), రత్నాలరాసులను దక్షిణలుగా ఇచ్చిన అంబరీషు డేమయ్యాడో చెప్పుము?' (శాశ్వతంగా నిలిచి లేడు కదా! శరీరం వదలక తప్పలేదే అని భావం).

సీ. ' లక్ష భార్యల నుపలాలించి, యొక్కొక్క। వెలఁదికి వేవురు వేవురాత్మ
జులు గాఁగఁ బదికోటు లలఘుమూర్తులఁ గాంచె; । వారును దోర్బలోజ్జ్వలులు నార్య
చరితులునై పేర్చి తురగ మేధంబు లం । దఱు బహు దక్షిణోదాత్త భంగిఁ
జేయుచుఁ దనపంపు సేసి వర్తింపంగఁ । దానును విశ్రుతాధ్వరము లొప్పఁ

తే. బెంపు సొంపును సువ్రత సంపదయును । నిర్మల శ్రద్ధయును గర్మ నిపుణతయును
నెఱయ శశిబిందుఁ డొనరించి నెగడె నతఁడు । వడయఁ జాలెనె యెన్నఁడుఁ జెడనియొడలు?' 239

ప్రతిపదార్థం: శశిబిందుఁడు= శశిబిందుడనే చక్రవర్తి; లక్షభార్యలన్= లక్షమంది భార్యలను; ఉపలాలించి= బుజ్జగించి; ఒక్కొక్క వెలఁదికిన్= ఒక్కొక్క స్త్రీకి; వేవురు వేవురు= వెయ్యిమంది చొప్పున; ఆత్మజులు కాఁగన్= కుమారులుగా; పదికోటులు= పది కోట్లమంది; అలఘుమూర్తులన్= గొప్పరూపంకలవారిని; కాంచెన్= పొందాడు; వారును= ఆ కొడుకులు కూడా; అందఱున్= అంతమంది; దోర్బల+ఉజ్జ్వలులు= బాహుబలంతో ప్రకాశించేవారు; ఆర్యచరితులును= మంచి నడతకలవారు; ఐ= అయి ఉండి; పేర్చి= అతిశయించి; బహు= అనేక; దక్షిణా= కానుకలతో; ఉదాత్తభంగిన్= గొప్పగా; తురగమేధంబులు= అశ్వమేధయాగాలు; చేయుచున్= చేస్తూ; తనపంపు= తన ఆదేశాన్ని; చేసి= అనుసరించి; వర్తింపంగన్= నడుచుకొంటూ ఉండగా; తానును= తనుకూడా; పెంపుసొంపును= తన ఆధిక్యంయొక్క చందము; సువ్రత సంపదయును= మంచి ప్రవర్తన అనే సంపద; నిర్మల శ్రద్ధయును= అచ్చపు ఆసక్తి; కర్మ నిపుణతయును= పనులయందు నేర్పరితనమూ; నెఱయన్= నిండగా (పూర్ణంగా ఉండగా); విశ్రుత+అధ్వరములు= పేరెన్నికగన్న యజ్ఞాలు; ఒప్పన్= చక్కగా; ఒనరించి= చేసి; నెగడెన్= వర్ధిల్లాడు; అతఁడు= అట్టి ఘనుడైన శశిబిందుడు; ఎన్నఁడు= ఎప్పటికీ; చెడని= నశించని; ఒడలు= శరీరమును; పడయన్+చాలెను+ఎ= పొందగలిగాడా? (లేదని భావం).

తాత్పర్యం: 'ధర్మరాజా! శశిబిందుడనే చక్రవర్తి లక్షమంది భార్యలను చక్కగా లాలించి, ఒక్కొక్కరివలన వెయ్యిమంది చొప్పున పదికోట్లమంది ఉత్తమ కుమారులను పొంది, వారందరూ తన ఆజ్ఞమేరకు సత్ప్రవర్తన కలవారై, బాహుబలంతో ప్రకాశిస్తూ ఎన్నో అశ్వమేధ యాగాలు భూరిదక్షణలిచ్చి చేయగా, తాను కూడా సత్ప్రవర్తన కలవాడై, ఎంతో ఆసక్తితో నేర్పరితనంతో చెప్పుకొన దగ్గవిధంగా యజ్ఞాలు చేశాడు. అట్టి వాడు కూడా శాశ్వతమైన శరీరం పొంద గలిగాడా?' (అతడు కూడా శరీరం వదిలాడు కదా అని భావం).

సీ. ' అధిక తపంబున నగ్ని నారాధించి । ప్రత్యక్షమగుటయు బ్రహ్మచర్య
వృత్తంబు దమమును వేదవిత్వము నహిం । సయుఁ బాత్రదానంబు శమము వరము
గాఁ గోరికొని వేదికాస్థలి మణికన । కాత్మిక యై ముప్పదాఱు యోజ
నముల దైర్ఘ్యము నంత కమరు విస్తారంబుఁ । గలుగంగ నొనరించి క్రతువు సేసి

తే. విప్ర తతికి దాని నతి ప్రియమున । నిచ్చెఁ; దనపేర గయ నుతి కెక్క వటము;
పొగడు వడయంగఁ బుణ్యుఁడై నెగడె గయుఁడు । భూవరోత్తమ! యతఁ డెందు బోయెఁ జెపుమ!'240

ప్రతిపదార్థం: భూవర+ఉత్తమ!= రాజవర్యా! ధర్మరాజా!; గయుఁడు= గయుడనే పేరుగల చక్రవర్తి; అధిక= మిక్కిలి అయిన; తపంబునన్= తపస్సుతో; అగ్నిన్+ఆరాధించి= అగ్నిదేవుడిని (అర్చించి) సేవించి; ప్రత్యక్షము+అగుటయున్= ఆ అగ్ని

సాక్షాత్కరించగా; బ్రహ్మచర్య వృత్తంబు= బ్రహ్మచారిగా నడుచుకొనే పద్ధతి; దమమును= బహిరింద్రియ నిగ్రహమును; వేదవిత్త్వమున్= వేదాలను తెలిసికొనగలగటం (వేదసారాన్ని తెలిసికొనటం); అహింసయున్= హింసచేయకుండటం; పాత్రదానంబు= అర్హులకు దానం చేయటం; శమము= అంతరింద్రియ నిగ్రహం; వరము గాన్= వరము లయ్యేటట్లుగా; కోరికొని= ప్రార్థించి; మణి+కనక+ఆత్మక+ఐ= రత్నములు బంగారుతో కూర్చినదై; ముప్పదారుయోజనముల= ముప్పది ఆరు యోజనాల; దైర్ఘ్యము= పొడవు; అంతకు+అమర= దానికి తగిన; విస్తారంబున్= వైశాల్యం; కలుగంగన్= ఉండేటట్లుగా; వేదికాస్థలిన్= తిన్నెను; ఒనరించి= ఏర్పాటుచేసి; క్రతువు+చేసి= యజ్ఞంచేసి; విప్రతతికిన్= బ్రాహ్మణ సమూహానికి; దానము; అతిప్రియముగన్+ఇచ్చెన్= ఎంతో ఇష్టంతో ఇచ్చాడు; తనపేరన్= తన పేరుతో; గయ= గయలో; నుతికిన్+ఎక్కన్= కీర్తి కలిగేటట్లు; వటము= మర్రిచెట్టు; పొగడు+పడయంగన్= మెప్పుపొందగా; పుణ్యుఁడు+ఐ= సత్కర్మలు ఆచరించినవాడై; నెగడెన్= వర్ధిల్లాడు; అతఁడు= ఆ గయుడు; ఎందున్+పోయెన్?= ఎక్కడికి వెళ్ళాడు?; చెపుము+అ= చెప్పుమా!.

తాత్పర్యం: 'ధర్మరాజా! గయుడనే చక్రవర్తి ఎంతో తపస్సుచేసి అగ్ని నారాధించి, ప్రత్యక్షం చేసికొన్నాడు. బ్రహ్మచర్యవృత్తిని, అనగా బ్రహ్మచారిగానే ఉండిపోవటాన్ని, అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహాన్ని, వేదజ్ఞానం కలిగి ఉండటాన్ని, అహింసను, పాత్రత ఎరిగి దానం చేయటాన్ని వరాలుగా కావాలని ప్రార్థించి పొందాడు. ముప్పది ఆరు యోజనాల పొడవు, దానికి తగిన వైశాల్యం కలిగిన మణులతో బంగారంతో కూడిన వేదికను నిర్మింపచేసి యజ్ఞంచేసి, బ్రాహ్మణులకు దానిని ఎంతో ఇష్టంతో దానం చేశాడు. ఆ ప్రదేశం అతడి పేరు మీదుగా గయ వటవృక్షం ప్రఖ్యాతి చెందగా, గయుడెన్నో సత్కర్మలు చేసి వర్ధిల్లాడు. మరి, అత డెక్కడికి పోయాడు? చెప్పుము'.

విశేషం: యోజనము= నాలుగు కోసుల దూరం - ఎనిమిది మైళ్ళ దూరం. (కోసు= రెండువేల విండ్ల దూరం).

దైవం ప్రత్యక్షమైతే ఎవరైనా కోరేవి భోగభాగ్యాలు. కాని, గయుడు కోరినవి తద్భిన్నమైనవి. అందునా పొందటానికి కష్టమైన వరం బ్రహ్మచర్యం. మానవుడు గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలను క్రమంగా పాటించాలి. ఆ క్రమం తప్పటానికి వేదవిహితమైన వర్ణాశ్రమధర్మం అంగీకరించదు. కనుక ఆ బ్రహ్మచర్యాశ్రమాన్ని పాటించటం వరంగా పొందవలసి వచ్చింది. వేదం చదవటం మానవ ప్రయత్నం, దాని సారం లేక తత్త్వం తెలియటం మాత్రం భగవదనుగ్రహమే.

సీ. 'ఇరువది వేవురు పరిణతపాచకు । లభ్యాగతులకును నతిథులకును
బాటించి క్రొత్తగాఁ బవలును రేయును । వలయు నన్నము లిడ వెలసి పశువు
లర్థి నుత్తమ గతికై తార చనుదేర । విశసించు చమరులు వేడ్కతోడఁ
బొడసూపి కడుపారఁ గుడువ హవిర్భాగ । ములు వెట్టు నివ్విధంబున మహోర్వ్

తే. తముగ నొనరించె సత్రయాగము తదుత్స । వంబు గొనియాడ వచ్చిన వార లెల్లఁ
బ్రచుర పుణ్యాత్ముఁ డన నొప్పె రంతిదేవుఁ । డవ్విభునకును వలసె లోకాంతరంబు.' 241

ప్రతిపదార్థం: రంతిదేవుఁడు= రంతిదేవుడనే చక్రవర్తి; ఇరువది వేవురు= ఇరువది వేలమంది; పరిణతపాచకులు= నేర్పరులైన వంటవారు; అభ్యాగతులకును= భోజన సమయానికి వచ్చిన వారికీ; అతిథులకును= ఆహూతులకూ; పాటించి= శ్రద్ధగా; క్రొత్తగాన్= అప్పటికప్పుడు; పవలును రేయును= పగటివేళల, రాత్రివేళల; వలయు= కావలసిన, తగిన; అన్నములు= ఆహారాలు; ఇడన్= పెట్టుతుండగా; పశువులు= యజ్ఞపశువులు; అర్థిన్= కోరికతో; ఉత్తమగతికిన్+ఐ= సద్గతులు పొందటానికి; తారు+అ= తమంతట తామే; చనుదేరన్= రాగా, వచ్చిచేరగా; విశసించుచున్= సంహరిస్తూ, బలిఇస్తూ; అమరులు= దేవతలు; వేడ్కతోడన్= వేడుకతో, ఇష్టంతో; పొడ+చూపి= రూపుకట్టి, ప్రత్యక్షమై; కడుపారన్= కడుపునిండుగా; కుడువన్= తినుచుండగా; హవిర్భాగములు+పెట్టున్=

యజ్ఞంలో హోమద్రవ్యాలు సమర్పించేవాడూ; ఈ+విధంబునన్= ఈ పద్ధతిలో, ఈ తీరుగా; మహా+అద్భుతముగన్= మిక్కిలి ఆశ్చర్యకరంగా; సత్రయాగము= ఎన్నో సంవత్సరాలపాటు జరిపే పెద్ద యాగమును; ఒనరించెన్= చేశాడు; తద్= ఆ; ఉత్సవంబున్= వేడుకను; కొని+ఆడన్= కీర్తించటానికి; వచ్చినవారలు+ఎల్లన్= వచ్చినవారందరూ; ప్రచుర= అధికమైన; పుణ్య+ఆత్ముఁడు= పవిత్ర స్వభావం కలవాడు; అనన్+ఒప్పెన్= అనేటట్లుగా ప్రకాశించాడు; ఆ+విభునకును= ఆ రాజుకు కూడా; లోక+అంతరంబు= పరలోకం; వలసెన్= తప్పలేదు.

తాత్పర్యం: 'ధర్మరాజా! రంతిదేవుడనే చక్రవర్తి సత్రయాగం నిర్వహించాడు. ఇది ఎన్నో సంవత్సరాల పాటు జరిగే యజ్ఞం. అంతకాలం ఆహూతులైనవారికి, భోజనసమయానికి పిలవక వచ్చేవారికి, అందరికీ రాత్రిపవలూ అప్పటికప్పుడు కావలసిన ఆహారం పెట్టటానికని ఇరవైవేల మంది పాకకళాప్రవీణులైన వంటవారిని నియమించాడు. ఆ యజ్ఞంలో బలిపశువులుగా ఉంటే తమకు ఉత్తమ గతులు లభిస్తాయని కోరి వచ్చిన పశువులనే చంపాడు. అత డర్పించే యజ్ఞభాగాలు స్వీకరించటానికి దేవతలు స్వయంగా వచ్చి కడుపారా భుజించేవారు. ఆశ్చర్యపడేటట్లుగా జరిగిన ఆ సత్రయాగం చూచిన వారంతా రంతిదేవుడిని పుణ్యాత్ముడని ఎంతో పొగడారు. అట్టి రంతిదేవుడు కూడా లోకాంతర గతుడయ్యాడు కదా!'

సీ. ' శరభ సింహాత్యుగ్ర సత్త్వచయంబుల । నేడిక లెట్లట్ల యెక్కియాడి,
కట్టుచు విడుచుచుఁ గణ్వాశ్రమంబున । దమియింపఁగా సర్వదమన నామ
మిడియె నమ్మునిఁ; పదంపడి మహారాజ్య । పదస్థుఁడై కాళిందితటమునందు
భాగీరథీ తీరభాగంబునను సర । స్వతి సమీపమునను వాజిమేధ

తే. రాజసూయాది వివిధాధ్వరము లొనర్చి । కనక నిర్మిత కరితురంగమ రథంబు
లసదృశ ప్రీతి విప్రుల కొసఁగె భరతుఁ; । డన్నరేంద్రచంద్రుండును జన్నవాఁడ.' 242

ప్రతిపదార్థం: భరతుఁడు= భరతుడనే చక్రవర్తి; శరభ= మీగండ్ల మెకము; సింహ= సింహం మొదలైన; అతి+ఉగ్ర= మిక్కిలి భయంకరమైన; సత్త్వచయంబులన్= మృగ సమూహాలను; ఏడికలు+ఎట్లు+అట్లు= పొట్టేళ్ళవలె; ఎక్కి= అధిరోహించి; ఆడి= క్రీడించి; కట్టుచున్= ఆ మృగాలను కట్టివేస్తూ; విడుచుచున్= వదలివేస్తూ; కణ్వ+ఆశ్రమంబు= కణ్వుడి ఆశ్రమంలో; దమియింపఁగాన్= నిగ్రహించగా; ఆ+ముని= ఆ కణ్వమహాముని; సర్వదమన= అన్నిటిని నిగ్రహించేవాడు అని 'సర్వదమనుడు' అనే; నామము+ఇడియెన్= పేరు పెట్టాడు; పదంపడి= తరువాత; మహారాజ్య పదస్థుఁడు+ఐ= గొప్ప సామ్రాజ్య పదవి పొందినవాడై; కాళింది తటమునందున్= యమునా నదీ తీరంలోనూ; భాగీరథీ= గంగానది; తీరభాగంబునను= తటాలలోనూ; సరస్వతి= సరస్వతీనది; సమీపమునను= దగ్గరలోనూ; వాజిమేధ= అశ్వమేధ; రాజసూయ+ఆది= రాజసూయం మొదలైన; వివిధ= అనేకమైన; అధ్వరములు= యజ్ఞాలు; ఒనర్చి= చేసి; కనకనిర్మిత= బంగారంతో చేయబడిన; కరి= ఏనుగులు; తురంగము= గుర్రాలు; రథంబులు= రథాలను; అసదృశ= పోలిక చెప్పటానికి వీలుకాని, సాటిలేని; ప్రీతిన్= తృప్తితో; విప్రులకున్= బ్రాహ్మణులకు; ఒసఁగెన్= ఇచ్చాడు; ఆ+నర+ఇంద్ర చంద్రుండును= ఆ రాజోత్తముడు కూడా; చన్నవాఁడు+అ= వెళ్ళినవాడే, చనిపోయినవాడే కదా!

తాత్పర్యం: 'ధర్మరాజా! కణ్వాశ్రమంలో శరభాలు సింహాలు మొదలైన భయంకరమైన మృగాలను గొర్రెపొట్టేళ్ళను ఎక్కినంత సులభంగా ఎక్కి, వాటిని బంధిస్తూ వదలుతూ, తన అధీనంలో ఉంచుకొన్న భరతుడికి, కణ్వుడు సర్వదమనుడని పేరు పెట్టాడు. తరువాత అతడు రాజ్యపదవిని పొంది, యమున, గంగ, సరస్వతీ నదీతీరాలలో అశ్వమేధం, రాజసూయంవంటి అనేక యజ్ఞాలు చేసి బంగారు ఏనుగులను, గుర్రాలను, రథాలను బ్రాహ్మణులకు ఇష్టంతో దానం చేశాడు. అటువంటి రాజశ్రేష్ఠుడైన భరతుడు కూడా పరలోకవాసి అయ్యాడు కదా!'

సీ. ' మిట్టు పల్లంబునై మెలఁగంగఁ దనరథ । ప్రముఖ వాహనములఁ బఱప ననువు
గాకున్న మేదినిఁ గని సమస్థలియుగ । వెరవున నొనరించి విశ్రుతముగఁ
దనపేరఁ బృథివి నాఁ జనఁజేసి గోరూప । మైన యివ్వసుమతి నమరనగముఁ
బనిచి యోషధులును బహురత్నములుఁ । బిదికించి జనంబుఁ బోషించెఁ బృథుఁడు;

తే. సేసె నానాధ్వరము లవి సెప్ప నేల? । సకల ధాత్రి బ్రాహ్మణులకు సత్కరించె;
నమ్మహానుభావునకును నతులయశము । కాక సుస్థిరమయ్యెనే కాయ మనఘ! 243

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! ధర్మరాజా!; మిట్టు పల్లంబును+ఐ= ఎత్తుపల్లాలుగా ఉండి; మెలఁగంగన్= కదలటానికి; తన రథ ప్రముఖ= తనవైన రథాలు మొదలైన; వాహనములన్= వాహనాలను; పఱపన్= నడిపించటానికి; అనువు+కాక+ఉన్న= వీలుకాకుండా ఉన్నటువంటి; మేదినిన్= భూమిని; కని= చూచి; సమస్థలియుఁగన్= చదునైన ఉపరితలం కలదిగా; వెరవునన్= ఉపాయంతో; ఒనరించి= చేసి; తనపేరన్= తన పేరుమీదుగా; పృథివినాన్= పృథివి (అనగ) అనే పేరుతో; విశ్రుతముగన్= ప్రఖ్యాతి చెందేటట్లు; చనన్+చేసి= చెల్లేటట్లుగా చేసి; గోరూపము+ఐన= ఆవు ఆకృతి ధరించిన; ఈ+వసుమతిన్= ఈ భూమిని; అమరనగమున్= హిమవత్పర్వతాన్ని; పనిచి= పంపి; ఓషధులును= తరు, లతా, గుల్మాదులైన చెట్లను; బహు= అనేకమైన; రత్నములున్= మణులను; పిదికించి= పిదికేటట్లు చేసి; జనంబున్= ప్రజలను; పోషించెన్= బ్రదికించాడు; నానా+అధ్వరములు= అనేక యజ్ఞాలు; చేసెన్= చేశాడు; అవి= వాటిని; చెప్పన్+ఏల?= చెప్పవలసిన పనిలేదు; సకల= సమస్తమైన; ధాత్రిన్= భూమిఅందలి; బ్రాహ్మణులకున్= విప్రులకు; సత్కరించెన్= సన్మానంచేశాడు; ఆ+మహానుభావునకున్= ఆ మహాత్ముడికి; అతుల= పోలిక చెప్పటానికి వీలుకానంత; యశము+అ= కీర్తిమాత్రమే; కాక= తప్ప; కాయము= శరీరం; సుస్థిరము+అయ్యెను+ఏ?= శాశ్వతమయిందా?

తాత్పర్యం: 'పాపరహితుడవైన ధర్మరాజా! పూర్వం భూమి ఎత్తుపల్లాలుగా ఉండి మనుష్యులు తిరగటానికి, రథాలు మొదలైన వాహనాలు నడవటానికి అనువుగా లేకపోతే, చూచి భూమిని చదునుగా ఉండేటట్లు చేశాడు పృథుచక్రవర్తి, అప్పటి నుండి అతడి పేరుమీద పృథ్వి అనే పేరు భూమికి చలామణి అయింది. గోరూపమైన భూమినుండి హిమవంతుడిని దూడగాచేసి ఓషధులను, మణులను పితికి ప్రజలను పోషించాడు. ఎన్నో యజ్ఞాలు చేశాడు. వాటిని గురించి చెప్పలేము. భూలోకంలోని బ్రాహ్మణులందరినీ సన్మానించాడు. ఆ మహానుభావుడికి అంతులేని కీర్తి తప్ప శరీరం స్థిరంగా నిలిచిందా? (కీర్తి మిగిలి, శరీరం నశించింది కదా!)'.

సీ. ' బ్రహ్మ విద్వేషంబుఁ బరికించి కోపించి । యవిజేయుఁడైన సహస్రబాహుఁ
బరిమార్చి నృపతులఁ దరమిడి తునుమాడె । నిరువదియొక్క మా ఱెల్లచోట
నందఱయేలెడు నన్ని భూములుఁ దాన । యేలె ధర్మోజ్జ్వల పాలనమున;
రాజయోగ్యములు ధరామరార్హంబులు । నగు నధ్వరములు పె క్కాచరించెఁ;

ఆ. గశ్యపునకు నిచ్చి కాశ్యపి యను పేరఁ । జనఁగఁ జేసె నుర్వి జామదగ్న్య
వినమె యామహాత్ముఁడును ససంతోష వి । భ్రాంతి గలిగెనేని బ్రదుక లేఁడు.' 244

ప్రతిపదార్థం: బ్రహ్మవిద్వేషంబున్= బ్రాహ్మణద్వేషాన్ని (బ్రహ్మజ్ఞానాన్ని ద్వేషించటం); పరికించి= గమనించి; కోపించి= కోపం కలవాడై; అవిజేయుఁడు+ఐన= గెలవటానికి వీలుకానటువంటి; సహస్రబాహున్= వేయిచేతులుగల కార్తవీర్యార్జునుడిని; పరిమార్చి= చంపి; నృపతులన్= రాజులను; ఇరువదిఒక్కమాఱు= ఇరవై ఒక్కసార్లు; తరమిడి= వరసపెట్టి; తునుమాడెన్= సంహరించాడు; ఎల్లచోటన్= అన్నితావుల; అందఱ+ఏలెడు= అందరూ పరిపాలించే; అన్ని భూములున్= అన్ని రాజ్యాలనూ; తాను+అ= తానే; ధర్మ+ఉజ్జ్వల+పాలనమునన్= ధర్మపద్ధతిలో మిక్కిలి ప్రకాశించే పరిపాలనతో; ఏలెన్= పాలించాడు; రాజ యోగ్యములు= రాజులకు

తగినవి; ధరా+అమర+అర్హంబులున్= బ్రాహ్మణులకు తగినవి; అగు= అయిన; అధ్వరములు= యజ్ఞాలు; పెక్కు+ఆచరించెన్= ఎన్నో చేశాడు; ఉర్విన్= భూమిని; కశ్యపునకున్= కశ్యప ప్రజాపతికి; ఇచ్చి= ఒసగి, దానంచేసి; కాశ్యపి+అనుపేరన్= కాశ్యపి అనే పేరుతో; చనఁగన్+చేసెన్= చెల్లుబాటయ్యేటట్లు చేశాడు; జామదగ్న్యున్= అటువంటి జమదగ్ని పుత్రుడైన పరశురాముడిని గూర్చి; వినము+ఎ= వినలేదా?; ఆ+మహా+ఆత్ముఁడును= ఆ మహానుభావుడు కూడా; స+సంతోష విభ్రాంతిన్= సంతోషంతో కూడిన విభ్రమం; కలిగెన్+ఏని= పొందినప్పటికీ; బ్రదుకలేఁడు= బ్రతుకజాలడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! జమదగ్ని పుత్రుడైన పరశురాముడు బ్రహ్మద్వేషి, జయించ శక్యం కానివాడూ అయిన వేయి చేతుల కార్తవీర్యుడిని చంపి, వరుసగా ఇరవై ఒక్కమారు రాజులందరినీ సంహరించి, వారందరి రాజ్యాలనూ తానొక్కడే ధర్మ బద్ధంగా పరిపాలించి, రాజులు చేయదగినవీ, బ్రాహ్మణులు చేయదగినవీ అయిన యజ్ఞాలు అనేకం చేసి, భూమినంతటినీ కశ్యపప్రజాపతికి దానంచేసి, భూమికి కాశ్యపి అనే పేరు స్థిరపరిచాడు. అవన్నీ మనం విన్నాం కదా! ఆ మహానుభావుడు కూడా సంతోష దుఃఖాలతో కూడిన బ్రతుకుతో కలకాలం జీవించలేకపోయాడు'.

వ. అని చెప్పిన యప్పుండరీకాక్షునితోఁ బాండవాగ్రజుండు 'సృంజయ సుతుండైన సువర్ణష్ఠీవిజన్మంబును, వాఁడు మృతుం డయిన విధంబును వినినది యయినను, సువ్యక్తంబుగా వినవలతుం జెప్పవే!' యనిన నతం డతని కిట్లను 'నీకు నాఁడు కృష్ణద్వైపాయనుం డక్కుమారు వృత్తాంతంబు నారదు నధీనంబగుటం జేసి తద్వ్యాపారంబు సెప్పెఁ; బర్వతునిం జెప్పండు గాని పర్వతుండును సహకారి; యత్తెఱం గాకర్ణింపుము.' 245

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; చెప్పిన= చెప్పిన; ఆ+పుండరీక+అక్షునితోన్= తెల్లతామరలవంటి కన్నులు కల శ్రీకృష్ణుడితో; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; సృంజయ సుతుండు+ఐన= సృంజయుడి కుమారుడైన; సువర్ణష్ఠీవి; జన్మంబును= పుట్టుకనూ; వాఁడు= ఆ సువర్ణష్ఠీవి; మృతుండు+ఐన= చనిపోయిన; విధంబును= ప్రకారమూ; వినినన్+అది= విన్నదే; అయినను= అయినా; సువ్యక్తంబుగాన్= బాగా తెలిసేవిధంగా (అర్థం అయ్యేటట్లు); వినవలతున్= వినాలని కోరుకొంటున్నాను; చెప్పుము+ఏ= చెప్పవలసింది; అనినన్= అనగా; అతనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనున్= (శ్రీకృష్ణుడు) అన్నాడు; నీకున్; నాఁడు= అప్పుడు; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; ఆ+కుమారు= ఆ బాలుడి; వృత్తాంతంబు= చరిత్ర; నారదు+అధీనంబు+అగుటన్+చేసి= నారదుడికి చెంది ఉండటం వలన; తద్+వ్యాపారంబు= ఆ నారదుడి వ్యవహారం; చెప్పెన్= చెప్పాడు; పర్వతునిన్= పర్వతుడి గురించి; చెప్పండు= చెప్పలేదు; కాని; పర్వతుండును= పర్వతుడు కూడా; సహకారి= తోడ్పడినవాడు; ఆ+తెఱంగు= ఆ క్రమం; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పిన కృష్ణుడితో ధర్మరాజు 'సృంజయుడి కుమారుడైన సువర్ణష్ఠీవి పుట్టుక, అతడు మరణించిన విధం విన్నదే అయినా, మరింత బాగా తెలిసేటట్లు వినా లనుకొంటున్నాను, చెప్పవలసింది' అన్నాడు. దానికి శ్రీకృష్ణ డిట్లా చెప్పటం ప్రారంభించాడు. 'నీకు ఆనాడు వ్యాసుడు ఆ బాలుడి వృత్తాంతం నారదుడికి చెందినది అవటంచేత అతడికి సంబంధించిన విషయమే చెప్పాడు. పర్వతుడిని గురించి చెప్పలేదు. కాని ఈ విషయంలో పర్వతుడుకూడా సహకరించాడు. ఆ విధం అంతా చెప్పుతాను వినుము'.

శ్రీకృష్ణుఁడు ధర్మజునకుఁ బర్వత నారదుల వృత్తాంతంబు సెప్పుట (సం. 12-30-4)

సీ. ' అధిప! నారదు చెలియలి కొడు కప్పర్వ, తుం డిద్దఱును మహీమండలమునఁ
బ్రిమ్మరు వేడుక దివినుండి యొక్కటఁ, జనుదెంచి తమలోన సమయ మధిక
నిష్ఠమైఁ జేసిరి నిజ చిత్తవృత్తు 'లొం, డొరులకు దాఁపక యుండువార;
మటుకాక దాఁప శాపార్హత వాటిల్లఁ, గలయది' యని యిట్లు గలయఁ బలికి

తే. యుచిత వర్తనమున నుండి యొక్కనాఁడు । సృంజయునిఁ గాంచి యతఁడు విశిష్ట భక్తి
నర్చనము సేసినను 'భవదాలయమున । ననఘ! వసియింతుమే కొన్ని దినము' లనిరి. 246

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; ఆ+పర్వతుండు= ఆ పర్వతుడు; నారదు= నారదుడియొక్క; చెలియలికొడుకు= చెల్లెలి కుమారుడు; ఇద్దఱును= నారద పర్వతులు; మహీమండలంబునన్= భూలోకంలో; త్రిమ్మరువేడుకన్= యథేచ్ఛగా విహరించాలనే కోరికతో; దివినుండి= దేవలోకం నుండి; ఒక్కటన్= ఒకేసారి; చనుదెంచి= వచ్చి; తమలోనన్= తమమధ్య; సమయము= ఒప్పందం, ఒడంబడిక; అధికనిష్ఠమైన్= మిక్కిలి గట్టిగా; చేసిరి= చేసికొన్నారు; నిజ= తమయొక్క; చిత్తవృత్తులు= మనోభావాలు; ఒండొరులకున్= పరస్పరం; దాఁపక+ఉండువారము= దాచుకొనకుండా ఉందాం; అట్లుకాక= ఆ విధంగా కాక; దాఁపన్= దాచినట్లయితే; శాప+అర్హత= శాపంపొందే అర్హత; పాటిల్లన్+కల+అది= కాగలదు; అని= ఈ విధంగా; కలయన్+పలికి= ఇరువురూ కలిసి అనుకొని; ఉచిత= తగిన; వర్తనమునన్= నడవడికతో; ఉండి= ప్రవర్తించి; ఒక్కనాఁడు= ఒకరోజు; సృంజయుని; కాంచి= చూచి; అతఁడు= ఆ సృంజయుడు; విశిష్టభక్తిన్= విశేషమైన భక్తితో; అర్చనము= పూజ, సేవ; చేసినను= చేయగా; అనఘ!= పాపరహితుడా!; భవత్+ఆలయమునన్= నీ గృహంలో; కొన్ని దినములు= కొద్ది రోజులు; నివసింతుము+ఏ?= ఉండమా?; అనిరి= అన్నారు.

తాత్పర్యం: ధర్మరాజా! పర్వతుడు నారదుడి చెల్లెలి కుమారుడు. వారిద్దరూ భూలోకంలో కొంతకాలం విహరించాలనే కోరికతో ఒకేసారి భూలోకం వచ్చారు. తమ మనోభావాలను దాచకుండా ఒకరితో ఒకరు చెప్పుకొనాలని, దాచినట్లైతే శాపార్హు లౌతారని ఒప్పందం చేసికొన్నారు. దానికి తగినట్లుగా ప్రవర్తిస్తూ ఒకనాడు సృంజయుడిని చూచారు. అతడు ప్రత్యేకమైన భక్తితో సేవించగా, అతడి ఇంట కొద్దికాలం ఉండమా? - అన్నారు.

వ. అని పలికిన నా పృథ్వీపతి ప్రియంబంది సుకుమారి యనుపేరం బరఁగిన నిజనందన రావించి 'యిక్కన్నియ
మీకుం బరిచర్య సేయ సమాధానంబున నుండుం'డని యన్నెలంతతో 'నీవు దేవోపచారంబుల వీరి
నారాధింపు' మని నియోగించి వలయు వస్తువులు సమగ్రంబులుగా సమకట్టినం, బ్రీతులై యమ్మునులు
సుఖంబున్న సమయంబున. 247

ప్రతిపదార్థం: అని పలికినన్= ఈ విధంగా అడుగగా; ఆ పృథ్వీపతి= ఆ రాజు, సృంజయుడు; ప్రియంబు+అంది= సంతోషపడి; సుకుమారి+అను+పేరన్+పరఁగిన= సుకుమారి అనే పేరుగల; నిజనందనన్= తనకుమార్తెను; రావించి= పిలిపించి; ఈ+కన్నియ= ఈ కన్య, ఈ బాలిక; మీకున్= మీకు; పరిచర్య+చేయన్= సేవలు చేస్తుండగా; సమ్+ఆ ధానంబునన్+ఉండుండు= అంగీకరించి ఉండండి; అని= పలికి; ఆ+నెలంతతోన్= ఆ బాలికతో; నీవు; దేవ+ఉపచారంబులు= దేవతలకు చేసే ఉపచారాలతో; వీరిన్= ఈ మునులను; ఆరాధింపుము+అని= సేవించుము (పూజించుము) అని; నియోగించి= ఆజ్ఞాపించి; వలయు= కావలసిన; వస్తువులు= పదార్థాలు; సమగ్రంబులు+కాన్= పరిపూర్ణంగా; సమకట్టినన్= సిద్ధపరచగా; ప్రీతులు+ఐ= సంతసించినవారై; ఆ+మునులు= ఆ ఋషులు; సుఖంబు+ఉన్న= హాయిగా ఉన్నటువంటి; సమయంబున= కాలంలో.

తాత్పర్యం: అని పర్వతనారదాదులు అంటే ఆ సృంజయుడు సంతోషపడి, సుకుమారి అనే పేరున్న తన కుమార్తెను పిలిపించి 'ఈ కన్య మీకు ఉపచారాలు చేస్తుంది. అంగీకరించండి' అని చెప్పి, ఆమెతో 'నీవు ఈ మునులను దేవతలకు చేసే ఉపచారాలతో (షోడశోపచారాలతో) సేవించుము' అని ఆజ్ఞాపించి, కావలసిన పదార్థాల నన్నింటిని పరిపూర్ణంగా ఏర్పాటు చేయగా, ఆ మునులు సుఖంగా ఉన్న సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. అల్లఁదనంబున యనువు మైకొనఁజూచు । నడపు కాంతికి వింత తొడవు గాఁగ,
వెడవెడ నూఁగారు వింతయై యేర్పడఁ । దారనివళులలో నారు నిగుడ,
నిట్టలు ద్రోచుచు నెలవులకల మేర । లెల్లను బిగియెక్కి యేర్పడంగఁ,
దెలుపును గప్పును వెలయంగ మెఱుఁగెక్కు। తారకంబులఁ గల్కితనము దొడరఁ

ఆ. జరణములును నడుముఁ జన్నులుఁ గన్నులు । జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు
చునికిఁ దెలుప సృంజయుని పుత్రి మెలఁగు వి । ధంబు నారదునకుఁ దగు లొనర్చె. 248

ప్రతిపదార్థం: అల్లఁదనంబున= నెమ్మదితనంతో; అనువు= వీలు, ఉపాయం; మైకొనన్+చూచు= అంగీకరించ ప్రయత్నించే; నడపు= గమనం; కాంతికిన్= జిగికి, శోభకు; వింత= క్రొత్తదైన; తొడవు+కాఁగన్= అలంకారం కాగా; వెడవెడ= కొద్దిగా; నూఁగారు= రోమాళి; వింతఐ= క్రొత్తదిగా; ఏర్పడన్= కలుగగా; తారని= కలువని (ఇంకా సరిగా ఏర్పడని) వళులలోన్= త్రివళులలో; ఆరు= నూగారు; నిగుడన్= వ్యాపించగా; నిట్టలు= స్థానాలు (తమ తమ); త్రోచుచున్= ఆవలకు నెట్టుతూ; నెలవులకున్= స్థానాలకు; అల= ఆ; మేరలు= హద్దులు; ఎల్లను= అన్ని; బిగి+ఎక్కి= బిగువు కలిగి; ఏర్పడంగన్= తయారుకాగా; తెలుపును= తెల్లదనం; కప్పును= నల్లదనం; వెలయంగన్= ఒప్పగా; మెఱుఁగు+ఎక్కు= కాంతి ఎక్కువ అవుతున్న; తారకంబులన్= కను గ్రుడ్లలో; కల్కితనము= మనోహరత్వం, గడుసరితనం; తొడరన్= అతిశయించగా; చరణములును= పాదాలూ; నడుమున్= నడుమూ; చన్నులున్= వక్షోజాలూ; కన్నులు= నయనాలూ; జవ్వనంబు= యౌవనము యొక్క; చెన్ను= అందం; నివ్వటిల్లుచున్= అతిశయిస్తూ; ఉనికి= ఉండటాన్ని; తెలుపన్= ప్రకటించగా; సృంజయుని పుత్రి= సుకుమారి; మెలఁగు విధంబు= ప్రవర్తించే తీరు; నారదునకున్= నారద మహర్షికి; తగులు+ఒనర్చి= మోహాన్ని కలిగించింది.

తాత్పర్యం: నెమ్మదితనంతో వీలు చూచుకొని అతిశయించే నడక ఆ సుకుమారి శోభకు క్రొత్త అందాన్ని కూర్చగా, అప్పుడే స్వల్పంగా రూపు కడుతున్న నూగారు, ఇంకా స్పష్టంగా ఏర్పడని త్రివళుల (పొట్టపై అందగత్తెలకుండే మూడు ముడుతలు)లో వ్యాపించగా, (శరీరావయవాలు) తమతమ స్థానాలను దాటి (విస్తరించి), క్రొత్త హద్దులను స్థిరపరచగా, తెలుపునలుపులతో మరింత కాంతిమంతమౌతున్న కంటిపాపల మనోహరత్వం అతిశయించగా, పాదాలు, నడుము, వక్షోజాలు, కన్నులు యౌవన సౌందర్యం అధికమవటాన్ని తెలుపుతుండగా సృంజయుడి కుమార్తె సుకుమారి ప్రవర్తించే తీరు నారదమహర్షికి ఆకర్షణ కలుగజేసింది.

విశేషం: అలం: యథాసంఖ్యం

క. నారదుఁడు మదనబాణా । సారము దనుఁ బొదువ ధైర్యసారమెడలి దు
ర్వార మనోవ్యధవంతం । గూరి క్రమంబునఁ గృశాంగకుండయ్యె నృపా! 249

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; నారదుఁడు= నారదమహర్షి; మదనబాణ+ఆసారము= మన్మథబాణాల జడివాన; తనున్= తనను; పొదువన్= క్రమ్మగా; ధైర్యసారము= ధైర్యంయొక్క బలం; ఎడలి= కోల్పోయి, దుర్వార= వారించరాని; ఆపలేని; మనోవ్యధ వంతన్= మానసికతాపం వలని బాధలో; కూరి= కూరుకుపోయి; క్రమంబునన్= నెమ్మది నెమ్మదిగా; కృశ+అంగకుండు= క్షీణించిన శరీరావయవాలు కలవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: ధర్మరాజా! నారదమహర్షి మన్మథబాణాల జడివాన తనను ముంచెత్తగా, ధైర్యం కోల్పోయినవాడై, నివారించలేని మనోవికార బాధలో కూరుకొనిపోయి నెమ్మదిగా చిక్కిపోయాడు.

వ. అట్లు కాముబారిం బడి నలంగియుఁ దనతో నుగ్గడింప సిగ్గువడి. 250

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; కాము+బారిన్+పడి= మన్మథబాధ పాలబడి; నలంగియున్= బాధపడి కూడా; తనతోన్= పర్వతుడితో; ఉగ్గడింపన్= చెప్పటానికి; సిగ్గు+పడి= సిగ్గిల్లి.

తాత్పర్యం: ఆ విధంగా మన్మథుడి బాణాలకు ఎర అయి, బాధపడుతూ కూడా తనతో చెప్పటానికి సిగ్గుపడి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. వెనుఁబడు చిత్తవృత్తియును, వెల్వెలఁ బాఱెడు నాననంబు నై
యనిశముఁ గుందు, మామఁ గని యల్లుఁ 'డితం డిటు లేల వంతఁ బొం
దెనో!' యనుచింత నొంది, తన దివ్యమతిం బరికించి కాంచి 'కూ
డునె సమయంబు దప్పఁగఁ? గడుం గుటిలాత్ముఁడవైతి నా యెడన్.' 251

ప్రతిపదార్థం: వెనుఁబడు= విషాదానికి లోనైన; చిత్తవృత్తియును= మనోభావమూ; వెల్వెలన్+పాఱెడు= పాలిపోయిన; ఆననంబును+ఐ= ముఖం కలవాడై; అనిశమున్= నిరంతరం; కుందు= బాధపడుతున్న; మామన్+కని= మేనమామ అయిన నారదుడిని చూచి; అల్లుఁడు= పర్వతుడు; ఇతండు= ఈ నారదుడు; ఇటులు= ఈ విధంగా; ఏల= ఏ కారణంగా; వంతన్= బాధను; పొందెను+ఒ?= పొందాడో?; అను చింతన్+ఒంది= అనే ఆలోచన కలిగి; తన దివ్యమతిన్= తన దివ్యదృష్టితో; పరికించి= చూచి; సమయంబున్= ఒప్పందాన్ని; తప్పఁగన్= తప్పటం; కూడును+ఎ?= తగినదా?; నా+ఎడన్= నా పట్ల; కడున్= మిక్కిలి; కుటిల+ఆత్ముఁడవు= దుర్బుద్ధి కలవాడివి; ఐతి(వి)= అయ్యావు.

తాత్పర్యం: మనసులో విషాదం, పాలిపోయిన ముఖం కలిగి నిరంతరం బాధపడుతూ ఉన్న తన మేనమామ నారదుడిని చూచి పర్వతుడు తనమామ ఎందుకు అంత బాధపడుతున్నాడా? అని ఆలోచించి, దివ్యదృష్టితో తెలిసికొన్నాడు. 'మాటతప్పి, నా పట్ల దుర్బుద్ధివి అయ్యావు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. రాచకూఁతు మీఁద రాగంబు పుట్టుట । నాకుఁ జెప్పవైతి; నీకు శాప
మిత్తు; నమ్మృగాక్షి నీవు వరింపక । నిలువలేవు మరుఁడు బలియుఁడగుట. 252

ప్రతిపదార్థం: రాచకూఁతు+మీఁదన్= రాజకుమార్తెపై; రాగంబు పుట్టుట= ప్రేమ కలగటం; నాకున్ చెప్పవు+ఐతి(వి)= నాకు చెప్పలేదు; నీకున్; శాపము+ఇత్తున్= శాపం ఇస్తాను; మరుఁడు= మన్మథుడు; బలియుఁడు= బలవంతుడు; అగుటన్= కావటం వలన; ఆ+మృగ+అక్షిన్= ఆ లేడి కళ్ళవంటి కళ్ళుగల సుకుమారిని; వరింపక= వివాహమాడక; నిలువలేవు= ఉండలేవు.

తాత్పర్యం: రాజకుమార్తెపై నీకు అనురాగం కలిగిందని నాకు చెప్పలేదు. నిన్ను శపిస్తాను. మన్మథుడి ప్రాబల్యం కారణంగా నీ వా సుకుమారిని పరిణయం చేసికొనక ఉండలేవు.

వ. పాణిగ్రహణానంతరంబ వానర వదనుండ వగు' మనవుడు నారదుండు 'నీకు నాకలోకంబునకుం జనుట లేకుండెడు' మని ప్రతిశాపం బిచ్చినం, బర్వతుం డచ్చోటు వాసిపోయి భూజనంబులు పూజింపఁ బ్రవర్తిల్లుచుండె. 253

ప్రతిపదార్థం: పాణిగ్రహణ+అనంతరంబు+అ= వివాహం తరువాత వెంటనే; వానర వదనుండవు= కోతిమొగం కలవాడివి; అగుము= కమ్ము; అనవుడున్= అనగా; నారదుండు; నీకున్= పర్వతుడికి; నాకలోకంబునకున్= స్వర్గలోకానికి; చనుట= వెళ్ళటం; లేక+ఉండెడున్= లేక ఉందువుగాక; అని= అంటూ; ప్రతిశాపంబు= ఎదురు శాపం; ఇచ్చినన్= ఇవ్వగా; పర్వతుండు; ఆ+చోటు=

ఆ ప్రదేశాన్ని; పాసి= వీడి; పోయి= వెళ్ళి; భూజనంబులు= భూలోక ప్రజలు; పూజింపన్= ఆరాధిస్తుండగా; ప్రవర్తిల్లుచుండెన్= నడుచుకొంటూ ఉన్నాడు.

తాత్పర్యం: వివాహం అయిన వెంటనే కోతి మొగం కలవాడివి అవుతావు' అని పర్వతుడు అనగానే, 'నీవు స్వర్గలోకానికి వెళ్ళకుందువుగాక!' అని నారదుడు ఎదురు శాపం ఇచ్చాడు. పర్వతుడు ఆ ప్రదేశం వదలి వెళ్ళి భూలోకంలోని ప్రజలచేత పూజలందుకొంటూ తిరుగసాగాడు.

శా. శాప ప్రాప్తికి నోర్చి తా నడిగి యా చంద్రాస్య నన్నారదుం
డా పృథ్వీపతి యీఁ బ్రియంబున వివాహం బయ్యె నమ్మాత్రలో
భూపా! యమ్ముని వానరాననతమైఁ బొల్పేద నక్కాంత త
ద్రూప ప్రాప్తి విరక్తగాక తగఁ బ్రీతుం జేయుచుండెం బతిన్. 254

ప్రతిపదార్థం: భూపా!= ధర్మరాజా!; ఆ+నారదుండు= ఆ నారదమహర్షి; శాపప్రాప్తికిన్= శాపం పొందటాన్ని కూడా; ఓర్చి= సహించి; తాన్= తానే; ఆ+చంద్ర+ఆస్యన్= చంద్రుడివంటి ముఖం కల సుకుమారిని; అడిగి= వేడి; ఆ పృథ్వీపతి= ఆ రాజు (సృంజయుడు); ఈన్= ఒసగగా; ప్రియంబునన్= ఇష్టంతో; వివాహంబు+అయ్యెన్= వివాహం చేసికొన్నాడు; ఆ+మాత్రలోన్= అంతలో; ఆ+ముని= ఆ నారదుడు; వానర+ఆననత+మైన్= కోతిమొగం కలిగి ఉండటంతో; పొల్పు+ఏదన్= అందంపోగా; ఆ+కాంత= ఆ సుకుమారి; తద్+రూప+ప్రాప్తిన్= ఆ కోతి రూపం పొందినందువలన; విరక్త+కాక= అనిష్టాన్ని పెంచుకొనకుండా; తగన్= చక్కగా; పతిన్= భర్తను; ప్రీతున్= సంతృప్తి చెందినవాడిని; చేయుచున్+ఉండెన్= చేస్తున్నది.

తాత్పర్యం: ధర్మరాజా! నారదమహర్షి తనకు శాపం వచ్చినా సహించి, సృంజయుడిని తానే అడిగి, సుకుమారిని ఎంతో ఇష్టంగా వివాహం చేసికొన్నాడు. మరుక్షణం కోతిముఖం పొంది తన అందాన్ని కోల్పోయాడు. నారదుడు అటువంటి వికారమైన రూపం పొందినా ఆ సుకుమారి భర్తపై అనిష్టం ప్రకటించకుండా అతడిని సుఖపెట్టుతూ ఉన్నది.

వ. ఇట్లు పతివ్రతయై సుకుమారి నారదు నారాధించుచుండెఁ;బదంపడి యొక్క నాఁ డేమేనియుం బనికి వనంబునకు నారదుండు వోయినయెడం బర్వతుండు డబ్బాటు గాంచి నమస్కరించి 'నాకిచ్చిన శాపంబు మరల్పవే!' యనుటయు నారదుండు 'నీవు గావె మున్ను శపించిన వాఁడవు; ముందర నీ యిచ్చిన శాపంబు మరల్పందగు' నని పలికిన, నతం 'డట్లకాక' యనియె; నివ్విధంబున నొడంబడి యిరువురు నొండొరువుల శాపంబులు మరల్చి; రయ్యల్లుండును మామతోడన వచ్చి మందిర ప్రవేశంబు సేయు సమయంబున నా రాజనందన నిజపురుషుం జూచి పరపురుషుండ కాఁ దలంచి, మఱిచూడక మాఱుమొగంబు వెట్టికొని పోవుటయు. 255

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పతివ్రత+ఐ= పతిని అనుసరించే ప్రవర్తన కలదై; సుకుమారి= సృంజయుడి కుమార్తె, నారదున్= నారదుడిని; ఆరాధించుచున్+ఉండెన్= సేవించుకొంటూ ఉన్నది; పదంపడి= తరువాత; ఒక్కనాఁడు= ఒక రోజు; ఏమి+ఏనియున్= ఏదో ఒక; పనికిన్= కార్యానికి; నారదుండు; వనంబునకున్= అరణ్యానికి; పోయిన+ఎడన్= వెళ్ళినప్పుడు; పర్వతుండు; డబ్బాటు= అకస్మాత్తుగా; కాంచి= చూచి; నమస్కరించి= మ్రొక్కి; నాకున్+ఇచ్చిన= నాకొసంగిన; శాపంబు= శాపాన్ని; మరల్పుము+ఏ?= వెనక్కు తీసికొనవా?; అనుటయున్= అనగా; నారదుండు; మున్ను= ముందు; శపించినవాఁడవు= తిట్టినవాడివి; నీవు+కావు+ఎ!= నీవే కదా!; ముందర= ముందు; నీ+ఇచ్చిన= నీ విచ్చిన; శాపంబు= తిట్టు; మరల్పన్+తగున్= వెనుకకు తీసికొనటం తగి ఉంటుంది;

అనిపలికినన్= అంటూ మాట్లాడగా; అతండు= ఆ పర్వతుడు; అట్లు+అ+కాక= అట్లే అగుగాక; అనియెన్= అన్నాడు; ఈ+విధంబునన్= ఈ తీరుగా; ఒడంబడి= అంగీకరించి; ఇరువురున్= ఇద్దరూ; ఒండొరువుల= పరస్పర; శాపంబులు= శాపాలను; మరల్చిరి= వెనుదిప్పారు; ఆ+అల్లుండును= ఆ పర్వతుడు కూడా; మామతోడన= నారదుడితోనే; వచ్చి= ఏతెంచి; మందిర ప్రవేశంబు+చేయు= ఇంటిలో అడుగుపెట్టే; సమయంబునన్= తరుణంలో; ఆ రాజనందన= ఆ రాకుమారి - సుకుమారి; నిజపురుషున్= తన భర్తను; చూచి= కని; పరపురుషుండు= పరాయి మగవాడు; కాన్+తలంచి= అయి ఉంటా డనుకొని; మఱిచూడక= మళ్ళీ చూడకుండా; మాఱుమొగంబు= ఎడమొగం; పెట్టికొని= పెట్టుకొని; పోవుటయున్= వెళ్ళిపోగా.

తాత్పర్యం: భర్త కురూపి అయినా సుకుమారి పతివ్రత అయి భర్తను సేవిస్తూ ఉన్నది. ఒకరోజు ఏదో పనిమీద నారదుడు అడవికి వెళ్ళగా హఠాత్తుగా పర్వతుడు చూచి నమస్కరించి తన కిచ్చిన శాపాన్ని వెనుకకు తీసికొనుమని అడిగాడు. దానికి నారదుడు 'ముందుగా శపించినది నీవు కనుక నీవే ముందు మరల్చాలి' అన్నాడు. దానికా పర్వతుడు సరేనన్నాడు. ఈ విధంగా ఇద్దరూ పరస్పరం శాపాలు మరల్చారు. మామా అల్లు ళ్ళిద్దరూ వచ్చి ఇంటిలో ప్రవేశించబోతూ ఉండగా, సుకుమారి తన భర్త అయిన నారదుడిని పరాయివాడిగా భావించి తిరిగిచూడక పెడమొగం పెట్టుకొని పోయింది.

ఆ. నగుచుఁ బర్వతుండు 'నాతి! నీపతి యగు । విశ్వసింపు'మని సవిస్తరముగ
శాపములును మోక్షసంవిధానములును । జెప్పి తీర్చె దాని చిత్తవృత్తి. 256

ప్రతిపదార్థం: పర్వతుండు; నగుచున్= నవ్వుతూ; నాతి!= ఓ సుకుమారీ!; నీపతి+అగు= (ఇతడు) నీ భర్తయే (అయి ఉన్నాడు); విశ్వసింపుము+అని= నమ్ముమని; సవిస్తరముగన్= అన్ని వివరాలతో; శాపములును= ఒకరినొకరు శపించుకొనటం; మోక్షసంవిధానములును= శాపావనసానపు తీరులూ; చెప్పి= తెలిపి; దాని= ఆ సుకుమారి యొక్క; చిత్తవృత్తిన్= మనసును; తేర్చెన్= కలత తీర్చాడు.

తాత్పర్యం: అపుడు పర్వతుడు నవ్వుతూ, 'సుకుమారీ! ఇతడు నీ భర్త అని నమ్ముము' అని శాపాలవృత్తాంతం, అవి పోయిన వృత్తాంతం వివరంగా చెప్పి ఆమె మనసులోని కలతను తీర్చాడు.

వ. ఇట్లు నారదుండును బర్వతుండును బరస్పర ప్రియకారులైరి; కౌరవోత్తమా! నీ యడిగిన సువర్ణష్ఠీవి వృత్తాంతంబు నిమ్మునివరుండు దేటపడం చెప్పెడు' నని సృంజయ పుత్ర చరిత్ర కథనంబు నారదు కృత్యంబుగాఁ బలుకుచు నతనిం జూపిన, నాతం 'డిప్పుడు శౌరి చెప్పినయంతయు నిట్టిద' యక్కుమారు తెఱంగుఁ జెప్పెద నాకర్ణింపు'మని యప్పాండవాగ్రజున కభిముఖుండై యిట్లనియె. 257

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నారదుండును, పర్వతుండును; పరస్పర= ఒకరికొకరు; ప్రియకారులు= మేలు చేసికొన్నవారు; ఐరి= అయ్యారు; కౌరవ+ఉత్తమా!= కౌరవులలో శ్రేష్ఠుడవైన ధర్మరాజా!; నీ+అడిగిన= నీవు అడిగినటువంటి; సువర్ణష్ఠీవి; వృత్తాంతంబున్= చరిత్రను; ఈ+మునివరుండు= ఈ ఋషి శ్రేష్ఠుడు నారదుడు; తేటపడన్= స్పష్టమయ్యేటట్లు; చెప్పెడున్= చెప్పుతాడు; అని= అంటూ; సృంజయ పుత్ర చరిత్ర= సృంజయుడి కుమారుడైన సువర్ణష్ఠీవి కథ; కథనంబు= చెప్పటం; నారదు కృత్యంబు+కాన్= నారదుడు చేయవలసిన పని అని; పలుకుచున్= చెప్పుతూ; అతనిన్= ఆ నారదుడినే; చూపినన్= చూపగా; ఆతండు= ఆ నారదుడు; ఇప్పుడు; శౌరి= కృష్ణుడు; చెప్పిన+అంతయున్= చెప్పినదంతా; ఇట్టిది+అ= అటువంటిదే, నిజమే; ఆ+కుమారు= ఆ బాలుడి; తెఱఁగున్= విధం; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము; అని= పలికి; ఆ+పాండవ+అగ్రజునకున్= ఆ ధర్మరాజుకు; అభిముఖుండు+ఐ= ఎదురుగా నిలిచినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ విధంగా నారదుడు పర్వతుడు ఒకరికొరకు ఒకరు ఉపకారం చేసికొన్నారు. నీవు అడిగిన సువర్ణష్ఠివి వృత్తాంతాన్ని మునివర్యుడైన నారదుడు మీకు తేటతెల్లంగా వినిపిస్తాడు. సువర్ణష్ఠివి కథ చెప్పటం నారదుడి పని' అని చెప్పి శ్రీకృష్ణుడు నారదుడిని చూపగా, అతడు 'కృష్ణుడు చెప్పినదంతా వాస్తవమే' అని, 'ఇక సువర్ణష్ఠివి కథ వినుఁ' మని ధర్మరాజు ఎదుట నిలిచి ఇట్లా చెప్పటం ప్రారంభించాడు.

సీ. ' అవ్విధంబున నేను నల్లుండు సంప్రీతి । స్నుంజయుపాల వసింపఁ గొన్ని
సంవత్సరంబులు సనినఁ, దదాశ్రిత । బ్రాహ్మణోత్తముల సంప్రార్థనంబు
గలుగంగ మాకును గమనేచ్ఛ పుట్టంగ । నా రాజునకు నుపకార మొకటి
సేయఁ దలంచి యే మాయన సన్నిధి । కరిగి కోరుము వరమంటి మనిన

ఆ. నతఁడు 'మీరు ప్రీతులయినకంటెను నొండు । గలవె వరము?' లనిన గారవించి
యనిమిషులను మిగులు తనయునిఁ బడయంగ । వలచియుండు దట్టి వానిఁ గనుము. 258

ప్రతిపదార్థం: ఆ+విధంబునన్= ఆ విధంగా; నేనును+అల్లుండున్= నేనూ నా మేనల్లుడైన పర్వతుడూ; సంప్రీతిన్= మిక్కిలి ఇష్టంతో; స్నుంజయపాలన్= స్నుంజయుడివద్ద; వసింపన్= నివసించగా, ఉండగా; కొన్ని సంవత్సరంబులు= కొన్ని ఏళ్ళు; చనినన్= కడవగా; తద్+ఆశ్రిత= ఆ స్నుంజయుడిని ఆశ్రయించుకొని ఉన్న; బ్రాహ్మణ+ఉత్తముల= విప్రవర్యుల; సంప్రార్థనంబు= విన్నపం; కలుగంగన్= ఉండగా; మాకును= మాకు కూడా; గమన+ఇచ్ఛ= వెళ్ళాలనే కోరిక; పుట్టంగన్= కలుగగా; ఆ రాజునకున్= ఆ స్నుంజయుడికి; ఉపకారము+ఒకటి= ఒక మేలు; చేయన్+తలంచి= ఒనరించా లనుకొని; ఏము= మేము; ఆయన సన్నిధికిన్= ఆ స్నుంజయుడి వద్దకు; అరిగి= వెళ్ళి; కోరుము వరము= వరంకోరుకొనుము; అంటిమి= అన్నాము; అనినన్= అనగా; అతడు= ఆ స్నుంజయుడు; మీరు; ప్రీతులు+అయిన= సంతసించినవారు అయిన; కంటెను= దానికన్న; ఒండు= వేరు; వరములు= కోరదగినవి; కలవు+ఎ?= ఉన్నాయా?; అనినన్= అనగా; గారవించి= ఆదరించి; అనిమిషులను= దేవతలను; మిగులు= అతిశయించే; తనయునిన్= కుమారుడిని; పడయంగన్= పొందాలని; వలచి= కోరి; ఉండుదు(వు)= ఉన్నావు; అట్టివానిన్= అటువంటి కుమారుడిని; కనుము= పొందుము.

తాత్పర్యం: ఆ విధంగా నేనూ నా మేనల్లుడూ ఆ స్నుంజయుడి వద్ద కొన్ని ఏళ్ళు ఉన్న తరువాత అతడి ఆశ్రయంలో ఉన్న బ్రాహ్మణులు కోరగా, మాకూ వెళ్ళుదామనే కోరిక కలగటంతో స్నుంజయుడికి ఏదైనా మేలు చేయాలనే ఉద్దేశంతో ఆయన వద్దకు వెళ్ళి వరం కోరుకొమ్మన్నాము. అతడు 'మీరు సంతుష్టులవటానికి మించిన వరాలు ఇంకేమున్నాయి?' అన్నాడు. అతడిని గౌరవించి 'దేవతలను మించిన కొడుకును పొందాలని కోరుకొంటున్నావు కనుక అట్టి కొడుకును పొందుతావు.'

వ. అంటి: మట్టియెడ నింద్ర తేజో రక్షణాయత్త చిత్తుండగు నప్పర్వతుం డప్పుడమిటేనితో 'వినుఁ మక్కుమారుండు
దీర్ఘాయురుపేతుండు గాకుండు' ననియె దానికి నమ్మానవపతి యుమ్మలించి యమ్మహాత్ము నాననంబునం
జూడ్కి నిలిపి 'యి ట్లేల యుష్మ దనుగ్రహం బనూనంబు గావలవదే?' యని ప్రార్థించిన నమ్మాట కమ్ముని
మఱుమాట వలుకకున్న నే నన్నరనాథుపైఁ గలుగు కరుణావిశేషంబున. 259

ప్రతిపదార్థం: అంటిమి= అన్నాము; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఇంద్రతేజోరక్షణ= ఇంద్రుడియొక్క తేజమును రక్షించటంలో; ఆయత్త= సిద్ధపడిన; చిత్తుండు= మనసు కలవాడు; అగు= అయిన; ఆ+పర్వతుండు= ఆ పర్వతుడు; ఆ+పుడమి టేనితోన్= ఆ రాజుతో; వినుము= వినుము; ఆ+కుమారుండు= ఆ బాలుడు; దీర్ఘ+ఆయుః+ఉపేతుఁడు= అధికమైన ఆయుస్సుతో కూడుకొన్నవాడు; కాక+ఉండున్= కాకపోతాడు; అనియెన్= అన్నాడు; దానికిన్= ఆ మాటలకు; ఆ+మానవపతి= ఆ రాజు;

ఉమ్మలించి= బాధపడి; ఆ+మహాత్ము= ఆ మహానుభావుడైన పర్వతుడి; ఆననంబునన్= ముఖంపై; చూడ్కి= చూపు; నిలిపి= కేంద్రీకరించి; ఇట్లు+ఏల= ఈ విధంగా ఎందుకు; యుష్మత్+అనుగ్రహంబు= మీ అనుగ్రహం; అనూనంబు= తక్కువ కానిది; కావలదు+ఏ!= అయి ఉండాలి కదా!; అని; ప్రార్థించినన్= వేడగా; ఆ+మాటకున్= ఆ పలుకునకు; ఆ+ముని= ఆ పర్వతుడు; మఱుమాట= మారుమాట; పలుకక= మాట్లాడక; ఉన్నన్= ఉండగా; ఏన్= నేను; ఆ+నరనాథుపైన్= ఆ రాజుమీద; కలుగు= ఉన్న; కరుణా విశేషంబునన్= దయావిశేషంవలన.

తాత్పర్యం: అని అన్నాం. ఆ సమయంలో ఇంద్రుడి మహత్త్వాన్ని రక్షించటంలో నిమగ్నమైన మనసున్న పర్వతుడు ఆ రాజుతో 'వినుము - ఆ బాలుడు దీర్ఘాయువు కలవాడు కాకుండా ఉంటాడు' అన్నాడు. దానికి ఆ రాజు బాధపడి పర్వతుడి ముఖంపై చూపు కేంద్రీకరించి, 'ఇట్లా ఎందుకు అన్నారు? మీ దయలో లోటు ఉండకూడదు కదా!' అని వేడుకొన్నాడు. ఆ మాటలకు పర్వతుడు మారుపలుక లేదు. నేను ఆ రాజుపై ఉన్న ప్రత్యేకమైన దయతో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. వలదు శంకింప నింద్రుని వలనఁ బుట్టు । నెడరు వొందక యుండంగఁ గొడుకు నోపి
నంత గావుము; గావంగనైన చావు । నపుడు నన్నుఁ దలంపు;మే నది మరల్తు. 260

ప్రతిపదార్థం: శంకింపన్= అనుమానించ; వలదు= వద్దు; ఇంద్రునివలనన్= ఇంద్రుడి నుండి; పుట్టు= కలుగబోయే; ఎడరు= ఆపద; పొందక+ఉండంగన్= కలుగకుండా ఉండేటట్లు; కొడుకున్= కుమారుడిని; ఓపిన+అంత= చేతనైనంత; కావుము= కాపాడుము; కావంగన్= కాపాడుతున్నా; ఐన= కలిగిన; చావునపుడు= మరణ సమయంలో; నన్నున్= నన్ను (నారదుడిని); తలంపుము= తలచుకొమ్ము; ఏన్= నేను; అది= ఆ మరణాన్ని; మరల్తున్= తిప్పికొడతాను.

తాత్పర్యం: రాజా! నీవు అనుమానించవద్దు. ఇంద్రుడివలన కలిగే ఆపద నీ కుమారుడిని సమీపించకుండా నీకు చేతనైనంత కాపాడు. ఎంత రక్షించినా, మరణం సంభవిస్తే ఆ సమయంలో నన్ను తలచుకొమ్ము. నే నా చావును వెనక్కి తిప్పుతాను.

వ. అక్కుమారుండు నిజనిష్ఠీవ నాదులు సువర్ణమయంబు లగుటంజేసి సువర్ణష్ఠీవియనం బరఁగుఁ;బ్రమోదంబునం
బొందుము.' 261

ప్రతిపదార్థం: నిజ= తన; నిష్ఠీవన+ఆదులు= ఉమ్మి మొదలైనవి; సువర్ణమయంబులు= బంగారపువి; అగుటన్+చేసి కావటంవలన; ఆ+కుమారుండు= ఆ బాలుడు; సువర్ణష్ఠీవి; అనన్+పరఁగున్= అని ప్రసిద్ధుడవుతాడు; ప్రమోదంబునన్ పొందుము= సంతోషము కలిగి ఉండుము.

తాత్పర్యం: నీకు పుట్టబోయే కుమారుడి ఉమ్మి మొదలైనవి బంగారంతో నిండినవి కావటంవలన సువర్ణష్ఠీవి అనే పేరుతో ప్రసిద్ధుడౌతాడు. నీవు సంతోషంగా ఉండుము.

క. అని యూఱడిల్లఁ బలికిన । విని యాతఁడు సంతసంబు వెల్లిం దేలెం
జని యే మీప్సితవర్తన । మున నుండితి; మవ్విభుండు పుత్రునిఁ గాంచెన్. 262

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; ఊఱడిల్లన్= ఓదార్పు పొందేటట్లుగా; పలికినన్= పలుకగా; విని= ఆకర్ణించి; ఆతఁడు= ఆ స్నుంజయుడు; సంతసంబు= ఆనందపు; వెల్లిన్= ప్రవాహంలో; తేలెన్= తేలియాడాడు; ఏము= మేము; చని= వెడలి; ఈప్సిత+వర్తనమునన్= యథేచ్ఛగా; ఉండితిమి= ఉన్నాం; ఆ+విభుండు= ఆ రాజు; పుత్రునిన్= కుమారుడిని; కాంచెన్= పొందాడు.

తాత్పర్యం: ఆ విధంగా ఓదార్పుమాటలు పలుకగా, ఆ సృంజయుడు ఆనంద ప్రవాహంలో తేలియాడాడు. మేము యథేచ్ఛగా సంచరిస్తూ ఉన్నాం. ఆ రాజు కుమారుడిని పొందాడు.

వ. వాఁడును మలమూత్ర లాలాశ్రు స్వేదంబులు గనక మయంబులయి తొరుఁగం బెరుఁగుచుండె; నా సమయంబున నెడరువేచి వెంగలు లగు మ్రుచ్చు లబ్బాలుం బట్టి నోరం జీర దుఱిమి, యడవికిం గొనిపోయి యొడలు జల్లించి పసిండి గానక పీనుంగు వైచి పోయిరి. సృంజయుండును దనకొడుకు నింద్రుం డపహరించె నను తలంపున శోకార్తినొంది పలవించుచు నన్నుం దలంచినం బోయి నీకుం బుండరీకాక్షుం డిప్పుడు సెప్పిన యాది రాజ విషయంబు లగు శోకోపశమన వచనంబులు సెప్పి, యంకిలి దేర్చి యవిచారపరులగు తస్కరు లా శిశువుం జంపుట యెఱింగించి. 263

ప్రతిపదార్థం: వాఁడును= ఆ బాలుడు కూడా; మల; మూత్ర; లాలా= ఉమ్మి; అశ్రు= కన్నీరు; స్వేదంబులు= చెమట; కనకమయంబులు+అయి= బంగారువి అయి; తొరుఁగన్= స్రవించుచుండగా; పెరుఁగుచున్+ఉండెన్= పెద్దవాడవుతూ ఉన్నాడు; ఆ సమయంబునన్= ఆ సమయంలో; ఎడరు= అవకాశంకొరకు; వేచి= ఎదురుచూచి; వెంగలులు= అవివేకులు; అగు= అయిన; మ్రుచ్చులు= దొంగలు; ఆ+బాలున్= ఆ పసివాడిని; పట్టి= పట్టుకొని; నోరన్= నోటియందు; చీర= వస్త్రం; తుఱిమి= కూరి, చొనిపి; అడవికిన్= అరణ్యానికి; కొనిపోయి= తీసికొనివెళ్ళి; ఒడలు= శరీరం; జల్లించి= శోధించి; పసిండిన్= బంగారాన్ని; కానక= చూడక; పీనుంగు= శవాన్ని; వైచి= పారవైచి; పోయిరి= వెళ్ళిపోయారు; సృంజయుండును= సృంజయుడు కూడా; తనకొడుకున్= తన కుమారుడిని; ఇంద్రుండు; అపహరించెను= దొంగిలించాడు; అను= అనే; తలంపునన్= ఆలోచనతో; శోక+ఆర్తిన్= దుఃఖం వలన బాధను; ఒంది= పొంది; పలవించుచున్= దుఃఖిస్తూ; నన్నున్= నన్ను; తలంచినన్= తలచుకొనగానే; పోయి= వెళ్ళి; నీకున్= నీకు (ధర్మరాజుకు); పుండరీక+అక్షుండు= తెల్లతామరలవంటి కన్నులు కల శ్రీకృష్ణుడు; ఇప్పుడు= ఈ సమయంలో; చెప్పిన= చెప్పినటువంటి; ఆది= పూర్వపు; రాజవిషయంబులు+అగు= రాజులకు చెందినవి అయిన; శోక= దుఃఖాన్ని; ఉపశమన= తగ్గించే; వచనంబులు= మాటలు; చెప్పి= పలికి; అంకిలి= కలత; తేర్చి= తీర్చి; అవిచారపరులు+అగు= అవివేకులు అయిన; తస్కరులు= దొంగలు; ఆ శిశువున్= ఆ పసివాడిని; చంపుట= చంపటం; ఎఱింగించి= తెలియపరచి.

తాత్పర్యం: ఆ సృంజయుడి కుమారుడైన సువర్ణష్ఠీవి తన మలమూత్రాలు, ఉమ్మి, చెమట, కన్నీరు మొదలైనవి బంగారు మయములుగా స్రవిస్తూ ఉండగా, పెరిగి పెద్దవాడవుతూ ఉన్నాడు. ఆ సమయంలో అవకాశంకొరకు ఎదురుచూచి అవివేకులైన దొంగలు ఆ బాలుడిని పట్టుకొని నోట్లో గుడ్డలు కుక్కి, అడవిలోకి తీసికొనిపోయి, ఒడలంతా వెదకి బంగారం కనబడకపోవటంతో ఆ శవాన్ని పారేసి వెళ్ళిపోయారు. సృంజయుడు తన కొడుకును ఇంద్రుడే దొంగిలించాడనే ఆలోచనతో బాధపడి విచారిస్తూ నన్ను తలచుకొన్నాడు. నేను వెళ్ళి, నీ కిప్పుడు శ్రీకృష్ణుడు చెప్పినటువంటి పూర్వ రాజచరిత్రలు - శోకాన్ని తగ్గించేవి, చెప్పి అతడి బాధను తగ్గించి, ఆ బాలుడిని అవివేకులైన దొంగలు సంహరించిన విషయం తెలియ చెప్పాను.

క. మ్రుచ్చుల మూఢత్వమునం । జచ్చి నరకవాసమునకుఁ జనిన తనయు నేఁ
దెచ్చి మగుడంగ వే నీ । కిచ్చెద; వగ పుడుగు మింకనేనియు నధిపా!' 264

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; మ్రుచ్చుల= దొంగల; మూఢత్వమునన్= అజ్ఞానంవలన; చచ్చి= మరణించి; నరకవాసమునకున్= నరకలోకానికి; చనిన= వెళ్ళిన; తనయున్= కుమారుడిని; ఏన్= నేను; తెచ్చి= తీసికొనివచ్చి; మగుడంగన్= తిరిగి; వే= వేగంగా; నీకున్+ఇచ్చెదన్= నీకు ఇస్తాను; ఇంకన్+ఏనియున్= ఇకనైనా; వగపున్= దుఃఖాన్ని; ఉడుగుము= వదలుము.

తాత్పర్యం: రాజా! స్ృంజయా! దొంగల మూర్ఖత్వంవలన చనిపోయిన యమలోకంలో ఉన్న నీ కుమారుడిని నేను వేగంగా తెచ్చి నీకు తిరిగి ఇస్తాను. ఇకనైనా నీ శోకాన్ని వదలిపెట్టుము'.

వ. అని చెప్పి యేనును. 265

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; చెప్పి= పలికి; ఏనును= నేను కూడా.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పి నేను కూడా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. భావమున నమ్మెయికిఁ దగు । దీవన యిచ్చుటయు, నరుగుదెంచె సువర్ణ
ష్ఠీవి గడు నద్భుతమ్ముగ; । నా విభుఁడుఁ బ్రమోద సంభృతాత్ముం డయ్యెన్. 266

ప్రతిపదార్థం: భావమునన్= మనసులో; ఆ+మెయికిన్= దానికి; తగు= తగినటువంటి; దీవన= ఆశీస్సు; ఇచ్చుటయున్= ఇవ్వగానే; సువర్ణష్ఠీవి; కడున్= మిక్కిలి; అద్భుతమ్ముగన్= ఆశ్చర్యం కలిగించేటట్లు; అరుగుదెంచెన్= వచ్చాడు; ఆ విభుఁడున్= ఆ స్ృంజయుడు కూడా; ప్రమోద సంభృత+ఆత్ముండు= సంతోషంతో నిండిన మనస్సు కలవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: మనస్సులో దానికి (సువర్ణష్ఠీవి తిరిగి రావటానికి) తగినటువంటి ఆశీస్సు ఇవ్వగానే, ఎంతో ఆశ్చర్యం కలిగేటట్లు సువర్ణష్ఠీవి తిరిగి వచ్చాడు. స్ృంజయుడి మనస్సు సంతోషంతో నిండిపోయింది.

తే. అతని వీడ్కొని సంప్రీతి నరుగుచుండి । 'యింద్రుచేఁత గా దిది వినుఁ! మిక్కుమారుఁ
జంప నింద్రుఁడు వేచు రక్షణము మఱువ । వలదు నీ'వని చెప్పితి వసుమతీశ! 267

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూమిపతీ!, ధర్మరాజా!; అతని= ఆ స్ృంజయుడిని; వీడ్కొని= సెలవుదీసికొని; సంప్రీతిన్= ఇష్టంతో; అరుగుచున్+ఉండి= వెళ్ళబోతూ; వినుఁ= వినుము; ఇది= ఈ పని; ఇంద్రుచేఁత= ఇంద్రుడి పని; కాదు; ఈ+కుమారున్= ఈ బాలుడిని; చంపన్= చంపటానికి; ఇంద్రుఁడు= దేవేంద్రుడు; వేచున్= ఎదురుచూస్తూ ఉంటాడు; నీవు; రక్షణము= కుమారుడిని కాపాడటం; మఱువ వలదు= మరచిపోవద్దు; అని= అంటూ; చెప్పితిన్= చెప్పాను.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ స్ృంజయుడివద్ద సెలవు తీసికొని బయలుదేరుతూ ఇట్లా చెప్పాను. 'స్ృంజయా! వినుము. ఈ పని చేసింది ఇంద్రుడు కాదు. కాని, ఇంద్రుడు ఈ పసివాడిని చంపటానికి అవకాశంకొరకు ఎదురుచూస్తూ ఉంటాడు. కుమారుడి రక్షణ విషయం మరువవద్దు'.

శార్దూలంబుచేఁ జచ్చిన సువర్ణష్ఠీవి నారదువలనఁ బునర్జీవితుఁ డగుట (సం. 12-31-41)

వ. ఏను బోయిన కొండొక కాలంబునకు నాఖండలుం డక్కుమారుండు దన్ను మిగులునని శంకించి చంపింపం దలంచి నన్నుం బర్వతునిం దలంచి పుయిలోడి బృహస్పతితో విచారించిన, నతం డతని భయం బుడిపె; నతండును దివ్యంబగుట సబుద్ధికంబైన వజ్రంబు నాలోకించి 'నీవు శార్దూల రూపంబున స్ృంజయ సుతుండగు సువర్ణష్ఠీవిం జంపు' మనుటయు నప్పని పూని యది సను సమయంబున. 268

ప్రతిపదార్థం: ఏను= నేను; పోయిన= వెళ్ళిన; కొండొక= కొద్ది; కాలంబునకున్= కాలానికి; ఆఖండలుండు= ఇంద్రుడు; ఆ+కుమారుండు= ఆ బాలుడు; తన్నున్= తనను; మిగులును+అని= మించుతాడు అని; శంకించి= అనుమానించి; చంపింపన్= చంపించాలని; తలంచి= అనుకొని; నన్నున్= నన్ను (నారదుడిని); పర్వతునిన్; తలంచి= గుర్తుచేసికొని; పుయిలోడి= వెనుకాడి;

బృహస్పతితో= దేవగురువుతో; విచారించినన్= ఆలోచన చేయగా; అతండు= ఆ బృహస్పతి; అతని= ఇంద్రుడి; భయంబు= భయాన్ని; ఉడిపెన్= పోగొట్టాడు; అతండును= ఆ ఇంద్రుడు కూడా; దివ్యంబు+అగుటన్= దేవలోకానికి చెందినవి కావటంవలన; సబుద్ధికంబు+ఐన= విచక్షణాజ్ఞానం కలిగిన; వజ్రంబున్= వజ్రాయుధాన్ని; ఆలోకించి= చూచి; నీవు; శార్దూలరూపంబునన్= పెద్దపులి ఆకారంలో; సృంజయ సుతుండు+అగు= సృంజయుడి కుమారుడైన; సువర్ణష్ఠీవిన్= సువర్ణష్ఠీవిని; చంపుము= సంహరించుము; అనుటయున్= అనగా; ఆ+పని= ఆ కార్యాన్ని; పూని= వహించి; అది= ఆ వజ్రాయుధం; చను= వెళ్ళే; సమయంబునన్= సమయంలో.

తాత్పర్యం: ఆవిధంగా చెప్పి నేను వెళ్ళిన కొద్దికాలానికి ఇంద్రుడు ఆ సువర్ణష్ఠీవి తనను మించిపోతాడని అనుమానించి చంపించా లనుకొని, నారదుడినీ, పర్వతుడినీ తలచుకొని వెనుకాడి బృహస్పతితో ఆలోచించాడు. దేవగురువు ఇంద్రుడి భయాన్ని పోగొట్టాడు. అపు డా ఇంద్రుడు దివ్యమైనది కావటంవలన విచక్షణాజ్ఞానం కలిగిన వజ్రాయుధాన్ని చూచి, 'నీవు పెద్దపులి రూపంలో సృంజయుడి పుత్రుడైన సువర్ణష్ఠీవిని చంపుము' అన్నాడు. ఆ కార్యభారం వహించి వజ్రాయుధం వెళ్ళుతున్న సమయంలో.

సీ. సృంజయుం డుజ్జ్వల శ్రీసముల్లాస ప్ర । హర్ష మొప్పంగఁ బ్రియాంగనలును
దానుఁ గుమార యుక్తముగ భాగీరథీ । తీరకాంతార ప్రదేశనిత్య
వసనేచ్ఛమెయి నుండి కుసుమాపచయముఖ । బహువిధ కేలితత్పరత నొంది
యొండుదలంపు లేకుండ నద్దంభోళి । వంచన నయ్యెడఁ బొంచి నిలిచి

తే. తెఱపి గాంచి శార్దూలమై యుఱికి వార । ణేంద్రసమయాను నమ్మానవేంద్ర తనయు
వ్రచ్చి యంతర్హితం బయ్యెఁ జచ్చె వాఁడు; । దాది యాక్రోశమున నార్తనాద మెసఁగ. 269

ప్రతిపదార్థం: సృంజయుండు; ఉజ్జ్వల= ప్రకాశమానమైన; శ్రీ= సంపదల; సమ్+ఉల్లాస= చక్కని సంతోషంతో; ప్రహర్షము= చిక్కని ఆనందం; ఒప్పఁగన్= విలసిల్లగా; ప్రియ+అంగనలును= ప్రేమా స్పదలైన భార్యలు; తానున్= తాను; కుమార యుక్తముగన్= కొడుకుతో కలిసి; భాగీరథీ= గంగానది; తీర= ఒడ్డున ఉన్న; కాంతార ప్రదేశ= అరణ్య సీమలలో; నిత్యవసన+ఇచ్ఛ మెయిన్= సతతమూ ఉండాలనే కోరికతో; ఉండి= నిలిచి; కుసుమ= పూలు; అపచయ= కోయటం; ముఖ= మొదలైన; బహువిధ= అనేక విధాలైన; కేలి+తత్పరతన్= క్రీడలలోమగ్నులై ఉండటాన్ని; ఒంది= పొంది; ఒండు= వేరు; తలంపు= ఆలోచన; లేక+ఉండన్= లేకుండా ఉండగా; ఆ+దంభోళి= ఆ వజ్రాయుధం; వంచనన్= మోసంతో; ఆ+ఎడన్= ఆ సమీపంలో; పొంచి= దాగికొని; నిలిచి= నిలబడి; తెఱపి= వీలు; కాంచి= చూచి; శార్దూలము+ఐ= బెబ్బులిగా మారి; ఉఱికి= దుమికి; వారణ+ఇంద్ర సమానయానున్= గజేంద్రుడి నడకతో సమమైన నడకగలవాడైన; ఆ+మానవ+ఇంద్ర+తనయున్= ఆ రాజు పుత్రుడిని; వ్రచ్చి= చీల్చి (సంహరించి); అంతర్హితంబు+అయ్యెన్= మాయమయింది; వాఁడు= ఆ సువర్ణష్ఠీవి; చచ్చెన్= చనిపోయాడు దాది= ధాత్రి; ఆక్రోశమునన్= ఆవేదనతో; ఆర్తనాదము+ఎసఁగన్= భయంతో పెట్టిన కేక వ్యాపించగా.

తాత్పర్యం: సృంజయుడు మిక్కిలి ప్రకాశించే సంపదల విలాసంతో ఆనందంగా ప్రియురాండ్రతో కలిసి కుమారుడితోకూడా గంగానదీ తీర అరణ్య ప్రదేశాలలో ఉండాలని వెళ్ళి, పుష్పాపచయం వంటి అనేక క్రీడలలో నిమగ్నమై వేరే ఆలోచనలేకుండా ఉన్నాడు. అపు డా వజ్రాయుధం మోసంతో అక్కడే నక్కి ఉండి వీలుచూచుకొని బెబ్బులిగా మారి గజేంద్రగమనుడైన సువర్ణష్ఠీవిపై దుమికి, చీల్చి మాయమయింది. ఆ బాలుడు మరణించాడు. భయంతో దాది పెట్టిన కేక అందరికీ వినిపిస్తుండగా.

క. విని సృంజయుండును బ్రియా । జనములు వే పాఱుదెంచి చచ్చిన బాలుం
గని బహులశోకపూరం । బున మునిఁగిరి విప్రలాపములు పెల్లెసఁగన్. 270

ప్రతిపదార్థం: విని= ఆ దాదిపెట్టిన కేక విని; సృంజయుండును; ప్రియాజనములు= అతడి భార్యలును; వే= వేగంగా; పాఱుదెంచి= పరుగునవచ్చి; చచ్చిన= మరణించిన; బాలున్= పసివాడిని; కని= చూచి; విప్రలాపములు= ఏడుపులు; పెల్లు+ఎసఁగన్= ఎక్కువ కాగా; బహుల= ఎక్కువైన; శోకపూరంబునన్= నిండుశోకంలో; మునిఁగిరి= మునిగిపోయారు.

తాత్పర్యం: (దాది పెట్టిన కేక) విని సృంజయుడు, అతడి భార్యలు వేగంగా పరుగున వచ్చి చనిపోయిన శిశువును చూచి ఏడుపులు ఎక్కువ కాగా, అధికమైన శోకసముద్రంలో మునిగిపోయారు.

ఆ. అట్టి యవసరమున నమ్మహీపతి నన్నుఁ । దలఁచె; నప్పు డేను బలవిరోధి
మది విరోధ ముడిపి మసలక వచ్చి య । బ్బాలు ప్రాణ మెత్తి ప్రమద మెసఁగ. 271

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; అవసరమునన్= సందర్భంలో; ఆ+మహీపతి= ఆ రాజు-; సృంజయుడు; నన్నున్= నన్ను (నారదుడిని); తలఁచెన్= భావన చేశాడు; అప్పుడు= ఆ సమయంలో; ఏను= నేను; బలవిరోధి= ఇంద్రుడి; మది= మనసులో; విరోధము= శత్రుభావాన్ని, వైరాన్ని; ఉడిపి= పోగొట్టి; మసలక= ఆలసించక; వచ్చి; ఆ+బాలు= ఆ సువర్ణష్ఠివి; ప్రాణము= జీవం; ఎత్తి= తీసి (కలిగించి); ప్రమదము= సంతోషం; ఎసఁగన్= ఎక్కువ కాగా.

తాత్పర్యం: ఆ సమయంలో సృంజయచక్రవర్తి నన్ను తలచుకొన్నాడు. నేను ఇంద్రుడి మనస్సులోని వైరాన్ని పోగొట్టి, ఆలస్యం చేయకుండా వచ్చి, ఆ రాజు సంతోషం ఎక్కువ అయ్యే విధంగా ఆ బాలుడికి ప్రాణం పోసి. (తరువాతి పద్యంతో అన్వయం)

వ. ఉచిత సల్లాపంబుల నించుకసేపు నిలిచి, యన్నరపతి యనుమతి సేయ నరిగితి; సువర్ణష్ఠీవియుం
దండ్రికి సంతసం బెసంగు తెఱంగునం బ్రవర్తిల్లి యతని పిమ్మటం బృథ్వీభారంబు పూని శిష్టానుగ్రహ దుష్ట
నిగ్రహంబులు నడపుచు, జన్నంబులు సేయుచు, శతాధిక సహస్రవర్షంబులు రాజ్యంబు సేసె'నని చెప్పి
నారదుండు వెండియు. 272

ప్రతిపదార్థం: ఉచిత= తగిన; సల్లాపంబులన్= మంచిమాటలతో; ఇంచుకసేపు= కొద్ది సమయం; నిలిచి= ఉండి; ఆ+నరపతి= ఆ రాజు; అనుజ్ఞ+చేయన్= అనుమతీయగా; అరిగితిన్= వెళ్ళాను; సువర్ణష్ఠీవియున్= సువర్ణష్ఠివి కూడా; తండ్రికిన్= జనకుడికి; సంతసంబు= సంతోషం; ఎసంగు= ఎక్కువ అయ్యే; తెఱంగునన్= పద్ధతిలో; ప్రవర్తిల్లి= నడచుకొని; అతని పిమ్మటన్= తండ్రి తరువాత; పృథ్వీభారంబు= భూభారాన్ని; పూని= వహించి; శిష్ట= సజ్జనులను; అనుగ్రహ= దయచూడటం; దుష్ట= దుర్జనులను; నిగ్రహంబులు= దండించటం; నడపుచున్= నిర్వర్తిస్తూ; జన్నంబులు= యజ్ఞాలు; చేయుచున్= చేస్తూ; శతాధిక సహస్ర వర్షంబులు = పదకొండువేల సంవత్సరాలు; రాజ్యంబు+చేసెన్= రాజ్యపరిపాలన చేశాడు; అని= అంటూ; చెప్పి= పలికి; నారదుండు; వెండియున్ = తిరిగి.

తాత్పర్యం: సమయానుగుణంగా మాట్లాడుతూ కొద్దిసేపు ఉండి, సృంజయుడు అనుమతించగా నేను వెళ్ళిపోయాను, సువర్ణష్ఠివి తండ్రికి సంతోషం కలిగేటట్లు నడుచుకొంటూ అతడి తరువాత రాజ్యభారాన్ని వహించి శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేస్తూ యజ్ఞాలు చేస్తూ, లక్ష సంవత్సరాలు రాజ్యాన్ని పాలించాడు' అని నారదుడు చెప్పి ఇంకా - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. ' హరియుఁ బరాశరాత్మజుఁడు నాదరణాతిశయంబునన్ సవి
స్తరత నుపన్యసించిన వచఃప్రకరంబు మహార్థ గాఢమి
ప్పరమహితోపదేశములు పాటిగఁ బట్టి వసుంధరాధురా
ధరణ మొనర్పు మయ్యెడు నుదాత్తయశంబును ధర్మవృద్ధియున్.' 273

ప్రతిపదార్థం: హరియున్= శ్రీకృష్ణుడును; పరాశర+ఆత్మజుఁడున్= పరాశరుడి కుమారుడైన వ్యాసుడును; ఆదరణ+అతిశయంబునన్= ప్రేమాధిక్యంతో; సవిస్తరతన్= విపులంగా; ఉపన్యసించిన= పలికిన; వచఃప్రకరంబు= మాటల సముదాయం; మహా= గొప్ప; అర్థ= భావంతో; గాఢము= నిండినది, లోతైనది; ఆ పరమ= ఆ ఉత్తమమైన; హిత= మేలుకలిగించే; ఉపదేశములు= బోధలు; పాటిగన్+పట్టి= ప్రమాణంగా గ్రహించి; వసుంధరా ధురా= భూభారాన్ని; ధరణము= వహించటం; ఒనర్పుము= కావించుము; ఉదాత్త= అధికమైన; యశంబును= కీర్తియు; ధర్మవృద్ధియున్= ధర్మం పెంపొందటమునూ; అయ్యెడున్= జరుగుతాయి.

తాత్పర్యం: 'ధర్మరాజా! శ్రీకృష్ణుడు, వ్యాసుడు నీ మీద ప్రేమాతిశయంతో చెప్పిన మాటలన్నీ గొప్పలోతైన భావాలతో నిండి ఉన్నాయి. ఆ ఉత్తమమైన మేలు కలిగించే బోధనలను మనసున పెట్టుకొని, భూభారాన్ని వహించవలసినది. దానివలన గొప్ప కీర్తి, ధర్మవృద్ధి సిద్ధిస్తాయి'.

వ. అనిన నజాతశత్రుం డూరకున్నఁ బరాశరపుత్రుండు పరమకరుణావిధేయచిత్తుండై యతని నుద్దేశించి యిట్లనియె. 274

ప్రతిపదార్థం: అనినన్= నారదు డీ విధంగా పలుకగా; అజాతశత్రుండు= ధర్మరాజు; ఊరక+ఉన్నన్= మాటాడక మిన్నకుండగా; పరాశర పుత్రుండు= పరాశరుడి కుమారుడైన వ్యాసుడు; పరమ= మిక్కిలి; కరుణా విధేయ చిత్తుండు+ఐ= కరుణకు లోనైన మనస్సు కలవాడై; అతనిన్= ఆ ధర్మరాజును; ఉద్దేశించి= ఉపలక్షించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా నారదుడు చెప్పిన మాటలు విని మిన్నకున్న ధర్మజుడిని ఉద్దేశించి, అధికమైన కరుణ నిండిన మనస్సు కలవాడై వ్యాసుడు ఈ విధంగా అన్నాడు.

సీ. ' క్షత్రియులకుఁ బ్రజాసంరక్షఁ గడచిన । ధర్మంబు గలుగునే? దాని వలన
వేద సంచోదిత విప్రకర్మంబులు । లెస్సలయ్యెడు; నదిలేక యున్నఁ
జెడియెడు; లెస్సైనఁ జెడినను రాజున । కగుఁ బుణ్యపాపంబు లగ్గలములు;
గాన జనాభిరక్షణ మొనరింపుము' । నావుడు నన్నరనాథుఁ 'డిట్లు

తే. మీరు సెప్పంగ నురియాట మేలె రాజ్య । కాంక్ష మిగిలి, యేఁ జంపంగఁ గాని యట్టి
వారిఁ బలువురఁ జంపిన క్రూరతా వి । శేష మాత్మదహించుటఁ జేసి గాక!' 275

ప్రతిపదార్థం: క్షత్రియులకున్= రాజవంశీయులకు; ప్రజాసంరక్షన్= ప్రజలను చక్కగా కాపాడటాన్ని; కడచిన= మించిన; ధర్మము= చేయవలసిన కర్తవ్యం; కలుగును+ఏ?= ఉన్నదా?; దానివలనన్= ఆ ప్రజా సంరక్షణ వలన; వేద= వేదాలచేత; సంచోదిత= చక్కగా నడపబడే; విప్రకర్మంబులు= బ్రాహ్మణులు ఆచరించే కర్మలు అనగా అధ్యయన, అధ్యాపన, యజన యాజనాదులు; లెస్సలు= మంచివి, శ్రేష్ఠమైనవి; అయ్యెడున్= అవుతాయి; అది= ఆ ప్రజాపరిరక్షణ; లేక+ఉన్నన్= లేకపోతే; చెడియెడున్= బ్రాహ్మణ ధర్మాలు పాడవుతాయి; లెస్స+ఐనన్= బాగా ఉన్నా; చెడినను= పాడయినా; రాజునకున్= రాజునకు; అగు= అయ్యే, కలిగే; పుణ్యపాపంబులు=

పుణ్యం, పాపం; అగ్గలములు= అధికం; కాన= అందువలన; జన+అభి రక్షణము= ప్రజలను చక్కగా కాపాడటం; ఒనరింపుము= చేయుము; నావుడున్= అనగా; ఆ+నరనాథుఁడు= ఆ రాజు (ధర్మరాజు); ఇట్లు+ ఈ విధంగా; మీరు= మీరందరూ; చెప్పంగన్= చెప్పగా; రాజ్యకాంక్ష= రాజ్యం సంపాదించాలనే కోరిక; మిగిలి= ఎక్కువై; ఏన్= నేను; చంపఁగన్+కాని= చంపకూడని; అట్టివారిన్= అటువంటి వారిని; పలువురన్= అనేకులను; చంపిన= సంహరించినటువంటి; క్రూరతా= క్రూరత్వపు; విశేషము= ప్రత్యేకత, ఆధిక్యం; ఆత్మ= ఆ మనసును (అంతరాత్మను); దహించుటన్= తపింపచేయటంచేత; కాక= కాకపోతే; ఉరియాట= ఉట్టివలె ఊగిసలాడటం, సందేహించటం; మేలు+ఎ?= మంచిదా?

తాత్పర్యం: 'రాజులకు ప్రజలను రక్షించటాన్ని మించిన ధర్మం మరొక్కటి ఉన్నదా? ఆ ప్రజాసంరక్షణంవలన బ్రాహ్మణులు వేద విహిత కర్మలు మెరుగుగా ఉంటాయి. లేకపోతే పాడవుతాయి. వేదవిహిత కర్మలు బాగుంటే పుణ్యమూ, చెడిపోతే పాపమూ రాజునకు అధికంగా కలుగుతాయి. కనుక ప్రజారక్షణం చేయవలసినది' అని వ్యాసుడీమాటలనగా, ధర్మరాజు ఇట్లా బదులు చెప్పాడు. 'రాజ్యసంపాదన చేయాలనే కోరిక ఎక్కువై చంపకూడని వారిని ఎంతోమందిని చంపాను. అంతులేని ఆ క్రూరత్వం నా అంతరాత్మను తపింపచేస్తున్నది. అంతేకాని మీరంతా ఇంతగా చెప్పాక సందేహించటం మంచిదా?' (కాదని భావం).

విశేషం: తమిళంలో ఉట్టిని 'ఉరి' అంటారు.

వ. అనిన విని యమ్మునిపతి యమ్మహీపతి కిట్లనియె. 276

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+మునిపతి= ఆ మునివర్యుడైన వ్యాసుడు; ఆ+మహీపతికిన్= ఆ రాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు అన్నమాటలు విన్న వ్యాసుడు అతడితో ఈ విధంగా అన్నాడు.

చ. ' మనుజులు సేయ నెవ్వరు సమస్తము నీశ్వరునాజ్ఞఁ జెల్లెడు
న్వినుము కుఠారపాణి ధరణీరుహముల్ నఱకంగఁ బాప మొం
దునొకొ! కుఠారమున్ జనులు దోసముఁ బొందరు కర్త యీశ్వరుం
డనియెడి నిశ్చయంబు దృఢమై మది నిల్చినఁ జాలు భూవరా! 277

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; చేయను= కర్మలు ఆచరించటానికి; మనుజులు= మానవులు; ఎవ్వరు?= ఎవరు?; సమస్తమున్= సకలం; ఈశ్వరు+ఆజ్ఞన్= పరమాత్ముడి ఆనతితో; చెల్లెడున్= నడుస్తుంది; వినుము= ఆలకించుము; కుఠారపాణి= గొడ్డలి ధరించినవాడు; ధరణీరుహముల్= చెట్లను; నఱకంగన్= ఛేదించగా; కుఠారమున్= గొడ్డలికి; పాపము+ఒందున్+ఒకొ!= పాపం వస్తుందా!; కర్త= అన్నింటినీ చేసేవాడు; ఈశ్వరుండు+అనియెడు= పరమాత్మయే అనేటటువంటి; నిశ్చయము= దృఢమైన భావం; మదిన్= మనస్సునందు; నిల్చినన్= ఉన్నట్లయితే; చాలున్= సరిపోతుంది; జనులు= మానవులు; దోసమున్= పాపాన్ని; పొందరు= కలిగి ఉండరు.

తాత్పర్యం: 'ధర్మరాజా! పనులు చెయ్యటానికి మనుష్యు లెవ్వరు? (మానవులు తమంత తాము కర్మలు ఆచరిస్తున్నామనుకొనటం అజ్ఞానం) అంతా భగవంతుడి ఆజ్ఞమేరకు వర్తిస్తూ ఉంటుంది. గొడ్డలిని చేతపట్టినవాడు చెట్టును నరికితే ఆ పాపం గొడ్డలికి వస్తుందా చెప్పుము; అన్నింటినీ చేయించేవాడు పరమాత్ముడే అనే భావం మనసులో గట్టిగా ఉంటే చాలు, మానవులకు ఎటువంటి పాపమూ అంటదు.

విశేషం: బంధుమరణానికి తానే కారకుడని అనుకొంటున్నాడు ధర్మరాజు. అందువలన అతడికి బాధ కలుగుతున్నది. ఆ పనికి తాను సాధనం మాత్రమే అని గుర్తిస్తే ఆ బాధ ఉండదు. ఈ బోధను అర్జునుడికి సంగ్రామ క్షేత్రంలోనే అందించాడు శ్రీకృష్ణుడు.

వ. కర్మఫలం బీశ్వరుని యదియ; తదర్పణ బుద్ధి సహితంబుగాఁ బ్రబుద్ధులు వేదచోదిత కర్మంబు లనుష్ఠింతురు. 278

ప్రతిపదార్థం: కర్మఫలంబు= చేసిన పనుల ఫలితం; ఈశ్వరుని+అది+అ= భగవంతుడిదే; తద్= అతడికి; అర్పణ= సమర్పిస్తున్నామనే; బుద్ధి సహితంబుగాన్= వివేకంతో కూడుకొని; ప్రబుద్ధులు= జ్ఞానులైనవారు; వేద చోదిత= వేదం నిర్దేశించిన (వేద విహిత); కర్మంబులు= కార్యాలు; అనుష్ఠింతురు= ఆచరిస్తారు.

తాత్పర్యం: కర్తృత్వంతోపాటు కర్మఫలం కూడా పరమాత్మకే చెందుతుంది. విశేషమైన ఆత్మజ్ఞానం కలిగినవారు వేదవిహిత కర్మలనన్నింటిని భగవదర్పితంగానే చేస్తారు.

తే. ఒప్పకున్నను నాత్మకులోక్తకర్మ । మూర్ధ్వగతిఁ జేర్చుఁ; బరకర్మ మొప్పెనేని
నార్యజనములు గిల్బిషమంద్రు దానిఁ; । గాన నడపుము నిజవంశకర్మ మధిప! 279

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; ఆర్యజనులు= పెద్దలు; ఒప్పక+ఉన్ననున్= అంగీకారం కాకపోయినా, ఇష్టం లేకపోయినా; ఆత్మ= తన; కుల= వంశానికి; ఉక్త= చెప్పబడిన, నిర్దేశించబడిన; కర్మము= పని; ఊర్ధ్వగతిన్= పైలోకాలకు; చేర్చున్= చేర్చుతుంది; పరకర్మము= తనదికాని పని; ఒప్పెన్+ఏనిన్= మంచిదైనా; దానిన్= ఆ పనిని; కిల్బిషము= పాపం; అండ్రు= అంటారు; కాన= కనుక; నిజవంశ కర్మము= నీ కుల ధర్మాన్ని; నడపుము= నిర్వర్తించుము.

తాత్పర్యం: ధర్మరాజా! ఇష్టంలేకపోయినా తన కులానికి చెప్పబడిన కర్మ చేయటం ఉత్తమగతిని (మోక్షాన్ని) కలిగిస్తుందనీ, తనది కాని పని అంగీకరిస్తే పాపకారకమని అంటారు పెద్దలు. అందువలన నీ కులధర్మాన్ని నిర్వర్తించుము.

క. అరివధము పాప మని మది । మెరమెర గలిగినను, దగిన మెయిఁ జేయుము భూ
వర! ప్రాయశ్చిత్తము గృహ । ధుర యుడుగుట మేలె కీడుతోఁ జన నగునే!' 280

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; అరి= శత్రువులను; వధము= చంపటం; పాపము+అని= కిల్బిషమని; మదిన్= మనసులో; మెరమెర= మనోవ్యథ; కలిగినను= కలిగినప్పటికీ; తగినమెయిన్= దానికి తగిన విధంగా; ప్రాయశ్చిత్తము= పరిహారం; చేయుము; గృహధుర= సంసారభారం; ఉడుగుట= వదలటం; మేలు+ఎ?= మంచిదా? (కాదని భావం); కీడుతోన్+అశుభమైన దానితో; చనన్= ప్రవర్తించటం; అగును+ఏ?= తగునా? (తగదని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! శత్రువులను చంపటం పాపం అనే బాధ నీ మనసులో ఉంటే దానికి తగిన పరిహారం చేసికొనుము. అంతేకాని సంసార భారాన్ని వదలటం మంచిదికాదు. అశుభవర్తనం కూడదు'.

వ. అనుటయుఁ గౌంతేయాగ్రజుండు సాత్యవతేయు నానతం బాలోకించి పుత్రులుం బౌత్రులు నన్నలుం దమ్ములు జనకులుం దాతలు మామలు గురువులు సంబంధులు సఖులు నల్లురు బావలు మఱందులు మఱియుఁ బవిత్రులగు ధాత్రీపతులు నాచేత మడిసిరి; తదీయ స్త్రీజనంబులు పతిసుత సోదర పితృ మరణశోక సంతాపాతిశయంబునం బలవించి పలవించి ప్రాణంబులు విడుతురు గావున దాని సూక్ష్మంబుగా

విచారించిన వనితావధ పాతకంబునుం బాటిల్లె నెయ్యది కడగా నిష్కల్మషుండ నగుదు? నను వెగడున మునింగిన మనంబు మహీభరణంబున కెట్లు సాచ్చు? నుగ్రంబైన తపంబునం దనువు దొఱంగుట దక్క నొండు విధంబు నాకుం జూడ లేకున్న యది' యనిన విని యమ్మునీశ్వరుండు నిజబుద్ధి నిపుణంబుగా నిరూపించి యన్నరపతి కిట్లనియె. 281

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మరాజా!; సాత్యవతేయున్= సత్యవతీ పుత్రుడైన వ్యాసుడి; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి; పుత్రులున్= కుమారులు; పౌత్రులున్= మనుమలు; అన్నలున్+తమ్ములు= సోదరులు; జనకులున్= తండ్రులు; తాతలు= పితామహులు, మాతామహులు; మామలు= మామలు; గురువులు= విద్యాబోధ చేసిన గురువులు; సంబంధులు= చుట్టాలు; సఖులున్= స్నేహితులు; అల్లురు= జామాతలు, మేనల్లురు; బావలు+మఱందులు= బావ మరదులు; మఱియున్= ఇంకా; పవిత్రులు+అగు= నిర్మలులైన; ధాత్రీపతులు= రాజులు; నా చేతన్= నావలన, నా కారణంగా; మడిసిరి= మరణించారు; తదీయ= వారి; స్త్రీజనంబులు= ఆడువారు; పతి= భర్త; సుత= కొడుకు; సోదర= అన్నదమ్ములు; పితృ= తండ్రి; మరణ= చనిపోవటం అనే; శోక= విషాదం వలన కలిగిన; సంతాప= అధికమైన బాధయొక్క; అతిశయంబునన్= ఆధిక్యం వలన; పలవించి పలవించి= ఏడ్చి ఏడ్చి; ప్రాణంబులు విడుతురు= ప్రాణాలు వదలుతారు, మరణిస్తారు; కావున= కనుక; దానిన్= ఈ విషయాన్నంతా; సూక్ష్మంబుగాన్= నిశితంగా; విచారించినన్= ఆలోచిస్తే; వనితావధ= స్త్రీలను చంపటం అనే; పాతకంబును= మహాపాపం కూడా; పాటిల్లెన్= వచ్చింది; ఎయ్యది= ఏది; కడగాన్= దిక్కుకాగా (ఆశ్రమించగా); నిష్కల్మషుండన్= పాపరహితుడిని; అగుదున్= అవుతాను; అను= అనే; వెగడునన్= తల్లడపాటున; మునింగిన= మునిగిపోయిన; మనంబు= మనస్సు; మహీభరణంబునకున్= భూభారాన్ని వహించటానికి; ఎట్లు= ఏ విధంగా; చొచ్చున్?= పూనుకొంటుంది?; ఉగ్రంబు+ఐన= భయంకరమైన; తపంబునన్= తపస్సుతో; తనువున్+తొఱంగుట= శరీరాన్ని వదలటం; తక్క= తప్ప, కాక; ఒండు విధంబు= మరొక పద్ధతి; నాకున్= నాకు; చూడన్= పరికించగా; లేక+ఉన్న+అది= లేదు, కనబడదు; అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+ముని+ఈశ్వరుండు= ఆ మునిశ్రేష్ఠుడైన వ్యాసుడు; నిజ= తన; బుద్ధి= తెలివి; నిపుణంబు+కాన్= నేర్పరి తనంతో; నిరూపించి= చూపించి, నిర్ధారించి; ఆ+నరపతికిన్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా పలికిన వ్యాసుడి ముఖంలోకి చూస్తూ ధర్మరాజు ఇట్లా అన్నాడు: ' కొడుకులు, మనుమలు, అన్నలు, తమ్ములు, తండ్రులు, తాతలు, మామలు, గురువులు, చుట్టాలు, మిత్రులు, అల్లురు, బావలు, మరదులు, నిర్మలులైన రాజులు నా కారణంగా చనిపోయారు. వారి ఆడవారు, భర్తలు, పిల్లలు, సోదరులు, తండ్రులు మరణించటం అనే విషాదం వలన కలిగిన అధికమైన దుఃఖంతో ఏడిచి, ఏడిచి ప్రాణాలు వదలుతారు. కనుక నిశితంగా పరిశీలిస్తే స్త్రీవధ అనే మహాపాపం కూడా నాకు చెందుతుంది. దేనిని ఆశ్రయిస్తే పాపరహితుడ నవుతాను?- అనే బాధలో మునిగిపోయిన మనసు భూభారాన్ని మోయటానికి ఎట్లా పూనుకొంటుంది? తీవ్రమైన తపస్సు చేసి శరీరం వదలటం తప్ప మరో మార్గం నాకు కనబడటంలేదు'. ఆ మాటలు విని వ్యాసుడు తన బుద్ధికౌశలంతో పరికించి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

సీ. ' విడువు ముమ్మలికంబు వినుము నీ చెప్పిన । యందఱు భూముల కాసపడియుఁ
బెంపును దేజంబుఁ బేరును గోరియు । నీసున సమరంబు సేసి చచ్చి
రాపని కిల్బిషం బగునె నీ కట్లును । గాక వారల నెట్టి కర్మగతులు
మృతులఁ గావించెనో మతి నెఱుంగుదె వాని । నెఱుఁగుఁ గాలుఁడు చావనేరి కెద్ది

తే. తఱి యతం డప్పు డెగటార్చు దాని నీవు । సేసినాఁడవుగా మదిఁ జింత సానిపి
యుడుకు టొక వెట్టి దీనిపై నొల్లగృహము । విడుతుఁ గా కనుటిది పెద్ద వెట్టి యధిప! 282

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఉమ్మలికంబు= బాధపడటం; విడువుము= వదలిపెట్టుము; నీ చెప్పిన= నీవు పేర్కొన్న; అందఱు= అంతమంది; భూములకున్= రాజ్యాలకు; ఆసపడియున్= ఆశించి; పెంపును= వృద్ధిని; తేజంబున్= పరాక్రమాన్ని; పేరును= కీర్తిని; కోరియున్= కోరుకొని; ఈసునన్= అసూయతో; సమరంబు= యుద్ధం; చేసి= ఒనరించి; చచ్చిరి= చనిపోయారు; ఆ పని= ఆ కార్యం (అట్లు వారు చచ్చుట); నీకున్= నీకు (ధర్మరాజుకు); కిల్బిషంబు= పాపం; అగును+ఎ?= అవుతుందా?; అట్లును+కాక= అంతే కాక; వారలన్= ఆ రాజులను; ఎట్టి= ఎటువంటి; కర్మగతులు= పనితీరులు; మృతులన్= చనిపోయిన వారినిగా; కావించెను+ఓ?= చేశామో? మతిన్= బుద్ధిలో; ఎఱుంగుదు(వు)+ఎ?= తెలిసికొన్నావా?; కాలుఁడు= యముడు; వానిన్= ఆ కర్మగతులను; ఎఱుంగున్= తెలియును; చావన్= చావటానికి; ఏరికిన్= ఎవరికి; ఎద్ది= ఏది; తఱి= సమయమో; అతండు= ఆ యముడు; అప్డు= ఆ సమయంలో; తెగటార్చున్= సంహరిస్తాడు; దానిని= ఆచరించటం; నీవు; చేసినవాఁడవు+కాక= చేశావని; మదిన్= మనస్సులో; చింత= బాధ; చొనిపి= ప్రవేశపెట్టి; ఉడుకుట= తపించటం; ఒక వెట్టి= పిచ్చితనం; దీనిచేన్= ఆ పిచ్చి కారణంగా; గృహము= ఇల్లు; ఒల్లన్= అంగీకరించను; విడుతున్+కాక= వదలుతాను; అనుట= అనటం; ఇది= అనేది; పెద్దవెట్టి= ఇంకా పెద్ద పిచ్చితనం.

తాత్పర్యం: 'ధర్మరాజా! బాధపడటం వదలిపెట్టుము. నీవు చెప్పిన వారంతా రాజ్యంకొరకు ఆశపడి, గొప్పతనాన్ని, పరాక్రమాన్ని, కీర్తిని కోరుకొని, అసూయతో యుద్ధంచేసి చనిపోయారు. వారు చేసినపనికి పాపం నీ కెట్లా వస్తుంది? అంతే కాదు. వారి కర్మగతులే వారిని చంపాయి. వారి కర్మలు నీకు తెలియవు. యముడికి తెలుసు. యముడు ఎవరికి చనిపోయే సమయం ఎప్పుడో, అప్పుడు వారిని చంపుతాడు. ఆ సంహారం నీవు చేశావని నీ మనసులో బాధపడటం పిచ్చితనం. ఆ కారణంగా ఇల్లు వద్దని వదలిపెడతా ననటం ఇంకా పెద్ద పిచ్చితనం.

క. నేర్పరి పెక్కువిధంబుల । నార్పఁగ బొమ్మలు గడంగి యాడెడు చందం
బేర్పడఁ గాన్పము కాల స । మర్పిత కార్యకరు లైన మానవుల దెసన్. 283

ప్రతిపదార్థం: నేర్పరి= నిపుణుడైనవాడు; పెక్కు విధంబులన్= బహుభంగుల; ఆర్పఁగన్= ఆడించగా; బొమ్మలు= ప్రతిమలు; కడంగి= పూని; ఆడెడు= కదిలే; చందంబు= తీరు; ఏర్పడన్= స్పష్టమయ్యే విధంగా; కాలసమర్పిత= కాలంచేత చక్కగా అప్పగించబడిన; కార్యకరులు+ఐన= పనులు నిర్వర్తించే వారైన; మానవుల దెసన్= మానవులవైపు; కాన్పము= చూడుము.

తాత్పర్యం: నిపుణుడైనవాడు అనేక విధాలుగా ఆడిస్తుంటే కదిలే బొమ్మలను చూచినట్లే, కాలం చెప్పిన పని చేసే మనుషులను కూడా చూడుము.

విశేషం: అలం: ఉపమ.

వ. నీకుం బాపంబునకుం బనిలేదు పనిగా కుండుంగాక! 284

ప్రతిపదార్థం: నీకున్= నీకు; పాపంబునకున్= పాపానికి; పనిలేదు= అవసరం లేదు; పని= అవసరం; కాక+ఉండున్+కాక= అవకుండును గాక.

తాత్పర్యం: ధర్మరాజా! అందువలన నీకు పాపం లేదు. ఇక రాకుండా ఉండుగాక!

క. ఇచ్చు కృప కల్మి యొప్పదె? । చచ్చిన నరపతుల యేలు జనపదములు నీ
విచ్చెదవు గాక మనమునఁ । బొచ్చెము లేక తగ వారిపుత్రుల కథిపా! 285

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; చచ్చిన= మరణించిన; నరపతుల= రాజుల; ఏలు= పాలించే; జనపదములు= గ్రామాలు; మనమునన్= మనస్సులో; పొచ్చెము= కపటం; లేక= ఉండక; తగన్= తగినట్లు; వారి= ఆ రాజుల; పుత్రులకున్= కుమారులకు; నీవు= నీవు; ఇచ్చెదవు+కాక= ప్రసాదించెదవు కాక; ఇచ్చు= ఇచ్చే; కృప= దయ అనే; కల్మి= సంపద; ఒప్పదు+ఎ?= తగిఉంటుంది కదా!

తాత్పర్యం: ధర్మరాజా! మరణించిన రాజుల ఏలుబడిలోని గ్రామాలను మనసులో ఎటువంటి కపటం లేనివాడవై వారి కొడుకులకు ఇద్దువు గాని. ఇవ్వటం అనేది దయ అనే సంపదవలన కలుగుతుంది కదా!

ఆ. కొడుకు లేనిచోటఁ గూఁతుఁ బ్రతిష్ఠింపు; । దానఁ జేసి వారి తల్లు లధిక
హర్ష మొందుదురు; ప్రియంబును నీ కగుఁ; । బుణ్యమును యశంబుఁ బొందు నిన్ను. 286

ప్రతిపదార్థం: కొడుకు= కుమారుడు; లేనిచోటన్= ఉండని తావున; కూఁతున్= కుమార్తెను; ప్రతిష్ఠింపుము= నిలుపుము; దానను+చేసి= అది కారణంగా; వారి తల్లులు= ఆ కుమార్తెల తల్లులు; అధిక= ఎక్కువ; హర్షము= సంతోషం; ఒందుదురు= పొందుతారు; నీకున్; ప్రియంబును= సంతోషం; అగున్= కలుగుతుంది; నిన్ను; పుణ్యము= సుకృతం; యశంబున్= కీర్తి; పొందున్= కలుగుతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! కుమారుడు లేని రాజ్యంలో కుమార్తెను సింహాసనంపై నిలుపుము. దానివలన వారి తల్లులు ఎంతో సంతసిస్తారు. నీకు కూడా సంతోషం, సుకృతం, కీర్తి కలుగుతాయి.

మ. అనుమానింపకు తోడఁబుట్టువులు గారా తున్మితూఁటాడె నెం
దును గ్రొన్నెత్తురు లేఱులై పఱవ నింద్రుం డుగ్రతన్ దైత్యులన్?
మును లవ్వీరు భజింపరే? క్రతువు లామోదంబుతో నమ్మహా
త్మునిఁ జేయింపరె? యూర్ధ్వలోక మదిగాదో? యేలఁడో నాకమున్? 287

ప్రతిపదార్థం: అనుమానింపకు= శంకించవలదు; ఇంద్రుండు= దేవేంద్రుడు; ఉగ్రతన్= భీకరంగా; ఎందును= ఎచట చూచినా; క్రొత్త+నెత్తురులు= అపుడే స్రవించిన నెత్తురులు; ఏఱులు+ఐ= ప్రవాహాలుగా; పఱవన్= ప్రవహించగా; దైత్యులన్= రాక్షసులను; తున్మితూఁటాడెన్= ముక్కలు చేసి సంహరించాడు; తోడన్+పుట్టువులు= (వారు) సహజన్ములు; కారా?= కాకపోయారా? (సహజన్ములే కదా అని భావం); మునులు= ఋషులు; ఆ+వీరున్= ఆ పరాక్రమశాలిని; భజింపరు+ఏ?= సేవించటం లేదా?; ఆమోదంబుతోన్= అంగీకారంతో, ఇష్టంతో; ఆ+మహా+ఆత్మునిన్= ఆ మహానుభావుడిని ఉద్దేశించి; క్రతువులు= యజ్ఞాలు; చేయింపరు+ఏ?= జరిపించటం లేదా?; నాకమున్= స్వర్గాన్ని; ఏలఁడు+ఓ?= పాలించటం లేదా?; అది= అతడు పాలించే స్వర్గం; ఊర్ధ్వలోకము= ఉన్నతమైన లోకం; కాదు+ఓ?= కాకపోయిందా?

తాత్పర్యం: ధర్మరాజా! నీవు శంకించ పనిలేదు. దేవేంద్రుడు రాక్షసులను నెత్తురుటేరులు ప్రవహించేటట్లుగా భయంకరంగా నరికి సంహరించాడు. ఆ రాక్షసులు ఇంద్రుడికి సోదరులే కదా! మునులు ఆ శూరుడిని పూజిస్తూనే ఉన్నారు కదా! ఆ ఘనుడిని ఉద్దేశించి యాగాలు చేస్తున్నారు కదా! అతడు స్వర్గాన్ని పరిపాలించటం లేదా? ఆ స్వర్గం పై లోకమే కదా!

విశేషం: సోదరులను చంపిన ఇంద్రుడు పూజించబడుతూ, అతడికై యజ్ఞాలు చెయ్యబడుతూ, భూలోకాని కన్న ఉన్నతలోకాన్ని పాలిస్తున్నాడు అనే పోలిక బంధువధ పాపం అనే భావం పోగొట్టటానికి చెప్పటం జరిగింది.

శా. నీవున్ ధర్మవిరోధులైన జనతా నింద్యాత్ములం బుణ్యమా
ర్గావష్టంభము దేజరిల్ల నృపవంశాచార మొప్పారఁ దో
డై వీరానుజు లుల్లసిల్లఁగ మహోగ్రాజిం దెగం జూచి తా
దేవాధీశుఁడ పోలె శిష్టపరిషత్సేవ్యుండ వై తా పనిన్. 288

ప్రతిపదార్థం: నీవున్= నీవు కూడా; ధర్మవిరోధులు+ఐన= ధర్మమార్గానికి వ్యతిరేకులైన; జనతా= ప్రజలచేత; నింద్య+ఆత్ములన్= నిందింపదగిన స్వభావం కలవారిని; పుణ్యమార్గ+అవష్టంభము= ధర్మమార్గం యొక్క ఊత; తేజరిల్లన్= ప్రకాశించగా, ఒప్పగా; నృపవంశ+ఆచారము= రాజవంశమువారికి అలవాటైన ప్రవర్తన; ఒప్పారన్= తగి ఉండగా; తోడు+ఐ= అందగించగా; వీర+అనుజులు= పరాక్రమవంతులైన తమ్ములు; ఉల్లసిల్లఁగన్= సంతోషించగా; మహా+ఉగ్ర+ఆజిన్= గొప్ప, భయంకరమైన రణంలో; తెగన్+చూచితి= చనిపోయేటట్లు చేశావు; ఆ దేవ+అధీశుఁడు+అ= ఆ దేవేంద్రుడి; పోలెన్= వలె; ఆపనిన్= శత్రుసంహార కార్యం వలన; శిష్ట= సజ్జనుల; పరిషత్= సముదాయంచేత; సంసేవ్యుండవు+ఐతి(వి)= బాగా సేవించదగినవాడ వయ్యావు.

తాత్పర్యం: ధర్మరాజా! నీవు కూడా అధర్మవర్తనులను, ప్రజలచేత నిందించదగిన గుణం కలవారినీ వీరులైన తమ్ముల సహకారంతో భయంకరమైన యుద్ధంలో ధర్మమార్గాన్ని ఊతగా గ్రహించి రాజధర్మానికి తగినట్లు సంహరించావు. ఈ పనివలననే దేవేంద్రుడివలె నీవు కూడా సజ్జనుల సముదాయంచేత సేవించ తగిన వాడివయ్యావు.

ఆ. వలయునేని యధిప! వాసవుచాడ్పునఁ । గ్రతుపరుండ వగుము; రాజధర్మ
కలితమైన పుడమిఁ గైకొమ్ము; తొలిదొలి । యశ్వమేధయాగ మాచరింపు.' 289

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వలయున్+ఏని= కావాలంటే; వాసవు= ఇంద్రుడి; చాడ్పునన్= వలె; క్రతుపరుండవు= యజ్ఞాలు చేయటంలో నిమగ్నుడవు; అగుము= కమ్ము; రాజధర్మ కలితము+ఐన= రాజధర్మంతో కూడుకొన్న; పుడమిన్= భూమిని; కైకొమ్ము= గ్రహించుము; తొలితొలి= ముమ్ముందు; అశ్వమేధయాగము; ఆచరింపు(ము)= చేయుము.

తాత్పర్యం: ధర్మరాజా! నీ కిష్టమయితే ఇంద్రుడివలె యజ్ఞాలు చేయటంలో ఆసక్తిని చూపించుము. క్షత్రియోచిత ధర్మంగా రాజ్యాన్ని స్వీకరించుము. ముందుగా అశ్వమేధయాగం చేయుము'.

వ. అనిన విని యంకిలి దేఱిన డెందంబుతో ధర్మనందనుం డెట్టి కర్మంబులు పాపంబు; లేపాపంబున కెద్ది
ప్రాయశ్చిత్తంబు? మునీంద్రా! యెఱింగింపవే' యనుటయు, నతనికి నమ్మహాత్ముం డి ట్లనియె. 290

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; అంకిలి= కలత; తేరిన= తీరిన; డెందంబుతోన్= హృదయంతో; ధర్మనందనుండు= ధర్మరాజు; ముని+ఇంద్రా!= మునులలో ఉత్తముడవైన వ్యాసమహర్షీ!; ఎట్టి కర్మంబులు= ఎటువంటి పనులు; పాపంబులు= చెడ్డవి; ఏపాపంబునకున్= ఏ చెడ్డపనికి; ఎద్ది= ఏది; ప్రాయశ్చిత్తంబు= పాపపరిహార ప్రక్రియ; ఎఱింగింపుము+ఏ!= తెలియపరచుమా!; అనుటయున్= అనగా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఆ+మహా+ఆత్ముండు= ఆ మహానుభావుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వ్యాసుడు చెప్పిన మాటలతో కలత తీరిన హృదయంతో ధర్మరాజు వ్యాసుడి నీ విధంగా అడిగాడు. 'మునీంద్రా! ఏ పనులు పాపం? ఏ పాపానికి పరిహారం ఏమిటి? తెలియపరచవలసింది'? అని. దానికి వ్యాసుడీ విధంగా జవాబు చెప్పాడు.

కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు ధర్మాధర్మంబు లెఱింగించుట (సం. 12-35-1)

ఆ. ' ఆగమోక్త కర్మ మాచరింపమియు, ని । షిద్ధమైన దానిఁ జేయుటయును,
బ్రాజ్ఞజనులు ధరణిపాలవరేణ్య! చె । ప్పుదురు పాపములుగ బోధ్యతతికి. 291

ప్రతిపదార్థం: ధరణిపాలవరేణ్య!= రాజులలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; ఆగమ= వేదాలు; ఉక్త= చెప్పిన; కర్మము= పని; ఆచరింపమియున్= చేయకపోవటమూ; నిషిద్ధము+ఐన దానిన్= చేయవద్దని చెప్పినదానిని; చేయుటయునున్= చేయటమూ; పాపములుగన్= పాపాలుగా; ప్రాజ్ఞ జనులు= బాగా తెలిసినవారు; బోధ్యతతికిన్= శిష్యగణాలకు; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: 'ధర్మరాజా! వేదవిహితమైన కర్మలు చేయకపోవటం, కూడనివి చేయటం పాపాలు అని తెలిసినవారు శిష్యగణాలకు చెప్పుతారు.

వ. ఇది కల్మష సామాన్య నిర్దేశంబు; విశేషంబు వినుము. 292

ప్రతిపదార్థం: ఇది= ఈ మాట; కల్మష= పాపముల గూర్చి; సామాన్య= సాధారణమైన; నిర్దేశము= చెప్పటం (చెప్పినమాట); విశేషంబు= మఱింత (పాపంలోని తేడాలు); వినుము= ఆకర్ణించుము.

తాత్పర్యం: ఈ మాట పాపం గురించి మామూలుగా చెప్పేది. అందులోని తేడాలు కూడా వినుము.

సీ. ఆదిత్యు నుదయాస్తమయ కాలముల నిద్ర । బొందుటయును, బాత్రభూతుఁ డింటి
కరుగుదెంచినఁ బూజ యాచరింపమియును, । బరదారగమనంబు, గురుల కెదురు
సేఁతయు, గ్రామంబు సెఱుచుటయును, వేద । విక్రయంబును, రసవిక్రయంబు,
భృత్యుఁ బ్రోవమియు, నసత్యోపచారంబు, । గహనదాహము, నన్యకర్మకృతియుఁ,
తే. దనదుకర్మంబు విడుచుటయును, వృథాప । శు ప్రహరణంబు, మేదినీసురుల కలిమిఁ
గొనుటయును, శరణార్థిఁ జేకొనమి, విప్ర । వధయుఁ బాపంబు లందురు బుధజనములు. 293

ప్రతిపదార్థం: ఆదిత్యున్= సూర్యుడి; ఉదయ+అస్తమయ కాలములన్= ఉదయించే, అస్తమించే సమయాలలో; నిద్రన్+పొందుటయును= నిద్రించటమూ; పాత్ర భూతుఁడు= యోగ్యుడు; ఇంటికిన్= గృహానికి; అరుగుదెంచినన్= రాగా; పూజ+ఆచరింపమియును= పూజించకపోవటమూ; పరదారగమనంబు= ఇతరుల భార్యల పొందూ; గురులకున్= పెద్దలకు; ఎదురు+చేఁతయున్= వ్యతిరేకంగా ఆచరించటం; గ్రామంబు= జనపదం; చెఱుచుట= పాడుపెట్టటం; వేద విక్రయంబును= వేదమును (చదువును) అమ్ముకొనటం; రసవిక్రయంబున్= ఉప్పు,బెల్లం (మొదలగువాటిని) అమ్మటం; భృత్యున్= సేవకుడిని; ప్రోవమియున్= రక్షించకుండా ఉండటం; అసత్య+ఉపచారంబు= కపటమైన సేవ లేదా అబద్ధమును సేవించటం; గహనదాహమున్= అడవులను తగులబెట్టటం; అన్య కర్మ కృతియున్= ఇతరుల పనిని చేయటం; తనదుకర్మంబు= తనదైనపనిని; విడుచుటయును= వదలిపెట్టటం; వృథా= అనవసరంగా; పశుప్రహరణంబు= జంతువులను కొట్టటం; మేదినీ సురుల= బ్రాహ్మణుల; కలిమిన్= సంపదను; కొనుటయును= తీసికొనటం; శరణ+అర్థిన్= శరణు కోరినవాడిని; చేకొనమి= రక్షించకపోవటం; విప్రవధయున్= బ్రాహ్మణుడిని చంపటం; (అనేవి) బుధజనులు= పండితులు; పాపంబులు= దుష్కృతాలు; అందురు= అంటారు.

తాత్పర్యం: సూర్యోదయ సూర్యాస్తమయ సమయాలలో నిద్రపోవటం, అర్హుడైనవాడు ఇంటికి వచ్చినప్పుడు సేవించకపోవటం, పరుల భార్యలను పొందటం, పెద్దలు చెప్పినదానికి వ్యతిరేకంగా ఆచరించటం, ఊరును నాశనంచేయటం, వేదాలను (చదువును) అమ్ముకొనటం, ఉప్పు,బెల్లం మొదలగువాటిని అమ్ముకొనటం, సేవకులను కాపాడకపోవటం,

కపటపు సేవ, అడవులను తగులపెట్టటం, తనదికానిపని చెయ్యటం, తనపని చేయకపోవటం, అనవసరంగా జంతువులను కొట్టటం (హింసించటం), బ్రాహ్మణుల సంపదలను తీసికొనటం, శరణుకోరిన వారిని ఆదరించకపోవటం పాపకార్యాలని పండితులు చెప్పుతారు.

వ. పాపంబులుంబోలె నుండియు దూష్యంబులు గాని వానిం జెప్పెద నాకర్ణింపుము. 294

ప్రతిపదార్థం: పాపంబులున్= పాపకార్యాలు; పోలెన్= వలె; ఉండియున్= ఉండికూడా; దూష్యంబులు= నిందించ దగినవి; కాని వానిన్= కాని విషయాలను; చెప్పెదన్= చెపుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: పాపకార్యాలవలె కనపడుతున్నా నిందించ తగినవి కానివాటిని చెప్పుతాను వినుము.

క. దురమునఁ గైదువుఁ గొని తనుఁ । బొరిగొన నేతెంచునట్టి పురుషుని వేదాం
త రహస్యవేది నయినను । బొరిగొనినను గిల్బిషంబు వొందదు వత్సా! 295

ప్రతిపదార్థం: వత్సా!= నాయనా!; దురమునన్= యుద్ధంలో; కైదువున్= ఆయుధాన్ని; కొని= పట్టి; తనున్= తనను; పొరిగొనన్= చంపటానికి; ఏతెంచు+అట్టి= వచ్చేటటువంటి; పురుషునిన్= మానవుడిని; వేదాంత= ఉపనిషత్తులలోని; రహస్య= అంతరార్థాన్ని; వేదిన్= ఎరిగినవాడిని; అయినను= అయినాసరే; పొరిగొనిననున్= చంపినా; కిల్బిషంబు= పాపం; పొందదు= రాదు.

తాత్పర్యం: నాయనా! ధర్మరాజా! యుద్ధంలో చేత ఆయుధం పట్టి తనను సంహరించటానికి వస్తున్నవాడు ఉపనిషత్తుల పరమార్థం తెలిసిన పండితుడయినా సరే, చంపితే పాపం రాదు.

క. ధరణీసురవిత్తము నప । హరింపఁగాఁ గని వధించు నతఁడు దురితముం
బొరయఁ డొక యించుకయు నని । నరేంద్ర! చెప్పుదురు ధర్మనానార్థవిదుల్. 296

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ధర్మరాజా!; ధరణీసుర= బ్రాహ్మణుల; విత్తములన్= ధనాన్ని; అపహరింపఁగాన్= దొంగిలించగా; కని= చూచి; వధించు= చంపే; అతఁడు= వాడు; ఒక+ఇంచుకయున్= కొద్దిగా కూడా; దురితమున్= పాపాన్ని; పొరయఁడు= పొందడు; అని= అంటూ; ధర్మ= ధర్మమార్గం యొక్క; నానా= అనేకమైన; అర్థవిదుల్= తత్త్వం తెలిసినవారు; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: ధర్మరాజా! బ్రాహ్మణుల ధనాన్ని దొంగిలిస్తుండగా చూచిన దొంగను చంపినవాడికి పాపం కొద్దిగా కూడా రాదని ధర్మమార్గం యొక్క పద్ధతులు బాగా తెలిసినవారు చెప్పుతారు.

క. జీవిత సంశయవేళను । భూవర! యొం డన్నపానములు దొరకమిఁ గల్
ద్రావినఁ, గల్లగు టెఱుంగక । త్రావిన నద్దురితమధిక ధర్మమునఁ జెడున్. 297

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; జీవిత సంశయవేళను= బ్రదకటం అనుమానాస్పదంగా ఉన్న సమయంలో; ఒండు= వేరు; అన్నపానములు= తినేవి, త్రాగేవి; దొరకమిన్= లభించకపోవటంతో; కల్= కల్లు; ద్రావినన్= త్రాగినా; కల్లు+అగుట= కల్లు అని; ఎఱుంగక= తెలియక; త్రావినన్= త్రాగిన; ఆ+దురితము= ఆ పాపం; అధిక= ఎక్కువ; ధర్మమునన్= పుణ్యం చేయటంవలన; చెడున్= నశిస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజా! ప్రాణం నిలవడనే పరిస్థితులలో తినటానికి, త్రాగటానికి వేరే ఏమీ దొరకనప్పుడు (ప్రాణం నిలపటం కొరకు) కల్లు త్రాగిన పాపం, త్రాగినది కల్లు అని తెలియక త్రాగిన ఆ పాపం అధికమైన పుణ్యకార్యాలు చేయటంతో నశిస్తుంది.

క. గురుసంరక్షణమునకును। బరమాపదయైన యెడను బ్రాహ్మణధనముల్
విరహితములుగాఁ బెఱచోఁ। జొరఁగానగు మ్రుచ్చిమికి వసుమతీనాథా! 298

ప్రతిపదార్థం: వసుమతీనాథా!= ధరణీపతీ! ధర్మరాజా!; గురుసంరక్షణమునకును= గురువును, పెద్దలను రక్షించటానికి; పరమ= గొప్ప; ఆపద= కష్టం; ఐన+ఎడన్= కలిగినప్పుడు; బ్రాహ్మణ ధనముల్= విప్రుల సొత్తులు; విరహితములు+కాన్= విడువబడినవై; పెఱచోన్= పరాయిచోటికి; చొరగాన్+అగు= పోయే; మ్రుచ్చిమికిన్= దొంగతనానికి.

తాత్పర్యం: ధర్మరాజా! గురువులను, పెద్దలను రక్షించటానికి, పెద్ద ఆపద కలిగినప్పుడు, బ్రాహ్మణుల ధనాలు వారినుండి అపహరించబడిన సమయంలోనూ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ప్రాణహాని దప్పించుచోఁ, బరిణయంబు। నందు గురుజన కార్యార్థమయ్యు నంగ
నా జనముతోడి సంభాషణమున సర్వ। ధనముఁ జెడియెడు నెడ బొంకఁ జను నృపాల! 299

ప్రతిపదార్థం: నృపాల!= రాజా!; ప్రాణహానిన్= ప్రాణనష్టాన్ని; తప్పించుచోన్= తప్పించే సమయంలో; పరిణయంబున్+అందున్= వివాహంలో; గురుజన= పెద్దల; కార్య+అర్థము+అయ్యున్= ప్రయోజనంకొరకు; అంగనాజనము= స్త్రీల; తోడి= తోటి; సంభాషణమునన్= మాట్లాడటంలో; సర్వధనమున్= సంపద అంతా; చెడియెడు+ఎడన్= నశించే సమయంలో; బొంకన్+చనున్= అబద్ధం చెప్పవచ్చును.

తాత్పర్యం: ధర్మరాజా! ప్రాణనష్టాన్ని తప్పించటానికి, వివాహంలో పెద్దల పనికొరకు, స్త్రీలతోడి మాటలలో, సంపద అంతా కోల్పోయే సమయంలో అసత్యం చెప్పవచ్చును.

క. కలలోనఁ జరమధాతు। స్ఖలనము గలిగినను బ్రహ్మచర్యము సెడ దు
జ్జ్వలవహ్ని నేయి వేల్చినఁ। దొలఁగుం గిల్బిషము దురితదూరచరిత్రా! 300

ప్రతిపదార్థం: దురిత= పాపాలకు; దూర= దూరమైన; చరిత్రా!= నడవడిక కలిగిన ధర్మరాజా!; కలలోనన్= స్వప్నంలో; చరమధాతు స్ఖలనము= వీర్యస్ఖలనం; కలిగినను= జరిగినట్లైతే; బ్రహ్మచర్యము= బ్రహ్మచర్యదీక్ష;చెడదు= పాడవదు, చెడిపోదు; ఉజ్జ్వల= బాగామండే; వహ్నిన్= అగ్నిలో; నేయి= ఘృతమును; వేల్చినన్= హోమం చేస్తే; కిల్బిషము= పాపం; తొలఁగున్= పోతుంది.

తాత్పర్యం: పాపరహితమైన నడవడిక కల ధర్మరాజా! కలలో వీర్యస్ఖలనం జరిగితే బ్రహ్మచర్యదీక్ష చెడదు. బాగా మండుతున్న అగ్నిలో నేతితో హోమం చేస్తే ఆ పాపం పోతుంది.

ఆ. అన్న పతితుఁడైన నటుగాక సన్యాసి। యయ్యెనేని తమ్ముఁ డాతఁ డుండ
దార సంగ్రహంబుఁ దాఁ జేసి పాపంబుఁ। బొరయఁ డంద్రు బుధులు కురువరేణ్య! 301

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశోత్తముడవైన ఓ ధర్మరాజా!; అన్న= జ్యేష్ఠసోదరుడు; పతితుఁడు+ఐనన్= అధర్మవర్తనుడైనా; అటు+కాక= ఆ విధం గాకపోయినా; సన్న్యాసి+అయ్యెన్+ఏని= సన్న్యాసం పుచ్చుకొని సంసారం వదలినా; ఆతఁడు+ఉండన్=

అన్న జీవించి ఉండగానే; తమ్ముఁడు; దారసంగ్రహంబు= అతడి భార్యను స్వీకరించటం; తాన్+చేసి= తనే చేసి; పాపంబున్= దురితం; పొరయఁడు= పొందడు; అండ్రు= అంటారు; బుధులు= పండితులు.

తాత్పర్యం: ధర్మరాజా! అన్న అధర్మవర్తనుడైనా, సన్న్యాసం స్వీకరించినా అతడి భార్యను, అతడు ఉండగానే తమ్ముడు స్వీకరిస్తే పాపం కాదు అని పండితులు అంటారు.

తే. అడవి గోవులకై కాల్చు టధ్వరమునఁ । బశువుఁ, జంపుట, దాన మపాత్రభూతుఁ
డగు టెఱుంగక యిచ్చుట, దగనిబంటుఁ । బ్రోవకుండుట గీడులు గావు వత్స! 302

ప్రతిపదార్థం: వత్స!= కుమారా! ధర్మజా!; అడవి= వనాన్ని; గోవులకున్+ఐ= ఆవులకొరకు; కాల్చుట= తగులబెట్టటం; అధ్వరమునన్= యజ్ఞంలో; పశువున్= జంతువును; చంపుట= చంపటం; అపాత్రభూతుఁడు= యోగ్యతలేనివాడు; అగుట= అవటం; ఎఱుంగక= తెలియక; ఇచ్చుట= ఇవ్వటం; తగని= అనర్హుడైన; బంటున్= సేవకుడిని; ప్రోవక= కాపాడక; ఉండుట= ఉండటం; కీడులు= చెడుపనులు, పాపాలు; కావు= అవవు.

తాత్పర్యం: కుమారా! ధర్మజా! గోవులకొరకు వనాన్ని తగులబెట్టటం, యజ్ఞంలో జంతువును చంపటం, అయోగ్యుడని తెలియక దానం ఇవ్వటం, అనర్హుడైన సేవకుడిని రక్షించకుండా వదలటం పాపాలు కావు.

వ. తపంబుల దానంబుల మఱియునుం దగిన పుణ్యకర్మంబులనుం బాపంబులు పరిక్షీణంబు లగు ననుఁ నిది సామాన్య వచనంబు; ప్రాయశ్చిత్త విశేషంబు లెఱింగించెద. 303

ప్రతిపదార్థం: తపంబులన్= తపస్సులచేత; దానంబులన్= దానములు చేయటంచేత; మఱియునున్= ఇంకా; తగిన= యుక్తమైన; పుణ్యకర్మంబులనున్= సత్కార్యాచరణాలవలన; పాపంబులు= దురితాలు; పరిక్షీణంబులు= బాగా కృశించినవి; అగును= అవుతాయి; అను+ఇది= అనే ఈ మాట; ప్రాయశ్చిత్త= పాపపరిహార; విశేషంబులు= భేదాలు; ఎఱింగించెదన్= తెలియచెప్పుతాను.

తాత్పర్యం: తపస్సు, దానం, ఇంకా ఇతర సత్కర్మాచరణం వలన పాపాలు బాగా తగ్గుతాయి అనేది మామూలు మాట. ఇంక పాపపరిహార ప్రక్రియలలోని భేదాలు చెప్పుతాను.

వ్యాసుఁడు ధర్మజునకుఁ బ్రాయశ్చిత్త విశేషంబు లెఱింగించుట (సం. 12-36-1)

సీ. వినుము! కర్మము దెల్పుచును గపాలంబున । నెత్తిన భైక్షాన్న మేకకాల
మశనంబు గొనుచు ఖట్వాంగ చిహ్నము బ్రహ్మ । చర్యంబునై యధశ్శయన మాచ
రించుచు నిట్లు పండ్రెండు వర్షంబులు । వ్రతవృత్తి నడపంగ బ్రహ్మహత్య
కిల్బిషంబు దొఱంగుఁ; గృచ్ఛ్రముల్ నడపిన । నాఱు వత్సరముల నడఁగు మూఁడు

తే. హాయనంబులు నడపఁ జాంద్రాయణములఁ । బోవు నిష్కానిరతి మాస భోజియైన
నబ్దమునఁబాయు; నటుగాక యశ్వమేధ । యాజి యగునేని వలదు భిక్షాదు లధిప! 304

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వినుము; కర్మమున్= చేసిన పనిని; తెల్పుచును= ప్రకటించుకొంటూ; కపాలంబునన్= పుర్రెలో; ఎత్తిన భిక్షాన్నము= తిరిపె మెత్తి తెచ్చిన ఆహారం; ఏకకాలంబు= ఒక్కమారు; అశనంబున్= ఆహారాన్ని; కొనుచున్= తింటూ;

ఖట్వాంగచిహ్నము= మంచపుకోడు ఆకారంలో ఉన్న ఆయుధం గుర్తుగా; బ్రహ్మచర్యంబును+ఐ= బ్రహ్మచర్య ధర్మాన్ని పాటిస్తూ; అధశ్శయనము= నేలమీద పడుకొనటం; ఆచరించుచున్= చేస్తూ; ఇట్లు= ఈ విధంగా; పండ్రెండు వర్షంబులు= పన్నెండు సంవత్సరాలు; వ్రతవృత్తిన్= నియమబద్ధమైన జీవితం; నడపంగన్= గడపగా; బ్రహ్మహత్య కిల్బిషంబు= బ్రహ్మహత్యాపాపం (బ్రాహ్మణవధ చేసిన పాపం); తొఱంగున్= పోతుంది; కృచ్ఛ్రముల్= సాంతపనాదివ్రతాలు; నడపినన్= ఆచరించితే; ఆఱు వత్సరములన్= ఆరేళ్ళలో; అడఁగును= నశిస్తుంది; మూడు హాయనంబులు= మూడు సంవత్సరాలు; నడపన్= ఆచరించగా; చాంద్రాయణములన్= చాంద్రాయణ వ్రతాలవలన; పోవును= పోతుంది; నిష్ఠానిరతిన్= నియమాలయందు ఆసక్తితో; మాసభోజి+ఐనన్= భుజిస్తే; అబ్దమునన్= సంవత్సరంలో; పాయున్= పోతుంది; అటు+కాక= ఆ విధంగా కాకపోతే; అశ్వమేధయాజి= అశ్వమేధ యజ్ఞం చేసినవాడు; అగున్+ఏని= అయినట్లయితే; భిక్షా+ఆదులు= భిక్షాన్నం తినటం మొదలైనవి; వలదు= అక్కరలేదు.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము; బ్రహ్మహత్యాదోషం పోవటానికి ప్రాయశ్చిత్తా లివి. తను చేసిన పని అందరికీ చెప్పుతూ, పురిలో భిక్షాటన చేసి తెచ్చిన ఆహారాన్ని రోజుకు ఒక్కసారి మాత్రమే తింటూ, ఖట్వాంగాన్ని గుర్తుగా గ్రహించి, బ్రహ్మచర్య ఆశ్రమధర్మాన్ని పాటిస్తూ నేలమీద పడుకొంటూ పన్నెండు సంవత్సరాలు నియమబద్ధ జీవితం గడపాలి. లేదా సాంతపనాది వ్రతాలు ఆరు సంవత్సరాలు ఆచరించాలి. లేకుంటే మూడు సంవత్సరాలు చాంద్రాయణ వ్రతం చేయాలి. అదీ కాకుంటే నిష్ఠగా మాసభోజి అయి ఒక్క ఏడాది ఉండాలి. అశ్వమేధయాగం చేస్తే మిగిలిన వేవీ చేయనక్కరలేదు.

విశేషం: 1. కృచ్ఛ్రము: మూడు రోజులు పగలు భోజనం చేసి, మూడురోజులు రాత్రిభోజనం చేసి, మూడురోజులు అడగకుండా లభించింది తిని, మూడు రోజులు అస లేమీ తినకుండా నిర్బుపవాసం ఉండే వ్రతం. పంచగవ్యము, కుశోదకం మాత్రమే స్వీకరించి, ఒకరాత్రి ఉపవసించే వ్రతాన్ని కృచ్ఛ్రము అంటారు. పంచగవ్యం అంటే గోవుకు సంబంధించిన 5 పదార్థాలు. 1. నేయి, 2. పాలు, 3. పెరుగు, 4. మూత్రం, 5. పేడ. గోమూత్రాన్ని మట్టిమూకుడులో ఇగిర్చి మిగిలినది లవణరూపంలో స్వీకరిస్తారు. ఆవుపేడను పుటంపెట్టి, నీటిలో బాగా కడిగి, ఆపై దానిపై తేర్చిన నీటిరూపంలో స్వీకరిస్తారు. ఇది ఒక్కనాటి నియమం. దీనిని ఆరు సంవత్సరాలు పాటించాలి.

2. చాంద్రాయణము: పూర్ణిమనాడు పూర్తిగా ఆహారం తీసికొని, కృష్ణపక్షంలో రోజుకొక్క ముద్దచొప్పున తగ్గిస్తూ, అమవాస్యనాడు పూర్తిగా ఉపవసించి, మరునాటి నుండి శుక్లపక్షంలో రోజు కొక్క ముద్ద చొప్పున హెచ్చిస్తూ పూర్ణిమనాటికి పూర్తిగా ఆహారం తీసికొనటం అనే వ్రతం.

3. మాస భోజి: రోజుకొక్క మాస ప్రమాణం మాత్రమే ఆహారం తీసికొనటం. రెండున్నర చిన్నాల ఎత్తు బరువును మాసం అంటారు. ఇది బంగారాన్ని తూచే బరువు. అంటే అంత తక్కువ ఆహారం.

ఈ వ్రతాలన్నింటిలోనూ ఆహారనియమం, శరీరశోషణం ముఖ్యాంశాలు. శరీరంతో చేసిన పాపానికి శరీరశోషణం అవసరం కదా!

క. అవనీశ! యశ్వమేధము ।నవబృథమున నీరఁ గ్రుంకి యన్యుఁడు శుద్ధుం
డవుఁ బాపుఁ డైనఁ; దత్కృ ।ర్త విశేషము లోక పూజితం బగు టరుదే! 305

ప్రతిపదార్థం: అవనీ+ఈశ!= ఓ రాజా!; అశ్వమేధము-అవభృథమునన్= అశ్వమేధయాగంలోని దీక్షాంతమున చేసే స్నానంలో; నీరన్= నీటిలో; క్రుంకి= మునిగి; అన్యుఁడు= ఇతరుడు; పాపుఁడు+ఐనన్= పాపం చేసినవాడైనా; శుద్ధుండు+అవున్= పవిత్రుడౌతాడు; తద్+కర్త= అశ్వమేధం చేసినవాడు; విశేషము= అధికంగా; లోకపూజితంబు= లోకంలోని అందరిచేత; పూజితంబు= పూజించబడటం; అరుదు+ఏ?= వింతయా? (వింతకాదు)

తాత్పర్యం: ధర్మరాజా! అశ్వమేధయాగంలోని దీక్షాంత స్నానపునీటిలో మునిగిన ఇతరు డెవరైనా, ఎంతటిపాపి అయినా పవిత్రుడౌతాడు. అటువంటిది ఆ అశ్వమేధయాగం చేసినవాడు లోకపూజితు డవటంలో ఆశ్చర్యం లేదు కదా!

సం॥ 35-10

తే. పుష్టగోలక్ష యొండెఁ గాంభోజవాజి । శతక మొండెను భూసురతతికి నొసఁగఁ
బాయు బ్రాహ్మణార్థాహవ ప్రాణహాని । యైన నొండెను జెడు బ్రహ్మహత్యకీడు. 306

ప్రతిపదార్థం: పుష్ట= బలిసిన; గోలక్ష= లక్షగోవులు; ఒండెన్= కాని; కాంభోజవాజి= కాంభోజదేశంలోని శ్రేష్ఠమైన గుర్రాలు; శతకము= వంద; ఒండెను= కాని; భూసురతతికిన్= బ్రాహ్మణుల సముదాయమునకు; ఒసఁగన్= దానం చేయగా; బ్రాహ్మణ+అర్థ= బ్రాహ్మణుల కొరకు చేసిన; ఆహవ= యుద్ధమందు; ప్రాణ, హాని, ఐనన్= ప్రాణములను పోగొట్టుకున్నా; బ్రహ్మహత్యకీడు= బ్రహ్మహత్యా పాతకం; పాయున్= పోతుంది; ఒండెను= అయినా; చెడున్= పోతుంది.

తాత్పర్యం: బ్రాహ్మణులకు పుష్టిగా ఉన్న లక్ష గోవులను, కాంభోజదేశానికి చెందిన వంద గుర్రాలను దానం చేసినా, బ్రాహ్మణులకోసం చేసిన యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్నా బ్రహ్మహత్యాపాతకం తొలగిపోతుంది.

సీ. కల్లుద్రావిన పాతకం బది యగ్నివ । ర్ణముగాఁగఁ గాఁచి పానంబు సేయఁ
గనుమూసి యుఱుకంగ ననలంబుఁ జొర మహా । ప్రస్థాన మాచరింపంగఁ బాయు
నట్లును గాక బృహస్పతి సవనమ । న్క్రతు వొనరించిన నతివిశిష్ట
భూమిదానమునను బోవు నక్కీడ్గురు । తల్పగుం డనలప్రతప్త మైన

ఆ. యాయసాంగనాంగ మాలింగనము సేసి । యైనఁ గోసి కరమునందు మేహ
నము ధరించి యంబరముఁ జూచు చరిగియే । నియును జచ్చి యఘము నిస్తరించు. 307

ప్రతిపదార్థం: కల్లున్+త్రావిన= మద్యం సేవించిన; పాతకంబు= మహాపాపం; అది= ఆ మద్యం; అగ్నివర్ణము+కాఁగన్= మంటవలె ఎర్రని రంగు వచ్చేదాకా; కాఁచి= మరిగించి; పానంబు+చేయన్= తాగగా; కనుమూసి= కళ్ళు మూసికొని; అనలంబున్= అగ్నిలో; చొరన్= ప్రవేశించగా; ఉఱుకంగన్= దుముకగా; మహాప్రస్థానము= తిరిగిరాని ప్రయాణం (శరీరం పడిపోయేదాకా అవిశ్రాంతంగా ఉత్తరాభిముఖుడైవెళ్ళి శరీరత్యాగం చేయటం); ఆచరింపంగన్= చేయగా; పాయున్= పోతుంది; అట్లును+కాక= అట్లా కాకపోతే; బృహస్పతి సవనము= బృహస్పతి యజ్ఞం; అన్+క్రతువు= అనే యజ్ఞం; ఒనరించినన్= చేసినా; అతివిశిష్ట= చాలా ఎక్కువైన; భూమిదానంబునను= భూమిని దానం చేయటం వలనా; ఆ+కీడు= కల్లు త్రావిన పాపం; పోవున్= పోతుంది; గురుతల్పగుండు= గురుదారగమనం చేసినవాడు; అనల= అగ్నిలో; ప్రతప్తము+ఐన= బాగా కాలిన; ఆయస= ఇనుప; అంగనా= స్త్రీ; అంగము= దేహం; ఆలింగనము+చేసి= కౌగిలించుకొని; ఐనన్= అయినా; మేహనము= మేఢ్రమును; కోసి= నరికి; కరమునందున్= చేతిలో; ధరించి= పట్టుకొని; అంబరమున్= ఆకాశాన్ని; చూచుచున్= చూస్తూ; అరిగి= వెళ్ళి; చచ్చి= మరణించి; ఏనియును= అయినా; అఘమున్= పాపాన్ని; నిస్తరించున్= పోగొట్టుకొంటాడు.

తాత్పర్యం: కల్లు సేవిస్తే వచ్చే పాతకం ఆ మద్యాన్ని ఎర్రగా కాచి తాగినా, కళ్ళు మూసికొని నిప్పులలో దూకినా, మహాప్రస్థానం చేసినా, బృహస్పతి సవనం అనే యజ్ఞం చేసినా, చాలా అధికమైన భూదానం చేసినా పోతుంది. గురుపత్నిని పొందినవాడు ఆ పాపం పోవటానికి బాగా కాల్చిన ఇనుపస్త్రీమూర్తిని కౌగిలించుకొనాలి. లేదా తన మేఢ్రాన్ని (ఆ పాపం చేయటానికి మూలం అదే కనుక) కోసి చేతిలో పట్టుకొని ఆకాశం వంక చూస్తూ పోయి మరణించాలి.

క. గురుతల్పగుండు రణమున । గురునకునై చచ్చియేని కురువర ధరణీ
సురులకు సర్వధనము భ । క్తి రతి నొసఁగియేని పాతకిత్వముఁ దొఱఁగున్. 308

ప్రతిపదార్థం: కురువర!= కురువంశరాజులలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; గురుతల్పగతుండు= గురుపత్నితో వ్యభిచరించినవాడు; రణమునన్= యుద్ధంలో; గురునకున్+ఐ= గురువు కొరకు; చచ్చి+ఏని= చనిపోయి కాని; ధరణీసురులకున్= విప్రులకు; సర్వధనము= సంపదనంతా; భక్తిరతిన్= భక్తితో, ఇష్టంతో; ఒసఁగి+ఏని= దానం చేసికాని; పాతకిత్వమున్= పాపభావాన్ని; తొఱఁగున్= పోగొట్టుకొంటాడు.

తాత్పర్యం: ధర్మరాజా! గురుపత్నీగమనం చేసినవాడు యుద్ధంలో ఆ గురువుకొరకు ప్రాణా లర్పించినా, తన ధనాన్నంతా విప్రులకు దానం చేసినా ఆ పాపం పోతుంది.

క. ధరణీసురుస్వర్ణము నప । హరించినతఁ డంత కనక మట్టిద వినయో
త్తరుఁడై మగుడఁగ నిచ్చినఁ । బరిహృత మగుఁ గల్మషంబు పౌరవముఖ్యా! 309

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశ శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; ధరణీసురు= విప్రుడి; స్వర్ణమున్= బంగారం; అపహరించిన= దొంగిలించిన; అతఁడు= వాడు; అంత కనకము= అంతే బంగారం; అట్టిది+అ= అటువంటిదే; వినయ+ఉత్తరుఁడు+ఐ= వినయంతో కూడుకొన్నవాడై; మగుడఁగన్= మరల; ఇచ్చినన్= ఇవ్వగా; కల్మషంబు= పాపం; పరిహృతము= పోగొట్టబడింది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: పౌరవవంశోత్తముడ వైన ధర్మరాజా! బ్రాహ్మణుడి బంగారాన్ని దొంగిలించిన వాడు అంతే బంగారం, అటువంటిదే వినయంతో తిరిగి ఇస్తే ఆ పాపం పోతుంది.

క. అనృతోపచారకలనం । బునఁ బుట్టిన పాతకంబు వోవుం దా నె
వ్వని నపచరించెఁ దగ నా । తనిఁ బ్రీతుంజేయ ధర్మతత్త్వప్రవణా! 310

ప్రతిపదార్థం: ధర్మతత్త్వప్రవణా!= ధర్మంయొక్క స్వభావం బాగా తెలిసిన ఓ ధర్మరాజా!; అనృత= అసత్యానికి; ఉపచార= సేవ; కలనంబునన్= చేయటం వలన; పుట్టిన= జనించిన; పాతకంబు= పాపం; ఎవ్వనిన్= ఎవరికి; అపచరించెన్= అపచారం చేశాడో; తగన్= చక్కగా; ఆతనిన్= ఆ వ్యక్తిని; ప్రీతున్= సంతసించినవాడినిగా; చేయన్= చేసినచో; పోవున్= పోతుంది.

తాత్పర్యం: ధర్మతత్త్వం బాగా తెలిసిన ఓ ధర్మరాజా! అబద్ధాన్ని ఆడటంవలన కలిగిన పాపం, ఎవరికి అపచారం చేశాడో ఆ వ్యక్తిని సంతోషపెట్టితే పోతుంది.

క. గురువునకు మాఱువల్కుటఁ । బొరసిన కల్మషము వాసిపోవు నతనికిం
బరితోషముగా వినయపు । వెరవున నుపహార మిచ్చి వినతుం డయినన్. 311

ప్రతిపదార్థం: గురువునకున్= ఆచార్యుడికి; మాఱుపల్కుటన్= ఎదురుచెప్పటం వలన; పొరసిన= కలిగిన; కల్మషము= పాపం; అతనికిన్= ఆ గురువుకు; పరితోషముగాన్= సంతోషం కలిగేటట్లు; వినయము+వెరవునన్= వినయంతో కూడిన ఉపాయంతో; ఉపహారము= కానుక; ఇచ్చి= ఒసగి; వినతుండు= నమస్కరించినవాడు; అయినన్= అయితే; పాసిపోవున్= తొలగిపోతుంది.

తాత్పర్యం: గురువును ఎదిరించటంవలన కలిగిన పాపం, ఆ గురువుకు సంతోషం కలిగేటట్లు వినయంతో నమస్కరించి కానుక ఇస్తే తొలగిపోతుంది.

క. పరదార గమనదోషము । పరిహృతమగు నొక్కయేఁడు పరమ నియతుఁడై
చరియించినఁ గృచ్ఛ్రంబులు । గురుకుల జలనిధి శశాంక! గుణమణి నికరా! 312

ప్రతిపదార్థం: కురుకుల= కురువంశమనే; జలనిధి= సముద్రానికి; శశాంక= చంద్రుడి వంటివాడా!; గుణమణి= శ్రేష్ఠమైన రత్నాలవంటి గుణాలకు; నికరా!= ప్రోగువంటివాడా!, ధర్మరాజా!; పర= ఇతరుల; దార= భార్యను; గమన= పొందిన; దోషము= పాపం; ఒక్కఏఁడు= ఒక్క సంవత్సరం; పరమ= మిక్కిలి; నియతుఁడు+ఐ= నియమాలు కలవాడై; కృచ్ఛ్రంబులు= సాంతపనాది వ్రతాలు; చరియించినన్= ఆచరించగా; పరిహృతము+అగున్= పరిహరించబడుతుంది.

తాత్పర్యం: కురువంశ చంద్రమా! సద్గుణరాశీ! ధర్మరాజా! ఇతరుల భార్యలను పొందిన పాపం ఒక్క సంవత్సరం అధికమైన నియమంతో కృచ్ఛ్రవ్రతాలను ఆచరిస్తే పోతుంది.

విశేషం: కృచ్ఛ్రముల వివరం 304వ పద్యంలో ఇవ్వబడింది.

ఆ. వావి గానియట్టి వనితఁ బొందినపాప । మాఱునెలలఁ బాయు నార్ద్రవస్త్ర
ధరణ భస్మశయన పరతఁ బాటించుచు । నియతి నుండెనేని నృపవరేణ్య! 313

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజోత్తమా!; వావి= వరుస; కాని+అట్టి= కానిదైన; వనితన్= స్త్రీని; పొందిన= కూడిన; పాపము= దురితం; ఆర్ద్రవస్త్రధరణ= తడిబట్టలు ధరించటం; భస్మశయనపరతన్= బూడిదలో పడుకొనటం; పాటించుచున్= అనుసరిస్తూ (చేస్తూ); నియతిన్= నియమంతో; ఉండెన్+ఏని= ఉన్నట్లయితే; ఆఱునెలలన్= ఆరునెలలలో; పాయున్= పోతుంది.

తాత్పర్యం: ధర్మరాజా! వరుసకాని స్త్రీని కూడిన పాపం - తడిబట్టలు కట్టుకొనటం, బూడిదలో పడుకొనటం అనే నియమాలను శ్రద్ధగా పాటిస్తే ఆరునెలలలో పోతుంది.

క. పరపురుష సంగమంబునఁ । బరిహృతయై యున్నయట్టి భామిని శుద్ధిం
బొరయు రజస్వలయై కం । చరయఁగ భస్మమున శుద్ధమైన విధమునన్. 314

ప్రతిపదార్థం: పరపురుష= పరాయి పురుషుడి; సంగమంబునన్= పొందువలన; పరిహృత+ఐ= వదలబడినదై; ఉన్న+అట్టి= ఉన్నటువంటి; భామిని= స్త్రీ; అరయఁగన్= పరికించి చూడగా; కంచు= కాంస్యం; భస్మమునన్= బూడిదతో; శుద్ధము= మలినం లేనిది; ఐన విధమునను= అయ్యే పద్ధతిలోనే; రజస్వల+ఐ= నెలసరి ఋతువు కలిగినదై; శుద్ధిన్= స్వచ్ఛతను; పొరయున్= పొందుతుంది.

తాత్పర్యం: పరపురుషుడి పొందువలన వదలబడిన స్త్రీ, బూడిదతో కంచు నిర్మలత్వాన్ని పొందిన విధంగా, రజోదర్శనంతో మాలిన్యం పోయి పవిత్రమౌతుంది.

ఆ. నఱకఁదగని మ్రాను నఱికినఁ, దిర్యగ్వ । ధంబుఁ జేసినను, నఘంబుఁ బాచి
కొనునరుండు మూఁడు దినములఁ దనచేత । పలుకుచును సమీరభక్షుఁ డయిన.' 315

ప్రతిపదార్థం: నఱకన్+తగని= కొట్టివేయకూడని; మ్రానున్= చెట్టును; నఱికినన్= కొట్టినా; తిర్యక్+వధంబున్= జంతులను చంపటం; చేసిననున్= చేసినా; అఘంబున్= ఆ పాపాన్ని; మూఁడు దినములు= మూడు రోజులు; తనచేత= తాను చేసిన పని; పలుకుచును= చెప్పుతూ; సమీరభక్షకుండు+అయినన్= గాలిని ఆహారంగా తింటూ ఉన్నట్లయితే; నరుండు= మానవుడు; పాచికొను= పోగొట్టుకుంటాడు.

తాత్పర్యం: నరకకూడని చెట్టును కొట్టినా, జంతువులను చంపినా, వచ్చిన పాపాన్ని మనిషి మూడురోజులపాటు తాను చేసిన పనిని చెప్పుకొంటూ గాలి మాత్రమే తింటూ (అన్న పానీయాలు మాని) ఉండి పోగొట్టుకొంటాడు.'

వ. అని చెప్పి వెండియు. 316

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఈ మాటలు చెప్పి వ్యాసుడు ఇంకా (ఇట్లా అన్నాడు):

క. 'మితభోజియై వివిక్త। క్షితి సావిత్రీజపంబు సేయునది యహ
స్థితియు నిశాసీనత్వము। మతి నేమఱకట్టులైన మడియు నఘంబుల్. 317

ప్రతిపదార్థం: మిత= పరిమితంగా; భోజి+ఐ= తినేవాడవై; వివిక్త= పవిత్ర (ఏకాంత); క్షితిన్= భూమిలో; సావిత్రీజపంబు=గాయత్రీమంత్రజపాన్ని; చేయునది= చేయాలి; అహఃస్థితియున్= పగలు నిలుచుండి మేల్కొని ఉండుటను; నిశా+ఆసీనత్వము= రాత్రియందు విశ్రయించుటయు కూర్చుండి ఉన్నప్పుడు; మతిన్= మనసులో; ఏమఱక= మరచిపోక; అట్టులు+ఐనన్= అట్లా చేసినట్లయితే; అఘంబుల్= పాపాలు; మడియున్= నశిస్తాయి.

తాత్పర్యం: 'ఆహారం మితంగా తీసికొంటూ, ఏకాంతస్థలంలో పగలు అయ్యేప్పుడు (ఉదయ సంధ్యలో) రాత్రి ఉన్నప్పుడు (సాయంసంధ్యలో) మనసులో ఏమరుపాటు లేక గాయత్రీమంత్రజపం చేస్తే పాపాలన్నీ నశిస్తాయి.

విశేషం: గాయత్రీమంత్రాధిదేవత సావిత్రి. సావిత్రీజపం అంటే గాయత్రి జపం అని భావం.

తే. పుణ్యకర్మముల్ సేయుచు భూసురులకు। వివిధ ధనములు ప్రీతితో వినయ మొప్ప
నొసఁగుచుండెడువారు పూర్వోపచితము। లైన కిల్బిషములఁ బాతు రవనినాథ! 318

ప్రతిపదార్థం: అవనినాథ!= భూమీపతీ!; పుణ్యకర్మముల్= మంచిపనులు; చేయుచున్= చేస్తూ; భూసురులకున్= విప్రులకు; వివిధ= అనేకములైన; ధనములు= సంపదలు; ప్రీతితోన్= ఇష్టంతో; వినయము+ఒప్పన్= వినమ్రత ప్రకాశించగా; ఒసఁగుచున్+ఉండెడువారు= ఇస్తూ ఉండేవారు; పూర్వ+ఉపచితములు= ఇంతకుముందు సంపాదించి పెట్టుకొన్నవి; ఐన= అయినటువంటి; కిల్బిషములన్= పాపాలను; పాతురు= పోగొట్టుకొంటారు.

తాత్పర్యం: సత్కర్మలు ఆచరిస్తూ, బ్రాహ్మణుల కనేకమైన సంపదలను ఇష్టంతో, వినయంతో దానం చేస్తూ ఉండేవారు పూర్వజన్మలలో కూడబెట్టిన పాపాలను కూడా పోగొట్టుకొంటారు.

క. విను మాస్తికతా శ్రద్ధా। వినయంబులు గలుగువారు వీనికి నెల్లన్
జననాథ! యర్హు; లవి లే। నినరులు పాపములఁ దొలఁగ నేర్తురె యెట్లున్. 319

ప్రతిపదార్థం: జననాథ!= రాజా!; విను= ఆలకించుము; ఆస్తికతా= భగవంతుడి యందు విశ్వాసబుద్ధి; శ్రద్ధా= ఆసక్తి; వినయంబులు= వినయం; కలుగువారు= ఉన్నవారు; వీనికిన్= ఇంతకుముందు చెప్పిన ప్రాయశ్చిత్తాదులకు; ఎల్లన్= అన్నింటికీ; అర్హులు= యోగ్యత ఉన్నవారు; అవి= ఆస్తికతా, శ్రద్ధా వినయాలు; లేని నరులు= లేనటువంటి మానవులు; ఎట్లున్= ఏ విధంగా; పాపములన్= పాపాలను; తొలఁగన్+నేర్తురు+ఎ?= పోగొట్టుకొనగలుగుతారు? (పోగొట్టుకొనలేరని భావం.)

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. భగవంతుడి పట్ల విశ్వాసం, శ్రద్ధ, వినయం ఉన్నవాళ్ళే ప్రాయశ్చిత్తా లన్నింటికీ అర్హులు. అవి లేనివారు పాపాలను ఎట్లా పోగొట్టుకొంటారు?

వ. ఆస్తికతా శ్రద్ధా వినయంబులు నీకు సహజంబులు గావే! కావునఁ బ్రాయశ్చిత్తంబు లల్పంబు లైననుం బాపంబులం బాపనోపుఁ; బాపం బని నీవు శంకించు కర్మంబు భారతయోధ వధంబ కాదె! యది యాత్మరక్షణంబునకై చేయుటంజేసియు, నుత్తమక్షత్రధర్మం బగుట నిరూపింపం బాపంబుం బొరయకున్న యది; యట్లుంగాక భవదంతఃకరణంబున జనియించిన కరుణయుం, బశ్చాత్తాపంబును, నిన్నుం బరిశుద్ధునింజేసె; నీవు ప్రాణబాధకంబు లగు తపశ్చరణంబులకుం జొరం జూడకుము; కురుకుల చూడామణిత్వంబునకు మూలంబయిన మహీపాలనం బాచరింపు' మనిన నబ్బాదరాయణుతో నమ్మేదినీరమణుం 'డపేయంబులు నభోజ్యంబులు నెయ్యవి? యపాత్రభూతపురుషు లెట్టివారు? మహాపురుషా! యెఱింగింపవే' యని యడిగిన నతం డిట్లనియె. 320

ప్రతిపదార్థం: ఆస్తికతా= భగవంతుడియందు విశ్వాసబుద్ధి; శ్రద్ధా= ఆసక్తి; వినయంబులు= వినమ్రత; నీకున్= నీకు (ధర్మరాజుకు); సహజంబులు= స్వభావసిద్ధమైనవి; కావు+ఏ!= కదా!; కావునన్= కనుక; ప్రాయశ్చిత్తంబులు= పాపపరిహార కర్మలు; అల్పంబులు+ఐననున్= తక్కువవి అయినా; పాపంబులన్= దురితాలను; పాపన్= పోగొట్టటానికి; ఓపున్= సమర్థములై ఉన్నాయి; పాపంబు+అని= అఘమని; నీవు శంకించు= నీవు అనుమానించే; కర్మంబు= పని; భారత= భరతవంశానికి చెందిన; యోధ= వీరుల; వధంబు+అ= సంహారమే; కాదు+ఎ!= కదా!; అది= ఆ పని; ఆత్మరక్షణంబునకున్+ఐ= తనను తాను రక్షించుకొనటానికి; చేయుటన్+చేసియున్= చేయటం వలన; ఉత్తమ= శ్రేష్ఠమైన; క్షత్రధర్మంబు= రాజోచిత కర్తవ్యం; అగుట= అవటం; నిరూపింపన్= నిరూపించటం వలన; పాపంబున్= దురితాన్ని; పొరయన్= పొందక; ఉన్న+అది= ఉన్నది; అట్లున్+కాక= అంతేకాక; భవత్= నీ; అంతఃకరణంబునన్= మనస్సులో; జనియించిన= పుట్టిన; కరుణయున్= దయయూ; పశ్చాత్తాపంబును= చేసిన పనికి బాధపడటం; నిన్నున్= నిన్ను; పరిశుద్ధునిన్= పవిత్రుడిగా; చేసెన్= చేశాయి; నీవు; ప్రాణబాధకంబులు+అగు= ప్రాణానికి కష్టం కలిగించేవి అయిన; తపశ్చరణంబులకున్= తపస్సు చేయటం మొదలైన పనులు; చొరన్+చూడకుము= మొదలుపెట్టాలనుకొనవద్దు; కురుకుల= కురువంశంయొక్క; చూడామణిత్వంబునకున్= ఉన్నతమైన గౌరవార్హమైన స్థితికి; మూలంబు+అయిన= కారణమైన; మహీపాలనంబు= భూమిని పరిపాలించటం; ఆచరింపుము= చేయుము; అనినన్= అనగా; ఆ+బాదరాయణుతోన్= ఆ వ్యాసుడితో; ఆ+మేదినీరమణుండు= ఆ రాజు; అపేయంబులున్= తాగకూడనివి; అభోజ్యంబులున్= తినకూడనివి; ఏ+అవి?= ఏవి?; అపాత్రభూత= అనర్హులైన; పురుషులు= మానవులు; ఎట్టివారు?= ఎటువంటివారు?; ఎవరు?; మహాపురుషా!= మహానుభావా!; ఎఱింగింపుము+ఏ?= తెలియచేయవా? అని; అడిగినన్= అడుగగా; అతండు= ఆ వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆస్తిక్యబుద్ధి, శ్రద్ధ, వినయం నీ నైజాలే కదా! కనుక స్వల్ప ప్రాయశ్చిత్తాలు పాపాలను పోగొట్టుతాయి. నీవు పాపం అని సందేహించేది భరతవంశవీరుల సంహారమే కదా! అది ఆత్మరక్షణకొరకు చేసిందే కాక ఉత్తమమైన రాజధర్మం అని నిరూపించబడటం వలన పాపం కాదు. అంతేకాదు. నీ మనస్సులో కలిగిన దయ, పశ్చాత్తాపాల కారణంగా నీవు నిర్మలుడ వయ్యావు. అందువలన నీవు తపస్సు మొదలైన పనులు ప్రారంభించకుము. కురువంశం సర్వశ్రేష్ఠంగా గౌరవించబడటానికి కారణమైన రాజ్యపాలనం నిర్వర్తించుము' అని చెప్పిన వ్యాసుడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు: 'మహానుభావా! తాగకూడనివి, తినకూడనివి ఏవి? ఎటువంటివారు అయోగ్యులు? తెలియచెప్పవలసినది'. దానికి వ్యాసు డిట్లా చెప్పటం మొదలుపెట్టాడు.

క. తురగియు నుష్ట్రియు ఖరియును । గురిసిన దుగ్ధములు నింద్యకోటి గణితముల్
ధరణీసురాది జను ల । ప్పారువునఁ బోయిన నఘంబుఁ బొందుదు రధిపా! 321

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; తురగియున్= ఆడగుర్రం; ఉష్ట్రియున్= ఆడ ఒంటె; ఖరియును= ఆడ గాడిద; కురిసిన= స్రవించిన; దుగ్ధములు= పాలు; నింద్య= నిందించదగిన; కోటి= సముదాయంగా; గణితముల్= పరిగణించబడ్డాయి; ధరణీసుర= బ్రాహ్మణ; ఆది= మొదలైన; జనులు= మానవులు; ఆ+పొరువునన్= వాటి సమీపానికి; పోయినన్= వెళ్ళినట్లయితే; అఘంబు= పాపం; పొందుదురు= పొందుతారు.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఆడ గుర్రం, ఆడ ఒంటె, ఆడ గాడిద ఇచ్చినపాలు నిందించ తగినవిగా పరిగణిస్తారు. బ్రాహ్మణులు మొదలైనవారు వాటి సమీపానికి వెళ్ళితే పాపం పొందుతారు.

సీ. మానుషీక్షీరంబు, నీనిన పదినాళ్ల । లోనిధేనువుల పాలును నపేయ
ములు; ప్రేతవిషయాన్నమును, సూతకాన్నంబుఁ, । దలవరియన్నంబుఁ, గులటయన్న
మును, వనితోపజీవనశీలు నన్నంబు, । నాడెడు పాడెడునట్టివాని
యన్నంబు, జూదరియన్నంబు, సూనరి । యన్నంబు బహివెట్టినతని యన్న

ఆ. మును, నిజాగ్రజునకు మును పెండ్లియాడిన । పురుషు నన్నమును, నభోజ్య మండ్రు;
వందియన్న మధిక నిందాస్పదంబు; ప । ర్యుషిత శుష్కములను నుడుగవలయు. 322

ప్రతిపదార్థం: మానుషీక్షీరంబు= మానవులపాలు; ఈనిన= ప్రసవించిన; పదినాళ్ళ= పదిరోజుల; లోని= లోపు; ధేనువుల= ఆవుల; పాలునున్= పాలునూ; అపేయములు= త్రాగకూడనివి; ప్రేతవిషయ= శవసంబంధమైన; అన్నమును= ఆహారం; సూతక+అన్నంబున్= అశౌచాలలోని (జాత అశౌచం - పురుడు, మృత అశౌచం - మైల) ఆహారం; తలవరి= తలారి; అన్నంబును= ఆహారం; కులట= వేశ్య అయిన స్త్రీ; అన్నమును= ఆహారం; వనిత= స్త్రీని; ఉపజీవనశీలుని= అనుసరించి జీవనం గడిపేవాడి (జీవనానికి స్త్రీపై ఆధారపడినవాడి); అన్నంబున్= ఆహారం; ఆడెడు= ఆడుతూ; పాడెడు= పాడుతూ ఉండే; అట్టివాని= అటువంటివాడి; అన్నంబు= ఆహారము; జూదరి= జూదగాడి; అన్నంబు= ఆహారం; సూనరి= పూలమ్మి బతికేవాడి; అన్నంబు= ఆహారం; బహి+పెట్టిన+అతని= వెలివేసినవాడి; అన్నమును= ఆహారం; నిజ= తన; అగ్రజునకున్= అన్నకన్న; మును= ముందుగా; పెండ్లి+ఆడిన= వివాహం చేసికొన్న; పురుషుని= మానవుడి; అన్నమునున్= ఆహారం; అభోజ్యము= తినతగనిది; అండ్రు= అంటారు; వంది= భట్టు (స్తుతి చేసి జీవించేవాడు); అన్నము= ఆహారం; అధిక= ఎక్కువగా; నిందా+ఆస్పదంబు= నిందకు తగినవి; పర్యుషిత= నిలవచేయబడినవి; శుష్కములనున్= ఎండినవి (వరుగులు); ఉడుగవలయున్= వదలివేయాలి.

తాత్పర్యం: మనిషిపాలు, ఈనిన పదిరోజుల లోపుగా ఆవుపాలు త్రాగకూడనివి. శవసంబంధమైనది అశౌచమైన (పురుడు, మైల సంబంధమైన)ది, తలారి ఇచ్చినది, కులట ఇచ్చినది, బ్రతుకు తెరువుకు స్త్రీపై ఆధారపడిన వాడు ఇచ్చినది, ఆడుతూ పాడుతూ ఉండేవాడు ఇచ్చినది, జూదగాడిచ్చినది, పూలమ్మువాడు ఇచ్చినది, వెలివేసినవాడు ఇచ్చినది, అన్నకంటె ముందు పెండ్లి చేసికొన్నవాడు ఇచ్చినది అయిన ఆహారం తినకూడనిది. స్తుతి చేసి జీవించేవాడి ఆహారం మరీ నిందించ తగినది. పాచిపోయినది (నిలవది), ఎండినది అయిన ఆహారాన్ని వదలివేయాలి.

క. వినుఁ! సురతోఁ గూడఁగఁ దె । చ్చినయట్టిది యెద్దియును భుజింప రభోజ్య
త్వ నిరూపణ నిపుణతగల । మనుజోత్తము లఖిలలోకమాన్యచరిత్రా! 323

ప్రతిపదార్థం: అఖిల= సమస్త; లోక= లోకంచేత; మాన్య= గౌరవించదగిన; చరిత్రా!= నడవడిక కలవాడా!; వినుము= ఆలకించుము; సురతోన్= కల్లుతో; కూడఁగన్= కలిపి; తెచ్చిన+అట్టిది= తీసికొనివచ్చినటువంటిది; ఎద్దియును= ఏదికూడ; అభోజ్యత్వ= తినకూడనివి; నిరూపణ= నిర్ధారించే; నిపుణత= నేర్పరితనం; కల= ఉన్న; మనుజ+ఉత్తములు= మానవశ్రేష్ఠులు; భుజింపరు= తినరు.

తాత్పర్యం: లోకంలో అందరిచేతా గౌరవించబడే ప్రవర్తన కల ధర్మరాజా! వినుము. తినకూడని వాటిని నిర్ధారించే చాతుర్యం ఉన్న ఉత్తములైనవారు కల్లుతో కలిపి తెచ్చిన వస్తువు ఏదైనా తినరు.

క. పులగముఁ బాయస మట్టులుఁ । బలలము నర్చనకుఁ గాక పక్వములయినం
గలుగు నభోజ్యత్వము వి । చ్చలవిడి వంటకము సేసి చనదు భుజింపన్.' 324

ప్రతిపదార్థం: పులగమున్= ముద్గాన్నము (పెసరపప్పు బియ్యం కలిపి వండిన అన్నం); పాయసము= పరమాన్నం; అట్టులు= అపూపములు; పలలము= నువ్వులపొడి (మాంసం అనే అర్థం కూడా ఉన్నది); అర్చనకున్+కాక= దేవతారాధనకు కాక; పక్వములు= వండినవి; అయినన్= అయితే; అభోజ్యత్వము= తినగూడకపోవటం; కలుగున్= కలుగుతుంది; విచ్చలవిడి= యథేచ్ఛగా; వంటకము= వండిన పదార్థాన్ని; చేసి= తయారుచేసి (వండి); భుజింపన్= తినటం; చనదు= కూడదు.

తాత్పర్యం: పులగం (పొంగలి), పరమాన్నం, అప్పాలు మొదలైన పిండివంటలు, నువ్వులపిండి మొదలైనవి దేవతార్చనకే వండాలి. అట్లా కాకపోతే అవి తినగూడనివి అవుతాయి. కనుక యథేచ్ఛగా వండి తినకూడదు.'

వ. అని వెండియు. 325

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా చెప్పి; వెండియున్= తిరిగి, ఇంకా.

తాత్పర్యం: వ్యాసు డీ విధంగా చెప్పి ఇంకా (ఇట్లా అన్నాడు):

తే. అతిథి పితృదేవతా పూజ లాచరించి । కాని గృహమేధులకు భోజ్యమైనఁ గుడువఁ
దగదు; యజ్ఞశిష్టం బమృతంబు గాఁగ । నార్యజనములు సెప్పుదు రధిపవర్య! 326

ప్రతిపదార్థం: అధిపవర్య!= రాజోత్తమా! ధర్మరాజా!; అతిథి= విందుల (ఇంటికి వచ్చిన వాళ్ళ); పితృదేవతా= పితృదేవతల; పూజలు= అర్చనలు; ఆచరించి కాని= చేసికాని; గృహమేధులకున్= ఇంటి యజమానులకు; భోజ్యము+ఐనన్= తినదగినదైనా; కుడువన్= తినటం; తగదు= కూడదు; యజ్ఞవిశిష్టంబు= యజ్ఞంలో మిగిలినది (ప్రసాదం); అమృతంబు+కాఁగన్= అమృతమౌతుందని; ఆర్యజనులు= పెద్దలు; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: 'ధర్మరాజా! గృహస్థాశ్రమ ధర్మాన్ని పాటించేవారు అతిథిపూజ, పితృదేవతాపూజ, దేవతాపూజ చేసికొని గాని తినదగిన దానినైనా తినరాదు. యజ్ఞంలో మిగిలినది (యజ్ఞప్రసాదం) అమృతమౌతుం దని పెద్దలు చెప్పుతారు.

క. ఆలును బిడ్డలు బంధులు । నై లీలఁ జరించుచును గృహస్థుఁడు దత్త
ల్లోలత్వరహిత చిత్తత । మేలుగ నలవఱుపవలయు మీఁ దెఱిఁగి నృపా!' 327

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; గృహస్థుఁడు= యజమాని; ఆలును= భార్య; బిడ్డలు= పిల్లలు; బంధులున్= చుట్టాలు; ఐ= అయి; లీలన్= క్రీడాప్రాయంగా; చరించుచును= ప్రవర్తిస్తూ; మీఁదు= తదుపరి రాబోయేది; ఎఱిఁగి= తెలిసికొని; తద్+తద్= ఆయా; లోలత్వరహిత= ఊగిసలాట లేని, స్థిరమైన; చిత్తత= మనసు కలిగించటాన్ని; మేలుగన్= బాగుగా; అలవఱుప వలయున్= అలవాటు చేయాలి, ప్రవర్తించాలి.

తాత్పర్యం: రాజా! గృహస్థుడు (గృహస్థాశ్రమ ధర్మం పాటించేవాడు) భార్య, పిల్లలు, చుట్టాలు అంటూ క్రీడాప్రాయంగా చరిస్తూనే, తరువాత రాబోయేది (పరం) గుర్తించి, ఆ బంధాలలో పూర్తిగా నిమగ్నం కాని మనస్సు కలిగి ఉండటాన్ని అలవాటు చేసికొనాలి (సాధన చేయాలి). ఇహంలో ఉంటూ అందులో మునిగిపోక పరం గుర్తించి సాధన చేయాలి'.

కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు నపాత్రపురుషుల నెఱింగించుట (సం. 12-37-23)

వ. అని యిట్లు చెప్పి 'యపాత్రభూతపురుషుల నాకర్ణింపు'మని పలికి. 328

ప్రతిపదార్థం: అని= అంటూ; ఇట్లు= ఈ విధంగా; చెప్పి= పలికి; అపాత్రభూతపురుషులన్= దాన యోగ్యత లేని వారయిన మానవులను గూర్చి; ఆకర్ణింపుము= వినుము; అని పలికి= అని మాట్లాడి.

తాత్పర్యం: వ్యాసు డీ విధంగా చెప్పి 'దాన యోగ్యత లేని మానవులను గూర్చి చెప్పుతాను వినుము'. అని పలికి- (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. పాడియు నాడియు బ్రదుకు వారలఁ బరి । హాసకు దుర్జను నంగహీను
మత్తుని మ్రుచ్చు నున్మత్తు నపుంసకుఁ । జెనఁటి మాటలఁ దేల్చు మనుజుఁ గులము
చాలమి వేదంబు చదువమి నిజవృత్తి । హాని దుర్వృత్తి గలట్టి వాని
దానపాత్రంబులుగా నియ్యకొనరు పె । ద్దలు; దీనుఁడును విపద్బాధితుండు

తే. నీగి కర్హులు; దయపేర్మి నిచ్చుచోట । నైన నవగుణ మెక్కుడై కానఁబడిన
నిందితాత్ముల కిచ్చుట నిష్ఫలంబు; । పాత్ర నిశ్చయ మిట్టిది పౌరవేంద్ర! 329

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర= పురువంశోత్తమ!; పాడియున్= గానంచేసి; ఆడియున్= నృత్యంచేసి; బ్రదుకు= జీవించే; వారలన్= వారిని; పరిహాసకున్= విదూషకుడిని; దుర్జనున్= దుష్టుడిని; అంగహీనున్= అంగవైకల్యం కలవాడిని; మత్తునిన్= మదించిన వాడిని; మ్రుచ్చున్= దొంగను; ఉన్మత్తున్= పిచ్చివాడిని; నపుంసకున్= షండుడిని; చెనఁటి= కుత్సితపు; మాటలన్= మాటలతో; తేల్చు= తేలియాడునట్లు చేసే; మనుజున్= మానవుడిని; కులము= వంశం; చాలమి= చాలకపోవటం; (సద్వంశసంజాతుడు కాకపోవటం); వేదంబు చదువమి= వేదాధ్యయనం చేయకపోవటం; నిజవృత్తి= తనదైన ధర్మానికి; హాని= చేటు; దుస్+వృత్తి= చెడువర్తనం; కల+అట్టి= కలిగినటువంటి; వానిన్= వ్యక్తిని; పెద్దలు= ఆర్యులు; దానపాత్రంబులు+కాన్= దానం చేయటానికి అర్హులనుగా; ఇయ్యకొనరు= అంగీకరించరు; దీనుఁడును= శోచనీయమైన స్థితిలో ఉన్నవాడు; విపద్+బాధితుండును= ఆపదలచేత కష్టపడుతున్నవాడు; ఈగికిన్= దానానికి; అర్హులు= యోగ్యులు; దయపేర్మిన్= ఎక్కువకరుణతో; ఇచ్చు+చోటన్+ఐనన్= ఇచ్చేటటువంటి చోట అయినా; అవగుణము= దుర్గుణం; ఎక్కుడు+ఐ= అధికంగా; కానఁబడిన= కనబడిన; నిందిత+ఆత్ములకున్= దూష్యులకు; ఇచ్చుట= దానం చేయటం; నిష్ఫలంబు= వృథ; పాత్ర నిశ్చయము= యోగ్యతను నిర్ణయించటం; ఇట్టిది= ఇటువంటిది.

తాత్పర్యం: పురువంశశ్రేష్ఠుడవైన ధర్మరాజా! ఆటపాటలతో జీవనం సాగించే గాయకులు నటులు, విదూషకులు, దుష్టులు, అంగవికలులు, మదించినవారు, దొంగలు, పిచ్చివారు, నపుంసకులు, కుత్సితమైన మాటలతో మోసం చేసేవారు, కులహీన, విద్యావిహీనులై, కులవృత్తిని వదలి, చెడునడత కలిగినవారు - వీరినందరను పెద్దలు దానానికి అర్హులుగా అంగీకరించరు. దీనులు, ఆపదలలో కొట్టుమిట్టాడుతున్నవారు దానానికి అర్హులు. దయపెచ్చుపెరిగి ఇచ్చేప్పుడు కూడా దుర్గుణాలు ఎక్కువగా ఉన్న నిందార్హులకు దానం చేయటం నిష్ఫలం. దానపాత్రత నిర్ణయం ఇది.

క. శిల చేవమ్రాను దెప్పగ । జలనిధిఁ గడవ దొరకొనిన చాడ్పగుఁ బాత్రం
బులు గానియెడల దానం । బులఁ బాపము నిస్తరింప బుద్ధిఁ దలఁచినన్. 330

ప్రతిపదార్థం: పాత్రంబులు= అర్హములు; కాని= కానట్టి; ఎడలన్= తావుల; దానంబులన్= దానం చేయటం వలన; పాపము= దురితాన్ని; నిస్తరింపన్= దాటటానికి (పోగొట్టుకొనటానికి); బుద్ధిన్= మనసులో; తలఁచినన్= ఆలోచించినట్లయితే; శిల= రాయి; చేవమ్రానున్= బాగా ముదిరిన చెట్టు; తెప్పగన్= తెప్పకొయ్య (నదిని దాటటానికి ఉపయోగించే కొయ్య)గా చేసికొని; జలనిధిన్= సముద్రాన్ని; కడవన్= దాటటం; దొరకొనిన= పూనుకొన్న; చాడ్పు= తీరు; అగున్= అవుతుంది.

తాత్పర్యం: అనర్హులైన వారికి దానం చేసి దానివలన పాపం పోగొట్టుకోవాలనుకోవటం - రాతిని, ముదిరిన చెట్టుకొయ్యను తెప్పగా చేసికొని సముద్రం దాటాలనుకోవటం అవుతుంది.

విశేషం: అలం: ఉపమ.

ఆ. పునుకఁ గుక్కతిత్తిఁ బోసినపాలు నీ । ళ్ళధిక నిందఁ బొరయునట్లు దుష్ట
మై యపాత్ర విషయ మగు నీగి వృథవోవు । నిచ్చుచోటఁ బాత్ర మెఱుఁగవలయు. 331

ప్రతిపదార్థం: పునుకన్= కపాలం (పుర్రెలో); కుక్కతిత్తిన్= నికృష్టమైన తోలుసంచిలో; పోసిన= ఉంచిన; పాలు= క్షీరం; నీళ్ళు= జలం; అధికనిందన్= ఎక్కువ దోషాన్ని; పొరయున్+అట్లు= పొందే విధంగా; దుష్టము+ఐ= చెడ్డదై; అపాత్ర విషయము+అగు= అనర్హులైన వారికి ఇచ్చిన; ఈగి= దానం; వృథ+పోవున్= వ్యర్థం అవుతుంది; ఇచ్చుచోటన్= దానం చేసే తావున; పాత్రము= అర్హతను; ఎఱుఁగన్+వలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: కపాలంలోనూ, నికృష్టమైన (కుక్క) తోలుసంచిలోనూ పోసిన పాలు, నీళ్ళు దోషభూయిష్ఠం అయినట్లే, చెడ్డదైన అపాత్రదానం నిష్ఫలం. కనుక దానం చేసేటప్పుడు పాత్రతను తెలిసికొనాలి.

తే. షండునకు బిడ్డ నిచ్చిన చందమొందు, । బూదిలో నేయి వేల్చుటఁ బోలు, నోటి
కడవ నీళ్ళులు వెట్టిన కరణియగు న । పాత్రజనులకుఁ బెట్టుట పౌరవేంద్ర! 332

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర!= పురువంశోత్తమా! ధర్మరాజా!; అపాత్రజనులకున్= అనర్హులైనవారికి; పెట్టుట= ఇవ్వటం (దానం చేయటం); షండునకున్= నపుంసకుడికి; బిడ్డను= పిల్లను; ఇచ్చిన= ఒసగిన; చందము= తీరు; ఒందున్= అవుతుంది; బూదిలోన్= బూడిదలో; నేయి= ఆజ్యం; వేల్చుటన్= హోమం చేయటాన్ని; పోలున్= పోలుతుంది; ఓటికడవన్= ఓటికుండలో; నీళ్ళులు= నీళ్ళు; పెట్టిన= ఉంచిన; కరణి= తీరు; అగున్= అవుతుంది.

తాత్పర్యం: పురువంశోత్తమా! ధర్మరాజా! అయోగ్యులకు దానం చేయటం అనేది నపుంసకుడికి కన్య నిచ్చినట్లు, బూడిదలో నేతిని హోమం చేసినట్లు, ఓటికుండలో నీళ్ళు పోసినట్లు నిష్ఫలం అవుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. దానవిధి యరయ నసమీ । చీనంబగునేని కీడు సేయుం గురుధా
త్రీనాథ! మఱియుఁ బాత్రం । బైనను గొన్నతని కిచ్చునతనికి నెట్లున్. 333

ప్రతిపదార్థం: కురుధాత్రీనాథ!= కురురాజా!; అరయన్= పరికించి చూడగా; దానవిధి= దానపద్ధతి; అసమీచీనంబు= తగినది కానిది; అగును+ఏని= అయినట్లయితే; కీడు= హాని; చేయున్= చేస్తుంది; మఱియున్= ఇంకా; పాత్రంబు+ఐనను= తగినది

అయితే; కొన్న+అతనికిన్= దానం స్వీకరించినవాడికి; ఇచ్చు+అతనికిన్= ఇచ్చినవాడికి; ఎట్లున్= ఏ విధమో; (అదే విధమైన మేలు జరుగుతుందని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! దాన పద్ధతి తగినది కాకపోతే కీడు కలిగిస్తుంది. అదే తగినదైతే దానం చేసిన వ్యక్తివలె పుచ్చుకొన్న వ్యక్తికి కూడ అవుతుంది. అంటే మేలు జరుగుతుంది.

క. కావున విను పాత్రము మే । లై విహితాచరణ సౌమ్యమగు దానము ధా
త్రీవర! దాత్రాదాతల । దా వెలయించు భువనద్వితయరంజకతన్.' 334

ప్రతిపదార్థం: ధాత్రీవర!= రాజా!; విను= ఆలకించుము; కావునన్= అందువలన; పాత్రము= యోగ్యత; మేలు+ఐ= శ్రేష్ఠమై; విహిత= విధ్యుక్తంగా; ఆచరణ= చేయబడింది; సౌమ్యము= తిన్ననిది; అగు= అయిన; దానము= ఈవి; దాత్రాదాతలన్= దానం పుచ్చుకున్న వారిని, ఇచ్చినవారిని; తాన్= తాను; భువనద్వితయ= రెండులోకాలలోనూ (ఇహపరాల్లో); రంజకతన్= సంతోషాన్ని; వెలయించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. యోగ్యమై చక్కగా విధ్యుక్తంగా చేసిన దానం పుచ్చుకొన్నవాడికి ఇచ్చినవాడికి ఇరువురికీ ఇహపరాలలో సంతోషాన్ని కలిగిస్తుంది.'

వ. అని చెప్పి 'యేను నీకు బుద్ధులు సెప్పంజొచ్చి సంక్షేపరూపంబునం గీడు మే లెఱింగించితి; నిప్పలుకులు పాటిగాఁ గొని విహితానుష్ఠానపరుండ వగు' మనుటయు, నమ్మనుజపతి యమ్మునిపతితో 'మహాత్మా! భవదనుగృహీతంబు లైన యివ్వాక్యంబులు హర్షంబు నావహించె; నెప్పాట ధర్మంబగు మార్గం బవలంబించి రాజ్యతంత్రంబు నడపి, యశుభంబునం దొడరక జయింతు; నట్టి తెఱంగు గలుగం గృపసేసి రాజధర్మంబులుం దక్కునుం గలుగు వర్ణాశ్రమ ధర్మంబులు నాపద్ధర్మంబులును లోనుగా నెఱుంగం దగు ధర్మంబులెల్ల నెఱింగింపవే! నాకుం జూడ రాజ్యంబును ధర్మచర్యయును బరస్పర విరుద్ధంబు లయినట్లున్నవి గావున నివ్విధంబున విన్నవింప వలసె'నని చెప్పుటయు, నత్తాపసోత్తముండు ప్రీతచిత్తుండై యతండు విన నారదుతోడ 'నీ భూపతి భీష్ము పాలికిం బోవలయు; నయ్యార్యవర్యు చేత సకల ధర్మంబులు వినువాఁ డగుట యర్హప్రకారం' బనవుడు నారదుం 'డిది లెస్స'యని వలికిన నప్పరాశరపుత్రుం డయ్యజాతశత్రున కిట్లనియె. 335

ప్రతిపదార్థం: అని= అంటూ; చెప్పి= పలికి; ఏను= నేను; నీకున్; బుద్ధులు= జ్ఞానబోధ; చెప్పన్= చెప్పటం; చొచ్చి= మొదలుపెట్టి; సంక్షేపరూపంబునన్= క్లుప్తంగా; కీడు= హాని; మేలు= మంచి; ఎఱింగించితిని= తెలియచెప్పాను; ఈ+పలుకులు= ఈ మాటలు; పాటి+కాన్= ప్రమాణంగా; కొని= గ్రహించి; విహిత= విధ్యుక్తమైన; అనుష్ఠాన పరుండవు+అగుము= నియమాలను ఆచరించేవాడివి కమ్ము; అనుటయున్= అనగా; ఆ+మనుజపతి= ఆరాజు (ధర్మరాజు); ఆ+మునిపతితోన్= ఆ వ్యాసుడితో; మహా+ఆత్మా!= మహానుభావా!; భవత్+అనుగృహీతంబులు+ఐన= నీవు దయ చేసినటువంటి; ఈ+వాక్యంబులు= ఈ మాటలు; హర్షంబును= సంతోషాన్ని; ఆవహించెన్= కలిగించాయి; ఏ+పాటన్= ఏ విధంగా; ధర్మంబు+అగు= వేదోక్తమైన ధర్మరూపంగల; మార్గంబు= పద్ధతి; అవలంబించి= పాటించి; రాజ్యతంత్రంబు= రాజ్యపాలనా వ్యవహారం; నడపి= నిర్వర్తించి; అశుభంబునున్= అమంగళం; తొడరక= కలగక; జయింతున్= నెగ్గుతాను; అట్టి= అటువంటి; తెఱంగు= పద్ధతి; కలుగన్= ఉండేటట్లు; కృప+చేసి= అనుగ్రహించి; రాజధర్మంబులున్= రాజులు ఆచరించవలసిన విధులు; తక్కునుం+కలుగు= మిగిలిన; వర్ణ+ఆశ్రమ ధర్మంబులు= చాతుర్వర్ణ్య చతురాశ్రమ ధర్మాలు; ఆపద్+ధర్మంబులును= ఆపదలలో చేయదగిన విధులు; లోనుగాన్= మొదలైన; ఎఱుంగన్+తగు= తెలిసికొనదగిన; ధర్మంబులు+ఎల్లన్= ధర్మాలు అన్నీ; ఎఱింగింపుము+ఏ?= తెలియచెప్పవా? (చెప్పవలసినదని భావం); నాకున్= నాకు; చూడన్= చూడగా; రాజ్యంబును= రాజ్యపరిపాలనను; ధర్మచర్యయును= ధర్మాచరణం; పరస్పర= ఒకదాని కొకటి;

విరుద్ధంబులు= వ్యతిరేకాలు; అయిన+అట్లు= అయిన విధంగా; ఉన్నవి= ఉన్నాయి; కావునన్= కనుక; ఈ+విధంబునన్= ఈ తీరులో; విన్నవింప= వేడుకొన; వలసెన్= వలసి వచ్చింది; అని= అంటూ; చెప్పుటయున్= చెప్పగా; ఆ+తాపస+ఉత్తముండు= ఆ తపస్సులలో శ్రేష్ఠుడైన వ్యాసుడు; ప్రీతచిత్తుండు+ఐ= సంతసించిన మనసు కలవాడై; అతండు= ఆ ధర్మరాజు; వినన్= వింటూ ఉండగా; నారదుతోడన్= నారద మహర్షితో; ఈ భూపతి= ఈ రాజు; భీష్మపాలికిన్= భీష్ముడి వద్దకు; పోవలయున్= వెళ్ళవలసి ఉన్నది; ఆ+ఆర్యవర్యుచేతన్= ఆ పూజనీయులలో శ్రేష్ఠుడైన భీష్ముడిచేత; సకల ధర్మంబులు= సమస్తమైన విధులు; వినువాఁడు= ఆలకించినవాడు; అగుట= అవటం; అర్హ= తగిన; ప్రకారంబు= పద్ధతి; అనవుడున్= అనగానే; నారదుండు; ఇది= ఈ మాట; లెస్స= మంచిది; అని+పలికినన్= అని అనగానే; ఆ+పరాశర పుత్రుండు= ఆ పరాశరుడి కుమారుడైన వ్యాసుడు; ఆ+అజాతశత్రునకున్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అంటూ చెప్పి, 'నేను నీకు జ్ఞానబోధ చేయటం మొదలుపెట్టి క్లుప్తంగా మంచిచెడులు తెలియపరిచాను. నేను చెప్పిన ఈ మాటలు ప్రమాణంగా గ్రహించి విధ్యుక్తధర్మాలను ఆచరించటంలో నిమగ్నుడవు కమ్ము' అనగా, ధర్మరాజు వ్యాసుడితో ఇట్లా అన్నాడు: 'మహానుభావా! నీవు దయచేసిన ఈ మాటలు సంతోషాన్ని కలిగించాయి. ఏ విధంగా ధర్మమార్గాన్ని ఆధారం చేసికొని రాజ్యపాలనావ్యవహారాన్ని నిర్వర్తించి అమంగళం (పాపం) కలుగకుండా నెగ్గగలనో ఆ పద్ధతి దయతో తెలియజెప్పి, రాజులు ఆచరించవలసిన విధులు, మిగిలిన వర్ణ, ఆశ్రమధర్మాలు, ఆపదలలో పాటించవలసిన ధర్మాలు, మొదలైన తెలిసికొనదగిన ధర్మా లనన్నింటిని తెలియపరచాలి. నాకు రాజ్యపాలన, ధర్మాచరణ ఒకదానికొకటి వ్యతిరేకమైనవిగా కనపడుతున్నాయి. కనుక ఈ విధంగా ప్రార్థించవలసి వచ్చింది' అనటంతో ఆ తపోధనుడు మనసులో సంతసించి ధర్మరాజు వింటూ ఉండగా నారదుడితో 'ఈ రాజు (ధర్మరాజు) భీష్ముడి దగ్గరకు వెళ్ళవలసి ఉన్నది. ఆ పూజనీయుడినుండి సమస్తధర్మాలు వినటం తగిన పద్ధతి' అన్నాడు. నారదుడు 'అదే మంచిది' అని అనగా వ్యాసుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

ఆ. కురుపితామహుండు గురుబుద్ధి నింద్రాదు । లకును మాననీయుఁ డకుటిలాత్మ
కుండు పరశురాము కోదండవిద్యాది । సుగుణములకు నెల్లఁ జొచ్చినిల్లు. 336

ప్రతిపదార్థం: కురుపితామహుండు= కురువంశంలోని వారి కందరకు పెద్ద అయిన భీష్ముడు; గురు= గొప్ప, ఘనమైన; బుద్ధిన్= మతిలో, తెలివిలో; ఇంద్ర+ఆదులకును= ఇంద్రుడు మొదలైన వారికి కూడ; మాననీయుఁడు= గౌరవించదగినవాడు; అకుటిల+ఆత్మకుండు= కుత్సితంలేని మనస్సు కలవాడు; పరశురాము= భార్గవరాముని యొక్క; కోదండ విద్య= విలువిద్య; ఆది= మొదలైన; సుగుణములకున్= మంచి లక్షణాలకు; ఎల్లన్= అన్నింటికి; చొచ్చిన+ఇల్లు= మెట్టినిల్లు.

తాత్పర్యం: 'కురువంశంలోని వారందరికి పెద్దదిక్కు అయిన భీష్ముడు తన గొప్ప మేధవలన ఇంద్రుడు మొదలైన వారికి కూడా పూజనీయుడు. నిర్మలమైన మనస్సుకలవాడు. పరశురాముడి విలువిద్య మొదలైన సద్గుణాలకన్నిటికీ నిలయమైనవాడు. (పరశురాముడి విద్యలు, సద్గుణాలు శిష్యుడైన భీష్ముడి వద్ద స్థిరనివాసం చేశాయి.)

క. సురతటినీ పుణ్యతమో । దరమున జన్మించినాఁ డుదాత్తవ్రతత
త్పరుఁ డతని కెల్ల ధర్ముఁ । గరస్థలామలక సన్నికాశం బధిపా! 337

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; సురతటినీ= సురగంగ; పుణ్యతమ= మిక్కిలి పుణ్యప్రదమైన; ఉదరమునన్= గర్భాన; జన్మించినాఁడు= పుట్టాడు; ఉదాత్త= గొప్ప; వ్రతతత్పరుఁడు= నియమాచరణంలో నిష్ఠకలవాడు; అతనికిన్= ఆ భీష్ముడికి; ఎల్లధర్మమున్= ధర్మశాస్త్రమంతా; కరస్థల= అరచేతియందుంచబడ్డ; ఆమలక= ఉసిరికతో; సన్నికాశంబు= సమానం.

తాత్పర్యం: ధర్మరాజా! మిక్కిలి పుణ్యవంతమైన సురగంగాగర్భానపుట్టాడు. గొప్పదైన నియమాన్ని నిష్ఠగా ఆచరిస్తున్నవాడు. ఆ భీష్ముడికి ధర్మాలన్నీ కరతలామలకం వంటివి.

క. చ్యవనుఁడు మార్కండేయుం ।డు వసిష్ఠుఁడు లోనుఁగా బటు ప్రాజ్ఞులు గా
రవమున వినిపింపఁగఁ దెలి ।య వినియె ధర్మప్రపంచ మతఁ డఖిలంబున్. 338

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భీష్ముడు; చ్యవనుఁడు; మార్కండేయుండు; వసిష్ఠుఁడు; లోనుగాన్= మొదలైన; పటు= గట్టి; గొప్ప; ప్రాజ్ఞులు= తెలిసినవారు; గారవమునన్= ఆదరంతో; వినిపింపఁగన్= చెప్పగా; తెలియన్= బాగా బోధపడేటట్లుగా; ధర్మప్రపంచము= ధర్మం యొక్క విస్తృతిని; అఖిలమున్= అంతటినీ; వినియెన్= గ్రహించాడు.

తాత్పర్యం: చ్యవనుడు, మార్కండేయుడు, వసిష్ఠుడు మొదలైన గొప్ప పండితులు ఆదరంతో బాగా బోధచేయగా ఆ భీష్ముడు ధర్మంయొక్క సమగ్రస్వరూపాన్ని తెలిసికొన్నాడు.

తే. శాంతమానసుఁడైన యా శాంతనవుఁడు ।విస్మయావహ చరితుండు; వినుము వలసి
నపుడు విడుచుటకై ప్రాణ మాఁగినాఁడు ।గాదె! యొరు లంతవా రెందుఁ గలరె నరులు. 339

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; శాంతమానసుఁడు+ఐన= రాగద్వేషాదులు లేని ప్రశాంతమైన మనస్సు; కలవాడైన; శాంతనవుఁడు= శంతనుడి కుమారుడు భీష్ముడు; విస్మయ+ఆవహ= ఆశ్చర్యం కలిగించే; చరితుండు= చరిత్ర కలవాడు; వలసిన+అపుడు= ఇష్టమైన (తగిన) సమయంలో; విడుచుటకున్+ఐ= వదలటంకొరకు; ప్రాణము= శరీరంలో జీవాన్ని; ఆఁగినాఁడు= నిలిపాడు; కాదు+ఎ!= కదా!; నరులు= మానవులు; ఒరులు= ఇతరులు; అంతవారు= అంతటి వారు; ఎందున్= ఎక్కడైనా; కలరు+ఎ?= ఉన్నారా? (లేరని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. ప్రశాంత చిత్తం కలవాడైన భీష్ముడి చరిత్ర ఆశ్చర్యం కలిగిస్తుంది. తగిన సమయంలో వదలటానికి ప్రాణాలు నిలిపి ఉన్నాడు. ఎక్కడైనా ఇతర మానవులు అంతటి వారున్నారా? (లేరు కదా అని భావం).

చ. అతనికి నీ పయిం గరుణ యగ్గల; మట్లగుటం గురుక్షమా
పతివర! పొమ్ము నీ వతనిపాలికి; నాతఁడు నిన్ను సంప్రబో
ధితుఁడుగఁ జేయు ధర్మములు దేటపడంగ నుపన్యసించు; మా
మత మిది; దీనఁ గీర్తియు సమంచిత ధర్మముఁ బెంపు నొందెడున్. 340

ప్రతిపదార్థం: కురుక్షమాపతి వర!= కురువంశరాజులలో ఉత్తముడవైన ధర్మరాజా!; అతనికిన్= అట్టి భీష్ముడికి; నీపయిన్= నీమీద; కరుణ= దయ; అగ్గలము= అధికం; అట్లు= ఆ విధంగా; అగుటన్= కావటం వలన; నీవు; అతనిపాలికిన్= ఆ భీష్ముడి వద్దకు; పొమ్ము= వెళ్ళుము; ఆతఁడు= ఆ భీష్ముడు; నిన్ను; సం+ప్రబోధితుడుగన్= బాగా బోధపడినవాడినిగా (తెలిసినవాడిగా); చేయున్= చేస్తాడు; ధర్మములు= విధులు; తేటపడంగన్= స్పష్టమయ్యేటట్లుగా; ఉపన్యసించున్= వివరిస్తాడు; ఇది; మా మతము= మా అభిప్రాయం; దీనన్= ఈ పనివలన; కీర్తియున్= యశం; సమంచిత= చక్కని; ధర్మమున్= వేదచోదిత ధర్మం కూడా; పెంపున్= వృద్ధిని; ఒందెడున్= పొందుతుంది.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠుడవైన ధర్మరాజా! అట్టి జ్ఞానవంతుడైన భీష్ముడికి నీమీద దయ చాల ఎక్కువ. కనుక నీ వతడి వద్దకు వెళ్ళుము. అతడు నీకు బాగా జ్ఞానప్రబోధ చేసి, ధర్మాలు మరింత తేలికగా అర్థమయ్యే

విధంగా వివరిస్తాడు. ఇది మా అభిప్రాయం. ఈ పనివలన నీకు మంచి కీర్తి, చక్కని వేదచోదితధర్మం వృద్ధి పొందుతాయి.

వ. అయ్యుత్తమోత్తమునకు నూర్ధ్వలోక గమనంబునకు సమయం బాసన్నంబగుచు వచ్చెం; దడయ కట్లు సేయు' మనిన విని యవ్వసుమతీపతి 'మునీంద్రా! బహుబంధు వధపాతకం బాచరించి యమ్మాననీయాత్ము నెదిరి కెట్లు వోదు? నట్లుం గాక యకృత్రిమ సమరశీలియగు నగ్గుణశాలిం గృత్రిమ సమరంబునం గూల్చి, క్రమ్మఱ నమ్మహాత్ము మొగంబు సూచి, నాకు ధర్మంబు లుపదేశింపవే యని యడుగ నేర్తునే?' యనుటయు నజ్జననాథునకు జనార్దనుం డిట్లనియె. 341

ప్రతిపదార్థం: ఆ+ఉత్తమ+ఉత్తమునకున్= ఆ శ్రేష్ఠాతిశ్రేష్ఠుడికి; ఊర్ధ్వలోక= పైలోకాలకు; గమనంబునకున్= వెళ్ళటానికి; సమయంబు= కాలం; ఆసన్నంబు+అగుచున్= దగ్గరవుతూ; వచ్చెన్= వచ్చింది; తడయక= ఆలసించక; అట్లు= మేము చెప్పినట్లు; చేయుము; అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+వసుమతీ+పతి= భూభర్త, ధర్మరాజు; ముని+ఇంద్రా!= మునివర్యా!; బహు= అనేక; బంధు= చుట్టాలను; వధ= చంపటం అనే; పాతకంబు= పాపం; ఆచరించి= చేసి; ఆ+మాననీయ+ఆత్ము= ఆ మహాత్ముడి; ఎదిరికిన్= ఎదుటికి; ఎట్లు= ఏ విధంగా; పోదున్?= వెళ్ళగలను?; అట్లున్+కాక= అంతేకాక; అకృత్రిమ= అసహజంకాని; సమరశీలి అగు= యుద్ధం చేసే స్వభావం కలవాడైన; ఆ+గుణశాలిన్= ఆ గుణవంతుడిని; కృత్రిమము+ఐన= అసహజమైన; సమరంబునన్= యుద్ధంలో; కూల్చి= పడగొట్టి; క్రమ్మఱన్= తిరిగి; ఆ+మహాత్ము= ఆ మహానుభావుడి; మొగంబు= ముఖం; చూచి= ఆలోకించి; నాకున్; ధర్మంబులు= ధర్మపద్ధతులు; ఉపదేశింపవు+ఏ?= బోధ చేయవా?; అని= అంటూ; అడుగన్= అడగటానికి; నేర్తును+ఏ?= సమర్థుడనవుతానా?; అనుటయున్= అనగా; ఆ+జననాథునకున్= ఆ రాజునకు; జనార్దనుండు= శ్రీ కృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ శ్రేష్ఠుడైన భీష్ముడు పై లోకాలకు వెళ్ళే సమయం సమీపిస్తున్నది. ఆలసించక మేము చెప్పినట్లు చేయుము' అని వ్యాసు డనగా విని ధర్మరాజు 'మునివరా! ఎంతోమంది బంధువులను వధించటం అనే మహా పాపాన్ని చేసి ఆ మహాత్ముడి ఎదుటికి ఎట్లా వెళ్ళగలను? అంతేకాదు. న్యాయంగా యుద్ధం చేసే స్వభావం కలిగిన ఆ సద్గుణరాశిని అధర్మయుద్ధంలో పడగొట్టి, తిరిగి ఆ ధర్మాత్ముడి మొగం చూచి, నాకు ధర్మోపదేశం చేయుమని ఏ విధంగా అడుగగలను?' అన్నాడు. అప్పుడు ధర్మరాజుతో కృష్ణ డిట్లా అన్నాడు:

తే. ' ఇంత నిర్బంధ మేటికి 'నిమ్మునీంద్రు । పనుపు సేయుదు గాక! యిప్పాట నెల్ల
పెనుపులకుఁ బాత్రమయ్యెదు; వనటతోడ । నెద్దియును నేల? పురమున కేఁగు మిపుడు. 342

ప్రతిపదార్థం: ఇంత= ఇంతటి; నిర్బంధము= తప్పనిసరి; ఏటికిన్?= ఎందుకు?; ఈ+ముని+ఇంద్రు= ఈ మునివరుడైన వ్యాసుడి; పనుపు= ఆజ్ఞ; చేయుదు+కాక!= చేస్తావు సుమా!; ఈ పాటన్= పద్ధతితో; ఎల్ల= అన్ని; పెనుపులకున్= వృద్ధులకు, అభ్యుదయాలకు; పాత్రము= అర్హుడవు; అయ్యెదు= అవుతావు; వనటతోడన్= శోకంతో; ఎద్దియున్= ఏది అయినా; ఏల?= ఎందుకు?; ఇపుడు= ఇప్పుడు; పురమునకున్= నగరానికి; ఏఁగుము= వెళ్ళుము.

తాత్పర్యం: 'ఇంత తప్పనిసరి అనటం ఎందుకు? వ్యాసుడు ఆనతిచ్చినది నీవు చేస్తావు సుమా! ఈ పనివలన నీవన్నివిధాలా వృద్ధిలోకి రావటానికి అర్హత కలవాడివి అవుతావు. ఏదయినా శోకంతో చేయటం ఎందుకు? ఇప్పుడు నగరానికి వెళ్ళుము.

వ. మరల గాంగేయు కడకు వత్త; మదిమేలు, లె' మ్మని పలికి వెండియు. 343

ప్రతిపదార్థం: మరలన్= తిరిగి; గాంగేయు= గంగాపుత్రుడైన భీష్ముడి; కడకున్= వద్దకు; వత్తము= వద్దాము; అది= ఆ పని; మేలు= మంచిది; లెమ్ము= బయలుదేరుము; అని= అంటూ; పలికి= చెప్పి; వెండియున్= తిరిగి; ఇంకా.

తాత్పర్యం: భీష్ముడివద్దకు మరొకమారు వద్దాము. అదే మంచిది. లెమ్ము' (నగరానికి వెళ్ళటానికి) అని చెప్పి శ్రీకృష్ణుడు ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ' తమ్ములును విప్రవరులును ధరణిఁ గల్గ । బహువిధంబుల ప్రజలును బార్థివేంద్ర
చాతకప్రకరములు పర్జన్యుఁ గోరు । నట్లు నినుఁ గోరుదురు కృప నాదరింపు. 344

ప్రతిపదార్థం: పార్థివ+ఇంద్ర!= రాజోత్తమా! ధర్మరాజా!; తమ్ములును= సోదరులు; విప్రవరులును= బ్రాహ్మణశ్రేష్ఠులు; ధరణిన్= భూమిపై; కల్గ= ఉన్న; బహువిధంబుల= అనేకములైన (వివిధ వర్ణాలకు, జాతులకు చెందిన); ప్రజలును= మానవులు; చాతక= వానకోయిల; ప్రకరములు= గుంపులు; పర్జన్యున్= మేఘుడిని; కోరు+అట్లు= కోరే విధంగా; నినున్= నిన్ను; కోరుదురు= కావాలనుకొంటారు; కృపన్= దయతో; ఆదరింపు(ము)= కాపాడుము (చేరదీయుము).

తాత్పర్యం: 'ధర్మరాజా! నీ తమ్ములు, బ్రాహ్మణోత్తములు, ఇంకా భూమిపై ఉన్న నానావిధ జాతివర్ణాలకు చెందిన జనులు వానకోయిలలు మేఘుంకొరకు ఎదురు చూచే విధంగా, నిన్నే కావాలనుకొంటున్నారు. వారిని దయతో ఆదరించుము.

విశేషం: అలం: ఉపమ.

వ. ఈ సర్వజనంబుల మనోరథంబును సఫలంబులు సేయు' మని ప్రార్థించె; నివ్విధంబునం గృష్ణద్వైపాయన నారద దేవల దేవస్థాణు కృష్ణులు లోనుగాఁ బెక్కండ్రు పెక్కుదెఱంగులఁ జెప్పిన వాక్యంబులఁ జిత్తంబు కలంకదేఱి, కౌంతేయాగ్రజుండు రాజ్యభార నిర్వహణోత్సాహం బంకురింప, శిశిరాపగమ సమయ కమలంబు ననుకరించు నాననంబుతో నప్పారాశర్య ప్రముఖ మునివరులకుం బ్రదక్షిణంబును దండప్రణామంబును నాచరించి, వారల వలన వసుమతీ వహనానుజ్ఞయు వివిధాశీర్వాదంబులుం బడసి వెలింగె; వారును నిజస్థానంబులకుం జనిరి; తదనంతరంబ. 345

ప్రతిపదార్థం: ఈ సర్వజనంబుల= ఇప్పుడు చెప్పిన అందరు జనుల; మనోరథంబును= కోరికను; సఫలంబు= ఫలవంతం; చేయుము; అని= అంటూ (శ్రీకృష్ణుడు); ప్రార్థించెన్= వేడుకొన్నాడు; ఈ విధంబునన్= ఈ తీరుగా; కృష్ణద్వైపాయన= వ్యాసుడు; నారద; దేవల; దేవస్థాణు; కృష్ణులు; లోనుగాన్= మొదలైన; పెక్కండ్రు= అనేకులు; పెక్కు= బహు; తెఱంగులన్= భంగుల; చెప్పిన= బోధించిన; వాక్యంబులన్= మాటలతో; చిత్తంబు= మనస్సు; కలంక= కలత (బాధ); తేఱి= తేరుకొని; కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; రాజ్యభార= రాజ్యపరిపాలన అనే బాధ్యతను; నిర్వహణ= మోయాలనే; ఉత్సాహంబు= ఆసక్తి; అంకురింపన్= మొలకెత్తగా; శిశిర= శిశిర ఋతువు యొక్క; అపగమ= వెనుదిరిగే; సమయ= కాలంలోని; కమలంబు= పద్మాన్ని; అనుకరించు= పోలిఉన్న; ఆననంబుతోన్= ముఖంతో; ఆ+పారాశర్య ప్రముఖ= వ్యాసుడు మొదలైన; మునివరులకున్= ఋషి శ్రేష్ఠులకు; ప్రదక్షిణంబు= వలగొనుట; దండప్రణామంబును= సాష్టాంగ దండ ప్రణామం (సాగిలి మొక్కటం); చేసి= ఆచరించి; వారలవలనన్= ఆ మునులనుండి; వసుమతీ వహన= భూభార నిర్వహణానికి; అనుజ్ఞయున్= అనుమతిని; వివిధ= అనేక; ఆశీర్వాదంబులున్= ఆశీస్సులును; పడసి= పొంది; వెలింగెన్= ప్రకాశించాడు; వారును= ఆ మునులును; నిజ= తమ; స్థానంబులకున్= తావులకు; చనిరి= వెళ్ళారు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: నిన్ను కోరే అందరు జనుల కోరికను తీర్చుము' అని శ్రీకృష్ణుడు ధర్మరాజును వేడుకొన్నాడు. ఈ విధంగా వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, కృష్ణుడు మొదలైన అనేకులు అనేకవిధాలుగా బోధించగా ఆ మాటతో మనస్సులో కలతపాటుపోయి, ధర్మరాజుకు రాజ్యపాలన చేయాలనే ఆసక్తి మొలకెత్తింది. శిశిర ఋతువు వెళ్ళిపోయి వసంత ఋతువు ప్రవేశించిన కాలంలో ఉన్న పద్మంవలె వికసించిన ముఖం కలవాడై, వ్యాసుడు మొదలైన మునులకు ప్రదక్షిణలు, సాష్టాంగ దండప్రణామాలు చేసి, వారినుండి భూభారనిర్వహణానికి అనుమతిని, అనేక ఆశీస్సులను పొంది రాణించాడు. ఆ మునులు మొదలైనవారంతా తమ తమ స్థానాలకు వెళ్ళిపోయారు. ఆ తరువాత.

విశేషం: అలం: ఉపమ.

సీ. దేవభూదేవ పూజావిశేషము లాచరించి । యక్కురుకులశ్రేష్ఠుఁ డుర్వి
నెడనెడ బ్రుంగుడువడి యున్నరాజులు । సనుదెంచి కను నవసరము వేచి
యునికి కృష్ణునిచేత విని పూసి తొడి కట్టి । కొలువిచ్చి, మణిహేమకుంజరాశ్వ
కాంతాదులగు తగుకానికల్ గైకొని, । యానృపాలురకుఁ బ్రియం బొనర్చి,

తే. యమ్ముకుందుండు వారును దమ్ముగమియుఁ । దక్కుఁగల బంధుమిత్రులు ధౌమ్య ముఖ్య
సూరిజనములు బలయంగఁ దారకముల । మధ్యమున చొప్పుచంద్రుని మాడ్కిఁ బొలిచె. 346

ప్రతిపదార్థం: ఆ+కురుకులశ్రేష్ఠుఁడు= ఆ కురువంశోత్తముడు; దేవ= దేవతలకు; భూదేవ= బ్రాహ్మణులకు; పూజావిశేషంబులు= ప్రత్యేక పూజలు మొదలైనవి; ఆచరించి= చేసి; ఎడన్+ఎడన్= అక్కడక్కడా; బ్రుంగుడు+పడి= దాగుకొని (యుద్ధానికి రాక); ఉన్న= ఉన్నటువంటి; రాజులు; చనుదెంచి= వచ్చి; కను+అవసరము= దర్శించటానికి తగిన సమయం కొరకు; వేచి+ఉనికి= ఎదురుచూస్తూ ఉండటం; కృష్ణునిచేతన్= కృష్ణుడు చెప్పగా; విని= ఆలకించి; పూసి= చందనాదులు అలదికొని; తొడి= అలంకరించుకొని; కట్టి= వస్త్రధారణచేసి; కొలువు+ఇచ్చి= తన ఆస్థానంలో స్థానమిచ్చి; మణి= మణులు; హేమ= బంగారం; కుంజర= ఏనుగులు; అశ్వ= గుర్రాలు; కాంతా= స్త్రీలు; ఆదులు+అగు= మొదలైన; తగు= యోగ్యమైన; కానికల్= ఉపహారాలు; కైకొని= స్వీకరించి; ఆ నృపాలురకున్= ఆ రాజులకు; ప్రియంబు= ఇష్టాన్ని; ఒనర్చి= కలిగించి; ఆ+ముకుందుండు= ఆ శ్రీకృష్ణుడు; వారును= ఆ రాజులు; తమ్ముగమియున్= సోదరబృందం; తక్కుఁగల= మిగిలిన; బంధు= చుట్టాలు; మిత్రులు= స్నేహితులు; ధౌమ్యముఖ్య= ధౌమ్యుడు మొదలైన; సూరిజనములు= పండితులు; బలయంగన్= పరివేష్టించి ఉండగా; తారకముల= నక్షత్రాల; మధ్యమునన్= మధ్యలో; ఒప్పు= అందగించే; చంద్రుని= చంద్రుడి; మాడ్కిన్= వలె; పొలిచెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ఆ కురుకులోత్తముడైన ధర్మరాజు దేవబ్రాహ్మణ పూజలు విశేషంగా చేసి, అక్కడక్కడా దాగుకొని ఉన్న (యుద్ధంలో పాల్గొనక తప్పించుకొన్న) రాజులు వచ్చి దర్శించటానికి తగిన సమయంకొరకు కాచుకొని ఉన్నారని శ్రీకృష్ణుడు చెప్పగా విని, సంభ్రమంగా మైపూతలు, వస్త్రాలు ధరించి, వారికి ఆస్థానంలో తా విచ్చి, వా రిచ్చిన మణులు, బంగారం, ఏనుగులు, గుర్రాలు, స్త్రీలు మొదలైన యోగ్యమైన కానుకలను స్వీకరించి, ఆ రాజులకు సంతోషాన్ని కలిగించి, ఆ సామంతరాజులు, తమ్ముల బృందం, మిగిలిన బంధువులు, స్నేహితులు, ధౌమ్యుడు మొదలైన పండితులు తనను పరివేష్టించి ఉండగా చుక్కలమధ్య చంద్రుడివలె ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. మఱునాఁడు కల్యంబునం గాలోచితకృత్యంబు లాచరించి ధవళానులేపన మాల్యవస్త్రాభరణంబుల నలంకృతుండై. 347

ప్రతిపదార్థం: మఱునాఁడు= మరుసటిరోజు; కల్యంబునన్= వేకువనే; కాల+ఉచిత= సమయానికి తగిన; కృత్యంబులు= పనులు; ఆచరించి= చేసి; ధవళ= తెల్లని; మాల్య= పూలదండలు; వస్త్ర= వస్త్రములు; ఆభరణంబులన్= నగలతోను; అలంకృతుఁడు+ఐ= అలంకరించబడినవాడై.

తాత్పర్యం: మరుసటిరోజు వేకువనే సమయోచితమైన పనులు (కాలకృత్యాదులు) నిర్వర్తించి, తెల్లని పూలదండలు, వస్త్రాలు, నగలు అలంకరించుకొని (తరువాతి పద్యంతో అన్వయం).

క. నవమగు రథమున షోడశ । ధవళహరులఁ బూన్పఁ బనిచి ధరణిపుఁడు విధుం
డవిరళ సుధారథం బె । క్కువిధము దోఁపంగ నెక్కెఁ గురువంశనిధీ! 348

ప్రతిపదార్థం: కురువంశనిధీ= కురువంశానికి పెన్నిధివంటి జనమేజయ చక్రవర్తీ!; నవము+అగు= క్రొత్తది అయిన; రథమునన్= రథానికి; షోడశ= పదునారు; ధవళ= తెల్లని; హరులన్= గుర్రాలను; పూన్పన్= పూన్చుమని; పనిచి= ఆజ్ఞాపించి; ధరణిపుఁడు= రాజు, ధర్మరాజు; విధుండు= చంద్రుడు; అవిరళ= ఎడబాయని; సుధారథంబు= వెన్నెల అనే రథాన్ని; ఎక్కు= అధిరోహించే; విధము= తీరు; తోఁపంగన్= అనిపించగా; ఎక్కెన్= అధిరోహించాడు.

తాత్పర్యం: జనమేజయ చక్రవర్తీ! ధర్మరాజు కొత్తరథానికి పదహారు తెల్లని గుర్రాలను పూన్చుమని ఆజ్ఞాపించి, ఆ రథాన్ని చంద్రుడు తనని ఎడబాయని వెన్నెలరథాన్ని ఎక్కిన విధం తలపింపచేస్తూ అధిరోహించాడు.

విశేషం: అలం: ఉపమ.

శా. సారథ్యంబు వహింప భీముఁడు, సితచ్ఛత్రంబు గాండీవి సె
ల్వారం బట్టఁగఁ, జామరల్ గవ లిడన్ హారిప్రభంబయ్యెఁ న
త్తేరం దేవురు నగ్నిపంచకము వేదిం బొల్చునట్లొప్పి రం
భోరాశిధ్వనివోలెఁ దూర్యనికరంబుల్ మ్రోసె నొక్కుమ్మడిన్. 349

ప్రతిపదార్థం: భీముఁడు= భీమసేనుడు; సారథ్యంబు+వహింపన్= రథచోదనం చేయగా; గాండీవి= అర్జునుడు; సితచ్ఛత్రంబు= తెల్లగొడుగు; చెల్వారన్= అందమతిశయించగా; పట్టఁగన్= పట్టుకొనగా; కవలు= నకుల సహదేవులు; చామరల్= వింజామరాలను; ఇడన్= పట్టుకోగా (వీచగా); ఆ+తేరు+అందున్= ఆ రథంలో; హారి= మనోహరమైన; ప్రభంబు+అయ్యెన్= కాంతికలిగిన దయింది (ప్రకాశించింది); ఆ+తేరు+అందున్= ఆ రథంలో; ఏవురున్= అయిదుగురు (పాండవులు); అగ్నిపంచకము= పంచాగ్నులు; వేదిన్=అందు; యజ్ఞవేదికయందు; పొల్చున్+అట్లు= వెలిగేటట్లు; ఒప్పిరి= అందగించారు; అంభోరాశి= సముద్రపు; ధ్వని= శబ్దం; పోలెన్= వలె; తూర్యనికరంబుల్= వాద్య సముదాయాలు; ఒక్కుమ్మడిన్= ఒక్కసారిగా; మ్రోసెన్= మ్రోగాయి.

తాత్పర్యం: ధర్మరాజు అధిరోహించిన రథానికి భీముడు సారథ్యం వహించాడు. అర్జునుడు వెల్లగొడుగును అంద మొప్పగా పట్టాడు. నకుల సహదేవులు వింజామరలు పట్టుకొని వీస్తున్నారు. వారితో ఆ రథం మనోహరమై ఒప్పారింది. పంచాగ్నులు యజ్ఞవేదికపై పొలుపారినట్టు పాండవులైదుగురూ ఆ రథంలో ప్రకాశించారు. సముద్రఘోషవలె వాద్యాలన్నీ ఒక్కసారిగా మ్రోగాయి.

విశేషం: అలం: ఉపమ. పంచాగ్నులు: 1. ఆహవనీయాగ్ని, 2. దక్షిణాగ్ని, 3. గార్హపత్యాగ్ని, 4. సభ్యాగ్ని, 5. అపసధ్యాగ్ని - ఇవి యజ్ఞవేదికి తూర్పు, దక్షిణ, పశ్చిమ, ఈశాన్య దిక్కులం దుంటాయి.

ధర్మరాజు సపరివారంబుగా గరినగరంబుఁ బ్రవేశించుట: (సం. 12-38-34)

వ. ఇట్లు నితాంతకాంతిప్రకారుండై పాండవాగ్రజుండు పాండురాజాగ్రజు నతని దేవిం బ్రభూతాందోళికారూఢులం జేసి పురస్కరించుకొని శైబ్య సుగ్రీవ మేఘపుష్పవలాహకంబు లను వాహంబులు పూనినరథంబున సాత్యకి సహితుండయి వెలుంగు వెన్ననిం బిఱింది దెసం బెట్టికొని, యతని కెలన మనోజవంబులగు హయంబులం బూన్చిన యవదాత స్యందనంబున యుయుత్సుం డరుగుదేర, నుచిత వాహనారూఢుండై విదురుండు కుంతీప్రముఖ కురుస్త్రీజనంబుల నందలంబుల నిడికొని వెనుకనడవ, నరేంద్రులు నానాముఖంబులం దమతమ సేనల తోడం గూడఁ గొలిచి చనుదెంచుచుండం జనునప్పుడు. 350

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవ+అగ్రజుండు= పాండు రాజకుమారులలో పెద్దవాడైన ధర్మరాజు; నితాంత= ఎడతెగని, అంతులేని; కాంతి ప్రకారుండు+ఐ= వెలుగుతో కూడినవాడై; పాండురాజ+అగ్రజున్= పాండురాజు అన్న అయిన ధృతరాష్ట్రుడిని; అతని దేవిన్= అతడి భార్య అయిన గాంధారిని; ప్రభూత= ఉన్నతమైన; గొప్ప; ఆందోళికా= పల్లకీని; ఆరూఢులన్= అధిరోహించిన వారినిగా; చేసి= ఒనర్చి; పురస్కరించుకొని= వారిని ముందుండేటట్లుగా చేసి; శైబ్య= శైబ్యం ; సుగ్రీవ= సుగ్రీవం; మేఘపుష్ప= మేఘపుష్పం; వలాహకంబులు= వలహకం; అను= అనే పేర్లుగల; వాహంబులు= గుర్రాలు; పూనిన= పూన్చిన; రథంబునన్= తేరుపై; సాత్యకి సహితుండు+ఐ= సాత్యకితో కూడుకొన్నవాడై; వెలుంగు= ప్రకాశించే; వెన్ననిం= శ్రీకృష్ణుడి; పిఱిందిదెసన్= వెనుకవైపు; పెట్టికొని= ఉంచుకొని; అతని= ధర్మరాజు; కెలనన్= పార్శ్వాన; మనోజవంబులు+అగు= మనసంతటి వేగంకల; హయంబులన్= గుర్రాలను; పూన్చిన= పూనిన; అవదాత= శ్రేష్ఠమైన, స్వచ్ఛమైన; స్యందనంబునన్= రథంలో; యుయుత్సుండు; అరుగు+తేరన్= వస్తుండగా; ఉచిత= తగిన; వాహన+ఆరూఢుండు+ఐ= రథాన్ని అధిరోహించినవాడై; విదురుండు; కుంతీప్రముఖ= కుంతీదేవి మొదలైన; కురుస్త్రీజనంబులన్= కౌరవస్త్రీలను; అందలంబులన్= పల్లకీలలో; ఇడికొని= ఉంచి; వెనుక నడువన్= వెనుకగా వస్తుండగా; నరేంద్రులు= రాజులు; నానా ముఖంబులన్= అన్ని వైపులనుండి; తమతమ= తమయొక్క; సేనలతోడన్= సైన్యాలతో; కూడన్= కలిసి; కొలిచి= సేవించి; చనుదెంచుచుండన్= వస్తూ ఉండగా; చను+అప్పుడు= వెళ్ళే సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు అంతులేని ప్రకాశంతో వెలిగిపోతూ ధృతరాష్ట్రుడినీ, గాంధారినీ గొప్ప పల్లకిలో కూర్చుండబెట్టి తన ముందుంచుకొని, శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకాలు అనే గుర్రాలను పూన్చిన రథంపై సాత్యకితో కలిసి శ్రీకృష్ణుడు వెనుక వస్తుండగా, ప్రక్కనే మనోవేగంతో పరుగెత్తే గుర్రాలను పూన్చిన శ్రేష్ఠమైన రథంపై యుయుత్సుడు వస్తుండగా, తనకు యోగ్యమైన వాహనాన్ని తా నధిరోహించి, కుంతీదేవి మొదలైన అంతఃపుర స్త్రీలను పల్లకీలలో ఉంచి, విదురుడు వెనుక వస్తుండగా, రాజులు అన్ని వైపుల నుండి తమ సైన్యాలతో కలిసి సేవిస్తుండగా, బయలుదేరే సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ద్విరదంబుల నరదంబులఁ । దురగంబులఁ గాల్బలములఁ దూర్యంబుల సీ
గిరులన్ గొడుగులఁ బడగలఁ । బరిస్ఫురిత మయ్యె నతని పయనంబు గడున్. 351

ప్రతిపదార్థం: అతని పయనంబు= ఆ ధర్మరాజు ప్రయాణం; ద్విరదంబులన్= ఏనుగులతో; అరదంబులన్= రథాలతో; తురగంబులన్= గుర్రాలతో; కాల్బలములన్= బంటులతో; తూర్యంబులన్ సీగిరులన్= వింజామరలతో; గొడుగులన్= ఛత్రాలతో; పడగలన్= ధ్వజాలతో; కడున్= మిక్కిలి; పరిస్ఫురితము+అయ్యెన్= ప్రకటితం అయింది.

తాత్పర్యం: ఆ విధంగా సాగుతున్న ధర్మరాజు ప్రయాణం ఏనుగులు, రథాలు, గుర్రాలు, బంటులు, వాద్యాలు,వింజామరలు, ఛత్రాలు, ధ్వజాలతో అధికంగా ప్రకటిత మయింది.

వ. మఱియును. 352

తాత్పర్యం: అంతేకాక, ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. వందిజనులుఁ బాఠకులుం ।గ్రందుకొనం బొగడఁ జదువఁగా మాగధు లా
నందముగఁ బాడ నుచితపు ।మందత్వము గమనమునకు మహిమ యొనర్పన్. 353

ప్రతిపదార్థం: వందిజనులు= భట్టులు; పాఠకులున్= వేదపాఠం చదివేవారు; క్రందుకొనన్= అతిశయించినట్లు; పొగడన్= కీర్తిస్తుండగా; చదువఁగాన్= పఠిస్తుండగా; మాగధులు= వంశకీర్తనం చేసేవారు; ఆనందముగన్= సంతోషంగా; పాడన్= పాడుతుండగా; ఉచితము+మందత్వము= తగినటువంటి నెమ్మదితనం; గమనమునకున్= నడకకు; మహిమ= గొప్పదనం; ఒనర్పన్= కూర్చగా.

తాత్పర్యం: రాజును పొగడి జీవించే వందులు కీర్తిస్తుండగా, వేదపాఠం చదివేవారు పఠిస్తుండగా, వంశచరిత్రను, ప్రతిష్ఠను కీర్తించే మాగధులు సంతోషంగా పాడుతుండగా, తగిన నెమ్మదితనం ప్రయాణానికి గొప్పతనాన్ని కూర్చగా. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. అన్నరనాథుండు నడచి నాగనగరంబు ప్రవేశించె; నంతకుమున్న యందలి జనంబులు గలువడములును దోరణంబులను గ్రముక కదళీస్తంభపూర్ణకుంభ స్థాపనంబులను కస్తూరి కలయంపులను గర్పూరపు మ్రుగ్గులను బుష్పోపహారంబులను బ్రాలంబమాలికలను నొప్పు మిగుల నప్పురం బలంకరించి, యాబాల వృద్ధంబుగాఁ బరమాంబరానులేపన మాల్య భూషణంబులం బొలిచి, బహుల ప్రమదంబున సమ్మర్దంబులగు సంచారంబులం జారుత్వవిశేషంబు వహించి రక్కురు రాజోత్తముండు రాజమార్గంబు దఱిసి చనుసమయంబున. 354

ప్రతిపదార్థం: ఆ+నరనాథుండు= ఆ రాజు; నడచి= వెడలి; నాగపురంబు= హస్తినాపురంలో; ప్రవేశించెన్= అడుగుపెట్టాడు; అంతకుమున్ను+అ= అంతకన్న ముందే; అందలి= అచటి; జనంబులు= ప్రజలు; కలువడములును= వేడుకగా ధ్వజస్థంభాలకు వేలాడగట్టిన కలువపూదండలు; తోరణంబులను= మంగళచిహ్నాలైన మామిడాకుల దండలు; క్రముక= పోక; కదళీ= అరటి; స్తంభ= బోదెలతోను; పూర్ణకుంభ స్థాపనంబులను= నిండైన కలశాలను శుభచిహ్నంగా నిలపటం; కస్తూరి కలయంపులను= కస్తూరి కలిపి చల్లిన కళ్ళాపులతోను; కర్పూరము+మ్రుగ్గులను= కర్పూరంతో వేసిన రంగవల్లికలతోను; పుష్ప+ఉపహారంబులను= పూల కానుకలతో (పుష్పగుచ్ఛాలు మొదలైనవి); ప్రాలంబ మాలికలను= బాగా వేలాడుతున్న దండలతోను; ఒప్పు+మిగులన్= అందం అతిశయించగా; ఆ+పురంబు= ఆ నగరాన్ని; అలంకరించి= సింగారించి; ఆ బాల వృద్ధంబుగాన్= పిల్లలు మొదలు పెద్దలవరకు అందరునూ; పరమ= శ్రేష్ఠమైన; అంబర= వస్త్రాలు; అనులేపన= మైపూతలు; మాల్య= పూలమాలలు; భూషణంబులన్= నగలతో; పొలిచి= చక్కనై, అలంకరించుకొని; బహుల ప్రమదంబునన్= ఎంతో సంతోషంతో; సమ్మర్దంబులు+అగు= ఒకరితో ఒకరు రాజుకుంటున్నట్లు; సంచారంబులన్= కదలికలతో (తిరుగాడుతూ); చారుత్వ విశేషంబుల= ఒప్పిదమైన అతిశయాన్ని; వహించిరి= కలిగి ఉన్నారు; ఆ+కురురాజ+ఉత్తముండు= ఆ కురువంశ రాజులలో శ్రేష్ఠుడైన ధర్మరాజు; రాజమార్గంబు= రాచబాటను; తఱిసి= సమీపించి; చను సమయంబునన్= వెళ్ళే సమయంలో.

తాత్పర్యం: ధర్మరాజు నడచి హస్తినాపురంలో ప్రవేశించాడు. అంతకన్న ముందుగా హస్తినాపురజనులు ధ్వజస్తంభాలకు కలువపూల దండలను వ్రేలాడగట్టి, మంగళతోరణాలు కట్టి, పోక అరటిబోదెలను, పూర్ణకలశాలను స్థాపించి, కస్తూరితో కళ్ళాపి చల్లి, కర్పూరపు రంగవల్లులు తీర్చి, పూలగుత్తులతోనూ, చక్కగా వ్రేలాడుతున్న పూలదండలతోను ఎంతో అందంగా ఆ నగరాన్ని అలంకరించారు. పసిపిల్లల నుండి వృద్ధులవరకు అందరూ ఎంతో శ్రేష్ఠమైన వస్త్రాలను, మై పూతలను, పూలదండలను, నగలను ధరించి చక్కదనంతో ఒప్పారుతూ ఎంతో ఆనందంగా ఒకరినొకరు

ఒరుసుకొంటూ (వీథులలో ఎడంలేని విధంగా జనులతో నిండాయని భావం.) చాలా సంబరంగా తిరుగుతున్నారు. అప్పుడు ధర్మరాజు రాచబాటను సమీపించి వెళ్ళే సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. హర్మ్యములనుండి పణ్యపుణ్యాంగనాని । కరము లక్షతయుత, మౌక్తికముల సేస
లొలుకఁ గల్పలతాచయంబులును పుష్ప । వృష్టి పెల్లుగఁ గురిసిన విధము దోఁచె. 355

ప్రతిపదార్థం: హర్మ్యములనుండి= భవనములపై నుండి; పణ్య+పుణ్య+అంగనా= వేశ్యాస్త్రీల, పుణ్యస్త్రీల; నికరములు= సముదాయాలు; అక్షతయుత= అక్షతలతో (నలగని పూలతో); కూడిన; మౌక్తికముల= ముత్యాల; సేసలు+ఒలుకన్= అక్షతలు చల్లగా; కల్పలతా= కల్పవృక్షాల; చయంబులు= గుంపులు; పుష్పవృష్టి= పూలవాన; పెల్లుగన్= అధికంగా; కురిసిన విధము= కురిసినట్లుగా; తోఁచెన్= అనిపించింది.

తాత్పర్యం: భవనాల పైనుండి వేశ్యాంగనలు, పుణ్యస్త్రీలు గుంపులుగా చేరి ముత్యాలతో కూడిన నలగని పూలు అక్షతలుగా చల్లుతుండగా కల్పవృక్షాల సముదాయం అధికంగా పూలవాన కురిపించినట్లుగా అనిపించింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అట్టియెడఁ జూడం బఱతెంచిన పౌరజానపద జనంబులు దమలోన. 356

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; చూడన్= చూడటానికి; పఱతెంచిన= వచ్చిన; పౌర= పురజనులు; జానపదజనంబులు= జానపదులు; తమలోనన్= తమలోతాము.

తాత్పర్యం: ఆ సమయంలో అక్కడికి చూడటానికి వచ్చిన నగరవాసులు, గ్రామవాసులు అయిన ప్రజలు తమలో తాము. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ‘ దిగ్విజయంబునం దేజస్వి యయ్యు న । జాతశత్రుం డనఁ జను నితండె;
రాజసూయ మహాధ్వరము సేసి విప్రులఁ । గనక రత్నాదులఁ దనిపె నితఁడె;
నిత్యవ్రతంబుగా సత్యంబు పాలించు । నిష్ఠ యస్ఖలితగా నెఱపె నితఁడె;
ధర్మైక నిరతుఁ డీతం డొక్కరుఁడ చువ్వె । యని పల్కుటకుఁ బాత్ర మయ్యె నితఁడె;

తే. బలముఁ దగవును ధర్మంబు వెలయఁ బగఱ । ననవశేషంబుగాఁ దెగటార్చె నితఁడె’
యనఁగ మఱియును వివిధ కీర్తనల హర్ష । వచనముల నుల్లసిల్లు రవంబు మిగిలె. 357

ప్రతిపదార్థం: ఇతండు+ఎ= ఇతడు మాత్రమే; దిగ్విజయంబునన్= అన్ని దిక్కులు జయించటంతో; తేజస్వి= కాంతిమంతుడు; అయ్యున్= అయి ఉండికూడ; అజాతశత్రుండు= పుట్టని శత్రువులు గలవాడు; అనన్= అనగా; చనున్= చెల్లుతున్నాడు; ఇతఁడు+ఎ= ఇతడే; రాజసూయ మహా+అధ్వరము= రాజసూయం అనే పేరున్న గొప్పయజ్ఞం; చేసి= ఒనరించి; విప్రులన్= బ్రాహ్మణులను; కనక= బంగారం; రత్న= మణులు; ఆదులన్= మొదలైన వాటితో; తనిపెన్= సంతృప్తి పరిచాడు; ఇతఁడు+ఎ= ఇతడే సుమా!; నిత్య= ఎల్లప్పుడూ; వ్రతంబు+కాన్= ఆచరించవలసిన పద్ధతిగా; సత్యంబు= సత్యవాక్యాన్ని; పాలించు= అనుసరించే; నిష్ఠ= నియమం; అస్ఖలిత+కాన్= చెక్కుచెదరకుండా; నెఱపెన్= అమలు జరిపాడు; ఇతఁడు+ఎ= ఇతడే, ఈ ధర్మరాజే; ధర్మ+ఏక+నిరతుఁడు= వేదచోదిత మార్గంలో అనన్యనిష్ఠ కలవాడు; ఈతండు= ఈ ధర్మరాజు; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; చువ్వె= సుమా!; అని పల్కుటకున్= అంటూ చెప్పటానికి; పాత్రము= అర్హుడు; అయ్యెన్= అయ్యాడు; ఇతఁడు+ఎ= ఇతడే;

బలమున్= శక్తి; తగవును= న్యాయం; ధర్మంబు= వేదోక్తవిధి నిర్వహణం; వెలయన్= ఒప్పగా; పగఱున్= శత్రువులను; అనవశేషంబు+కాన్= మిగలకుండా; తెగటార్చెన్= సంహరించాడు; అనఁగన్= అనేట్లుగా; మఱియును= ఇంకా; వివిధ కీర్తనలన్= అనేక విధాలైన పొగడ్తలతోను; హర్షవచనములన్= సంతోషంతో కూడిన మాటలతోను; ఉల్లసిల్లు= అతిశయించే; రవంబు= ధ్వని; మిగిలెన్= ఎక్కువయింది.

తాత్పర్యం: 'అన్ని దిక్కుల రాజులను జయించి కీర్తిమంతుడై కూడ 'అజాతశత్రుడు' అని ప్రసిద్ధి కెక్కింది ఇతడే. రాజసూయం అనే గొప్ప యజ్ఞం చేసి బ్రాహ్మణులను బంగారం, రత్నాలు మొదలైన వాటితో తృప్తి పరచిం దితడే. సత్యవాక్య పరిపాలనను నిరంతరం ఆచరించే నియమంపట్ల ఉన్న లగ్నత చెక్కుచెదరనీయనిది ఇతడే. ధర్మాచరణంలో అనన్యనిష్ఠ గలవా డితడొక్కడే సుమా! అని చెప్పటానికి తగిన అర్హత కలవా డితడే. శక్తి, న్యాయం, ధర్మం ఒప్పేటట్లుగా శత్రువులను నిశ్శేషంగా చంపింది ఇతడే' అంటూ, ఇంకా అనేక పొగడ్తలతోనూ, సంతోషంతో కూడిన మాటలతోనూ అధికమైన శబ్దం అతిశయించింది.

విశేషం: అజాతశత్రుడు: పుట్టని శత్రువులు కలవాడు. అంటే ధర్మరాజు ఎవరినీ తన శత్రువులుగా భావించడు. ఇతరులు ధర్మరాజును శత్రువు అనుకుంటే అనుకొనవచ్చును. అంతశ్శత్రువుల పుట్టుక తనలో లేనివాడు. దిగ్విజయం చేసికూడా అజాతశత్రువు అనే బిరుదాన్ని నిలుపుకొన్న ఘనత ధర్మరాజుకే దక్కింది.

క. లావులు వెరవులుఁ దాల్ములుఁ, జేవలు నస్ఖలితములుగఁ జెల్లు పనులు నా
నా విధములఁ బేర్కొనుచుం, బావని నరుఁ గవలఁ బొగడు పటురవ మెసఁగెన్. 358

ప్రతిపదార్థం: లావులు= బలాలు; వెరవులున్= ఉపాయాలు; తాల్ములున్= ఓర్పులూ; చేవలున్= సామర్థ్యాలూ; అస్ఖలితములుగన్= జారనివిగా (చెక్కుచెదరక); చెల్లు= నడిచే; పనులు= కార్యాలు; నానావిధములన్= అనేక తీరులుగా; పేర్కొనుచున్= ఏకరువు పెట్టుతూ; పావనిన్= భీముడిని; నరున్= అర్జునుడిని; కవలన్= నకుల సహదేవులనూ; పొగడు= కీర్తించే; పటు= గొప్ప; రవము= ధ్వని; ఎసఁగెన్= ఎక్కువైంది.

తాత్పర్యం: బలాలు, ఉపాయాలు, ఓర్పులు, సామర్థ్యాలు ఏమాత్రం చెదరకుండ (తక్కువకాకుండా) నిర్వర్తించిన ఘనకార్యాలనన్నింటిని అనేక విధాలుగా చెప్పుకొంటూ (పౌరులు) భీమార్జున నకుల సహదేవులని పొగడుతున్న ధ్వనులు మిన్నుముట్టుతున్నాయి.

విశేషం: అలం: యథాసంఖ్యం. భీమాదులందరిలో సమష్టిగా నాలుగు గుణాలు చూస్తున్నా, ప్రత్యేకించి భీముడిలో బలం, అర్జునుడిలో ఉపాయం, నకులుడిలో ఓర్పు, సహదేవుడిలో సామర్థ్యం గమనించి ప్రజలు కీర్తించారని క్రమాలంకారం వలన గ్రహించవచ్చును.

క. 'వ్రతచర్యయు భాగ్యంబును, ధృతియు మతియు నరయ ద్రౌపదికి నెనయగు భూ
పతివల్లభాజనము లీ, క్షితిఁ గలరే' యనురవంబు సెలఁగెం గలయన్. 359

ప్రతిపదార్థం: వ్రతచర్యయున్= ఉపవాసాది పుణ్యకర్మలు, నోములు మొదలైనవి ఆచరించటం; భాగ్యంబును= అదృష్టం, పతుల అనురాగం; ధృతియున్= ధైర్యం; మతియున్= తెలివి; అరయన్= చూడగా; ద్రౌపదికిన్= ద్రౌపదితో; ఎన+అగు= సాటి అయిన; భూపతివల్లభాజనములు= రాజపత్నులు; ఈక్షితిన్= ఈ భూమిలో; కలరు+ఏ?= ఉన్నారా? (లేరని భావం); అను= అనే; రవంబు= ధ్వని; కలయన్= అంతటా; చెలఁగెన్= వ్యాపించింది.

తాత్పర్యం: 'పుణ్యకర్మలు, నోములు చేయటంలోనూ, అదృష్టం, ధైర్యం, తెలివి కలిగి ఉండటంలోనూ, రాజపత్నులెవ్వరూ ద్రౌపదికి సాటి అయినవారు ఈ భూమిలో ఉన్నారా?' (లేరు అని భావం) అనే ప్రశంసల సవ్వడి అంతటా వ్యాపించింది.

వ. ఇట్లు పెల్లయిన మ్రోఁతను దరంగితము లైన నెరవుల పెంపునఁ బురంబు చంద్రోదయ ఘూర్ణమానంబైన మహార్ణవంబు ననుకరించె; నా ధర్మరాజు రాజమందిరద్వారంబు సేరంజనియె; నప్పుడు బహువిధంబులగు శోభనద్రవ్యంబులు గరంబులంగొని భవ్యభూసురులును బుణ్యాంగనలును నెదుర్కొన, వాని నెల్లం గైకొనుచుం బ్రవేశించి యతం డేనుంగు మొగసాల నరదంబు డిగ్గి, ధౌమ్య ధృతరాష్ట్ర పురస్సరంబుగా నభ్యంతర నివాసంబు సొచ్చి, గృహదేవతలం బూజించి, మగుడ బహిరంగణ భూమికి వచ్చి, నగర దేవతా పూజలు సేయింపం దగువారలం బనిచి, బ్రాహ్మణ సంఘంబులం గానిపించుకొని, కనకంబులును గోవులు మొదలైన వివిధ వస్తువులు నొసంగె; నప్పు డాశీర్వాద నాదంబులను శంఖభేరీ ప్రముఖ మంగళ తూర్యరవంబులను రోదసి పిక్కటిల్లెఁ; దదనంతరంబ నిశ్శబ్దంబై యున్న సకల జనంబులును నజ్జనపాలు నాననం బాలోకించు చుండి; రట్టియెడ దుర్యోధన సఖుండైన చార్వాకుం డను నొక్క రక్కసుండు విప్రాకారంబు గైకొని త్రిదండి వేషం బలవడ నయ్యవనీదేవతాకోటిలో నిల్చి యన్నరనాథున కిట్లనియె. 360

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పెల్లు+అయిన= అధికమైన; మ్రోఁతను= ధ్వనితో; తరంగితములు+ఐన= ఉప్పొంగిన; నెరవుల= మార్గాల; పెంపునన్= ఆధిక్యంతో; పురంబు= నగరం; చంద్ర+ఉదయ= చంద్రోదయ సమయంలో; ఘూర్ణమానంబు+ఐన= ఎగసిపడుతున్న; మహా+అర్ణవంబును= గొప్ప సముద్రాన్ని; అనుకరించెను= పోలి ఉన్నది; ఆ ధర్మరాజు; రాజమందిర ద్వారంబు= రాజప్రాసాదపు వాకిలిని; చేరన్+చనియెన్= సమీపించపోయాడు; అప్పుడు= ఆ సమయంలో; బహువిధంబులు+అగు= వివిధ ప్రకారాలైన; శోభనద్రవ్యంబులు= మంగళ ద్రవ్యాలు; కరంబులన్= చేతులలో; కొని= పట్టుకొని; భవ్యభూసురులును= శుభప్రదులైన బ్రాహ్మణులు; పుణ్య+అంగనలునున్= పుణ్యస్త్రీలు, ముత్తైదువలు; ఎదుర్కొనన్= ఎదురురాగా; వానిన్+ఎల్లన్= వాటినన్నింటిని; కైకొనుచున్= గ్రహిస్తూ; ప్రవేశించి= అడుగిడి; ఏనుంగు= పెద్దదైన; మొగసాలన్= ముఖశాలలో; అరదంబు= రథం; డిగ్గి= దిగి; ధౌమ్య= ధౌమ్యుడు; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రుడు; పురస్సరంబు+కాన్= ముందు నడుస్తుండగా; అభి+అంతర, నివాసంబు= అంతఃపురం; చొచ్చి= ప్రవేశించి; గృహదేవతలన్= తమ ఇంటి దైవాలను (కులదైవాలను); పూజించి= అర్చించి; మగుడన్= తిరిగి; మరల; బహిః+అంగణ భూమికిన్= ముంగిలికి వెలుపల ఉన్న ప్రదేశానికి; వచ్చి= చేరి; నగరదేవతా= నగరాధిదేవత; పూజలు= అర్చనలు; చేయింపన్= నిర్వర్తించటానికి; తగువారలన్= తగినవారిని; పనిచి= పంపి; బ్రాహ్మణ సంఘంబులన్= విప్రగణాలను; కానిపించుకొని= దర్శించుకొని; కనకంబులును= బంగారాలు; గోవులు= ఆవులు; మొదలు+ఐన= ఆదిగా; వివిధ+ అనేకమైన; వస్తువులున్= సంభారాలను; ఒసంగెన్= ఇచ్చాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆశీర్వాదనాదంబులను= ఆశీర్వచనాలతోనూ; శంఖ= శంఖాలు; భేరీ= దుందుభులు; ప్రముఖ= మొదలైన; మంగళ= శుభప్రదమైన; తూర్య= వాద్యాల; రవంబులను= ధ్వనులతో; రోదసి= అంతరిక్షం; పిక్కటిల్లెన్= పూర్తిగా నిండిపోయింది; తద్= ఆ; అనంతరంబు+అ= తర్వాత; నిశ్శబ్దంబు+ఐ= శబ్దం లేనిదై; ఉన్నన్= ఉండగా; సకల= సమస్తమైన; జనంబులునున్= ప్రజలు; ఆ+జనపాలున్= ఆ రాజుయొక్క; ఆననంబు= ముఖం; ఆలోకించుచున్+ఉండిరి= చూస్తూ ఉండిపోయారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; దుర్యోధన సఖుండు= దుర్యోధనుడి మిత్రుడైన; చార్వాకుండు+అను= చార్వాకుడు అనే; ఒక్కరక్కసుండు= ఒక రాక్షసుడు; విప్ర+ఆకారంబున్= బ్రాహ్మణరూపం; కైకొని= గ్రహించి; త్రిదండి= సన్యాసి; వేషం= అలంకారం; అలవడన్= ధరించి; ఆ+అవనీదేవతాకోటిలోన్= బ్రాహ్మణ సముదాయంలో; నిల్చి= ఉండి; ఆ+నరనాథునకున్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అత్యధికమైన ధ్వనులతో ఉప్పొంగిన బాటల అతిశయంతో ఆ నగరం చంద్రోదయ సమయంలో ఎగసిపడుతున్న మహాసముద్రం వలె ఉన్నది. అప్పు డా ధర్మరాజు రాజప్రాసాదాల వాకిలి సమీపించాడు. ఆ సమయంలో ఎన్నో రకాల మంగళద్రవ్యాలు చేతులలో ధరించి శుభప్రదులైన బ్రాహ్మణులు, పుణ్యస్త్రీలు ఎదురు రాగా ఆ మంగళద్రవ్యాల నన్నింటినీ గ్రహిస్తూ నగరులో ప్రవేశించి, చాల పెద్దదైన ముఖశాల (గజశాల) వద్ద

రథం దిగి, ధౌమ్యుడు, ధృతరాష్ట్రుడు ముందు నడుస్తుండగా అంతఃపురం ప్రవేశించి, తమ ఇలవేల్పులను అర్చించి, తిరిగి వెలుపలి ప్రదేశానికి వచ్చి, నగర దేవత పూజలు చేయించటానికి అర్హులైనవారిని ఏర్పాటు చేయించి, బ్రాహ్మణులను దర్శించుకొని, వారికి బంగారం, గోవులు మొదలైన అనేక సంభారాలు దానం చేశాడు. అప్పుడు ఆ బ్రాహ్మణులు చేసిన ఆశీస్సుల ధ్వనులతోనూ, శంఖం భేరీ మొదలైన మంగళ వాద్యాల ఘోషతోనూ ఆకాశం మారుమ్రోగింది. ఆ తరువాత జనులంతా శబ్దం చేయకుండా ధర్మరాజు ముఖం చూస్తూ ఉండిపోయారు. అటువంటి సమయంలో దుర్యోధనుడి మిత్రుడైన చార్వాకుడు అనే పేరుగల రాక్షసు డొకడు బ్రాహ్మణరూపం ధరించి సన్న్యాసి వేషం వేసికొని, బ్రాహ్మణసమూహంలో నిలబడి ఆ రాజుతో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమ. త్రిదండి= మనోదండం, వాగ్దండం, కర్మదండం అనే మూడు దండాలు ఉన్నవాడు సన్న్యాసి.

చార్వాకుం డను రాక్షసుఁడు బ్రాహ్మణ నిగ్రహంబునఁ జచ్చుట (సం. 12-39-22)

చ. ' వినుము నరేంద్ర! సర్వమగు విప్రజనంబును గూడి నన్నుఁ బం
చిన విధ 'మీతఁ డేటిపతి? సేసిన పాపము పెద్ద; చంపుచో
జనకుఁడు భ్రాత పుత్రుఁడను శంక యొకించుక లేదు; సద్గురుం
డనియెడి కొంకు బుద్ధి నిసుమంతయుఁ బుట్టదు; వీనిఁ గాల్పనే!' 361

ప్రతిపదార్థం: నరేంద్ర!= రాజా!; సర్వము+అగు= సమస్తమైన; విప్రజనంబును= బ్రాహ్మణసమూహం; కూడి= కలిసి; నన్నున్= నన్ను; పంచిన= పంపిన; విధము= పద్ధతి, కారణం; వినుము= ఆలకించుము; ఈతఁడు= ఈ ధర్మరాజు; ఏటి పతి?= ఎటువంటి రాజు?; చేసిన పాపము= ఆచరించిన దుష్కృత్యం; పెద్ద= ఘనం; చంపుచోన్= చంపే సమయంలో; జనకుఁడు= తండ్రి; భ్రాత= సోదరుడు; పుత్రుఁడు= కుమారుడు; అను= అనే; శంక= అనుమానం, సందేహం; ఒక+ఇంచుక= కొద్దిగా కూడ; లేదు= లేకపోయింది; సత్+గురుండు= మంచిగురువు; అనియెడి= అనే; కొంకు= భయం; బుద్ధిన్= మనసులో; ఇసుమంతయున్= అతి స్వల్పంగా కూడ; పుట్టదు= కలగలేదు; వీనిన్= ఈ ధర్మరాజును; కాల్పను+ఏ?= తగులబెట్టాలా? (ఏం చేసినా తప్పులేదు నిష్ప్రయోజనం అనే భావం ప్రకటించటానికి వాడే ప్రయోగం).

తాత్పర్యం: 'ధర్మరాజా! బ్రాహ్మణులంతా కలిసి నన్ను పంపిన కారణం వినుము. ఘనమైన పాపం చేసిన ఇతడేం రాజు? చంపే సమయంలో తండ్రి, సోదరుడు, కొడుకు అని కూడ సందేహించలేదు. విద్య నేర్పిన గురువని మనసులో కొంచెం కూడ భయపడలేదు. వీడిని తగలపెట్టినా తప్పులేదు కదా!'

వ. అను మని రని పలికి వెండియు. 362

ప్రతిపదార్థం: అనుము= అనవలసినది; అనిరి; అని= అన్నారని; పలికి= మాట్లాడి; వెండియున్= తిరిగి, ఇంకా.

తాత్పర్యం: అనుమని అన్నారు' అని చెప్పి ఇంకా - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. ' ఇట్లు శిష్టజనము లేవగింపఁగఁ జేయు । రాజ్య మేల బంధురాజి నెల్లఁ
బొలియఁజేసి యెట్టి భోగంబు లనుభవిం । చెదవు? కల్మషంబు చిక్కె నీకు. 363

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; శిష్టజనములు= సజ్జనులు; ఏవగింపఁగన్= అసహ్యించుకుంటూ ఉండగా; చేయు= చేసే; రాజ్యము+ఏల?= రాజ్యపాలన ఎందుకు?; బంధు= చుట్టాల; రాజిన్= సమూహాన్ని; ఎల్లన్= అంతటినీ; పొలియన్+చేసి= చంపి; ఎట్టి= ఎటువంటి; భోగంబులు= సుఖాలు; అనుభవించెదవు?= అనుభవిస్తావు?; నీకు; కల్మషంబు= పాపం; చిక్కెన్= కలిగింది.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఈ విధంగా సజ్జనులు అంతా అసహ్యించుకొంటూ ఉండగా రాజ్యం చెయ్యటం ఎందుకు? బంధువుల నందరినీ చంపి నీవు ఎటువంటి భోగాలు అనుభవిస్తావు? నీకు పాపం కలిగింది.'

వ. అనిన విని యవ్విప్రు లత్యంత వ్యథితాంతఃకరణు లగుచు నొండొరుల మొగంబులు సూచి 'యిట్లు వుట్టం బని యేమి?' యను వచంబులతోఁ దిరుగుడు వడిరి; ధర్మనందనుండు లజ్జావనత వదనుండై యూరకుండి, వారలవలను గనుంగొని కేలు మొగిచి ఫాలభాగంబునఁ గదియించి యిట్లనియె. 364

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+విప్రులు= ఆ బ్రాహ్మణులు; అతి+అంత= మిక్కిలి; వ్యథిత= బాధపడిన; అంతఃకరణులు= మనస్సు కలవారు; అగుచున్= ఔతూ; ఒండొరుల= పరస్పరం; మొగంబులు= ముఖాలు; చూచి= ఆలోకించి; ఇట్లు= ఇటువంటిది; పుట్టన్= కలగటానికి; పని+ఏమి?= కారణం ఏమిటి?; అను= అనే; వచనంబులతోన్= మాటలతో; తిరుగుడు+పడిరి= కల్లోల పడ్డారు; ధర్మనందనుండు= ధర్మరాజు; లజ్జ= సిగ్గుచేత; అవనత= క్రిందికి దించిన; వదనుండు+ఐ= ముఖం కలవాడై; ఊరక+ఉండి= మిన్నకుండి; వారల= వారి; వలను= దిక్కు, వైపు; కనుంగొని= చూచి; కేలు మొగిచి= చేతులు జోడించి; ఫాలభాగంబునన్= నుదుట; కదియించి= కీలించి, ఉంచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ చార్వాకుడు అన్నమాటలు విని అక్కడ ఉన్న బ్రాహ్మణులంతా మనస్సులలో ఎంతో బాధపడినవారై ఒకరి మొగం ఒకరు చూచుకొంటూ 'ఇటువంటి మాట రావటానికి కారణం ఏమిటి?' అని అనుకొంటూ కల్లోలపడ్డారు. ధర్మరాజు సిగ్గుతో తలవంచుకొని, వారివంక చూచి, చేతులు జోడించి నుదుట ఉంచి, ఇట్లా అన్నాడు:

తే. 'మ్రొక్కి వేఁడెద ననుఁ మీరు ధిక్కరింప । కాదరింపుఁడు; మునిసమూహానుమతుఁడ
నై వినిశ్చియ పరికలితాంతరంగ । వర్తనముతోడ నిచటికి వచ్చినాఁడ.' 365

ప్రతిపదార్థం: (మీకు) మ్రొక్కి= నమస్కరించి; వేఁడెదన్= ప్రార్థిస్తున్నాను; నను= నన్నున్; మీరు; ధిక్కరింపక= ఎదిరించక, వ్యతిరేకించకుండా; ఆదరింపుఁడు= మన్నించండి; ముని సమూహ= మునుల సముదాయంచేత; అనుమతుఁడను+ఐ= ఆజ్ఞపొందినవాడినై; వినిశ్చయ= గట్టి నిర్ణయంతో; పరికలిత= బాగా కూడుకొన్న; అంతరంగ వర్తనముతోడన్= మనః ప్రవృత్తితో; ఇచటికిన్= ఇక్కడికి; వచ్చినాఁడన్= వచ్చాను.

తాత్పర్యం: 'మీకు నమస్కరించి ప్రార్థిస్తున్నాను. నన్ను కాదనక మన్నించండి, మునులందరిచేత ఆజ్ఞాపించబడి, దృఢమైన నిర్ణయంతో కూడుకొన్న మనఃప్రవృత్తితో ఇక్కడికి వచ్చాను'.

వ. అనవుడు భయ సంభ్రమ భరితు లగుచు నా భూసురులు 'దేవా! యీ వాక్యంబులు మావలనం బుట్టినవి గా' విది యేమియో కాని, నీ వుత్తమ క్షత్రధర్మంబున సముపార్జించిన యుజ్జ్వలశ్రీ సుస్థిరతం బొందెడు' మని యతనికి నాశ్వాసం బొనర్చి, యమ్మాయాభిక్షువు నాలోకించి, పరమబోధనంబున నప్పురుషాధము నెటింగి, యమ్మహీపతితో 'వీఁడు దుర్యోధన సఖుం డగు రాక్షసుండు సన్యాసి వేషంబున నేతెంచి యతనికి హితం బాచరించువాఁడై యీ దుర్వచనంబు లాడె; నీ కుక్కమొఱఁగిన యంతన పాలమున్నీరుం బోని నీకుం గలంగ నేల? ధర్మాత్ములగు తమ్ములు పనుపు సేయం బూజ్యంబగు సామ్రాజ్యంబు వహింపు'మని యాదరించి. 366

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; భయ= బెదరు; సంభ్రమ= తడబాటు; భరితులు= నిండుగా కలిగినవారు; అగుచున్= అవుతూ; ఆ భూసురులు= ఆ బ్రాహ్మణులు; దేవా!= ప్రభూ!; ఈ వాక్యంబులు= ఈ మాటలు; మావలనన్= మా నుండి; పుట్టినవి కావు= పుట్టలేదు; ఇది= ఈ మాటలు పుట్టటం; ఏమి+ఓ+కాని= ఏమైనా అవనీ (పట్టించుకొనవద్దని భావం); నీవు; ఉత్తమ= గొప్ప;

క్షత+ధర్మంబునన్= రాజోచితమైన పద్ధతిలో; సముపార్జించిన= సంపాదించిన; ఉజ్జ్వలశ్రీ= ప్రకాశించే సంపద (రాజ్యం, కీర్తి మొదలైనవన్నీ); సుస్థిరతన్= శాశ్వతత్వాన్ని; పొందెడున్+అని= పొందుదువుగాక!; (ఎడుతల ద్రుతంబున కచ్చు పరంగునపుడు మకారంబగు. అయ్యెడున్+అని= అయ్యెడుమని, కావుతన్+అని= కావుతమని); అని= అని పలికి; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఆశ్వాసంబు= సాంత్వనం; ఒనర్చి= కలిగించి; ఆ+మాయాభిక్షువున్= ఆ కపట సన్న్యాసిని; ఆలోకించి= చూచి; పరమబోధంబునన్= దివ్యమైన జ్ఞానంతో (దివ్యదృష్టితో); ఆ+పురుష+అధమున్= మనవులలో నీచుడిని; ఎఱింగి= గుర్తించి; ఆ+మహీపతితోన్= ఆ ధర్మరాజుతో; వీఁడు= ఈ మాయావి; దుర్యోధన సఖుండు+అగు= దుర్యోధనుడి మిత్రుడైన; రాక్షసుండు= రక్కసి; సన్న్యాసివేషంబునన్= యతి వేషంలో; ఏతెంచి= వచ్చి; అతనికిన్= దుర్యోధనుడికి; హితంబు= మేలు; ఆచరించువాఁడు+ఐ= చేసేవాడై; ఈ దుర్వచనంబులు= ఈ చెడు మాటలు; ఆడెన్= పలికాడు; ఈ కుక్క= ఈ నీచుడు; మొఱఁగిన+అంతన= అరచినంత మాత్రాన; పాలమున్నీరున్+పోలు= పాలసముద్రంవంటి; నీకున్= నీకు; కలంగన్= బాధ పడటం; ఏల?= ఎందుకు?; ధర్మ+ఆత్ములు= ధర్మబుద్ధికలవారు; అగు= అయిన; తమ్ములు= అనుజులు; పనుపు= నీ ఆజ్ఞను; చేయన్= అమలు జరుపుతూ ఉండగా; పూజ్యంబు+అగు= పవిత్రమైన; సామ్రాజ్యంబు= రాజ్యభారాన్ని; వహింపుము= నిర్వహించుము; అని= అని పలికి; ఆదరించి= మన్నించి.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా పలుకగా బ్రాహ్మణులు భయంతో కంగారుగా 'ప్రభూ! ఈ మాటలు మా నుండి రాలేదు. అవి ఏమైనా కానిమ్ము (పాటించవద్దని భావం), నీవు శ్రేష్ఠమైన రాజోచిత మార్గంలో సంపాదించిన ప్రకాశించే సంపదను అంటే రాజ్యం కీర్తి మొదలైనవన్నీ కలకాలం నిలిచి ఉంటాయి' అని ధర్మరాజుతో సాంత్వన వచనాలు పలికారు. ఆ కపటయతిని చూచి, దివ్యదృష్టితో ఆ నీచుడిని గుర్తించి, ధర్మరాజుతో ఈ విధంగా పలికారు. 'వీడు దుర్యోధనుడి స్నేహితుడైన ఒక రాక్షసుడు. దుర్యోధనుడికి మేలు చేయా లని ఈ చెడుమాటలు పలికాడు. ఈ నీచుడు కుక్కవలె మొరిగినంత మాత్రాన పాలసముద్రంవలె స్వచ్ఛంగా ఉన్న నీవు బాధపడలసిన పని లేదు. ధర్మమార్గంలో నడిచే నీ తమ్ములు నీ ఆజ్ఞను అమలు జరుపుతుండగా, పవిత్రమైన రాజ్యభారం వహించుము' అని ఆదరించారు.

క. ఆ రాక్షసుఁ గనుఁగొని కో । పారంజిత నేత్రు లగుచు నవ్విప్రులు హుం
కార ముఖరు లగుటయు, నతి । ఘోరాకృతితోడ వాఁడు గూలెం బుడమిన్. 367

ప్రతిపదార్థం: ఆ రాక్షసున్= ఆ చార్వాకుడిని; కనుఁగొని= చూచి; కోప= కోపంతో; ఆరంజిత= బాగా ఎర్రబడిన; నేత్రులు+అగుచున్= కన్నులు కలవారై; ఆ+విప్రులు= ఆ బ్రాహ్మణులు; హుంకారముఖరులు= హుం అనే ధ్వనిచేస్తున్న నోరు కలవారు; అగుటయున్= కావటంతో; అతిఘోర+ఆకృతితోడన్= మిక్కిలి భయంకరమైన రూపంతో; వాఁడు= ఆ రక్కసి; పుడమిన్= భూమిపై; కూలెన్= పడ్డాడు.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణులు చార్వాకుడిని చూచి కోపంతో కన్నులు ఎర్రబడగా, హుంకారంచేయటంతో వాడు భయంకరమైన రూపంతో నేల కూలాడు.

తే. బ్రహ్మతేజో నిహతి నిట్లుపడి మహేశ । నిప్రహతి పాతితోర్విజనిభత నొంది
యున్న యద్దానవునిఁ జూచి యన్నరేంద్రుఁ । డెలమి సొంపు వహించెఁ దమ్ములును దాను. 368

ప్రతిపదార్థం: బ్రహ్మ= బ్రాహ్మణ; తేజోనిహతిన్= తేజస్సువలన చంపబడి; ఇట్లు= ఈ విధంగా; పడి= నేలకూలి; మహా+అశని= గొప్ప పిడుగుయొక్క; ప్రహతిన్= దెబ్బచేత; పాతిత= పడగొట్టబడిన (నేలకూలిన); ఉర్వీజ= చెట్టు; నిభతన్= పోలికను; పొంది= కలిగి; ఉన్న= ఉండిన; ఆ+దానవునిన్= ఆ రాక్షసుడిని; చూచి= కని; ఆ+నర+ఇంద్రుఁడు= ఆ రాజశ్రేష్ఠుడు; తాను= తను; తమ్ములును= సోదరులూ; ఎలమి= వికాసం; సొంపు= సంతోషం; వహించెన్= పొందాడు.

తాత్పర్యం: బ్రాహ్మణుల తేజస్సువలన చంపబడి నేలకూలి, పెద్దపిడుగుపాటుతో నేలకూలిన వృక్షంవలె ఉన్న ఆ రాక్షసుడిని చూచి ధర్మరాజు తమ్ములతో కూడి వికాసాన్నీ, సంతోషాన్నీ పొందాడు.

వ. ఇట్లు ప్రీతుండై యజాతశత్రుం డవ్విప్రసమూహంబునకు సవిశేషార్చనం బొనర్చి వీడుకొలిపె; నప్పు డచ్యుతుండు బ్రాహ్మణస్తుతి సేసి యజ్జనపతితో నిట్లనుఁ; 'కృతయుగంబునం జార్వాకుం డనుదైత్యుండు తపం బొనరించి పద్మభవుండు ప్రత్యక్షంబయిన నఖిల భూతంబుల వలనను నభయంబు వేఁడిన నద్దేవుండు భూదేవతల కనిష్టంబులైన పనులు సేయకుండు వాఁడవు; చేసితేని యదియ నీకుఁ దుది యని' పలికి యవ్వరం బొసంగె నట్లు లబ్ధవరుండై వాఁడు గర్వించి గీర్వాణుల బాధింపం దొడంగిన, వారు విరించిం గాంచి యా రక్కసుండు సేయు బాధలు సెప్పిన, 'నమ్మహాత్ముం డేను మున్న యెఱింగి యొనర్చినవాఁడు దుర్యోధనుం డను రాజునకు నెచ్చెలియై యచ్చపలుండు తత్కార్యం బాదరింపఁజొచ్చి మహీసురులకు మనోవ్యథాకరంబగు కర్మంబు సేయు; నప్పనికారణంబుగా వారల కోపంబునం గూలం గలవాఁ డని పలికె; నద్దానవుండు నేఁ డిట వచ్చి తన దుర్వినయంబున బ్రహ్మదండ నిహతుండై పడియున్నవాఁ'డని చెప్పి, యప్పీనుంగు వెడలవైపించి, యా భూపాలు నుద్దేశించి వెండియు. 369

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; అజాతశత్రుండు= ధర్మరాజు; ఆ+విప్ర సమూహంబునకున్= ఆ బ్రాహ్మణుల సముదాయానికి; సవిశేష= ప్రత్యేకమైన; అర్చనంబు= పూజ; ఒనర్చి= చేసి; వీడుకొలిపెన్= సెలవుతీసికొని పంపించాడు; అప్పుడు= ఆ సమయంలో; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; బ్రాహ్మణ= బ్రాహ్మణులను; స్తుతి+చేసి= కీర్తించి; ఆ+జనపతితోన్= ఆ రాజుతో (ధర్మరాజుతో); ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; కృతయుగంబునన్= కృతయుగంలో; చార్వాకుండు= చార్వాకుడనే పేరుగల; దైత్యుండు= రాక్షసుడు; తపంబు= తపస్సు; ఒనరించి= చేసి; పద్మభవుండు= బ్రహ్మ; ప్రత్యక్షంబు+అయినన్= దర్శన మీయగా; అఖిల= సమస్తమైన; భూతంబుల వలననున్= ప్రాణులనుండి; అభయంబు= భయంలేకపోవటాన్ని; వేఁడినన్= ప్రార్థించగా; ఆ+దేవుండు= ఆ దేవతా ముఖ్యుడు; భూ దేవతలకున్= బ్రాహ్మణులకు; అనిష్టంబులు+ఐన= ఇష్టంకాని, కష్టం కలిగించే; పనులు= చేతలు; చేయక+ఉండువాఁడవు= చేయకుండా ఉండుము; చేసితి(వి)+ఏని= చేసినట్లైతే; అది+అ= అదే; నీకున్+తుది= నీకు చివర (అంతం); అని= అంటూ; పలికి= చెప్పి; ఆ+వరంబు= అత డడిగిన వరం; ఒసంగెన్= ఇచ్చాడు; అట్లు= ఆ విధంగా; లబ్ధవరుండు+ఐ= వరం పొందినవాడై; వాఁడు= ఆ చార్వాకుడు; గర్వించి= అహంకరించి; గీర్వాణులన్= దేవతలను; బాధింపన్= కష్టపెట్టటం; తొడంగినన్= ప్రారంభించగా; వారు= ఆ దేవతలు; విరించిన్= బ్రహ్మను; కాంచి= దర్శించుకొని; ఆ రక్కసుండు= ఆ రాక్షసుడు; చేయు= చేసే, పెట్టే; బాధలు= కష్టాలు; చెప్పినన్= చెప్పగా; ఆ+మహా+ఆత్ముండు= ఆ మహానుభావుడు; ఏను= నేను; మున్ను+అ= ముందే; ఎఱింగి= తెలిసి; ఒనర్చినవాఁడన్= చేశాను; దుర్యోధనుండు+అను= దుర్యోధనుడనే పేరుగల; రాజునకున్= రాజునకు; నెఱ+చెలి= మంచి మిత్రుడు; ఐ= అయి; ఆ+చపలుండు= ఆ స్థిరబుద్ధిలేనివాడు; తద్+కార్యంబు= అతడి పని; ఆచరింపన్+చొచ్చి= చేయటం మొదలుపెట్టి; మహీసురులకున్= బ్రాహ్మణులకు; మనోవ్యథాకరంబు= మనస్సుకు బాధకలిగేది; అగు= అయిన; కర్మంబు= పని; చేయున్= చేస్తాడు; ఆ+పని= ఆ చేష్ట; కారణంబుగాన్= నిమిత్తంగా; వారలకోపంబునన్= వారి కోపంతో; కూలన్+కలవాఁడు= చనిపోగలడు; అని పలికెన్= అని చెప్పాడు; ఆ+దానవుండు= ఆ రాక్షసుడు; నేఁడు= ఈ రోజు; ఇట= ఇక్కడికి; వచ్చి= అరుదెంచి; తన= తన యొక్క; దున్+వినయంబునన్= అవినీతితో; బ్రహ్మదండ= బ్రాహ్మణుల దండన చేత; నిహతుండు+ఐ= చంపబడిన వాడై; పడి+ఉన్నవాఁడు= నేలకూలాడు; అని+చెప్పి= అంటూ తెలియచేసి; ఆ+పీనుంగున్= ఆ శవాన్ని; వెడల= దూరంగా; వైపించి= వేయించి; ఆ భూపాలున్= ఆ రాజును; ఉద్దేశించి= లక్షించి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఈ విధంగా సంతోషించిన ధర్మరాజు ఆ బ్రాహ్మణ సమూహానికి విశేషమైన పూజలు చేసి వీడ్కోలు పలికాడు, అప్పుడు శ్రీకృష్ణుడు బ్రాహ్మణులను కీర్తించి, ధర్మరాజుతో ఈ విధంగా పలికాడు. 'కృతయుగంలో చార్వాకుడనే పేరున్న రాక్షసుడు తపస్సుచేసి బ్రహ్మను ప్రత్యక్షంచేసికొని తనకు సమస్తప్రాణుల వలన భయంలేకుండా ఉండేటట్లు వరం కోరాడు. బ్రాహ్మణులకు అనిష్టమైన పనులు చేయకుండా ఉండుము. అట్లా చేస్తే అదే నీకు ఆఖరు (ఆపై నీవుండవు). అని చెప్పి అతడు కోరిన వరం ప్రసాదించాడు. వాడు ఆ విధంగా

వరం పొంది అహంకరించి దేవతలను బాధించటం మొదలు పెట్టాడు. దేవతలు బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ఆ రాక్షసుడు పెట్టే బాధలు చెప్పారు. ఆ మహానుభావుడు 'నే నీ సంగతి ముందే తెలిసికొని తగినట్లుగా ఏర్పాటు చేశాను. దుర్యోధనుడనే రాజుకు మిత్రుడై ఆ బుద్ధిస్థిరతలేని చార్వాకుడు ఆ దుర్యోధనుడి పని చేయాలనుకొని బ్రాహ్మణులకు బాధ కలిగించే పని చేస్తాడు. ఆ చార్వాకుడు ఈ రోజు ఇక్కడికి వచ్చి తన వినయరాహిత్యంవలన బ్రాహ్మణుల దండనచేత చంపబడ్డాడు' ఆ శవాన్ని బయటపారవేయుమని చెప్పి ధర్మరాజుతో ఇంకా ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. ' మాఱుకొన్నవారి నీఱు సేయుము; ప్రజ । నరసి మనుపు; ధరణిసురులఁ బ్రోవు;
మఖిల బంధుజనుల నాశ్రితులను సుఖ । వృత్తి మనుపు పెంపు వెలయ నధిప! 370

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; మాఱుకొన్నవారిన్= ఎదిరించినవారిని; నీఱు= బూడిద; చేయుము= కావించుము; ప్రజన్= పౌరులను; అరసి= విచారించి (కనుగొని); మనుపు= కాపాడుము; ధరణి సురులన్= బ్రాహ్మణులను; ప్రోవుము= కాపాడుము; పెంపు= ఆధిక్యం, గొప్పతనం; వెలయన్= ఒప్పగా; అఖిల= సమస్తమైన; బంధుజనులన్= చుట్టాలను; ఆశ్రితులను= శరణు జొచ్చినవారిని; సుఖవృత్తిన్= సుఖంగా ఉండేటట్లు; మనుపు= కాపాడుము.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఎదిరించిన వాళ్ళను మసిచేయుము. ప్రజల కష్టసుఖాలు విచారించి రక్షించుము. నీ గొప్పతనం ప్రకటమయ్యే విధంగా బంధువులను, ఆశ్రయించుకొన్నవారిని సుఖంగా ఉండేటట్లు కాపాడుము.

వ. రాజ్యాభిషేక శోభనం బనుభవింపు' మని పలికి, యాభిషేచనిక ద్రవ్యానయనంబునకుం దగువారిం బనిచి బయలి పెద్దకొలువుకూటంబున నమ్మహీపతికి మహోన్నత హేమమయ సింహాసనంబు పెట్టించి, వెలయువారలకెల్ల సముచిత సమంచిత పీఠంబులుపచరింప నియోగించిన, నప్పాండవాగ్రజుం డుల్లంబు కలంక యెల్ల డిగ్గఁద్రావి, యిచ్చం దెలివొంది, చెలువొందు నిజపీఠంబునం బూర్వాభిముఖుండై కూర్చుండె; నతని కట్టెదురం గనత్కాంచ నాసనంబున సాత్యకి సమేతంబుగా శౌరియు, వలపటను దాపటను మణిపీఠంబుల వడముడియుఁ గవ్వడియును, వెనుకం గనకాయుత కుబ్జాసనంబులం గవల నిరువంకల నునిచికొని కుంతీమహాదేవియు దామోదరుని దక్షిణ దిక్కున నర్చిస్సముజ్జ్వలం బగు నాసనంబున ధృతరాష్ట్రుండును దదీయ ప్రాక్ప్రదేశంబునం బ్రస్ఫురిత పీఠంబుల విదురుండునుధౌమ్యుండును, ధృతరాష్ట్రుని పిఱుంద నర్ఘపీఠంబుల గాంధారీ యుయుత్సు సంజయులునుం గూర్చుండి; రా సమయంబున నంబుజాక్షుండు కృపావిశేషంబునఁ గృపాచార్యుం దగుతెఱంగున నయ్యజాతశత్రుం గానిపించి యోగ్యాసనంబున ధౌమ్యు సమీపంబున నతని నునిచె; నంత నప్పుడమిఱేఁడు సిత కుసుమాక్షత కాంచన రజత రత్న గర్భాస్పర్శనం బాచరించెఁ; దదనంతరంబ. 371

ప్రతిపదార్థం: రాజ్య+అభిషేక= పట్టాభిషేకం అనే; శోభనంబు= వైభవం; అనుభవింపుము= పొందుము; అని+పలికి= అంటూ చెప్పి; ఆభిషేక సంబంధమైన; ద్రవ్య= సంభారాల; ఆనయనంబునకున్= తీసికొనిరావటానికి; తగువారిన్= అర్హులైన వారిని; పనిచి= పంపి; బయలి= ఆరుబయట; పెద్ద= విశాలమైన; కొలువు కూటంబునన్= సభాస్థలియందు; ఆ+మహీపతికిన్= ఆ రాజుకు (ధర్మరాజుకు); మహా= ఘనమైన; ఉన్నత= ఎత్తైన; హేమమయ= బంగారంతో చేయబడిన; సింహాసనంబు= సింహపు ముఖం ఉన్న ఎత్తైన బంగారు ఆసనం, రాజోచితమైనది; పెట్టించి= ఏర్పరచి; వలయువారలకున్= అయినవారికి, ఆప్తులకు; ఎల్లన్= అందరికీ; సముచిత= బాగా తగిన; సమంచిత= గొప్పవైన; పీఠంబులు= ఆసనాలు; ఉపచరింపన్= సన్మానించటానికి, సేవించటానికి;

నియోగించినన్= ఏర్పాటుచేయగా; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; ఉల్లంబు కలంక= మనస్సులోని బాధ; ఎల్లన్= అంతటినీ; డిగ్గన్+త్రావి= దిగమ్రింగి; ఇచ్చన్= కోరికతో, సంకల్పంతో; తెలివి+ఒంది= ఎఱుక కలిగి; చెలువు+ఒందు= అందగించే; నిజ= తన; పీఠంబునన్= సింహాసనం మీద; పూర్వ+అభిముఖుండు+ఐ= తూర్పుదిక్కుగా ముఖం కలవాడై; కూర్చుండెన్= అధివసించి ఉన్నాడు; అతని= ఆ ధర్మరాజు; కడు+ఎదురన్= ఎట్టఎదురుగా; కనత్= ప్రకాశించే; కాంచన= బంగారు; ఆసనంబునన్= పీఠంమీద; సాత్యకి సమేతంబుగాన్= సాత్యకితో కూడుకొన్నవాడై శౌరియున్= కృష్ణుడును; వలపటను= కుడిప్రక్కన; దాపటను= ఎడమప్రక్కన; మణిపీఠంబులన్= రత్నమయ ఆసనాలపై; వడముడియున్= భీముడూ; కవ్వడియును= అర్జునుడు; వెనుకన్= వెనుక ప్రక్కగా, కనక+ఆయత+కుబ్జ= బంగారపు విశాలమైన పొట్టిది అయిన; ఆసనంబులన్= పీఠాలమీద; కవలన్= నకుల సహదేవులను; ఇరువంకలన్= రెండువైపులా; ఉనిచికొని= కూర్చుండబెట్టుకొని; కుంతీమహాదేవియున్= కుంతీదేవి; దామోదరు= కృష్ణుడు; దక్షిణ దిక్కునన్= కుడిప్రక్క; అర్చిస్= కాంతులతో; సముజ్జ్వలంబు= బాగా ప్రకాశించే; ఆసనంబునన్= పీఠంపై ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడు; తదీయ= అతడికి; ప్రాక్+ప్రదేశంబునన్= తూర్పువైపున; ప్రస్ఫురిత= బాగా ప్రకాశించే; పీఠంబులన్= ఆసనాలపై; విదురుండును= విదురుడు; ధౌమ్యుండును= పురోహితుడైన ధౌమ్యుడు; ధృతరాష్ట్రుని పిఱుందన్= ధృతరాష్ట్రుడి వెనుక ప్రక్క; అర్హపీఠంబులన్= తగిన ఆసనాలమీద; గాంధారీ, యుయుత్సు, సంజయులునున్= గాంధారీదేవి, యుయుత్సుడు, సంజయుడు; కూర్చుండిరి= ఆసీనులై ఉన్నారు; ఆ సమయంబునన్= అట్టి సమయంలో; అంబుజ+అక్షుండు= పద్మాలవంటి కన్నుల కల శ్రీకృష్ణుడు; కృపావిశేషంబునన్= దయాతిశయంతో; కృప+ఆచార్యున్= కృపాచార్యుడిని; తగు= తగిన; తెఱంగునన్= తీరులో; ఆ+అజాతశత్రున్= ఆ ధర్మరాజుకు; కానిపించి= కనబడచేసి; యోగ్య+ఆసనంబునన్= ఉచితాసనంపై; ధౌమ్యు= పురోహితుడైన ధౌమ్యుడిని; సమీపంబునన్= చేరువలో, ప్రక్కనే; అతనిన్= ఆ కృపాచార్యుడిని; ఉనిచెన్= కూర్చుండచేశాడు; అంతన్= అప్పుడు; ఆ+పుడమిటేఁడు= ఆ భూపతి, ధర్మరాజు; సిత= తెల్లని; కుసుమ= పూలు; అక్షత= అక్షతలు; కాంచన= బంగారు; రజత= వెండి; రత్నగర్భ= భూమి; స్పర్శనంబు= తాకటం; ఆచరించెన్= చేశాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: పట్టాభిషేక వైభవాన్ని అనుభవించుము' అని శ్రీకృష్ణుడు చెప్పి అభిషేకానికి కావలసిన వస్తు సంభారాలను తీసికొని రావటానికి అర్హులైన వారిని పంపాడు. ఆరుబయట పెద్ద కొలువుతీర్చి, ధర్మరాజుకు గొప్ప ఎత్తైన బంగారు సింహాసనాన్ని ఏర్పాటుచేసి, అయినవారందరికీ తగిన, ఘనమైన ఆసనాలు ఏర్పాటుచేయుమని అర్జునుడికి చెప్పాడు. అప్పుడు ధర్మరాజు తన మనస్సులోని బాధనంతా దిగమ్రింగి, సంకల్పంతో తేరుకొని, ప్రకాశిస్తున్న తన ఆసనం మీద తూర్పుముఖంగా కూర్చున్నాడు. అతడికి ఎదురుగా బంగారు పీఠంపై సాత్యకితో కలిసి శ్రీకృష్ణుడు కూర్చున్నాడు. రత్నమయ పీఠాలపై కుడిఎడమల భీముడు, అర్జునుడు, వెనుక ప్రక్క విశాలములు, పొట్టివి అయిన బంగారు ఆసనాల మీద నకుల సహదేవులు చెరొకప్రక్క ఉండగా; కుంతీదేవి, కృష్ణుడికి కుడి ప్రక్కగా కాంతులతో ప్రకాశించే పీఠంమీద ధృతరాష్ట్రుడు, అతడికి తూర్పువైపు వెలిగిపోయే ఆసనాలమీద విదురుడు, ధౌమ్యుడు, ధృతరాష్ట్రుడికి వెనుకగా ఉచితాసనాలమీద గాంధారి, యుయుత్సుడు, సంజయుడు ఆసీనులై ఉన్నారు. ఆ సమయంలో తన కరుణా విశేషంతో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు కృపాచార్యుడి దర్శనం కలిగించి, ధౌమ్యుడి ప్రక్కన ఉచితాసనంపై అధివసింపచేశాడు. ఆ ధర్మరాజు తెల్లని పూలను, అక్షతలను, బంగారాన్ని, వెండిని, భూదేవిని స్పృశించాడు. ఆ తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. విద్వత్సమూహంబు, వివిధ దేశాధీశ! । సంఘంబుఁ, గార్యవిచారపరులు,
నర్థార్జనాది కృత్యంబుల వారలు, । బహుపరిచర్యలఁ బరఁగు జనులు,
వైశ్యప్రముఖ పౌరవర్గంబులును, ముఖ్య । హలికాది జానపదావలులును,
వైణిక గాయక వాంశికాది వినోద । కరులును, వారసుందరులు లోను

ఆ. గాఁగఁ దగినవారు గాంచి యవ్విభుని స । త్కారములఁ బ్రమోదితాత్ము లగుచు
భావములు దలిర్ప సేవించియుండ న । క్కొలువు సాల నొప్పెఁ గురువరేణ్య! 372

ప్రతిపదార్థం: కురువరేణ్య!= జనమే జయమహారాజా!; విద్వత్= పండితుల; సమూహంబు= గణము; వివిధ= అనేక; దేశ+అధీశ= రాజుల; సంఘంబున్= సమూహం; కార్యవిచారపరులు= మంత్రులు; అర్థ+ఆర్జన= ధనసముపార్జన; ఆది= మొదలైన; కృత్యంబుల వారలు= పనులు చేసేవారు; బహు= నానా; పరిచర్యలన్= సేవలలో; పరఁగు= ఒప్పే; జనులు= వారు (మానవులు); వైశ్యప్రముఖ= వైశ్యులు మొదలైన; పౌరవర్గంబులును= పురజనుల గణాలు; ముఖ్య= ప్రధానమైన; హలిక+ఆది= కృషీవలులు మొదలైన; జానపద+ఆవలులును= గ్రామీణజన సమూహాలు; వైణిక= వీణ వాయించేవారు; గాయక= పాడేవారు; వాంశిక= వేణువూదేవారు; ఆది= మొదలైన; వినోద కరులును= వినోదం కలిగించేవారు; వారసుందరులు= వేశ్యాస్త్రీలు; లోను+కాఁగన్= మొదలుగా; తగినవారు= యోగ్యులు; కాంచి= దర్శించుకొని; సత్కారములన్= సన్మానాలతో; ప్రమోదిత= మిక్కిలి సంతోషపెట్టబడిన; ఆత్ములు= మనస్సులు కలవారు; అగుచున్= ఔతూ; భావములు= తలపులు; తలిర్పన్= సంతోషంతో అతిశయించగా; సేవించి+ఉండన్= కొలువుతీరి ఉండగా; ఆ+కొలువు= ఆ సభ; చాలన్= అధికంగా; ఒప్పెన్= అందగించింది.

తాత్పర్యం: జనమేజయా! పండితుల సమూహం, వివిధ దేశాల రాజుల సముదాయం, మంత్రులు, ధనార్జన మొదలైనవి చేసేవారు, వివిధ పరిచర్యలు చేసే సేవకజనం, వైశ్య ప్రముఖులు మొదలైన పౌరులు, కృషీవలులు మొదలైన గ్రామీణులు, వీణ వేణువు మొదలైన సంగీత వాద్యాలను పలికించటంలో నేర్పరులు, గాయకులు, వేశ్యలు మొదలైనవారంతా ధర్మరాజును దర్శించుకొని, అతడిచేత సన్మానాలు పొంది, మనసులో ఎంతో సంతసిస్తూ కొలువు తీర్చి ఉండగా ఆ సభ చాల ప్రకాశించింది.

విశేషం: రాజ్యపాలనకు కావలసిన అంగాలన్నీ (మంత్రం, ధనం, కార్యాచరణం, సేవ), సుఖస్థితికి వలసినవి (వ్యాపారం, పాడిపంట) వినోదం - అన్నీ సమకూడి ఉన్నాయి సభలో.

ధర్మరాజు పట్టాభిషేక మహోత్సవము (సం. 12-40-9)

వ. అంత నాభిషేచనిక ద్రవ్య సంచయంబు సన్నిహితం బగుటయు, మాధవానుమతుండై ధౌమ్యుండు ప్రాగు దకీ ప్లవనంబైన వేదికాతలం బలంకరించి యందు జాతరూప నవరత్న ఖచితంబును దృఢపాదంబు నగు భద్రపీఠంబు ప్రతిష్ఠించి, శార్దూల చర్మాస్తరణ శోభితంబు సేసి యర్చించి, కాంచనదామజుష్టం బగు నుత్కృష్టఘన శంఖంబు సమంచిత స్థండిలంబున నిలిపి పూజించి, దానను దానిచుట్టునుం బార్థివంబులు హైమంబులు రాజతంబులు రత్నమయంబులు నగు కుంభంబు లొనర్చి వాననుగాంగంబులగు జలంబులు నించి యన్నింటికి రత్నమంగళతరు త్వక్పల్లవ కుసుమంబులను బంచగవ్యంబులను సమంత్రకంబుగా సంస్కారంబు నిర్వర్తించి. 373

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; ఆభిషేచనిక= అభిషేక సంబంధమైన; ద్రవ్యసంచయంబు= వస్తుసముదాయం; సన్నిహితంబు= బాగా దగ్గరకు వచ్చినది; అగుటయున్= కావటంతో; మాధవ+అనుమతుండు+ఐ= కృష్ణుడిచేత అనుజ్ఞపొందినవాడై; ధౌమ్యుండు= పురోహితుడైన ధౌమ్యుడు; ప్రాక్+ఉదక్ (ప్రాగుదీచీ పాఠాంతరం)= తూర్పు, ఉత్తరం, అనగా ఆ దిక్కుల మధ్య ఉండే ఈశాన్యం; ప్లవనంబు+ఐన= పల్లంగా ఉన్న; వేదికాతలంబు= వేదికను; అలంకరించి= అలంకారం చేసి; అందున్= అచట; జాతరూప= బంగారుమయమైనవి; నవరత్న ఖచితంబును= నవరత్నాలతో తాపటం చేయబడింది; దృఢపాదంబును= స్థిరమైన బలమైన కాళ్ళు కలిగినది; అగు= అయిన; భద్ర= శుభప్రదమైన; పీఠంబు= ఆసనం, పీట; ప్రతిష్ఠించి= స్థాపించి; శార్దూలచర్మ= పులితోలు; ఆస్తరణము= పరుపుతో; శోభితంబు+చేసి=

అలంకరించి; అర్చించి= పూజించి; కాంచన= బంగారు; దామ= దండతో; జుష్టంబు+అగు= చేరినదైన; ఉత్కృష్ట= శ్రేష్ఠమైన; ఘన= పెద్ద; శంఖంబు= శంకువుని; సమంచిత= బాగా తగిన; స్థండిలంబునన్= వ్రతము కొరకు దర్భాదులచేత సంస్కరించబడిన స్థలమున; నిలిపి= నిలబెట్టి; పూజించి= అర్చించి; దానన్= దానియందు; దానిచుట్టునున్= ఆ శంఖం చుట్టూ; పార్థివంబులు= మట్టివి; హైమంబులు= బంగారపువి; రాజతంబులు= వెండివి; రత్నమయంబులున్= రత్నాలతో చేయబడినవి; అగు= అయిన; కుంభంబులు= కలశాలు; ఒనర్చి= ఏర్పాటుచేసి, పెట్టి ఉంచి; వానను= ఆ కలశాలలో; గాంగంబులు+అగు= గంగానదివైన; జలంబులు= నీరు; నించి= నింపి; అన్నింటికిన్= ఆ కలశాలన్నింటికీ; రత్న= మణులతోను; మంగళతరు= శుభప్రదమైన చెట్ల; త్వక్+పల్లవ+కుసుమంబులను= బెరడులు, చిగుళ్ళు, పూలతోను; పంచగవ్యంబులను= గోసంబంధమైన అయిదు వస్తువులతోను (ఆవుపాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, పేడ); సమంత్రికంబు+కాన్= మంత్రపూతంగా; సంస్కారంబు= సంస్కరణ; నిర్వర్తించి= చేసి.

తాత్పర్యం: ఆ విధంగా కొలుపుతీరిన సమయంలో పట్టాభిషేకానికి కావలసిన సంభారాలు రావటంతో, కృష్ణుడు ఆజ్ఞాపించగానే పురోహితుడైన ధౌమ్యుడు ఈశాన్యదిక్కున పల్లంగా ఉన్న (ఇది వాస్తు శాస్త్రాన్ని అనుసరించి శుభం) వేదికను అలంకరించాడు. ఆ వేదికపై నవరత్నాలు పొదిగిన బలమైన కాళ్ళుగల బంగారపు భద్రపీఠాన్ని స్థాపించి, ఆ పీఠంపై పులితోలు పరచి అలంకరించి, పూజించి, బంగారు దండలతో కూడుకొని ఉన్న శ్రేష్ఠమైన గొప్ప శంఖాన్ని యజ్ఞార్థం దర్భాదులచేత సంస్కరించబడి బాగా ఒప్పే స్థలంలో నిలబెట్టి పూజించి, ఆ స్థలంలోనూ దానిచుట్టూ మట్టి, బంగారు, వెండి, మణి కలశాలనుంచి, ఆ కలశాలలో గంగాజలం నింపి, ఆ కలశాల నన్నింటిని రత్నాలతోను, శుభప్రదమైన వృక్షాల బెరడులు, చిగుళ్ళు, పూలతోనూ, పంచగవ్యాలతోనూ మంత్రపూతంగా సంస్కరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. వీర్యవంతములగు వివిధ మంత్రంబుల । తోఁ గూడ సద్ద్విజస్తోమ పరివృ
తునిఁ జేసికొని రాజుఁ దోడ్కొనియేఁగి యా । వినుత పీఠంబున నునిచి, శోభ
నాలంకరణమున నభిరామ యైన పాం । చాలిఁ దద్వామపార్శ్వమున సహస
మాసీనఁ గావించి, యగ్నిముఖము సేసి । కొని హోమ తంత్ర వర్తన మొనర్చె;

తే. నంత నూర్జిత శుభవేళ యగుడు శంఖ । చక్రధరుఁ డా సమర్చిత శంఖ మెత్తి
' పృథివి కధిపతి వగు' మని ప్రీతి నా పృ । థాసుతుని నభిషిక్తునిఁ జేసె నధిప! 374

ప్రతిపదార్థం: అధిప!= రాజా! జనమేజయా!; వీర్యవంతములు+అగు= శక్తిమంతాలైన; వివిధ= అనేక; మంత్రంబులతోన్= మంత్రాలతో; కూడ= కూడి; సత్+ద్విజస్తోమ= మంచి బ్రాహ్మణ గణంతో; పరివృతునిన్= చుట్టబడినవాడుగా, పరివేష్టింపబడినవాడుగా; చేసికొని= చేసి; రాజున్= ధర్మరాజును; తోడ్కొని= వెంట తీసికొని; ఏఁగి= వెళ్ళి; ఆ వినుత పీఠంబునన్= ఆ బాగా కీర్తించబడిన ఆసనంపై; ఉనిచి= నిలిపి; శోభన+అలంకరణమునన్= మంగళకరమైన సింగారాలతో; అభిరామ+ఐన= మనోహరంగా ఉన్న; పాంచాలిన్= పాంచాలరాజపుత్రి అయిన కృష్ణను; తద్+వామపార్శ్వమునన్= ధర్మరాజుకు ఎడమ ప్రక్క; సహసమాసీనన్= కలిసి చక్కగా కూర్చున్న దానిగా; కావించి= చేసి; అగ్ని ముఖము= అగ్నికి ఎదురుగా ఉండేటట్లు; చేసికొని= ఏర్పాటు చేసికొని; హోమతంత్రవర్తనము= దేవయజ్ఞ పద్ధతి ఆచరణం; ఒనర్చెన్= నిర్వర్తించాడు; అంతన్= అప్పుడు; ఊర్జిత= దృఢమని నిశ్చయించిన; శుభవేళ= మంగళకాలం; అగుడున్= అవగానే; శంఖ చక్రధరుఁడు= శంఖచక్రాలు ధరించిన వాడైన శ్రీకృష్ణుడు; ఆ సమర్చిత శంఖము+ఎత్తి= ఆ పూజించబడిన శంఖాన్ని ఎత్తి; పృథివికిన్= భూమికి, రాజ్యానికి; అధిపతివి= రాజువు; అగుము= కమ్ము; అని= పలికి; ప్రీతిన్= ఇష్టంతో; పృథాసుతునిన్= కుంతీపుత్రుడైన ధర్మజుడిని; అభిషిక్తునిన్= పట్టాభిషిక్తుడిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: శక్తిమంతాలైన మంత్రాలు చదువుతున్న సద్బ్రాహ్మణులతో పరివేష్టించబడినవాడినిగా చేసి, ఆ ధర్మరాజును వెంటబెట్టుకొని తీసికొనివెళ్ళి బహుధా స్తుతించబడిన ఆ ఆసనంపై కూర్చొనపెట్టి, మంగళాలంకార శోభిత అయి మనోహరంగా ఉన్న ద్రౌపదిని ధర్మరాజు ఎడమప్రక్క కూర్చుండబెట్టి, అగ్నిని ఎదురుగా ఉంచుకొని దేవయజ్ఞ తంత్రం పూర్తిచేసి, నిశ్చయించిన శుభసమయంలో శ్రీకృష్ణుడు, అంతకు ముందు పూజించిన శంఖాన్ని తీసి దానితో 'ఈ భూమికి రాజువు కమ్ము' అని ఇష్టంతో ధర్మరాజును అభిషిక్తుడిని చేశాడు.

విశేషం: అగ్నిముఖం= జీడిచెట్టు, అగ్నిముఖుఁడు= బ్రాహ్మణుడు, వేలుపు. శంఖంలోని నీటితో అభిషేకించినవాడు శంఖచక్రధరుడనటం సందర్భోచితం.

వ. అప్పుడు చిత్తం బుత్తమ ప్రకారంబై యాంబికేయుండు ప్రసన్నవదనుం డగుచుం బ్రతిష్ఠితంబు లయిన కలశంబులలో నుజ్జ్వలం బగు నొక్కటి ధౌమ్యుం డంది యీ నెత్తి యా భూపోత్తము నభిషేకించె; మఱియుం బ్రభూతాత్ము లగు రాజులును, బ్రకృతులలోనం దగువారును,, దదభిషేక శోభనం బాచరించిరి; శంఖానక దుందుభి ప్రభృతి మంగళతూర్యంబులు గంభీర నాదంబులం జెలంగె; నివ్విధంబున సుహృజ్జన హృదయంబు లానందింప ధర్మనందనుండు సామ్రాజ్య పదస్థుండై భూసుర దీనానాథ ప్రముఖ పాత్రంబులకు వివిధ బహుధనంబు లొసంగె; నట్టియెడ విద్యా విశిష్ట బ్రాహ్మణాది పురుష సత్తము లక్కురుసత్తమున కభిముఖులై 'దేవా! దైవ మానుషంబుల కలిమి నతిమానుషంబగు నీ విజయంబును వసుధాధిపత్య సంప్రాప్తియు నింత యొప్పునే!' యనిన విని వారలతో నవ్వసుంధరా వల్లభుండు. 375

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; చిత్తంబు= మనస్సు; ఉత్తమ ప్రకారంబు+ఐ= శ్రేష్ఠమైన తీరులో ఉండగా; ఆంబికేయుండు= అంబిక కుమారుడైన ధృతరాష్ట్రుడు; ప్రసన్నవదనుండు+అగుచున్= నిర్మలమైన ముఖం కలవాడై; ప్రతిష్ఠితంబులు+అయిన= స్థాపించబడిన; కలశంబులలోన్= కుంభాలలో; ఉజ్జ్వలంబు+అగు= ప్రకాశించే, మెరుగైన; ఒక్కటి= ఒక్కదానిని; ధౌమ్యుండు; అంది+ఈన్= అందించగా; ఎత్తి= పై కెత్తి; ఆ భూప+ఉత్తమున్= ఆ రాజవరుడైన ధర్మరాజును; అభిషేకించెన్= అభిషేకించాడు; మఱియున్= ఇంకా; ప్రభూత+ఆత్ములు+అగు= మహాత్ములైన; రాజులును= భూపతులు; ప్రకృతులలోన్= పౌరులలో; తగువారును= అర్హులైనవారు; తద్= ఆ; అభిషేకశోభనంబు= అభిషేకమనే శుభకార్యాన్ని; ఆచరించిరి= చేశారు; శంఖ= శంఖాలు; ఆనక= తప్పెటలు; దుందుభి= భేరులు; ప్రభృతి= మొదలైన; మంగళతూర్యంబులు= మంగళవాద్యాలు; గంభీర నాదంబులన్= ఘనమైన ధ్వనులతో; చెలంగెన్= వ్యాపించాయి; ఈ+విధంబునన్= ఈ తీరున; సుహృద్+జన= మిత్రులు; ఆప్తులు అయిన వారి; హృదయంబులు= మనసులు; ఆనందింపన్= సంతసించగా; ధర్మనందనుండు= ధర్మరాజు; సామ్రాజ్యపదస్థుండు+ఐ= చక్రవర్తి పదవియందున్నవాడై; భూసుర= బ్రాహ్మణులు; దీన= దీనులు; అనాథ= దిక్కులేనివారు; ప్రముఖ= మొదలైన; పాత్రంబులకున్= అర్హులైనవారికి; వివిధ= అనేక విధాలైన; బహు= అధికంగా; ధనంబులు= సంపదలు; ఒసంగెన్= ఇచ్చాడు; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో; విద్యావిశిష్ట= గొప్పవిద్యావంతులైన; బ్రాహ్మణ= బ్రాహ్మణులు; ఆది= మొదలైన; పురుష+సత్తములు= మానవోత్తములు; ఆ+కురుసత్తమునకున్= కౌరవోత్తముడైన ధర్మరాజుకు; అభిముఖులు+ఐ= ఎదురుగా నిలిచినవారై; దేవా!= ప్రభూ!; దైవ= దేవతా; మానుషంబుల= మానవ సంబంధమైన శక్తుల; కలిమిన్= సంపదతో; అతిమానుషంబు+అగు మానవాతీతమైన; ఈ విజయంబును= ఈ గెలుపూ; వసుధా+ఆధిపత్య+సంప్రాప్తియున్= రాజ్యపాలన లభించటం; ఇంత= ఇంతగా; ఒప్పును+ఏ?= అందగిస్తాయా?; అనినన్= అనగా; విని= ఆలకించి; వారలతోన్= బ్రాహ్మణాదులతో; ఆ+వసుంధరావల్లభుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: అటుపై మంచి మనసుతో ధృతరాష్ట్రుడు నిర్మలమైన ముఖంకలవాడై ప్రతిష్ఠించిన కలశాలలో మేలైన దాని నొకదానిని ధౌమ్యుడు తనకు అందించగా, దానిని ఎత్తి ధర్మరాజు నభిషేకించాడు. ఇంకా మహాత్ములైన రాజులు, ప్రముఖులైన పౌరులు కూడా ఆ అభిషేక శుభకార్యాన్ని నిర్వర్తించారు. శంఖాలు, తప్పెటలు, భేరులు

మొదలైన మంగళవాద్యాల గొప్ప ధ్వనులు బాగా వ్యాపించాయి; ఈ విధంగా ఆప్తుల హృదయాలు సంతసించగా ధర్మరాజు చక్రవర్తి పదవి నధిష్ఠించి బ్రాహ్మణులు, దీనులు, దిక్కులేనివారు మొదలైన దానయోగ్యులకు అనేక విధాలైన అధికమైన సంపదలు దానం చేశాడు. ఆ సమయంలో పండితులు, బ్రాహ్మణులు మొదలైన మనుజశ్రేష్ఠులు ధర్మరాజు కెదురుగా నిలిచి 'ప్రభూ! దేవమానవ శక్తులు బాగా కలిగి ఉండటం వలన ప్రాప్తించిన నీ విజయం, రాజ్యపాలన ప్రాప్తి ఎంత యోగ్యంగా ఉన్నాయి! (తమ ఊహనుమించి అందగించాయని భావం)' అనగా విని వారితో ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ' కలిగె లేకుండె ని ట్లలఘు గుణంబులు । వాక్రుచ్చి మీయంత వార లిట్లు
గొనియాడఁ బాండునందనులు ధన్యాత్ముల' । యని పల్కి యంబికాతనయుఁ జూపి
' తండ్రియు గురువును దైవంబు నీతఁడ । మాకు; మీ రెల్ల నీ మనుజవిభుని
పనుపు సేయుటయు, నీతనికిఁ బ్రియంబు గా । వించుటయును, మమ్ము వేనవేల

తే. విధులఁ బ్రీతులఁ జేత యుర్వీజనులుఁ । బౌరులును మీరలును దొంటిభంగిఁ దప్ప
కిమ్మహారాజునెడ వినయమ్ముతోడ । నడచుచుంటయు యెంతయు నాకుఁ బ్రియము. 376

ప్రతిపదార్థం: కలిగెన్= ఉన్నవో; లేకుండెన్= లేవో; ఇట్లు= ఈ విధంగా; అలఘు= గొప్ప; గుణంబులు= సద్గుణాలు; వాక్రుచ్చి= పేర్కొని; మీ+అంతవారలు= మీ అంతటి పెద్దలు; ఇట్లు; ఈ విధంగా; కొనియాడన్= కీర్తించగా; పాండునందనులు= పాండురాజు పుత్రులు; ధన్య+ఆత్ములు+అ= అదృష్టవంతులే; అని పలికి= అని చెప్పి; అంబికాతనయున్= ధృతరాష్ట్రుడిని; చూపి= చూపించి; మాకున్= పాండవులకు; తండ్రియున్= జనకుడు; గురువును= పెద్ద; దైవంబున్= దైవం; ఈతఁడు+అ= ఇతడే; మీరు+ఎల్లన్= మీరంతా; ఈ మనుజ విభుని= ఈ రాజుయొక్క; పనుపు= ఆజ్ఞ; చేయుటయున్= అమలు జరపటం; ఈతనికిన్= ఈ ధృతరాష్ట్రుడికి; ప్రియంబు= ఇష్టమైనది; కావించుటయును= చేయటం; మమ్మున్= మమ్ములను (పాండవులను); వేనవేల= వేలాది; విధులన్= తీరులలో; ప్రీతులన్= సంతసించినవారినిగా; చేఁత= చేయటం (ఔతుంది); ఉర్వీజనులన్= భూప్రజలు; పౌరులును= పురజనులు; మీరలును= మీరందరూ; తొంటిభంగిన్= పూర్వంవలెనే; తప్పక= కాదనక, పొరబడక; ఈ+మహారాజు+ఎడన్= ఈ చక్రవర్తిపట్ల; వినయమ్ముతోడన్= వినమ్రతతో; నడచుచున్+ఉంటయున్= నడుస్తూ ఉండటం; నాకున్; ఎంతయున్= ఎంతో; ప్రియంబు= ఇష్టం.

తాత్పర్యం: 'ఈ గొప్ప సద్గుణాలు ఉన్నాయో లేవో కాని వాటిని పేర్కొని, మీ అంతటి పెద్దలు ఈ విధంగా పొగడుతుంటే పాండవులు అదృష్టవంతులే' అని పలికి, ధృతరాష్ట్రుడిని చూపించి ఇట్లా అన్నాడు: 'మాకు తండ్రి, గురువు, దైవం ఈ ధృతరాష్ట్రుడే. ఈతడి ఆజ్ఞ అమలు చేయటం, ఇతడికి ఇష్టమైనది చేయటం వేలాది తీరులలో మమ్మల్ని సంతోషపెట్టటం అవుతుంది. దేశప్రజలు, పౌరులు, మీరు అందరూ పూర్వంవలె (ధృతరాష్ట్రుడు పరిపాలిస్తున్న కాలంలో వలె) ఈ ధృతరాష్ట్రుడి పట్ల వినమ్రతతో నడుచుకొనటం మాకు ఎంతో ఇష్టం.

క. జ్ఞాతివధ మట్లు సేసియు । నీతనిఁ గొల్చుటకుఁ గాఁగ నీ గృహధర్మో
పేతత్వము బొరసితి భూ । భూతికి మనకు విభుఁ డీ ప్రభువ మఱవకుఁడీ!' 377

ప్రతిపదార్థం: జ్ఞాతివధము= దాయాదులను చంపటం; అట్లు= ఆ విధంగా; చేసియున్= చేసికూడా; ఈతనిన్= ఈ ధృతరాష్ట్రుడిని; కొల్చుటకున్= సేవించటానికి; కాఁగన్= మాత్రమే; ఈ గృహధర్మ= గృహస్థాశ్రమ ధర్మంతో; ఉపేతత్వమున్= కూడి ఉండటాన్ని; పొరసితిన్= పొందాను; భూభూతికిన్= ఈ భూమిపైగల ఐశ్వర్యానికి; మనకు= మనకు; ఈ ప్రభువు+అ= ఈ రాజే; విభుఁడు= అధిపతి; మఱవకుఁడీ!= మరచిపోవద్దు సుమా!

తాత్పర్యం: ఆ విధంగా దాయాదులను చంపి కూడా గృహస్థాశ్రమ ధర్మాన్ని అనుష్ఠించటం, ఈ ధృతరాష్ట్రుడిని సేవించటంకొరకే. భూమిపై ఉన్న ఐశ్వర్యానికి, మనకు అధిపతి ఈ రాజే అని మరవవద్దు సుమా!'

వ. అని చెప్పి నిజేచ్ఛవర్తించి సుఖంబుండువారుగాఁ బ్రార్థించి, వినయంబుతో ధృతరాష్ట్ర గాంధారుల నగరిలోని కనిచి, పౌరులను జానపదులను బోవంబనిచి, సగౌరవంబుగాఁ గృపాచార్యు నిజనివాసంబున కరుగ వీడ్కొలిపి, యువరాజ పదంబున భీమసేను నిలిపి, కర్తవ్య విచారంబునకుఁ దదీయ నిశ్చయంబునకును సంధివిగ్రహాది షాడ్గుణ్య చింతనంబునకును విదురునిం బ్రియవచన పూర్వకంబుగా నియోగించి, వలయుపనులు వెనుక ముంద రరసి యెఱింగించుటకు నాయవ్యయంబు లెఱింగించుటకునై సంజయుం జొనిపి, సేనల కొలందులను గనుంగొనుటకు భృత్యులకు జీవితంబులు వెట్టుటకుఁ గర్మకలాపంబులు సేయించుటకును నకులు నాజ్ఞాపించి, దర్పితుల మర్దించుటకుఁ బరచక్రంబు లాక్రమించుటకు నర్జును నిర్దేశించి, బ్రాహ్మణకార్యంబులకు శ్రౌత స్మార్తకృత్య సమనుష్ఠానంబునకు ధౌమ్యుం జాలించి, సహదేవుం జూచి 'నీవు మదీయ గోపనపరుండవై సర్వావస్థల యందును మత్సమీపంబున నిల్చునది' యని పలికి, మఱియుం గరణీయంబు లగు నధికారంబుల నెల్లను గల్పించి , వీరల మీఁదన పెట్టి, యుయుత్సుం గనుంగొని, విదుర సంజయుల నాలోకించి 'మీరలనుదినంబును నవధానంబు గలిగి రాచవారి యోగక్షేమంబు లేనెట్లట్ల నిర్వహింప వలయుఁ బురజనంబుల భూజనంబుల కర్జంబులు రాచవారి కెఱింగించి, పంచినట్లు నడపంగలవార'లని యప్పగించి యభ్యంతర మందిరంబునకు విజయంచేయు'మని కుంతీదేవినిం బాంచాలీ సహితంబుగాఁ బుచ్చి. 378

ప్రతిపదార్థం: అని= అంటూ; చెప్పి= పలికి; నిజ+ఇచ్ఛన్= తమ ఇష్టం వచ్చినట్లు; వర్తించి= ప్రవర్తించి, నడచి; సుఖంబు+ఉండువారు+కాన్= హాయిగా జీవించేవారు కమ్మని; ప్రార్థించి= వేడుకొని; వినయంబుతోన్= వినమ్రతతో; ధృతరాష్ట్ర గాంధారులన్= ధృతరాష్ట్రుడినీ, గాంధారినీ; నగరిలోనికిన్= రాజప్రాసాదంలోకి; అనిచి= పంపి; పౌరులను= పురజనులను; జానపదులను= గ్రామప్రజలను; పోవన్+పనిచి= వీడ్కొలిపి; కృప+ఆచార్యున్= కృపాచార్యుడిని; సగౌరవంబుగాన్= గౌరవపురస్సరంగా; నిజనివాసంబునకున్= తన (కృపాచార్యుడి) ఇంటికి; అరుగన్= వెళ్ళటానికి; వీడ్కొలిపి= వీడుకోలు చెప్పి; యువరాజ పదంబునన్= యువరాజ పదవిలో; భీమసేనున్= భీముడిని; నిలిపి= ఉంచి; కర్తవ్య= చేయవలసినది; విచారంబునకున్= ఆలోచించటానికి; తదీయ= దానిని; నిశ్చయంబునకును= నిర్ణయించటానికి; సంధి విగ్రహ+ఆది= సంధి విగ్రహం మొదలైన; షాడ్గుణ్య= ఆరు గుణాల; చింతనంబునకును= ఆలోచనకు; విదురునిన్= విదురుడిని; ప్రియవచన పూర్వకంబుగాన్= మంచిమాటలతో; నియోగించి= ఒప్పించి (ఆజ్ఞాపించి); వలయు= అవసరమైన; పనులు= కార్యాలు; వెనుక ముందు= వరుస క్రమం; అరసి= చూచి; ఎఱింగించుటకున్= తెలియచెప్పటానికి; ఆయవ్యయంబులు= ఆదాయం, ఖర్చు; ఎఱింగించుటకును= తెలియపరచటానికి; సంజయున్= సంజయుడిని; చొనిపి= ప్రవేశపెట్టి; సేనల= సైన్యం; కొలందులు= పరిమితులు, లెక్కలు; కనుంగొనుటకున్= చూడటానికి; భృత్యులకున్= సేవకులకు; జీవితంబులు= జీతాలు; పెట్టుటకున్= ఇవ్వటానికి; కర్మకలాపంబులు= పనిపాటలు; చేయించుటకున్= చేయించటానికి; నకులున్+ఆజ్ఞాపించి= నకులుడిని నియోగించి; దర్పితులన్= అహంకరించినవారిని; మర్దించుటకున్= నుగ్గుచేయటానికి; పరచక్రంబులు= ఇతర రాజ్యాలను; ఆక్రమించుటకున్= స్వాధీనం చేసికొనటానికి; అర్జునున్= అర్జునుడిని నియమించి; బ్రాహ్మణకార్యంబులకున్= విప్రుల పనులకు; శ్రౌత= వేదసంబంధమైన; స్మార్త= స్మృతులకు సంబంధించిన; కృత్య= కార్యాలు; సమనుష్ఠానంబునకున్= చక్కగా నిర్వర్తింపబడటానికి; ధౌమ్యున్= ధౌమ్యుడిని; చాలించి= నియోగించి; సహదేవున్= సహదేవుడిని; చూచి= కని; నీవు; మదీయ= నా; గోపన పరుండవు+ఐ= నా రక్షణ చూచే వాడవై; సర్వ+అవస్థలఅందున్= అన్ని స్థితులలోను; మత్= నా; సమీపంబునన్= చేరువలో; నిల్చునది= నిలవవలసింది; అని= అంటూ; పలికి= మాటాడి; కరణీయంబులు+అగు= చేయదగినవి అయిన; అధికారంబులన్= పెత్తనాలు; ఎల్లను= అన్నింటినీ;

కల్పించి= కలుగచేసి; వారలమీఁదను+అ= వారి మీదే; పెట్టి= ఉంచి; యుయుత్సున్= యుయుత్సుడిని; కనుంగొని= చూచి; విదుర సంజయులన్= విదురుడినీ, సంజయుడినీ; ఆలోకించి= చూచి; మీరలు= మీరు; అనుదినంబును= ప్రతిరోజూ; అవధానంబు= హెచ్చరిక; కలిగి= కలిగి ఉండి; రాచవారి= రాజవంశంవారి; యోగక్షేమంబులు= లాభం, మేలు; ఏను= నేను; ఎట్లు+అట్లు+అ= ఎట్లో అట్లే; నిర్వహింపవలయున్= నిర్వర్తించాలో; పురజనంబుల= పౌరుల; భూజనంబుల= ప్రజల; కర్జంబులు= కార్యాలు; రాచవారికిన్= పాలకులకు; ఎఱిఁగించి= తెలియజేసి; పంచిన+అట్లు= ఆజ్ఞాపించినట్లుగా; నడపన్+కలవారలు= నడిపించగలరు; అని= పలికి; అప్పగించి= అప్పచెప్పి; కుంతీదేవినిన్= కుంతీదేవిని; పాంచాలీ సహితంబుగాన్= ద్రౌపదితోపాటు; అభ్యంతర మందిరంబునకున్= అంతఃపురానికి; విజయం చేయుము+అని= వేంచేయుమని; పుచ్చి= పంపి.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పి తమ ఇచ్చవచ్చినట్లు నడచి సుఖంగా ఉండండని వారిని ప్రార్థించాడు. గాంధారీధృతరాష్ట్రులను వినమ్రంగా రాజప్రాసాదానికి పంపాడు. పురజనులను, గ్రామీణులను వెళ్ళండని సెలవిచ్చాడు. కృపాచార్యుడిని గౌరవపురస్సరంగా స్వగృహానికి వెళ్ళటానికి వీడ్కోలు చెప్పాడు. భీముడిని యువరాజు స్థానంలో నిలిపాడు. కర్తవ్యం ఆలోచించి నిర్ణయించటానికి శత్రువుతో పొందు, యుద్ధం మొదలైన ఆరు రాజగుణాలు ఆలోచించటానికి మంచి మాటలతో విదురుడిని అంగీకరింపచేసి, చేయవలసిన పనుల వరుసక్రమం చూచి చెప్పటానికి, ఆదాయం వ్యయం తెలపటానికి సంజయుడిని నియమించి, సైన్యం వివరాలు తెలిసికొని, సేవకులకు జీతాలు ఇవ్వటానికి, వారిచేత పనులు చేయించటానికి నకులుడిని నియమించి. అహంకరించినవారిని అణచటానికి, శత్రురాజ్యాలు ఆక్రమించటానికి అర్జునుడిని నియోగించి, బ్రాహ్మణుల పనులను, వేద, స్మృతి సంబంధి కార్యాచరణను ధౌమ్యుడికి అప్పగించి, సహదేవుడి వంక చూచి 'నీవు నన్ను రక్షిస్తూ, ఎల్లవేళలా నా చేరువలో ఉండు' మని ఆజ్ఞాపించి, చేయదగిన పనులను తగిన పెత్తనం కల్పించి తగిన వారికి అప్పగించాడు. యుయుత్సుడిని, విదురుడిని, సంజయుడినీ చూచి 'మీరు ఎప్పుడూ హెచ్చరికతో ఉండి రాజవంశంవారి లాభాన్నీ మంచినీ నేను చూడాల్సిన విధంగా చూస్తూ, పురజనుల, సర్వజనుల పనులు పాలకులకు చెప్పి, ఆజ్ఞాపించిన విధంగా పనులు నిర్వర్తించగలరు' అన్నాడు. కుంతీదేవిని ద్రౌపదితో కూడా అంతఃపురానికి పంపాడు.

విశేషం: షడ్గుణాలు= సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధము, ఆశ్రయం. సంధి= శత్రువుతోపొత్తు - ఇది మూడు విధాలు: 1. కోశప్రధాన హేతుకం, 2. దండప్రధానహేతుకం; 3. భూమిప్రధాన హేతుకం.

తే. ప్రేమ సంప్రీతి వినయ మిశ్రిత విలోక । నంబు గృష్ణుని ముఖకమలంబునందు
మాసరంబగు వికసన మధువునకు మ । ధువ్రతంబయి నిగుడ నా సువ్రతుండు. 379

ప్రతిపదార్థం: ప్రేమ= అనురాగం; సంప్రీతి= మిక్కిలి ఇష్టం; వినయ= వినమ్రత; మిశ్రిత= కలిసిన; విలోకనంబు= చూపు; కృష్ణుని= శ్రీకృష్ణుడి; ముఖ= ముఖమనే; కమలంబునందున్= పద్మంలో; మాసరంబు+అగు= అధికమైన వికసన= వికాసమనే; మధువునకున్= తేనెకొరకు; మధువ్రతంబు+అయి= తేనె త్రాగే తుమ్మెద అయి; నిగుడన్= ఒప్పారగా; ఆ సువ్రతుండు= ఆ సదాచారి.

తాత్పర్యం: అనురాగం, ఎంతో ఇష్టం, వినయం కలిసిన ధర్మరాజు చూపులు కృష్ణుడి ముఖమనే పద్మంలో వృద్ధిపొందే తేనెకొరకు తుమ్మెదవలె ప్రసరిస్తుండగా ఆ ధర్మరాజు. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అమ్మహాత్ముని సాత్యకి సహితంబుగా వీడుపట్టున కనుప ననుజన్ముల ననిచి, యుచితవర్తనంబున నుండి పదంపడి భండనంబునం జచ్చిన వారిం జిత్తంబున నిరూపించి తొడంగి. 380

ప్రతిపదార్థం: ఆ+మహాత్మునిన్= ఆ ఘనుడైన శ్రీకృష్ణుడిని; సాత్యకి సహితంబుగాన్= సాత్యకితో సహా; వీడుపట్టునకున్= ఇంటికి; అనుపన్= పంపటానికి; అనుజన్ములన్= తమ్ములను; అనిచి= పంపి; ఉచిత= తగిన; వర్తనంబునన్= నడవడికతో, ఉండి; పదంపడి= తరువాత; భండనంబునన్= యుద్ధంలో; చచ్చినవారిన్= మరణించినవారిని; చిత్తంబునన్= మనస్సులో; నిరూపించి= గుర్తించి; తొడంగి= ప్రారంభించి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడిని సాత్యకితో కూడా విడిదికి పంపండని తమ్ములను ఆజ్ఞాపించి, యోగ్యమైన నడవడికతో ఉండి, తరువాత (కొంతకాలానికి) యుద్ధంలో మరణించిన వారిని మనసులో గుర్తించి, పూనుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. బ్రాహ్మణానుజ్ఞతోఁ గూడ బంధుజనుల । కందఱకు వేఱువేఱు మహావిభూతి
వెలయ నంచిత శ్రాద్ధ క్రియలు సభక్తి । కముగ రత్న హేమాది దానములు మెఱయ. 381

ప్రతిపదార్థం: బ్రాహ్మణ= విప్రుల; అనుజ్ఞతోన్= అనుమతితో; కూడన్= తగినట్లుగా; బంధుజనులకున్= చుట్టాలకు; అందఱకున్= అంతమందికి; వేఱువేఱు= విడి విడిగా; మహా= గొప్ప; విభూతి= వైభవం; వెలయన్= ఒప్పగా; అంచిత= గౌరవించదగిన విధంగా; రత్న= మణులు; హేమ= బంగారం; ఆది= మొదలైన; దానములు= దానాలు; మెఱయన్= వెలుగుతుండగా; శ్రాద్ధక్రియలు= అపరకర్మలు; సభక్తికముగన్= భక్తితో.

తాత్పర్యం: బ్రాహ్మణుల అనుమతిలో తగినట్లుగా, బంధువులందరికీ విడి విడిగా శ్రాద్ధకర్మలను వైభవంతో, భక్తిపూర్వకంగా, మణులు రత్నాలు దానంగా ఇస్తూ. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అనుష్ఠించి ద్రోణాచార్య ద్రుపద తద్బంధు విరాట తదీయ జ్ఞాతులకును బ్రత్యేకంబ కర్ణాభిమన్యు ప్రభృతుల కెట్లట్ల సర్వదక్షిణ సామగ్రి వెలయం బరలోక క్రియలు నిర్వర్తింపంజేసి, దుర్యోధనాదులకు నంతకంటె విభవం బెసంగ ధృతరాష్ట్రుం డౌర్ధ్వదైహిక విధు లాచరించునట్లుగా నొనర్చి, తా నెఱింగిన వారల కెల్ల లగ్గు సేయుటకుఁ, దగు బంధులు లేని వసుంధరాధిపుల నెల్ల నుద్దేశించి యంచితదానంబులతోఁ జేయ ధౌమ్యుం బనిచె; మఱియును. 382

ప్రతిపదార్థం: అనుష్ఠించి= ఆచరించి; ద్రోణ+ఆచార్య= ద్రోణుడికి; ద్రుపద= ద్రుపద మహారాజునకు; తద్+బంధు= ద్రుపదుడి బంధువులకు; విరాట= విరాటరాజుకు; తదీయ= అతడి; జ్ఞాతులకును= దాయాదులకు; ప్రత్యేకంబ= విశేషంగా; కర్ణ= కర్ణుడు; అభిమన్యు= అభిమన్యుడు; ప్రభృతులకున్= మొదలైనవారికి; ఎట్లు+ఎట్లు+అ= ఏ విధమో అదే విధంగా; సర్వ= సమస్తమైన; దక్షిణ సామగ్రి= దాన సమయంలో ఇచ్చే దక్షిణకు ఉపయోగించే వస్తువులు; వెలయన్= ఒప్పగా, ఉండగా; పరలోక క్రియలు= ఉత్తర క్రియలు; నిర్వర్తింపన్+చేసి= చేయించి; దుర్యోధన+ఆదులకున్= దుర్యోధనుడు మొదలైనవారికి; అంతకంటెన్= మిగిలిన వారికంటె; విభవంబు= వైభవం; ఎసంగన్= అధికంకాగా; ధృతరాష్ట్రుండు; ఔర్ధ్వదైహిక= పరలోక; విధులు= క్రియలు; ఆచరించునట్లుగాన్= చేసేటట్లుగా; ఒనర్చి= చేసి; తాన్= తాను; ఎఱింగిన= తెలిసిన; వారలకున్+ఎల్లన్= వారందరికీ; లగ్గు= శుభం; చేయుటకున్= చేయటానికి; తగు= తగిన; బంధులు= చుట్టాలు; లేని= లేనటువంటి; వసుంధరా+అధిపులన్= రాజులకు; ఎల్లన్= అందరినీ; ఉద్దేశించి= లక్షించి; అంచిత= గౌరవించతగిన, గొప్ప; దానంబులతోన్= దానాలతో; చేయన్= చేయటానికి; ధౌమ్యున్= ధౌమ్యుడిని; పనిచెన్= నియోగించాడు; మఱియును=ఇంకా.

తాత్పర్యం: శ్రాద్ధకర్మలు నిర్వర్తించాడు ద్రోణుడికీ, ద్రుపదుడికీ అతడి బంధువులకు, విరాటరాజుకు అతడి జ్ఞాతులకు, కర్ణాభిమన్యులకు విశేషంగాను అన్ని దక్షిణలు మొదలైన వాటితో ఉత్తరలోక క్రియలు జరిపించాడు. దుర్యోధనాదులకు

అంతకన్న గొప్ప వైభవంగా పరలోక క్రియలు ధృతరాష్ట్రుడిచేత చేయించాడు. తనకు తెలిసినవారి కందరికీ శుభం కలిగించాలని అనుకొని ఉత్తర క్రియలు చేసే తగిన వారసులు లేని రాజులందరికొరకు తగిన దానాదులతో పరలోక క్రియలు నిర్వర్తించటానికి తనపురోహితుడైన ధౌమ్యుడిని నియోగించాడు. అంతేకాక.

క. చలివందిరులును సత్త్రం । బులుఁ బెట్టించెను, దటాకములు దేవగృహా
మ్ములుఁ గల్పించెను, బంధుజ । నులకు సుగతి యగుటకై వినుతభంగి నృపా! 383

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; బంధుజనులకున్= చుట్టాలకు; సుగతి= మంచిగతులు; అగుటకున్+ఐ= కలగటానికి; చలిపందిరులును= చలివేంద్రాలు (దాహార్తులకు నీటిని పోసేచోట్లు); సత్త్రంబులును= బాటసారులకు భోజనంపెట్టేచోటులు; పెట్టించెను= ఏర్పాటు చేశాడు; తటాకములు= చెరువులు; దేవగృహమ్ములు= దేవాలయాలు; కల్పించెను= నిర్మించాడు.

తాత్పర్యం: బంధువులకు ఉత్తమ లోకాలు ప్రాప్తించాలని ధర్మరాజు చలివేందరాలు సత్త్రాలు (మనిషికి అవసరమైన అన్నపానీయాలు అందరికీ అందించే తావులు) ఏర్పాటు చేశాడు. చెరువులు, దేవాలయాలు నిర్మాణం చేశాడు.

క. లోకమునఁ గలుగు భూసుర । లోకమునకు నెల్ల గోవులుం బసిఁడియు నా
నా కల్పంబులు బంధుల । కై కోటివిధముల నిచ్చె నతులిత భక్తిన్. 384

ప్రతిపదార్థం: నానాకల్పంబులు= అనేక కల్పముల కాలం; బంధువులకున్+ఐ= చుట్టాల సద్గతులకొరకు; లోకమునన్= జగత్తులో; కలుగు= ఉన్న; భూసుర= బ్రాహ్మణ; లోకమునకున్= సమూహానికి; ఎల్లన్= అందరికీ; గోవులున్= ఆవులును; పసిఁడియున్= బంగారం; కోటి విధములన్= ఎన్నో తీరులుగా; అతుల భక్తిన్= సాటిలేని భక్తిభావంతో; ఇచ్చెన్= దానం చేశాడు.

తాత్పర్యం: ఎన్నో కల్పాలకాలం తన బంధువులకు సద్గతులు లభించాలని, లోకంలో ఉన్న బ్రాహ్మణ సమూహం అంతటికీ, గోవులు, బంగారం ఎన్నో విధమైన పద్ధతులలో భక్తిభావంతో దానం చేశాడు.

వ. ఇట్లు సకలబాంధవసుహృజ్జనంబులకుం బారలౌకికక్రియలు సేసి యనృణత్వంబున వెలింగి జగంబులచేతం
బొగడు వడసి, కృతకృత్వంబుఁ బొందె; నివ్విధంబునఁ బ్రాప్తసామ్రాజ్యుం డయిన పాండవాగ్రజుం డొక్క
సముచితావసరంబున గోవిందున కభిముఖుం డయి వినయంబునం గేలు మొగిచి. 385

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సకల= అందరు; బాంధవ= బంధువులు; సుహృత్+జనంబులకున్= మిత్రులకు; పారలౌకిక క్రియలు= ఉత్తర క్రియలు; చేసి= ఆచరించి; అనృణత్వంబున= ఋణంలేకపోవటంతో; వెలింగి= ఒప్పి; జగంబులచేతన్= లోకాలన్నిటి చేత; పొగడు+పడసి= కీర్తిని పొంది; కృతకృత్యతన్= ధన్యతను; పొందెన్= పొందాడు; ఈ విధంబునన్= ఈ తీరుగా; ప్రాప్త= పొందిన; సామ్రాజ్యుండు+ఐన= రాజ్యం కలవాడైన; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; ఒక్క= ఒక; సముచిత+అవసరంబునన్= తగిన సమయంలో; గోవిందునకున్= కృష్ణుడికి; అభిముఖుండు+అయి= ఎదురు నిలిచినవాడై; వినయంబునన్= వినమ్రంగా; కేలు మొగిచి= చేతులు జోడించి.

తాత్పర్యం: ఈ విధంగా బంధువులకు స్నేహితులకు ఉత్తరక్రియలు నిర్వర్తించి, ఋణం లేనివాడై ఒప్పి లోకాలన్నిటిచేత కీర్తించబడినవాడై ధన్యుడయ్యాడు. ఈ విధంగా రాజ్యం పొందినవాడైన ధర్మరాజు తగిన సమయంలో శ్రీకృష్ణుడి ఎదుట నిలిచి వినయంతో నమస్కరించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మానవుడికి మూడు ఋణాలుంటాయి. 1. దేవఋణం, 2. ఋషిఋణం, 3. పిత్ఋణం. పిత్ఋణం చనిపోయినవారికి ఉత్తరక్రియలు నిర్వహించటంద్వారా తీరుతుంది. కనుక ధర్మరాజు బంధుమిత్రులందరికీ శ్రాద్ధకర్మలు నిర్వర్తించి ఋణవిముక్తుడయ్యాడు.

ధర్మజుఁడు శ్రీకృష్ణు నుచిత వచనంబుల స్తుతించుట (సం. 12-43-1)

తే. అమల భవదీయ సుప్రసాదమునఁ జేసి । పితృపితామహక్రమయోగ్య పీఠ మైన
వినుత సామ్రాజ్యమున కేను విభుఁడనై కృ । తార్థతానంద పూర్ణుండ నైతిఁ గృష్ణ!' 386

ప్రతిపదార్థం: కృష్ణ!= కృష్ణా!; అమల= స్వచ్ఛమైన; భవదీయ= నీ యొక్క; సుప్రసాదమునన్+చేసి= అనుగ్రహంచేత పితృపితామహక్రమ= తండ్రి, తాతల వరుసలో; యోగ్య= అర్హ (పొందదగిన); పీఠము+ఐన= ఆసనమైన; వినుత= కీర్తనీయమైన; సామ్రాజ్యమునకున్= ఈ మహారాజ్యానికి; ఏను= నేను; విభుఁడను+ఐ= రాజునై; కృత+అర్థతా= కోరినది నెరవేరటం అనే; ఆనంద= సంతోషంతో; పరిపూర్ణుండను+ఐతిన్= పూర్తిగా నిండినవాడి నయ్యాను.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! అచ్చమైన నీ అనుగ్రహంవలన తాత తండ్రులచేత వరుసగా (వంశక్రమానుగతంగా) పొందదగినదైన ప్రశస్తమైన సామ్రాజ్యానికి నేను రాజునయ్యాను. ధన్యతనొందటంవలన కలిగిన ఆనందంతో పూర్తిగా నిండిపోయాను'.

వ. అని మఱియును. 387

తాత్పర్యం: అని చెప్పి, ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ' బావలు మఱఁదులు ననుచును । నీవు కృపాతిశయ మెసఁగ నెమ్మిని మమ్ముం
గావను బ్రోవను దలఁచి ర । మావర! కలిపికొని తిరిగి మన్నించుటలన్. 388

ప్రతిపదార్థం: రమావర!= లక్ష్మీపతీ!; నీవు; కృపా+అతిశయము= కరుణయొక్క; ఆధిక్యం; ఎసఁగన్= మించగా; బావలు, మఱఁదులున్= మేనత్త కొడుకులు; అనుచును= అంటూ; కలిపికొని= చేరదీసి; తిరిగి= కలిసివర్తించి; మన్నించుటలన్= ఆదరించటాలతో; నెమ్మిని= ప్రేమతో; మమ్మున్= మమ్మల్ని (పాండవులను); కావను= కాపాడాలని; ప్రోవను= రక్షించాలని; తలఁచి= అనుకొని.

తాత్పర్యం: లక్ష్మీపతివైన శ్రీకృష్ణా! మమ్మల్ని బావలూ, మరదులూ అంటూ నీతో కలుపుకొని ప్రవర్తించటం, కరుణాతిశయంతో, ప్రేమతో మమ్ములను కాచి రక్షించాలని తలంచి.

వ. తేఁకువలేక మెలంగితిమి గాక! భవదీయ మహానుభావం బున్నరూపెఱుంగను దగం గొనియాడను నే
మెంతటి వార?'మని పలికి వెండియు. 389

ప్రతిపదార్థం: తేఁకువ= భయం; లేక= లేకుండ; మెలంగితిమి= జీవించాము; కాక; భవదీయ= నీ; మహా+అనుభావంబు= మాహాత్మ్యం; ఉన్నరూపు= కలరూపు, వాస్తవం; ఎఱుంగనున్= తెలిసికొనటానికి; తగన్= చక్కగా; కొని+ఆడనున్= పొగడటానికి; ఏము= మేము; ఎంతటివారము?= ఎంత? చాలగలమా?; అని= అంటూ; పలికి= మాటాడి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: (ఆ కారణంచేతనే) మేము భయం లేకుండ జీవించాము కదా! నీ గొప్పతనం, నీ నిజరూపం తెలిసికొనటానికి, చక్కగా కీర్తించటానికి మేమెంతటి వారం? (సమర్థులం కాము అని భావం)' అంటూ మాటాడి, ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ' ఆదిమ పురుషుఁడ వగుటను । వేదంబులు సెప్పు నవియు వెఱచుఁ బలుకఁగా
నీదృక్కకారుఁ డని దా । మోదర! నీ పెం పెఱుంగ నొరుల కలవియే? 390

ప్రతిపదార్థం: దామోదర!= కృష్ణా!; వేదంబులు= వేదాలు; ఆదిమ పురుషుఁడవు+అగుటను= సృష్టిలో మొట్టమొదటి శరీరధారివి; అగుటను= కావటం; చెప్పున్= చెపుతాయి; ఈదృక్+ప్రకారుఁడు+అని= ఈ విధమైనవాడు అని; పలుకఁగాన్= చెప్పటానికి; అవియున్= ఆ వేదాలు కూడా; వెఱచున్= భయపడతాయి; ఒరులకున్= ఇతరులకు; నీ పెంపు= నీ ఘనత; ఎఱుంగన్= తెలియటం; అలవి+ఏ= సాధ్యమౌతుందా?

తాత్పర్యం: 'కృష్ణా! నీవు సృష్టికి ఆద్యుడవని వేదాలు చెప్పుతున్నాయి. కాని, నీ విటువంటివాడివని ఇదమిత్థంగా చెప్పటానికి ఆ వేదాలే భయపడుతున్నాయి. అటువంటప్పుడు ఇతరులకు నీ ఘనత తెలిసికొనటం సాధ్యమా? (కాదు అని భావం).

క. దురితములఁ జెఱుప శుభములఁ । బెరిఁగింపం జాలునట్టి పేళ్ళులు నీకుం
బురుషోత్తమ! కడుఁ బె క్కవి । పరమార్థ ద్యోతకములు భావింపంగన్. 391

ప్రతిపదార్థం: పురుష+ఉత్తమ!= జీవులలో శ్రేష్ఠుడా!; దురితములన్= పాపాలను; చెఱుపన్= పోగొట్టటానికి; శుభములన్= శ్రేయములను; పెరిఁగింపన్= వృద్ధిచేయటానికి; చాలునట్టి= సమర్థమైన; పేళ్ళులు= నామాలు, బిరుదులు; నీకున్= నీకు; కడున్= మిక్కిలి; పెక్కు= ఎక్కువ; అవి= ఆ పేరులు; భావింపంగన్= భావనచేస్తే, బాగా మననం చేస్తే; పరమ+అర్థ= ఉత్కృష్టమైన ప్రయోజనాన్ని (పరమాత్మను); ద్యోతకములు= ప్రకాశింపచేసేవి (తెలియచెప్పేవి).

తాత్పర్యం: పురుషోత్తముడవైన శ్రీకృష్ణా! పాపాలు పోగొట్టేవీ పుణ్యాలు పెంచేవీ అయిన పేరులు నీకు ఎన్నో ఉన్నాయి. వాటిని భావన చేస్తే అవి పరమాత్మను తెలియచేస్తాయి.

విశేషం: పురుషోత్తముడు అనేది సార్థక ప్రయోగం. పురుషుడు అంటే శరీరధారి, ప్రాణి అని అర్థం. పురుషోత్తముడు అంటే జీవులన్నింటిలోను ఉత్కృష్టుడు అని సామాన్యార్థం. దానినే 'భావన' చేస్తే సర్వజీవులలోనూ ఉత్తమపురుష (నేను, తాను - ఆత్మను) గా ఉండేవాడని ద్యోతకం అవుతుంది (స్ఫురిస్తుంది).

భావన= ఒక భావాన్ని మననం చేసి చేసీ అదే తాను అయిపోవటం.

పరమార్థం= పురుషార్థాలకు పైన ఉన్నది.

భగవంతుడికి ఉన్న నామాలు స్వల్ప ప్రయోజనాలను ఆశించినవారికి (పాపాలు పోవటం, పుణ్యాలు కలగటం వంటివి) అంతే అందజేస్తాయి. వాటి పరమార్థం తెలిసి భావించినవారికి పరమార్థాన్నే స్ఫురింపచేస్తాయి. ఈ విషయం నిరూపించటానికి పురుషోత్తమ అనే నామమే ఉదాహరణ. సామాన్యార్థం శ్రేష్ఠుడు అని పరమార్థం - సర్వవ్యాపి, అంతర్యామి అయిన పరమాత్మ అని.

తే. ప్రయతు లగు సద్ద్విజులు వానిఁ బరమభక్తి । యుక్తి నెపుడుఁ బఠించుచు భక్తి ముక్తి
దాయి వగు నిన్ను సతతంబుఁ దలఁచుచును న । మస్కృతులు సేసి యవ్యయ మహిమఁగండ్రు.'392

ప్రతిపదార్థం: ప్రయతులు+అగు= పరిశుద్ధులైన; సత్+ద్విజులు= సత్‌బ్రాహ్మణులు; వానిన్= ఆ నామాలను; పరమ= ఉత్కృష్టమైన ; భక్తియుక్తిన్= భక్తికలిగి; ఎపుడున్= ఎల్లప్పుడు, సదా; పఠించుచున్= చదువుతూ, పారాయణచేస్తూ; భుక్తి= భోజనం, భోగం; ముక్తి= మోక్షం; దాయివి+అగు= ఇచ్చేవాడివైన; నిన్నున్; సతతంబున్= ఎల్లప్పుడూ; తలఁచుచును= భావిస్తూ; నమస్కృతులు= కైమోడ్పులు; చేసి= ఆచరించి; అవ్యయ= వ్యయం కాని, స్థిరమైన; మహిమన్= మాహాత్మ్యాన్ని; కండ్రు= పొందుతారు.

తాత్పర్యం: బహిరంతర శుద్ధులైన సద్బ్రాహ్మణులు ఆ నీ నామాలను చాలా గొప్పదైన భక్తితో వల్లెవేస్తూ భోగాలనూ, మోక్షాన్నీ ప్రసాదించే నిన్ను సదా భావిస్తూ నీకు నమస్కరిస్తూ ఉండి నశించని శాశ్వతమైన మహత్త్వాన్ని పొందుతారు'.

వ. అని పలికి విష్ణు విశ్వాత్మ జిష్ణు శర్వ హంస దామోదర శంభు ప్రముఖంబులగు ప్రభూత నామంబులం బ్రస్తుతించినఁ బ్రీతుండై పుష్కరాక్షుండు పుష్కలంబైన వాగ్విశేషంబుల నా ధర్మనందను నభినందించెఁ; దదనంతరంబ కొల్చియున్న జనంబుల నిజనివాసంబులకుం బోవం బనిచి, యక్కురుసత్తముండు దమ్ముల నాలోకించి. 393

ప్రతిపదార్థం: అనిపలికి= అంటూ మాటాడి; విష్ణు= వ్యాపనశీలం కలిగి విశ్వమంతా వ్యాపించినవాడు; విశ్వ+ఆత్మ= విశ్వానికి ఆత్మ అయినవాడు, విశ్వమే తాను (ఆత్మ) అయినవాడు; జిష్ణు= జయశీలి, జయించే లక్షణం కలవాడు; శర్వ= సంహారసమయంలో సకల ప్రాణులను రుద్రరూపంలో సంహరించేవాడును; హంస= ఉచ్ఛ్వాస నిశ్శ్వాసరూపమైన ప్రాణంగా, ఓంకారంగా జీవులలో ఉండేవాడు; దామోదర= దామము(మాల)ఉదరమునందు కలవాడు; శంభు= సుఖాన్ని (భక్తులకు) కలిగించేవాడు; ప్రముఖంబులు+అగు= మొదలైన; ప్రభూత= గొప్ప; నామంబులన్= పేరులతో; ప్రస్తుతించినన్= కీర్తించగా; ప్రీతుండు+ఐ= సంతసించినవాడై; పుష్కర+అక్షుండు= తామరలను పోలిన కన్నులు కలవాడు అయిన శ్రీకృష్ణుడు; పుష్కలంబు+ఐన= సమృద్ధిగా ఉన్న; వాక్+విశేషంబులన్= విశేషమైన మాటలతో; ఆ ధర్మనందనున్= ఆ ధర్మరాజును; అభినందించెన్= పొగిడాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; కొల్చి+ఉన్న= కొలువు తీర్చి ఉన్న; జనంబులన్= ప్రజలను; నిజనివాసంబులకున్= తమ ఇళ్ళకు; పోవన్= వెళ్ళండని; పనిచి= ఆజ్ఞాపించి; ఆ+కురుసత్తముండు= ధర్మరాజు; తమ్ములన్= అనుజులను; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని మాటాడి ధర్మరాజు కృష్ణుడిని విష్ణువు, విశ్వాత్ముడు, జిష్ణువు, శర్వుడు, హంసుడు, దామోదరుడు, శంభుడు మొదలైన పవిత్ర నామాలతో కీర్తించాడు. దానికి సంతసించిన శ్రీకృష్ణుడు సమృద్ధమైన మాటలతో విశేషంగా ధర్మరాజును అభినందించాడు. ఆ తరువాత కొలువుతీరి ఉన్న ప్రజలనందరినీ తమ తమ ఇళ్ళకు వెళ్ళుడని పంపించాడు. అప్పుడు తమ్ములను చూచి.

మ. ' అటవీదేశములందు గాఢబహులాయాసంబులం గంది, దు
ర్ఘట మత్స్యేశ్వరు సేవఁ గుంది, బహుసంగ్రామంబులన్ విద్విష
త్పటు నానాస్త్ర మహోగ్ర శస్త్రచయ నిర్భగ్నాంగతం బొంది యు
త్కట దుఃఖంబుల మీర లొందితి రభేద్యస్థైర్యులై నాకుఁగాన్. 394

ప్రతిపదార్థం: 'మీరలు= మీరు; నాకున్+కాన్= నాకొరకు; అభేద్య స్థైర్యులు+ఐ= మొక్కవోని స్థిరత్వం కలవారై; అటవీ దేశముల +అందున్= అరణ్య ప్రదేశాలలో; గాఢ= తీవ్రమైన; బహుల= అనేక; ఆయాసంబులన్= శ్రమలతో; కంది= బాధపడి; దుర్ఘట= కలగకూడనటువంటి; మత్స్య+ఈశ్వరు= మత్స్యదేశరాజైన విరటుడి; సేవన్= కొలువులో; కుంది= వగచి; బహు= అనేక; సంగ్రామంబులన్= యుద్ధాలలో; విద్విషత్= శత్రువుల; పటు= పటిష్ఠమైన; నానా= బహు; అస్త్ర= మంత్రపూతంగా ప్రయోగించే ఆయుధాల వలన; మహా+ఉగ్ర= గొప్ప భయంకరమైన; శస్త్రచయ= ఆయుధ సమూహంవలన; నిర్భగ్న+అంగతన్= మిక్కిలి దెబ్బతిన్న శరీరం; పొంది= కలిగి ఉండి; ఉత్కట= అధికమైన; దుఃఖంబులన్= శోకాలను; ఒందితిరి= పొందారు.

తాత్పర్యం: 'మీరు నా కొరకు స్థైర్యం చెదరనివారై అడవులలో తీవ్రమైన కష్టాలు ఎన్నో అనుభవించి బాధపడ్డారు. దురదృష్టవశాత్తు విరటుడి కొలువులో సేవచేసి కష్టపడ్డారు. అనేక యుద్ధాలలో అస్త్రశస్త్రాలచేత దెబ్బతిన్న అవయవాలు కలవారయ్యారు. అధికమైన శోకాన్ని పొందారు.

వ. నన్నుం గృతకృత్యునిం జేసితిరి; కృష్ణ ప్రసాద లబ్ధంబయిన యీ జయశోభనంబు నిజేచ్ఛాకలిత సుఖావాప్తి లీల ననుభవించుచు నాత్మప్రియ ప్రకారంబుల వర్తించుచు, నవధానంబుతో రాజ్యాంగ సప్తకం బరయుం'డని చెప్పి యాంబికేయు ననుజ్ఞతోడ. 395

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; కృతకృత్యునిన్= ధన్యుడిని; చేసితిరి= చేశారు; కృష్ణ= శ్రీకృష్ణుడి; ప్రసాద= అనుగ్రహంవలన; లబ్ధంబు+ఐన= లభించిన; ఈ జయశోభనంబు= ఈ విజయంయొక్క వైభవం; నిజ+ఇచ్ఛా కలిత= మీమీ కోరికలతో కూడుకొన్న; సుఖ+అవాప్తి= సుఖమును పొందటం అనే; లీలన్= విలాసాన్ని; అనుభవించుచున్= అనుభూతిచెందుతూ; ఆత్మ ప్రియ ప్రకారంబులన్= మనసుకు నచ్చిన తీరులలో; వర్తించుచున్= మెలగుతూ; అవధానంబుతోన్= హెచ్చరికతో; రాజ్యాంగ సప్తకంబు= రాజ్యపాలనాతంత్రంలోని ఏడు అంశాలు; అరయుండు= చూస్తూ ఉండండి; అని= అంటూ; చెప్పి= పలికి; ఆంబికేయు= ధృతరాష్ట్రుడి; అనుజ్ఞ+తోడన్= అనుమతితో.

తాత్పర్యం: 'అట్లా కష్టపడి నన్ను ధన్యుడిని చేశారు. శ్రీకృష్ణుడి అనుగ్రహంవలన లభించిన ఈ విజయ వైభవాన్ని మీమీ ఇష్టాలతో కూడిన సుఖాన్ని పొందటం అనే క్రీడను అనుభవిస్తూ, మీకు నచ్చిన విధంగా నడుచుకొంటూ హెచ్చరికతో (జాగరూకులై) రాజ్యాంగసప్తకాన్ని చూడండి (పట్టించుకొండని భావం)' అని చెప్పి ధృతరాష్ట్రుడి అనుమతితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: రాజ్యాంగ సప్తకం: 1. ప్రభువు, 2. మంత్రము, 3. ధనాగారం, 4. దుర్గం, 5. సైన్యం, 6. రాష్ట్రం (ప్రజలు), 7. మిత్రులైన రాజులు.

సీ. బహురత్నమయ ఘనప్రాసాదమండప । దాసదాసీ జనోద్భాసితంబుఁ,
దత్తుల్య వైభవ తదధిక ధనధాన్య । ముఖవస్తు సంచయ సుఖకరంబుఁ,
గిన్నర వల్లభ గృహసమానత్వ మ । హావిభూతి స్ఫురణాంచితంబు,
సర్వసంపత్పూర్ణ చారు వామాక్షీ ప్ర । చార సంశోభిత స్థలచయంబు,

తే. నైనవాని రారాజుని ల్లనిలజునకు, । దుస్ససేను మందిరము పార్థునకు, వరుస
తోడ దుర్మర్షణునియును దుర్ముఖునియు । నిండ్లు గవలకు సంప్రీతి నిచ్చె నృపతి. 396

ప్రతిపదార్థం: నృపతి= రాజు; బహు= నానా; రత్నమయ= మణులతో నిండిన; ఘన= గొప్ప; ప్రాసాద= నగరు; మండప= మంటపం; దాసదాసీజన= సేవకులు, సేవకురాండ్రతో; ఉత్+భాసితంబు= బాగా పైకి వెలిగేది; తద్+తుల్య= దానితో సమానమైన; వైభవ= విభవం; తద్+అధిక= దానికన్న ఎక్కువైన; ధన, ధాన్య= ధనం, ధాన్యం; ముఖ= మొదలైన; వస్తుసంచయ= వస్తు సముదాయంతో; సుఖకరంబున్= హాయిగొలిపేది; కిన్నరవల్లభ= కుబేరుడి; గృహ= ఇంటితో; సమానత్వ= సమానమైన; మహా= గొప్ప; విభూతి= వైభవం; స్ఫురణ= గుర్తుకు తెచ్చే; అంచితము= ఒప్పుకలది; సర్వ= సమస్త; సంపద్= సంపదల; స్ఫూర్తి= ప్రకటమవటంచేత; చారు= మనోహరమైన; వామ+అక్షి= అందమైన కన్నులు కల స్త్రీల; ప్రచార= కదలికలతో; సంశోభిత= బాగా అందమైన; స్థలచయంబున్= అనేక ప్రదేశాలు కలిగినది; ఐనవానిన్= అయినటువంటివాటిని; రారాజు= దుర్యోధనుడి; ఇల్లు= భవనం; అనిలజునకున్= భీముడికి; దుస్సహసేనుమందిరము= దుశ్శాసనుడి భవనం; పార్థునకున్= అర్జునుడికి; వరుసతోడన్= క్రమంగా; దుర్మర్షణునియును దుర్ముఖునియును= దుర్మర్షణ, దుర్ముఖుల; ఇండ్లు= మందిరాలు; కవలకున్= నకుల సహదేవులకు; సంప్రీతిన్= మిక్కిలి ఇష్టంతో; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: ధర్మరాజు దుర్యోధనుడి భవనం భీముడికి, దుశ్శాసనుడి మందిరం అర్జునుడికి, దుర్మర్షణుడి నివాసం నకులుడికి, దుర్ముఖుడి నికేతనం సహదేవుడికి ఇష్టంగా ఇచ్చాడు. ఆ భవనాలు మణిమయాలు. గొప్ప అంతఃపురాలు, మండపాలు, దాసదాసీజనాలతో ప్రకాశిస్తున్నాయి. ఆ వైభవాన్ని మించి ధనధాన్యాదులైన సంభారాలతో సుఖాన్ని కల్పిస్తాయి. కుబేరుడి ఇంటితో సమానమైన గొప్ప వైభవాన్ని కలిగి దానిని గుర్తుకు తెచ్చేవి, సమస్త సంపదలను ప్రకటించే అందగత్తెలు అటునిటు తిరుగుతూ ఉండగా కళకళలాడే ప్రదేశాలెన్నో కలిగినవి - ఆ మందిరాలు.

వ. మఱియు విదుర యుయుత్సు సంజయ ధౌమ్యుల వదనంబు లాలోకించి 'మీ మీ నికేతనంబుల మీరలు గైకొనుం' డని నియోగించి, పెద్ద నగరిలోన ధృతరాష్ట్రుండు మున్ను పన్నుగా వసియించు హర్మ్యంబున నజ్జనపతి నునిచె; నివ్విధంబున గృహంబులు విభజించి యిచ్చి కృష్ణ సాత్యకుల సవ్యసాచి సదనంబున నిల్చునట్లుగా నిర్దేశించి, యందఱం బోవం బనిచి యభ్యంతర మందిరంబున కరిగె; నా భీమసేనాదు లమ్మహనీయ వాసంబులు సేకొని యందుఁ బ్రభూతాన్న పానాద్యనుభవంబుల సుఖించియుండ నవ్విభుండు నిజేచ్ఛ విహరించె'నని యిట్లు ధర్మపుత్రు చరిత్రంబు సెప్పిన విని 'యబ్భంగిం బ్రాప్త సామ్రాజ్యుండై పాండవాగ్రజుండు పదంపడి యెత్తెఱంగున వర్తించె? సకల జగద్గురుం డగు కృష్ణుండు మఱి యెట్లుండె? నెఱింగింపు' మనుటయు. 397

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; విదుర; యుయుత్సు; సంజయ; ధౌమ్యుల; వదనంబులు= ముఖాలు; ఆలోకించి= చూచి; మీమీ నికేతనంబులు= మీమీ భవనాలు; మీరలు= మీరు; కైకొనుండు= స్వీకరించండి; అని; నియోగించి= పనిచి; పెద్ద నగరిలోన= ప్రధాన ప్రాసాదంలో; ధృతరాష్ట్రుండు; మున్ను= పూర్వం; పన్నుగాన్= చక్కగా; వసియించు= నివసించే; హర్మ్యంబునన్= భవనంలో; ఆ+జనపతిన్= ఆ ధృతరాష్ట్రుడిని; ఉనిచెన్= ఉంచాడు; ఈ+విధంబునన్= ఈ రకంగా; గృహంబులు= భవనాలు; విభజించి= విభాగంచేసి (కేటాయించి); ఇచ్చి= ఒసగి; కృష్ణసాత్యకుల= శ్రీకృష్ణుడిని, సాత్యకిని; సవ్యసాచి= కవ్వడి; సదనంబునన్= భవనంలో; నిల్చునట్లుగాన్= ఉండేటట్లు; నిర్దేశించి= సూచించి; అందఱన్= అందరినీ; పోవన్+పనిచి= వెళ్ళుడని పంపి; అభి+అంతర+మందిరంబునకున్= తన ఏకాంత మందిరానికి; అరిగెన్= వెళ్ళాడు; ఆ భీమసేన+ఆదులు= ఆ భీముడు మొదలైనవారు; ఆ+మహనీయ వాసంబులు= ఆ ఘనమైన గృహాలు; చేకొని= స్వీకరించి; అందున్= ఆ భవనాలలో; ప్రభూత= అధికమైన; అన్న, పాన+ఆది+అనుభవంబులన్= భోజనాలు పానీయాలు మొదలైనవి అనుభవిస్తూ; సుఖించి= సుఖపడుతూ;

ఉండన్= ఉండగా; ఆ+విభుండు= ఆ రాజు (ధర్మరాజు); నిజ+ఇచ్ఛన్= తనకు నచ్చినట్లు; విహరించెన్= చరించాడు; అని= అంటూ; ఇట్లు= ఈ విధంగా; ధర్మపుత్రు= ధర్మరాజు; చరిత్రంబు= చరిత; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; ఆ+భంగిన్= ఆ విధంగా; ప్రాప్త= పొందిన; సామ్రాజ్యుండు+ఐ= మహాసామ్రాజ్యం కలిగినవాడై; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; పదంపడి= తరువాత; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; వర్తించెన్= చరించాడు? (ప్రవర్తించాడు); సకల= సమస్తమైన; జగత్= లోకాలకు; గురుండు= ఉపదేష్ట; అయిన= అయినటువంటి; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; మఱి= ఇంకా; ఎట్లు+ఉండెన్?= ఏ విధంగా ఉన్నాడు?; ఎఱింగింపుము= తెలియజెప్పుము; అనుటయున్= అనగా.

తాత్పర్యం: ఇంకా విదురుడినీ, యుయుత్సుడినీ, సంజయుడినీ, ధౌమ్యుడినీ చూచి 'మీరు మీమీ ఇళ్ళను (అంతకు ముందు వారు నివాసం చేసినవి) స్వీకరించండి' అని చెప్పాడు. ప్రధానప్రాసాదంలో ధృతరాష్ట్రుడు ఇంతకుముందు ఉంటున్న ఇంటిలో అతడిని ఉంచాడు. ఈ విధంగా భవనాలను అందరికీ కేటాయించి ఇచ్చి, కృష్ణుడూ, సాత్యకీ అర్జునుడి గృహంలో ఉండేటట్లు ఏర్పాటు చేశాడు. అందరిని వెళ్ళుడని పంపి, తాను తన అభ్యంతర మందిరానికి వెళ్ళాడు. భీముడు మొదలైనవారంతా ఆ ఘనమైన మందిరాలను స్వీకరించి, అచట సిద్ధంగా ఉన్న పవిత్రమైన భోజనపానీయాలను అనుభవిస్తూ ఆనందంగా ఉన్నారు. ధర్మరాజు కూడా తనకు నచ్చినవిధంగా ఉన్నాడు. ఈ విధంగా ఉన్న ధర్మరాజు చరిత్రను వైశంపాయనుడు చెప్పగా విన్న జనమేజయుడు 'ఈ విధంగా రాజ్యం పొందిన ధర్మరాజు ఆ తరువాత ఏ విధంగా నడుచుకొన్నాడు? అన్నిలోకాలవారికి గురువైన శ్రీకృష్ణ డే విధంగా ఉన్నాడు? తెలియచెప్పుము' అని అనగా. (తరువాతి ఆశ్వాసంలోని రెండవ వచనంతో అన్వయం).

ఆశ్వాసాంతము

శా. భక్తాంభోరుహ బాలసూర్య! దనుజ ప్రధ్వంసనాచార్య! సు
వ్యక్తావ్యక్త నిజప్రకార! సదయ వ్యాపార! దాంతిక్షమా
సక్త నిత్య స్వీకృత! వేదపరిషత్సంస్తుత్య! మాయా విని
ర్ముక్త ద్యోతన! తార్క్ష్య శాక్వర మహామూర్తి స్ఫురత్కేతనా! 398

ప్రతిపదార్థం: భక్త= భక్తులు అనే; అంభోరుహ= పద్మాలకు; బాలసూర్య!= ఉదయసూర్యుడి వంటివాడా!; దనుజ= రాక్షసులను; ప్రధ్వంసన= సమూలంగా నశింపచేయటంలో; ఆచార్య!=చేసేవాడా! ప్రముఖుడా! సువ్యక్త= బాగా తెలియబడే; అవ్యక్త= ఏమీ ప్రకటంకాని; నిజ= నీ దైన; ప్రకార= పద్ధతి కలవాడా!; సదయ= కరుణతో కూడిన; వ్యాపార!= చేతలు కలవాడా?; దాంతి= ఇంద్రియ నిగ్రహమందునూ; క్షమా= ఓర్పునందునూ; అసక్త= అసక్తులైన వారిచేత; స్వీకృత= స్వీకరించబడిన; నిత్య= శాశ్వతుడా!; వేదపరిషద్= వేదసభలలో; సంస్తుత్య= బాగా కీర్తించబడేవాడా!; మాయా= అవిద్య; వినిర్ముక్త= బాగా తొలగించుకొన్నవారికి; ద్యోతన= దర్శనమిచ్చువాడా!; తార్క్ష్య= గరుడుడు; శాక్వర= ఎద్దు(నందిఅను); మహామూర్తి= గొప్ప ఆకృతులచే; స్ఫురత్= ప్రకాశించు; కేతనా!= జెండాలు కలవాడా! (హరిహరనాథా! -అని భావం).

తాత్పర్యం: భక్తుల హృదయపద్మాలకు ఉదయసూర్యుడివంటివాడా! రాక్షసులను సంహరించడంలో గొప్పవాడా! నీ చేతలలో ప్రకటం అవుతూనే, కాకుండా ఉండేవాడా! దయతో వర్తించేవాడా! ఇంద్రియనిగ్రహంలోనూ క్షమలోనూ

ఆసక్తి కలవారిచే గ్రహించబడిన నిత్య స్వరూపుడా! వేదపరిషత్తులచేత నుతింపబడేవాడా!, అవిద్యను వదలినవారికి దర్శనమిచ్చేవాడా! గరుడుడు, నంది అను గుర్తులు కల జెండాలు కలవాడా! హరిహరనాథా!

విశేషం: 'శాక్వరమహామూర్తి' అనే పాదానికి 'శాశ్వతమహామూర్తి' అనే పాఠం కొన్ని ప్రతులలో కానవస్తున్నది. కాని ఇక్కడ శాక్వర (శాక్కర) శబ్దమే ఉచితమైనది. శాక్వర - శాక్కర (ఆప్టే నిఘంటువు). హరిహరనాథుడు గరుత్మంతుడిచేత, వృషభంచేత ప్రకాశించే కేతనం కలవాడు.

క. భవదుఃఖ భరనిరాస । ప్రవీణ! నానాభిధాన! పారాశర్య
స్తవనీయ ఓరుగంటి గుణ నిధాన! స । మవబోధ నిరంతరా విదాత్మాధీనా! 399

ప్రతిపదార్థం: భవదుఃఖ భార= సంసారదుఃఖ భారాన్ని; నిరాస= పోగొట్టటంలో; ప్రవీణ!= నేర్పరి అయినవాడా!; నానా+అభిధాన= ఎన్నో పేర్లు కలవాడా!; పారాశర్య= పరాశరుడి పుత్రుడైన వ్యాసుడిచేత; స్తవనీయ!= పొగడబడినవాడా!; గుణ= అన్ని గుణాలకు; నిధాన!= నిలయమైనవాడా!; సమ్+అవబోధ= నిరంతరా ఎడతెగనిజ్ఞానమే స్వరూపముగా కలవాడా!; విద్+ఆత్మ= బోధకలిగినవారికి; అధీనా!= లోబడి ఉండేవాడా! (హరిహరనాథా!)

తాత్పర్యం: జననమరణ స్వరూపమైన సంసార దుఃఖభారాన్ని పోగొట్టటంలో నేర్పరీ! ఎన్నో నామాలు కలవాడా! (అన్ని నామాలూ ఆయనవే), వ్యాసుడిచేత కీర్తించబడినవాడా! (పురాణ, ఉపపురాణ, మహాపురాణ, బ్రహ్మసూత్రాలలో) సమస్త గుణాలకు నిలయమైనవాడా!, ఎల్లప్పుడూ మేలుకొని ఉండేవాడా! (నిత్య జాగరమూర్తీ), ఎరుకగలవారికి అధీనుడవు అయినవాడా! (హరిహరనాథా!)

మాలిని:

ప్రకృతి పురుష యోగీ! భక్తతాత్పర్య రాగీ! । సకృప హృదయపద్మా! శాంతి చిత్తైక సద్మా!
వికృతి రహితమూర్తీ! విశ్వభూత ప్రవర్తీ! । సుకృత ఫలమయాత్మా! సుస్థిరానంద వర్త్మా! 400

ప్రతిపదార్థం: ప్రకృతి= పంచభూతాత్మకమూ, త్రిగుణాత్మకమూ అయిన వ్యక్త సృష్టి; పురుష= పరమ పురుషుడు (అవ్యక్తుడు); యోగీ!= చక్కగా కలిసిన రూపమైనవాడా!; భక్త= భక్తుల; తాత్పర్య= అభిప్రాయం (తత్పరత) అందు; రాగీ!= అనురాగం కలవాడా!; సకృప= దయతోకూడిన; హృదయపద్మా!= పద్మంవంటి హృదయం కలవాడా!; శాంతి= కల్లోలంలేని, ప్రశాంతమైన; చిత్త= మనస్సు; ఏకసద్మా!= ఒకే ఒక నివాసంగా కలవాడా!; విశ్వ= లోకమందలి; భూత= ప్రాణులను; ప్రవర్తీ!= నడిపించేవాడా!; సుకృత= పుణ్యాల; ఫలమయ= ఫలస్వరూపమైన; ఆత్మ!= రూపం (మనస్సు) కలవాడా!; సుస్థిర= మిక్కిలి స్థిరమైన; ఆనంద వర్త్మా!= ఆనంద మార్గం కలవాడా!; (హరిహరనాథా!).

తాత్పర్యం: ప్రకృతి, పురుషుడు కలిసినట్టి రూపం కలవాడా! భక్తతత్పరతయందు అనురాగం కలవాడా! దయతో కూడిన హృదయపద్మం కలవాడా!, ప్రశాంతమైన చిత్తమే నివాసమైనవాడా!, మార్పుచెందని రూపం కలవాడా!, లోకాలన్నింటినీ, ప్రాణులందరినీ నడిపించేవాడా!, పుణ్య స్వరూపమైన మనస్సు, శాశ్వతమైన ఆనంద స్వరూపం కలవాడా! (హరిహరనాథా!).

విశేషం: ఈ వృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, న, మ, య, య గణాలుంటాయి. 9వ అక్షరం యతిస్థానం - ప్రాసనియమం నియతం.

గద్యము

ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున శాంతి పర్వంబు నందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఇప్పటివరకు చెప్పింది; శ్రీమత్= శుభప్రదమూ; ఉభయకవిమిత్ర= ఉభయ కవిమిత్రుడనే బిరుదు కలిగినవాడు, శైవ, వైష్ణవ, దేశిమార్గ కవులందరికీ హితుడైనవాడూ; కొమ్మన+అమాత్య పుత్ర= కొమ్మనామాత్యుడి కుమారుడైనవాడూ; బుధ= పండితులను, దేవతలను; ఆరాధన= పూజించటంచేత; విరాజి= ప్రకాశించేవాడూ (పండితులు తనను గౌరవించటంచేత రాణించేవాడూ) అయిన; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కన; ప్రణీతంబు+అయిన= చెప్పిన; శ్రీమహాభారతంబున= శ్రీ మహాభారతంలోని; శాంతిపర్వంబు అందున్= శాంతిపర్వంలో; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసం.

తాత్పర్యం: ఇప్పటివరకు చెప్పినది శుభప్రదమైన, ఉభయకవిమిత్రుడనే బిరుదు కలిగినవాడూ, కొమ్మనామాత్యుడి కుమారుడైనవాడూ, పండితులను, దేవతలను పూజించి ప్రకాశించేవాడూ (పండితులచేత గౌరవించబడి రాణించేవాడూ అయిన) తిక్కనసోమయాజిచేత చెప్పబడిన శ్రీమహాభారతంలో శాంతిపర్వంలోని మొదటి ఆశ్వాసం.

శాంతిపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీ శుచితాధృతి కరణ క । లా శౌండ కటాక్షలీల! లౌల్యరహిత! లో
లా శక్తిత్రయ సమయు । క్త్యా శోభిత రూపహేల! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= ఐశ్వర్యం; శుచితా= త్రికరణ శౌచం; ధృతి= ధీరత్వాలను; కరణ= కలుగజేయటం అనే; కలా= విద్యయందు; శౌండ= ప్రసిద్ధమగు; కటాక్షలీల!= కడగంటిచూపుల విలాసం కలవాడా!; లౌల్య-రహిత= చపలత్వము లేనివాడా!; లోలా= లక్ష్మీరూపమగు; శక్తిత్రయ= మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ రూపములగు మూడు శక్తులతో; సమ= తుల్యముగా; యుక్తి= కూడుటచేత; ఆశోభిత= అంతటా ప్రకాశించు; రూప-హేల!= సౌందర్యము, విలాసము గలవాడా!; హరిహరనాథా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీ కటాక్షప్రసారంచేతనే జనులకు సంపద, త్రికరణశుద్ధి, ధైర్యం కలుగుతాయి. నీవు స్థిరమైనవాడవు. బ్రహ్మవిష్ణు శివరూపాన సరస్వతీ, లక్ష్మీ, గౌరీ రూప శక్తిత్రయంతో కూడి విశ్వవ్యవహారానికి, అనేక సుందరరూపాలతో కూడి ఉంటావు. లేదా ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తులనుబట్టి అనేకావతారాలతో శోభిల్లుతావు.

ధర్మనందనుని ప్రవర్తన (సం. 12-45-3)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నిట్లు సమధిగత సామ్రాజ్యుండై ధర్మనందనుండు దేజో విశేషంబున మహోజ్జ్వలత్వంబునొంది మహీసురుల నాశ్రితజనంబుల నర్థులం గృతార్థులం గావించి, ధృతరాష్ట్ర గాంధారీ విదురులకు రాజ్యంబు సమర్పించి, 'మీరలింతటికి నొడయుల రేను మీ పనిచిన పని సేసి పెట్టిన యట్లు గుడిచి యుండం గలవాఁడ' నని పలికి, నిత్యంబును వారల యనుమతి గొని భవ్యమార్గంబునం బ్రజలం బాలించుచు, వారికిం బూర్వప్రకారంబుకంటె నతిశయిల్ల నెల్ల వర్తనంబులు సంప్రీతిం జెల్లించుచు విపతులైన సతుల నుష్మలికంబు వొరయకుండం గరుణ నరయుచుఁ, గృప యుయుత్సు సంజయులకుం గౌరవామాత్యులకు మన్ననలు సలుపుచుఁ, గుంతీదేవికి శుశ్రూష యాచరించుచుఁ, బాంచాలికి సౌమనస్యం బాపాదించుచు ధౌమ్యునకు సగౌరవంబుగా సకల సంపదలు నొసంగి, తన్ముఖంబున దేవ పితృ పూజనంబులు నతిథి తర్పణంబులు వైదేశిక విప్రార్చనంబులు దీనానాథ పోషణంబులుం బరమ సంతోషంబుతో నడపుచుం గృష్ణ నారాధించుచు సమస్త పౌరజనపదకోటుల మనంబులం బ్రమోదంబు పరిపూర్ణంబగునట్లుగా నివ్విధంబునఁ బ్రవర్తిల్లుచుండి, యొక్కనాఁడు రేపకడ కృష్ణుని యున్న మందిరంబునకుం బోయి. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= వ్యాసమహర్షికి శిష్యుడైన వైశంపాయనుడు; జనమేజయునకున్= పరీక్షిన్మహారాజు పుత్రుడైన జనమేజయునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; ఇట్లు= ఈ విధంగా; సమ్+అధిగత సామ్రాజ్యుండు+ఐ= రాజ్యాన్ని పొందినవాడై; ధర్మనందనుండు= ధర్మరాజు; తేజః+విశేషంబునన్= రాజ్యాభిషిక్తుడు కావటం వలన పొందిన విశేషమైన కాంతిచేత; మహా+ఉత్+జ్వలత్వంబున్+ఒంది= గొప్పదైన మిక్కిలి ప్రకాశాన్ని పొంది; మహీసురులన్=

భూదేవతలైన బ్రాహ్మణులను; ఆశ్రితజనంబులన్= ఆశ్రయించిన ప్రజలను; అర్థులన్= కోరికతో వచ్చినవారిని; కృత+అర్థులన్+కావించి= తీరిన కోర్కెలు గలవారినిగా చేసి; ధృతరాష్ట్ర గాంధారీ విదురులకున్= ధృతరాష్ట్రుడికి, గాంధారికి, విదురుడికి; రాజ్యంబు సమర్పించి= రాజ్యాన్ని ఇచ్చి; మీరలు= మీరు; ఇంతటికిన్+ఒడయులరు= దీనికంతటికి ప్రభువులు; ఏను= నేను (ధర్మరాజు); మీ పనిచిన పని+చేసి= మీరు ఆజ్ఞాపించిన పనిని చేసి; పెట్టిన+అట్లు= పెట్టిన రీతిగా; కుడిచి= తిని; ఉండన్+కలవాఁడను= ఉండగలను; అని పలికి= అని చెప్పి; నిత్యంబును= ప్రతి దినమూ; వారల+అనుమతిన్= వారి అనుజ్ఞను; కొని= తీసికొని; భవ్యమార్గంబునన్= సరైన పద్ధతిలో; ప్రజలన్+పాలించుచున్= ప్రజలను ఏలుతూ; వారికిన్= వారికి; పూర్వప్రకారంబు కంటెన్= ముందటి పద్ధతికంటె; అతిశయిల్లన్= మించేటట్లుగా; ఎల్ల వర్తనంబులు= అన్ని కార్యాలను; సంప్రీతిన్= సంతోషం కలిగించే విధంగా; చెల్లించుచున్= చేస్తూ; విపతులు+ఐన= భర్తలను పోగొట్టుకొన్న; సతులన్= స్త్రీలను; ఉమ్మలికంబు+పొరయకుండన్= దుఃఖం కలుగకుండా; కరుణన్= దయతో; అరయుచున్= గమనిస్తూ; కృప యుయుత్సు సంజయులకున్= కృపాచార్య, యుయుత్సు, సంజయులకు; కౌరవ+అమాత్యులకున్= కౌరవుల మంత్రులకు; మన్ననలు+చలుపుచున్= గౌరవిస్తూ; కుంతీదేవికిన్= తల్లిఅయిన కుంతీదేవికి; శుశ్రూష+ఆచరించుచున్= సేవ చేస్తూ; పాంచాలికిన్= ద్రౌపదికి; సౌమనస్యంబు+ఆపాదించుచున్= సంతోషాన్ని కలిగిస్తూ; ధౌమ్యునకున్= పాండవ పురోహితుడైన ధౌమ్య మహర్షికి; సగౌరవంబుగాన్= గౌరవ పూర్వకంగా; సకల సంపదలున్+ఒసంగి= సర్వ సంపదల నిచ్చి; తద్+ముఖంబునన్= ఆయన ఆధ్వర్యంలో; దేవ పితృ పూజనంబులున్= దేవతల, పితృదేవతల పూజాదికాలు; అతిథి తర్పణంబులు= అతిథులకు తృప్తి; వైదేశిక= ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన; విప్ర+అర్చనంబులు= బ్రాహ్మణులకు పూజలు; దీన+అనాథ పోషణంబులున్= దీనుల, అనాథల యొక్క సంరక్షణలు; పరమ= మిక్కిలి; సంతోషంబుతోన్= ఆనందంతో; నడుపుచున్= నిర్వర్తిస్తూ; కృష్ణున్+ఆరాధించుచున్= శ్రీకృష్ణుడిని పూజిస్తూ; సమస్త= ఎల్ల; పౌర= పుర ప్రజలను; జనపదకోటుల= గ్రామీణ ప్రజా సముదాయాల; మనంబులన్= మనసులలో; ప్రమోదంబున్= ఆనందాన్ని; పరిపూర్ణంబు+ అగునట్లుగాన్= నిండేటట్లుగా; ఈ+విధంబునన్= ఈ రీతిగా; ప్రవర్తిల్లుచున్+ఉండి= నడుచుకొంటూ ఉండి; ఒక్కనాఁడు= ఒకానొక రోజు; రేపకడ= తెల్లవారుజామున; కృష్ణుని+ఉన్న మందిరంబునకున్+పోయి= శ్రీకృష్ణుడి విడిది మందిరానికి వెళ్ళి.

తాత్పర్యం: వైశంపాయనుడు జనమేజయుడికి ఈ విధంగా చెప్పాడు: ఓ రాజా! ఈ రీతిగా ధర్మరాజు రాజ్యాన్ని పొందినవాడై విశేషకాంతిచేత మిక్కిలి ప్రకాశిస్తూ బ్రాహ్మణుల, ఆశ్రయించిన వారల, కోరికతో తన వద్ద చేరిన వారల కోర్కెల్ని తీర్చి, గాంధారీ ధృతరాష్ట్ర విదురులకు రాజ్యాన్ని సమర్పించి 'మీరు దీనికంతటికీ ప్రభువులు, నేను మీరు చెప్పిన పనిని చేసి, మీరు పెట్టిన దానిని తింటూ ఉండగలను' అని పలికాడు. ప్రతిరోజూ వారి అనుమతి తీసికొని సరైన పద్ధతిలో ప్రజలను పాలిస్తూ వారందరికీ పూర్వంకంటె అధికమైన జీవనభృతులను కల్పిస్తూ, భర్తలను పోగొట్టుకొన్న స్త్రీలకు దుఃఖం కలుగకుండా దయతో గమనిస్తూ, కృపాచార్య, యుయుత్సు సంజయులను, కౌరవమంత్రులను గౌరవిస్తూ, తల్లి అయిన కుంతిని సేవిస్తూ, ద్రౌపదికి సంతోషాన్ని కలిగిస్తూ, ధౌమ్యమహర్షికి సకల సంపదల నిచ్చి ఆయన ఆధ్వర్యంలో దేవతల, పితృదేవతల పూజాదికాలు నిర్వర్తించి, అతిథులకు సంతృప్తి కలిగిస్తూ, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన బ్రాహ్మణులను అర్చిస్తూ, దీనులను, అనాథలను సంరక్షిస్తూ శ్రీకృష్ణుడిని పూజిస్తూ, సమస్త నగరవాసుల, గ్రామీణుల మనసులను పరిపూర్ణంగా ఆనందంతో నిండింపజేస్తూ ఉన్నాడు. ఈ విధంగా ప్రవర్తిస్తున్న సమయంలో ఒకనాడు తెల్లవారుజామున ధర్మరాజు శ్రీకృష్ణుడి విడిది మందిరానికి వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఈ వచనంలో 'సమధిగత సామ్రాజ్యుండై ధర్మనందనుండు' అని చెప్పటంలో శత్రువులైన కౌరవులను కురుక్షేత్ర ధర్మయుద్ధంలో జయించి ధర్మరాజు రాజ్యాన్ని పొందినట్లు విదితమవుతుంది. తాను ధర్మబద్ధంగా సాధించుకొన్న రాజ్యాన్ని ధృతరాష్ట్ర గాంధారీ విదురులకు సమర్పించి, వారినే తన ప్రభువులుగా, తానే వారి సేవకుడుగా భావించటంలో ధర్మరాజు వినయం స్పష్టం కావటమే కాక, పుత్రశోక సంతప్తులైన గాంధారీ ధృతరాష్ట్రులకు సంతోషాన్ని చేకూర్చినట్లు వెల్లడవుతున్నది. భర్తృహీనలై దుఃఖితమతు

లైన స్త్రీలను బాధ్యతాయుత ప్రవర్తనతోపాటు ధర్మరాజు దయతో చూచిన తీరు స్పష్టమవుతున్నది. పెద్దలపట్ల, అతిథులపట్ల, దేవబ్రాహ్మణుల, దీనుల, అనాథల, పురజనుల, గ్రామీణుల పట్ల రాజుగా తన ధర్మాన్ని ధర్మరాజు నిర్వర్తించిన తీరులో ఆయన వ్యక్తిత్వం ప్రదర్శితమవుతున్నది.

ధ్యానాసక్తుఁడైన శ్రీకృష్ణునింగని ధర్మజుఁడు సంభాషించుట (సం.12-45-13)

సీ. మణిహేమ పర్యంక మహితోపవేశుని సురుచిరాభరణ విస్ఫురితగాత్రుఁ,
గౌస్తుభరత్న వికాసి వక్షస్థ్సలుఁ, బీతకౌశేయ సంవీతమూర్తి,
మేరు తటీగత మేఘసంకాశు నక్షత్రగణావృత గగన సదృశు,
నూతనోదిత రవి ద్యోతితోదయ గిరి నిభు రుక్మ బద్ధేంద్రనీల తుల్యు,

ఆ. నమ్ముకారిఁ గని కృతాంజలి యై భక్తిఁ । జిత్తవృత్తి గరము జొత్తిలంగ
నంతకంత కాననాంబుజ మలరంగ । నిట్టు లనియెఁ దియ్య మెసక మెసఁగ. 3

ప్రతిపదార్థం: మణి= మణులతో కూడిన; హేమ= బంగారు మయమైన; పర్యంక= పాన్పుమీద; మహిత= బాగుగా; ఉపవేశునిన్= కూర్చున్న వాడిని; సురుచిర= మిక్కిలి కాంతిమంతమైన; ఆభరణ= అలంకారాలతో; విస్ఫురిత= ఎక్కువగా ప్రకాశిస్తున్న; గాత్రున్= శరీరం కలవాడిని; కౌస్తుభరత్న= కౌస్తుభమనెడి రత్నంచేత; వికాసి= ప్రకాశిస్తున్న; వక్షస్థ్సలున్= ఉరో భాగం కలిగినవాడిని; పీత= పచ్చని; కౌశేయ= పట్టు వస్త్రాన్ని; సంవీతమూర్తిన్= హారంవలె ధరించిన స్వరూపం కలవాడిని; మేరుతటీ= మేరుపర్వత ప్రదేశంలో; గత= ఉన్న; మేఘ= మేఘంతో; సంకాశున్= సమానమైన వాడిని; నక్షత్రగణ= చుక్కల గుంపులచేత; ఆవృత= కప్పబడిన; గగన= ఆకాశంతో; సదృశున్= సమానమైనవాడిని; నూతన= అప్పుడే; ఉదిత= పుట్టిన; రవి= సూర్యునియొక్క; ద్యోతిత= కాంతితో కూడిన; ఉదయగిరి= ఉదయ పర్వతంతో; నిభున్= సమానమైన వాడిని; రుక్మ= బంగారంలో; బద్ధ= కూర్చబడిన (ఖచిత); ఇంద్రనీలతుల్యున్= ఇంద్రనీలంతో సమానమైనవాడిని; ఆ+మురఅరిన్+కని= ఆ ముర అనే రాక్షసుడికి శత్రువైన శ్రీకృష్ణుడిని చూచి; కృత+అంజలి+ఐ= నమస్కరించిన వాడై; భక్తిన్= భక్తితో; చిత్తవృత్తి= మనోవృత్తి; కరము= మిక్కిలి; జొత్తిలంగన్= రంజిల్లగా; అంతకున్+అంతకున్= అంతకంతకు; ఆనన+అంబుజము= పద్మమువంటి ముఖము; అలరంగన్= ఒప్పుతూ ఉండగా; తియ్యము+ఎసక మెసఁగన్= ప్రేమ అతిశయింపగా; ఇట్టులు+అనియెన్= (ధర్మరాజు) ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: మిక్కిలి కాంతిమంతమైన అలంకారాలతో ప్రకాశిస్తున్న శరీరం కలిగిన వాడూ, కౌస్తుభమనే రత్నాన్ని ఉరోభాగాన ధరించినవాడూ, పచ్చని పట్టు వస్త్రాన్ని హారంలా వేసుకొన్నవాడూ, మేరుపర్వత ప్రాంతంలో ఉన్న మేఘంతో సమానమైనవాడూ, చుక్కల గుంపులతో చుట్టబడిన ఆకాశంతో సమానమైనవాడూ, అప్పుడే ఉదయించిన సూర్యకాంతితో కూడిన ఉదయపర్వతంతో సమానమైనవాడూ, బంగారంలో పొదగబడిన ఇంద్రనీలమణితో సమానమైనవాడూ, మణులతోకూడి బంగారుమయమైన పాన్పుమీద ప్రశస్తంగా కూర్చున్నవాడూ అయిన శ్రీకృష్ణుడిని చూచి ధర్మరాజు నమస్కరించి తన మనస్సు భక్తినిమగ్నం కాగా అంతకంతకూ తన ముఖపద్మం ప్రకాశిస్తూ ఉండగా అతిశయించిన ప్రేమతో ఈ విధంగా పలికాడు.

విశేషం: సామాన్యంగా తిక్కన శైలి అలతి అలతి పద ప్రయోగంతో ఉంటుంది. కానీ ఇక్కడ శ్రీకృష్ణుని వ్యక్తిత్వ విశిష్ట వివరణకు సంస్కృత శబ్దాలను గ్రహించాడు. 'మహితోపవేశుని' అని ప్రయోగించటంలో తిక్కన శ్రీకృష్ణుడు గంభీరంగా కూర్చొని ఉన్న తీరు స్పష్టం చేశాడు.

మురారి: మురాసురుడనే రాక్షసుడికి శత్రువు అయిన కృష్ణుడు.

మురాసురుడు బ్రహ్మనుగూర్చి తపస్సు చేసి తన అరచేతిని ఎవడిపయి పెడితే వాడు భస్మమయ్యే వరాన్ని పొందాడు. విర్రవీగిన మురుడు విష్ణువును సంహరింపదలచాడు. ఆ సంగతి గుర్తించిన విష్ణువు, నీ గుండెలేల తటపటా కొట్టుకుంటున్నాయని అనగానే, లేదే అంటూ తన గుండెపయి తన అరచేతిని ఉంచుకొనగానే మురాసురుడు భస్మమయిపోయాడు.

తే. 'కడపితే రాత్రి సులభసౌఖ్యంబుగా? మ । నంబు గాఢప్రసన్నమే యంబుజాక్ష!
దైవి యగు నీదు బుద్ధి కతమునఁ గాదె । ధర్మగతిఁ బ్రాభవంబుఁ బొందంగఁ గంటి. 4

ప్రతిపదార్థం: అంబుజ+అక్ష!= పద్మాలవంటి కన్నులు కలిగిన శ్రీకృష్ణా!; సులభ సౌఖ్యంబుగాన్= హాయిగా (సుఖంగా); రాత్రిన్= రాత్రి; కడపితి+ఏ?= గడపావు కదా; మనంబు= నీ మనస్సు; గాఢ= మిక్కిలిగా; ప్రసన్నమే?= ప్రశాంతంగా ఉన్నదా?; దైవి+అగు= దైవసంబంధమైన; నీ+బుద్ధి కతమునన్= నీ బుద్ధి విశేషం వలన; ధర్మగతిన్= ధర్మమార్గంలో; ప్రాభవంబున్= రాజ్యాధికారాన్ని; పొందంగన్+కంటిన్= పొందితిని; కాదె!= కదా!

తాత్పర్యం: 'ఓ శ్రీకృష్ణా! రాత్రి సుఖంగా గడిపావు కదా! నీ మనసు మిక్కిలి ప్రశాంతంగా ఉంది కదా! దేవుడవే అయిన నీ బుద్ధివిశేషంవలన నేను ధర్మమార్గంలో రాజ్యాధికారాన్ని పొందగలిగాను కదా! (అని ధర్మరాజు పలికాడు.)

విశేషం: తిక్కన సహజశైలికి చక్కటి నిదర్శన మీ పద్యం. చిన్న చిన్న వాక్యాలలో సన్నిహితులను పలకరించే తీరును వ్యక్తం చేసిన తిక్కన లోకజ్ఞత ఇక్కడ వ్యక్తమవుతున్నది. 'దైవియగు' అని వాచ్యం చేసి శ్రీకృష్ణుడిని కేవలం బావగానే కాక, తనకు కూర్చు నెయ్యుడే కాక, భగవంతుడుగా గుర్తించటం ధర్మరాజు విజ్ఞతకు నిదర్శనం.

వ. త్రిభువన వ్యాప్త విక్రముండ వగు నీ కటాక్షంబున కలిమిం గాదె జగత్త్రయ సంభావనీయుండనై వెలింగితి' ననుచుం జేరంబోయి. 5

ప్రతిపదార్థం: త్రిభువన= ముల్లోకాలలో; వ్యాప్త= వ్యాపించిన; విక్రముండవు+అగు= పరాక్రమం కలిగిన వాడవైన (ముల్లోకాలను ఆక్రమించిన వామనుడని అర్థాంతరం); నీ= నీయొక్క; కటాక్షంబున కలిమిన్+కాదె= కటాక్షం యొక్క కలిమిచేతనే కదా! (ఉండుటచేతనే కదా అని అర్థాంతరం); జగత్త్రయ= ముల్లోకాలచేత; సంభావనీయుండను+ఐ= గౌరవించదగినవాడనై; వెలింగితిని= ప్రకాశించాను; అనుచున్= అని పలుకుతూ; చేరన్+పోయి= సమీపించి.

తాత్పర్యం: ఓ కృష్ణా! ముల్లోకాలలో వ్యాపించిన పరాక్రమం కలిగిన నీ దయవలననే ముల్లోకాల చేత గౌరవించదగిన వాడనై ప్రకాశించాను' అని అంటూ ధర్మరాజు శ్రీకృష్ణుడిని సమీపించి.

విశేషం: దశావతారాలలో వామనరూపంలో బలిచక్రవర్తిని మూడడుగు లడిగి ముల్లోకాలు వ్యాపించి బలిని అణచిన త్రివిక్రముడు శ్రీకృష్ణుడు కావటం వలన ఆ సంగతిని గుర్తుచేసి, శ్రీకృష్ణుడు త్రివిక్రముడు కావటం వలనే తనను (ధర్మరాజును) ముల్లోకాలలోను గౌరవనీయుడుగా ప్రకాశించేటట్లు చేయగలిగాడని ధర్మరాజుచేత పలికించటం వలన తిక్కన సాభిప్రాయ పదప్రయోగ దక్షత వ్యక్తమవుతున్నది.

క. తన యుచితాలాపములకు । మనుజేశ్వర! మాధవుండు మఱుమాట యొకం
డును బలుకక భవ్య ధ్యా । న నిరూఢత నున్న యపుడు నరపతి యతనిన్. 6

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= ఓ జనమేజయ మహారాజా! తన= తన (ధర్మరాజు) యొక్క; ఉచిత= తగిన; ఆలాపములకున్= మాటలకు; మాధవుండు= శ్రీకృష్ణుడు; మఱుమాట+ఒకండును= బదులుమాట కూడా; పలుకక= మాటలాడక; భవ్య= శ్రేష్ఠమైన; ధ్యాన నిరూఢతన్+ఉన్న= విశిష్ట ధ్యానంలో ఉన్న; అపుడు= ఆ సమయంలో; నరపతి= రాజైన ధర్మరాజు; అతనిన్= ఆ శ్రీకృష్ణుడితో.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ధర్మరాజు తగిన రీతిలో పలికిన ఆ పలుకులకు కృష్ణుడు మరేమీ మాటలాడక శ్రేష్ఠమైన, విశిష్టమైన ధ్యానంలో ఉండగా అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణుడిని.

వ. నిరూపించి యిట్లనియె. 7

ప్రతిపదార్థం: నిరూపించి= శ్రీకృష్ణుడిని చూచి; ఇట్లు+అనియెన్= ధర్మరాజు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు శ్రీకృష్ణుడిని చూచి ఈ విధంగా అన్నాడు.

సీ. 'పంచాత్మకంబైన పవనంబు నిగృహీత మైనది, భవదింద్రియములు మనము
నందాఁగఁ బడ్డవి, యవియును నదియును । బుద్ధియం । దొదిఁగించి శుద్ధమైన
నాలవ తెరువున లోలతారహితముల్ । గాఁగ నిన్నియును సంకలితములుగ
నంచిత క్షేత్రజ్ఞునందుఁ గూర్చినవాఁడ । వీ పరమధ్యాన మేమి కతన

తే. నొలసెనొకొ! లోకములకు నొండొక్క వింత । లేక నెమ్మది యున్నదియే? కరంబు
విస్మయముఁ బొందె నా మది; వినఁగ నర్హ। మేని వినిపింపవే నాకు నిత్తెఱంగు.' 8

ప్రతిపదార్థం: పంచ+ఆత్మకంబు+ఐన పవనంబు= పంచ ప్రాణాలతో ((ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం) కూడిన గాలి (ప్రాణవాయువు); నిగృహీతము+ఐనది= నిగ్రహించ బడింది; భవత్+ఇంద్రియములు= నీయొక్క ఇంద్రియాలు (శ్రోత్ర, చర్మ, చక్షుస్, జిహ్వా, నాసిక - అనే జ్ఞానేంద్రియాలు, వాక్కు, హస్త, పాద, పాయువు, ఉపస్థ - అనే కర్మేంద్రియాలు); మనంబునన్= మనసునందు; ఆఁగఁబడ్డవి= నిల్పబడ్డాయి; అవియును= ఆ ఇంద్రియాలూ; అదియును= ఆ మనస్సూ; బుద్ధి+అందు+ఒదిఁగించి= బుద్ధియందు చేర్చి; శుద్ధము+ఐన= స్వచ్ఛమైన; నాలవ తెరువునన్= నాలుగవదైన మార్గంలో (జాగ్రత్, స్వప్న, సుషుప్తి కాక నాలుగవదైన ధ్యాన మార్గంలో); లోలతా రహితముల్+కాఁగన్= చలనం లేకుండునట్లు కాగా; ఇన్నియును= వీటన్నింటిని; సంకలితములుగన్= కూడుకొన్నట్లుగా; అంచిత= తగినట్లు; క్షేత్రజ్ఞునందున్= జీవుడి యందు; కూర్చినవాఁడవు= చేర్చినవాడవు; ఈ పరమ ధ్యానము= ఇట్లాంటి శ్రేష్ఠమైన ధ్యానం; ఏమి కతనన్= ఏ కారణం వలన; ఒలసెన్+ఒకొ!= కలిగిందో కదా!; లోకములకున్= సమస్త లోకాలకు; ఒండు+ఒక్క= వేరొక; వింతలేక= ఎలాంటి విచిత్రమూ లేకుండా; నెమ్మది+ఉన్నదియే?= ప్రశాంతంగా ఉన్నదా?; నా మది= నా మనస్సు; కరంబు= మిక్కిలి; విస్మయమున్+పొందెన్= ఆశ్చర్యాన్ని పొందింది; వినఁగన్+అర్హము+ఏని= వినదగిన విషయమైతే (రహస్యం కాకుంటే); నాకున్= నాకు (ధర్మరాజునకు) ఈ+తెఱంగున్= ఈ పద్ధతిని; వినిపింపవే= తెలియజేయవా?

తాత్పర్యం: 'ఓ కృష్ణా! అయిదు విధాలయిన వాయువు బంధించబడింది. నీ ఇంద్రియాలు మనసులో నిల్ప బడ్డాయి. మనసును బుద్ధియందు చేర్చి స్వచ్ఛమైన ధ్యాన మార్గంలో చలన రహితంగా, తగిన రీతిలో జీవుడి యందు వీటన్నిటినీ చేర్చావు. ఇటువంటి శ్రేష్ఠమైన ధ్యానం ఎందుకు చేస్తున్నావు? సమస్తలోకాలలో ఎట్లాంటి వింత జరగకుండా ప్రశాంతతతో ఉన్నది కదా! అందుకే నా మనసు ఎంతో ఆశ్చర్యాన్ని పొందింది. రహస్యం కాకుంటే ఈ నీ ధ్యానస్థితికి కారణం నాకు తెలియ జేస్తావా? అని ధర్మరాజు అడిగాడు.

విశేషం: మూలంలో శ్రీకృష్ణుడి ధ్యానాన్ని వర్ణిస్తున్న సందర్భంలో వ్యాస భగవానుడు చెప్పిన 'స్థాణుకుడ్య శిలాభూతో నిరీహశ్చాసి' అనే పలుకులను సముచితం కాదని భావించి తిక్కన 'లోల రహితముల్ గాఁగ' అని మార్చాడు. ఇక్కడ స్థాణు, కుడ్య, శిలాభూతః అనటం నిశ్చైతన్య ద్యోతకమని భావించి 'లోల రహితముల్ గాఁగ' అంటే చైతన్యవంతుడైన ఆ మహనీయుడు సమస్తమూ స్తంభింపజేసి ధ్యాననిమగ్నుడైనట్లు వర్ణించటంలో తిక్కన ప్రతిభ గోచరిస్తున్నది.

ఆది శంకరాచార్య విరచితమైన నిర్వాణషట్క స్తోత్రంలోని

శ్లో: **"మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహం । నశ్రోత్రం న జిహ్వా న చ ఘ్రాణ నేత్రే**
న చ వ్యోమ భూమి ర్న తేజో న వాయు । శ్చిదానంద రూప శ్శివోఽహం శివోఽహమ్"

అనే శ్లోకభావాన్ని తిక్కన ఈ పద్యంలో పొదిగాడా అని అనిపిస్తుంది. ధర్మరాజు శ్రీకృష్ణుడి ధ్యాననిష్ఠలోని విశేషాన్ని తెలిసికొనాలనే కుతూహలంతో 'వినఁగ నర్హమేని వినిపింపవే' అని అడగటంలో ఎంతో మర్యాద, మనస్సంస్కారమూ విదితమై, తిక్కన లోకజ్ఞతను ప్రకటిస్తున్నది.

వ. అని యిట్లు ధర్మనందనుండు నివాతనిశ్చలదీప ప్రకారంబున నున్న యప్పరమపురుషుం బ్రార్థించి మఱియును. 9

ప్రతిపదార్థం: అని= అని పలికి; ఇట్లు= ఈ విధంగా; ధర్మనందనుండు= ధర్మరాజు; నివాత= గాలి లేకపోవటంవలన; నిశ్చల= కదలిక లేని; దీప ప్రకారంబునన్+ఉన్న= దీపంవలె ఉన్న; ఆ+పరమ పురుషున్= ఆ పురుషోత్తముడిని; ప్రార్థించి= ప్రార్థించి (వేడుకొని); మఱియును= ఇంకా.

తాత్పర్యం: అని పలికి ఈ విధంగా ధర్మరాజు "గాలి లేనందువలన కదలకుండా ఉన్న దీపంవలె ప్రకాశిస్తున్న ఆ పురుషోత్తముడైన శ్రీకృష్ణుడిని ప్రార్థించి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'క్షరము నక్షరమును నీవ; కర్తయును వి । కర్తయును నీవ; యాద్యంత గతులు నీవ;
యొక్కఁడై వెలిఁగెడు పురుషోత్తమాభి । ధాన వాచ్య వినమ్ర వాత్సల్య కల్య! 10

ప్రతిపదార్థం: నీవు+అ= నీవే (శ్రీకృష్ణుడవు); క్షరమున్= నశించెడి వాడవు; అక్షరమును= నాశరహితుడవు; నీవు+అ= నీవే; ఆది+అంతగతులు= మొదలు తుద అయిన వాడవు; వినమ్ర= వినయంతో కూడిన; వాత్సల్య= ప్రేమచేత; కల్య!= నేర్పరి అయిన వాడా!; (నీవు); ఒక్కఁడై= సమస్తమూ ఒక్కడివే ఐ; వెలిగెడు= ప్రకాశించే; పురుష+ఉత్తమ+అభిధాన వాచ్య!= పురుషోత్తముఁడనే పేరుతో పిలువబడుతున్నవాడా!

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! నశించేవాడవు, నాశరహితుడవు నీవే. ఈ సమస్తసృష్టికి కర్తవు నీవే. సర్వవినాశకారివి నీవే; ఈ సృష్టికి ఆది, అంతమూ నీవే. అంతకు మించి వాత్సల్యాన్ని వర్షిస్తూ పురుషోత్తముడని పిలువబడుతూ సమస్తంలో ఏకస్వరూపంతో వెలిగే మహనీయుడవు నీవే.

విశేషం: ఈ పద్యం వ్యాస భారతంలోని "త్వం హి కర్తా వికర్తా చ త్వం క్షరమ్ చాక్షరం చా హి" అనే శ్లోకానికి యథాతథానువాదం. అంతే కాకుండా భగవద్గీతలోని పదిహేనవ అధ్యాయంలో 16, 17, 18 శ్లోకాలలో వివరించిన క్షర, అక్షర, పురుషోత్తమ శబ్దాల విశిష్టతను ప్రతిబింబిస్తున్నది.

వ. ప్రసన్నుండవగుము; నా డెందంబు సందియంబు వాయం జేయవే!' యని విన్నవించినం బాంచజన్యధరుండు బుద్ధియు మనంబు నింద్రియంబులును గోచరత్వ సంప్రాప్తంబులు గావించి, కొంచెపు నగవున నెమ్మొగం బొప్ప నప్పుడమిఱేని నాలోకించి యిట్లనియె. 11

ప్రతిపదార్థం: ప్రసన్నుండవు+అగుము= శాంత చిత్తుడవు కమ్ము; నా డెందంబు= నా హృదయంయొక్క; సందియంబు+పాయన్+చేయవే!= అనుమానాన్ని తొలగించవా?; అని విన్నవించినన్= అని తెలుపగా; పాంచజన్యధరుండు= పాంచజన్య మనే శంఖాన్ని ధరించినవాడైన శ్రీకృష్ణుడు; బుద్ధియున్= బుద్ధిని; మనంబున్= మనసును; ఇంద్రియంబులును= ఇంద్రియాలను;

గోచరత్వ సంప్రాప్తంబులు+కావించి= కనిపించేటట్లు సహజస్థితికి తెచ్చి; కొంచెము+నగవునన్= చిరునవ్వుతో; నెఱ+మొగంబు+ఒప్పన్= అందమైన ముఖంతో అలరారుతూ; ఆ+పుడమి జేనిన్= ఆ ధర్మరాజును; ఆలోకించి= చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణుడితో 'నీవు శాంతచిత్తుడవై, నా హృదయంలోని అనుమానాన్ని తొలగించవా?' అని ప్రార్థించగా పాంచజన్యధరుడైన శ్రీకృష్ణుడు తన మనోబుద్ధీంద్రియాలను సహజస్థితికి తెచ్చి - అంటే ధ్యానాన్ని విరమించి - చిరునవ్వుతో, ప్రసన్నవదనంతో ఆ ధర్మరాజును చూచి ఇట్లా అన్నాడు.

సీ. 'గంగ యెవ్వనిఁ 'దన గర్భంబునం దతి । శ్లాఘా సమేతయై సంభరించె;
భార్గవుం డెవ్వనిఁ బరమశిష్యుఁడు గాఁగఁ । బడసి గురుత్వ మెక్కుడుగ నెగడె;
నారాముఁ డెవ్వనితో రాసి యిరువది । మూఁడు దినములకు వాఁడి దఱిఁగెఁ;
గాశీశు కన్యలు గారణంబుగఁ బోరి । యెవ్వని కోడి రనేక నృపులు;

తే. వేదములు నాలుగును ధనుర్వేదమును మ । హాస్త్రములుఁ జెంది యెవ్వనియందు వెలిఁగె
నట్టి భీష్ముండు న న్నిప్పు డాత్మఁ దలఁచు । చునికిఁ దద్గతమయ్యె నా మనము నధిప! 12

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; ఎవ్వనిన్= ఎవడిని; తన గర్భంబునందున్= తన గర్భంలో; అతి= మిక్కిలి; శ్లాఘాసమేతము+ఐ= ప్రశంసతో కూడినదై; గంగ= గంగాదేవి; సంభరించెన్= చక్కగా భరించిందో; ఎవ్వనిన్= ఎవడినైతే= పరమశిష్యుఁడు+కాఁగన్= ఉత్తమ శిష్యుడిగా; పడసి= పొంది; భార్గవుండు= భృగువంశజుడైన పరశురాముడు; గురుత్వము= గురుస్థానం; ఎక్కుడుగన్=ఎక్కువగా; నెగడెన్= ప్రసిద్ధి పొందాడో; ఎవ్వనితోన్= ఎవడితో; రాసి= ఎదుర్కొని; ఇరువది మూఁడు దినములకున్= ఇరవై మూడు రోజులకు; ఆ రాముఁడు= ఆ పరశురాముడు; వాఁడి+తఱిఁగెన్= పరాక్రమాన్ని కోల్పోయాడో; అనేక నృపులు= రాజులు పెక్కుమంది; కాశీ+ఈశు కన్యలు= కాశీరాజు పుత్రికల; కారణంబుగన్= నిమిత్తంగా; పోరి= యుద్ధంచేసి; ఎవ్వనికిన్+ఓడిరి= ఎవడితో ఓడిపోయారో; వేదములు నాలుగును= ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణం అనే వేదాలు నాలిగింటిని; ధనుః+వేదమును= ధనుర్వేదాన్ని (విలువిద్యను); మహా+అస్త్రములున్= గొప్పవైన బాణాలను (మంత్ర పూర్వకంగా ప్రయోగించేవి); చెంది= పొంది; ఎవ్వని+అందున్= ఎవనియందు; వెలిఁగెన్= ప్రకాశించెనో; అట్టి= అటువంటి; భీష్ముండు= భీష్ముడు; నన్నున్+ఇప్పుడు+ఆత్మన్+తలఁచుచున్+ఉనికిన్= ఆత్మలో న న్నిప్పుడు స్మరిస్తూ ఉండటంవలన; నా మనమున్= నా మనస్సు కూడా; తద్+గతము+అయ్యెన్= అతడియందు లీనమైనది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ప్రశంసనీయమైన గంగాదేవి ఎవడిని గర్భాన భరించిందో, ఎవడు తనకు శిష్యుడు కావటంవలన పరశురాముడు గురుశ్రేష్ఠుడయ్యాడో, ఆ పరశురాముడే ఎవడితో ఇరవై మూడు రోజులు యుద్ధంచేసి పరాక్రమాన్ని కోల్పోయాడో, కాశీరాజపుత్రికల కారణంగా పెక్కుమంది రాజులు ఎవడితో పోరాడి ఓడిపోయారో, చతుర్వేదాలు, ధనుర్వేదం, మహాస్త్రాలు పొంది ఎవడియందు అవి ప్రకాశించాయో అట్లాంటి భీష్ముడు ఈ సమయంలో నన్ను మదిలో స్మరించటంవలన నా మనస్సు అతడియందు లీనమైనది.

విశేషం: శంతనుడివలన గంగాదేవి భీష్ముడిని పుత్రునిగా పొందింది. లోకంలో గురువులకు ఎంతో మంది శిష్యులుంటారు. కాని, భీష్ముడు పరశురాముడికి శిష్యశ్రేష్ఠుడు కావటం వలన పరశురాముడి గురుత్వం లోక ప్రసిద్ధంగా వెలిగింది. అంటే గురువు వలన శిష్యుడికి ప్రఖ్యాతి రావటం లోక సహజం. కాని, ఇక్కడ భీష్ముడి వలన గురువైన పరశురామునికి కీర్తి సిద్ధించటం విశేషం. గురువైన పరశురాముడు అంబకు అభయ మిచ్చి శిష్యుడైన భీష్ముడితో ఇరవైమూడు రోజులు పోరాడి పరాక్రమహీను డయ్యాడు. ఇక్కడ

భీష్ముడు గురువును మించిన శిష్యుడయ్యాడు. అయినా 'శిష్యా దిచ్ఛేత్ పరాజయమ్' అన్న న్యాయాన్ని అనుసరించి పరశురాముడు గురుశ్రేష్ఠ డయ్యాడు. బహుశః ఏ గురువుకు ఇట్లాంటి గౌరవం దక్కలేదేమో! కాశీరాజు తన పుత్రికలైన అంబ, అంబిక, అంబాలికలకు స్వయంవరాన్ని ప్రకటించగా భీష్ముడు తన సోదరులైన చిత్రాంగద, విచిత్రవీర్యులకు వివాహం గావించటానికి సమస్త రాజులను తా నొక్కడే జయించి కాశీరాజు పుత్రికలను తెచ్చిన పరాక్రమ సంపన్నుడు భీష్ముడు. చతుర్వేదాలను, ధనుర్వేదాన్ని, మహాస్త్రాలను పొందటం వలన ఒక వ్యక్తి ప్రకాశిస్తాడు. కాని, ఇవన్నీ భీష్ముడి వశం కావటం వలన అవే ప్రశస్తంగా వెలుగొందాయి - అని తిక్కన చెప్పటంలో భీష్ముని పరాక్రమవైశిష్ట్యం వ్యక్తమవుతున్నది. ఇక్కడ భక్తితత్త్వం భీష్ముడిలో, భక్తపరాధీనత శ్రీకృష్ణుడిలో స్పష్టమవుతున్నాయి.

క. అనలము శమించు చాడ్పున । ననఘ! యతండు పరమోన్ముఖాత్ముండై తా
ననుఁ దలఁచె నింద్రియంబులు । మనమునఁ దగ నిగ్రహించి మహిత సమాధిన్. 13

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడైన ఓ ధర్మరాజా!; అతండు= ఆ భీష్ముడు; పరమ+ఉత్+ముఖ+ఆత్ముండు+ఐ= నాకు మిక్కిలి అభిముఖమైన ఆత్మ కలిగినవాడై; అనలము= అగ్ని; శమించు చాడ్పునన్= అణగినట్లు; తాన్= ఆ భీష్ముడు; ఇంద్రియంబులు= కర్మేంద్రియ, జ్ఞానేంద్రియాలను; మనమునన్= మనస్సునందు; తగన్= ఉచిత రీతిని; నిగ్రహించి= అణచిపెట్టి; మహిత= శ్రేష్ఠమైన; సమాధిన్= మనోలయస్థితిలో; ననున్+తలఁచెన్= నన్ను స్మరించాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ భీష్ముడు సమాధినిష్ఠలోని ఆసక్తిచేత, నిప్పు అణగిపోయినట్లు, జ్ఞాన, కర్మేంద్రియాలను మనస్సు నందు నిగ్రహించి, అత్యంత సమాధినిష్ఠలో ఉంటూ నన్ను స్మరించాడు.

విశేషం: సమాధి అష్టాంగాలలో ఒకటి. అష్టాంగాలు: యమం, నియమం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధ్యానం, ధారణ, మననం, సమాధి.

ధర్మరాజు శ్రీకృష్ణుడిని దర్శించి సంభాషించినప్పుడు సమాధినిమగ్నుడనై ఉన్నా నని, దీనికి కారణం పరమ కృష్ణభక్తుడైన భీష్ముడు తనను స్మరించటం వలననే తాను సమాధిగతుడనయ్యానని కృష్ణుడు బదులు చెప్పాడు. అంతేకాక భీష్ముడు యుద్ధరంగంలో అగ్నివలె జాజ్వల్యమానంగా ప్రకాశించి ఇప్పుడు శరతల్పగతుడై అగ్ని అణగినట్లు సమాధిగతుడై తనను ధ్యానించాడని ధర్మరాజుకు తెలిపి భీష్ముడి భక్తితత్త్వాన్ని వివరించాడు.

క. శరతల్పగతుం డతఁడే । శరణంబుగ నాశ్రయించి సద్భావ వ్యా
ప్తిరతుం డగుటను విను త । త్పరత నతనియందు నాదు భావం బెలసెన్. 14

ప్రతిపదార్థం: విను= (ఓ ధర్మరాజా!) వినుము; శరతల్పగతుండు= బాణాలతో చేయబడిన పాన్పునందు పరుండిన; అతఁడు= ఆ భీష్ముడు; ఏన్= నేను; శరణంబుగన్+ఆశ్రయించి= రక్షకుడని ఆశ్రయించి; సత్+భావ= శ్రేష్ఠమైన మనస్సు నందు; వ్యాప్తి రతుండు+అగుటను= అంతట వ్యాప్తిచేత! ఆసక్తు డగుట వలన; అతని+అందున్= ఆ భీష్ముడి అందు; నాదు భావంబు= నా మనస్సు; తత్పరతన్= పారవశ్యంతో; ఎలసెన్= చేరి ఉన్నది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! వినుము. శరతల్పగతుడై ఆ భీష్ముడు నన్నే శరణుగా భావించి నన్ను సమాధి నిష్ఠతో ధ్యానించటం వలన భక్త పరాధీనుడ నైన నేను ఆ భీష్ముడి మనస్సునందు సంలీనుడినై ఉన్నాను.

వ. ఇది మదీయ ధ్యానంబు తెఱం; గమ్మహాత్ముండు వసిష్ఠ శిష్యుండు, భూత భవిష్య ద్వర్తమానవేది, సర్వ విద్యా ధార భూతుం డాతం డస్తమించిన ధాత్రి యస్తమిత సుధాగభస్తి యగు రాత్రియుంబోలె నగు; సకలజ్ఞానంబులు ననాశ్రయంబులై పానుంగు పడుం; గావున నీ వతని పాలికిం బోయి నీ యడుగం దలంచిన యఖిల ధర్మంబులు

నడిగి చెప్పించుకొని నిశ్శేష నిరస్త సంశయుండవు గావలయు'నని యానతిచ్చిన నమ్మానవపతి గద్గద కంఠుం డగుచు నా వైకుంఠున కి ట్లనియె. 15

ప్రతిపదార్థం: ఇది= ఈ పైని చెప్పబడినది; మదీయ= నా యొక్క; ధ్యానంబు= ధ్యానం యొక్క; తెఱంగు= విధం; ఆ+మహాత్ముండు= ఆ మహానీయుడైన భీష్ముడు; వసిష్ఠ శిష్యుండు= వసిష్ఠుడి శిష్యుడు; భూత= గతకాలం; భవిష్యత్= రాబోయే కాలం; వర్తమాన= నడుస్తున్న కాలం; వేది= తెలిసినవాడు (అంటే త్రికాల వేది); సర్వ విద్యా+ఆధారభూతుండు= సమస్త విద్యలకు ఆధారమైన వాడు; ఆతండు+అస్తమించినన్= ఆ భీష్ముడు కన్ను మూస్తే; ధాత్రి= భూమి; అస్తమిత= అడగిపోయిన లేదా అంతరించిన; సుధా= చల్లనైన; గభస్తి+అగు= కిరణాలు కలిగిన చంద్రుడు గల; రాత్రియున్+పోలెన్+అగున్= రాత్రివలె ఔతుంది; సకల జ్ఞానంబులు= సమస్త జ్ఞానాలు (మోక్షేధీర్జ్ఞానమ్ - జ్ఞాయతే అనే నేతి జ్ఞానం జ్ఞా అవబోధనే. దీనిచేత నెరుగబడును. మోక్షసాధనమైన బుద్ధి పేరు, ధీః ధ్యాయం త్యనయేతి ధీః ధ్యై చింతాయాం. దీని చేత ధ్యానము చేయుదురు. గురుబాల ప్రబోధిక పుటలు 111, 114, అంటే ధ్యానం ద్వారా మోక్షసాధనమైనదే జ్ఞానం. ఇంతేకాక శ్రీసూర్య రాయాంధ్ర నిఘంటువులో 1. (వేదాంత) పదార్థములను గ్రహించెడు మానసిక వృత్తి, బోధము, ఎఱుక; 2. పరమాత్మ విషయమైన వివేచనము; 3. తత్త్వ జ్ఞానము; 4. పరమాత్మ జ్ఞాన సాధనమైన శాస్త్రాదుల వలన కలిగిన ఆత్మసాక్షాత్కారము; 5. వేద వేదాంగార్థ విషయమైన యెరుక; 6.ఆత్మ స్వరూప ప్రకాశనము; 7. మోక్ష ఫలకమైన బుద్ధి - అని అనేక రీతుల జ్ఞాన శబ్దార్థాలున్నాయి. 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' (తై. ఉప. 2-1) (బ్రహ్మము సత్యము జ్ఞానము అనంతమును) అనంతమైన బ్రహ్మము సత్యజ్ఞానమని అంటే (బ్రహ్మజ్ఞానమే జ్ఞానం) ఇన్ని జ్ఞానాలు; న+ఆశ్రయంబులై= అనాశ్రయంబులై= ఆశ్రమ రహితాలై; పొనుంగుపడున్+కావున(న్)= నిస్తేజమవుతాయి, శూన్యమవుతాయి, లేదా నశిస్తాయి కనుక; నీవు+అతని పాలికిన్+పోయి= నీవు ఆ భీష్ముడివద్దకు వెళ్ళి; నీ+అడుగన్+తలంచిన= నీవు అతడిని అడుగదలచిన; అఖిలధర్మంబులన్+అడిగి= అన్ని ధర్మాలను అడిగి; చెప్పించుకొని; నిశ్శేష= శేషరహితంగా అంటే ఏమీ మిగలకుండా; నిరస్త= పోయినటువంటి; సంశయుండవు= సందేహం కలవాడవు, సందేహ రహితుడవు కావలసి ఉన్నది; అని+ఆనతిచ్చినన్= అని ఆజ్ఞాపించగా; ఆ+మానవపతి= ఆ ధర్మరాజు; గద్గద కంఠుండు+అగుచున్= డగ్గుత్తిక కలవాడై; ఆ వైకుంఠునకున్+ఇట్లు+అనియెన్= ఆ వైకుంఠుడైన శ్రీకృష్ణుడితో ఇలా అన్నాడు.

తాత్పర్యం: పై పద్యాల్లో చెప్పిన రీతిగా అది శ్రీకృష్ణుడి ధ్యాన పద్ధతి అని ధర్మరాజునకు తెలియజెప్పాడు. వసిష్ఠ శిష్యుడు, త్రికాలవేది, సమస్త విద్యలకు నిలయుడు అయిన భీష్ముడు స్వర్గతుడైతే ఈ భూమి చంద్రరహితమైన రాత్రివలె అవుతుంది. సర్వజ్ఞానాలు - అంటే వేద వేదాంతాలు తత్త్వ జ్ఞానాదులన్నీ ఆశ్రయరహితాలై అదృశ్యమై పోతాయి. అందువలన భీష్ముడివద్దకు వెళ్ళి నీవు అడుగదలచిన సమస్త ధర్మాలను అడిగి తెలిసికొని సందేహ నివృత్తిని పొందవలసిం'దని శ్రీకృష్ణుడు ఆనతివ్వగా, ఆ ధర్మరాజు డగ్గుత్తికతో శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: భీష్ముడు వసిష్ఠుడివలన సకలవేదాలను, శాస్త్రాలను చదివాడు. పరశురాముడివద్ద అస్త్రవిద్యాపారీణు డయ్యాడు. ఆత్మవిజ్ఞానంలో సనత్కుమారునంతటివాడు. సర్వశాస్త్ర విద్యా నైపుణ్యంలో బృహస్పతిని పోలినవాడు. ఈ విషయాలను తిక్కన సూచించాడు.

ఉ. 'శంతనుసూనుగౌరవము సర్వము మున్నును వింటి విప్ర ల
త్యంతము వేడ్కఁ జెప్ప నతఁ డట్టిఁడ; యాతని నీవు మున్నుగా
నెంతయు భక్తిఁ గాంచుటకు నే మదిఁ గోరెద నమ్మహాత్ముఁడున్
సంతసమందు నీదయిన సన్నిధిఁ గాంచిన భక్తవత్సలా! 16

ప్రతిపదార్థం: భక్తవత్సలా!= భక్తులయందు వాత్సల్యం కలవాడా!; విప్రులు+అత్యంతము= బ్రాహ్మణులు మిక్కిలి; వేడ్కన్+చెప్పన్= సంతోషంతో చెప్పగా; శంతనుసూను= శంతను మహారాజు పుత్రుడైన భీష్ముడి యొక్క; గౌరవమున్= గొప్పతనాన్ని; సర్వమున్= సమస్తమూ; మున్నును= ముందే; వింటిన్= విన్నాను; అతఁడు+అట్టి+వాఁడు+అ= ఆ భీష్ముడు అంత గొప్పవాడే; నీవు మున్నుగాన్= నీవు ముందుండగా అంటే నీతోపాటు; ఎంతయున్ భక్తిన్= ఎంతో భక్తితో; ఆతనిన్= ఆ మహానీయుని; కాంచుటకున్+ఏన్+మదిన్+కోరెదన్= దర్శించటానికి నేను నా మనస్సులో కోరుకొంటున్నాను; నీదు+అయిన= నీ యొక్క; సన్నిధిన్+కాంచినన్= చేరువను అంటే సామీప్యాన్ని చూస్తే; ఆ+మహా+ఆత్ముఁడున్= ఆ మహానీయుడు కూడా; సంతసము+అందున్= సంతోషిస్తాడు.

తాత్పర్యం: భక్తవత్సలుడ వైన ఓ శ్రీకృష్ణా! ఇంతకు ముందే బ్రాహ్మణోత్తములు వివరించగా శంతను మహారాజు పుత్రుడైన ఆ భీష్ముడి గౌరవ మెంతటిదో నేను గుర్తించాను. నీవు చెప్పినట్లు భీష్ము డంతటి మహనీయుడే. సందేహం లేదు. నీవు ముందుండగా ఆ మహాత్ముడిని దర్శించటానికి కుతూహల చిత్తుడనయి ఉన్నాను. నీ సన్నిధిని కాంచిన భీష్ముడు కూడా ఆనందిస్తాడు.' అని ధర్మరాజు శ్రీకృష్ణుడితో చెప్పాడు.

వ. ఉత్తరాయణంబు వేచికొని యున్న యన్నరోత్తముండు బ్రహ్మమయనిధి యయిన నీ సందర్శనంబు గోరు; నా మీఁది యనుగ్రహంబునను నతని యెడం గలుగు పరిగ్రహంబునను దేవా! నీ విట్లు సేయవలయు' ననుటయు, నద్దేవకీ నందనుండు సమీప గతుం డగు సాత్యకిం గనుంగొని 'రథంబు సమకట్టుమని దారుకునకుం జెప్పుము; భీమార్జున నకుల సహదేవులను కృప యుయుత్సు సంజయులను రావింపు' మనిన నతం డట్ల చేసె దారుకుండునుం దే రాయితంబు గావించె. 17

ప్రతిపదార్థం: దేవా!= ఓ శ్రీకృష్ణా!; ఉత్తర+అయనంబు= ఉత్తరాయణం అంటే ఉత్తర దిక్కులోని సూర్యగమనం (సంవత్సరంలో ఆరు నెలలపాటు సూర్యుడు ఉత్తర, దక్షిణ దిక్కులలో ఉంటాడు); వేచికొనిఉన్న= ప్రతీక్షిస్తున్న; ఆ నర+ఉత్తముండు= ఆ మానవ శ్రేష్ఠుడు అయిన భీష్ముడు; బ్రహ్మ+మయ నిధి+అయిన= బ్రహ్మమయమైన నిధి; నీ సందర్శనంబున్= నిన్ను చూడటాన్ని; కోరున్= కోరుకొంటున్నాడు; నా మీఁది+అనుగ్రహంబుననున్= నాపైని దయవలననూ; అతని యెడన్+కలుగు= ఆ భీష్మునిపై కలిగే; పరిగ్రహంబుననున్= ప్రీతితో స్వీకరించటంతోనూ; నీవు+ఇట్లు+చేయవలయున్+అనుటయున్= నీవీ విధంగా చేయాలని ధర్మరాజు చెప్పగా; ఆ+దేవకీ నందనుండు= ఆ దేవకీదేవి పుత్రుడు శ్రీకృష్ణుడు; సమీప గతుండు+అగు= దగ్గరలోనే ఉన్నటువంటి; సాత్యకిన్+కనుంగొని= తమ్ముడైన సాత్యకిని చూచి; రథంబు= రథాన్ని; సమకట్టుము+అని= సిద్ధం చేయుమని; దారుకునకున్+చెప్పుము= సారథియైన దారుకునకు చెప్పు; భీమ+అర్జున నకుల సహదేవులను+కృప యుయుత్సు సంజయులను= భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు, కృపుడు, యుయుత్సుడు, సంజయుడు అనేవారిని; రావింపుము+అనినన్= పిలిపించుమని చెప్పగా; అతండు+అట్లు చేసెన్= ఆ సాత్యకి అట్లా చేశాడు; దారుకుండునున్+తేరు+ఆయితంబు+కావించె(న్)= సారథి అయిన దారుకుడు రథం సిద్ధం చేశాడు.

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! తనువు చాలించాలని ఉత్తరాయణం కొరకు ఎదురుచూస్తున్న ఆ మహనీయుడైన భీష్ముడు పరబ్రహ్మ స్వరూపుడవు, అన్నిటికీ నిధివైన నీ సాన్నిధ్యాన్ని అభిలషిస్తూ ఉంటాడు. అతడిపై గల దయతోను, నా మీది ఆదరంతోను నీ వా మహాత్ముడి వద్దకు వెళ్ళవలసిం' దని కోరుతున్నానని ధర్మరాజు వేడుకొన్నాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజు అభ్యర్థనను గుర్తించి, తన సమీపంలోనే ఉన్న తమ్ముడైన సాత్యకిని పిలిచి 'వెంటనే రథం సిద్ధం చేయవలసిం దని సారథి అయిన దారుకుడితో చెప్పుము. భీమార్జున నకుల సహదేవులను, కృపాచార్య,

యుయుత్సు, సంజయులను వెనువెంటనే రప్పించుము' అని సెలవిచ్చాడు. వెంటనే సాత్యకి అన్న మాటలను పాటించాడు. దారుకుడు రథం ఆయత్తం చేశాడు.

విశేషం: సంవత్సరంలో ఆరేసి నెలలపాటు సూర్యుడు ఉత్తర దక్షిణ దిక్కులలో పయనిస్తూ ఉంటాడు.

ఉత్తరాయణం: మకర సంక్రాంతి మొదలుకొని కర్కాటక సంక్రాంతి వరకు గల కాలాన్ని ఉత్తరాయణ మంటారు. ఉత్తరాయణ పుణ్యకాలంలో పరమపదిస్తే ఉత్తమ గతులు కలుగుతాయని విశ్వాసం. అందుకే భీష్ముడు ఉత్తరాయణం కోసం వేచి ఉన్నాడు.

బ్రహ్మలవికారం: బ్రహ్మ నవబ్రహ్మలని ప్రతీతి. భృగువు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అంగిరసుడు, దక్షుడు, అత్రి, మరీచి, వసిష్ఠుడు - అనీ వీరే కాక బాల, కుమార, అర్క, వీర, విశ్వ, తారక, గరుడ, స్వర్గ, పద్మ బ్రహ్మలనీ నవబ్రహ్మలు.

బ్రహ్మమయోనిధిః అనే మూల ప్రయోగాన్ని తిక్కన 'బ్రహ్మమయనిధి' అని యథాతథంగా వాడుకొన్నాడు. పరబ్రహ్మ స్వరూపుడు, సమస్తనిధి అయిన శ్రీకృష్ణుడు అని అర్థం.

క. అది రత్నరుచుల పెల్లున । నుదితార్కునిఁ బోలి వెలుఁగుచుండెను జవసం
పదుదీర్ణ సత్త్వ సారా । స్పద సుగ్రీవాదిరథ్య సంశోభిత మై. 18

ప్రతిపదార్థం: అది= ఆ రథం (దారుకుడు ఆయత్తం చేసి తెచ్చిన శ్రీకృష్ణుడి రథం); జవ= వేగంయొక్క; సంపద్= సంపద అంటే ఆధిక్యం చేత; ఉదీర్ణ= గొప్పదయినట్టి; సత్త్వ= బలం యొక్క; సార= సారానికి (చేవకు); ఆస్పద= ఆటపట్టయిన; సుగ్రీవ+ఆది= శ్రీకృష్ణుడి రథానికి పూన్చిన గుర్రాలలో (సుగ్రీవం, శైబ్యం, మేఘ పుష్పం, వలాహకం అనే నాలుగింటిలో) ఒకటైన సుగ్రీవమనే గుర్రం మొదలుకొని; రథ్య= గుర్రాలచేత; సంశోభితము+ఐ= మిక్కిలి అందమైనదై; రత్న= మణుల యొక్క (నవరత్నాలు: మౌక్తికం, పద్మరాగం, వజ్రం, వైడూర్యం, ప్రవాళం, మరకతం, నీలం, గోమేధికం, పుష్యరాగం); రుచుల= కాంతుల యొక్క; పెల్లునన్= ఆధిక్యంచేత; ఉదిత= అప్పుడే ఉదయించిన; అర్కునిన్+పోలి= సూర్యుడివలె; వెలుఁగుచుండెను= ప్రకాశిస్తూ ఉన్నది.

తాత్పర్యం: ఆ విధంగా దారుకుడు ఆయత్తంచేసి తెచ్చిన శ్రీకృష్ణుడి రథం అత్యంత వేగవంతమూ, దేహదార్ఢ్యమూ కలిగిన సుగ్రీవం మొదలైన శ్రీకృష్ణ రథాశ్వాలతో శోభావహమై, నవరత్న శోభితమై ఉండటంచేత, అప్పుడే ఉదయించిన సూర్యుడివలె ప్రకాశిస్తూ మనోహరమై ఒప్పుతూ ఉండింది.

వ. ఆ సమయంబున నక్కడం బారాశర్య నారద దేవల దేవస్థాణు వాత్స్య దేవరాత ప్రభృతి పరమ మునీంద్ర పరివేష్టనంబు గలిగి గాంగేయుండు గ్రహగణ పరివృతుండైన చంద్రుండునుంబోలెఁ దల్పీభూత శాతశరశతంబుల చేత శోభిల్లి సందర్శనీయగభస్తి వితానుండగు నస్తమయ సమయ భానుం గ్రేణిసేయుచుఁ గృష్ణుం జిత్తంబున నిరతిశయ నిష్ఠ నిలిపికొనియుండి చేతులు మొగిడ్చి సుపుష్టస్వరంబున నిట్లని స్తుతియించె. 19

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ దారుకుడు శ్రీకృష్ణుడి రథం సిద్ధంచేసి తెచ్చినప్పుడు; అక్కడన్= శరతల్పగతుడై భీష్ముడున్న ప్రదేశంలో; పారాశర్య నారద దేవల దేవస్థాణువాత్స్య దేవరాత= పరాశరుని పుత్రుడైన వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, వాత్స్యుడు, దేవరాతుడు; ప్రభృతి= మొదలైన; పరమ ముని+ఇంద్ర= శ్రేష్ఠులైన ముని నాథులచేత; పరివేష్టనంబు+కలిగి= చుట్టు ఉన్నటువంటి వారిని కలిగి ఉన్న; గాంగేయుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; గ్రహగణ= నవగ్రహాల సమూహంచేత; పరివృతుండు+ఐన= చుట్టబడిన వాడైన; చంద్రుండునున్+పోలెన్= చంద్రుడివలె; తల్పీభూత= పాన్పుగా చేయబడిన; శాత= వాడి అయిన; శరశతంబుచేతన్= నూరు బాణాలచేత; శోభిల్లి= ప్రకాశించినవాడై; సందర్శనీయ= చూడటానికి వీలయిన; గభస్తి=

సూర్య కిరణములయొక్క; వితానుండగు= సమూహమును కలిగినవాడయి; అస్తమయ= అస్తమించే; సమయ= కాలమందలి భానున్= సూర్యుని; క్రేణి+చేయుచున్= పరిహసిస్తూ; కృష్ణున్= కృష్ణుడి; చిత్తంబునన్= మనస్సునందు; నిరతిశయ నిష్ఠన్= మిక్కిలి నిష్ఠతో; నిలిపికొనిఉండి= ఉంచుకొని; చేతులు మొగిడిచి= (నమస్కార పూర్వకంగా) చేతులు జోడించి; సుపుష్ట స్వరంబునన్= ఉచ్చైస్స్వరంతో; ఇట్లు+అని= ఈ విధంగా; స్తుతించెన్= స్తోత్రం చేశాడు.

తాత్పర్యం: దారుకుడు సిద్ధంచేసి రథం తెచ్చిన సమయంలో భీష్ముడు శరతల్పగతుడై ఉన్న ప్రదేశంలో వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, వాత్స్యుడు, దేవరాతుడు ప్రభృతులయిన మహాముని శ్రేష్ఠులచేత చుట్టబడిన భీష్ముడు నవగ్రహాల సమూహంచేత చుట్టబడిన చంద్రుడివలె వాడి అయిన అనేక బాణాలచేత చేయబడిన పాన్పుమీద ప్రకాశిస్తూ చూడటానికి వీలయిన అస్తమయసూర్యుడిని పరిహసిస్తూ శ్రీకృష్ణుడిని నిరతిశయమైన నిష్ఠతో తన మనస్సునం దుంచుకొని ఉండి, చేతులు జోడించి ఉచ్చైస్స్వరంతో ఈ విధంగా స్తుతించాడు.

విశేషం: అలం: ఉపమ. మహర్షుల జాబితా మూలంలో ఎక్కువగా ఉండగా తిక్కన దాన్ని సంక్షిప్తంచేసి వ్యాస, నారద, దేవల, దేవస్థాణు, వాత్స్య, దేవరాత ప్రభృతి మహామునిశ్రేష్ఠులు అని మాత్రం పేర్కొన్నాడు. మునులచేత చుట్టబడిన భీష్ముడు గ్రహగణాలతో చుట్టబడిన చంద్రుడివలె ఉన్నాడని చెప్పటంలో భీష్ముడు పండిపోయిన రీతి స్పష్టమవుతుంది. ఇంకా స్వర్గతుడు కావటానికి సిద్ధంగా ఉండి ఉత్తరాయణం కొరకు ఎదురు చూస్తున్న భీష్ముడి "సందర్శనీయ గభస్తి వితానుండగు నస్తమయ సమయ భానుంగ్రేణి సేయుచు" - అని సముచితంగా వర్ణించాడు తిక్కన.

భీష్ముఁడు శ్రీకృష్ణుని భక్తియుక్తుండై స్తుతించుట (సం. 12-47-7)

సీ. 'శుచియును హంసుండు శుచిషత్తుఁ బరముండుఁ। బరమేష్ఠియును నగు భవ్యుఁ గొలుతు;
మునులును సురలు నెవ్వనియున్నరూపెఱుం। గరు సర్వవిదుని నప్పురుషుఁ గొలుతు;
శ్రుతులు సెప్పఁగ మహామతులు దుఃఖౌషధం। బుగ నెఱింగెడు పుణ్యమూర్తిఁ గొలుతు;
లోకంబు లెల్లఁ గల్గుట నిల్చు టొదుఁగుట। తనయంద యగు మహోత్తరునిఁ గొలుతు;

తే. బక్షి రత్నచయంబు బుష్ప వ్రజంబుఁ। బంజరము త్రాడు నార యుపాశ్రయముగ
నుండు చాడ్పున విశ్వంబు నుండుటకు సు। ఖాస్పదం బగు పుండరీకాక్షుఁ గొలుతు. 20

ప్రతిపదార్థం: శుచియును= శుచి అయిన అగ్ని; హంసుండున్= సూర్యుడు; శుచిషత్తున్= శుచి అయిన ప్రదేశాలలో నివసించే వాడైన బ్రహ్మ; పరముండున్= పరమాత్ముడూ; పరమేష్ఠియున్= పరబ్రహ్మ; అగు= అయినట్టి; భవ్యున్= శ్రేష్ఠుడయిన శ్రీకృష్ణుడిని; కొలుతున్= పూజిస్తాను; మునులును= మహర్షులూ; సురలున్= దేవతలూ; ఎవ్వని= ఎవడియొక్క; ఉన్నరూపు= నిజమైన స్వరూపాన్ని; ఎఱుంగరు= తెలియరో అట్టి; సర్వవిదునిన్= సమస్తం తెలిసిన; ఆ+పురుషున్= ఆ పరమ పురుషుడైన శ్రీకృష్ణుడిని; కొలుతున్= అర్చిస్తాను; శ్రుతులు= వేదాలు; చెప్పఁగన్= (ఎవరిని గురించి) చెప్పుతున్నాయో; మహామతులు= జ్ఞాన సంపన్నులు (బుద్ధిమంతులు); దుఃఖ= దుఃఖమనే రోగానికి; ఔషధంబుగన్= మందువలె; ఎఱింగెడు= తెలిసికొనేటటువంటి; పుణ్యమూర్తిన్= పుణ్య పురుషుడైన శ్రీకృష్ణుడిని; కొలుతున్= ప్రార్థిస్తాను; లోకంబులు+ఎల్లన్= జగత్తులన్నీ; కల్గుట= సృజించబడటం; నిల్చుట= నిలబడటం (స్థితి); ఒదుఁగుట= నాశనం కావటం (లయం); తనయందు+అ+అగు= తనలోనే ఉన్న; మహా+ఉత్తరున్= మహాశ్రేష్ఠుడైన ఆ శ్రీకృష్ణుడిని; కొలుతున్= కొలుస్తాను; పక్షి= పిట్ట; రత్నచయంబున్= మణుల యొక్క సమూహమూ; పుష్ప వ్రజంబున్= పువ్వుల సమూహమూ; పంజరమున్= పంజరం వలననూ; త్రాడున్= దారం వలననూ; నారయున్= నార వలననూ;

ఉప+ఆశ్రయముగన్= ప్రాపుగా; ఉండు చాడ్పునన్= ఉన్నట్లుగా; విశ్వంబు= ఈ ప్రపంచమంతా; ఉండుటకున్= (సువ్యవస్థితమై) నిలవటానికి; సుఖ+ఆస్పదంబు+అగు= సుఖమయం - ఏ విధమైన ఇబ్బంది లేకుండా ఉండే ఆశ్రయమైన; పుండరీక+అక్షున్= తెల్ల తామరల వంటి కన్నులు కలిగిన శ్రీకృష్ణుడిని; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: శుచి, హంసుడు, శుచిషత్తు, పరమాత్ముడు, పరబ్రహ్మ అయిన శ్రీకృష్ణుడిని పూజిస్తాను, మహర్షులు దేవతలు కూడా ఎవడి కలరూపు తెలిసికొనలేకపోయారో అట్లాంటి పరమ పురుషుడైన శ్రీకృష్ణుడిని అర్చిస్తాను. ప్రాజ్ఞులు దుఃఖరోగానికి ఎవరినయితే ఔషధంగా భావించారో ఆ పుణ్యపురుషుడైన శ్రీకృష్ణుడిని ప్రార్థిస్తాను. ఈ జగత్తులన్నింటి సృష్టి స్థితి లయములకు కారణ మెవ్వడో ఆ మహాశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడిని కొలుస్తాను. పక్షి పంజరాన్ని, రత్నసమూహం దారమునూ, పూలు నారనూ ప్రాపుగా గొని ఉన్నట్లుగానే ఈ ప్రపంచం సువ్యవస్థితమై నిలవటానికి ఉత్తమాశ్రయమైన పుండరీకాక్షు డైన శ్రీకృష్ణుడిని స్మరిస్తాను.

విశేషం: అలం: యథాసంఖ్యం. పరబ్రహ్మ వరకు సమస్త దేవతామయుడై సర్వజగత్తుల సృష్టి స్థితి లయ కారణ భూతుడయి సమస్తమూ తానే అయిన శ్రీకృష్ణుడిని భీష్ముడు స్తుతించాడు. సమస్తకారణభూతుడు కృష్ణుడు అనటానికి ఈ పద్యంలోని ప్రతి పదమూ ఉపకరిస్తుంది.

అ. హరి సహస్ర శీర్ష్ణఁ బరము సహస్రాక్షు । వేదమయు సహస్రపాదు నలఁతు
లైన వారి కంటె నలఁతి పెద్దలకును । జాలఁబెద్ద యగు దయాళుఁ గొలుతు. 21

ప్రతిపదార్థం: హరిన్= శ్రీకృష్ణుడిని; సహస్ర శీర్షన్= వేయి తలలు కలవాడిని; పరమున్= శ్రీకృష్ణుడిని; సహస్ర+అక్షున్= వేయి కన్నులు కలవాడిని; వేదమయున్= సమస్త వేదములూ తానే అయినవాడిని; సహస్రపాదున్= వేయి పాదాలు కలవాడిని; అలఁతులైన వారి కంటెన్= మిక్కిలి చిన్నవారికంటె; అలఁతిన్= చిన్న వానిని; పెద్దలకున్+చాలఁక+పెద్ద అగు= మిక్కిలి పెద్దలైన వారికంటె మిక్కిలి పెద్దవాడైన; దయాళున్= దయామయుడైన శ్రీకృష్ణుడిని; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: వేయి తలలతో, వేయి కన్నులతో, వేయి పాదాలతో, వేదమయుడై పరమశ్రేష్ఠుడైన హరిని, చిన్నవారికంటె మిక్కిలి చిన్నవాడైన వాడిని, పెద్దలకంటె మిక్కిలి పెద్దవాడయిన వాడిని దయామయుడైన శ్రీకృష్ణుడిని స్మరిస్తాను.

విశేషం: సహస్ర శీర్షాదిగా పురుష సూక్తంలోను విష్ణు సహస్రనామ స్తోత్రంలోనూ, విష్ణువును గూర్చి చెప్పబడిన అంశాలను, "అణోరణీయాన్ మహతో మహీయాన్" అన్న విశేషాలను వ్యాస మహర్షి ప్రయోగించాడు. అదే రీతిగా తిక్కన ఈ చిన్న పద్యంలోనూ కూర్చటం విశేషం.

క. అమృతమయు, ఋగ్యజు స్సా । మముల యుపనిషద్వచ స్సమాజములకు వా
చ్యమయిన పురుషోత్తము, ని । క్కము రూపగు వాని భక్తిగమ్యుఁ దలంతున్. 22

ప్రతిపదార్థం: అమృతమయున్= నాశరహితుడిని; ఋక్+యజుః+సామముల= ఋగ్వేద, యజుర్వేద, సామవేదాల యొక్క; ఉపనిషత్+వచః+సమాజములకున్= ఉపనిషత్తులలోని వాక్య సమూహానికి; వాచ్యము+అయిన= అభివ్యక్తీకరించే (తెలియజేసే); నిక్కము రూపు+అగు వానిన్= సత్య స్వరూపమైన వాడిని; భక్తి గమ్యున్= భక్తితో పొంద దగినవాడిని; పురుషోత్తమున్= పురుషోత్తముడైన శ్రీకృష్ణుడిని; తలంతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: అమృతమయుడు, వేదాలు, ఉపనిషత్తుల వాక్య సమూహాలచేత వాచ్యుడు, సత్యస్వరూపుడు, భక్తితో పొంద దగినవాడూ అయిన పురుషోత్తముడిని ధ్యానిస్తున్నాను.

విశేషం: భగవంతుడు భక్తపరాధీనుడు అనే అంశాన్ని తెలియచేయటానికే తిక్కన 'భక్తిగమ్యుఁడు' అనే మాట ప్రయోగించాడు.

ఆ. అరణి నగ్ని వొడము కరణి దేవకి యందు । విప్రకర్మయజ్ఞ వేద గుప్తి
కై జనించె నెవ్వఁ డవ్వసుదేవ నం । దను భజింతు నేకతానిరూఢి. 23

ప్రతిపదార్థం: ఎవ్వఁడు= ఎవడైతే; అరణిన్= త్రచ్చి నిప్పు పుట్టించే కొయ్యవలన; అగ్ని= అగ్నిదేవుడు; పొడము కరణిన్= పుట్టిన రీతిగా; దేవకి+అందున్= దేవకీదేవి గర్భమందు; విప్రకర్మయజ్ఞ= బ్రాహ్మణులయొక్క కర్తవ్యమైన యజ్ఞాలయొక్క; వేద= వేదాలయొక్క; గుప్తికయి= సంరక్షించుటకయి; జనించెన్= పుట్టాడో; ఆ+వసుదేవ నందనున్= ఆ వసుదేవ పుత్రుడైన శ్రీకృష్ణుడిని; ఏకతా నిరూఢిన్= ఏకాగ్ర చిత్తంతో; భజింతున్= కొలుస్తాను.

తాత్పర్యం: అరణుల రాపిడివలన అగ్నిదేవుడు ఉద్భవించినట్లు దేవకీదేవి వసుదేవులకు సుతుడుగా, బ్రాహ్మణ కర్తవ్యమైన యజ్ఞ వేదాలను సంరక్షించటంకొరకు జన్మించిన శ్రీకృష్ణుడిని ఏకాగ్రచిత్తంతో స్మరిస్తాను.

విశేషం: అలం: ఉపమ. పరిశుద్ధమైన అగ్నివలె శ్రీకృష్ణుడు సైతం యజ్ఞ వేదాల సంరక్షకుడిగా పరిశుద్ధుడనే అంశాన్ని కవి ఈ పద్యంలో స్పష్టం చేశాడు. 'ఏకతానిరూఢి' అంటే జ్ఞాన కర్మేంద్రియాలను మనస్సునందు సమైక్యం చేసికొని భీష్ముడు శ్రీకృష్ణుడిని స్తుతించాడని భావం.

తే. ఒకఁడు పండ్రెండు మూర్తులై యుండునట్లు । గా హిరణ్య వర్ణంబగు గర్భ మదితి
దాల్చి యెవ్వానిఁ గనియె దైత్యఘ్ను నట్టి । దేవు సూర్యాత్మకునిఁ బ్రణుతింతు విష్ణు. 24

ప్రతిపదార్థం: ఒకఁడు= ఒక్కడే; పండ్రెండు మూర్తులు+ఐ= పండ్రెండుగురు ఆదిత్యులై; ఉండునట్లుగాన్= ఉండే రీతిగా; అదితి= కశ్యప ప్రజాపతి భార్య అయిన అదితి; హిరణ్య వర్ణంబు+అగు= బంగారు రంగు కలిగిన; గర్భము+తాల్చి= గర్భం ధరించి; ఏ+వానిన్+కనియెన్= ఎవడిని కన్నదో; అట్టి దైత్యఘ్నున్= రాక్షసుడైన బలిచక్రవర్తిని సంహరించిన అట్టి వామనుడనే వాడిని; దేవున్= భగవంతుడిని; సూర్య+ఆత్మకునిన్= ద్వాదశ సూర్యాత్మకుడైన; విష్ణు(న్)= శ్రీ మహా విష్ణువును; ప్రణుతింతున్= నమస్కరిస్తున్నాను.

తాత్పర్యం: విష్ణువు ద్వాదశ సూర్యాత్మకుడు. బలిచక్రవర్తి సంహారార్థం అదితి గర్భంలో వామనమూర్తిగా జన్మించిన శ్రీ మహావిష్ణువును దేవదేవుడిగా సంస్మరిస్తాను.

విశేషం: ద్వాదశాదిత్యులు: అంశుడు, భగుడు, మిత్రుడు, వరుణుడు, ధాత, అర్యముడు, జయంతుడు, భాస్కరుడు, త్వష్ట, పూషుడు, ఇంద్రుడు, విష్ణువు. ద్వాదశాదిత్యులలో ఒకడు విష్ణువు. సూర్యాత్మకు డైన శ్రీకృష్ణుడిని స్మరిస్తున్నాడు భీష్ముడు.

క. సురపితృకోట్లం బూర్వా । పర పక్ష దినముల నమృత పాన ప్రీతిం
బొరయం జేయుచు వెలిఁగెడు । హరి సోమాత్మకునిఁ గొల్తు నాత్మేశ్వరునిన్. 25

ప్రతిపదార్థం: సురపితృకోట్లన్= దేవతలయొక్క, పితరుల యొక్క సమూహాలకు; పూర్వ+అపర పక్ష దినములన్= నెలలో శుక్ల, కృష్ణ పక్ష దినాలలో; అమృతపాన= అమృతాన్ని త్రాగటమునందలి; ప్రీతిన్= ఇష్టంతో; పొరయన్+చేయుచున్= పొందజేస్తూ; వెలిఁగెడు= ప్రకాశించునట్టి; ఆత్మ+ఈశ్వరునిన్= నా హృదయాధీశ్వరుడైన; సోమ+ఆత్మకునిన్= చంద్రాత్మకుడైన హరిని; కొల్తున్= పూజిస్తాను.

తాత్పర్యం: నెలలోని శుక్లపక్షంలో దేవతలను, కృష్ణ పక్షంలో పితృదేవతలను తన అమృతాన్ని ప్రీతితో ఇచ్చి పోషించే ఓషధీరూపు డైన వాడిని, నా హృదయాధీశ్వరు డైన చంద్రాత్మకు డైన హరిని ధ్యానిస్తాను.

విశేషం: దక్షుడు శపించిన సందర్భంలో శివుని ఆశ్రయించగా తగవు తీర్చటానికి బ్రహ్మ చంద్రుడిని రెండుగా విభజించి శివుడి తలపై సగమూ, హిమవత్పర్వతంలో సగమూ ఉండేటట్లు నిర్ణయించాడు. దక్షుడి శాపం అనృతం కాకుండటానికి తారల కిచ్చిన భాగం వృద్ధి క్షయాలు పొందుతూ ఉండేది. ఆ వృద్ధి క్షయాలలో శుక్లపక్షంలో దేవతలను, కృష్ణపక్షంలో పితరులను సంతోష పరుస్తూ చంద్రుడు ఉంటాడు. అట్లాంటి చంద్రాత్మకుడైన శ్రీ మహావిష్ణువును భీష్ముడు స్తుతిస్తున్నాడు.

తే. విశ్వసృజులను మునులచే వితతమగు స । హస్ర వత్సర కలిత మహాధ్వరమునఁ
గశ్యపబ్రహ్మ యెవ్వానిఁ గనియెఁ గనక । పక్షు దార్క్ష్యాత్ముఁ దలఁతు నప్పద్మనాభు. 26

ప్రతిపదార్థం: విశ్వసృజులు+అను= విశ్వ సృష్టికర్తలు (నవ బ్రహ్మలు) అనే; మునులచేన్= మహర్షులచేత; వితతము+అగు= విస్తృతమైన; సహస్ర వత్సర కలిత= వేయేండ్లతో కూడినట్టి; మహా+అధ్వరమునన్= గొప్ప యజ్ఞమందు; కశ్యపబ్రహ్మ= కశ్యపుడనే ప్రజాపతి; ఏ+వానిన్= ఎవ్వడినైతే; కనియెన్= కన్నాడో అట్లాంటి ; కనక పక్షున్+తార్క్ష్య+ఆత్మున్= బంగారు రెక్కలు కలిగినట్టి గరుత్మంతుడిని ఆత్మగా గల; ఆ+పద్మనాభున్= పద్మం నాభియందు గల ఆ మహావిష్ణువును; తలఁతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: విశ్వసృజు లనబడే మహర్షులు వేయి సంవత్సరాలపాటు చేసిన యజ్ఞంలో కశ్యపప్రజాపతికి సువర్ణపక్షుడైన గరుత్మంతుడు జన్మించాడు. అట్లాంటి గరుడుని ఆత్మగా గల శ్రీ మహావిష్ణువును స్మరిస్తాను.

విశేషం: 'విశ్వసృక్' అన్నది విష్ణు సహస్ర నామాలలో ఒకటి. విష్ణువు నవబ్రహ్మాత్మకుడు. అందువలన నవబ్రహ్మలు చేసిన వెయ్యేండ్ల యాగ సమయంలో కశ్యపప్రజాపతికి గరుత్మంతుడు వినతవలన జన్మించాడు.

క. సువ్యక్త క్షేత్రంబున । నవ్యక్తాకృతి నిరూఢి నాసీనుం డై
భవ్యత నుండెడు క్షేత్రా । త్మ వ్యపదిష్టుఁ బ్రణుతింతు దామోదరునిన్. 27

ప్రతిపదార్థం: సువ్యక్త= స్పష్టంగా తెలియవస్తున్న; క్షేత్రమునన్= జీవుడుండే శరీరమందు; అవ్యక్త+ఆకృతి నిరూఢిన్= తెలియరానట్టి ఆకారంతో ప్రసిద్ధంగా; ఆసీనుండు+ఐ= కూర్చున్నవాడై; భవ్యతన్+ఉండెడు= యోగ్యమైన రీతిలో ఉండే (అంటే యోగంలో ఉండే); క్షేత్ర+ఆత్మ+వి+అపదిష్టున్= క్షేత్రాత్ముడని పిలువబడుతున్న ప్రసిద్ధుడైన; దామ+ఉదరున్= తులసిమాలను ఉదరమందు కలిగిన శ్రీమహావిష్ణువును; ప్రణుతింతున్= ప్రార్థిస్తున్నాను.

తాత్పర్యం: స్పష్టంగా తెలిసే దేహమందు తెలియరానట్టి యోగంలో ఉండే క్షేత్రాత్ముడుగా ప్రసిద్ధుడైన దామోదరుడైన ఆ శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తున్నాను.

విశేషం: విష్ణు సహస్రనామాలలో విష్ణువు క్షేత్ర క్షేత్రజ్ఞుడిగా చెప్పబడుతున్న అంశాన్ని ఇక్కడ గుర్తించవలసి ఉన్నది.

క. ప్రకృతి వికృతులను షోడశ । వికారముల బెరసి ప్రకృతి వికృతిత్వము లొం
దక యుండఁ గాంతు రెవ్వని । సకల మునులు దలఁతు నట్టి సాంఖ్యాత్ము హరిన్. 28

ప్రతిపదార్థం: ప్రకృతి వికృతులను= సహజమైన ప్రకృతులు, వాటి వ్యతిరేకమైన వికారాలు అనే; షోడశ వికారముల బెరసి= పదహారు వికారాలతో కూడి; ప్రకృతి వికృతిత్వములు+ఒందక ఉండన్= ప్రకృతిని కాని, వికృతిని కాని ఏ మాత్రం పొందకుండేటట్లుగా; ఏ+వానిన్= ఎవ్వడిని; సకలమునులు= సమస్త మహర్షులు; కాంతురు= చూడగలరో (దర్శించగలరో); అట్టి= అటువంటి; సాంఖ్య+ఆత్మున్+హరిన్= యోగాత్ముడైన శ్రీకృష్ణుడిని; తలఁతున్= ప్రార్థిస్తాను.

తాత్పర్యం: సహజమూ, తద్వ్యతిరేకమూ అయిన ప్రకృతి వికృతులను పదహారు వికారాలతో కూడి ఉండి కూడా, ప్రకృతి వికృతులను ఏ మాత్రమూ పొందకుండేటట్లు మహర్షి సత్తములు ఎవ్వడినైతే దర్శిస్తారో అటువంటి సాంఖ్యాత్ముడైన ఆ శ్రీమహావిష్ణువును స్మరిస్తాను.

విశేషం: ప్రకృతులు: అష్ట ప్రకృతులు= అవ్యక్తం, బుద్ధి, అహంకారం, పంచతన్మాత్రలు; శబ్ద స్పర్శ రూప రస గంధాలు; వికారము (సాంఖ్య) మూల ప్రకృతి నుండి పుట్టినవి; ఇవి పదహారు; షోడశ వికారాలు: పంచ జ్ఞానేంద్రియాలు (శ్రోత్రం, చర్మం, చక్షువు, జిహ్వా, నాసిక), పంచ కర్మేంద్రియాలు (వాక్కు, హస్తం, పాదాలు, పాయువు, ఉపస్థ), పంచేంద్రియార్థాలు (ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం)+మనస్సు.

సాంఖ్యం: షడ్దర్శనాలు (సాంఖ్యం, యోగం, న్యాయం, వైశేషికం, మీమాంస, వేదాంతం)లో ఒకటి. పంచవింశతి తత్త్వాల (ఇరవై ఐదు తత్త్వాలలో ప్రకృతి పురుషుడు, బుద్ధి, అహంకారం, మనస్సు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచ మహాభూతాలు; పంచ తన్మాత్రలు) ఇందులో ప్రకృతి పురుషులను గూర్చి చెప్పేదే సాంఖ్యం. ఇక్కడ వేదాంతం అంగీకరించిన రీతిగా భగవంతుడే సృష్టి స్థితి లయ కారకుడన్న అంశాన్ని సాంఖ్యం అంగీకరించదు. పైపెచ్చు ఈ సమస్తానికి ప్రకృతే మూలమని నిరూపిస్తుంది.

క. అంతశ్చర మారుతములు । శాంతములుగఁ జేసి యనలసత్వము శమమున్
దాంతియు గల జనములు గను । నంతర్హితుఁ గొలుతు జలశయను యోగాత్మున్. 29

ప్రతిపదార్థం: అంతఃచర+మారుతములు= శరీరంలోపల ఉండే ప్రాణవాయువులు (ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం); శాంతములుగన్+చేసి= శాంతింపజేసి (చలనం లేకుండా చేసి); అనలసత్వమున్= ఏకాగ్రతతో, అలసత్వం లేకుండా; శమమున్= నిగ్రహం (జ్ఞానేంద్రియ నిగ్రహం); దాంతి= కర్మేంద్రియ నిగ్రహం; కల= కలిగినటువంటి; జనములు= యోగులు; కను= చూడగలిగినటువంటి; అంతర్హితున్= ఇంద్రియ నిగ్రహంచేత అంతర్ముఖీనుడైన వాడిని; జలశయనున్= నీటియందు శేషుడిని పాన్పుగ చేసికొని ఉన్నటువంటి వాడిని; యోగ+ఆత్మున్= యోగముద్రలో ఉన్నటువంటి శ్రీమహావిష్ణువును; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: పంచ ప్రాణాలను శాంతింపజేసి అలసత్వం లేని శాంతి దాంతులతో ఒప్పుతున్న యోగులు చూడగలిగిన అంతర్ముఖీనుడై ప్రళయాంతంలోని మహాజలాలలో శేషశయనుడై యోగనిద్రాముద్రితుడై ఉన్న శ్రీమహావిష్ణువును పూజిస్తాను.

విశేషం: శమము= జ్ఞానేంద్రియ నిగ్రహం; దాంతి= కర్మేంద్రియ నిగ్రహం.

క. ఉపరమముం బ్రాపించిన । యపుణ్య పుణ్యములు గలుగు నతిశాంతులు భ
వ్యపుగతిఁ బొందెడు నానం । దపు రూపుని విష్ణుఁ దలఁచెదను మోక్షాత్మున్. 30

ప్రతిపదార్థం: ఉపరమమున్+ప్రాపించిన= సమస్త విషయ సంబంధమైన కోరికలను వదలిపెట్టిన (విషయ వైరాగ్యాన్ని పొందిన); అపుణ్య పుణ్యములు+కలుగు= పుణ్యాపుణ్యములు సమంగా చూడగలిగే; అతిశాంతులు= జ్ఞాన కర్మేంద్రియాది నిగ్రహం కలిగిన మహాత్ములు; భవ్యము+గతిన్+పొందెడు= శ్రేష్ఠమైన మార్గాన్ని పొందేటటువంటి; ఆనందపు రూపుని(న్)= ఆనందమే (బ్రహ్మానందమే) స్వరూపంగా కలిగిన; మోక్ష+ఆత్మున్= మోక్ష స్వరూపుడు అయిన; విష్ణున్= శ్రీ మహావిష్ణువును; తలఁచెదను= స్మరిస్తాను.

తాత్పర్యం: విషయ వైరాగ్యాన్ని పొందిన ద్వంద్వాతీతులైన తపస్సులు శ్రేష్ఠమైన పద్ధతిలో పొందే బ్రహ్మానంద స్వరూపుడైన వాడును, మోక్షప్రదాత అయిన శ్రీ మహావిష్ణువును స్మరిస్తాను.

విశేషం: విషయ వాంఛా రహితులైన విరాగులు, పుణ్యపాపాలకు అతీతులు. ద్వంద్వాతీతులు వారే. అటువంటి మహాత్ములే అతి శాంతులు. అటువంటి మహనీయులు 'భవ్యపు గతిన్' అంటే విష్ణుసహస్ర నామావళిలో ఒకటైనది భవ్యశబ్దం కనుక, అటువంటి గతిని పొందగలిగే బ్రహ్మానంద స్వరూపుడు శ్రీమహావిష్ణువు.

తే. చరణ నాభి శీర్షంబులు ధరయు నంత । రిక్షమును దివమును జగచ్చక్షు రగ్ని
దిశలు దృఙ్ముఖ శ్రోత్రముల్ దీప్తు లెమ్మ । హంగునకు నట్టి హరిని లోకాత్ముఁ దలఁతు. 31

ప్రతిపదార్థం: ఏ+మహా+అంగునకున్= సమస్తాన్ని శరీరంగా కలిగిన ఏ మహాత్ముడికి; ధరయున్+అంతరిక్షమున్+దివమును= భూమి, ఆకాశం, స్వర్గం, క్రమంగా; చరణనాభి శీర్షంబులు= పాదాలు, బొడ్డు, తల అయి ఉన్నాయో అట్లాగే; జగత్+చక్షుః+అగ్ని దిశలు= సూర్యుడు, అగ్ని, దిక్కులు క్రమంగా; ముఖ+శ్రోత్రముల్+దీప్తుల్= ముఖం, చెవులు, కాంతులు అయి ఉన్నాయో; అట్టి లోక+ఆత్మున్= జగత్తులన్నింటిని ఆత్మగా కలిగిన వాడైన శ్రీమహావిష్ణువును; తలఁతున్= స్మరిస్తాను (పూజిస్తాను).

తాత్పర్యం: ఈ భూమి, ఆకాశం, స్వర్గం, ముల్లోకాలు వరుసగా శ్రీమహావిష్ణువునకు పాదాలు, బొడ్డు, తల. సూర్యుఁడు, కళ్ళు, అగ్ని, దిక్కులు శ్రీ మహావిష్ణువునకు. చూపులు, ముఖం, చెవులు, కాంతులు అయి ఒప్పుతున్నాయి. అట్టి లోకాత్ముడూ మహాంగుడూ అయిన శ్రీమహావిష్ణువును స్మరిస్తాను.

విశేషం: కవి ఇందులో శ్రీ మహావిష్ణువు యొక్క విశ్వస్వరూపాన్ని వివిధ రీతుల, అదే మహాశరీరంగా అభివర్ణించాడు.

క. భూతముల మ్రింగి, లోక । వ్రాతము జలమయముఁ జేసి, వశ్యాత్మత ని
ద్రాతిశయంబున బాలుం । డై తేలెడు వానిఁ దలఁతు హరి మాయాత్మున్. 32

ప్రతిపదార్థం: భూతములన్ మ్రింగి= ప్రాణులనన్నింటిని తనలో ఇముడ్చుకొని; లోక వ్రాతమున్= జగత్తుల సమూహాలను; జలమయమున్+చేసి= నీటి మయంచేసి; వశ్య+ఆత్మతన్= తన అధీనం చేసికొన్న ఆత్మతో (సమస్త ఇంద్రియాల నిగ్రహంతో); నిద్రా+అతిశయంబునన్= అధికమైన యోగ నిద్రతో; బాలుండు+ఐ= పసిపాపడై; తేలెడు వానిన్= నీటిపై మట్టియాకుపై తేలియాడుతుండే; మాయా+ఆత్మున్= యోగమాయ ఆత్మగా కలిగిన; హరిన్= శ్రీ మహావిష్ణువును; తలఁతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: ప్రళయాంతంలో సమస్త ప్రాణికోటిని తనయందే సంలీనం చేసికొని, ప్రపంచమంతటినీ నీటిలో మగ్నంచేసి, తన ఆత్మను అధీనం చేసుకొని యోగనిద్రలో నీటిపై మట్టియాకుమీద పసిపాపడై తేలియాడే మాయాత్ముడైన ఆ శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తాను.

విశేషం: ప్రళయాంతంలో సమస్త ప్రాణికోటి నశించి పోతుంది. సర్వాంతర్యామి అయిన ఆ మహావిష్ణువు సమస్తాన్ని తనలో ఇముడ్చుకొని ఏమీ తెలియని పసివాడివలె నీటిపై తేలియాడుతుంటాడనే అంశం పురాణప్రసిద్ధమే. అదంతా శ్రీ మహావిష్ణువు యొక్క మాయ అన్నది విశేషార్థం.

తే. అంబుదంబులు గేశంబులందు, నదులు । సర్వ తనుసంధులందును, జలధు లుదర
దేశమున యందు నున్నట్టి దేవదేవుఁ । గొలుతుఁ దోయాత్ము దేవకికొడుకుఁ గృష్ణు. 33

ప్రతిపదార్థం: అంబుదంబులు= నీటి నొసగే మేఘాలు; కేశంబులందున్= తలలోని కురులందు; నదులు= నదులు; సర్వతను సంధులందును= సమస్త శరీరంయొక్క కలయికలోను; జలధుల్+ఉదరదేశమున+అందున్= సముద్రాలు కడుపు ప్రదేశంలోనూ; ఉన్న+అట్టి= ఉన్నట్టి; దేవదేవున్= దేవతలకు దేవుడైన; తోయ+ఆత్మున్= జలస్వరూపుడైన; దేవకి కొడుకున్= దేవకీదేవి కుమారుడైన; విష్ణున్= శ్రీ మహావిష్ణుమూర్తిని; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: వర్షపు మేఘాలను తలనీలాలలోను, నదులను అన్ని శరీరావయవ సంధులలోనూ, సముద్రాలను కుక్షిలోనూ కలిగిన దేవాదిదేవుడు, నారాయణుడు, దేవకీదేవిపుత్రుడైన శ్రీకృష్ణమూర్తిని పూజిస్తాను.

తే. వదన బాహూరు పదము లెవ్వాఁడు విప్ర । రాజ వైశ్య శూద్రులకు సంప్రభవ దేశ
ములుగ వెలుఁగొందు నమ్మహామూర్తి విభవ । దీప్తు వర్ణాత్మకునిఁ బ్రణుతింతు విష్ణు. 34

ప్రతిపదార్థం: ఏ+వాఁడు= ఎవ్వడైతే; వదన బాహు+ఊరు పదములన్= ముఖం, భుజాలు, తొడలు, పాదాలు (క్రమంగా); విప్ర రాజ వైశ్య శూద్రులకున్= బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనేవారికి; సంప్రభవ దేశములుగన్= పుట్టిన ప్రదేశాలుగా కలిగి; వెలుఁగొందున్= ప్రకాశిస్తున్నాడో; ఆ+మహామూర్తిన్= ఆ మహా స్వరూపుడిని; విభవ దీప్తున్= వైభవకాంతిమంతుడిని; వర్ణ+ఆత్మకునిన్= నాలుగు వర్ణాలను ఏర్పరచిన వాడిని; విష్ణున్= శ్రీమహావిష్ణువును; ప్రణుతింతున్= స్తుతిస్తాను.

తాత్పర్యం: శ్రీ మహావిష్ణువు ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు అనే నాలుగు వర్ణాలవారు ఉద్భవించారు. అట్లాంటి చతుర్వర్ణాత్మకుడైన శ్రీ మహావిష్ణువును స్తుతిస్తాను.

విశేషం: బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు విష్ణువు ముఖం, బాహువులు, ఊరువులు, పాదాల నుంచి ఉద్భవించారన్న ఈ అంశం పురుష సూక్తంలోను,

"బ్రాహ్మణోz స్య ముఖ మాసీత్ । బాహూ రాజన్యఃకృతః
ఊరూతదస్యయ ద్వైశ్యః । పద్భ్యాగ్ం శూద్రో అజాయత"

అని చెప్పబడింది. నాలుగు వర్ణాలు తానే సృష్టించానని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన అంశం తెలిసిందే. "చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణ కర్మ విభాగశః" (4-13)

క. మాసర్తయనాబ్దమయో । ద్భాసిత రూపుఁ డయి సృష్టిఁ బ్రళయంబుఁ దగం
జేసి పాలుపారు శౌరి ను । పాసింతును యోగి భోగ్యబలుఁ గాలాత్మున్. 35

ప్రతిపదార్థం: మాస+ఋతు+అయన= (సంవత్సరంలో) నెలలు (పండ్రెండు) ఋతువులు (ఆరు) అయనాలు (ఉత్తరాయన దక్షిణాయనాలు (రెండు); అబ్దమయ= (అరవై) సంవత్సరాలతో కూడి; ఉద్భాసిత+రూపుఁడు+అయి= ప్రకాశిస్తున్న స్వరూపం కలిగి; సృష్టిన్+ప్రళయంబున్+తగన్+చేసి= కాలాత్మకుడై ఈ ప్రపంచాన్ని సృష్టించి వినాశనం చేసి; పాలుపు+ఆరి= ఒప్పి; యోగి భోగ్య బలున్+కాల+ఆత్మున్= మహాయోగీ (సమస్తాన్ని అనుభవించే మహాబల సంపన్నుడూ, కాలస్వరూపుడూ అయిన); శౌరిన్= శూర వంశీయుడైన శ్రీమహావిష్ణువును; ఉపాసింతును= పూజిస్తాను.

తాత్పర్యం: నెలలు, ఋతువులు, ఉత్తర దక్షిణాయనాలు, సంవత్సరాలు తానే అయి, సృష్టి ప్రళయాలకు కర్త అయి, కాలస్వరూపుడై యోగి భోగి అయి ఒప్పుతూ ఉన్న ఆ శ్రీమహావిష్ణువును భజిస్తాను.

క. ముని దివిజాదిక లోకము । లనంతుఁ డన జగతి కెల్ల నాధారం బై
పెనుపొందెడు శేషాత్ముని । వినుతింతున్ విష్ణుభక్తి విభవ విధాయిన్. 36

ప్రతిపదార్థం: ముని= మహర్షులయొక్క; దివిజ+ఆదిక లోకములన్= దేవతలయొక్క లోకమైన స్వర్గం మొదలుకొని; జగతికిన్ ఎల్లన్= సమస్త జగత్తునకు; అనంతుఁడు+అనన్= అంతంలేని వాడైన శేషుడనే ప్రసిద్ధుడు; ఆధారంబు+ఐ= భరించే ఆధారభూతమై;

పెనుపొందెడు= అతిశయిల్లుతున్న; విష్ణుభక్తి విభవ విధాయిన్= విష్ణుభక్తి వైభవాన్ని విధించే వాడైన; శేష+ఆత్మునిన్= ఆదిశేషస్వరూపుడైన శ్రీమహావిష్ణువును; వినుతింతున్= స్తుతిస్తాను.

తాత్పర్యం: మునులలోకం, దేవలోకమైన స్వర్గం మొదలుకొని సమస్త లోకాలను అనంతుడన్న పేరుతో మోస్తూ అతిశయిల్లుతూ ఉన్న విష్ణుభక్తి వైభవాన్ని విధించే ఆదిశేషాత్ముడైన శ్రీమహావిష్ణువును స్తుతిస్తాను.

క. ఆదిత్య మరుద్వసురు । ద్రాదిదివిజ గణము లెల్ల నవయవ రూపో
త్పాదకలితు లెవ్వానికి । నా దేవుని సంస్తుతింతు హరి దేవాత్మున్. 37

ప్రతిపదార్థం: ఏ+వానికిన్= ఎవడికైతే; ఆదిత్య= ద్వాదశాదిత్యులును; మరుత్= మరుద్గణాలూ; వసు= అష్టవసువులూ; రుద్రులు= ఏకాదశ రుద్రులూ; ఆది= మొదలైన; దివిజ గణములు= సమస్త దేవతా సమూహాలు; అవయవ= శరీరంలోని అవయవములచేత; రూప+ఉత్పాదక= రూప నిర్మాణానికి; కలితులు= కూడి ఉన్నటువంటి వారో; అట్టి= ఆ; దేవునిన్= భగవంతుడిని; దేవ+ఆత్మున్= సమస్త దేవతలను ఆత్మగా కలవాడైన; హరిన్= శ్రీమహావిష్ణువును; సంస్తుతింతున్= ప్రార్థిస్తాను.

తాత్పర్యం: ద్వాదశాదిత్యులు, మరుత్తులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, మొదలైన దేవగణాలన్నీ శ్రీమహావిష్ణువునకు అంగభూతులో అట్లాంటి దేవాత్మకూడా ఆ మహాదేవుడైన విష్ణువును సంస్తుతిస్తాను.

విశేషం: ద్వాదశాదిత్యులు: ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూషుడు, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు.

మరుత్తులు: దితి కశ్యపుల సంతానం మరుద్గణం,

అష్ట వసువులు: ఆపుడు, ధ్రువుడు, సోముడు, అధ్వరుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, విభావసుడు.

ఏకాదశ రుద్రులు: అజుడు, ఏకపాదుడు, శంభుడు, హరుడు, త్ర్యంబకుడు, అహిర్బుధ్న్యుడు, త్వష్ట, రుద్రుడు, అపరాజితుడు, ఈశానుడు, త్రిభువనుడు.

ఇవన్నియూ దేవగణాలు.

క. సర్వము నందును దానున్ । సర్వముఁ దనయందు నుండు సంచారంబున్
సర్వమునకుఁ దన వలనన । సర్వాత్మకు నట్టి వృష్ణిసత్తముఁ దలఁతున్. 38

ప్రతిపదార్థం: సర్వమునందున్+తానున్= సమస్తమునందును భగవంతుడు; సర్వమున్ తనయందున్+ఉండున్= సమస్తం భగవంతుడియందు ఉన్నట్టి; తన వలనన= భగవంతుడి వలనే; సర్వమునకున్= సమస్తానికి; సంచారంబున్= సంచరించటం; ఉండున్= ఉండునో; సర్వ+ఆత్మకున్= సమస్తానికి ఆత్మగా కలిగిన; అట్టి= అటువంటి; వృష్ణి సత్తమున్= వృష్ణి వంశంలో శ్రేష్ఠుడైన శ్రీమహావిష్ణువును; తలఁతున్= ప్రార్థిస్తాను.

తాత్పర్యం: సమస్తమూ భగవంతుడిలోనూ, సమస్తమూ భగవంతుడి యందు సమస్తమునకు తనవలెనే మెలగుట జరుగునో అట్లాంటి సర్వాత్మకుడైన శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తాను.

క. మీనయి తా నతలగతం । బైన నిగమ చయముఁ దెచ్చి యజునకు నొసఁగం
గా నేర్చిన సుమనస్స । మ్మానిత విగ్రహు భజింతు మత్స్యాత్ము హరిన్. 39

ప్రతిపదార్థం: తాన్= తాను (భగవంతుడైన విష్ణువు); మీను+అయి= చేప అయి; అతలగతంబు+ఐన= అధో లోకానికి చేరిన; నిగమ చయమున్+తెచ్చి= వేద సమూహాన్ని తెచ్చి; అజునకున్= బ్రహ్మకు; ఒసగంగాన్+నేర్చిన= తెచ్చి ఇచ్చే నేర్పు కలిగిన వాడును; సుమనస్+సం+మానిత+విగ్రహున్= దేవతలచేత సమ్మానింపబడిన స్వరూపుడైన; మత్స్య+ఆత్మ(న్)= మత్స్యావతారుడైన శ్రీమహావిష్ణువును; భజింతున్= పూజిస్తాను.

తాత్పర్యం: అనాదికాలంలో సోమకు డనే రాక్షసుడు వేదాలను అపహరించుకొని సముద్రంలో అధోలోకానికి వెళ్ళిపోగా, సోమకాసురుడిని సంహరించి మళ్ళీ ఆ వేదాలను బ్రహ్మకు తెచ్చి ఇచ్చి దేవతలచేత కొనియాడ బడిన మత్స్యావతారు డయిన శ్రీమహావిష్ణువును పూజిస్తాను.

క. అమృత మథనమున మంథన । గము లీలోద్ధరణకేళిఁ గైకొని సురసం
ఘమునకుఁ బ్రియ మొనరించిన । యమేయుఁ గూర్మాత్మ నంబుజాక్షుం గొలుతున్. 40

ప్రతిపదార్థం: అమృతమథనమునన్= అమృతం కొరకు పాల సముద్రాన్ని చిలికినప్పుడు; మంథనగమున్= మంథర పర్వతాన్ని; లీల= విలాసంతో; ఉద్ధరణ కేళిన్= ఎత్తుట అనే ఆటగా; కైకొని= గ్రహించి; సుర సంఘమునకున్= దేవతల సమూహానికి; ప్రియము+ఒనరించిన= ప్రీతి కూర్చిన (ఆనందాన్ని కలిగించిన); అమేయున్= అపరిమితుడు అయిన విష్ణువును; అంబుజ+అక్షున్= పద్మాక్షుడిని; కూర్మ+ఆత్మున్= కూర్మావతార మెత్తిన విష్ణువును; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: మంథరపర్వతాన్ని కవ్వంగా చేసికొని పాలసముద్రాన్ని దేవతలు, రాక్షసులు చిలికిన సందర్భంలో మంథర పర్వతం సముద్రంలో మునిగిపోకుండా విలాసంగా ఎత్తి పట్టుకొని దేవతా సమూహానికి అత్యంతమూ ఆనందం కూర్చిన కూర్మావతారరూపుడైన శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తాను.

క. వారాహ రూపమునఁ బెం । పారిన తన దంష్ట్ర నొకట నవని సగిరికాం
తారంబుగ నెత్తిన యా । శౌరిం గ్రోడాత్మఁదలఁతు సమ్యగ్భక్తిన్. 41

ప్రతిపదార్థం: వారాహ రూపమునన్= వరాహ అవతారంలో; పెంపు+ఆరిన= అతిశయించిన; తన= తనదైన; ఒకటన్= ఒక్కటి అయిన; దంష్ట్రన్= కోరచేత; సగిరి కాంతారంబుగన్= పర్వతాలు, అరణ్యాలతో కూడిన; అవనిన్= భూమిని; ఎత్తిన= ఎత్తినట్టి; క్రోడా+ఆత్మున్= వరాహాన్ని ఆత్మగా కలిగిన; ఆ శౌరిన్= ఆ శ్రీమహావిష్ణువును; సమ్యక్+భక్తిన్= సమంచితమైన భక్తితో; తలఁతున్= స్మరిస్తాను (భావిస్తాను).

తాత్పర్యం: వరాహావతార మెత్తి పర్వతారణ్యాలతో కూడిన భూమి నంతటిని బలోపేతమైన తన ఒకే దంష్ట్రచేత ఉద్ధరించిన వరాహాత్ముడైన శ్రీమహావిష్ణువును సదా భక్తితో పూజిస్తాను.

ఆ. నారసింహవపు రుదార భావము నొంది । ఘను హిరణ్యకశిపు ఖర నఖముల
వ్రచ్చి దీప్తమూర్తి వఱలు నృసింహాత్ము । నాత్మభవుని భక్తి నాశ్రయింతు. 42

ప్రతిపదార్థం: నారసింహ= సగం నరుడు, సగం సింహము అయిన; వపుఃశరీరంతో; ఉదార భావమును+ఒంది= ఉదార స్వభావమును పొంది; ఘనున్= గొప్పవాడయిన; హిరణ్య కశిపున్= హిరణ్య కశిపుడిని; ఖరనఖములన్= వాడి అయిన గోళ్ళచేత; వ్రచ్చి= చీల్చి; దీప్తమూర్తిన్= తేజస్వంతుడిని; వఱలు= ప్రకాశించునటువంటి; నృసింహ+ఆత్మున్= నృసింహస్వరూపం కలిగినవాడిని; ఆత్మభవునిన్= స్వయంగా పుట్టినవాడైన విష్ణువును; భక్తిన్= భక్తితో; ఆశ్రయింతున్= శరణువేడుతాను.

తాత్పర్యం: నరసింహావతారమెత్తి మదించిన హిరణ్యకశిపుడిని వాడి అయిన తన గోళ్ళతో చీల్చి ప్రసిద్ధిపొందిన నరసింహాత్ముడైన శ్రీమహావిష్ణువును ఆశ్రయిస్తాను.

క. వామన రూపంబున ను । ద్దామ బలున్ బలి నడంచి త్రైలోక్యాతి
క్రామితఁ బేర్చిన యద్భుత । ధాముం గ్రాంతాత్ముఁ దలఁతు దామోదరునిన్. 43

ప్రతిపదార్థం: వామన రూపంబునన్= వామనావతారంలో; ఉద్దామబలున్= అత్యంత బలం కలవాడైన; బలిన్= బలిచక్రవర్తిని; అడంచి= అణచివైచి; త్రైలోక్య+అతిక్రామితన్= ముల్లోకాల ఆక్రమణంతో; పేర్చిన= అతిశయించిన; అద్భుతధామున్= ఆశ్చర్యకరమైన నివాసం కలవాడై; క్రాంత+ఆత్మున్= ఆక్రమించిన ఆత్మగా కలిగి; దామ+ఉదరునిన్= శ్రీమహావిష్ణువును; తలఁతున్= భావిస్తాను.

తాత్పర్యం: వామనావతారమెత్తి, అత్యంత బలాఢ్యుడైన బలిచక్రవర్తిని మూడడుగు లడిగి ముల్లోకాలు ఆక్రమించుకొని బలిచక్రవర్తిని త్రొక్కిపెట్టి అణచి వేసిన వామన స్వరూపుడైన శ్రీమహావిష్ణువును సంస్మరిస్తాను.

ఆ. పరశురాముఁ డనఁగ భవ్యుఁడు జమదగ్ని । కుద్భవించి యిరువదొక్కమాఱు
మనుజపతుల నెల్లఁ దునిమిన క్రోధాత్ము । నధిక భక్తి శార్ఙ్గినాశ్రయించు 44

ప్రతిపదార్థం: పరశురాముఁడు+అనఁగన్= పరశురాముడనగ; భవ్యుఁడు= శ్రేష్ఠుడైన; జమదగ్నికిన్+ఉద్భవించి= జమదగ్ని మహర్షికి జన్మించి; ఇరువది+ఒక్కమాఱు= ఇరవై ఒక్కసార్లు; మనుజపతులన్+ఎల్లన్= సమస్త రాజులను; తునిమిన= సంహరించిన; క్రోధ+ఆత్మున్= క్రోధ స్వభావుడైన; శార్ఙ్గిన్= శార్ఙ్గమును ధరించిన వాడైన శ్రీమహావిష్ణువును; అధిక భక్తిన్= అమితమైన భక్తితో; ఆశ్రయింతున్= ఆశ్రయిస్తాను.

తాత్పర్యం: శ్రీమహావిష్ణువు పరశురాముడనే పేరుతో మహర్షి సత్తముడైన జమదగ్నికి జన్మించి ఇరవై ఒక్కసార్లు రాజని పేరున్న వారిని అందరిని సంహరించి క్రోధాత్ముడైన శ్రీమహావిష్ణువును అమితమైన భక్తితో ఆశ్రయిస్తాను.

క. క్షత్రాత్ముఁ గొలుతు దశరథ । పుత్రున్ శ్రీరాముఁ డనఁగఁ బొలిచిన దేవున్
శత్రుభయదు రావణు నొక । మాత్రం దునుమాడినట్టి మధుసూదనునిన్. 45

ప్రతిపదార్థం: దశరథ పుత్రున్= దశరథ మహారాజు కుమారుడైన; శ్రీరాముఁడు+అనఁగన్= శ్రీరాము డనే పేరుతో; శత్రు భయదున్= శత్రువులకు భయం కలిగించేవాడైన; రావణున్= రావణాసురుడిని; ఒక మాత్రన్= ఒక్కత్రుటిలో; తునుమాడినట్టి= సంహరించినట్టి; పొలిచిన= అతిశయించిన; దేవున్= దేవుడిని; క్షత్ర+ఆత్మున్= క్షత్రస్వరూపుడైన; మధుసూదనునిన్= మధు అనే రాక్షసుడిని సంహరించిన వాడైన శ్రీమహావిష్ణువును; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: దశరథ మహారాజు కుమారుడు శ్రీరాముడుగా జన్మించి, శత్రుభయంకరుడైన రావణాసురుడిని అవలీలగా సంహరించిన క్షత్రాత్ముడైన శ్రీమహావిష్ణువును పూజిస్తాను.

క. హల ముసల ధరునిఁ గరుణా । నిలయ హృదయు రాము రౌహిణేయు సితాంగున్
జలద నిభాంబరుని శుచిం । దలఁతును గోవిందు శౌర్యధను భోగాత్మున్. 46

ప్రతిపదార్థం: హల ముసల ధరునిన్= నాగలి, రోకలి ఆయుధాలుగా కలిగినవాడిని; కరుణా నిలయ హృదయున్= దయకు ఆటపట్టయిన హృదయం కలవాడిని; రౌహిణేయున్= రోహిణీదేవియొక్క కుమారుడైన; సిత+అంగున్= తెల్లనయిన శరీరం కలవాడిని; జలద నిభ+అంబరునిన్= మేఘంతో సమానమైన నీలవస్త్రం కలవాడిని; శుచిన్= పరిశుద్ధుడైన వాడిని; శౌర్యధనున్= పరాక్రమమే ధనంగా కలవాడిని; భోగ+ఆత్మున్= భోగాత్ముడైన; రాముని= బలరాముడిని; గోవిందున్= శ్రీమహావిష్ణువును; తలఁతును= భావిస్తాను.

తాత్పర్యం: నాగలిని, రోకటిని ఆయుధాలుగా కలిగిన వాడిని, దయాంతఃకరణుడు, రోహిణీదేవి పుత్రుడు, తెల్లని శరీరం కలవాడు, మేఘంతో సమాన మైన వస్త్రం కలవాడు, పరిశుద్ధుడు, శౌర్యధనుడు భోగాత్ముడు శ్రీమహావిష్ణువు అయిన బలరాముడిని తలుస్తాను.

మ. యదువంశంబున వాసుదేవుఁ డనఁ గ్రీడార్థంబు జన్మించి, దు
ర్మద దైత్యావలిఁ గూల్చి, పార్థునకు సారథ్యంబు త్రైలోక్య స
మ్మద మారంగ నొనర్చి, దేవముని సమ్మానోద్ధతిన్ భూభరం
బు దొలంగించిన చక్రి నంబురుహనాభుం గొల్తుఁ గృష్ణాత్మునిన్. 47

ప్రతిపదార్థం: యదువంశంబునన్= యాదవ వంశంలో; వాసుదేవుఁడు+అనన్= వసుదేవ కుమారుడై; క్రీడా+అర్థంబు= వినోదార్థం; జన్మించి= పుట్టి; దుర్మద దైత్య+ఆవలిన్= దుర్మార్గులైన రాక్షసుల సమూహాన్ని; కూల్చి= నాశనం చేసి; పార్థునకున్= అర్జునుడికి; సారథ్యంబున్= రథచోదకత్వం; త్రైలోక్య సమ్మదము+ఆరంగన్= ముల్లోకాలకు ఆనందం కలిగేటట్లుగా; ఒనర్చి= చేసి; దేవముని సమ్+మాన+ఉద్ధతిన్= దేవతల, మునులయొక్క గౌరవాధిక్యంతో; భూభరంబు+తొలంగించిన= భూభారాన్ని తొలగించిన; చక్రిన్= చక్రాయుధుడిని; అంబురుహ నాభున్= పద్మం నాభియందు కలవాడిని; కృష్ణాత్మునిన్= కృష్ణపరమాత్మను; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: యాదవ వంశంలో దేవకీ వసుదేవులకు పుత్రుడై వినోదార్థంగా పుట్టి దుర్మార్గులైన రాక్షస సమూహాన్ని నాశనం చేసి ముల్లోకాలు హర్షించేటట్లు అర్జునుడికి సారథ్యంచేసి దేవమునులకు మిక్కిలి గౌరవం చేకూరుస్తూ భూభారాన్ని తొలగించిన పద్మనాభుడు, కృష్ణస్వరూపుడైన శ్రీమహావిష్ణువును కొలుస్తాను.

క. కలికాల చలిత ధర్మము । నిలుపంగల యట్టి విష్ణునిం గల్క్యాత్ముం
దలఁతుఁ దురగ వాహను మ్లే । చ్ఛుల నెల్లం గీటడంచు శుభచారిత్రున్. 48

ప్రతిపదార్థం: కలికాల చలిత ధర్మము నిలుపన్= కలియుగంలో చలించే - నాశమయ్యే; ధర్మమున్= ధర్మాన్ని; నిలుపన్ కల= నిలుప సమర్థుడైనట్టి; తురగ వాహనున్= అశ్వారూఢుడూ (గుర్రం వాహనంగా కలవాడూ); మ్లేచ్ఛులన్+ఎల్లన్= మ్లేచ్ఛజాతివారి నందరిని; గీటడంచు= నాశనం చేసే; శుభ చారిత్రున్= ఉత్తమ చరిత్ర కలవాడును; కల్కి+ఆత్మున్= కల్క్యవతారుడిని; విష్ణునిన్= శ్రీమహావిష్ణువును; తలఁతున్= సంస్మరిస్తాను.

తాత్పర్యం: కలియుగంలో విచలితమయిపోయే ధర్మాన్ని నిలబెట్ట గలిగినట్టివాడూ, మ్లేచ్ఛజాతినంతటిని సర్వనాశనం చేయగలవాడూ, అశ్వవాహనం కలవాడూ, శుభప్రదమైన చరిత్ర కలవాడూ, కల్క్యవతారుడూ అయిన శ్రీమహావిష్ణువును భావిస్తాను.

ఆ. క్షరము లైన భూత సంఘంబులం దెల్ల । నక్షర స్వరూపుఁడై వెలుంగు
సకల బుద్ధివృత్తి సాక్షి సాక్ష్యాత్ము న । స్పందబోధఘను ముకుందుఁ దలఁతు. 49

ప్రతిపదార్థం: క్షరములు+ఐన= నశించి పోయేటటువంటివైన; భూత సంఘంబులు+ఎల్లన్= సమస్త ప్రాణికోటులందును; అక్షర స్వరూపుఁడు+ఐ= వినాశంలేని మూర్తిమంతుడై; వెలుంగు= ప్రకాశించే; సకల బుద్ధి వృత్తి సాక్షి= సమస్త జ్ఞాన వ్యాపారాలకు సాక్షీభూతుడైన; సాక్ష్య+ఆత్మున్= సాక్ష్యాత్ముడైన; న+స్పంద= చలనంలేని; బోధ= జ్ఞానంచేత; ఘనున్= గొప్పవాడైన; ముకుందున్= శ్రీమహావిష్ణువును; తలఁతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: నశించిపోయే సమస్త ప్రాణికోటి యందును నాశరహితుడై మూర్తిమంతుడై ప్రకాశించే సమస్త బుద్ధి వ్యాపారాలకు సాక్షీభూతుడైన సాక్షాత్తు సాక్ష్యాత్ముడై స్థిరమైన జ్ఞానంచేత గొప్పవాడైన శ్రీమహావిష్ణువును భావిస్తాను.

సీ. పరమేశ పుణ్య, సుబ్రహ్మణ్య, భక్తవ । త్సల, మహాదేవ, విశ్వప్రకాశ
కరణ, హృషీకేశ, వరద నారాయణ, । రాజీవనయన, హిరణ్యనాభ,
యఖిల లోక నమస్కృతాంఘ్రి సరోరుహ । యజ్ఞాంగ, యచ్యుత, యమృతరూప!
నీకు మ్రొక్కెదఁ గరుణింపవే యతసీ కు । సుమ వర్ణ పీతాంబరము ధరించి

ఆ. యున్న నిన్ను నెవ్వ రుల్లంబునందుఁ ద । లంతు రట్టి వారలకు భయంబు
గలుగదెందు నేమి కార్యంబులం దెప్డు । వినుత మంగళాయతనమ వగుట. 50

ప్రతిపదార్థం: ఎందున్= ఎక్కడైనా; ఏమి కార్యంబులందున్= ఎట్లాంటి పనులలోఅయినా; ఎప్పుడున్= ఎప్పుడైనా; వినుత మంగళ+ఆయతనమవు+అగుటన్= కొనియాడబడే శుభానికి నివాసం కావటం వలన; పరమ+ఈశ!= దేవాధిదేవుడా!; పుణ్య!= పుణ్యాత్ముడా!; సుబ్రహ్మణ్య!= సుబ్రహ్మణ్య స్వరూపుడా!; భక్తవత్సల!= భక్తులయందు వాత్సల్యం కలవాడా!; మహాదేవ!= ఘనమైన దైవమా!; విశ్వప్రకాశ కరణ!= జగత్తున కంతటికిని కాంతిని ప్రసాదించేవాడా!; హృషీక+ఈశ!= ఇంద్రియాలకు ఈశ్వరుడైన వాడా!; వరద!= వరాలనిచ్చేవాడా!; నారాయణ!= నీటిని స్థానంగా కలవాడా!; రాజీవ నయన!= పద్మనయన!; హిరణ్యనాభ!= బంగారుమయమైన బొడ్డు కలవాడా!; అఖిల= సమస్త; లోక= లోకాలచేత; నమస్కృత= నమస్కరింపబడుతున్న; అంఘ్రి సరోరుహ!= పాదపద్మాలు కలిగినవాడా!; యజ్ఞ+అంగ= యజ్ఞమందలి హవిర్భాగాలను గ్రహించేవాడా!; అచ్యుత!= నాశంలేని వాడా!; అమృతరూప!= అమృతమయ స్వరూపా!; అతసీ కుసుమ వర్ణ!= అవిసె పూవు వర్ణం కలవాడా!; పీత+అంబరము ధరించి ఉన్న నిన్నున్= పచ్చని వస్త్రం ధరించి ఉన్న నిన్ను; ఎవ్వరు+ఉల్లంబునందున్= ఎవ్వరయితే మనస్సులో; తలంతురు= స్మరిస్తారో; అట్టివారలకున్= అట్లాంటి వారికి; భయంబు కలుగదు= భయముండదు.

తాత్పర్యం: ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ కార్యంలోనైనా మంగళప్రదుడవగుటచేత భక్తవత్సల, నారాయణ, అచ్యుతాది నామాదులచేత ప్రసిద్ధుడై అతసీ పుష్ప సంకాశుడవయి, పీతాంబరధరుడవయి సమస్తలోకాలచేత నమస్కరించ బడుతున్న పాదపద్మాలు కలవాడా! నిన్ను స్మరించే వారందరికి ఎట్లాంటి భయం కలుగదు.

విశేషం: మూలంలోని అనేక శ్లోకాలను సంక్షిప్తంచేసి శ్రీమహావిష్ణువు నామ సంస్మరణం భీష్మునిచేత తిక్కన చేయించాడు.

క. మంగళము విష్ణుదేవుఁడు । మంగళ మెమ్మెఁ దలంప మధురిపుఁ డుద్య
న్మంగళ మంభోజాక్షుఁడు । మంగళ మఖిలము విహంగమ ధ్వజుఁ డరయన్. 51

ప్రతిపదార్థం: అరయన్= చూడగా; ఏ+మెయిన్+తలంపన్= ఏ విధంగా ఆలోచించినా విష్ణుదేవుడు; మంగళము= శుభంకరుడు; మధురిపుఁడు= మధుడనే రాక్షసుడి శత్రువైన విష్ణువు మంగళ ప్రదుడు; అంభోజ+అక్షుఁడు= నీటినుండి పుట్టిన తామరలవంటి

కన్నులు కలవాడు; ఉద్యత్+మంగళము= అత్యంత శుభప్రదుడు; విహంగమ ధ్వజుఁడు= గరుత్మంతుడిని ధ్వజంగా కలిగిన శ్రీమహావిష్ణువు; అఖిలము= సమస్తం; మంగళము= మంగళం కూర్చువాడు.

తాత్పర్యం: ఎన్నివిధాల ఆలోచించినా విష్ణుదేవుడు, మధురిపుడు, అంభోజాక్షుడు, విహంగమధ్వజుడు అని ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణువు శుభంకరుడు.

క. నారాయణ పరములు నిజ । మారయ బ్రహ్మంబుఁ బరము నంచిత సత్యో
దార తపంబులుఁ గావున । నారాయణపరత వీని నాల్గిటి నిచ్చున్. 52

ప్రతిపదార్థం: నిజము+ఆరయన్= వాస్తవం పరిశీలించగా; బ్రహ్మంబున్= పరబ్రహ్మం; పరమున్= మోక్షం; అంచిత సత్య= అత్యుత్తమ సత్యం; ఉదార తపంబులున్= ఉన్నత తపస్సు అనేవి; నారాయణ పరములు= శ్రీమన్నారాయణుడి అధీనాలు; కావునన్= అందుచేతనే; నారాయణ పరత= విష్ణుభక్తి; వీనిని+నాల్గిటిన్+ఇచ్చున్= ఈ నాలుగింటిని ప్రసాదిస్తుంది.

తాత్పర్యం: పరబ్రహ్మం, మోక్షం, అత్యున్నత సత్యం, తపస్సు అన్నవి శ్రీమహావిష్ణువు పరమై ఉన్నాయి. కాబట్టి విష్ణువును ధ్యానించేవారికి ఆ శ్రీమహావిష్ణువు ఈ నాలిగింటిని ప్రసాదిస్తాడు.

తే. విష్ణుమయ మగ్ని, హవియును విష్ణుమయము, । విష్ణుమయము సర్వంబును విశదబుద్ధి
నిట్లగుటఁ గందుఁ గావున నించుకేనిఁ । గల్మషము నాకు లేకున్కి గానవచ్చు. 53

ప్రతిపదార్థం: అగ్ని విష్ణుమయము= అగ్ని స్వరూపుడు విష్ణువు; విష్ణుమయము హవియును= హవిస్సుకూడ విష్ణుమయమే; సర్వంబును విష్ణుమయము= విష్ణువు సమస్తంలోను ఉండేవాడు; ఇట్లు+అగుటన్= ఈ విధమగుటచేత; విశద బుద్ధిన్+కందున్= విస్పష్టమైన మనస్సుతో చూస్తున్నాను. కావునన్= అందువలననే; ఇంచుకేనిన్= కొంచెమైనా; కల్మషము లేకున్కి= పాపం లేకపోవటం; నాకు కానవచ్చున్= నాకు కనిపిస్తుంది.

తాత్పర్యం: అగ్ని స్వరూపుడు, హవిస్స్వరూపుడు, సమస్త స్వరూపుడు శ్రీమహావిష్ణువు కావటంచేత, విస్పష్ట జ్ఞానంతో చూడగలుగుతున్నాను. నాకు ఏ పాపం అంటదు. కనుక ఆ మహావిష్ణువు కనిపిస్తున్నాడు.

క. శరణాగతుండ భక్తుఁడఁ । బరమ పదవిఁ గోరెదను శుభంబుగ నన్నుం
బరికించి యేది మే ల । య్యిరవు దొరకొనంగఁ దలఁపవే కమలాక్షా! 54

ప్రతిపదార్థం: కమల+అక్ష!= కమలములవంటి కన్నులు కల ఓ శ్రీమహావిష్ణూ!; శరణాగతుండన్= శరణని వేడుకొంటున్నాను; భక్తుఁడన్= నీ పరమ భక్తుడను; పరమపదవిన్+కోరెదన్= మోక్షపదవిని కోరుతున్నాను; శుభంబుగన్= శుభం కలిగేటట్లుగా; నన్నున్+పరికించి= నన్ను పరిశీలించి; ఏది మేలు+ఆ+ఇరవు= ఏది మంచిదో ఆ చోటు (విధానం); దొరకొనంగన్= ఒప్పునట్లుగ; తలఁపవే= భావించవా!.

తాత్పర్యం: ఓ కమలాక్షా! నీకు పరమభక్తుడనయి, శరణాగతుడనయి ఉన్నాను. మోక్షపదవిని కోరుకొంటున్నాను. మంగళప్రదమై ఏది ఉత్తమమైన స్థానమౌతుందో దానిని తగిన రీతిగా నాకు అనుగ్రహించుము.

తే. తపమునకు విఘ్నకును జనుస్థానమైన । జనన రహితుని యజ్ఞాత్మ శౌరి వాఙ్మ
యాధ్వరార్చితుఁ జేసితి; నా జనార్ద । నుండు మద్భజనమునఁ బ్రీతుండు గాత!' 55

ప్రతిపదార్థం: తపమునకున్= తపస్సునకు; విద్యకును= సర్వ విద్యలకును; జనుఁ+స్థానము+అయిన= పుట్టుకకు నిలయమైన; జనన రహితునిన్= పుట్టుకలేని వాడిని; యజ్ఞ+ఆత్మున్= యజ్ఞస్వరూపుడిని; శౌరిన్= శూరవంశజుడైన శ్రీమహావిష్ణువును; వాఙ్మయ+అధ్వర+అర్చితున్+చేసితిన్= మాటలనే యాగంచేత పూజితుడిగా; చేసితిన్= చేశాను; ఆ జనార్దనుండు= ఆ శ్రీమహావిష్ణువు; మత్+భజనమునన్= నా భక్తివలన; ప్రీతుండు గాత!= సంప్రీతుడగుగాక!

తాత్పర్యం: శ్రీమహావిష్ణువు సమస్త తపస్సులకు, సర్వ విద్యలకు పుట్టుక స్థానమైనవాడు. పుట్టుక లేనివాడు. యజ్ఞస్వరూపుడు. అటువంటి మహావిష్ణువును నా వాక్కులనే - అంటే స్తవరాజం అనే - యాగంచేత పూజించాను. ఆ మహావిష్ణువు నా పూజకు సంప్రీతుడై నాకు మోక్షమొసగుగాక!

క. అని యి ట్లతుల స్తోత్రం । బున హరిఁ బూజించి గంగపుత్రుఁడు మదిలో
న నమః కృష్ణాయ యనుచు । వినతశిరస్కుఁ డయి మ్రొక్కె విశ్రుతభక్తిన్. 56

ప్రతిపదార్థం: అని; గంగ పుత్రుఁడు= గంగాసుతుడైన భీష్ముడు; ఇట్లు+అతుల స్తోత్రంబునన్= సాటిలేని స్తవరాజంచేత; హరిన్+పూజించి= శ్రీమహావిష్ణువును పూజించి; మదిలోనన్= మనసునందే; కృష్ణాయ నమః= కృష్ణుడికి నమస్కారం; అనుచున్= అంటూ; వినత శిరస్కుఁడు+అయి= తలవంచినవాడయి; విశ్రుత భక్తిన్= ప్రసిద్ధమైన భక్తితో; మ్రొక్కెన్= నమస్కరించాడు.

తాత్పర్యం: అని భీష్ముడు సాటిలేని మేటి స్తోత్రంతో శ్రీమహావిష్ణువును పూజించి మనస్సులోనే 'కృష్ణుడికి నా నమస్కార' మంటూ శిరస్సు వంచి, ప్రసిద్ధమైన భక్తితో ప్రార్థించాడు.

వ. అని పలికె నని చెప్పి వైశంపాయనుం డిట్లనియె. 57

తాత్పర్యం: అని భీష్ముడు తెలిపాడని వైశంపాయనుడు ఇట్లా పేర్కొన్నాడు.

క. స్తవరాజం బనఁగ ముని । స్తవనీయం బైన యీ వృషాకపి భవ్య
స్తవనామృతార్ణవము సం । స్తవనంబున నిచ్చు సుగతి జగతీనాథా! 58

ప్రతిపదార్థం: జగతీనాథా!= జగత్తునకు నాథుడైన ఓ జనమేజయ మహారాజా!; స్తవరాజంబు+అనఁగన్= స్తోత్రాలలో శ్రేష్ఠమైనదనబడే; ముని స్తవనీయంబు+ఐన= మహార్షులచేత స్తుతించదగినదైన; వృషాకపి= శ్రీమహావిష్ణువుయొక్క; భవ్య= శ్రేష్ఠమైన; స్తవన= స్తోత్రమనే; అమృత+అర్ణవము= అమృత సాగరం; సంస్తవనంబునన్= మిక్కిలి స్తుతించుటవలన; సుగతిన్= మోక్షాన్ని; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! ఈ స్తవరాజం మహర్షులచేత స్తుతించదగింది. ఆ శ్రీమహావిష్ణువు శ్రేష్ఠమైన స్తోత్రమనే అమృతసాగరాన్ని సంస్తుతించటం వలన అందరికీ మోక్షం ప్రాప్తిస్తుంది.

విశేషం: శరతల్పగతుడైన భీష్ముడు మోక్షార్థమై ఉత్తరాయణం కొరకు వేచిఉండి శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడిని స్తవరాజమనే ఈ స్తోత్రరాజంతో స్తుతించాడు.

క. వినుము జనమేజయ భూవర! । యనుత్తమంబయిన యిమ్మహా స్తవము పఠిం
చిన వినినను వ్రాసిన శ్రీ । యును నాయువుఁ బెంపుఁ బేరు నొసఁగు జనులకున్. 59

ప్రతిపదార్థం: భూవర!= ఓ జనమేజయ మహారాజా!; వినుము; అనుత్తమంబు+అయిన= అతిశ్రేష్ఠమైన; ఈ+మహాస్తవము= ఈ స్తవరాజమును; పఠించినన్= చదివినా; వినినన్= విన్నా; వ్రాసినన్= వ్రాసినా; శ్రీయును= సంపదను; ఆయువున్= ఆయుస్సును; పెంపున్= అభివృద్ధిని; పేరును= ప్రఖ్యాతిని; జనులకున్+ఒసఁగున్= ప్రజలకు ప్రసాదిస్తుంది.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! భీష్మకృత మైన అత్యుత్తమమైన ఈ స్తవరాజాన్ని పఠించినా, విన్నా, వ్రాసినా వారికి సంపదను, ఆయుస్సును, పేరు ప్రఖ్యాతులను ప్రసాదిస్తుంది.

వ. అని చెప్పి వైశంపాయనుండు వెండియు నిట్లనియె. 60

తాత్పర్యం: అని పలికి, వైశంపాయనుడు మరల ఈ విధంగా అన్నాడు.

తే. అట్లు హరిఁ బ్రస్తుతించి శాంతాత్మవృత్తి । నూరకున్న శాంతనవుని భూరితేజు
న మ్ముకుందునిఁ గీర్తించి రచట నున్న । పరమ మునులు గద్గదికతోఁ గురువరేణ్య! 61

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశ శ్రేష్ఠుడైన ఓ జనమేజయ మహారాజా!; అట్లు= పైన పేర్కొన్న రీతిగా; హరిన్= శ్రీమహావిష్ణువును; ప్రస్తుతించి= స్తోత్రం చేసి; శాంత+ఆత్మ+వృత్తిన్= ప్రశాంతమైన మానసిక స్థితిలో; ఊరక+ఉన్నన్= మాట్లాడకుండగా; శాంతనవునిన్= శంతన మహారాజు పుత్రుడైన భీష్ముడిని; భూరితేజున్= అత్యంత తేజశ్శాలిని; ఆ+ముకుందునిన్= ఆ శ్రీమహావిష్ణువును; అచటన్+ఉన్న= అక్కడున్న; పరమ మునులు= ముని శ్రేష్ఠులు; గద్గదికతోన్= డగ్గుత్తికతో; కీర్తించిరి= ప్రస్తుతించారు.

తాత్పర్యం: శ్రీమహావిష్ణువును స్తవరాజంతో స్తుతించి ప్రశాంతాత్ముడై మాటాడక ఊరకున్న శాంతనవుడిని, తేజశ్శాలి అయిన శ్రీమహావిష్ణువును, మహామునులు డగ్గుత్తికతో ప్రశంసించారు.

వ. అంత నిక్కడ. 62

తాత్పర్యం: అంతట ఇక్కడ. (ధర్మరాజాదులతో కూడిన శ్రీకృష్ణ డున్న ప్రదేశంలో)

ఉ. ఆ దివిజాపగాతనయు నంచిత భక్తికిఁ బ్రీతిఁ బొంది దా
మోదరుఁ డప్పు డన్నరవరోత్తముచి త్తమునందు సర్వలో
కాదృత దివ్యబోధ మహిమాతిశయం బుదయింపఁ జేయుచుం
దా దయతోడ సెజ్జ డిగి ధర్మజుమోమునఁ జూడ్కి పర్వఁగన్. 63

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; దామ+ఉదరుఁడు= శ్రీకృష్ణుడు; ఆ దివిజ+ఆపగా= ఆ దేవతా సంబంధమైన గంగానదియొక్క; తనయు= పుత్రుడి (భీష్ముడి); అంచిత భక్తికిన్= అకుంఠిత భక్తికి; ప్రీతిన్+పొంది= సంతోషించి; ఆ నరవర+ఉత్తము= ఆ రాజశ్రేష్ఠుడైన భీష్ముడియొక్క; చిత్తమునందున్= మనస్సునందు; సర్వలోక= సమస్త జగత్తులచేత ఆదృత= ఆదరింపబడిన; దివ్యబోధ= శ్రేష్ఠమైన జ్ఞానబోధ యొక్క; మహిమ+అతిశయంబు= అతిశయించిన మాహాత్మ్యం; ఉదయింపన్+చేయుచున్= కలిగింపచేస్తూ; తాన్+దయతోడన్= శ్రీకృష్ణుడు కరుణతో; సెజ్జ డిగి= పాన్పునుండి దిగి; ధర్మజుమోమునన్= ధర్మరాజుయొక్క ముఖము నందు; చూడ్కి పర్వఁగన్= చూపులు వ్యాపించగా.

తాత్పర్యం: భీష్ముడు శ్రీకృష్ణుడిని ప్రగాఢభక్తితో స్తుతించగా శ్రీకృష్ణుడు పరమానందభరితుడై ఆ భీష్ముడి మనస్సునందు సమస్త లోకాలకు చేసిన ప్రబోధాతిశయాన్ని ప్రసాదిస్తూ దయాంతఃకరణుడై పాన్పునుండి దిగి ధర్మరాజు ముఖ మవలోకించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శ్రీమహావిష్ణువునందు సమస్తలోకాలు ఉన్నాయి. కనుక భీష్మ స్తవరాజం వలన సంప్రీతుడైన శ్రీకృష్ణుడు సమస్తలోకాలకు ఆదర పూర్వకంగా చేసిన దివ్యప్రబోధంయొక్క అతిశయాన్ని చూడగలిగాడు. ఆ వెనువెంటనే ధర్మజుడి ముఖాన్ని అవలోకించాడు.

వ. 'భీష్ము పాలికిం బోదము ర' మ్మని పలికి కృతపరికరబద్ధుండై వెడలి రథం బెక్కి,సాత్యకిం దన పిఱిందిం వలనం బెట్టికొనియె; ధర్మనందన ధనంజయు లొక్క తేరును మారుతి నకుల సహదేవు లొక్క యరదంబును గృప యుయుత్సు సంజయు లొక్కస్యందనంబును నెక్కి తదీయంబులగు నేమీ నినాదంబులు దిక్కులం బిక్కటిల్ల నుచిత పరివార పరివృతులై నడచి; ర ట్లరిగి యస్థికేశ బహులంబును బహు ద్విప కుంభ ఖండ నర కపాల పాళి నిబిడంబును నై ప్రేతపత్యనుభూతోజ్జితం బైన యాపాన భూభాగంబు ననుకరించు, కురుక్షేత్రంబు దఱియు సమయంబున నయ్యంబుజాక్షుండు పాండవాగ్రజుతోడ. 64

ప్రతిపదార్థం: (శ్రీకృష్ణుడు); భీష్మపాలికిన్+పోదము రమ్ము+అని పలికి= భీష్ముడివద్దకు పోదాం రమ్మని చెప్పి; కృత= చేయబడిన; పరికర= సాధనాలచేత; బద్ధుండు+అయి= ప్రయాణ సన్నద్ధుడయి, వెడలి; రథంబు+ఎక్కి= తేరును ఎక్కి; సాత్యకిన్= తమ్ముడైన సాత్యకిని; తన పిఱింది వలనన్= తన వెనుక; పెట్టుకొనియెన్= కూర్చుండబెట్టుకొన్నాడు; ధర్మనందన ధనంజయులు= ధర్మరాజు, అర్జునుడు; ఒక్కతేరును= ఒక్క రథాన్ని; మారుతి నకుల సహదేవులు= భీముడు, నకుల, సహదేవులు; ఒక్క రథంబును= వేరొక రథాన్ని; కృప యుయుత్సు సంజయులు= కృపుడు, యుయుత్సుడు, సంజయుడు ముగ్గురు; ఒక్క స్యందనంబును= మరొక రథాన్ని, ఎక్కి; తదీయంబులు+అగు= ఆ రథాలయొక్క; నేమీ నినాదంబులు= రథ చక్రాల శబ్దాలు; దిక్కులన్+పిక్కటిల్లన్= దిశలన్నిట అతిశయించగా; ఉచిత పరివార పరివృతులు+అయి= తగిన పరివారంచేత చుట్టబడిన వారై; నడచిరి= వెళ్ళారు; అట్లు+అరిగి= అట్లా వెళ్ళి; అస్థికేశ బహులంబును= ఎముకలు, వెంట్రుకలయొక్క సమూహం కలది; బహు= అనేకములైన; ద్విప= ఏనుగుల యొక్క; కుంభ= కుంభస్థలాలయొక్క; ఖండ= ముక్కలతోను; నర= మనుష్యులయొక్క; కపాలపాళి= పుర్రెల సమూహం చేత; నిబిడంబును+అయి= దట్టంగా వ్యాపించినది అయి; ప్రేతపతి= ప్రేతాలకు అధిపతి అయిన యమధర్మరాజు చేత; అనుభూత= అనుభవించి; ఉజ్ఝితము+అయిన= వదలివేయబడిన; ఆపాన భూభాగంబున్+అనుకరించు= పానభూమి- అంటే మద్యపానశాలవలె కనిపిస్తున్న; కురుక్షేత్రంబు+తఱియు= కురుక్షేత్రాన్ని సమీపించే; సమయంబునన్= ఆ సమయంలో; అంబుజ+అక్షుండు= తామరలవంటి కన్నులు కల ఆ శ్రీకృష్ణుడు; పాండవ+అగ్రజుతోడన్= ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు 'భీష్ముడివద్దకు పోదము ర'మ్మని ధర్మరాజుతో చెప్పి ప్రయాణ సన్నద్ధుడై, రథం అధిరోహించి సాత్యకిని తన రథంలో వెనుకనే కూర్చుండబెట్టుకొన్నాడు. ధర్మరాజు, అర్జునుడు ఇద్దరు ఒక రథంలోనూ, భీమ నకుల సహదేవులు మరొక రథంలోనూ, కృపుడు, యుయుత్సుడు, సంజయుడు మరొక రథంలోనూ, ఎక్కి కూర్చున్నారు. రథాలు వెళ్ళుతూ ఉండగా ఆ వేగానికి రథచక్రాల శబ్దాలు దశదిశల వ్యాపించాయి. తమతోపాటు తగిన పరివారం బయలుదేరి వెళ్ళింది. వెళ్ళుతూ మహాభారత యుద్ధం జరిగిన కురుక్షేత్రాన్ని దర్శించారు. ఆ కురుక్షేత్రం ఎముకలు, వెంట్రుకల సమూహంతోనూ, అనేకమైన ఏనుగుల కుంభస్థలాల ముక్కలతోను, మానవుల కపాలాల సమూహంతోను దట్టమై, యముడు అనుభవించి త్రావి వదలినట్టి పానశాలాప్రదేశాన్ని అనుకరిస్తూ కనిపించింది. అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తే. 'దూరమున నైదు మడువులు దోఁచుచున్న । యవి నరేశ్వర! మును వీనియందుఁ గాదె
పరశురాముండు సేసెఁ దర్పణము నృపుల । రక్తమున భూరితర పితృభక్తి వెలయ. 65

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= ఓ ధర్మరాజా! దూరమునన్= దూరంగా; అయిదు మడువులు= ఐదు నీటి కుంటలు; తోఁచుచున్నవి= కనిపిస్తున్నాయి; మును= పూర్వం; పరశురాముండు= జమదగ్ని పుత్రుడైన పరశురాముడు; భూరి తరపితృభక్తి=

ప్రగాఢమైన పితృభక్తి; వెలయన్= ఒప్పునట్లు; నృపుల రక్తమునన్= రాజుల రక్తంతో; తర్పణము= పితరులకర్పించే తర్పణం; వీనియందున్= ఈ అయిదు మడుగులలో; చేసెన్+కాదె!= చేశాడు కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఈ కురుక్షేత్రంలో దూరంగా అయిదు మడుగులు కనిపిస్తున్నాయి. పూర్వం పరశురాముడు రాజులపై ఇరవై ఒక్కసార్లు దండెత్తి వెళ్ళి, వాళ్ళను సంహరించి వారి రక్తంతో అత్యంత పితృభక్తిని ప్రకటించి ఈ ఐదుమడుగులలోనే తర్పణం చేసి సంతృప్తు డయ్యాడు కదా!

విశేషం: త్రేతా ద్వాపర సంధి యుగంలో ఇరవై ఒక్కమార్లు శత్రుసంహారం చేసి, ఈ ప్రదేశంలో ఐదు మడుగులు చేసి, శత్రువుల రక్తంతో ఈ ఐదు మడుగులలో పితృతర్పణం చేశాడు పరశురాముడు. పితృప్రార్థనంతో పరశురాముడి కోపం ఉపశాంతించటం జరిగింది. అందువలననే ఈ ప్రాంతం శమంతక పంచకమని ప్రసిద్ధి పొందింది. కురుక్షేత్రంలోని భాగ మది.

మ. క్షితి నెందుం జరియించి భూపతుల నిశ్శేషంబుగా నేకవిం
శతి వారంబులు ద్రుంచి యాతఁడు దుదిన్ శాంతత్వముం బొందె సు
వ్రతుఁడై' నావుడు నమ్మహీశుఁ 'డతఁ డీ క్రౌర్యంబు సేయంగ నే
ల తొడంగెన్? నృపు లెట్లు గల్గి రిల యెల్లం గైకొనం గ్రమ్మఱన్?' 66

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ పరశురాముడు; సువ్రతుఁడు+ఐ= క్షత్రియ సంహారమే వ్రతంగా కలవాడయి; క్షితిన్+ఎందున్+చరియించి= భూమి అంతట తిరిగి; ఏక వింశతి వారంబులు= ఇరవై ఒక్కమారులు; భూపతులన్= రాజులను; నిశ్శేషంబుగాన్= మిగులకుండ; త్రుంచి= చంపి; తుదిన్= చివర; శాంతత్వమున్+పొందెన్= శాంతిని పొందాడు; నావుడున్= అని శ్రీకృష్ణుడు చెప్పగా; ఆ+మహీశుఁడు= ఆ భూమిపతి అయిన ధర్మరాజు; అతడు+ఈ క్రౌర్యంబు+చేయంగన్= ఆ పరశురాముడు ఈ క్రూర కార్యం చేయటానికి; ఏల తొడంగెన్?= ఎందుకు ప్రయత్నించాడు?; ఇల+ఎల్లన్+కైకొనన్= ఈ భూమినంతటిని గ్రహించటానికి; క్రమ్మఱన్= మరల; ఎట్లు నృపులు కల్గిరి?= ఏ విధంగా రాజులు జన్మించారు? అని ప్రశ్నించాడు.

తాత్పర్యం: పరశురాముడు భూమి నంతటను తిరిగి ఇరవై ఒక్కమారులు రాజులందరిని శత్రుశేషం లేకుండా సంహరించి చిట్టచివరకు శాంతాత్ముడయ్యాడు' అని శ్రీకృష్ణుడు చెప్పగా ధర్మరాజు విని 'ఈ క్రూరకార్యాన్ని పరశురాముడు ఎందుకు చేయవలసి వచ్చింది? క్షత్రియులందరిని సంహరించగా ఎట్లా పునరుజ్జీవితు లయ్యారు? ఈ భూమినంతటిని మళ్ళీ ఎట్లా ఆక్రమించారు?'

విశేషం: మూలమందలి ఆరు శ్లోకాలను సంక్షిప్తీకరించి తిక్కన ఈ పద్యంలో పరశురాముడు క్షత్రియ సంహారంచేసిన విషయాన్ని వివరించాడు.

వ. అనుటయు నచ్యుతుండు 'నప్పరశురామ జన్మప్రపంచంబును, దదీయ క్రోధ కారణంబును, నృపలోక
మారణంబును, భూపాల వంశ పునస్సంభవ ప్రకారంబును మునులవలన వినిన చొప్పునం జెప్పెద' నని
యజ్జనపతి కి ట్లనియె. 67

ప్రతిపదార్థం: అనుటయున్= అని అడుగగా; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; ఆ+పరశురామ+జన్మ ప్రపంచంబును= ఆ పరశురాముడి యొక్క జనన వివరణను; తదీయ క్రోధ కారణంబును= ఆయన కోప హేతువును; నృపలోక మారణంబును= రాజ సమూహము యొక్క సంహారాన్ని; భూపాల వంశ= రాజులయొక్క వంశాల యొక్క; పునఃసంభవ ప్రకారంబును= మరల జన్మించిన విధాన్ని; మునుల వలనన్= మహర్షుల వలన; వినిన చొప్పునన్+చెప్పెదన్= వినిన రీతిగా వివరిస్తాను; అని+ఆ+జనపతికిన్= అని ఆ ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ క్రింది విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా శ్రీకృష్ణుడు 'పరశురాముడి జననరీతిని, ఆయనకు కలిగిన కోపహేతువును, రాజ సమూహ సంహారాన్ని, మళ్ళీ రాజులు జనించిన రీతిని మహర్షులవలన విన్న విధానాన్ని చెపుతున్నా'నని ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకుఁ బరశురాముని చరిత్రంబు చెప్పుట (సం. 12-49-1)

సీ. కలఁడు జహ్నుం డనఁగాఁ దొల్లి యొక మహీ । పతి యుజహ్నుండు దత్సుతుఁడు; వాని
కుదయించె వల్లభుం డుర్వీశ! యాతని । కొడుకు తపోనిష్ఠఁ గుశికుఁ డింద్రు
మెచ్చించి జగముల మేటినాఁ దగుపు త్రు । వేఁడిన దాన నవ్విభున కుద్ధ
వమ్మయి కౌశికుఁ డిమ్మహి గాధి నా । మమ్మునఁ బరగె నమ్మనుజవిభుఁడు

తే. సత్యవతి యను తన కన్య సంప్రమోద । మున బుచీకున కిచ్చె; నమ్ముని సుకర్మ
నిరతి సంతాన వాంఛమైఁ జరు యుగంబుఁ । దనకు మామకునై కల్పితముగఁ జేసి. 68

ప్రతిపదార్థం: ఉర్వీశ!= ఓ ధర్మరాజా! తొల్లి= పూర్వం; జహ్నుండు+అనఁగాన్= జహ్నుడనే పేరుతో; ఒక మహీపతి= ఒకరాజు; కలఁడు= ఉండేవాడు; తత్సుతుఁడు ఉజహ్నుండు= ఆతడి కుమారుడు ఉజహ్నుడు; వానికి; వల్లభుండు ఉదయించెన్= అతడికి వల్లభుడనేవాడు జన్మించాడు; ఆతని కొడుకు= ఆ వల్లభుడి కుమారుడు; కుశికుఁడు= కుశికుడనే పేరు కలవాడు; తపఃనిష్ఠన్= తపోనిష్ఠచేత; ఇంద్రున్+మెచ్చించి= దేవేంద్రుడిని మెప్పించి; జగములన్ మేటి నాన్ తగు= లోకంలో అన్నిట సాటిలేని మేటి అనదగిన; పుత్రున్+వేడినన్= కుమారుడిని వేడుకొనగా; దానన్+ఆ+విభునకున్= ఆ ఇంద్రుడి వరంవలన కుశికుడనే రాజునకు; కౌశికుఁడు+ఉద్భవంబు+అయి= కౌశికుడు జన్మించి; ఈ+మహిన్= ఈ భూలోకంలో; గాధి నామంబునన్+పరఁగెన్= గాధి అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు; ఆ+మనుజ విభుఁడు= ఆ రాజైన గాధి; సత్యవతి+అను= సత్యవతి అనే; తన కన్యన్= తన కూతురును; సంప్రమోదమునన్= అత్యంత ఆనందంతో; బుచీకునకున్+ఇచ్చెన్= బుచీకుడనే మునికి ఇచ్చి పెండ్లి చేశాడు; ఆ+ముని= ఆ బుచీక మహర్షి; సుకర్మ నిరతిన్= ఉత్తమ కర్మాచరణాసక్తితో; సంతాన వాంఛమైన్= సంతానం మీది కోరికతో; చరు యుగంబున్= హవిస్సుల జంటను; తనకున్ మామకున్= తనకు మామకును; కల్పితంబుగన్+చేసి= కల్పించి.

తాత్పర్యం: పూర్వం జహ్ను డనే రాజు ఉండేవాడు. అతడి కుమారుడు ఉజహ్నుడు. అతడి పుత్రుడు వల్లభుడు. అతడి కుమారుడు కుశికుడు. ఈ కుశికుడు ఘోరతపం చేసి ఇంద్రుడిని మెప్పించి లోకా లన్నిట సాటిలేని మేటి అయిన పుత్రుడిని ఇమ్మని వేడుకొనగా, ఇంద్రవరం వలన కౌశికుడు ఉద్భవించాడు. అతడే గాధి అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. ఈ గాధి తన పుత్రిక అయిన సత్యవతిని సంతోషంగా బుచీకు డనే ముని కిచ్చి పెండ్లి చేశాడు. ఆ బుచీకమహర్షి ఉత్తమ తపఃకర్మ లాచరించి సంతానాన్ని వాంఛించాడు. అందుకు తనకే కాక మామకు కూడా సంతానాన్ని ఆశించి హవిస్సుల జంటను కల్పించాడు.

విశేషం: 'ఉజహ్నుండు' పాఠాంతరంలో వావిళ్ళ ప్రతిలో అజహ్నుడు అని ఉండగా, మరొక ప్రతిలో ఉజహ్నుడు అని ఉన్నది. మూలంలో మాత్రం 'ఉజహ్నుడు' అని ఉన్నది. కాబట్టి ఆ పాఠమే గ్రహించబడింది. వావిళ్ళ ప్రతిలో పల్లవుడని ఉండగా తక్కిన ప్రతులలో వల్లభుడని ఉన్నది. మూలంలో వల్లభుడని ఉన్నది.

వ. ఆ భృగునందను డచ్చరువులు నిజభార్య ముందట నిడి 'క్షత్రియాజేయుండును క్షత్రియ సూదనుండును నగు క్షత్రియోత్తముం డిచ్చరువున జన్మించు; దీని మీ తల్లికి నిమ్ము; తపోధృతి శమంబుల నుత్కృష్టుండగు ద్విజ శ్రేష్ఠుండు దీని వలనం బుట్టు; నిది నీ వుపయోగింపు' మని వాని నేర్పరించి 'భవజ్జననీ జనకు లిప్పుడు వచ్చెద'

రని చెప్పి నదీ స్నానార్థియయి యరిగెం; దదనంతరంబ తదాశ్రమంబునకుం దీర్థయాత్రాపరుండయి గాధి గృహిణీ సహితంబుగాఁ జనుదెంచిన, సత్యవతియు నిజ భర్త గావించిన చరుద్వయంబు మాతకుం జూపి తత్ప్రభావ భేదం బుపన్యసించినం బ్రీత యై యద్దేవి పరమపావనస్నానం బాచరించి చరువుపయోగించు నప్పుడజ్ఞానంబునం దన చరువు కూఁతున కిచ్చి కూతుచరువు దానుపయోగించె; నయ్యువతియుం దలంపులేమి నా లేమ యిచ్చిన భంగిన కుడిచె; నంత భార్గవుండు వచ్చి పత్నిం జూచి దివ్య బోధనంబు నెఱింగి 'క్షత్రియాంతకరం బగు గర్భంబు ధరియించినదాన' వనవుడు నత్తరుణియుఁ దత్పాదంబులకుం బ్రణతయై 'మీ రిట్లానతీఁ దగునె?' యని వడవడ వడంకుచుఁ గేలు మొగిచి నిలిచిన, నత్తపోధనుం డత్తెఱవతో 'నత్తెఱంగు నా తలంపున వచ్చినది గాదు; భవన్మాతృ బుద్ధిహీనిం జేసి చరు వ్యత్యాసంబున నయ్యె; నీకుఁ గ్రూరకర్ముండును మహాబలుండును నగు పుత్రుం డుద్భవించు; నా యమకు బ్రహ్మభూతుండు దపోధనుండును నగువా డుదయించు; నేను దపంబున విశ్వబ్రహ్మంబు నచ్చరువున నావహించినవాఁడ'నని పలుకుటయు. 69.

ప్రతిపదార్థం: ఆ భృగు నందనుండు= ఆ భృగు వంశీకుడైన ఋచీకుడనే మహర్షి; ఆ+చరువులు= ఆ రెండు హవిస్సులను; నిజభార్యముందటన్+ఇడి= తన భార్య ముందట ఉంచి; క్షత్రియ+అజేయుండును= రాజులచేత జయింపబడని వాడును; క్షత్రియ సూదనుండును= రాజులను వధించేవాడును; అగు= అయిన; క్షత్రియ+ఉత్తముండు= రాజశ్రేష్ఠుడు; ఈ+చరువునన్= ఈ హవిస్సునందు; జన్మించున్= జన్మిస్తాడు; దీనిన్= ఈ మొదటి హవిస్సును; నీ తల్లికిన్+ఇమ్ము= మీ అమ్మకు ఇమ్ము; తపః+ధృతి శమంబులన్= గొప్ప తపస్సు శాంతులచేత; ఉత్కృష్టుండు+అగు= గొప్పవాడైన; ద్విజశ్రేష్ఠుండు= బ్రాహ్మణోత్తముడు; దీనివలనన్= ఈ మరొక హవిస్సు వలన పుట్టుతాడు; ఇది నీవు+ఉపయోగింపుము= దీనిని నీవు భుజింపవలసిందని; వానిని= ఆ హవిస్సులను; ఏర్పరించి= విభజించి; భవత్+జననీ జనకులు= మీ తల్లిదండ్రులు; ఇప్పుడు వచ్చెదరు= కొద్దిసేపటిలో వస్తారని తెలిపి; నదీ స్నాన+అర్థి+అయి= నదిలో స్నానం చెయ్యటం కొరకు(ఋచీకుడు); అరిగెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; తద్+ఆశ్రమంబునకున్= ఆ ఆశ్రమానికి; తీర్థయాత్రాపరుండు+ఐ= తీర్థయాత్రలలో ఆసక్తి కలవాడై; గాధి= ఋచీకుడి మామ అయిన గాధి; గృహిణీ సహితంబుగాన్= భార్యతోపాటు; చనుదెంచినన్= రాగా; సత్యవతియున్= ఆ దంపతుల పుత్రి అయిన సత్యవతి; నిజభర్త= తన భర్త అయిన ఋచీకుడు; కావించిన= చేసిన; చరుద్వయంబు= హవిస్సుల జంటను; మాతకున్+చూపి= తల్లికి చూపెట్టి; తత్ప్రభావ భేదంబున్+ఉపన్యసించినన్= ఆ హవిస్సుల జంట యొక్క మహిమల భేదాన్ని వివరించగా; ఆ+దేవి= ఆ సత్యవతి తల్లి; ప్రీత+ఐ= సంతుష్ట అయి; పరమపావన స్నానంబు+ఆచరించి= మిక్కిలి పవిత్రమైన స్నానం చేసి; చరువు+ఉపయోగించునప్పుడు= ఆ హవిర్భాగాన్ని ఉపయోగిస్తున్నప్పుడు; న+జ్ఞానంబునన్= తెలివి తక్కువ వలన; తన చరువు కూఁతునకున్+ఇచ్చి= తాను భుజించవలసిన హవిర్భాగాన్ని పుత్రికకు ఇచ్చి; కూఁతు చరువు= కూతురు గ్రహించవలసిన హవిర్భాగాన్ని; తాన్+ఉపయోగించెన్= తాను గ్రహించింది; ఆ+యువతియున్= ఆ సత్యవతియు; తలంపు లేమిన్= గుర్తులేకపోవటంచేత; ఆ లేమ యిచ్చిన భంగిన= ఆ తల్లి ఇచ్చిన విధంగానే; కుడిచెన్= స్వీకరించింది; అంతన్= అంతలోపల; భార్గవుండు వచ్చి= భృగు వంశీకుడైన ఋచీకుడు వచ్చి; పత్నిన్ చూచి= భార్య అయిన సత్యవతిని చూచి; దివ్యబోధనంబునన్+ఎఱింగి= దివ్య జ్ఞానంతో తెలిసికొని; క్షత్రియ+అంతకరంబు+అగు= రాజ వినాశకమైన; గర్భంబున్+ధరించినదానవు= గర్భం ధరించావు; అనవుడన్= అని చెప్పగా; ఆ+తరుణియున్= ఆ సత్యవతి; తద్+పాదంబులకున్= ఆతడి కాళ్ళకు; ప్రణతఅయి= నమస్కరించినదై; మీరు+ఇట్లు+ఆనతి+ఈన్+తగునె?= మీరు ఈ విధంగా అనటం సమంజసం కాదు; అని వడవడ వడంకుచున్= గజగజ వణకుతూ; కేలు మొగిచి= చేతులు జోడించి; నిలిచినన్= నిలువగా; ఆ+తపోధనుండు= తపస్సే ధనంగా కల ఆ ఋచీకుడు; ఆ+తెఱవతోన్= ఆ సత్యవతితో; ఆ+తెఱంగు= ఆ విధం; నా తలంపున వచ్చినది కాదు= నా ఎరుకతో వచ్చినది కాదు (కావాలని చేసినది కాదు); భవత్+మాతృ+బుద్ధిహీనిన్+చేసి= నీ తల్లి బుద్ధిలేమితనంవలన; చరు వ్యత్యాసంబునన్+అయ్యెన్= హవిస్సులు మారటం వలన జరిగింది;

నీకున్= నీకు; క్రూర కర్ముండును= ఘోరకృత్యాలు చేసేవాడును; మహాబలుండును= మిక్కిలి పరాక్రమవంతుడును; అగు= అయిన; పుత్రుండు= కుమారుడు; ఉద్భవించున్= పుట్టుతాడు; ఆయమకున్= నీ తల్లికి; బ్రహ్మభూతుండు= బ్రహ్మజ్ఞాని; తపోధనుండు= తపస్సే ధనంగా కలవాఁడు; అగువాడు= అయినవాడు; ఉద్భవించున్= పుట్టుతాడు; ఏను= నేను; తపంబునన్= తపస్సుచేత; విశ్వ బ్రహ్మంబున్= పరబ్రహ్మమును; ఆ+చరువునన్= ఆ హవిస్సునందు; ఆవహించినవాఁడను= ప్రవేశపెట్టాను; అని పలుకుటయున్= అని చెప్పగా.

తాత్పర్యం: ఆ ఋచీకుడు రెండు హవిర్భాగాలను, భార్య సత్యవతికి చూపించి 'రాజులచేత జయించబడనివాడు, క్షత్రియ సంహారకుడు అయిన ఉత్తమ క్షత్రియుడు మొదటి హవిర్భాగంవలన జన్మిస్తాడు. ఇది మీ తల్లికి ఇమ్ము. తపస్సంపన్నుడైన బ్రాహ్మణోత్తముడు రెండవ హవిస్సువలన జన్మిస్తాడు. దీనిని నీవు స్వీకరించుము' అని చెప్పి 'త్వరలోనే నీ తల్లిదండ్రులు ఇక్కడకు వస్తా' రని చెప్పి నదీస్నానానికై వెళ్ళిపోయాడు. కొంతసేపటికి తీర్థయాత్రలు చేస్తూ గాధి భార్యాసమేతంగా ఆ ఆశ్రమానికి వచ్చాడు. సత్యవతి ఆ హవిర్భాగాలను చూపి భర్త చెప్పిన విషయాన్ని తెలుపగా తల్లి సంతోషించి, సత్యవతి స్వీకరింపవలసిన హవిస్సును తాను, తాను భుజింపవలసింది సత్యవతి వ్యత్యస్తంగా భుజించారు. ఆ వెనుక ఋచీకుడు వచ్చి బ్రహ్మజ్ఞానంతో 'నీగర్భంలో క్రూరకర్ముడు ఉన్నా' డని చెప్పగా సత్యవతి 'ఇట్లా అనుగ్రహిస్తారా?' అని గజగజ వణికిపోయింది. అప్పుడు ఋచీకుడు తాను ఆ విధంగా భావించ లేదని మీ తల్లి బుద్ధిలేమితనంవల్ల హవిర్భాగాల వ్యత్యస్తం జరిగిందని చెప్పాడు. 'నీకు క్రూరకర్ముడు, మహాబలుడు అయిన పుత్రుడు ఉద్భవిస్తాడు. ఆవిడకు బ్రహ్మజ్ఞాని, తపస్సంపన్నుడైనవాడు పుట్టుతాడు. నేను ఘోరతపస్సుచేసి పరబ్రహ్మను ఆ హవిర్భాగంలో ఆవహింపచేశాను' అని చెప్పాడు.

క. అమ్ముగ్ధ యతని కిట్లను । 'నిమ్మూఁడు జగములు మీర లితరంబులుగాఁ
గ్రమ్మనఁ జేయఁగఁ జాలుదు; । రెమ్మెయి నైనఁ గృపసేయరే నా మీఁదన్. 70

ప్రతిపదార్థం: ఆ+ముగ్ధ= ఆ ముద్దరాలైన సత్యవతి; అతనికిన్+ఇట్లు+అనున్= భర్త అయిన ఋచీకుడితో ఇట్లాఅన్నది; మీరలు= మీరు; ఈ+మూఁడు జగములు= ఈ ముల్లోకాలను; ఇతరంబులుగాన్= వేరుగా; క్రమ్మనన్= వెనువెంటనే; చేయఁగన్+చాలుదురు= చేయగల సమర్థులు; ఏ+మెయిన్+అయినన్= ఏ విధంగా నైనా సరే; నా మీదన్= నాపై; కృప చేయరే!= దయ చూపించరా!

తాత్పర్యం: వెనువెంటనే ముగ్ధ అయిన సత్యవతి భర్తతో ఇట్లా అన్నది - 'ఈ ముల్లోకాలను మార్చగలిగిన సమర్థులు మీరు. ఏ విధంగానైనా నా మీద దయతో అనుగ్రహించరా!

వ. క్రూరుండగు కొడుకుం గనుట కోర్వ' ననుటయు ననుగ్రహాతిశయంబున నమ్మహాముని 'యవ్విశేషంబు నా పుత్రునకు లేకుండెడు; బౌత్రునియం దావహిల్లెడు; నీ కెట్లు ప్రియం బట్లకాఁగలయది' యనియె; నట్ల యత్తన్వి తపో నిరతుండును, దాంతుండును, శాంతుండును నైన జమదగ్నిం గనియె; బ్రహ్మర్షి సదృశుం డగు విశ్వామిత్రుని గాధిపత్ని గాంచె. 71

ప్రతిపదార్థం: క్రూరుండు+అగు= భయంకరుడైన; కొడుకున్+కనుటకున్+ఓర్వన్+అనుటయున్= కుమారుడిని పొందటానికి సహించనని సత్యవతి చెప్పగా; అనుగ్రహ+అతిశయంబునన్= అధికమైన దయతో; ఆ+మహాముని= ఆ మహర్షి శ్రేష్ఠుడు; ఆ+విశేషంబు= క్రూరుడై పుట్టే విశేషం; నా పుత్రునకున్ లేకుండెడున్= నా కుమారుడికి లేకుండుగాక!; పౌత్రుని యందున్+ఆవహిల్లెడున్= మనుమని యందు కలుగుతుంది; నీకున్+ఎట్లు ప్రియంబు+అట్లకాన్+కల అది= నీకు ప్రియమైన దేదో అదే రీతిగా జరుగుతుంది; అనియెన్= అని ఋచీకుడు అనుగ్రహించాడు; అట్లు+అ+తన్వి= అదే రీతిగా ఆ సత్యవతి;

తపఃనిరతుండును= తపస్సు నందతిశయమైన ఆసక్తి కలవాడు; దాంతుండును= కర్మేంద్రియ నిగ్రహం కలవాడు (తపఃక్లేశాలకు ఓర్చుకొనేవాడు); శాంతుండునున్= కర్మేంద్రియ నిగ్రహం కలవాడు; ఐన= అయినట్టి; జమదగ్నిన్+కనియెన్= జమదగ్ని అనే కుమారుడిని పొందింది; బ్రహ్మర్షి సదృశుండు+అగు= బ్రహ్మవేత్త అయిన మహర్షితో సమానుడైన; విశ్వామిత్రుని= విశ్వామిత్రుడనే పేరు కలిగినవాడిని; గాధి పత్ని+కాంచెన్= గాధి భార్య పొందింది.

తాత్పర్యం: క్రూరాత్ముడైన కుమారుడిని పొందటానికి నేను అంగీకరించ నని సత్యవతి చెప్పింది. ఆ మహర్షి సత్తముడైన ఋచీకుడు ఆ క్రూరాత్మత పుత్రుడియందు గాక, మనుమని యందుంటుందనీ, ఆమె కోరిన రీతిగా జరుగుతుందని అనుగ్రహించాడు. అట్లాగే సత్యవతి తపస్సంపన్నుడు, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ నిగ్రహం కలవాడు అయిన జమదగ్నిని పుత్రుడిగా పొందింది. గాధి భార్య బ్రహ్మర్షి సమానుడైన విశ్వామిత్రుడిని కన్నది.

క. జమదగ్ని సర్వ విద్యా । సమేతుఁడు నుదారగుణుఁడుఁ జాపాగమవే
దిమతియు నగు రామునిఁ గాం । చె మహీపతి హనన శీలు శిఖినిభమూర్తిన్. 72

ప్రతిపదార్థం: జమదగ్ని= జమదగ్ని మహర్షి; సర్వవిద్యా సమేతుఁడు= సమస్త విద్యలను కలిగినవాడూ; ఉదార గుణుఁడు= ఔదార్యవంతుడూ; చాప+ఆగమవేదిమతియున్= ధనుర్వేదమునందు బుద్ధిమంతుడూ; మహీపతి హనన శీలున్= రాజులను సంహరించగల సమర్థుడూ; శిఖి నిభమూర్తిన్= అగ్ని శిఖతో సమానమైన స్వరూపం కలవాడూ; అగు= అయినట్టి; రామునిన్+కాంచెన్= పరశురాముడిని పుత్రుడిగా పొందాడు.

తాత్పర్యం: జమదగ్ని సమస్తవిద్యలను నేర్చినవాడూ, ఉదారస్వభావుడూ, ధనుర్వేదాన్ని గ్రహించిన బుద్ధిమంతుడూ, రాజులను సంహరించగల సమర్థుడూ అగ్ని సమానుడూ అయిన పరశురాముడిని కుమారుడిగా పొందాడు.

వ. అక్కాలంబునందు హైహయ వంశవరుండు. 73

ప్రతిపదార్థం: ఆ+కాలంబునందున్= అదే కాలంలో; హైహయ వంశవరుండు= హైహయ వంశంలో శ్రేష్ఠుడైనవాడు.

తాత్పర్యం: అదే కాలంలో హైహయవంశశ్రేష్ఠుడైనవాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. దుర్జయ విక్రమోజ్జ్వలుఁడు దోష వివర్జిత బుద్ధి కార్తవీ
ర్యార్జునుఁ డేడుదీవులు నయాన్విత శూరత నేలుచుండ ధ
ర్మార్జనలోల బుద్ధియు మహాస్త్రబలంబు సహస్ర బాహుతా
స్ఫూర్జనమున్ వెలుంగఁగ నృపుల్ దన యాజ్ఞఁ దలన్ వహింపఁగన్. 74

ప్రతిపదార్థం: దుర్జయ విక్రమ+ఉత్+జ్వలుఁడున్= జయించటానికి వీలు గాని పరాక్రమంతో ప్రకాశిస్తున్నవాడు; దోష వివర్జిత బుద్ధి= పాపాన్ని వదలిన బుద్ధి కలవాడు (అయిన); కార్తవీర్య+అర్జునుఁడు= కార్తవీర్యార్జును డనే పేరు కలిగిన హైహయరాజు; ధర్మ+ఆర్జన లోల బుద్ధియున్= పురుషార్థాలలో ఒకటైన ధర్మ సంపాదనమునందు ఆసక్తమైన బుద్ధితో; మహా+అస్త్రబలంబున్= గొప్ప బాణవిద్యయొక్క బలంతోను; సహస్ర బాహుతా స్ఫూర్జనమున్= వేయి చేతులు గలిగియుండుటవలని ప్రకాశాతిశయంతోను (స్ఫూర్తితోను); వెలుంగఁగన్= ప్రసిద్ధమై వెలుగగా; నృపుల్= (సామంత) రాజులు; తన ఆజ్ఞన్+తలన్ వహింపఁగన్= ఆ కార్తవీర్యార్జునుడి ఆనతి ఔదల దాల్చగా; నయ+అన్విత శూరతన్= నీతితో కూడిన అంటే నీతిమంతమైన పరాక్రమంతో; ఏడు దీవులు= ఏడు దీవుల రాజ్యాన్ని; ఏలుచుండున్= పరిపాలిస్తూ ఉంటాడు.

తాత్పర్యం: శత్రువులకు జయించరానంతటి పరాక్రమంతో ఎట్లాంటి పాపమూ లేనట్టి బుద్ధి సంపన్నుడు అయిన హైహయవంశ రాజు అయిన కార్తవీర్యార్జునుడు ధర్మంలో ఆసక్తమైన బుద్ధిచేతను, అస్త్రవిద్యాబల సంపన్నత చేతను, వేయిచేతుల బలాఢ్యతతోనూ, ప్రకాశిస్తూ రాజులందరూ తన ఆజ్ఞను శిరసావహిస్తుండగా నీతియుత పరాక్రమంతో సప్తద్వీపాలతో కూడిన భూమిని పాలిస్తూ ఉండేవాడు.

విశేషం: కార్తవీర్యార్జునుడు; హైహయ వంశీకుడైన కృతవీర్యుడి కుమారుడు కార్తవీర్యుడు. అతడి పేరు అర్జునుడు. కార్తవీర్యార్జునుడు. ఇతడు దత్తాత్రేయుడిని సేవించి, ఆతడి వరప్రసాదంవలన సహస్ర బాహువులు, యుద్ధంలో విజయమేగాని ఓటమిలేనట్లు, వరాలు పొందాడు.

క. ఆ రాజు నగ్నిదేవుఁడు । గారవమున నడుగ నతఁడు గడుఁబెంపున నా
హారముగ నిచ్చె గిరినగ । రారణ్య గ్రామ ఖర్వటాదు లతనికిన్. 75

ప్రతిపదార్థం: అగ్నిదేవుఁడు= సర్వభక్షకుడైన అగ్నిదేవుడు; ఆ రాజున్= హైహయ వంశీకుడైన కార్తవీర్యార్జునుడిని; గారవమున్= గౌరవంతో (ప్రీతితో); అడుగన్= అడుగగానే; అతఁడు+కడున్+పెంపునన్= ఆ కార్తవీర్యార్జునుడు మిక్కిలి అతిశయంతో; అతనికిన్= ఆ అగ్నికి; గిరి నగర+అరణ్య గ్రామ ఖర్వట+ఆదుల్= పర్వతాలు, నగరాలు, అడవులు, గ్రామాలు, అన్ని వృత్తులవాళ్ళు ఉండే పల్లెలు మొదలైన వాటి నన్నింటిని; ఆహారముగన్+ఇచ్చెన్= ఆహారంగా స్వీకరించటానికి ఇచ్చాడు.

తాత్పర్యం: ఒకానొకరోజు క్షుధార్తుడయిన అగ్నిదేవుడు కార్తవీర్యార్జునుడి వద్దకు వెళ్ళి ప్రార్థించగా పర్వతాలు, అరణ్యాలు, పట్టణాలు, గ్రామాలు, వృత్తిపనులవా ళ్ళుండే పల్లెటూళ్ళు అగ్నిదేవుడికి ఆహారంగా ఇచ్చాడు.

వ. ఇచ్చిన నగ్నిదేవుం డాహారంబుగాఁ గొను తరువాత మిత్రావరుణనందను నాశ్రమకాననం బతండు లేని సమయంబున సమసిన నమ్మహాత్ముం డెఱింగి వచ్చి యా సర్వభక్షకునకు రక్షణం బాచరించుచు వర్తించు కార్తవీర్యునిం గని కనలి 'నీవు మదీయ తపోవనంబు పరిహరింపక గహన సామాన్య బుద్ధిం గాల్చితి; నీ బాహులు రాముండు నఱకువాఁ'డని శాపం బిచ్చె; సహస్రబాహుండును దానికి విషాదంబు నొంది యధిక తాత్పర్యంబుతో ధర్మకార్యంబుల నడుపుచుండె. 76

ప్రతిపదార్థం: ఇచ్చినన్= కార్తవీర్యార్జునుడు దానమివ్వగా; అగ్నిదేవుండు+ఆహారంబుగాన్= సర్వభక్షకుడైన అగ్నిదేవుడు ఆహారంగా; కొను తరువాత= స్వీకరించిన వెనుక; మిత్రావరుణ నందనున్= మిత్రావరుణుల యొక్క కుమారుడు (వసిష్ఠ మహర్షి); ఆశ్రమ కాననంబు= ఆశ్రమాటవి; అతండు లేని సమయంబునన్= అతడు లేని సమయంలో; సమసినన్= నాశనమై పోగా; ఆ+మహాత్ముండు= ఆ మహర్షి వసిష్ఠుడు; ఎఱింగి వచ్చి= తెలిసికొని వచ్చి; ఆ సర్వభక్షకునకున్= సర్వాన్ని తినే వాడైన అగ్నికి; రక్షణంబు+ఆచరించుచున్= కాపాడుతూ; వర్తించు= నడుచుకొంటున్నటువంటి; కార్తవీర్యునిన్+కని= కార్తవీర్యార్జునుడిని చూచి; కనలి= కోపించి; నీవు= (కార్తవీర్యార్జునుడు); మదీయ తపోవనంబు= నా ఆశ్రమాన్ని; పరిహరింపక= వదలిపెట్టక; గహన సామాన్య బుద్ధిన్= సాధారణ అరణ్యమనే భావనతో; కాల్చితి(వి)= కాల్చివేశావు?; నీ బాహులు= నీ వేయి చేతులు; రాముండు నఱకువాఁడు+అని= పరశురాముడు ఖండిస్తాడని; శాపంబు+ఇచ్చెన్= శపించాడు; సహస్ర బాహుండును= వెయ్యి చేతులుగల కార్తవీర్యార్జునుడును; దానికిన్= అందుకు; విషాదంబున్+ఒంది= దుఃఖించి; అధిక తాత్పర్యంబుతోన్= ముందుకంటె మరింత అభినివేశంతో; ధర్మకార్యంబులన్= ధర్మగుణంతో సమస్తమైన పనులను; నడుపుచుండెన్= చేస్తూ ఉండేవాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు యాచించగానే కార్తవీర్యార్జునుడు సమస్తమూ ఇచ్చివేయగా, ఆహారంగా స్వీకరించాక వసిష్ఠాశ్రమాన్ని సైతం అతడు లేని సమయాన అగ్నిదేవుడు సమస్తమూ భక్షించాడని తెలిసికొన్న వసిష్ఠమహర్షి

అగ్నిదేవుడికి రక్షకుడైన కార్తవీర్యార్జునుడిని చూచి మిక్కిలి కోపించి, 'నీవు తపోవనాన్ని మిగల్చకుండా సామాన్యమైన అరణ్యంగా భావించి కాల్పించావు. పరశురాముడు నీ బాహువులను ఖండిస్తా'డని శాపమివ్వగా అందుకు కార్తవీర్యార్జునుడు ధుఃఖించినప్పటికి మరింత అభినివేశంతో ధర్మకార్యాలు నిర్వర్తిస్తూనే వచ్చాడు.

క. శాపము గారణముగ నా । భూపతి కవినీతులైన పుత్రులు సబలా
టోపాత్ములు పలువురు సిం । హోపములు జనించి ధాత్రి నుద్భటవృత్తిన్. 77

ప్రతిపదార్థం: శాపము కారణముగన్= వసిష్ఠుని యొక్క శాపకారణంచేత; ఆ భూపతికిన్= ఆ రాజైన కార్తవీర్యార్జునుడికి; సబల+ఆటోప+ఆత్ములు= బలంతో కూడి ఉండటం వలన వేగిరపాటు కల బుద్ధితో ఉన్నవారు; సింహ+ఉపములు= సింహాలతో సమానమైనవారు; పలువురు= అనేకులు; జనించి= పుట్టి; ధాత్రిన్= భూమిపై; ఉద్భట వృత్తిన్= భయంకరమైన నడవడితో.

తాత్పర్యం: వసిష్ఠుడు ఇచ్చిన శాపం మూలంగా కార్తవీర్యార్జునుడికి నీతిలేనివారు, అత్యంత బలం వలన వేగిరపాటు కలవారు, సింహ పరాక్రములు అయిన అనేక పుత్రులు జన్మించారు. పుట్టి భూమిని భయంకర వృత్తితో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: దహించివేయబడిన ఆశ్రమంవలె కార్తవీర్యార్జునుని వేయి చేతులు ఖండించబడతాయని వసిష్ఠుడి శాపం. కాని, శాపం కారణంగా అని తిక్కన మూలంలో లేని శాపకారణాన్ని పేర్కొన్నాడు. అందువలననే దుర్మార్గులైన అనేక పుత్రులు కార్తవీర్యార్జునుడికి కలిగారు. బహుశః వినీతుడైన కార్తవీర్యార్జునుడికి నాశముండదని, అందువలననే అవినీతులైన పుత్రులు జన్మించారని తిక్కన భావించి ఉండవచ్చును.

వ. ఎందునుం జరియించు వా రొక్కనాఁడు జమదగ్ని యాశ్రమంబునకుం బోయి యతండునుం జామదగ్న్యుండును నయ్యెడ లేకుండ హోమధేనువును వత్సంబునుం దమ మందిరంబునకుం గొనివచ్చి; రిట్లు దెచ్చుట సహస్ర బాహుం డెఱుంగఁడు. 78

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు= ఒకనొక రోజు; ఎందునున్+చరియించువారు= (పెరిగి పెద్దవారైన కార్తవీర్యార్జునుడి పుత్రులు) ఎక్కడెక్కడో తిరుగుతూ; జమదగ్ని+ఆశ్రమంబునకున్+పోయి= జమదగ్ని మహర్షి తపోవనానికి వెళ్ళి; అతండునున్+జామదగ్న్యుండునున్= ఆ జమదగ్నియు ఆతని కుమారుడైన పరశురాముడూ; ఆ+ఎడన్= ఆ తపోవనంలో; లేక+ఉండన్= లేకుండగా; హోమధేనువును= యాగ సంబంధమైన ఆవును; వత్సంబునున్= దాని దూడను; తమ మందిరమునకున్= వారి అంతఃపురానికి; కొనివచ్చిరి= పట్టి తెచ్చారు; ఇట్లు తెచ్చుటన్= ఈ విధంగా తీసికొనిరావటం; సహస్ర బాహుండు+ఎఱుంగఁడు= వేయి చేతులు కల కార్తవీర్యార్జునుడికి తెలియదు.

తాత్పర్యం: కార్తవీర్యార్జునుడి పుత్రులు ఎక్కడెక్కడో తిరిగి, జమదగ్ని తపోవనానికి వెళ్ళి, జమదగ్నీ అతని కుమారుడైన పరశురాముడూ లేని సమయంలో వారి యాగధేనువును, దూడను పట్టి తెచ్చి తమ అంతఃపురంలో కట్టివేశారు. ఈ తెచ్చిన విషయం కార్తవీర్యార్జునుడికి తెలియదు.

క. అట రాముఁ డెఱిఁగి పరమో । ద్భట మగు కోపమునఁ జాప పరశుముఖ మహో
త్కట శస్త్రాస్త్రంబులతోఁ । బటుగతి వచ్చెను సహస్రబాహుని మీఁదన్. 79

ప్రతిపదార్థం: అటన్= ఆ తపోవనంలో; రాముఁడు+ఎఱిఁగి= పరశురాముడు తెలిసికొని; పరమ+ఉద్భటము+అగు= మిక్కిలి సంభ్రమంతో కూడిన; కోపమునన్= కోపంతో; చాప పరశు ముఖ మహా+ఉత్కట శస్త్ర+అస్త్రంబులతోన్= విల్లు, గండ్రగొడ్డలి

మొదలైన అత్యంత భయంకరమైన ఆయుధాలు మంత్ర పూతమైన బాణాలతో; సహస్ర బాహుని మీఁదన్= కార్తవీర్యార్జునుడి పైకి; పటుగతిన్= మిక్కిలి ఉద్ధతితో; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆశ్రమంలో తాములేని సమయంలో యాగధేనువును, దూడను దుర్మార్గులైన కార్తవీర్యార్జునుడి పుత్రులు తీసికొనిపోయారన్న విషయాన్ని తెలిసికొని పరశురాముడు సంభ్రమంతో కూడిన కోపంతో ధనుస్సు, గండ్రగొడ్డలి మొదలైన శస్త్రాస్త్రాలతో కార్తవీర్యార్జునుడిపైకి ఉద్ధతుడై దాడికి వెళ్ళాడు.

పరశురాముఁడు కార్తవీర్యార్జునుని జంపుట (సం. 12-49-41)

ఆ. వచ్చి ముట్టి కయ్య మిచ్చిన నవ్విభు । నొంచి బాహు వనముఁ జంచ దుగ్ర
పరశు ఘోరధారపాల్ సేసి పోయి ని । జేచ్ఛ నుండె మేదినీశవర్య! 80

ప్రతిపదార్థం: మేదినీ+ఈశవర్య!= భూమికి అధిపతులైన వారిలో శ్రేష్ఠుడైన ఓ జనమేజయ మహారాజా!; వచ్చి= క్రుద్ధుడై వచ్చిన పరశురాముడు; ముట్టి= ఎదుర్కొని; కయ్యము+ఇచ్చినన్= యుద్ధం చేసి; ఆ+విభున్+నొంచి= ఆ రాజైన కార్తవీర్యార్జునుడిని బాధించి; బాహువనమున్= చేతులనే అరణ్యాన్ని; చంచత్+ఉగ్ర పరశు ఘోరధార పాల్+చేసి పోయి= ప్రకాశిస్తున్న భయంకరమైన గండ్రగొడ్డలియొక్క వాడి అయిన వాదరకు బలిచేసి తిరిగిపోయి; నిజ+ఇచ్ఛన్+ఉండెన్= స్వేచ్ఛగా ఉండిపోయాడు.

తాత్పర్యం: జమదగ్నీ అతడికుమారుడు పరశురాముడూ ఆశ్రమంలో లేని సమయంలో ధేనువును, దూడను బలాత్కారంతో తెచ్చి అంతఃపురంలో ఉంచుకొన్నాడు కార్తవీర్యార్జునుడు. ఆ సంగతి తెలిసిన పరశురాముడు కుపితుడై కార్తవీర్యార్జునుడిపై దండెత్తిపోయి తన పరశువుతో అతడిని సంహరించి యాగధేనువును, దూడను గ్రహించి తిరిగి ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

చ. అతఁడు సమిత్కుశాభిహరణార్థము గానకు నేగియుండఁగా
నతి కుపితాత్ము లై కడఁగి యర్జునసూనులు వోయి ముట్టి త
త్పితృశిరమున్ వెసం దునిమి ప్రీతిమెయిం జనుదెంచి; రమ్మహో
ద్ధతుఁ డట వచ్చి వారి చరితం బెఱిఁగెం దమ తల్లి సెప్పఁగన్. 81

ప్రతిపదార్థం: అతఁడు= పరశురాముడు; సమిత్+కుశ+అభిహరణ+అర్థము= సమిధలను, దర్భలను తీసికొని రావటం కొరకు; కానకున్+ఏఁగి+ఉండఁగాన్= అడవికి వెళ్ళి ఉండగా; అర్జును సూనులు= కార్తవీర్యార్జునుడి పుత్రులు; అతి కుపిత+ఆత్ములు+ఐ= మిక్కిలి కోపంతో కూడిన మనస్సు కలవారై; కడఁగి= పూనికతో జమదగ్ని ఆశ్రమానికి పోయి; ముట్టి= ఎదుర్కొని; తద్+పితృశిరమున్= ఆ పరశురాముడి తండ్రి జమదగ్ని యొక్క తలను; వెసన్+తునిమి= వెంటనే ఖండించి; ప్రీతిమెయిన్+చనుదెంచిరి= సంతోషంతో తిరిగి వచ్చారు; ఆ+మహా+ఉద్ధతుఁడు= ఆ పరాక్రమ వంతుడైన పరశురాముడు; అటన్+వచ్చి= ఆశ్రమానికి తిరిగివచ్చి; తమ తల్లి+చెప్పఁగన్= పరశురాముడి తల్లి రేణుకాదేవి చెప్పగా; వారి చరితంబు+ఎఱిఁగెన్= కార్తవీర్యార్జునుడి పుత్రుల దుర్మార్గ చరిత్రను తెలిసికొన్నాడు.

తాత్పర్యం: సమిధలు, దర్భలు తీసికొని రావటానికై అరణ్యానికి పరశురాముడు వెళ్ళి ఉండగా, కార్తవీర్యార్జునుడి పుత్రులు క్రోధాత్ములై ఆ ఆశ్రమానికి వెళ్ళి, జమదగ్ని తల నరికి హాయిగా వెనుదిరిగి వచ్చారు. అప్పుడు పరాక్రమ సంపన్నుడైన పరశురాముడు ఆశ్రమానికి తిరిగివచ్చి దుష్టులైన కార్తవీర్యార్జునుడి పుత్రులు చేసిన పనిని తల్లివలన తెలిసికొన్నాడు.

వ. అ ట్లెఱిఁగి. 82

తాత్పర్యం: ఆ విధంగా తెలిసికొని - (తరువాతి పద్యంతో అన్వయం).

శా. రాముం డుద్ధత రోషపావక శిఖాప్రస్ఫీతుఁడై తున్ముదున్
భూమీశాలిఁ గుఠారధార నని విస్ఫూర్జద్గతిన్ హైహయ
స్తోమం బాదిగఁ జొచ్చి రాజకులముం దున్మాడి చేసెన్ సము
ద్దామ క్రీడను రౌద్ర మొప్ప నిల రక్తస్యంద సంసిక్తఁగన్. 83

ప్రతిపదార్థం: రాముండు= పరశురాముడు; ఉద్ధత రోషపావక శిఖా ప్రస్ఫీతుఁడు+ఐ= ఎక్కువైన కోపమనే అగ్ని శిఖలతో ప్రకాశిస్తున్న వాడై; భూమీ+ఈశ+ఆలిన్= రాజుల సమూహాన్ని; కుఠారధారన్= గండ్రగొడ్డలి వాదరచేత; తున్ముదున్+అని= సంహరిస్తానని; విస్ఫూర్జత్+గతిన్= అత్యంతం ప్రకాశించేవేగంతో; హైహయ స్తోమంబు+ఆదిగన్= హైహయ రాజ సమూహం మొదలుకొని; చొచ్చి= చంపటానికి ప్రవేశించి; రాజకులమున్ తున్మాడి= సమస్త రాజ సమూహాలను సంహరించి; రౌద్రము+ఒప్పన్= వీరోచితంగా; సమ్+ఉద్దామ క్రీడను= ఏ మాత్రం ఎదురులేని ఆటగా; ఇలన్= భూమి; రక్తస్యంద సంసిక్తఁగన్= రక్తం చిందించటంచేత తడిసి పోయేటట్లుగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: తన తండ్రి తలను కార్తవీర్యార్జునుడి పుత్రులు నరికివెళ్ళిన సంగతి తెలిసిన పరశురాముడు అత్యంత భయంకరమైన అగ్నిశిఖవలె జాజ్వల్యమానంగా వెలుగొందుతూ, తన గండ్రగొడ్డలితో సమస్త క్షత్రియ సమూహాన్ని సంహరిస్తానంటూ వెళ్ళి హైహయ వంశరాజులను మొదలుకొని సమస్త క్షత్రియ రాజులను తుదముట్టించి అత్యంత రౌద్రంతో రాజుల రక్తంతో భూమిని తడిపివేశాడు.

విశేషం: తిక్కన అలతి అలతి పదాలతో రచించటమే అతని సహజశైలి. అయినా, వీర రసోదంచితంగా శార్దూల వృత్తంలో శబ్దఝుడితిని పరశురాముడి కుఠారం ఝళిపించినట్లు రౌద్రోచితంగా రచించటం తిక్కన "రసాభ్యుచిత బంధం".

వ. ఇట్లు సేసి పరమకృపావిష్ట హృదయుండై తపోవనంబునకుం జనియెఁ; బదంపడి బహువత్సరంబులు సనిన విశ్వామిత్ర పౌత్రుండైన పరావసు వనురాజు దుర్వినీతుండై గర్వోద్రేకంబునం బరశురాము నధిక్షేపించి, రాజులకు వెఱచి డాఁగి యున్నవాఁడ వని విశిష్ట జన సన్నిధిం బలికి బాల వృద్ధ భావంబున నుపేక్షితులై యతని చేత మున్నుచావక యున్న ప్రతర్దనాదుల నుగ్గడించి. 84

ప్రతిపదార్థం: ఇట్లు+చేసి= ఈ విధంగా భయంకరమైన రాజ సంహారం చేసి; పరమకృపా+ఆవిష్ట+హృదయుండు+ఐ= అత్యున్నతమైన దయతో కూడిన హృదయం కలవాడై; తపః+వనంబునకున్= తపస్సుకొరకైన అరణ్యానికి; చనియెన్= వెళ్ళిపోయాడు; పదంపడి= ఆ తరువాత; బహువత్సరంబులు+చనినన్= అనేక సంవత్సరాలు గడిచిపోగా; విశ్వామిత్ర పౌత్రుండు+ఐన= విశ్వామిత్రుడియొక్క మనుమడైన; పరావసువు+అనురాజు= పరావసువనే పేరుగల రాజు; దుఃవినీతుండు+అయి= దుష్టనీతిగలవాడై; గర్వ+ఉద్రేకంబునన్= పొగరుమోతు తనంతో కూడిన కోపంతో;పరశురామున్+అధిక్షేపించి= పరశురాముడిని హేళనచేసి; రాజులకున్ వెఱచి= రాజులకు భయపడి; దాఁగి+ఉన్నవాఁడవు= తపోవనంలో ఎట్లా దాక్కొన్నావు అని; విశిష్టజన సన్నిధిన్+పలికి= ఉత్తమ జనుల ఎదుట చెప్పి; బాలవృద్ధ భావంబునన్= పసిపిల్లలు, ముది వగ్గులు అనే భావంతో; ఉపేక్షితులు+అయి= లెక్కచేయబడనివారయి; అతని చేతన్= ఆ పరశురాముడిచేత; మున్ను చావకఉన్న= ముందు చావకుండా బ్రతికి ఉన్నట్టి; ప్రతర్దన+ఆదులన్= ప్రతర్దనుడనే రాజు మొదలైనవారిని; ఉగ్గడించి= చెప్పి.

తాత్పర్యం: పరశురాముడు సమస్త రాజ సంహారం చేసి ఆ తరువాత మిక్కిలి దయాంతఃకరణుడై తపస్సు నిమిత్తం ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. తరువాత అనేక సంవత్సరాలు గడచిపోయాయి. ఆ వెనుక విశ్వామిత్రుడి మనుమడైన పరావసువు అనే రాజు నీతిమాలినవాడై గర్వంతో ఉద్రేక పూరితుడై, చేసిన ప్రతిజ్ఞను మరచి రాజులకు భయపడి తపోవనంలో దాక్కొన్నాడని ఆర్యుల ఎదుట పరశురాముడిని పరిహసించాడు. చిన్న పిల్లలు, ముసలివాళ్ళనే భావంతో అప్పుడు సంహరించక వదలిపెట్టబడిన ప్రతర్దనుడు మొదలైన రాజులను ఉదాహరించి చెప్పాడు.

ఆ. 'నృపులు గారె వారు? నీవు మిథ్యా ప్రతి । జ్ఞాభిమాని' వనుడు నతఁడు మగుడ
రోషమెత్తి కడఁగి క్రూరత నాబాల । వృద్ధముగ నరేంద్ర వితతి నఱకె. 85

ప్రతిపదార్థం: వారు; నృపులు+కారె?= పైన పేర్కొన్న ప్రతర్దనాదులు రాజులు కారా?; నీవు= ఓ పరశురామా! నీవు; మిథ్యా ప్రతిజ్ఞా+అభిమానివి+అనుడున్= అసత్యమైన ప్రతిజ్ఞయందు అభిమానం కలవాడవు (ప్రతిజ్ఞచేసి నెరవేర్చుకొనలేనివాడవు); అనుడున్= అని పరావసువు పలుకగా; అతఁడు= ఆ పరశురాముడు; మగుడన్= మరల; రోషము+ఎత్తి= కోపంవచ్చి; కడఁగి= ప్రయత్నించి; ఆ బాల వృద్ధముగన్= పిల్లలు మొదలుకొని ముసలి వాళ్ళవరకు; నర+ఇంద్ర+వితతిన్= రాజశ్రేష్ఠుల సమూహాన్ని; క్రూరతన్= మిక్కిలి క్రూరభావంతో; నఱకెన్= సంహరించాడు.

తాత్పర్యం: 'ప్రతర్దనుడు మొదలుకొని ఉన్న వారందరు రాజులు కారా? చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకొనలేని వాడవు అని పరావసు డనే రాజు పలుకగా, పరశురాముడు కోపోద్రిక్తుడై బాలురు వృద్ధులు అని లెక్కచేయక సమస్త రాజ లోకాన్ని క్రూరాత్ముడై సంహరించాడు.

వ. గర్భంబుల నున్న యర్భకులను మఱియు వివిధ ప్రకారంబులఁ బోరం దప్పిపోయి పుడమి యేలు రాజులం
గాలాంతరంబుల వెదకి వెదకి వధియించె; నిట్లిరువది యొక్క మాఱు నేల నిఃక్షత్రంబు గావించి యశ్వమేధ
యాగంబు సేసి, దక్షిణగా నీ క్షితి యంతయుం గశ్యపున కిచ్చెఁ; బదంపడి యమ్ముని యా జామదగ్న్యతో ని
ట్లనియె. 86

ప్రతిపదార్థం: గర్భంబులన్+ఉన్న+అర్భకులను= తల్లుల కడుపులందున్న పసికూనలను; మఱియున్= అంతేకాక; వివిధ ప్రకారంబులన్= అనేక రీతులుగా; పోరన్+తప్పిపోయి= యుద్ధంలో తప్పించుకొనిపోయి; పుడమి+ఏలు రాజులన్= భూమినేలుతున్న రాజులను; కాల+అంతరంబులన్= వివిధ కాలాలలో; వెదకి వెదకి= రాజులను వెదకి వెదకి; వధియించెన్= సంహరించాడు; ఇట్లు+ఇరువది ఒక్కమాఱు= ఈ విధంగా ఇరవై ఒక్కసార్లు; నేలన్= భూమిని; నిఃక్షత్రంబు కావించి= రాజులు లేకుండా చేసి; అశ్వమేధ యాగంబు+చేసి= అశ్వమేధ మనే యజ్ఞాన్ని చేసి; ఈ క్షితి+అంతయున్= ఈ భూమినంతటిని; కశ్యపునకున్= కశ్యప ప్రజాపతికి; దక్షిణగాన్+ఇచ్చెన్= దానం చేశాడు; పదంపడి= ఆ తరువాత; ఆ+ముని= ఆ కశ్యప ప్రజాపతి; ఆ జామదగ్న్యతోన్= ఆ జమదగ్ని కుమారుడైన పరశురాముడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: తల్లుల గర్భాల్లో ఉన్న శిశువులను అనేక రీతులుగా యుద్ధంలో తప్పించుకొనిపోయి రాజ్యమేలుతున్న రాజులను అనేక సంవత్సరాలపాటు వెదకి వెదకి పరశురాముడు సంహరించాడు. ఆ విధంగా ఇరవై ఒక్కసార్లు ఈ భూమిపై రాజులు లేకుండా చేసి అశ్వమేధయాగం చేసి, ఈ భూమినంతటిని కశ్యప ప్రజాపతికి దానమిచ్చాడు. ఆ కశ్యపుడు పరశురాముడితో ఇట్లా అన్నాడు.

తే. 'అశ్వమేధ యాగంబున నవని యెల్ల । నాకు దక్షిణగా నిచ్చినాఁడ; వింక
నాధిపత్యంబు నీకు లే దరుగు దక్షి । ణాబ్ధిపారదేశమునకు ననఘుచరిత! 87

ప్రతిపదార్థం: న+అఘ చరిత్ర!= ఓ పాప రహితుడైన పరశురామా!; అశ్వమేధ యాగంబునన్= అశ్వమేధయాగంలో; అవని+ఎల్లన్= భూమినంతటిని; నాకున్ దక్షిణగాన్+ఇచ్చినాఁడవు= నాకు దానం చేశావు; ఇంకన్= ఇక మీదట; నీకున్; ఆధిపత్యంబు= అధికారం; లేదు= లేదు; దక్షిణ+అబ్ధి+పారదేశమునకున్= దక్షిణ సముద్రతీర దేశానికి; అరుగు= వెళ్ళుము.

తాత్పర్యం: 'పాపరహితుడవైన ఓ పరశురామా! అశ్వమేధయాగం చేసి ఈ భూమినంతటిని నాకు దానం చేశావు. ఇంక ఈ భూమిమీద నీకు అధికారం లేదు. కాబట్టి దక్షిణసముద్రం హద్దుగా కలిగిన ప్రదేశానికి వెళ్ళుము' అని కశ్యపప్రజాపతి పలికాడు.)

వ. అని పలికి యెందేని నేమేనియుం దెఱంగున శేషించినరాజ పింఛంబునకు నిశ్శేషత్వంబు వాటిల్లకుండం బరిహరించు బుద్ధిం బలికిన నప్పురుష సింహుండు 'నట్ల కాక' యని పోవ, నతని వలని వెఱపున నవ్వలని సముద్రుండు శూర్పాకార ప్రదేశంబు బెరయం గొంతదేశం బతనికి విహారస్థానంబు గావించె; నివ్విధంబునం గశ్యప మునీంద్రుండు పరిగ్రహించి భూమి భూసుర ప్రకరంబుల కిచ్చి తపోవనంబున కరిగె; భూమియు నతనిపేరఁ గాశ్యపి యన నెగడెఁ; గొండొక కాలంబునకు వైశ్య శూద్ర ప్రముఖులు దర్పితులై వివిధ ప్రకారంబుల విప్రదారధన ధాన్యాదు లపహరింపం దొడంగిరి. 88

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఎందున్+ఏనిన్+ఏమి+ఏనియున్+తెఱంగునన్= ఎక్కడైనా ఎట్లాంటి విధంగానైనా; శేషించిన= మిగిలిన అంటే పరశురాముడు వధించగా మిగిలిన; రాజ పింఛంబునకున్= రాజుల సమూహానికి; నిఃశేషత్వంబు+పాటిల్లకుండన్= ఏ మాత్రమూ మిగులు లేకుండాపోవటాన్ని; పరిహరించుబుద్ధిన్+పలికినన్= నివారించదలచి చెప్పగా; ఆ+పురుష సింహుండు= పురుషులలో శ్రేష్ఠుడైన ఆ పరశురాముడు; అట్లకాక+అనిపోవన్= అట్లాగేనని పోగా; అతని వలని వెఱపునన్= ఆ పరశురాముడి వలన భయంతో; ఆ+వలని= దక్షిణ దిక్కునందలి; సముద్రుండు= సాగరుడు; శూర్ప+ఆకార ప్రదేశంబు బెరయన్= చేట ఆకారంతోటి స్థలం కలిగిన; కొంత దేశంబు= కొంత భూమిని; అతనికిన్= ఆ పరశురాముడికి; విహార స్థానంబు+కావించెన్= మసలటానికి తగిన ప్రదేశంగా చేశాడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; కశ్యపముని+ఇంద్రుండు= మహర్షి శ్రేష్ఠుడైన కశ్యపుడు; పరిగ్రహించి= పరశురాముడి వలన దానంగా పొంది; భూమిన్= భూమినంతటిని; భూసుర ప్రకరంబులకున్+ఇచ్చి= బ్రాహ్మణ సమూహాలకు ఇచ్చి; తపః+వనంబునకున్+అరిగెన్= తపస్సుకై వనానికి వెళ్ళిపోయాడు; భూమియున్= (అప్పటి నుండి) ఈ భూమి; అతని పేరన్= ఆ కశ్యప ప్రజాపతి దానంగా గ్రహించి రాజులకు ఇవ్వటం వలన; కాశ్యపి+అనన్+నెగడెన్= కాశ్యపి అని ప్రసిద్ధి పొందింది; కొండొక కాలంబునకున్= కొంతకాలానికి; వైశ్య శూద్ర ప్రముఖులు= వైశ్యులలో, శూద్రులలో ముఖ్యులైన వాళ్ళు; దర్పితులు+ఐ= గర్వించి; వివిధ ప్రకారంబులన్= అనేక రీతులుగా; విప్రదార ధన ధాన్య+ఆదులన్= బ్రాహ్మణుల భార్యలూ, ధనమూ, ధాన్యమూ మొదలైన వాటిని; అపహరింపన్+తొడంగిరి= దొంగిలించ నారంభించారు.

తాత్పర్యం: కశ్యపప్రజాపతి అవశేషం లేకుండా రాజలోకం నశించి పోతుందేమోనన్న శంకతో దానంగా నా కిచ్చిన రాజ్యంవైన నీకు అధికారం లేదని పరశురాముడిని దక్షిణసముద్రం ఎల్లగా ఉన్న ప్రదేశంలోని తపోవనానికి పొమ్మన్నాడు. అదేరీతి అతడు వెళ్ళిపోయాడు. పరశురాముడివలన భయంతో దక్షిణసముద్రుడు అతడు విహరించటానికి చేట ఆకారంతో కొంత భూమి నిచ్చాడు. పరశురాముడి వలన దానంగా పొందిన భూమి నంతటిని బ్రాహ్మణుల సమూహానికి సమర్పించి, కశ్యపుడు తపోవనానికి వెళ్ళిపోయాడు. అప్పటి నుండి భూమి 'కాశ్యపి' అనే ప్రసిద్ధి పొందింది. కొంత కాలానికి వైశ్య శూద్రులలో శ్రేష్ఠులైన వాళ్ళు మిక్కిలి గర్వించి అనేక రీతులుగా బ్రాహ్మణుల భార్యలను, ధనధాన్యాలను మొదలైన వాటిని దొంగిలించటం మొదలు పెట్టారు.

సీ. పదపడి విప్రులు పథము దప్పి వధంబు । మద్యపానంబు సన్మార్గ వర్తు
లైన సాధుల ధన మపహరించుటయును । మొదలుగాఁగ నకృత్యములకుఁ జొచ్చి
రధ్వరాదిక సత్క్రియల్ ప్రవర్తింపక । తెక్కలిబంది యే దిక్కులందు
దఱుచయ్యె నిమ్మెయి ధర్మంబు సెడి యధ । ర్మంబు వర్తించి యరాజకత్వ

ఆ. దోష జాతమైన దురిత బాహుళ్యంబు । గుతిలపెట్ట భూమి యతలమునకుఁ
బోవ నెఱిఁగి కశ్యపుఁడు నిజోరువు నెఱి । గ్రుచ్చి దాపు గాఁగ నిచ్చి యెత్తె. 89

ప్రతిపదార్థం: పదపడి= ఆ వెనుక; విప్రులు= బ్రాహ్మణులు; పథము+తప్పి= ధర్మ మార్గాన్ని తప్పి; వధంబు= హత్యను; మద్యపానంబు= మద్యం సేవించటం; సత్+మార్గవర్తులు+అయిన= ఉత్తమ మార్గంలో నడచుకొంటున్న; సాధుల= ఉత్తములయొక్క; ధనము+అపహరించుటయును= ద్రవ్యాన్ని దొంగిలించటం; మొదలుకాఁగన్= మొదలుకొని; అకృత్యములకున్+చొచ్చిరి= దుర్మార్గ ప్రవర్తనలకు పూనుకొన్నారు; అధ్వర+ఆదిక+సత్+క్రియల్= యాగం మొదలైన ఉత్తమ కార్యాలు; ప్రవర్తింపక= జరగక; తెక్కలి= దొంగిలించటం; బంది= చెరబట్టటం; ఏ దిక్కులందున్= అన్నిచోట్ల; తఱుచు+అయ్యెన్= అతి సామాన్యమై పోయింది; ఈ+మెయిన్= ఈ విధంగా; ధర్మంబు+చెడి= ధర్మం చెడిపోయి; అధర్మంబు వర్తించి= అధర్మం అధికమై; అరాజకత్వ దోష జాతము+అయినన్= రాజులు లేమి వలన కలిగిన దోషంవలన ఏర్పడిన; దురిత బాహుళ్యంబు= దుర్మార్గం అధికమై; కుతిల పెట్టన్= కుంగదీయగా; భూమి= భూమాత; అతలమునకున్+పోవన్= భూమి కిందటి లోకానికి వెళ్ళగా; కశ్యపుఁడు= కశ్యప ప్రజాపతి తెలిసికొని; నిజ+ఊరువున్= తన తొడను; నెఱి గ్రుచ్చి= చక్కగా సంధించి; దాపు+కాఁగన్+ఇచ్చి+ఎత్తెన్= ఆధారం కాగా భూమిని ఎత్తి పట్టాడు.

తాత్పర్యం: కశ్యప ప్రజాపతి బ్రాహ్మణసమూహానికి రాజ్యం అప్పగించి వెళ్ళిపోయాడు. ఆ తరువాత బ్రాహ్మణులు ధర్మమార్గాన్ని వదలిపెట్టి కారణరహితంగా వధించటం, మద్యం సేవించటం, ఉత్తమమార్గంలో నడుస్తూ ఉన్న సాధుజనుల భార్యలను ధనధాన్యాలను దొంగిలించటం మొదలైన పనులు చేస్తూ అధర్మానికి పాలుపడ్డారు. తాము నిర్వహించవలసిన యజ్ఞయాగాది కర్మలు వదలిపెట్టి ఇతరులను దోచుకొనటం, చెరపట్టటం సామాన్యమైపోయింది. ఈ విధంగా అధర్మమార్గమే ప్రధానమై రాజులు లేకుండటంవలన అరాజకత్వంవలన కలిగిన అనేక దోషజాలం భూమిని క్రుంగదీసింది. భూమి భరించలేక కిందికి వెళ్ళిపోయింది. ఈ విషయాన్ని తెలిసికొన్న కశ్యపప్రజాపతి తన ఊరువులను ఆధారంగా చేసి భూమిని పైకి ఎత్తాడు.

వ. అది కారణంబుగా ధరణి యుర్వి యనం బ్రసిద్ధి వహించె; నయ్యుద్ధరణ సమయంబునం గాశ్యపి గశ్యపుని
వేఁడుకొని యుత్తమ క్షత్రియులు దండనీతి ప్రయోగంబునం జేసి ధర్మంబు రక్షించి తన్ను సురక్షితం
జేయువారుగా వరంబు వడయుటకై యమ్మహామునితో ని ట్లనియె. 90

ప్రతిపదార్థం: అది కారణంబుగాన్= రసాతలానికి వెళ్ళిన భూమిని కశ్యప ప్రజాపతి తన ఊరువులు ఆధారంగా, ఎత్తి పట్టటమనే కారణం వలన; ధరణి= ఈ భూమి; ఉర్వి+అనన్= ఉర్వి అనే పేరుతో; ప్రసిద్ధి వహించెన్= ప్రఖ్యాతి చెందింది; ఆ+ఉద్ధరణ సమయంబునన్= ఆ విధంగా ఉద్ధరించబడిన సమయంలో; కాశ్యపి= కాశ్యపి అనబడే భూమి; కశ్యపుని వేఁడుకొని= కశ్యప ప్రజాపతిని ప్రార్థించి; ఉత్తమ క్షత్రియులు= శ్రేష్ఠులైన రాజులు; దండనీతి ప్రయోగంబునన్+చేసి= దండోపాయమనే నీతి మార్గంవలన (సామ, దాన, భేద, దండోపాయాలనే చతురుపాయాలలో ఒకటైన దండోపాయం వలన); ధర్మంబు రక్షించి= ఉత్తమ ధర్మాన్ని పరిరక్షించి; తన్ను= భూమిని; సురక్షితన్+చేయువారుగాన్= భయంలేని దానినిగా చేయగలవారుగా; వరంబున్+పడయుటకై= వరం పొందటానికై; ఆ మహామునితోన్= ఆ మహర్షితో; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పింది.

తాత్పర్యం: కశ్యపుడు కిందికి వెళ్ళిన భూమిని తన ఊరువు ఆధారంగా పైకి ఎత్తటంవలన ఈ భూమి ఉర్వి అని ప్రసిద్ధి కెక్కింది. ఆ సమయంలోనే ఉత్తమ రాజులు దండనీతి మార్గాన్నుసరించి ధర్మాన్ని రక్షించి తనను సురక్షితను చేయగలవారుగా కశ్యపుడివలన వరం పొందటానికి ఆ మహర్షితో ఇట్లా అన్నది.

భూదేవి కశ్యపునితోఁ బరశురామునిచేఁ జావనిరాజులఁ జెప్పుట. (సం. 12-49-66)

క. 'నాయం దచట నచట రా । మాయత బాహా విభూతి కగపడని ఘనుల్
ధీయుక్తులు గల; రన్నర । నాయకులను వినుము పనుపు నను రక్షింపన్.' 91

ప్రతిపదార్థం: వినుము= ఓ కశ్యప ప్రజాపతీ! వినుము; నా యందున్+అచటన్+అచటన్= భూమిమీద అక్కడక్కడ; రాము= పరశురాముడి యొక్క; ఆయత= పొడవైన; బాహా= చేతుల యొక్క; విభూతికిన్= సంపదకు; కనపడని= కనిపించని; ఘనుల్= గొప్పవారు; ధీయుక్తులు= బుద్ధిశాలులు; కలరు= ఉన్నారు; ఆ+నరనాయకులను= ఆ రాజులను; నను రక్షింపన్= నన్ను రక్షించటానికి; పనుపు(ము)= ఆజ్ఞాపించుము.

తాత్పర్యం: 'ఓ కశ్యప ప్రజాపతీ! పరశురాముడి బాహు పరాక్రమ సంపదకు కనిపించకుండా తప్పించుకొన్న రాజులు అక్కడక్కడ ఉన్నారు. అటువంటి ప్రజా నాయకులను నా సంరక్షణార్థం పంపుము' (అని భూదేవి ప్రార్థించింది.)

వ. అని పలికి యద్దేవి తన సురక్షితత్వంబున హైహయులు గొందఱు చావునకుం దప్పుటయు, బౌరవాన్వయ ప్రభావుండగు విదూరథ సుతుండు ఋక్షవత్పర్వతంబున ఋక్షంబులచేత రక్షితుం డగుటయు, సౌదాసవంశ జనితుం డొక్కరుండు పరాశర సంయమి వరు నధ్వర కాలంబునంఁ జేరినఁ గారుణ్యాతిశయంబున నమ్మహాత్ముండు వాని శూద్ర ప్రవర్తనంబున సర్వ కర్మంబులుఁ జేయించుకొని రక్షింప సర్వకర్ముం డనం బరఁగుటయు, శిబి మనుమఁడు గోపతి యనువాఁడు, వనంబున గోవులు రక్షించిన బ్రతికియునికియుం, బ్రతర్దన పుత్రుడు వత్సాభిధానుండు వత్సంబులు గోష్ఠంబున రక్షణం బాచరింప సంచరించుటయు, దివిరథ తనయుం డగు దధివాహను కొడు కంగుం డనువాఁడు గంగా కూలంబుల గౌతమ మునీంద్రుని రక్షం జేసి నిర్భయుండై వర్తిల్లుటయు, బృహద్రథ కులజాతుండు భూరి నామధేయుండు గృధ్రకూట శైలంబున గోలాంగూలంబులు రక్షించుట వలనఁ గలిగి యుండుటయు, మరుత్త సంతాన సంభవులు చతుర్వర్ష వయస్కులగువారు మువ్వురు సముద్రుండు రక్షకుండై పెనుపం దత్తీరంబునం బెరుఁగుటయుం జెప్పి వా రుత్తమ క్షత్రియులు వారలు సమ్యక్పరిపాలనంబున నన్నరయువారుగా ననుగ్రహించిన నచలితనై యుండెద. 92

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఆ+దేవి= ఆ భూదేవి; తన సురక్షితత్వంబునన్= తాను రక్షించగా; కొందఱు హైహయులు= కొంత మంది హైహయరాజులు; చావునకున్+తప్పుటయున్= మరణం నుండి తప్పించుకొనటం వలన; పౌరవ+అన్వయ+ప్రభవుండు+అగు= పూరు వంశంలో జన్మించిన వాడగు; విదూరథ సుతుండు= విధూరథు డనే వాడి కుమారుడు; ఋక్షవత్పర్వతంబునన్= ఋక్షవంతమనే పర్వతంలో; ఋక్షంబులచేతన్= ఎలుగుబంట్ల చేత; రక్షితుండు+అగుటయున్= కాపాడబడి; సౌదాసవంశ జనితుండు= సుదాస వంశస్థుడు; ఒక్కరుండు= ఒక్కడు; పరాశర సంయమి వరు+అధ్వర కాలంబునన్+చేరినన్= మునిశ్రేష్ఠుడైన పరాశరుడియొక్క యాగకాలంలో చేరగా; కారుణ్య+అతిశయంబునన్= దయాతిశయంతో; ఆ+మహాత్ముండు= ఆ మహాత్ముడైన పరాశరుడు; వాని= వానియొక్క; శూద్ర ప్రవర్తనంబునన్= శూద్రోచితమైన నడవడికతో; సర్వకర్మంబులును= సమస్త కార్యాలను

చేయించుకొని; రక్షింపన్= రక్షించగా; సర్వకర్ముండు+అనన్+పఁరగుటయున్= సర్వకర్ముడని పిలువ బడటమూ; శిబిమనుమఁడు= శిబిచక్రవర్తి మనుమడు; గోపతి= గోపతి అనేవాడు; వనంబునన్= అరణ్యంలో; గోవులు రక్షించినన్= గోవులను రక్షించటం వలన; బ్రతికి+ఉనికియున్= జీవించి ఉండటమూ; ప్రతర్దన పుత్రుఁడు= ప్రతర్దనుడనే వాడి కుమారుడు; వత్స+అభిధానుఁడు= వత్సుడనే పేరుతో; వత్సంబులు= దూడలు; గోష్ఠంబునన్= గోశాలలో; రక్షణంబు+ఆచరింపన్= సంరక్షించగా; సంచరించుటయున్= తిరుగటమూ; దివిరథ తనయుండు+అగు= దివిరథుడియొక్క కుమారుడు అయిన; దధివాహను కొడుకు= దధి వాహనుడి కొడుకు అయిన; అంగుండు+అనువాఁడు= అంగుడనేవాడు; గంగా+కూలంబునన్= గంగానదీ తీరంలో, గౌతమ+ముని+ఇంద్రుని+రక్షన్+చేసి= గౌతమ ముని శ్రేష్ఠుని రక్షణవలన; నిర్భయుండు+అయి= భీతిలేనివాడై; వర్తిల్లుటయున్= జీవించటమూ; బృహద్రథ కుల జాతుండు= బృహద్రథుని వంశంలో పుట్టిన వాడైన; భూరి నామధేయుండు= భూరి అనే పేరు కలవాడు; గృధ్ర కూట శైలంబునన్= గృధ్ర కూటమనే పర్వతంలో; గోలాంగూలంబులు= కొండముచ్చులు; రక్షించుట వలనన్+కలిగిన= రక్షించటంచేత బ్రతికి ఉండటమూ; మరుత్త సంతాన సంభవులు= మరుత్తుడనే వాడి సంతానం వలన కలిగిన; చతుర్+వర్ష+వయస్కులగువారు= నాలుగు సంవత్సరాల వయస్సు కలిగిన వారైన; ముప్పురు= ముగ్గురు; సముద్రుండు= సాగరుడు; రక్షకుండై పెనుపన్= రక్షకుడై పోషింపగా; తద్+తీరంబునన్= ఆ తీరంలో; పెఱుంగుటయున్+చెప్పి= పెరగటాన్ని తెలియజేసి; వారు+ఉత్తమ క్షత్రియులు= పైన పేర్కొన్న వారందరు ఉత్తమరాజులు; వారలు= వారందరు; సమ్యక్+పరిపాలనంబునన్= మంచి ఏలుబడితో; నన్నున్+అరయువారుగాన్= నన్ను జాగ్రత్తగా చూసేవారుగా; అనుగ్రహించినన్= ప్రసాదిస్తే; అచలితన్+అయి+ఉండెదను= స్థిరంగా ఉండగలను.

తాత్పర్యం: ఆ భూదేవి సంరక్షించగా చావునుండి తప్పించుకొని, హైహయవంశరాజులు కొందరు చావకుండా బతికిపోయారు. కురువంశంలో జన్మించిన విదూరథుడి కుమారుడు ఋక్షవంతమనేపర్వతంలో ఎలుగుబంట్లచేత రక్షించబడ్డాడు. సుదాసు వంశంలో జన్మించిన ఒకడిని యాగకాలంలో పరాశరుడు దయతలచి అతడిచేత శూద్రకులోచితంగా సర్వకర్మలు చేయించుకొనటం వలన సర్వకర్ముడనే ప్రసిద్ధిపొంది మిగిలిపోయాడు. శిబిచక్రవర్తి మనుమడైన వాడు అరణ్యంలో గోవులు రక్షింప బ్రతికిపోయాడు. ప్రతర్దనకుమారుడైన వత్సుడనే పేరు కలిగినవాడు దూడలను గోశాలలో సంరక్షింప బ్రతికిపోయాడు. దివిరథుని కుమారుడైన దధివాహనుడనే వాడికొడుకైన అంగుడనే వాడు గంగాతీరంలో గౌతమమహర్షి సంరక్షించటంవలన జీవించాడు. బృహద్రథవంశంలో పుట్టిన భూరి అనే పేరు కలవాడు గృధ్రకూట పర్వతంలో కొండముచ్చుల రక్షణలో బ్రతికి బట్టకట్టాడు. మరుత్తుయొక్క సంతానంవలన పుట్టిన నాలుగేళ్ళ వయస్సున్న ముగ్గురు సముద్రుడి రక్షణలో పెరిగి పెద్దవారయ్యారు - అని చెప్పి 'వాళ్ళంతా ఉత్తమ క్షత్రియులు. సముచితమైన పరిపాలనలో పాలించగలవారినిగా నాకు ప్రసాదించండి. అప్పుడు నేను స్థిరంగా ఉండగలను'

క. వారల పెద్దలు నాకై । పోరఁ బరశురాము చేతఁ బొలిసిరి; నాకున్
వారి నధిపతులఁ జేయుట । గోరందగుఁ గాన యిట్లు గోరితి ననఘా!' 93

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాప రహితుడైన కశ్యప ప్రజాపతీ! వారల పెద్దలు= పైన పేర్కొన్న వారు పెద్దలు; నాకై పోరన్= భూమికొరకు యుద్ధం చేయగా; పరశురాము చేతన్+పొలిసిరి= పరశురాముడిచేత చనిపోయారు; నాకున్+వారిన్+అధిపతులన్+చేయుట= నాకు వారిని అధినేతలుగా చేయటం; కోరన్+తగున్= కోరతగినదే; కాన= కావున; ఇట్లు+కోరితిన్= అందుకే నేనిట్లా ప్రార్థించాను.

తాత్పర్యం: అనేక విధాలుగా రక్షించబడిన రాజవంశజుల పెద్దలందరు భూమికొరకు పోరాడిన వారే. అయితే వారందరు పరశురాముడి చేత సంహరించబడ్డారు. అందుకే వారు రాజ్యాధిపతులు కాదగిన వారని ఇట్లా కోరుకొన్నాను.'

తే. అనిన విని వారి రావించి య మ్మునీంద్రుఁ । డందఱను జూచి యాధిపత్యమున కిమ్ము
హాభుజులు దగు వారని యవనిఁ దగిన । యట్లు విభజించి యభిషేక మాచరించె. 94

ప్రతిపదార్థం: అనినన్+విని= అని పలుకగా విని; వారిన్ రావించి= వారిని రప్పించి; ఆ+ముని+ఇంద్రుఁడు= ఆ మునిశ్రేష్ఠుడైన కశ్యపుడు; అందఱను+చూచి= వచ్చిన రాజులందరిని పరిశీలించి చూచి; ఆధిపత్యమునకున్= అధికారానికి; ఈ+మహాభుజులు= ఈ మహా పరాక్రమ సంపన్నులు; తగువారు+అని= అర్హులని; తగిన+అట్లు= ఉచితమైన రీతిని; అవనిన్= భూమిని; విభజించి= పంచి; అభిషేకము+ఆచరించెన్= వారందరిని రాజ్యాభిషిక్తులను చేశాడు.

తాత్పర్యం: ఆ కశ్యపప్రజాపతి భూదేవివలన తెలిసికొని రాజులందరిని పిలిపించి చూచి, రాజ్యాధిపత్యానికి అర్హులని భావించి, ఉచితమైన రీతిగా భూమిని విభాగించి వారిని రాజ్యాభిషిక్తులను చేశాడు.

క. ఆ నృపుల వంశముల నా । నా నృపతులు పుట్టి; రిట్లు నరవర! నృప సం
తానములు పెక్కు గలిగి మ । హీనాథత్వమున వ్రాలె నెందును గలయన్. 95

ప్రతిపదార్థం: నరవర!= ఓ రాజశ్రేష్ఠుడవైన ధర్మరాజా!; ఆ నృపుల వంశములన్= ఆ రాజుల వంశాల మూలాన; నానా నృపతులు= అనేక రాజులు; పుట్టిరి= జన్మించారు; ఇట్లు= ఈ విధంగా; నృప సంతానములు= రాజ సంతతులు; పెక్కు+కలిగి= అనేకం పుట్టి; ఎందునున్+కలయన్= భూమి అంతటను; మహీనాథత్వమునన్+వ్రాలెన్= రాజ్యాధికారంలో ప్రవేశించారు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ పైన పేర్కొన్న రాజవంశాలలో పెక్కుమంది రాజులు పుట్టారు. ఈ విధంగా రాజవంశాలు పుట్టి పెరిగి భూమి అంతట రాజ్యాధికారంలో ప్రవేశించారు.

క. అప్పరుసునఁ బెరిఁగిన నృపు । లిప్పుడు భారత రణోపహృతులై పలువుర్
గుప్పలు గొనఁబడి; రనికిం । దప్పిన వాఁడొకఁ డొకండ ధర నంతంతన్. 96

ప్రతిపదార్థం: ఆ+పరుసునన్= ఆ విధంగా; పెరిఁగిన నృపులు= వృద్ధిపొందిన రాజులు; భారతరణ+ఉపహృతులు+అయి= భారత యుద్ధంలో సంహరించబడినవారై; పలువుర్= అనేకులు; కుప్పలు గొనన్+పడిరి= కుప్పలుగా పడి ఉన్నారు; ధరన్= భూమిపై; అంతన్+అంతన్= అక్కడక్కడ; ఒకఁడు+ఒకండు= ఒక్కొక్కడు; అనికిన్= యుద్ధానికి గురికాక; తప్పినవాఁడు= తప్పించుకొన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా అభివృద్ధి చెందిన రాజులు భారతయుద్ధంలో సంహరించబడి కుప్పలుగా కూలి పడి ఉన్నారు. భూమిమీద అక్కడక్కడ ఒక్కొక్కడుగా యుద్ధంలో తప్పించుకొని ఉన్నారు.

వ. నీ వడిగిన పూర్వ వృత్తాంతంబు చిత్తాయత్తంబుగా నెఱింగించితి; ననవుడు ధర్మనందనుండు గోవిందు తోడఁ 'బరశురాముఁ డింతటి వాఁడగునే? కోపంబును, విక్రమాటోపంబును జిత్రంబుగా ధాత్రి నిఃక్షత్రంబు సేసె' నని పలికె; వెండియు. 97

ప్రతిపదార్థం: నీవు+అడిగిన= నీవు అడిగిన; పూర్వ వృత్తాంతంబు= పూర్వ చరిత్ర; చిత్త+ఆయత్తంబుగాన్= మనస్సుకు హత్తుకొనేటట్లుగా; ఎఱింగించితిన్= తెలిపాను; అనవుడున్= అనగానే; ధర్మనందనుండు= ధర్మరాజు; గోవిందు తోడన్= కృష్ణుడితో; పరశురాముఁడు+ఇంతటివాఁడు+అగునే?= పరశురాముడు ఇంత గొప్పవాడా?; కోపంబును= కోపమూ; విక్రమ+ఆటోపంబును= పరాక్రమాతిశయమూ; చిత్రంబుగాన్= ఆశ్చర్యం కొల్పగా; నిఃక్షత్రంబుగాన్+చేసెన్= రాజులు లేకుండా చేశాడు; అని పలికెన్= అని అన్నాడు; వెండియున్= మరల.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధర్మరాజుతో 'నీవు అడిగిన పూర్వకథ - అంటే పరశురాముడిచేత సమస్తరాజులు సంహరించబడిన ఈ భూమి మీద రాజులు ఎట్లా పుట్టారని నీవు అడిగిన ప్రశ్నకు సమాధానంగా పూర్వకథ - అంతటిని మనస్సుకు హత్తుకొనేటట్లు తెలిపాను' - అని చెప్పాడు. ధర్మరాజు ఆశ్చర్య చకితుడై 'పరశురాముడు ఇంత గొప్పవాడా? అత్యంత కోపంతో పరాక్రమంతో భూమిని అంతటిని క్షత్రియ రహితంగా చేయగలిగా'డని ప్రశంసించాడు.

తే. 'ధరణియును ఋక్షములుఁ బరాశరుఁడు గో స । మూహములు వత్సములు గౌతముండు గపులుఁ
దోయధియు నింత పుణ్యంబు సేయునే? జ । నంబు భాగ్యంబు నభివర్ణనమున కెక్కె' 98

ప్రతిపదార్థం: ధరణియును= భూమి; ఋక్షములు= ఎలుగు బంట్లు; పరాశరుఁడు= పరాశరుడు; గో సమూహములు= ఆలమందలు; వత్సములు= దూడలు; గౌతముండు= గౌతమ మహర్షి; కపులున్= కోతులు; తోయధియున్= నీటికి నిధి అయిన సముద్రుడు; ఇంత పుణ్యంబు+చేయునే?= ఇంత పుణ్యం సంపాదిస్తాయా?; జనంబు భాగ్యంబున్= ప్రజల అదృష్టం; అభివర్ణనమునకున్+ఎక్కెన్= పొగడ్తకు తగినదయింది.

తాత్పర్యం: పరశురాముడి కుఠారానికి బలికాకుండా రాజులను రక్షించిన భూమి, ఎలుగుబంట్లు, ఆవుల మందలు, దూడలు, కోతులు, సముద్రం మాత్రమే కాక పరాశర మహర్షి, గౌతమ ముని కూడా ఇంత పుణ్యానికి నోచుకున్నారా? నిజంగా ఇది ప్రజల అదృష్టంగా అభివర్ణించదగింది'.

వ. అని యిట్లు సల్లాపంబు సేయుచు మాధవ ధర్మజు లరిగి, యోఘవతీ తీరంబున శరతల్పగతుం డైగాంగేయుం
డున్నెడ కనతి దూరంబున రథావతరణంబు సేసిన, భీమసేన ప్రముఖులుం గృపాదులు నరదంబులు డిగ్గి,
రిట్లందఱు నంతరంగంబు లేకాగ్రంబులు సేసికొని చేరం జని, సాత్యవతేయ ప్రభృతి మునీంద్రులకుం బ్రణమిల్లి,
మఱి భీష్ముం గాంచి రట్లు సముచిత ప్రకారంబునం గని యతనిం బరివేష్టించి యాసీనులై రప్పు; డచ్యుతుం
డమ్మహాత్ము నాలోకించి యుమ్మలించుచు నతనితోడ. 99

ప్రతిపదార్థం: అని; ఇట్లు; సల్లాపంబు+చేయుచున్= సంభాషించుకొంటూ; మాధవ ధర్మజులు+అరిగి= కృష్ణ ధర్మరాజులు వెళ్ళి; ఓఘవతీ తీరంబునన్= ఓఘవతీ నది ఒడ్డున; శరతల్ప గతుండు+అయి= అమ్ముల పాన్పునందు పడుకొన్న వాడై; గాంగేయుండు+ఉన్న+ఎడకున్= భీష్ముడు ఉన్న ప్రదేశానికి; అనతి దూరంబునన్= దగ్గరలోనే; రథ+అవతరణంబు+చేసినన్= రథంలో నుండి దిగగానే; భీమసేన ప్రముఖులున్= భీముడు మొదలైనవారును; కృప+ఆదులున్= కృపాచార్యుడు మొదలైన వారును; అరదంబుల్+డిగ్గిరి= రథాల నుండి దిగిపోయారు; ఇట్లు+అందఱున్= ఈ విధంగా అందరూ; అంతరంగంబులు+; ఏక+అగ్రంబులు+చేసికొని= హృదయాలను ఏకాగ్రతతో ఉంచుకొని; చేరన్+చని= సమీపించి; సాత్యవతేయ ప్రభృతి ముని+ఇంద్రులకున్= సత్యవతీ పుత్రుడైన వ్యాసుడు మొదలైన మునిశ్రేష్ఠులకు; ప్రణమిల్లి= నమస్కరించి; మఱి= ఆ వెనుక; భీష్మున్+కాంచిరి= భీష్ముడిని సందర్శించారు; అట్లు= ఆ రీతిగా; సముచిత ప్రకారంబునన్+చని= తగినట్లుగా వెళ్ళి; అతనిన్= ఆ భీష్ముడిని; పరివేష్టించి= చుట్టుమూగి; ఆసీనులు+ఐరి= కూర్చున్నారు; అప్పుడు+అచ్యుతుండు= ఆ సందర్భంలో శ్రీకృష్ణుడు; ఆ+మహాత్మున్= ఆ భీష్ముడిని; ఆలోకించి= చూచి; ఉమ్మలించుచున్= బాధపడుతూ; అతనితోడన్= ఆ భీష్ముడితో.

తాత్పర్యం: శ్రీకృష్ణ ధర్మరాజులు మాటలాడుకొంటూ వెళ్ళి ఓఘవతీ నదీతీరంలో అమ్ములపాన్పుపై పడుకొని భీష్ముడు ఉన్న ప్రదేశానికి దగ్గరలోనే రథం నుండి దిగారు. అట్లాగే భీముడు, కృపుడు మొదలైనవారు రథాలనుండి

దిగారు. అందరూ హృదయాలను స్వాయత్తపరచుకొని సమీపించి వ్యాసుడు మొదలైన మునిశ్రేష్ఠులకు నమస్కరించి ఆ వెనుక భీష్ముడిని దర్శించారు. ఆ విధంగా భీష్ముడిని దర్శించి చుట్టూ కూర్చున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు ఆ మహనీయుడిని పరిశీలించి బాధ పడుతూ - (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'నీకు మున్పోలె నవ్యాకులమై యున్న । యదియె చిత్తంబు? దేహంబు పీడ
ఘనము మనఃపీడకంటె నందురు బుధు । లొక ముల్కి యొడలిలో నున్న నలఁత
సేయు; నెమ్మెయి బహుసాయక కీలిత । మైన యంగంబు నొ వ్వడుగ నేల?
యిట్టు లుండియు నించుకేనియు దుఃఖంబుఁ । బొరయమి పితృవరస్ఫూర్తిఁ గాదె!

ఆ. దేవతలకు నైన నీ వుపదేశింతు । కలిమి లేములకు వికార మొంద
కుండ బోధ వృద్ధ లొరులు నిన్ దేర్పంగ । వలవ కునికి నిజ మవార్యతేజ! 100

ప్రతిపదార్థం: అవార్యతేజ!= వారించటానికి వీలులేని తేజస్సు కల ఓ భీష్ముడా!; నీకున్= నీకు; మున్+పోలెన్= ముందువలెనే; చిత్తంబు= మనస్సు; అవ్యాకులము+అయి ఉన్న అదియె?= కలత లేకుండా ఉన్నది కదా!; బుధులు= పెద్దలు; మనఃపీడకంటెన్= మానసిక బాధకంటె; దేహంబు పీడ= శారీరకమైన బాధ; ఘనంబు+అండ్రు= గొప్పది అంటారు; ఒక ముల్కి+ఒడలిలోన్+ఉన్నన్= ఒకే ఒక్క బాణం శరీరంలో ఉంటేనే; నలఁత చేయున్= బాధిస్తుంది; ఏ+మెయిన్= ఏ విధంగా; బహుసాయక కీలితము+అయిన= అనేక బాణాలచేత గుచ్చుకొనబడ్డ; అంగంబు= శరీరంయొక్క; నొవ్వు+అడుగన్+ఏల?= బాధ ఎట్లా ఉన్నది అని అడుగనక్కరలేదు కదా! ఇట్టులు+ఉండియున్= నీ శరీరంలో ఇన్ని బాణాలున్నా; ఇంచుక+ఏనియున్= కొంచెమైనా; దుఃఖంబు+పొరయమి= దుఃఖం కలుగకుండా ఉండటానికి; పితృవర స్ఫూర్తిన్+కాదె!= మీ తండ్రి అయిన శంతను మహారాజు ఇచ్చిన వరంయొక్క గొప్పతనం కదా!; దేవతలకున్+ఐనన్= దేవతలకు కూడా; నీవు+ఉపదేశింతు(వు)= ఉపదేశించుటకు సమర్థుడవు; కలిమి లేములకున్= ధనమున్నా, లేకున్నా; వికారము+ఒందకుండన్= వ్యతిరేక భావం పొందకుండా; ఒరులు= ఇతరులైన; బోధవృద్ధులు= జ్ఞానవృద్ధులు, పెద్దలు; నిన్నున్+తేర్పంగ వలవక+ఉనికి= నిజం నీకు బోధించవలసిన అవసరం లేని మాట వాస్తవం.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు భీష్ముడితో ఇట్లా అన్నాడు - 'ఓ మహానుభావా! నీ మనస్సు ఇదివరలోవలెనే కలత లేకుండా ఉన్నది కదా! మానసిక బాధకంటె శరీర బాధ గొప్పదని పెద్దలు చెప్పుతారు. శరీరంలో ఒక బాణమున్నా బాధిస్తుంది. కాగా, అనేక బాణాలు నాటిన నీ శారీరకబాధను గురించి అడగాలా? ఈ విధంగా ఉన్నప్పటికి నీకు బాధ కలగలేదంటే దానికి మీ తండ్రి వరమే కారణం. దేవతలకు సైతం నీవు ఉపదేశించగల సమర్థుడవు. నీకు బాధ ఉన్నా లేకున్నా నీకు ఏ పెద్దలు ప్రబోధించ నక్కరలేదు.

విశేషం: భీష్ముడు తన తండ్రికి సత్యవతిని భార్యగా చేయటంలో జీవితాంతం బ్రహ్మచర్యాన్ని పూనుతున్నట్లు శపథం చెయ్యటం మూలాన శంతనుడు మెచ్చుకొని భీష్ముడికి స్వచ్ఛంద మరణం వరంగా ప్రసాదించాడు. ఆ కారణంగానే శరతల్పగతుడైన భీష్ముడు యుద్ధంలో నాటిన శస్త్రాస్త్రాలు ఏ విధమైన బాధను కలిగించలేదని మన మిక్కడ గ్రహించవలసి ఉన్నది. తిక్కనలో సూక్తులు ఉన్నాయి. 'బుధులు మనః పీడకంటె దేహంబు పీడ ఘనము' అందురు. 'ఒక ముల్కి యొడలిలోనున్న నలఁత సేయు నెమ్మెయి బహుసాయక కీలితమైన యంగంబు నొ వ్వడుగ నేల?' ఇవి చక్కటి సామెతలు. కృష్ణుడి ఈ సమాశ్వాస వాక్యాలతో భీష్ముడు ఆనందించాడు. ఇక్కడ మనఃపీడకంటె దేహపీడ ఎక్కువంటాడు శ్రీకృష్ణుడు. కాని, లోకంలో మనోవేదన గొప్పదని గదా ప్రసిద్ధం? మరి ఏ న్యాయాన్ని అనుసరించి కృష్ణుడు అట్లా ప్రయోగించాడో తెలియదు. సమయానికి తగు మాటలాడు వైఖరి అంటే ఇదేనేమో!

క. భూతంబుల సంసరణము । భూత భవద్భావి కార్యములు గర్మ సము
ద్యోతన భంగియు నీ యఱి । చేతివి కావె కురువంశశేఖరజన్మా! 101

ప్రతిపదార్థం: కురువంశ శేఖర జన్మా!= కురువంశమునందు శ్రేష్ఠమైన జన్మం కలిగిన ఓ భీష్మా!; భూతంబుల= సర్వప్రాణికోటియొక్క; సంసరణము= జీవనమూ; భూత= కడచిన; భవత్= జరుగుతున్న; భావి కార్యములు= భవిష్యత్ కాలమునకు సంబంధించిన కార్యములు; కర్మసమ్+ఉద్యోతన భంగియున్= కర్మలయొక్క అత్యంతంగా ప్రకాశించే రీతి; నీ+అరచేతివి కావే!= నీ కరతలాధీనాలే కదా!

తాత్పర్యం: ప్రాణికోటుల జీవనరీతి, త్రికాలాలలో చేసే కార్యకలాపాలు, కర్మానుష్ఠానంవలన ప్రకాశమానమై వెలుగొందే విధానం - ఓ భీష్మా! నీకు కరతలామలకమే కదా!' అని శ్రీకృష్ణుడు భీష్ముడిని ప్రశంసించాడు.

వ. అని వెండియు. 102

తాత్పర్యం: అని చెప్పి మరల - (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'రా జటె! రాగహీనుఁ డటె! రాజిత సుందరమూర్తి యట్టె! వి
భ్రాజిత సంపదున్నతి విభాసిత వర్తనుఁ డట్టె! కామినీ
రాజి మనోజ్ఞభంగి చతురత్వ ధనుండటె! బ్రహ్మచర్యదీ
క్షా జిత మన్మథుండు నటె! జన్ములు లిట్టివి యెందు గల్గునే? 103

ప్రతిపదార్థం: రాజు+అటె!= రాజట కదా!; రాగహీనుఁడు+అటె!= రాగరహితుడట కదా; రాజిత సుందరమూర్తి+అట్టె!= ప్రకాశిస్తున్న సౌందర్యమూర్తి కూడానట కదా!; విభ్రాజిత సంపద్+ఉన్నతి= ప్రకాశమనే సంపదయొక్క ఔన్నత్యం చేత; విభాసిత= వెలుగొందుతున్న; వర్తనుఁడు+అట్టె!= నడవడిక కలవాడట!; కామినీ రాజి మనోజ్ఞ భంగి చతురత్వ ధనుండు+అటె!= స్త్రీ సమూహానికి మనోహరమైన రీతిలో, నైపుణ్యమనే సంపద కలవాడట కదా!; బ్రహ్మచర్య దీక్షా జిత మన్మథుండున్+అటె!= బ్రహ్మచర్యమనే పట్టుదలతో జయించబడిన మన్మథుడు కలవాడట!; ఇట్టివి జన్ములు= ఇట్లాంటి పుట్టుకలు; ఎందున్+కలుగునే?= ఎక్కడైన సంభవిస్తాయా?

తాత్పర్యం: శ్రీకృష్ణుడు భీష్ముడిని ఉద్దేశించి ఈ విధంగా ప్రశంసించాడు; 'క్షత్రియుడుగా జన్మించాడు. మహర్షులవలె ద్వంద్వాతీతుడయ్యాడు, ప్రకాశిస్తున్న సౌందర్యమూర్తి. విభ్రాజమానమై అత్యున్నతంగా వెలుగొందే నడవడిక కలవాడు; స్త్రీసమూహానికి మనోహరమైన నైపుణ్యసంపద కలవాడు; బ్రహ్మచర్యదీక్షచేత మన్మథుడిని జయించినవాడు; ఇట్లాంటి జన్మలు మరెక్కడైనా సంభవిస్తాయా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. శ్రీకృష్ణుడు భీష్ముడిని ఉత్తమ గుణగణాలను మిక్కిలి ప్రశంసించాడు. అట్లాంటి గుణాలు కలవాడు కావటంవలన ధర్మజుడికి సమస్తధర్మాలను ప్రబోధించగలిగాడు భీష్ముడు. మూల శ్లోకాలకు వన్నె తెచ్చేరీతిలో మనోహరంగా రచించాడు తిక్కన. భీష్ముడి గొప్పతనాన్ని ప్రశంసిస్తూ చేసిన ఈ పద్యరచన తిక్కన శైలీవిన్యాసాని కొక మచ్చు తునక.

క. సురలును నసురులు యక్షులు । నురగులు గంధర్వులును మహోద్ధతిఁ బై పై
నురవడి వచ్చిన నొకఁడవ । పరాజితులఁ జేయు దుగ్ర బాహా స్ఫురణన్. 104

ప్రతిపదార్థం: సురలునున్= దేవతలును; అసురులున్= రాక్షసులును; యక్షులున్= యక్షులును; ఉరగులున్= నాగులును; గంధర్వులును; మహా+ఉద్ధతిన్= గొప్ప పరాక్రమంతో; పైపైన్= మీది మీదికి; ఉరవడిన్‌వచ్చినన్= మహావేగంతో వస్తే; ఒకఁడవు+అ= ఒక్కడవే; ఉగ్రబాహా స్ఫురణన్= భయంకరమైన బాహు పరాక్రమ స్ఫూర్తితో; పరాజితులన్+చేయుదు(వు)= ఓడించగలవు.

తాత్పర్యం: దేవతలు, రాక్షసులు, నాగులు, యక్షులు, గంధర్వులు మహాపరాక్రమంతో, మహావేగంతో మీది కెత్తి వచ్చినా లెక్కచేయక ఒక్కడవే ఎక్కటికయ్యంలో భయంకరమైన బాహుపరాక్రమంతో పరాజితులను చేయగల సమర్థుడవు.

చ. దమమును సత్యముం దపము దానము వేదములందుఁ జూపవే
దమునను గల్గు నైపుణియు, ధర్మవిధిజ్ఞతయున్, విరోధి భూ
రమణ విమర్దన క్రమ విరాజిత శౌర్యము నీకుఁ బోలె నై
జము లగువాఁడు వేఱొకఁడు శంతనునందన! పుట్టఁ డెన్నఁడున్. 105

ప్రతిపదార్థం: శంతను నందన!= ఓ శంతను మహారాజు కుమారుడవైన భీష్మా!; దమమును= కర్మేంద్రియాల నిగ్రహం; సత్యమున్+తపమున్= సత్యం, తపస్సు; దానమున్= దానం; వేదములందున్+చూప వేదమునను= చతుర్వేదాలలోను, ధనుర్వేదంలోను; కల్గు= కలిగినట్టి; నైపుణియున్= నైపుణ్యం; ధర్మవిధిజ్ఞతయున్= ధర్మగుణం యొక్క జ్ఞానం; విరోధి= శత్రువులైన; భూరమణ= భూపతులను; మర్దన= సంహరించే; క్రమ= పద్ధతిచేత; విరాజిత= ప్రకాశిస్తున్న; శౌర్యమున్= పరాక్రమం; నీకున్+పోలెన్= నీకువలె; నైజములు+అగువాఁడు= సహజసిద్ధమైన వాడూ; ఎన్నఁడున్= ఏ కాలంలోనూ; వేఱు+ఒఁకడు= మరొకడు; పుట్టఁడు= జన్మించడు.

తాత్పర్యం: ఓ భీష్మా! దమమూ, సత్యం, తపోదానాలు, వేదాలలోనూ ధనుర్వేదంలోను అత్యంత నైపుణ్యం, ధర్మోచితమైన జ్ఞానం, శత్రురాజులను వధించి విరాజిల్లే పరాక్రమం - నీవలె సహజసిద్ధంగా కలవాడు, ఏ కాలంలోనూ జన్మించడు.'

విశేషం: తిక్కన పద్యరచనా శైలికి నిదర్శనం ఈ పద్యం. భీష్ముడి ఉత్తమ గుణగణాలను శ్రీకృష్ణుడు ఏకరువు పెట్టాడు ఈ పద్యంలో. తిక్కన రచనారీతిలో చక్కటి శైలీ విన్యాసంతో 103 పద్యంవలె మనోహరంగా రచించాడు. మూలంలోని మూడు శ్లోకాలను తిక్కన ఈ పద్యంలో సముచితంగా మనోహరంగా రచించాడు.

క. వేయేల? సంభవించునె । సాయక తల్పమున నుండి చావఁగ నొల్లన్
నా యిచ్ఛఁ గాక? యను నరుఁ । డే యుగమునఁ జూడ వినఁగ నెచ్చట నైనన్. 106

ప్రతిపదార్థం: వేయి+ఏల?= వేయి మాట లెందుకు?; సాయక తల్పమునన్+ఉండి= అమ్ముల పాన్పునందుండి, శయనించి ఉండి; నా ఇచ్ఛన్+కాక= నా ఇష్టప్రకారం కాక; చావఁగన్+ఒల్లన్= మరణించ నిష్టపడను; అను= అనే; నరుఁడు= మానవుడు; ఏ యుగమునన్= ఏ యుగంలోనైనా; ఎచ్చటన్+ఐనన్= ముల్లోకాలలో ఎక్కడైనా; చూడన్ వినఁగన్= చూడగా, వినగా; సంభవించునె?= కలుగుతాడా?

తాత్పర్యం: ఏమైనా, శరతల్పగతుడై ఉండి, నా ఇష్టానుసారంగానే నేను మరణిస్తాను అని చెప్పగల మానవుడిని గూర్చి ఇంతకు ముందు యుగాలలోనూ, ముల్లోకాలలోనూ, ఎప్పుడైనా, ఎక్కడైనా వినబడటం గానీ, చూడబడటం గానీ జరిగిందా?

తే. వసువులందును బెద్దవు, వాసవాది । సురుల మిగులుదు గుణముల, ధరణిసురులు
సెప్ప విందు, నీ మహిమ నా చిత్తమునను । గందు ననుపమతేజ! గంగాతనూజ!' 107

ప్రతిపదార్థం: అనుపమ తేజ!= సాటిలేని తేజస్సు కలవాడా; గంగా తనూజ!= గంగాదేవికి పుత్రుడైన భీష్మా!; వసువులందును+పెద్దవు= అష్టవసువులందరిలోను పెద్దవాడవు; గుణములన్= ఉత్తమ గుణగణాలలో; వాసవ+ఆది= ఇంద్రుడు మొదలుకొని; సురులన్=

దేవతలలో; మిగులుదు(వు)= శ్రేష్ఠుడనిపించు కొంటావు; నీ మహిమ= నీ మాహాత్మ్యాన్ని గూర్చి; ధరణి సురులు= భూ దేవతలైన బ్రాహ్మణులు; చెప్పన్ విందున్= పొగడగా విన్నాను; నా చిత్తమునను+కందున్= నా మనస్సులోను నే నెరుగుదును.

తాత్పర్యం: సాటిలేని తేజస్సంపన్నుడా! పవిత్ర గంగాదేవి పుత్రుడవైన ఓ భీష్మా! అష్టవసువులలో పెద్దవాడవు. ఉత్తమ గుణగణాలలో శ్రేష్ఠుడవైన నీతో ఇంద్రాది దేవతలు సైతం చాలరు. బ్రాహ్మణులు నీ మహిమను గూర్చి పొగడగా విన్నాను. నేను సైతం నా మనస్సులో గుర్తించాను'.

విశేషం: అష్టవసువులు: ఆపుడు, ధ్రువుడు, సోముడు, అధ్వరుడు, అనిలుడు, ప్రత్యూషుడు, అనలుడు, ప్రభాసుడు - అని ఎనిమిది మంది అందులో ప్రభాసుడే భీష్ముడుగా జన్మించాడు. ఒకానొక సమయంలో అష్టవసువులు భార్యా సమేతులై వశిష్ఠాశ్రమానికి వెళ్ళారు. వశిష్ఠుని హోమధేనువు పాలుతాగితే జరామరణాలు ఉండవని తెలిసి దాన్ని అష్టవసువులు అపహరిస్తారు. ఈ విషయం తెలుసుకొన్న వశిష్ఠుడు అష్టవసువులను మానవులుగా జన్మించమని శపిస్తాడు. అందులో ప్రభాసుని భార్య ఈ హోమధేనువు అపహరణకు మూలమని తెలిసి భూలోకంలో సంతాన రహితుడై చిరకాలం జీవించేటట్లు శపించాడు. అతడే భీష్ముడు.

వ. అని పలికి పాండవాగ్రజుం జూపి. **108**

ప్రతిపదార్థం: అని పలికి= అని శ్రీకృష్ణుడు మాటలాడి; పాండవ+అగ్రజున్+చూపి= పాండవులలో మొదటి వాడైన ధర్మరాజును భీష్మునకు చూపించి.

తాత్పర్యం: అని శ్రీ కృష్ణుడు పలికి ధర్మరాజుకు భీష్ముడిని చూపించి - (తరువాతి పద్యంతో అన్వయం).

కృష్ణుఁడు ధర్మజునకు ధర్మము లుపదేశింప భీష్ము నియమించుట (సం. 12-50-29)

ఉ. 'నీవు తపో విశేష మహనీయతఁ జేసి జగంబు లన్నియున్
భావమునం గనుంగొని నృపాల మహోత్తర! చాలు; దీతఁ డ
త్యావిల చిత్తుఁడయ్యె సుహృదాప్తమృతిన్ దురటిల్లు నెవ్వగం
బోవగఁ ద్రోవు నీ దయిన పుణ్యతమస్ఫుట వాక్య పద్ధతిన్. **109**

ప్రతిపదార్థం: నృపాల మహా+ఉత్తర=రాజులలో మహాశ్రేష్ఠుడైన ఓ భీష్మా!; నీవు; తపః+విశేష+మహనీయతన్+చేసి= విశిష్టమైన తపస్సు యొక్క, గొప్పతనం వలన; భావమునన్= మనస్సునందే; జగంబులు+అన్నియున్= లోకములన్నింటిని; కనుంగొని= తెలిసికొని; చాలుదు(వు)= సమర్థుడవై ఉంటావు; ఈతఁడు= ఈ ధర్మరాజు; సుహృద్+ఆప్తమృతిన్= స్నేహితుల, బంధువుల యొక్క మరణంచేత; అతి+ఆవిలచిత్తుఁడు+అయ్యెన్= అత్యంత బాధతో కూడిన చిత్తం కలవాడు అయ్యాడు; దురటిల్లున్= తపిస్తున్నాడు; నెఱ+వగన్= మిక్కిలి బాధను (ధర్మరాజుయొక్క బాధను); నీదు+అయిన= నీదైన; పుణ్యతమ స్ఫుట వాక్య పద్ధతిన్= మహా పుణ్యంతో కూడుకొని స్పష్టమైన మాటల రీతితో; పోవఁగన్+త్రోవు(ము)= తొలగి పోయేటట్లుగా చేయవలసింది. (శ్రీకృష్ణుడు కోరుతున్నాడు).

తాత్పర్యం: 'ఓ రాజశ్రేష్ఠుడైన భీష్మా! నీవు అత్యంత తపస్సంపన్నుడవు. అందువలననే లోకాలలో జరిగే సమస్త విషయాలను మనస్సునందే గ్రహించగలవు. ఈ ధర్మరాజు మిత్రులు, బంధువులు అందరు మరణించగా దుఃఖంతో బాధాతప్తుడై ఉన్నాడు. నీ ఉత్తమమైన మాటల పోహళింపుచేత ధర్మరాజు బాధను తొలగించవలసిందని కోరుతున్నాను.

విశేషం: 'నృపాలమహోత్తర' - అని తిక్కన భీష్ముడికి విశేషణం వాడటంతో భీష్ముడి రాజధర్మాన్ని, రాజనీతిని గుర్తింపచేస్తున్నాడు. అట్లాగే 'తపోవిశేష మహనీయత చేసి' అనే ప్రయోగంవలన భీష్ముడి తపోనిరతి, దాని మూలంగా సమస్త లోకజ్ఞత వ్యక్తం చేయటం జరిగింది. 'పుణ్యతమస్ఫుట వాక్యపద్ధతిన్' అనటంవలన దుఃఖితమతి అయిన ధర్మరాజును ప్రస్ఫుటమైన చక్కటి మాటల నీటుతో భీష్ముడు ఊరడించగల డని సంభావించవచ్చును.

వ. నాలుగు వర్ణంబులకును నాలుగాశ్రమంబులకు నిట్టిట్టివి యర్హంబులని నాలుగు వేదంబులం జెప్పిన ధర్మంబులు నీకు విదితంబులు; ప్రవృత్తి నివృత్తులును సాంఖ్యయోగంబులును బురాణేతిహాసంబులు ధర్మశాస్త్రంబులు నవగతంబులు; సర్వసంశయచ్ఛేదన దక్షుండ; వీ వీక్షితిపతి నాదరింపుము; శోక మోహగ్రస్తం బగు జనంబు నిస్తరింపంజేయుట గదా మిము బోటుల బుద్ధి విస్తారంబునకు ఫలం' బనిన విని మొగం బించుక యెత్తి కృతాంజలి యై గాంగేయుండు గోవిందున కిట్లనియె. 110

ప్రతిపదార్థం: నాలుగు వర్ణంబులకును= చతుర్వర్ణాలకు; నాలుగు+ఆశ్రమంబులకున్= మానవుడు ఆచరించవలసిన నాలుగు ఆశ్రమాలకు; ఇట్టివి+ఇట్టివి= ఇట్లాంటివి; అర్హములు+అని= తగినవని; నాలుగు వేదంబులన్= నాలుగు వేదాలలోను; చెప్పిన= చెప్పబడిన; ధర్మంబులు= సమస్త ధర్మాలు; నీకు విదితంబులు= నీకు తెలుసును కదా; ప్రవృత్తి నివృత్తులును= ప్రవృత్తి నివృత్తులనే చిత్తవృత్తులు; సాంఖ్య యోగంబులును= సాంఖ్య యోగాదులూ; పురాణ+ఇతిహాసంబులును= పురాణాలూ, ఇతిహాసాలూ; ధర్మశాస్త్రంబులును= ధర్మశాస్త్రాదులూ; అవగతములు= నీకు తెలిసినవే; ఈవు= నీవు; సర్వ సంశయ+ఛేదన దక్షుండవు= అన్ని సందేహాలను నివృత్తి చేయగల సమర్థుడవు; ఈక్షితిపతిన్+ఆదరింపుము= ఈధర్మరాజును ఆదరించుము; మిముబోటుల= మీలాంటి వారి; బుద్ధి విస్తారంబునకున్= విస్తృతమైన జ్ఞానానికి; శోక మోహ గ్రస్తంబు+అగు= దుఃఖ మోహాలతో కూడిన; జనంబున్= ప్రజలను; నిస్తరింపన్+చేయుట+ఫలంబు కదా!= ఊరడింపచేయటమే ప్రయోజనం కదా!; అనినన్ విని= అని చెప్పగా విని; మొగంబు+ఇంచుక+ఎత్తి= ముఖం కొద్దిగా పైకెత్తి; కృత+అంజలి+ఐ= చేతులు జోడించిన వాడై; గాంగేయుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; గోవిందునకున్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: చతుర్వర్ణాల ప్రజలు, చతురాశ్రమాలలో ఆయా ప్రజలు చేయవలసిన అర్హమైన కార్యకలాపాలు, చతుర్వేదాలలో చెప్పబడిన అన్ని ధర్మాలు నీకు తెలుసు. ప్రవృత్తినివృత్తి మార్గాలు, సాంఖ్యయోగాలు, పురాణేతిహాసాలు, ధర్మశాస్త్రాలు నీకు కరతలామలకాలే. నీవు సర్వసంశయాలను నివృత్తి చేయగల సమర్థుడవు. నీవు ఈ ధర్మరాజును ఆదరించుము. మీవంటి వారి సర్వసమర్థతకు, బుద్ధివిస్తారతకు, శోకమోహాలతో బాధా సంతప్తులైన ప్రజలను తరింపచేయటమే ప్రయోజనం కదా!' అని కృష్ణుడు పేర్కొనగా విని భీష్ముడు కొద్దిగా కృష్ణుడివైపు ముఖం తిప్పి, నమస్కరించి శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: నాలుగు వర్ణాలు: బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు.

నాలుగు ఆశ్రమాలు: బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం

నాలుగు వేదాలు: ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం

క. 'కర్తయును భర్తయును సం । హర్తయు జగములకు నీవ! యాశ్రిత జన ఘో
రార్తి నిరాస నిపుణ సం । కీర్తన! యోగీశ్వరేశ! కృష్ణ వరేణ్యా!' 111

ప్రతిపదార్థం: యోగి+ఈశ్వర+ఈశ!= యోగులలో శ్రేష్ఠులకు శ్రేష్ఠుడైన వాడా!; కృష్ణవరేణ్యా!= శ్రేష్ఠుడవైన ఓ కృష్ణా!; ఆశ్రిత= ఆశ్రయించిన; జన= జనులయొక్క; ఘోర+ఆర్తి= భయంకరమైన దుఃఖాన్ని; నిరాస నిపుణ సంకీర్తన= తొలగించుట యందు నిపుణుడవై కీర్తింపబడుతున్నవాడా; జగములకున్= లోకాలకు; కర్తయును= సృష్టికర్తా; భర్తయును= సంరక్షకుడును; సంహర్తయున్= వినాశకుడు; నీవ= నీవే.

తాత్పర్యం: 'యోగిశ్రేష్ఠుడవైన ఓ శ్రీకృష్ణా! ఆశ్రయించిన ప్రజల దుఃఖాన్ని పోగొట్టటంలో నిపుణుడవైనవాడా! జగత్తులన్నింటికీ సృష్టి స్థితి లయ కారకుడవు నీవే కదా!'

విశేషం: ఈ పద్యంలో శ్రీకృష్ణుడు సర్వశక్తి మంతుడని, కనుకనే ధర్మరాజు దుఃఖాన్ని పోగొట్టేవాడని ధ్వనింపచేస్తున్నాడు. కృష్ణుడు భీష్ముడిని పొగడినదంతా ఒక ఎత్తైతే శ్రీకృష్ణుడిని భీష్ముడు పొగడటం ఒక ఎత్తు.

మూలంలోని తొమ్మిది శ్లోకాలలో భీష్ముడు శ్రీకృష్ణుని గూర్చి పలికిన ప్రశంసా వాక్యాలను తిక్కన చిన్న కందపద్యంలో చక్కగా ధ్వనింపచేశాడు. ఇంతకు క్రితం చేసిన స్తవరాజంలోని కొన్ని శ్లోకాల పునరుక్తులు మూలంలోని ఈ భాగంలో ఉన్నాయి. వాటిని పునరుక్తి చేయకుండా ఒకే పద్యంలో వివరించాడు తిక్కన.

వ. అని మఱియు ననేక ప్రకారములం బ్రశంసించి నాకు మేలెయ్యది దానిని నీ దివ్య చిత్తంబునం దలంపు మనవుడు నద్దేవుం డిట్లనియె. 112

ప్రతిపదార్థం: అని మఱియున్= అని చెప్పి మరల; అనేక ప్రకారంబులన్= వివిధ రీతులలో; ప్రశంసించి= పొగడి; నాకు మేలు+ఏ+అది= నాకు ఏది మంచిదో దానిని; నీ దివ్య చిత్తంబునన్+తలంపుము= నీ దేవతా సంబంధమైన మనస్సులో ఆలోచించుము; అనవుడున్= అనగానే; ఆ+దేవుండు+ఇట్లు+అనియెన్= ఆ దేవుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని భీష్ముడు శ్రీకృష్ణుడిని అనేక రీతులుగా పొగడి 'నా కేది మేలో నీ మనస్సునందే ఆలోచించుము' అని చెప్పగా ఆ శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు.

తే. 'అచల భక్తి నిత్యంబు నాయందు నీకుఁ । గలిమిఁ జేసి నీ యంతరంగమున నాదు
దివ్యరూపంబు నొలయించితిం బ్రమోద । భాజనం బైతి భీష్మ తపస్స్వరూప! 113

ప్రతిపదార్థం: భీష్మ తపస్స్వరూప!= భయంకరమైన తపస్సే స్వరూపంగా కలిగిన ఓ భీష్మా!; నాయందున్= నాపై; అచలభక్తి= ప్రగాఢతమమైన భక్తి; నీకున్+కలిమిన్+చేసి= నీకుండటంచేత; నీ అంతరంగమునన్= నీ మనస్సునందు, హృదయంలో; నాదు= నా యొక్క; దివ్యరూపంబున్= దైవ స్వరూపాన్ని; ఒలయించితిన్= సంకల్పించాను; ప్రమోద భాజనంబు+అయితి= సంతోషానికి అర్హుడ వయ్యావు.

తాత్పర్యం: 'కఠినమైన శపథం చేసి ఘోరమైన తపస్సే రూపు దాల్చిన ఓ భీష్మా! ఎల్లప్పుడు నాయందు నీ భక్తి ప్రగాఢమై ఒప్పుతుంది. అందువలననే నీ హృదయంలో నా దైవస్వరూపాన్ని నిలిపాను. అత్యంత సంతోషానికి అర్హుడవయ్యావు.'

వ. మేలు వేఱ తలంప నేల?' యని వెండియు. 114

ప్రతిపదార్థం: మేలు= శ్రేయస్సు; వేఱ+తలంపన్+ఏల?= మరొక మారు ప్రత్యేకంగా ఆలోచించటం ఎందుకు?; వెండియున్= మరల.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు మెచ్చుకొంటూ మళ్ళీ మేలును గూర్చి ఆలోచింపనవసరం లేదని చెప్పి, మరల ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'భక్తియు నార్జవమును సం । యుక్తము లై యున్న యట్టి యుల్లంబున నా
సక్తి నిలుతు; నిందొకఁడు వి । యుక్తం బైనను వసింప నుర్వీనాథా! 115

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ రాజా భీష్మా!; భక్తియున్= భక్తియును; ఆర్జవమును= ఋజు మార్గమును; సంయుక్తములు+అయి+ఉన్న+అట్టి= కలిసి ఉన్నటువంటి; ఉల్లంబునన్= మనస్సునందు; ఆసక్తిన్= నిలుతున్= మిక్కిలి ఆసక్తితో నివసిస్తూ ఉంటాను; ఇందున్+ఒకఁడు= వీటిలో ఏ ఒక్కటి; వియుక్తంబు+ఐనను= కలవకుండా పోయినట్లయితే; వసింపను= నివసించను.

తాత్పర్యం: 'ఓ భీష్మా! భక్తి, ఆర్జవము రెండు కలిసి ఉన్న మనస్సునందు నేను నివసిస్తాను. ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా నేను ఉండను'

విశేషం: భక్తి, ఆర్జవము రెండూ భీష్ముని మనస్సులో ఉండటంవలననే శ్రీకృష్ణుడు ఆసక్తితో భీష్ముడి మనస్సునందు దైవస్వరూపాన్ని అధివసింప చేశాడు.

తే. అనఘ! యినుఁ డింక నేఁబది యాఱు దివస । ములకుఁ దా నుత్తరాయణమునఁ జరింపఁ
దొడఁగు; నీ వప్పు దేహంబు విడిచి యేఁ గు । దపునరావృత్తి పదమున కభినుతముగ. 116

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ భీష్మా!; ఇనుఁడు= సూర్యుడు; ఇంకన్= ఇటు తరువాత; ఏన్+పది యాఱు దివసములకున్= ఏబది ఆరు రోజులకు; తాన్+ఉత్తరాయణమునన్= తాను ఉత్తరాయణమునందు; చరింపన్+తొడఁగున్= ప్రవర్తించటం ప్రారంభిస్తాడు; నీవు+అప్పుడు= నీవు ఆ సందర్భంలో; దేహంబున్ విడిచి= ఈ భౌతిక శరీరాన్ని వదలి; అపునఃరావృత్తి పదమునకున్= మరల జన్మలేని మోక్షపదవికి; అభినుతముగన్= పొగడ దగినట్లు; ఏగుదు(పు)= వెళ్ళిపోతావు.

తాత్పర్యం: ఓ పాపరహితుడవైన భీష్మా! ఇప్పటి నుంచి ఏబది ఆరు రోజులలో సూర్యుడు ఉత్తరాయణంలో సంచరించటం ప్రారంభిస్తాడు. నీవు అప్పుడు ప్రశంసార్హమైన రీతిలో ఈ భౌతికదేహాన్ని వదలిపెట్టి "పునరపి జననం పునరపి మరణం" అనే ఆవృత్తి లేకుండా జనులు నుతించేటట్లు మోక్షం పొందుతావు.

వ. వీరె వసువులు విమానంబులతో నంతరిక్షంబున నంతర్హితులై నీ రాక ప్రతీక్షించి యున్న వా; రది యట్లుండె; నీవు సన్న నీ లోకంబున నెఱుక పానుంగుపడుం గావున వీ రెల్ల సకల ధర్మవివేక లబ్ధికినయి యరుగుదెంచి పరివేష్టించి యున్న వా' రని తత్కాల సమాగత యోగ్యజనంబులం జూపి, ధర్మపుత్రు నుపలక్షించి, 'శోకోపహత బహుశ్రుతుం డగు నితండు దెలివొందునట్లుగా ధర్మార్థ సమాధి యుక్తంబులగు నుక్తి విశేషంబుల ననుగ్రహింప వలయు' ననుటయు నద్దేవకీనందనునకు దేవవ్రతుం డి ట్లనియె. 117

ప్రతిపదార్థం: వీరె వసువులు= వీరే వసువులు; విమానంబులతోన్= విమానాలలో కూర్చుండి; అంతరిక్షంబునన్= ఆకాశంలో; అంతర్హితులు+అయి= అదృశ్యులై; నీ రాకన్= నీ రాకను; ప్రతీక్షించి+ఉన్నవారు= వేచి ఉన్నారు; అది+అట్లు+ఉండెన్= ఆ విషయం అట్లా ఉండనీ; నీవు+చన్నన్= నీవు స్వర్గానికి వెళ్ళిపోతే; ఈ లోకంబునన్= ఈ జగత్తులో; ఎఱుక= జ్ఞానం; పానుంగు పడున్= మరుగున పడిపోతుంది; కావునన్= అందుకే; వీరు+ఎల్లన్= వీరందరూ; సకలధర్మ వివేక లబ్ధికిన్+అయి= సమస్త ధర్మాలు వాటి విచక్షణలను పొందటానికై; అరుగుదెంచి= వచ్చి; పరివేష్టించి+ఉన్నవారు= చుట్టూ ఉన్నారు; అని= అనిచెప్పి; తద్+కాలసమాగత= ఆ సమయంలో వచ్చిన; యోగ్య జనంబులన్= అర్హులైన జనాన్ని చూపెట్టి; ధర్మపుత్రున్+ఉపలక్షించి= ధర్మరాజును ఉద్దేశించి; శోక+ఉపహత బహుశ్రుతుండు+అగు= బాధచేత దెబ్బతీయబడిన గొప్పపండితుడు; అయిన; ఇతండు= ఈ ధర్మరాజు; తెలివి+పొందునట్లుగాన్= తెలిసికొనేటట్లుగా; ధర్మ+అర్థ+సమాధియుక్తంబులు+అగు= పురుషార్థాలలో ధర్మం, అర్థం మోక్షమనే వాటికి తగిన రీతిగా; ఉక్తి విశేషంబులన్= సూక్తుల విశిష్టతతో; అనుగ్రహింపన్ వలయున్= దయచేయవలసింది; అనుటయును= అని ప్రార్థించగా; ఆ+దేవకీనందనునకున్= దేవకీ కుమారుడైన శ్రీకృష్ణుడితో; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అరుగో వసువులు ఆకాశంలో విమానారూఢులై అదృశ్యంగా నీ రాక కోసం ఎదురు చూస్తున్నారు. అది అట్లు ఉండనీ. నీవు దివంగతుడ వైతే ఈ లోకంలో జ్ఞానం మరుగున పడిపోతుంది. నీవలన ధర్మవివేకాలతో కూడిన జ్ఞానాన్ని పొందటానికి వీళ్ళంతా వచ్చారు' అని చెప్పి చుట్టూ చేరిన జనాన్ని చూపి ప్రత్యేకించి ధర్మరాజును ఉద్దేశించి 'బాధాతప్త హృదయుడైన ఇతడికి జ్ఞానోపదేశం చేయుము; ధర్మార్థ మోక్షాలను ఉచితరీతిని సూక్తిసుధతో దయచేయుము' అని కృష్ణుడు భీష్ముడిని ప్రార్థించాడు. అప్పుడు కృష్ణుడితో భీష్ముడు ఇట్లా అన్నాడు.

క. 'శివ! నారాయణ! యచ్యుత! । భవదీయము లైన మధుర భాషణములు నా
చెవు లానిన నమృత రస । ప్లవనంబునఁ బోలెఁ బ్రమద భరితుఁడ నైతిన్. 118

ప్రతిపదార్థం: శివ!= శుభప్రదాతా!; నారాయణ!= సర్వవ్యాపకా!; అచ్యుత!= శ్రీకృష్ణా!; భవదీయములు+ఐన= నీయొక్క; మధుర భాషణంబులు= తియ్యని మాటలు; నా చెవులు+ఆనినన్= నా చెవులలో సోకగానే; అమృత రసప్లవనంబునన్+పోలెన్= అమృతరసంలో తేలియాడుతున్నట్లు; ప్రమద భరితుఁడన్+ఐతిన్= సంతోష భరితుడ నయ్యాను.

తాత్పర్యం: 'శుభప్రదాతవూ, సర్వవ్యాపకుడవూ అయిన ఓ శ్రీకృష్ణా! నీ మధురమైన మాటలు నా చెవులలో పడగానే అవి అమృతరసప్రవాహంవలె ఉండగా సంతోషభరితుడను అయ్యాను.

తే. వాగ్విభుఁడ వైన నీ వచో వైభవంబు । లో సమస్తంబు నుండుట లోకనాథ!
నీదు సన్నిధిఁ బలుకంగ నేర రాదు । పద్మభవునకు; నే నెట్లు పలుకువాఁడ? 119

ప్రతిపదార్థం: లోకనాథ!= అన్ని లోకాలకు అధిపతివైన ఓ శ్రీకృష్ణా!; వాక్+విభుఁడవు+ఐన= మాటల వైభవం కలిగిన; నీ వచః+వైభవంబులోన్= నీ మాటల నైపుణ్యమందు; సమస్తంబున్+ఉండుటన్= సర్వమూ ఉండటం వలన; నీదు సన్నిధిన్= నీ ఎదుట; పద్మ భవునకున్= పద్మం నుంచి పుట్టిన బ్రహ్మకైనా; పలుకంగన్ నేరన్+రాదు= మాటలాడటం సాధ్యం కాదు; నేను+ఎట్లు, పలుకువాఁడన్?= నే నే విధంగా మాటలాడగలను?

తాత్పర్యం: వాగ్విభవుడవైన ఓ శ్రీకృష్ణా! నీ మాటల నైపుణ్యంలో సమస్తమూ ఉంటుంది. అటువంటి నీ ముందు మాటలాడటం బ్రహ్మకు కూడా సాధ్యం కాదు. నీకు నే నెట్లా సమాధానం ఇవ్వగలను?

వ. విషానల సదృశంబు లగు శరంబులు సేయు వేదనం జేసి యంగంబులు నంతరంగంబు నవశంబులై యున్న యవి; ప్రతి సంభాషణ క్షమ లేదు; దౌర్బల్యంబున నెలుంగును నాలుకయుం బ్రస్ఫుట వర్తనంబులు గా;వే నెవ్విధంబున భాషింప నుత్సహింతుఁ? బ్రతిభాషా శక్తిలేమి సహించి నా దెసం బ్రసన్నుండ వగుము; ధర్మపుత్రున కెయ్యది హితం బది నీవ చెప్పుము; నీ వుండ నేను జెప్పుట గురుం డుండ శిష్యుండు సెప్పిన విధంబు గాదె' యనిన విని భక్తార్తిహరుం డైన హరి యతనితో నిట్లనియె. 120

ప్రతిపదార్థం: విష+అనల సదృశంబులు+అగు= విషంతోను, అగ్నితోను, సమానమైన; శరంబులు+చేయు= బాణాలు కలిగించే; వేదనన్+చేసి= బాధవలన; అంగంబులున్= అవయవాలు; అంతరంగంబున్= మనస్సును; అవశంబులు+ఐ+ఉన్న+అవి= నా వశం తప్పి ఉన్నవి; ప్రతి సంభాషణ క్షమ లేదు= ప్రత్యుత్తర మిచ్చే సామర్థ్యం లేదు; దౌర్బల్యమునన్= దుర్బలత్వం వలన; ఎలుంగును= కంఠధ్వని; నాలుకయును= నాలుక; ప్రస్ఫుట వర్తనంబులు+కావు= స్పష్టరీతిని మెలగటం లేదు; ఏను+ఏ+విధంబునన్= నేను ఏ రీతిగా; భాషింపన్= మాటలాడ; ఉత్సహింతున్?= ఉత్సాహ పడతాను?; ప్రతి భాషా శక్తి లేమిన్= ప్రత్యుత్తర మిచ్చే

శక్తి లేకపోవటం వలన; సహించి= ఓర్చుకొని; నా దెసన్= నా యందు; ప్రసన్నుండవు+అగుము= దయచూపించుము; ధర్మ పుత్రునకున్= ధర్మరాజుకు; ఏ+అది= ఏది; హితంబు+అది= మేలైనదో దానిని; నీవు+అ చెప్పుము= నీవే చెప్పుము; నీవు+ఉండన్= నీవు ఉండగా; నేను చెప్పుట= నేను చెప్పటం; గురుండు+ఉండన్= గురువు ఉండగా; శిష్యుండు+చెప్పిన విధంబు+కాదె!= శిష్యుడు చెప్పినట్లు అవుతుంది గదా; అనినన్ విని= అని పలుకగా విని; భక్త+ఆర్తి+హరుండు+ఐన= భక్తుల యొక్క దుఃఖాన్ని తొలగించే వాడైన; హరి= శ్రీకృష్ణుడు; అతనితోన్= ఆ భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: విషముతో, అగ్నితో సమానమైన బాణాలు శరీరంమీద గుచ్చుకొని కలిగిస్తున్న బాధ శరీరంతోపాటు మనస్సును కూడా వశవర్తి కానీయటం లేదు. మీతో సంభాషించే సామర్థ్యం నాకు లేదు. ఈ దుర్బలత్వం వలన నా కంఠధ్వని నాలుక, స్పష్టతను కోల్పోయాయి. అట్లాంటి నేను మాటలాడటానికి ఎట్లా పూనుకొనేది? ప్రత్యుత్తరం ఇచ్చే శక్తి లేకపోవటం వలన నన్ను క్షమించి దయతో చూడుము. ధర్మరాజుకు ఏది మంచిదో అది నీవే చెప్పుము. నీవు ఉండగా నేను చెప్పటం అనేది - గురువు ఉండగా శిష్యుడు చెప్పినట్లు అవుతుంది' అని శ్రీకృష్ణుడితో భీష్ముడు చెప్పగా భక్తుల దుఃఖాలను పోగొట్టే శ్రీకృష్ణుడు భీష్ముడితో ఇట్లా అన్నాడు.

క. 'కురువంశ ధురంధరుఁ డగు । పరమార్థజ్ఞునకు వినయఫణితిం దగు ని
ర్భర శరవేదన సెప్పితి; । వరములు మూఁడిత్తు గొనుము వసుధాధీశా! 121

ప్రతిపదార్థం: వసుధా+అధి+ఈశా!= భూమికి అధిపతివైన ఓ భీష్మా!; నిర్భర శర వేదన= భరింపశక్యం కాని బాణాల యొక్క బాధను గూర్చి; తగు= తగిన విధంగా; వినయ ఫణితిన్= వినయ మార్గంలో; చెప్పితి(వి)= చెప్పావు; కురువంశ ధురంధరుఁడు+అగు= కురువంశ భారాన్ని మోసేవాడవైన నీకు; పరమ+అర్థజ్ఞునకున్= భగవత్తత్త్వజ్ఞుడవైన నీకు; వరములు మూఁడు= మూడు వరాలను; ఇత్తున్= ఇస్తాను; కొనుము= స్వీకరించుము.

తాత్పర్యం: 'ఓ భీష్మా! భరింపశక్యం కాని వేదనను గూర్చి వినయంతో తెలిపావు. కురువంశభారం నీమీద ఆధారపడి ఉన్నది. భగవత్తత్త్వ జ్ఞానివి. అటువంటి నీకు మూడు వరాలు ఇస్తున్నాను. స్వీకరించుము'.

క. శరముల వలనను మూర్ఛం । బొరయక యొక్కింత డప్పిబొరయక నొప్పిం
బొరయక యవిద్ధ గాత్రుని । కరణి సుఖాత్ముఁడవు గమ్ము కౌరవనాథా! 122

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ఓ భీష్మా; శరముల వలనను= బాణాల వలన; మూర్ఛన్+పొరయక= మూర్ఛపొందకుండా; ఒక్కింత= కొంచెమైనా; డప్పిన్+పొరయక= అలసట చెందకుండా; నొప్పిన్+పొరయక= బాధ పొందకుండా; అవిద్ధ గాత్రుని కరణిన్= బాధించబడని శరీరం కలవాడుగా; సుఖ+ఆత్ముఁడవు+కమ్ము= కష్ట రహితుడవై ఉండుము.

తాత్పర్యం: ఓ భీష్మా! గ్రుచ్చుకొన్న బాణాల వలన మూర్ఛగానీ, అలసటగానీ, నొప్పిగానీ కలుగకుండా బాధా రహితమైన శరీరంతో సుఖంగా ఉండుము'.

ఆ. అనఘ! నీరువట్టు నాఁకలియును నెప్పుఁ । బొరయకుండునట్టి భూరి శక్తి
నీకుఁ గలుగ నేను నెమ్మనంబునఁ దలం । చితిఁ; దదీయ పీడఁ జెందకుండు. 123

ప్రతిపదార్థం: న+అఘ!= పాపరహితుడా! ఓ భీష్మా!; ఎప్పుడున్= ఏ సమయమందైనా; నీకున్; నీరువట్టున్= దప్పిక; ఆఁకలియున్= ఆకలీ; పొరయక+ఉండునట్టి= కలుగనట్టి; భూరిశక్తి కలుగన్= మిక్కిలి శక్తి కలిగే విధంగా; ఏను= నేను; నెఱ+మనంబునన్= నిండు మనస్సులో; తలంచితిన్= భావించాను; తదీయపీడన్= ఆ బాధను; చెందకుండు(ము)= పొందకుండా ఉండుము.

తాత్పర్యం: పాప రహితుడవైన ఓ భీష్మా! ఎప్పుడూ నీకు ఆకలి దప్పులు కలుగకుండా ఉండేటట్లుగా నీకు మహాశక్తి కలగాలని నా మనసులో సంకల్పించాను. వాటి పీడ నీకు ఉండదు.

క. వినుఁ! సకల భూతముల వ । ర్తనములు గను నపుడు బుద్ధి దవులఁ బడక యెం
దును బరఁగి దివ్యబోధం । బున నలవడునట్టి పెంపుఁ బొందు మనింద్యా! 124

ప్రతిపదార్థం: అనింద్యా!= పాపరహితుడా!; వినుఁ= వినుము; సకల భూతముల= సమస్త ప్రాణులయొక్క; వర్తనములు= నడవడికలను; కనునపుడు= గమనించే సమయంలో; బుద్ధి= నీ మనస్సు; ఎందునున్= ఏ విధంగానూ; తవులన్+పడక= వాటిలో చిక్కకుండా; పరఁగి= ఒప్పి; దివ్య బోధంబునన్+అలవడు+అట్టి= దివ్య జ్ఞానంతో ఒప్పారుతూ ఉండునట్టి; పెంపున్+పొందుము= అట్లాంటి అతిశయాన్ని పొందుము.

తాత్పర్యం: ఓ భీష్మా! సకలప్రాణుల నడవడికలను గమనించేటప్పుడు నీ మనస్సు వాటికి అంటకుండా దివ్య ప్రబోధాన్ని పొందుతావు. అట్లాంటి శక్తితో అతిశయజ్ఞానాన్ని పొందుము.

వ. మత్ప్రసాదంబున నీదృశప్రభావ నిరూఢుండ వయి నెగడు' మని పల్కుటయుం, బారాశర్యాది పరమార్ష్య లప్పద్మనాభుం బ్రశంసించిరి; దివంబున దేవదుందుభులు మొరసె; మురారి భీష్మ ధర్మజుల మీఁదం గుసుమ వర్షంబు గురిసె; నప్సరోగణ గానంబు వీతెంచె; నచ్చటి యందఱు నాశ్చర్య ప్రమోదభరిత హృదయు లైరి. తదనంతరంబ యంబుజాప్తుం డపరగిరి శిఖరం బలంకరించె; నప్పు డమ్ముని లచ్యుత గాంగేయ కౌంతేయాగ్రజుల నామంత్రితులం జేసి గమనోన్ముఖు లగుటయు, నమ్మాధవ యుధిష్ఠిరులును, సాత్యకియును భీమార్జున యమళులును, గృప యుయుత్సు సంజయులును వారలకుం బ్రణమిల్లిరి; వారలును రేపు వచ్చెద మని నిజస్థానంబులకుం జనిరి; కృష్ణాదులును దేవవ్రతున కభిముఖు లగుచు నట్ల పలికి, వలగొని యరిగి యరదంబు లెక్కిరి; వారి పిఱుంద మున్ను వచ్చిన వారణ రథ తురగ పదాతులు బలసి కొల్చి పోవం బురంబునకు వారు వోవు సమయంబున. 125

ప్రతిపదార్థం: మత్+ప్రసాదంబునన్= నా అనుగ్రహంతో; ఈదృశప్రభావ నిరూఢుండవు+అయి= ఇట్లాంటి మహిమాతిశయం కలవాడవై; నెగడుము= ప్రసిద్ధుడవు కమ్ము; అని పల్కుటయున్= అని శ్రీకృష్ణుడు చెప్పగా (అనుగ్రహించగా); పారాశర్య+ఆది= పరాశరుని కుమారుడైన వ్యాసుడు మొదలుకొని; పరమ+ఆర్యులు= ఆర్యశ్రేష్ఠులు; ఆ+పద్మనాభున్= ఆ శ్రీకృష్ణుడిని; ప్రశంసించిరి= ప్రస్తుతించారు; దివంబునన్= స్వర్గంలో; దేవదుందుభులు మొరసెన్= దేవతా సంబంధమైన భేరులు మ్రోగాయి; మురఅరి భీష్మ ధర్మజులమీఁదన్= శ్రీకృష్ణుడు, భీష్ముడు, ధర్మజులమీద; కుసుమ వర్షంబు కురిసెన్= పూలవాన కురిసింది; అప్సరోగణ గానంబు= అప్సరసల బృందగానం; వీతెంచెన్= వినిపించింది; అచ్చటి+అందఱున్= అక్కడ ఉన్న వారంతా; ఆశ్చర్యప్రమోద భరిత హృదయులు= ఆశ్చర్యంతో కూడిన సంతోష మనస్కులు; ఐరి= అయ్యారు; తద్+అనంతరంబ= ఆ తరువాత; అంబుజ+ఆప్తుండు= పద్మబంధువైన సూర్యుడు; అపరగిరి శిఖరంబు= పడమటి కొండ శిఖరమును; అలంకరించెన్= అలంకరించాడు; అప్పుడు+ఆ+మునులు= ఆ సమయంలో అక్కడున్న మహర్షులు; అచ్యుత గాంగేయ కౌంతేయ+అగ్రజులన్= శ్రీకృష్ణ, భీష్మ, ధర్మరాజాదుల వద్ద; ఆమంత్రితులను చేసి= అనుజ్ఞపొంది; గమన+ఉన్ముఖులు+అగుటయున్= వెళ్ళిపోవటానికి సిద్ధం కాగా; ఆ+మాధవ+యుధిష్ఠిరులును సాత్యకియు, భీమార్జున యమళులును గృప యుయుత్సు సంజయులును= శ్రీకృష్ణ, ధర్మజ, సాత్యకి, భీమార్జునులు, కవలలైన నకుల సహదేవులు, కృప, యుయుత్సు, సంజయులును; వారలకున్= ఆ మహర్షులకు; ప్రణమిల్లిరి= నమస్కరించిరి; వారలను= ఆ మహర్షులును; రేపు వచ్చెదము+అని= ఉదయాన్నే వస్తామని; నిజస్థానంబులకున్+చనిరి= వాళ్ళ నివాసాలకు వెళ్ళారు; కృష్ణ+ఆదులును= కృష్ణుడు మొదలైనవారునూ; దేవవ్రతునకున్= భీష్మునకు; అభిముఖులు+ అగుచున్=ఎదురుగా నిలబడి; అట్లు+పలికి= అదే విధంగా పలికి; వలగొని= ప్రదక్షిణించి;

అరిగి= వెళ్ళి; అరదంబులు+ఎక్కిరి= రథాలు అధిరోహించారు; వారి పిఱుందన్= వారి వెనుకనే; మున్ను వచ్చిన= ముందే వచ్చిన; వారణ రథ తురగ పదాతులు= ఏనుగులు, రథాలు, గుర్రాలు, కాల్బలం; బలసి= గుమికూడి; కొల్చిపోవన్= అనుసరించి పోతూ ఉండగా; వారు= శ్రీకృష్ణాదులు; పురంబునకున్= హస్తినాపురానికి; పోవు సమయంబునన్= వెళ్తూ ఉన్న సందర్భంలో.

తాత్పర్యం: నా అనుగ్రహంతో సైన పేర్కొన్న మూడు వరాలవలన మహిమాతిశయుడవై వర్థిల్లు'మని శ్రీకృష్ణుడు భీష్ముడితో చెప్పాడు. వ్యాసాది మహర్షులంతా శ్రీకృష్ణుడిని ప్రశంసించారు. స్వర్గంలో దేవదుందుభులు మ్రోగాయి. కృష్ణుడు, భీష్ముడు, ధర్మరాజు మొదలైనవారి మీద పూలవాన కురిసింది. అప్సరోభామినుల బృందగానం వినిపించింది. అక్కడున్న వాళ్ళందరి హృదయాలు ఆశ్చర్యసంతోషాలతో నిండిపోయాయి. సూర్యుడు అస్తగిరి శిఖరాన్ని చేరాడు. అక్కడ ఉన్న మహర్షులంతా శ్రీకృష్ణ భీష్మ ధర్మరాజులవద్ద సెలవుపుచ్చుకొని పోవటానికి సిద్ధమయ్యారు. కృష్ణ ధర్మరాజ సాత్యకులు, భీమార్జున నకుల సహదేవులు. కృప, యుయుత్సు, సంజయులు మహర్షులకు నమస్కరించారు. ఆ మహర్షులును ఉదయాన్నే వస్తామని చెప్పి తమ నివాసాలకు వెళ్ళిపోయారు. కృష్ణుడు మొదలైనవారు భీష్ముడికి అభిముఖులై ఉదయాన్నే వస్తామని చెప్పి ప్రదక్షిణించి, రథాధిరోహణం చేశారు. అంతకు ముందే వచ్చినట్టి చతురంగబలాలు వారిని సేవిస్తూ వారి వెనుక హస్తినాపురానికి వెళ్ళుతూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. దినమున నెల్ల నుష్ణకరదీప్తులు పర్వి రసంబుఁ బీల్వ వం
దిన సకలౌషధి ప్రవితతిం దెలివొందఁగఁజేయు నేర్పు గ
ల్గిన తన రశ్మిజాలమున లీలఁ జకోరములన్ మదింపఁ జే
య నుదయమై వెలింగె నమృతాంశుఁడు సేనకుఁ దన్పు సేయుచున్. 126

ప్రతిపదార్థం: దినమునన్+ఎల్లన్= పగలంతా; ఉష్ణకరదీప్తులు= వేడి అయిన కిరణాలు కలిగిన సూర్యుడి యొక్క కాంతులు; పర్వి= వ్యాపించి; రసంబు+పీల్వన్= ఓషధుల రసాన్ని పీల్చి వేయగా; వందిన= వాడిపోయిన; సకల+ఓషధి ప్రవితతిన్= సమస్తమైన ఓషధుల సమూహాన్ని; తెలివి+ఒందఁగన్= మళ్ళీ చైతన్యవంతమయ్యేటట్లుగా; చేయునేర్పు+కల్గిన= చేయగల నేర్పరి తనంఉన్నటువంటి; తన రశ్మి జాలమునన్= తనదైన వెన్నెల సమూహంతో; లీలన్= విలాసంతో; చకోరములన్= చకోర పక్షులను; మదింపన్+చేయన్= బలాన్ని పుంజుకొనేటట్లు చేయటానికై; అమృత+అంశుఁడు= చల్లని కిరణాలు కలిగిన చంద్రుడు; ఉదయము+ఐ= ఉదయించి; సేనకున్= సైన్యానికి; తన్పు+చేయుచున్= సంతోషాన్ని కలిగిస్తూ; వెలింగెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: పగలంతా సూర్యుడి వేడిమి ఓషధుల రసాన్ని పీల్చివేయగా కందిపోయినటువంటి ఆ ఓషధుల సమూహాలకు ప్రాణవంతం చేయగల నేర్పున్న తన వెన్నెలల చల్లదనంతో ఆ కిరణాలను ఆహారంగా స్వీకరించి చకోరాలు మదించేటట్లుగా చేయటానికై చంద్రుడు ఉదయించి సైన్యానికి సంతోషం కలిగిస్తూ ప్రకాశించాడు.

విశేషం: "తతः పురస్తాత్..... గుణేన యోజయన్" అనే మూలశ్లోకానికి వన్నెలు దిద్దుతూ తిక్కన ఈ వృత్తాన్ని రచించాడు. మూలంలో ఓషధులను మళ్ళీ పునర్జీవితులను చేస్తున్నా నన్నాడే కానీ చకోర పక్షుల ప్రస్తావన లేదు. చంద్రకిరణాలను భక్షించి చకోరాలు జీవిస్తాయన్న అంశాన్ని చక్కగా వర్ణించాడు తిక్కన.

వ. ఇట్లుదయించి సుధామరీచి లోచనప్రీతి యాచరింపం బెంపు సుభగంబుగా శౌరి ప్రముఖులు పుర ప్రవేశంబు
సేసి నిజ నివాసంబుల నుచిత వర్తనంబుల నా రాత్రి గడపి ప్రభాతం బగుటయు. 127

ప్రతిపదార్థం: ఇట్లు+ఉదయించి= ఈ విధంగా పుట్టిన; సుధామరీచి= చల్లనైన కిరణాలు కలవాడైన చంద్రుడు; లోచనప్రీతి+ఆచరింపన్= కన్నుల పండువు చేయగా; పెంపు సుభగంబుగాన్= అతిశయితమైన మనోహరంగా; శౌరి ప్రముఖులు= శ్రీకృష్ణుడు మొదలైనవారు; పుర ప్రవేశంబు+చేసి= హస్తినాపురంలోకి వెళ్ళి; నిజ నివాసంబులన్= స్వగృహాలలో; ఉచిత వర్తనంబులన్= తగిన పనులతో; ఆ రాత్రి గడపిరి= ఆ రాత్రి సుఖంగా గడిపారు; ప్రభాతంబు+అగుటయున్= తెల్లవారగానే.

తాత్పర్యం: ఆ రీతిగా చంద్రుడు ఉదయించి కన్నుల పండువు చేయగా శ్రీకృష్ణాదులు మిక్కిలి సంతోషంతో హస్తినాపుర ప్రవేశం చేసి స్వగృహాలలో తగిన రీతిగా ఆ రాత్రి గడిపారు. అంతలో తెల్లవారింది.

తే. మంజుపాఠక రవమును మధురమాగ ధ్వనంబును వినుచు మాధవుఁడు మేలు
కాంచి తత్కాల సముచిత కర్మ జాత మాచరించి భూసురులకు నర్చ లిచ్చి. 128

ప్రతిపదార్థం: మంజుపాఠక రవమును= మనోహరమైన పాఠకులయొక్క శబ్దాలను; మధుర మాగధ స్వనంబును= తియ్యనైన మాగధుల యొక్క కంఠధ్వనిని వింటూ; మాధవుఁడు= శ్రీకృష్ణుడు, మేలుకాంచి= మేలుకొని; తద్+కాల= ఆ ఉదయకాలమందలి; సముచిత కర్మజాతము+ఆచరించి= తగిన కార్యక్రమాన్ని చేసి; భూసురులకున్= భూదేవు లైన బ్రాహ్మణులకు; అర్చలు ఇచ్చి= పూజలు చేసి.

తాత్పర్యం: మనోహరమైన వందిజన స్తోత్రాలను, శ్రుతిసుభగమైన మాగధుల కంఠధ్వనులను వింటూ శ్రీకృష్ణుడు మేల్కొని ఉదయాన్నే చేయవలసిన అర్హమైన కార్యకలాపాలను పూర్తిచేసి భూదేవతలను పూజించి.

వ. మంగళప్రకారంబున నలంకరించి నిజాకృతి యాదర్శంబునందు దర్శించి యప్పుడు సన్నిహితుండైన సాత్యకి వదనం బవలోకించి భీష్ము పాలికిం బోవుటకుం బాండవాగ్రజుం డాయితంబగుట యెఱింగి 'మన వెలువడు చునికి యెఱింగింపు' మని పనిచె; నంతకు మున్న యక్కురుపుంగవుండు బుణ్య సంకీర్తనాశీర్వాదంబులను భద్రగాన నాదంబులను వీనులు వికసిల్ల మేలుకాంచి సమయ కృత్యంబు లనుష్ఠించి యుండ నా కృష్ణానుజుం డతనిం గని గాంగేయు కడ కరుగుటకై రథంబు సన్నద్ధంబు సేయించి 'నీరజనాభుఁడు నీ రాక వార్చి యున్న వాఁ'డని చెప్పుటయు, నమ్మనుజపతి పార్శ్వగతుం డగు పార్థుం గనుంగొని 'మనయరదంబు సంఘటింపుము; నేఁడు మొదలుగా నయ్యెడకు సైనికుల రానీకు; మంతఃపరివారంబు వచ్చు టుడుపుము; శాంతనవుండు సందడింబడ నర్హుండు గాఁడు విశేషించి పరమ గుహ్యార్థంబు లగు వాక్యంబులు మనకు ననుగ్రహింపం గలవాఁడు గావున నిస్సమ్మర్దంబుగా నుపాసింప వలయు'నని పలికి యొక్కింత విచారించి తగు రాజులం గొందఱం బేరుకొని ధృతరాష్ట్ర విభుండును వారును వచ్చువారు; వారిం బిలువం బంపు' మనవుడుఁ బిలిపించి యతండు. 129

ప్రతిపదార్థం: మంగళ ప్రకారంబునన్+అలంకరించి= శుభప్రదంగా అలంకారం చేసికొని; నిజ+ఆకృతి= శ్రీకృష్ణుడు తన రూపాన్ని; ఆదర్శంబునందున్= అద్దంలో; దర్శించి= చూచికొని; అప్పుడు= వెంటనే; సన్నిహితుండు+ఐన= దగ్గరలోనే ఉన్న; సాత్యకి+వదనంబు+అవలోకించి= సాత్యకి ముఖాన్ని చూచి; భీష్మపాలికిన్+పోవుటకున్= భీష్ముడి వద్దకు వెళ్ళటానికి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ఆయితంబు+అగుట+ఎఱింగి= సిద్ధమై ఉన్న విషయాన్ని తెలిసికొని; మన వెలువడుచున్+ఉనికి= మనం బయలుదేరుతున్న విషయాన్ని; ఎఱింగింపుము+అని+పనిచెన్= తెలియచేయవలసిందని పంపాడు; అంతకు మున్న= అంతకు ముందే; ఆ +కురుపుంగవుండు= ఆ కౌరవ శ్రేష్ముడైన ధర్మరాజు; పుణ్యసంకీర్తన+ఆశీర్వాదంబులను= పుణ్యప్రదమైన సంకీర్తనాత్మకమైన ఆశీస్సు; భద్రగాన నాదంబులను= మంగళకర సంగీత నాదాలతో; వీనులు వికసిల్లన్= చెవులకు ఇంపు కొల్పగా; మేలు కాంచి= నిద్ర లేచి; సమయ కృత్యంబులు+అనుష్ఠించి+ఉండన్= కాలకృత్యాలు చేసి ఉండగా; ఆ కృష్ణ+అనుజుండు= ఆ శ్రీకృష్ణుడి తమ్ముడైన సాత్యకి; అతనిన్+కని= ధర్మరాజును దర్శించి; గాంగేయు కడకున్+అరుగుటకున్+ఐ= భీష్ముడి వద్దకు

వెళ్ళటానికి; రథంబు సన్నద్ధంబు+చేయించి= రథం సిద్ధంచేయించి; నీరజనాభుఁడు= పద్మనాభుడైన శ్రీకృష్ణుడు; నీ రాక వార్చి+ఉన్నవాఁడు+అని= నీ రాక కొరకు వేచి ఉన్నాడని; చెప్పుటయున్= చెప్పగా; ఆ+మనుజపతి= ఆ ధర్మరాజు; పార్శ్వగతుండు+అగు= పక్కనే ఉన్నటువంటి; పార్థున్+కనుంగొని= అర్జునుడిని చూచి; మన+అరదంబు= మన రథాన్ని; సంఘటింపుము= సిద్ధం చేయుము; నేడు మొదలుగాన్= ఈనాటినుండి; ఆ+ఎడకున్= అక్కడకు; సైనికులన్ రానీకుము= దండు రానీయకుండా చూడుము; అంతఃపుర పరివారంబును= అంతఃపురంలోని సేవకులను; వచ్చుట+ఉడుపుము= రానీయకుము; శాంతనవుండు= శంతను పుత్రుడైన భీష్ముడు; సందడిన్+పడన్+అర్హుండు కాఁడు= జన సమ్మర్దానికి తగినవాడు కాడు; విశేషించి= ప్రత్యేకించి; పరమ గుహ్య+అర్థంబులు+అగు వాక్యంబులు= మిక్కిలి రహస్యమైన అర్థాలు గల మాటలు; మనకున్+అనుగ్రహింపన్+కలవాఁడు= మనకు ప్రసాదిస్తాడు; కావునన్= అందుకని; నిఃసమ్మర్దంబుగాన్= సందడి లేకుండా ఉపాసింపన్+వలయును+అని= పూజించవలసిందని; పలికి= చెప్పి; ఒక్క+ఇంత= కాస్త; విచారించి= ఆలోచించి; తగురాజులన్= అర్హులైన రాజులను; కొందఱన్ పేరుకొని= కొందరిని పేర్కొని; ధృతరాష్ట్ర విభుండును= ధృతరాష్ట్ర మహారాజు; వారును= పైన పేర్కొనబడ్డ రాజులు; వచ్చువారు= వస్తారు; వారిన్+పిలువన్+పంపుము= వారిని పిలిపించుము; అనవుడున్= అని చెప్పగా; అతండు= ఆ అర్జునుడు; పిలిపించి= పిలిపించి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు శుభప్రదంగా అలంకరించుకొని, తన మూర్తిని అద్దంలో చూచుకొని దగ్గరే ఉన్న సాత్యకిని చూచి భీష్ముడి వద్దకు పోవటానికి ధర్మరాజు సిద్ధమైన సంగతి తెలిసికొని మనం ప్రయాణమవుతున్న సంగతి చెప్పుమని పంపించాడు. అంతకుముందే ధర్మరాజు పుణ్యాత్ముల సంకీర్తనాశీస్సులూ, శుభప్రదమైన సంగీత నాదాలూ చెవి కింపు గొల్పుతుండగా నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకొని ఉండగా సాత్యకి ఆ ధర్మరాజును చూచి భీష్ముడి వద్దకు పోవటానికి రథం సిద్ధంచేయించి శ్రీకృష్ణుడు నీ రాకకొరకు ఎదురు చూస్తున్నాడని చెప్పాడు. వెంటనే ధర్మరాజు పక్కనే ఉన్న అర్జునుడిని చూచి 'మన రథాన్ని సిద్ధం చేయుము. ఈ రోజు నుండి అక్కడకు సైనికులను అంతఃపుర పరివారాన్ని రానీయకుము. భీష్ముడు జనసమ్మర్దాన్ని తట్టుకొనే స్థితిలో లేడు. పైపెచ్చు మనకు రహస్యార్థాలను తెలియచేయనున్నాడు. కాబట్టి సందడి లేకుండా మనం భీష్ముడిని సేవించవలసి ఉన్నది' అని చెప్పి, కొంత ఆలోచించి కొందరు రాజులపేర్లను చెప్పి, 'ధృతరాష్ట్ర మహారాజుతోపాటు వారిని కూడా పిలిపించవలసిం' దని చెప్పగా అర్జునుడు యథారీతిగా ఆచరించాడు.

ధర్మరాజు కృష్ణాదులతోడ భీష్ము పాలికింబోపుట (సం. 12-53-27)

క. అరదము వన్నిన నా భూ । వరుఁ డతఁడును దాను నెక్కి వడముడి వేఱొ
క్క రథమునఁ బిన్న తమ్ముల । నిరువురఁ గలపికొని యెలమి నేతేరంగన్. 130

ప్రతిపదార్థం: అరదము+పన్నినన్= రథాన్ని ఆయత్తం చేయగా; ఆ భూవరుఁడు= ధర్మరాజు; అతఁడును= అర్జునుడూ; తానున్= తానును (ధర్మరాజు); ఎక్కి= అధిరోహించి; వేఱు+ఒక్క రథమునన్= మరొక రథంలో; వడముడి= భీముడు; పిన్నతమ్ములన్+ఇరువురన్= చిన్న తమ్ములైన నకుల సహదేవు లిద్దరిని; కలపికొని= తనతో కలుపుకొని; ఎలమిన్+ఏతేరంగన్= సంతోషంతో బయలుదేరగా.

తాత్పర్యం: రథాన్ని ఆయత్తం చేయగా ధర్మరాజు అర్జునుడితోపాటు రథ మెక్కగా మరొక రథంలో భీముడు నకుల సహదేవులను కలుపుకొని సముచిత రీతిని బయలుదేరాడు.

క. వినుము! మహా భూతము లే । నును సమధిక రూపమున వినుతభంగిఁ దగం
జను తెఱఁగు దోఁప నెలమిం । జనియెను వసుదేవసుతుని సదనంబునకున్. 131

ప్రతిపదార్థం: వినుము= ఓ మహారాజా! వినుము (జనమేజయుడితో వైశంపాయనుడు చెప్పటం); మహాభూతముల్+ఏనును= పంచభూతాలు అయిదును; సమ్+అధిక రూపమునన్= చక్కటి రూపంతో; వినుత భంగిన్= ప్రశంసించ తగిన రీతిగా; తగన్+చను తెఱఁగు+తోఁపన్= సముచితంగా వెళ్ళుతున్న పద్ధతి స్పష్టమయ్యేట్లు; ఎలమిన్= బాగుగా; వసుదేవ సుతుని= వసుదేవుడి కుమారుడైన శ్రీకృష్ణుడి; సదనంబునకున్= భవనానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: పంచభూతాలు సముచితరూపంతో ప్రశంసనీయమైన రీతిలో సముచితంగా వెళ్ళుతూ ఉన్న పద్ధతి స్పష్టమయ్యేటట్లుగా ధర్మరాజు తమ్ములతో కూడి తాము అయిదుగురూ శ్రీకృష్ణుడి భవనానికి వెళ్ళారు.

విశేషం: అలం: ఉపమ.

వ. రథగమన రవంబునం గృప యుయుత్సు సంజయులుం గూడుకొని; రంత. 132

ప్రతిపదార్థం: రథగమన రవంబునన్= రథం వెళ్ళుతున్న శబ్దంవలన; కృప యుయుత్సు సంజయులున్= కృపాచార్యుడు, యుయుత్సుడు, సంజయుడు ముగ్గురు; కూడుకొనిరి= కలిసికొన్నారు; అంతన్= ఆ తరువాత.

తాత్పర్యం: ధర్మరాజాదులు వెళ్ళుతున్న రథగమన శబ్దాలను గుర్తించి కృపుడు, యుయుత్సుడు, సంజయుడు ముగ్గురు వచ్చి కలిసికొన్నారు. ఆ వెనుక - (తరువాతి పద్యంతో అన్వయం).

క. దారుకుఁడు వన్ని తెచ్చిన । తేరను వెలువడియె వాసుదేవుండును; న
త్తేరులు నాలుగు నేమిక । లా రవ మెసఁగంగ బెరసి యరిగె నరేంద్రా! 133

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= జనమేజయ మహారాజా!; దారుకుఁడు+వన్ని+తెచ్చిన= శ్రీకృష్ణుడి రథసారథి అయిన దారుకుడు సిద్ధం చేసి తెచ్చిన; తేరను= రథమందు; వాసుదేవుండును= వసుదేవుడి కుమారుడైన శ్రీకృష్ణుడును; వెలువడియెన్= బయలుదేరి వచ్చాడు; ఆ+తేరులు నాలుగున్= ఆ నాలుగు రథాలు; నేమి+కలారవము+ఎసఁగంగన్= చక్రాల అతిశయమైన శబ్దం చేస్తూ ఉండగా; బెరసి+అరిగెన్= కలిసి బయలుదేరి వెళ్ళాయి.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! శ్రీకృష్ణుడి సారథి అయిన దారుకుడు సిద్ధం చేసి తెచ్చిన రథంలో శ్రీకృష్ణుడు బయలుదేరాడు. అర్జునుడితో ధర్మజుడు బయలుదేరిన రథమూ, నకుల సహదేవులతో భీముడు అధిరోహించిన రథమూ, కృప యుయుత్సు సంజయుల రథమూ. శ్రీకృష్ణుడు బయలుదేరిన రథమూ నాలిగింటి యొక్క చక్రాల శబ్దం అతిశయిస్తూ ఉండగా బయలుదేరి వెళ్ళాయి.

క. జనమేజయ నృప! యంతకు । మును నారద ముఖ్యులైన మునివర్యులు శాం
తనవుని పాలికి వచ్చిరి । వనజభవుని కడకు సురలు వచ్చు విధమునన్. 134

ప్రతిపదార్థం: జనమేజయ నృప!= ఓ జనమేజయ మహారాజా!; అంతకుమును= అంతకు ముందే; నారద ముఖ్యులు+ఐన= నారద ప్రముఖులైన; ముని వర్యులు= మునిశ్రేష్ఠులు; వనజభవుని కడకున్= పద్మంనుండి పుట్టినవాడైన బ్రహ్మ వద్దకు; సురలు వచ్చు విధమునన్= దేవతలు వచ్చే విధంగా; శాంతనవుని పాలికిన్ వచ్చిరి= శంతను మహారాజు కుమారుడైన భీష్ముడి వద్దకు వచ్చారు.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! అంతకుముందే అంటే ఆ శ్రీకృష్ణాదులు రాకముందే నారదుడు మొదలైన మునిశ్రేష్ఠులు బ్రహ్మవద్దకు దేవతలు వచ్చినట్లుగా భీష్ముడి వద్దకు వచ్చారు.

విశేషం: అలం: ఉపమ.

వ. అట్లు సంయమి వర పరిషత్పరివృతుండై యున్నయ ద్దేవ వ్రతుని కడ చేర నరిగి శౌరి ప్రముఖులు రథంబులు డిగ్గి. 135

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; సంయమి వర పరిషత్+పరివృతుండు+ఐ+ఉన్న= మునిశ్రేష్ఠుల సమూహంతో చుట్టబడి ఉన్న; ఆ+దేవవ్రతుని కడ+చేరన్+అరిగి= ఆ భీష్ముడి దగ్గరకు వెళ్ళి; శౌరి ప్రముఖులు= కృష్ణుడు మొదలైన ముఖ్యులు; రథంబులు డిగ్గి= రథాలలోనుండి దిగి.

తాత్పర్యం: మునిశ్రేష్ఠుల సమూహంతో చుట్టబడి ఉన్న భీష్ముడి సమీపానికి వెళ్ళి, శ్రీకృష్ణాదులు రథాలలోనుండి దిగి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. తత్సమీపమునకు ధర్మనందన పుర । స్సరత నరిగి తొలుత సకల మునులఁ
బ్రణతిఁ దెలచి కదిసి బలసి యుపాసించి । రన్నదీతనూజు నధికభక్తి. 136

ప్రతిపదార్థం: తద్+సమీపమునకున్= వారి దగ్గరకు; ధర్మనందన పురస్సరతన్+అరిగి= ధర్మరాజును ముందుగా ఉంచుకొని వెళ్ళి; తొలుతన్= మొదట; సకల మునులన్= సమస్త మహర్షులను; ప్రణతిన్= నమ్రతతో; తెలచి= మొక్కి, నమస్కరించి; కదిసి= సమీపించి; బలసి= చుట్టుచేరి (పరివేష్టించి); ఆ+నదీ తనూజున్= ఆ గంగానదీ పుత్రుడైన భీష్ముడిని; అధిక భక్తిన్= అత్యంత భక్తితో; ఉపాసించిరి= పూజించారు.

తాత్పర్యం: శ్రీకృష్ణాదులు భీష్మాదు లున్న సమీపానికి ధర్మరాజును ముందుంచుకొని వెళ్ళి, మొదట సకల మహర్షులకు నమస్కరించి, అంతా పరివేష్టించి భీష్ముడిని మిక్కిలి భక్తితో పూజించారు.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె. 137

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విన్న జనమేజయ మహారాజు; వైశంపాయనునకున్+ఇట్లు+అనియెన్= వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పగా వినిన జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు.

మ. 'శరతల్పంబునఁ బొల్చు భీష్ముకడకున్ సంప్రీతి న క్కౌరవే
శ్వరుఁడుం దమ్ములు గృష్ణుఁడుం జని మునివ్రాతంబుతోఁ గూడ న
ప్పరమోదాత్తుని చుట్టు నున్న యెడ నెబ్భంగిం బ్రవర్తించె వి
స్తర మాధుర్య మనోజ్ఞ సత్కథలు విస్పష్టంబుగాఁ జెప్పవే!' 138

ప్రతిపదార్థం: శరతల్పంబునన్+పొల్చు= అమ్ముల పాన్పుపై ప్రకాశించే; భీష్ముకడకున్= భీష్ముడి వద్దకు; సంప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ఆ+కౌరవ+ఈశ్వరుఁడున్= కౌరవశ్రేష్ఠుడైన ధర్మరాజు; తమ్ములున్= తమ్ములును (అయిన భీమార్జున నకుల సహదేవులు); కృష్ణుఁడున్= శ్రీకృష్ణుడును; చని= వెళ్ళి; ముని వ్రాతంబుతోన్+కూడన్= మునుల యొక్క సమూహంతో కూడా; ఆ+పరమ+ఉదాత్తుని చుట్టున్= ఆ పరమోన్నతుడైన భీష్ముడి చుట్టూ; ఉన్నెడన్= ఉన్న సమయంలో; ఏ+భంగిన్+ప్రవర్తించెన్= ఏ రీతిగా నడుచుకొన్నాడో; విస్తర మాధుర్య మనోజ్ఞ సత్కథలు= విపులమై, తియ్యనై, మనోహరమైన ఉత్తమ కథలు; విస్పష్టంబుగాన్+చెప్పవే!= విశదంగా చెప్పుము.

తాత్పర్యం: 'శరతల్పగతుడై ఒప్పుతున్న భీష్ముడి వద్దకు అత్యంత ప్రీతితో ధర్మరాజు, అతడి తమ్ములు, భీమార్జున నకుల సహదేవులు, శ్రీకృష్ణుడు మహర్షి గణంతో కూడా వెళ్ళి అతడిని ఉండగా ఆతడి ప్రవర్తన ఎట్లా ఉన్నది? విపులమూ, మధురమూ, మనోహరమూ అయిన ఆ కథలు వివరంగా చెప్పు'మని జనమేజయుడిని వైశంపాయనుడు కోరాడు.

వ. అని యడిగిన నమ్మహీవిభునకు వైశంపాయనుం డిట్లనియె; మున్ను ధర్మపుత్రుండు రావించిన ధృతరాష్ట్రుండును రాజులు నతనిపజ్జ నరిగి వారును గాంగేయు నుచిత ప్రకారంబునం గాంచి కొల్చి యుండి; రట్టియెడ నారదుండు ధర్మపుత్రాదుల న మ్మేదినీపతులం గలయం గనుంగొని. 139

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని అడుగగా; ఆ+మహీవిభునకున్= ఆ జనమేజయ మహారాజునకు; వైశంపాయనుండు+ఇట్లు+అనియెన్= వైశంపాయనుడు ఇట్లా అన్నాడు; మున్ను= ఇంతకు ముందే; ధర్మపుత్రుండు రావించిన= ధర్మరాజు పిలిపించిన; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్ర మహారాజూ; రాజులున్= ఇతర రాజులూ; ఆతనిపజ్జన్+అరిగి= ఆతని దగ్గరకు వెళ్ళి; వారును= వారందరూ; గాంగేయున్= గంగాదేవి పుత్రుడైన భీష్ముడిని; ఉచిత ప్రకారంబునన్+కాంచి= తగిన రీతిగా దర్శించి; కొల్చి ఉండిరి= సేవిస్తూ ఉన్నారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; నారదుండు= నారద మహర్షి; ధర్మపుత్ర+ఆదులన్= ధర్మరాజు మొదలైన వారిని; ఆ+మేదినీ పతులన్= ఆ రాజులను; కలయన్+కనుంగొని= కలయచూచి.

తాత్పర్యం: ధర్మరాజాదులు భీష్ముడి చుట్టూ చేరినప్పుడు భీష్ముని ప్రవర్తన ఎట్లుందో చెప్పుమని జనమేజయ మహారాజు అడుగగా వైశంపాయనుడు ఇట్లా చెప్పాడు: అంతకు ముందే ధర్మరాజు పిలిపించినట్టి ధృతరాష్ట్రుడు, తక్కిన రాజులు భీష్ముడి వద్దకు వెళ్ళి భీష్ముడిని తగిన రీతిగా దర్శించి సేవిస్తూ ఉన్నారు. ఆ సమయంలో నారద మహర్షి ధర్మరాజాదులనూ తక్కిన రాజులనూ కలయచూచి ఇట్లా అన్నాడు.

క. 'శంతను నందనుఁ డపరది । గంత ప్రాప్తరవి యట్టిఁడయ్యె నితఁడు లో
కాంతరగతుఁ డగుటకు ము । న్నంతఃకరణముల సంశయము వాయంగన్. 140

ప్రతిపదార్థం: శంతను నందనుఁడు= శంతను మహారాజు కుమారుడైన భీష్ముడు; ఇతఁడు= ఈ భీష్ముడు; అపర దిక్+అంతప్రాప్తరవి+ అట్టి+వాఁడు+అయ్యెన్= పడమటి దిక్కుయొక్క అంతమును చేరిన సూర్యుడివంటి వాడు అయ్యాడు; లోక+అంతరగతుఁడు+ అగుటకున్= ఈ భూలోకం వదలి స్వర్లోకానికి వెళ్ళటానికి; మున్ను= ముందు; అంతఃకరణముల= మనస్సుతోపాటు జ్ఞాన కర్మేంద్రియాలయొక్క; సంశయము+పాయంగన్= సందేహాలు తొలగి పోయేటట్లుగా.

తాత్పర్యం: 'ఈ భీష్ముడు పశ్చిమదిక్కును చేరుతున్న సూర్యుడివలె ఒప్పుతున్నాడు. ఈ లోకం వదలిపెట్టి స్వర్గలోకానికి వెళ్ళే ముందు మనస్సుతోపాటు జ్ఞానకర్మేంద్రియాల సందేహాలు తొలగిపోయేటట్లుగా.

విశేషం: అలం: ఉపమ. పరలోకగతుడు కానున్న భీష్ముడిని అపరదిగభిముఖుడైన సూర్యుడితో పోల్చటం అత్యంతం సముచితంగా ఉన్నది.

వ. సకల ధర్మ ప్రకారంబు నడిగి తెలిసికొం'డనినఁ బ్రశ్నపాటవంబు లేమి నందఱు నొండొరువుల మొగంబులు సూచుచుండఁ బాండవాగ్రజుండు పుండరీకాక్షున కిట్లనియె. 141

ప్రతిపదార్థం: సకల ధర్మప్రకారంబున్+అడిగి= సమస్త ధర్మ పద్ధతులను అడిగి; తెలిసికొండు+అనినన్= తెలసికొనవలసిందని నారదుడు చెప్పగా; ప్రశ్న పాటవంబు లేమిన్= ప్రశ్నించే పటుత్వం లేకపోవటం వలన; అందఱున్+ఒండొరుపుల= అందరూ ఒకళ్ళొకళ్ళ; మొగంబులు చూచుచుండన్= ముఖాలు చూస్తుండగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; పుండరీక+అక్షునకున్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సమస్త ధర్మపద్ధతులనూ భీష్ముడిని అడిగి తెలిసికొనండని నారదుడు చెప్పగా ప్రశ్నించే తీరు తెలియక అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూస్తూ ఉన్న సమయంలో ధర్మరాజు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తే. 'నీవు దక్కంగ మందాకినీ తనూజు । తోడి సల్లాపములకు నుక్తులు ముకుంద!
కలరె యెందును? ధర్మవేదులకు నెల్ల । గురుఁడ వీవ; సంభాషణపరుఁడ వగుము.' 142

ప్రతిపదార్థం: ముకుంద!= ఓ కృష్ణా!; మందాకినీ తనూజు తోడి= గంగాదేవి పుత్రుడైన భీష్ముడితో; సల్లాపములకున్= మంచి మాటలకు (సంభాషణకు); నీవు తక్కంగన్= నీవు తప్ప; ఉక్తులు కలరె?= చెప్పగలవా రున్నారా?; ఎందునున్= ఎక్కడైనా; ధర్మవేదులకున్+ఎల్లన్= ధర్మమెరిగిన వారందరికి; ఈవ= నీవే; గురుఁడవు; సంభాషణ పరుఁడవు+అగుము= మాట్లాడటం ప్రారంభించుము.

తాత్పర్యం: 'భీష్ముడితో సంభాషించటానికి నీవు తప్ప అర్హులు లేరు. ధర్మవేత్తలందరికి నీవు గురుడవు. నీవు సంభాషణ ప్రారంభించుము.

విశేషం: 'ఉక్తులు' అనటానికి బదులు 'శక్తులు' అనే పాఠాంతరం సముచితం.

వ. అనుటయు నచ్యుతుండు భీష్మున కత్యాసన్నుండై శారీర మానస కుశల ప్రశ్నంబుఁ జేసిన నతండు. 143

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; భీష్మునకున్+అతి+ఆసన్నుండు+ఐ= భీష్ముడికి మిక్కిలి సమీపంలో కూర్చున్నవాడై; శారీర మానస కుశల ప్రశ్నంబున్+చేసినన్= శరీరానికి సంబంధించి మనస్సుకు సంబంధించి క్షేమాన్ని గూర్చి అడుగగా; అతండు= ఆ భీష్ముడు.

తాత్పర్యం: అని ధర్మరాజు ప్రార్థించగా శ్రీకృష్ణుడు భీష్ముడికి మిక్కిలి సమీపంలో ఉంటూ అతడిని శరీరానికి మనస్సుకు సంబంధించిన క్షేమాన్ని గూర్చి ప్రశ్నించాడు. అప్పుడు భీష్ముడు ఇట్లా అన్నాడు.

ఉ. 'దేవ! భవత్ప్రసాదమునఁ దీఱె శరీరము నొప్పి డప్పి, మ
ద్భావము నింద్రియంబులును బాటవ సంపద నొందె, వేద వి
ద్యా విభవంబు నాకుఁ బరతత్వ పరిస్ఫుట బోధ యుక్తమై
భావితమయ్యెఁ నాత్మఁ బరిపక్వ దయాకరచిత్త మాధవా! 144

ప్రతిపదార్థం: పరిపక్వ దయాకర చిత్త!= పండిన కరుణకు నెలవైన చిత్తం కలవాడా!; మాధవా!= ఓ కృష్ణా!; దేవ!= మహానుభావా! భవత్+ప్రసాదమునన్= నీ అనుగ్రహంతో; శరీరము నొప్పి= శారీరకమైన బాధ; దప్పి= అలసట; తీఱెన్= తొలగిపోయాయి; మత్+భావంబున్= నా మనస్సును; ఇంద్రియంబులును= జ్ఞాన కర్మేంద్రియాలును; పాటవ సంపదన్+ఒందెన్= పటుత్వ సంపదను పొందాయి; నాకు; ఆత్మన్= ఆత్మలో; వేద విద్యా విభవంబు= చతుర్వేదాల విద్యయొక్క వైభవమూ; పరతత్వ

పరిస్ఫుట బోధయుక్తమై= పరమాత్మయొక్క స్పష్టమైన జ్ఞానంతో కూడినదయి; భావితము+అయ్యెన్= సంభావితమయింది (తెలిసికొన్నాను).

తాత్పర్యం: ఓ కృష్ణా! పరిపూర్ణ కరుణాకరా! నీ అనుగ్రహంతో శరీర సంబంధమైన నొప్పి, అలసట తీరిపోయాయి. నా మనస్సు, జ్ఞాన కర్మేంద్రియాలూ పాటవ సంపదతో ఒప్పారుతున్నాయి. నాకు నా ఆత్మలో వేదవిద్యా వైభవం స్పష్టమైన పరమాత్మ జ్ఞానంతో కూడినదై స్పష్టంగా తెలిసింది.

విశేషం: మూలంలోని ఎనిమిది శ్లోకాల భావాన్ని ఈ పద్యంలో తిక్కన కుదించి రచించాడు. ఆ ఎనిమిది శ్లోకాలలో భావాన్ని జారిపోనీయకుండా భీష్ముని మాటలుగా ఈ పద్యంలో మనోహరంగా చిత్రించాడు.

వ. దేవర దివ్య చిత్తంబున నన్నుం దలంచిన దానంజేసి బృంహితుండ నయ్యును గొండుక ప్రాయంబు వాఁడునుం బోలె నయితిఁ; జెప్ప వలయు వాని నెల్లం జెప్పెదఁ; బాండవ శుభకరంబైన వాని నీ వేల చెప్పవు? నీ తలం పేమి? సెప్పవే!' యనినఁ గృష్ణుండు గాంగేయున కిట్లనియె. 145

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; దేవర దివ్య చిత్తంబునన్= భగవంతుడవైన నీ దివ్యమైన మనస్సులో; తలంచిన దానన్+చేసి= నన్ను తలంచటంవలన; బృంహితుండన్+అయ్యును= వృద్ధుడనైనప్పటికి; కొండుక ప్రాయంబు వాఁడునున్+పోలెన్+అయితిన్= చిన్న బాలుడివలె అయిపోయాను; చెప్పవలయు వానిన్+ఎల్లన్= చెప్పదగిన వాటి నన్నింటిని; చెప్పెదన్= వివరిస్తాను; పాండవ శుభకరంబు+ఐన దానిన్= పాండవులకు మంగళప్రదమైన దానిని; ఈవు+ఏల+చెప్పవు= నీవు ఎందుకు చెప్పవు; నీ తలంపుఏమి?= నీ అభిప్రాయం ఏమి?; చెప్పవే+అనినన్= చెప్పవలసిందని భీష్ముడు ప్రశ్నించగా; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; గాంగేయునకున్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: "నీ దివ్య చిత్తంలో నన్ను భావించటంచేత నేను వృద్ధుడనైనప్పటికీ, చిన్న బాలుడివలె అయిపోయాను. నీ ఆదేశానుసారం పాండవులకు చెప్పదలచినవన్నీ సవిస్తరంగా చెప్పుతాను. అయినా పాండవులకు శుభప్రదమైన వాటిని నీ వెందుకు చెప్పవు? నీ భావ మేమి? చెప్పుము' అని అడిగాడు. అప్పుడు కృష్ణుడు భీష్ముడితో ఇట్లా అన్నాడు.

**తే. 'అనఘ! శ్రేయస్సునకు యశంబునకు నేను । మూలకందంబ; విను! చంద్రముండు శీత
కిరణుఁడను మాట విస్మయకరమె? చెపుము; । యశ ముపార్జింపఁ గ్రొత్తపెం పగునె నాకు? 146**

ప్రతిపదార్థం: న+అఘా!= పాపరహితుడవైన ఓ భీష్మా!; విను= వినుము; శ్రేయస్సునకున్= మేలునకు; యశంబునకున్= కీర్తికిని; ఏను= నేను; మూల కందంబన్= మూలాధారమైనవాడిని; చంద్రముండు= చంద్రుడు; శీత కిరణుడు+అనుమాట= చల్లనైన కిరణాలు కలవాడనే మాట; విస్మయకరమె= ఆశ్చర్యకరమా; చెపుమా= చెప్పు; నాకు; యశము+ఉపార్జింపన్= కీర్తిని సంపాదించటం; క్రొత్త పెంపు+అగునె= క్రొత్త అభివృద్ధి అవుతుందా?

తాత్పర్యం: 'ఓ భీష్మా! ప్రజాశ్రేయస్సుకు, కీర్తికి నేనే మూలకారణం. సందేహం లేదు. చంద్రుడు చల్లని కిరణాలు కలవాడనటంలో విచిత్రం లేదు కదా! అట్లాంటి నాకు కీర్తి సంపాదన కొత్తగా తెచ్చుకొన్న అభివృద్ధి అవుతుందా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. సామాన్యాంశం విశేషాంశం చేత సమర్థించబడుతున్నది.

**క. పరమ మగు యశము నీకును । ధరణిం గలిగింపఁ బూని తాత్పర్యమునం
బురుషవర! నాదు బుద్ధి । స్ఫురణము నీ మనమునందుఁ జొనిపితి నెనయన్. 147**

ప్రతిపదార్థం: పురుషవర!= ఓ మానవోత్తముడైన భీష్మా!; ధరణిన్= ఈ భూమి మీద; పరమము+అగు యశము= శ్రేష్ఠమైన కీర్తిని; నీకును కలిగింపన్+పూని= నీకు సంప్రాప్తింపచేయటానికి ప్రయత్నించి; తాత్పర్యమునన్= మనస్సునందు లేదా అభిమతంలో; నాదు= నా యొక్క; బుద్ధి స్ఫురణమున్= నా బుద్ధి జ్ఞానాన్ని; ఎనయన్= తగునట్లు; నీ మనమునందున్+చొనిపితిన్= నీ మనస్సునందు ఆపాదించాను.

తాత్పర్యం: ఓ మానవోత్తముడవైన భీష్మా! అత్యుత్తమ కీర్తిని నీకు కూడా ప్రసాదించదలచి తదనుగుణంగా నా జ్ఞానాన్ని నీ మనస్సులో ప్రవేశపెట్టాను.

విశేషం: చందమామకు వెన్నెల సహజమైన రీతిగా నాకు కీర్తి సహజమే. అయితే అత్యుత్తమ కీర్తిని భీష్ముడికి సైతం ప్రసాదించాలన్న కోరికతో ఆ జ్ఞానాన్ని అతడి మనస్సులో ప్రవేశపెట్టినట్లు కృష్ణుడు చెప్పటంలో ఎంతో విశేషమున్నది.

తే. ధరణి యెందాఁక నుండు సుస్థిరత నీదు । కీర్తి యందాఁక నక్షయస్ఫూర్తిఁ దాల్చి
నడవఁ గలయది నీవు సెప్పెడి సువాక్య । ములును వేదతుల్యంబులై వెలయుచుండు. 148

ప్రతిపదార్థం: ధరణి= ఈ భూమి; ఎంత+దాఁకన్= ఎంతకాలం దాకా; సుస్థిరతన్+ఉండున్= స్థిరమై ఉంటుందో; అంత+దాఁకన్= అంతవరకు; నీదు కీర్తి= నీ కీర్తి; అక్షయ స్ఫూర్తిన్+తాల్చి= నశించనిదై; నడవన్+కల+అది= కొనసాగుతుంది; నీవు+చెప్పెడి= నీవు ప్రబోధించబోయే; సువాక్యములును= మంచి మాటలును; వేద తుల్యంబులు+ఐ= వేదాలతో సమానమై; వెలయుచుండున్= ఒప్పారుతూ ఉంటాయి.

తాత్పర్యం: ఈ భూమి ఎంతకాలం సుస్థిరంగా ఉంటుందో నీ కీర్తి నశించనిదై అంత వరకు కొనసాగుతుంది. నీవు చెప్పే మంచి మాటలన్నీ వేదాలతో సమానమై ఒప్పారుతూ ఉంటాయి.

క. ధర్మజునకు నీ చెప్పెడు । ధర్మస్థితి వాక్య సమితి తాత్పర్యముతో
నిర్మలు లై కొనియాడెడు । ధార్మికులకు నుభయజగదుదాత్తత కలుగున్. 149

ప్రతిపదార్థం: ధర్మజునకున్= ధర్మరాజునకు; నీ చెప్పెడు= నీవు ప్రబోధించే; ధర్మస్థితి= ధర్మపద్ధతియొక్క; వాక్య సమితి= మాటల సమూహం; తాత్పర్యముతోన్= ఏకాగ్రతతో; నిర్మలులు+ఐ= పరిశుద్ధులై; కొనియాడెడు= ప్రశంసించే; ధార్మికులకున్= ధర్మాత్ములకు; ఉభయ జగత్+ఉదాత్తత= ఇహపరాలలోను, ఉత్తమత్వము; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ధర్మరాజుకు నీవు చెప్పే ధర్మంతో కూడిన వాక్యసమూహ సారం ఏకాగ్రతతో పరిశుద్ధులై ప్రశంసించే ధర్మాత్ములకు ఉభయతారకమై ఒప్పుతుంది.

వ. కావున నిట్లు సేసితి; భవదీయ ధర్మవేదిత్వంబును సవిశేష ప్రకారంబుగా నీ మనుములు ధర్మజ భీమార్జున నకుల సహదేవులు భద్ర భాజనంబులుగా నీ యున్న మహీపతులు విని కృతార్థజన్ములుగా నఖిల ధర్మ ప్రకారబోధకంబు లగు వాక్యంబులు సెప్పు' మనుటయు శాంతనవుం 'డట్ల చేసెద' నని పలికి యాదరభరితుం డయి యిట్లనియె. 150

ప్రతిపదార్థం: కావునన్= అందుకని; ఇట్లు+చేసితిన్= ఇలా నిర్ణయించాను; భవదీయ= నీ యొక్క; ధర్మవేదిత్వంబును= ధర్మసంబంధమైన జ్ఞానాన్ని; సవిశేష ప్రకారంబుగాన్= విశేషంతో కూడిన పద్ధతితో; నీ మనుములు= నీ మనుములైన; ధర్మజ భీమ+అర్జున నకుల సహదేవులు= ధర్మరాజు భీముడు అర్జునుడు నకులుడు సహదేవు డనే ఐదుగురు; భద్ర భాజనంబులు

గాన్= శుభార్హులయ్యేట్లుగా; ఈ+ఉన్న= ఇక్కడ గుమిగూడి ఉన్న; మహీపతులు= రాజులు; కృత+అర్థ జన్ములు+కాన్= పుట్టుకలు సఫలమయ్యేటట్లుగా; అఖిల ధర్మప్రకార బోధకంబులు+అగు= అన్ని ధర్మవిశేషాలను ప్రబోధించే; వాక్యంబులు+చెప్పుము+ అనుటయును= మాటలు చెప్పుమని శ్రీకృష్ణుడు కోరగా; శాంతనవుండు+అట్లు+చేసెదన్+అని= భీష్ముడు అట్లాగే చేస్తానని చెప్పి; ఆదరభరితుండు+అయి+ఇట్లు+అనియెన్= ప్రేమతో నిండినవాడై ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఓ భీష్మా! భూమి ఉన్నతంకాలం అపారకీర్తి నీకే రావాలని భావించి ఇట్లా చేశాను. నీ ధర్మ సంబంధమైన విజ్ఞాన విశేషాన్ని నీ మనుమలైన ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు శుభార్హులయ్యేటట్లుగా, ఇక్కడ పరివేష్టించి ఉన్న రాజుల పుట్టువు సఫలమయ్యేటట్లుగా సమస్త ధర్మవిశేషాలను బోధించే వాక్యాలను చెప్పవలసిం'దని శ్రీకృష్ణుడు కోరగా భీష్ముడు అట్లాగే చేస్తా'నని చెప్పి సంతోష భరితుడై ఇట్లా అన్నాడు.

సీ. 'ఎవ్వఁడు పుట్టిన నెల్ల మునీంద్రులు । నత్యంత సంప్రమోదాత్ము లైరి,
పరమ ధార్మికులైన భరతుల యందును । నెవ్వరు నెవ్వని నెనయ లేరు,
సత్యంబు దాంతియు శౌచంబు శాంతియు । నలవడి యెవ్వనియందు వెలయుఁ,
బాత్రదానాధ్వర బంధు రక్షాది ధ । ర్మంబు లెవ్వనికిఁ బ్రియంబు లెపుడుఁ,

తే. గామమున నైన విపులార్థ కారణమున । నైన భయమున నైనను నపథ వర్త
నంబునకుఁ జొరఁ డెవ్వాఁడు నన్ను నేమి । యడుగఁ దలఁచె నా ధర్మజుం డడుగుఁ గాక!' 151

ప్రతిపదార్థం: ఎవ్వఁడు పుట్టినన్= ఎవ్వడు పుట్టటం వలన; ఎల్ల ముని+ఇంద్రులున్= ముని శ్రేష్ఠులందరు; అత్యంత= మిక్కిలి; సంప్రమోద+ఆత్ములు+ఐరి= సంతోషాంతరంగు లయ్యారో; పరమ ధార్మికులు+ఐన= మిక్కిలి ధర్మగుణం కలవా రయిన; భరతుల యందునున్= భరత వంశంలో పుట్టిన వారి యందు; ఎవ్వరున్= ఎవ్వరు కూడా; ఎవ్వనిన్= ఎవ్వనితో; ఎనయన్+లేరు= సమానులు కారో; సత్యంబున్= సత్యమూ; దాంతియున్= కర్మేంద్రియాల నిగ్రహశక్తి; శౌచంబున్= శుచిత్వం; శాంతియున్= జ్ఞానేంద్రియాల నిగ్రహశక్తి; అలవడి= కలిగి; ఎవ్వనియందున్= ఎవ్వడితో అయితే; వెలయున్= ప్రకాశిస్తూ ఉంటాయో; పాత్రదాన+అధ్వర బంధురక్షా+ఆది= అర్హులైనవారికి దానాలు చెయ్యటం, యజ్ఞాలను బంధువులను రక్షించటం మొదలైన; ధర్మంబుల్= ధర్మాలు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; ఎవ్వనికిన్= ఎవడికయితే; ప్రియంబులు= ప్రియమయితే; కామమునన్+ఐనన్= కోరికవలన అయితేనేమీ; విపుల+అర్థ+కారణమునన్+ఐనన్= విస్తృత ధనం కారణం వలన అయినా; భయమునన్+ఐనన్= భయంవలన అయినా; అపథ వర్తనంబునకున్= చెడు మార్గ ప్రవర్తనకు; ఏ+వాఁడు= ఎవడయితే; చొరఁడు= ప్రవేశించడో; ఆ ధర్మజుండు= ఆ ధర్మరాజు; నన్నున్= నన్ను; ఏమి+అడుగన్+తలఁచెన్= ఏమి అడగాలని అనుకొంటున్నాడో; అడుగున్ కాక!= అది అడగవలసింది.

తాత్పర్యం: 'ఎవ్వడి జన్మకారణంగా సమస్త మునీంద్రులు సంతోషాంతరంగు లయ్యారో, పరమధార్మికు లని పేరు పొందిన భరత వంశీయులు కూడా ఎవ్వడితో సాటిరారో, సత్యం, శౌచం, శాంతి దాంతులు ఎవ్వడియందు ప్రకాశిస్తూ ఉంటాయో, పాత్రులైన వారికే దానం చేయటం, యజ్ఞాలనూ, బంధువులను, రక్షించటం మొదలైన ఉత్తమ ధర్మాలన్నీ ఎవడికి సంతోషాన్ని కలిగిస్తుంటాయో, కామంవలన కాని, అర్థంవలన కాని, భయంవలన కాని, అవినీతి మార్గంలో ఎవడయితే ప్రవేశించడో అటువంటి ఉత్తమగుణగణుడైన ధర్మరాజు అడుగదలచుకొన్న అన్నింటిని అడిగి సందేహ నివృత్తి చేసికొని తెలిసికొను గాక!'

వ. అనుటయు నతనితో నచ్యుతుండు. 152

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు అనగానే; అతనితోన్= ఆ భీష్ముడితో; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: అని చెప్పగా భీష్ముడితో శ్రీకృష్ణుడు - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'గురులను బంధుమిత్రులను గ్రూరశరంబులఁ గూల్చె నుగ్రతన్,
నరుల ననేకకోటుల రణంబునఁ దాఁ దెగటార్చెఁ గాన యి
క్కురుపతి నీ సమక్షమునకుం గదియం బయిలోడెడుం గృపా
విరహిత కార్య కర్మరుఁడు వీఁ డని యాడుదొ యన్ తలంపునన్.' 153

ప్రతిపదార్థం: ఈ+కురుపతి= ఈ ధర్మరాజు; గురులను= గురువు లైన పెద్దలను; బంధుమిత్రులను= చుట్టాలను, స్నేహితులను; క్రూర శరంబులన్+కూల్చెన్= ఘోరమైన బాణాలతో పడగొట్టాడు; ఉగ్రతన్= కోపంతో; తాన్= ధర్మరాజు; నరులన్+అనేక కోటులన్= అనేకులైన మానవులను; తెగటార్చెన్= తెగ నరికాడు; కృపా విరహిత కార్య కర్మఠుఁడు= దయారహిత కార్య నిర్వాహకుడు; వీఁడు+అని= ఇతడని; ఆడుదొ+అన్+తలంపునన్= అంటావేమో అనే భావంతో; నీ సమక్షమునకున్+కదియన్= నీ ఎదుటకు రావటానికి; పుయిలోడెడున్= సంకోచిస్తున్నాడు.

తాత్పర్యం: 'ఈ ధర్మరాజు యుద్ధంలో గురువులూ, బంధువులూ, మిత్రులూ అని లెక్కించక, భయంకరమైన బాణాలతో అందరినీ కూల్చాడు. అనేక మానవ కోటులను యుద్ధంలో సంహరించాడు. కనుక ఇతడు దయాంతఃకరణుడు కాడని అంటావేమో నని భావించి నీ ఎదుట పడటానికి సంకోచిస్తున్నాడు'.

వ. అనిన విని వాసుదేవునకు దేవవ్రతుం డి ట్లనియె. 154

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పగా విని; వాసుదేవునకున్= శ్రీకృష్ణుడికి; దేవవ్రతుండు+ఇట్లు+అనియెన్= భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అనగా విని భీష్ముడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'విప్రుల కధ్యయన ప్రదానాధ్వరా । ద్యము లగు కర్మము లట్ల రాజు
లకు సంగరము తండ్రులను బుత్ర పౌత్రుల । గురుల నైనను బాపపరులఁ బోరఁ
జంపుట ధర్మంబు; సమయంబు విడిచి లో । భంబున నన్యాయ పథము నందు
వర్తించువారి నెవ్వరి నాహవంబునఁ । బొరివుచ్చఁగలిగినఁ బుణ్య కృతియ

ఆ. యట్లు గాక శోణితాంబుపూరముఁ గేశ । శైవలంబుఁ గాఁగ సమర భూమి
నక్కజపు నదీచయం బొనర్చిన రాజు । ధర్మవిదుఁ డనంగఁదగు ముకుంద!' 155

ప్రతిపదార్థం: ముకుంద!= ఓ శ్రీకృష్ణా!; విప్రులకున్= బ్రాహ్మణులకు; అధ్యయన ప్రదాన+అధ్వర+ఆద్యములు+అగు= వేదాధ్యయనమూ, దానమూ, యజ్ఞమూ మొదలైన; కర్మములు+అట్లు= కర్మాచరణ ఉన్న రీతిగానే; రాజులకున్ సంగరంబు= రాజులకు యుద్ధం; తండ్రులను; పుత్ర పౌత్రులన్= కుమారులను, మనుమలను; గురులన్+అయినను= గురువులయినప్పటికి; పాప పరులన్= దుర్మార్గులను; పోరన్+చంపుట= యుద్ధమునందు చంపటం; ధర్మంబు= ధర్మం; సమయంబు విడిచి= నీతి మార్గాన్ని వదలి; లోభంబునన్= అత్యాశతో; అన్యాయపథంబు నందు= అన్యాయ మార్గంలో; వర్తించువారిన్= నడుచుకొనే వారిని;

ఎవ్వరిన్= ఎవ్వరినైనా; ఆహవంబునన్= యుద్ధంలో; పొరిపుచ్చన్+కలిగినన్= సంహరించగలిగితే; పుణ్యకృతియ= అదే పుణ్యకార్యం; అట్లున్+గాక= ఆ విధంగా కాకపోతే; సమర భూమిన్= యుద్ధభూమిని; శోణిత+అంబు పూరమున్= రక్త మనే జలప్రవాహం; కేశ శైవలంబున్+కాఁగన్= వెంట్రుక లనే నాఁచు అయ్యేటట్లుగా; అక్కజపు నదీ చయంబు+ఒనర్చినన్= ఆశ్చర్యకర మైన నదీ సమూ హాలుగా చేసిన; రాజు, ధర్మవిదుఁడు+అనంగన్+తగున్= రాజు ధర్మవేత్త అని అనటానికి అర్హుడైన వాడు.

తాత్పర్యం: 'ఓ కృష్ణా! వేదాధ్యయనం, దానపూర్వకమైన యాగాది కర్మాచరణం, బ్రాహ్మణులకు ఎట్లాగో అదే విధంగా రాజులకు యుద్ధం సహజం. పాపవర్తను లైన తండ్రులు, పుత్రులు, మనుమలు, గురువులు ఎవరినైనా యుద్ధంలో చంపటం రాజధర్మం. విధ్యుక్త ధర్మాన్ని వదలి లోభగుణంతో అన్యాయమార్గ వర్తనులైన వారిని ఎవరినైనా యుద్ధరంగంలో వధించటం పుణ్యకార్యమే. అంతే కాకుండా యుద్ధభూమిలో దుర్మార్గులను వధించి రక్త మనే జలపూరమూ కేశ పాశాలనే నాచూ నిండి ఉండే నదీసమూహాలుగా చేయటం ధర్మవిదుడైన రాజుకు అర్హమైన కార్యం'.

విశేషం: అలం: రూపకం.

భీష్ముఁడు ధర్మరాజును సప్రేమంబుగా గారవించుట (సం. 12-55-1)

చ. అన విని ధర్మసూనుఁడు కృతాంజలి యై తగ భీష్ము డాయ న
ల్లన చని, కేలఁ బాదకమలంబు లమర్చి శిరంబు సోఁక వం
దన మొనరించినం, బిలిచి తా నభినందితుఁ జేసి మస్తకం
బునఁ గడు నర్మిలిం దనదు మో మిడి మూర్కొని సాదరంబుగన్. 156

ప్రతిపదార్థం: అనన్ విని= భీష్ముడు శ్రీకృష్ణుడితో రాజ ధర్మాన్ని గూర్చి చెప్పగా విని; ధర్మ సూనుఁడు= ధర్మరాజు; కృత+అంజలిఐ= చేయబడిన నమస్కారం కలవాడై అంటే నమస్కరించి; తగన్= ఉచిత రీతిని; భీష్మున్= భీష్ముడిని; డాయన్+అల్లన చని= సమీపించటానికి మెల్లగా వెళ్ళి; కేలన్= తన చేతులతో; పాద కమలంబుల్+అమర్చి= (భీష్ముడి) పాద పద్మాలను పట్టుకొని; శిరంబు సోఁకన్= తల తాకేటట్లు; వందనము+ఒనరించినన్= నమస్కరించగా; పిలిచి; తాన్+అభినందితున్+చేసి= భీష్ముడు ధర్మరాజును సంతోషింపజేసి; మస్తకంబునన్+కడున్+నర్మిలిన్= ధర్మరాజు తలపై మిక్కిలి ప్రేమతో; తనదు మోము+ఇడి= తన ముఖ ముంచి; మూర్కొని= ఆఘ్రాణించి; స+ఆదరంబుగన్= ఆదరపూర్వకంగా.

తాత్పర్యం: ధర్మరాజు చేతులు మొగిడ్చి, భీష్ముడిని సమీపించి, ఆయన పాదపద్మాలను తన చేతులతో పట్టుకొని తన తలను తాకిస్తూ నమస్కరించగా, భీష్ముడు ధర్మరాజును అభినందించి, అతడి తలకు తన ముఖాన్ని ఆనించి ప్రేమతో ఆఘ్రాణించాడు. ధర్మరాజును ఆదరించాడు.

వ. భీష్ముం డాభీమాగ్రజుం గూర్చుండం బనిచి, 'శంకింపక న న్నేమి యైన నడుగు' మనిన నమ్మహీపతి మాధవునకుం బ్రణమిల్లి, పారాశర్యప్రభృతి మునివరులకు నభివాదనం బాచరించి, సర్వకౌరవుల యనుమతి వడసి, యప్పితామహున కభిముఖుం డై నమస్కరించి యి ట్లనియె. 157

ప్రతిపదార్థం: భీష్ముండు+ఆ భీమ+అగ్రజున్+కూర్చుండన్+పనిచి= భీష్ముడు ఆ భీముడి అన్న అయిన ధర్మరాజును కూర్చుండగా నియమించి; శంకింపక= సంకోచం లేకుండా; నన్నున్+ఏమి+ఐనన్= నన్ను ఏదయినా; అడుగుము+అనినన్= అడుగు మని చెప్పగా; ఆ+మహీపతి= ఆ ధర్మరాజు; మాధవునకున్+ప్రణమిల్లి= శ్రీకృష్ణుడికి నమస్కరించి; పారాశర్యప్రభృతి= వ్యాసుడు మొదలైన;

మునివరులకున్= ముని శ్రేష్ఠులకు; అభివాదనంబు+ఆచరించి= మ్రొక్కి; సర్వ కౌరవుల+అనుమతి+పడసి= పెద్దవాడైన ధృతరాష్ట్రుడు మొదలుకొని సమస్త కౌరవుల అనుజ్ఞను పొంది; ఆ+పితామహునకున్+అభిముఖుండు+ఐ= ఆ తాత అయిన భీష్ముడికి ఎదురుగా కూర్చుండి, నమస్కరించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు (అడిగాడు).

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజును కూర్చుండ నియమించి 'సంకోచించకుండా ఏ మేమి అడుగదలచావో సమస్తమూ అడుగు' మని చెప్పాడు. ధర్మరాజు శ్రీకృష్ణుడికి నమస్కరించి వ్యాసాది మహామునిశ్రేష్ఠులకు ఏటికోళ్ళు పట్టి, ధృతరాష్ట్రాది సమస్త కౌరవుల ఆజ్ఞతో భీష్ముడికి అభిముఖుడై నమస్కరించి ప్రశ్నించాడు.

విశేషం: అభివాదనం: గోత్ర నామాదులు (ప్రవర) చెప్పి పాదాలు సోకేటట్లుచేసే నమస్కారం. దీనినే ఏటికోళ్ళు అంటారు. పెద్దలను దర్శించినపుడు తనగోత్రనామాలను చెబుతూ పాదాభివందనం చేయటం సంప్రదాయం. అట్లే ధర్మరాజు వ్యాసాది మహర్షులకు అభివాదనం చేశాడు.

చ. 'అరయఁగ రాజధర్మము సమాశ్రయ మై నడపుం త్రివర్గమున్
గురుతర మోక్షధర్మమునకుం దలఁపం దనప్రాప యూఁత భూ
వర! వినుఁ ఘోటకంబునకు వాగెయు, దంతికి నంకుశంబు నే
కరణి నివారకంబులు జగంబుల కట్టుల తాను నెమ్మెయిన్. 158

ప్రతిపదార్థం: భూవర!= భూమికి భర్త అంటే రాజా - ఓ భీష్మా!; వినుఁ= వినుము; అరయఁగన్= పరిశీలించగా; రాజధర్మము= రాజుకు ఉండవసిన ధర్మం; సమ్+ఆశ్రయము+ఐ= చక్కటి ఆధారమై; త్రివర్గమున్= ధర్మం, అర్థం, కామం అనే మూడింటిని; నడపున్= కొనసాగిస్తుంది; తలఁపన్= ఆలోచించగా; గురుతర= మిక్కిలి గొప్పదైన; మోక్షధర్మమునకున్= పురుషార్థాలలో నాలుగవదైన మోక్షధర్మానికి; తన ప్రాప+ఊఁత= తన అండయే ఆశ్రయమూ, ఆధారమున్నూ; ఏ+మెయిన్= ఎట్లాగైనా; ఘోటకంబునకున్= గుర్రానికి; వాగెయున్= గుర్రపు కళ్ళేనికి తగిలించే పగ్గం; దంతికిన్= ఏనుగునకు; అంకుశంబున్= అంకుశం; ఏ కరణిన్= ఏ విధంగా; నివారకంబులు= నిరోధించగలవో; తాను= ఆ రాజధర్మం; జగంబులకున్+అట్టు= ఈ లోకాల కన్నింటికి అదే రీతి (నిరోధం).

తాత్పర్యం: 'ఓ తాతా! ప్రజాపరిపాలనా రూపమైన రాజధర్మమే శ్రేష్ఠమైనది. ఈ జీవలోకాని కెల్ల రాజధర్మమే ఆధారం. ధర్మార్థ కామాలు మూడు రాజధర్మంపై ఆధారపడి ఉన్నాయి. గుర్రానికి పగ్గమూ, ఏనుగుకు అంకుశం వలె లోకాన్ని శాసించేది రాజధర్మమే. ఇందులో సందేహం లేదు.

విశేషం: అలం: నిదర్శన.

క. వ్యాకులతఁ బొంది రూపఱు । లోకస్థితి తొంటిరాజలోకముచే నం
గీకృత మగు ధర్మ మనం । గీకృత మగునేని వీతకిల్బిషచరితా! 159

ప్రతిపదార్థం: వీత కిల్బిష చరితా!= పోయిన పాపాలుగల చరిత్ర గలవాడా!, ఓ పవిత్రమైన చరిత్ర గల భీష్మా!; తొంటి= పూర్వపు; రాజలోకముచేన్= రాజసమూహాలచేత; అంగీకృతము+అగు= అంగీకరించబడినదైన; ధర్మము= ధర్మం; అనంగీకృతము+అగున్+ఏని= స్వీకరించి తదుచితంగా పరిపాలన సాగించక పోయినట్లైతే; లోకస్థితి= ఈ లోకపు పరిస్థితి; వ్యాకులతన్+పొంది= కలత చెంది; రూపఱున్= నాశనమైపోతుంది.

తాత్పర్యం: ఓ పరిశుద్ధ చరిత్రుడవైన తాతా! పూర్వ రాజులు అంగీకరించిన రాజధర్మాన్ని పాటించకపోతే ఈ లోకపు పరిస్థితి కలత చెంది నాశనమై పోతుంది.

క. తరణి వొడిచి తమము సెఱుచు । కరణిని లోకమునఁ గలుగు కల్మష మెల్లన్
ధరణిపతి ధర్మ మాత్మ । స్ఫురణంబునఁ జెఱుచు విమలబోధనచరితా! 160

ప్రతిపదార్థం: విమల బోధన చరితా!= నిర్మల జ్ఞాన చరిత్రుడా, ఓ తాతా!; తరణి+పొడిచి= సూర్యుడు ఉదయించి; తమము+చెఱుచు కరణిని= చీకటిని పోగొట్టేటట్లు; ధర్మము+ఆత్మ స్ఫురణంబునన్= ధర్మం మనస్సులో కలగగానే; ధరణిపతి= రాజు; లోకమునన్+కలుగు= ఈ లోకంలో ఉన్నట్టి; కల్మషము+ఎల్లన్= పాపమంతటినీ; చెఱుచున్= తొలగిస్తాడు, పోగొట్టుతాడు.

తాత్పర్యం: ఓ పితామహా! సూర్యోదయంతో చీకటి తొలగిపోయేటట్లు లోకంలోని పాపాలన్నీ రాజధర్మంచేతనే నాశనమౌతాయి.

విశేషం: అలం: ఉపమ. శ్లో॥ **"ఉదయన్ హి యథా సూర్యో నాశయ త్యశుభం తమః**
రాజ ధర్మ స్తథా లోక్యా మాక్షిప త్యశుభాం గతిమ్"

అనే సంస్కృత మూల శ్లోకానికి తిక్కన అనువాదం పై పద్యం. దీనికి ఆధారంగా ఉన్న స్మృతిని నీలకంఠీయం ఉదాహరించింది.

"రాజభిః కృతదండాస్తు శుద్ధ్యంతి మలినా జనాః
కృతార్ధాశ్చ తతో యాంతి స్వర్గం సుకృతినో యథా॥

ఆ. అనఘ! నీదు బుద్ధి యతిలోక మగుటయుఁ । దెలిసికొనఁగ నాకు వలయునట్టి
ధర్మకోటి నీవ తగఁ జెప్ప వినవల । యుటయుఁ జెప్పె నంబుజోదరుండు. 161

ప్రతిపదార్థం: అనఘ!= పాప రహితుడవైన ఓ తాతా!; నీదు బుద్ధి= నీ బుద్ధి; అతిలోకము+అగుటయున్= లోకాతీతం- అసామాన్యం అంటే మానవులకు ఎవ్వరికీ లేని వైశిష్ట్యాన్ని కలిగి ఉండటం చేత; నాకున్; తెలిసికొనఁగన్= తెలిసికొనటానికి; వలయునట్టి= అవసరమైన; ధర్మకోటి= ధర్మాల సమూహం; నీవ= నీవే; తగన్+చెప్పన్= తగిన రీతిగా చెప్పగా; వినవలయుటయున్= నేను వినవలసింది గాను; అంబుజ+ఉదరుండు= పద్మం నాభియందు గలవాడైన ఆ శ్రీకృష్ణుడు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'నిర్మలుడవైన ఓ తాతా! నీవు లోకాతీతమైన బుద్ధిసంపన్నుడ వనీ, నేను తెలిసికొనదగిన రాజధర్మాలు నీవు చెప్పగా నేను గ్రహించాలనీ ఆ శ్రీకృష్ణుడి నిర్ణయం. కాబట్టి సమస్త రాజధర్మాలను వివరించుమని ప్రార్థిస్తున్నాను.

విశేషం: .సమస్త రాజ ధర్మాలను అతిలోకజ్ఞుడైన భీష్ముడు ఒక్కడే చెప్పటానికి అర్హుడని విదితం.

ఆ. ధర్మవిదులు రాజు ధర్మ స్వరూపుఁగాఁ । జెప్ప విందుఁ దద్విశేషవృత్తి
భరముగాఁ దలంతు నరవర! చెప్పవే । మున్ను రాజ ధర్మముల తెఱంగు.' 162

ప్రతిపదార్థం: నరవర!= రాజశ్రేష్ఠుడవైన ఓ పితామహా!; రాజు ధర్మస్వరూపున్+కాన్= సమస్త ధర్మమే రాజుగా రూపం ఎత్తినట్లు; ధర్మవిదులు= ధర్మ స్వరూపాన్ని తెలిసిన వేత్తలు; చెప్పన్= తెలుపగా; విందున్= విన్నాను; తద్+విశేష వృత్తి= ఆ విశిష్ట మార్గం

-అంటే ఆ రాజ ధర్మమార్గం; భరముగాన్= బరువైన దానిగా అంటే ఆ రాజ ధర్మ నిర్వహణం కష్టతరమని; తలంతున్= భావిస్తున్నాను; మున్ను= ముందుగా; రాజధర్మముల= రాజు అనుసరించదగిన ధర్మాల యొక్క; తెఱంగు= విధానాన్ని; చెప్పవే= వివరించుము.

తాత్పర్యం: ఓ తాతా! రాజు ధర్మ స్వరూపు డని ధర్మవేత్తలు చెప్పగా విన్నాను. కానీ, ఆ రాజ ధర్మ నిర్వహణం అతికష్ట సాధ్యమని భావిస్తాను. కాబట్టి అటువంటి రాజ ధర్మరీతులను ముందుగా వివరించ గోరుతున్నాను.

చ. అనుటయు నాపగేయుఁడు మహత్త్వ సమంచిత మైన ధర్మము
న్వినుత విధాతృభావ మహనీయుఁడు కృష్ణుని, వేదమూర్తి నాఁ
జను ధరణీసురావలిఁ బ్రసక్తిఁ దలంచి నమస్కరించి, య
జ్జనపతి వక్త్ర మాదర రసప్లుత దృష్టిని జూచి యిట్లనున్. 163

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధర్మరాజు ప్రార్థించగా; ఆపగేయుఁడు= గంగాపుత్రుడైన భీష్ముడు; మహత్త్వ సమంచితము+ఐన= మహిమతో కూడుకొన్న; ధర్మమున్= ధర్మాన్ని; వినుత= ప్రస్తుతి కొన్న; విధాతృభావ మహనీయుఁడు= బ్రహ్మభావన చేత మహాత్ముడైన; కృష్ణునిన్= శ్రీకృష్ణుడిని; వేదమూర్తి నాన్+చను= వేదాల స్వరూపమో అనేటట్లు ఒప్పుతూ ఉన్న; ధరణీసుర+ఆవలిన్= భూదేవుల అంటే బ్రాహ్మణుల యొక్క సమూహాన్ని; ప్రసక్తిన్+తలంచి= ప్రస్తావ వశాన భావించి; నమస్కరించి; ఆ+జనపతి వక్త్రము= ఆ ధర్మరాజు ముఖాన్ని; ఆదర రసప్లుత దృష్టిని+చూచి= ఆదరమనే రసం స్రవించే చూపుతో చూచి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: రాజధర్మాలను తెలుపు మని ధర్మరాజు కోరగా భీష్ముడు మహిమాన్వితమైన ధర్మాన్ని, బ్రహ్మకల్ప స్వరూపుడైన శ్రీకృష్ణుడిని, వేదాలే రూపు దాల్చిన బ్రాహ్మణసమూహాన్ని స్మరించి, నమస్కరించి, ఆదర రసప్రవాహ దృష్టితో ధర్మరాజు ముఖాన్ని అవలోకించి ఇట్లా చెప్పాడు.

విశేషం: ధర్మం ప్రధానమైంది. దాని సవిస్తర ప్రశంస భీష్ముడు చేయబోతున్నాడు. కనుక మొదట ధర్మాన్ని స్మరించాడు. ఆ వెనుక ఆ సమస్త ధర్మానికి మూలమైన శ్రీకృష్ణుడిని, ఆ తరువాత వేదమూర్తులైన బ్రాహ్మణులను భీష్ముడు తలంచి, నమస్కరించటంలో ఔచిత్యమున్నది.

"నమో ధర్మాయ మహతే నమః కృష్ణాయ వేధసే ।
బ్రాహ్మణేభ్యో నమస్కృత్య ధర్మాన్ వక్ష్యామి శాశ్వతాన్" ॥

అని మూలం. ఇందులో తిక్కన ఆయా విశేషణాలతో 'అజ్జనపతి వక్త్రమాదర రసప్లుత దృష్టిని జూచి' అని కల్పించాడు. దీనివలన భీష్మునికి ధర్మజునిపై గల ప్రేమాదరాలు విదితమవుతాయి.

క. 'నృపధర్మము లన్నియు నీ । కుపదేశించెద విసంశయోక్తుల; మఱియున్
విపులఫలవంత మగు ధ । ర్మపథంబును నడుగునెడఁ గరము వివరింతున్. 164

ప్రతిపదార్థం: నీకు, నృప ధర్మములు+అన్నియున్= నీకు రాజ ధర్మాలన్నింటిని; విసంశయ+ఉక్తులన్= సందేహం లేనట్టి మాటలతో; ఉపదేశించెదన్= బోధిస్తాను; మఱియున్= ఇంకా; విపుల ఫలవంతము+అగు= విస్తారమైన ప్రయోజనకారిఅయిన; ధర్మపథంబునున్= (రాజధర్మంతోపాటు ఆపద్ధర్మం, మోక్షధర్మం మొదలైన) సమస్త ధర్మమార్గాలను; అడుగు+ఎడన్= (నీవు ఆయా సందర్భాలలో) అడిగేటప్పుడు; కరమున్= మిక్కిలిగా; వివరింతున్= విస్పష్టం చేస్తాను.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజ ధర్మాలన్నింటిని ఏ విధమైన సందేహమూ లేని వాక్యాలతో విస్పష్టంగా వివరిస్తాను. అంతేగాక ఆయా సందర్భాలలో నీవు అడిగిన ఎంతో ఫలవంతమైన ఆపద్ధర్మ, మోక్షధర్మాదులను అత్యంత ప్రయోజనాత్మకంగా తెలుపుతాను.

వ. అవహితమతివై యాకర్ణింపుము. 165

ప్రతిపదార్థం: అవహిత మతివి+ఐ= అవధాన చిత్తుండవై (ఏకాగ్రచిత్తంతో); ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: కాబట్టి ఏ విధమైన వైకల్యమూ లేని ఏకాగ్రచిత్తుడవై వినుము.

ఆ. మేలు దనకుఁ గోరు మేదినీశుఁడు మున్ను । దేవతలకు భూమిదేవతలకుఁ
బూజ యాచరించు నోజ యత్నముఁ జేయ । వలయు రెండు గార్యఫలకరములు. 166

ప్రతిపదార్థం: తనకున్ మేలు+కోరు= తనకు శుభాన్ని కోరుకొనే; మేదినీ+ఈశుఁడు= భూమికి భర్త అయిన రాజు; మున్ను= ముందు; దేవతలకున్= దేవతలకును; భూమిదేవతలకున్= భూమిపై దేవతలైన బ్రాహ్మణులకు; ఓజన్= క్రమంగా; పూజ+ఆచరించు= పూజచేయటానికి; యత్నమున్+చేయవలయున్= ప్రయత్నించవలసి ఉన్నది; రెండున్= దైవతపురుషకారాలు రెండూ; కార్యఫల కరములు= (తలచిన) కార్యసాధనకు ప్రయోజన కారులు.

తాత్పర్యం: తనకు శుభం కలగాలని కోరుకొనే రాజు, మొట్టమొదట దేవతలకు, భూదేవతలకు పూజచేయవలసిన ఆవశ్యకత ఎంతేని ఉన్నది. దానిని విస్మరించక ప్రయత్నించాలి. దేవతల అనుగ్రహం, పురుషప్రయత్నం రెండూ రాజుకు కార్యసాధనకు ప్రయోజనకారణా లని గుర్తించాలి.

మ. వినుము ద్యోగము రెంటి యందుఁ బర ముర్వీనాథ! యుద్యోగవం
తునకున్ దైవము దోడ్పడంగ ఫలసిద్ధుల్ సేకుఱున్; మానుషం
బున కొక్కొక్కెడ సిద్ధి దప్పిన వగల్ పొందంగరానీక య
ప్పని దైవోపహతంబుగాఁ గనుట భూపాలార్హవృత్తంబగున్. 167

ప్రతిపదార్థం: ఉర్వీనాథ!= భూభర్త అయిన ఓ ధర్మరాజా! వినుము= ఆలకించుము; ఉద్యోగము= మానవప్రయత్నం; రెంటియందున్+పరము= దైవత పురుష కారాల రెంటిలోనూ శ్రేష్ఠమైనది; ఉద్యోగవంతునకున్= ప్రయత్నం చేసే రాజునకు; దైవము+తోడ్పడంగన్= భగవంతుడు సహాయంచేయటం వలన; ఫలసిద్ధుల్+చేకుఱున్= ప్రయోజనమూ; కోరిక లీడేరటం, సమకూరుతాయి; మానుషంబునకున్+ఒక్క+ఒక్క+ఎడన్= మానవ ప్రయత్నానికి ఒక్కొక్క సందర్భంలో; సిద్ధి+తప్పినన్ సిద్ధించక తప్పిపోతే; వగల్+పొందంగన్+రానీక= దుఃఖం పొందనీకుండ; ఆ+పని= కార్యం సిద్ధించకపోయిన ఆ కార్యం; దైవ+ఉపహతంబుగాన్+కనుట= భగవంతుడిచేత నాశనం చేయబడ్డ దానిగా తెలిసికొనటం; భూపాల+అర్హవృత్తంబు+అగున్= రాజులకు ఉచితమైన వర్తనమవుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! దైవత పురుష కారాలలో మానవప్రయత్నం శ్రేష్ఠమైనది. మానవప్రయత్నం మానక చేసే రాజుకు భగవంతుడు సహాయపడతాడు. అప్పుడు రాజుకు ఫలసిద్ధులు చేకూరుతాయి. కొన్ని సందర్భాలలో మానవప్రయత్నం ఫలించకపోవటమూ జరుగవచ్చును. అటువంటి సమయంలో దుఃఖించక, దైవోపహతంగా భావించటం సముచితరాజధర్మం.

విశేషం: దైవానుగ్రహమూ, మానవ ప్రయత్నమూ - ఈ రెంటిలో మానవ ప్రయత్నమే శ్రేష్ఠమైనది. అట్లా ప్రయత్నించే మానవుడికి ఫలసిద్ధులు చేకూరుతాయి. కొన్ని సందర్భాలలో ఫలించకపోతే అందుకు కారణం మానవ ప్రయత్న లోపం కాక భగవంతుడే కారణ మని భావించటం రాజధర్మ మని భీష్ముడి వివరణలోని సారాంశం.

క. దాంతియు విజితాత్మత్వము । శాంతియు శీలంబుఁగలుగు జగతీశుఁడ శ్రీ
మంతుండు యశస్వియు నై । యెంతయు సౌఖ్యంబు నొందు నిభపురనాథా! 168

ప్రతిపదార్థం: ఇభపుర నాథా!= హస్తినాపురానికి అధిపతి వయిన ఓ ధర్మరాజా!; శాంతియున్= ఇంద్రియ నిగ్రహమూ; విజిత+ఆత్మత్వమున్= జయించబడిన ఆత్మత్వాన్ని కలిగి ఉండటం; శాంతియున్= కామక్రోధాది రాహిత్యమూ; శీలంబున్+కలుగు= మంచి నడత కలిగినట్టి; జగతీ+ఈశుఁడు= జగత్తునకు అధిపతి అయిన రాజే; శ్రీమంతుండున్= సంపదగలవాడూ; యశస్వియున్+ఐ= కీర్తిమంతుడూ అయి; ఎంతయున్= మిక్కిలి; సౌఖ్యంబున్+ఒందున్= సుఖాలను పొందగలడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఇంద్రియ నిగ్రహమైన దాంతీ, ఆత్మజయమూ, మనోనిగ్రహమైన అంటే కామక్రోధాది రహితమైన శాంతీ, మంచి నడత కలిగినట్టి రాజు మాత్రమే శ్రీమంతుడూ, కీర్తిమంతుడూ అయి సమస్త సౌఖ్యాలను పొందగలడు'.

తే. ప్రకృతు లేడింటి నెఱి నడపంగ వలయు; । దాని కార్జవ సత్యముల్ దావలములు;
దండనీతి విధాన మంతటికి రక్ష; । యర్ఘ్యమగు మెల్పుతోఁ జేయ నది వెలుంగు. 169

ప్రతిపదార్థం: ప్రకృతులు+ఏడింటిన్= ప్రకృతులు - స్వామి, అమాత్యుడు, సుహృత్తు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం - అనే ఏడింటిని; నెఱిన్= క్రమంగా (న్యాయంగా); నడపంగన్+వలయున్= నడిపించవలసి ఉన్నది; దానికిన్+ఆర్జవ సత్యముల్= ((ప్రకృతు లేడింటిని క్రమంగా నడపటానికి) ఋజుభావం, సత్య మనేవి; తావలములు= ఆధారాలు (మూలాలు); అంతటికిన్= ఈ పై పేర్కొన్న సర్వస్వానికి; దండనీతి విధానము= కామందకాద్యర్థశాస్త్రపద్ధతి; రక్ష= సంరక్షకమైనది; అది; అర్ఘ్యము+అగు= తగినట్టి; మెల్పుతోన్+చేయన్= జాగరూకతతో (నేర్పుతో) చేస్తే; వెలుంగున్= ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: స్వామి, అమాత్యుడు, సుహృత్తు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం అనే ఏడు ప్రకృతులను రాజు గుర్తించి, సక్రమంగా నిర్వహించవలసి ఉన్నది. ఆ నిర్వహణకు రాజులో ఋజుభావమూ, సత్యమూ, ఆధార భూతమై ఉండాలి. దీనికి అంతటికి కామందకాదులు చెప్పిన అర్థశాస్త్ర ప్రకారం రాజుకు దండనీతి రక్ష. దానిని నేర్పుతో నిర్వహిస్తే విశిష్టంగా ప్రకాశించగలడు.

విశేషం: రాజుకు ఆర్జవ సత్యాలు ముఖ్యం. కామందకుడనే ముని ఆంగరిష్ముడనే రాజుకు తెలిపిన దండనీతిని తెలిసికొని ఉండవలసి ఉన్నది. జాగరూకుడైన రాజు కావించే తన్నిర్వహణంతో రాజనీతి విశిష్ట మవుతుం దని భీష్ముడి మాటల సారాంశం.

వ. అదియును బుద్ధిమంతులు బ్రాహ్మణులవలనం బ్రయోగింప; రయ్యర్థంబునకు మనువాక్యంబులు గల; వాకర్ణింపుము. 170

ప్రతిపదార్థం: అదియును= దానితోపాటు; బుద్ధిమంతులు= నేర్పరులు; బ్రాహ్మణుల వలనన్+ప్రయోగింపరు= బ్రాహ్మణుల పట్ల కొనసాగించరు; ఆ+అర్థంబునకున్= ఆ విషయానికి; మను వాక్యంబులు+కలవు= మనువు చెప్పిన నీతి వాక్యాలు ఉన్నాయి; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: పై రాజధర్మానుగుణులైన రాజులు నేర్పరులైతే బ్రాహ్మణుల విషయంలో దీన్ని కొనసాగించరు. ఈ అర్థాన్ని వివరించే మనువు చెప్పిన వాక్యాలను వినుము.

ఆ. ఇనుము ఱాత, నీర నినలంబు, విప్రుల । వలన రాజు, లుద్భవంబుఁ బొందు
టిది నిజంబు; తత్సమిద్ధ తేజము లెందుఁ । జెల్లుఁ బుట్టినెడలఁ జేటు నొందు. 171

ప్రతిపదార్థం: ఱాతన్= రాతివలన; ఇనుమున్= ఇనుమూ; నీరన్= నీటితో; అనలంబున్= అగ్నీ; విప్రుల వలనన్= బ్రాహ్మణులవలన; రాజులు= రాజులును; ఉద్భవంబున్+పొందుట+ఇది నిజంబు= జన్మించటమనేది వాస్తవం; తద్+సమ్+ఇద్ధతేజంబులు= వాటియొక్క పరిశుద్ధమైన కాంతులు; ఎందున్+చెల్లున్= ఎక్కడైనా ప్రకాశించగలవు; పుట్టిన+ఎడలన్+చేటున్+ఒందున్= కానీ జన్మస్థానాలలో నాశనమవుతాయి.

తాత్పర్యం: రాతివలన ఇనుమూ, నీటివలన అగ్ని, బ్రాహ్మణులవలన రాజులు జన్మించటం నిజమే. వాటి పరిశుద్ధ కాంతులు అన్నిచోట్ల ప్రకాశిస్తాయి. కాని, జన్మస్థానాలలో మాత్రం ప్రవర్తించవు.

విశేషం: ఒకచోట పుట్టి ఇతరత్రా విశిష్టంగా వెలుగవచ్చును. కాని, తమ జన్మస్థానంలో వాటి శక్తి ఉపకరించదు. దీని వివరణ తరువాతి పద్యంలో ఉన్నది.

క. శిలఁ ద్రెంపఁబోయి యినుమును । జలములు గొని కాల్పఁగడఁగి చని యనలంబుం
బొలియును; రాజును విప్రుల । కలిగి చెఱుపఁబోయి తాన యనయంబుఁ జెడున్. 172

ప్రతిపదార్థం: శిలన్+త్రెంపన్+పోయి= రాతిని ఖండింపబోయి; ఇనుమును= ఇనుమూ; జలములు+కొని= నీటిని గ్రహించి; కాల్పన్+కఁడగి చని= కాల్చివేయ ప్రయత్నించబోయి; పాలియును= అవే నశించిపోతాయి; రాజును= రాజూ; విప్రులకున్+అలిగి= బ్రాహ్మణులపై కోపగించి; చెఱుపన్+పోయి= నాశనంచేయ ప్రయత్నించి; అనయంబున్= ఎప్పుడైనా; తాన= తానే; చెడున్= నాశనమవుతాడు.

తాత్పర్యం: రాతిలోనుండి పుట్టిన ఇనుము రాతిని ఖండించబోయి తానే పాడవుతుంది. నీట పుట్టిన నిప్పు ఆ నీటిని గ్రహించి కాల్చబోయి తానే నశిస్తుంది. అదే రీతిగా బ్రాహ్మణులను నాశనం చేయదలిస్తే రాజే నశిస్తాడు.

విశేషం: ఈ న్యాయాన్ని అనుసరించి మూలచ్ఛేదం చేయబోతే ఆ చేయప్రయత్నించిన వారే నశిస్తారు. ముఖ్యంగా రాజు కిది చక్కటి నిరూపణ.

శా. ఈ వాక్యంబులు రెండుఁ జిత్తమున నీ వెల్లప్పుడున్ నిల్పి భూ
దేవశ్రేణియెడం గృపాన్వితుఁడవై దీప్తార్హదండంబు స
ద్భావం బొప్పఁగ నొండెడన్ నడపు శాంతక్ష్మాసురోదార జి
హ్వా విశ్రాంతము బ్రహ్మ మట్లగుట దైవం బండ్రు విప్రున్ బుధుల్. 173

ప్రతిపదార్థం: ఈవు+ఎల్లప్పుడున్= నీవు అన్ని సమయాలలోను; ఈ వాక్యంబులు రెండున్= పైని పేర్కొన్న న్యాయాలను రెండింటిని; చిత్తమునన్+నిల్పి= నీ మనస్సులో ఉంచుకొని; భూదేవ శ్రేణి యెడన్= బ్రాహ్మణులయొక్క సమూహం పట్ల; కృపా+అన్వితుఁడవు+ఐ= దయ కలవాడవై; దీప్త+అర్హదండంబున్= ప్రకాశిస్తూ అర్హమైన (తగిన) రాజదండమూ; సద్భావంబు+ఒప్పఁగన్= సాధు భావం ఒప్పునట్లుగా; ఒండు+ఎడన్+నడపు= మరొకచోట ప్రవర్తింప చేయవలసింది; బ్రహ్మము= వేదము; శాంత= శాంతగుణ శీలురైన; క్ష్మాసుర= భూదేవతలు బ్రాహ్మణులయొక్క; ఉదార జిహ్వా= గొప్పదైన నాలుకపై; విశ్రాంతము= విశ్రమిస్తూ ఉంటుంది; అట్లు+అగుటన్= అలా ఉండటం చేత; బుధుల్= విద్వాంసులు; విప్రున్= బ్రాహ్మణుడిని; దైవంబు అండ్రు= దేవత అంటారు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! పైన పేర్కొన్నరెండు న్యాయాలను మనస్సులో ఉంచుకొని బ్రాహ్మణుల పట్ల దయాంతఃకరణుడవై ఉండుము. సద్భావంతో అర్హమైన రాజదండమును, ఇతరులపట్ల ప్రవర్తింపజేయుము. శాంత స్వరూపులైన బ్రాహ్మణుల నాల్కలపై వేదాలు ఉంటాయి. కనుకనే విద్వాంసులు బ్రాహ్మణులను దేవతలుగా పేర్కొన్నారు.

వ. విప్రుని దండించు నెడలునుం గలవు; శుక్రుండును జెప్పినవాఁడు; వినుము. 174

ప్రతిపదార్థం: విప్రునిన్= బ్రాహ్మణుడిని; దండించు= శిక్షించే; ఎడలునున్+కలవు= అవకాశాలూ ఉన్నాయి. శుక్రుండునున్+చెప్పిన వాఁడు= శుక్రాచార్యుడు కూడా వివరించాడు; వినుము.

తాత్పర్యం: బ్రాహ్మణులను శిక్షించే పట్టులూ ఉన్నాయి. అట్లాంటి సందర్భాలను శుక్రాచార్యుడు వివరించాడు. చెప్పుతాను వినుము.

భీష్ముఁడు ధర్మరాజునకు విప్రులలో దండార్హుల నిరూపించుట (సం. 12-56-29)

క. శాంతుఁడు గా కని నాయుధ । వంతుం డై కవియు విప్రు వసుధేశుఁడు వే
దాంతి నయిన హింసించుట । యెంతయు ధర్మంబు; శ్రుతులు నిట్లని చెప్పున్. 175

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధంలో; ఆయుధ వంతుండు+ఐ= శస్త్రాస్త్రాలు ధరించి; శాంతుఁడు+కాక= శాంతం లేక; కవియు= ఎదుర్కొనే; వేదాంతిన్+అయినన్= వేదాంతినైనా; విప్రున్= బ్రాహ్మణుడిని; వసుధా+ఈశుఁడు= భూభర్త అయిన రాజు; హింసించుట= సంహరించటం; ఎంతయున్+ధర్మంబు= మిక్కిలి ధర్మం; ఇట్లు+అని= ఇదే ధర్మమని; శ్రుతులు చెప్పున్= వేదాలు చెప్పుతాయి.

తాత్పర్యం: యుద్ధంలో శస్త్రాస్త్రాలు ధరించి కోపోద్రిక్తుడై ఎదుర్కొనే బ్రాహ్మణుడు వేదాంతి అయినప్పటికీ అతడిని సంహరించటం రాజుకు పరమధర్మమని వేదాలు చెబుతున్నాయి.

క. గురుతల్పగు, భ్రూణహనున్, । నరేంద్ర విద్వేషి, బ్రాహ్మణఘ్ననిఁ బెలుచన్
ధరణి వెడల నడువ వలయు; । శరీర నిగ్రహము సేయఁ జన దెయ్యెడలన్. 176

ప్రతిపదార్థం: గురుతల్పగున్= గురు భార్యాగతుడయ్యే వాడిని; భ్రూణహనున్= శిశుహంతను; నర+ఇంద్ర విద్వేషిన్= రాజును ద్వేషించే వాడిని; బ్రాహ్మణఘ్ననిన్= బ్రాహ్మణులను సంహరించే వాడిని; పెలుచన్= కఠినంగా; ధరణి వెడలన్+నడువ వలయున్= తన రాజ్యం నుండి వెడలగొట్టవలసి ఉన్నది; ఏ+ఎడలన్= ఎట్లాంటి పరిస్థితిలో అయినా; శరీర నిగ్రహము+చేయన్+చనదు= శరీరాన్ని నాశనం చేయరాదు.

తాత్పర్యం: గురుతల్పగుడూ, శిశుహంతా, రాజద్వేషీ, బ్రాహ్మణహంతా అయిన బ్రాహ్మణుడిని రాజు తన రాజ్యం నుండి బహిష్కరించాలి. అంతేగాని అట్లాంటి వారిని వధించరాదు.

వ. దుర్గంబు లనేక విధంబులు గలవు; వానియందు నర దుర్గంబు వరిష్ఠంబు గావున వర్ణంబులు నాలిగింటి మీఁదను మేదినీశ్వరుండు దయ గలుగవలయుఁ; గేవల క్షమావంతుం డగుటకు సాదుటేనుంగు చందంబై యుండు; నివ్విషయంబున బృహస్పతి వచనంబులు గలవు; తదీయార్థంబులు వివరించెద. 177

ప్రతిపదార్థం: దుర్గంబులు+అనేక విధంబులు+కలవు= కోటలు అనేక పద్ధతులలో - ఆరువిధాలుగా ఉన్నాయి; వానియందున్= ఆ ఆరురకాల దుర్గాలలో; నరదుర్గంబు= చుట్టూ చతురంగ బలాలు గల కోట; వరిష్ఠంబు= మిక్కిలి శ్రేష్ఠమైనది; కావునన్= అందుచేత;

వర్ణంబులు నాలిగింటి మీఁదను= బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాల మీదా; మేదినీ+ఈశ్వరుండు= భూమి భర్త అయిన రాజు; దయ+కలుగ వలయున్= దయ కలిగి ఉండాలి; కేవల క్షమావంతుండు+అగుటకున్= కేవలం క్షమాగుణం కలిగి ఉండటం; సాదు+టు+ఏనుగు చందంబు+ఐ+ఉండున్= సాధువైన ఏనుగువలె ఉన్నట్లవుతుంది; ఈ+విషయంబునన్= ఈ వివరణకు; బృహస్పతి వచనంబులు+కలవు= బృహస్పతి వాక్యాలు ఉన్నాయి; తదీయ+అర్థంబులు= ఆ బృహస్పతి వచనాలకు అర్థాలను; వివరించెదన్= వివరిస్తాను.

తాత్పర్యం: దుర్గాలు పలు రీతులు. వాటిలో నరదుర్గం శ్రేష్ఠమైనది. అందువలన రాజు నాలుగు వర్ణాల ప్రజల మీదను దయాహృదయుడై ఉండటం అవసరం. అయితే రాజు కేవలం దయావంతు డైతే మాత్రం ఏనుగు సాధువై ఉన్నట్లే. ఈ వివరణకు తగిన బృహస్పతి వచనాలు ఉన్నాయి. ఆ వాక్యాలను వివరిస్తాను.

విశేషం: దుర్గంకోట - ఆరు రకాలు: ధన్వదుర్గం (నలుప్రక్కలా అయిదామడల మరుభూమిగల కోట), మహీదుర్గం (చుట్టూ మట్టి దిబ్బలు గల కోట), వార్క్షదుర్గం (చుట్టూ వృక్షాలుగల కోట), నరదుర్గం (చుట్టూ చతురంగ బలాలుగల కోట), జలదుర్గం (చుట్టూ నీరుగల కోట), గిరి దుర్గం (చుట్టూ కొండలు గల కోట).

సీ. మేదినీపతి యతిమృదువైన, మావంతుఁ । డేనుంగు నెట్లట్ల యెక్కి యాడఁ
జూచుఁ దేఁకువ సెడి నీచపుఁ బ్రజ:క్రూరుఁ । డగునేని లోకంబు బెగడు గుడుచుఁ
గాన వసంతంబుభానుని చాడ్పునఁ । దగియెడు పాటితో ధరణి ప్రజల
నుచితవర్తనముల నొందించునది; యిది । రాజ ధర్మములకు రాజు సుమ్ము;

ఆ. కౌరవేంద్ర! యదియుఁ గాక దండము పరీ । క్షా విశుద్ధి పూర్వకముగ వలయుఁ
దనతలంపు వెంటఁ దమకించి ప్రజకు నొ । వ్వుగఁ జరించుటయును దగదు పతికి. 178

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= కురువంశ రాజశ్రేష్ఠుడైన ఓ ధర్మరాజా!; మేదినీపతి= పుడమికి అధిపతి అయిన రాజు; అతి మృదువు+ఐనన్= మిక్కిలి మెత్తని వాడైతే; నీచము+ప్రజ= అధములైన ప్రజలు; తేఁకువ+చెడి= భయంలేక; మావంతుండు+ఏనుంగున్+ఎట్లు+అట్లు+ఎక్కి+ఆడన్+చూచున్= మావటీడు ఏనుగుపైకి ఏ విధంగా అయితే ఎక్కి ఆడతాడో అట్లాగే ఆడటానికి ప్రయత్నిస్తాడు; క్రూరుఁడు+అగున్+ఏని= (రాజు) భయంకరుడైతే; లోకంబు= ఈ జగత్తు; బెగడు+కుడుచున్= భయపడుతుంది కానన్= అందుచేత; వసంతంబు భానుని చాడ్పునన్= వసంత ఋతువులోని సూర్యుడివలె; తగియెడు పాటితోన్= అవసరమైనంత మోతాదుతో; ధరణి ప్రజలన్= పౌరులను; ఉచిత వర్తనములన్+ఒందించునది= తగిన నడవడికలతో పాలించవలసింది; ఇది= ఈ పద్ధతి; రాజ ధర్మములకున్= రాజు ఆచరించవలసిన ధర్మాలకు; రాజు సుమ్ము!= శ్రేష్ఠమైనది సుమా!; అదియున్+కాక= అంతేకాక; దండము= చతురుపాయాలైన సామ దాన భేద దండోపాయాలలో చివరిదైన దండోపాయం; పరీక్షా విశుద్ధి పూర్వకముగన్ వలయున్= బహు జాగరూకతతో పరిశీలించాకే చేయవలసింది; పతికిన్= రాజునకు; తన తలంపు వెంటన్= తనకు తోచిన వెంటనే; తమకించి= త్వరపడి, వేగిరపడి; ప్రజకు నొవ్వుగన్= ప్రజలకు బాధాకరంగా; చరించుటయును+తగదు= నడుచుకొనటం కూడా సముచితం కాదు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! వినుము. శాంతపరు డైన రాజు కోపరహితమైన ఏనుగువలె నీచులకు వశమవుతాడు. అట్లాంటి ఏనుగును మావటీడు తన ఇష్టానుసారం ఆడించునట్లే శాంతపరుడైన రాజును నీచప్రజలు ఆడిస్తారు. రాజు కోపస్వభావుడైతే ప్రజలు భయపడి పారిపోతారు. కాన, రాజు వసంత ఋతువులో సూర్యుడివలె సమభావంతో ప్రజలను పాలించవలసి ఉన్నది. ఇది రాజునకు ఉండవలసిన రాజధర్మాలలో అతిశ్రేష్ఠమైన ధర్మం. ప్రజల ఉపకారాపకారాది గుణాలవలన వ్యక్తమయ్యే శీలవృత్తులను బట్టి బహుజాగరూకతతో పరిశీలించి పరిపాలించవలసి ఉన్నది. తన కోపాన్ని ప్రజలపై రుద్దకుండా, వేగిరపాటు లేక ప్రజలకు బాధ కలిగించని రీతిలో రాజు నడుచుకొనవలసి ఉన్నది.

విశేషం: అలం: ఉపమ. మూలంలోని ఆరుశ్లోకాల కీ పద్యం తిక్కన అనువాదం. మూలసార మిందులో నిక్షిప్తం. మూలంలోని "క్షమావాన్" పదానికి మృదువనీ; 'తీక్ష్ణః' శబ్దానికి క్రూరుడైన అనీ తిక్కన ప్రయోగాలు. 'ప్రత్యక్షేణానుమానేన'.... పరీక్ష్య' అనే మాటల అర్థాన్ని తిక్కన 'పరీక్షా విశుద్ధి పూర్వకముగనే' అని ప్రయోగించాడు. 'వాసంతార్క ఇవ' . . . న శీతో నచఘర్మదః' మాటలకు 'వసంతంబు భానుని చాడ్పున దగియెడు పాటితో' అని తిక్కన అనువాదం. 'ఇది రాజధర్మములకు రాజు సుమ్ము' అనే తిక్కన మాట సామెత ఆమెతవలె ఉన్నది. రాజును ఏనుగుతోను, ప్రజలను మావటితోను పోల్చటమూ, ఏనుగునుబట్టి మావటివలె రాజునుబట్టి ప్రజలు ఉంటారని చక్కగా వివరించబడింది.

క. వినుఁ గర్భిణి ప్రజ బ్రదుకున । కనురూపము లైన యట్టి యాహారంబుల్
గొనుగతిఁ బతి ధరణీ ప్రజ । మనికికిఁ దగ నడచునది తమకి గా కెపుడున్. 179

ప్రతిపదార్థం: వినుఁ= ఓ ధర్మరాజా! ఇంకా వినుము; ఎపుడున్= ఎల్లప్పుడు; తమకి గాక= తమకం (తొందర) పడేవాడు కాక; గర్భిణి= కడుపుతో ఉన్న స్త్రీ; ప్రజ బ్రదుకునకున్= కడుపులో పెరుగుతున్న శిశుపోషణకు; అనురూపములు+ఐన+అట్టి= తగినట్టి; ఆహారంబుల్+కొనుగతిన్= ఆహార పదార్థాలు తినే పద్ధతిలోనే; పతి= రాజు; ధరణీ ప్రజ= పౌరులయొక్క; మనికికిన్+తగన్ నడచునది= మనుగడకు తగినట్లు వర్తించాలి.

తాత్పర్యం: గర్భం ధరించిన స్త్రీ తన సంతానం క్రమంగా పెరగటానికై తగిన పథ్యాహార విహారాదులను ఆచరించినట్లే రాజుసైతం తొందరపడక తన ప్రజలకు క్షేమకరమైన రీతిలో వర్తించవలసి ఉంటుంది.

మ. పరిహాసంబునఁ దేలి భృత్యులయెడం బ్రహ్లాదముం బొందు భూ
వరునాజ్ఞం జన; రీగి మెచ్చరు పనిన్ వంచింతు రెగ్గాడఁ జొ
త్తురు; కౌతూహల వేష భూషణములం దుల్యత్వముం బొంది యే
తురు; వా రెల్లపదంబు వేఁడుదురు; సింతుర్ భూమి మాఱొడ్డులన్. 180

ప్రతిపదార్థం: పరిహాసంబునన్+తేలి= పరియాచకాలలో తేలియాడి; భృత్యులఎడన్= సేవకుల యందు; ప్రహ్లాదమున్+పొందు= అత్యంత ఆనందాన్ని పొందే; భూవరున్+ఆజ్ఞన్+చనరు= రాజాజ్ఞ ప్రకారం నడచుకొనరు; ఈగిన్+మెచ్చరు= త్యాగశీలతను మెచ్చుకొనలేరు; పనిన్+వంచింతురు= కార్యాచరణలో మోసగిస్తారు; ఎగ్గు+ఆడన్+చొత్తురు= కీడు మాటలాడ ప్రయత్నిస్తారు; కౌతూహల వేష భూషణములన్= కుతూహలమైన వేష ధారణంలో, మాటలలో; తుల్యత్వమున్+పొంది= (రాజుతో) సమానత్వాన్ని భావించి; ఏతురు= విజృంభిస్తారు; వారు= సేవకులు లేదా ప్రజలు; ఎల్లపదంబు+వేడుదురు= అన్ని పదవులను ఆశిస్తారు; భూమి మాఱు+ఒడ్డులన్= భూమిని ప్రతివ్యూహాలు పన్ని; చింతుర్= పీడిస్తారు.

తాత్పర్యం: ప్రజలతో కలిసిమెలసి పరాచకాలాడుతూ ఆనందించే రాజును ప్రజలు లెక్కచేయరు. ఎంత త్యాగశీలు డైనా మెచ్చుకొనరు. తమ కర్తవ్యం ఆచరించక మోసగిస్తారు. కీడు తలపెట్టుతారు. కుతూహలమైన వేషభాషలలో రాజుతో సమానత్వాన్ని భావించి విజృంభిస్తారు. అన్ని పదవులను ఆశిస్తూ ప్రతివ్యూహాలు పన్ని భూమిని పీడిస్తారు.

వ. కావున భృత్యులయెడ నత్యంత హర్షంబునం దేలి తేఁకువసెడఁ జరింప వలదు; సప్తాంగంబులయెడ విరోధం
బాచరించువాని నెవ్వని నైనను విడువ వలయు'నని చెప్పి వెండియు. 181

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; భృత్యుల+ఎడన్= సేవకుల యందు; అతి+అంత హర్షంబునన్+తేలి= మిక్కిలి సంతోషంతో తేలియాడి; తేఁకువ+చెడన్+చరింప వలదు= ధైర్యంచెడి మసలుకొనకూడదు; సప్త+అంగంబుల+ఎడన్= ఏడు రాజ్యాంగాలైన-

స్వామి, అమాత్యుడు, మిత్రుడు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం-అనే వాటికి సంబంధించి; విరోధంబు+ఆచరించు వానిన్= విరుద్ధం చేసేవాడిని; ఎవ్వనిన్+ఐనను= ఎవ్వడినైనా; విడువ వలయున్+అని చెప్పి= వదలిపెట్ట వలసిం దని చెప్పి (శిక్షించవలసిం దని చెప్పి); వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: కాబట్టి సేవకులతో కలిసి మెలసి సంతోషంతో తేలియాడుతూ ధైర్యం కోల్పోయేటట్లు నడచుకొనరాదు. సప్తరాజ్యాంగా లైన స్వామి, అమాత్యుడు, మిత్రుడు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం - అనే వాటికి వినాశకారి అయిన వాడి నెవ్వడినైన పరిహరించడమే అంటే శిక్షించటమే సముచిత మని భీష్ముడు ధర్మరాజుతో చెప్పి, మళ్ళీ ఈ విధంగా అన్నాడు.

క. అవలేపంబునఁ గర్త । వ్య వివేకము లేక వలసినట్టుల యెవ్వం
డవినీతి సేయు ధరణీ । ధవుఁడు విడువ వలయుఁ దన కతఁడు గురుఁ డైనన్.' 182

ప్రతిపదార్థం: ధరణీ ధవుఁడు= భూభర్త అయిన రాజు; అవలేపంబునన్= గర్వంతో; కర్తవ్య వివేకము లేక= ఆచరించవలసిన దానియందు విచక్షణ లేకుండా; వలసినట్టుల= తన కిష్టం వచ్చినట్లు; ఎవ్వండు+అవినీతి+చేయున్= అవినీతికి పాల్పడే వాడెవడైనా; తనకున్= రాజునకు; అతఁడు; గురుఁడు+ఐనన్= గురువైనా సరే; విడువ వలయున్= వదలిపెట్టటమే సముచితం.

తాత్పర్యం: గర్వంతో కర్తవ్యరహితుడై విచక్షణ లేకుండా ప్రవర్తించే వ్యక్తి ఎవడైనా సరే, చివరికి రాజుకు గురువైనా సరే, వదలిపెట్టటమే రాజు ఆచరించవలసిన ధర్మం.'

వ. అని మరుత్తుండను మహారాజునకు బృహస్పతి యొడంబడం బలికె; నట్లగుట గురుండు మిత్రుండు పుత్రుండని మన్నింప వలవదు; తప్పు గలిగిన ధరణీపతులకు దండింప వలయు; సగరుండు దనకొడుకు నసమంజసునిం బౌరబాల బాధకుండుగాఁ దెలిసియు నుద్దాలకముని నిజ తనయు శ్వేతకేతుని విప్రులయెడ మిథ్యోపచారకుం డని యెఱింగియుఁ బరిత్యజించి రన వినమె! యిట్టి చరితంబుల రాజు ప్రజారంజకుండు గావలయు; నిక్కంబును జక్కటియునుం గలిగి జనుల చిత్తంబులు నొప్పింపక పెట్టవలయు; నట్టివి దఱి తోన పెట్టుచు సైరణ గలిగి వర్తిల్లు భూవల్లభుం డభివృద్ధి నొంది యతిశయిల్లు. 183

ప్రతిపదార్థం: అని= పై విధంగా చెప్పి; మరుత్తుండు+అను మహారాజునకున్= మరుత్తు డనే పేరు కలిగిన మహారాజునకు; బృహస్పతి; ఒడంబడన్+పలికెన్= అంగీకరించేటట్లు పలికారు; అట్లు+అగుటన్= కాబట్టి; గురుండు మిత్రుండు పుత్రుండు+అని= గురువు, స్నేహితుడు కుమారుడు అనే భావంతో; మన్నింపన్+వలవదు= గౌరవించవలసిన పని లేదు; తప్పు+కలిగినన్= దోషమున్నట్లైతే; ధరణీ పతులకున్= రాజులకు; దండింపన్+వలయున్= శిక్షించటం ఎంతైనా అవసరం; సగరుండు= సగర మహారాజు; తన కొడుకున్+అసమంజసునిన్= అసమంజసు డనే తన కుమారుడిని; పౌరబాల బాధకుండుగాన్+తెలిసియున్= పుర జనులను, పిల్లలను పీడించే వాడని తెలిసికొని; ఉద్దాలక ముని= ఉద్దాలకుడనే మహర్షి; నిజ తనయున్= తన కుమారుడైన; శ్వేతకేతునిన్= శ్వేతకేతు డనే వాడిని; విప్రుల యెడన్ బ్రాహ్మణులపట్ల; మిథ్యా+ఉపచారకుండు+అని= అసత్య సేవాచరణుడు - అంటే ఉపచారం చేయనట్టివాడని; ఎఱింగియున్+పరిత్యజించిరి= తెలిసికొని వదలిపెట్టారు; అనన్+వినమె= అని చెప్పగా తెలిసికొన్నాము గదా; ఇట్టి చరితంబులన్= ఇట్లాంటి వారి చరిత్రలను గుర్తించటం వలన; రాజు ప్రజారంజకుండు+కావలయున్= ప్రజలను సంతోష పెట్టేవాడు కావలసి ఉన్నది; నిక్కంబును+చక్కటియునున్+కలిగి= నిజాన్ని, న్యాయాన్ని కలిగి; జనుల చిత్తంబులు నొప్పింపక పెట్టవలయున్= ప్రజల మనస్సులను బాధించక, కొనసాగించవలసింది; అట్టివి= అలాంటి వాటిని; తఱితోన పెట్టుచున్=

తగిన సమయంలోనే చేస్తూ; సైరణ+కలిగి= క్షమాగుణంతో ఒప్పి; వర్తిల్లు= నడచుకొనే; భూ వల్లభుండు= భూమి భర్త అయిన రాజు; అభివృద్ధిన్+ఒంది+అతిశయిల్లున్= అభ్యున్నతిని పొంది ఆధిక్యంతో వెల్గొందుతాడు.

తాత్పర్యం: పై విధంగా మరుత్తుడనే మహారాజుకు బృహస్పతి సమ్మతించేటట్లు వివరించాడు. అందువలన గురువనీ, స్నేహితుడనీ, పుత్రుడనీ ఎవడైనా సరే క్షమించరాదు. తప్పుంటే శిక్షించవలసిందే. తన కుమారుడు పౌరులను, పసిపిల్లలను పీడిస్తున్నాడని తెలిసికొన్న సగరుడు, శ్వేతకేతువనే తన కుమారుడు బ్రాహ్మణులకు అసత్యోపచారం చేస్తున్నాడని తెలిసికొన్న ఉద్దాలక మహర్షి తమ కుమారులే అయినప్పటికి వదలిపెట్టారు. ఇట్లాంటి చరిత్రలను గ్రహించి ప్రజారంజకుడై వర్ధిల్లవలసి ఉన్నది. నిజాయితీ, న్యాయం కలిగి ప్రజల మనస్సులను బాధించక తగిన సమయంలో పీడిస్తూ క్షమాగుణం కలిగిన రాజు మాత్రమే అభ్యున్నతిని పొంది అతిశయిల్లుతాడు.

విశేషం: బృహస్పతి దేవగురువు. మరుత్తు అవీక్షిత్తు అనే రాజు కుమారుడు. ఇతడి తల్లి విశాల. మరుత్తు జన్మసమయంలో తుంబురుడు వచ్చి, ఆ బాలుడికి మరుత్తులన్నీ శుభం చేస్తాయని చెప్పాడట. అందుచేత అతడికి మరుత్తుడని పేరు పెట్టారు. చాలా ప్రసిద్ధి పొందిన రాజు. సగరుడు బాహువు (అసితుని) కుమారుడు. ఇతడికి కేసిని అనే భార్యయందు అసమంజసు డనే పుత్రుడు జన్మించి పిశాచకృత్యాలు చేస్తుండగా, పుత్రు డని పరిగణించక నగరంనుండి వెడలగొట్టాడు. ఉద్దాలకుడు ఒక మహర్షి. అతడి కుమారుడు శ్వేతకేతువు దుష్టుడు కాగా పరిత్యజించాడు.

క. 'తనకీడు వైదికపు వ । ర్తనములఁ గొని యడఁప వలయు; దానిం గడవన్
జనపతికి మేలు గలదే? । వినుము చతుర్వర్గ పరత విహిత మతనికిన్. 184

ప్రతిపదార్థం: వినుము= జాగరూకతతో వినుము; జనపతికిన్= రాజునకు; తన కీడు= రాజునకు కలిగే హానిని; వైదికపు వర్తనములన్+కొని= వేద విహితమైన కార్యాచరణతో; అడఁపన్+వలయున్= తొలగించుకొనవలసి ఉన్నది; దానిన్+కడవన్ మేలు+కలదే!= దానిని మించిన మేలున్నదా?; అతనికిన్= ఆ రాజునకు; చతుర్వర్గ పరత విహితము= ధర్మార్థ కామ మోక్షాలపై ఆసక్తి కలిగి ఉండటమే తగింది.

తాత్పర్యం: రాజునకు ఎలాంటి కీడు కలగకుండా, వేదవిహితమైన ఆచారాలతో నివారించుకొనవలయును. అంతకంటే వేరే ఉత్తమ మార్గం లేదు. ధర్మార్థ కామమోక్షాలనే చతుర్వర్గంపై దృష్టి ఉంచి ధర్మాచరణ చేసినప్పుడే రాజు తన ధర్మాన్ని నిర్వర్తించిన వా డవుతాడు. అంటే చతుర్వర్గం రాజుకు విహితం.

ఆ. సకల వర్ణ ధర్మ సంకర రక్షయు, । సంధి విగ్రహాది షడ్గుణములు,
నలయ కరయుటయును నర్థ సమ్యగుపార్జ । నమును నృపతి యెపుడు నడపవలయు. 185

ప్రతిపదార్థం: ఎప్పుడున్= ఎల్లప్పుడు; నృపతి= రాజు; సకల వర్ణ ధర్మ సంకర రక్షణయున్= సమస్తమైన వర్ణాలకు విహితమైన ధర్మాల కలయిక యొక్క సంరక్షణమూ; సంధి విగ్రహ+ఆది షడ్గుణములున్= సంధి విగ్రహం మొదలైన అంటే సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధం, ఆశ్రయం - అనే ఆరు గుణాలను; అలయక+అరయుటయునున్= విసుగు చెందకుండా పరిశీలిస్తూ ఉంటూ; అర్థసమ్యక్+ఉపార్జనమును= సముచితరీతిని ద్రవ్య సంపాదనను; నడపవలయున్= నిర్వర్తించవలసి ఉన్నది.

తాత్పర్యం: సమస్త వర్ణాలకు సంబంధించిన ధర్మాలను రక్షించటంలోనూ, సంధి విగ్రహాది ఆరు గుణాలను పాటించటంలోను అలపు లేక పరిశీలిస్తూ సముచితరీతిని ధనార్జన చేస్తూ రాజు తన ధర్మాన్ని నిర్వర్తించాలి.

విశేషం: వర్ణాలు: బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు - అనే నాలుగు వర్ణాలు.

షడ్గుణాలు: సంధి (ఒకటి కావటం); విగ్రహం (యుద్ధం చేయటం); యానం (తన శక్తి అధికమైనప్పుడు గానీ, శత్రువు బలం లేదని తెలిసినప్పుడు గానీ జయించటానికై వెళ్ళటం); ఆసనం (దుర్గాదులను సంరక్షించుకొంటూ ప్రయాణ విముఖంగా ఉండటం); ద్వైధం (తనపైకి ఇద్దరు శత్రువులు దండెత్తి వచ్చినప్పుడు ఒకడితో సంధి చేసుకొని, మరొకడితో విరోధించటం); ఆశ్రయం (అశక్తితో బలవంతుడిని ఆశ్రయించటం). ఇవి రాజు గమనించవలసిన షడ్గుణాలు.

**క. పొనరిచి యాడెడు మాటలఁ ।
గొనఁ దలఁపక దుర్వినీత కోటి ధనంబుల్
దన కెక్కినట్టి తప్పులఁ ।
గొని సుజనుల కీగి నృపతి గుణమండ్రు బుధుల్. 186**

ప్రతిపదార్థం: పొనరిచి+ఆడెడు మాటలన్= పొసగునట్లుపలికే మాటలను; కొనన్+తలఁపక= గ్రహించటానికి ఆలోచించక; తనకున్+ఎక్కినట్టి తప్పులన్+కొని= తనపై ఆపాదించబడ్డ దోషాలను గ్రహించి; దుర్వినీత కోటి ధనంబుల్= అవినీతి పరులైన పెక్కుర అపరాధుల ధనాన్ని; సుజనులకున్+ఈగి= మంచివారికి ఇవ్వటమనేది; నృపతి గుణము= రాజుయొక్క ధర్మ మని; బుధుల్= విద్వాంసులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: తన ఇచ్ఛకాలకై మాటలాడే మాటలను లెక్కించక, తన దృష్టికి వచ్చిన దోషాలను మాత్రమే గ్రహించి దానిని దండనగా గ్రహించిన దుష్టుల ధనాన్ని ఉత్తములకు ఇచ్చి సంతృప్తి పరచటమే రాజధర్మ మని బుధులు అంటా రని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

**క. కడు నమ్మి యునికియును నె ।
క్కుడు నమ్మమియును సుశీల కుశలత గా; దె
య్యెడ నైనను బుద్ధి సానిపి ।
తడవి కనికొనంగ వలయుఁ దగవుఁ దగమియున్. 187**

ప్రతిపదార్థం: కడు నమ్మి+ఉనికియున్= మిక్కిలి నమ్మి ఉండటమూ; ఎక్కుడు నమ్మమియునున్= అధికంగా విశ్వసించక పోవటమూ; సుశీల కుశలత+కాదు= మంచి నడవడికకు క్షేమకరం కాదు; ఏ+ఎడన్+ఐనను= ఎట్టి పరిస్థితులలోనైనా సరే; బుద్ధి+చొనిపి= మనసు పెట్టి; తగవున్+తగమియున్= ఇది ఉచితం, ఇది అనుచితం అని; తడవి= పరిశీలించి; కనికొనంగ వలయున్= తెలిసికొని స్వీకరించవలసి ఉంటుంది.

తాత్పర్యం: పూర్తిగా విశ్వసించటం గానీ, ఏ మాత్రమూ నమ్మక పోవటం కానీ రాజు సద్వర్తనకు క్షేమకరం కాదు. ఏ విషయంలోనైనా సరే మనసుపెట్టి బహుజాగరూకతతో ఉచితానుచితాలను పరిశీలించి గ్రహించవలసి ఉన్నది.

**క. ధన మపహరించుటయ తన ।
కనిశముఁ బని గాఁగ బ్రదుకు నతి లుబ్ధునకున్
విను! శత్రులచే నౌటకు ।
మును దన ప్రజలచేన చేటు మూఁడు నరేంద్రా! 188**

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజులలో శ్రేష్ముడైన ఓ ధర్మరాజా! వినుము; తనకు+అనిశమున్= ఎల్లప్పుడు తనకు; ధనము+అపహరించుటయ= పరధనాన్ని దొంగలించటమే; పని+కాఁగన్= ముఖ్య ధర్మమని; బ్రదుకు+అతి లుబ్ధునకున్= జీవితం గడిపే మిక్కిలి పిసినారికి; శత్రులచేన్+ఔటకున్ మును= శత్రువుల వలన (కీడు) కలిగే ముందే; తన ప్రజచేన్= తన ప్రజల వలననే; చేటు మూడున్= వినాశం కలుగుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! జాగరూకతతో వినుము. ఇతరుల ధనమును అపహరించటమే తన పని అన్నట్లు భావించే పిసినారి రాజుకు ఇతరులవలన కలిగే దానికంటె ముందు తన ప్రజల వలననే వినాశం కలుగుతుంది.

**ఆ. ధర్మరతులు, నర్థ నిర్మాణ చతురులు, । లౌల్యరహితులును, నలంఘితాజ్ఞ
లును, సునీతి నిపుణులును, గులజులు నగు । పరిజనములఁ బెనుపు పతికి హితము. 189**

ప్రతిపదార్థం: ధర్మరతులున్= ధర్మంపై ఆసక్తి కలవారు; అర్థ నిర్మాణ చతురులున్= ద్రవ్యసంపాదనంలో నిపుణులైనవారు; లౌల్య రహితులునున్= చలించనట్టి వారు - స్థిర చిత్తులైన వారు; అలంఘిత+ఆజ్ఞులునున్= ఆజ్ఞ దాటనివారు; సునీతి నిపుణులును= ఉత్తమ నీతిని గ్రహించటంలో నైపుణ్యం కలవారూ; కులజులున్+అగు= ఉత్తమ కులంలో జన్మించినవారూ అయిన; పరిజనములన్+పెనుపు= పరివారం యొక్క పెంపు చేసికొనటం; పతికిన్= రాజునకు; హితము= ఉచితం.

తాత్పర్యం: ధర్మమం దాసక్తి కలవారు, ద్రవ్యాభివృద్ధి నిపుణులు, స్థిరచిత్తులు, రాజాజ్ఞ నతిక్రమించని ఉత్తమ నీతి కోవిదులూ, ఉత్తమ కుల సంజాతులు అయిన పరివారాన్ని పెంపు చేసికొనటమనేది రాజుకు చాలా ముఖ్యమైన ధర్మం.

చ. కపటము లేక, వైభవము గప్పక, యొండొరుమీఁద రాజుపై
నపరిమిత ప్రియం బెసఁగ నల్గక యుండు ముదంబుఁ బొంది యే
నృపు విషయంబునం బ్రజ వినిర్మలవృత్తతఁ బుత్రుభంగి నా
నృపు నృపుఁ డండ్రు గా కితరునిం దగువా రెద నియ్యకొందురే? 190

ప్రతిపదార్థం: ఏ నృపు విషయంబునన్= ఏ రాజు విషయంలోనైతే; ప్రజ= ప్రజలు; వినిర్మల వృత్తతన్= ఉత్తమ ప్రవర్తనతో; కపటము లేక= మోసం లేకుండా; వైభవము+కప్పక= విభవాన్ని అంటే సంపదను దాచుకొనక; ఒండు+ఒరుమీఁదన్= పరస్పరం ఒకరు మరొకళ్ళమీద; రాజుపైన్= రాజుమీద; అపరిమిత ప్రియంబు+ఎసఁగన్= అత్యంతమైన ప్రేమ అతిశయిల్లగా; అల్గక= కోపించక; ముదంబున్+పొంది= సంతోషం పొంది; పుత్రు భంగిన్= కుమారుడి వలె; ఉండున్= ఉంటాడో; ఆ నృపున్+నృపుఁడు+అండ్రు+కాక= రాజును రాజంటారు కాని; ఇతరునిన్+తగువారు+ఎదన్+ఇయ్యకొందురే?= తదితరమైన రాజును, అర్హులైన వారు హృదయంలో ఒప్పుకొంటారా?.

తాత్పర్యం: ఏ రాజు విషయంలో అయితే ప్రజలు ఉత్తమప్రవర్తనతో మోసం లేకుండా సంపదను దాచుకొనక, పరస్పరమూ, రాజు మీద మిక్కిలి ప్రేమతో మసలుకొంటూ, కోపం లేకుండా పుత్రుల వలె ఉంటారో అట్లాంటి రాజే నిజమైన రాజు. తదితరులను అర్హులైనవారు హృదయంలో ఒప్పుకొంటారా?

క. ధన దారాదికముల నె । వ్వనికిని రక్షించికొనఁగ వసమే రక్షా
ఘనుఁ డగు పతి గల్గిన గా । కనఁడే శుక్రుఁడు సుమతు లభినందింపన్. 191

ప్రతిపదార్థం: రక్షాఘనుఁడు+అగు పతి+కల్గినన్+కాక= (ప్రజలను) సంరక్షించటంలో పరాక్రమ వంతుడుగా ఉంటే తప్ప; ధనదార+ఆదికములన్= సంపదలను, భార్య మొదలైన వారిని; ఎవ్వనికిని= ఎవ్వడికైనా; రక్షించుకొనఁగన్ వసమే?= సంరక్షించుకొనటం సాధ్యమా? (అని); సుమతులు+అభినందింపన్= బుద్ధిమంతులు మెచ్చుకొనేటట్లు; శుక్రుఁడు= శుక్రాచార్యుడు; అనఁడే?= అనలేదా?

తాత్పర్యం: ప్రజలను సంరక్షించే పరాక్రమసంపన్నుడైన రాజు ఉంటే తప్ప సంపదలను, భార్య, బిడ్డలు మొదలైనవారిని రక్షించుకొనటం సాధ్యం కాదని బుద్ధిమంతులు మెచ్చుకొనేటట్లు శుక్రాచార్యుడు చెప్పలేదా?

క. అనధీయానుం డితఁ డనఁ । జను ఋత్విజునట్ల చూవె సంరక్షా క
ల్పన హీనుఁడైన నృపుఁడని । మనువు పలికెఁ గాదె బుద్ధిమంతులు మెచ్చన్. 192

ప్రతిపదార్థం: సంరక్షా కల్పన హీనుఁడు+ఐన నృపుఁడు= ప్రజా సంరక్షణ చేయటంలో చేతకానివాడైన రాజు; ఇతఁడు; అనధీయానుండు= అనధ్యయనుడు అంటే చదవని వాడు; అనన్+చను= అన దగిన; ఋత్విజున్+అట్ల చూవె= యజ్ఞకర్తచేత

ధనం పుచ్చుకొని యజ్ఞం చేయించేవానిలాంటివాడు సుమా; అని; మనువు; బుద్ధిమంతులు; మెచ్చన్= మెచ్చుకొనేటట్లు; పలికెన్+కాదె!= వివరించాడు కదా!

తాత్పర్యం: ప్రజాసంరక్షణం చేయటానికి తగిన ప్రయత్నం చేయని రాజు, అధ్యయనరహితుడైన ఋత్విజుడివంటి వాడని, మనువు బుద్ధిమంతులు మెచ్చుకొనేటట్లు వివరించాడు కదా!

విశేషం: అలం: ఉపమ. ఋత్విజునకు అధీత బోధాచరణాలు ఎంత ముఖ్యమో రాజనే వాడికి ప్రజలను సంరక్షించటానికి తగిన యత్నం చేయటం అంతముఖ్యం. ఋత్విజులు పదహారుగురు. బ్రహ్మ, ఉద్గాత, హోత, అధ్వర్యుడు, బ్రాహ్మణాచ్ఛంసి, ప్రస్తోత, మైత్రావరుణుడు, ప్రతిప్రస్థాత, పోత, ప్రతివార్త, అచ్ఛావాకుడు, నేష్ట, అగ్నీధ్రుడు, సుబ్రహ్మణ్యుడు, శ్రావస్తుడు, ఉన్నేత - అని.

వ. మఱియు బృహస్పతి మహేంద్ర భారద్వాజ ప్రముఖులగు రాజధర్మానుశాసకులు రాజత్వ మూలకారణంబు ప్రజాసంరక్షయ యనిరి గావున నెత్తెఱంగున నైనను లోకరక్షణంబు రాజున కవశ్య కర్తవ్యంబు. 193

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; బృహస్పతి, మహేంద్ర, భారద్వాజ ప్రముఖులు+అగు= బృహస్పతి, ఇంద్రుడు, భారద్వాజుడు మొదలుగా ముఖ్యులైన; రాజధర్మ+అనుశాసకులు= రాజు అనుసరించవలసిన ధర్మాలను శాసించిన వారు; రాజత్వ మూల కారణంబు= రాజనే వాడికి ఉండవలసిన ప్రధానకారణం; ప్రజా సంరక్షయ+అనిరి= ప్రజలను సుభిక్షంగా పరిపాలించటమే అని పేర్కొన్నారు; కావునన్= కాబట్టి; ఏ+తెఱంగునన్+ఐనను= ఏ విధంగానైనా; లోక రక్షణంబు= లోక సంరక్షణమే; రాజునకున్+అవశ్యకర్తవ్యంబు= రాజునకు తప్పనిసరి అయిన ధర్మం.

తాత్పర్యం: కాబట్టి బృహస్పతి, భారద్వాజుడు, ఇంద్రుడు అనే ప్రముఖులైనవారు రాజధర్మాలను శాసించినవారు రాజునకు ప్రథమకర్తవ్యం ప్రజాసంరక్షణమే అని పేర్కొన్నారు. కాబట్టి, ఏ విధంగా పరిశీలించినా రాజునకు లోకసంరక్షణమే అనుసరించదగిన తప్పనిసరి అయిన ధర్మం.

తే. సంతతోత్సాహవంతుఁడై శత్రుకోటి । నార్జవంబున నైన ననార్జవమున
నైనఁ జెఱుపన వలయు; నత్యల్పుఁడైనఁ । బగతుఁ డగ్ని విషంబుల పగిది నొంచు. 194

ప్రతిపదార్థం: సంతత+ఉత్సాహవంతుఁడు+ఐ= ఎల్లప్పుడు ఉత్సాహ పూరితుడై; ఆర్జవంబునన్+ఐనన్+అనార్జవమునన్+ఐనన్= ఋజుత్వం వలనగాని, ఋజుత్వాన్ని వదలిగాని అయినా; శత్రుకోటిన్= శత్రు సమూహాన్ని; చెఱుపన వలయున్= నాశనం చేసి తీరవలసిందే; అతి+అల్పుఁడు+ఐనన్+పగతుఁడు= మిక్కిలి చిన్నవాడైనా సరే శత్రువు; అగ్ని విషంబుల పగిదిన్+నొంచున్= నిప్పువలె, విషంవలె బాధిస్తాడు.

తాత్పర్యం: రాజు ఎల్లప్పుడు రాజ్యపాలనంలో ఉత్సాహవంతుడై ఋజుత్వంవలన గాని, తద్వ్యతిరేకంగా గాని, శత్రుసమూహాన్ని నాశనం చేయటమే రాజధర్మం. అందువలన మిక్కిలి అల్పుడైనవా డైనా శత్రువు నిప్పువలె, విషంవలె నొప్పిస్తాడు. కనుక తప్పక రాజు శత్రుసంహారి కావలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

క. వినుము నృప! రాజ్యామిషముం । గొనఁ బలువురచేతఁ బ్రాణగొడ్డంబై యు
న్నను ధీరుఁ డేమఱుమి నది । దనకును దక్కించుకొను బుధస్తుత్యముగన్.' 195

ప్రతిపదార్థం: వినుము= వినుము; నృప= ఓ రాజా!; పలువురచేతన్= అనేకుల వలన; ప్రాణగొడ్డంబు+ఐ+ఉన్నను= ప్రాణానికి హింస కలిగించేదైన; ధీరుఁడు= ధైర్యవంతుడు; రాజ్య+ఆమిషమున్= రాజ్యమనే లాభాన్ని; కొనన్= పొందుటయందు; ఏమఱుమిన్=

ఏమరుపాటు లేకుండటంచేత; బుధస్తుత్యముగన్= పండితులచేత పొగడబడేటట్లుగా; అది+తనకును= దానిని తనకై; దక్కించుకొనున్= చేజిక్కించుకొంటాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ధీరుడైన రాజు అనేకు లడ్డగించి ప్రాణాంతకం చేసినా లెక్కచేయక రాజ్యమనే లాభాన్ని ఏమరకుండ పండిత ప్రశంసలు పొందేటట్లుగా తనకు చేజిక్కించుకొంటాడు.'

వ. అని చెప్పి భీష్ముం 'డేను రాజధర్మప్రకారంబు సంక్షేప రూపంబున నెఱింగించితి; నీకు సందేహంబు గల యట్టిది యెయ్యది యడుగు' మనిన, ధర్మనందనుం డమ్మహాత్మునితో 'నరుణగభస్తి యస్తగిరి సేరెడు; నేఁటికిం బనివినియెద; రేపు వచ్చి యడిగెద' ననుచుం దత్పాదంబులకుం బ్రణతుండై వీడ్కొనియెఁ; బద్మనాభ ప్రముఖులును వీడ్కొనిరి; వారలందఱును మునులకు నభివాదనంబు లాచరించిరి; మునులు నిజ స్థానంబుల కరుగం దారును దృషద్వతి యను మహానదిం గృతసంధ్యావందనులై చని కరిపుర ప్రవేశంబు సేసి సుఖవృత్తి నా రాత్రి గడపి, కల్యంబునం గాలోచిత కృత్యంబు లాచరించి భీష్మపాలికిం బోయి, యంతకు మున్న వచ్చి యున్న మునిలోకంబునకు నమస్కరించి సవినయంబును సకుశలప్రశ్నంబునుంగా నగ్గాంగేయునిం గదిసి బలసి కూర్చుండి; రా సమయంబునఁ బాండవాగ్రజుండు ప్రాంజలి యై యతని కిట్లనియె. 196

ప్రతిపదార్థం: అని చెప్పి= పై విధంగా రాజధర్మాలను గూర్చి ధర్మరాజునకు చెప్పి; భీష్ముండు= శరతల్పగతు డైన భీష్ముడు; ఏను= నేను; రాజధర్మ ప్రకారంబున్= రాజులకు ఉండవలసిన ధర్మ పద్ధతులను; సంక్షేప రూపంబునన్= సంక్షిప్తంగా; ఎఱింగించితిన్= తెలియజేశాను; నీకు; సందేహంబు+కల+అట్టిది+ఏ+అది+అడుగుము+అనినన్= నీకు దేనియందు సందేహం కలదో దానిని అడుగుమని భీష్ము డనగా; ధర్మనందనుండు= ధర్మరాజు; ఆ+మహాత్మునితోన్= ఆ మహనీయుడైన భీష్ముడితో; అరుణ గభస్తి+అస్తగిరి+చేరెడున్= ఎర్రనైన కిరణాలు గల సూర్యుడు పడమటి కొండపై చేరుతున్నాడు; నేఁటికిన్+పనివినియెదన్= ఈ నాటికి నేను వెళ్ళి వచ్చెదను; రేపు వచ్చి+అడిగెదన్= ఉదయమే వచ్చి అడుగవలసినవి అడుగుతాను; అనుచున్= అంటూ; తద్+పాదంబులకున్= ఆ భీష్ముడి పాదాలకు; ప్రణతుండు+ఐ= నమస్కరించినవాడై; వీడ్కొనియెన్= వెళ్ళిపోయాడు; పద్మనాభ ప్రముఖులును= శ్రీకృష్ణుడు మొదలైనవారును; వీడ్కొనిరి= వెళ్ళిపోయారు; వారలు+అందఱును= వారందరు; మునులకున్= మహర్షులకు; అభివాదనంబులు+ఆచరించిరి= నమస్కరించారు; మునులు= మహర్షులు; నిజ స్థానంబులకున్+అరుగన్= తమ ఆశ్రమాలకు వెళ్ళిపోగా; తారును= తామును; దృషద్వతి+అను మహానదిన్= దృషద్వతి అనే మహానదియందు; కృతసంధ్యా వందనులు+ఐ= చేయబడిన సంధ్యావందనాదులు కలవారై; చని= వెళ్ళి; కరిపుర ప్రవేశంబు+చేసి= హస్తినాపురం ప్రవేశించి; సుఖవృత్తిన్= సౌఖ్యంగా; ఆ రాత్రి+కడపి= ఆ రాత్రి గడపి; కల్యంబునన్= వేకువనే; కాల+ఉచిత కృత్యంబులు+ఆచరించి= కాలకృత్యాలు తీర్చుకొని; భీష్మపాలికిన్+పోయి= భీష్ముని వద్దకు వెళ్ళి; అంతకు మున్ను+అ వచ్చి+ఉన్న= అంతకంటే ముందే వచ్చి ఉన్న; ముని లోకంబునకున్= మునుల సమూహానికి; నమస్కరించి; సవినయంబును= వినయంతోడను; సకుశల ప్రశ్నంబునున్+కాన్= క్షేమ సమాచారాన్ని అడుగుట తోడను; ఆ+గాంగేయునిన్+కదిసి= ఆ భీష్ముని సమీపించి; ఒలసి= చుట్టుముట్టి; కూర్చుండిరి= కూర్చున్నారు; ఆ సమయంబునన్= అప్పుడు; పాండవ+అగ్రజుండు= పాండవుల అన్నఅయిన ధర్మరాజు; ప్ర+అంజలి+ఐ= చేతులు మోడ్చినవాడై; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ భీష్ముడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'రాజధర్మాలను వివరించి ఇంక ఏవైన సందేహాలు ఉంటే అడుగవలసిం'దని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు. అప్పుడు ధర్మరాజు భీష్ముడితో 'ఇప్పుడు సూర్యుడు అస్తమిస్తున్నాడు కనుక ఈ పూటకు నిష్క్రమించి రేపు ఉదయమే వచ్చి అడుగుతాను' అని తెలిపాడు. భీష్ముడి పాదాలకు నమస్కరించి ధర్మరాజు వెళ్ళిపోయాడు. అట్లాగే శ్రీకృష్ణాదులు నమస్కరించారు. మునులు ఆశ్రమాలకు వెళ్ళిపోయారు. వారు దృషద్వతి అనే నదిలో

సంధ్యావందనాదులు చేసి హస్తినాపురం చేరారు. ఆ రాత్రి సుఖంగా గడపి వేకువ జామున కాలకృత్యాలు ముగించి భీష్ముడివద్దకు వెళ్ళి అంతకుముందే వచ్చిన మహర్షులకు నమస్కరించారు. వినయంతో కుశల ప్రశ్నలతో భీష్ముడిని సమీపించి, అందరు చుట్టూ కూర్చున్నారు. అప్పుడు ధర్మరాజు దోయిలొగ్గి భీష్ముడిని ఇట్లా ప్రశ్నించాడు.

సీ. 'రాజనామమునకు భాజనం బై మహా । ద్భుత చరిత్రుం డగు పురుషుఁ డొకఁడు
గలిమికి మూలంబు ఘన విశేషము గల్గ । నోపుఁ గౌరవ కుల దీపజనన
యది యెఱింగింపవే; యవయవంబులుఁ బ్రాణ । మానసంబులు జన్మ మరణములు శ
రీర యాత్రలు నెల్లవారికి నెట్లట్ల । కాని విభేదంబు గాన; మిట్టి

ఆ. రా జొకండు శూర తేజస్వి బుద్ధి మ । జ్జనుల నెట్లు దన వశంబు సేయ
నిలుపఁ జెఱుప నెల్లయిలయును నేల దై । వ నిభుఁడగుచు మ్రొక్కుగొనఁగఁ జాలె. 197

ప్రతిపదార్థం: కౌరవ కులదీప జనన!= కురువంశానికి దీపం వంటి జననం కలవాడా!; రాజనామమునకున్= రాజనే పేరునకు; భాజనంబు+ఐ= పాత్రమై (అర్హమై); మహా+అద్భుత చరిత్రుండు+అగు= మిక్కిలి ఆశ్చర్యకరమైన నడవడిక కలవాడైన; పురుషుఁడు+ఒకఁడు= ఒకానొక పురుషుడు; కలిమికిన్+మూలంబు= సంపదలకు హేతువు; ఘన విశేషము+కల్గన్+ఓపున్= మిక్కిలి ఔన్నత్యానికి తగినట్టి దానికి అర్హుడు; అవయవంబులున్= శరీరమందలి అవయవాలును; ప్రాణమానసంబులున్= ప్రాణం, మనస్సు; జన్మ మరణములున్= పుట్టుట గిట్టుటలును; శరీర యాత్రలున్= దేహ యాత్రలును; ఎల్లవారికిన్+ఎట్లు+అట్ల= అందరికి సమానమే; కాని= అయినప్పటికి; విభేదంబు+కానము= తేడా ఏమి లేదు; శూర తేజస్వి= పరాక్రమంచేత ప్రకాశిస్తున్నవాడు; ఇట్టి+రాజు+ఒకండు= ఇట్లాంటి ఒక రాజు; బుద్ధిమత్+జనులన్= బుద్ధిమంతులైన ప్రజలను; ఎట్లు= ఏ విధంగా; తన+వశంబు+చేయన్= తన వశవర్తులుగా చేసికొనటానికి; నిలుపన్= సంరక్షించటానికి; చెఱుపన్= నాశనం చేయటానికి; ఎల్ల యిలయును= సమస్తమైన భూమండలంలో; దైవ నిభుఁడు+అగుచున్= భగవంతుడితో సమానుడవుతూ; ఏల?= ఎందుకు?; మ్రొక్కు+కొనఁగన్+చాలెన్= నమస్కారానికి అర్హుడగుతున్నాడు; అది+ఎటింగింపవే?= దాన్ని వివరించవా?

తాత్పర్యం: ఓ భీష్ముడా! రాజనే పేరుకు పాత్రమై ఉత్తమచరిత్ర కలవాడైన ఒకానొక మానవుడు సంపదలకు మూలం, ఔన్నత్యానికి అర్హుడు కావచ్చును. మానవు లందరికి ఉన్నట్లు శరీరావయవాలు, ప్రాణం, మనస్సు, పుట్టుట గిట్టుటలు, దేహయాత్రలు, రాజుకు కూడా సమానమే. భేద మేమీ కనిపించటం లేదు. పరాక్రమతేజస్వి అయిన ఒక రాజు బుద్ధిమంతు లైన ప్రజలను ఏ విధంగా తన వశం చేసికొంటాడు, సంరక్షిస్తాడు, నాశనం చేస్తాడు, ఈ భూమిపై ఏ విధంగా భగవంతుడితో సమానంగా పూజార్హుడవుతాడు? - అనే అంశాలను వివరించుము.

భీష్ముండు ధర్మజునకు దండనీతి జన్మప్రకారం బెటింగించుట (సం. 12-59-11)

వ. అదియును వినవలతు'నని యడిగిన నమ్మనుజపతి కమ్మహాత్ముం డిట్లనియె. 198

ప్రతిపదార్థం: అదియును వినవలతున్+అని+అడిగినన్= పై విషయాలను వినాలన్న కోరిక ఉన్నదని ధర్మరాజు అడుగగా; ఆ+మనుజపతికిన్+ఆ+మహాత్ముండు+ఇట్లు+అనియెన్= ఆ ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విషయాలను వినాలన్న కోరిక ఉన్న' దని ధర్మరాజు అడుగగా భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

క. 'వినుఁ! దొల్లి కృత యుగంబున । మనుజులయెడ దండనీతిమంతుం డై రా
జన నొకఁడు గలిగి యరయుట । మనుజేశ్వర! లేదు ధర్మమత మండ్రు తగన్. 199

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= ఓ ధర్మరాజా! వినుము; తొల్లి= పూర్వం; కృతయుగంబునన్= కృతయుగంలో; మనుజుల యెడన్= మానవుల పట్ల; దండనీతి మంతుండు+ఐ= శిక్షావిధి కలవాడై; రాజు+అనన్+ఒకఁడు+కలిగి+అరయుట లేదు= రాజనేవాడు ఒకడుండి పరిశీలించటం జరగలేదు; తగన్= తగినట్లు; ధర్మమతము+అండ్రు= దాన్ని తగినరీతి ధర్మమతమని అంటారు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! జాగరూకతతో వినుము. పూర్వం కృతయుగంలో మానవుల పట్ల శిక్షావిధి విధాయకుడై ఒకానొక రాజు ఉండి దీన్ని పరిశీలించినవాడు లేడు. కేవలం దానిని ధర్మమత మని పెద్దలు చెపుతారు.

క. ఒండొరులకు రక్షకులై । యుండుదు; రట్లుండ దైన్య మొదవిన లోభం
బొండొండు పెరిఁగి ధర్మము । ఖండితమై మొదలుకొని రకార్యంబులకున్. 200

ప్రతిపదార్థం: ఒండు+ఒరులకున్= ఒకరి కొకరు; రక్షకులు+ఐ+ఉండుదురు= రక్షకులై ఉంటూ వచ్చారు; అట్లు+ఉండన్= ఆ విధంగా కొనసాగుతూ ఉండగా; దైన్యము+ఒడవినన్= దీన భావం కలుగగా; లోభంబు+ఒండొండ= పిసినారితనం ఒక్కొక్కటిగా; పెరిఁగి= అతిశయించి; ధర్మము ఖండితము+ఐ= ధర్మం వినాశమై; అకార్యంబులకున్= కానిపనులకు; మొదలుకొనిరి= ప్రారంభించారు.

తాత్పర్యం: పరస్పరం ఒకరికొకరు రక్షకులై ఉంటూ వచ్చారు. ఆ విధంగా ఉండగా దీనభావం కలిగి పిసినారితనం ఒక్కొక్కటి పెరిగి ధర్మం వినాశనమైనది. ఆ విధంగా ప్రజలు అకార్యాలకు పాల్పడ్డారు.

క. క్రమమునఁ గామము రాగము । దమ మనముల నొదవఁగా మదం బెక్కిన వి
భ్రమ మొందుచు విచ్చల విడి । విమార్గ చరితముల వేదవిధ్వంసకులై. 201

ప్రతిపదార్థం: క్రమమునన్= వరుసగా; కామము= కోరిక; రాగము= మాత్సర్యం; తమ మనములన్+ఒదఁగాన్= తమ మనస్సులందు కలుగగా; మదంబు+ఎక్కినన్= క్రొవ్వెక్కగా; విభ్రమ మొందుచున్= విభ్రాంతి పొందుతూ, తొట్రుపాటుతో; విచ్చలవిడి= యథేచ్ఛగా; విమార్గ చరితములన్= దుర్మార్గమైన నడవడికలతో; వేద విధ్వంసకులు+ఐ= వేద వినాశకులై.

తాత్పర్యం: క్రమంగా కోరిక, మాత్సర్యం తమ మనస్సులందు కలుగగా, క్రొవ్వెక్కి విభ్రాంతులై యథేచ్ఛగా దుర్మార్గ ప్రవర్తనలతో వేదవినాశకులై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మనుజులు ధర్ముఁ బొడవడఁ । చిన వేదముఁ గర్ములును జెడుటకు భయ మం
దిన యింద్రాదులు గమలా । సనుఁ గానఁగ మునులుఁ దారుఁ జనిరి నరేంద్రా! 202

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ఓ రాజా!; మనుజులు= మానవులు; ధర్మమున్+పొడవు+అడఁచినన్= ధర్మంయొక్క గొప్పతనాన్ని అణచివేయగా; వేదమున్+కర్ములునున్+చెడుటకున్= వేదాలు చేయవలసిన కర్మాదికాలు చెడిపోవటానికి; భయము+అందిన= భయపడినటువంటి; ఇంద్ర+ఆదులు= ఇంద్రుడు మొదలైన వారు; కమల+ఆసనున్+కానఁగన్= పద్మాన్ని ఆసనంగా కల బ్రహ్మను దర్శించటానికి; మునులున్+తారును+చనిరి= మహర్షులు ఇంద్రాదులు వెళ్ళారు.

తాత్పర్యం: ఓ రాజా! మానవులు ధర్మముయొక్క గొప్పతనాన్ని అణచివేయగా, వేదాలు చేయవలసిన కర్మలు చెడిపోవటానికి భయపడిన ఇంద్రుడు మొదలైన దేవతలు బ్రహ్మను సందర్శించటానికి మునులతోపాటు వెళ్ళారు.

వ. చని యద్దేవునిం గని 'మనుజ లోకంబున వేదంబులు ధర్మంబులుం బొడ వడంగిన నధ్వర రాహిత్యంబున నేమును దుర్బలులమై భయంబంది వచ్చితిమి; రక్షింపు'మని యవ్విబుధులు విన్నవించిన విరించి 'దానికిం బ్రతి విధానంబు సేసెద; మీరు వెఱవ వల' దని పలికి స్వామ్యమాత్య రాష్ట్ర దుర్గ కోశ సుహృద్బలంబులు నాన్వీక్షకీ త్రయీ వార్తా దండనీతులును, నరి మిత్రోదాసీ నాదిక ద్వాదశరాజ మండలంబును, సంధి విగ్రహ యానాసన ద్వైధీభావ సమాశ్రయంబులును మొదలుగా వలయు వానికిం బ్రబోధకంబులగు నానావయవంబులుం గలిగి ధర్మార్థకామ మోక్షంబులకు సాధకంబులయి యుండునట్లుగా నూఱువేలధ్యాయంబుల నఖిలలోక హితంబగు నీతిశాస్త్రంబు రచియించి, యిది లోక చరిత్ర నిర్మలీకరణంబునకుం గారణంబగు'నని యనుగ్రహించె నా లోక పితామహు లలాటంబున ననాది నిధనుండును, విశ్వజగత్కర్తయు సర్వ భూతాత్ముండును సనాతనుండును నగు విరూపాక్షుండు విశాలాక్షుండను నామంబున నావిర్భవించి యాగ్రంథం బధిగమించి దాని నభ్యసించుటకు మర్త్యుల కాయుర్బుద్ధులు సాలవని యుమ్మలించి యమ్మహనీయ తంత్రంబు సంక్షేపరూపంబునం బదివే లధ్యాయంబుల వైశాలాక్షం బన నిర్మించె. 203

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; ఆ+దేవునిన్+కని= ఆ బ్రహ్మదేవుడిని సందర్శించి; మనుజలోకంబునన్= భూలోకంలో; వేదంబులున్+ధర్మంబులున్+పొడవు+అడంగినన్= వేదాలయొక్క, ధర్మాలయొక్క ఆధిక్యం తగ్గిపోగా; అధ్వర రాహిత్యంబునన్= యజ్ఞాలు లేకపోవటం వలన; ఏమును= మేమును; దుర్బలులము+ఐ= బలహీనులమై; భయంబు+అంది వచ్చితిమి= భయపడి వచ్చాము; రక్షింపుము+అని+ఆ+విబుధులు= కాపాడుమని ఆ దేవతలు; విన్నవించిన్= వేడుకొనగా; విరించి= బ్రహ్మ; దానికిన్+ప్రతి విధానంబు+చేసెదన్= అందుకు ప్రతిక్రియ చేస్తాను; మీరు వెఱవ వలదు+అని పలికి= మీరు భయపడవలసిన పనిలేదని చెప్పి; స్వామి+అమాత్య రాష్ట్ర దుర్గ కోశ సుహృద్+బలంబులున్ స్వామి, అమాత్యుడు, రాష్ట్రం, దుర్గం, కోశం, మిత్రులు, సైన్యమూ; ఆన్వీక్షకీ త్రయీ వార్తా దండ నీతులునున్= ఆన్వీక్షకి, త్రయి, వార్త, దండనీతి అనే నాలుగు విద్యలను; అరిమిత్ర+ఉదాసీన+ఆదిక ద్వాదశరాజ మండలంబును= శత్రువు, మిత్రుడు, ఉదాసీనుడు మొదలైన పండ్రెండు రాజ మండలాలును; సంధి విగ్రహ యాన+ఆసన ద్వైధీభావ సమాశ్రయంబులును= సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం అనే వాటి ఆధారంతో ఉన్నవి; మొదలుగాన్= మొదలుకొని; వలయువానికిన్= కావలసిన వాటికి; ప్రబోధకంబులు+ అగు= వివరణాత్మకాలైన; నానా అవయవంబులున్+కలిగి= అనేక అవయవాలతో ఒప్పి; ధర్మ+అర్థ కామ మోక్షంబులకున్= ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే వాటికి; సాధకంబులు+అయి+ఉండునట్లుగాన్= సాధనా లయ్యేటట్లుగా; నూఱువేల+ అధ్యాయంబులన్= లక్ష అధ్యాయాలతో; అఖిల లోకహితంబు+అగు= సమస్త లోకాలకు మంచిని చేకూర్చేటట్లుగా; నీతి శాస్త్రంబున్ రచియించి= ఈ నీతి శాస్త్ర రచన చేసి; ఇది లోక చరిత్ర నిర్మలీకరణంబునకున్+కారణంబు+అగును+అని+అనుగ్రహించెన్= ఈ నీతిశాస్త్రం లోకంలోని నడవడికలను పరిశుద్ధం చేయటానికి హేతు వవుతుం దని అనుగ్రహించాడు; ఆ లోక పితామహు లలాటంబునన్= ఆ బ్రహ్మయొక్క నొసట; అనాది నిధనుండును= మొదలు, తుదిలేనివాఁడును; విశ్వ జగత్కర్తయున్= విశ్వానికి (లోకాలకు) కర్త అయిన వాడును; సర్వభూత+ఆత్ముండున్= అన్ని ప్రాణులను తన ఆత్మలో కలవాడును; సనాతనుండునున్= శాశ్వతుడును; అగు= అయినటువంటి; విరూప+అక్షుండు= వికృతమైన కన్నులు కలవాడైన శివుడు; విశాల+అక్షుండు అను నామంబునన్= విశాలాక్షుడనే పేరుతో; ఆవిర్భవించి=పుట్టి; ఆ గ్రంథంబు+అధిగమించి=బ్రహ్మరచించిన నీతి శాస్త్రాన్ని చదివి; దానిన్+అభ్యసించుటకున్= దానిని నేర్చుకొనటానికి; మర్త్యులకున్+ఆయుఃబుద్ధులు+ చాలవు+అని+ఉమ్మలించి= మానవులకు ఆయుస్సు బుద్ధి చాల వని చింతించి; ఆ+మహనీయ తంత్రంబున్= ఆ మహిమాన్విత మైన నీతి శాస్త్రాన్ని; సంక్షేప రూపంబునన్= క్లుప్తంగా; పదివేలు+అధ్యాయంబులు= పదివేల అధ్యాయాలతో; వైశాలాక్షంబు+అనన్+నిర్మించెన్= వైశాలాక్షమనే నీతిశాస్త్ర సంగ్రహాన్ని నిర్మించాడు.

తాత్పర్యం: ఇంద్రాదులు మునులతోపాటు బ్రహ్మను సందర్శించి 'మానవలోకంలో వేదాలయొక్క, ధర్మాలయొక్క ఆధిక్యం నశించి యజ్ఞయాగాదులు లేకపోవటంవలన తాము బలహీనులం అవుతున్నా'మని తమ భయాన్ని తెల్పి రక్షించు మని ప్రార్థించారు. అందుకు బ్రహ్మ 'దానికి ప్రతిక్రియగా తగిన ఏర్పాటు చేస్తున్నా' నని భయపడవల దని తెల్పి సప్తోపాయాలు, దండనీతి రీతిని, ద్వాదశరాజ మండలాలను, పంచోపాయాలను మొదలైన వాటిని, వాటి వివరణతోపాటు పురుషార్థాలకు సాధకాలుగా ఉండేటట్లు లక్ష అధ్యాయాలతో సకలలోకహితార్థంగా నీతిశాస్త్రాన్ని రచించాడు. నీతి శాస్త్రం లోకంలోని ప్రజల నడవడికలను నిర్మలం చేస్తుం'దని అనుగ్రహించాడు. ఆ బ్రహ్మ నొసటినుండి విరూపాక్షుడు విశాలాక్షు డనే పేరుతో ఆవిర్భవించి, ఆ నీతి శాస్త్రాన్ని తెలిసికొని నేర్చుకొనటానికి కావలసిన ఆయుస్సు, బుద్ధి మనుష్యులకు చాలవని చింతించి ఆ మహిమాన్వితమైన నీతిశాస్త్రాన్ని సంక్షిప్తంగా పదివేల అధ్యాయాలతో 'వైశాలాక్ష' మనే పేరుతో నిర్మించాడు.

ఆ. హరునివలనఁ బడసి యాశాస్త్ర మమరేంద్రుఁ । డయిదు వేలు సేసె నమరగురుఁడు
దేటపడ నొనర్చెఁ ద్రిసహస్రకాధ్యాయ । రూప సమ్మితముగ భూపవర్య! 204

ప్రతిపదార్థం: భూపవర్య!= భూ భర్తలలో శ్రేష్ఠుడైన ఓ ధర్మరాజా!; హరుని వలనన్+పడసి= విశాలాక్షుడి వలన పొంది; అమర+ఇంద్రుడు= దేవేంద్రుడు; ఆ శాస్త్రమున్= ఆ నీతి శాస్త్రాన్ని; అయిదువేలు+చేసెన్= ఐదువేల అధ్యాయాలకే తగ్గించాడు; అమర గురుఁడు= దేవతల గురువైన బృహస్పతి; త్రి సహస్రక+అధ్యాయ రూప సమ్మితముగన్= మూడువేల అధ్యాయాలతో కూడినట్లుగా; తేటపడన్+ఒనర్చెన్= స్పష్టమయ్యేటట్లు నిర్మించాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! విశాలాక్షుడివలన మహేంద్రుడు ఆ నీతిశాస్త్రాన్ని పొంది ఐదువేల అధ్యాయాలకు కుదించాడు. దానిని బృహస్పతి మూడువేల అధ్యాయాలతో అందరికి అర్థమయ్యే రీతిలో మరీ సంక్షిప్తంగా రచించాడు.

వ. దాని శుక్రుండు సహస్రాధ్యాయ పరిమితంబుఁ గావించె; మఱియు మనుష్యుల శక్తి యెఱింగి మునులు క్రమంబున సంక్షిప్త రూపంబులుగా గ్రంథంబులు గావించి;రిది నీతి శాస్త్రప్రవర్తన ప్రకారం;బట్లు సుర లమ్మేలు వడసి విశ్వలోకేశ్వరుం డగు విష్ణుపాలికిం జని తగం గని కార్యంబు విన్నవించి, నీతిశాస్త్ర సముద్భవం బెఱింగించి, దీని నధిగమింపను, దదీయాచారంబు నడపను శక్తుం డగు వాని నొక్కరుని నిర్దేశింపవలయు నని యభ్యర్థించిన నద్దేవుండు నిజతేజోమయుండుగా నొక్క మానసపుత్రు నిర్మించి విరజుం డను పేరిడియె; నతండు భూమికిం బ్రభువుగా నొల్లకుండెఁ; దత్సుతుండు కర్దముండు ననపేక్షిత రాజ్యుండై తపంబున కరిగెఁ; దదీయ పుత్రుం డనంగుండు దండనీతి నయించి భూ ప్రజలం బాలించె; నతని కొడుకు నీతి యనువాఁ డమ్మహారాజ్యంబున కభిషిక్తుండై యింద్రియ వశత్వంబు నొందిమృత్యుపుత్రి సునీథ యను కామినిం గమనీయాకార నతిమనోహర గుణ విభాసినిం బరిణయంబైన, దానియందు వేనుండు గలిగి మాతామహదోషంబునం జేసి రాగద్వేషంబులం బ్రజకు విరుద్ధుం డయ్యె; నట్లగుటయు మహామునులు గూడి యేతెంచి మంత్రపూతంబు లగు కుశసంచయంబుల నతనిం బ్రశమితుం జేసి తద్దక్షిణోరుతలంబు మథించిన. 205

ప్రతిపదార్థం: దానిన్= ఆ నీతిశాస్త్రాన్ని; శుక్రుండు= శుక్రాచార్యుడు; సహస్ర+అధ్యాయ పరిమితంబున్+కావించెన్= వేయి అధ్యాయాలకు తగ్గించి రచించాడు; మఱియున్= ఇంకా; మనుష్యుల శక్తి+ఎఱింగి= మానవుల సామర్థ్యాన్ని గుర్తించి; మునులు; క్రమంబున్= వరుసగా; సంక్షిప్త రూపంబులుగాన్= క్లుప్తంగా; గ్రంథంబులు+కావించిరి= గ్రంథాలు రచించారు; ఇది నీతిశాస్త్ర ప్రవర్తన ప్రకారంబు= ఇది నీతిశాస్త్రం ప్రవర్తిల్లిన విధానం; అట్లు= ఆ విధంగా; సురలు+ఆ+మేలు పడసి= దేవతలు ఆ మేలును పొంది; విశ్వలోక+ఈశ్వరుండు+అగు= విశ్వానికి అంతటికి అధిపతియైన; విష్ణుపాలికిన్+చని= విష్ణువు వద్దకు వెళ్ళి; తగన్+కని= ఉచితరీతిని సందర్శించి; కార్యంబు విన్నవించి= తాము వచ్చిన పనిని తెలియజేసి; నీతిశాస్త్ర సముద్భవంబు+ఎఱింగించి= నీతిశాస్త్రం యొక్క పుట్టుకను తెలియ చెప్పి; దీనిన్+అధిగమింపను= దీనిని పఠించటానికి; తదీయ+ఆచారంబు నడపను= నీతిశాస్త్ర సంప్రదాయాన్ని నిర్వర్తించటానికి; శక్తుండు+అగువానిన్+ఒక్కరుని= సమర్థుడైన ఒక వ్యక్తిని; నిర్దేశింప వలయున్+అని+అభ్యర్థించినన్= చూపించవలసింది అని ప్రార్థించగా; ఆ+దేవుండు= ఆ విష్ణువు; నిజ తేజోమయుండు కాన్= తనదైన ప్రకాశం కలవాడైన; ఒక్కమానస పుత్రున్+నిర్మించి= ఒక్క మానసపుత్రుడిని సృష్టించి; విరజుండు+అనుపేరు+ఇడియెన్= విరజు డనే పేరు పెట్టాడు; అతండు= ఆ విరజుడు; భూమికిన్+ప్రభువుగాన్+ఒల్లకుండెన్= భూమికి రాజు కావటానికి ఇష్టపడలేదు. తద్+సుతుండు= అతడి కుమారుడు; కర్దముండున్= కర్దముడనే వాడు; అనపేక్షిత రాజ్యుండు+ఐ= ఇష్టంలేని రాజ్యం కలవాడై (అంటే రాజ్యంపై ఆసక్తిలేనివాడై); తపంబునకున్+అరిగెన్= తపస్సు చేసికొనటానికి వెళ్ళిపోయాడు; తదీయ పుత్రుండు+అనంగుండు= ఆ కర్దముడి కుమారుడైన అనంగుడు; దండనీతి నయించి= దండనీతి ననుసరించి; భూప్రజలన్+పాలించెన్= భూలోకంలోని ప్రజలను పరిపాలించాడు; అతని కొడుకు= అతడి పుత్రుడు; నీతి+అనువాఁడు= నీతి అనుపేరుగలవాడు; ఆ+మహారాజ్యంబునకున్+అభిషిక్తుండు+ఐ= ఆ గొప్ప రాజ్యానికి పట్టాభిషిక్తుడై; ఇంద్రియ వశత్వంబున్+ఒంది= ఇంద్రియాలకు లోనయి; మృత్యుపుత్రి= మృత్యువు యొక్క కుమారి అయిన; సునీథ+అను కామినిన్= సునీథ అనే స్త్రీని; కమనీయ+ఆకారన్= మనోహరమైన ఆకారం కలదానిని; అతి మనోహర గుణ విభాసినిన్+ పరిణయంబు+ అయినన్= మిక్కిలి సౌందర్యం, గుణాలచేత ప్రకాశిస్తున్న దానిని వివాహం కాగా; దానియందున్= ఆ సునీథయందు; వేనుండు+కలిగి= వేనుడనే వాడు పుట్టి; మాతామహ దోషంబునన్+చేసి= తల్లి తండ్రి యొక్క దోషం వలన; రాగ ద్వేషంబులన్= అనురాగ ద్వేషాల వలన; ప్రజకున్+విరుద్ధుండు+అయ్యెన్= ప్రజలకు విరోధి అయ్యాడు; అట్లు+అగుటయున్= ఆ విధంగా కావటం వలన; మహాములులు+కూడి+ఏతెంచి= మహర్షులు కలిసి వచ్చి; మంత్ర పూతంబులు+అగు= మంత్రాలచేత పవిత్రీకరించబడిన; కుశ సంచయంబులన్= దర్భల సమూహంతో; అతనిన్+ప్రశమితుం+చేసి= అతడిని ఉపశమింపజేసి; తద్+దక్షిణ+ఊరుతలంబు+మథించినన్= అతడి యొక్క కుడి తొడను మథించగా.

తాత్పర్యం: ఆ నీతిశాస్త్రాన్ని శుక్రాచార్యుడు వేయి అధ్యాయాలకు కుదించాడు. మహర్షులు క్రమంగా మానవుల శక్తికి అనుగుణంగా సంక్షిప్తం చేశారు. ఇది నీతిశాస్త్రం ప్రవర్తిల్లిన విధం. దేవతలు విష్ణుసన్నిధికి వెళ్ళి నీతిశాస్త్రం పుట్టుకను వివరించి, దాన్ని అభ్యసించి, తదుచితంగా నడపగల సమర్థుడిని నిర్దేశించుమని ప్రార్థించారు. విష్ణువు తనతో సమాన తేజస్సుగల మానసపుత్రుని సృష్టించి విరజు డని నామకరణం చేశాడు. అతడు రాజు కావటానికి అంగీకరించలేదు. అతడి కుమారుడు కర్దముడు రాజ్యపాలనకు ఇష్టపడక తపస్సుకు వెళ్ళిపోయాడు. అతడి కుమారుడు అనంగుడు దండనీతి ననుసరించి ప్రజలను పాలించాడు. అతడి పుత్రుడు నీతి అనేవాడు రాజ్యాభిషిక్తుడై చక్కటి అందచందాలతో ప్రకాశిస్తూ ఉండిన మృత్యుపుత్రిక అయిన సునీథను పెండ్లాడి ఆవిడయందు వేనుడనే కుమారుడిని పొందాడు. మాతామహుడి దోషంవలన వేనుడు రాగద్వేషాల కారణంగా ప్రజావిరుద్ధు డయ్యాడు. అట్లా కావటంతో మహాములులు కలిసి వచ్చి మంత్రాలతో పవిత్రీకరించిన దర్భలతో అతడిని ఉపశమింపజేసి అతడి కుడితొడను మథించారు.

క. వినుఁ కాలిన కొఱవి తెఱం । గున నల్ల దనంబు మిగులు కుఱుచ యొడలు నె
ఱ్ఱని కన్నులు నై యశుచి । త్వ నిరూఢుం డొకఁడు పుట్టె ధర్మతనూజా! 206

ప్రతిపదార్థం: ధర్మతనూజా!= ఓ ధర్మరాజా! వినుఁ= వినుము; కాలిన కొఱవి తెఱంగునన్= కాలిన కొరవివలె; నల్ల దనంబున్= నల్లదనం; మిగులు= అతిశయించే; కుఱుచ+ఒడలున్= మిక్కిలి పొట్టి శరీరమూ; ఎఱ్ఱని కన్నులున్+ఐ= ఎఱ్ఱని కన్నులు కలిగి; అశుచిత్వ నిరూఢుండు+ఒకఁడు= శుచి శుభ్రత లేనివా డొకడు; పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! మునులు వేనుడి కుడితొడను మథించగా, కాలిన కొరవివలె నల్లనై, మిక్కిలి పొట్టి శరీరంతో ఎఱ్ఱని కన్నులు కలిగి, అశుచి అయిన ఒకడు జన్మించాడు.

వైన్యుం డనురాజు చరిత్రంబు భీష్ముఁడు ధర్మజునకుం జెప్పుట (సం. 12-59-201)

వ. వానిం జూచి యా ఋషులు 'నిషీద' యని పలికి వర్జించుటం జేసి తత్సంతాన జాతులు నిషాదు లనం బరఁగి వింధ్యాది గిరి వన ప్రదేశంబులఁ గ్రూరత్వంబున వర్తిల్లి; రమ్మునులు మఱియు నా రాజు దక్షిణ బాహువు మథించిన నుజ్జ్వలత్కవచ శరశరాసన భాసమానుండును వేద వేదాంగ ధనుర్వేద పారగుండును నగు పరమాకారవంతుం డుదయించె; సకల దండనీతియు నప్పురుషు నాశ్రయించె; నతం; డమ్మహాత్ముల కభిముఖుండును బ్రాంజలియు నై వినయంబున. 207

ప్రతిపదార్థం: వానిన్+చూచి= ఆ పొట్టి మనిషిని చూచి; ఆ ఋషులు= ఆ మహర్షులు; నిషీద+అని పలికి= కూర్చుండు మని చెప్పి; వర్జించుటన్+చేసి= వదలిపెట్టటం వలన; తద్+సంతాన జాతులు= ఆ పొట్టిమనిషికి జన్మించిన జాతులు; నిషాదులు+అనన్+పరఁగి= నిషాదులు అనే పేరుతో; వింధ్య+ఆది గిరి వన ప్రదేశంబులన్= వింధ్య మొదలైన పర్వతాలలో, అరణ్యాలలో; క్రూరత్వంబునన్= క్రూర స్వభావంతో; వర్తిల్లిరి= ప్రవర్తిల్లారు; ఆ+మునులు= ఆ మహర్షులు; మఱియున్= మళ్ళీ; ఆ రాజు దక్షిణ బాహువును మథించినన్= ఆ వేనుని కుడి భుజాన్ని మథించగా; ఉజ్జ్వలత్+కవచ శర శరాసన భాసమానుండునున్= ప్రకాశిస్తున్న కవచమూ, బాణాలు, విల్లుతో సూర్యకాంతితో ప్రకాశించే; వేద వేద+అంగ ధనుఃవేద పారగుండునున్+అగు= వేదాలలో వేదాంగాలలో, ధనుర్వేదంలో తుదముట్టి ఎరిగినవాడు అయిన; పరమ+ఆకారవంతుండు+ఉదయించెన్= శ్రేష్ఠమైన స్వరూపంతో జన్మించాడు; సకల దండనీతియున్= సమస్తమైన దండనీతి; ఆ+పురుషున్+ఆశ్రయించెన్= ఆ మహాపురుషుడిని ఆశ్రయించింది; అతండు+ఆ+మహాత్ములకున్= ఆ మహాపురుషుడు ఆ మహనీయులకు; అభిముఖుండును= ఎదురుగా నిలబడ్డవాడు; ప్ర+అంజలియున్+ఐ వినయంబునన్= దోసిలొగ్గినవాడు అయి, వినయంతో.

తాత్పర్యం: ఆ పొట్టి మనిషితో మునులు 'నిషీద' అనటంవలన అతడి సంతతి జాతులు నిషాదులై వింధ్యపర్వతం మొదలుకొని ఉన్న వనప్రదేశాలలో క్రూరస్వభావంతో నివసించటం ప్రారంభించారు. ఆ మహర్షులు మళ్ళీ వేనుడి కుడి బాహువును మథించగా వేద వేదాంగాలలోను, ధనుర్వేదంలోను పారంగతుడు - ప్రకాశించే కవచంతో, ధనుర్బాణాలతో మహాపురుషుడు జన్మించాడు. ఆ వెంటనే దండనీతి ఆ మహాపురుషుడిని ఆశ్రయించింది. ఆ పురుషుడు మునుల ఎదుట నిలిచి వినయంతో అంజలి ఘటించాడు.

తే. 'వినుఁడు! ధర్మార్థ తత్త్వ ప్రవీణ యగుచు । సూక్ష్మదర్శిని యైనది సుకృతులార!
నాదు బుద్ధి; మీ కెప్పని నడపవలయు । దీనిఁ గొని నన్నుఁ బనుపరే దాని' కనిన. 208

ప్రతిపదార్థం: సుకృతులార!= పుణ్యాత్ములారా!; వినుఁడు= దయతో వినండి; నాదు బుద్ధి= నా యొక్క బుద్ధి; ధర్మ+అర్థ తత్త్వ ప్రవీణ+అగుచున్= ధర్మమూ, అర్థమూ వీటి స్వభావంలో నిపుణమై; సూక్ష్మదర్శిని+ఐనది= సూక్ష్మవివేచనతో ఒప్పుతూ

ఉన్నది; మీకున్+ఏ+పనిన్+నడపవలయున్= మీ కొరకు ఏ పని చేయాలో; దీనిన్+కొని= దీనిని గ్రహించి; దానికిన్= అందుకై; నన్నున్+పనుపరే!= నన్ను ఆజ్ఞాపించరా!; అనినన్= అని ప్రార్థించగా.

తాత్పర్యం: 'ఓ మహాత్ములారా! నా మనస్సు ధర్మార్థస్వభావాలలో ప్రవీణమయింది. సూక్ష్మవివేచనతో ఒప్పుతూ ఉన్నది. ఇటువంటి నా బుద్ధిని గ్రహించి, మీకై ఎట్లాంటి మహాకార్యం చేయమంటారో ఆజ్ఞాపించండి' అని ఆ మహాపురుషుడు ప్రార్థించాడు.

వ. వారునుం దత్సమయ సమాగతు లయిన విబుధులును నవ్వైన్యాభిధాను నభినందించి. 209

ప్రతిపదార్థం: వారునున్= ఆ మునులూ; తద్+సమాగతులు+అయిన= అక్కడికి వచ్చిన; విబుధులును= దేవతలూ; ఆ+వైన్య+అభిధానున్+అభినందించి= ఆ వైన్యుడనే పేరు కలిగిన ఆ మహాపురుషుడిని మెచ్చుకొని.

తాత్పర్యం: ఆ మహర్షులూ, అక్కడికి వచ్చిన విద్వాంసులు వైన్యు డనే పేరు కలిగిన ఆ మహాపురుషుడిని మెచ్చుకొని - (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. మాన లోభములఁ గామ క్రోధములఁ బాసి । సర్వ జంతువులకు సముఁడ వగుచు
నియత ధర్మము నీవు నిశ్శంక నడపుము; । ప్రియము నప్రియము నుపేక్షఁ గూర్పు;
'దండనీత్యాశ్రయ ధర్మంబు నా పని; । దీనిఁ జేయుదు సావధాన వృత్తి;
రక్షింతు శ్రుతుల; వర్ణముల సంకరములు । సొరనీ; నదండ్యులు ధరణి దివిజు

తే. లరయువాఁడ నే భూప్రజ'నని ప్రతిజ్ఞ । యను మహోన్నత పద మెక్కు మనుడు, నాతఁ
'డవనిసురులు సహాయత్వ మాచరించి । రేని న ట్లగుఁ గా' కనియెం గుమార! 210

ప్రతిపదార్థం: కుమార!= మనుమడైన ఓ ధర్మరాజా! మాన లోభములన్+కామ క్రోధములన్+పాసి= మాన లోభాలను, కామ క్రోధాలను వదలిపెట్టి; సర్వ జంతువులకున్= సమస్త ప్రాణులకు; సముఁడవు+అగుచున్= సమానుడ వవుతూ; నియత ధర్మమున్+ఈవు= నియమితమైన ధర్మాన్ని నీవు; నిశ్శంకన్+నడపుము= నిస్సందేహంగా కొనసాగించుము; ప్రియమున్+అప్రియమున్+ఉపేక్షన్+కూర్పు= ప్రియాప్రియాలను నిర్లిప్తంగా నిర్వహించుము; దండనీతి+ఆశ్రయ ధర్మంబు నా పని= దండనీతిని ఆశ్రయించిన ధర్మమే నేను చేయవలసిన పని; దీనిన్+చేయుదున్= దీనిని నేను చేస్తాను; స+అవధాన వృత్తిన్= ఏకాగ్రతతో కూడిన పద్ధతితో; శ్రుతులన్= వేదాలను; రక్షింతున్= రక్షిస్తాను; వర్ణములన్+సంకరములు= వర్ణసంకరం; చొరనీను= ప్రవేశింప నీయను; ఏను= నేను; ధరణిదివిజులు= బ్రాహ్మణులు; అదండ్యులు= శిక్షార్హులు కానివారైన; భూ ప్రజన్= భూమిలోని ప్రజానీకాన్ని; అరయువాఁడన్= ప్రేమతో చూస్తాను అని; ప్రతిజ్ఞ+అను= ప్రతిజ్ఞ అనే; మహా+ఉన్నత పదము+ఎక్కుము+ అనుడున్= అత్యున్నత పదవిని అలంకరించవలసిందని చెప్పగా; ఆతఁడు= ఆ మహాపురుషుడు; అవని సురులు= భూదేవతలైన బ్రాహ్మణులు; సహాయత్వము+ఆదరించిరి+ఏని= సహాయ సహకారా లందిస్తే; అట్లు+అగున్+కాక+ అనియెన్= మీరుకోరినట్లే ఔతుందని చెప్పాడు.

తాత్పర్యం: దురహంకారం, లోభం, కామక్రోధాలు అనే దుర్గుణాలను వదలి సమస్తప్రాణులపట్ల సముడవై, శాస్త్ర విహితంగా రాజధర్మాన్ని అనుక్షణం నిస్సంకోచంగా పరిపాలించవలసింది. ఇష్టానిష్టాలను లెక్కచేయక నిర్లిప్తుడవై కర్తవ్యాన్ని యథావిధిగా నిర్వర్తించాలి. దండనీతిని అనుసరించిన ధర్మసంరక్షణమే నా దైనందిన విధి. ఈ నియమ నిష్ఠలో సావధానుడనై వేదసంరక్షణతో వర్ణాశ్రమాల సాంకర్యం పరిహరిస్తాను. భూప్రజలందరినీ దయాంతఃకరణుడవై

పాలిస్తాననే దృఢప్రతిజ్ఞాసింహపీఠిపై అధిష్ఠితుడవు కావాలి అని మునులు ఆదేశించారు. 'నాకు బ్రాహ్మణులు సహాయసహకారా లందిస్తే అదే రీతిగా ప్రవర్తించగల'నని ఆ వైన్యుడు విన్నవించాడు.

వ. అనిన విని వారలు ప్రీతచిత్తులై యాతనికి మహీసురులు సహాయత్వం బాచరించువారుగా ననుమతి సేసి; రయ్యవసరంబున వాత్సల్యంబున సకల దివ్య పరివృతులై వచ్చి విష్ణు విధాతలు నమ్మునీశ్వరులును నక్కుమారు నఖిల ధరణీ సామ్రాజ్యాభిషేకంబు నిర్వర్తించి; రవ్విభునకు శుక్రుండు పురోహితుండును వాలఖిల్యుల యందు సారస్వతగణం బమాత్యులును గర్గుండు సాంవత్సరికుండు నై నడచిరి. మున్ను మహి విషమ యగుటయు నమ్మనుజపతి సమమూర్తి గావించుటయు విందుము. కరచరణాద్యవయవములతో నవనియు సాగరంబులును మహాగిరులును నగ్గురు ప్రభావుని భజియించె. 211

ప్రతిపదార్థం: అనినన్ విని= అని వైన్యుడు చెప్పగా మహర్షులు విని; వారలు= ఆ మహర్షులు; ప్రీతచిత్తులు+ఐ= మనసులో సంతోషించిన వారై; అతనికిన్= ఆ వైన్యునకు; మహీసురులు= బ్రాహ్మణులు; సహాయత్వంబు+ఆచరించు వారుగాన్= సహాయం చేసేవారుగా; అనుమతి+చేసిరి= అనుమతించారు; ఆ+అవసరంబునన్= ఆ సందర్భంలో; వాత్సల్యంబునన్= ప్రేమతో; సకలదివ్య పరివృతులు+ఐ= సమస్త దేవతలతో కూడినవారై; వచ్చి; విష్ణు విధాతలున్= విష్ణువూ, బ్రహ్మ; ఆ+ముని+ఈశ్వరులునున్= ఆ మునీంద్రులు; ఆ+కుమారున్= ఆ వైన్యుడిని; అఖిల ధరణీసామ్రాజ్య+అభిషేకంబున్+నిర్వర్తించిరి= సమస్త భూమికి రాజ్యాభిషిక్తుడినిచేశారు; ఆ+విభునకున్= ఆ వైన్యుడనే రాజుకు; శుక్రుండు పురోహితుండును= శుక్రాచార్యుడు పురోహితుడుగాను; వాలఖిల్యుల+అందున్= వాలఖిల్య మహర్షులలో; సారస్వత గణంబు= సారస్వత గణమనే మునులు; అమాత్యులును= మంత్రులుగానూ; గర్గుండు= గర్గుడు; సాంవత్సరికుండున్+ఐ= జ్యోతిష్కుడై; నడచిరి= ప్రవర్తించారు; మున్ను= పూర్వం; మహి= భూమి; విషమ+అగుటయున్= సమానంగా లేకపోవటం (ఎగుడు దిగుడుగా ఉండటం) వలన; ఆ+మనుజపతి= ఆ రాజు; సమమూర్తి+కావించుటయున్= మిట్ట పల్లాలు లేని సమతలమైన భూమిగా చేయటాన్ని; విందుము= విన్నాము; కరచరణ+ఆది+అవయవంబులతోన్= చేతులు, కాళ్ళు మొదలైన శరీర భాగాలతో; అవనియున్= భూమి; సాగరంబులును= సముద్రాలూ; మహాగిరులునున్= మహాపర్వతాలూ; ఆ+గురుప్రభావుని= గొప్ప మహిమను పొందిన వైన్యమహారాజును; భజియించెన్= సేవించాయి.

తాత్పర్యం: అని వైన్యుడు చెప్పగా విన్న మహర్షులు సంతోషచిత్తు లయ్యారు. వారు ఆ వైన్యుడికి బ్రాహ్మణులను సహాయకులుగా అనుమతించారు. ఆ సందర్భంలో ప్రేమతో సమస్తదేవతలతో కూడినవారైన బ్రహ్మవిష్ణువులూ మహర్షులూ సమస్తభూమికీ వైన్యుడిని రాజుగా అభిషేకించారు. ఆ వైన్యుడికి శుక్రాచార్యుడు పురోహితుడుగా సారస్వత్యగణం మంత్రులుగా, గర్గుడు జ్యోతిష్కుడుగా వర్తించారు. అంతకు ముందు భూమి మిట్టపల్లాలతో ఉండగా, వైన్యుడే సమతలం చేశా డని విన్నాం. శరీరావయవాలతో కూడి భూమీ, సప్త సముద్రాలూ, కులపర్వతాలూ ఆ మహానుభావుడిని సేవించాయి.

క. సురపతి విభవము, మేరువు, హిరణ్యమును, గిన్న రేశుఁ డీడిత సంప
ద్గురుతయు నొసఁగిరి రథ కరి, తురగ భటావళులు తలఁపుతో నొడఁగూడెన్. 212

ప్రతిపదార్థం: సురపతి= దేవతల రాజైన ఇంద్రుడు; విభవమున్= సమస్త వైభవాన్నీ; మేరువు= మేరుపర్వతం; హిరణ్యమును= బంగారాన్నీ; కిన్నర+ఈశుఁడు= కిన్నరులకు రాజైన కుబేరుడు; ఈడిత= ప్రశస్తమైన; సంపద్+గురుతయున్= అధికమైన సంపదనూ; ఒసఁగిరి= ప్రసాదించారు; తలఁపుతోన్= భావించగానే; రథ, కరి, తురగ, భట+ఆవళులు= రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలం యొక్క సమూహం; ఒడఁగూడెన్= సమకూడినది.

తాత్పర్యం: ఆ వైన్య మహారాజుకు ఇంద్రుడు సమస్త వైభవాన్నీ, మేరు పర్వతం బంగారాన్నీ, కుబేరుడు ప్రశస్తమూ, అధికమూ అయిన సంపదనూ ప్రసాదించారు. భావించిందే ఆలస్యంగా రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలముల సమూహమూ సమకూరాయి.

వ. ఇట్లు మహనీయ ప్రభుత్వ పదస్థుండై యమ్మహాత్ముండు శాస్త్రోక్త మార్గంబున దండనీతి పరిపాలనంబు ధర్మతాత్పర్య సమీచీనంబుగా నాచరించె. 213

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మహనీయ ప్రభుత్వ పదస్థుండు+ఐ= మహిమాన్వితమైన అధికార పదవిని పొందినవాడై; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడైన వైన్యుడు; శాస్త్ర+ఉక్తమార్గంబునన్= శాస్త్రాలలో చెప్పబడ్డ రీతిలో; దండనీతి పరిపాలనంబున్= దండనీతితో పాలించటాన్ని; ధర్మతాత్పర్య సమీచీనంబుగాన్+ఆచరించెన్= ధర్మానుగుణంగా, సత్యరీతిగా కొనసాగించాడు.

తాత్పర్యం: మహోన్నతమైన అధికార పదవిని అలంకరించిన ఆ వైన్యుడు, శాస్త్రోక్తంగా దండనీతితో ధర్మాను రక్తుడై, సత్యవ్రతుడై పరిపాలన సాగించాడు.

క. ఉరగాదులవలని భయముఁ । బొరయక యొండొరులతోడఁ బొసఁగి రుజలుఁ జి
త్తరుజలు లేక యతని తఱి । ధరణీప్రజ సస్యసంపదయుఁ గల్గి మనున్. 214

ప్రతిపదార్థం: అతని తఱిన్= ఆ వైన్య మహారాజు పరిపాలన సమయంలో; ధరణీ ప్రజలు= భూ ప్రజ; ఒండు+ఒరుల తోడన్+పొసఁగి= పరస్పరం కలసి మెలసి; ఉరగ+ఆదులవలని భయమున్+పొరయక= పాములు మొదలైన వాటి భయంలేకుండా; రుజలున్= శరీర సంబంధమైన రోగాలు; చిత్తరుజలు లేక= మానసిక రోగాలు లేకుండా; సస్యసంపదయున్+కల్గి= పైరు పంటల సంపదతో ఒప్పి; మనున్= జీవిస్తుంది.

తాత్పర్యం: ఆ వైన్యుడి పాలనలో ప్రజలంతా కలసి మెలసి పాములు మొదలైన విషపు పురుగుల బాధలు లేకుండా పాడిపంటలతో సుఖంగా జీవించారు.

తే. బ్రాహ్మణ క్షత సంత్రాణ పరతఁ జేసి । క్షత్రియాభిధానంబు, రంజనము నెల్ల
ప్రజకుఁ జేయుట కతమున రాజనామ । మును బ్రవర్తిల్లె నా నృపాలునకు నధిప! 215

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; ఆ నృపాలునకున్= ఆ వైన్య మహారాజుకు; బ్రాహ్మణ= బ్రాహ్మణులను; క్షతసంత్రాణ= వినాశంనుండి రక్షించటంలో; పరతన్+చేసి= ఆసక్తి కలిగి ఉండటంచేత; క్షత్రియ+ఆభిధానంబున్= క్షత్రియుడు అనే పేరును; ఎల్ల ప్రజకున్= సమస్త ప్రజలకూ; రంజనము చేయుట కతమునన్= ఆనందాన్ని కలిగించటం కారణంగా; రాజనామమును= రాజు అనే పేరును; ప్రవర్తిల్లెన్= కలిగాయి.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ వైన్యమహారాజు బ్రాహ్మణులను వినాశనంనుండి రక్షించే ఆసక్తి కలిగి ఉండటంచేత క్షత్రియుడనే పేరునూ, సర్వప్రజలనూ రంజింపచేయటంచేత రాజు అనే పేరునూ పొందాడు.

వ. తత్సంతతి జాతు లెల్లను దత్కల్పులై రాజత్వంబు వహించి దండనీతి పాలించిరి; రాజని యొకండు కలిగిన తెఅంగును రాజ్య స్థాపనంబును రాజు మిగిలి వర్తింప దక్కిన జనంబులకు రాకుండుటయు విష్ణు విహితంబులు విష్ణుండు రాజుల నిజ తేజోంశంబులం బ్రవేశించి యుండునట్లగుటంజేసి దైవ నిభుండగుచు రా జెల్ల వారిచేతను

మ్రొక్కుం గొనజాలుఁ, దద్రక్షణంబును నాచరించు; నొక్కని వశంబున లోకంబంతయు వర్తిల్లుటకు దేవ సంబంధ కలితం బయిన గుణంబు వెలిగా నొండు కారణంబు కలదే? యాకర్ణింపుము. 216

ప్రతిపదార్థం: తద్+సంతతి జాతులు+ఎల్లను= ఆ వైన్యుడనే రాజుయొక్క సంతాన సమూహమంతా; తద్+కల్పులు+ఐ= అతడితో సమానులై; రాజత్వంబు వహించి= రాజ్యాధికారాన్ని పొంది; దండనీతి పాలించిరి= దండనీతితో రాజ్యాన్ని పాలించారు; రాజు+అని+ఒకండు= రాజు అనే పేరుతో ఒకడు; కలిగిన తెఱంగును= సంభవించిన రీతిని; రాజ్యస్థాపనంబును= రాజ్య నిర్మాణాన్ని; తక్కిన జనంబులకున్= తదితర ప్రజలకు; రాజు మిగిలి= రాజును అతిక్రమించి; వర్తింపన్= ప్రవర్తించటానికి; రాకుండుటయున్= వీలుకాకుండా; విష్ణువిహితంబులు= విష్ణువుచేత విధించబడ్డాయి; విష్ణుండు= విష్ణుమూర్తి; రాజుల= రాజులయందు; నిజ తేజఃఅంశంబులన్ తన తేజోభాగాలను; ప్రవేశించి+ఉండునట్లు+అగుటన్+చేసి= ప్రవేశించి ఉంటాడు గాన; రాజు; దైవ నిభుండు+అగుచున్= దేవుడితో సమానమైనవాడై; ఎల్లవారిచేతను= సమస్త ప్రజలచేత; మ్రొక్కున్+కొనన్+చాలున్= నమస్కృతు లందు కొనటానికి అర్హుడయ్యాడు; తద్+రక్షణంబునున్+ఆచరించు= ఆ ప్రజలను రక్షిస్తాడు; ఒక్కని వశంబున్= ఒక్కడి వంశంలో; లోకంబు+అంతయున్= లోకమంతా; వర్తిల్లుటకున్= కొనసాగటానికి; దేవ సంబంధ కలితంబు+అయిన గుణంబు= దైవ సంబంధంతో కూడిన గుణం; వెలిగాన్= వేరుగా; ఒండుకారణంబు+కలదే?= ఇతర కారణ ముందా? (లేదు కదా); ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ వైన్యుడి సంతానమంతా అతడితో సమానులై దండనీతిని అనుసరించి రాజ్యం చేశారు. రాజనేవాడు పుట్టిన విధానమూ, రాజ్యస్థాపనమూ, రాజును అతిక్రమించకుండా ప్రజలు ప్రవర్తించటం అనే అంశాలు విష్ణునిర్ణయకాలే. విష్ణువు రాజులందు తన తేజోభాగాలను ప్రవేశింపజేయటంవలన రాజు దైవసమానుడై ప్రజల నమస్కారాలకు అర్హుడయ్యాడు. ప్రజాసంరక్షణం ఒకడి అధీనంలో ఉండటం అనేది దైవాంశ సంబంధమైన గుణం కాక మరొకటి అవుతుందా? వినుము.

విశేషం: ఈ వచనం మూలాను సారంగా సాగింది. మూలంకంటే తిక్కన సరళంగా విపులంగా రచించటం విశేషం. ఈ వచనంలో రాజుకు సంబంధించి విష్ణు ప్రాధాన్యాన్ని చెప్పటానికి 'నా విష్ణుః పృథివీ పతిః' అనే సూక్తి ఆధారం. విష్ణ్వంశలేనివాడు రాజు కాలేడని స్పష్టం.

మ. హరిఫాలంబునఁ బుట్టి ధర్మమున కాలై యర్థమన్పుత్రకున్
సిరి కాంచెన్ దగ వారు మువ్వురును సుస్థేమోన్నతిన్ సంశ్రయిం
తురు భూపాలకు నాతఁ డన్యజనతా తుల్యోద్భవుం డెట్లు ని
ర్జర లోకార్హ సమగ్ర పుణ్య వితతి ప్రాప్తుండు గా కారయన్. 217

ప్రతిపదార్థం: సిరి= సంపద (లక్ష్మి); హరిఫాలంబునన్= విష్ణువు నొసట; పుట్టి= జన్మించి; ధర్మమునకున్+ఆలై= ధర్మదేవతకు భార్య అయి; అర్థమన్+పుత్రకున్= అర్థమనే కుమారుడిని; కాంచెన్= పొందింది; తగన్= తగిన రీతిలో; వారు మువ్వురును= లక్ష్మి, ధర్మదేవత, అర్థమనే పుత్రుడూ వీళ్ళు ముగ్గురూ; సుస్థేమ+ఉన్నతిన్= మిక్కిలి దృఢంగా; భూపాలకున్= రాజును; సంశ్రయింతురు= ఆశ్రయిస్తారు; ఆరయన్= పరిశీలించగా; ఆతఁడు= ఆ రాజు; నిర్జరలోక+అర్హ= స్వర్గ లోకార్హమైన; సమగ్ర= సంపూర్ణమైన; పుణ్యవితతి= పుణ్యసమూహాన్ని; ప్రాప్తుండు+కాక= పొందినవాడు కాకుండా; అన్యజనతా తుల్య+ఉద్భవుండు+ఎట్లు?= ఇతర ప్రజలతో సమానమైన జననం కలవా డెట్లా అవుతాడు?

తాత్పర్యం: శ్రీమహావిష్ణువు ఫాలభాగంలో ఉద్భవించిన లక్ష్మి, ధర్మదేవుడికి భార్యయై, అర్థమనే పుత్రుడిని పొందింది. లక్ష్మి, ధర్మదేవత, అర్థమనే పుత్రుడు - ఈ ముగ్గురూ మిక్కిలి దృఢంగా రాజును ఆశ్రయిస్తారు.

అందుకే రాజు ఎంతో పుణ్యాన్ని పొందినవాడై స్వర్గలోకాన్ని పొందటానికి తగినవా డౌతాడు. అంతేగాని ఇతరులవంటి వాడు కాడు.

విశేషం: 'విష్ణోర్లలాటాత్కమలం సౌవర్ణమభవత్తథా, శ్రీస్సంభూతాయతో దేవీ పత్నీ ధర్మస్య ధీమతః' అంటూ సాగిన మూలంలోని నాలుగైదు శ్లోకాలకు యథామూల మీ పద్యం.

వ. దివంబున నుండి దండనీతి నయించుటకు వచ్చి వాసుదేవ మహత్త్వ భావితుండైన మహానుభావుండు కావున వర్ణంబులు నాశ్రమంబులుం దదాచార ప్రవర్తనంబులైన; వేద పురాణేతిహాసంబులును రాజున కధీనంబులు తదీయ మాహాత్మ్యంబున నతనియందు సౌందర్య శౌర్య చాతుర్యాది గుణంబులు కలుగ జనంబులు తలంతురు; తదాజ్ఞకు లోనై వర్తింతు రిది రాజులు దేవసములైన తెఱంగు; మఱియు నడుగవలయు వాని నడుగు' మనిన నయ్యాపగానందనునకుం బ్రణమిల్లి యప్పాండునందనుం డి ట్లనియె. 218

ప్రతిపదార్థం: దివంబునన్+ఉండి= స్వర్గం నుండి; దండనీతిన్ నయించుటకున్ వచ్చి= దండనీతిని ప్రాప్తింపజేయటం కొరకు వచ్చి; వాసుదేవ మహత్త్వ భావితుండు+ఐన= శ్రీమహావిష్ణువు మహిమను భావించేవాడైన; మహానుభావుండు+కావునన్= కాబట్టి; వర్ణంబులున్= చతుర్వర్ణాలూ; ఆశ్రమంబులున్= చతురాశ్రమాలూ; తద్+ఆచార ప్రవర్తనంబులు+ఐన= వాటి ఆచారాన్ని నిర్వహింపజేసేవైన; వేద పురాణ+ఇతిహాసంబులును= వేదాలూ, పురాణాలూ, ఇతిహాసాలూ; రాజునకు+అధీనంబులు= రాజు వశమై ఉంటాయి; తదీయ మాహాత్మ్యంబునన్= వాటియొక్క మహిమచేత; అతని+అందున్= ఆ రాజులో; సౌందర్య, శౌర్య చాతుర్య+ఆది గుణంబులు+కలుగన్= సౌందర్యమూ, పరాక్రమమూ, నైపుణ్యమూ మొదలైన ఉత్తమ గుణాలు ఉన్నాయని; జనంబులు= ప్రజలు; తలంతురు= భావిస్తారు; తద్+ఆజ్ఞకు లోను+ఐ= అందువలననే ఆ రాజాజ్ఞకు లోనై; వర్తింతురు= ప్రవర్తిస్తారు; ఇది రాజులు దేవ సములైన తెఱంగు= ఇది రాజులు దేవతలతో సమానులైన తీరు; మఱియున్= ఇంకా; అడుగవలయువానిన్= అడగవలసిన వాటిని; అడుగుము+అనినన్= అడుగు మని పల్కగా; ఆ+ఆపగా నందనునకున్= ఆ గంగాసుతుడైన భీష్మునకు; ప్రణమిల్లి= నమస్కరించి; ఆ+పాండునందనుండు= ఆ ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దండనీతిని ప్రాప్తింపజేయటానికి స్వర్గం నుండి దిగి వచ్చి శ్రీమహావిష్ణువు మహిమను భావించే మహానుభావుడు కావటంవలన, చతుర్వర్ణాలు, చతురాశ్రమాలు, వీటిని ఆచరించటానికి ఆధారాలైన వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు రాజునకు వశమై ఉంటాయి. వాటి మహిమచేతనే రాజులలో అందమూ, పరాక్రమమూ, నైపుణ్యమూ మొదలైన గుణాలు ఉంటా యని ప్రజలు భావించి రాజాజ్ఞకు లోనై ప్రవర్తిస్తారు. ఇది రాజులు దేవతలతో సమాన మని చెప్పిన తీరు. ఇంకా అడగవలసిన విషయాలు ఉంటే అడుగు'మని భీష్ముడు పల్కినప్పుడు ధర్మరాజు ఆయనకు నమస్కరించి ఇట్లా అన్నాడు.

**తే. 'అనఘ! నాలుగు వర్ణము లాశ్రమములు । నెన్ని కల? వెవ్వియ్ధంబుల నన్నిటికిని
వర్తనమ్ములు? వేర్వేఱ వానిఁ దెలుపు । విశ్వ రాజధర్మములను విస్తరింపు. 219**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన తాతా!; నాలుగు వర్ణములు= బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాలూ; ఆశ్రమములున్= బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే నాలుగు ఆశ్రమాలూ; అన్నిటికినీ= వాటన్నిటికీ; వర్తనంబులు= ఆచరించే పద్ధతులు; ఏ+విధంబులన్= ఏ రీతులలో; ఎన్ని కలవు= ఎన్ని ఉన్నాయో; వానిన్= వాటిని; వేర్వేఱన్= వేర్వేరుగా; తెలుపు= వివరించుము; విశ్వ రాజ ధర్మములను= ఈ ప్రపంచంలోని రాజధర్మాలను; విస్తరింపు= వివరంగా చెప్పుము.

తాత్పర్యం: 'ఓ తాతా! నాలుగు వర్ణాలూ, నాలుగు ఆశ్రమాలూ వాటన్నిటినీ ఆచరించే పద్ధతులూ ఏ విధంగా ఎన్ని ఉన్నాయో విడి విడిగా వివరించుము. ప్రపంచంలోని రాజధర్మాలను విపులీకరించుము'.

భీష్ముఁడు ధర్మజునకు వర్ణాశ్రమధర్మంబు లెఱిఁగించుట (సం. 12-60-1)

వ. అని యడిగిన నా దేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లనియె. 220

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని అడుగగా; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; ఆ+నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజశ్రేష్ఠుడైన ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని అడుగగా ఆ భీష్ముడు నరశ్రేష్ఠుడైన ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

క. 'కోపంబు లేమి, సత్యా । లాపము నిజ దార పర విలాసము శుచితా
గోపన మద్రోహం బవ । నీపాలక! సర్వవర్ణ నియత గుణంబుల్ 221

ప్రతిపదార్థం: అవనీపాలక!= ఓ ధర్మరాజా!; కోపంబులేమి= కోపం లేకపోవటం; సత్య+ఆలాపమున్= సత్యం చెప్పటం; నిజదార= తన భార్యయందు; పరవిలాసము= అత్యంతాసక్తి; శుచితాగోపనము= పరిశుద్ధతతో కూడిన రహస్యరక్షణం; అద్రోహంబున్= ద్రోహచింతన లేకుండటం; సర్వవర్ణ నియత గుణంబుల్= సమస్త వర్ణాలకు నియమితమైన ఉత్తమగుణాలు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఎట్లాంటి పరిస్థితిలోనైనా కోపం లేకుండా శాంతంగా ఉండటం, సత్యాన్నే చెప్పటం, స్వభార్యయందు ఆసక్తితో ఉండటం, పరిశుద్ధతతో కూడిన రహస్య రక్షణం, ద్రోహచింతన లేకుండటం అనే ఉత్తమ గుణాలను నాలుగు వర్ణాలవారు పాటించాలి.

ఆ. బ్రాహ్మణునకు దమము పరమ ధర్మం బవ । శ్యంబుఁ గృత్య మధ్యయనము; దాన
సర్వ కర్మములును, శాసితంబులు; వాని । నడపవలయు నిష్ఠ యెడప కతఁడు. 222

ప్రతిపదార్థం: బ్రాహ్మణునకున్= బ్రాహ్మణుడికి; దమము= ఇంద్రియనిగ్రహం; పరమ ధర్మంబు= శ్రేష్ఠమైన ధర్మం; అధ్యయనము= వేదాధ్యయనం; అవశ్యంబున్+కృత్యము= తప్పనిసరిగా చేయవలసిన పని; దానన్= దానివలన; సర్వ కర్మములును= సమస్త విహిత కర్మలూ; శాసితంబులు= శాసించబడ్డాయి; అతఁడు= ఆ బ్రాహ్మణుడు; నిష్ఠ+ఎడపక= నిష్ఠను వదలకుండా; నడపవలయున్= నిర్వహించాలి.

తాత్పర్యం: బ్రాహ్మణుడికి ఇంద్రియనిగ్రహం శ్రేష్ఠధర్మం. వేదాధ్యయనం నిత్యకృత్యం. దానివలన సమస్త విహిత కర్మలూ (అంటే యజ్ఞయాగాది కర్మలూ) నియమించబడ్డాయి. అతడు వాటిని నిష్ఠతో నిర్వర్తించాలి.

ఉ. కాని పథంబునం జనక, కారుణికత్వము గల్గి, శాంతిమైఁ
దా నడవంగ విప్రున కుదాత్తధనం బొడఁగూడె నేని సం
తానముఁ గూర్ప నర్హులకు ధర్మ నిరూఢతఁ బంచి పెట్ట దు
ర్మాన విదూరుఁడై పరఁగఁ బ్రాప్తుఁడు కౌరవవంశదీపకా! 223

ప్రతిపదార్థం: కౌరవ వంశదీపకా!= కురువంశ శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; కాని పథంబునన్+చనక= చెడు మార్గంలో నడవకుండా; కారుణికత్వము+కల్గి= దయ కలిగి; శాంతిమైన్= శాంతంతో; నడవంగన్= ప్రవర్తించగా; విప్రునకున్= బ్రాహ్మణుడికి; ఉదాత్త

ధనంబు+ఒడఁగూడెన్+ఏని= అధిక ధనం లభిస్తే; తాన్= తాను (ఆ బ్రాహ్మణుడు); సంతానమున్+కూర్పన్= సంతానమునకు ఇవ్వటానికి; అర్హులకున్= పాత్రులైనవారికి; ధర్మనిరూఢతన్= ధర్మానుబద్ధంగా; పంచిపెట్టన్= పంచిపెట్టటం వలన; దుర్మాన విదూరుఁడు+ఐ= అవమానాలకు దూరమైనవాడై; పరఁగన్+ప్రాప్తుడు= మెలగటానికి అర్హుడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! దుర్మార్గవర్తనుడు కాక, దయాంతఃకరణుడుగా, శాంతస్వభావుడుగా మెలిగే బ్రాహ్మణుడికి అతిశయిత మైన ధనం లభిస్తే అతడు దానిని సంతానమునకు ఇవ్వటానికి, అర్హులైన వారికి పంచిపెట్టటంకొరకు వినియోగిస్తే అవమాన దూరుడై మెలగటానికి అర్హుడౌతాడు.

విశేషం: వావిళ్లవారి ప్రతిలో ' సంతానముఁ గూర్ప కర్హులకు' అని పాఠాంతరం ఉన్నది. అది బాగుగా ఉన్నది. విప్రుడికి అధిక ధనం లభిస్తే దానిని తన సంతానానికి ప్రవర్తింపజేయక అర్హులైనవారికి ధర్మనిరతితో పంచిపెట్టాలనడం బాగుగా నున్నది.

చ. యజనము దాన కర్మమును నధ్యయనంబును దస్యుహింసయుం
బ్రజ కనురాగ మొందఁ బరిపాలన చేఁతయు సంగరంబున
న్విజిత విభీతిమై నురవణించుటయున్ నృపధర్మముల్; కురు
వ్రజ తిలకాయమాన! సమరంబు సుధర్మువు వీనిలోపలన్. 224

ప్రతిపదార్థం: కురువ్రజ తిలకాయమాన!= కురువంశశ్రేష్ఠుడైన ఓ ధర్మరాజా!; యజనము= యజ్ఞాచరణమూ; దాన కర్మమునున్= దానం చెయ్యటమూ; అధ్యయనంబును= వేదాధ్యయనమూ; దస్యుహింసయున్= దొంగలను శిక్షించటమూ; ప్రజకున్+అనురాగము+ ఒందన్= ప్రజలకు ప్రేమ కలిగేటట్లు; పరిపాలన చేఁతయున్= పరిపాలించటమూ; సంగరంబునన్= యుద్ధంలో; విజిత విభీతిమైన్= ఓటమి భయం లేకుండా; ఉరవణించుటయున్= పరాక్రమించటమూ; నృపధర్మముల్= రాజధర్మాలు; వీనిలోపలన్= పైన పేర్కొన్న వాటన్నిటిలోను; సమరంబు= యుద్ధం చెయ్యటం; సుధర్మువు= అత్యుత్తమ ధర్మం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! యజ్ఞాచరణమూ, దానకర్మమూ, వేదాధ్యయనమూ, దొంగలను శిక్షించటమూ, ప్రజానురాగంతో పరిపాలన చేయటమూ, యుద్ధంలో ఓడిపోతా ననే భయం లేకుండా పరాక్రమించటమూ రాజధర్మాలు. వీటన్నిటిలో యుద్ధ మనేది అత్యుత్తమ ధర్మం.

విశేషం: మూలంలో 'రాజు యజ్ఞం చెయ్యవచ్చు. యజ్ఞం చేయించకూడదు. దానం చెయ్యవచ్చు. యాచించకూడదు. అధ్యయనం చెయ్యవచ్చు. అధ్యాపనం చెయ్యకూడదు' అనే రీతిలో ఉండగా, నిషిద్ధధర్మాలను పరిహరించి తిక్కన రాజునకు అర్హధర్మాలను మాత్రమే పేర్కొనటంలో ఒక ప్రత్యేకతను ప్రదర్శించా డనవచ్చును.

తే. అధ్యయన దాన యజ్ఞంబు లధిప! వైశ్యు । నకును గృత్యముల్; శుద్ధార్జనమున ధనము
సంచితవ్యంబు పసుల రక్షించువాఁ డ । తండు; వానికి నిది మహా ధర్మ మనఘ! 225

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; వైశ్యునకును= చతుర్వర్ణాలలో మూడవ వాడైన వైశ్యుడికి; అధ్యయన= వేదాధ్యయనం; దాన యజ్ఞంబులు= దానం చేయటమూ, యజ్ఞం చేయటమూ అనేవి; కృత్యముల్= ఆచరించవలసిన కార్యాలు; అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; శుద్ధ+ఆర్జనమునన్= పరిశుద్ధమైన అంటే న్యాయ మార్గంలో సంపాదించిన; ధనము సంచితవ్యంబు= ధనం కూడబెట్టుకొనదగింది; అతండు= ఆ వైశ్యుడు; పసుల రక్షించువాఁడు= పశువులను రక్షించేవాడుగా ఉండాలి; వానికిన్+ఇది మహాధర్మము= ఆ వైశ్యుడి కిది ఉత్తమ ధర్మం.

తాత్పర్యం: 'పాప రహితుడవైన ఓ ధర్మరాజా! వైశ్యుడికి వేదాధ్యయనమూ, దాన యజ్ఞాచరణాలూ తప్పనిసరిగా ఆచరించవలసిన కార్యాలు. అతడు న్యాయమార్గంలోనే ధనార్జన చేసి కూడబెట్టాలి. పశుపాలనం వైశ్యుడి ప్రముఖ ధర్మం.

విశేషం: మూలంలో ఐదు శ్లోకాల్లో వైశ్యుని ధర్మాలు విస్తారంగా చెప్పబడగా తిక్కన ఈ తేటగీతిలో సంక్షిప్తంగా చెప్పాడు.

క. ఈ మూఁడు వర్ణములకును ; దా మంచిగఁ బనులు సేఁత ధర్మువు కురు ధా
త్రీ మహిళేశ్వర! శూద్రున ; కామెయి జీవనము వాని కజుఁడు విధించెన్. **226**

ప్రతిపదార్థం: కురు ధాత్రీ మహిళా+ఈశ్వర!= కురుభూమి అనే స్త్రీకి భర్త అయిన ఓ ధర్మరాజా!; ఈ మూఁడు వర్ణములకును= పైన పేర్కొన్న బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులనే మూడు వర్ణాలకూ; తాన్= తాను (శూద్రుడు); మంచిగన్+పనులు+చేఁత= సముచితంగా పనులు చెయ్యటం; శూద్రునకున్ ధర్మువు= శూద్రుడికి ధర్మం; ఆ మెయిన్= ఆ విధంగా; వానికిన్= ఆ శూద్రుడికి; అజుఁడు= బ్రహ్మ; జీవనము= జీవిత విధానం; విధించెన్= నిర్ణయించాడు.

తాత్పర్యం: 'ఓధర్మరాజా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు సముచిత రీతిలో పనులు చేస్తూ ఉండటం శూద్రుడికి ధర్మం. అతడికి ఆ జీవనవిధిని బ్రహ్మ నిర్ణయించాడు.

క. ధనధాన్యంబులు కూర్చుట ; జనపతి యనుమతము లేక చన;దతనికి దా
ననిరూఢి శ్రద్ధ గలిగినఁ ; జనునది సుపవిత్ర యగుట జగతీనాథా! **227**

ప్రతిపదార్థం: జగతీనాథా!= ఓ ధర్మరాజా!; అతనికిన్= ఆ శూద్రుడికి; జనపతి+అనుమతము లేక= రాజానుమతి లేకుండా; ధనధాన్యంబులు+కూర్చుట= ధనసంపాదనమూ, ధాన్యసేకరణమూ చెయ్యటం; చనదు= కూడదు; దాన నిరూఢిన్= దానం చేసి ప్రసిద్ధి పొందటంలో; శ్రద్ధ+కలిగినన్= ఆసక్తి ఉంటే; అది సుపవిత్ర+అగుట= అది మిక్కిలి పవిత్రమయినది కావటం వలన; చనున్= అర్హమైనదే (అంటే రాజానుమతి అవసరం లేదు).

తాత్పర్యం: శూద్రుడికి రాజానుమతి లేకుండా ధనధాన్యసేకరణం ఉచితం కాదు. ఉత్తమమార్గం కావటంవలన అతడు రాజానుమతి లేకుండానే దానధర్మాలకొరకు ధనం సంపాదించవచ్చును.

తే. అధిప! త్రైవర్ణికులకును యజ్ఞవిధుల ; శ్రద్ధ కలిమికి మిగులు ధర్మంబు లేదు;
యజ్ఞమునకంటె నధికమైనదియుఁ గలదె? ; యజ్ఞకర్తయ చూవె సర్వాధికుండు. **228**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; త్రైవర్ణికులకును= బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులనే మూడు వర్ణాలకు; యజ్ఞవిధులన్= యజ్ఞ కార్యాచరణంలో; శ్రద్ధ కలిమికిన్= ఆసక్తి కలిగి ఉండటం అనే దానికంటె; మిగులు ధర్మంబు లేదు= మించిన ధర్మం లేదు; యజ్ఞమునకంటెన్= యజ్ఞ కార్యంకంటే; అధికమైనదియున్+కలదె?= విశిష్టమైనది ఉన్నదా?; సర్వ+అధికుండు= అందరికంటె గొప్పవాడు; యజ్ఞ కర్తయ చూవె!= యజ్ఞ కర్తయే కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు యజ్ఞకార్యాచరణంలో శ్రద్ధ కలిగి ఉండటం ఉత్తమమైన ధర్మం. యజ్ఞకార్యంకంటె గొప్పది ఏమీ లేదు. అందరికంటె యజ్ఞకర్త గొప్పవాడు.

వ. ఆశ్రమ ధర్మంబు లాకర్ణింపుము. **229**

ప్రతిపదార్థం: ఆశ్రమ ధర్మంబులు+ఆకర్ణింపుము= నాలుగు ఆశ్రమాలు - బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాలు అనే వాటి ధర్మాలను గూర్చి చెప్పుతాను వినుము.

తాత్పర్యం: ఆశ్రమ ధర్మాలు నాలుగు - బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాలు అనే వాటి ధర్మాలను గూర్చి చెప్పుతాను వినుము.

మ. గురుశుశ్రూషయు, నాగమాధ్యయనమున్, గోష్ఠీ నిరాసంబుఁ ద
త్పరతం బొందొరయంగఁ దాఁ జొరమియున్, భైక్షాశనత్వంబు, ష
డ్వర కర్మంబులయందు రాగభరగాఢద్వేషముల్ లేక, యె
వ్వరితోడం బగగాక యున్కియును భవ్య బ్రహ్మచర్యోక్తముల్. 230

ప్రతిపదార్థం: గురు శుశ్రూషయున్= గురువులకు సేవ చేయటమూ; ఆగమ+అధ్యయనమున్= వేదాధ్యయనమూ; గోష్ఠినిరాసంబున్= సమావేశాలపట్ల నిరాసక్తతా; తత్పరతన్= ఆసక్తితో; పొందు+ఒరయంగన్= స్నేహం పొందడంలో; తాన్+చొరమియున్= తాను ఆసక్తుడు కాకుండా ఉండటమూ; భైక్ష+అశనత్వంబున్= భిక్షాన్నం భుజిస్తూ; రాగభర గాఢ ద్వేషముల్ లేక= ప్రేమాధిక్యం కానీ, ప్రగాఢమైన విద్వేషంగానీ లేకుండా; ఎవ్వరితోడన్+పగగాక= ఎవ్వరితోనూ శత్రుత్వం లేకుండటం అనే; షట్+వరకర్మంబుల+అందున్= శ్రేష్ఠమైన ఆరు కర్మల యందు; ఉన్కియున్= ఉండడమూ (జీవించటమూ); భవ్య బ్రహ్మచర్య+ఉక్తముల్= శ్రేష్ఠమైన బ్రహ్మచర్యాశ్రమ విషయంలో చెప్పబడిన ధర్మాలు.

తాత్పర్యం: గురుసేవ, వేదాధ్యయనం, సమావేశాల పట్ల అనాసక్తత, అలంకారాల పట్ల ఆసక్తి లేకుండా ఉండటం, భిక్షాన్నంతో బ్రతకటం, మిక్కిలి ప్రేమ, గాఢద్వేషమూ లేకుండా ఎవరితోనూ శత్రుత్వం వహించకుండా ఉండటమూ ఆరు శ్రేష్ఠమైన కర్మలను ఆచరిస్తూ జీవించటమే బ్రహ్మచర్యాశ్రమంలో ముఖ్యధర్మం.

మ. నిజదారైకపరత్వముం గరుణయున్ నిక్కంబునుం దాల్మియున్
సుజనా సంగము దేవ పిత్రతిథి సంశుద్ధార్చనల్ హవ్య భు
గ్భజనంబున్ సకలాశ్రమస్థలను శక్యప్రకియం బ్రోపుఁ బం
కజగర్భుండు గృహస్థ ధర్మములుగాఁ గల్పించె నుర్వీశ్వరా! 231

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ్వరా!= భూమికి అధిపతివైన ఓ ధర్మరాజా!; నిజదార+ఏక పరత్వమున్= తన భార్య యందు మాత్రమే ఆసక్తిని కలిగి ఉండటమూ; కరుణయున్= దయ; నిక్కంబునున్= సత్యమూ; తాల్మియున్= ఓర్పు; సుజనా సంగమున్= సజ్జన సాంగత్యం; దేవ పితృ+అతిథి సంశుద్ధ+అర్చనల్= దేవతల, పితృదేవతల అతిథుల పరిశుద్ధమైన పూజలు; హవ్యభుక్+భజనంబున్= అగ్నిదేవుడి పూజ; సకల+ఆశ్రమస్థలను= సమస్త ఆశ్రమ ధర్మాలను నిర్వహించే వారిని; శక్య ప్రక్రియన్+ప్రోపు= యథాశక్తి రక్షించటమూ; గృహస్థ ధర్మములుగాన్= గృహస్థాశ్రమ ధర్మాలుగా; పంకజగర్భుండు= కమల భవుడైన బ్రహ్మ; కల్పించెన్= నిర్ణయించాడు.

తాత్పర్యం: 'ఓధర్మరాజా! స్వభార్యాసక్తి, దయ, సత్యనిష్ఠ, ఓర్పు, సజ్జనసాంగత్యం, దేవతల, పితృదేవతల, అతిథుల సమర్చనం, అగ్నిపూజ, సమస్త ఆశ్రమధర్మ నిర్వాహకులను శక్త్యనుసారం పోషించటమూ అనేవాటిని గృహస్థాశ్రమ ధర్మాలుగా బ్రహ్మ నిర్ణయించాడు.

శా. తానున్ భార్యయు నేఁగుఁ బేరడవికిం దా నొక్కఁ డైనం జనున్
మానాహంకృతులూడ్చు నింద్రియములన్ మర్దించు నచ్చో జడల్
పూనుం దాపస శాస్త్రముల్ చదువుఁ జల్పున్ గోష్ఠి తత్జ్ఞాళితో
వానప్రస్థ విధా ప్రవిష్టుఁడు ప్రజా వాత్సల్య నిష్ణాతతన్. 232

ప్రతిపదార్థం: వాన ప్రస్థ విధా ప్రవిష్టుఁడు= వానప్రస్థ మనే ఆశ్రమ విధానాన్ని స్వీకరించినవాడు; ప్రజా వాత్సల్య నిష్ణాతతన్= సంతానం పట్ల మమకారం వదలినవాడై; పేరు+అడవికిన్= ఘోరారణ్యానికి; తానున్ భార్యయున్+ఏఁగున్= భార్యా సహితుడై వెళతాడు; తాను+ఒక్కఁడు+ఐనన్+చనున్= తా నొక్కడుగా నైనా వెళ్ళుతాడు; మాన+అహంకృతులు+ఊడ్చున్= అభిమానం, అహంకారం వదులుతాడు; ఇంద్రియములన్ మర్దించున్= ఇంద్రియాలను నిగ్రహిస్తాడు; అచ్చోన్= ఆ అరణ్యంలో; జడల్ పూనున్= జడలు ధరిస్తాడు; తాపస శాస్త్రముల్ చదువున్= తపస్సంబంధమైన శాస్త్రాలు తెలిసికొంటాడు; తద్+జ్ఞాళితోన్= ఆయా విషయాలలో జ్ఞానవంతులైన వారితో; గోష్ఠి సల్పున్= సమావేశమై చర్చిస్తాడు.

తాత్పర్యం: వానప్రస్థాశ్రమం స్వీకరించినవాడు సంతానంపట్ల మమకారాన్ని వదలి, తానొక్కడు గానీ, భార్యా సమేతంగా గానీ ఘోరారణ్యానికి వెళ్ళుతాడు, అభిమానాహంకారాలను వదలిపెట్టుతాడు. ఇంద్రియ నిగ్రహాన్ని కలిగి జడలు ధరిస్తాడు. తపస్సంబంధమైన శాస్త్రాధ్యయనం చేస్తాడు. ఆయా విషయాలలో ప్రవీణులైన జ్ఞానుల గోష్ఠిలో పాల్గొని విషయ చర్చ చేస్తాడు.

శా. ఎచ్చో నైనను నిల్చు, నాఁకటికి నేమేనిం గొనున్, రాత్రియై
నచ్చో నెమ్మి శయించు, నగ్ని పరిచర్యం బాసి వర్తించుఁ, దా
నిచ్చం గోరఁ డొకండు, నింద్రియ జయం బేపారు భోగంబులన్
మెచ్చున్ మ్రొక్కును నొల్లకుండు యతిపేర్మిన్ నిర్మముండై నృపా! 233

ప్రతిపదార్థం: నృపా!= ఓ ధర్మరాజా!; యతి= సన్న్యాసాశ్రమం స్వీకరించినవాని; పేర్మిన్= విధంగా; నిర్మముండు+ఐ= మమకార రహితుడై; ఏ+చోటన్+ఐనను నిల్చున్= ఎక్కడైనా ఉంటాడు; ఆఁకటికిన్+ఏమి+ఏనిన్+కొనున్= ఆక లైతే ఏదో ఒకటి తింటాడు; రాత్రి+ఐనన్= రాత్రి కాగా; అచ్చోన్= అక్కడే; నెమ్మిన్+శయించు= హాయిగా నిద్రిస్తాడు; అగ్ని పరిచర్యన్+పాసి= అగ్ని కార్యాన్ని వదలి; వర్తించున్= నడుచుకొంటాడు; తాన్= తాను; ఇచ్చన్= కావాలని (కోరికతో); ఒకండు= దేన్నీ; కోరఁడు= ఆశించడు (అర్థించడు); ఇంద్రియ జయంబు+ఏపారు భోగంబులన్ మెచ్చున్= ఇంద్రియ నిగ్రహానికి ఉపకరించే భోగాలను మెచ్చుకొంటాడు; మ్రొక్కునున్+ఒల్లకుండున్= నమస్కారాన్ని అంగీకరించడు.

తాత్పర్యం: 'ఓధర్మరాజా! సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించినవాడు మమకారరహితుడై ఎక్కడో ఒకచోట ఉంటూ, ఆక లైనప్పుడు ఏదో ఒకటి తింటూ, ఎక్కడ ఉన్నప్పుడు రాత్రి అవుతుందో అక్కడే హాయిగా పడుకొంటాడు. అగ్నికార్యాలను త్యజించి నడుచుకొంటాడు. తనంతట తానే దేనినీ కోరడు. ఇంద్రియ నిగ్రహానికి ఉపకరించే పద్ధతులను మెచ్చుకొంటాడు. నమస్కారాన్ని స్వీకరించడు.

విశేషం: తిక్కన నాలుగు ఆశ్రమ ధర్మాలను రెండు మత్తేభాలు, రెండు శార్దూలాలు అనే నాలుగు వృత్తాల్లో వర్ణించాడు. విషయ గౌరవాన్నిబట్టి వృత్త స్వీకరణం గావించటం తిక్కన కవితావైశిష్ట్యానికి తార్కాణం. సాధారణంగా జాత్యుపజాతులను స్వీకరించే తిక్కన ఈ సందర్భంలో వృత్తాలను స్వీకరించటంలో ఛందస్సు ఔచిత్యాన్ని పాటించా డని చెప్పవచ్చును.

క. ఈ నాలుగాశ్రమములకుఁ ; బూని చొరందగినవాఁడు భూదేవుఁడు రా
జైనను వీనను వైశ్యుం ; డేనియు వర్తించు శుద్ధ హృదయత కల్మిన్. 234

ప్రతిపదార్థం: భూదేవుఁడు= బ్రాహ్మణుడైనా; రాజు+ఐనను= రాజైనా; వైశ్యుండు+ఏనియున్= వైశ్యుడైనా; ఈ నాలుగు+ఆశ్రమములకున్= ఈ నాలుగు ఆశ్రమాలకు; పూని= ప్రయత్నించి; చొరన్+తగినవాఁడు= స్వీకరించదగినవాడు; వీనను= వీటి యందు; శుద్ధ హృదయత కల్మిన్= పరిశుద్ధ హృదయ సంపదతో; వర్తించున్= నడచుకొంటాడు.

తాత్పర్యం: బ్రాహ్మణుడైనా, రాజైనా, వైశ్యుడైనా ఈ నాలుగు ఆశ్రమాలను స్వీకరించవచ్చును. స్వీకరించి తదుచితంగా హృదయనైర్మల్యంతో నడచుకొంటాడు.

తే. సుమతిఁ ద్రైవర్ణికులకు శుశ్రూష సేసి ; యాప్తసంతానుఁడయ్యు నిలాధినాథు
ననుమతంబున శూద్రున కాశ్రమాంత ; రంబు తగుఁ గాదు యతి గాఁగ రాజముఖ్య! 235

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; సుమతిన్= మంచిబుద్ధితో; త్రైవర్ణికులకున్= మూడు వర్ణాలైన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు; శుశ్రూష+చేసి= సేవ చేసి; ఆప్త సంతానుఁడు+అయ్యున్= సంతానవంతుడైనా; శూద్రునకున్= శూద్రుడికి; ఇలా+అధినాథు+అనుమతంబున్= రాజానుమతితో; ఆశ్రమ+అంతరంబు+తగున్= ఇతరాశ్రమాలైన బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థాలను స్వీకరించవచ్చును; యతి+కాఁగన్ కాదు= సన్న్యాసాశ్రమ స్వీకారం తగదు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! బుద్ధిమంతుడై బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు సేవచేస్తూ, సంతానవంతుడై రాజానుమతితో శూద్రుడు బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థాశ్రమాలను స్వీకరించవచ్చును. కానీ సన్న్యాసాశ్రమాన్ని మాత్రం స్వీకరించకూడదు.

క. నిజధర్మవర్తి యగు స ; ద్విజుఁ డగుఁ బాత్రంబు దాన విధి మఖముల క
ట్ల జనేశ్వర నృపముఖులకు ; నిజవిత్తము లీయ మాననీయత కలుగున్. 236

ప్రతిపదార్థం: జన+ఈశ్వర!= ఓ ధర్మరాజా!; నిజధర్మవర్తి+అగు= తన ధర్మాన్ని నిర్వర్తించే; సత్+ద్విజుఁడు= ఉత్తమ బ్రాహ్మణుడు; దాన విధి మఖములకున్= యజ్ఞ యాగాదులలో దానం స్వీకరించటానికి; పాత్రంబు= అర్హుడు; అగున్= అవుతాడు; అట్ల= అదేవిధంగా; నిజవిత్తములు+ఈయన్= తమ ధనాన్ని సద్బ్రాహ్మణులకు దానం చెయ్యటంవలన; నృపముఖులకున్= రాజశ్రేష్ఠులకు; మాననీయత+కలుగున్= ఖ్యాతి కలుగుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! తన ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించే ఉత్తమ బ్రాహ్మణుడు యజ్ఞ యాగాదులలో దానం స్వీకరించటానికి అర్హుడౌతాడు. అట్లాంటి బ్రాహ్మణులకు తమ ధనాన్ని దానం చెయ్యటంవలన రాజశ్రేష్ఠులకు గౌరవం కలుగుతుంది.

తే. వర్ణములు నాశ్రమంబులు వసుమతీశుఁ ; డుక్తపథమున నడపించి యుభయలోక
సిద్ధి గనుఁ దప్పఁ ద్రొక్కని శిష్టజనులు ; గల నరేంద్రున కింద్రుండుఁ దలఁప సరియె? 237

ప్రతిపదార్థం: వర్ణములున్= చాతుర్వర్ణ్యాలు; ఆశ్రమంబులున్= నాలుగు ఆశ్రమాలు; వసుమతీ+ఈశుఁడు= రాజు; ఉక్త పథమునన్= ఈ చెప్పబడిన మార్గాలలో; నడిపించి= ప్రజలను నడిపించి; ఉభయ లోక సిద్ధి+కనున్= ఇహ పరలోకాలలో ప్రయోజనాన్ని పొందుతాడు; తలఁపన్= ఆలోచించగా; తప్పన్+త్రొక్కని= ఈ మార్గాలను వ్యతిరేకించని; శిష్టజనులు+కల= ఉత్తమ పౌరులు కలిగిన; నర+ఇంద్రునకున్= రాజుకు; ఇంద్రుఁడు= ఇంద్రుడైనా; సరియె?= సమానుడా? (కాడు).

తాత్పర్యం: నాలుగు వర్ణాల వారిని నాలుగు ఆశ్రమాల వారిని పైన పేర్కొన్న మార్గంలో నడిపించే రాజు ఇహ పర సుఖాలను పొందుతాడు. ఈ మార్గాలకు వ్యతిరేకంగా నడచుకోని ఉత్తమ పౌరులు గల రాజుకు ఇంద్రుడు కూడా సమానుడు కాడు.

వ. అదియునుం గాక. **238**

తాత్పర్యం: అంతే కాకుండా - (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఏనుంగు హజ్జలో నెల్ల సత్త్వంబుల । హజ్జలు నడఁగిన యట్ల పోలె;
రాజిత క్షత్ర ధర్మమునకు లోనయి । సర్వ ధర్మంబులుఁ జను మఖములు;
వేదంబులును శుభవృత్తంబులును దండ । నీతి మాసినఁ జెడు భూతలంబు;
సంస్కార రహితమై చాల హీనతఁ బొందు । నట్లైనఁ బ్రజకుఁ జే టావహిల్లు;

తే. రాజు లరసిన నెమ్మది బ్రదుకుఁ గాన । రాజు సర్వోత్తముఁడు; ధర్మరాజియందు
రాజధర్మంబ యెక్కుడు; రా జనంగ । ధర్మదేవత యన వేఱె ధర్మతనయ! **239**

ప్రతిపదార్థం: ధర్మతనయ!= ఓ ధర్మరాజా!; ఏనుంగు హజ్జలోన్= ఏనుగు పాదముద్రలో; ఎల్లసత్త్వంబుల హజ్జలు= సమస్త ప్రాణుల అడుగులు; అడఁగిన+అట్లపోలెన్= కనబడకుండా పోయినట్లు; రాజిత= ప్రకాశిస్తున్న; క్షత్ర ధర్మమునకు లోనయి= రాజధర్మానికి లోబడి; సర్వధర్మంబులున్+చనున్= ఇతర సమస్త ధర్మాలు ప్రవర్తిస్తాయి; దండనీతి మాసినన్= దండనీతి చెడితే; మఖములు= యజ్ఞాలు; వేదంబులును= వేదాలు; శుభవృత్తంబులును= శుభకార్యాలు; చెడున్= నాశనమవుతాయి; భూతలంబు= భూమండలం; సంస్కార రహితము+ఐ= సంస్కారం లేకుండా; చాల హీనతన్+పొందున్= చాలా అల్పత్వాన్ని పొందుతుంది; అట్లు+ఐనన్= అట్లా జరిగితే; ప్రజకున్+చేటు+ఆవహిల్లున్= ప్రజలకు కీడు కలుగుతుంది; రాజులు+అరసినన్= రాజులు ప్రేమతో చూస్తే; నెమ్మదిన్ బ్రదుకున్+కానన్= ప్రజలు సంతోషంతో బ్రతుకుతారు కాబట్టి; రాజు; సర్వ+ఉత్తముండు= సర్వశ్రేష్ఠుడు; ధర్మరాజి+అందున్= ధర్మసమూహంలో; రాజధర్మంబు+అ+ఎక్కుడు= రాజధర్మమే గొప్పది; రాజు+అనంగన్= రాజన్నా; ధర్మదేవత+అనన్ వేఱె= ధర్మదేవత అన్నా వేరా? (వేరు కాదని భావం.)

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఏనుగు పాదముద్రలలో సమస్త ప్రాణుల అడుగులు అణగిపోయినట్లే విశిష్టరాజ ధర్మానికి సమస్త ధర్మాలు లోబడి ఉంటాయి. దండనీతి చెడితే వేదాధ్యయనం, యజ్ఞాచరణం, శుభకార్యాచరణలకు వినాశనం ఏర్పడుతుంది. ఈ భూమి అంతా సంస్కారరహితమై హీనస్థితిని పొందుతుంది. ప్రజలకు కీడు కలుగుతుంది. రాజు ప్రజలను ప్రేమతో పరిపాలిస్తే హాయిగా బ్రతుకుతారు. రాజు సర్వశ్రేష్ఠుడు. ఈ ధర్మా లన్నింటిలో రాజధర్మం శ్రేష్ఠమైనది. రాజంటే ధర్మదేవతే కాని వేరు కాదు.

వ. ఆకర్ణింపుము. **240**

తాత్పర్యం: ఓ ధర్మరాజా! జాగరూకతతో వినుము - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. తొల్లి మాంధాతృఁ డను మహీవల్లభుండు । విష్ణు సందర్శనము సేయ వేఁడి యొక మ
హాధ్వరము నిష్ఠమైఁ జేయ నమరవిభుఁడు । సన్నిహితుఁ డయ్యెఁ బ్రీతి నజ్జనవిభునకు. **241**

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; మాంధాతృఁడు+అను మహీవల్లభుండు= మాంధాతృడనే మహారాజు; విష్ణు సందర్శనము+చేయన్ వేడి= విష్ణువును చూడగోరి; ఒక మహా+అధ్వరమున్= ఒక గొప్ప యజ్ఞాన్ని; నిష్ఠమైన్+చేయన్= మిక్కిలి నిష్ఠతో చేయగా; ఆ+జన

విభునకున్= ఆ రాజునకు; అమర విభుఁడు= దేవతల ప్రభువైన ఇంద్రుడు; ప్రీతిన్= సంతోషంతో; సన్నిహితుఁడు+అయ్యెన్= ప్రత్యక్షమయ్యాడు.

తాత్పర్యం: పూర్వం మాంధాతృ డనే మహారాజు విష్ణువును చూడగోరి గొప్ప నిష్ఠతో ఒక మహా యజ్ఞాన్ని చేశాడు. ఆ రాజునకు ఇంద్రుడు ప్రీతితో ప్రత్యక్షమయ్యాడు.

వ. అ ట్లింద్రుండు ప్రత్యక్షం బగుటయు. 242

తాత్పర్యం: ఆ విధంగా దేవేంద్రుడు ప్రత్యక్షం కాగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అన్నరపాలుఁడు తానున్ । జన్నమునకు వచ్చినట్టి జగతీశులు భ
క్తి న్నమ్రు లైరి దేహము । లు న్నేలయు ముదము మనములుం గలయంగన్. 243

ప్రతిపదార్థం: ఆ+నరపాలుఁడు= ఆ మాంధాతృ డనే మహారాజు; తానున్= తాను జన్నమునకు వచ్చినట్టి= యజ్ఞానికి వచ్చిన; జగతీ+ఈశులున్= రాజులు; భక్తిన్= భక్తి పూర్వకంగా; దేహములున్= శరీరాలూ; నేలయున్= భూమీ; ముదమున్= సంతోషమూ; మనములున్= మనస్సులూ; కలయంగన్= కలసిపోయేటట్లు; నమ్రులు+అయిరి= నమస్కరించారు.

తాత్పర్యం: ఆ మాంధాత, యజ్ఞానికి వచ్చిన రాజులూ తమకు ప్రత్యక్షమైన ఇంద్రుడికి భక్తితో సంతోషంగా సాష్టాంగ నమస్కారం చేశారు.

వ. అట్లు దండ ప్రణామంబులు సేసి లేచి చేతులు మొగిచి నిలిచిన సురేంద్రుఁ డన్నరేంద్రునితో నిట్లనియె.244

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; దండ ప్రణామంబులు+చేసి లేచి= సాష్టాంగ నమస్కారాలు చేసి లేచి; చేతులు మొగిచి= చేతులు జోడించి; నిలిచినన్= నిలబడగా; సుర+ఇంద్రుఁడున్= దేవేంద్రుడు; ఆ+నర+ఇంద్రునితోన్= ఆ మాంధాతృ మహారాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా సాష్టాంగ నమస్కారాలు చేసి లేచి చేతులు జోడించి నిలబడగా ఆ దేవేంద్రుడు మాంధాతృ మహారాజుతో ఇట్లా అన్నాడు.

ఆ. విష్ణుఁ జూడ నీవు వేడుక పడితి నా । కైన నజున కైన నరిది విష్ణు
దర్శనంబు నీదు తలఁ పెద్ది యెఱిఁగింపు; । మది యొనర్చెదను మహానుభావ! 245

ప్రతిపదార్థం: మహానుభావ!= ఓ మహానుభావుడవైన మాంధాతా!; ఈవు= నీవు; విష్ణున్+చూడన్= విష్ణు సందర్శనం కొరకు; వేడుక పడితి(వి)= కుతూహల పడ్డావు; విష్ణు సందర్శనంబు= ఆ మహావిష్ణు దర్శనం; నాకున్+ఐనన్= నాకు గానీ (ఇంద్రుడికి); అజునకున్+ఐనన్= బ్రహ్మకుగానీ; అరిది= సులభసాధ్యం కాదు; నీ తలఁపు+ఎద్ది= నీ ఆలోచన ఏమిటి; ఎఱిఁగింపుము= తెలుపుము; అది+ఒనర్చెదను= ఆ తలపు నెరవేరుస్తాను.

తాత్పర్యం: 'ఓ మహానుభావా! మాంధాతా! నీవు విష్ణుసందర్శనానికి కుతూహలపడుతున్నావు. విష్ణుదర్శన మనేది నాకుగానీ, బ్రహ్మకుగానీ కష్టసాధ్యం. నీ ఆలోచన ఏమిటో చెప్పితే నేను నెరవేరుస్తాను'.

క. అనవుడు సాంసారిక వ । ర్తన ముడుపుము, భైక్షచరణ తత్పరత మనం
బున దృఢముగ నొందింపుము । ననుఁ జరితార్థునిఁగఁ జేయు నావుడు నగుచున్. 246

ప్రతిపదార్థం: అనవుడున్= అని ఇంద్రుడు చెప్పగా; సాంసారిక వర్తనము+ఉడుపుము= నా సంసార జీవితాన్ని తొలగించు; భైక్షచరణ తత్పరతన్= భిక్షమెత్తి జీవించే ఆసక్తిని; మనంబునన్= నా మనసులో; దృఢముగన్+ఒందింపుము= స్థిరీకరించుము; ననున్+చరితార్థ నిగన్+చేయు= నన్ను కృతార్థుడిగా చేయుము; నావుడున్= అని మాంధాత పలుకగా; నగుచున్= ఇంద్రుడు నవ్వుతూ.

తాత్పర్యం: అప్పుడు మాంధాత ఇంద్రుడితో సంసార జీవితాన్ని తొలగించి బిచ్చమెత్తుకొని జీవించే ఆసక్తిని మనసులో స్థిరీకరించి కృతార్థుడిగా చేయవలసిందని కోరుకొన్నాడు. ఆ సమయంలో ఇంద్రుడు నవ్వుతూ ఇట్లా అన్నాడు.

మ. 'ధరణీశా! నృపధర్మ ముత్తమము సద్ధర్మంబులం దెల్ల నే
తెరువున్ రా జరయంగఁ గాదె తగ సిద్ధిం బొందుఁ గామంబుఁ గ్రో
ధరయంబున్ మగిడించి దండము సమత్వవ్యాప్తిఁ జెల్లించుచున్
ధరఁ బాలించిన రాజు వొందుగతిఁ బొందన్ శక్యమే యేరికిన్? 247

ప్రతిపదార్థం: ధరణీ+ఈశా!= ఓ రాజా!; సత్+ధర్మంబులందున్+ఎల్లన్= అన్ని ఉత్తమ ధర్మాలలోను; నృప ధర్మము= రాజధర్మం; ఉత్తమము= శ్రేష్ఠమైనది; ఏ తెరువున్= ఏ మార్గమైనా; రాజు+అరయంగన్+కాదె= రాజు రక్షిస్తేనే కదా; తగన్= తగిన విధంగా; సిద్ధిన్+పొందున్= ఫలవంతమవుతుంది; కామంబు= కామాన్ని; క్రోధరయంబున్= కోపావేశాన్ని; మగిడించి= అణచిపెట్టి; దండము= దండనీతిని; సమత్వ వ్యాప్తిన్+చెల్లించుచున్= సమదృష్టితో చేస్తూ; ధరన్+పాలించిన రాజు= రాజ్యమేలిన రాజు; పొందుగతిన్= పొందే మార్గాన్ని పొందటం; ఏరికిన్= ఎవరికైనా; శక్యమే?= సాధ్యమా? (సాధ్యం కాదని భావం).

తాత్పర్యం: 'ఓ మాంధాతా! అన్ని ధర్మాలలోనూ రాజధర్మమే శ్రేష్ఠమైనది. ఏ రీతిగా చూసినా ప్రజలను ప్రేమతో పాలిస్తేనే రాజు ఉత్తమసిద్ధి పొందుతాడు. కామక్రోధాలను వర్జించి, దండనీతిని సమంగా అమలు చేస్తూ రాజ్య మేలే రాజు పొందే ఉత్తమగతి ఇతరులకు సాధ్యం కాదు'.

వ. అని పలికి పురందరుం డందఱు రాజులం గలయం గనుంగొని. 248

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; పురందరుండు= ఇంద్రుడు; అందఱు రాజులన్= అక్కడున్న రాజులందరినీ; కలయన్+కనుంగొని= పరిశీలనగా చూచి.

తాత్పర్యం: అని చెప్పి ఇంద్రుడు అక్కడున్న రాజులందరిని చూచి - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'లోకపాలాత్ములరు మీరు మీకు భైక్ష। చరణ మర్హమే? ప్రజఁ బ్రోపు సమరముక్త
దేహు లగుటయు నమ్మేలు తెచ్చు సంశ। యంబు; వలవదు మీ పద మధికతరము. 249

ప్రతిపదార్థం: మీరు= మీరంతా; లోక పాల+ఆత్ములరు= లోక పాలకుల అంశలతో పుట్టారు; మీకున్; భైక్షచరణము+అర్హమే?= భిక్షాటనం తగిందా?; ప్రజన్= ప్రజలను; ప్రోపు= సంరక్షించటమూ; సమరముక్త దేహులు+అగుటయున్= యుద్ధంలో మరణించే శరీరం కలిగిన వారు కావటంవలన; ఆ+మేలు+తెచ్చున్= ఆ మంచిని చేకూరుస్తాయి; సంశయంబు వలవదు= సందేహించవద్దు; మీ పదము+అధిక తరము= మీ రాజ పదవి శ్రేష్ఠతరమైనది.

తాత్పర్యం: మీరు పాలకస్వరూపులు. మీకు భిక్షాచరణం తగదు. ప్రజారక్షణం, యుద్ధంలో శరీరత్యాగం, మీకు

శుభప్రదం. ఇందులో సందేహం లేదు. మీ స్థానం చాలా గొప్పది.

వ. అని చెప్పి దేవేంద్రుండు దివంబునకుం జనియె. 250

తాత్పర్యం: అని తెలిపి దేవేంద్రుడు స్వర్గలోకానికి వెళ్ళాడు.

చ. అది యొకఁడేల వేదములయందుఁ బురాణములం బ్రసిద్ధకో
విదులు బహుప్రదేశముల వేమఱుఁ గాంచి మనుష్యులెల్ల భూ
మిదయితుకంటెఁ దక్కువ యమేయ సుధర్ము లీడుగావు ని
ర్మదకృత దండనీతి కనరా మనమెల్ల వినంగ నెప్పుడున్. 251

ప్రతిపదార్థం: అది+ఒకఁడు+ఏల= అంతేకాదు; వేదముల+అందున్= వేదాలలోనూ; పురాణములన్= పురాణాలలోనూ; ప్రసిద్ధకోవిదులు= ప్రసిద్ధ పండితులు; బహు ప్రదేశములన్= పలుప్రాంతాలలో; వేమఱున్+కాంచి= అనేక పర్యాయాలు గమనించి, మనుష్యులు+ఎల్లన్= మానవులంతా; భూమిదయితు కంటెన్+తక్కువ= రాజుకంటె తక్కువవారు; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; నిర్మదకృత దండనీతికిన్= అహంకార రహితమైన దండనీతికి; అమేయ= కొలతకందని; సుధర్ములు= ఉత్తమధర్మాలు; ఈడు+కావు= సమానం కావని; మనము+ఎల్లన్ వినంగన్= మనమంతా వినే విధంగా; అనరా= చెప్పలేదా?

తాత్పర్యం: అంతేకాదు. వేదాలలో, పురాణాలలో, ఇంకా పలుచోట్ల ప్రసిద్ధ పండితులు అనేక పర్యాయాలు పరిశీలించి మానవులంతా రాజుకంటె తక్కువ అని చెప్పారు. మన కందరికీ స్పష్టమయ్యేటట్లు అహంకారరహితమైన దండనీతికి ఇతర ఉత్తమధర్మాలు సమానం కావని చెప్పగా వినలేదా?

ఉ. కావునఁ గామరోషములఁ గ్రాఁచుచు నాశ్రమకోటిఁ గాచుచున్
భూవలయ ప్రజన్ సమతఁ బ్రోచుచు రాజ్యముసేత మేలు; భి
క్షావిధి లోనుగాఁ గలుగు సారపు ధర్ములన్ ఘటించు మేల్
వావిరి నప్రయత్నమున వానికి వచ్చు నృపాల! యెమ్మెయిన్. 252

ప్రతిపదార్థం: నృపాల!= ఓ ధర్మరాజా!; కావునన్= కాబట్టి; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; కామ రోషములన్+క్రాఁచుచున్= కామక్రోధాలను దహిస్తూ; ఆశ్రమకోటిన్+కాచుచున్= ఆశ్రమ ధర్మాలను రక్షిస్తూ; భూవలయ ప్రజన్= భూ మండలంలోని ప్రజలను; సమతన్+ప్రోచుచున్= దండనీతితో సమానంగా పోషిస్తూ; రాజ్యము+చేఁత= రాజ్యాన్ని పాలించటం; మేలు= మంచిది; భిక్షావిధి లోనుగాన్+కలుగు= భిక్షాటనం మొదలైన వాటివలన కలిగేది; సారము+ధర్ములన్= శ్రేష్ఠమైన ధర్మాలతో; ఘటించు= కలిగే; మేల్= శుభం; వావిరి= క్రమంగా; అప్రయత్నమునన్= ప్రయత్నం లేకుండానే; వానికిన్ వచ్చు= ఆ రాజుకు చేకూరుతుంది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! కామక్రోధాలను దహించి ఆశ్రమధర్మాలను రక్షిస్తూ ప్రజలను దండనీతితో సమంగా కాపాడుతూ రాజ్యం చేయటం మంచిది. భిక్షాటనం మొదలైన శ్రేష్ఠమైన ధర్మాలవలన సమకూరే శ్రేయస్సు క్రమంగా అనుకోకుండా రాజుకు లభిస్తుంది.

విశేషం: తిక్కన శైలి క్రమక్రమంగా ఉన్నతోన్నతమైనట్లు ఈ పద్యం నిరూపిస్తున్నది. అంత్యప్రాసలతో చెప్పదలచుకొన్న అభిప్రాయాన్ని స్పష్టం చేస్తున్న దీ పద్యం. 'సారపుధర్ములన్' అనే ప్రయోగం చేసి మరొక్కసారి శ్రీకృష్ణ రాయబార ఘట్టంలో శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో రాజధర్మాన్ని గూర్చి చెప్పే సందర్భంలోని 'సారపుధర్మమున్ విమల సత్యము. . . .' అనే పద్యాన్ని గుర్తుచేసి రాజధర్మ విశిష్టతను తిక్కన సోదాహరణంగా వివరించాడు.

చ. అతిథుల దీనకోటుల ధనార్థిత లేని యతివ్రజంబు స
మ్మతిఁ బరికింపు హర్ష మదమాన విషాదములం జొరంగ నీ
క తొలఁగఁ ద్రోవు నా యొడలు గావక భూప్రజఁ గాతు న న్వినిశ్చిత దృఢ బుద్ధి గల్గు మిది చేయు సమస్త సుధర్మసిద్ధులన్.' 253

ప్రతిపదార్థం: అతిథులన్= అతిథులనూ; దీనకోటులన్= దీన జన సమూహాలనూ; ధన+అర్థిత లేని= ధనాన్ని కోరని; యతి వ్రజంబున్= సన్న్యాసుల సమూహాన్ని; సమ్మతిన్+పరికింపు= మంచి మనసుతో చూడుము; హర్ష= సంతోషం; మద= మదం; మాన= అభిమానం; విషాదములన్+చొరంగనీక= దుఃఖం మొదలైన వాటిని మనసులో ప్రవేశించనీయకుండా; తొలఁగన్+త్రోవు(ము)= తోసిపుచ్చుము; నా+ఒడలు+కావక= నా శరీర సంరక్షణ కాక; భూ ప్రజన్+కాతున్= భూ ప్రజల్ని రక్షిస్తాను; అనే; వినిశ్చిత దృఢబుద్ధిన్= నిశ్చితమూ స్థిరమూ అయిన మనస్సును; కల్గుము= కలిగి ఉండుము; ఇది= ఈ పద్ధతి; సమస్త సుధర్మ సిద్ధులన్= అనేక ఉత్తమ ధర్మాలవలన కలిగే ప్రయోజనాన్ని; చేయున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: అతిథులనూ, దీనులనూ, యతీంద్రులనూ మంచిమనసుతో గమనించుము. సంతోషమూ, అహంకారమూ, అభిమానమూ, దుఃఖమూ అనేవాటిని మనసులోనికి రానీయకుండా తొలగించుము. 'నా శరీర సంరక్షణమే ముఖ్యం' అని భావించక 'ప్రజలను కాపాడతాను' అనే స్థిరసంకల్పంతో ఉండటంవలన సమస్త ఉత్తమధర్మనిర్వహణంవలన కలిగే ప్రయోజనం సిద్ధిస్తుంది.'

వ. అనిన విని యజాతశత్రుండు 'మహాపురుషా! వర్ణాశ్రమ విధంబులుం దద్రక్షణంబు చొప్పును దాన వచ్చు పెంపును నెఱింగించితి; రాష్ట్ర జనంబు లెయ్యది యాచరించి సుఖు లగుదు; రెఱింగింపవే!' యని యడిగిన నమ్మహీకాంతునకు శాంతనవుం డిట్లనియె. 254

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విని; అజాతశత్రుండు= పుట్టని శత్రువులు గల ధర్మరాజు; మహాపురుషా!= పురుషోత్తమా!; వర్ణ+ఆశ్రమ విధంబులున్= వర్ణాశ్రమ ధర్మాలను; తద్+రక్షణంబు చొప్పును= వాటిని రక్షించే తీరునూ; దానన్= దానివలన; వచ్చు= కలిగే; పెంపును= ఆధిక్యాన్నీ; ఎఱింగిచితి(వి)= తెలియజేశావు; రాష్ట్రజనంబులు= రాష్ట్ర ప్రజలు; ఏ+అది+ఆచరించి= దేన్ని చేసి; సుఖులు+అగుదురు= సుఖిస్తారో; ఎఱింగింపవే= తెలియజెప్పవే; అని+అడిగినన్= అని ప్రార్థించగా; ఆ+మహీకాంతునకున్= ఆ ధర్మరాజుతో; శాంతనవుండు+ఇట్లు+అనియెన్= భీష్ముడు ఇట్లా పలికాడు.

తాత్పర్యం: భీష్ముడు చెప్పిన మాటలను విన్న ధర్మరాజు భీష్ముడితో 'వర్ణాశ్రమ ధర్మాలను, వాటి సంరక్షణ విధానాన్ని, దానివలన కలిగే ఫలితాన్ని తెలియజేశావు. ఇంకా రాష్ట్రప్రజలు ఏ కార్యాచరణంవలన సుఖాన్ని పొందుతారో తెలియజేయుము' అని ప్రార్థించగా, ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా అన్నాడు.

రాష్ట్ర జనుల కర్తవ్యధర్మములు భీష్ముఁడు ధర్మజునకుఁ దెలుపుట (సం. 12-67-2)

సీ. రాజు నుత్తమగుణ భ్రాజిష్ణు నభిషిక్తుఁ। గావించుకొని, యెల్ల కార్యములును
దన్ముఖంబునఁ జెల్లఁ; దద్ధయు సుఖముండఁ। బడయుదు; రొకఁడు భూపాలనంబు
సేఁతలేకున్న దుశ్చేష్టితు లై జను। లన్యోన్య దారధనాపహరణ
మాచరింతురు; మీల యట్టుల బలవంతు। లల్పులఁ దమకు నాహారములుగఁ

తే. గొండ్రు; భూపతిలేకున్న మండ్రె జనము? । లధిప! కృషి సేయుటయును బేహార మాడు
టయును గోరక్ష గావించుటయును మొదలు। గాఁగఁ బ్రదికెడు తెరువులు గాసిగావె! 255

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; ఉత్తమగుణ భ్రాజిష్ణున్= ఉత్తమ గుణాలచేత ప్రకాశించే రాజును; అభిషిక్తున్+కావించుకొని= రాజుగా అభిషేకించుకొని; ఎల్లకార్యములును= సమస్త కార్యాలనూ; తద్+ముఖంబునన్+చెల్లన్= ఆ రాజానుమతితో నెరవేరుతుండగా; తద్దయున్= మిక్కిలి; సుఖము+ఉండన్+పడయుదురు= సుఖంగా ఉంటారు; ఒకడు భూపాలనంబు+చేత లేకున్న= ఒకడు రాజ్యపాలనం చేయకపోతే (రాజు లేకపోతే); జనులు= ప్రజలు; దుశ్చేష్టితులు+ఐ= దుర్మార్గ వర్తనులై; అన్యోన్య= పరస్పరం; దార, ధన+అపహరణము+ఆచరింతురు= భార్యలను, ధనాన్ని దొంగిలిస్తారు; మీల+అట్టలన్= చేపల రీతిగా; బలవంతులు= బలం కలిగినవారు; అల్పులన్= బలహీనులను; తమకున్+ఆహారములుగన్+కొండ్రు= తమకు ఆహారంగా గ్రహిస్తారు; భూపతిలేకున్నన్= రాజు లేకుంటే; జనము= ప్రజలు; మండ్రె?= జీవిస్తారా?; కృషి+చేయుటయును= వ్యవసాయం చేయటమూ; బేహారము+ఆడుటయును= వ్యాపారం చేయటమూ; గోరక్ష కావించుటయును= ఆవులను కాపాడటమూ; మొదలుగాఁగన్= మొదలైన; బ్రదికెడు తెరువులు= జీవించే మార్గాలు; గాసి+కావె?= నాశనమవుతాయి కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఉత్తమగుణవిలసితుడైన రాజును అభిషేకించుకొని, ఆ రాజు మూలాన సమస్త కార్యాలను నిర్వర్తింపజేసికొంటూ ప్రజలు మిక్కిలి సుఖిస్తారు. రాజ్యపాలనం లేకపోతే ప్రజలు దుర్మార్గవర్తనులై పరస్పరం భార్యలను, ధనాన్ని దొంగిలించటం ప్రారంభిస్తారు. పెద్ద చేపలు చిన్న చేపలను మింగినట్లుగా బలవంతులు బలహీనులను ఆహారంగా గ్రహిస్తారు. రాజు లేకుండా ప్రజలు జీవించలేరు. వ్యవసాయమూ, వర్తకమూ, గోసంరక్షణమూ మొదలైన జీవనోపాధి మార్గాలు నాశనమవుతాయి.

వ. వినుము. **256**

తాత్పర్యం: ఓ ధర్మరాజా! వినుము.

సీ. జను లొక్కతఱిఁ దొల్లి సమయంబుఁ దమలోనఁ । జేసి క్రూరతయు మ్రుచ్చిమియు అంకు
సైఁపక యట్టి దుర్జను నందఱును గూడి । శాసించువారుగాఁ జాలి తమకు
నధిపతియుఁగ నొరునాసపడక యుండి । నడవడి బహుకారణములఁ జిక్కు
వడిన, విషణ్ణులై బ్రహ్మఁగానఁగఁ బోయి । మాకు రక్షకుఁడుగ మహిపుఁ డొకఁడు

తే. వలయు రూపింపు; మాతని గొలిచి బ్రదుకు । వార మనుటయు, నజుఁడును వారి వలని
కరుణ మనువు నిరూపించె; నరు లసత్య । చరితు లని పాలనమునకుఁ జొరఁడ యతఁడు. **257**

ప్రతిపదార్థం: తొల్లి = పూర్వకాలంలో; ఒక్కతఱిన్= ఒకానొక సందర్భంలో; జనులు= ప్రజలు; తమలోనన్+సమయంబున్ చేసి= తమలో ఒక శపథంచేసి; క్రూరతయున్= క్రూరత్వమూ; మ్రుచ్చిమియున్= దొంగతనమూ; అంకున్= వ్యభిచారమూ; సైఁపక= సహించలేక; అట్టి దుర్జనున్= అట్లాంటి దుర్మార్గుడిని; అందరును+కూడి= అందరూ కలిసి; శాసించు వారుగాన్+చాలి= అదుపులో పెట్ట గలిగేవారుగా ఉండి; తమకున్+అధిపతియుఁగన్= తమకు ప్రభువుగా; ఒరున్+ఆసపడక+ఉండి= ఇతరు డెవ్వడిని ఇష్టపడక; నడవడి= వారి జీవితం; బహుకారణములన్= అనేక కారణాలవలన; చిక్కు+పడినన్= కష్టాలమయం కాగా; విషణ్ణులు+ఐ= దుఃఖితులై; బ్రహ్మన్+కానఁగన్+పోయి= బ్రహ్మను దర్శించటానికై వెళ్ళి; మాకున్; రక్షకుడుగన్= సంరక్షకుడుగా; మహిపుఁడు+ఒకఁడు వలయున్= ఒకరాజు కావాలి; రూపింపుము= చూపించుము; ఆతనిన్+కొలిచి= అతడిని సేవించి; బ్రదుకువారము= జీవిస్తాం; అనుటయున్= అని ప్రార్థించగా; అజుఁడును= బ్రహ్మ; వారి వలని కరుణన్= వారి మీది దయతో; మనువు నిరూపించెన్= మనువు మీ రాజని చూపించాడు; అతఁడు= ఆ మనువు; నరులు+అసత్య చరితులు+అని= మానవులు అసత్య జీవనులని; పాలనమునకున్+చొరడు= ప్రజలను పాలించటానికి ఇష్టపడ లేదు.

తాత్పర్యం: పూర్వకాలంలో ఒకానొక సమయంలో ప్రజలు తమలోనే ఉన్న క్రూరత్వం, దొంగతనం, వ్యభిచారం మొదలైన దుర్గుణాలను సహించక అట్లాంటి పనులను చేస్తున్న దుర్మార్గుడిని అందరూ కలిసి శాసించగలిగి ఉండి, తమకు ఇతరు లెవరూ రాజుగా ఉండ నవసరం లేదని భావించి కొంతకాలం ఉండి, వారి జీవితాలు అనేక కారణాలవలన కష్టాలకు లోను కాగా, దుఃఖితులై బ్రహ్మను దర్శించటానికి వెళ్ళారు. వెళ్ళి 'మాకు రక్షకుడుగా రాజు ఒకడు కావాలి. నిర్దేశించుము. అతడిని సేవించి మేము జీవిస్తాం' అని అనగానే బ్రహ్మ వారి మీద దయతో మనువు అనే రాజును చూపించాడు. నరులు అసత్య వర్తనులు కాబట్టి ఆ మనువు వారిని పాలించటానికి ఇష్టపడలేదు.

వ. చొరకున్న నజ్జనంబు లమ్మహాత్మునితో 'నీకుం బుయిలోడ నేల? ప్రజలచేతఁ బశువులయందును బసిండిని నేఁ బది యగు నంశంబును, ధాన్యంబున దశమ భాగంబును భండారంబుగాఁ బుచ్చికొని శస్త్రోపజీవుల నెల్ల నీ వారిం జేసికొని బలవంతుండవై దుష్టనిగ్రహ శిష్ట ప్రతిపాలనం బాచరింపు; మే మందఱము ని న్ననుసరించి నీ పనుపు చేయంగల వార; మధర్మ వర్తనులు నీ చేతం జెడువారు; ధర్మవర్తనులు చేసిన ధర్మంబున నాఱవపాలు నిన్నుం జేరంగలయదిగా నొడంబడితి; మింద్రుండు దేవతల రక్షించు మాడ్కి' మమ్ము రక్షించుకొని సుఖంబుండు మనుటయు. 258

ప్రతిపదార్థం: చొరకున్నన్= ఆ మనువు అంగీకరించకపోవటంతో; ఆ జనంబులు= ఆ ప్రజలు; ఆ+మహా+ఆత్మునితోన్= ఆ మహనీయుడైన మనువుతో; నీకున్+పుయిలోడన్+ఏల?= నీకు సంకోచమెందుకు?; ప్రజలచేతన్= ప్రజలవలన; పశువుల+అందును= పశువులలో; పసిండిని= బంగారంలో; ఏఁబది+అగు అంశంబును= సగభాగమూ; ధాన్యంబునన్= పండించిన పంటలో; దశమ భాగంబును= పదవవంతును; భండారముగాన్= ధనకోశం కొరకై; పుచ్చికొని= తీసికొని; శస్త్ర+ఉపజీవులన్+ఎల్లన్= ఆయుధాల వలన జీవించేవారినందరినీ; నీవారిన్+చేసికొని= నీ అధీనంలో ఉంచుకొని; బలవంతుండవు+ఐ= బలసంపన్నుడవై; దుష్టనిగ్రహ= దుష్టశిక్షణ; శిష్ట ప్రతిపాలనంబు+ఆచరింపుము= దుష్టశిక్షణా శిష్ట రక్షణమూ చేయుము; ఏము+అందరమున్= మేమందరమూ; నిన్ను+అనుసరించి= నీకు అనుగుణంగా నడిచి; నీపనుపు+చేయన్+కలవారము= నీ ఆజ్ఞను పాటిస్తూ ఉంటాం; నీ చేతన్= నీ వలన; అధర్మవర్తనులు= దుర్మార్గులు చేసినవారు; చెడువారు= చెడిపోతారు; ధర్మవర్తనులు= ధర్మాన్ని పాటించేవారు; చేసిన= ఆచరించే; ధర్మంబునన్= ధర్మంలో; ఆఱవపాలు= ఆరోవంతు; నిన్ను+చేరన్+కలయదిగాన్= నీకు చెందే విధంగా; ఒడంబడితిమి= అంగీకరించాం; ఇంద్రుండు= దేవేంద్రుడు; దేవతలన్ రక్షించు మాడ్కిన్= దేవతల్ని రక్షించే విధంగా; మమ్ము రక్షించుకొని= మా సంరక్షణ చేస్తూ; సుఖంబు+ఉండుము+అనుటయున్= సుఖంగా ఉండుము అని చెప్పగా.

తాత్పర్యం: మనువు ప్రజలను పాలించటానికి అంగీకరించకపోవటంతో ఆ మహానీయుడితో ప్రజలు ఇట్లా అన్నారు. 'నీకు సంకోచమెందుకు? ప్రజల నుండి పశువులలోను, బంగారంలోనూ సగభాగం నీ సొత్తు. పంటలలో పదవ భాగాన్ని కోశంకొరకు గ్రహించి, ఆయుధాల వలన జీవించేవారి నందరినీ నీవారిగా చేసికొని బలవంతుడవై దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావించుము. మేమంతా నీ ఆజ్ఞానుసారం ప్రవర్తిస్తాం. దుర్మార్గులు నీవలన నాశనమవుతారు. ధర్మాత్ములు చేసిన ధర్మంలో ఆరోవంతు నీకు చెందేటట్లు అంగీకరిస్తున్నాం. ఇంద్రుడు దేవతలను రక్షించే విధంగా మా రక్షణభారాన్ని స్వీకరించి సుఖంగా ఉండవలసింది' అని పలికారు.

క. అతఁ డొడఁబడి యత్తెఱఁగున । నతిబలవంతుఁ డయి నీతి నంచిత మగు ను
ద్ధత విక్రమమునఁ దగ నీ । క్షితిఁ బాలించె; సుఖులై రశేష జనములున్. 259

ప్రతిపదార్థం: ఆ+తెఱఁగునన్= ఆ విధంగా; అతఁడు+ఒడఁబడి= ఆ మనువు అంగీకరించి; అతిబలవంతుఁడు+అయి= మిక్కిలి బలవంతుడై; నీతిన్= దండనీతితో; అంచితము+అగు= ఒప్పుతున్న; ఉద్ధత విక్రమమునన్= పరాక్రమాతిశయంతో; తగన్= తగినరీతిలో; ఈ క్షితిన్= ఈ భూమిని; పాలించెన్= పరిపాలించాడు; అశేష జనములున్= ప్రజలంతా; సుఖులు+ఐరి= సుఖంగా జీవించారు.

తాత్పర్యం: ఆ విధంగా మనువు అంగీకరించి మిక్కిలి బలవంతుడై నీతిబద్ధంగా పరాక్రమాతిశయంతో, తగిన రీతిలో ఈ భూమిని పాలించాడు. సమస్తప్రజలూ సుఖజీవనం గడిపారు.

ఉ. కావున మేలు సేయదె జగజ్జనకోటికి రాజునాజ్ఞమైఁ
బోవుట; యాతనిం దగిన పూజలఁ దృప్తునిఁజేఁత; దేవసం
భావనఁ గొల్వ తండొకటఁబాడి తొఱంగిన సైఁచు టిట్లు సం
భావితుఁ జేయఁగా నతని పంపొనరింతురు మ్రొక్కి శత్రులున్. 260

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; రాజు+ఆజ్ఞమైన్+పోవుట= రాజాజ్ఞ చొప్పున నడచుకొనటం; ఆతనిన్= ఆ రాజును; తగిన పూజలన్= అర్హమైన పూజలతో; తృప్తునిన్+చేఁత= సంతృప్తి పరచటమూ; దేవ సంభావనన్+కొల్వు= దైవంతో సమానంగా సేవించటమూ; అతండు= ఆ రాజు; ఒకటన్= ఏదైనా ఒక విషయంలో; పాడి+తొఱంగినన్= న్యాయం తప్పినా; సైఁచుట= ఓర్చుకొనటం; జగత్+జనకోటికిన్= భూ ప్రజ సమూహానికి; మేలు+చేయదె?= శుభకరం కాదా?; ఇట్లు= ఈ విధంగా; సంభావితున్+చేయఁగాన్= ప్రజలు రాజును గౌరవించగా; శత్రులున్= శత్రువులు కూడా; మ్రొక్కి= నమస్కరించి; అతని పంపు+ఒనరింతురు= ఆ రాజాజ్ఞను శిరసావహిస్తారు.

తాత్పర్యం: అందువలన రాజానుమతితో నడుచుకొనటం, ఆ రాజును తగిన పూజలతో సంతృప్తి పరచటం, దైవంతో సమానంగా సేవించటం, ఒకవేళ ఏదైనా విషయంలో న్యాయం తప్పినా సహించటం ప్రజలకు మేలే కలిగిస్తుంది. ఈ విధంగా ప్రజలు రాజును గౌరవిస్తే శత్రువులు సైతం వినమ్రులై అతడి ఆజ్ఞను శిరసా వహిస్తారు.

క. తనవారు పెద్ద సేయని । మనుజేశు నరాతిజనులు మదిని సరకుగాఁ
గొన; రది భూప్రజ కొప్పదు । విను! కావునఁ బతికిఁ బ్రజలు వెఱచుట యొప్పున్. 261

ప్రతిపదార్థం: విను= ఓ ధర్మరాజా! వినుము; తనవారు= తన రాజ్యంలోని ప్రజలే; పెద్ద+చేయని= గౌరవించని; మనుజ+ఈశున్= రాజును; అరాతి జనులున్= శత్రువులు కూడా; మదినిన్= మనసులో; సరకుగాన్+కొనరు= లెక్కచేయరు; అది= ఆ విధంగా రాజును గౌరవించక పోవటమనేది; భూ ప్రజకున్= ప్రజలకు; ఒప్పదు= తగదు; కావునన్= అందువలన; పతికిన్= రాజునకు; ప్రజలు వెఱచుట+ఒప్పున్= ప్రజలు భయపడటమే యుక్తం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! తన ప్రజలే గౌరవించని రాజును శత్రువులు ఏ మాత్రం లెక్క చెయ్యరు. రాజును గౌరవించకపోవటం ప్రజలకు ఉచితం కాదు. కాబట్టి రాజు అంటే ప్రజలు భయపడటమే సముచితం.

తే. వాహనాసన శయ్యా నివాసములును, । భోజ్య గంధ మాల్యాంబర భూషణములు,
గుప్తియును నరపతికి నెక్కుడుగ వలయు । నను తలంపునఁ బ్రజలకు మనుట గుణము. 262

ప్రతిపదార్థం: వాహన= వాహనం; ఆసన= పీఠం; శయ్యా= పడక; నివాసములును= గృహమూ అనేవి; భోజ్య, గంధ, మాల్య+అంబర భూషణములున్= ఆహార పదార్థాలు, చందనాది సుగంధాలు, పుష్పమాలలు,వస్త్రాలు,అలంకారాలు అనేవి; గుప్తియును= రక్షణమూ;

నరపతికిన్+ఎక్కుడుగన్ వలయున్= రాజుకు ఎక్కువ అవసరం; అను తలంపునన్= అనే ఆలోచనతో; మనుట= జీవించటం; భూజనుల గుణము= ప్రజల కుండవలసిన సద్గుణం.

తాత్పర్యం: వాహనాలు, సింహాసనాలూ, శయ్యాగృహాలూ, ఆహార పదార్థాలూ, చందనాది సుగంధద్రవ్యాలూ, పుష్పమాలలూ, వస్త్రాలంకారాలూ, రక్షణా రాజుకు మిక్కిలి అవసరమనే సద్భావనతో ప్రజలు జీవించటం అవసరం.

చ. అతఁడును మందహాస సహితాలపనంబును, సత్యభాషణ
వ్రతమును, సంవిభాగ నిరవద్యతయున్, సమభావముం, గృత
జ్ఞతయు, జితేంద్రియత్వముఁ, బ్రసాద గుణంబును గల్గి భూమికిం
బితృసముఁడై విరోధి జన భీషణ సారత నొప్పఁ బెం పగున్.' 263

ప్రతిపదార్థం: అతఁడును= ఆ రాజుకూడా; మందహాస సహిత= చిరునవ్వుతో కూడిన; ఆలపనంబును= సల్లాపమూ; సత్యభాషణ వ్రతమును= సత్యాన్ని చెప్పే నియమమూ; సంవిభాగ నిరవద్యతయున్= విభజించటంలో ఉత్కృష్టతా; సమభావమున్= అందరిపట్ల సమానమైన భావమూ; కృతజ్ఞతయున్= చేసిన మేలును మరచిపోకుండటమూ; జిత+ఇంద్రియత్వమున్= ఇంద్రియ నిగ్రహమూ; ప్రసాద ఫలంబును= ప్రసన్న గుణమూ; కల్గి= కలిగి ఉండి; భూమికిన్= భూమి ప్రజలకు; పితృసముఁడు+ఐ= తండ్రితో సమానమైన వాడై; విరోధి జన భీషణ= శత్రు ప్రజలకు భయాన్ని కలిగించే రీతిలో; సారతన్= బలంతో (శౌర్యంతో); ఒప్పన్= వెలుగొందితే; పెంపు+అగున్= గొప్పగౌరవం కలుగుతుంది (అభ్యున్నతి కలుగుతుంది).

తాత్పర్యం: రాజు చిరునవ్వుతో కూడిన సల్లాపం, సత్య భాషణ నియమం, భాగవిభజనలో ఔన్నత్యం, అన్నిటియందు అందరియందు సమభావం, కృతజ్ఞతా భావం, ఇంద్రియ నిగ్రహం, ప్రసన్న గుణం కలిగి ఉండి భూప్రజలను తండ్రితో సమానంగా చూస్తూ విరోధిజన భయంకరుడై ప్రకాశిస్తే అత్యంత గౌరవం కలుగుతుంది'.

వ. అనుటయుం గౌంతేయాగ్రజుండు 'మనుష్యుల కెల్ల రాజధిపతియును దైవంబునుంగా విప్రులు చెప్పి; రట్లగుట
యేమిటనో? యని యుండుదు;నది మీవలనం బ్రస్ఫుటంబుగా వింటి' నని పలికిన; గాంగేయుఁ 'డింకనుం
జెప్పెదఁ దొల్లి వసుమనుం డను మానవేంద్రుండు నీవ పోలె వితర్కించి బృహస్పతి నడిగిన, నతం డతనికిఁ
జెప్పిన భంగి యాకర్ణింపు' మని యిట్లనియె. 264

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు చెప్పగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతీ పుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; మనుష్యులకున్+ఎల్లన్= మానవు లందరికీ; రాజు+అధిపతియును= రాజును ఏలికగాను; దైవంబునున్+కాన్= దేవుడుగాను; విప్రులు= బ్రాహ్మణులు; చెప్పిరి= చెప్పారు; అట్లు+అగుట+ఏమిటనో+అని+ఉండుదున్= అట్లా కావటం ఎందుకో అనే సందేహంతో ఉన్నాను; అది మీ వలనన్= అది మీ వలన; ప్రస్ఫుటంబుగాన్ వింటిని+అని పలికినన్= స్పష్టంగా విన్నానని చెప్పగా; గాంగేయుండు= భీష్ముడు; ఇంకనున్+చెప్పెదన్= ఇంకా చెప్పుతాను; తొల్లి= పూర్వం; వసుమనుండు+అను= వసుమనుడనే; మానవ+ఇంద్రుండు= మానవులలో శ్రేష్ముడైన రాజు; నీవపోలెన్= నీవలెనే; వితర్కించి= సందేహించి; బృహస్పతిన్+అడిగినన్= బృహస్పతిని అడుగగా; అతండు+అతనికిన్+చెప్పిన భంగిన్= ఆ బృహస్పతి వసుమను డనే రాజుకు చెప్పిన రీతిని; ఆకర్ణింపుము+అని= వినవలసిం దని; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'మానవులందరికీ రాజు ఏలిక మాత్రమే కాకుండా దైవస్వరూపుడని బ్రాహ్మణులు చెప్పారు. అ దేమిటో ఎందుకో అనే సందేహం ఉండేది. దానికి సమాధానంగా మీవలన స్పష్టంగా

తెలిసికొన్నాను' అని ధర్మరాజు పలికాడు. అప్పుడు భీష్ముడు 'ఇంకా వివరిస్తాను వినుము. పూర్వం వసుమనుడనే రాజు నీవలెనే వితర్కించి బృహస్పతిని ప్రశ్నించగా అతడు ఆ రాజుతో చెప్పిన విధానాన్ని తెలిసికొ'మ్మని ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

బృహస్పతి వసుమనుండను రాజునకుం జెప్పిన రాజధర్మ ప్రకారము (సం. 12-68-1)

తే. లోకములు లోక ధర్మంబులును నృపాల! । రాజ మూలముల్; రాజ విరహిత మైన
పుడమి జనులకు నింకిన మడువులోని । జలచరంబులు పడుపాటు సంభవిల్లు. 265

ప్రతిపదార్థం: నృపాల!= ఓ ధర్మరాజా!; లోకములున్= జగాలు; లోకధర్మంబులును= లోకాలలో అనుసరించబడే ధర్మాలు; రాజమూలముల్= రాజుపై ఆధారపడి ఉంటాయి; రాజ విరహితము+ఐన= రాజు లేకుండా పోతే; పుడమి జనులకున్= భూ ప్రజలకు; ఇంకిన మడువులోని= నీరు ఇంకిపోయిన చెరువులోని; జలచరంబులు= నీటిలోని ప్రాణులైన చేపలు; పడుపాటు= పడే కష్టం; సంభవిల్లున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'ఓధర్మరాజా! లోకాలు, లోకధర్మాలు అనేవి రాజుమీద ఆధారపడి ఉంటాయి. రాజు లేకపోతే భూ ప్రజలకు నీ రింకిపోయిన మడుగులోని జలచరాలకు కలిగే కష్టం కలుగుతుంది.

విశేషం: అలం: నిదర్శన.

క. తరణి శశాంకులతేజ । స్స్ఫురణము లేకున్న యట్లు భూజనములు ని
ర్భర దురితతఁ జేడ్పడుదురు । నరపాలక విహిత పాలనము లేకున్నన్. 266

ప్రతిపదార్థం: నరపాలక విహిత పాలనము= రాజు విధించిన పరిపాలనం; లేకున్నన్= లేకపోతే; తరణి శశాంకుల= సూర్యచంద్రుల యొక్క; తేజఃస్ఫురణము లేకున్న+అట్లు= కాంతి స్ఫూర్తి లేని రీతిగా; భూజనములు= ప్రజలు; నిర్భరదురితతన్= అత్యంత పాపంతో; చేడ్పడుదురు= బాధలకు గురి అవుతారు.

తాత్పర్యం: రాజు విధించే పరిపాలనం లేకుండా పోతే సూర్యచంద్రుల వెలుగులు లేకపోయిన రీతిగానే ప్రజలు మిక్కిలి పాపంతో బాధలకు గురి అవుతారు.

విశేషం: అలం: నిదర్శన.

క. తనధన మిదియని యూఱడి । మనఁ బరిణయ మాదియైన మహితోత్సవముల్
కొనియాడ నెవ్వరికి వ । చ్చునె? జనపాలుండు లేనిచో నిర్భయతన్. 267

ప్రతిపదార్థం: జనపాలుండు లేనిచోన్= రాజు లేకుంటే; నిర్భయతన్= భయరహితంగా; ఇది తన ధనము+అని= ఇది తన ధనమని; ఊఱడి= ఉపశమించి; మనన్= బ్రతకటానికి; పరిణయము+ఆది+ఐన= వివాహం మొదలైన; మహిత+ఉత్సవముల్= గొప్ప ఉత్సవాలు; కొనియాడన్= ప్రశంసించటానికి; ఎవ్వరికిన్+వచ్చునె!= ఎవరికైనా సాధ్యమా!

తాత్పర్యం: రాజు లేకుండాపోతే నిర్భయంగా ఇది తన ధనమని, ప్రశాంతంగా జీవించటానికిగాని, వివాహాది శుభకార్యాలను మహోత్సాహంతో చేసి ప్రశంసించటానికి గాని ఎవరికీ సాధ్యం కాదు.

తే. విభుఁడు లేకున్న జనములు సభయ హృదయు । లగుచు హాహా నినాదంబు లడరఁ దల్ల
డిల్లుదురు; రాజు లేమియ యెల్లవారు । లేమి; కల్మియ కల్మి దుర్లేపరహిత! 268

ప్రతిపదార్థం: దుర్లేప రహిత!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; విభుఁడు లేకున్నన్= రాజు లేకపోతే; జనములు= ప్రజలు; సభయ హృదయులు+అగుచున్= భయంతో కూడిన మనస్సులు కలవారై; హాహా నినాదంబులు+అడరన్= హాహాకారాలు చేస్తూ; తల్లడిల్లుదురు= సంక్షోభం పొందుతారు; రాజు లేమియ= రాజు లేకపోవటమనేదే; ఎల్లవారు లేమి= అందరూ లేకపోవటమే; కల్మియ= రాజును కలిగి ఉండటమే; కల్మి= నిజమైన సంపద.

తాత్పర్యం: ఓ పాపరహితుడవైన ధర్మరాజా! రాజు లేని రాజ్యంలో ప్రజలు భయాందోళనలతో కూడిన హృదయాలు కలవారై, హాహాకారాలు చేస్తూ తల్లడిల్లి పోతారు. రాజు లేకపోవటం అంటే బంధుమిత్రాదులు లేనట్లే; రాజు ఉంటే అందరూ ఉన్నట్లే.

క. యాగములును, భోగములును, । ద్యాగములును, బహువిధముల ధర్మములు మహా
భాగా! నరపతి రక్షా । యోగంబునఁ జెల్లుఁ బ్రజకు నుల్లాసముగన్. 269

ప్రతిపదార్థం: మహాభాగా!= గొప్ప భాగ్యవంతుడవైన ఓ ధర్మరాజా!; నరపతి రక్షా యోగంబునన్= రాజ సంరక్షణ మనే అదృష్టం వలన; యాగములున్= యజ్ఞాలు; భోగములును= సర్వభోగాలు; త్యాగములును= దానం చేయటం మొదలైన విడుపులు; బహువిధముల ధర్మములున్= పలువిధా లైన ధర్మాలు; ప్రజకున్= ప్రజలకు; ఉల్లాసముగన్= ఉత్సాహంతో కూడి; చెల్లున్= ఒప్పుతాయి.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజసంరక్షణ అనే అదృష్టం లభిస్తే ప్రజలకు యజ్ఞయాగాలు, భోగభాగ్యాలు, దానత్యాగాలు, పలురీతుల ధర్మాలు ఆనందోత్సాహంతో సమకూరుతాయి. అప్పుడు వారంతా ఆనందంగా జీవిస్తారు.

విశేషం: భోగాలు ఎనిమిది విధాలు: గృహం, శయ్య, వస్త్రం, ఆభరణం, స్త్రీ, పుష్పం, గంధం, తాంబూలం. ఇవి ప్రవృత్తి భోగాలు. అట్లాగే నివృత్తి భోగాలు ఉన్నాయి.

క. ఒకరునికి నలిగి యాతని । సకల హిరణ్యంబు రత్న సంచయమును బు
చ్చుకొనుం, దనవలచిన వా । నికి నిచ్చు ధనేశుఁ డంద్రు నృపు నట్టితఱిన్. 270

ప్రతిపదార్థం: ఒకరునికిన్+అలిగి= రాజు ఒకానొక శత్రు రాజుపై కోపించి; ఆతని= అతడియొక్క; సకల హిరణ్యంబున్= బంగారాన్నంతటినీ; రత్న సంచయమును= రత్నరాశినీ; పుచ్చుకొనున్= స్వాధీనం చేసికొంటాడు; తన వలచిన వానికిన్+ఇచ్చున్= తాను (ఆ రాజు) తనకు ఇష్టుడైన వాడికి అనుగ్రహిస్తాడు; అట్టి తఱిన్= ఆ సమయంలో; నృపున్= రాజును; ధన+ఈశుఁడు+అంద్రు= ధనానికి అధిపతి అయిన కుబేరుడని (ఆర్యులు) అంటారు.

తాత్పర్యం: రాజు ఒకానొక శత్రువుపై ఆగ్రహించి వాడి సమస్త సంపదనూ రత్నరాసులనూ స్వాధీనం చేసికొని, తనకు ఇష్టమైనవాడికి అనుగ్రహిస్తాడు. ఆ సందర్భంలో రాజును కుబేరు డని పెద్దలు అంటారు.

తే. చారచక్షుఁడై కను నెల్ల జగము; నపుడు । సూర్యుఁ డంద్రు నరేంద్రు నకార్యకరులఁ
దునుము నయ్యెడ జముఁడు నాఁజను; నతండు । దేవతాత్మకుఁ డగుట సందియమె యధిప! 271

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; నర+ఇంద్రున్= మానవశ్రేష్ఠుడైన రాజును; చారచక్షుఁడు+ఐ= చారు లనే (వేగులనే) కన్నులు కలవాడై; ఎల్ల జగమున్= సమస్త లోకాన్ని; కనున్= గమనిస్తాడు కాబట్టి; అపుడు= ఆ సందర్భంలో; సూర్యుఁడు+అంద్రు= సూర్యుడని

(విద్వాంసులు) అంటారు; అకార్యకరులన్= కాని పనులు చేసేవారైన దుర్మార్గులను; తునుమున్= సంహరిస్తాడు; ఆ+ఎడన్= ఆ సందర్భంలో; జముఁడునాన్+చనున్= యముడుగా పిలువబడతాడు; అతండు= అట్లాంటి రాజు; దేవతా+ఆత్మకుఁడు+అగుట= దైవస్వరూపుడు కావటంలో; సందియమె?= సందేహముంటుందా? (ఉండదు).

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజు చారులనే కన్నులు కలిగి ఉండటంచేత చారచక్షు డని పిలువబడతాడు. అట్లాంటి చారచక్షువైన రాజు లోకాన్నంతటినీ జాగరూకుడై పరిశీలిస్తూ ఉంటాడు. అప్పుడు పెద్దలు రాజును సూర్యుడని ప్రశంసిస్తారు. దుర్మార్గులను సంహరించినప్పుడు రాజును యము డని విద్వాంసులు వక్కాణిస్తారు. కాబట్టి రాజు దైవస్వరూపుడు అనటంలో సందేహం ఉందా?

విశేషం: సర్వలోకసాక్షి సూర్యుడు. కనుకనే తిక్కన సూర్యప్రయోగం సార్థకం. యముడు సమవర్తి. అందుచేత రాజు దైవస్వరూపు డనటం తిక్కన విజ్ఞతకు ఔచిత్యానికి నిదర్శనం.

క. వినుఁ నృప! సమ్రాట్టు విరా ।ట్టనియెడు శబ్దములఁ బొగడు నాగమములు నె
ట్టన భూపాలకునన నా ।తనిఁ దగ నర్చింపకుండఁ దగునె యొరులకున్? **272**

ప్రతిపదార్థం: నృప!= ఓ ధర్మరాజా!; వినుఁ= జాగ్రత్తగా వినుము; సమ్రాట్టు= తన ఆజ్ఞతో రాజులను శిక్షించి రాజసూయయాగం చేసిన మండలేశ్వరుడు; విరాట్టు+అనియెడు= మిక్కిలి ప్రకాశించే వాడైన క్షత్రియుడు అనే; శబ్దములన్= మాటలచేత; భూపాలకున్= రాజును; నెట్టన= అనివార్యంగా; ఆగమములు= వేదాలు; పొగడున్+అనినన్= ప్రశంసిస్తున్నాయి అంటే; ఒరులకున్= ఇతరులకు అంటే పాలితులైన ప్రజలకు; అతనిన్= ఆ రాజును; తగన్= అర్హమైన రీతిలో; అర్చింపక+ఉండన్+తగునె?= పూజించకుండా ఉండటం సముచితమేనా? (కాదు).

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజును విరాట్టు, సమ్రాట్టు అని వేదాలు అనివార్యంగా ఘోషిస్తున్నాయి. అట్లాంటి రాజును ప్రజలు అర్హమైన రీతిలో పూజించకుండా ఉండటం తగునా?

విశేషం: 'రాజా భోజా విరాట్సమ్రాట్ క్షత్రియో భూపతి ర్నృపః
య ఏభి స్తూయతే శబ్దైః కస్తం నార్చితు మర్హతి।

అనే మూల శ్లోకానికి పై పద్యం తిక్కన అనువాదం తిక్కన 'రాజా, భోజఃక్షత్రియఃʼ అనే మాటలను వదలిపెట్టి 'విరాట్సమ్రాట్టులను మాత్రం గ్రహించాడు. పై మూల శ్లోకానికి నీలకంఠ వ్యాఖ్య ఇట్లా ఉన్నది. 'రాజేతి రాజా రంజకఃʼ భోజఃభోజ్య సుఖానామ్ భోజయితా, వివిధం రాజత ఇతి విరాట్; శ్రీమాన్ సమ్రా డితి రాజ్ఞా మపి రాజ్యేz కుంఠి తైశ్వర్యఃʼ

క. నియతిమెయి నెవ్వఁ డింద్రియ ।జయమును, భక్తియును, జిత్తసారము, దృఢ సం
శ్రయముఁ గలిగి కొలుచుం గృప ।నయసంపన్ననిఁగఁ జేయు నధిపతి యతనిన్. **273**

ప్రతిపదార్థం: నృపున్= రాజును; ఎవ్వఁడు= ఎవడైతే; నియతిమెయిన్= నియమానుసారంగా; ఇంద్రియ జయమును= ఇంద్రియాలను జయించి; భక్తియును= భక్తిగలిగి; చిత్తసారమున్= మానసిక బలమైన; దృఢ సంశ్రయతయున్+కలిగి= స్థిరంగా ఆశ్రయించి; కొలుచున్= సేవిస్తాడో; అతనిన్= అట్లాంటివాడిని; అధిపతి= రాజు; నయసంపన్ననిఁగన్+చేయున్= నీతి సంపదగలవాడిగా సంపన్నుడిగా చేస్తాడు.

తాత్పర్యం: ఎవడు జితేంద్రియుడై, భక్తియుక్తుడై, దృఢచిత్తంతో రాజును ఆశ్రయించి నియమానుసారంగా సేవిస్తాడో, అట్లాంటివాడిని రాజు నీతిమంతుడిగా, సంపన్నుడిగా చేస్తాడు.

విశేషం: మూలంలోని మూడు శ్లోకాల భావాల్ని సంక్షిప్తీకరించి ముఖ్యాంశాల్ని తిక్కన ఈ కందంలో చెప్పాడు.

క. రాజునకుఁ బ్రజ శరీరము; । రాజు ప్రజకునాత్మ; కాన రాజుం బ్రజయున్
రాజోత్తమ! యన్యోన్య వి । రాజితు లై యుండవలయు రక్షార్చనలన్.' 274

ప్రతిపదార్థం: రాజ+ఉత్తమ!= రాజ శ్రేష్ఠుడ వైన ఓ ధర్మరాజా!; రాజునకున్= రాజుకు; ప్రజ శరీరము= ప్రజలు శరీరంవంటి వారు; రాజు; ప్రజకున్+ఆత్మ= ప్రజలకు ఆత్మవంటి వాడు; కానన్= అందువలన; రాజున్+ప్రజయున్= రాజు, ప్రజలు; రక్షా+అర్చనలన్= క్రమంగా సంరక్షణలోను; పూజించటం అంటే సేవించటంలోనూ; అన్యోన్య= పరస్పరం; విరాజితులు+ఐ= ప్రకాశిస్తూ; ఉండవలయున్= ప్రవర్తించాలి.

తాత్పర్యం: 'రాజశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా! ప్రజలు రాజుకు శరీరంవంటి వారు. ప్రజలకు రాజు ఆత్మవంటి వాడు. అందుచేత రాజు ప్రజలను సంరక్షించటంలోనూ, ప్రజలు రాజును సేవించటంలోనూ పరస్పరం విధ్యుక్త ధర్మాలను నెరవేరుస్తూ ప్రకాశించాలి.'

విశేషం: అలం: కావ్యలింగం, యథాసంఖ్యం.మూలంలో 'రాజా ప్రజానాం హృదయం గరీయః' అనే మాటలు మాత్రం ఉండగా, తిక్కన స్వతంత్రంగా ఈ పద్యాన్ని సంతరించి తన రాజకీయ చతురతను ప్రకటించుకొన్నాడు. హృదయానికీ ఆత్మకీ గల భేదాన్ని గమనించి ఆత్మ ప్రయోగం చేసి శరీరాత్మలకుగల సంబంధాన్ని ప్రజలకు రాజుకు గల సంబంధంగా నిరూపించాడు. ఆత్మ శరీరాన్ని రక్షించినట్లే శరీరం ఆత్మను పూజించవలసి ఉన్నది. అట్లాగే రాజుకు ప్రజలను సంరక్షించవలసిన బాధ్యత ఉన్నట్లే ప్రజలకు ఆత్మ అయిన రాజును సేవించవలసిన ధర్మం ఉన్నది. కాబట్టి శరీరాత్మలవలె ప్రజలూ రాజూ పరస్పరం ఆధారాధేయాలు. ఇంకా స్వతంత్రించి తిక్కన ' రాజునకు ప్రజ శరీరము, రాజు ప్రజకు నాత్మ' అని సూక్తులవలె ప్రయోగించి తన సూక్తి వైచిత్రిని స్పష్టం చేశాడు. మూలానికి మెరుగులు దిద్దిన ఈ రచనలో తిక్కన నిగూఢార్థ రాజకీయ ప్రతిభాపాటవం విదితమవుతున్నది.

వ. అని యిట్లు బృహస్పతి యుపదేశించినం గౌసల్యపతి యగు నవ్వసుమనుండు ప్రయత్నంబునం బ్రజాపాలనం
బాచరించె నని చెప్పుటయు ధర్మనందనుండు 'రాజు జనపద పరిపాలనంబును శత్రువధంబును మొదలైన
కృత్యంబులు నడుపు తెఱం గెఱిఁగింపవే!' యనుటయు భీష్ముం డి ట్లనియె. 275

ప్రతిపదార్థం: అని+ఇట్లు= అని ఈ విధంగా; బృహస్పతి+ఉపదేశించినన్= బృహస్పతి రాజ ధర్మోపదేశం చేయగా; కౌసల్య పతి+అగున్+ఆ+వసుమనుండు= కోసల దేశాధిపతి అయిన ఆ వసుమనుడనే రాజు; ప్రయత్నంబునన్= ప్రయత్న పూర్వకంగా; ప్రజాపాలనంబు+ఆచరించెన్= ప్రజలను పాలించాడు; అని చెప్పుటయున్= అని భీష్ముడు చెప్పగా; ధర్మనందనుండు= ధర్మరాజు; రాజు= రాజు; జనపద పరిపాలనంబును= గ్రామీణ ప్రజలను పాలించే విధానమూ; శత్రువధంబును= శత్రువులను సంహరించే రీతి; మొదలైన కృత్యంబులు= మొదలైన కార్యాలను; నడపు తెఱంగు= నిర్వర్తించే విధానాన్ని; ఎఱిఁగింపవే= తెలియజేయుము; అనుటయున్= అని ప్రార్థించగా; భీష్ముండు+ఇట్లు+అనియెన్= భీష్ముడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: రాజనీతిని గూర్చి బృహస్పతి ఉపదేశించగా అదే రీతిలో వసుమనుడనే రాజు బహు జాగరూకుడై ప్రయత్నపూర్వకంగా రాజ్యపాలనం చేశాడని భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'రాజుగా జనపదాలను ఎట్లా పాలించాలి? శత్రుసంహారం ఎట్లా చెయ్యాలి? - మొదలైన కార్యాలను నిర్వహించే తీరును వివరించు' మని భీష్ముడిని ప్రార్థించాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజుకు ఇట్లా వివరించాడు.

క. 'తనుఁ దాన తొలుత గెలువన్ । మనుజపతికి వలయుఁ; బిదప మార్తుర గెలువన్
మనమునఁ దలంచునది; మును । దను గెలువని పతికిఁ గెలువఁ దరమే పగఱన్. 276

ప్రతిపదార్థం: మనుజపతికిన్= రాజునకు; తొలుతన్= మొట్టమొదట; తనున్+తాన= తనను తానే; గెలువన్ వలయున్= జయించవలసి ఉన్నది; పిదప= ఆ తరువాత (తనను తాను జయించిన వెనుక); మార్తురన్ గెలువన్= శత్రువులను జయించటాన్ని గూర్చి; మనమునన్= మనస్సునందు; తలంచునది= ఆలోచించవలసి ఉన్నది; మును= మొదటగా; తను గెలువని పతికిన్= తనను తాను జయించని రాజుకు; పగఱన్= శత్రువులను; గెలువన్+తరమే?= జయించటం సాధ్యమా?

తాత్పర్యం: రాజు మొట్టమొదట తన్ను తాను జయించుకొనాలి. అంటే ఇంద్రియనిగ్రహాన్ని సాధించవలసిన అవసరం ఉన్నది. రాజు తనను తాను జయించిన తరువాత శత్రువులను జయించాలి. ముందుగా తనను తాను జయించని రాజుకు శత్రువులను జయించటం సాధ్యం కాదు.

విశేషం: తనను తాను జయించటమంటే తనలోని శత్రువులైన అరిషడ్వర్గాలను జయించట మని అర్థం. అంతశ్శత్రువు లైన అరిషడ్వర్గాలను జయించినవాడు మాత్రమే బాహ్యశత్రువులను జయించగలుగుతాడు. అంటే ఇంద్రియనిగ్రహదక్షునికి మాత్రమే శత్రువులను జయించటం సాధ్యమవుతుందని అర్థం. మూలంలోని

"ఆత్మాజేయ స్సదా రాజ్ఞా తతో జేయాశ్చ శత్రవః
అజితాత్మా నరపతిః విజయేత కథం రిపూన్" (12-69-4) అనే శ్లోకానికి తిక్కన పై పద్యాన్ని కూర్చాడు.

ఆ. వినుము! తన్ను గెలుచు టన వేఱొకండె? పం । చేంద్రియములఁ దూలనీక కొలఁది
నాఁగుటయ జితేంద్రియత్వంబు గల రాజు । రిపులఁ జెఱుపఁజాలు నృపవరేణ్య! 277

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజశ్రేష్ముడవైన ఓ ధర్మరాజా! వినుము= జాగరూకుడవై వినుము; తన్నున్+గెలుచుట+అనన్= తనను తాను జయించటమంటే; పంచ+ఇంద్రియములన్= ఐదు ఇంద్రియాలను (త్వక్కు, చక్షువు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము; ఇవి జ్ఞానేంద్రియములు. వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థము - ఇవి కర్మేంద్రియములు); తూలనీక కొలఁదిన్+అగుటయ= చలించిపోనీక శక్యమయ్యేటట్లు ఆపటమే అంటే నిగ్రహించటమే కాని; వేఱు+ఒకండె?= మరొకటి కాదు; జిత+ఇంద్రియత్వంబు+కలరాజు= ఇంద్రియాలను జయించిన రాజు; రిపులన్= శత్రువులను; చెఱుపన్+చాలున్ నాశనం చేసి జయించగలుగుతాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! తనను తాను జయించట మంటే వేరేమీ కాదు. ఇంద్రియాలను జయించటమే. ఇదే రాజు కర్తవ్యం. అట్లాంటి ఇంద్రియనిగ్రహం కల రాజు శత్రు సంహారం చేసి విజయాన్ని సాధిస్తా డనటంలో సందేహం లేదు. కాబట్టి ఇంద్రియజయ మనేది రాజునకు తప్పనిసరి అయిన గుణం.

క. ఆరామాదిక నిజ సం । చార స్థలములకు, దేశ సంధులకుఁ, బురీ
ద్వారములకు, నగరికిని ధ । రా రమణుఁ డొనర్ప వలయు రక్షలు నియతిన్. 278

ప్రతిపదార్థం: ధరారమణుఁడు= భూమికి భర్త అయిన రాజు; నియతిన్= నియమానుసారంగా (తప్పని సరిగా); ఆరామ+ఆదిక= ఉద్యానవనం మొదలైన; నిజసంచార స్థలములకున్= తన విహార ప్రదేశాలకు; దేశసంధులకున్= రాజ్యం సరిహద్దులకు; పురీద్వారములకున్= పురద్వారాలకు; నగరికిని= అంతఃపురానికి; రక్షలు= సంరక్షలు అంటే - ఎట్లాంటి శత్రుభయం లేకుండా రక్షణలు; ఒనర్పవలయున్= చేయాలి.

తాత్పర్యం: తనకు సంచారయోగ్యాలైన ఉద్యానవనాలు, రాజ్యం సరిహద్దులు, పురద్వారాలు, అంతఃపురాలు మొదలైన అన్నిచోట్ల తగిన సంరక్షకులను నియమించి రాజు ఎల్లప్పుడు జాగరూకుడై సంరక్షించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

తే. అరులకడ, నిజ భూమియం, దనుజ తనుజ । బాంధ వామాత్య మిత్రులపాల వేష
ధరుల వేగులఁగాఁ బెట్ట ధరణిపునకు । వలయు నొండొరు నెఱుఁగని వారిఁగాఁగ. 279

ప్రతిపదార్థం: అరులకడన్= శత్రురాజ్యంలోనూ; నిజభూమియందున్= తన రాజ్యంలోనూ; అనుజ తనుజ బాంధవ+అమాత్య మిత్రుల పాలన్= సోదరులు, పుత్రులు, బంధువులు, అమాత్యులు, స్నేహితుల వద్ద; ఒండొరున్= ఒకరినొకరు; ఎఱుఁగనివారిన్+కాఁగన్= తెలియనివారుగా; వేషధరులన్= మారువేషాలను ధరించిన వారిని; వేగులన్+కాన్+పెట్టవలయున్= గూఢచారులుగా నియమించాలి.

తాత్పర్యం: శత్రురాజుల సన్నిధిలోనూ, తన దేశంలోను, సోదరులు, పుత్రులు, బంధువులు, మంత్రులు, మిత్రులు అయినవారి వద్ద ఒకరినొకరు గుర్తించని రీతిగా మారువేషాలలో వేగులవారిని నియమించి, వారి వారి రహస్యాలను గుర్తిస్తూ జాగరూకతతో రాజు మెలగాలి.

క. తను హీనుం డని యెఱుఁగక । మును ప్రబలునితోడ శీఘ్రమున సంధానం
బొనరింప వలయు నతనికి । ధనం బొసఁగియైనఁ బతికిఁ దగు నిలఁ గావన్. 280

ప్రతిపదార్థం: తను= తాను (రాజు); హీనుండు+అని+ఎఱుఁగక మును= శత్రువుల కంటె తాను బలహీనుడని శత్రువులు గ్రహించకముందే; ప్రబలునితోడన్= అత్యంత బలసంపన్నుడైన శత్రువుతో; శీఘ్రమునన్= వెంటనే; సంధానంబు+ఒనర్పన్ వలయున్= సంధిచేసికొనాలి; అతనికిన్= ఆ శత్రువుకు; ధనంబు+ఒసఁగి+ఐనన్= ధనమిచ్చి అయినా; ఇలన్+కావన్= తన రాజ్యాన్ని రక్షించటం; పతికిన్+తగున్= రాజునకు తగిన ధర్మం.

తాత్పర్యం: తాను బలహీనుడని శత్రువులు గ్రహించకముందే, తనకంటె బలవంతు డైన శత్రువుతో వెనువెంటనే సంధిచేసికొనటం అవసరం. చివరకు శత్రువుకు ధన మిచ్చి అయినా సరే - తన రాజ్యాన్ని సంరక్షించుకొనటం రాజధర్మం.

విశేషం: సామ దాన భేద దండోపాయాలలో శత్రువులకంటె తాను బలహీనుడని గుర్తించినప్పుడు సామోపాయం ప్రధానమైనది. దానికి శత్రువు లొంగకపోతే దానోపాయంతో శత్రువును జయించాలని రాజనీతిలో వివరించబడింది.

క. మత్తుఁ బ్రమత్తుని విషయా । యత్తుని దుర్బలునిఁ జూచి యట్టి పగతుపై
నెత్తునది, శిఖి విషాదుల । నుత్తల పెట్టునది యతని యుర్విఁ గడంకన్. 281

ప్రతిపదార్థం మత్తున్= మదించిన వాడిని; ప్రమత్తునిన్= మిక్కిలి మత్తుడైన వాడిని; విషయ+ఆయత్తునిన్= విషయసుఖాలకు అధీనుడైన అంటే విషయలోలుడైన వాడిని; దుర్బలునిన్+చూచి= బలహీనుడిని పరిశీలించి; అట్టి పగతునిపైన్= అట్లాంటి శత్రువుపై; ఎత్తునది= దండెత్తిపోయి యుద్ధంచేయాలి; కడంకన్= ప్రయత్నంతో; అతని+ఉర్విన్= ఆ శత్రురాజ్యాన్ని; శిఖివిషాదులన్= అగ్ని, విషం మొదలైన వాటిచేత; ఉత్తల పెట్టునది= కలత చెందించాలి.

తాత్పర్యం: శత్రువు విషయలోలుడై మదించి మైమరచి ఉండగా గుర్తించి అట్లాంటి బలహీనుడిపై దండెత్తాలి. మిక్కిలి ప్రయత్నించి ఆ శత్రురాజ్యానికి నిప్పుపెట్టి, విషప్రయోగం చేసి అత్యంత సంక్షోభంలో ముంచి వేయాలి.

ఆ. కయ్యమునకు వలదు కాల్‌ద్రవ్వనధిప! సా । మమున భేదమునను మార్తు మనము
మెత్తఁ జేసి చెఱిచి మెయివడిఁ దప్పించు । కొనుతెఱం గెఱింగికొనుట మేలు. 282

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; కయ్యమునకున్= యుద్ధానికి; కాల్బవ్వన్ వలదు= కారణం లేకుండా యుద్ధానికి సిద్ధం కావద్దు; మార్తుమనమున్= శత్రువుయొక్క మనస్సును; సామమునన్ భేదమునన్= సామదానభేద దండోపాయాలనే నాలుగు ఉపాయాలలోనూ సామంవలన గాని, భేదంవలనగాని; మెత్తన్+చేసి= లొంగేటట్లు చేసి; చెఱిచి= నాశనం చేసి; మెయివడిన్= ఆనుకూల్యంతో; తప్పించుకొను తెఱంగు= శత్రువునుంచి తప్పించుకొనే మార్గం; ఎఱింగికొనుట మేలు= తెలిసికొనటం మంచిది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! అనవసరంగా యుద్ధానికి సిద్ధపడకూడదు. ఒకవేళ యుద్ధమే అవసర మనిపిస్తే సామదాన భేద దండోపాయాలలో సామంవలనగాని లేదా భేదోపాయంవలనగాని శత్రువును నయాన భయాన వశంచేసికొని నాశనంచేసి ఆనుకూల్యంతో శత్రువునుంచి తప్పించుకొనే మార్గాన్ని గుర్తించటం మంచిది.

చ. జనకుఁడుబోలె నర్మిలిఁ బ్రజం బరికించుచు షష్ఠభాగముం
గొనునది; వారిచేత నరిఁ గోటి విధంబుల నాప్తదక్షులం
గని వన గోకులాకర నగ ప్రముఖార్థకరంబు లారయం
బనుచుచు నన్నిటన్ ధరణిపాలుఁడు కన్నిడియున్నఁ బెంపగున్. 283

ప్రతిపదార్థం: ధరణి పాలుఁడు= రాజు; ప్రజన్= ప్రజలను; జనకుఁడున్+పోలెన్= తండ్రివలె; అర్మిలిన్= ప్రేమతో; పరికించుచున్= చూస్తూ; వారిచేతన్= వారి నుండి; అరిన్= పన్నును; షష్ఠభాగమున్+కొనునది= వారి ఆదాయంలో ఆరవభాగం మాత్రమే తీసుకొనేది; కోటివిధంబులన్= అనేక రీతులలో; ఆప్త దక్షులన్+కని= ఆత్మీయులైన వారిలో సమర్థులైన వారిని తెలిసికొని (గుర్తించి); వనగోకుల+ఆకర ప్రముఖ+అర్థకంబులు= అరణ్యాలు, గో సమూహాలు, గనులు మొదలైన ధనా న్నిచ్చే వాటిని; ఆరయన్+పనుచుచున్= పరిపాలించటానికి నియోగిస్తూ; అన్నిటన్= అన్ని వ్యవహారాలను; కన్ను+ఇడి+ఉన్నన్= కనిపెట్టి ఉండటం వలన; పెంపు+అగున్= అభివృద్ధి కలుగుతుంది.

తాత్పర్యం: రాజు ప్రజలను తండ్రివలె పరిపాలించాలి. ప్రజల ఆదాయంలో ఆరవభాగాన్ని మాత్రమే పన్నుగా గ్రహించాలి. అనేక రీతులుగా రాజు తన ఆప్తులలో దక్షులైనవారిని మాత్రమే ఆదాయాన్ని పెంచటానికి కారణాలైన అరణ్యాలు, గో సమూహాలు, గనులు మొదలైనవాటిమీద అజమాయిషీకై నియమించి, అన్ని వ్యవహారాలలోనూ ఒక కంట కనిపెట్టి ఉండటం మంచిది. దానివలన అభివృద్ధి కలుగుతుంది.

సీ. కోట యేమఱ కెప్పుఁ బాటించి గడ్డియు । ఖాణంబుఁ గొల్చును గట్టియలును
నేయు నూనియయును నాయుధమ్ములు నౌష । ధములు నాభీల యంత్రములుఁ గూప
ములు లోనుగా నందు వలయువాని సమగ్ర । ములుగ సంపాదించి భూరి ధైర్య
శౌర్యాది గుణముల సడిసన్న యాప్త యో । ధులఁ బె ల్లమర్చుట యలఘునీతి;

ఆ. పగతుఁ డలిగి నడచు పథమునఁ ధృణ కాష్ఠ । ములును ధాన్యతోయములును లేక
యుండఁ జేసి మిత్రమండలేశుల నెత్తి । యరుగుదేరఁ బనుచునది విభుండు. 284

ప్రతిపదార్థం: విభుండు= రాజు; ఎప్పున్= ఎల్లప్పుడు; ఏమరక= అశ్రద్ధ చేయక (జాగరూకతతో); కోట పాటించి= కోటను దృష్టిలో పెట్టుకొని; గడ్డియున్= పశువులకు అవసరమైన గడ్డిని; ఖాణంబున్= అశ్వాదులకు కావలసిన ఉలవలు మొదలైన ఆహార పదార్థాలను; కొల్చునున్= మానవులకు కావలసిన వరిధాన్యాన్ని; కట్టియలును= వంటచెఱకును; నేయున్= నేతినీ; నూనియయున్= నూనెనీ; ఆయుధమ్ములున్= యుద్ధాదులలో ఉపయోగించే ఆయుధాలను; ఔషధములున్= మందులను; ఆభీల= భయంకరమైన;

యంత్రములున్= యంత్రాలను; కూపములున్= బావులనూ; లోనుగాన్= మొదలైన; అందున్ వలయు వానిన్= వాటికి కావలసిన పరికరాలను; సమగ్రములుగన్= సంపూర్ణంగా; సంపాదించి= సమకూర్చుకొని; భూరి= అధికమైన; ధైర్య శౌర్య+ఆది గుణములన్= ధైర్యమూ, పరాక్రమమూ మొదలైన ఉత్తమ గుణాలలో; సడి+చన్న= నిందలేని; ఆప్త యోధులన్= ఆప్తులైన బంటులను; పెల్లు+అమర్చుట= అధికంగా నియమించటం; అలఘునీతి= రాజునకు ఉండవలసిన గొప్ప రాజనీతి; పగతుఁడు= శత్రువు; అలిగి= (రాజుపై) కోపించి; నడచు పథమునన్= ప్రయాణించే మార్గంలో; తృణ కాష్ఠములును= గడ్డి కట్టెలూ; ధాన్య తోయములును= (తినటానికి) ఆహార ధాన్యాలు (తాగటానికి) నీరూ; లేక+ఉండన్+చేసి= (శత్రువులకు) లభించకుండ చేసి; మిత్రమండల+ఈశులన్= తనకు మిత్రులైన (సమీప) మండలాధిపతులను; ఎత్తి+అరుగు దేరన్+పనుచునది= శత్రువులపై దండెత్తి పోయేటట్లు నియమించాలి.

తాత్పర్యం: రాజు ఎల్లప్పుడు బహు జాగరూకుడై పశువులకు గడ్డి, అశ్వగజాదులకు కావలసిన ఉలవలు మొదలైన ఆహార పదార్థాలు, ప్రజలకు అవసరమైన ధాన్యాదులు, కట్టెలు, నేయి, నూనె, సమస్తమైన ఆయుధాలు, మందులు, భయంకర యంత్రసామగ్రిని, నీటి బావులను సంపూర్ణంగా సమకూర్చుకొని అత్యంత ధైర్యపరాక్రమాది ఉత్తమ గుణాలతో నిందారహితులైన ఆప్తులైన యోధులను అధికంగా నియమించటం ఉత్తమ రాజనీతి. శత్రువు తనపై కోపించి దండెత్తి వస్తే, ఆ మార్గం తెలిసికొని, ఆ శత్రు సైన్యానికి గడ్డి, కట్టెలు, ధాన్యం, నీరూ లభించకుండా చేసి తనకు మిత్రులైన సమీప మండలాధిపతులను, ఆ శత్రువులపై దండెత్తి పోయేటట్లు పురికొల్పి నియోగించట మనేది ఉత్తమ రాజనీతి.

వ. మఱియు రాజునకు రక్షింపవలయునది స్వామ్యమాత్య జనపద కోశ సైన్య మిత్ర దుర్గంబులను రాజ్యాంగ సప్తకంబు కన్నిడి యరయ వలయునది; సంధి విగ్రహ యానాసన ద్వైధీభావ సమాశ్రయంబులను షాడ్గుణ్యంబు నడపవలయునది; ధర్మార్థ కామంబు లను త్రితయంబు పాటింపవలయునది; మంత్రప్రభుత్వోత్సాహంబులను శక్తి త్రయంబు నిజవశవర్తిం జేయవలయునది; సత్త్వరజస్తమంబు లను గుణ త్రికంబు విశేషించి ధర్మసేవ సంతతంబు నాచరింపవలయునది; ప్రమాదంబున నర్థకామంబులు హీనంబు లైనను ధర్మనిష్ఠంజేసి ధరణీపరిపాలనంబు సుస్థిరంబై చెల్లు; నాంగిరస భార్గవాదులగు పెద్ద లిట్లని చెప్పిరి 'త్వక్చక్షు శ్శ్రోత్ర జిహ్వా ఘ్రాణంబులను బుద్ధీంద్రియంబులును, వాక్పాణి పాద పాయూపస్థంబులను కర్మేంద్రియంబులును, మనంబునుం గూడ నేకాదశ సంఖ్యంబైన యింద్రియజాతంబు జయించి, కామజంబు లగు నక్ష మృగయా స్త్రీ పానార్థ దూషణంబులునుం, క్రోధజంబు లగు వాక్పారుష్య దండపారుష్యంబులును నైన సప్తవ్యసనంబు లం దగులక, యజ్ఞాధ్యయన దానతత్పరుం డగుచు దుర్మంత్రుల కుటిల వాక్యంబులకు లోనుగాక, నయవిక్రమ క్రమజ్ఞులైన యమాత్యులతో దైవ మానుష చింతనంబు చేయుచు దేవ బ్రాహ్మణ ప్రణామ తర్పణ రక్షణంబులుం జేసి, యశుభ నిరాసనంబును, శుభాపాదనంబును నొనర్చుచుఁ బ్రజలం బాలించు భూపతి యుభయ లోక సిద్ధులం బొందు. 285

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; రాజునకున్ రక్షింప వలయునవి= రాజు రక్షించవలసినవి ఉన్నాయి; స్వామి+అమాత్య జనపద కోశ సైన్య మిత్ర దుర్గంబులు+అను= స్వామి, మంత్రి, జనపదం, ధనాగారం, సైన్యం, మిత్రులు, దుర్గాలు అనే; రాజ్య+అంగసప్తకంబు= రాజ్యానికి భాగాలైన ఏడింటిని; కన్ను+ఇడి+అరయవలయునది= కనిపెట్టి పరిశీలించాలి; సంధి, విగ్రహ యాన+ఆసన ద్వైధీభావ సమాశ్రయంబులు+అను= సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం అనే; షాడ్గుణ్యంబున్= ఆరు గుణాలతో; నడపవలయునది= రాజనీతిని నిర్వర్తించాలి; ధర్మ+అర్థ కామంబులు+అను= ధర్మం, అర్థం, కామం అనే; వర్గత్రితయంబు= పురుషార్థాల్లోని ఈ మూడు వర్గాలను; పాటింపవలయునది= నిర్వర్తించాలి; మంత్ర, ప్రభుత్వ+ఉత్సాహంబులు+అను= మంత్రం,

ప్రభువు, ఉత్సాహం అనే; శక్తి త్రయంబున్= మూడు శక్తులను; నిజవశవర్తిన్+చేయవలయునది= స్వాధీనం చేసికొనవలసి ఉన్నది; సత్త్వరజఃతమంబులు+అను= సత్త్వం, రజస్సు, తపస్సు అనే; గుణ త్రికంబున్= మూడు గుణాలను; విశేషించి= ప్రత్యేకించి; సతతమున్= ఎల్లప్పుడు; ధర్మసేవన్= ధర్మానుగుణమైన సేవను; ఆచరింపవలయునది= పాటించాలి; ప్రమాదంబునన్= ప్రమాదవశాత్తు; అర్థ కామంబులు= ధనమూ కోరికలు; హీనంబులు+ఐనను= హీనదశకు వచ్చినప్పటికి; ధర్మనిష్ఠన్+చేసి= ధర్మమునందు ఆసక్తుడై ఉండటం వలన; ధరణీ పరిపాలనంబు= రాజ్యపాలనం; సుస్థిరంబు+ఐ చెల్లున్= స్థిరంగా కొనసాగుతుంది; ఇట్లు+అని= ఇట్లాగని; ఆంగిరస భార్గవ+ఆదులు+అగు= ఆంగిరసుడు భార్గవుడు అనే మహర్షులు మొదలైన; పెద్దలు= వృద్ధులు (ఆర్యులు); చెప్పిరి= పలికారు; త్వక్+చక్షుః+శ్రోత్ర జిహ్వా+ఘ్రాణంబులు+అను= చర్మం, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు అనే; బుద్ధి+ఇంద్రియంబులును= జ్ఞానేంద్రియాలు ఐదూ; వాక్+పాణి పాద పాయు+ఉపస్థంబులు+అను= వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థం అనే; కర్మ+ఇంద్రియంబులును= కర్మేంద్రియాలు ఐదూ; మనంబునున్+కూడన్= మనసూ కలసి; ఏకాదశ సంఖ్యంబు+ఐన= పదునొకండు సంఖ్యతో కూడినదైన; ఇంద్రియ జాతంబున్+జయించి= ఇంద్రియ సమూహాన్ని గెల్చి; కామజంబులు+అగు= కామం వలన కలిగిన; అక్ష, మృగయా, స్త్రీ, పాన, అర్థ, దూషణంబులున్= ద్యూతం, వేట, స్త్రీలోలత, మద్యపానం, నిరర్థక ధనవ్యయం అనే అయిదు వ్యసనాలూ; క్రోధజంబులు+అగు= కోపంవలన కలిగిన; వాక్పారుష్య దండ పారుష్యంబులునున్+ఐన= వాక్పారుష్యం, దండపారుష్యం అనే రెండు పారుష్యాలు అనే; సప్త వ్యసనంబులన్+తగులక= ఏడు వ్యసనాలకు లొంగక; యజ్ఞ+అధ్యయన దాన తత్పరుండు+అగుచున్= యజ్ఞాలు చేయటంలో, వేదాధ్యయనంలో, దానం చేయటంలో ఆసక్తుడై; దుః+మంత్రుల= దుష్టులైన మంత్రులయొక్క; కుటిల వాక్యంబులకున్= చెడ్డ మాటలకు; లోనుగాక= లొంగక; నయ విక్రమ క్రమజ్ఞులు+ఐన= నీతి పరాక్రమ మెరిగిన వారైన; అమాత్యులతోన్= మంత్రులతో; దైవ మానుష చింతనంబు+చేయుచున్= ఆయా దైవ మానుష వ్యవహారాలు నిర్వర్తిస్తూ; దేవ బ్రాహ్మణ తర్పణ రక్షణంబులన్+చేసి= దేవతలకు బ్రాహ్మణులకు నమస్కరిస్తూ, తర్పణాలిస్తూ వారిని రక్షిస్తూ ఉండటం చేత; అశుభ నిరాసనంబునున్= అశుభాలను తొలగించటమూ; శుభ+ఆధానంబునున్+ఒనర్చుచున్= శుభాలను చేకూరుస్తూ; ప్రజలన్= ప్రజలను; పాలించు భూపతి= పరిపాలించే రాజు; ఉభయలోక సిద్ధులన్+పొందున్= ఇహపరలోకాలు రెండింటిలోను కృతార్థు డౌతాడు.

తాత్పర్యం: ఇంకా రాజు జాగరూకతతో సంరక్షించవలసినవాటిని తెలుపుతాను విను మని ధర్మరాజుకు భీష్ముడు వివరించాడు. 'స్వామి, అమాత్యుడు, జనపదం, ధనాగారం, సైన్యం, మిత్రులు, దుర్గం - అనే రాజ్యాంగాలైన ఏడింటిని కనిపెట్టి పరిశీలించవలసిన అవసరం ఉన్నది. సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం - అనే ఆరు రాజ్యతంత్రాలను రాజనీతితో నిర్వర్తిస్తూ, ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలను నిర్వర్తించటం రాజధర్మం. మంత్రం, ప్రభువు, ఉత్సాహం అనే శక్తిత్రయాన్ని స్వాధీనం చేసికొని, సత్త్వ రజస్తమోగుణాలనే మూడింటితో ముఖ్యంగా ధర్మానుగుణమైన సేవచేయటం రాజనీతి. ప్రమాదవశాత్తు అర్థకామాలు హీనదశకు చేరినప్పటికీ రాజు ధర్మనిష్ఠాపరుడైతే రాజ్యపాలనం సుస్థిరమై కొనసాగుతుంది. రాజధర్మ మిది - అని ఆంగిరసుడు, భార్గవుడు మొదలైన మహర్షులు చెప్పారు. త్వక్కు, చక్షువు, శ్రోత్రం, జిహ్వ, ఘ్రాణం అనే ఐదు జ్ఞానేంద్రియాలు, వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థం అనే ఐదు కర్మేంద్రియాలు, మనస్సూ కలసి ఏకాదశ సంఖ్య గల ఇంద్రియ సమూహాన్ని జయించి కామంవలన పుట్టిన ద్యూతం, వేట, స్త్రీలోలత, మద్యపానం, నిరర్థకధనవ్యయం అనే ఐదు వ్యసనాలు, క్రోధంవలన కలిగిన వాక్పారుష్యం, దండపారుష్యం అనే రెండు పారుష్యాలు కలసిన సప్తవ్యసనాలకు లొంగక యజ్ఞాలు చేయటంలో, వేదాధ్యయనంలో దానంలో ఆసక్తుడై మంత్రుల కుటిలవాక్యాలకు దూరంగా ఉంటూ, రాజనీతి పరాక్రమం తెలిసిన మంత్రులతో, దైవమానుష చింతనతో, దేవబ్రాహ్మణులకు నమస్సులతో తర్పణలిస్తూ, సంరక్షణచేస్తూ అశుభాలకు దూరంగా సమస్త శుభాలను ప్రసాదిస్తూ ప్రజలను పాలించే రాజు ఇహపరలోకాలు రెండింటిలోను సిద్ధి పొందగలుగుతాడు'.

తే. అనిన విని ప్రీతి ధర్మనందనుఁడు రాజు । దండనీతియు ననఁగ నుదాత్తయుక్త
వస్తువులు రెండు నార్య ప్రశస్త కార్య । సిద్ధి గావించు తరములు సెప్పు మనఘ!' 286

ప్రతిపదార్థం: అనినన్ విని= అని రాజ ధర్మాన్ని గూర్చి భీష్ముడు చెప్పగా విని; ధర్మనందనుఁడు= ధర్మరాజు; ప్రీతిన్= సంతోషంతో; అనఘ!= పాపరహితుడవైన తాతా!; రాజు దండనీతియున్= రాజును, దండనీతి; అనఁగన్= అనేటువంటి; ఉదాత్త యుక్తవస్తువులు= శ్రేష్ఠము లైన ఈ అంశాలు; రెండును= రెండూ; ఆర్యప్రశస్తకార్య సిద్ధి కావించు= ఆర్యులయొక్క ప్రసిద్ధమైన కార్యాలు సిద్ధిపొందించే; తరములు= విధములు; చెప్పుము= వివరించుము.

తాత్పర్యం: రాజధర్మాన్ని గూర్చి భీష్ముడు విపులంగా వివరించగా విన్న ధర్మరాజు సంతోషంతో భీష్ముడితో 'రాజు, దండనీతి అనే శ్రేష్ఠమైన అంశాలు రెండూ ఆర్యప్రసిద్ధ కార్యసిద్ధిని ఎట్లా కలిగిస్తాయో ఆ పద్ధతులను అన్నిటినీ వివరించుము.'

వ. అని యడిగిన నప్పుడమిపేనికి సరిత్సూనుం డిట్లనియె. 287

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని ధర్మరాజు అడుగగా; ఆ+పుడమి పేనికిన్= ఆ ధర్మరాజుతో; సరిత్+సూనుండు= నదీపుత్రుడైన భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు భీష్ముడిని ప్రార్థించగా నదీసుతుడైన భీష్ముడు ధర్మరాజుతో ఈ విధంగా పలికాడు.

క. 'భూరమణుఁడు కాలమునకుఁ । గారణ మెట్లన్న ధర్మగతి పూర్ణత నొ
ప్పారంగ దండనీతి స । మారంభము నడపుఁ గృతయుగాగతి నధిపా! 288

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా!; భూరమణుఁడు= భూమికి భర్తఅయిన రాజు; కాలమునకున్= కాలగమనానికి; కారణము+ఎట్లు+అన్నన్= ఏ విధంగా కారణ భూతుడౌతున్నా డంటే; ధర్మగతి= రాజ ధర్మవిధానం; పూర్ణతన్+ఒప్పారంగన్= సంపూర్ణమై విలసిల్లేటట్లుగా; కృతయుగ+ఆగతిన్= కృతయుగం రాకతో; దండనీతి సమారంభమున్= రాజనీతి ప్రారంభం; నడపున్= కొనసాగిస్తున్నాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజు కాలగమనానికి కారణభూతు డెట్లా అవుతున్నా డంటే, ధర్మవిధానం సంపూర్ణంగా విలసిల్లేటట్లు కృతయుగం రాకతో రాజనీతిని ప్రారంభించి కొనసాగించటంవలన మాత్రమే అని గ్రహించాలి' అని వివరించాడు.

వ. అందు. 289

తాత్పర్యం: ఆ కృతయుగంలో - (తరువాతి పద్యంతో అన్వయం).

క. ధర్మంబు పెరుఁగు వైదిక । కర్మఫలము లెసఁగు ఋతునికాయము ప్రజకున్
శర్మం బొనర్చు నాయువు । పేర్మిఁ బొరయు దున్నకయును బృథివి ఫలించున్. 290

ప్రతిపదార్థం: ధర్మంబు పెరుఁగున్= ధర్మం అభివృద్ధి చెందుతుంది; వైదిక కర్మ ఫలముల్+ఎసఁగున్= వేదాధ్యయనం, యజ్ఞయాగాది ధర్మాచరణాల ఫలితాలు అతిశయిస్తాయి; ప్రజకున్= ప్రజలకు; ఋతునికాయము= ఋతు సమూహం; శర్మంబు+ఒనర్చున్= శుభం చేకూర్చుతుంది; ఆయువు= జీవితకాలం; పేర్మిన్+పొరయున్= అతిశయమై ఒప్పుతుంది; దున్నక= దున్నకుండానే; పృథివి= భూమి; ఫలించున్= పండి పంటలిస్తుంది.

తాత్పర్యం: కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుంది. వేదాధ్యయనం, యజ్ఞయాగాది ధర్మాచరణ ఫలితాలు అతిశయిస్తుంటాయి. ప్రజలకు ఋతువు లన్నీ సంతోషాన్ని కలిగిస్తాయి. ప్రజలయొక్క ఆయువు అతిశయమై ఒప్పుతుంది. కర్షకులు దున్నకుండానే భూమి పంటలను ప్రసాదిస్తుంది.

తే. రాజు మూఁడు భాగముల ధర్మంబు నడపుఁ । ద్రేత నమ్మెయి నది ప్రజాప్రీతి సలుపు
ద్వాపరంబున నర్ధంబ యోపి చెల్లఁ । జేయు నక్కాల మమ్మాత్రఁ జెందు మేలు. 291

ప్రతిపదార్థం: త్రేతన్= త్రేతాయుగంలో; రాజు; మూఁడు భాగములన్= మూడు భాగాలతో; ధర్మంబు నడపున్= ధర్మాన్ని కొనసాగిస్తాడు; ఆ+మెయిన్+అది= ఆ త్రేతాయుగంలోని పరిస్థితి ఆ విధంగా; ప్రజాప్రీతి+చలుపున్= ప్రజలకు ఆనందాన్ని చేకూరుస్తుంది; ద్వాపరంబునన్= ద్వాపరయుగంలో; అర్ధంబు+అ+ఓపి= ధర్మాన్ని రెండుపాదాలతో మాత్రమే; చెల్లన్+చేయున్= చెల్లుబడి అయ్యేటట్లు చేస్తాడు; ఆ+కాలము= ఆ ద్వాపరయుగంలో; ఆ+మాత్రన్= ఆ మాత్రమే; మేలు= మంచి; చెందున్= కలుగుతుంది.

తాత్పర్యం: త్రేతాయుగంలో రాజు ధర్మాన్ని మూడు పాదాలతో నడిపిస్తాడు. అది ప్రజలకు మిక్కిలి సంతోషాన్ని సమకూరుస్తుంది. ద్వాపరయుగంలో రాజు ధర్మాన్ని రెండు పాదాలతో నడపుతాడు. ఆ ద్వాపరయుగంలో ఆ మాత్రమే మేలు కలుగుతుంది.

క. నరపతి ధర్మోపేక్షా । పరుఁ డగుఁ గలియుగమునందుఁ బాయును ధర్మ
స్ఫురణ మధర్మం బెందును । బరఁగును వర్ణాశ్రమముల పథములు దప్పున్. 292

ప్రతిపదార్థం: కలియుగము నందున్= కలియుగంలో; నరపతి= రాజు; ధర్మ+ఉపేక్షాపరుఁడు+అగున్= ధర్మం పట్ల అశ్రద్ధ వహిస్తాడు; ధర్మస్ఫురణము= ధర్మజ్ఞానం; పాయును= నశిస్తుంది; ఎందునున్= అంతటా; అధర్మంబు పరఁగును= అధర్మం వ్యాపిస్తుంది; వర్ణ+ఆశ్రమముల పథములు= నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలకు సంబంధించిన మార్గాలు; తప్పున్= గతి తప్పుతాయి.

తాత్పర్యం: కలియుగంలో రాజు ధర్మంపట్ల శ్రద్ధ వహించడు. ధర్మజ్ఞానం క్రమంగా నశిస్తుంది. అధర్మం అంతటా వ్యాపిస్తుంది. నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలు వాటికి సంబంధించిన పద్ధతులు క్రమంగా గతి తప్పుతాయి.

వ. కాల ప్రభావం బిట్టిది యైనను. 293

తాత్పర్యం: కాలమహిమ ఇట్లాంటిది అయినప్పటికి - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. విభుని సకలధర్మవృత్తి నత్తఱి కృత । యుగముఁ బోలు ధర్మయుక్తి మాత్ర
లరయ విభుల కెట్టులయ్యె నట్టి తెఱంగు । లవుల యుగములట్ల యగు నృపాల! 294

ప్రతిపదార్థం: నృపాల!= ఓ ధర్మరాజా!; ఆ+తఱిన్= ఆ సమయంలో; విభుని సకల ధర్మవృత్తిన్= రాజుయొక్క సమస్త ధర్మ ప్రవృత్తి; కృతయుగమున్+పోలు= కృతయుగంలో వలె; ధర్మయుక్తి మాత్రలు+అరయన్= రాజనీతి విధానాన్ని పరిశీలించగా; విభులకున్= రాజులకు; ఎట్టులు+అయ్యెన్= ఏ విధంగా అయ్యాయో; అట్టి తెఱంగులు= ఆ రీతులు; అవుల యుగముల+అట్లు+అగున్= ఆ తరువాతి యుగాలలో రీతిగానే కొనసాగుతుంది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఆయా యుగాలలో రాజనీతినిబట్టి ధర్మం కొనసాగుతుంది. కృతయుగంలో వలె రాజు ధర్మాన్ని నాలుగుపాదాల నిర్వహిస్తే అదే రీతిగా ధర్మం అభివృద్ధి చెందుతుంది. లేని పక్షంలో అంటే త్రేతా ద్వాపర కలియుగాలలో వలె క్రమంగా రాజు అనుసరించే దండనీతి ప్రకారం ధర్మం నశిస్తూ ఉంటుంది.

వ. అనుటయు నెట్టివాఁడైన విభుని శుభంబులు పొందు; ననుటయు ధర్మనందనునకు మందాకినీ నందనుం డిట్లనియె. 295

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు చెప్పగా; ఎట్టివాఁడైన= ఎలాంటి వాడైన; విభునిన్= రాజును; శుభంబులు పొందున్= శుభములు చేకూరుతాయి; అనుటయున్= అని అడుగగా; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; మందాకినీ నందనుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఎట్లాంటి నడవడి కలిగిన రాజునకు శుభక్రమం చేకూరుతుందో తెలియజేయు'మని ధర్మరాజు ప్రార్థించగా భీష్ముడు ఇట్లా వివరించాడు.

మ. అరయుం దప్పు కృతం బెఱుంగు మదలోభావేశముల్ లే వము
ష్కరుఁ డాత్మస్తుతి లేదు చేయునియతిం గార్యంబు లీగుల్ ఘన
స్థిరముల్ శూరుఁడు గర్వికాఁడశఠుఁ డస్త్రీలోలుఁ డక్రోధనుం
డరి నొవ్వం గొనఁ డ న్వొగడ్తఁ గను రా జత్యంత దీప్తుం డగున్.' 296

ప్రతిపదార్థం: రాజు= రాజు; తప్పు= తప్పును; అరయున్= పరిశీలిస్తాడు; కృతంబు+ఎఱుంగున్= చేసిన పనిని గుర్తిస్తాడు; మదలోభ+ఆవేశముల్ లేవు= మదం, పిసినారితనం, ఆవేశం మొదలైనవి కలిగి ఉండడు; అముష్కరుఁడు= దుర్మార్గుడు కానివాడు; ఆత్మస్తుతి లేదు= తనను తాను పొగడుకోడు; నియతిన్= నియమబద్ధంగా; కార్యంబులు= విధ్యుక్త ధర్మాలు; ఈగుల్= దాన ధర్మాలు; ఘన స్థిరముల్= అధికంగా పదికాలాలపాటు నిలిచేటట్లు; చేయున్= చేస్తాడు; శూరుఁడు= పరాక్రమవంతుడు; గర్వికాఁడు= గర్వం లేకుండా ఉంటాడు; అశఠుఁడు= కుత్సితుడు కానివాడు; అస్త్రీలోలుఁడు= స్త్రీలౌల్యం లేనివాడు; అక్రోధనుండు= కోపంలేనివాడు; అరిన్= కప్పమును; నొవ్వన్= సామంత రాజులకు బాధకలిగేటట్లు; కొనఁడు= గ్రహించడు; అన్+పొగడ్తన్+కనున్= అనే ప్రశంసను పొందుతాడు; అతి+అంత= మిక్కిలి; దీప్తుండు+అగున్= తేజస్వవంతుడై ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: రాజు ప్రజల తప్పులను పరిశీలిస్తాడు, చేసిన పనులను గుర్తిస్తాడు. మదమూ, లోభమూ, ఆవేశమూ లేనివాడు. దొంగకానివాడు, ఆత్మస్తుతి చేసికొనడు. నియమబద్ధంగా విధ్యుక్తధర్మాలను ఘనమైన దానాలను పదికాలాలు నిలిచేటట్లు నిర్వహిస్తాడు. పరాక్రమవంతుడు, నిగర్వి, కుత్సితుడు కానివాడు, పరస్త్రీలౌల్యం లేనివాడు, క్రోధరహితుడు, సామంతులను పీడిస్తూ కప్పం గ్రహించడు' అనే పొగడ్తలకు పాత్రుడైనవాడు. అట్లాంటి రాజు మిక్కిలి తేజస్సుతో ప్రకాశిస్తాడు.'

వ. అని చెప్పి వెండియు. 297

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

ఆ. 'సాంగ వేదవేది యగు పురోహితుఁ డెప్పు । నగర మెలఁగ వలయుఁ దగవుఁ గృపయుఁ
జక్కటియును గలుగు సచివునప్పనముల । నరులు నరయఁ బనుచునది విభుండు. 298

ప్రతిపదార్థం: విభుండు= రాజు; సాంగవేదవేది+అగు= అంగాలతో కూడిన వేదాలు తెలసినవాడైన; పురోహితుఁడు= బ్రాహ్మణుని; ఎప్డున్= ఎల్లప్పుడు; నగరమున్+మెలగవలయున్= పట్టణంలో ఉండేటట్లు నియమించాలి; తగవున్= సముచితమైన తీర్పు; కృపయున్= దయ; చక్కటియునున్+కలుగు= న్యాయం కలిగిన; సచివున్= మంత్రిని; అప్పనములున్= కానుకలను; అరులన్= కప్పములను; అరయన్+పనుచునది= పరిగ్రహించటానికి నియమించాలి.

తాత్పర్యం: రాజు వేదవేదాంగవేత్త అయిన పురోహితుడిని పట్టణంలో సదా ఉండేటట్లు నియమించాలి. సముచితమైన తీర్పు, దయ, న్యాయం కలిగిన అమాత్యుడిని మాత్రమే ప్రజలు ఇచ్చేకానుకలు కప్పాలు గ్రహించేటట్లుగా నియమించాలి.

క. పరుసఁదనముమెయి నరిగొనఁ । జొరఁదగ; దది పాదుఁగు గోయు చొప్పగు విను పా
ల్గరియించుకొనఁ దలంచిన । నరయవలదె గోవుఁ బ్రజయు నట్టిద యధిపా! 299

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా! విను= జాగరూకతతో వినుము; పరుసఁదనము మెయిన్= కాఠిన్యంతో; అరి+కొనన్+చొరన్+తగదు= కప్పం గ్రహించటానికి ప్రయత్నించకూడదు; అది= ఆ విధానం; పాదుఁగు+కోయు చొప్పు+అగున్= (పాలకోసం) ఆవు పొదుగు కోసినట్లపుతుంది; పాల్గయించుకొనన్+తలంచినన్= ఆవు పొదుగునుండి పాలు పిండుకొనదలిస్తే; గోవున్= ఆవును; అరయవలదె!= జాగరూకతతో కాపాడు కొనాలి కదా!; ప్రజయున్= ప్రజానీకం కూడా; అట్టిది+అ= ఆ ఆవువంటిదే.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ప్రజలపై కాఠిన్యం వహించి కప్పం గ్రహించటానికి ప్రయత్నించకూడదు. కాఠిన్యంతో ప్రవర్తించి కప్పాన్ని గ్రహించటం పాలిస్తున్న ఆవు పొదుగును కోసిన దానితో సమానం. పాలు కావా లనుకొన్నప్పుడు ఆవును జాగ్రత్తగా రక్షించుకొనాలి కదా! అట్లాగే ప్రజలను కూడా పరిరక్షించుకొనాలి'

ఆ. కోరి తోఁటవాఁడు కుసుమ ఫలంబులు । కోయునట్లు రాజు కొనఁగవలయు
నప్పనములు; నటికి యంగారములు చేయు । భంగి యైన భూమి పాడు గాదె? 300

ప్రతిపదార్థం: తోఁటవాఁడు= తోటమాలి; కోరి= ఇష్టపడి; కుసుమ ఫలంబులు= పుష్ప ఫలాలు; కోయునట్లు= కోసేరీతిగా; రాజు= ప్రభువు; అప్పనములు కొనఁగవలయున్= కానుకలు, కప్పాలు గ్రహించాలి; నటికి= ఖండించి; అంగారములు చేయు భంగి+ఐనన్= నిప్పుపెట్టి బొగ్గులుగా చేసేరీతిలో ప్రవర్తిస్తే; భూమి పాడు+కాదె?= భూమి నాశనం కాదా? (అవుతుంది కదా అని భావం).

తాత్పర్యం: తోటమాలి కావలసిన పుష్పఫలాలను కోసుకొన్నట్లుగా రాజు కూడా జాగరూకుడై కప్పాలను గ్రహించాలి. అట్లా కాక ఫలపుష్పాదుల నిచ్చే చెట్లను నరికి నిప్పుపెట్టి బొగ్గులుగా చేస్తే భూమి నాశనమౌతుంది. కాబట్టి తోటమాలివలె రాజు జాగరూకుడై ప్రజలను సంరక్షిస్తూ కప్పం గ్రహించవలసి ఉంటుంది.

విశేషం: అలం: ఉపమ.

క. దయఁ బ్రజ రక్షించుటకు, నె । నయె తపములు నధ్వరములు నరవర దానన్
జయమును లక్ష్మియునుం గీ । ర్తియు సుగతియుఁ గలుగు వసుమతీనాథునకున్. 301

ప్రతిపదార్థం: నరవర!= నరులలో శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; వసుమతీ నాథునకున్= భూభర్తయిన రాజునకు; ప్రజన్= ప్రజలను; దయన్= దయతో; రక్షించుటకున్= సంరక్షించటంలో; తపములున్= తపస్సులు; అధ్వరములున్= యాగములు; ఎనయె?= సమానమా? (కావు); దానన్= దానివలన; జయమును= విజయమూ; లక్ష్మియున్= సంపద; కీర్తియున్= యశస్సును; సుగతియున్= ఉత్తమ గతులు; కలుగున్= ప్రాప్తిస్తాయి.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ప్రజలను సంరక్షించటమే రాజు ప్రధానధర్మం. కాని, ఆ రాజుచేసే తపస్సులు, యాగాలు, ప్రజలను దయతో సంరక్షించే దానితో సమానం కావు. రాజు రాజధర్మాన్ని అనుసరించి ప్రజలను సంరక్షిస్తే ఆ రాజునకు విజయంతోపాటు సంపద, కీర్తి ఉత్తమగతులు లభిస్తాయి' అని భీష్ముడు వివరించాడు.

వాయుదేవుఁడు పురూరవునకుఁ జెప్పిన రాజధర్మప్రకారము (సం. 12-73-2)

వ. విశేషించి పురోహితుం బాటింపవలయు వినుము. తొల్లి యెలుం డగు పురూరవుండు 'వసుధ విప్రక్షత్త్రియులం దెవ్వాని ధనంబై యుండునని వాయుదేవు నడిగిన నమ్మహాత్ముండు చతుర్ముఖుని ముఖ బాహూరు పాదంబులు బ్రాహ్మణ క్షత్త్రియ వైశ్యశూద్రులకుఁ బ్రభవస్థానంబు లగుట చెప్పి యి ట్లుత్కృష్ట ప్రభవుండై సర్వ వర్ణంబులకు నీశ్వరుం డగు బ్రాహ్మణుం డీ పృథివీ ధన ధాన్యాది సమస్త వస్తువులునుం దా ననుభవింపను నొడ్లకు నొసంగను యుక్తుండు; దండనీతి ధారణంబునకు క్షత్త్రియుం జొనిపి బ్రాహ్మణ శాంతి పరత్వంబున క్షత్త్రియాధిపత్యప్రాప్తి పతిలేమి నంగన దేవరునిం బ్రతిగ్రహించినట్లున్నది; యిది భూమి తెఱం; గి ట్లగుటం జేసి నిజధర్మవ్రతుండును, విద్వాంసుండును శాంతుండును నగు పురోహితునకు సర్వసంపదలును సమర్పించి జనపతి శుశ్రూషా పరుండును, నహంకార రహితుండును నై దండనీతి నయించి యుభయ లోకంబులనుం బెంపు వహించు. 302

ప్రతిపదార్థం: వినుము= ఓ ధర్మరాజా! వినుము; విశేషించి= ప్రత్యేకించి; పురోహితున్+పాటింపన్ వలయున్= బ్రాహ్మణుని గౌరవించాలి; తొల్లి= పూర్వం; ఐలుండు+అగు= ఇలా పుత్రుడైన; పురూరవుండు= పురూరవుడనే రాజు; వసుధ= ఈ భూమి; విప్ర క్షత్రియులందున్= బ్రాహ్మణ,క్షత్రియులలో; ఏ+వాని ధనంబు+ఐ+ఉండున్+అని= ఎవడి సొత్తై ఉంటుంది అని; వాయుదేవున్+అడిగినన్= వాయుదేవుడిని ప్రశ్నించగా; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడు; చతుర్ముఖుని= నాలుగు ముఖాలుగల బ్రహ్మయొక్క; ముఖ, బాహు+ఊరు పాదంబులు= ముఖం, బాహువులు, తొడలు, పాదాలు (క్రమంగా); బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకున్= బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు, శూద్రులకు; ప్రభవస్థానంబులు+అగుట చెప్పి= పుట్టుక స్థానాలు కావటాన్ని వివరించి; ఇట్లు= ఈ విధంగా; ఉత్కృష్ట ప్రభవుండు+ఐ= శ్రేష్ఠమైన జన్మకలవాడై; సర్వవర్ణంబులకున్= అన్ని వర్ణాలకు; ఈశ్వరుండు+అగు బ్రాహ్మణుండు= అధిపతిఅయిన బ్రాహ్మణుడు; ఈ పృథివీ ధన ధాన్య+ఆది సమస్త వస్తువులునున్= ఈ భూమిలోని ధనమూ, ధాన్యమూ మొదలైన అన్ని వస్తువులను; తాన్+అనుభవింపను= తాను అనుభవించటానికి; ఒడ్లకున్+ఒసంగనున్= ఇతరులకు ఇవ్వటానికి; ఉక్తుండు+అగుటన్= నియమించబడి; దండనీతి ధారణంబునకున్= రాజధర్మ నిర్వహణకు; క్షత్రియున్+చొనిపెన్= క్షత్రియుడిని నియోగించాడు; బ్రాహ్మణ శాంతిపరత్వంబున్= బ్రాహ్మణుడికి సహజమైన శాంతి అందలి ఆసక్తివలన; క్షత్రియ+ఆధిపత్య ప్రాప్తి= రాజునకు అధికారం సంప్రాప్తం కావటంవలన; పతి లేమిన్= భర్త లేకపోవటం వలన; అంగన= స్త్రీ; దేవరునిన్= భర్తయొక్క సోదరుడిని; ప్రతిగ్రహించిన+అట్లు+ఉన్నది= భర్తకు బదులుగా గ్రహించినట్లున్నది; ఇది భూమి తెఱంగు= ఇది భూమి క్షత్రియులకు సంప్రాప్తించిన విధానం; ఇట్లు+అగుటన్+చేసి= ఇట్లా జరిగినందువలన; నిజ ధర్మ వ్రతుండును= తనదైన సనాతన ధర్మాన్ని పాటించేవాడు; విద్వాంసుండును= పండితుడు; శాంతుండును= ప్రశాంతమైన మనస్సు కలవాడు; అగు= అయిన; పురోహితునకున్= బ్రాహ్మణుడికి; సర్వ సంపదలును= సమస్త సంపదలను; సమర్పించి= ఇచ్చి; జనపతి= రాజు; శుశ్రూషా పరుండును= బ్రాహ్మణ సేవాసక్తుడూ; అహంకార రహితుండునున్+ఐ= అహంకారం లేనివాడై; దండనీతిన్ నయించి= దండనీతిని ప్రయోగించి; ఉభయ లోకంబులనున్= ఇహపర లోకాలు రెండింటిలో; పెంపున్ వహించున్= అభ్యున్నతిని పొందుతాడు.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో ఈ విధంగా పలికాడు - 'రాజు పురోహితుడిని గౌరవించవలసి ఉంటుంది. పూర్వం పురూరవుడు వాయుదేవుడితో బ్రాహ్మణ క్షత్రియులలో ఈ భూమి ఎవరి సొత్తని ప్రశ్నించాడు. అప్పుడు

వాయుదేవుడు పురూరవుడికి ఇట్లా వివరించాడు. 'బ్రహ్మయొక్క ముఖం, బాహువులు, తొడలు, పాదాల నుండి బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు జన్మించారు. ఉత్తమాంగంలో జన్మించిన బ్రాహ్మణుడు అన్ని వర్ణాలకు ఈశ్వరుడివంటివాడు. ఈ భూమిపై ఉన్న ధనధాన్యాది సమస్తవస్తువులను తా ననుభవిస్తూ ఇతరులకు ఇవ్వటానికి అర్హు డయ్యాడు. ఆ బ్రాహ్మణుడు దండనీతిని ధరించటానికి క్షత్రియుడిని నియోగించాడు. బ్రాహ్మణుడు సహజంగా శాంత్యనురక్తుడు కావటంవలన క్షత్రియుడు రాజ్యాన్ని పొందటం భర్త లేని స్త్రీ భర్తయొక్క సోదరుడిని ప్రతిగ్రహించినట్లుగా ఉన్నదని తెలిపాడు. ఇదిభూలోకంలోని క్షత్రియుల విధానం. తన సనాతనధర్మాన్ని సంరక్షిస్తున్నవాడు, విద్వాంసుడు, శాంతుడు అయిన పురోహితుడికి సమస్తసంపదలను సమర్పించి, బ్రాహ్మణుడికి సేవచేస్తూ అహంకారరహితుడై దండనీతిని ప్రయోగించే రాజు ఇహపరలోకాలలో ఉత్తమ గతులను పొందుతాడు.

విశేషం: అలం: ఉపమ.

క. రస గంధాద్యనుభవములు । పాసఁగవు భీతమగు చిత్తమున భయముం బా
ప సమర్థుఁడు కావున నృపుఁ । డసమానప్రభుతఁ బొందు నవనీనాథా! 303

ప్రతిపదార్థం: అవనీ నాథా!= భూ భర్త అయిన ఓ ధర్మరాజా!; రసగంధ+ఆది+అనుభవములు= రుచి, వాసన మొదలైన అనుభూతులు; పాసఁగవు= ఒప్పవు; భీతము+అగు చిత్తమునన్= భయభ్రాంత మైన మనసునందు; భయమున్+పాపన్= భయాన్ని తొలగించటానికి; సమర్థుఁడు= సామర్థ్యం కలవాడు; కావునన్= కాబట్టి; నృపుఁడు= రాజు; అసమాన ప్రభుతన్+పొందున్= సాటిలేని అధికారాన్ని పొందుతాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజునకు రుచి వాసన మొదలైన అనుభూతులు పనికిరావు. భయపడ్డవారి భయాన్ని తొలగించటానికి రాజు సమర్థుడు. అందువలననే సాటిలేని అధికారాన్ని రాజు సంపాదించుకొంటాడు.'

క. అని వాయుదేవుఁ డి ట్ల । జ్జనపతి బోధించె ననుడు శాంతనవున క
మ్మనుజపతి యిట్టు లను 'నే । పనులఁ బురోహితుఁడు మాన్యభావము నొందున్?' 304

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ విధంగా; వాయుదేవుఁడు= వాయుదేవుడు; ఆ+జనపతి= ఆ పురూరవుడికి; బోధించెన్= ప్రబోధించాడు; అనుడున్= అని చెప్పగా; శాంతనవునకున్= భీష్ముడికి; ఆ+మనుజపతి= ఆ నరపతి అయిన ధర్మరాజు; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు; ఏ పనులన్= ఏ పనులతో; పురోహితుఁడు= బ్రాహ్మణుడు; మాన్యభావమున్+ఒందున్?= గౌరవభావాన్ని పొందుతాడు?.

తాత్పర్యం: అని వాయుదేవుడు పురూరవుడికి తెలిపినట్లు భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు. అప్పుడు 'ఏ ఉత్తమ కార్యాచరణ వలన బ్రాహ్మణుడు గౌరవభావాన్ని పొందుతాడో తెలుపవలసిం'దని ధర్మరాజు భీష్ముడిని ప్రార్థించాడు.

వ. అనిన నా ధర్మతనయుతో నద్దేవవ్రతుండు 'పురోహిత విషయంబులుగా శుక్రుండు చెప్పిన వాక్యంబులు గల వుపన్యసించెద నాకర్ణింపు'మని యిట్లనియె. 305

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ ధర్మతనయుతోన్= ఆ ధర్మరాజుతో; ఆ+దేవవ్రతుండు= ఆ భీష్ముడు; పురోహిత విషయంబులుగాన్= పురోహిత విషయమై; శుక్రుండు= శుక్రాచార్యుడు; చెప్పిన వాక్యంబులు+కలవు= చెప్పిన మాటలు ఉన్నాయి; ఉపన్యసించెదన్= ప్రసంగిస్తాను; ఆకర్ణింపుము= వినుము; అని+ఇట్లు+అనియెన్= అని ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పైవిధంగా భీష్ముడు ధర్మరాజుతో చెప్పి, మళ్ళీ శుక్రాచార్యుడు పురోహితవిషయంగా చెప్పిన వాక్యాలను వివరిస్తా ననీ జాగరూకతతో వినవలసిం దనీ భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

తే. 'అమర గరుడ గంధర్వ విద్యాధరాది । దివ్యులకు నధ్వరంబులఁ దృప్తి సేసి
పరమ శుభములఁ బొందు భూవరుఁడు; దాని । కెల్ల మూలంబు దగు పురోహితుని బుద్ధి. 306

ప్రతిపదార్థం: భూవరుఁడు= భూమికి భర్త అయిన రాజు; అమర, గరుడ, గంధర్వ విద్యాధర+ఆది= దేవతలు, గంధర్వులు, విద్యాధరులు మొదలైన; దివ్యులకున్= దేవలోకంలో నివసించేవారికి; అధ్వరంబులన్= యజ్ఞయాగాదులచేత; తృప్తి+చేసి= సంతృప్తి కలుగజేసి; పరమశుభములన్+పొందున్= శ్రేష్ఠమైన శుభాలను పొందుతాడు; దానికిన్+ఎల్లన్= దానికంతటికీ; మూలంబు= హేతువు; తగు= అర్హుడైన; పురోహితుని బుద్ధి= పురోహితుడియొక్క ఆలోచనాబలం.

తాత్పర్యం: రాజు తా నాచరించే యజ్ఞయాగాదులచేత అమరులు, గరుడ, గంధర్వ, విద్యాధరులు మొదలైన సమస్త దేవలోకవాసులకు సంతృప్తి కలిగించే అత్యంత శ్రేష్ఠమైన శుభపరంపరను పొందుతాడు. దీని కంతటికీ పురోహితుడి బుద్ధి మూలకారణం.

క. రక్షఃపిశాచ గుహ్యక । యక్షాదులు బాధవెట్టు నవనీనాథున్
దక్ష పురోహిత మంత్ర సు । రక్షా సంస్కారవిధి విరహితుం డైనన్. 307

ప్రతిపదార్థం: దక్ష= సమర్థుడైన; పురోహిత= పురోహితుడియొక్క; మంత్ర= మంత్రాలచేత; సురక్షా= శ్రేష్ఠమైన సంరక్షణతో కూడిన; సంస్కార విరహితుండు+ఐనన్= సంస్కారం లేనివాడైతే; అవనీనాథున్= భూ భర్తఅయిన రాజును; రక్షఃపిశాచ గుహ్యక యక్ష+ఆదులు= రాక్షసులు, పిశాచులు, గుహ్యకులు, యక్షులు మొదలైన వాళ్ళు; బాధ+పెట్టున్= బాధిస్తూ ఉంటారు.

తాత్పర్యం: సమర్థుడైన పురోహితుడియొక్క మంత్రాదులచేత శ్రేష్ఠమైన సంరక్షణతో కూడిన సంస్కారం లేకుండా పోయిన రాజును రాక్షసులు, పిశాచులు, గుహ్యకులు, యక్షులు మొదలైనవాళ్ళు పీడిస్తారు.

క. వివిధోత్పాతంబులకున్ । నవళులలోఁ దోఁచు కీడునకుఁ దోడ్తో శాం
తి విధానంబున నిరసన । మవును బురోహితునిచేత ననవద్యముగన్. 308

ప్రతిపదార్థం: వివిధ+ఉత్పాతంబులకున్= అనేక విధాలైన అపశకునాలకు; నవళులలోన్+తోఁచు= అంతఃపురాలలో సంభవించే; కీడునకున్= అశుభానికి; తోడ్తోన్= వెనువెంటనే; అనవద్యముగన్= తిరుగులేకుండా; పురోహితునిచేతన్= పురోహితుడిచేత; శాంతి విధానంబునన్= శాంతికొరకు చేసే పనులవలన; నిరసనము+అవును= నివారణ జరుగుతుంది.

తాత్పర్యం: అనేకమైన ఉత్పాతాలకు, అంతఃపురాలలో సంభవించే అశుభాలకూ పురోహితుడి తిరుగులేని శాంతి కార్యాలవలన అశుభాల నివారణ జరుగుతుంది.

విశేషం: ఉత్పాతం, అపశకునం, ఇది మూడు విధాలు: దివ్యం (అపూర్వ నక్షత్రాదుల పుట్టుక); అంతరిక్షం: (పరివేషం, ఇంద్రధనుస్సు ఏర్పడటం, పిడుగులు పడటం); భౌమం: (దుఃఖరోగ ప్రదాలైన అపూర్వమైన చరాచర వస్తువులు కలగటం).

వ. ఈ వాక్యంబులం దాత్పర్యంబు గలుగుము. బృహస్పతియును శాంతికంబును బౌష్టికంబును శత్రునాశంబును మంత్రాఢ్య పురోహిత సాధ్యంబు లనియెం గావున నీవును సంభావితపురోహితుండ వగుము. 309

ప్రతిపదార్థం: ఈ వాక్యంబులన్+తాత్పర్యంబు+కలుగుము= ఈ పైన చెప్పిన మాటలయందు జాగరూకత వహించుము; బృహస్పతియును= బృహస్పతి సైతం; శాంతికంబును= శాంతిని ప్రసాదించటానికి చేసే శాంతి కర్మలు; పౌష్టికంబును= పుష్టిని కలిగించే పౌష్టిక కర్మలు; శత్రునాశంబును= విరోధుల వినాశనమూ; మంత్ర+ఆఢ్య= మంత్రాలచేత సంపన్నుడైన; పురోహిత సాధ్యంబులు+అనియెన్= పురోహితుడి వలననే సాధ్యమవుతుందని చెప్పాడు; కావునన్+ఈవును= కనుక నీవు కూడా; సంభావిత పురోహితుండవు+అగుము= గౌరవించబడిన పురోహితుడిని కలవాడవు కమ్ము.

తాత్పర్యం: 'పురోహిత ప్రాధాన్యాన్ని గూర్చి చెప్పిన మాటలను జాగరూకతతో గ్రహించుము. శాంతి పౌష్టిక కార్యాలూ, శత్రువినాశనమూ మంత్రవేత్త అయిన ఉత్తమ పురోహితుడివలననే సాధ్యమవుతుందని బృహస్పతి సైతం వక్కాణించాడు. కాబట్టి నీవు కూడా ఉత్తమపురోహితుడిని చేరదీసి, గౌరవించి, అతడివలన సమస్త శుభాలను పొందుము'.

క. పరిశుద్ధి లేని కుత్సిత । పురోహితులు నీచదశలఁ బొందుదురు మహీ
వర! యల్పమె శుద్ధుండై । పురోహితత్వంబు సేఁత భూపతినగరన్. 310

ప్రతిపదార్థం: మహీవర!= భూ భర్తవైన ఓ ధర్మరాజా!; పరిశుద్ధి లేని= శ్రేష్ఠమైన చిత్తం లేని; కుత్సిత పురోహితులు= నీచులైన పురోహితులు; నీచదశలన్+పొందుదురు= నీచస్థితిని పొందుతారు; భూపతినగరన్= రాజాంతఃపురంలో; శుద్ధుండు+ఐ= పరిశుద్ధాత్ముడై; పురోహితత్వంబు+చేఁత= పౌరోహిత్యం నెరపటం; అల్పమే?= కొంచెపు పని కాదు కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! శ్రేష్ఠమైన చిత్తశుద్ధి లేని కుత్సితులైన పురోహితులు నీచస్థితికి జారిపోయి నాశనమవుతారు. కాని, రాజాంతఃపురాలలో పరిశుద్ధాత్ముడై పురోహితుడు పౌరోహిత్యం నెరపటం అంత తేలిక పని కాదు.

క. ఆరోగ్యము గల యుత్తముఁ । బౌరోహిత్యంబు నడపఁ బనుచునది ధరి
త్రీ రమణుఁ డతఁడు దాను స । మారంభము లెల్ల నేకమతి గను టొప్పున్. 311

ప్రతిపదార్థం: ధరిత్రీ రమణుఁడు= భూమికి భర్త అయిన రాజు; ఆరోగ్యము+కల= పూర్ణారోగ్యవంతుడైన; ఉత్తమున్= శ్రేష్ఠుడిని; పౌరోహిత్యంబు నడపన్+పనుచునది= పౌరోహిత్యం నిర్వహించటానికి ఆజ్ఞాపించవలసి ఉన్నది; అతఁడు+తానున్= ఆ పురోహితుడూ, రాజూ; సమ్+ఆరంభములు+ఎల్లన్= అన్ని ఉత్తమమైన ఆరంభసమయాలలోనూ; ఏకమతిన్+కనుట+ఒప్పున్= ఒకే బుద్ధితో పరిశీలించటం ఎంతైనా మంచిది.

తాత్పర్యం: రాజు జాగరూకుడై, పౌరోహిత్యం నెరపటానికి సంపూర్ణారోగ్యవంతుడైన వాడిని మాత్రమే పురోహితుడిగా నియమించాలి. ఆ రాజూ, పురోహితుడూ ఏకమనస్కులై సమస్త శుభకార్యాలలోనూ సమదృష్టి కలిగి మసలుకొనటం ఎంతైనా అవసరం.

క. బ్రహ్మ క్షత్రము లొంది, య । జిహ్మములై కృత్యములు విశిష్టత నడపన్
బ్రహ్మేదులు హర్షింతురు; । బ్రాహ్మణ ముఖ వర్ణసమితి ప్రమదముఁ బొందున్. 312

ప్రతిపదార్థం: బ్రహ్మ క్షత్రములు+ఒంది+అజిహ్మములు+ఐ= బ్రాహ్మణ క్షత్రియులు పొందుపడి సరిసమానులై; కృత్యములు= రాజ్యకార్య కలాపాలు; విశిష్టతన్ నడపన్= శ్రేష్ఠమైన రీతిని నిర్వహిస్తే; బ్రహ్మ+ఆదులు= బ్రహ్మ మొదలుకొని సమస్త దేవతలు; హర్షింతురు= సంతోషిస్తారు; బ్రాహ్మణ ముఖ వర్ణ సమితి= బ్రాహ్మణులు మొదలుకొని సమస్త వర్ణాల సమూహం; ప్రమదమున్+పొందున్= అత్యంత సంతోషాన్ని పొందుతుంది.

తాత్పర్యం: బ్రాహ్మణ క్షత్రియులు అన్యోన్యులై అనుకూలంగా, సరైన మార్గంలో రాజ్య కార్యకలాపాలను నిర్వర్తిస్తే, బ్రహ్మమొదలుకొని సమస్త దేవతలు, బ్రాహ్మణులు మొదలుకొని సమస్త వర్ణాలవారు మిక్కిలి సంతోషిస్తారు.

వ. ఈ యర్థంబునం దైల కశ్యప సంవాదంబను నితిహాసంబు కలదు; వినుమైలుండు గశ్యపుని బ్రహ్మక్షత్రప్రకారం బడిగిన నమ్మనుజపతికి నమ్మునీంద్రుం డిట్లనియె. 313

ప్రతిపదార్థం: ఈ+అర్థంబునందున్= ఈ బ్రాహ్మణ క్షత్రియుల పరస్పర అన్యోన్యతను గూర్చిన విషయంలో; ఐల కశ్యప సంవాదంబు+అను= ఐలుడు కశ్యప ప్రజాపతి అనేవారిద్దరి మధ్య జరిగిన సంభాషణమనే; ఇతిహాసంబు+కలదు= పూర్వకథ ఒకటి ఉన్నది; వినుము= జాగరూకతతో వినుము; ఐలుండు+కశ్యపునిన్= ఐలుడు కశ్యప ప్రజాపతితో; బ్రహ్మ క్షత్ర ప్రకారంబు+అడిగినన్= బ్రాహ్మణ క్షత్రియుల సంబంధాన్ని గూర్చి ప్రశ్నించగా; ఆ+మనుజపతికిన్= ఆ ఐలుడనే మహారాజుకు; ఆ+ముని+ఇంద్రుండు= ఆ మహర్షి సత్తముడైన కశ్యప ప్రజాపతి; ఇట్లు+అనియెన్= ఇట్లా వివరించాడు.

తాత్పర్యం: ఐల కశ్యపప్రజాపతి సంవాదంలో బ్రాహ్మణ క్షత్రియుల సంబంధానికి సంబంధించిన ఒక పూర్వ కథ ఉన్నది. ఆ కథ చెబుతాను వినుము. బ్రాహ్మణ క్షత్రియుల మధ్య ఉండే సంబంధాన్ని ఐలుడు అడుగగా కశ్యపప్రజాపతి ఈ విధంగా చెప్పాడు.

ఆ. 'క్షత్రమునకుఁ బుట్టఁగాఁ బట్టు బ్రహ్మంబు । బ్రాహ్మణునకు యోని రాజు గాన
యుభయ వర్ధనంబు నొండొంటి విడువమి । వెలుఁగు రెండు మాయు విడిచెనేని. 314

ప్రతిపదార్థం: క్షత్రమునకున్= క్షాత్రానికి (రాజుకు); పుట్టన్+కాన్+పట్టు బ్రహ్మంబు= పుట్టుక స్థానం బ్రాహ్మణుడు; బ్రాహ్మణునకున్= బ్రాహ్మణుడికి; యోని రాజు= జననస్థానం రాజు; కానన్= అందుచేత; ఉభయ వర్ధనంబున్= బ్రాహ్మణ క్షత్రియుల అభివృద్ధి; ఒండొంటిన్= ఒకటినొకటి అంటే బ్రాహ్మణ క్షత్రియులు పరస్పరం; విడువమిన్ వెలుఁగున్= వదలకుండటం వలననే ప్రకాశిస్తాయి; విడిచెన్+ఏని= పట్టువదలితే; రెండు మాయున్= బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలు రెండూ నశిస్తాయి.

తాత్పర్యం: క్షత్రియుడికి పుట్టుక స్థానం బ్రాహ్మణుడు. బ్రాహ్మణుడికి జననస్థానం రాజు. అందుచేత బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలు రెండూ పరస్పర ఆధారాధేయాలు కావటంవలన ఆ రెండు వర్ణాలు కలిసి సముచిత కార్యకలాపాలు నెరపినప్పుడే అభ్యున్నతితో ప్రకాశిస్తాయి. లేదా పట్టువదలితే పరస్పరం వినాశనమౌతాయి.

క. తమలోనఁ బొందుగల వి । ప్రమహీశులఁ బ్రజయుఁ బొదువుఁ బ్రజచే మాన్య
త్వము వడయఁగ నేరరు భే । దము గలిగిన నలఁతు రొలసి దస్యులు ప్రజలన్. 315

ప్రతిపదార్థం: తమలోనన్+పొందు+కల= క్షత్రియులూ బ్రాహ్మణులూ తమలో తాము అరమరికలు లేకుండా కలసి ఉంటే; విప్ర= బ్రాహ్మణులను; మహీ+ఈశులన్= రాజులను; ప్రజయున్+పొదువున్= ప్రజలు సైతం కలసి మెలసి ఉంటారు; భేదము+కలిగినన్= బ్రాహ్మణ క్షత్రియులలో విభేదం ఏర్పడితే; ప్రజచేన్= ప్రజలచేత; మాన్యత్వము+పడయఁగన్ నేరరు= గౌరవం పొందలేరు; ప్రజలన్= అప్పుడు ప్రజలను; దస్యులు= దొంగలు; ఒలసి= కదిసి (చుట్టుముట్టి ఎదుర్కొని); నలఁతురు= విసిగిస్తారు (పీడిస్తారు).

తాత్పర్యం: బ్రాహ్మణ క్షత్రియులు పరస్పరం అరమరికలు లేక కలసి మెలసి ఉంటే ప్రజలు గౌరవిస్తారు. వాళ్ళలో విభేదం ఉంటే మాత్రం అట్లాంటి బ్రాహ్మణ క్షత్రియుల పట్ల ప్రజలకు ఏ మాత్రం గౌరవం ఉండదు. ఇది అదనుగా గ్రహించి దొంగలు ప్రజలను పీడిస్తారు.

తే. అట్టి దశఁ బుట్టు రుద్రుని యలుక దాన । సకలమునకు వినాశంబు సంభవిల్లుఁ
గాన యెల్ల విధంబులఁ గలసి యుండ । వలయు నృపుఁడుఁ బురోధయు వసుమతీశ! 316

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూమికి భర్త అయిన ఓ ధర్మరాజా!; అట్టి దశన్= బ్రాహ్మణ క్షత్రియులకు అన్యోన్యత లేని సమయంలో; రుద్రుని+అలుక పుట్టున్= రుద్రదేవుడికి కోపం కలుగుతుంది; దానన్= ఆ రుద్రదేవుడి ఆగ్రహం వలన; సకలమునకున్= సమస్త ప్రపంచానికీ; వినాశంబు సంభవిల్లున్= విధ్వంసం కలుగుతుంది; కాన= అందుచేత; ఎల్ల విధంబులన్= అన్ని విధాలా; నృపుఁడున్+పురోధయున్= రాజూ, బ్రాహ్మణుడూ; కలసి+ఉండవలయున్= కలసి మెలసి ఉండటమే సముచితం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! బ్రాహ్మణ క్షత్రియులకు అన్యోన్యత లేని సమయంలో రుద్రదేవునికి కోపం కలుగుతుంది. ఆయన ఆగ్రహంవలన సమస్తప్రపంచానికీ నాశనం కలుగుతుంది. అందువలన రాజూ, బ్రాహ్మణుడూ కలిసి మెలసి ఉండటమే సర్వవిధాలా సముచితం.

క. వినుము విశేషించి జనన । జనితోన్నతి విప్రుఁ డతని జనపతి వినయం
బున నడపవలయు దానను । మనుగడ యిరువురకుఁ బ్రజకు మహనీయ మగున్.' 317

ప్రతిపదార్థం: వినుము= సావధానుడవై వినుము; విశేషించి= ప్రత్యేకించి; జనన జనిత+ఉన్నతి విప్రుఁడు= పుట్టుకలోను, పుట్టిన దానిలోను బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు; జనపతి= రాజు; అతనిన్= ఆ బ్రాహ్మణుడి పట్ల; వినయంబునన్= మిక్కిలి వినమ్రతతో (భయ భక్తులతో); నడపవలయున్= జీవితయాత్ర సాగించాలి; దానను= ఆ విధంగా రాజు బ్రాహ్మణుడి పట్ల వినయంతో నడిపిస్తే; ఇరువురకున్+ప్రజకున్= బ్రాహ్మణ క్షత్రియులు ఇద్దరికీ ప్రజలకూ; మనుగడ= జీవితయాత్ర; మహనీయము+అగున్= మహోన్నతమై ఒప్పుతుంది.

తాత్పర్యం: పుట్టుకవలన, పుట్టిన తరువాత ఔన్నత్యం కారణంగా కూడా బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు. అందువలన రాజు బ్రాహ్మణుడి పట్ల వినయవినమితగాత్రుడై తన జీవితయాత్రను సాగించాలి. ఆ విధంగా గౌరవించటంవలన రాజుకూ, బ్రాహ్మణుడికీ దానివలన ప్రజలకూ జీవనయాత్ర మహోన్నత మౌతుంది.'

కుబేరునకు ముచుకుందునకుఁ గలిగిన సంవాదము (సం. 12-75-3)

వ. అని చెప్పి పురోహితుని విశేషంబు ముచుకుందుం డను రాజునకు వైశ్రవణునకుం గలిగిన సంవాదంబునఁ
బ్రకటం బయ్యె; నత్తెఱం గెఱింగించెద. 318

ప్రతిపదార్థం: అని చెప్పి= అని బ్రాహ్మణ క్షత్రియుల సంబంధాన్ని పై రీతిలో చెప్పి; పురోహితుని విశేషంబున్= పురోహితుడియొక్క విశిష్టతను; ముచుకుందుండు+అను రాజునకున్= ముచుకుందు డనే రాజుకు; వైశ్రవణునకున్+కలిగిన= విశ్రవసుడి పుత్రుడైన వైశ్రవణునకు అంటే కుబేరునకు కలిగిన; సంవాదంబునన్= సంభాషణవలన; ప్రకటంబు+అయ్యెన్= స్పష్టమైనది; ఆ+తెఱంగు+ఎఱింగించెదన్= ఆ పద్ధతినంతటినీ వివరిస్తాను.

తాత్పర్యం: బ్రాహ్మణ క్షత్రియులు అన్యోన్యంగా ఉంటూ రాజు బ్రాహ్మణుడిని గౌరవించటమే మంచి' దని తెలిపి, ఇంకా పురోహితుడి విశిష్టతను వివరించే ముచుకుంద మహారాజుకూ కుబేరుడికీ జరిగిన సంవాదంలో వెల్లడైన తీరును వివరిస్తాను వినుమని భీష్ముడు ధర్మరాజునకు తెలిపాడు.

మ. వినుమారాజు సమస్త దిగ్విజయమున్ విస్ఫూర్తిమైఁ జేసి, తాఁ
దన లా వారయు బుద్ధి వైశ్రవణు మీఁదం బోవ నాతండు దై
త్యనికాయంబులఁ బంచినం దెరువునం దత్సైన్యముల్ రాజు మూఁ
క నతి క్షుభ్యము గాఁగఁ జేయుటయు స్రుక్కంబడ్డ చిత్తంబుతోన్. 319

ప్రతిపదార్థం: వినుము= ఓ ధర్మరాజా! వినుము; ఆ రాజు= ఆ ముచుకుందు డనే రాజు; విస్ఫూర్తిమైన్= మిక్కిలి పరాక్రమంతో దేదీప్యమానంగా; సమస్త దిక్+విజయమున్= అన్ని దిక్కుల విజయాన్ని; చేసి= సాధించి; తాన్+తనలావు+ఆరయు బుద్ధిన్= ఆ ముచుకుందుడు తన పరాక్రమాన్ని తెలిసికొనాలనే బుద్ధితో; వైశ్రవణు మీఁదన్+పోవన్= కుబేరుడిపై యుద్ధానికి పోగా; ఆతండు= ఆ కుబేరుడు; దైత్యనికాయంబులన్= రాక్షస సమూహాలను; పంచినన్= యుద్ధానికి వెళ్ళండని ఆజ్ఞాపించగా; తెరువునన్= మార్గమధ్యంలోనే; తద్+సైన్యముల్= ఆ కుబేరుడు పంపిన దైత్య సేనలు; రాజు మూఁకన్= ముచుకుందుడనే రాజు సైన్య సమూహాలను; అతి క్షుభ్యము+కాఁగన్= మిక్కిలి సంక్షోభం చెందేటట్లు; చేయుటయున్= బాధించగా; స్రుక్కన్+పడ్డ చిత్తంబుతోన్= కలత చెంది మూర్ఛపడ్డ మనసుతో.

తాత్పర్యం: 'ధర్మరాజా! సావధానంగా వినుము. ముచుకుందు డనే రాజు అన్ని దిక్కుల విజయాన్ని సాధించి తన పరాక్రమాన్ని పరీక్షించుకొనదలచి, కుబేరుడిపై కయ్యానికి కాలుదువ్వాడు. కుబేరుడు దైత్యసైన్యాల ననేకం పంపగా ఆ సైన్యాలు మార్గమధ్యంలోనే ముచుకుందుడి సైన్యాన్ని మట్టికరిపించి సంక్షోభింపజేశాయి. సంక్షుభిత మనస్కుడైన ముచుకుందుడు - (తరువాతి పద్యంతో అన్వయం).

క. నృపతి పురోహితు దూఱినఁ। దపముల మంత్రముల దేవతాపూజల వీ
ర్యపటుత్వ మతని సేనకు। నపరిమితము సేసె నమ్మహాత్ముం డధిపా! 320

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా!; నృపతి= ఆ ముచుకుందుడనే రాజు; పురోహితున్ దూఱినన్= తన పురోహితుడిని నిందించగా; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడైన పురోహితుడు; తపములన్= తపస్సులచేత; మంత్రములన్= మంత్రాలచేత; దేవతాపూజలన్= దైవ పూజాదికాలచేత; అతని సేనకున్= ఆ ముచుకుందుడి సైన్యానికి; వీర్య పటుత్వము= పరాక్రమ తీక్ష్ణతను; అపరిమితము+చేసెన్= సాటిలేనంతగా ప్రసాదించాడు.

తాత్పర్యం: ఓటమి చవిచూసిన ముచుకుందు డనే రాజు తన పురోహితుడిని నిందించాడు. వెంటనే ఆ పురోహితుడు ఘోర తపస్సువలన, మహిమాన్విత మంత్రాల వలన, దైవపూజల మూలాన ముచుకుందుని సైన్యాలకు అత్యంత పరాక్రమ పటుత్వాన్ని ప్రసాదించాడు.

విశేషం: ఇక్కడ పురోహితుడి మహిమాన్విత శక్తి సామర్థ్యాలూ, అట్లాంటి పురోహిత విరహితంగా రాజు కొనసాగలే డనీ, పురోహిత మహిమ చేతనే రాజు విశిష్టుడు అవుతాడనీ సోదాహరణంగా నిరూపితం. అందువలనే ఈ కథ ఉదాహరించబడింది.

ఆ. బ్రహ్మశక్తిఁ బేర్చి రాజు సైన్యము దైత్య। సేన బడలు వడఁగఁ జేయ నాతఁ
డతి రయమున ముట్టె నలకఁ గుబేరుండు। ననికి వెడలె నిజ బలాన్వితముగ. 321

ప్రతిపదార్థం: బ్రహ్మశక్తిన్+పేర్చి= బ్రాహ్మణుడి యొక్క శక్తి వలన అతిశయించి; రాజు సైన్యము= ముచుకుందుడనే రాజుయొక్క సైన్యం; దైత్యసేన= కుబేరుడు పంపిన దైత్యసైన్యాన్ని; బడలు+పడఁగన్+చేయన్= బలహీనపడేటట్టు చేయగా; ఆతఁడు= ఆ ముచుకుందుడు; అతి రయమునన్= మిక్కిలి వేగంతో; ముట్టెన్= ఎదుర్కొన్నాడు; కుబేరుండు= కుబేరుడు; అలుకన్= కోపంతో; నిజబల+అన్వితముగన్= తన సైన్యాలతో కూడి; అనికి వెడలెన్= యుద్ధానికి వెళ్ళాడు.

తాత్పర్యం: బ్రాహ్మణుడి తపస్సు, మంత్రపూత దైవపూజాదికాలవలన పొందిన శక్తిచేత ముచుకుందుడి సైన్యం కుబేరుడి సైన్యాలను బలహీనపరిచేటట్లు ముచుకుందుడు తన సైన్యాలను పురికొల్పాడు. అందుకు ఆగ్రహించిన కుబేరుడు తన సైన్యసమూహాలతో ముచుకుందుడి సైన్యాలను ఎదుర్కొన్నాడు.

వ. వెడలి సమరంబు సేయు సమయంబునం గిన్నరేశ్వరుం డన్నరేశ్వరు నాలోకించి. 322

ప్రతిపదార్థం: వెడలి= కుబేరుడు యుద్ధానికి వెళ్ళి; సమరంబు+చేయు సమయంబునన్= యుద్ధం చేసే సమయంలో; కిన్నర+ఈశ్వరుండు= కిన్నరులకు అధిపతిఅయిన కుబేరుడు; ఆ+నర+ఈశ్వరున్+ఆలోకించి= ఆ ముచుకుందుడనే రాజును చూచి.

తాత్పర్యం: కుబేరుడు యుద్ధభూమికి వెళ్ళి యుద్ధం చేస్తున్న సమయంలో ముచుకుందుడిని చూచి - (తరువాతి పద్యంతో అన్వయం).

శా. 'దక్షుం డై తిటు బ్రహ్మశక్తిన భవద్బాహా విలాసం బమి
త్రక్షోభం బొనరించెనే?' యనుడు నాతం డిట్లు 'నీ వంటి బ్ర
హ్మ క్షత్రంబుల కేక యోని జననం బ వ్వేధ గల్పించె; యో
గ క్షేమాకలనంబు సంగతములై కావింపఁ బంపండొకో! 323

ప్రతిపదార్థం: ఇటు= ఈ విధంగా; బ్రహ్మశక్తిన్= బ్రాహ్మణశక్తి మూలంగానే; దక్షుండు+ఐతి(వి)= పరాక్రమ సంపన్నుడ వయ్యావు; భవత్+బాహా విలాసంబు= నీ యొక్క బాహు పరాక్రమం; అమిత క్షోభంబు+ఒనరించెనే?= శత్రువులకు సంక్షోభం కలిగించగలదా?; అనుడున్= అని పలుకగా; ఆతండు= ఆ ముచుకుందుడు; ఇట్లు= ఈ రీతిగా; నీవంటి= నీవంటి; బ్రహ్మ క్షత్రంబులకున్= బ్రాహ్మణ క్షత్రియులకు; ఏకయోని జననంబు= ఒకే జనన స్థానంలో పుట్టుకను; ఆ+వేధ కల్పించెన్= ఆ బ్రహ్మ సృజించాడు; యోగక్షేమ+ఆ కలనంబున్= ఆ బ్రహ్మ పరస్పర యోగక్షేమాల సంబంధాన్ని; సంగతములు+ఐ= ఒప్పిదమయ్యేటట్లు; కావింపన్+పంపండొకో!= చేయగా పంపడా?

తాత్పర్యం: 'ఓ ముచుకుంద మహారాజా! బ్రహ్మతేజశ్శక్తి మూలాన్నే నీకు ఇంతటి అపూర్వ పరాక్రమసామర్థ్యాలు ఒనగూడి, విజృంభించావు గానీ నీకు మామూలుగా ఇంతటి సామర్థ్యమేదీ?' అని కుబేరుడు అధిక్షేపించాడు. అప్పుడు ఆ ముచుకుందుడు ఇట్లా సమాధానం చెప్పాడు. 'బ్రహ్మక్షత్రాలకు ఒకే తేజోరాశిని బ్రహ్మదేవుడు అనుగ్రహించాడు. కనుకనే బ్రాహ్మణక్షత్రియుల యోగక్షేమాల సంబంధంగా ఆ బ్రహ్మ ఉపేక్షించి ఎట్లా ఉండగలడు?; తప్పకుండా ఆ బ్రహ్మ తగిన రీతిలోనే నా విషయంలో అనుగ్రహించాడు' అని వివరించాడు.

వ. అనుటయు ధనదుండు సాంత్వన స్వరంబున. 324

ప్రతిపదార్థం: అనుటయున్= అని ముచుకుందుడు చెప్పగా; ధనదుండు= కుబేరుడు; సాంత్వన స్వరంబునన్= అనునయ పూర్వకమైన కంఠంతో.

తాత్పర్యం: ముచుకుందుడు సమాధానం చెప్పగా విన్న కుబేరుడు అనునయంతో కూడిన మాటలతో - (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'నాకును నీకు నేటికి రణం బొనరింపఁగ నేను బంప నీ
వేక ముఖంబుగా ధరణి యేలుము' నావుడు నవ్వి యవ్విభుం
'డీ కుపతిత్వ మొల్ల నొరు నీగి మహత్త్వకరంబె విద్విష
ద్భీకర మద్భుజార్జితమ పెంపొనరంగ భుజింతు దిక్పతీ! 325

ప్రతిపదార్థం: నాకును నీకున్= నాకూ నీకూ (కుబేరుడికీ ముచుకుందుడికీ); రణంబు+ఒనరింపఁగన్+ఏటికిన్= యుద్ధం చెయ్యట మెందుకు?; ఏను+పంపన్= నేను ఆజ్ఞాపించగా; ఈవు+ఏకముఖంబుగాన్= నీవే స్వతంత్రంగా; ధరణి+ఏలుము= రాజ్యాన్ని పాలించుము; నావుడున్= అని కుబేరుడు అనగా; ఆ+విభుండు= ఆ ముచుకుందు డనే రాజు; నవ్వి= పరిహాస పూర్వకంగా నవ్వి; ఈ కుపతిత్వము+ఒల్లన్= ఈ కుటిల రాజ్యాధిపత్యం అంగీకరించలేను; ఒరు+ఈగి= ఇతరులు ఇచ్చిన దానం; మహత్త్వ కరంబె?= గొప్పదనాన్ని చేకూర్చగలదా?; విద్విషత్+భీకర= శత్రువులకు భయంకరమైన; మత్= నా యొక్క; భుజ+ఆర్జితము+అ= బాహుబలంతో సాధించిన రాజ్యాన్ని మాత్రమే; పెంపు+ఒనరంగన్= అతిశయించేటట్లుగా; భుజింతున్= అనుభవిస్తాను.

తాత్పర్యం: కుబేరుడు అనునయంగా ముచుకుందునితో 'నీకూ నాకూ యుద్ధం చెయ్యవలసిన అవసరంలేదు. నా నియోగంతో నీవు ఏకచ్ఛత్రాధిపత్యంగా ఈ రాజ్యాన్ని పాలించుకొమ్ము' అని చెప్పగా ఆ ముచుకుందుడు పరిహాసపూర్వకంగా 'ఓ కుబేరా! ఈ కపట రాజ్యాధిపత్యాన్ని నేను అంగీకరించను. ఇతరులు ఇచ్చే దానం స్వీకరిస్తే నాకు మహత్త్వకారణం కాజాలదు. నా బాహుపరాక్రమంతో శత్రుసంహారం చేసి సంపాదించిన రాజ్యాన్నే ఏలుతూ సమస్తభోగాలనూ అనుభవిస్తాను. అదే నాకు సముచితం' అని సమాధానం ఇచ్చాడు.

విశేషం: పరాక్రమ సంపన్నుడూ, వీరుడూ అయిన రాజు మహత్వానికి కారణం శత్రు సంహారంచేసి రాజ్యం చేజిక్కించుకొనటమేనని, వీరుడైన రాజు ఇతరులు ఇచ్చే దానాదులకు దోయిలొగ్గలేడని, అట్లా దానానికి చేతులు చాచటం అతడి పరాక్రమానికి మచ్చ అనీ, వీరవిస్ఫూర్తి సంపాదిత రాజ్యరమ భోగయోగ్యమని ముచుకుందుడి మాటలవలన విదిత మవుతుంది.

తిక్కన రచించిన ఈ ఉత్పలమాల ముచుకుందుడి వీరోచిత కార్యస్ఫురణకు సముచితంగా సాగింది.

వ. అనిన విని పౌలస్త్యుండు నీ వధికుండ వట్లు సేయు'మని గారవించిన ముచుకుందుండు ముదితుండై చని సకలోర్వియు నిర్వక్ర విక్రమంబున నేలె నని చెప్పిన విని యజాతశత్రుండు 'రాజధర్మంబులయం దైశ్వర్య ప్రీతి పుణ్యలోకంబులు నిరతిశయంబుగాఁ జేయం జాలునది యెయ్యది?' యని యడిగిన. 326

ప్రతిపదార్థం: అనినన్ విని= అని ముచుకుందుడు చెప్పగా విని; పౌలస్త్యుండు= పులస్త్యుడి వంశంలో జన్మించినవాడైన కుబేరుడు; నీవు+అధికుండవు+అట్లు+చేయుము+అని= నీవు గొప్పవాడవు అట్లాగే కానిమ్ము అని; గౌరవించినన్= మన్నించగా; ముచుకుందుఁడు= ముచుకుందు డనే రాజు; ముదితుండు+ఐ+చని= సంతోషంతో వెళ్ళి; సకల+ఉర్వియున్= సమస్త భూమండలాన్ని; నిర్వక్ర విక్రమంబునన్+ఏలెన్+అని చెప్పినన్ విని= సాటి లేని పరాక్రమంతో పరిపాలించా డని చెప్పగా విన్న; అజాత శత్రుండు= పుట్టని శత్రువులు గల ధర్మరాజు (శత్రువులు లేని ధర్మరాజు); రాజధర్మంబుల+అందున్= రాజుకు విహిత మైన ధర్మాలలో; ఐశ్వర్య ప్రీతి పుణ్యలోకంబులు= సంపద యందలి ప్రీతి; శాశ్వత పుణ్యలోక ప్రాప్తి అనే వాటిలో; నిరతిశయంబుగాన్= అత్యధికంగా; చేయన్+చాలునది+ఏ+అది= ఇవ్వగలిగిన ధర్మ మేది? అని+అడిగినన్= అని అడుగగా.

తాత్పర్యం: తన పరాక్రమంతో సంపాదించిన రాజ్యం నిర్వక్ర పరాక్రమంతో ఏలుతా' నని చెప్పిన ముచుకుందుడితో కుబేరుడు 'నీ వంతటి సమర్థుడవు. అట్లాగే చేయుము' అని చెప్పి మన్నించాడు. ముచుకుందుడు సంతోషించి సమస్తభూమండలాన్నీ పరాక్రమోపేతుడై పరిపాలించాడు. ఈ కథను భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'రాజధర్మాలలో పరమ సంపదను, పుణ్యలోకప్రాప్తిని ప్రసాదించగల ధర్మ మేదో' తెలియజేయవలసిందని భీష్ముడిని ప్రార్థించగా - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అతని కిట్టు లనియె నమర తరంగిణీ । సూనుఁ 'డధిక భీతులైన సజ్జ
నులకు నభయ మొసఁగి యలఘు సౌఖ్యాత్ములఁ । జేత యెంతయును విశిష్ట మధిప!' 327

ప్రతిపదార్థం: అమర తరంగిణీ సూనుఁడు= దేవనది అయిన గంగాపుత్రుడైన భీష్ముడు; అతనికిన్+ఇట్టు+అనియెన్= ఆ ధర్మరాజుతో ఇట్లా అన్నాడు; అధిప!= ఓ ధర్మరాజా!; అధిక భీతుఁడు+ఐన= ఎక్కువ భయపడిన; సత్+జనులకున్= మంచి జనులకు; అభయము+ఒసఁగి= భయంలేదని చెప్పి, అనుగ్రహించి; అలఘు సౌఖ్య+ఆత్ములన్+చేఁత= మిక్కిలి సుఖాత్ములుగా చేయటం; ఎంతయును= మిక్కిలి; విశిష్టము= శ్రేష్ఠం.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో 'ఓ ధర్మరాజా! అత్యంత భీతులైన ఉత్తమజనులకు అభయ మిచ్చి, వారికి సమస్తసుఖాలు సంప్రాప్తింపజేసి సంతోషాంతరంగులను చేయట మనేది రాజునకు ఉండవలసిన విశిష్టధర్మం' అని పలికాడు.

వ. అని వెండియు. 328

తాత్పర్యం: అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'విను! పర్జన్యుఁడు భూతము । లను బండిన ఫ్రూను పక్షులను బ్రోచువిధం
బున నీవు బంధువుల, స । జ్జన యుతముగఁ బ్రోవు; మది ప్రశస్తం బనఘా! 329

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడ వైన ఓ ధర్మరాజా!; విను= శ్రద్ధతో వినుము; పర్జన్యుఁడు= వర్షాధి దేవతఅయిన ఇంద్రుడు; భూతములను= ప్రాణులనూ; పండిన ఫ్రూను= ఫలాలతో నిండిన చెట్టు; పక్షులను= అనేక పక్షి సంతతిని; ప్రోచు విధంబునన్= సంరక్షించే విధంగానే; ఈవు= నీవు; బంధువులను= చుట్టాలను; సత్+జనయుతముగన్+ప్రోవుము= మంచి జనులతో పాటు రక్షించుము; అది ప్రశస్తంబు= అది సర్వశ్రేష్ఠం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఇంద్రుడు సమస్త ప్రాణికోటిని వర్షధారలతో సంరక్షించినట్లు, ఫలభరితమైన చెట్టు అనేక పక్షిసంతతిని పోషించిన రీతిగా, నీవు మంచివాళ్ళందరినీ చుట్టాలతోపాటు సంరక్షించుము. అది రాజధర్మాలలో మిక్కిలి ప్రశస్తమైనది.

విశేషం: అలం: మాలోపమ.

వ. అనిన విని ధర్మనందనుండు 'విప్రప్రభృతులకు నిజధర్మవర్తనంబుల జీవనంబుల నడవక తక్కిన నె?' ట్లని యడిగినఁ బితామహుం డతనితో 'నాపద దనికిన నితర జాతి వృత్తంబు గర్వితంబుగా దట్లయినను నాయుధోపజీవనాదిక్షత్ర ధర్మంబులంజేసి బ్రాహ్మణ్యంబు వట్రపడి బ్రాహ్మణులు క్షత్రసము లగుదురు. వాణిజ్య ప్రముఖ వైశ్యక్రియ లాచరించి వైశ్యసము లగుదురు. నిత్యానుష్ఠానంబులు లోనుగాఁ గలయవి డిగవిడిచి

ధనలోభ తాత్పర్యంబున శూద్ర ప్రాయులై చరించి శూద్రసము లగుదురు; దక్కిన జాతులవారందరు దమదమ తారతమ్యంబులతో నిట్ల నిజజాతి విహీను లగుదు; రట్టివారు జాత్యుత్తమ కృత్యంబునకుఁ బాత్రంబులు గారు; భూకాంతుం డింతయు నెఱింగి యర్హప్రకారంబులం బ్రజ నడిపి రక్షించినం బ్రజాకృతం బగు ధర్మంబునందుఁ జతుర్థాంశంబునకు నుక్తుం డగుఁ బ్రజలఁ బాతకంబులం బొరయకుండ నరయం జాలక దండ్యదండన రహితుం డైన మహీవిభుని వారలచేసిన పాతకంబుల నాలవపాలు వొందుఁ; గొందఱు బుధు లంతయుం బొందు నని చెప్పుదు'రనుటయు నమ్మనుజనాథుండు. 330

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విన్న; ధర్మనందనుండు= ధర్మరాజు; విప్ర ప్రభృతులకున్= బ్రాహ్మణులు మొదలైన వర్ణాలవారికి; నిజ ధర్మవర్తనంబులన్= తమ ధర్మానుగుణ వర్తనాలలో; జీవనంబులు నడవక తక్కినన్= జీవితాలను సాగించకపోతే; ఎట్లు+అని+అడిగినన్= ఏమిటి గతి? అని ప్రశ్నించగా; పితామహుండు= కురుపితా మహుడైన భీష్ముడు; అతనితోన్= ఆ ధర్మరాజుతో; ఆపద దనికినన్= విపత్తు సంభవిస్తే; ఇతర జాతి వృత్తంబు= ఇతర వర్ణాల నడవడి; గర్వితంబు+కాదు= నిందించదగ్గది కాదు; అట్లు+అయినను= అట్లా అయినప్పటికి; ఆయుధ+ఉపజీవన+ఆది= ఆయుధాలతో జీవనం మొదలుకొని; క్షత్రధర్మంబులన్+చేసి= రాజధర్మాలవలన; బ్రాహ్మణత్వంబు వఱపడి= బ్రాహ్మణత్వం క్షీణించి; బ్రాహ్మణులు క్షత్ర సములు+అగుదురు= బ్రాహ్మణులు రాజులతో సమాను లౌతారు; వాణిజ్య ప్రముఖ= వర్తకం మొదలైన; వైశ్యక్రియలు+ఆచరించి= వైశ్యులకు ఉచితమైన పనులు చేసి; వైశ్య సములు+అగుదురు= వైశ్యులతో సమాను లవుతారు; నిత్య+అనుష్ఠానంబులు= అనునిత్యమూ ఆచరించవలసిన అగ్ని కార్యాదులు; లోనుగాన్+కలయవి= మొదలుకొని గల కార్యా లన్నిటిని; డిగవిడిచి= వదలిపెట్టి; ధనలోభ తాత్పర్యంబునన్= ద్రవ్యంమీది ఆసక్తి మూలంగా; శూద్ర ప్రాయులు+ఐ చరించి= శూద్రులవలె నడుచుకొని; శూద్రసములు+అగుదురు= శూద్రులతో సమాను లవుతారు; తక్కిన జాతులవారు+అందఱున్= ఇతర వర్ణాల వారందరూ; తమతమ తారతమ్యంబులతోన్= వారి వారి తరతమ భేదాలతో; ఇట్లు= ఇదే రీతిగా; నిజ జాతి విహీనులు+అగుదురు= తమ వర్ణాలకంటె నీచులవుతారు; అట్టివారు= అట్లాంటివారు; జాతి+ఉత్తమ కృత్యంబునకున్= ఆయా వర్ణాల శ్రేష్ఠమైన కార్యాలకు; పాత్రంబులు+కారు= అర్హులు కాలేరు; భూకాంతుండు= భూమికి భర్త అయిన రాజు; ఇంతయున్+ఎఱింగి= పైన పేర్కొన్న సమస్తమూ గుర్తించి; అర్హ ప్రకారంబులన్= తగిన పద్ధతులలో; ప్రజన్ నడపి రక్షించినన్= ప్రజలను ఏలుకొని సంరక్షిస్తే; ప్రజాకృతంబు+అగు= ప్రజలు చేసిన; ధర్మంబునందున్= ధర్మంలో; చతుర్థ+అంశంబునకున్+ఉక్తుండు+అగున్= నాలుగో భాగానికి అర్హుడు అవుతాడు; ప్రజలన్= ప్రజలను; పాతకంబులన్+ పొరయకుండన్+అరయన్+చాలక= పాపాలు అంటకుండా పరిపాలించక పోతే; దండ్యదండన రహితుండు+ఐన= శిక్షార్హుడైన వాడిని శిక్షించ లేని; మహీవిభుని= రాజును; వారల చేసిన పాతకంబులన్= ప్రజలు చేసిన పాపాలలో; నాలవ పాలు పొందున్= నాలుగవ వంతు అనుభవిస్తాడు; కొందఱు బుధులు= (అయినా) కొంతమంది పండితులు; అంతయున్+పొందున్+అని చెప్పుదురు= ప్రజలు చేసిన పాపమంతా రాజుకు చెందుతుం దని చెప్పుతున్నారు; అనుటయున్= అని చెప్పగా; ఆ+మనుజ నాథుండు= ఆ మానవనాథుడైన ధర్మరాజు.

తాత్పర్యం: ప్రజలను సంరక్షించటం రాజధర్మాలలో శ్రేష్ఠమైనదని భీష్ముడు చెప్పగా, ధర్మరాజు 'బ్రాహ్మణుడు మొదలుకొని ఆయా వర్ణాలవారు స్వజాతి ధర్మ నిర్వహణం చేయకుండా తప్పితే పరిస్థితి ఏమిటి?' అని ప్రశ్నించాడు. 'ఆపద సమయాలలో ఆయా వర్ణాలవారు స్వజాతి ధర్మాన్ని వదలిపెట్టినా నిందార్హులు కారు. శస్త్రోపజీవులైన రాజులు ఆచరించే ధర్మాలను బ్రాహ్మణులు ఆచరించి, బ్రాహ్మణ్యాన్ని కోల్పోయి, రాజుతో సమానులౌతారు. వైశ్యులకు తగిన వాణిజ్యం మొదలుకొని ధర్మాలను పాటించి వైశ్యులతో సమానులౌతారు. నిత్యకృత్యాలైన అగ్నిష్టోమాది కార్యాలను వదలిపెట్టి, ధనలోభులై శూద్రులవలె ప్రవర్తించి శూద్రులతో సమాను లౌతారు. ఇట్లాగే ఇతర వర్ణాలవారు తమతమ ధర్మాలను వదలిపెట్టి ఇతర ధర్మాచరణచేత తమ వర్ణాలకంటె హీనమైన వారవుతారు. అట్లాంటి వారు

ఉత్తమ కార్యాలను ఆచరించటానికి అర్హులు కాలేరు. ఈ విషయాలను రాజు జాగరూకుడై గుర్తించి, ఆయా వర్ణాలవారిని తగిన రీతిలో సంరక్షించటం రాజుకు ఉత్తమధర్మం. ఆ ప్రజలు చేసే ధర్మానుగుణ ప్రవర్తనవలన వారు సంపాదించుకొనే ధర్మంలో నాలుగవ వంతు ఆ రాజుకు చెందుతుంది. ప్రజలకు ఎట్లాంటి పాపాలంటకుండా పాలించకపోయినా, శిక్షార్హులను దండించకపోయినా ఆ ప్రజలు చేసిన పాపంలో నాలుగవ వంతు రాజు అనుభవిస్తా డని కొందరు పెద్దలు చెప్పుతున్నారు. కాని, మరికొందరు ఆర్యులు అట్లాంటి ప్రజలు దుష్ట కార్యాచరణవలన సంపాదించుకొన్న పాపమంతా రాజే అనుభవించవలసి ఉంటుం దని వక్కాణించారు' అని భీష్ముడు ధర్మరాజునకు వివరించాడు.

ఆ. 'వినుము! వివిధ సుఖము లనుభవింపఁగ రాజ్య। విభవ యుక్తిఁ దిరుగ వేడ్క లేదు
నాకు ధర్మరక్షణము మీఁది భరముఁ ద। ల్లోప భయము మనములోనఁ బెద్ద. 331

ప్రతిపదార్థం: వినుము= ఓ తాతా వినుము; నాకున్= నాకు (ధర్మరాజుకు); వివిధ సుఖములు+అనుభవింపఁగన్= నాకు అనేక సుఖాలు అనుభవించా లనీ; రాజ్య విభవ యుక్తిన్+తిరుగన్= రాజ్య వైభవోపేతమైన యుక్తియుక్తంగా నడచుకోవాలనీ; వేడ్క లేదు= కోరిక లేదు; మనము లోనన్= నా మనస్సునందు; ధర్మరక్షణము మీఁది భరమున్= ధర్మాన్ని రక్షించే భారం; తద్+లోపభయమున్= తద్విరహితమైన దానివలన భయమూ; పెద్ద= మిక్కిలి పెద్దదిగా తోస్తున్నది.

తాత్పర్యం: 'ఓ తాతా వినుము! సమస్త సుఖాలు అనుభవించాలన్న కోరికగానీ, రాజ్య వైభవ సముపేతంగా జీవించాలన్న కుతూహలంగానీ నాకు లేదు. ధర్మరక్షణ చేయటమనే భారమూ, ధర్మరక్షణ చేయకపోవటమనే భయమూ నా మనసును మిక్కిలి పీడిస్తూ ఉంటాయి.

వ. కావున. 332

తాత్పర్యం: అందువలన.

చ. అనఘ! యనేక దోష మగునట్టి మహీవహనంబు నొల్ల; దం
డన పరుషత్వ మేటికి? దృఢ ప్రశమంబున నేను గానకుం
జనియెద' నన్న భీష్ముఁ 'డిది జాడ్యము గాక నృపాలధర్మమే
మనుజ వరేణ్య! నీ మనము మార్దవ మగ్గల; మిట్టు నొప్పునే? 333

ప్రతిపదార్థం: అనఘ!= పాప రహితుడవైన ఓ తాతా!; అనేక దోషము+అగునట్టి= అనేక పాపాలకు నిలయమైన; మహీవహనంబున్+ఒల్లన్= రాజ్యభారాన్ని మోయటానికి అంగీకరించలేను; దండన పరుషత్వము+ఏటికిన్= దండనీతితో కూడిన కాఠిన్యం ఎందుకు?; ఏను= నేను; దృఢ ప్రశమంబునన్= దిట్టమైన ప్రశాంతితో; కానకున్+చనియెదన్= తపోవనానికి వెళ్ళుతాను; అన్నన్= అని ధర్మరాజు తన అభిప్రాయాన్ని వెల్లడించగా; భీష్ముఁడు= తాత అయిన భీష్ముడు; మనుజవరేణ్య!= మానవశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; ఇది జాడ్యము+కాక= ఇదొక రకమైన జడత్వమే కాని; నృపాల ధర్మమే!= క్షత్రియ ధర్మం అవుతుందా?; నీ మనము మార్దవము+అగ్గలము= నీ మనసు మృదుత్వం గొప్పది; ఇట్టున్+ఒప్పునే?= ఈ విధమైతే సముచితమేనా?

తాత్పర్యం: 'ఓ తాతా! అనేక పాపాలకు ఆకరమైన రాజ్యభారాన్ని అంగీకరించలేను. దండనీతి ప్రయోగం మిక్కిలి కఠినమైనది. దానిని నేను నిర్వహించలేను. పరమప్రశాంతమైన తపోవనంలో ముక్కుమూసికొని జీవించాలని

కోరుకొంటున్నాను' అని ధర్మరాజు తన దృఢాభిప్రాయాన్ని స్పష్టం చేశాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజు మానవశ్రేష్ఠుడనే విషయాన్ని గుర్తుచేసి 'ఇది నీలోని జడత్వమే గాని వేరు కాదు. కాకపోతే ఇది క్షత్రియధర్మమా? నీ మనసు మిక్కిలి మృదువైందనే విషయం నాకు తెలుసు. అయినా రాజైన వాడికి ఉండవలసిన లక్షణ మిదేనా? ఇది సముచితమేనా?'

వ. ని న్నొత్తి చెప్పుటకుఁ బాండు విచిత్రవీర్య శంతను లున్నవారే? నా బుద్ధి వినుము. 334

ప్రతిపదార్థం: నిన్నున్+ఒత్తి చెప్పుటకున్= నీకు గట్టిగా ప్రబోధించటానికి; పాండు విచిత్రవీర్య శంతనులు+ఉన్నవారే?= పాండు మహారాజుగాని విచిత్రవీర్య ధరాధిపతిగాని, శంతన మహారాజుగాని ప్రస్తుతం లేరు కదా!; నా బుద్ధిన్ వినుము= నా ఆలోచనను ఆలకించుము.

తాత్పర్యం: నిన్ను మిక్కిలి ప్రబోధించటానికి పాండురాజు గానీ, విచిత్రవీర్యుడు గాని, శంతన మహారాజుగాని లేరు కదా! కాబట్టి సహనంతో నా హితవును వినుము.

విశేషం: ఇక్కడ భీష్ముడు పాండురాజు, విచిత్రవీర్యుడు, శంతనులను ప్రస్తావించటం ఎంతో సముచితంగా ఉన్నది. సంక్షుభిత మనస్కులైన వారికి పెద్దల పలుకులు ఉపశమనాన్ని కలిగిస్తాయి. ఉత్తమమార్గాన్ని చూపుతాయి. అందుకే రాజ్యాధికారం వద్దంటున్న ధర్మరాజుతో భీష్ముడు 'నీకు ఇప్పుడు గట్టిగా ధర్మబోధ చెయ్యటానికి పాండురాజాది పెద్దలు లేరు. నీకు ఉన్న పెద్ద దిక్కు నేనే. అందుకే నీ హితాన్ని కోరి చెప్పుతున్న నా పలుకులను ఆలకించి ఆచరించుము' అని తన మాటలకు అనుగుణంగా ప్రవర్తించు మని ధర్మరాజుతో చెప్పాడు.

ఈ చిన్ని వచనంలో 'నిన్నొత్తి చెప్పుటకు' అని తిక్కన రచించి 'నిన్ను శాసించటానికి, నీకు తగిన రీతిలో చెప్పటానికి' అనే ప్రత్యేకార్థాలను స్ఫురింపజేసి తన ప్రత్యేకతను ప్రకటించుకొన్నాడు.

ఆ. ఈఁగ కాలి యంత యేనియు వీసర । పోవకుండ ధర్మమునన నడచి
రయ్య! తొంటి రాజుల క్రోధ కామ ప్ర । యుక్త దండధరణ మొప్పుఁ గాక. 335

ప్రతిపదార్థం: అయ్య!= ఓ ధర్మరాజా!; తొంటి రాజులు= పూర్వరాజులు; ఈఁగ కాలి+అంత+ఏనియున్= ఈగ కాలి అంత అంటే అణుమాత్రమైనా; వీసరపోవకుండన్= వెలితి రానీయకుండా; ధర్మమునన్ నడచిరి= రాజధర్మంతోనే నడచుకొన్నారు; అక్రోధ కామ ప్రయుక్త దండ ధరణము= కోపమూ, కామమూ లేని ప్రయోగంతో దండనీతిని ధరించటం; ఒప్పున్+కాక= సముచితం కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! పూర్వరాజులు అణుమాత్రమైనా వెలితిరానీయక క్షత్రియోచిత ధర్మపాలన సాగించారు. క్రోధాన్ని, కామాన్ని పరిత్యజించి దండనీతితో రాజ్యపాలన చేయటం రాజు వైన నీకు సముచితం'.

క. దానాధ్యయన యజనముల । తో నుర్వీజనులఁ గావఁ దొడఁగుట పతికిం
దా నజ కల్పిత ధర్ముము; । దీని విడుపు నరకమునకుఁ దెరు వగు నధిపా! 336

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా!; దాన+అధ్యయన యజనములతోన్= దానం చేయటం, వేదాధ్యయనం కొనసాగించటం, యజ్ఞయాగాది కార్యాచరణం - అనే వాటితో; ఉర్వీజనులన్= భూప్రజలను; కావన్+తొడఁగుట= సంరక్షించ నారంభించటం; పతికిన్+తాన్+అజ కల్పిత ధర్ముము= రాజునకు అదే బ్రహ్మచేత సృష్టించబడిన ధర్మం; దీని విడుపు= దీన్ని చేయకుండా వదలిపెట్టటం; నరకమునకున్+తెరువు+అగున్= నరకానికి మార్గమవుతుంది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! దాన ధర్మాలు, యజ్ఞయాగాలు, వేదాధ్యయనాదులు నీవంటి ఉత్తమ రాజులకు పరమేష్ఠి విధించిన విహితధర్మం. దీనిని చేయకుండా వదలిపెడితే నరకప్రాప్తి తప్పదు'.

క. కావున వర్ణాశ్రమముల । నేవిధమున నైన నడపు లెడలక యుండం
గావంగ నోపు నృపతికి । లే వలజ ళ్ళుభయలోక లీలలయందున్. 337

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; వర్ణ+ఆశ్రమములన్= నాలుగు వర్ణాలను, నాలుగు వర్ణాలకు తగిన నాలుగు ఆశ్రమాలను; ఏ విధమునన్+ఐనన్= ఎన్ని కష్టాలకైనా ఓర్చి; నడపులు+ఎడలక+ఉండన్= కొనసాగింపులు వదలకుండా; కావంగన్+ఓపు= సంరక్షించే సామర్థ్యంగల; నృపతికిన్= రాజునకు; ఉభయ లోక లీలల యందున్= ఇహపరలోకాలలోని లీలా విశేషాలలో; అలజళ్ళు లేవు= ఎట్లాంటి భయాందోళనలు ఉండవు. (కాగా సర్వ సుఖ ప్రాప్తి కలుగుతుంది).

తాత్పర్యం: 'కాబట్టి నాలుగు వర్ణాలను, నాలుగు ఆశ్రమాలను ఎట్లాగైనాసరే నిర్వర్తిస్తే ఆ రాజునకు ఇహపరలోకాలలో ఎట్లాంటి భయాందోళనలు లేక సమస్త సౌఖ్యాలు సమకూరుతాయి అది రాజధర్మం'.

వ. ఇ ట్లగుటం దెలుపునది యొక్క యితిహాసంబు గల; దాకర్ణింపుము. 338

ప్రతిపదార్థం: ఇట్లు+అగుటన్+తెలుపునది= ఈ విధంగా జరిగిన దని తెలుపటానికి; ఒక్క+ఇతిహాసంబు+కలదు= ఒక పూర్వకథ ఉన్నది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: 'దీనిని సోదాహరణంగా వివరించే ఒక పూర్వకథ ఉన్నది చెప్పుతాను వినుము' అన్నాడు భీష్ముడు.

కేకయరాజ రాక్షస సంవాద ప్రకారము (సం. 12-78-6)

క. పరమ నియతిమైఁ గేకయ । నరపతి యధ్యయన విధి యొనర్పఁగ నటవీ
పరిసరమున కేఁగినయెడ । ధరణీశ్వర! పట్టె నొక్క దానవుఁ డతనిన్. 339

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= భూ భర్తవైన ఓ ధర్మరాజా!; కేకయ నరపతి= కేకయరాజు; పరమ నియతిమైన్= శ్రేష్ఠమైన నియమంతో; అధ్యయన విధి+ఒనర్పన్= వేదాధ్యయన విధి నిర్వహణకు; అటవీ పరిసరమునకున్+ఏగిన యెడన్= అరణ్యప్రాంతాలకు వెళ్ళినప్పుడు; అతనిన్= ఆ కేకయ రాజును; ఒక్కదానవుఁడు= ఒకానొక రాక్షసుడు; పట్టెన్= పట్టుకొన్నాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! కేకయరాజు పరమ నియమానుగుణంగా వేదాధ్యయనం నిర్వహించటంకొరకు అరణ్య ప్రాంతాలకు వెళ్ళిన సందర్భంలో ఆ రాజును ఒక రాక్షసుడు పట్టుకొన్నాడు.

వ. పట్టినఁ బ్రబలుం డగు నద్దనుజునిం ద్రోచిపోవంజాలక యమ్మహీపాలుండు వాని కిట్లనియె. 340

ప్రతిపదార్థం: పట్టినన్= రాక్షసుడు కేకయరాజును పట్టుకొనగా; ప్రబలుండు+అగు= మిక్కిలి బలవంతుడైన; ఆ+దనుజునిన్= ఆ రాక్షసుడిని; త్రోచి పోవన్+చాలక= త్రోసి పుచ్చలేక; ఆ+మహీపాలుండు= ఆ కేకయ రాజు; వానికిన్+ఇట్లు+అనియెన్= ఆ రాక్షసుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ రాక్షసుడు కేకయరాజును పట్టుకొనగా మిక్కిలి బలవంతుడైన ఆ రాక్షసుడిని ఎదిరించలేక ఆ కేకయరాజు రాక్షసుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'మ్రుచ్చిమియును అంకు నెచ్చోట నైన నా । భూమిలోపల లేదు భూమిసురులు
వేదాధ్యయన యజ్ఞవిధి దానతత్పరుల్ । రాజులు బ్రాహ్మణారాధనంబు
జన్నముల్ సేఁతయు సమరానివర్తన । వ్రతమును గలరు గోరక్షణాది
వార్తావినీతులై వైశ్యులు నడపుదు । రమ్మూఁడు జాతుల కధికభక్తి

తే. తోడ శుశ్రూషసేసి శూద్రులు చరింతు; । రేమి రంధ్రంబు గాంచి నీ విట్లు వెరవు
మాలి పట్టి తత్యుద్ధతలీల నన్నుఁ? । దలఁప నిది నీకుఁ బథ్యమే దానవేంద్ర! 341

ప్రతిపదార్థం: దానవ+ఇంద్ర!= ఓ రాక్షస శ్రేష్ఠుడా!; నా భూమిలోపలన్= నా రాజ్యంలో; ఏ చోటన్+ఐనన్= ఎక్కడైనా; మ్రుచ్చిమియును= దొంగతనమూ; అంకు= వ్యభిచారమూ; లేదు= కనిపించదు; భూమిసురులు= బ్రాహ్మణులు; వేద+అధ్యయన, యజ్ఞవిధి, దాన తత్పరుల్= వేదాధ్యయనం చేయటమూ, యజ్ఞయాగాదులు ఆచరించటమూ, దానధర్మాలు చేయటమూ అనే పనుల్లో ఆసక్తిని కలిగి ఉంటున్నారు; రాజులు= క్షత్రియులు; బ్రాహ్మణ+ఆరాధనంబున్= బ్రాహ్మణులను పూజించటమూ; జన్నముల్+చేతఁయున్= యజ్ఞయాగాదులు చేయించటమూ; సమరానివర్తన (సమర+అని వర్తన)వ్రతమును+కలరు= యుద్ధము నుండి వెనుకకు తిరిగి రాకుండుట అనే వ్రతాలు కలిగి ఉన్నారు; వైశ్యులు; గోరక్షణ+ఆది= గోపాలనం మొదలుకొని; వార్తా వినీతులు+ఐ నడపుదురు= జీవనాన్ని నియమబద్ధంగా సాగిస్తున్నారు; శూద్రులు; ఆ+మూఁడు జాతులకున్= ఆ మూడు వర్ణాలకు; అధిక భక్తి తోడన్= మిక్కిలి భక్తితో; శుశ్రూష చేసి చరింతురు= సేవచేసి జీవిస్తున్నారు; ఇట్లు= ఈ విధంగా; నీవు; ఏమిరంధ్రంబు+కాంచి= ఏ దోషం చూచి; వెరవు మాలి= తెలివిలేనివాడవై; అతి+ఉద్ధతలీలన్= మిక్కిలి గర్వవిలాసంతో; నన్ను పట్టితి(వి)?= నన్ను పట్టుకొన్నావు?; తలఁపన్= ఆలోచించగా; ఇది= ఈ విధంగా నన్ను పట్టుకొనటం; నీకున్+పథ్యమే?= నీకు హితమేనా?

తాత్పర్యం: 'ఓ రాక్షసశ్రేష్ఠా! నా రాజ్యంలో ఎక్కడా జారచోర దురాచారాలు లేవు. బ్రాహ్మణులు వేదాధ్యయనంతో యజ్ఞయాగాదులు చేస్తున్నారు. రాజులు బ్రాహ్మణార్చనలతో పాటు యజ్ఞయాగాదులు, యుద్ధంలో పాల్గొనటం అనే వ్రతాలు పాటిస్తున్నారు. వైశ్యులు గోపాలన, వాణిజ్యం నిర్వహిస్తున్నారు. ఈ మూడు వర్ణాలవారిని శూద్రులు పరమభక్తిపరులై సేవిస్తున్నారు. నా రాజ్యంలో ఏ దోషాన్ని పసిగట్టి ఈ విధంగా గర్వించి అకారణంగా నన్ను పట్టుకొన్నావు? నీకిది ఉచితమా?'

విశేషం: నాలుగు వర్ణాల వాళ్ళు తమ జాత్యుచిత కార్యకలాపాలలో నిమగ్నులై సుఖజీవనం చేస్తున్నారనీ, అది మచ్చలేని తన రాజ్యపాలనమని కేకయరాజు రాక్షసుడికి తెలిపాడు.

చ. అనుటయు నమ్మహోదనుజుఁ డాతని కిట్లను 'నట్టి వానిఁగా
నినుఁ గని వర్ణరక్షణము నిర్మలచిత్తతఁ జేయు రాజు కీ
డునఁబడకున్కి దెల్పఁగఁ గడుం బ్రియమై చనుదెంచితిన్; మహీ
జనపరిరక్ష యస్ఖలిత సౌమ్యత నిట్ల యొనర్పు భూవరా!' 342

ప్రతిపదార్థం: అనుటయున్= అని కేకయ రాజు పలుకగా; ఆ+మహోదనుజుఁడు= ఆ గొప్ప రాక్షసుడు; అతనికిన్+ఇట్లు+అనున్= ఆ కేకయ రాజుతో ఇట్లా అన్నాడు; భూవరా!= ఓ రాజా!; అట్టివానిన్+కాన్= అట్లాంటి ఉత్తముడిగా; నిన్నున్+కని= నిన్ను చూచి; వర్ణ రక్షణమున్= వర్ణాశ్రమ ధర్మాలను; నిర్మల చిత్తతన్+చేయు= పరిశుద్ధ మనస్సుతో చేసే; రాజు; కీడునన్+పడక+ఉన్కి= ఆపదలపాలు కాకుండా ఉండటాన్ని; తెల్పఁగన్= తెలియజేయటానికి;కడున్+ప్రియమై= మిక్కిలి ప్రీతియై; చనుదెంచితిన్= వచ్చాను;

ఇట్లు= ఈ రీతిగానే; మహీజన పరిరక్ష= భూ ప్రజల సంరక్షణ; అస్ఖలిత= జారుపాటు లేని (తొట్రుపాటులేని లేదా చలించని); సౌమ్యతన్= మంచితనంతో; ఒనర్పు= కొనసాగించుము.

తాత్పర్యం: 'నన్నెందుకు బంధించా'వని కేకయరాజు ప్రశ్నించగా ఆ రాక్షసుడు అతనితో 'నీవు ఉత్తముడవని, నాలుగు వర్ణాశ్రమాల ధర్మనిర్వహణం నిర్మలమనస్సుతో చేసే రాజునకు ఎట్లాంటి ఆపదలు రావని తెలుపటానికి మిక్కిలి ప్రీతితో ని న్నీ విధంగా బంధించాను. ఇదే రీతిగా ప్రజలను ఏ మాత్రం తొట్రుపాటు లేని సౌమ్యతతో రాజ్యపాలన కొనసాగించుము'.

వ. అని పలికి సఖ్యంబు సేసి చనియె నని చెప్పినం గౌంతేయాగ్రజుండు సంతోషించి 'జీవనాభావం బైనచో క్షత్రియ కర్మానుష్ఠానంబునకు నశక్తుం డగు విప్రుం డెట్లు బ్రదుకు వాఁ?' డని యడిగిన భీష్ముం డిట్లనియె. 343

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; సఖ్యంబు+చేసి చనియెన్= స్నేహం చేసికొని వెళ్ళిపోయాడు; అని చెప్పినన్= అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; సంతోషించి= ఆనందించి; జీవన+అభావంబు+ఐనచోన్= జీవనం కొనసాగించటం కష్టమైతే; క్షత్రియ కర్మ+అనుష్ఠానంబునకున్= రాజోచిత కర్మాచరణానికి; అశక్తుండు+అగు= శక్తిహీనుడైన; విప్రుండు= బ్రాహ్మణుడు; ఎట్లు బ్రదుకు వాఁడు?+అని+అడిగినన్= ఎట్లా జీవించగలడని ధర్మరాజు అడుగగా; భీష్ముండు+ఇట్లు+అనియెన్= భీష్ముడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కేకయరాజును రాక్షసుడు మెచ్చుకొని స్నేహం చేసి వెళ్ళిపోయాడు. ఈ కథ విన్న ధర్మరాజు సంతోషాంతరంగుడై 'జీవనం కొనసాగించటం కష్టమైనప్పుడు రాజోచిత కర్మానుష్ఠానం నెరపలేని బ్రాహ్మణుడు ఎట్లా జీవించగలడో వివరించు' మని భీష్ముడిని అడుగగా భీష్ముడు ఇట్లా సమాధానం చెప్పాడు.

చ. మనఁ జను నుప్పు నువ్వులును మాంసము గోవు వృషంబుఁ గూడుఁ గ
ల్లును ఘృత తైల మాక్షికములున్ ధృతకేసరమైన జంతువున్
ధన మధికంబుగాఁ బడయు దానికి నేనియు విక్రయింపఁ గా
దనుమతి యూఁది వైశ్యకృతినైనను విప్రున కాపదాగతిన్.' 344

ప్రతిపదార్థం: విప్రునకున్+ఆపద్+ఆగతిన్= బ్రాహ్మణుడు ఆపత్సమయంలో (అంటే ఆపద్ధర్మంగా); అనుమతి+ఊఁది= అనుజ్ఞ పొంది; వైశ్యకృతిన్+ఐనను= వైశ్య ధర్మాన్ని అవలంబించి అయినా; మనన్+చనున్= జీవించటం సముచితమే (అయితే); ధనము+అధికంబుగాన్+పడయుదానికిన్+ఏనియున్= ధనం ఎక్కువగా పొందటానికి; ఉప్పు, నువ్వులు, మాంసము, గోవు, వృషంబున్+కూడున్+కల్లును= ఉప్పు, నువ్వులు, మాంసము, ఆవు, ఎద్దు, అన్నము, కల్లు; ఘృత తైల మాక్షికములున్= నేయి, నూనె తేనెటీగల వలన తయారైన తేనెలను; ధృతకేసరము+ఐన జంతువున్= వెంట్రుకలు గల జంతువును (గుర్రము మొదలైనవి); విక్రయింపన్+కాదు= అమ్మరాదు.

తాత్పర్యం: బ్రాహ్మణుడు స్వకీయవృత్తిలో జీవించలేనప్పుడు ఆపద్ధర్మంగా వైశ్యవృత్తిని స్వీకరించి జీవించవచ్చును. అయితే అత్యధికంగా ధనం లభిస్తుం దన్న ఆశతో ఉప్పు, నువ్వులు, మాంసం, గోవు, ఎద్దు, అన్నం, కల్లు, నేయి, నూనె, తేనెలను కేసరాలు గల జంతువు అంటే గుర్రం మొదలైనవి అమ్మరాదు. ఇది నియమం' అని భీష్ముడు వివరించాడు.

విశేషం: మూలంలో సవిస్తరంగా సుమారు 7, 8 శ్లోకాలలో సాగిన వివరణను తిక్కన ఒక చంపకమాలలో సంక్షిప్తసుందరంగా వివరించాడు. మూలంలో తేనె సంగతి లేదు. మహిషమని మూలంలో ఉండగా తిక్కన గోవును పేర్కొన్నాడు. కేసరాలుగల జంతువు

గుర్రమని నీలకంఠ వ్యాఖ్య. కృతాన్నం అంటే పక్వాన్నమని నీలకంఠీయం. అన్నం విక్రయించరా దంటే అన్నం పరబ్రహ్మస్వరూపం-కనుక దానిని విక్రయిస్తే దానికి మూలమైన భూమిని విక్రయించినట్లే భూమి సర్వ దేవతామయం కనుక విక్రయించటం సముచితం కాదని వివరణ. మూలంలో నీటిని విక్రయిస్తే బ్రాహ్మణుడికి నరకప్రాప్తి కలుగుతుందని చెప్పబడింది. కాని ఆ విషయం తిక్కన తడవలేదు. విక్రయించరాదని నిషేధించాడు.

వ. అనిన విని ధర్మతనయుండు 'యజ్ఞంబు లెట్లయిన సమీచీనంబు లగు?'నని యడిగిన ననిమిష నదీనందనుం డతని కిట్లనియె. 345

ప్రతిపదార్థం: అనినన్ విని= అని భీష్ముడు చెప్పగా విని; ధర్మ తనయుండు= ధర్మరాజు; యజ్ఞంబులు+ఎట్లు+అయినన్= యజ్ఞాలు ఏ విధంగా; సమీచీనంబులు+అగున్+అని+అడిగినన్= పరిశుద్ధ మవుతాయో (సత్య సమ్మత మవుతాయో) తెలుపుమని ప్రశ్నించగా; అనిమిష నదీనందనుండు= దేవనది అయిన గంగానది యొక్క పుత్రుడైన భీష్ముడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: బ్రాహ్మణుడు ఆపద్ధర్మంగా వైశ్యవృత్తిని అవలంబించినా అతడు అనుసరించవలసిన నియమాలను భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'యజ్ఞాలు సత్యసమ్మతాలు ఎట్లా అవుతాయో వివరించు' మని ప్రార్థించగా భీష్ముడు ఇట్లా స్పష్టం చేశాడు.

ఆ. 'శ్రద్ధ వలయు, మిథ్య చనదు, వేదంబులఁ। బరిభవింపఁ దగదు భవ్యయజ్ఞ
కర్త కెపుడు; నదియుఁ గాక దక్షిణలు మం। త్రార్థ పోషకంబులందు రధిప! 346

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; భవ్య యజ్ఞ కర్తకున్= శ్రేష్ఠమైన యజ్ఞ కర్తకు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; శ్రద్ధ వలయున్= శ్రద్ధ అవసరం; మిథ్య చనదు= బూటకం పనికిరాదు; వేదంబులన్+పరిభవింపన్+తగదు= వేదాలను అవమానించరాదు; అదియున్+కాక= అంతేకాక (మీదు మిక్కిలి); దక్షిణలు= యజ్ఞయాగాదులలో ఋత్విజులకు ఇచ్చే ధనం; మంత్ర+అర్థపోషకంబులు+అందురు= వేద మంత్రార్థాలకు అత్యంత పుష్టిని కలిగిస్తుందని పెద్దల సూక్తి.

తాత్పర్యం: 'శ్రేష్ఠుడైన యజ్ఞకర్తకు ఎల్లప్పుడు శ్రద్ధ అత్యంతావశ్యకం. బూటకాలు పనికిరావు. వేదాలను అవమానించి తిరస్కరించరాదు. అంతేగాక యజ్ఞాది సమయాలలో ఋత్విజులు ఇచ్చే భూరిదక్షిణలు వేదమంత్రార్థాలకు మిక్కిలి పుష్టిని, తుష్టిని చేకూరుస్తా యని ఆర్యులు వక్కాణించారు.

క. ఈగతి యెఱింగి చేసిన। యాగము సోమాప్తుఁ జేయు నప్పురుషునిఁ ద
ద్యోగ మొనర్చు మహాసుఖ। యోగము సోమాధిరాజ్య యుక్తము శ్రుతులన్. 347

ప్రతిపదార్థం: ఈగతి+ఎఱింగి= ఈ విషయా న్నంతటినీ సంపూర్ణంగా తెలిసికొని; చేసిన యాగము= చేసిన యజ్ఞకార్యం; ఆ+పురుషునిన్= అట్లాంటి యజ్ఞం చేసిన వ్యక్తిని; సోమ+ఆప్తున్+చేయున్= సోమపానంతో కృతకృత్యుడిని చేస్తుంది; శ్రుతులన్= వేదాలలో; తద్+యోగము+ఒనర్చు= ఆ మహాయోగం చేకూర్చే; మహాసుఖయోగము= అత్యంత సుఖయోగం; సోమ+అధిరాజ్య యుక్తము= సోమపాన మనే అధిరాజ్యంతో కూడి ఉంటుంది.

తాత్పర్యం: సలక్షణంగా చేసిన యజ్ఞం యజ్ఞకర్తను పునీతం చేస్తుంది. అది మహాసుఖయోగం. శ్రుతులు ఈ అంశాన్ని స్పష్టం చేశాయి. ఇది 'సోమపాన' అధిరాజ్యం. శ్రుతులలో అట్లాంటి ఆ యోగం చేకూర్చే మహాసుఖయోగం సోమపాన మనే అధిరాజ్యంతో కూడి ఉంటుంది'.

ఆ. అధ్వరంబుకంటె నధికంబు దపము, ద । పం బనంగ మేని ప్రన్నఁదనము
నివురఁ జేతగా దహింసయు సత్యవా । క్యంబు దమము దయయుఁ గాని యరయ **348**

ప్రతిపదార్థం: అరయన్= పరిశీలించగా; అధ్వరంబు కంటెన్= యజ్ఞంకంటె; తపము అధికంబు= తపస్సు శ్రేష్ఠమైనది; తపంబు+అనంగన్= తపస్సంటే; మేని ప్రన్నఁదనమున్+ఇవురన్+చేఁత+కాదు= శరీర మనోజ్ఞతను శుష్కింపచేయటం కాదు; అహింసయున్= హింసచేయకుండటం; సత్యవాక్యంబు= సత్యవచనం; దమము= ఇంద్రియ నిగ్రహం; దయయున్+కాని= దయ మొదలైన ఉత్తమ గుణాలు మాత్రమే.

తాత్పర్యం: పరిశీలించి చూడగా యజ్ఞయాగాదులకంటె తపస్సు శ్రేష్ఠమైనది. తపస్సంటే మేని పసలను శుష్కింపచేయటం కాదు. అహింస, సత్యవచనం, ఇంద్రియనిగ్రహం, దయ మొదలైన సద్గుణాలు కలిగి ఉండటమే'..

వ. అనిన. **349**

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగా - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. ప్రియమున ధర్మనందనుడు భీష్మునితో 'నృపు డెట్టిభంగి వా
నియెడఁ గరంబు నమ్మఁదగు; నిక్కపు మిత్రుఁడు లేని భర్తకున్
నయగతి సెల్లనేర' దనినన్ విని యిట్లను నాతఁ 'డేక బు
ద్ధియుతుఁడవై వినన్ వలయుఁ దెల్లముగా నెఱిఁగింతు భూవరా!' **350**

ప్రతిపదార్థం: ధర్మనందనుఁడు= ధర్మరాజు; ప్రియమునన్= ప్రీతితో; భీష్మునితోన్= తాత అయిన భీష్ముడితో; నృపుఁడు+ఎట్టి భంగి వాని యెడన్= రాజు ఎట్లాంటి వాడి పట్ల; కరంబు= మిక్కిలి; నమ్మన్+తగున్= నమ్మకంతో ఉండవచ్చు; నిక్కము+మిత్రుఁడు లేని= నిజమైన (ఆప్తుడైన) స్నేహితుడు లేని; భర్తకున్= రాజునకు; నయగతి+చెల్లనేరదు= నీతి మార్గం సాగదు; అనినన్ విని= అని ప్రశ్నించగా విని; ఆతఁడు= ఆ భీష్ముడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; భూవరా!= ఓ ధర్మరాజా!; తెల్లముగాన్+ఎఱిఁగింతున్= స్పష్టంగా తెలుపుతాను; ఏక బుద్ధి యుతుఁడవై= ఏకాగ్రమైన బుద్ధి కలిగిన వాడవై; వినన్ వలయున్= వినవలసింది.

తాత్పర్యం: 'నమ్మకమైన స్నేహితులు లేకపోతే రాజకార్యం నీతిమార్గంలో సాగటం కష్టం. ఎట్లాంటివాడి పట్ల మిక్కిలి నమ్మకం కలిగి ఉండవచ్చో తెలుపవలసిం'దని ధర్మరాజు భీష్ముడిని ప్రార్థించాడు. 'ఆ విషయాలు విశదం చేస్తాను గానీ బహుశ్రద్ధతో వినుము' అని భీష్ముడు ఆదేశించాడు.

క. 'నమ్మమి మృత్యువు, పెద్దయు । నమ్ముట యపమృత్యు వగుట నరపతి నమ్మి
నమ్మక పనిగొనునది, ని । త్యమ్మును సూక్ష్మమతిఁ దాను నరయఁగ వలయున్. **351**

ప్రతిపదార్థం: నరపతి= రాజు; నమ్మమి= నమ్మకపోవటం; మృత్యువు= మరణంతో సమానం (అంటే వినాశనకారి); పెద్దయున్ నమ్ముట= అధికంగా నమ్మటం; అపమృత్యువు+అగుటన్= అకస్మాత్తుగా కలిగే చావువంటిది కావటంవలన; నమ్మి నమ్మక= కొంత నమ్మి, కొంత నమ్మక; పని+కొనునది= కార్యాన్ని సాధించుకొనాలి; తాను= రాజు; నిత్యమ్మును= ఎల్లప్పుడు; సూక్ష్మమతిన్= సూక్ష్మబుద్ధితో; అరయఁగన్ వలయున్= పరిశీలిస్తూ ఉండాలి.

తాత్పర్యం: రాజు నమ్మకపోవటమంటే మృత్యుసమానం అంటే వినాశకారి. అత్యంతం విశ్వసించటం అపమృత్యువుతో సమానం. కాబట్టి నమ్మి నమ్మక పనులు సాధించాలి. ఎల్లప్పుడూ సూక్ష్మబుద్ధితో సర్వమూ పరిశీలిస్తూ ఉండవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

తే. తనకు మే లొనరించు నాతండు మిత్రుఁ; । డతఁడు నడపంగ నెల్ల కార్యములు శుభము
నొందు; నేమిట నేమఱకునికి తోడ । నృపుఁడు మిత్రుపైఁ గార్యముల్ నిలుప వలయు. 352

ప్రతిపదార్థం: తనకున్ మేలు+ఒనరించు+ఆతండు మిత్రుఁడు= తనకు (రాజుకు) మేలుచేసేవాడే నిజమైన స్నేహితుడు; అతఁడు= ఆ మిత్రుడు; నడపంగన్= రాజుచేత కార్యాచరణ చేయించగా; ఎల్లకార్యములు= అన్ని పనులు; శుభమున్+ఒందున్= శుభ ప్రదమవుతాయి; నృపుఁడు= రాజు; ఏమిటన్+ఏమఱక+ఉనికితోడన్= దేనియందూ అశ్రద్ధ లేకుండా ఉన్నట్లయితే; మిత్రుపైన్= స్నేహితుడిమీద; కార్యముల్ నిలుప వలయున్= కార్యభారాన్ని మోపాలి.

తాత్పర్యం: రాజుకు మేలు చేసేవాడే మిత్రుడు. అట్లాంటి మిత్రుడు నడిపిస్తే సమస్తకార్యాలూ శుభాన్ని చేకూరుస్తాయి. దేనిలోనూ ఏమరుపాటు లేనివాడైన స్నేహితుడిపై కార్యభారాన్ని మోపాలి. అప్పుడు అన్ని పనులు సానుకూలమవుతాయి.

ఉ. మన్ననకున్ మదింప కవమానము వచ్చిన స్రుక్క కొక్కభం
గిన్నెఱిఁ గార్యముల్ విగత కిల్బిషుఁడై తగఁ జేయునట్టి మి
త్రు న్నరనాయకుండు దనరూపుగ నగ్గలమైన శ్రీయు న
త్యున్నతియున్ ఘటించు మహిమోజ్జ్వలుఁ జేత సుఖావహం బగున్. 353

ప్రతిపదార్థం: మన్ననకున్ మదింపక= గౌరవం కలిగినప్పుడు గర్వించక; అవమానము వచ్చినన్ స్రుక్కక= అవమానం కలిగినప్పుడు పరితాప పడక; ఒక్కభంగిన్= ఒకేరీతిగా; నెఱిన్= నేర్పుతో (సొగసుగా); విగత కిల్బిషుఁడు+ఐ= పాపరహితుడై (దోష రహితుడై); తగన్= ఉచిత రీతిని; కార్యముల్ చేయునట్టి= పనులు చేసే; మిత్రున్= స్నేహితుడిని; నరనాయకుండు= రాజు; తన రూపుగన్= తనతో సమానంగా (భావించి); అగ్గలము+ఐ= అధికమైన; శ్రీయున్= సంపదను; అతి+ఉన్నతియున్= మిక్కిలి ఔన్నత్యాన్ని; ఘటించు= కలిగించే; మహిమ+ఉజ్జ్వలున్+చేఁత= మహిమతో ప్రకాశితుడిని చేయటం; సుఖ+ఆవహంబు+అగున్= సుఖాలను చేకూరుస్తుంది.

తాత్పర్యం: గౌరవానికి గర్వించక, అవమానానికి దుఃఖించక రెండింటినీ ఒకే రీతిగా భావించి, పాపరహితుడై ఉచిత రీతిని కార్యాలను సాధించే మిత్రుడిని, రాజు తనతో సమానంగా భావించి, అత్యధికంగా సంపదను ఇనుమిక్కిలి ఔన్నత్యాన్ని కలిగించగల మహిమాన్వితుడిగా చేయటం సుఖాస్పదం అవుతుంది!

క. వినుమట్టి మంత్రి గామం । బునఁ గ్రోధంబునను లోభమున భయమునఁ గా
ర్య నిరూపణంబు వదలక । వినీతుఁడై నడచు టధిక విభవముఁ జేయున్.' 354

ప్రతిపదార్థం: వినుము= సావధానుడవై వినుము; అట్టి మంత్రి= అట్లాంటి మంత్రి; కామంబునన్= కామంవలన; క్రోధంబునను= కోపంవలన; లోభమునన్= లోభ గుణం వలన; భయమునన్= భయంవలన; కార్య నిరూపణంబు= కార్యాచరణాన్ని; వదలక= వదలిపెట్టక; వినీతుఁడు+ఐ= ఉత్తమ నీతిమంతుడై; నడచుట= నిర్వహించటం అనేది; అధిక విభవమున్+చేయున్= మిక్కిలి వైభవాన్ని చేకూరుస్తుంది.

తాత్పర్యం: అట్లాంటి మంత్రి కామక్రోధ లోభ భయాదులవలన కార్య నిరూపణం వదలకుండా ఉత్తమ నీతిమంతుడై నిర్వహించటం అనేది అత్యంత వైభవాన్ని చేకూరుస్తుంది.'

వ. అని చెప్పి వెండియు. 355

తాత్పర్యం: అని ఈ విధంగా చెప్పి మళ్ళీ - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'అన్నలుఁ దమ్ములుఁ గలుగుట । యున్నతుఁ జేయు నృపు నెంత యొఱపి ళ్ళయినన్
మన్ననయు నీగియును సం । పన్నంబులు గాఁగ వారిఁ బాటించు టురున్. 356

ప్రతిపదార్థం: అన్నలున్+తమ్ములున్+కలుగుట= అన్నలనూ తమ్ముళ్ళనూ కలిగి ఉండటం అనేది; నృపున్= రాజును; ఉన్నతున్+చేయున్= గొప్పవాడిని చేస్తుంది; ఎంత+ఒఱపిళ్ళు+అయినన్= ఎంత అయోగ్యులైనప్పటికీ; వారిన్= ఆ అన్నదమ్ములను; మన్ననయున్= గౌరవించటమూ; ఈగియును= ధనమిచ్చి ఆదరించటమూ; సంపన్నంబులు+కాఁగన్= సమృద్ధమయ్యేటట్టు; పాటించుట+ఉరున్= ఆదరించటమే సముచితం.

తాత్పర్యం: రాజునకు అన్నలు తమ్ములు ఉండటంవలన అతడు గొప్పవాడుగా గుర్తించబడతాడు. అన్నదమ్ములు ఎంత అయోగ్యులైనప్పటికీ వారిని మన్నించి, ధనమిచ్చి సమృద్ధమయ్యే రీతిలో ఆదరించటమే సముచితం.

వ. అది యెట్లంటేని. 357

తాత్పర్యం: అదెట్లాగంటే - (తరువాతి పద్యంతో అన్వయం).

క. బలఁగము గల భూపాలుఁడు । గెలని మహీశ్వరుల బుద్ధికిని వ్రేఁగగుచున్
బలియుఁ డగు; లేని వానిం । జులుకంగాఁ జూతు రెట్టి శూరుం డైనన్. 358

ప్రతిపదార్థం: బలఁగము+కల= బంధుమిత్రాదులు గల; భూపాలుఁడు= రాజు; కెలని= చుట్టు ప్రక్కల ఉన్న (సమీపంలోని); మహీ+ఈశ్వరుల బుద్ధికిని= రాజుల మనస్సులకు; వ్రేఁగు+అగుచున్= భారమవుతూ; బలియుఁడు+అగున్= బలవంతుడు అవుతాడు; ఎట్టి శూరుండు+ఐనన్= ఎట్లాంటి పరాక్రమవంతుడైనా; లేనివానిన్= బలగం లేనివాడిని; చులుకంగాన్+చూతురు= తేలికగా చూస్తారు.

తాత్పర్యం: బంధుమిత్రాదుల బలగం ఉన్న రాజు చుట్టుప్రక్కల ఉన్నవారికి భయంకలిగిస్తూ బలవంతుడవుతాడు. ఎంత పరాక్రమం కలవాడైనా బలగం లేనివాడైతే అతడిని తేలికగా చూస్తారు.

క. ఎక్కువ తక్కువ మాటలు । నుక్కివములు బంది గీడు లొందించుటలుం
బెక్కు దన యన్నదమ్ముల । దిక్కున నన్నియును సైఁపఁ దేజము సేయున్. 359

ప్రతిపదార్థం: ఎక్కువ తక్కువ మాటలు= పెద్దచేసి తక్కువ చేసి మాటలాడే మాటలు; ఉక్కివములు= కపటాలు; బంది+కీడులు+ఒందించుటలున్= నిర్బంధించటమూ ఆపదలు కలిగించటమూ అనే; పెక్కు= పెక్కింటిని; తన అన్న+తమ్ముల దిక్కునన్= తన అన్నదమ్ముల పక్షాన; సైఁపన్= సహించటం; తేజము+చేయున్= తేజస్సును కలిగిస్తుంది.

తాత్పర్యం: ఎక్కువ తక్కువ మాటలు, కపటాలు, నిర్బంధించటం, ఆపదలు కలిగించటం మొదలైన అనేకమైన వెన్ని ఉన్నా, అన్నింటిని అన్నదమ్ముల పట్ల సహించటం రాజునకు తేజఃకారణ మవుతుంది. అంటే ఎంతో శోభావహం అవుతుం దని అర్థం.

క. లోపల రాఁజుచుఁ బొగయుచు । బాపంబులు దలఁతు రోపి బలిమియు వెఱపుం
జూపక తక్కరు కెలనికి । నేపాటను వారి నడపు టెంతయు నొప్పున్. 360

ప్రతిపదార్థం: లోపలన్= లోలోపలే; రాఁజుచున్+పొగయుచున్= నిప్పు రగులుకొంటూ పొగబారుతున్నట్లు; పాపంబులు= చేసిన తప్పిదాలను; తలఁతురు= ఆలోచిస్తారు; ఓపి= సహించి (శక్తితో); బలిమియున్= బలాన్ని; వెఱపున్+చూపక= భయాన్ని ప్రదర్శించకుండా; తక్కరు= వదలరు; కెలనికిన్= ప్రక్కవారికి; వారిన్= అట్లాంటి వారిని (దుష్టులను); ఏ పాటను= ఏ విధంగానైనా; అడఁపుట+ఎంతయున్+ఒప్పున్= నాశనం చేయటం మిక్కిలి మంచిది.

తాత్పర్యం: లోలోపలే నిప్పు రగిలి పొగబారుతున్నట్లు, దుర్మార్గులు రాజు దోషాలను గూర్చి ఆలోచిస్తూ ఉంటారు. వీలు చూచికొని ఓపికతో తమ బలాన్ని చూపి భయపెట్టకుండా ఉండరు. అట్లాంటి దుష్టులైనవారిని ఏ విధంగానైనా నాశనం చేయటం మంచిది. ఇది రాజనీతి.

తే. చాలుదురు వారు నృపతికి మేలు సేయఁ। గీడొనర్పంగఁ; గావునఁ గిల్బిషములఁ
బొరయ కుండంగ వారల నరసికొనుచుఁ। బొదివి నడపుట కార్యంబు భూవిభునకు.' 361

ప్రతిపదార్థం: నృపతికిన్= రాజునకు; వారు= అట్లాంటివారు; మేలు+చేయన్+కీడు+ఒనర్పంగన్ చాలుదురు= మేలు చేయటానికి గానీ ఆపదలు కూర్చటానికి గానీ తగుదురు (సమర్థులు); కావునన్= కాబట్టి; భూ విభునకున్= రాజునకు; కిల్బిషములన్+పొరయకుండంగన్= పాపాలు సోకకుండా (కలుగకుండా); వారలన్+అరసికొనుచున్= అట్లాంటి వారిని; జాగరూకతతో పరిశీలించుకొంటూ; పొదివి నడపుట= కమ్ముకొని నడిపించటం; కార్యము= కర్తవ్యం.

తాత్పర్యం: అట్లాంటివాళ్ళు రాజుకు తామను కొంటే మేలుకానీ, కీడుకానీ చేయటానికి సమర్థులై ఉంటారు. తమ కేమాత్రం పాపం అంటనట్లు వాళ్ళను జాగరూకతతో చూస్తూ కమ్ముకొని నడిపించటమే రాజునకు కర్తవ్యం.'

వ. అనుటయు ధర్మజుండు 'ధనార్జనం బేమిటం బ్రస్ఫుటంబై నడచు?'నని యడిగిన యతనికి భీష్ముం డిట్లనియె. 362

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు చెప్పగా; ధర్మజుండు= ధర్మరాజు; ధన+ఆర్జనంబు= ధన సంపాదనం; ఏమిటన్+ప్రస్ఫుటంబు+ఐ నడచున్= దేనివలన స్పష్టంగా కొనసాగుతుందో; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; భీష్ముండు+ఇట్లు+అనియెన్= భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: రాజు నడుచుకొనవలసిన తీరునుగూర్చి భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'ధనసంపాదనం ఏ విధంగా ప్రస్ఫుటంగా కొనసాగుతుందో తెలుపు' మని అడిగినప్పుడు భీష్ముడు ఇట్లా సమాధానం చెప్పాడు.

కాలక పృక్షీయ క్షేమదర్శి సంవాద ప్రకారము (సం. 12-83-1)

క. ఆయతికాఁడు వలయు నర। నాయకునకు వానికెల్ల నరులుం జేటుం
జేయఁ దలంతురు దా నవ। ధాయకు డై కావవలయు ధరణిపుఁ డతనిన్. 363

ప్రతిపదార్థం: నరనాయకునకున్= రాజునకు; ఆయతికాఁడు= ధనార్జనపరుడు; వలయున్= అవసరం; వానికిన్+ఎల్లనరులున్= అట్లాంటి ధనార్జనపరునకు ప్రజలంతా; చేటున్+చేయన్+తలంతురు= కీడు కలిగించటానికి ఆలోచిస్తారు; ధరణిపుఁడు= రాజు; తాన్= తాను; అవధాయకుఁడు+ఐ= ఏకాగ్రత కలవాడై (హెచ్చరిక కలవాడై); అతనిన్= ఆ ధనార్జనుడిని; కావన్ వలయున్= సంరక్షించాలి.

తాత్పర్యం: రాజుకు ధనార్జనాపరుడైన వ్యక్తి కావాలి. అట్లాంటి ధనార్జనా పరుడికి కీడు కలిగించటానికి ప్రజలు ఆలోచిస్తూ ఉంటారు. అట్లాంటి విషయాన్ని గ్రహించి రాజు అవధాన పరత్వంతో అతడిని సంరక్షించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

వ. ఈ యర్థంబున నితిహాసంబు గల దాకర్ణింపుము; కాలక వృక్షీయ నామధేయుం డగు నొక్కమునిక్షేమదర్శి యనియెడు కోసల భూవిభుని భూమికిం బంజరస్థంబుఁ జేసికొని యొక్క కాకంబుఁ దెచ్చి యిప్పక్షి త్రైకాల్యవేది యని యెల్ల జనంబులకుం జెప్పుచుఁ దిరిగి క్రమంబున రాజుం గని యతని కక్కాకంబుఁ జూపి 'నీయం దర్థార్జనాది నృప కార్యంబువలన నేమఱుట గలదు; దానం బుట్టిన సేగియెల్ల నిప్పులుఁగు సెప్పి నీకుం దప్పిన మ్రుచ్చులం బట్టింపఁ జాలు' నను పలుకు వలికి యమ్మహీవరు నాదరంబు వడసి వీడుఁ బట్టున కరిగిన. 364

ప్రతిపదార్థం: ఈ+అర్థంబునన్= ఈ విషయాన్ని తెలిపే; ఇతిహాసంబు+కలదు+ఆకర్ణింపుము= ఒక పూర్వ కథ ఉన్నది వినుము; కాలక వృక్షీయ నామధేయుండు+అగున్+ఒక్కమున= కాలక వృక్షీయుడనే పేరు కలిగిన ఒక మహర్షి; క్షేమదర్శి+అనియెడు=క్షేమదర్శి అనే పేరుగల; కోసల భూ విభుని భూమికిన్= కోసల దేశాధిపతిఅయిన క్షేమదర్శి రాజ్యానికి; పంజరస్థంబున్+చేసికొని= పంజరంలో ఉంచుకొని; ఒక్కకాకంబున్+తెచ్చి= ఒక కాకిని తెచ్చి; ఆ+పక్షి= ఆ కాకి; త్రైకాల్యవేది+అని= మూడు కాలాలను తెలిసికొన్నదని; ఎల్ల జనంబులకున్+చెప్పుచున్+తిరిగి= ప్రజలందరికీ తెలియజేస్తూ తిరిగి; క్రమంబునన్= క్రమంగా; రాజున్+కని= క్షేమదర్శి అనే రాజును దర్శించి; అతనికిన్= ఆ రాజునకు; ఆ+కాకంబున్+చూపి= ఆ కాకిని చూపించి; నీ+అందున్+అర్థ+ఆర్జన+ఆది= నీలో ధనార్జన మొదలైన; నృపకార్యంబుల వలనన్= రాజకార్యాలవలన; ఏమఱుట+కలదు= ఏమరుపాటు ఉన్నది; దానన్+పుట్టినసేగి+ఎల్లన్= అందువలన కలిగిన ఆపద నంతటినీ; ఈ+పులుఁగు+చెప్పి= ఈ పక్షి (కాకి) తెలిపి; నీకున్+తప్పిన= నీ నుండి తప్పించుకొన్న; మ్రుచ్చులన్+పట్టింపన్+చాలున్= దొంగలను పట్టించగల సామర్థ్యం దీనికి ఉన్నది; అను పలుకు+పలికి= అనే మాటలు చెప్పి; ఆ+మహీవరు+ఆదరంబు+పడసి= ఆ మహారాజు అభిమానంపొంది; వీడు పట్టునకున్+అరిగినన్= వాసస్థానానికి (విడిదికి) వెళ్ళిపోగా.

తాత్పర్యం: ధర్మరాజా! రాజునకు జాగ్రత్త చాలా అవసరం. ఇందుకు తగిన కథ చెప్పుతాను. వినుము. కాలకవృక్షీయుడు ఒక ముని. అతడు కోసలాధిపతి క్షేమదర్శి రాజ్యానికి వెళ్ళాడు. పంజరంలో ఉంచిన చిలుకను చూపుతూ 'ఇది త్రికాలవేది' అనేవాడు. కాకిని రాజుకు చూపెట్టుతూ 'రాజా! నీకు ధనార్జనపట్ల ఏమరుపాటు ఉన్నది. అందువలన అనేకమైన ఆపదలు. కాని, ఈ కాకి ఆవిపత్తు లన్నిటిని నీకు విశదం చేస్తుంది. నీ ఏమరుపాటువలన తప్పించుకొన్న దొంగలను పట్టిస్తుంది' - అన్నాడు. ఆ రాజు ఆదరం పొందాడు. తన నివాసానికి కదలి వెళ్ళాడు.

క. ఆ రాత్రి యవ్విభుని యధి । కారులు సంపి రొక భంగిఁ గాకము; మఱునాఁ
డా రాజున కవ్విప్రుఁడు । గోరి రహస్యంబుఁ జేసికొని యెఱిఁగించెన్. 365

ప్రతిపదార్థం: ఆ రాత్రి= అదేరోజు రాత్రి; ఆ+విభుని+అధికారులు= ఆ రాజాధికారులు; కాకమున్= కాకిని; ఒక భంగిన్= ఏదో ఒక విధంగా; చంపిరి= చంపారు; మఱునాఁడు= ఆ మరుసటి రోజు; ఆ+విప్రుఁడు= ఆ బ్రాహ్మణుడైన కాలక వృక్షీయుడు; కోరి= ప్రార్థించి; రహస్యంబున్+చేసికొని= రహస్యాన్ని గ్రహించి; ఎఱిఁగించెన్= తెలియజేశాడు.

తాత్పర్యం: ఆ రాత్రికి రాత్రే రాజాధికారులు కొంతమంది ఆ కాకిని ఒక ఉపాయంతో చంపారు. ఆ మరుసటిరోజు ఆ బ్రాహ్మణుడైన కాలకవృక్షీయుడు ఆ రహస్యాన్ని గ్రహించి, రాజునకు తెలియజేశాడు.

వ. అట్లు నియోగుల కపటోపాయంబునం గాకి మృతం బగుట సాభిజ్ఞానంబుగా నెఱింగించి, తన పేరు సెప్పి, 'యేను మీ తండ్రి సఖుండ; నతని పిమ్మట నిచ్చట నిలువ నొల్లక వనంబున కరిగి తపంబు సేయుచుండి, నీ మీఁది యధిక స్నేహంబునంజేసి, నీ దగు యోగక్షేమంబు లరయవేఁడి వచ్చి యీ రాష్ట్రంబునం బురంబునను వర్తించుచు భవదీయ రాజ్యలక్ష్మి మధుర భంగి యయ్యును నధము లగువాని యుక్తులవలనం జోరజన సంవృతంబైన కావేరియుంబోలె నుపయోగ్య గాకునికి యెఱింగి, నీకెఱింగించుటకై మిథ్యాభివర్ణితంబైన కాకంబు నెపంబిడి చొచ్చితి; దుర్మతులైన ద్రోహులు దానిం జంపుట కతంబున లోనం గీడు గలుగుట నీకుం గొంత గాననయ్యెఁ; గనుగలిగి యరసిన నింకనుం దేటపడియెడు నా యాప్తియును, గార్య వివేకంబు కలిమియు నమ్మి మదీయోపదేశంబు నాదరింపు; మిప్పుడు నన్నాదరింపక విడిచినవాఁడ వగుము; వంచకులైన యధికార పురుషులకు నేర్పుమైఁ గ్రమంబునఁ బరస్పర విరోధంబుఁ గలిగించి సంప్రీతి సెఱిచి నీవలసిన ట్లొక నొకనిం దండింపు' మని వారలం బేరు గ్రుచ్చి యుపదేశించిన. 366

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నియోగుల= రాజాధికారుల; కపట+ఉపాయంబునన్= మోసకృత్యం వలన; కాకి మృతంబు+అగుట= కాకి చనిపోవటం; స+అభిజ్ఞానంబుగాన్+ఎఱింగించి= గుర్తుండేటట్లు తెలిపి; తన పేరు+చెప్పి= తన పేరు తెలిపి; ఏను మీ తండ్రి సఖుండన్= నేను మీ తండ్రి స్నేహితుడిని; అతని పిమ్మటన్= అతడి మరణానంతరం; ఇచ్చట నిలువన్+ఒల్లక= ఈ రాజ్యంలో ఉండటం ఇష్టంలేక; వనంబునకున్+అరిగి= అడవికి వెళ్ళి; తపంబు+చేయుచుండి= తపస్సు చేస్తూ ఉండి; నీ మీఁది= నీ పైన ఉన్న; అధిక స్నేహంబునన్+చేసి= మిక్కిలి మైత్రివలన; నీది+అగు= నీ యొక్క; యోగక్షేమంబులు+అరయన్ వేఁడి వచ్చి= బాగోగులు తెలిసికొనటానికి వచ్చి; ఈ రాష్ట్రంబునన్+పురంబునను వర్తించుచున్= ఈ రాజ్యంలో నీ పట్టణంలో తిరుగుతూ; భవదీయ రాజ్యలక్ష్మి= నీ రాజ్యలక్ష్మి; మధుర భంగి+అయ్యునున్= మనోహరమైనప్పటికీ; అధములు+అగువాని యుక్తులవలనన్= నీచుల కపటాలోచనలవలన; చోర సంవృతంబు+ఐన కావేరియున్+పోలెన్= దొంగలతో కూడిన కావేరి నదీ ప్రాంతంవలె; ఉపయోగ్య+కాక+ఉనికి+ఎఱింగి= ఉపయోగ పడటం లేదని తెలిసి; నీకున్+ఎఱింగించుటకై= నీకు తెలియజేయటానికి; మిథ్య+అభివర్ణితంబు+ఐన= అబద్ధంగా వివరించిన; కాకంబు నెపంబు+ఇడి చొచ్చితిన్= కాకి కారణంగా వచ్చాను; దుర్మతులు+ఐన ద్రోహులు= దుర్మార్గులైన ద్రోహచింతనా పరులు; దానిన్+చంపుట కతంబునన్= ఆ కాకిని చంపటం కారణంగా; లోనన్+కీడు+కలుగుట= లోలోపలే ఆపద కలగటం; నీకున్+కొంత+కానన్+అయ్యెన్= నీకూ కొంత తెలిసింది; కను+కలిగి+అరసినన్= జాగరూకతతో గమనిస్తే; ఇంకనున్+తేట పడియెడున్= ఇంకా నీకు స్పష్టమౌతుంది; నా+ఆప్తియున్= నేను ఆప్తుడిని కావటమూ; కార్యవివేకంబు కలిమియున్ నమ్మి= కార్యాలోచన అనే వివేక సంపదను విశ్వసించి; మదీయ+ఉపదేశంబున్+ఆదరింపుము= నా ప్రబోధాన్ని మన్నించుము; ఇప్పుడు నన్నున్+ఆదరింపక= ఈ సమయంలో నన్ను గౌరవించక; విడిచినవాఁడవు+అగుము= నన్ను వదలిపెట్టినట్లు నటించుము; వంచకులు+ఐన= మోసకారులైన; అధికార పురుషులకున్= రాజాధికారులకు; నేర్పుమైన్= సామర్థ్యంతో; క్రమంబునన్= క్రమంగా; పరస్పర విరోధంబు+కలిగించి= వారిలో వారికి శత్రుత్వం కల్పించి; సంప్రీతి+చెఱిచి= వారి సంతోషాన్ని చెడగొట్టి; నీవలసిన+అట్లు+ఒకని+ఒకనిన్= నీకు సాధ్యమైన రీతిలో ఒక్కొక్కరిని; దండింపుము+అని= శిక్షించవలసిందని; వారలన్+పేరు+క్రుచ్చి= ఆ దోషులైనవారి పేర్లు పేర్కొని; ఉపదేశించినన్= బోధించగా.

తాత్పర్యం: ఆ విధంగా అధికారుల మోసంవలన కాకి చంపబడటాన్ని ఉదాహరణపూర్వకంగా నిరూపించి, తాను కాలకవృక్షీయుడనే ముని నని చెప్పి, 'మీ తండ్రి మిత్రుడిని. అతడి మరణానంతరం దుష్టులతో నిండిన ఈ దేశంలో జీవించటం ఇష్టంలేక అరణ్యంలో తపస్సు చేసికొంటూ వచ్చాను. నీ మీది వాత్సల్యంతో నీ యోగక్షేమాలు తెలిసికొనగోరి, నీ రాజ్యంలో నీ పట్టణంలో తిరుగుతూ నీ రాజ్యరమ మనోహరమైనా నీచుల నియోగంవలన

దొంగలచేత చుట్టబడ్డ కావేరీ తీరంవలె, ఉపకరించటంలేదని తెలిసికొని, నీకు ఈ విషయం స్పష్టం చేయటానికి కపటోపాయంతో కాకి త్రికాలవేది అనే నెపంతో నీ దగ్గరకు వచ్చాను. దుష్టబుద్ధులైన రాజాధికారులు కొందరు కాకిని చంపటంతో వాళ్ళ దౌష్ట్యం కొంత నీకు తెలిసింది. జాగరూకుడవై పరిశీలిస్తే నీకు ఇంకా విదితమవుతుంది. నేను నీకు లభించటాన్ని, నా కార్యవివేక సంపదను విశ్వసించి నా ప్రబోధాన్ని మన్నించుము. ప్రస్తుతం నన్ను మన్నించక వదలినట్లు నటించుము. మోసకారులైన రాజాధికారులకు నేర్పుతో వాళ్ళలో వాళ్ళకే విరోధాలు కల్పించి, వాళ్ళ సంతోషాన్ని భంగపరచి ఒక్కొక్కళ్ళను శిక్షించుము' అని పేరు పేరున దుష్టులను పేర్కొని ప్రబోధించగా - (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆ రాజు నట్ల చేసి మ । హారాజ్య స్థితికి నెల్ల నవ్విప్రు మహో
దారగుణు మంత్రిఁగాఁ గొని । సారధనప్రీతి సుఖ యశంబులు వడసెన్.' 367

ప్రతిపదార్థం: ఆ రాజు= ఆ క్షేమదర్శి అనే రాజు; అట్ల చేసి= కాలక వృక్షీయ మహర్షి చెప్పినట్లు దుష్టులను శిక్షించి; మహారాజ్య స్థితికిన్+ఎల్లన్= ఆ కోసల రాజ్యానికి అంతటికీ; ఆ విప్రున్= ఆ బ్రాహ్మణుడైన కాలక వృక్షీయుడిని; మహా+ఉదార గుణున్= మిక్కిలి గొప్ప గుణాలు కలవాడిని; మంత్రిన్+కాన్+కొని= మంత్రిగా నియమించి; సారధన ప్రీతి సుఖయశంబులు+పడసెన్= శ్రేష్ఠమైన ధనం, సంతోషం, సుఖం, కీర్తి అనే వాటిని పొందాడు.

తాత్పర్యం: క్షేమదర్శి అనే రాజు కాలకవృక్షీయుడి హితబోధను అనుసరించి దుష్టులను శిక్షించి, ఉత్తమగుణఖని అయిన అతడిని మంత్రిగా నియమించి, అతడి సాచివ్యంతో రాజ్యపాలన సాగించి శ్రేష్ఠమైన ధనం, సంతోషం, సుఖం, కీర్తి పొందాడు.'

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు 'మంత్రి యెట్టివాఁడు గావలయు నెఱింగింపు' మనుటయు గాంగేయుం డతని కిట్లనియె. 368

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విని; కౌంతేయ+అగ్రజుండు= కుంతీ పుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; మంత్రి+ఎట్టివాఁడు+కావలయున్= మంత్రి ఎలాంటివాడై ఉండాలో; ఎఱింగింపుము+అనుటయున్= తెలుపవలసిందని కోరగా; గాంగేయుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు ధర్మరాజు 'మంత్రి ఎట్లాంటి గుణగరిష్ఠుడై ఉండాలో తెలుపు'మని కోరగా భీష్ముడు ఇట్లా చెప్పాడు.

సీ. 'జ్ఞానపరుఁడుఁ బౌర జానపదాప్తుండుఁ । గార్యజ్ఞుఁడును ధైర్యశౌర్యఘనుఁడు
నక్రూరుఁడును విశుద్ధాత్ముండుఁ బతియెడ । భక్తను రాగ సంభ్రమము లెసఁగ
సమ సుఖదుఃఖుఁడై చెమరు నెత్తురు గాఁగఁ । దలఁచుచు నరయక తప్పు మీఁదఁ
బెట్టిన నలుకమైఁ దిట్టినఁ గలఁక దా । నొందక తేర్చుచోఁ బొందు సెడక

తే. మెలఁగు వాఁడును నిజరంధ్రములకు మాటు । సేయఁ బరరంధ్రములు గని చిక్కువఱుపఁ
జాలు నిపుణుండు నైన విశాలబుద్ధి । గావలయు మంత్రిముఖ్యుండు గౌరవేంద్ర! 369

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవులలో శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; మంత్రి ముఖ్యుండు= మంత్రి శ్రేష్ఠుడు; జ్ఞానపరుఁడున్= ఉత్తమ జ్ఞాన సంపన్నుడూ; పౌరజానపద+ఆప్తుండున్= పౌరులకూ, జానపదులకూ ఆత్మీయుడూ; కార్యజ్ఞుఁడును= కార్యవేత్తా;

ధైర్యశౌర్య ఘనుఁడున్= ధైర్య పరాక్రమాలలో గొప్పవాడూ; అక్రూరుఁడును= క్రౌర్యం లేనివాడూ; విశుద్ధ+ఆత్ముండున్= పరిశుద్ధాత్మ కలవాడూ; పతి+ఎడన్= రాజుపట్ల; భక్తి+అనురాగ సంభ్రమములు+ఎసగన్= భక్తిప్రేమభావాలు అధికం కాగా; సమసుఖదుఃఖుఁడు+ఐ= సుఖ దుఃఖాలను సమంగా స్వీకరించగల వాడై; చెమరు= చెమట; నెత్తురు+కాఁగన్+తలఁచుచున్= రక్తంగా భావించి; అరయక; తెలియక= తప్పు మీఁదన్+పెట్టినన్= ఏదేని దోషం తనమీద మోపినా; అలుకమైన్= కోపంతో; తిట్టినన్= దూషించినా; తాన్= తాను; కలఁక= కలత; ఒందక= చెందక; తేర్చుచోన్+పొందు+చెడక= అనునయించేటప్పుడు స్నేహం చెడక; మెలఁగువాఁడును= జాగకరూకతతో మసలుకొనేవాడూ; నిజ రంధ్రములకున్= తన రాజ్య సంబంధి దోషాలను; మాటు+చేయన్= కప్పిపుచ్చగల; పరరంధ్రములు+కని= శత్రువుల దోషాలను తెలిసికొని; చిక్కు+పఱుపన్+చాలు నిపుణుండు+ఐన= కష్టాలపాలు చేయగల నేర్పరి అయిన; విశాలబుద్ధి= విస్తృతమైన బుద్ధి సంపన్నుడు; కావలయున్= కావాలి.

తాత్పర్యం: 'జ్ఞానధనుడూ, పౌరజానపదులకు ఆప్తుడు, కార్యవేత్త, ధైర్యపరాక్రమాలలో గొప్పవాడూ, క్రౌర్యం లేనివాడు, పరిశుద్ధాత్ముడు, రాజుపట్ల భక్తి గౌరవాతిశయాలతో సుఖదుఃఖాలను సమంగా స్వీకరించగల వాడు, చెమటను రక్తంగా భావించి తెలియక తనపై దోషారోపణ చేసినా, కోపంతో దూషించినా, ఏ మాత్రం కలతచెందక అనునయంతో రాజు పొందు చెడకుండా మసలుకొనగలవాడూ, తమ దోషాలను కప్పిపుచ్చుతూ, శత్రువుల లోపాలను గుర్తించి వాళ్ళను చిక్కులపాలు చేయగల నైపుణ్యంకలవాడూ అయిన విశాలబుద్ధిగలవాడు మంత్రిగా ఉండటానికి అర్హుడు.'

వ. అని చెప్పి. **370**

తాత్పర్యం: అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పి.

క. 'మృదు మధుర వాక్యముల నిం । పొదవెడు చిఱునవ్వుతోడ నుర్వీశుఁడు స
మ్మదము సచివులకుఁ బ్రజలకు । నొదవింపఁగవలయు;నది మహోన్నతిఁ జేయున్. **371**

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశుఁడు= రాజు; సచివులకున్+ప్రజలకున్= మంత్రులకు, ప్రజలకు; మృదు మధుర వాక్యములన్= మెత్తని తియ్యనైన మాటలతో; చిఱునవ్వుతోడన్= దరహాసంతో; సమ్మదమున్= సంతోషాన్ని; ఒదవింపఁగన్ వలయున్= కలిగించవలసి ఉన్నది; అది మహా+ఉన్నతిన్+చేయున్= అది గొప్పదనాన్ని చేకూరుస్తుంది.

తాత్పర్యం: 'రాజు తన మంత్రులకు, ప్రజలకు మెత్తని తియ్యని మాటలతో సంతోషాన్ని కలిగించే చిరునవ్వుతో సమ్మదం చేకూర్చవలసి ఉన్నది. అది రాజునకు ఎంతో ఔన్నత్యాన్ని కలిగిస్తుంది.

తే. ఈగియును బ్రియ వచన సంయోగమునన । కాని జనులకు సంతోషకారి గాదు
పుచ్చి కొనునప్డు పల్కుల పొందుకలిమి । యెదిరి మదిఁ గందనీ దింత యెఱుఁగు మధిప!' **372**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; ఈగియును= దానంవలనగాని; ప్రియవచన సంయోగమునన కాని= ప్రియమైన మాటలతోగాని; జనులకున్ సంతోషకారి+కాదు= ప్రజలకు సంతోషం కలుగదు; పుచ్చికొనునప్డు= గ్రహించేటప్పుడు; పల్కుల పొందు కలిమి= మాటల పొందిక అనే సంపద; ఎదిరి మదిన్+కందన్+ఈదు= శత్రువుల మనస్సులను పీడించదు; ఇంత+ఎఱుఁగుము= ఈ సంగతి తెలిసికొమ్ము.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! దానంతోగాని, ప్రియమైన మాటలతోగాని ప్రజలకు సంతోషం కలుగదు. స్వీకరించే సమయంలో చక్కని మాటల పొందిక శత్రువుల మనస్సులను బాధించదు. దీనిని జాగరూకుడవై తెలిసికొమ్ము.

వ. అనుటయు ధర్మతనయుండు 'జనంబుల వివాదం బుడుపు నపుడు పుడమిఱేఁడు దూఱునుం బాపంబును బొరయకుండు తెఱంగు దెలుపవే 'యనిన దేవవ్రతుం డిట్లనియె. 373

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు అనగా; ధర్మతనయుండు= ధర్మరాజు; జనంబుల వివాదంబు+ఉడుపునపుడు= ప్రజల తగాదాలను తీర్చేటప్పుడు; పుడమిఱేఁడు= రాజునకు; దూఱునున్+పాపంబును+పొరయకుండు తెఱంగు+తెలుపవే+అనినన్= నింద, పాపం సోకకుండా ఉండే మార్గం తెలుపుమని అనగా; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'ప్రజలలో కలిగే వివాదాలలో తీర్పు చెప్పేటప్పుడు రాజునకు ఎట్లాంటి నింద, పాపం, సోకకుండా ఉండే మార్గం ఏదో తెలుపు' మని ధర్మరాజు అడుగగా భీష్ముడు ఇట్లా చెప్పాడు.

సీ. 'వ్యవహారశుద్ధి సర్వ ప్రజా ప్రియకారి; । యదియ భూపతికి ధర్మాతిశయముఁ
గీర్తియుఁ జేయు; నక్షీణసత్యులు ధర్మ । పరులును నైన భూసురులు నీవు
ద్రాసులుం బోని చిత్తంబుల తోడుత । బ్రజ వివాదము లెడఁ బక్ష ముడిగి
విని ధన వాంఛమై ధనికుల దెస వ్రాలి । తీర్పక ధర్మంబు తెరువు దప్ప

ఆ. కుండఁ బాడిఁ దీర్చి దండింపఁ దగునెడ । ననుగుణంపు దండ మాచరింపు
మొఱఁగ బలికితేని నుండదు ప్రజ డేగఁ । గనిన పులుఁగుపిండు కరణిఁ జెదరు. 374

ప్రతిపదార్థం: భూపతికిన్= రాజునకు; వ్యవహారశుద్ధి= వ్యవహారంలో పరిశుద్ధత; సర్వప్రజా ప్రియకారి= సమస్త ప్రజలకూ సంతోషాన్ని గూర్చేది; అదియ= అదే; ధర్మ+అతిశయమున్= ధర్మాధికారాన్ని; కీర్తియున్+చేయున్= యశస్సును చేకూరుస్తుంది; అక్షీణ సత్యులు= ఏ మాత్రం సత్యం దప్పనివారు; ధర్మపరులు+ఐన= ధర్మాత్ములైన; భూసురులున్= భూదేవతలైన బ్రాహ్మణులు; ఈవున్= నీవును; త్రాసులున్+పోని చిత్తంబులతోడుతన్= త్రాసులవంటి మనస్సులతో; ప్రజ వివాదములు+ఎడన్= ప్రజల వివాదాలను పరిష్కరించే సందర్భంలో; పక్షము+ఉడిగి విని= పక్షపాతబుద్ధి లేక విని; ధనవాంఛమైన్= ధనంమీది ఆసక్తితో; ధనికుల దెస వ్రాలి తీర్పక= ధనికుల పక్షం వహించి తీర్పు చెప్పక; ధర్మంబుతెరువు+తప్పకుండన్= ధర్మమార్గం తప్పకుండా; పాడిన్+తీర్చి= న్యాయమైన తీర్పు చెప్పి; దండింపన్+తగున్+ఎడన్= శిక్షించవలసిన సందర్భంలో; అనుగుణము+దండము+ఆచరింపుము= తదుచితమైన శిక్ష విధించవలసింది; ఒఱఁగన్+పలికితి(వి)+ఏనిన్= పక్షపాతబుద్ధితో తీర్పు చెప్పితే; ప్రజ ఉండదు= ప్రజలు రాజాశ్రయంలో ఉండరు; డేగన్+కనిన= డేగను చూచిన; పులుఁగు పిండు కరణిన్+చెదరున్= పక్షుల సమూహంవలె చెదరిపోతారు.

తాత్పర్యం: 'వ్యవహారాలలో పరిశుద్ధత రాజునకు అవసరం. అదే సర్వప్రజలకు ప్రీతిని చేకూరుస్తుంది. అందువలన ధర్మాధిక్యమూ, కీర్తి కలుగుతాయి. నిత్యసత్య వచనులు, ధర్మాత్ములు అయిన బ్రాహ్మణులూ నీవూ త్రాసులతో సమానమైన మనస్సులతో ప్రజల వివాదాలు తీర్చేటప్పుడు పక్షపాతం లేకుండా ఇరుపక్షాలవారి వాదనలను విని ధనాశతో ఐశ్వర్యవంతుల వైపు మొగ్గకుండా, న్యాయమైన తీర్పు చెప్పి శిక్షించవలసిన పట్ల, తదుచితమైన శిక్ష విధించాలి. పక్షపాతబుద్ధితో తీర్పు చెప్పితే డేగను చూచిన పక్షులు చెల్లా చెదరైపోయినట్లు ప్రజలు రాజాశ్రయంలో ఉండరు.

విశేషం: అలం: ఉపమ.

వ. దండించుట దానును. 375

తాత్పర్యం: శిక్షించటంలో తానూ - (తరువాతి పద్యంతో అన్వయం).

క. నఱకుట యర్థముఁ గొనుటయు । జెఱ నునుచుట కట్టి యడిచి చేఁ్పాటొందం
బఱచుట మొదలుగఁ గల పలు । దెఱఁగులఁ దగవుమెయి నడచు ధీరవిచారా! 376

ప్రతిపదార్థం: ధీర విచారా!= ధీర విచారుడవైన ఓ ధర్మరాజా!; నఱకుట= ఖండించటం (సంహరించటం); అర్థమున్+కొనుటయున్= ధనం గ్రహించటం; చెఱన్+ఉనుచుట= కారాగారంలో బంధించటం; కట్టి= కట్టివేసి; అడిచి= అణచిపెట్టి; చేఁ్పాటు+ఒందన్+పఱచుట= నాశనం చేయటం; మొదలుగన్+కల= మొదలైన; పలుతెఱఁగులన్= అనేక రీతులలో; తగవు మెయిన్= న్యాయమైన రీతిలో; నడచున్= ప్రవర్తిస్తాడు.

తాత్పర్యం: 'ధీరవిచారుడ వైన ఓ ధర్మరాజా! ఖండించటం అంటే శిరశ్ఛేదం, ధనం గ్రహించటం, కారాగారంలో బంధించటం, కట్టివేసి అడచిపెట్టి కీడు కలిగించటం మొదలైన పలురీతులలో న్యాయబద్ధంగా ప్రవర్తిస్తాడు.

వ. అని చెప్పి భీష్ముండు వెండియు ని ట్లనియె. 377

ప్రతిపదార్థం: అని చెప్పి= అని ఈ విధంగా చెప్పి; భీష్ముండు= భీష్ముడు; వెండియున్+ఇట్లు+అనియెన్= మళ్ళీ ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పై రీతిగా వివరించి భీష్ముడు ధర్మరాజుతో మళ్ళీ ఇట్లా అన్నాడు.

క. 'తన కడకు వచ్చి మొగమో । డని వాఁ డగు దూత వల్కుటకుఁ గోపింపం
జనదు జననాథునకు; దూ । తునిఁ జంపిన నరక మగుట ధ్రువ మని రార్యుల్. 378

ప్రతిపదార్థం: తనకడకున్ వచ్చి= తన ఆస్థానానికి వచ్చి; మొగము+ఓడనివాఁడు+అగు= మొగమోట మెరుగనివాడైన; దూత+పల్కుటకున్= దూత మాటలకు; జననాథునకున్= రాజునకు; కోపింపన్+చనదు= కోపగించుకొనటం సముచితం కాదు; దూతునిన్+చంపినన్= దూతను చంపినట్లైతే; నరకము+అగుట ధ్రువము+అని= నరక ప్రాప్తి తప్పదని; ఆర్యుల్= పెద్దలు; అనిరి= పలికారు.

తాత్పర్యం: దూత తన ఆస్థానానికి వచ్చి మొగమోటం లేకుండా మాట్లాడినప్పుడు ఆ మాటలకు రాజు కోపగించుకొనకూడదు. దూతను చంపితే నరకం తప్పదని పెద్దలు వక్కాణించారు.

తే. కులము, శీలంబు, హితవాక్యములును, నేర్పుఁ, । గార్యవాదిత్వ సద్వచో గౌరవంబుఁ,
దలఁపు గలుగుట, దక్షత, యలఘు గుణము । లండ్రు దూతకు నియ్యేడు నార్యజనులు. 379

ప్రతిపదార్థం: ఆర్యజనులు= పెద్దలు; దూతకున్= దూతకు (రాయబారికి); కులమున్= ఉత్తమ కులం; శీలంబున్= మంచి నడవడి; హిత వాక్యములును= మంచిని గోరి చెప్పే మాటలు; నేర్పు= నేర్పరితనం; కార్యవాదిత్వ సత్+వచః+గౌరవంబున్= కార్యసాధనకొరకు మంచి మాటలు పల్కటం; తలఁపు+కలుగుట= ఆలోచన కలగటం (సమయస్ఫూర్తి); దక్షత= సమర్థత అనే; ఈ+ఏడున్= ఈ ఏడు; అలఘు గుణములు+అండ్రు= గొప్ప గుణాలని పెద్దలు వక్కాణించారు.

తాత్పర్యం: 'ఉత్తమ కులం, మంచినడవడి, మంచినిగోరి చెప్పేమాటలు, నేర్పరితనం, కార్యసాధనకొరకు మంచి మాటలు పలకటం, సమయస్ఫూర్తి, దక్షత - అనే ఈ ఏడుగుణాలూ దూతకు ఉండవలసిన గొప్ప లక్షణాలని' పెద్దలు పలికారు.

క. మొనదీర్చు వెరవు, యంత్రము । లనేకము లొనర్చు నేర్పు, నాయుధముల వి
న్ననువును బోటుల కర్జం । బును సేనాపతికి నైజములు గావలయున్. 380

ప్రతిపదార్థం: మొన+తీర్చు వెరవున్= వ్యూహం పన్నే ఉపాయం; యంత్రములు+అనేకములు+ఒనర్చు నేర్పున్= అనేక యంత్రాలను తయారుచేయటంలో నైపుణ్యమూ; ఆయుధముల విన్ననువును= ఆయుధాలను ప్రయోగించటంలో నేర్పూ; పోటుల కర్జంబును= యుద్ధంలో సామర్థ్యం (యుద్ధకార్యాచరణం); సేనాపతికిన్= సైన్యాధిపతికి; నైజములు+కావలయున్= సహజ గుణాలై ఉండాలి.

తాత్పర్యం: యుద్ధవ్యూహాలు పన్నే ఉపాయమూ, అనేక యంత్రాల నిర్మాణంలో నైపుణ్యమూ, ఆయుధాలను ప్రయోగించటంలో నేర్పూ, యుద్ధకార్యాలలో సామర్థ్యమూ, సైన్యాధిపతికి ఉండవలసిన సహజగుణాలు.

క. తనయులనైనను నమ్మిన । జనపతి సిరి గోలుపోవుఁ; జతురతమై న
మ్మినవాఁడ పోలె నమ్మక । యునికి సకల జనుల యెడల నురవై యుండున్.' 381

ప్రతిపదార్థం: తనయులన్+ఐనను= తన పుత్రులనైనా; నమ్మిన= విశ్వసించిన; జనపతి= రాజు; సిరి+కోలుపోవున్= సంపదను పోగొట్టుకొంటాడు; చతురతమైన్= యుక్తితో; నమ్మినవాఁడ పోలెన్= విశ్వసించిన వాడివలెనే; నమ్మక+ఉనికి= నమ్మకుండా ఉండటమే; సకల జనుల+ఎడలన్= ప్రజలందరిపట్ల; ఉరవు+ఐ+ఉండున్= సముచితమై ఒప్పుతుంది.

తాత్పర్యం: రాజు తన పుత్రులనైనా మిక్కిలి నమ్మితే ఐశ్వర్యాన్ని కోల్పోతాడు. పుత్రులనే కాదు - సమస్త ప్రజలనూ నమ్మినట్లు నటిస్తూ రాజ్యపాలనం చేయటమే రాజునకు సముచిత ధర్మమై ఒప్పుతుంది.'

తే. అనిన విని పాండవాగ్రజుం 'డనఘ! పురము । భంగి యె ట్లైన మేలు? సెప్పంగ వలయు'
ననుడు నమ్మహీవిభునకు ననిమిషాప । గా తనూభవుఁ డి ట్లనుఁ బ్రీతితోడ. 382

ప్రతిపదార్థం: అనినన్= విని= అని చెప్పగా విని; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; అనఘ!= పాపరహితుడ వైన ఓ తాతా!; పురము భంగి= రాజధాని పద్ధతి; ఎట్లు+అయినన్ మేలు= ఏ విధంగా ఉంటే శ్రేయస్కరమో; చెప్పంగన్ వలయున్= తెలుపగోరుతున్నాను; అనుడున్= అని పలుకగా; ఆ+మహీవిభునకున్= ఆ మహారాజైన ధర్మరాజుతో; అనిమిష+ఆపగా తనూభవుఁడు= దేవతలనదిఅయిన గంగకుపుత్రుడైన భీష్ముడు; ప్రీతితోడన్= సంతోషంతో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కుమారుడు మొదలుకొని ప్రజలవరకూ రాజు ఏ విధమైన నమ్మకంతో ఉండాలో చెప్పగా విన్న ధర్మరాజు 'రాజధాని ఏ తీరులో ఉంటే మంచిదో తెలుపు'మని భీష్ముడిని కోరగా ఆయన సంతృప్తిపడి, ఇట్లా సమాధానం చెప్పాడు.

సీ. 'పరపు లోఁతును గల పరిఖతోఁ' బొడవును । ఘనమును నగుకోట గలిగి, తగిన
వాకిళ్ళు బలుపుఁ, గావలి నొప్ప రమ్య గృ । హవ్రాతములు గొమరారు వీథు
లందంబు లగు మేటి యంగళ్ళ నెల్ల వ । స్తువులును శోభిల్లు సుజన బహుళ
మై ధాన్యములును ఘృతాది రసద్రవ్య । ములును నానాయంత్రములును బహువి

ఆ. ధాయుధములు బిరుదు లగు యోధులును బండి । తులు విలాసినులును దూతముఖ్య
పరిజనము నెఱయఁ బరమోత్సవంబులు । మెఱయఁ బురము చెలువు మిగుల వలయు. 383

ప్రతిపదార్థం: పరపున్= విరివిగలిగి (విశాలమై); లోఁతును+కల= లోతు కలిగిన; పరిఖతోన్= అగడ్తతో; పొడవును ఘనమునున్= పొడవూ దిట్టమూ అయిన; కోట+కలిగి= కోటతో ఒప్పి; తగిన వాకిళ్ళు= అందుకు తగినట్టి ద్వారాలు; బలుపున్+కావలిన్+ఒప్పన్= వాటి వద్ద బలమైన కాపలా ఒప్పుతుండగా; రమ్యగృహ వ్రాతములు= మనోహరమైన భవన సమూహాలు (భవన సముదాయాలు); కొమరారు వీథులు= మనోజ్ఞమైన వీథులు; అందంబులు+అగు= అందమైన; మేటి+అంగళ్ళన్= పెద్ద పెద్ద దుకాణాలతో; ఎల్ల వస్తువులును శోభిల్లన్= సమస్త వస్తు సముదాయం శోభిస్తూ ఉండగా; సుజన బహుళము+ఐ= సజ్జన సమూహం గలదై; ధాన్యములును= వివిధ ధాన్యరాశులూ; ఘృత+ఆది రసద్రవ్యములును= నేయి నూనె మొదలైన రసద్రవ్యాలు; నానాయంత్రములును= వివిధ యంత్రాలతో; బహువిధ+ఆయుధములున్= అనేక విధాలైన ఆయుధాలూ; బిరుదులు+అగు యోధులును= ధీరులైన వీరులు; పండితులున్= విద్వాంసులు; విలాసినులును= విలాసినీ మణులు; దూత ముఖ్య పరిజనమున్= దూతమొదలైన పరివారమూ; నెరయన్= నిండి; పరమ+ఉత్సవంబులు= శ్రేష్ఠమైన పండుగలు పబ్బాలు; మెఱయన్= ప్రకాశిస్తూ ఉండగా; పురము= రాజధాని; చెలువు మిగులన్ వలయున్= మనోహరమై ఒప్పుతూ ఉండాలి.

తాత్పర్యం: విశాలమూ, లోతూ అయిన అగడ్తతో, పొడవూ దిట్టమూ అయిన కోటను కలిగి, ఆ కోటకు తగిన రీతిలో ద్వారాలు వాటికి గట్టి కాపలాతో మనోహరమైన భవన సముదాయమూ, మనోజ్ఞంగా తీర్చిదిద్దబడ్డ రాజవీథులు, అందమైన పెద్ద అంగళ్ళలో సమస్త వస్తు సముదాయమూ శోభిల్లుతూ ఉండగా, సజ్జనసమూహంతో నిండి ఉండగా, వివిధ ధాన్యరాశులు, నెయ్యి, నూనె మొదలైన రసద్రవ్యాలూ పలు యంత్రాలు, తగిన ఆయుధాలు, మేటి యోధులు, ఉత్తమ విద్వాంసులు, విలాసినీ మణులు, దూతలు మొదలైన పరివారమూ నిండి ఉండగా శ్రేష్ఠమైన ఉత్సవాలు, పండుగలు పబ్బాలు ప్రకాశిస్తూ ఉంటే రాజధాని మనోహరమై ఒప్పుతుంది.

విశేషం: ఇందులో వర్ణితమైన రాజధాని పూర్వరాజుల జీర్ణమైన కోట పేటలను పరిశీలిస్తే విదితమవుతుంది. మనోజ్ఞమైన భవన సముదాయంతో తీర్చిదిద్దినట్లు ఉండే రాజవీథులతో సమస్త వస్తు రసద్రవ్యాలతో నిండినట్టి దుకాణాలతో జనసమూహంతో, పండితులూ, కళాకారులు, విలాసినీజనం మొదలైన వారితో నగరం ప్రశస్తమై దేవసంబంధమూ, సమాజసంబంధమూ అయిన ఉత్సవాలతో పండగ పబ్బాలతో మనోహరమై రాజధాని ఉండాలని తిక్కన ఒక్క సీసంలో చక్కగా వర్ణించాడు. మూలంలో ఐదు శ్లోకాల్లో రాజధాని వర్ణనం ఉన్నది.

ఆ. అట్టి పురవరంబునందు రత్న స్వర్ణ । ముఖములగు పదార్థములకు బంధు
తతికిఁ బతి సురక్షిత స్థితి సేయువాఁ । డధిప! వినుము భూమి యరయు తెఱఁగు.' 384

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; వినుము= వినుము; అట్టి పురవరంబునందున్= అలాంటి ఉత్తమ నగరంలో; రత్న స్వర్ణ ముఖములు+అగు= నవరత్నాలు బంగారం మొదలైన; పదార్థములకున్= అమూల్య వస్తువులకు; బంధుతతికిన్= బంధు సమూహానికి; పతి= రాజు; సురక్షితస్థితి+చేయువాఁడు= రక్షణ కల్పించినవాడు; భూమి+అరయు తెఱఁగు= రాజ్యపాలన విధానం వినుము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! అట్లాంటి ఉన్నత నగరంలో నవరత్నాలు, బంగారం మొదలైన విలువగల వస్తువులకు, బంధువుల సమూహానికి రాజు సురక్షితస్థితిని కల్పించినప్పుడే రాజ్యపాలనం చేసే విధం వినుము.

వ. అని పలికి మఱియు. 385

తాత్పర్యం: అని పలికి ఇంకా భీష్ముడు ఇట్లా అన్నాడు.

క. 'స్థలముఖ్యము లయ్యెడు పే । ర్కుల యూళ్ళుల నెల్ల వెరవు గలిగిన విశ్వా
సులఁ బ్రభుత యిచ్చి భూపతి । నిలుప వలయు వర్ణరక్షణీయత వెలయన్. 386

ప్రతిపదార్థం: భూపతి= రాజు; స్థలముఖ్యములు+అయ్యెడు= ప్రముఖ ప్రదేశాలైన; పేరు+కల+ఊళ్ళులన్+ఎల్లన్= ప్రసిద్ధమైన పట్టణాలన్నిటిలోను; వెరవు+కలిగిన= ఉపాయం కలిగిన; విశ్వాసులన్= నమ్మదగిన వారికి; ప్రభుత+ఇచ్చి= రాజ్యాధికారం ఇచ్చి; వర్ణ రక్షణీయత వెలయన్= వర్ణాశ్రమ ధర్మ సంరక్షణం ప్రకాశించేటట్లు; నిలుప వలయున్= నియమించవలసి ఉన్నది.

తాత్పర్యం: రాజు ప్రసిద్ధ పట్టణాలన్నిటిలోను బుద్ధిశాలులూ, ఉపాయశాలులూ, విశ్వసనీయులూ అయినవారికి రాజ్యాధికారం ఇచ్చి వర్ణాశ్రమధర్మ సంరక్షణం ప్రకాశించేటట్లు చేయాలి.

క. చోరులచేఁ జెడకుండం, । గ్రూరులచేఁ జావకుండఁ గువలయ జనులన్
జారులచేఁ బడకుండ ధ । రారమణుఁడు నేర్పు గలిగి రక్షింపఁ దగున్. 387

ప్రతిపదార్థం: ధరారమణుఁడు= భూమికి భర్త అయిన రాజు; కువలయ జనులన్= భూప్రజలను; చోరులచేన్+చెడకుండన్= దొంగలవలన కీడు పొందకుండా; క్రూరులచేన్+చావక+ఉండన్= క్రూరాత్ములవలన మరణించకుండా; జారులచేన్+పడక+ఉండన్= జారులవలలో పడకుండా; నేర్పున్+కలిగి= జాగరూకతతో, నైపుణ్యంతో; రక్షింపన్+తగున్= సంరక్షించవలసి ఉన్నది.

తాత్పర్యం: రాజు తన ప్రజలను చోరులచేత కీడుపొందకుండా, క్రూరాత్ములచేత మరణించకుండా. జారుల వలలో తగులుకొనకుండా జాగరూకతతో సంరక్షించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

క. అవు బేహారముఁ, గృషియు, । న్సవరణలును బసులసొంపునన యట్లగుటన్
భువిఁ బసులు గలుగు కాఁపుల । నవనీశుఁడు గన్న ప్రజల య ట్లరయఁ దగున్. 388

ప్రతిపదార్థం: బేహారమున్= వాణిజ్యమూ; కృషియున్= వ్యవసాయమూ; సవరణలును= సేవలును; పసుల సొంపునను అవున్= పశువుల సంవృద్ధి వలననే పెంపొందుతాయి; అట్లు+అగుటన్= అందువలన; అవనీ+ఈశుఁడు= రాజు; భువిన్= తన రాజ్యంలో; పసులు+కలుగు+కాఁపులన్= పశుసంపద కలిగిన రక్షకులను; కన్న ప్రజల+అట్లు+అరయన్+తగున్= కన్న సంతానంవలె చూచుకొనటం మంచిది.

తాత్పర్యం: వాణిజ్యమూ, వ్యవసాయమూ, సేవా, పశుసంవృద్ధివలన అభివృద్ధి చెందుతాయి. కాబట్టి రాజు అట్లాంటి పశుసంపద గల వారిని కన్న సంతానంవలె ఏ లోటూ లేకుండా చూచుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

క. అరి మిగులఁ గొనుట, గ్రేపులఁ । బొరిమాలం బిదికినట్ల భూవర! కదుపున్
వెరవునఁ బెనిచిన యట్టగు । నరపతి ప్రజచేత నప్పనము దగఁ గొనినన్. 389

ప్రతిపదార్థం: భూవర!= ఓ ధర్మరాజా!; అరి= పన్ను; మిగులన్+కొనుట= ఎక్కువగా వసూలు చేయట మనేది; క్రేపులన్= దూడలను; పొరిమాలన్+పిదికిన+అట్లు= పాలు వదలకుండా పిండి చంపినట్లే; నరపతి= రాజు; ప్రజచేతన్= ప్రజలనుండి; అప్పనము+తగన్+కొనినన్= పన్నులు మొదలైన కానుకలు సముచిత రీతిని వసూలు చేస్తే; కదుపున్= ఆలమందలను; వెరవునన్= ఉపాయంతో; పెనిచిన+అట్టు+అగున్= పరిపోషించినట్లే అవుతుంది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ప్రజలనుండి పన్నులు అధికంగా వసూలు చేయటమనేది, పాలు వదలకుండా పిండి దూడలను చంపటం వంటిది. రాజు ప్రజలనుండి పన్నులు మొదలైన కానుకలను సముచిత రీతిలో వసూలు చేస్తే గోసంపదను పరిపోషించిన ట్లవుతుంది'.

బండారంబు వృద్ధి సేయుతెఱంగు భీష్ముఁడు ధర్మజునకుం జెప్పుట (సం. 12-89-1)

వ. అనిన విని పాండవాగ్రజుండు 'బండారంబు గలిగించు వెరవెట్టిది తెలుపు'మని యడిగిన నాపగాతనయుండతని కిట్లనియె. 390

ప్రతిపదార్థం: అనినన్ విని= అని రాజు పన్నులు వసూలు చేసేటప్పుడు జాగరూకుడై ఉండాలని భీష్ముడు చెప్పగా విని; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; బండారంబు= కోశం; కలిగించు వెరపు+ఎట్టిది?= ఏర్పాటు చేసికొని అభివృద్ధి చేసే ఉపాయం ఎట్లాంటిదో; తెలుపుము+అని+అడిగినన్= తెలుపవలసిం దని కోరగా; ఆపగాతనయుండు= ఆ గంగాపుత్రు డైన భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'రాజు ప్రజలనుండి పన్నులు వసూలు చేసేటప్పుడు బహు జాగరూకుడై మసలుకొనాలని భీష్ముడు చెప్పగా, ధర్మరాజు విని, కోశాభివృద్ధికి మార్గాలను తెలుపవలసిందని కోరగా భీష్ముడు ఇట్లా సమాధానం చెప్పాడు.

క. 'విను కర్షకులును వణిజులు । ననఘా! గోరక్షకులు ధరాధీశునకున్
ధన మొడఁ గూడెడు చోటుల । ననేక విధములకు నెల్ల నాద్యస్థలముల్. 391

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; వినుం= జాగరూకుడవై వినుము; ధరా+అధి+ఈశునకున్= రాజునకు; కర్షకులును= రైతులు; వణిజులు= వర్తకులు; గోరక్షకులు= గోపాలకులు; ధనము+ఒడగూడెడు చోటులన్= ధనం అభివృద్ధి చెందే అంశాలలో; ఎల్లన్= అన్నిచోట్లా; ఆద్య స్థలముల్= ముఖ్యమైన పట్టులు (ఆధారాలు)

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! సావధానుడవై వినుము. రాజునకు ధనం సమకూర్చుకొనటంలో కృషీవలులు, వర్తకులు, గోపాలురు ముఖ్యమైన పట్టులు.

తే. ధనములకు ధాన్యములకు నుత్పత్తి తలము । లయినవాని కించుకయును హాని గాక
యుండఁ దనకును బండార మొదవఁ దగు ను । పార్జనము సేయవలయు భూపాలకుండు. 392

ప్రతిపదార్థం: భూపాలకుండు= రాజు; తనకును= తనకు; ధనములకున్= సంపదలకు; ధాన్యములకున్= పంటలకు; ఉత్పత్తి తలములు+అయిన= వానికి ఉత్పత్తి కారణాలైన ప్రదేశాలకు; ఇంచుకయును= కొంచెమైనా; హాని+కాక+ఉండన్= కీడు కలుగనీయకుండా; బండారము+ఒదవన్+తగు= కోశాభివృద్ధికి తగిన రీతిలో; ఉపార్జనము+చేయన్ వలయున్= సంపాదన చెయ్యాలి.

తాత్పర్యం: 'ధనధాన్యాలకు సముత్పత్తిస్థానాలైన పట్టులకు ఏ మాత్రం భంగం కలుగని రీతిలో మిక్కిలి నైపుణ్యంతో కోశాభివృద్ధికి రాజు ప్రయత్నించి తగిన రీతిలో సంపాదించాలి'.

విశేషం: ధనోత్పతికి వర్తక వాణిజ్యాలు, ధాన్యాభివృద్ధికి భూమి ఆధారాలు కాబట్టి ఇవి రాజాధీనంలోనే ఉండాలి. వాటికి హాని రానీయకుండా రాజు జాగరూకుడై కోశాభివృద్ధికి ప్రయత్నించాలి.

క. పులి గూనల దినుచందము । గలిగిన నంతటన నిలుచుఁ గాక ధనంబుల్
గలుగునె మీఁదం గావున । జలగ దిగిచినట్లు గొనఁగఁ జను నిల సొమ్ముల్. 393

ప్రతిపదార్థం: పులి+కూనల+తినుచందము+కలిగినన్= పులి ఈనిన వెంటనే ఆకలితో తన పిల్లలనే తినే తీరు అయితే; ధనంబుల్= సంపదలు; అంతటన= అంతటితోనే; నిలుచున్+కాక= అభివృద్ధిలేక ఆగిపోతాయి కాని; మీఁదన్+కలుగునె?= ఆపైన అభివృద్ధి కలుగుతుందా?; కావునన్= కాబట్టి; ఇలన్= భూమిపై; జలగ+తిగిచినట్లు= జలగ రక్తాన్ని లాగినట్లు; సొమ్ముల్= సంపదను; కొనఁగన్+చనున్= గ్రహించవలసి ఉంటుంది.

తాత్పర్యం: ఆకలితో పులి తన పిల్లలను తానే తిన్నట్లుగా, రాజు ప్రజలనుండి పన్నులు వసూలుచెయ్యటం ప్రారంభిస్తే కోశాభివృద్ధి చెందక ఆగిపోతుంది. అందువలన ఇతరులకు బాధకలగనీయకుండా తెలియకుండా జలగ నెత్తురు పీల్చిన రీతిలో రాజు ప్రజలనుండి ధనసంపాదన చేస్తే కోశం అభివృద్ధి చెందుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. అరయుటఁ బ్రజ వర్ధింపఁగ । నరి యేఁటఁ గ్రమ ప్రవృద్ధ మౌనట్టులుగా
నరపతికిఁ గొనఁగ వచ్చు । న్వెరవులఁ బెంపంగఁ జాల నెఱయు ధనంబుల్. 394

ప్రతిపదార్థం: నరపతికిన్= రాజునకు; ప్రజన్= ప్రజలను; వర్ధింపఁగన్= ప్రవర్ధమానమై వెలిగేటట్లు; అరయుటయున్= జాగరూకతతో చూడటమనే దానివలన; ఏఁటన్= ప్రతి సంవత్సరమూ; అరి= పన్ను; క్రమ ప్రవృద్ధము+ఔనట్టులుగాన్= క్రమాభివృద్ధి పొందేటట్లుగా; కొనఁగన్ వచ్చున్= గ్రహించవచ్చును; వెరవులన్= ఉపాయాలతో; పెంపంగన్= అభివృద్ధి చేస్తే; ధనంబుల్= సంపదలు; చాలన్ నెఱయున్= అధికంగావచ్చి నిండుతాయి.

తాత్పర్యం: ప్రజాభివృద్ధికరమైన పనులు చేస్తూ, జాగరూకతతో పరిపాలించే రాజు ప్రతి సంవత్సరమూ క్రమాభివృద్ధి పొందేటట్లుగా గ్రహించవచ్చును. మూర్ఖపు పట్టుదలతోగాక, చక్కటి ఉపాయాలతో అభివృద్ధిచేస్తే తప్పకుండా కోశం ధనంతో నిండుతుంది.

క. దమియింపఁ దగిన వారల । సమయమున దమించి, వారి సంపదలు మహీ
రమణుండు దనదు బండా । రముగా సమకూర్చు జనము రాగిల్లంగన్. 395

ప్రతిపదార్థం: మహీరమణుండు= భూ భర్త అయిన రాజు; దమియింపన్+తగిన వారలన్= అణచివేయవలసిన వారిని; సమయమునన్= తగిన సమయంలో శిక్షించి; వారి సంపదలు= వారి సంపదలన్నిటినీ; జనము= ప్రజలు; రాగిల్లంగన్= సంతోషించేటట్లు; తనదు బండారము+కాన్= తన బొక్కసంగా; సమకూర్చున్= నింపుకొంటాడు.

తాత్పర్యం: 'రాజు తగిన సమయంలో శిక్షించవలసినవారిని దండించి, వారి సంపదలన్నింటిని గ్రహించి, ప్రజలు సంతోషించేటట్లుగా తన బొక్కసాన్ని నింపుకోవాలి'.

క. ఆ పనికిఁ గీడు రోయుచు । భూపాలుఁడు ధనము గలుగు పురుషుల సిరిఁ దా
జూ పోపక కొనఁ దగదు, ద । యాపరుఁడై పెంపవలయు నఖిలజనములన్. 396

ప్రతిపదార్థం: భూపాలుఁడు= రాజు; ధనము+కలుగు= ధనమున్నట్టి; పురుషుల సిరిన్= ప్రజల సంపదలకు; చూపు+ఓపక= కన్నుగుట్టి; కొనన్+తగదు= బలవంతంగా స్వాధీనం చేసికొనకూడదు; ఆ పనికిన్+కీడు రోయుచున్= అట్లాంటి పనికి ఆపద

కలుగుతుందని అసహ్యించుకొని; దయాపరుఁడు+ఐ= కరుణాళువై; అఖిల జనములన్= సమస్త ప్రజలనూ; పెంపన్ వలయున్= అభివృద్ధి పరచాలి.

తాత్పర్యం: 'రాజు ధనవంతులైన ప్రజల సిరిసంపదలను చూచి ఓర్చుకొనలేక బలవంతంగా, అన్యాయంగా స్వాధీనం చేసికొనకూడదు. అట్లా చెయ్యటంవలన కీడు కలుగుతుందని గ్రహించి దయాంతఃకరణుడై అందరికీ ఆనందం కలిగించే రీతిలో ప్రజలను పాలించాలి'.

క. ప్రభువుల నుపచారంబుల । విభుఁ డనురాగిల్లఁ జేసి వెదగొనుఁ గాఁపుల్
సభయులు గాకుండ ధనం । బుభయ జగత్సిద్ధి పొంటె నుర్వీనాథా! 397

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ రాజా!; విభుఁడు= రాజు; ప్రభువులన్= సామంత రాజులను; ఉపచారంబులన్= తగిన గౌరవాదరాలతో; అనురాగిల్లన్+చేసి= కూరిమి నెరపి; కాఁపుల్= కర్షకులు; సభయులు+కాక+ఉండన్= భయంతో కూడినవారు కాకుండా; (భయ రహితంగా); ఉభయ జగత్+సిద్ధి పొంటెన్= ఇహపరలోకాలలో సిద్ధి పొందటంకొరకు; ధనంబు= సంపదను; వెద+కొనున్= అద నెరిగి గ్రహిస్తాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఉచితజ్ఞుడైన రాజు ఉభయలోకాలలో సిద్ధిపొందటంకొరకు సామంతరాజులను గౌరవాదరాలతో సమాదరించి కూరిమి నెరపి కర్షకులు భయభ్రాంతులు కాకుండా, అద నెరిగి పన్నులు వసూలు చేసి బొక్కసం నింపుకొంటాడు'.

క. ఆయతి కిమ్మెయిఁ గలుగు ను । పాయంబులు ధర్మమార్గ ఫలితంబులుగాఁ
జేయుటయును మేలు నృపతికి । మాయాకృతి నిపుణు డగుట మతిగాదు సుమీ! 398

ప్రతిపదార్థం: నృపతికిన్= రాజునకు; ఆయతికిన్+ఈ+మెయిన్+కలుగు= ధనసంపాదనకు (రాబడి) ఈ విధంగా కలిగే; ఉపాయంబులు= ఉచిత మార్గాలు; ధర్మమార్గఫలితంబులు+కాన్+చేయుటయును మేలు= ధర్మమార్గ ప్రయోజనాలుగా చేయటమే సముచితం; మాయాకృతి నిపుణుఁడు+అగుట= కపట కార్యాలలో నేర్పరి కావటం; మతి+కాదు సుమీ!= మంచిబుద్ధి లక్షణం కాదు సుమా!

తాత్పర్యం: 'రాజు ధనసంపాదనకు ఉచితమైన మార్గాలోచనల ఫలితంగా చేయటమే సముచితం. అంతేగాని, పన్నులు రాబట్టటంలో కపటోపాయాలలో నైపుణ్యం సాధించి ప్రవర్తించటం బుద్ధిమంతుడైన రాజునకు ఎంతమాత్రమూ సమంజసం కాదు'.

క. ధనము సవరించినఁ బ్రయో । జన మేమి యపాత్రములకుఁ జల్లి చెఱుచు నే
ని నరేంద్రముఖ్య! వ్యయములు । విను రక్షయ సిరికిఁ బాత్ర విషయము లైనన్. 399

ప్రతిపదార్థం: నర+ఇంద్ర ముఖ్య= రాజశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; వినుఁ= సావధానంగా వినుఁ; అపాత్రములకున్+చల్లి= అర్హులు కానివారికి వెదజల్లి; చెఱుచున్+ఏని= నాశనం చేసేటట్లయితే; ధనము సవరించినన్= ధనాన్ని సంపాదిస్తే మాత్రం; ప్రయోజనము+ఏమి= ఫలితం ఏమిటి?; పాత్ర విషయములు+ఐనన్= అర్హులైనవారి విషయంలో అయితే; వ్యయములు= వెచ్చించటాలు; సిరికిన్= సంపదలకు; రక్షయ= సంరక్షణమే.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! సావధానుడవై వినుము. అపాత్రదానం చేసి ధనం వినాశనం చేసేటట్లయితే ఆ ధన సంపాదనవలన ప్రయోజనం లేదు. అయితే పాత్రదానం చేసి సిరిసంపదలను వెచ్చిస్తే మాత్రం ఆ సంపదకు అది సంరక్షణమేగాని నిష్ప్రయోజనం మాత్రం కాదు. కాబట్టి పాత్రదానం ముఖ్యం.

విశేషం: ధనము ఉన్నందుకు దానం చెయ్యటమే ప్రయోజనం. ఊరికే కూడబెట్టినందువలన ప్రయోజనం లేదు. అయితే పాత్రా పాత్రవివేచన కలిగి దానం చెయ్యాలి. అర్హులైన వారికి దానం చేయటమనేది ముఖ్యం. అప్రాతదానం అనుచితం. పాత్రదానం చెయ్యటం వలన ఆ ధనానికి సంరక్షణమే గాని అన్యం కాదు' అని భీష్ముడి భావన.

వ. ఈ భంగి యైనం గోశ మిత్ర రాష్ట్ర బలంబులు వృద్ధిఁ బొందు; నీ విట్టి తెఱంగువాఁడవై ప్రజల రక్షింపుము. రణంబుల కలయక విరోధుల వధియింపుము మఖంబు లొనరింపుము ; దరిద్రులైన ధరణీసురాది సాధుల నరసి కుటుంబ రక్షణంబు సేయుము; మాంధాతృనకు నాంగిరసుం డగు నుతథ్యుండు సెప్పిన హిత వాక్యంబు లుపన్యసించెద; నాకర్ణింపుము. 400

ప్రతిపదార్థం: ఈ భంగి+ఐనన్= ఈ పద్ధతిని నీవు పాటిస్తే; కోశమిత్ర రాష్ట్రంబులున్= భండాగారం, స్నేహితులు, రాష్ట్రం, సైన్యబలం మొదలైనవన్నీ; వృద్ధిన్+పొందున్= అభివృద్ధి చెందుతాయి; ఈవు+ఇట్టి తెఱంగువాఁడవు+ఐ= నీవు ఈ మార్గంలో నడుస్తూ; ప్రజలన్ రక్షింపుము= ప్రజలను కాపాడుము; రణంబులకున్+అలయక= యుద్ధాలకు భయపడక; విరోధులన్ వధియింపుము= శత్రువులను సంహరించుము; మఖంబులు+ఒనరింపుము= యజ్ఞయాగాదులు చేయుము; దరిద్రులు+ఐన= దారిద్ర్యంతో బాధపడుతున్న; ధరణీసుర+ఆది సాధులన్+అరసి= భూ దేవులైన బ్రాహ్మణులు మొదలైన సాధువులను గమనించి; కుటుంబ రక్షణంబు+చేయుము= అట్లాంటివారి కుటుంబాలను సంరక్షించుము (ఈ సందర్భంలో); మాంధాతృనకున్= మాంధాత అనే రాజుకు; ఆంగిరసుండు+అగు= అంగిరస వంశీకుడైన; ఉతథ్యుండు= ఉతథ్యుడనే మహర్షి; చెప్పిన హిత వాక్యంబులు= ప్రబోధించిన హిత వచనాలు; ఉపన్యసించెదన్+ఆకర్ణింపుము= ప్రసంగిస్తాను - సావధానంతో వినుము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఈ రీతిగా నీవు నడచుకొన్నట్లయితే నీ భాండాగారంతోపాటు మిత్రబృందం, రాష్ట్రం, సైన్యం అభ్యున్నతి పొందుతుంది. కాబట్టి, ఈ మార్గంలో పయనించి ప్రజలను రక్షించుము. యుద్ధాలకు భయపడవద్దు. పరాక్రమాన్ని ప్రదర్శించి శత్రువులను సంహరించుము. యజ్ఞయాగాదులు ఆచరించి, దరిద్రులైన బ్రాహ్మణులు మొదలైన సాధుజనులను పరిశీలించి వారి కుటుంబాలను రక్షించుము. ఈ సందర్భంలో మాంధాతమహారాజునకు ఆంగిరసుడైన ఉతథ్యుడనే మహర్షి చెప్పిన హితవచనాలను ప్రసంగిస్తాను. సావధాన చిత్తుడవై వినుము' అని భీష్ముడు పలికాడు.

మాంధాతృన కుతథ్యుఁడు సెప్పిన హితవాక్యముల ప్రకారము (సం. 12-91-1)

తే. భూత వృద్ధులు ధనలాభములును గలుగు । ధర్మమును రాజనువాఁడు ధర్మరక్ష
కై జనించెను గావున నతఁ డరోష । కాముఁడై ధర్మనిరతుండు గాఁగ వలయు. 401

ప్రతిపదార్థం: ధర్మమునను= ధర్మంవలనే; భూతవృద్ధులు= ప్రాణికోటి అభివృద్ధులు; ధనలాభములును+కలుగున్= అత్యధిక ధనాభివృద్ధులు కలుగుతాయి; రాజు+అనువాఁడు= రాజనేవాడు; ధర్మరక్షణకున్+ఐ= ధర్మ సంరక్షణకొరకే; జనించెను= జన్మించాడు; కావునన్= కాబట్టి; అతఁడు= ఆ రాజు; అరోషకాముఁడు+ఐ= అహంకారం, కామం లేనివాడై; ధర్మనిరతుండు+కాఁగన్ వలయున్= ధర్మంపట్ల అత్యంతాసక్తి కలవాడై ఉండటం అవసరం.

తాత్పర్యం: 'ధర్మంవలననే ప్రాణికోటి అభివృద్ధి చెందుతుంది. అత్యంత ధనలాభం కలుగుతుంది. రాజనేవాడు ధర్మసంరక్షణకొరకే జన్మించాడు. అందుచేత అహంకార, కామ వివర్జితుడై ధర్మాసక్తుడై రాజు పరిపాలన చేయవలసి ఉంటుంది'.

క. వినుఁ ధర్మమునకు బ్రాహ్మణ । జనము జననదేశ మగుట జనపతి భక్తిం
గొనియాడి యసూయా వ । ర్జనుఁడై తగు విప్రకోటి సంభావింపన్. 402

ప్రతిపదార్థం: వినుఁ= సావధానుడవై వినుము; ధర్మమునకున్= ధర్మానికి; జననదేశము= పుట్టుకచోటు; బ్రాహ్మణ జనము= బ్రాహ్మణులే; అగుటన్= కావటంవలన; జనపతి= రాజు; అసూయావర్జనుఁడు+ఐ= అసూయను తొలగించుకొన్నవాడై (లేనివాడై); విప్రకోటి(న్)= బ్రాహ్మణ సమూహాన్ని; భక్తిన్+కొనియాడి= భక్తితో ప్రశంసించి; సంభావింపన్+తగున్= గౌరవించటం యుక్తం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! సావధానుడవై వినుము. ధర్మానికి జన్మస్థానం బ్రాహ్మణులే. కాబట్టి రాజు అసూయా రహితుడై బ్రాహ్మణ సమూహాన్ని పూజించి గౌరవించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది'.

చ. అనిమిషులున్ విభీతు లగునట్టి పదంబునఁ బేర్చి మున్ విరో
చన తనయుండు భూమిసురజాతి సువృత్తి కసూయచేసి నె
ట్టన సిరిఁ బాయడే? బలి దృఢంబగు భక్తివిశేషమూఁదఁగా
ననఘ! యతండు దాఁ బిదప నవ్యయసౌఖ్య విభూతి నొందఁడే? 403

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; మున్= పూర్వం; విరోచన తనయుండు= విరోచనుడి కుమారుడు; బలి= బలిచక్రవర్తి; అనిమిషులున్= దేవతలు సైతం; విభీతులు+అగునట్టి= భయపడేటట్లు; పదంబునన్+పేర్చి= పదవిలో అతిశయించి; భూమిసురజాతి= బ్రాహ్మణజాతి; సువృత్తికిన్+అసూయచేసి= ఉత్తమ ధర్మమార్గానికి అసూయపడి; నెట్టన= అనివార్యంగా; సిరిన్+పాయఁడే?= సంపదను పోగొట్టుకొనలేదా?; దృఢంబు+అగు= మిక్కిలి దృఢమైన; భక్తి విశేషము+ఊఁదన్+కాన్= భక్తి ప్రపత్తిని ఆధారం చేసుకొని; పిదపన్= ఆ తరువాత; అతండు= ఆ బలిచక్రవర్తి; తాన్= తాను; అవ్యయ సౌఖ్యవిభూతిన్= స్థిర సుఖ సంపదలను; ఒందఁడే?= పొందలేదా? (పొందాడు కదా!).

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! పూర్వం విరోచనపుత్రు డైన బలి దేవతలు సైతం భయభ్రాంతు లయ్యేటట్లు ఉన్నత పదవిలో విజృంభించి, బ్రాహ్మణుల ధర్మప్రవర్తనకు అసూయ పడి సమస్తసంపదలను కోల్పోయాడు. కాని, ఆ పిమ్మట దృఢమైన భక్తిప్రపత్తిని ఆధారం చేసికొనగా అతడే స్థిరమైన సుఖసంపదలను పొందాడు'.

ఆ. ధర్మమునకు సిరికిఁ దగ జనించినయది । దర్ప; మనిమిషులు నుదాత్తమునులు
నైన నగ్గుణమున నూనినఁ జెడుదురు । దాని గెలువవలయు ధరణిపునకు. 404

ప్రతిపదార్థం: ధర్మమునకున్= ధర్మానికి; సిరికిన్= సంపదకు; దర్పము= గర్వం; తగన్ జనించిన అది= పుట్టింది; అనిమిషులున్= దేవతలైనా; ఉదాత్తమునులున్+ఐనన్= ఉత్తమ మహర్షులైనా; ఆ+గుణమునన= ఆ గర్వమనే గుణాన్నే; ఊనినన్= పూనినట్లయితే; చెడుదురు= నాశనమౌతారు; ధరణిపునకున్= రాజు; దానిన్ గెలువన్ వలయున్= దానిని గెలువ వలసి ఉన్నది.

తాత్పర్యం: 'ధర్మానికి, సంపదకు దర్పమనే దుర్గుణం పుట్టింది. అయితే దేవతలైనా, మునీశ్వరులైనా ఆ దుర్గుణానికి లోనైతే నాశనమైపోతారు. కాబట్టి రాజు ఈ దర్పమనే దుర్గుణాన్ని నిశ్శేషంగా జయించవలసి ఉంటుంది.'

మ. పరనారీగమనాదిదోషములు భూపాలుండు సేయంగఁ ద
ద్ధరకున్ వర్షము లేకయుండుఁ; బ్రజకున్ దైన్యంబు వాటిల్లుఁ; బె
క్కు రుజల్ పైకొను; నెందునుం గలయ నుక్కుం దేజముం దక్కు ;ను
ద్ధుర సైన్యంబుల శత్రు లొత్తుదురు; బంధుశ్రేణికిం జే టగున్. 405

ప్రతిపదార్థం: భూపాలుండు= రాజు; పరనారీగమన+ఆది దోషములు= పరస్త్రీని కోరి పొందటం మొదలైన తప్పిదాలు; చేయంగన్= చేయటంవలన; తద్+ధరకున్= ఆ రాజ్యంలో; వర్షము లేక+ఉండున్= వానలు కురవకుండా పోతాయి; ప్రజకున్= ప్రజలకు; దైన్యంబు+పాటిల్లున్= దీన భావం కలుగుతుంది; పెక్కు రుజల్= అనేక రోగాలు; సైకొనున్= పైబడి వ్యాపిస్తాయి; ఎందునున్+కలయన్= అన్నిచోట్లా వ్యాపించి; ఉక్కున్+తేజమున్+తక్కున్= పరాక్రమమూ, తేజస్సూ నశించిపోతాయి; శత్రులు= శత్రువులు; ఉద్దుర సైన్యంబులన్= బలమైన సైన్యాలతో; ఒత్తుదురు= బాధిస్తారు (నాశనం చేస్తారు); బంధుశ్రేణికిన్= బంధువుల సమూహానికి; చేటు+అగున్= కీడు కలుగుతుంది.

తాత్పర్యం: 'రాజు పరస్త్రీలోలత్వం మొదలైన దుర్గుణాలతో ప్రవర్తిస్తే అతడి రాజ్యంలో వర్షాలు కురువవు. ప్రజలు దైన్యానికి లోనవుతారు. అనేక రోగాలు వ్యాపిస్తాయి. అవి అన్నిచోట్లా వ్యాపించటంవలన పరాక్రమమూ తేజస్సూ నశిస్తాయి. శత్రువులు బలమైన సైన్యంతో బాధిస్తారు. బంధుజనులకు కీడు కలుగుతుంది'.

విశేషం: కాబట్టి రాజు ఉత్తమ గుణ సంపన్నుడై, దుశ్శీలుడు గాక సమస్త ప్రజానీకానికి ఆదర్శ ప్రాయుడై ఉండి ప్రజలను కన్న సంతానంవలె పోషించాలి. వాస్తవానికి రాజు దుష్టుడైతే ప్రజలు అదే రీతిగా ఉంటారు. ఈ భావానికి మూలం 'యథారాజా తథాప్రజా' అనే సూక్తి.

క. కాని చెయిదములు సేయ క । నూనపు ధర్మమున నడచు నుర్వీశుఁడు సం
తానము బంధులుఁ బ్రజయును । దానును సేనలును శుభము దలకొనఁ బేర్చున్.' 406

ప్రతిపదార్థం: కాని చెయిదములు+చేయక= కానిపనులు చేయకుండా; అనూనపు ధర్మమునన్ నడచు= పరిపూర్ణ ధర్మమార్గంలో నడిచే; ఉర్వీ+ఈశుఁడు= భూమికి భర్త అయిన రాజు; తానును= తానూ; సంతానమున్= పుత్ర పౌత్రాదులూ; బంధువులున్= బంధువులు; ప్రజయునున్= ప్రజలూ; సేనలును= చతురంగ బలాలూ; శుభము+తలకొనన్+పేర్చున్= అత్యంత శుభాలు చేకూరి అతిశయిస్తారు.

తాత్పర్యం: 'చెడ్డపనులు చేయకుండా, పరిపూర్ణ ధర్మమార్గంలో నడచుకొనే రాజు సంతానం, బంధుమిత్రులు, ప్రజలు, చతురంగబలాలు మొదలైన సమస్తశుభాలతో కలకాలం సంతోషంగా జీవిస్తారు'.

విశేషం: పైన పేర్కొన్నట్లు రాజు ఉత్తమ గుణఖని అయితే సమస్త ప్రజలూ సుఖసంపదలతో విలసిల్లుతారు. రాజు సంతానం, బంధుమిత్రులు ఆనందిస్తారు.

వ. అని యిట్లు సెప్పిన వాక్యంబులం దెలివొంది ధర్మతత్పరుండై మాంధాతృండు మహావిభూతిం బొంది నెగడె; నీవును నట్ల నెగడు' మనిన ధర్మతనయుండు 'ధర్మంబున నెగడ దొరకొనుట యెట్టి భంగిం గలుగు?'నని యడుగుటయు, నతనితో నక్కురుపితామహుండు దొల్లి కౌసల్యుం డగు వసుమనుం డనురాజు వామదేవ మహాముని నిట్ల యడిగిన నతం డతనికి నుపదేశించిన తెఱం గెఱిఁచెద విను మని యిట్లనియె. 407

ప్రతిపదార్థం: అని+ఇట్లు+చెప్పిన వాక్యంబులన్= అని ఈ విధంగా ఉతథ్యుడనే మహర్షి చెప్పిన వచనాల వలన; తెలివి+ఒంది= బుద్ధిమంతు డైన; ధర్మతత్పరుండు+ఐ= ధర్మాసక్తుడై; మాంధాతృండు= మాంధాత అనే రాజు; మహావిభూతిన్+పొంది నెగడెన్= గొప్ప సంపదలను పొంది ప్రసిద్ధి గాంచాడు; ఈవునున్= నీవూ; అట్ల నెగడుము+అనినన్= అదే రీతిగా ప్రసిద్ధి పొందుమని అనగా; ధర్మతనయుఁడు= ధర్మరాజు; ధర్మంబునన్= ధర్మమార్గంలో; నెగడన్ దొరకొనుట= వర్ధిల్లటానికి పూనుకొనటం; ఎట్టి భంగిన్+కలుగున్+అని+అడుగుటయున్= ఏ విధంగా సాధ్యమౌతుందని అడుగగా; అతనితోన్= ఆ ధర్మరాజుతో; ఆ+కురు పితామహుండు= ఆ కౌరవ పితామహుడైన భీష్ముడు; తొల్లి= పూర్వం; కౌసల్యుండు+అగు= కోసలదేశాధీశు డైన;

వసుమనుండు+అనురాజు= వసుమనుం డనే రాజు; వామదేవ మహామునిన్+ఇట్లు+అ+అడిగినన్= వామదేవుడనే మహర్షిని ఇదే రీతిని అడుగగా; అతండు+అతనికిన్= ఆ వామదేవుడు వసుమనునికి; ఉపదేశించిన తెఱంగు+ఎఱిఁగించెదన్= ప్రబోధించిన తీరును తెలుపుతాను; వినుము+అని= వినవలసిందని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'రాజు ధర్మవర్తనుడు కావాలని ఉతథుడు చెప్పగా విన్న మాంధాత జ్ఞానవంతుడై ధర్మాసక్తితో నడచుకొని సమస్త సంపదలతో వర్ధిల్లాడు. అదే రీతిగా నీవు సైతం ప్రసిద్ధి పొందవలసిం'దని భీష్ముడు ధర్మరాజుకు ఉపదేశించాడు. అప్పుడు ధర్మరాజు ధర్మమార్గానువర్తనంతో ఏ రీతి ప్రఖ్యాతి పొందవచ్చునో చెప్పవలసిందని కోరగా భీష్ముడు కోసలదేశాధిపతి అయిన వసుమనుడు అనేరాజు వామదేవుడనే మహర్షిని ఇదే రీతిగా ప్రశ్నించినప్పుడు అతనికి ప్రబోధించిన తీరును వివరిస్తాను విను మని చెప్పాడు.'

వసుమనుం డను రాజునకు వామదేవుండు సెప్పిన ధర్మప్రకారము (సం. 12-93-1)

ఆ. అర్థసిద్ధికంటె నరయ నెక్కుడు ధర్మ । సిద్ధి; దాన సకల సిద్ధులును బ్ర
శస్త భంగిఁ జేరు; శాశ్వత కీర్తియు । సంభవించుఁ; గలుగు సద్గతియును. 408

ప్రతిపదార్థం: అరయన్= పరిశీలించగా; అర్థసిద్ధికంటెన్= ధన సంపాదనకంటె; ధర్మార్థ సిద్ధి ఎక్కుడు= ధర్మాన్ని సిద్ధింపజేసికొనటమే మంచిది; దానన్= దానివలన; ప్రశస్త భంగిన్= ప్రఖ్యాత పద్ధతిలో; సకల సిద్ధులునున్= సమస్తమైన ప్రయోజనాలు; చేరున్= సమకూరుతాయి; శాశ్వత కీర్తియున్ సంభవించున్= శాశ్వత కీర్తికూడా కలుగుతుంది; సత్+గతియును కలుగున్= ఉత్తమ లోకాలు ప్రాప్తిస్తాయి.

తాత్పర్యం: 'పరిశీలించి చూడగా, ధనసంపాదనకంటె ధర్మాన్ని సిద్ధింపజేసికొనటం శ్రేష్ఠం. ధర్మసిద్ధివలన సమస్త ప్రయోజనాలూ సిద్ధిస్తాయి. శాశ్వతకీర్తితోపాటు ఇహపరలోకాలలో సిద్ధి కలుగుతుంది.

క. ధనమునకై ధర్మము దెస । ననాదరము సేసెనేని నా నృపతికి న
ద్ధనమును జెడు; దుర్యశముం । బనుగొనుఁ దుది దుర్గతియును బాటిలు ననఘా! 409

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; ధనమునకున్+ఐ= ధనం కూడబెట్టటం కొరకు; ధర్మము దెసన్= ధర్మాన్ని గూర్చి; అనాదరము+చేసెన్+ఏనిన్= అశ్రద్ధతో ఉన్నట్లయితే; ఆ నృపతికిన్= అట్లాంటి రాజునకు; ఆ+ధనమును+చెడున్= ఆ సంపాదించిన ధనమూ నశిస్తుంది; దుస్+యశమున్+పనుగొనున్= దుష్కీర్తి కలుగుతుంది; తుదిన్= చివరకు; దుస్+గతియున్+పాటిలున్= నరకలోకం ప్రాప్తిస్తుంది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ధనం కూడబెట్టటమే ధ్యేయంగా భావించి ధర్మాన్ని లెక్కచేయకపోతే, ఆ రాజు సంపాదించిన ధనం నాశనం కావటమే కాక, అతడికి దుష్కీర్తి, నరక ప్రాప్తి సంభవిస్తాయి.

క. లాభంబు ధర్మముఖ్యము । గా భరపడి మార్గశుద్ధి గనుఁగొని కైకో
లా భూవరునకు నిహపర । శోభనములు సేఁత చెప్పు శ్రుతి వాక్యంబుల్. 410

ప్రతిపదార్థం: ధర్మముఖ్యముగాన్= ధర్మ ప్రధానంగా; లాభంబు= ధన లాభాన్ని; భరపడి= భరించి; మార్గశుద్ధి+కనుఁగొని= ఉత్తమ మార్గమని భావించి; కైకోలు= గ్రహించట మనేది; ఆ భూవరునకున్= ఆ రాజునకు; ఇహపర శోభనములు+చేఁత= ఐహికాముష్మిక సుఖాల ప్రాప్తి (అని); శ్రుతి వాక్యంబుల్ చెప్పున్= వేదవాక్యాలు వక్కాణిస్తున్నాయి.

తాత్పర్యం: 'ధార్మికదృష్టితో ధనార్జన చేయటం ఉత్తమమార్గంగా భావించే రాజునకు ఇహపరసౌఖ్యాలు దక్కుతాయని శ్రుతివాక్యాలు చెప్పుతున్నాయి.'

క. ధర్మ ప్రవృత్తియయ్యును । ధర్మము నా కింతకంటెఁ దత్తద్విధులం
బేర్మిం బొరయ వలయు నను । ధార్మికతాతృష్ణ నత్యుదాత్తుఁడు పొందున్.' 411

ప్రతిపదార్థం: ధర్మ ప్రవృత్తి+అయ్యును= ధర్మస్వభావం కలిగి ఉండి కూడా; ధర్మము= ధర్మమార్గం; నాకున్+ఇంతకంటెన్= నాకు దీనికంటె; తద్+తద్+విధులన్= ఆయా కార్యకలాపాలలో; పేర్మిన్+పొరయన్ వలయున్+అను= అతిశయితంగా కలగాలని; ధార్మికతా తృష్ణన్= ధర్మమార్గ దాహంతో; అతి+ఉదాత్తుఁడు+పొందున్= మిక్కిలి ఉత్తముడు పొందుతాడు.

తాత్పర్యం: 'ధర్మస్వభావం కలవాడైనా తా ననుసరించే ధర్మమార్గం మరింతగా - అంటే ఇబ్బడిముబ్బడిగా, తాను ఆచరించే ఆయా విధులలో మిక్కిలి అతిశయితమై ఒప్పాలని ధర్మంమీది దాహంతో మిక్కిలి ఉదాత్తుడైన రాజు ఉత్తమ ఫలితాలను పొందుతాడు.'

వ. అని తన వచనంబులం దెలివొందిన వసుమనుండను రాజుతో వామదేవుండు రాజ్యతంత్రంబున కెల్ల నాధార భూతంబు లగు సామ భేద దానదండంబులం బ్రయోగించు తెఱం గెఱిఁంచెద నాకర్ణింపు మని యిట్లనియె. 412

ప్రతిపదార్థం: అని తన వచనంబులన్= అని వామదేవుడి పలుకులవలన; తెలివి+ఒందిన= గ్రహించిన (తెలిసికొన్న); వసుమనుండు+అనురాజుతోన్= వసుమనుడనేరాజుతో; వామదేవుండు= వామదేవుడనే మహర్షి; రాజతంత్రంబునకున్+ఎల్లన్= రాజ్య వ్యాపార నిర్వహణానికి అంతటికీ; ఆధార భూతంబులు+అగు= ప్రధాన ఆధారమైన; సామభేద దాన దండంబులన్= సామం, భేదం, దానం, దండం అనే చతురుపాయాలను; ప్రయోగించు తెఱంగు+ఎఱిఁగించెదన్= పాటించే విధానాన్ని వివరిస్తాను; ఆకర్ణింపుము+అని+ఇట్లు+ అనియెన్= సావధానుడవై వినవలసిందని ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'అని వామదేవుడి మాటల సారాన్ని గ్రహించిన వసుమనుడనే రాజుతో వామదేవుడు మళ్ళీ రాజ్యపాలన వ్యవహారాన్ని నడిపించటానికి ప్రధాన ఆధారమైన సామ దాన భేద దండోపాయాలనే చతురుపాయాల ప్రయోగ విధానాన్ని వివరిస్తాను; సావధాన చిత్తుడవై వినవలసిన' దని ఇట్లా వివరించాడు.

క. మూలబలము సంతుష్టం । బై లాలిత మగుచునున్న యప్పు డసదుఁ జో
టాలోకించి నడవ భూ । పాలకునకు దండ మతిశుభం బొనరించున్. 413

ప్రతిపదార్థం: మూలబలము= చతురంగ బలంలోని ప్రధాన సైన్యం; సంతుష్టంబు+ఐ= సంతృప్తి పొంది; లాలితము+అగుచున్+ఉన్న+ అప్పుడు= లాలింపబడుతున్నప్పుడు; అసదు+చోటు+ఆలోకించి= శత్రువుల అసమర్థతను కనిపెట్టి; నడవన్= శత్రువులపై యుద్ధానికి వెళితే; భూపాలకునకున్= రాజుకు; దండము= సామదాన భేద దండాలలో దండనీతి; అతిశుభంబు+ఒనరించున్= మిక్కిలి శుభాన్ని చేకూరుస్తుంది.

తాత్పర్యం: 'తన చతురంగ బలాలలో మూలబలం - అంటే ప్రధానసైన్యం - శత్రుసంహారార్థమని భావించి సంతృప్తిపొంది సంతోషంతో దానిని ప్రేమగా చూస్తున్నప్పుడు శత్రువుల అసమర్థతను గమనించి, యుద్ధానికి వెళ్ళితే రాజునకు దండనీతివలన మిక్కిలి శుభం కలుగుతుంది.

చ. సమరము సాహసం బధిక సంపద లమ్మెయిఁ దెచ్చికోలు ప
థ్యమె రిపు లేల కల్గు దురహంకృతి పెంపును నుత్కటంపుఁ గో
పము మగిడింపఁజాలు నరపాలున కట్లగుటన్ హితంబు సా
మము దనయంతవాఁ డయిన మానవనాథు నెడన్ మహీశ్వరా! 414

ప్రతిపదార్థం: మహీ+ఈశ్వరా!= ఓ రాజా!; సమరము= యుద్ధమనేది; సాహసంబు= సాహసంతో కూడినపని; ఆ+మెయిన్= ఆ రీతిగా; అధిక సంపదలు= మిక్కిలి సిరిసంపదలను; తెచ్చికోలు పథ్యమె?= సంపాదించటం హితమేమీ కాదు; అహంకృతి పెంపునున్= అతిశయితమైన అహంకారాన్ని; ఉత్కటము+కోపమున్= అత్యధికమైన కోపాన్ని; మగిడింపన్+చాలు= ఉపసంహరించుకొనగల సమర్థుడైన; నరపాలునకున్= రాజునకు; రిపులు+ఏల కల్గుదురు?= శత్రువులు ఎందుకుంటారు?; అట్లు+అగుటన్= అట్లా కావటంవలన; తన+అంతవాఁడు+అయిన= తనతో సమానుడైన; మానవ నాథు+ఎడన్= రాజుపట్ల; సామము హితంబు= సామ దాన భేద దండోపాయాలనే చతురుపాయాలలో మొదటిదైన సామమే సముచితమైనది.

తాత్పర్యం: 'ఓ రాజా! యుద్ధమనేది సాహసకృత్యం. యుద్ధం చేసి శత్రు సంహారంవలన సంపాదించే సిరిసంపదలు మేలు కలిగించవు. అతిశయితమైన అహంకారాన్ని, అత్యధికకోపాన్ని తగ్గించుకొనగలిగిన సమర్థుడైన రాజునకు శత్రువులు ఎట్లా ఉంటారు? అందువలన ఎదుటి రాజు తనంతటి శత్రువని గ్రహించినప్పుడు సామోపాయంతో ప్రవర్తించటం శ్రేష్ఠం.'

క. తన భటులు గలఁగినప్పుడు। ధన మిచ్చి విరోధి నల్పతరు నైనను శాం
తునిఁ జేయవలయు దానము। నన యధికునిఁ దేర్చు టురవు నరపతి కెపుడున్. 415

ప్రతిపదార్థం: తన భటులు= తన సైన్యంలోని వీరులు; కలఁగినప్పుడు= కలత చెందినప్పుడు (అంతఃకలహాలతో ఉన్నప్పుడు); అల్ప తరున్+ఐనన్= బలహీనుడైనా సరే; విరోధిన్= శత్రువును; ధనము+ఇచ్చి= ధనాన్ని ఇచ్చి; శాంతునిన్+చేయన్ వలయున్= శాంతుడిని చేయటమే మంచిది; ఎప్పుడున్= ఎల్లప్పుడు; నరపతికిన్= రాజునకు; అధికునిన్= తనకంటె బలవంతుడైన శత్రువును; దానమునన= సామ దాన భేద దండోపాయాలలో దానం చేతనే; తేర్చుట+ఉరవు= సంతృప్తి పరచటమే సముచితం.

తాత్పర్యం: 'తన సైన్యంలోని అంతఃకలహాలు చెలరేగితే బలహీనుడైన శత్రువునైనా ధనం ఇచ్చి సంతృప్తి పరచటమే మంచిది. రాజునకు తన కంటె బలవంతుడైన శత్రువును దానం అనే ఉపాయంతో వశం చేసికొనటమే సముచితం'.

తే. ఆ యుపాయముల్ మూఁటికి ననువుగాని। యట్టి పగతునియెడ భేద మాచరింప
వలయు రంధ్రముల్ దగవేచు వలను గలిగి। తత్పరతఁ జేయఁజాలు సాధకులఁ బనిచి. 416

ప్రతిపదార్థం: ఆ+ఉపాయముల్+మూఁటికిన్= ఆ సామ దాన దండోపాయా లనే మూటికి; అనువు+కాని= సాధ్యంకాని; అట్టి పగతుని+ఎడన్= అట్లాంటి శత్రువుపట్ల; రంధ్రముల్= లోపాలను గ్రహించి; తగన్ వేచువలను+కలిగి= తగినట్లు బాధించే అవకాశం కలిగి; తత్పరతన్+చేయన్+చాలు= శ్రద్ధతో చేసే సమర్థులైన; సాధకులన్+పనిచి= కార్యసాధకులను పంపించి; భేదము+ఆచరింపన్ వలయున్= భేదోపాయాన్ని ప్రయోగించవలసి ఉంటుంది.

తాత్పర్యం: 'పైన పేర్కొన్నట్లు సామ దాన దండోపాయాలనే మూడింటికి అవకాశం లేనప్పుడు శత్రువుపట్ల కలిగిన లోపాలను పరిశీలించి తగినవిధంగా బాధించే అవకాశం కలిగినప్పుడు శ్రద్ధతో కార్యాన్ని సాధించగలవారిని భేదోపాయానికి నియోగించటం సముచితం'.

విశేషం: ఇంతవరకు సామ దాన భేద దండోపాయాలనే నాలుగింటి ప్రయోగం ఎట్లా చేయాలో రాజు శత్రువులపట్ల ఎట్లా ప్రవర్తించాలో విదితం చేయబడింది.

వ. శుక్రమతంబునం బంచమోపాయంబైన యుపేక్ష వర్తిల్లు దానిం బ్రయోగించు భంగియుం జెప్పెద.417

ప్రతిపదార్థం: శుక్రమతంబునన్= శుక్రాచార్యుడి అభిప్రాయం ప్రకారం; పంచమ+ఉపాయంబు+ఐన+ఉపేక్ష వర్తిల్లున్= సామ దాన భేద దండోపాయాలు కాక ఐదో ఉపాయమైన ఉపేక్షా భావం ఒప్పుతుంది; దానిన్+ప్రయోగించు భంగియున్+చెప్పెదన్= ఆ ఉపేక్షా భావాన్ని ప్రయోగించే విధానాన్ని సైతం వివరిస్తాను.

తాత్పర్యం: 'శుక్రాచార్యుడి అభిప్రాయం ప్రకారం సామ దాన భేద దండోపాయాలు కాక, ఉపేక్షా భావమనే మరో ఐదో ఉపాయం ఉన్నది. దానిని ప్రయోగించే తీరు తెన్నులను వివరిస్తాను'.

మ. కలహంబుల్ దమలోనఁ జేసిన నుపేక్షానైపుణం బొప్ప శ
త్రులఁ జూడందగు భూతదానవుల పోరుం జూచిన ట్లెమ్మెయి
న్ములు ముంటం దగఁ బుచ్చు భంగి గలుగు న్భూనాథ! కీడైన మం
త్రులయేపున్ విభుఁ డిట్ల మాపునది నేర్పుం బెంపుఁ బొల్పారఁగన్. 418

ప్రతిపదార్థం: భూనాథ!= ఓ రాజా!; కలహంబుల్= పోట్లాటలు; తమలోనన్+చేసినన్= తమలో తమకు కలిగినట్లయితే; ఉపేక్షా నైపుణంబు+ఒప్పన్= ఉపేక్షాభావంలో నేర్పు నైపుణ్యం ఒప్పేటట్లుగా; భూత దానవుల పోరున్+చూచిన+అట్లు= భూతాలకు రాక్షసులకు కలిగిన యుద్ధాన్ని చూసినట్లుగా; శత్రువులన్+చూడన్+తగున్= శత్రువులను చూడవలసింది; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; ములు ముంటన్+తగన్+పుచ్చు భంగి+కలుగన్= ముల్లును ముల్లుతో తీసే తీరుగానే చూడాలి; విభుఁడు= రాజు; కీడు+ఐన= ఆపదను కలిగించే; మంత్రుల+ఏపున్= మంత్రుల అతిశయాన్ని; ఇట్లు+ ఇదే విధంగా; నేర్పున్= నేర్పరితనమూ; పెంపున్= ఆధిక్యమూ; పొల్పు+ఆరఁగన్= మిక్కిలి అతిశయించేటట్లుగా; మాపునది= తొలగించేది.

తాత్పర్యం: 'ఓ రాజా! వైరం తమలో తమకే కలిగితే భూత రాక్షసులకు యుద్ధం జరిగితే ఉపేక్షించినట్లు, శత్రువులను ఉపేక్షాభావంతో చూడవలసి ఉంటుంది. ఏ విధంగానైనా ముల్లును ముల్లుతో తీసే తీరులోనే చూడాలి. రాజు తనకు ఆపదలు కలిగించే మంత్రుల అతిశయాన్ని ఇదే విధంగా తన నేర్పరితనంతో, ఆధిక్యంతో తొలగించవలసి ఉంటుంది. ఇది సామదానభేద దండోపాయాలనే నాలుగు కాక ఉపేక్ష అనే ఐదో ఉపాయం. ఇది శుక్రనీతి ప్రకారం కొనసాగింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అని యత్తెఱంగున వామదేవుండు సెప్పిన హితవచనంబులు వాటించి కోసలపతి భాసమానుండయ్యెఁ నీవును నట్ల వర్తిల్లి వలెయు'మనినఁ బాండవాగ్రజుండు 'సమరంబున శత్రుల జయించునప్పటి పాడి యెట్లుండు?' నను టయు భీష్ముం డతని కిట్లనియె. 419

ప్రతిపదార్థం: అని+ఆ+తెఱంగునన్= అని ఆ విధంగా; వామదేవుండు= వామదేవుడనే మహర్షి; చెప్పిన హితవచనంబులు+పాటించి= చెప్పిన హిత వాక్యాలను ఆచరించి; కోసలపతి= కోసలాధిపతి అయిన వసుమను డనే రాజు; భాసమానుండు+అయ్యెన్= తేజస్వంతుడయ్యాడు; ఈవునున్= నీవుకూడా; అట్ల వర్తిల్లి వెలయుము+అనినన్= అదే రీతిగా రాజ్యపాలనం చేసి ప్రసిద్ధి పొందవలసిందని చెప్పగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; సమరంబునన్= యుద్ధంలో; శత్రుల జయించునప్పటి పాడి=

శత్రువులను జయించే సమయంలోని యుద్ధనీతి; ఎట్లు+ఉండున్+అనుటయున్= ఎట్లా ఉంటుందో అని అడుగగా; భీష్ముండు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'అని ఉపేక్షాభావం వహించే తీరును, వామదేవుడనే మహర్షి చెప్పిన హితవచనాలను అనుసరించి కోసలదేశాధిపతి అయిన వసుమను డనే రాజు, సూర్యసమతేజుడై వెలుగొందాడు; నీవూ అదే రీతిగా రాజ్యపాలన చేసి, ప్రకాశించవలసిం'దని చెప్పగా, ధర్మరాజు 'శత్రువులను జయించే సందర్భంలో యుద్ధనీతి ఎట్లా ఉంటుందో చెప్పు' మని అడుగగా భీష్ముడు ఈ విధంగా వివరించాడు.

ధర్మజునకు భీష్ముండు సమరంబున పాడి దెల్పుట (సం. 12-96-6)

సీ. పగవాఁడు బలములఁ బన్ని త్రోచినఁ దాను । సబలుఁడై యొంటిమై సంగరంబు
గోరిన నమ్మెయి గొనకొని మాయ లొ । నర్చిన మాయలఁ బేర్చి గెలుపు
గొనునది; వెన్నిచ్చినను బ్రమాదంబునం । బడినను గైదువు భగ్నమైన
శరణన్న మ్రొక్కినఁ దురగాళి యెడలిన । నొరుతోడఁ బోరుచునున్న నెట్టి

ఆ. పగతునైనఁ జంపఁ దగ దధర్మంబునఁ । జంపు కంటె ధర్మసమర కేలిఁ
జావు మేలు; రాజు శయ్యఁ జచ్చుట గొఱ । గాదు గాన యోడఁ గాదు పోర. 420

ప్రతిపదార్థం: పగవాఁడు= శత్రువు; బలములన్+పన్ని త్రోచినన్= సైన్యాలతో సిద్ధమై ఎదుర్కొంటే; తానున్ సబలుఁడు+ఐ= తాను కూడా సైన్యాలతో కూడినవాడై; ఒంటిమైన్= ఒంటరిగానే; సంగరంబు+కోరినన్= యుద్ధానికి సిద్ధమైతే; ఆ+మెయి+గొనకొని= అదేరీతిగా ప్రయత్నించి; మాయలు+ఒనర్చినన్= శత్రువులు మాయలు చేస్తే; మాయలన్+పేర్చి= మాయలచేతనే అతిశయించి; గెలుపు+కొనునది= విజయం సాధించాలి; వెన్ను+ఇచ్చినను= పారిపోతూ వీపు చూపినా; ప్రమాదంబునన్+పడినను= యుద్ధరంగంలో ప్రమాదవశాత్తు పడిపోయినా; కైదువు భగ్నమైనన్= ఆయుధం నాశనమైనా; శరణు+అన్నన్= రక్షణకోరినా; మ్రొక్కినన్= నమస్కరించినా; తురగ+ఆళి+ఎడలినన్= గుర్రాల సమూహం వికలమైనా (అంటే చచ్చినా, పారిపోయినా); ఒరుతోడన్= మరొక వ్యక్తితో; పోరుచున్+ఉన్నన్= యుద్ధం చేస్తున్నా; ఎట్టి పగతున్+ఐనన్= ఎట్లాంటి శత్రువునైనా; చంపన్+తగదు= చంపటం న్యాయం కాదు; అధర్మంబున్= ధర్మవిరుద్ధంగా; చంపుకంటెన్= చంపటంకంటే; ధర్మసమరకేలిన్= ధర్మయుద్ధ విహారంలో; చావు మేలు= చనిపోవటమే మంచిది; రాజు; శయ్యన్+చచ్చుట+కొఱగాదు= పడకమీదనే చనిపోవటం ప్రయోజనకారి కాదు; కాన= అందుచేత; పోరన్= యుద్ధంలో; ఓడన్+కాదు= ఓడిపోరాదు.

తాత్పర్యం: యుద్ధనీతి భీష్ముడు ధర్మరాజుకు ఉపదేశించాడు. 'యుద్ధంలో శత్రువు సైన్యాలతో సిద్ధమై ఎదుర్కొంటే నీవూ సైన్యంతో ఎదిరించాలి. శత్రువు ఎక్కటి కయ్యానికి సిద్ధమైతే నీవూ అసహాయ శూరుడవై యుద్ధం చెయ్యాలి. మాయోపాయాలతో శత్రువు యుద్ధం చేయటం ప్రారంభిస్తే నీవూ కపటోపాయాలతో ఎదిరించి విజయాన్ని సాధించాలి. వెన్నిచ్చి పారిపోయినా, ఏమరుపాటున పడిపోయినా, ఆయుధం భగ్నమైనా, శరణువేడుకొన్నా, మ్రొక్కినా, గుర్రాలు నేలపైకూలినా, పారిపోయినా, వేరొకడితో యుద్ధం చేస్తున్నా ఎట్లాంటి శత్రువునైనా చంపరాదు. అధర్మంగా శత్రువును చంపటంకంటె ధర్మయుద్ధవిహారంలో చావటం మంచిది. రాజు పడకమీద మరణించటం పనికిరాదు. అందుకని యుద్ధంలో ఓడిపోరాదు.

క. వినుఁ చిల్లయిడిన యాయుధ । మును విషలిప్తమగు శస్త్రమును నెట్టియ మి
త్రునిపై నైనఁ బ్రయోగిం । చిన నరపతి నరకమున వసించు నృపాలా! 421

ప్రతిపదార్థం: నృపాలా!= ఓ ధర్మరాజా!; వినుఁ= సావధానుడవై వినుము; చిల్ల ఇడిన+ఆయుధమును= అగ్రభాగంలో వంకరగా ఉండే ములికిని ఉంచి తయారుచేసిన ఆయుధాన్ని, విషలిప్తము+అగు= విషంపూసినదైన; శస్త్రమునున్= ఆయుధాన్ని; ఎట్టి+అమిత్రునిపైన్+ఐనన్= ఎట్లాంటి శత్రువుపై అయినా; ప్రయోగించిన= యుద్ధంలో ఉపయోగించిన; నరపతి= రాజు; నరకమున వసించున్= నరకాన్ని పొందుతాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! జాగరూకతతో వినుము. అగ్రభాగంలో ములికిని ఉంచి తయారుచేసిన ఆయుధాన్ని, లేదా విషంపూసిన ఆయుధాన్ని ఎట్లాంటి శత్రువుపైనైనా ప్రయోగించకూడదు. అట్లా ప్రయోగించే రాజునకు నరకప్రాప్తి తప్పదు. ఇది యుద్ధనీతిలో భాగం' అని భీష్ముడు వివరించాడు.

క. తనకుం దోడ్పడి యని నొ । చ్చిన వానిం గాంచి కడఁగి చేష్టింపక యు
న్న నరేంద్రుఁ బొందు పాపం । బునకుఁ గొలఁది గలదె భరతపుంగవ! తలఁపన్. 422

ప్రతిపదార్థం: భరత పుంగవ!= భరత వంశంలో శ్రేష్ఠుడైన ఓ ధర్మరాజా!; తలఁపన్= ఆలోచించగా; తనకున్+తోడ్పడి= తనకు సహాయం చేయవచ్చి; అనిన్= నొచ్చినవానిన్+కాంచి= యుద్ధంలో పీడితుడైన వాడిని చూచి; కడఁగి= పూనుకొని; చేష్టింపక+ఉన్న= పట్టించుకొనకుండా ఉన్న; నర+ఇంద్రున్= రాజును; పొందు పాపంబునకున్= పొందే పాపానికి; కొలఁది+కలదె?= ఇంత అని లెక్క ఉన్నదా?

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఆలోచిస్తే యుద్ధంలో తనకు సహాయం చేయటానికి వచ్చి ఘోరంగా పీడింపబడిన వాడిని పట్టించుకొనకుండా ఉండే రాజు భయంకరమైన పాపాన్ని పొందుతాడు'.

వ. అని చెప్పి వెండియు. 423

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ (ఇట్లా అన్నాడు).

చ. అరిపయిఁ బోయి వాని పుర మగ్గలికం జెఱుపంగఁ దద్ధరం
బరఁగు ప్రజం జలంబు మెయి బాధలఁ బెట్టు టధర్మమట్టి ని
ష్ఠురత యొనర్చుటప్పటికిఁ జూడఁగ మానఁగరాదయేని భూ
సుర గృహదేవగేహముల చూఱ నవశ్యము మాన్చు టొప్పగన్.' 424

ప్రతిపదార్థం: అరిపయిన్+పోయి= శత్రువుపై యుద్ధానికి వెళ్ళి; వాని పురము= ఆ శత్రువుయొక్క పట్టణాన్ని; అగ్గలికన్+చెఱుపంగన్= పరాక్రమంతో నాశనం చెయ్యటానికి; తద్+ధరన్+పరఁగు ప్రజన్= ఆ రాజ్యంలో నివసిస్తున్న ప్రజలను; చలంబు మెయిన్= మాత్సర్యంతో; బాధలన్+పెట్టుట+అధర్మము= బాధలకు గురిచేయటం ధర్మంకాదు; అట్టి నిష్ఠురత+ఒనర్చుట= అట్లాంటి కాఠిన్యం వహించటం; అప్పటికిన్+చూడఁగన్= ఆ సమయానికి (పరిశీలించగా); మానఁగన్ రాద+ఏనిన్= మానుకొనటం వీలుకాకపోతే; భూసురగృహ= బ్రాహ్మణుల ఇళ్ళను; దేవగేహములన్= దేవతా గృహాలను (దేవాలయాలను); చూఱన్= కొల్లగొట్టట మనేది; అవశ్యము= తప్పనిసరిగా; మాన్చుట+ఒప్పు+అగున్= వదలిపెట్టటమే సముచితమవుతుంది.

తాత్పర్యం: 'శత్రువుపై దండెత్తి పోయి అతడి పట్టణాన్ని నాశనం చేయటానికి అక్కడ నివసిస్తున్న ప్రజలను మాత్సర్యంతో బాధించటం అధర్మం. అట్లాంటి కాఠిన్యాన్ని మానుకొనటం, అప్పటికి వీలుకాకపోతే కనీసం బ్రాహ్మణుల ఇళ్ళను, దేవాలయాలను కొల్లగొట్టటం తప్పనిసరిగా మానుకొనటం సముచితం'.

వ. అనిన విని యజాతశత్రుండు 'రాజధర్మంబు కంటెం బాపకర్మంబు లేదు పొ'మ్మని పలికి 'యిట్లేని రాజున కెట్లును నధోగతి వాటిల్లఁ గదే!' యనుటయు నాపగాతనయుం డిట్లనియె. 425

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విని; అజాతశత్రుండు= పుట్టని శత్రువులుగల ధర్మరాజు; రాజధర్మంబు కంటెన్= రాజు ఆచరించవలసిన ధర్మంకంటే; పాపకర్మంబు లేదు పొమ్ము+అని పలికి= పాపకార్యం మరొకటి నిశ్చయంగా లేదని పలికి; ఇట్లు+ఏనిన్= ఇట్లాగైతే; రాజునకున్= రాజుకు; ఎట్లునున్= ఏ విధంగానైనా; అధః+గతి= దుర్గతి; పాటిల్లున్+కదే!= ప్రాప్తిస్తుంది కదా!; అనుటయున్= అనగా; ఆపగా తనయుండు+ఇట్లు+అనియెన్= దేవతల నది అయిన గంగ పుత్రుడైన భీష్ముడు ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'యుద్ధనీతిని భీష్ముడు విశదం చేయగా విన్న ధర్మరాజు 'రాజధర్మం కంటె మరొక పాపకార్యం నిశ్చయంగా లే'దని తన అసమ్మతిని తెలిపి, 'ఎట్లా చూచినా రాజుకు నరకప్రాప్తి తప్పటం లేదు కదా!' అని పలికినప్పుడు భీష్ముడు ఇట్లా వివరించాడు.

క. 'శరణాగతుఁ గాచియు, నని । నరిపోటులఁ బడ్డఁ దెచ్చి యరసియు, ధరణీ
సురులం బ్రోచియు, నానా । ధ్వరములు సేసియును రాజు దలుఁగు దురితముల్. 426

ప్రతిపదార్థం: శరణ+ఆగతున్+కాచియున్= శరణుకోరిన వాడిని రక్షించి; అనిన్+అరిపోటులన్+పడ్డన్= యుద్ధంలో శత్రువుల చేత దెబ్బలు తిన్నవాడిని; తెచ్చి+అరసియు= తీసికొని వచ్చి క్షేమాలపట్ల శ్రద్ధ వహించి; ధరణీసురులన్+ప్రోచియున్= భూదేవులైన బ్రాహ్మణులను పోషించి; నానా+అధ్వరములు+చేసియును= అనేక యజ్ఞయాగాలు చేసి; రాజు దురితముల్ తలుఁగున్= రాజు పాపాలను తొలగించుకొనవచ్చును.

తాత్పర్యం: 'శరణాగతులను సంరక్షించి, యుద్ధంలో శత్రువుల బాధలకు గురి అయినవారిని తెచ్చి, వారికి తగిన సేవచేసి, బ్రాహ్మణులను పోషించి, అనేక యజ్ఞాలను నిర్వహించి, రాజు పాపాలను పరిహరించుకొనవచ్చును.'

క. అన విని యమ్మనుజేశ్వరుఁ । 'డని ననివర్తు లయి శౌర్య మభినుతి కెక్కం
దనువుఁ దొఱంగిన వారికి । ననఘా! యెబ్భంగి లోక మగు?' నని యడిగెన్. 427

ప్రతిపదార్థం: అనన్ విని= అని చెప్పగా విని; ఆ+మనుజ+ఈశ్వరుండు= ఆ రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు; అనఘా!= పాపరహితుడ వైన తాతా!; అనిన్+అనివర్తులు+అయి= యుద్ధంలో వెనుదిరుగని వారై; శౌర్యము+అభినుతికిన్+ఎక్కన్= పరాక్రమం ప్రఖ్యాతి పొందగా; తనువున్+తొరంగినవారికిన్= శరీరం పోగొట్టుకొన్న వారికి (చనిపోయినవారికి); ఏ+భంగి లోకము+అగున్?= ఎట్లాంటి లోకాలు కలుగుతాయి?; అని+అడిగెన్= అని ప్రశ్నించాడు.

తాత్పర్యం: 'రాజధర్మాన్ని అనుసరించి ప్రజాసంరక్షణ చేస్తే ఉత్తమగతులు కలుగుతా' యని భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'యుద్ధంలో వెనుదీయక అరివీరభయంకరులై పరాక్రమసంపదను ప్రదర్శించి ప్రాణాలు కోల్పోయినవారికి ఎట్లాంటి లోకాలు కలుగుతాయో తెలుపు'మని భీష్ముడిని అడిగాడు.

వ. అడుగుటయు, నమ్మహీకాంతునితో 'శాంతనవుండు శక్రాంబరీష సంవాదంబు చెప్పెద; దాన నీ యడిగినయది దేటపడు నని యిట్లనియె. 428

ప్రతిపదార్థం: అడుగుటయున్= అని అడిగిన; ఆ+మహీకాంతునితోన్= ఆ ధర్మరాజుతో; శాంతనవుండు= భీష్ముడు; శక్ర+అంబరీష సంవాదంబున్= ఇంద్రుడికి అంబరీషుడికి మధ్య జరిగిన సంభాషణను; చెప్పెదన్= చెప్పుతాను; దానన్= దానివలన; నీ+అడిగిన+అది= నీవు అడిగిన ప్రశ్న; తేటపడున్= స్పష్టపడుతుంది; అని+ఇట్లు+అనియెన్= అని ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'అని ప్రశ్నించిన ధర్మరాజుతో భీష్ముడు 'ఇంద్రుడికీ అంబరీషుడికీ మధ్య జరిగిన సంభాషణను విశదం చేస్తాను; దానివలన నీవు అడిగిన ప్రశ్నకు చక్కటి సమాధానం లభిస్తుం'దని ఇట్లా వివరించాడు.

ఇంద్రాంబరీష సంవాద ప్రకారము (సం. 12-99-1)

సీ. అంబరీషుండు నానాధ్వరంబులు సేసి । కడచని వాసవు కడకు నేఁగి,
యచట నుజ్జ్వల విమానారూఢుఁ డును మనో । హరి సంక్రీడనోదారచరితుఁ
డును నై వెలింగెడు తనదు బంటు సుదేవుఁ । డను వానిఁ జూచి యయ్యనిమిషేంద్రు
తోడ మదీయభృత్యుఁడు వీఁడు క్రతుముఖ్య । కర్మముల్ సేయఁ డెక్కారణమున

తే. ననఘ! నాకంటెఁ గడుఁ బేర్చి యునికి గలిగె । ననుడు నా జిష్ణుఁ డిమ్మహాత్ముని తెఱంగు
సెప్పఁ జిట్టలు వినఁగ వాంఛించితేని । వినుము చెప్పెద' నని యిట్టు లనియెఁ బ్రీతి. 429

ప్రతిపదార్థం: అంబరీషుండు= అంబరీషుడనే రాజు; నానా+అధ్వరంబులు+చేసి= అనేక యజ్ఞాలు చేసి; కడచని= మరణించి; వాసవు కడకున్+ఏఁగి= ఇంద్రునివద్దకు వెళ్ళి; అచటన్= అక్కడనే; ఉత్+జ్వల విమాన+ఆరూఢుఁడును= ప్రకాశిస్తున్న విమానం ఎక్కినవాడు; మనఃహరిసమ్+క్రీడన+ఉదార చరితుఁడును+ఐ= మనోజ్ఞమైన చక్కగా క్రీడిస్తున్న ఉత్తమ ప్రవర్తన కలవాడై; వెలింగెడు= ప్రకాశిస్తున్న; తనదు బంటు= తన సేవకుడు; సుదేవుఁడు+అనువానిన్+చూచి= సుదేవుడనే వాడిని చూచి; ఆ+అనిమిష+ఇంద్రుతోడన్= దేవతలరాజైన ఇంద్రుడితో; అనఘా!= ఓ పాపరహితుడవైన మహేంద్రా!; వీఁడు మదీయ భృత్యుఁడు= యజ్ఞయాగాది కర్మలను ఆచరించలేదు; ఏ+కారణంబునన్= ఏ కారణంవలన; నాకంటెన్+కడున్+పేర్చి= నాకంటె మిక్కిలి అతిశయించి; ఉనికి+కలిగెన్= ఉండగలిగాడు (ఈ ఉన్నత స్థితిని పొందగలిగాడు); అనుడున్= అనగానే; ఆ జిష్ణుఁడు= ఆ ఇంద్రుడు; ఈ+మహాత్ముని తెఱంగు చెప్పన్+చిట్టలు= ఈ మహాత్ముడి గూర్చి చెబితే చాలా ఆశ్చర్యకరం; వినఁగన్ వాంఛించితి(వి)+ఏని= వినాలన్న కోరిక ఉంటే; వినుము చెప్పెదన్= విను చెప్పుతాను; అని ప్రీతిన్ ఇట్టులు+అనియెన్= అని సంతోషంగా ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'అంబరీషుడనే రాజు అనేక యజ్ఞయాగాలు చేసి, ఆ పుణ్యంతో మరణించి స్వర్గలోకానికి, ఇంద్రుడి సన్నిధికి వెళ్ళాడు. అక్కడ ప్రకాశమానమైన విమానంలో అధివసించి మనోజ్ఞ క్రీడావినోదాలలో నిమగ్నుడై ఉన్న సుదేవుడనేవాడిని చూచి ఇంద్రుడితో 'వీడు నా సేవకుడు. యజ్ఞయాగాది ముఖ్యకార్యాలు ఆచరించ లేదు. మరి వీడు ఎట్లా నాకంటె విశిష్టుడై ఉన్నతంగా వెలుగొందుతున్నాడు? అని ప్రశ్నించాడు. 'ఇతడి చరిత్ర మిక్కిలి విచిత్రమైనది. వినాలన్న కోరిక ఉంటే చెప్పుతాను వినుము' అని ఇంద్రుడు ఇట్లా చెప్పాడు.

వ. శతశృంగుం డనియెడి దానవుని తనూజులు సదముండును విదముండును దముండును ననియెడు వారలు. 430

ప్రతిపదార్థం: శతశృంగుండు+అనియెడి= శతశృంగు డనే; దానవుని తనూజులు= రాక్షసుడి కుమారులు; సదముండును విదముండును దముండునున్+అనియెడు వారలు= సదముడు, విదముడు, దముడు అనేవాళ్ళు.

తాత్పర్యం: శతశృంగుడనే రాక్షసుడి కుమారులైన సదముడు, విదముడు, దముడు అనేవాళ్ళు (తరువాతి పద్యంతో అన్వయం).

శా. బాహాగర్వము సూపఁగోరి పటుదర్పం బొప్ప నుగ్రాహవో
త్సాహం బూర్జితభంగిగా భయద ఘోషస్ఫీత నానావిధ
వ్యూహంబుల్ ధరణీప్రకంపనము లై యుద్దామ సర్వాంగ స
న్నాహత్వంబునఁ బేర్చి తోడ నడవ న్సంరంభ శుంభద్గతిన్. 431

ప్రతిపదార్థం: బాహాగర్వము+చూపన్+కోరి= భుజ పరాక్రమాన్ని ప్రదర్శించటానికి ఇష్టపడి; పటుదర్పంబు+ఒప్పన్= మిక్కిలి గర్వాతిశయంతో; ఉగ్ర+ఆహవ+ఉత్సాహంబు= భయంకరమైన యుద్ధంపట్ల ఉత్సాహంగా; ఊర్జిత భంగి+కాన్= దృఢరీతిగా; భయద ఘోష స్ఫీత నానావిధ వ్యూహంబుల్= భయాన్ని గొల్పుతున్న శబ్దాలతో అధికమైన అనేక యుద్ధ వ్యూహాలు; ధరణీ ప్రకంపనంబులు+ఐ= భూమి సంచలనాలు; ఉద్దామ సర్వ+అంగసన్నాహత్వంబునన్+పేర్చి= అధికమైన అన్ని చతురంగ సైన్యాలతో, పరికరాలతో ఆయత్తమై అతిశయించి; సంరంభ శుంభత్+గతిన్= ఆటోపంతో కూడిన తీవ్రవేగంతో; తోడన్ నడవన్= తమతోపాటు నడుస్తూ ఉండగా.

తాత్పర్యం: శతశృంగు డనే రాక్షసుడి పుత్రులైన సదముడు, విదముడు, దముడు అనే ముగ్గురు భుజ పరాక్రమాన్ని ప్రదర్శించదలచి అత్యధిక గర్వంతో భయంకర యుద్ధోత్సాహం అత్యంతమై ఒప్పగా భయంకరమైన శబ్దాడంబరంతో అనేక యుద్ధవ్యూహాలతో భూమి దద్దరిల్లేటట్లుగా ఎదురులేనట్టి చతురంగ బలసమన్వితులై అతిశయించి, ఆటోపంతో కూడిన మహాతీవ్ర వేగంతో తమతో పాటు నడుస్తూ ఉండగా.

విశేషం: తిక్కన వీరరసోదంచితంగా ఈ శార్దూలాన్ని రచించి, తన రసాభ్యుచిత బంధశైలిని స్పష్టం చేశాడు.

ఉ. 'మంచి మగండ వైన నిను మార్కొను వారయి దాడివెట్టి యొ
క్కించుక శంక లేక ప్రజయెల్లను బెగ్గిలముట్టి యర్థముల్
గొంచు ధరిత్రి గైకొనుటకుం గన లగ్గల మొంది యీతనిం
బంచితి సైన్యయుక్తముగఁ బార్థివ! యిట్లని పల్కి తత్తఱిన్. 432

ప్రతిపదార్థం: పార్థివ!= ఓ అంబరీష మహారాజా!; మంచి మగండవు+ఐన= గొప్ప వీరుడ వైన; నినున్= నిన్ను; మార్కొనువారు+అయి= ఎదిరించేవారై; దాడి+పెట్టి= దండెత్తివచ్చి; ఒక్క+ఇంచుక శంక లేక= కొంచెమైనా సందేహం లేకుండా; ప్రజ+ఎల్లను= ప్రజలంతా; బెగ్గిలన్ ముట్టి= భయ భ్రాంతు లయ్యేటట్లు ముట్టడించి; అర్థముల్+కొంచున్= ధన మపహరిస్తూ; ధరిత్రి+కైకొనుటకున్= రాజ్యం కైవసం చేసికొనటానికి; కనలు+అగ్గలము+ఒంది= కోపం అతిశయించి (కోపాతిశయంతో); ఈతనిన్= ఈ సుదేవు డనే వాడిని; సైన్యయుక్తముగన్= సైన్యసమేతంగా; పంచితి(వి)= పంపించావు; ఆ+తఱిన్= ఆ సమయంలో; ఇట్లు+అని పల్కితి= ఈ విధంగా పలికావు.

తాత్పర్యం: 'ఓ అంబరీష మహారాజా! గొప్పవీరుడ వైన నిన్ను ఎదిరించే వారై సదముడు, విదముడు, దముడు అనే ముగ్గురు దండెత్తి వచ్చి, ఏ మాత్రం సందేహించక ప్రజలందరినీ భయభ్రాంతులను చేసి ముట్టడించి, బాధించి, ధన మపహరించి రాజ్యం కైవసం చేసికొనటానికి కోపాతిశయంతో నీవు ఈ సుదేవుడిని సైన్యసమేతంగా పంపించావు. ఆ సమయంలో నీవు ఈ విధంగా పలికావు.

మ. పసగన్ వే చని దోర్బలంబున రణప్రావీణ్యముం జూపి నీ
వసురానీకముఁ ద్రుంచి భూప్రజలకున్ హర్షంబు గావించి రా
క సుమీ రాక; జయంబు లేక ప్రజ దుఃఖంబొందఁగా రాక నీ
యసువర్గంబుల పోకగా నెఱుఁగు పె క్కాడంగ నిం కేటికిన్? 433

ప్రతిపదార్థం: నీవు; పసగన్= చాతుర్యంతో; వే= శీఘ్రంగా; చని= యుద్ధానికి వెళ్ళి; దోన్+బలంబునన్= భుజపరాక్రమంతో; రణ-ప్రావీణ్యమున్= యుద్ధనైపుణ్యాన్ని; చూపి; అమర+అనీకమున్= రాక్షససేనను; త్రుంచి= ఖండించి; భూ-ప్రజలకున్= దేశప్రజకు; హర్షంబు= సంతోషం; కావించి= ఒనగూర్చి; రాక-సుమీ-రాక= రావటమే సుమా రావటం; జయంబు-లేక= గెలుపు లేకుండా; ప్రజ= దేశప్రజ; దుఃఖంబు+ఒందఁగాన్ రాక= దుఃఖం పొందేటట్టు రావడం; నీ+అసువర్గంబుల పోవ+కాన్= నీ ప్రాణసముదాయాల; పోవడంగా; ఎఱుఁగు(ము)= తెలిసికో; పెక్కు+ఆడంగన్= ఇంకెందుకు?

తాత్పర్యం: అంబరీషుడు సుదేవుడితో ఇట్లా అన్నాడు: 'ఓయి సుదేవా! నీవు చాతుర్యంతో వెంటనే యుద్ధానికి వెళ్ళి, నీ భుజపరాక్రమంతో యుద్ధనైపుణ్యం చూపి, రాక్షససేనను సంహరించి, దేశప్రజలకు సంతోషం ఒనగూర్చి, తిరిగి రావటమే రావటం. అట్లా కాక గెలుపు లేకుండా ప్రజలు దుఃఖించేటట్లు రావటం అంటే నీ ప్రాణాలు పోవటమే అని తెలిసికొమ్ము. ఇంక పలుమాట లెందుకు?'

మహాస్రగ్ధర:

అనినన్ సంగ్రామ కేళీవ్యవసన రసికుఁడై యట్లకాకంచు నిన్ వీ
డ్కొని యీతం డేఁగి తా నప్డు దనుజతతి యాటోపమున్ గూఢచారుం
డను దృష్టిం జూచి తా నిట్లను మనమున 'సైన్యంబు చే టేల? శత్రుం
గొననీ నేలా? పురారిం గొలుతు నతనికిం గోసియిత్తున్ శిరంబున్.' 434

ప్రతిపదార్థం: అనినన్= అని అంబరీషుడు చెప్పగానే; సంగ్రామకేళీ వ్యసన రసికుఁడు+ఐ= యుద్ధ క్రీడలో మిక్కిలి ఆసక్తి కలిగినవాడై; అట్ల కాక+అంచున్= అట్లాగే కానిమ్మని; నిన్ వీడ్కొని= నీవద్ద సెలవు పుచ్చుకొని; ఈతండు+ఏఁగి= ఈ సుదేవుడు యుద్ధానికి వెళ్ళి; తాను+అపుడు= అతడు ఆ సమయంలో; దనుజతతి+ఆటోపమున్= రాక్షసుల సమూహంయొక్క సంభ్రమాన్ని; గూఢచారుండు+అనుదృష్టిన్+చూచి= చారుడు అనుసరించిన దృష్టితో పరిశీలించి; తాన్ మనమునన్ ఇట్లు+అనున్= తాను (ఆ సుదేవుడు) మనసులో ఇట్లా అనుకొన్నాడు; సైన్యంబు చేటు+ఏల?= సైన్యనాశనం దేనికి?; శత్రున్+కొనన్+ఈన్+ఏలా?= శత్రువులు ఈ విజయం పొందేటట్లు చేయటం దేనికి?; పుర+అరిన్+కొలుతున్= శివుడిని పూజిస్తాను; అతనికిన్= ఈశ్వరుడికి; శిరంబున్ కోసి+ఇత్తున్= నా తల నరికి ఇస్తాను (అని భావించాడు).

తాత్పర్యం: అంబరీషుడు యుద్ధానికి వెళ్ళుమని ఆదేశించగా యుద్ధమంటే చెవికోసుకొనే సుదేవుడు అట్లాగేనని నీ వద్ద సెలవు పుచ్చుకొని రాక్షసుల యుద్ధాటోపాన్ని గూఢచారులవలన తెలిసికొని మనసులో ఇట్లా భావించాడు. 'సైన్యవినాశనం దేనికి? శత్రువులకు విజయం చేకూర్చటం దేనికి? కాబట్టి ఈశ్వరుడిని పూజిస్తాను. నా తలను నరికి, శివుడికి ఇస్తాను' అని భావించాడు.

విశేషం: మహాస్రగ్ధరలో ప్రతిపాదంలోనూ వరుసగా స, త, త, న, స, ర, ర, గ - అనే గణాలుంటాయి. 9, 16వ అక్షరాలతో యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

మ. అని నిశ్చాయకుఁడై రణం బుడిగి సైన్యంబంతయుం గ్రమ్మఱం
జనగాఁజేసి పరేత భూమికి దృఢోత్సాహంబునం బోయి శం
భునిఁ జిత్తంబున నిల్పి వాలును గళంబుం గూర్చినన్ సత్కృపా
ఘనుఁ డద్దేవుఁడు ముందటన్ నిలిచి ఖడ్గంబుం దొలంగించుచున్. 435

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; నిశ్చాయకుఁడు+ఐ= నిశ్చయించుకొన్నవాడై; రణంబు+ఉడిగి= యుద్ధాన్ని విరమించి; సైన్యంబు+అంతయున్= సైన్యమంతా; క్రమ్మఱన్+చనఁగాన్+చేసి= వెనుదిరిగి పోయేటట్లు ఆజ్ఞాపించి; పదేత భూమికిన్= శ్మశాన భూమికి; దృఢ+ఉత్సాహంబునన్+పోయి= మిక్కిలి ఉత్సాహంతో వెళ్ళి; శంభునిన్= ఈశ్వరుడిని; చిత్తంబునన్ నిల్పి= మనస్సులో నిల్పుకొని; వాలును= కత్తిని; గళంబున్+కూర్చినన్= కంఠంపై చేర్చుకోగా; సత్+కృపాఘనుఁడు+ఆ+దేవుఁడు= ఉత్తమ దయాధికుడైన ఆ శివుడు; ముందటన్+నిలిచి= తనముందు ప్రత్యక్షమై; ఖడ్గంబున్+తొలంగించుచున్= కత్తిని తొలగిస్తూ.

తాత్పర్యం: సుదేవుడు ఈశ్వరుడినిగూర్చి తపస్సుచేసి తన తలను ఆ దేవుడికి నరికి ఇస్తానని నిశ్చయించుకొని, యుద్ధం వదలి సైన్యాన్నంతటినీ తిరిగిపోయేటట్లు ఆజ్ఞాపించి, తాను మిక్కిలి ఉత్సాహంతో శ్మశానభూమికి వెళ్ళి, ఈశ్వరుడిని మనసులో నిలుపుకొని తన కంఠంపై కత్తిని సంధింపగా, అత్యంత దయామయుడైన ఈశ్వరుడు ప్రత్యక్షమై, అతడి కంఠంనుండి కత్తిని తొలగించాడు.

విశేం: ఈ పద్యంలో జరిగిన విషయాన్ని క్రమంగా చిన్న చిన్న మాటలతో చెప్పి తిక్కన విషయాన్ని స్పష్టంచేశాడు. విషయావగాహనకు ఉపకరించే రీతిలో పద్యాన్ని నడిపి తన పద్యశైలీ నైపుణ్యాన్ని ప్రకటించాడు.

మ. "చనునే సాహస మిట్లు సేయ? నిది కర్జంబే? కతం బేమి? యి
ప్పని? కన్నం గని చక్కఁజాఁగి ధరయున్ ఫాలంబునుం బొంద వం
దనముం జేసి, యితండు నీ పలుకులున్ దైతేయులం దాఁక నొ
ల్లనివాఁడైన తెఱంగుఁ జెప్పెశివు నుల్లం బార్ద్రతం బొందఁగన్. 436

ప్రతిపదార్థం: ఇట్లు సాహసము+చేయన్ చనునే?= ఈ రీతిగా సాహసం చెయ్యటం తగునా?; ఇది కర్జంబే?= ఇది చేయదగిన పనేనా?; ఈ+పనికిన్= ఈ పని చెయ్యటానికి; కతంబు+ఏమి?= కారణ మేమిటి?; అన్నన్+కని= అనగానే చూచి; చక్కన్+చాఁగి= చక్కగా సాగిలపడి; ధరయున్= భూమియు; ఫాలంబునున్= నొసటిభాగమును; తాఁకన్= తాకగా; వందనమున్+చేసి= నమస్కరించి; ఇతండు= ఈ సుదేవుఁడు; నీ పలుకులున్= నీవు (అంబరీషుడు) చెప్పిన మాటలను; దైతేయులన్+తాఁకన్+ఒల్లనివాఁడు+ఐన తెఱంగున్= రాక్షసులను ఎదుర్కొనటం ఇష్టంలేనివాడైన తీరును; శివు+ఉల్లంబు+ఆర్ద్రతన్+పొందఁగన్= శివుడి మనస్సు కరిగేటట్లుగా; చెప్పెన్= వివరించాడు.

తాత్పర్యం: 'ఇంత సాహసకార్యం చేయటం తగునా? ఇది చేయదగినదేనా? ఈ పనికి కారణ మేమిటి? 'అని శివుడు అనగా విని సుదేవుడు శివుడికి సాష్టాంగనమస్కారం చేసి నీవు(అంబరీషుడు) చెప్పిన మాటలను, తాను రాక్షసులను ఎదుర్కొనటానికి ఇష్టపడని అంశాన్ని శివుడి మనసు కరిగేటట్లు వివరించాడు'.

ఉ. ఆ పరమేశ్వరుం డితని కప్పుడు దివ్య రథోత్తమంబునుం
జాపము నస్త్రకోటియుఁ బ్రసన్నత నిచ్చి రణంబునందు నీ
యేపున కోర్వ దేవతల కేనియు దైత్యులకేని రాదు పా
మ్మే పగఱేని గెల్వము; మహిం జరణం బిడకుండు మాజిలోన్. 437

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆ పరమేశ్వరుండు= ఆ శివుడు; ప్రసన్నతన్= దయతో; ఇతనికిన్= ఈ సుదేవుడికి; దివ్యరథ+ఉత్తమంబునున్= దేవతా సంబంధమైన ఉత్తమ రథాన్ని; చాపమున్= వింటిని; అస్త్రకోటియున్= బాణసమూహాన్ని, ఇచ్చి= ప్రసాదించి; రణంబునందున్= యుద్ధంలో; దేవతలకున్+ఏనియున్= దేవతలకైనా; దైత్యులకున్+ఏనిన్= రాక్షసులకైనా; నీ+ఏపునకున్+ఓర్వన్= నీ ధాటికి తట్టుకొనటం; రాదు పొమ్ము= సాధ్యం కాదు పో; ఏ పగఱ+ఏనిన్= ఎట్లాంటి శత్రువులనైనా; గెల్వము= జయించుము; ఆజిలోన్= యుద్ధంలో; మహిన్+చరణంబు+ఇడక+ఉండుము= భూమిమీద కాలుపెట్టవద్దు (అని చెప్పాడు).

తాత్పర్యం: ఆ సమయంలో పరమేశ్వరుడు సుదేవుడిపై అనుగ్రహంతో దేవతాసంబంధమైన ఉత్తమ రథాన్ని, వింటిని, బాణ సమూహాన్ని ప్రసాదించి యుద్ధంలో దేవతలకుగానీ, రాక్షసులకు గానీ నీ ధాటికి నిలవటం సాధ్యంకాదు. ఏ శత్రువునైనా జయించుము. అయితే ఎట్టి పరిస్థితులలోనూ యుద్ధంలో నేలమీద కాలుమోపకుము.' అని శివుడు హెచ్చరించాడు.

మ. అని వీడ్కొల్పిన నీతఁ డుబ్బు మదిఁ బొంగారంగఁ దే రెక్కి వే
చని దైత్యధ్వజినీ ప్రతాప మహిమోత్సాహంబులం జీరికిం
గొన కుగ్రోద్ధతిఁ దాఁకి పీనుఁగుల పెంగుప్పల్ గొనం జేసె న
య్యనిఁ బైఁ ద్రోచిన నిద్దఱం దునిమె దైత్యాధీశులన్ వ్రేల్మిడిన్. 438

ప్రతిపదార్థం: అని వీడ్కొల్పినన్= అని హెచ్చరించి శివుడు పంపించగా; ఈతఁడు= ఈ సుదేవుడు; ఉబ్బు మదిన్+పొంగారంగన్= ఆనందం మనస్సులో అతిశయించగా; తేరు+ఎక్కి= రథం ఎక్కి; వే చని= వెంటనే వెళ్ళి; దైత్యధ్వజినీ= రాక్షస సైన్యాలయొక్క; ప్రతాప మహిమ+ఉత్సాహంబులన్= పరాక్రమ మాహాత్మ్యమూ, ఉత్సాహాలను; చీరికిన్+కొనక= లెక్కచేయక; ఉగ్ర+ఉద్ధతిన్+తాఁకి= భయంకరమైన అతిశయంతో ఎదుర్కొని; పీనుఁగుల పెన్+కుప్పల్+కొనన్+చేసెన్= శవాలు పెద్ద గుట్టలుగా పడేటట్లు చేశాడు; ఆ+అనిన్= ఆ యుద్ధంలో; పైన్+త్రోచినన్= తనపై దాడిచేసిన; ఇద్దఱన్ దైత్య+అధీశులన్= ఇద్దరు రాక్షసాధిపతులను (సదముడు, దముడు); వ్రేల్మిడిన్= చిటికెలో; తునిమెన్= సంహరించాడు.

తాత్పర్యం: శివుడు అనుగ్రహించి హెచ్చరికతో పంపగా సుదేవుడు అత్యంతానందంతో కూడిన మనస్సుతో రథం ఎక్కి వెంటనే వెళ్ళి, రాక్షససమూహాల పరాక్రమాతిశయోత్సాహాలను లెక్కచేయక మహాభయంకరంగా ఎదుర్కొని వారి శవాలు పెద్ద గుట్టలుగా పడేటట్లు చేశాడు. ఆ యుద్ధంలో తనను ఎదిరించిన రాక్షసాధిపతులైన సదముడు దముడు అనే ఇద్దరినీ చిటికెలో సంహరించాడు.

వ. ఇ ట్లివిధంబున సదముండును దముండునుం బడినం గని కోపోద్దీపితుండై. 439

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; సదముండును దముండునున్= సదముడు, దముడు అనే రాక్షసరాజులు; పడినన్= యుద్ధభూమిలో మరణించి పడిపోగా; కని= చూచి; కోప+ఉద్దీపితుండు+ఐ= అతిశయించిన కోపం కలవాడై.

తాత్పర్యం: ఈ విధంగా సదముడు దముడు అనే రాక్షస రాజులు యుద్ధంలో మరణించగా చూచి మిక్కిలి కోపంతో విదముడు. (తరువాతి పద్యంతో అన్వయం).

స్రగ్ధర: వీరోదారోగ్రలీలన్ విదముఁడు సమరోర్విన్ బలోల్లాస మొప్పం
జేరెన్ బాహాసముల్లాసిత ఘనరుచిరాసి ప్రభాభాసురుం డై
యా రక్షోనాథుపైఁ బేరలుక మఱపుఁ జేయంగ నీతండు డిగ్గెం
దే రుద్యత్ఖడ్గదీప్తుల్ దెసల నిగుడ దైతేయవీరుల్ చలింపన్. 440

ప్రతిపదార్థం: విదముఁడు= విదము డనే రాక్షుడు; వీర+ఉదార+ఉగ్రలీలన్= పరాక్రమాతిశయంతో భయంకరమైన రీతిలో; సమర+ఉర్విన్= యుద్ధ భూమిలో; బల+ఉల్లాసము+ఒప్పన్= పరాక్రమోత్సాహాలు ప్రకాశించగా; బాహా సమ్+ఉత్+లాసిత ఘనరుచిర+అసి ప్రభా భాసురుండు+ఐ= భుజాలపై మిక్కిలి ప్రకాశిస్తూ గొప్పదై ఒప్పుతూ ఉన్న ఖడ్గంయొక్క కాంతిచేత వెలుగొందుతున్నవాడై; ఆ రక్షః+నాథు పైన్= ఆ రాక్షసరాజైన విదముడిపై కలిగిన; పేరు+అలుక= అత్యంత కోపం; మఱపున్+చేయంగన్= శివుడి హెచ్చరికను మరిచేటట్లు చేయగా; ఈతండు= ఈ సుదేవుడు; ఉద్యత్= అతిశయితమైన; ఖడ్గదీప్తుల్= ఆయుధాల కాంతులు; దెసలన్ నిగుడన్= అన్ని దిక్కులకు వ్యాపించగా; దైతేయవీరులు= రాక్షస వీరులు; చలింపన్= సంక్షోభించగా; తేరు డిగ్గెన్= రథం మీదనుండి క్రిందికి దిగాడు.

తాత్పర్యం: విదముడనే రాక్షసుడు భయంకరమైన పరాక్రమాతిశయంతో యుద్ధభూమిలో భుజాలమీద ప్రకాశిస్తున్న గొప్పదై ఒప్పుతున్న ఖడ్గకాంతిచేత వెలుగొందుతున్నవాడై కనిపించగా, ఆ రాక్షసరాజుమీది కోపాతిశయంతో సుదేవుడు తన ఖడ్గదీప్తులు అన్ని దిక్కులకు వ్యాపించగా, రాక్షసవీరులు సంక్షోభించే రీతిలో శివుడి హెచ్చరికను (ఎట్టి పరిస్థితులలోనూ రథం దిగి నేలమీద కాలు మోపవద్దు అనే మాటను) మరచిపోయి రథం దిగాడు.

విశేషం: తిక్కన సాధారణంగా చిన్న చిన్న తెలుగు మాటలను మాత్రమే ప్రయోగిస్తూ ఉంటాడు. కాని, రసానుగుణంగా పదప్రయోగం చేయటంలో అందెవేసిన చేయి. యుద్ధంలో వీరోత్సాహ ముట్టిపడేటట్లుగా సంస్కృత భూయిష్ఠమైన రచనచేయటంలో కూడా దిట్ట. అందుకు ఈ పద్యం చక్కటి ఉదాహరణ. 'బాహోసముల్లసిత ఘన రుచిరాసి ప్రభా భాసురుండై' మొదలైన సమాసాలు ఇందుకు సాక్ష్యం. స్రగ్ధరావృత్తంలో ప్రతిపాదానికీ వరుసగా మ, ర, భ, న, య, య, య అనే గణాలు ఉంటాయి. 8, 15 అక్షరాలతో యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. ఇట్లు విధాతృ వశంబునఁ బాదచారియై. 441

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; విధాతృ వశంబునన్= విధినిర్ణయం ప్రకారం; పాదచారిఐ= యుద్ధభూమిలో నడుస్తున్నవాడై.

తాత్పర్యం: ఈ విధంగా సుదేవుడు విధినిర్ణయం ప్రకారం శివుడి హెచ్చరికను మరచిపోయి యుద్ధభూమిలో నడచి వెళ్తుండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. దనుజుం దాఁకి కృపాణ ఖేలనము చిత్రంబై వెలుంగొందఁ ద
త్తను సంఛేదన కేలిసల్ప నతఁడుం దన్నుం బటుప్రస్ఫుర
ద్ఘన కౌక్షేయక ధారఁ జీరఁ బడియెం దా నాతనిం గూల్చెఁ ద
క్కిన దైత్యావలి విచ్చె నల్గడఁ బరిక్షీణోద్యమత్వంబునన్. 442

ప్రతిపదార్థం: దనుజున్+తాఁకి= రాక్షసుడైన విదముడిని ఎదుర్కొని; కృపాణ ఖేలనము= ఆయుధ క్రీడ చిత్రంబు+ఐ= విచిత్రంగా; వెలుఁగు+ఒందన్= ప్రకాశిస్తూ ఉండగా; తద్+తను సంఛేదన కేలి సల్పన్= ఆ రాక్షసుడి శరీర ఖండనమనే ఆట ఆడగా; అతఁడున్= ఆ రాక్షసుడూ; తన్నున్= తనను (ఆ సుదేవుని); పటు= మిక్కిలి; ప్రస్ఫురత్= ప్రకాశిస్తున్న; ఘన= గొప్పదైన; కౌక్షేయక ధారన్= కత్తి వాదరచేత; చీరన్= చీల్చగా; పడియెన్= పడిపోయాడు; తాను+ఆతనిన్+కూల్చెన్= ఆ సుదేవుడు విదముని పడగొట్టాడు; తక్కిన దైత్య+ఆవలి= మిగిలిన రాక్షస సేనా సమూహం; పరిక్షీణ+ఉద్యమత్వంబునన్= పూర్తిగా నశించి పోయే పూనికతో; నల్గడన్= నాలుగు దిక్కులకూ విచ్చెన్= చెల్లా చెదరై పోయింది.

తాత్పర్యం: సుదేవుడు ఆ రాక్షసుడైన విదముని ఎదుర్కొని తన ఖడ్గనైపుణ్యాన్ని చిత్రవిచిత్రంగా ప్రదర్శించి వెలుగొందుతూ అతడి శరీరాన్ని ఖండించటానికి ప్రయత్నించగా ఆ రాక్షసుడు తనను మిక్కిలి ప్రకాశమానమైన ఖడ్గధారచేత చీల్చగా అదేసమయంలో తానూ ఆ రాక్షసుడిని పడగొట్టి పడిపోయాడు. అప్పుడు మిగిలిన సైన్యం వినాశమొతామేమో ననే భయంతో అన్ని దిక్కులకూ చెల్లా చెదరైంది.

వ. ఇట్లు నిశ్శేషంబుగాఁ బరవీరులం బరిమార్చిన నీ రాజ్యంబు పూజ్యంబై వెలసె, భూ ప్రజయుం బ్రమోదంబు నొందె; నిత్తెఱంగున నీ సుదేవుండు సకృతవంతుండై యింతటి పదంబున కర్హుం డయ్యెఁ; నేయజ్ఞంబులును సంగ్రామ యజ్ఞంబునకు సదృశంబులు గావు; వినుము! వీర మస్తకరాశి వేదికగా గృపాణ బాణాది సాధనంబులు సమిత్స్రుక్స్రువంబులుగా శోణితం బాజ్యంబుగా మాంసంబు పురోడాశంబుగా వీరవ్రత దీక్షితుండు సమరాధ్వరంబు సలిపి, రుధిరజల పూరయు మస్తిష్కకర్దమయుఁ గేశ శైవాలయు నాంత్ర ఫేనయు

భేరీ మండూకయు హేతి మీనయు గజకళేబర పులినయు నగు నమర పుణ్యనది నవభృథస్నానంబు సేసి మదీయ లోకంబున సుశ్లోకుండై నిత్యస్థితి నత్యుదాత్తపదవిం బ్రవర్తిల్లుఁ బుణ్యతముం డగుటకుం దనువు దొఱంగ వలయు ననిలేదు; తెగువతోడి యనివర్తన గతియ చాలు; నిట్టిది రణాచరణ ప్రభావం; బేనును బ్రబల దైతేయవ్రాత శాతన సుకృతంబునంగాదె యీ దేవేంద్రత్వంబు నొందితి' నని పలికిన నంబరీషుండు సమర శూరుల సమధిక పుణ్యత్వంబు దెలిసి సంభావించె'నని చెప్పి దేవవ్రతుండు వెండియు. 443

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నిఃశేషంబుగాన్= ఏ మాత్రం మిగలకుండా; పరవీరులన్= శత్రువీరులను; పరిమార్చినన్= చంపగా; నీ రాజ్యంబు= నీ సామ్రాజ్యం; పూజ్యంబు+ఐ= మాన్యమై; వెలసెన్= ప్రకాశించింది; భూ ప్రజయున్= నీ రాజ్య ప్రజ; ప్రమోదంబున్+ఒందెన్= సంతోషించింది; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఈ సుదేవుఁడు= ఈ సుదేవుడనే నీ భృత్యుడు; సుకృతవంతుండు+ఐ= పుణ్యాత్ముడై; ఇంతటి పదంబునకున్+అర్హుండు+అయ్యెన్= ఇంత ఉన్నత పదవికి పాత్రుడు అయ్యాడు; ఏ యజ్ఞంబులును= ఏ యజ్ఞ యాగాలు కూడా; సంగ్రామ యజ్ఞంబునకున్= యుద్ధమనే యజ్ఞానికి; సదృశంబులు+కావు= సమానములు కావు; వినుము= విను; వీరమస్తకరాశి వేదికగాన్= వీరుల తలల సమూహమే యజ్ఞ వేదికగా; కృపాణబాణ+ఆది సాధనంబులు= ఖడ్గం, బాణం మొదలైన ఆయుధాలు; సమిత్+స్రుక్+స్రువంబులుగాన్= తగిన యజ్ఞోపకరణం, యజ్ఞ పాత్రలుగా; శోణితంబు+ఆజ్యంబుగాన్= రక్తం నేయిగా; మాంసం; పురోడాశంబుగాన్= యజ్ఞార్థమైన అపూపంగా; వీరవ్రత దీక్షితుండు= వీర వ్రతమే దీక్షగా గలవాడైన వీరుడు; సమర+అధ్వరంబు+చలిపి= యుద్ధమనే యజ్ఞం పరిపూర్తిచేసి; రుధిరజల పూరయున్= రక్తమనే జలంతో నిండినది; మస్తిష్క కర్దమయున్= మెదళ్ళనే బురద కలదీ; కేశశైవాలయున్= వెంట్రుకలనే నాచు కలదీ; ఆంత్ర ఫేనయున్= పేగులనే నురుగు కలదీ; భేరీ మండూకయున్= యుద్ధ భేరీలు అనే కప్పలు కలదీ ; హేతి మీనయున్= ఖడ్గాలనే చేపలు కలదీ ; గజకళేబర పులినయున్= ఏనుగుల మృతకళేబరాలు అనే ఇసుక దిబ్బలు కలదీ; అగు= అయిన; అమరపుణ్యనదిన్= స్వర్గంగలో; అవభృథస్నానంబు+చేసి= యజ్ఞాంత స్నానం చేసి; మదీయలోకంబునన్= నా లోకంలో (స్వర్గలోకంలో); సుశ్లోకుండు+ఐ= బాగా కీర్తించబడిన వాడై; నిత్యస్థితిన్= శాశ్వతరీతి; అతి+ఉదాత్త పదవిన్= మిక్కిలి శ్రేష్ఠమైన పదవిలో; ప్రవర్తిల్లున్= ప్రవర్తిస్తుంటాడు; పుణ్యతముండు+అగుటకున్= పుణ్యశ్రేష్ఠుడు కావటానికి; తనువు+తొఱంగన్ వలయున్+అనిలేదు= శరీరాన్ని వదలిపెట్టాలని లేదు; తెగువతోడి= సాహసంతో; అనివర్తన గతియ చాలు= వెనుదీయకుండా యుద్ధం చెయ్యటమే చాలు; ఇట్టిది= ఇట్లాంటిది; రణ+ఆచరణ ప్రభావం= యుద్ధాచరణం వలన కలిగే ఫలితం; ఏనును= నేనుకూడా; ప్రబలదైతేయ వ్రాతశాతన సుకృతంబునన్+కాదె?= మిక్కిలి బలవంతులైన రాక్షసుల సమూహాలను సంహరించటమనే పుణ్యం వలననే కదా!; ఈ దేవ+ఇంద్రత్వంబున్+ఒందితిన్= ఈ దేవేంద్ర పదవిని పొందగలిగాను; అని పలికినన్= అని చెప్పగా; అంబరీషుండు= అంబరీషుడనే రాజు; సమర శూరుల సమ్+అధిక పుణ్యత్వంబు+తెలిసి= యుద్ధవీరుల అతిశయితమైన పుణ్య భావాన్ని తెలిసికొని; సంభావించెన్= (సుదేవుడిని) గౌరవించాడు; అని చెప్పి= అని ఈ విధంగా తెలియజేసి; దేవవ్రతుండు= భీష్ముడు; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఈ విధంగా నిశ్శేషంగా శత్రువీరులను సంహరించగా నీ రాజ్యం గౌరవప్రదమైనది. నీ ప్రజలంతా సంతోషించారు. ఈ రీతిగా సుదేవుడు పుణ్యాత్ముడై ఇంతటి ఉన్నత పదవికి పాత్రుడయ్యాడు. ఎన్ని యజ్ఞయాగాలైనా యుద్ధయజ్ఞానికి సమానం కావు. వీరుల తలల రాశులే వేదికగా, ఖడ్గబాణాది సాధనాలు యజ్ఞోపకరణాలైన సమిధలు స్రువములు కాగా రక్తమే నేయిగా, మాంసం పురోడాశంగా వీరమనే వ్రతం పూనినవాడు యుద్ధ మనే యజ్ఞాన్ని సల్పి, రక్తమనే జలంతో కూడినది, మెదళ్ళనే బురద గలది, వెంట్రుకలనే పాచి కలదీ, పేగులనే నురుగు గలదీ, యుద్ధభేరీలనే కప్పలు గలదీ, ఖడ్గాలనే చేపలు గలదీ, ఏనుగుల మృతకళేబరాలనే ఇసుక దిబ్బలు గలదీ అయినటువంటి స్వర్గగంగలో యజ్ఞాంతస్నానం చేసి, నా స్వర్గలోకంలో బాగా కీర్తించబడినవాడై శాశ్వతస్థితిలో అత్యుత్తమ పదవిని పొందగలిగాడు. పుణ్యాత్ముడు కావటానికి శరీరం వదలిపెట్టాలని లేదు. యుద్ధంలో సాహసోపేతంగా వెనుదీయకుండా పోరాడటమేచాలు. ఇది యుద్ధాచరణంవలన కలిగే పుణ్యం. నేను కూడా అనేక రాక్షస సమూహాలను సంహరించటం అనే పుణ్యం వలననే కదా ఈ దేవేంద్ర పదవిని

పొందగలిగాను' అని ఇంద్రుడు చెప్పగా అంబరీషుడనే రాజు యుద్ధవీరుల అత్యంత పుణ్యత్వాన్ని తెలిసికొని సుదేవుడిని గౌరవించాడు' అని పైరీతిగా స్పష్టం చేసి, భీష్ముడు ధర్మరాజుతో మళ్ళీ ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం.

సమరానివర్తనంబు వలని ఫలము (సం. 12-100-1)

క. జనకుఁడు ప్రతర్దనునకుం । దనకును రణమైన యపుడు తన యోధులకున్
వినుఁ నాకంబును నరకముఁ । గనుఁగొనుఁ డని చూపి చెప్పెఁ గౌరవముఖ్యా! 444

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= కురువంశ శ్రేష్ముడవైన ఓ ధర్మరాజా!; వినుఁ= శ్రద్ధగా ఆలకించుము; జనకుఁడు= జనక మహారాజు; ప్రతర్దనునకున్= ప్రతర్దనుడనే వాడికి; తనకును= తనకూ; రణము+ఐన+అపుడు= యుద్ధం జరిగినప్పుడు; తన యోధులకున్= తన వీరులకు; నాకంబును= స్వర్గాన్ని; నరకమున్= నరకాన్ని; కనుగొనుఁడు+అనిచూపి చెప్పెన్= చూడుండని చూపించి ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! వినుము. జనకమహారాజుకు ప్రతర్దనుడికి యుద్ధం జరిగింది. ఆ సమయంలో జనకుడు తన వీరులకు స్వర్గనరకాలను చూపించి, వాటిని చూడుం డని ఇట్లా అన్నాడు'.

తే. పుణ్యతమము భోగాస్పదంబును మనోహ । రాంగనా జనబహులంబు నైనయది ర
ణంబు బిరుదులై చేసిన నరుల నెలవు; । దూరఁ బందలచో టిది దుఃఖమయము. 445

ప్రతిపదార్థం: పుణ్యతమము= అధిక పుణ్యాన్ని కలిగించేది; భోగ+ఆస్పదంబును= సమస్త భోగాలకు నిలయమయినది; మనోహర+అంగనాజన బహులంబున్= అనేక సుందరాంగులతో నిండినది; ఐన+అది= అయిన అది; బిరుదులు+ఐ= వీరులై; రణంబు+చేసిన= యుద్ధం చేసిన; నరుల నెలవు= వీరులకు నిలయం (స్వర్గం); ఇది= ఈ నరకం; దూరన్= ప్రవేశించటానికి; పందలచోటు= పిరికివాళ్ళ నిలయం; దుఃఖమయము= దుఃఖంతో నిండింది.

తాత్పర్యం: 'అధిక పుణ్యాన్ని అందించేది. సమస్తభోగాలకు నిలయమై అనేకమైన సుందరాంగులతో నిండినదీ అయిన అది స్వర్గం. పిరికివాళ్ళు ప్రవేశించేదీ దుఃఖమయమైనదీ అయిన ఇది నరకం' అని జనకుడు తన వీరులతో చెప్పాడు.

వ. అని తన మాహాత్మ్యంబునం జూపనోపిన యుభయ స్థలంబులుం జూపం జూచి, యేచి యవ్వీరులు దెంపు వొంపిరి వోవం దఱియ నుఱికి వైరుల జయించిరి; సమరంబు తెగువ దీప్తలక్ష్మిం గరంబొనర్చుఁ బుణ్యతమ లోకంబు లిచ్చుం గావున శూరుం డధిక పుణ్యోదారుం డని యిట్లు దేవవ్రతుండు ధర్మశూరునకు సమరానివర్తన జనవిశేషం బెఱిఁగించె నని చెప్పిన విని 'యట మీఁద వారల సంప్రశ్నోత్తరంబులు ప్రవర్తిల్లిన విధంబులు వినిపింపు' మనుటయు. 446

ప్రతిపదార్థం: అని= అని పలికి; తన మాహాత్మ్యంబునన్+చూపన్+ఓపిన= తన మహిమచేత చూపించగలిగిన; ఉభయస్థలంబులున్= స్వర్గ నరకాలు రెండింటిని; చూపన్+చూచి= చూపెట్టగా చూచి; ఏచి= విజృంభించి; ఆ+వీరులు= ఆ జనకమహారాజు యోధులు; తెంపు= సాహసం; పొంపిరి+పోవన్= అతిశయించగా; తఱియన్+ఉఱికి= శత్రువులను తరమటానికి పరుగెత్తి; వైరుల జయించిరి= శత్రువులను ఓడించారు; సమరంబు తెగువ= యుద్ధంలోని సాహసం; దీప్త లక్ష్మిన్= ప్రకాశించే సంపదను; కరంబు+ఒనర్చున్= మిక్కిలి కలిగిస్తుంది; పుణ్యతమ లోకంబుల్+ఇచ్చున్= ఉత్తమ లోకాలను ప్రసాదిస్తుంది; కావునన్= అందువలన; శూరుండు= వీరుడు; అధిక+పుణ్య+ఉదారుండు+అని= మిక్కిలి పుణ్యవంతుడని; ఇట్లు= ఈ విధంగా; దేవవ్రతుండు= భీష్ముడు; ధర్మశూరునకున్= ధర్మరాజునకు; సమరానివర్తన జనవిశేషంబు+ఎఱిఁగించెన్= వెనుదీయకుండా యుద్ధంలో పాల్గొనే వీరుల విశేషాన్ని తెల్పాడు; అని చెప్పినన్= అని చెప్పగా; విని; అటమీఁదన్= ఆ తరువాత; వారల సంప్రశ్న+ఉత్తరంబులు= వారి ప్రశ్నలూ

సమాధానాలు; ప్రవర్తిల్లిన విధంబులు= జరిగిన తీరులు; వినిపింపుము+అనుటయున్= వినిపించవలసిం దని కోరగా. (జనమేజయుడు వైశం పాయనుడిని కోరగా).

తాత్పర్యం: జనకుడు ఆ విధంగా పలికి తన మహిమచేత స్వర్గ నరకాలను చూపెట్టగా చూచిన అతడిసైన్యం విజృంభించి సాహసంతో శత్రువులను తరమటానికి పరుగెత్తి విజయం సాధించింది. యుద్ధంలోని సాహసం ప్రకాశించే సంపదను ఉత్తమలోకాలను ప్రసాదిస్తుంది. అందువలన వీరుడు మిక్కిలి పుణ్యవంతు' డౌతాడు అని ఈ విధంగా భీష్ముడు ధర్మరాజునకు వెనుదీయకుండా యుద్ధంలో పాల్గొనే వీరుల విశేషాన్ని తెల్పాడు' అని చెప్పగా విన్న జనమేజయుడు వారి ప్రశ్నలూ సమాధానాలు తరువాత ఎట్లా సాగాయో వినిపించవలసిందని వైశంపాయనుడిని కోరాడు.

ఆశ్వాసాంతము

మ. పరమాయుఃపరమార్థసిద్ధి పరమ ప్రావీణ్య సంపాద నా
దర సంభావిత భక్తలోక! నిగమాంతస్ఫీత హర్మ్యాగ్ర సం
చరణ ప్రౌఢమయూర! చిత్రమహిమా! సర్వాత్మ విజ్ఞాన సం
పరిపాక ప్రకటాకృతీ! శమదమోద్భావాహిత స్వీకృతీ! 447

ప్రతిపదార్థం: పరమ+ఆయుఃఉత్కృష్టమైన ఆయుస్సు; పరమ+అర్థసిద్ధి= పురుషార్థాల్లో ఉత్తమమైన మోక్షాన్ని సిద్ధింపజేయటంలోను; పరమ ప్రావీణ్య సంపాదన= శ్రేష్ఠమైన నైపుణ్యాన్ని సమకూర్చటంలోను; ఆదర= ఆసక్తివలన; సంభావిత= గౌరవించబడిన; భక్తలోక!= భక్తుల సమూహం గలవాడా!; నిగమ= వేదాలయొక్క; అంత= చివరి భాగాలైన ఉపనిషత్తులనే; స్ఫీత= ఉన్నతమైన; హర్మ్య+అగ్ర= సౌధం పైభాగాన; సంచరణ= విహరిస్తున్నట్టి; ప్రౌఢమయూర!= నిపుణమైన నెమలి అయినవాడా!; చిత్రమహిమా!= ఆశ్చర్యకరమైన మహిమలు కలవాడా!; సర్వ+ఆత్మ= సమస్తమూ తానే ఆత్మ అయినవాడనే; విజ్ఞాన= పరిజ్ఞానంయొక్క; సమ్+పరిపాక= ఉత్తమ పరిపక్వ స్థితివలననే; ప్రకట+ఆకృతీ!= స్పష్టమయ్యే స్వరూపం కలవాడా!; శమదమ+ఉద్భావాహిత స్వీకృతీ!= శాంతిదాంతులతో కూడిన హృదయాలు గలవారిలో ఉంచబడినట్టి స్వీకారం కలవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! 'నీ పరమ భక్తులకు పరిపూర్ణమైన ఆయుస్సును పురుషార్థాలలో శ్రేష్ఠమైన మోక్షాన్ని, సమస్త కార్యాచరణచాతుర్యాన్ని ప్రసాదిస్తావు. వేదాలలో ఉపనిషత్తులలో వివిధవిధాలుగా ప్రశంసించబడ్డ నీవు విశిష్టుడవు. నీ విచిత్రమహిమ సామాన్యులకు అవగతం కాదు. అయినా విశ్వమంతా నీవే నని భావించగల విజ్ఞాన ఖనులకు నీ మహిమ స్పష్టమే. అందుకే అట్లాంటి శమదమాది గుణగరిష్ఠులైనవారిని నీవెంతగానో ఆదరిస్తావు.

క. యమనియమాద్యష్టాంగ । క్రమాభ్యసన నిర్మథిత వికార సుచేతః
కమలామోద మయాత్మా! । సమతా రాహిత్య శస్య! సర్వనమస్యా. 448

ప్రతిపదార్థం: యమనియమ+ఆది= యమం నియమం మొదలుకొని అంటే ఆసనం ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణం, ధ్యానం, సమాధి - అనే; అష్ట+అంగ క్రమ+అభ్యసన= ఎనిమిది అంగాలను క్రమంగా అభ్యసించటంవలన; నిర్మథిత వికార= నశింప జేయబడినట్టి మార్పుగల; సుచేతఃకమల= మంచి మనస్సనే పద్మానికి; ఆమోదమయ+ఆత్మా!= సుగంధరూపమైన స్వరూపంగలవాడా!; సమతా రాహిత్య శస్య!= సమత్వం అంటే సమభావం లేకపోవుటచే మాత్రము చెప్పదగినవాడా! అయినవాడా! (అంటే భగవంతుడు సమత్వం ఉన్నవాడు, అయితే ప్రజలచేత వారి వారి జ్ఞానాన్నిబట్టి గ్రహించే తీరులో కనిపించే పద్ధతిలో అసమానత్వమున్నవా డని అర్థం); సర్వనమస్యా!= సమస్త వ్యక్తుల నమస్సులను పొందదగినవాడా!

తాత్పర్యం: యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణం, ధ్యానం, సమాధి - అనే అష్టాంగ యోగాభ్యాసం చేయటంవలన పరిశుద్ధమైన మనస్సనే కమలానికి సుగంధమైన స్వరూపం కలవాడా! సమత

కలవాడుగా భగవంతుడు కీర్తించబడతాడు, అయితే భక్తుల మనోవైశిష్ట్యాన్నిబట్టి జ్ఞానాన్ని అనుసరించి తదుచితంగా, అసమానంగా చెప్పదగినవాడా! సర్వులచేత అంటే బ్రహ్మాదులచేత సైతం పూజించబడుతున్నవాడా! హరిహరనాథా!

విశేషం: శస్యమనగా పైరు అనగా భోజ్యం. పరమేశ్వరుడు సమరూపంలో ఉన్నప్పుడు లౌకిక రసానుభూతికి విషయం కాకపోవటంచేత, సమతారాహిత్యంలోనే - అనగా కార్యరూపమైన ప్రపంచరూపం పొందినప్పుడే భోజ్యుడవుతున్నాడని చెప్పవచ్చును.

మాలిని: సమధిక నిరవద్య స్థైరనిత్య ప్రభుత్వా!
విమల మహిమ హేలావిర్భవత్సర్వ సత్వా!
నమదమలినచిత్తౌన్నత్య దీవ్యన్మహత్వా!
దమమహిత తపస్సద్భావ సంవేద్యతత్వా! 449

ప్రతిపదార్థం: సమధిక= అన్నిటికంటే ఉత్తమమూ; నిరవద్య= దోష రహితమూ; స్థైర= స్వేచ్ఛాయుతమూ; నిత్య= శాశ్వతమూ అయినట్టి; ప్రభుత్వా!= ఆధిపత్యం కలవాడా! (సామర్థ్యం కలవాడా!); విమల= స్వచ్ఛమైన; మహిమ= మాహాత్మ్యం యొక్క; హేలా విలాసంవలన; ఆవిర్భవత్= పుట్టుతున్నట్టి; సర్వసత్వా!= సమస్త వస్తు సమూహం కలవాడా!; నమత్= నమస్కరిస్తున్న వారై; అమలినచిత్త= పరిశుద్ధమైన మనస్సులు గల మహామునుల; ఔన్నత్య= గొప్పదనంవలన; దీవ్యత్= ప్రకాశిస్తున్న; మహత్వా!= మహిమాన్వితుడైనవాడా!; దమ= ఇంద్రియ నిగ్రహంతో కూడిన; మహిత= శ్రేష్ఠమైన; తపః= తపస్సుయొక్క; సత్+భావ= సమున్నత భావంవలన; సమ్+వేద్యతత్వా!= విస్పష్టంగా తెలియదగ్గ వాస్తవరూపం కలవాడా!

తాత్పర్యం: 'అన్నిటి కంటే ఉత్తమమూ, దోషరహితమూ, స్వేచ్ఛాయుతమూ, శాశ్వతమూ అయినట్టి ఆధిపత్యం కలవాడా! స్వచ్ఛమైన మాహాత్మ్య విలాసంవలన పుట్టుతున్న సమస్త వస్తుసమూహం కలవాడా! పరిశుద్ధాంతః కరణులై నమస్కరిస్తున్న మహర్షుల ఔన్నత్యంవలన ప్రకాశిస్తున్న మహిమాన్వితుడైనవాడా! ఇంద్రియనిగ్రహంతో కూడిన గొప్ప తపస్సుయొక్క ఉనికివలన విస్పష్టంగా విదితమయ్యే వాస్తవరూపం కలవాడా! హరిహరనాథా!

విశేషం: మాలినీవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, న, మ, య, య అనే గణాలుంటాయి. 9వ అక్షరంతో యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

గద్యము:

ఇది శ్రీమదుభయ కవిమిత్ర, కొమ్మనా మాత్యపుత్ర, బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బైన శ్రీమహాభారతంబున శాంతి పర్వంబునందు ద్వితీయాశ్వాసము

ప్రతిపదార్థం: ఇది= ఇది (ఈ శాంతిపర్వం ద్వితీయాశ్వాసం); శ్రీమత్+ఉభయకవిమిత్ర= సంపద్యుక్తమైన ఉభయ కవిమిత్ర బిరుదాంకితుడైన (అంటే సంస్కృతాంధ్ర భాషాకవులకు మిత్రుడైన); కొమ్మన+ఆమాత్యపుత్ర= కొమ్మనమంత్రి పుత్రుడైన; బుధ+ఆరాధన విరాజి= విద్వాంసులచేత పూజించబడటంవలన ప్రకాశిస్తున్న; తిక్కన సోమయాజి= యజ్ఞంచేసి సోమయాజి అయిన తిక్కన మహాకవిచేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీమహాభారతంబునందున్= శ్రీమహాభారతంలో; శాంతిపర్వంబునందున్= శాంతిపర్వంలో; ద్వితీయ+ఆశ్వాసము= రెండో ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది సంపద్యుక్తమైన ఉభయకవిమిత్రుడనే బిరుదు గల, కొమ్మనమంత్రి పుత్రుడైన విద్వాంసులచేత ఆరాధించబడి ప్రకాశిస్తున్న, తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీమహాభారతమందలి శాంతిపర్వంలోని ద్వితీయాశ్వాసం.

శాంతిపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - తృతీయాశ్వాసము

శ్రీధుర్యకరణ! సమ్య । గ్బోధాత్మ విహరణ! దివిజ పూజ్యచరణ! యా
రాధకభరణ! నిరాధి । వ్యాధికరణ! సౌమ్యకిరణ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీధుర్యకరణ!= సంపదల భారాన్ని మోసేటట్లు చేసేవాడా!; సమ్యక్+బోధ= జ్ఞానవంతుల; ఆత్మ= మనస్సులలో; విహరణ!= విహరించేవాడా!; దివిజ= దేవతలచేత; పూజ్య= పూజింపదగిన; చరణ!= పాదాలు కలవాడా!; ఆరాధక= పూజించే భక్తులను; భరణ!= పోషించేవాడా!; నిరాధివ్యాధికరణ!= మానసిక శారీరక రోగాలను నివారించగలవాడా!; సౌమ్యకిరణ!= చంద్రుడికిరణములవంటి చల్లని కిరణాలు కలవాడా!; హరిహరనాథా!= హరిహరనాథుడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీవు భక్తులను సుసంపన్నులుగా చేయగల వాడవు. వాళ్ళ హృదయాలలో విహరించేవాడవు. దేవతల పూజలందుకొనే పాదాలు కలవాడవు. భక్తపోషకుడవు. మానసిక, శారీరక వ్యాధులను పారద్రోలేవాడవు తేజస్వంతుడవు.

కాలనిరూపణాదులగు రణోపాయంబుల ప్రకారము (సం. 12-101-2)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లు శూరులు పుణ్యతమ పురుషు లని విని కుంతీనందనాగ్రజుండు గంగానందనునితోఁ 'గాలనిరూపణాదులగు రణోపాయంబు లెఱిఁగింపు' మనుటయు నతండు భరితాదరుండై. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= జనమేజయ మహారాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ రీతిగా; శూరులు= యోధులు; పుణ్యతమ పురుషులు+అని= ఎంతో పుణ్యాత్ములు అని; విని= ఆలకించి; కుంతీనందన+అగ్రజుండు= కుంతీదేవి కుమారులలో పెద్దవాడైన ధర్మరాజు; గంగానందనునితోన్= గంగాదేవి కొడుకైన భీష్ముడితో; కాలనిరూపణ+ఆదులు+అగు= తగిన కాలాన్ని నిరూపించటం మొదలైన; రణ+ఉపాయంబులు= సమర సన్నాహాలకు అనువైన ఎత్తుగడలను; ఎఱిఁగింపుము= తెలియచెప్పుము; అనుటయున్= అనటంతోనే; అతండు= భీష్ముడు; భరిత+ఆదరుండు+ఐ= ఎంతో ఆనందించినవాడై.

తాత్పర్యం: జనమేజయ మహారాజునకు వైశంపాయన మహర్షి భారతకథ చెప్పటం ప్రారంభించాడు. ధర్మరాజు 'శూరులు ఏ విధంగా పుణ్యాత్ములో' భీష్ముడి వలన విన్నాడు. 'పోరుకు పోవటానికి వీలైన కాలనిరూపణం మొదలైన ఉపాయాలను తెలియచెప్పు'మని అడిగాడు. భీష్ముడు ఎంతో ఆనందంగా చెప్పటం మొదలు పెట్టాడు.

సీ. 'వానయు సీతును వర్జించి మండు వే । సవి గాక మున్న సస్యముల పంట
లొదవెడు తఱి నెత్తునది శత్రుపయిఁ । బూరి, గట్టియల్ నీళ్ళులఁ గలుగు తెరువు
గాఁజూచి నడచుట కర్జంబు సిడములుఁ । గంకటంబులును బల్కలును విండ్లు
మొదలగు నాయుధంబులు రథగజహయం । బుల సవరణలు నపూర్వభంగి

తే. నొప్పి యరిభీకరంబులై యుండవలయు । శంఖ కాహళ పటహనిస్సాణ ముఖము
లైన తూర్యముల్ మంచివి యైన లెస్స । యధిప విడిదల సమతల మగుట మేలు. 3

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; వానయున్= వర్షాకాలాన్ని; సీతును= చలికాలాన్ని; వర్జించి= విడిచిపెట్టి; మండు వేసవి= ఎండలు మండేకాలం; కాకమున్న= రాకముందే; సస్యముల పంటలు= పైరుపంటలు; ఒదవెడు తఱిన్= లభించే సమయంలో; శత్రుపయిన్= పగవాళ్ళమీదికి; ఎత్తునది= దండెత్తాలి; పూరి= పచ్చగడ్డి; కట్టియల్= కట్టెలు; నీళ్ళులున్= నీళ్ళను; కలుగు తెరువుగాన్ చూచి= దొరకే మార్గంగా చూచికొని; నడచుట= దండయాత్ర చేయటం; కర్జంబు= కార్యం; సిడములున్= జెండాలూ; కంకటంబులును= కవచాలూ; పల్కలును= డాళ్ళూ; విండ్లు= ధనుస్సులూ; మొదలగు= మొదలైన; ఆయుధంబులు= యుద్ధసాధనాలు; రథగజహయంబుల= రథాల, ఏనుగుల, గుర్రాల; సవరణలున్= వాహనాద్యలంకరణలు; అపూర్వభంగిన్= ఇంతకుముందు లేని రీతిలో కొత్తగా; ఒప్పి= ప్రకాశించి; అరిభీకరంబులు+ఐ= శత్రువులకు జడుపు పుట్టించేవై; ఉండన్ వలయున్= ఉండాలి; శంఖ= శంఖం; కాహళ= బాకా; పటహ= తప్పెట; నిస్సాణ ముఖములు+ఐన= చర్మవాద్యాలు మొదలైన; తూర్యముల్= యుద్ధ వాద్యాలు; మంచివి+ఐన= బాగా మ్రోగేవి అయిన; లెస్స= మంచిది; విడిదల= దండువిడిసే చోటు; సమతలము+అగుట= చదునుగా ఉండటం; మేలు= శ్రేష్ఠం.

తాత్పర్యం: వానలు పడేటప్పుడు, చలితో వణికేటప్పుడు, బాగా ఎండలు కాసేటప్పుడు కాక పంటలు పండేకాలంలో పగవాళ్ళపైకి దండెత్తి పోవాలి. పచ్చికా, కట్టెలూ, నీళ్ళూ దొరికే తోవలో దండును నడిపించుకొని పోవటం మంచిది. శత్రువులు కలవరపడేటట్లు జెండాలూ, కవచాలూ, డాళ్ళూ, ధనుస్సులూ మొదలైన ఆయుధాలను, రథాల ఏనుగుల గుర్రాల వాహనాలను ఇంతకుముందు కనీవినీ ఎరగని రీతిలో అమర్చుకొనాలి. హోరెత్తించే మంచి శంఖాలు, మంచి బాకాలు, మంచి డప్పులు మొదలైన చర్మవాద్యాలు ఉండటం మంచిది. సైన్యం బస చేసేచోటు ఎగుడూ దిగుడూ లేని చదునైన ప్రదేశంగా ఉండాలి.

క. చరులఁ బనిచి యరుల తెఱం । గరయుచు, వా రెదురు నడచునట్టి దయిన దె
ప్పరపుందెరువున డప్పిం । బొరసినయెడ విడియుచోటఁ బొడుచు టురవగున్. 4

ప్రతిపదార్థం: చరులన్= వేగులవాళ్ళను; పనిచి= పంపించి; అరుల తెఱంగు= శత్రువుల నడతను; అరయుచున్= విచారిస్తూ; వారు= ఆ శత్రువులు; ఎదురునడుచునట్టిది+అయిన= ఎదుర్కోలుకు బయలుదేరి ఉంటే; దెప్పరము= సహింపరాని; తెరువునన్= తోవలోనూ; డప్పిన్= అలసటను; పొరసినయెడన్= పొంది ఉన్నప్పుడూ; విడియుచోటన్= సైన్యం బసలోనూ; పొడుచుట= యుద్ధం చేయటం; ఉరవు+అగున్= తగినదవుతుంది.

తాత్పర్యం: చారులను పంపించి విరోధుల మార్గాలను గూర్చి తెలిసికొనాలి. అప్పటికే వాళ్ళు దండెత్తి వస్తుంటే కాలుమోపటానికి వీలులేని త్రోవలలోగానీ, అలసిన సమయాలలోగానీ, దండు విడిసినపుడు గానీ వాళ్ళను చంపటం తగిన పద్ధతి.

ఆ. నిదురపోవుచోట నీరుదవ్వె వడఁ । బడిన యెడను గూడుదడసి సొలసి
నపుడుఁ జెదరియున్న యవసరమునఁ బగ । వారిఁ బొడిచి చెఱుపవలయు నధిప! 5

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; నిదురపోవుచోటన్= పడుకొని నిద్రపోతున్న చోటులో; నీరు= నీళ్ళూ; దవ్వై= దూరమై; వడన్+పడినయెడను= ఎండదెబ్బ తగిలిన సమయంలోనూ; కూడు= తిండి; తడసి= ఆలసించి; సొలసినపుడున్= సొమ్మసిల్లినపుడూ; చెదరిఉన్న అవసరమునన్= సేన అటు ఇటు చెల్లాచెదరై ఉన్నప్పుడూ; పగవారిన్= శత్రువులను; పొడిచి= బాధించి; చెఱుప వలయున్= నశింపచేయాలి.

తాత్పర్యం: నిద్రపోతున్నప్పుడూ, నీళ్ళు దరిదాపుల్లో దొరక్క తపిస్తున్నప్పుడూ, తినటానికి తిండిలేక అలసిసొలసినపుడూ, సైన్యం అంతా చెల్లా చెదరైనపుడూ విరోధులను మట్టుబెట్టటం అతి సులభం.

సీ. చెట్టును ఱాయియు మిట్టయుఁ బల్లంబుఁ ; గలిగినచోటు గాల్బలము నేల
వినుము నీళ్ళును రొంపియును లేక సమవిశా ; లమునైన చోటు గుఱ్ఱముల నేల
కమ్మి గ్రుంగక గదుగదుప రొంపులు గలు ; గమి నొప్పుచోటు రథముల నేల
యెడనెడ మ్రాఁకులు మడువులుఁ గల చోటు ; కురునాథ! యెఱుఁగుము; కరుల నేల

ఆ. యే బలంబు దనకు నెక్కుడుఁ గలిగె న ; బ్బలమునేల పోరుగలను గాఁగ
నినుఁడు సీతుగాలి వెనుకగా మొన నడ ; పించి పొడువ సంభవించు జయము. 6

ప్రతిపదార్థం: కురునాథా!= ఓ కౌరవరాజా! వినుము= ఆలకించుము; చెట్టును= మ్రాను; ఱాయియున్= రాయీ; మిట్టయున్= మెరకా; పల్లంబున్= పల్లమూ; కలిగినచోటు= ఉన్న ప్రదేశం; కాల్బలము నేల= కాలినడకన పోయే సైన్యం ఉండే భూమిగాను; నీళ్ళును= జలమును; రొంపియును లేక= బురద లేని; సమవిశాలమున్+ఐన చోటు= చదునుగా విశాలంగా ఉన్న నేల; గుఱ్ఱముల నేల= గుర్రాలు ఉండే స్థలంగానూ; కమ్మి= బండి చక్రం కమ్మి; క్రుంగక= దిగబడిపోకుండా; గదుగదుప రొంపులు= జారుడుగల బురదమట్టి; కలుగమి= ఉండక; ఒప్పుచోటు= తగినచోటు; రథమునేల= రథాలు ఉండే ప్రదేశంగానూ; ఎడనెడన్= అక్కడక్కడ; మ్రాఁకులు= పెద్ద మాకులు; మడువులు= నీటిగుంటలూ; కలచోటు= ఉన్నస్థలం; కరులనేల= ఏనుగులు ఉండే చోటునుగానూ; ఎఱుంగుము= తెలిసికొనుము; ఏ బలంబు= ఏ సైన్యం; తనకున్= తనకు (ఆ రాజునకు); ఎక్కుడు కలిగెన్= అధికంగా ఉండునో; ఆ+బలము నేల= ఆ సైన్యానికి అనువైన భూమిని; పోరుకలను కాఁగన్= యుద్ధభూమిగానూ; ఇనుఁడు= ఎండా; సీతుగాలి= చల్లటి గాలీ; వెనుకగాన్= వెనకబడ్డప్పుడూ అంటే తక్కువగా ఉన్నప్పుడు; మొనన్= సైన్యాన్ని; నడిపించి= తీసికొనివెళ్ళి; పొడువన్= పోరాడగా; జయము= గెలుపు; సంభవించున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఓ కురునాథా! చెట్లూ, రాళ్ళూ, మెరకలూ, పల్లాలూ ఉండే ప్రదేశాన్ని పదాతిసైన్యానికి ఎంచుకొనాలి. నీళ్ళూ, బురదా లేని సమతల ప్రదేశాన్ని గుర్రాల దండుకు వాడుకొనాలి. రథచక్రాల కమ్మీలు దిగబడని బురదమట్టి నేలను రథబలంకొరకు ఉంచుకొనాలి. అక్కడక్కడా చెట్లూ, నీటి గుంటలూ ఉండేచోట గజసేనను నిలబెట్టాలి. రాజు దగ్గర ఏ సేన ఎక్కువగా ఉంటుందో ఆ సేనకు అనువైన భూమిని యుద్ధరంగం చేయాలి. ఎండ, చలిగాలి తక్కువగా ఉన్న రోజులలో దండెత్తితే జయం తప్పక కలుగుతుంది.

చ. పలకలవార లగ్రమునఁ బన్నఁగ విండులవారి ఘోటకం
బులఁ గరులన్ రథంబులను భూవర! వెన్వెనుకం గ్రమంబునన్
నిలిపినఁ గూడి నిల్చిన యనీకమునం గడుమంచి యోధులం
గలయఁగ నెందు నయ్యయి ప్రకారము వారల నిల్ప బల్వగున్. 7

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా!; పన్నఁగన్= యుద్ధానికి సిద్ధపడగా; పలకలవారలు= డాలు మొదలైన ఆయుధాలను ధరించిన వాళ్ళు; అగ్రమునన్= ముందునా; వెన్వెనుకన్= ఆ వెనుకాల వెనకాలనే; క్రమంబునన్= ఒకటి తరువాత ఒకటిగా; విండులవారిన్= ధనుర్ధారులను; ఘోటకంబులన్= గుర్రాలను; కరులన్= ఏనుగులను; రథంబులను= రథాలను; నిలిపినన్= మోహరింపచేయగా; కూడి నిల్చిన= చేరి నిల్చున్న; అనీకమునన్= సేనయందు; కడున్= మిక్కిలి; మంచి యోధులన్= వీరభటులను; కలయఁగన్= అంతటా; ఎందున్= ఎక్కడైనా; ఆ+అయి ప్రకారము= ఆయా తీరుల; వారలన్= వాళ్ళనందరినీ; నిల్పన్= ఉంచటం; బల్పు+అగున్= పుష్టిమంతం అవుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! డాలు మొదలైన ఆయుధసామగ్రిని ధరించినవాళ్ళను సేనలో మొదట నడిపించాలి. ఆ తరువాత విండ్లు ధరించే వాళ్ళనూ, ఆ వెనక గుర్రాలసేననూ, ఆ వెనుకనే గజ బలాన్నీ, ఆ వెనువెనుకనే రథబలాన్నీ నిలబెట్టాలి. వాళ్లల్లో మంచి వీరులను ఏరి అక్కడక్కడా నిలిపినట్లయితే అది మరింత బలాన్ని చేకూరుస్తుంది.

ఆ. బంటు లుత్సహించి పగఱపోయిరి పోయి । రంచుఁ గడఁగి బొబ్బలార్పు లెసఁగ
నతి రయమున నడరు నట్లుగ దొర సము । ద్ధతి యొనర్పవలయుఁ దాఁకుదలల.' 8

ప్రతిపదార్థం: బంటులు= సైనికులు; ఉత్సహించి= విజృంభించి; పగఱ= శత్రువులు; పోయిరి పోయిరి= పారిపోయారు పారిపోయారు; అంచున్= అంటూ; కడఁగి= ప్రయత్నించి (పూనుకొని); బొబ్బలు+ఆర్పులు= పెద్ద అరుపులు; ఎసఁగన్= అతిశయించగా (ఎక్కువ కాగా); అతిరయమునన్= ఎంతో తొందరగా; అడరునట్లుగన్= విజృంభిస్తున్నట్లుగా; తాఁకుదలల= యుద్ధం ప్రారంభంలో; దొర= రాజు; సముద్ధతి= ఎక్కువైన ఉద్ధృతిని (ఆర్భాటాన్ని); ఒనర్పన్ వలయున్= చేయాలి.

తాత్పర్యం: యుద్ధం మొదలుకాగానే శత్రువులకు బెదరు పుట్టేటట్లు భటులు 'శత్రువులు పారిపోయారు పారిపోయారు' అంటూ పెద్దపెట్టున అరుపులూ రంకెలూ వేయాలి. రాజు కూడా అపుడే విజృంభిస్తున్నట్లుగా సముద్ధతి చేయాలి'.

వ. అనుటయుఁ గౌంతేయాగ్రజుండు శాంతనవునితో 'బం ట్లెట్టివారు గావలయు?'నని యడిగిన, నతం
డిట్లనియె. 9

ప్రతిపదార్థం: అనుటయున్= అని మాట్లాడగానే; కౌంతేయ+అగ్రజుండు= కుంతి పెద్దకుమారుడు ధర్మరాజు; శాంతనవునితోన్= శంతను పుత్రుడు భీష్ముడితో; బంట్లు= యోధులు; ఎట్టివారు, కావలయును= ఎట్లాంటి వాళ్ళను కూర్చుకొనాలి; అని అడిగినన్= అని అడుగగా; అతండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగానే ధర్మరాజు 'యుద్ధ భటులు ఎట్లాంటి వారైతే బాగుంటుంది?' అని అడగగానే భీష్ముడు ఇట్లా చెప్పాడు.

తే. ఏనుఁ గేనుంగుఁ బేర్చిన ట్లెసకమెసఁగు । నంగముల సొంపుఁ, బులికిని సింగమునకుఁ
బుట్టినట్టి యుగ్రతయును గట్టి మెఱయ । వలనుఁ గల యోధవీరులు వలయు ననికి. 10

ప్రతిపదార్థం: ఏనుఁగు= ఏనుగు; ఏనుంగున్= మరో ఏనుగుతో; పేర్చినట్లు= విజృంభించేటట్లు; ఎసకమెసఁగు= ఉప్పొంగు; అంగముల సొంపున్= అవయవ సమృద్ధిని; పులికిని= పులికీ; సింగమునకున్= సింహానికీ; పుట్టినట్టి= జన్మించినట్టి; ఉగ్రతయును= భీకరత్వమూ; గట్టి మెఱయన్= శౌర్యాన్ని ప్రదర్శించే; వలనున్+కల= నేర్పు ఉన్న; యోధవీరులు= వీరులైన బంట్లు; అనికిన్= యుద్ధానికి; వలయున్= కావాలి.

తాత్పర్యం: ఏనుగు మరో ఏనుగుతో తలపడి విజృంభించేటప్పటి కండబలం, పులికీ సింహానికీ ఉన్నంత భీకరత్వం, తమ పౌరుషాన్ని ప్రదర్శించుకొనగల చాకచక్యం గల బంట్లు యుద్ధంలో అవసరం.

వ. దేశ విశేషంబు లాకర్ణింపుము: గాంధార సింధు సౌవీరులు కఠారంబుల సబళంబులం బరిశ్రమంబు గలిగి బలశౌర్య సమగ్రులై సర్వసమరంబులకుఁ జాలియుండుదు; ఔశీనరు లెల్ల కైదువులకు నేర్చి సత్త్వవంతులై యుండుదురు; ప్రాచ్యు లేనిక కయ్యంబునకు నేర్తురు; కపట యోధులై యుండుదురు; యవనులుఁ గాంభోజులును మధుర చుట్ల దేశంబులవారును గుట్టపు బవరంబులకు నలవడి యుండుదురు; ఘూర్జరులు బ్రద్దపరుల నడిదంబులం బరిణతులై యుండుదురు; మాళవులు రథంబులు మొదలైన చతురంగ బలంబుల సంగరంబులం జతురులై యొక్కఁ డొక్కండ పెక్కండ్రకైన నోర్చియుండుదురు; గొందఱఁ గొందఱ నిర్దేశించితి; మఱియు ననేకదేశంబులవారు వివిధ ప్రకారంబుల నుండుదు; రయ్యె తెఱంగు లెఱింగి పెనంగించి జయంబు గొనునది' యనిన ధర్మనందనుండు 'జయించు సైన్యంబులం దోఁచు లక్షణంబులు వినవలతు' ననవుడు భీష్ముఁ డతని కిట్లనియె. 11

ప్రతిపదార్థం: దేశవిశేషంబులు= దేశ విశేషాలను గూర్చి; ఆకర్ణింపుము= వినుము; గాంధారసింధు సౌవీరులు= గాంధార సింధు సౌవీరదేశ వీరులు; కఠారంబులన్= కత్తులతో; సబళంబులన్= ఈటెలతో; పరిశ్రమంబు+కలిగి= బాగా సాధనచేసి; బలశౌర్య సమగ్రులు+ఐ= పరాక్రమ, పౌరుషశక్తి, సంపన్నులయి; సర్వసమరంబులకున్= ఎన్నిరకాల యుద్ధాలకైనా; చాలి, ఉండుదురు= సమర్థులై ఉంటారు; ఔశీనరులు= ఔశీనరదేశం వాళ్ళు; ఎల్లకైదువులకున్= అన్ని ఆయుధాలను ఉపయోగించటంలో; నేర్చి= పట్టుగలిగి; సత్త్వవంతులు+ఐ= బలిష్ఠులై; ఉండుదురు= ఉంటారు; ప్రాచ్యులు= తూర్పుదేశీయులు; ఏనికకయ్యంబునకున్= గజ యుద్ధంలో; నేర్తురు= ఆరి తేరినవాళ్ళుగాను; కపట యోధులు+ఐ= మోసకారులైన వీరులై; ఉండుదురు= ఉంటారు; యవనులు= యవనదేశస్థులూ; కాంభోజులును= కాంభోజ యోధులూ; మధురచుట్ల దేశంబులవారును= మధుర చుట్టుప్రక్కలప్రాంతం వాళ్ళూ; గుట్టపుబవరంబులకున్= ఆశ్విక యుద్ధాలకు; అలవడి ఉండుదురు= తగి ఉంటారు; ఘూర్జరులు= ఘూర్జరసేనలు; బ్రద్దపరులన్= ధనుర్విద్యలోనూ; అడిదంబులన్= కత్తీకటారులు తిప్పటంలోనూ; పరిణతులు+ఐ= చేయి తిరిగినవాళ్ళై; ఉండుదురు= ఉంటారు; మాళవులు= మాళవభటులు; రథంబులు= రథాలు మొదలైన; చతురంగబలంబులన్= నాలుగు రకాలైన యుద్ధ సైన్యంతో; సంగరంబులన్= యుద్ధాల్లో; చతురులు+ఐ= నేర్పరులై; ఒక్కఁడొక్కండు= ఒక్కొక్కడే; పెక్కండ్రకున్+ఐనన్= చాలామందిని ఎదుర్కొనటానికైనా; ఓర్చి= తాళ కలిగి; ఉండుదురు= ఉంటారు; కొందఱన్+కొందఱన్= కొద్దిమందిని మాత్రమే; నిర్దేశించితిన్= నిరూపించి చెప్పాను; మఱియున్= ఇంకా; అనేక దేశంబులవారు= ఎన్నో దేశాలవాళ్ళు; వివిధ ప్రకారంబులన్= అనేక విధాలుగా; ఉండుదురు= ఉంటారు; ఆ+ఆ+తెఱంగులు= ఆయా పద్ధతులు; ఎఱింగి= తెలిసికొని; పెనంగించి= పోరాడేటట్లు చేసి; జయంబున్= గెలుపును; కొనునది= చేపట్టాలి; అనినన్= అనగానే; ధర్మనందనుండు= ధర్మరాజు; జయించు= విజయం సాధించే; సైన్యంబులన్= సేనలలో; తోఁచు= కనబడే; లక్షణంబులు= ఆనవాళ్ళను; వినవలతున్= వినాలని ఉన్నది; అనవుడున్= అని అనగానే; భీష్ముఁడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు= ఇట్లా; అనియెన్= మాట్లాడాడు.

తాత్పర్యం: ఇక ఆయాదేశాల వీరభటుల స్వభావాలు ఎట్లా ఉంటాయో చెప్పుతాను వినుము. గాంధార, సింధు, సౌవీర దేశవీరులు కత్తులతో ఈటెలతో బాగా సాధన చేసిన వాళ్ళు. వీళ్ళు ఏ యుద్ధం చేయటానికైనా సంసిద్ధులే. ఔశీనరదేశంవాళ్ళు అన్ని ఆయుధాలను పట్టగలిగే సత్తువ కలవాళ్ళు, పుష్టికలవాళ్ళు. తూర్పుదేశం సేనలు ఏనుగులు ఎక్కిచేసే యుద్ధాలలో ఆరితేరినవాళ్ళు. వీళ్ళు గదాయుద్ధంలోనూ మంచి ఘటికులు. యవనులు, కాంభోజులు, మధుర చుట్టూ ఉన్నదేశాలవాళ్ళు గుర్రాలనెక్కి చేసే యుద్ధంలో మంచి పట్టుగలవాళ్ళు. ఘూర్జరులు బాణం

విసరటంలో, కత్తులూ, కటారులూ తిప్పటంలో చేయితిరిగినవాళ్ళు. మాళవులు రథ, గజ, అశ్వ, పదాతిదళాల పోరులో పండబారిన వాళ్ళు. ఒక్కొక్కడు వేలమంది పెట్టు. ఇంతదాకా నీకు చాలా కొద్ది మందిని గూర్చి మాత్రమే తెలిపాను. ఇంకా అనేక దేశాలసేనలు ఎన్నో యుద్ధవిధానాలలో మంచి నేర్పరులై ఉంటారు. ఆయా యుద్ధపు మెలకువలు తెలిసికొని ఎదిరించి. విజయాన్ని సాధించాలి' - అని అనగానే ధర్మరాజు 'జయం సాధించే సేన ఏ లక్షణాలతో ఉంటుందో చెప్పు'మనగానే భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

ధర్మజునకు భీష్ముఁడు శకునాపశకునములు దెలుపుట (సం. 12-103-2)

క. సైనికుల మనము లుత్సా । హానూనము లగుచునుండు, హయహేషణముల్
వీనులకును సొగియించు, గ । జానీకము లుబ్బు విజయ మగు సైన్యమునన్. 12

ప్రతిపదార్థం: విజయము+అగు= జయం కలిగే; సైన్యమునన్= సేనలో; సైనికుల= సేనలయొక్క; మనములు= మనస్సులు; ఉత్సాహ= సంతోషంతో; అనూనములు= తక్కువకానివి అంటే మరింత ఆనందించేవి; అగుచున్= అవుతూ; ఉండున్= ఉంటాయి; హయ= గుర్రాల; హేషణముల్= సకిలింతలు; వీనులకునున్= చెవులకు (వినటానికి); సొగియించున్= ఇంపు కలిగిస్తాయి; గజ+అనీకములు= ఏనుగుల దండు; ఉబ్బున్= విజృంభిస్తుంది.

తాత్పర్యం: జయం లభించే సేన మంచి ఉత్సాహంగా ఉంటుంది. గుర్రాల సకిలింతలు చెవికి ఇంపుగా వినిపిస్తాయి. ఏనుగుల గుంపు విజృంభిస్తుంది. ఇవి గెలుపునకు సూచకాలు.

క. మృగములుఁ బక్షులు ననులో । మగతిం జరియించు, వెనుక మందానిలుఁ డిం
పుగ వచ్చి మెలఁగుఁ, గడు మే । లగుమాటలు పొడము గెలుచునట్టి బలమునన్. 13

ప్రతిపదార్థం: గెలుచు+అట్టి= జయం ప్రాప్తించే; బలమునన్= సైన్యంలో; మృగములున్= మెకాలూ; పక్షులున్= పిట్టలూ; అనులోమగతిన్= సవ్యం అయిన పోకడలతో; చరియించున్= తిరుగుతాయి; వెనుకన్= తరువాత; మందానిలుఁడు= పిల్లగాలి; ఇంపుగన్= హాయిగా; వచ్చి= తాకి; మెలఁగున్= విసరును; కడుమేలు+అగు= ఎంతో మంచిని కోరే; మాటలు= సల్లాపాలు; పొడమున్= పుట్టుతాయి (వినిపిస్తాయి).

తాత్పర్యం: విజయం చేకూరుతుం దనటానికి గుర్తుగా జంతువులూ పక్షులూ అనుకూలంగా తిరుగుతాయి. చిరుగాలులు వీస్తూ సంతోష పెట్టుతాయి. సైన్యంలోనుండి శుభంకరమైన పల్కులే వినిపిస్తాయి.

క. వెలడు నెడఁ దెలివితో న । గ్నులు వలపల సుడియు శిఖలఁ గొమరగుఁ దూర్యం
బులు గంభీరధ్వనులం । జెలఁగును జయము గొనునట్టి సేనఁ గుమారా!' 14

ప్రతిపదార్థం: కుమారా!= ఓ బిడ్డా!; జయము= గెలుపు; కొనునట్టి= చేపట్టే; సేనన్= సైన్యంలో; వెలడు= బయలుదేరే; ఎడన్= సమయంలో; తెలివితోన్= ప్రకాశంతో (తేజస్సుతో); అగ్నులు= నిప్పులు; వలపల= కుడివైపుగా; సుడియు= తిరిగే (వ్యాపించే); శిఖలన్= మంటలతో; కొమరు+అగున్= ఒప్పుతాయి; తూర్యంబులు గంభీరధ్వనులన్= వాద్యాలు పెనుమ్రోతలతో; చెలఁగున్= మార్మ్రోగుతాయి.

తాత్పర్యం: ఓ బిడ్డా! విజయం పొందే సేన సమరానికి సాగిపోయేటప్పుడు అగ్నిజ్వాలలు ఎర్రగా కుడివైపుగా మండుతాయి. యుద్ధ భేరీలు ధణధణమంటూ భోరున మ్రోగుతాయి.'

క. అని చెప్పి మఱియు నతఁ డి । ట్లను 'ముట్టిన పగఱసొంపునడఁచుట యొప్పున్
విను కయ్యమునకుఁ గాల్ద్ర । వ్వినఁ బాటిలు దురిత మెట్టి విభునకు నైనన్. 15

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; మఱియున్= మళ్ళీ; అతఁడు= భీష్ముడు; ఇట్లు= ఇట్లా; అనున్= పలికాడు; ముట్టిన= చుట్టుముట్టిన; పగఱ= శత్రువులయొక్క; సొంపున్= పెంపును; అడఁచుట= అణగదొక్కటం (నశింపచేయటం); ఒప్పున్= తగి ఉంటుంది; వినుము= ఆలకించుము; కయ్యమునకున్+కాల్ద్రవ్వినన్= యుద్ధానికి సిద్ధపడితే; ఎట్టి= ఎంతటి; విభునకున్= దొరకైనా; దురితము= పాపం; పాటిలున్= కలుగుతుంది.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు తిరిగి ఇట్లా అన్నాడు. 'అయితే ఊరకనే ఎదుర్కొన్న శత్రువుల పొగరు అణచటం మంచిదే. ఇంకొక విషయం కూడా బాగా వినుము. తనకు తానై యుద్ధానికి తలపడితే మాత్రం ఎట్లాంటి రాజుకైనా పాపం చుట్టుకొంటుంది.

క. చెఱువు నడు మవిసినను బెను । వెఱ మెకములు సెదరినను వివేకనిధీ! యు
క్కఱి బహుళసైన్య మఱిముఱిఁ । బఱచిన నాఁగంగ రాదు బలియుర కైనన్. 16

ప్రతిపదార్థం: వివేకనిధీ!= జ్ఞానంగల ధర్మరాజా!; చెఱువు= చెరువుకట్ట; నడుము= నట్టనడిమి భాగం; అవిసినను= గండిపడినా; పెనువెఱన్= మిక్కిలి భయంతో; మెకములు= జంతువులు; చెదరినను= అటూ ఇటూ పారిపోయినా; ఉక్కు+అఱి= శక్తిలేక; బహుళసైన్యము= అధికమైన; అఱిముఱిన్= తత్తరపాటుతో ఎక్కడివక్కడ; పఱచినన్= పరుగులు పెట్టినా; బలియురకున్+ఐనన్= ఎంతటి బలవంతులకైనా; ఆఁగంగన్= ఆపటం; రాదు= కుదరదు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నడిగట్టు తెగిన చెరువునీళ్ళను, బెదరి పారిపోయే క్రూరమృగాలను, యుద్ధం చేసే ఓపికలేక పిరికితనంతో పారిపోయే సైన్యాన్ని అడ్డుకొనటం ఎట్లాంటి మహామహుడికైనా తగదు.

క. విను కొందఱైనఁ గడుఁ దెం । పున మార్కొని కడిమి మీఱి పొంగి యడరినన్
మొన యెంతయైన విఱుగుం; । జనునే కయ్యంబు వొడువ శక్తుల కైనన్. 17

ప్రతిపదార్థం: విను= వినవలసింది; కొందఱు+ఐనన్= కొద్దిమంది అయినా; కడున్+తెంపునన్= ఎంతో సాహసంతో; మార్కొని= ఎదురొడ్డి; కడిమిమీఱి= మించిన పరాక్రమంతో; పొంగి= ఉబ్బి; అడరినన్= విజృంభించగా; మొన= సైన్యం; ఎంత+ఐనన్= ఎంత పాటిదైనా; విఱుగున్= ఓడుతుంది; శక్తులకున్+ఐనన్= ఎంతటి సమర్థుల (నేర్పరుల)కైనా; కయ్యంబు= పోరు; పొడువన్+చనునే?= కలిగించటం తగునా?

తాత్పర్యం: ఒక విషయం వినుము. సైన్యంలో కొద్దిమంది అయినా తెగించి ఎంతో పరాక్రమంతో ఎంతో ఉత్సాహంతో విరుచుకుపడితే ఆ సైన్యం ఎంత పాటిదైనా చెల్లాచెదరైపోతుంది. ఎంత సామర్థ్యం కలవాళ్ళకైనా పోరాడటం సరైన పద్ధతి కాదు. ఎక్కువ సైన్యం ఉంటేనే జయించటం సాధ్యం అనుకొనకూడదు. (ఒకొక్కప్పుడు తక్కువ సైన్యం ఉన్నా జయించవచ్చని భావం).

క. క్షమ మేలగు; నైన నతి । క్షమ దైన్యముఁ దెచ్చు నెదురు గర్వించినఁ గ
య్యము వొడిచి గెలిచి యరిశే । షమునెడ సదయక్షమా విశదుఁ డగు టొప్పున్.' 18

ప్రతిపదార్థం: క్షమ= ఓర్పు; మేలు+అగున్= మంచిదే అవుతుంది; ఐనన్= అయినా; అతిక్షమ= మితిమీరిన సహనం; దైన్యమున్= తక్కువతనాన్ని; తెచ్చున్= తెచ్చిపెట్టుతుంది; ఎదురు= పగవాడు; గర్వించినన్= గర్వపడితే; కయ్యము+పొడిచి= పోరుపెట్టుకొని; గెలిచి= జయించి; అరిశేషము+ఎడన్= మిగిలిన శత్రువుల విషయంలో; సదయ= కరుణతో కూడిన; క్షమావిశదుఁడు+అగుట= ఎంతో ఓర్పు కలిగి ఉండటం; ఒప్పున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: ఓ రాజా! ఓర్పు వహించటం మంచిదే కాని శ్రుతిమించిన సహనం దైన్యానికి త్రోవతీస్తుంది. పగవాడు పొగరుబోతు అయితే యుద్ధంచేసి గెలవాలి. మిగిలిపోయిన శత్రువులపట్ల ఎంతో శాంతి, దయా కనబరచాలి.'

రాజు పగఱయెడ నుండవలయు విధము (సం. 12-104-2)

వ. అనిన నప్పాండవోత్తముండు 'పుడమిఱేఁడు పగఱయెడ నెట్టివాఁడు గావలయు?'ననవుడు నా భూపతితో భీష్ముండు 'బృహస్పతి దివస్పతి కెఱిఁగించిన తెఱఁ గుపదేశించెద' నని యి ట్లనియె. 19

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన భీష్ముడితో; ఆ+పాండవ+ఉత్తముండు= ఆ పాండవులలో ముఖ్యుడైన ధర్మరాజు; పుడమిఱేఁడు= భూపతి (రాజు); పగఱ+ఎడన్= విరోధులపట్ల; ఎట్టివాఁడు= ఎట్లాంటివాడు; కావలయున్= అయి ఉండాలి; అనవుడున్= అనగానే; ఆ భూపతితోన్= ఆ రాజుతో; భీష్ముండు= భీష్ముడు; బృహస్పతి= దేవతల గురువు; దివస్పతికిన్= స్వర్గానికి రాజైన ఇంద్రుడికి; ఎఱిఁగించిన= తెలిపిన; తెఱఁగు= విధానం; ఉపదేశించెదను= బోధపరుస్తాను; అని= అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడితో ధర్మరాజు 'రాజు విరోధుల విషయంలో ఎట్లా ప్రవర్తించాలి?' అని అడిగాడు. భీష్ముడు 'ఒకప్పుడు బృహస్పతి ఇంద్రుడికి చెప్పినట్లుగానే నీకూ చెప్పుతాను విను'మని ధర్మరాజుతో ఇట్లా చెప్పటం ప్రారంభించాడు.

చ. విను మరిఁ జంపనుం జెఱుప వేచుట లెస్స; ప్రతాప భాషణం
బున వెడ నుల్లికుట్టులను బొంకుల వానిఁ గలంగఁ జేసి రేఁ
చినఁ దన పూఁపు దప్పు నఱసేయని చందము నమ్మి యున్న చా
డ్పును మెఱయంగఁ బల్కుచుఁ గడున్ మది నమ్మకయుండఁ గాఁ దగున్. 20

ప్రతిపదార్థం: వినుము= వినుము; అరిన్= పగవాడిని; చంపనున్= చంపటానికి; చెఱుపన్= పాడు చేయటానికి; వేచుట= ఎదురు చూడటం; లెస్స= మంచిది; ప్రతాప భాషణంబునన్= కరకు మాటలతోనూ; వెడన్= పొల్లుకూతలతోనూ; ఉల్లికుట్టులను= సూటిపోటి మాటలతోనూ; బొంకులన్= అబద్ధాలతోనూ; వానిన్= పగవాడిని; కలంగన్+చేసి= కలవర పెట్టి; రేఁచినన్= రెచ్చిపోగా; తన= తనదైన; పూఁపు= ప్రయత్నం; తప్పున్= చెడిపోతుంది; అఱ చేయని చందమున్= దగా చేయని పద్ధతితో; నమ్మి+ఉన్న= నమ్మకం పెట్టుకొన్న; చాడ్పును= తీరును; మెఱయంగన్= ఒప్పేటట్లు (వ్యక్తమయ్యేటట్లు); పల్కుచున్= మాట్లాడుతూ; కడున్= మిక్కిలి; మదిన్= మనస్సులో; నమ్మక= విశ్వసించకుండా; ఉండఁగాన్+తగున్= ఉండటం మంచిది.

తాత్పర్యం: పగవాడిని తుదముట్టించాలన్నా, పాడుచెయ్యాలన్నా అనువుకొరకు వేచి ఉండాలి. అంతేకాని కరుకుగా మాట్లాడిగాని, వ్యర్థంగా మాటలాడిగానీ, పుల్లవిరుపు మాటలాడిగాని, అబద్ధా లాడిగాని వాళ్ళను కలవరపెట్టకూడదు. అట్లా రెచ్చగొడితే తాను తలపెట్టిన ప్రయత్నాలకు అడ్డుపుల్లలు పడతాయి. వాళ్ళను మోసగించని రీతిలో నమ్మినట్లు మాటలలో కనబరచాలి. కాని, లోపల ఏ మాత్రమూ నమ్మకం పెట్టుకొనకూడదు.

చ. అరిపయి వీఁకనెత్తి చనునప్పుడుఁ దేనియ లుట్టు నట్లుగా
నరపతి వాని వారలు వినం బ్రియమాడుట మేలు; పక్షిఁ దాఁ
దిరముగఁ జేయఁగా మృగము తేఁకువ వాపను వేఁటకాఁడు త
త్స్వరములు సూపికాదె తుదిఁ జంపఁ దెగుం దనబారిఁ బాఱినన్. 21

ప్రతిపదార్థం: అరిపయిన్= శత్రువుమీదికి; వీఁకన్= పరాక్రమంతో; ఎత్తి= దండెత్తి; చను+అప్పుడున్= వెళ్ళేటప్పుడు; నరపతి= రాజు; వాని వారలు= వాళ్ళవాళ్ళు; వినన్= వినేటట్లు; తేనియలు= తీయదనం; ఉట్టునట్లు+కాన్= ఉట్టిపడేటట్లుగా; ప్రియము= ఇచ్చకాలు; ఆడుట= పలకటం; మేలు= బాగు; వేఁటగాఁడు= బోయ; తనబారిన్= తన గురి (దృష్టి) నుండి; పాఱినన్= తప్పుకొనిపోగా; తాన్= తాను (బోయ); పక్షిన్= పిట్టను; తిరముగన్= స్థిరంగా (కదలకుండేటట్లు); చేయఁగాన్= చేయటానికి; మృగము= జంతువు; తేఁకువ= భయం; పాపను అని= పోగొట్టటానికి; తద్= ఆయా పిట్టలయొక్క, జంతువులయొక్క; స్వరములు= కూతలు(అరుపులు); చూపి= కలిగించి; తుదిన్= చివరకు; చంపన్= ప్రాణం తీయటానికి; తెగున్+కాదె!= సాహసించును కదా!

తాత్పర్యం: తన గురినుండి తప్పించుకొని తన స్థానంలో దిటవుగా ఉన్న పక్షికీ, జంతువుకూ కలిగే భీతిని పోగొట్టటానికి ఆయా పక్షుల జంతువుల కూతలూ అరుపులూ పెట్టించి రప్పించి, చివరకు వాటి ప్రాణాలు తీయటానికి బోయవాడు పూనుకొంటాడు. అట్లాగే పగవాడి మీదికి పోయేటప్పుడు రాజు వాళ్ళ దగ్గరి వాళ్ళు వినేటట్లు తీయగా కమ్మగా ఇచ్చకాలాడి తప్పించుకొన్న శత్రువును రప్పించి చంపటం తగిన వ్యవహారం అనిపించుకొంటుంది.

విశేషం: అలం: నిదర్శనం.

ఉ. వేమఱు శత్రునిం బరిభవించుట, రిత్తకు రిత్త వైరముం
దా మదిఁ బెట్టికోలు సుఖతంత్రము గాదు, సుసంధికాలమున్
సీమ దగంగ రూపడఁగఁ జేయుటయున్ వల; దగ్గమైన వాఁ
డేమెయి నైన వధ్యుఁ డను నిట్టి వినిశ్చయ మాత్మఁ గల్గుటన్. 22

ప్రతిపదార్థం: అగ్గము+ఐనవాఁడు= స్వాధీనుడైనవాడు; ఏమెయిన్+ఐనన్= ఎట్లాగైనా; వధ్యుఁడు= చంపదగినట్టివాడు; అను+ఇట్టి= అనేటి; వినిశ్చయము= గట్టి భావం; ఆత్మన్= తనలో; కల్గుటన్= కలిగి ఉండటం వలన; వేమఱు= మాటిమాటికి; శత్రునిన్= పగవాడిని; పరిభవించుట= అవమాన పరచటం; రిత్తకు రిత్త= నిష్కారణ; వైరమున్= విరోధాన్ని (పగను); తాన్= తానుగా; మదిన్= మనస్సులో; పెట్టికోలు= పెట్టుకొనటం; సుఖతంత్రము+కాదు= క్షేమమైన ఉపాయం కాదు; సుసంధికాలమున్= చక్కగా ఒక ఒప్పందానికి వచ్చే సమయానికి; సీమ= ఎల్లను (సరిహద్దును); తగంగన్= ఒప్పిదంగా; రూపు+అడఁగన్+చేయుటయున్= రూపు మాపుచేయటం; వలదు= ఒప్పదు.

తాత్పర్యం: చేజిక్కిన శత్రువును ఎట్లాగైనా జయించవచ్చనే గట్టి నిర్ణయాన్ని లోపలపెట్టుకొని పగవాడిని అదే పనిగా అవమానించటం, ఎపుడూ పగతో ఉండటం సరైన సంధి కుదుర్చుకొనే సమయంలో, రాజ్యపు సరిహద్దులను నామరూపాలు లేకుండా చేయటం అనేవి తగని పనులు.

క. కాల విపర్యయమున నర । పాలుఁడు దా మ్రొక్కియైనఁ బగతుఁ గలిసి త
చ్ఛీలమెఱిఁగి తఱియైనం । గాలునిపురి కనుచునది సుకరముగ వానిన్. 23

ప్రతిపదార్థం: కాల విపర్యయమునన్= కాలం కలిసిరానపుడు; నరపాలుఁడు= రాజు; తాన్+మ్రొక్కి+ఐనన్= తనకు తానుగా నమస్కరించి అయినా; పగతున్+కలిసి= శత్రువుతో కూడి; తద్+శీలమున్= అతడి నడవడిని; ఎఱింగి= తెలిసికొని; తఱి+ఐనన్= సమయం వచ్చినప్పుడు; వానిన్= ఆ విరోధిని; సుకరముగన్= మిక్కిలి తేలికగా; కాలునిపురికిన్= యమునిపట్టణానికి; అనుచునది= పంపాలి.

తాత్పర్యం: శత్రువునకు కాలం అచ్చివచ్చినప్పుడు తనకు తానుగానే మొక్కుకొని అయినా లొంగిపోవాలి. అతడితో కలిసిపోవాలి. అతడి నడతను పసిగట్టాలి. తనకు కాలం కలిసిరాగానే పగవాడిని చాల అనాయాసంగా చంపాలి.

క. అనదతనంబును, బెడిదపుఁ ; దనమును లేకుండఁ బరఁగి దరి యొత్తెడు నే
ఱునుబోలె నొత్తవలయును ; మనుజేంద్రుఁడు మార్తురం గ్రమంబున నధిపా! 24

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా!; మనుజ+ఇంద్రుఁడు= మనుష్యులలో ఉత్తముడైన రాజు; మార్తురన్= విరోధులను; క్రమంబునన్= మెల్లగా; అనదతనంబును= దీనత్వాన్ని; బెడిదపుఁ దనమును= కరకు తనాన్ని; లేక ఉండన్= ఏమాత్రం కనపడనీయకుండా; పరఁగి= ఒప్పి; దరి= ఒడ్డును; ఒత్తెడు= ఒరసికొనే; ఏఱును+పోలెన్= నదివలె; ఒత్తవలయును= ఆక్రమించాలి.

తాత్పర్యం: పగవాడిమీద రాజు ఎంతో జాలిపడినట్లుగాని, ఎంతో దురుసుగా ఉన్నట్లుగాని బయటపడకూడదు. ఒడ్డును దాకి మెల్లగా దానిని కోసి విస్తరించే నది మాదిరిగా శత్రువులను మెల్లమెల్లగా ఆక్రమించుకొనాలి.

విశేషం: అలం: ఉపమ.

క. పెక్కండ్రతోడ నీరస ; మొక్క తఱిన కొనక తఱిఁగి యున్న పగతుతో
నుక్కాడి బంధుభావముఁ ; దక్కటి పగఱయెడ వలయుఁ దా నెఱపంగన్. 25

ప్రతిపదార్థం: పెక్కండ్ర తోడన్= చాలా మందితో; ఈరసము= ద్వేషం; ఒక్కతఱిన= ఒకేసారే; కొనక=తెచ్చుకొనక; తఱిఁగి+ఉన్న= తగ్గి ఉన్న (బలహీనపడి ఉన్న); పగతుతోన్= శత్రువుతో; ఉక్కాడి= పగగొని; తక్కటి= తక్కిన; పగఱ+ఎడన్= విరోధుల పట్ల; బంధుభావము= చుట్టరికాన్ని; తాన్= తాను; నెఱపంగన్ వలయున్= కనబరచాలి.

తాత్పర్యం: ఒకేసారి ఎక్కువమందిమీద ద్వేషం పెట్టుకొనకూడదు. తగ్గి ఉన్న పగవాడిపై పగబట్టాలి. కాని, మిగతా శత్రువులతో ఆత్మీయంగా మెలగాలి.

కాలకవృక్షీయ మహాముని క్షేమదర్శికిఁ జెప్పిన హితవాక్యములు (సం. 12-105-2)

వ. అనిన శంతనుపుత్రుతో నజాతశత్రుండు 'నిజపరివారదోషంబున నైనను, బరులచేత నేనియు, సంపద సెడుట నాపదం బొరసిన ధరణీశుండు నెవ్వగ నెవ్విధంబునం బాపికొను? నెఱింగింపు'మనుటయుఁ 'దొల్లి కోసల పతియైన క్షేమదర్శి విదేహపతిచేత భూమిఁ గోల్పోయి వగంబొంది, మున్ను దనకు మంత్రియై యుండి తాను రాజ్యంబు సేయుచుండు బరమశాంతి నొంది వనంబునకుం జనిన కాలకవృక్షీయు నాశ్రయించి, యిట్ల యడిగిన నమ్మనుజపతికి నమ్మునిపతి సెప్పిన వాక్యంబులు సెప్పెద విను మని యక్కురుపితామహుం డిట్లనియె. 26

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; శంతను పుత్రుతోన్= భీష్ముడితో; అజాతశత్రుండు= ధర్మరాజు; నిజపరివార= సొంతపరిజనంయొక్క; దోషంబునన్+ఐనన్= తప్పిదంవలన అయితేనేమి; పరులచేతన్+ఏనియున్= ఇతరుల వలన అయితేనేమి;

సంపద= రాజ్యసంపత్తి; చెడుటన్= కోల్పోవటంచేత; ఆపదన్= కష్టాన్ని; పొరసిన= పొందిన; ధరణీ+ఈశుండు= రాజు; నెఱ+వగన్= ఎక్కువ దుఃఖాన్ని; ఏ విధంబునన్= ఎట్లా; పాపికొనున్?= పోగొట్టుకొంటాడు; ఎఱింగింపుము= తెలియచెప్పుము; అనుటయున్= అనగానే; తొల్లి= ఆనాడు (అపు డెప్పుడో); కోసలపతి+ఐన= కోసలదేశం రాజైన; క్షేమదర్శి= క్షేమదర్శి అనేవాడు; విదేహపతిచేతన్= విదేహదేశపు రాజుచేత; భూమిన్= రాజ్యాన్ని; కోల్పోయి= పోగొట్టుకొని; వగన్+పొంది= విచారించి (బాధపడి); మున్ను= మునుపు; తనకున్= తనకు; మంత్రిఐ+ఉండి= మంత్రిగా ఉండి; తాను రాజ్యంబు చేయుచున్+ఉండన్= తాను పరిపాలిస్తుండగా; పరమ= మిక్కిలి; శాంతిన్+ఒంది= ఓర్పు వహించి; వనంబునకున్= అడవిలోనికి; చనిన= వెళ్ళిన; కాలకవృక్షీయున్= కాలకవృక్షీయుడిని; ఆశ్రయించి= నీడన ఉండి; ఇట్లు= ఇట్లా; అడిగినన్= అడుగగా; ఆ మనుజపతికిన్= ఆ రాజుకు; ఆ+మునిపతి= ఆ మునిరాజు; చెప్పిన= ఆడిన; వాక్యంబులు= మాటలు; చెప్పెదన్= చెప్పుతాను; వినుము+అని= వినవలసినదని; ఆ కురుపితామహుండు= ఆ కురువంశీయుల తాత భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడితో ధర్మరాజు 'సొంత బలగంవలననో ఇతరులవలననో రాజ్యం కూలిపోయి అగచాట్లు పడే రాజు తన బాధను ఎట్లా దిగమింగుకొనాలో చెప్పవలసింది' అనగానే 'కోసలదేశపు రాజు క్షేమదర్శి విదేహదేశపు రాజు చేతిలో రాజ్యాన్ని పోగొట్టుకొని చాలా వెత పొందాడు. ఇంతకు మునుపు తాను పరిపాలించేటప్పుడు మంత్రిగా ఉండి, అడవులలోనికి వెళ్ళిన కాలకవృక్షీయుడి నీడపట్టున చేరి, నీ వడిగినట్లే అడిగాడు. ఆ రాజునకు ఆ ముని చెప్పిన విషయాలే నీకు వినిపిస్తాను. ఆలకించుము అని భీష్ముడు ఇట్లా అన్నాడు.

తే. అర్థవంతుఁడై భోగంబు లనుభవించు । చున్నయప్పుడ యిది యిట్టులుండనేర;
దస్థిరము; తాను లోనుగానని యెఱుంగు । నతఁడు వగఁబొందఁ డేది యెట్లైన నధిప! 27

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! అర్థవంతుఁడు+ఐ= ధనవంతుడై; భోగంబులు= సుఖాలు; అనుభవించుచున్+ఉన్న+అపుడు+అ= పొందుతున్న సమయంలోనే; అది= ఆ ధనం; ఇట్టులు= ఈ తీరులో; ఉండన్+ఏరదు= ఉండదు; అస్థిరము= నిలకడలేనిది; తాను= తనకు తానుగా (నాకు నేనుగా); లోనుగాను= లోబడను; అని ఎఱుంగు+అతఁడు= అని తెలిసికొనేవాడు; ఏది ఎట్లు+ఐనన్= ఏది ఎట్లా జరిగినా; వగన్ పొందఁడు= బాధనొందడు (విచారించడు).

తాత్పర్యం: ఓ కోసలరాజా! బాగా డబ్బుండి సమస్త సుఖాలూ అనుభవించేటప్పుడు 'డబ్బు ఎపుడూ ఇట్లాగే ఉండదు. అనిత్యమైనది. దానికి నేను బానిసను కాకూడదు' అని అనుకొనే రాజునకు ఏది ఎట్లా జరిగినా అంటే డబ్బు ఉన్నా పోయినా చీకూ చింతా ఉండదు.

క. కానియటు లుండి నెఱిఁ బడు; । నైన తెఱఁగు దోఁచి మాయమగు; నిబ్భంగిన్
మానసమున కుబ్బు వగయుఁ । దే నోపుం బనులు; బుధుఁడు దేలఁడు రెంటన్. 28

ప్రతిపదార్థం: పనులు= కార్యాలు; కాని అటులు+ఉండి= కావేమో అన్నట్లు ఉండి; నెఱిన్+పడున్= సిద్ధిస్తాయి; ఐన తెఱఁగు తోఁచి= పని ఫలిస్తుందేమో అనేటట్లు కనబడి; మాయము+అగున్= కాకపోవచ్చును; ఈ భంగిన్= ఇట్లా; మానసమునకున్= మనస్సునకు; ఉబ్బున్= సంతోషాన్ని; వగయున్= దుఃఖాన్ని; తేన్+ఓపున్= తెచ్చిపెట్టగలవు; బుధుఁడు= పండితుడు; రెంటన్= సుఖదుఃఖాలు రెంటి విషయంలోనూ; తేలఁడు= పైకి తేలడు.

తాత్పర్యం: ఒకొక్కపని కాదేమో అనిపించి చటుక్కున నెరవేరుతుంది. ఒకొక్కపని అయితీరుతుం దనిపించి కాకపోవచ్చును. పని ఫలిస్తే మనస్సుకు సంతోషాన్నీ, ఫలించనపుడు విచారాన్నీ కలిగిస్తుంది. మంచీ చెడ్డా తెలిసినవాడు మాత్రం ఈ రెంటి విషయంలోనూ ఎక్కడా బయటపడడు.

విశేషం: అలం: యథాసంఖ్యం.

క. జననీజనకులును సుహృ ।జ్జనులును దెగునపుడు గావఁ జనమి దెలియదే
ధనములు వారల కంటెనె । మనుజేశ్వర! వగపు వాని మగిడించునొకో! 29

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= రాజా!; జననీ జనకులును= తల్లిదండ్రులును; సుహృద్+జనులును= నేస్తగాండ్రును; తెగు+అపుడు= చచ్చిపోయేటప్పుడు; కావన్+చనమి= కాపాడుకొనలేకపోవటం; తెలియదే?= తెలియదా?; ధనములు= సంపదలు; వారలకంటెన్+ఏ= ఆ తల్లిదండ్రులు మొదలైన వారికంటే ఎక్కువా; వగపు= దుఃఖం; వానిన్= వారిని; మగిడించు+ఒకొ!= మళ్ళిస్తుందా ఏమి? మళ్ళించదు.

తాత్పర్యం: ఓ రాజా! చనిపోతున్న తల్లిదండ్రులను ఆప్తులను కాపాడుకొనలేమని తెలిసినపుడు ధనాన్ని ఎట్లా రక్షించుకొనగలం? డబ్బు వారికంటె గొప్పదా? బాధపడినందువలన వారిని తిరిగిపొందలేం. (అశాశ్వతమైన వాటిని గూర్చి వగచి ప్రయోజనంలే దని పిండితార్థం).

క. గతమునకును వగవ కనా । గతమునకును నోరుదెఱచి కడుఁ గోరక దీ
నతఁ బొందక దైవం బే । గతిఁ బుచ్చిన దానఁ బోదుఁ గా కనవలయున్. 30

ప్రతిపదార్థం: గతమునకును= జరిగిపోయినదానికి; వగవక= విచారించక; అనాగతమునకును= రాబోయే దానినిగూర్చి; నోరు+తెఱచి= ఆశపెట్టుకొని; కడున్+కోరక= ఎక్కువ ఆపేక్షించకుండా; దీనతన్= దీనావస్థను; పొందక= చెందక; దైవంబు= విధి; ఏ గతిన్= ఏ తీరున; పుచ్చినన్= ఆదేశిస్తే; దానన్= దానితో; పోదున్+కాక= నడచుకుంటాను గాక; అనన్ వలయున్= అని అనుకోవాలి.

తాత్పర్యం: అయిపోయినదానిని గూర్చి విచారించి ప్రయోజనం లేదు. కాబోయే వాటిని గూర్చి ఆశ పనికిరాదు. దైన్యాన్ని దరిదాపులకు రానీయరాదు. దైవం ఎట్లా నడిపిస్తే అట్లా నడవక తప్పదు - అనే నిశ్చయానికి రావాలి.

క. వెరవును లావును గలిగిన । పురుషులు లే రెట్లు లోకమున; నెవ్వరికిన్
సిరి శాశ్వతంబె? యని వగఁ । బొరయఁడు ధీరుండు కలిమి పోకకు నధిపా! 31

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా!; వెరవును= యుక్తినీ; లావును= శక్తినీ; కల్గిన= కలిగి ఉన్న; పురుషులు= మనుష్యులు; లోకమునన్= ప్రపంచంలో; ఎట్లున్ లేరు= ఎట్లాగైనా ఉండకపోరు; ఏ+వారికిన్= ఎవరికైనా; సిరి= సంపద; శాశ్వతంబె?= నికరమా?; అని= అనుకొని; కలిమి పోకకున్= సిరి తరిగిపోయినందుకు; వగన్= విచారాన్ని; ధీరుండు= ధైర్యం కలవాడు; పొరయఁడు= పొందడు.

తాత్పర్యం: ఓ రాజా! లోకంలోని మానవులంతా శక్తియుక్తులు కలిగినవాళ్ళే. వాళ్ళకంతా ఐశ్వర్యం స్థిరంగా అట్లాగే ఉన్నదా! అనుకొని సంపద పోయినందుకు విచారించకుండా గుండె దిటవు కలవాడు ఏ మాత్రం చింతించడు. (లోకంలోని వాళ్ళంతా ధనాన్ని రాజ్యాన్ని విడిచి వెళ్ళిన వాళ్ళేకదా అని తాత్పర్యం).

క. సారపుసిరి చేటు నరుఁడు । గోరకయే వచ్చునట్లు కోరక యుండన్
శ్రీరాక గలుగు దైవము । కారుణ్యము గలిగెనేని గాధవివేకా! 32

ప్రతిపదార్థం: గాధవివేకా!= బుద్ధిమంతుడవైన ఓ కోసలరాజా!; సారపుసిరి= ఎక్కువైన సంపదలు; చేటు= నశించటం; నరుఁడు= మానవుడు; కోరకయే= కోరకుండానే; వచ్చున్= వస్తుంది (కలుగుతుంది); అట్లు= ఆవిధంగా; కోరక+ఉండన్= కోరుకోకుండానే; దైవము= భగవంతుడి; కారుణ్యము= దయ; కలిగెన్+ఏని= కలిగినట్లైతే; శ్రీరాక= సంపదలు సిద్ధించటం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఓ కోసలరాజా! మనిషి తన సంపదలు సర్వనాశనం కావాలని కోరుకొనకుండానే తుడిచిపెట్టుకుపోతున్నాయి. ధనం పొందాలని ఆశించకుండానే దేవుడిదయవలన వచ్చిపడుతున్నాయి. (డబ్బు రావటం పోవటం అనేది మనిషి చేతిలో లేదని భావం).

క. సిరివిడుచును బురుషుని విను। పురుషుఁడు సిరిఁ దొరఁగు నిది యపూర్వమె ఫల మూ
లరతుండై వాఙ్నియతిం। బొరసియునికి యట్టి చోటఁ బురుషున కమరున్. 33

ప్రతిపదార్థం: విను= వినవలసింది; సిరి= సంపద; పురుషుని= మనిషిని; విడుచును= వదలి పెట్టుతుంది; పురుషుఁడు= మానవుడు; సిరిన్= లక్ష్మిని; తొరఁగున్= విడుచును; ఇది= ఇట్లా జరగటం; అపూర్వమె= కొత్తకాదు కదా!; అట్టిచోటన్= అట్లాంటి సమయాలలో; ఫలమూలరతుండు+ఐ= ప్రయోజనాన్ని ఆశించినవాడై; వాక్+నియతిన్ పొరసి= మాటను కట్టడి చేసికొని; ఉనికి= ఉండటం; పురుషునకున్= మానవుడికి; అమరున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: మనిషి డబ్బును వదలవచ్చును. డబ్బూ మనిషినుండి తొలగిపోవచ్చును. ఇది సర్వసామాన్యమే! ఇట్లాంటి దేమైనా జరిగినప్పుడు మంచి ఫలితాన్ని కోరుకుంటూ మాట్లాడకుండా మౌనంగా ఉండటం ఒప్పిదం అయినపని.

క. కలఁగిన పెద్దమడువు విను। తెలివిఁ బొరయునట్లు దానధీరుం డ ట్ల
గ్గలము లయిన దురితంబులఁ। గలఁగియుఁ దనయంతఁ దేఱు గౌరవ మొప్పన్.' 34

ప్రతిపదార్థం: విను= ఆలకించవలసింది; కలఁగిన= కలతపడిన; పెద్దమడువు= పెద్దచెరువు; తాన= తనంతట తానుగా; ఎట్లు= ఏ విధంగా; తెలివిన్+పొరయున్= తేరుకుంటుందో; అట్లు= ఆ విధంగా; ధీరుండు= ధైర్యంకలవాడు; అగ్గలములు+అయిన= ఎక్కువగా కలిగిన; దురితంబులన్= పాపాలచేత; కలఁగియున్= కలతపడీ; గౌరవము= ఆదరువు; ఒప్పన్= కలిగే విధంగా; తన+అంతన్= తనకుతానే; తేఱున్= తేరుకుంటాడు.

తాత్పర్యం: పెద్ద మడుగులోని నీళ్ళు కలకబాటినా మళ్ళీ కాసేపటికి ఎట్లా తేటపడతాయో ఆ విధంగానే గుండె దిటవు కలవాడు తాను చేసిన పాపాలకు కలవరపడినా తనకు తానుగానే తెప్పరిల్లుతాడు.'

విశేషం: అలం: ఉపమ.

వ. అని చెప్పి 'యిది యుపశమన ప్రకారంబు; నీతి యెఱిఁగించెద; నాకర్ణింపు' మనుటయు నమ్మునివరుతో
నమ్మనుజవరుండు 'మహాత్మా! నిన్నుఁ జేరి యేను దురితంబులం దొలంగవలదె? యానతి' మ్మనిన నతం డతని
కిట్లనియె. 35

ప్రతిపదార్థం: ఇది ఉపశమన ప్రకారంబు= ఇది బాధను నిమ్మళించుకొనే పద్ధతి; అని చెప్పి= అని చెప్పి; నీతి= రాజధర్మాన్ని; ఎఱిఁగించెదన్= తెలుపుతాను; ఆకర్ణింపుము= వినుము; అనుటయున్= అనటంతోనే; ఆ+మునివరుతోన్= ఆ ముని శ్రేష్ఠుడితో; ఆ+మనుజవరుండు= ఆ రాజు; మహాత్మా!= గొప్పవాడా!; నిన్నున్+చేరి= నిన్ను ఆశ్రయించి; ఏను= నేను; దురితంబులన్= పాపాలనుండి; తొలంగ వలదె?= తప్పుకొనవద్దా?; ఆనతి+ఇమ్ము= ఆజ్ఞాపించవలసింది; అనినన్= అనగానే; అతండు= ఆ కాలకవృక్షీయ ముని; అతనికిన్= ఆ రాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఇది బాధను తగ్గించుకొనే తీరు. నీతిని గూర్చి చెప్పుతాను ఆలకించుము' - అనగానే ఆ మునితో ఆ రాజు 'ఓ మహానుభావా! నీ అండలో పాపాలను కడుక్కునేందుకు ఆదేశించవలసింది' అని అడగగానే ఆ ముని ఇట్లా అన్నాడు.

సీ. 'తద్దయు శాంతుఁడై తక్కువ కోర్చి శ । త్రునిఁ గని యొడఁగూడి మనఁగవలయు;
మన్నెరాజుల భూమి మర్దించి సైన్య మ । ల్లన కూర్చి వైరి పైఁ జనఁగవలయుఁ;
బ్రబలునిఁ జేరి యారాధించి యాతని । సేనతోడుగ నరిఁ జెఱుపవలయు;
విషమున మాంత్రిక విధిఁ బంపుపోటున । నలయక రిపుఁ దెగటార్పవలయుఁ;

తే. బొంచి భేదంబొనర్చి కలంచియేని । నంగనలఁ గొని వారి మాయలఁ దగిల్చి
యైన మఱియును బహువిధోపాయములను । దెగువ డింపక పగతు సాధింప వలయు.' 36

ప్రతిపదార్థం: తద్దయున్= మిక్కిలి; శాంతుఁడు+ఐ= శాంతం పొంది; తక్కువకున్= చులకన తనానికి; ఓర్చి= ఓర్చుకొని; శత్రునిన్+కని= విరోధిని చూచి; ఒడన్+కూడి= కలసిమెలసి; మనఁగన్ వలయున్= బ్రతకాలి; మన్నెరాజుల= సామంత రాజుల; భూమిన్= రాజ్యాన్ని; మర్దించి= జయించి; సైన్యమున్= సేనను; అల్లన కూర్చి= మెల్లగా సమకూర్చుకొని; వైరిపైన్= విరోధిపై; చనఁగన్ వలయున్= దండెత్తిపోవాలి; ప్రబలునిన్+చేరి= బలవంతుడి దరిచేరి; ఆరాధించి= సేవించి; ఆతనిసేన తోడుగన్= అతడిసేనల సాయంతో; అరిన్= శత్రువును; చెఱుపన్ వలయున్= నాశనం చేయాలి; విషమునన్= విషంతోనూ; మాంత్రిక విధిన్= గారడీలతోనూ; పంపుపోటునన్= పెట్టుకొన్న పోరుతో; అలయక= శ్రమపడక; రిపున్= శత్రువును; తెగటార్పన్ వలయున్= చంపాలి (నూకలు చెల్లించాలి); పొంచి= వేచి; భేదంబున్+ఒనర్చి= ఒకరి కొకరికి పడకుండా చేసి; కలంచి ఏనిన్= కలతపెట్టి అయినా; అంగనలన్+కొని= స్త్రీలను ఆధారంగా చేసికొని; వారి మాయలన్= (ఆడ)వాళ్ళ కపటాలలో; తగిల్చి+ఐనన్= మోహించేటట్లుచేసి అయినా; మఱియును= మళ్ళీ; బహువిధ= అనేక విధాలైన; ఉపాయములను= విరోధిని లొంగదీసికొనే సాధనాలతో; తెగువ= తెంపు; డింపక= వీడక; పగతున్= పగవాడిని; సాధింపన్వలయున్= పోరుపెట్టుకుంటూ ఉండాలి.

తాత్పర్యం: రాజు ఎంతో శాంతంగా తన తక్కువతనాన్ని ఓర్చుకుంటూ పగవాడితో కలిసిమెలసి బ్రతకాలి. సామంతరాజుల బలగాన్ని సంతరించుకొని, వాళ్ళ ద్వారా శత్రువు మీద కత్తి దూయాలి. బలవంతులను కొలిచి, వాళ్ళ అండతో శత్రుస్థావరాలను ఆక్రమించాలి. విషం పెట్టి అయినా, గారడీ చేసి అయినా, కయ్యానికి కాలుదువ్వి అయినాసరే, పగవాడిని దుంపనాశనం చేయాలి. వాళ్ళలో వాళ్ళకు పుల్లలు పెట్టి అయినా, ఆడవాళ్ళ మాయలలో పడేసి అయినా ఇంకా ఎన్నో రకాల ఉపాయాలతో అయినా పట్టువదలకుండా శత్రువును పడగొట్టాలి.'

వ. అని చెప్పె నని చెప్పి, గాంగేయుండు వెండియుఁ జెప్పు 'నా కౌసల్యుం డధర్మోపాయ విధాయకంబు లగు నుపాయంబులకుం జొరంజాల ననిన నమ్ముని తద్విరోధి యగు విదేహవిభు రావించి యేకాంతంబున నా క్షేమదర్శిం బేర్కొని నీ వతని రాజ్యంబుగొని యున్నవాఁడ వన్నరపతి యొండుమైఁ గార్యంబు సూచుట యొప్పదు సంధిసేయుమని వెరవు కలిమి నొడంబఱిచి యిరువురకును సంధి యొనర్చి నెయ్యంబు చాటించి వీడుకొల్పినఁ గౌసల్యుం దోడ్కొని చని, యతనికిఁ దనకూఁతు నిచ్చి కరితురగాది వివిధ పదార్థంబు లొసంగి విదేహ జనవల్లభుం డవ్వసుమతీవల్లభుని నిజపురంబున కనిచిపుచ్చె; రాజులకు జయాపజయంబు లనుభావ్యంబులు; మదవిషాదంబు లనాదరణీయంబు' లనవుడు ధర్మనందనుండు 'పరిజనంబులయందు గణంబులైయున్నవారిం బరిపాలించు సమ్యక్కారంబు సెప్పు'మనుటయు నమ్మహీకాంతునకు శాంతనవుం డిట్లనియె. 37

ప్రతిపదార్థం: అని= ఇట్లా; చెప్పెన్= చెప్పాడు; అని చెప్పి= అని కాలకవృక్షీయముని కోసలరాజునకు తెలియచెప్పాడని చెప్పి; గాంగేయుండు= భీష్ముడు; వెండియున్= మళ్ళీ; చెప్పున్= చెప్పటం మొదలుపెట్టాడు; ఆ కౌసల్యుండు= ఆ క్షేమదర్శి; అధర్మ=

అన్యాయాన్ని; విధాయకంబులు+అగు= ఆచరించేవి అయినట్టి; ఉపాయంబులకున్= పన్నుగడలను గురించి; చొరన్+చాలను= అనుసరించలేను; అనినన్= అనగానే; ఆ+ముని= ఆ కాలకవృక్షీయుడు; తద్+విరోధి+అగు= ఆ రాజు శత్రువు అయిన; విదేహవిభున్= విదేహరాజును; రావించి= రప్పించి; ఏకాంతంబునన్= రహస్యంగా; ఆ క్షేమదర్శిన్= ఆ కోసలరాజును; పేర్కొని= ప్రస్తావించి; నీవు; అతని రాజ్యంబున్= అతడి పాలనా భాగాన్ని; కొని ఉన్నవాఁడవు= ఆక్రమించుకొన్నావు; ఆ+నరపతి= ఆ రాజు; ఒండుమైన్= మరొక కార్యంబు; చూచుట= పని తలపెట్టటం; ఒప్పదు= తగదు; సంధిచేయుము= రాజీచేసికొనుము; అని; వెరవు కలిమిన్= ఉపాయంగా; ఒడంబఱిచి= ఆమోదింపచేసి (ఒప్పించి); ఇరువురకును= ఇద్దరికీ; సంధి ఒనర్చి= పొత్తు కుదిర్చి; నెయ్యంబు=స్నేహాన్ని; పాటించి= కలిగించి; వీడుకొల్పినన్= వీడ్కోలు ఇవ్వగా (సాగనంపగా); కౌసల్యున్= కోసలాధిపతిని;తోడ్కొని= తీసికొని; చని= వెళ్ళి; అతనికిన్= ఆ రాజుకు; తన కూఁతున్= సొంతకూతురిని; ఇచ్చి= వివాహంచేసి; కరి= ఏనుగులు; తురగ+ఆది= గుర్రాలు మొదలైన; వివిధ పదార్థంబులు= అనేక వస్తువులను; ఒసఁగి= ఇచ్చి; విదేహజనవల్లభుండు= విదేహదేశపురాజు; ఆ+వసుమతీ వల్లభునిన్= ఆ రాజును; నిజపురంబునకున్= అతడి సొంత నగరానికి; అనిచిపుచ్చెన్= పంపించాడు; జయ+అపజయంబులు= గెలుపు ఓటములు; అనుభావ్యంబులు= అనుభవించవలసినవే; మద= గర్వం; విషాదంబులు= దుఃఖాలు; అనాదరణీయంబులు= పాటించరానివి; అనవుడున్= అనగానే; ధర్మనందనుండు= ధర్మరాజు; పరిజనంబుల+అందున్= సేవకులలో; గణంబులు+ఐ ఉన్నవారిన్= గుంపుగా కూడి ఉన్నవాళ్ళను; పాలించు= ఏలుకొనే; సమ్యక్ ప్రకారంబు= మంచి తోవను; చెప్పుము= చెప్పవలసింది; అనుటయున్= అనటంతోనే; ఆ+మహీకాంతునకున్= ఆ ధర్మరాజునకు; శాంతనవుండు= భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అట్లా ఆ ముని కోసలరాజుతో శత్రువును తెగటార్చే ఉపాయం తెలిపినా, క్షేమదర్శి 'నేను ఎట్లాంటి అన్యాయానికి ఒడిగట్టను' అనగానే ఆ ముని శత్రురాజైన విదేహరాజును పిలిపించి ఏకాంతంగా క్షేమదర్శిని గూర్చి వివరించి చెప్పి 'రాజా! నీవు క్షేమదర్శి రాజ్యాన్ని స్వాధీనపరచుకున్నావు. ఆ రాజు ఏదో ఒక అడ్డుదారిలో రాజ్యాన్ని తిరిగి సంపాదించుకొనటం తగదు. ఇద్దరూ ఒక ఒప్పందానికి రం'డని యుక్తిగా చెప్పి అంగీకరించేటట్లు చేసి, ఇద్దరికీ పొత్తు కలిపి, స్నేహభావంతో సాగనంపాడు. విదేహరాజు ఆ కోసలరాజుతో వియ్యమంది, అరణంగా ఏనుగులూ, గుర్రాలు మొదలైన ఎన్నో వస్తు వాహనాలను ఇచ్చి, కోసలరాజ్యానికి సాదరంగా పంపాడు. అయినా రాజులకు గెలవటం ఓడటం అనేవి అనుభవించదగినవే. గెలుపొందినపుడు గర్వపడటం, ఓడినప్పుడు బాధపడటం మంచిది కాదు' అనగానే ధర్మరాజు 'పరిజనంలోని గణజనులను ఎట్లా ఏలుకొనాలో ఆ తీరులను విశదం చేయండి' అన్నాడు. అప్పుడు భీష్ముడు ఇట్లా అన్నాడు.

ధర్మరాజునకు భీష్ముండు గణజనులం బాలించు ప్రకారంబు సెప్పుట (సం. 12-108-10)

క. 'విను మర్థార్జకులును గా । ర్యనిపుణ మానసులు నాయుధాజీవులుఁ ద
క్కును గల పనుల జనులుఁ గల । రనఘా! యొక్కిండ్ల వార లైన జనంబుల్. 38

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పుణ్యాత్ముడా!; వినుము= ఆలకించుము; అర్థార్జకులును= డబ్బును వసూలుచేసి కూడబెట్టేవాళ్ళూ; కార్యనిపుణ మానసులున్= పనులను తీర్చిదిద్దే సామర్థ్యం గలవాళ్ళు (మంత్రులు); ఆయుధ+ఆజీవులున్= ఆయుధ ప్రయోగమే జీవనంగా గలవాళ్ళూ (ఆయుధ సైనికులు); తక్కునుగల= మిగతా; పనులన్= పనులను చేసే; జనులున్= పరిజనులూ; ఒక్క ఇండ్ల వారలు+ఐనన్= ఒకే తెగకు చెందిన వాళ్ళైన; జనంబుల్= సామాన్య జనులు; కలరు= ఉంటారు.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! వినుము. కోశాగారం నింపే కోశాధికారులూ, ఎంతో చాకచక్యంగా పనులను చక్కబెట్టే అమాత్యులూ, ఆయుధధారు లైన సైనికులూ, మిగతా పనులు చేసే పరిజనం గణజను లవుతారు. పరిజనులు ఒకే తరగతికి చెందిన సామాన్యులు.

విశేషం: గణము= సమూహం - సేనా విశేషం. 27 ఏనుగులు, 51 గుర్రాలు, 135 పదాతులు కలది.

క. వారు గదాగణములు పతి । వారలతోఁ గలసి మెలఁగువడువున నయ్యె
వారి తెఱఁ గెఱుఁగవలయును । వారికి నెమ్మి గలిగించు వలనొదవుటకున్. 39

ప్రతిపదార్థం: వారు+కదా!= వాళ్ళే కదా!; గణములు= సంఘంలోని జనులు; పతి= రాజు; వారలతోన్+కలసి= వాళ్ళల్లో ఒకడుగా కలసిపోయి; మెలఁగు వడువునన్= మసలుకొనే తీరున; వారికిన్= ఆ గణాలకు; నెమ్మి= శుభం; కలిగించు= ఒనగూర్చే; వలను= ఉపాయం; ఒదవుటకున్= సిద్ధంచేయటానికి; ఆ+ఆ+వారి= ఆయా వాళ్ళ; తెఱఁగు= తీరు; ఎఱుఁగవలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: వాళ్ళనే 'గణజనులు' అంటారు. రాజు వీళ్ళతో కలసి మెలగుతున్నట్లు ఉండాలి. వాళ్ళకు శుభం కలిగించే ఉపాయాన్ని సిద్ధింపచేయటానికి ఆయా వాళ్ళ తీరులను తెలిసికొనాలి.

సీ. కుల మొక్కఁడైనఁ దేఁకువలేక బుద్ధియు । శౌర్యంబుఁ బెంపును సరకుగొనక
యెట్టివారలతోడ నెవ్వరైనను మత్స । రంబు గల్గుదురు గణంబు జనులు
దాన నంతర్భేదమైన శత్రులు వాపి । కొండ్రు గొందఱ నది గ్రొచ్చు రాజ్య
మూలంబుఁ గావున మున్ను భూపాలుండు । వారినందఱఁ దగు వచన రచన

తే. నీగి మన్ననఁ గలఁగంగనీక పొదివి । యధికముగ గణముఖ్యుల నాదరించి
పనులు గొనునది తమలోనఁ బాయకుండఁ । బ్రోవు లెడలిన రాజ్యంబు పాలుపు దప్పు. 40

ప్రతిపదార్థం: గణంబు= సంఘంలోని; జనులు= పరిజనులు; కులము+ఒక్కఁడు+ఐనన్= ఒకే జాతికి చెందిన వాళ్ళైనా; తేఁకువ లేక= ఉచితానుచితాలు తెలిసికొనకుండా; బుద్ధియున్= వివేకాన్ని; శౌర్యంబున్= పరాక్రమాన్ని; పెంపును= గౌరవాన్ని; సరకుగొనక= లెక్క చేయక; ఎట్టి వారలతోడన్= ఎట్లాంటి వాళ్ళతో అయినా; ఎవ్వరు+ఐనను= ఎట్లాంటి వాళ్ళైనా; మత్సరంబు కల్గుదురు= ద్వేషం పెట్టుకొంటారు; దానన్= అందువలన; అంతర్భేదము+ఐనన్= వాళ్ళల్లో వాళ్ళకు మనస్పర్థలు ఏర్పడితే; శత్రులు= ఎదుటి పక్షంవాళ్ళు; కొందఱన్= కొంతమందిని; పాపికొండ్రు= తమలోకి లాగుకొంటారు; అది= విడిపోవటం అనేది; రాజ్యమూలంబున్= మూలరాజ్యాన్నే; గ్రొచ్చున్= పెకలిస్తుంది; కానన్= కాబట్టి; మున్ను= ముందుగానే; భూపాలుండు= రాజు; వారిన్+అందఱన్= వాళ్ళందరిని; తగు= ఉచితం అయిన; వచనరచనన్= మాటల మూటలతోను (సల్లాపాలతో); ఈగి= దానాలతోనూ; మన్ననన్= ఆదరణలతోనూ; కలగంగన్+ఈక= కలత చెందనీక; పొదివి= పట్టి; అధికముగన్= ఎక్కువగా; గణముఖ్యులన్= సంఘ ప్రధానులను; ఆదరించి= మన్నించి (గౌరవించి); పనులుకొనునది= పనులు తీర్చుకొనాలి; తమలోనన్= తమలో తాము; పాయక+ఉండన్= చీలకుండా; ప్రోవులు= గణాలు; ఎడలినన్= వీడిపోతే; రాజ్యంబు= రాజ్యం; పాలుపుతప్పున్= సొంపే పోతుంది.

తాత్పర్యం: ఈ గణం జనులు ఒక తెగకు చెందిన వాళ్ళే అయినా మంచి చెడ్డలు లేని వాళ్ళై, వాళ్ళ వాళ్ళ తెలివిని పౌరుషాన్ని, గొప్పతనాన్నిగూర్చి లెక్కపెట్టరు. అందువలన ఎట్లాంటి వాళ్ళతో అయినాసరే విరోధం పెట్టుకొంటారు. ఈ కారణంగా లోపల లోపల విభేదాలు వస్తాయి. ఇది ఆసరా చేసికొని శత్రువులు చేరదీస్తారు. గణజనంలో ఇట్లాంటి మనస్పర్థలు ఏర్పడితే మూలగద్దెకే ముప్పు వస్తుంది. కాబట్టి ఇదంతా రాకముందే వాళ్ళందరిని రాజు మంచి మాటలు చెప్పి, దానధర్మాలు చేసి, గౌరవించి ఆదరించాలి. వాళ్ళలో వాళ్ళు విడిపోకుండా చూచుకొంటూ పనులు చక్కదిద్దుకొనాలి. చీలికలు వస్తే మాత్రం (మొదటికే మోసం వస్తుంది) రాజ్యం కుప్పకూలిపోతుంది.

క. ఎక్కార్యములను గణజను । లొక్కటి యై మెలఁగుచున్న నుర్వీశునకున్
మిక్కిలి సిరియగుఁ గావునఁ । దక్కక యరయంగవలయుఁ దగ గణవిధముల్.' 41

ప్రతిపదార్థం: ఏ+కార్యములను= ఏ పనులను గురించి అయినా; గణజనులు= గుంపులోని వాళ్ళు; ఒక్కటి+ఐ= ఒకమాటమీద; మెలఁగుచున్+ఉన్నన్= ఉంటుంటే; ఉర్వీ+ఈశునకున్= రాజునకు; మిక్కిలి= ఎక్కువగా; సిరి+అగున్= సంపదలు కలుగుతాయి; కావునన్= కాబట్టి; తగన్= ఒప్పేటట్లు; గణ విధముల్= సంఘ పరిజనుల పద్ధతులు; తల+కొని= పూనుకొని; అరయంగన్ వలయున్= గమనించుకొనాలి.

తాత్పర్యం: ప్రతి పనిలోనూ గణజనులంతా ఒక్కటిగా ఉంటే ఆ రాజు రాజ్యంలో సిరి తాండవిస్తుంది. కనుక గణవిధానాన్ని పని పెట్టుకొని శ్రద్ధగా పరిశీలించుకొంటూ ఉండాలి'.

ధర్మరాజునకు భీష్ముండు ధర్మసూక్ష్మత తెఱం గెఱిఁగించుట (సం. 12-109-3)

వ. అనుటయు ధర్మజుండు 'ధర్మంబులు బహుశాఖలు గలిగియుండు; నన్నియు ననుష్ఠింపవచ్చునే? యెయ్యది యాచరించి పురుషుండైహికాముష్మిక సుఖంబులం బొందు?'నని న మందాకినీనందనుండతని కిట్లనియె. 42

ప్రతిపదార్థం: అనుటయున్= అని మాటాడగానే; ధర్మజుండు= ధర్మరాజు; ధర్మంబులు= పుణ్యాచారాలు; బహుశాఖలు= అనేక విధాలుగా; కలిగి ఉండున్= ఉంటాయి; అన్నియున్= అన్ని; అనుష్ఠింపన్ వచ్చునే?= ఆచరించ వీలవుతుందా?; ఏ+అది= ఏ ధర్మాన్ని; ఆచరించి= చేసి; పురుషుండు= మానవుడు; ఐహిక= ఈ లోకానికి సంబంధించిన; ఆముష్మిక= పై లోకానికి సంబంధించిన; సుఖంబులన్= సౌఖ్యాలను; పొందున్?= అనుభవిస్తాడు?; అనినన్= అనగానే; మందాకినీ నందనుండు= గంగాదేవి పుత్రు డైన భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అని అనటంతోనే ధర్మరాజు 'ధర్మాలు ఎన్నో రూపాలలో ఉన్నాయి కదా! వాటన్నిటిని ఆచరించటం సాధ్యం కాదు. కనుక ఏ ధర్మాన్ని ఆచరిస్తే మానవుడు ఈ లోకంలోనూ పై లోకంలోనూ హాయిగా ఉండగలుగుతాడు?' అని అడగగానే భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

సీ. 'విను తల్లియును దండ్రియును గురుండును సేవ । నీయులు సద్భక్తి నిత్యనిరతి
వారలఁ గొలుచుచు వా రెద్ది సెప్పిన । నది యాచరించుట యధిక ధర్మ;
మాగమత్రయమును నగ్నిత్రయంబు లోక । త్రయంబును దేవతాత్రయంబు
ననువస్తువులు వార లందును జనని గౌ । రవమున నెక్కుడు రాజవర్య!

తే. యీ జగంబున దివమునం బూజ వడయు । మాతృభక్తుండు పితృభక్తి మానసుండు
నట్ల యవ్యయానందసంప్రాపణంబు । గురు పదాబ్జ సమారాధకుండుఁ గాంచు. 43

ప్రతిపదార్థం: రాజవర్య!= రాజులలో కెల్ల గొప్పవాడా!; విను= వినుము; ఆగమత్రయమునున్= ఋగ్యజుస్సామ వేదాలు మూడూ; అగ్నిత్రయంబు= ఆహవనీయ, దాక్షిణాత్య, గార్హపత్యాగ్నులు మూడూ; లోకత్రయంబును= స్వర్గ, మర్త్య, పాతాళలోకాలు మూడూ; దేవతాత్రయంబున్= బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురూ; అను వస్తువులు= అనే పదార్థాల వంటి వారు అయిన; తల్లియును= కన్నతల్లీ; తండ్రియును= తండ్రి; గురుండును= గురువూ; సేవనీయులు= కొలవదగ్గవారు; సత్+భక్తిన్= మేలైన భక్తితో; నిత్యనిరతిన్= ఎంతో ఆసక్తితో; వారలన్= వారందరినీ; కొలుచుచున్= సేవిస్తూ; వారు= వాళ్ళు; ఎద్ది= ఏది; చెప్పినన్= చెప్పినా;

అది= ఆ ధర్మాన్ని; ఆచరించుట= ఆచరణలో పెట్టటం; అధిక ధర్మము= గొప్పధర్మం; వారలందును= వారందరిలోకూడా; జనని= తల్లి; గౌరవమునన్= గొప్పతనంలో; ఎక్కుడు= అధికం; ఈ జగంబునన్= ఈ లోకంలోను; దివమునన్= స్వర్గలోకంలోనూ; మాతృభక్తుండు= తల్లిమీద ఆదరం కలవాడు; పితృభక్తి మానసుండు= తండ్రిమీద భక్తి భావం కలవాడు; పూజ పడయున్= ఆదరించబడతాడు; అట్లు= అట్లాగే; గురుపదాబ్జ సమారాధకుండు= గురుపాదసేవకుడు కూడా; అవ్యయ+ఆనంద సంప్రాపణంబున్= బ్రహ్మానంద సంప్రాప్తిని; కాంచున్= పొందుతాడు.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. తల్లీ, తండ్రీ, గురువూ ఈ ముగ్గురూ నిత్యం సేవించవలసినవారు. ఎంతో భక్తితో వాళ్ళకు సేవలందిస్తూ వా రేది చెప్పితే దానిని ఆచరణలో పెట్టటం ఉత్తమ ధర్మం. ఈ ముగ్గురూ వేదత్రయం వంటివారు. త్రేతాగ్నులవంటివారు, ముల్లోకాలవంటివారు, త్రిమూర్తులవంటి వారు, వీరిలో తల్లికే ఎక్కువ గౌరవం. తల్లిదండ్రులమీద అభిమానం కలవాడు ఇహపరలోకాలలో గౌరవించబడతాడు. గురువును సేవించుకొనేవాడు అవ్యయానందాన్ని పొందుతాడు.

వ. అనవుడు నజాతశత్రుండు గంగాపుత్రునితో 'సత్యానృతంబులు జగంబులం బరఁగియుండుఁ బురుషుండు వానియెడ నెబ్భంగివాఁడై ధర్మపరుం డగు?' నని యడిగిన నమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె. 44

ప్రతిపదార్థం: అనవుడున్= అనటంతోనే; అజాతశత్రుండు= ధర్మరాజు; గంగాపుత్రునితోన్= భీష్ముడితో; సత్య+అనృతంబులు= నిజం, అబద్ధాలు; జగంబులన్= ముల్లోకాలలో; పరగి ఉండున్= ఒప్పి ఉంటాయి; పురుషుండు= మానవుడు; వానిఎడన్= వాటి విషయంలో; ఏ+భంగి వాఁడై= ఏ విధం అనుసరించేవాడై; వాడు+ఐ= తనకు తానై; ధర్మపరుండు+అగున్?= ధర్మానికి కట్టుబడి ఉంటాడు?; అని+అడిగినన్= అని అడుగగా; ఆ+మహీపతికిన్= ఆ రాజుతో; ఆ మహాత్ముండు= ఆ భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడిని 'లోకంలో నిజానిజాలు సిద్ధమై ఉన్నాయి కదా! వాటి విషయంలో మనిషి తనకు తానుగా ఏ విధంగా ధర్మానికి బద్దుడై ఉండాలో చెప్పు'మనగానే భీష్ముడు ఈ విధంగా చెప్పసాగాడు.

సీ. 'సత్యంబు వలుకుట సర్వధర్మములకు । మిక్కిలి; యనృతంబు మేటి పాత
కము; తద్విశేషంబు గలదు చెప్పెద; నొరు । నర్థంబుఁ బ్రాణంబు నపహరింపఁ
జూచు; పాతకులతో సూనృతం బాడుట । పాపంబు బొంకులు వలికి యట్టి
వారి హింసించుట వరధర్మ మిది యొక్కఁ । డేల భూతములకు హితము సేయు

తే. బొంకు లెల్లను ధర్ములో భూత బాధ । కంబు లగు నిక్కములు పాతకములు వినుము!
భూతముల దుష్ట శిష్టత్వములు వివేక । సూక్ష్మతా వేద్యములు వానిఁ జూడవలయు. 45

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; సర్వధర్మములకున్= అన్ని పుణ్యాలకంటె; సత్యంబు= నిజం; పలుకుట= చెప్పటం; మిక్కిలి= ఎక్కువ; అనృతంబు= అబద్ధం ఆడటం; మేటిపాతకము= ఎంతో పాపం; తద్= దాని విషయంలో (పాపపుణ్యాల విషయంలో); విశేషంబు= చెప్పుకొనవలసింది; కలదు= ఉన్నది; చెప్పెదన్= చెప్పుతాను; ఒరున్= ఇంకొకడి; అర్థంబున్= సొమ్మును; ప్రాణంబున్= ఉసురును; అపహరింపన్+చూచు= దోచుకొనాలనుకునే; పాతకులతోన్= పాపులతో; సూనృతంబు= నిజాన్ని; ఆడుట= పలకటం; పాపంబు= కీడు; బొంకులు+పలికి= అబద్ధాలు ఆడి; అట్టివారిన్= అట్లాంటి వాళ్ళను; హింసించుట= నొప్పించటం; వరధర్ముము= మంచి పుణ్యం; ఇది+ఒక్కఁడు+ఏల= ఇదొక్కటే కాదు; భూతములకున్= జీవులకు; హితము చేయు= మేలుచేసే; బొంకులు= అబద్ధాలు; ఎల్లనుధర్ములో= అన్నీ ధర్మాలు (అవుతాయి); భూత బాధకంబులు+అగు= జీవులను దుఃఖపెట్టేవి అయిన;

నిక్కములు= నిజాలు; పాతకములు= పాపాలు (అవుతాయి); భూతములన్= ప్రాణులలోని; దుష్టశిష్టత్వముల్= చెడూ, మంచీ; వివేక సూక్ష్మతా; వేద్యములు= అతిసూక్ష్మం (అల్పాల్పం) అయిన బుద్ధివలన తెలిసికొనదగినవి; వానిన్ చూడవలయున్= వాటిని జాగ్రత్తగా చూడాలి.

తాత్పర్యం: అయితే వినుము. ధర్మాలలోకెల్లా ఉత్తమమైన ధర్మం నిజం చెప్పటం. పాపాలలోకెల్ల మహాపాపం అబద్ధాలాడటం. ఈ రెంటి విషయంగా చెప్పుకొనదగ్గది ఒకటి ఉన్నది చెపుతాను. పరాయివాడి సొమ్మునూ, ఉసురునూ దోచుకొనాలనుకొనే పాపులతో నిజం చెప్పటం కన్నా, చేటు మరొకటి ఉండదు. అబద్ధాలు ఆడైనా సరే అటువంటి వారిని బాధించటం ఎంతో న్యాయం. ఇదే కాదు ప్రజలకు మేలు కలిగించే అబద్ధాలన్నీ పుణ్యాలు (ధర్మాలు) అవుతాయి. సాటి జీవులను వేధించే సత్యాలన్నీ పాపా(అధర్మా)లవుతాయి. అందరిలోను ఉన్న మంచీ చెడూ అనేవి అతిసూక్ష్మమైన వివేకంతో తెలిసికొనాలి.

పాపనిస్తరణ ప్రకారము (సం. 12-111-2)

వ. అనినం గౌంతేయాగ్రజుం 'డెట్టివారు దురితంబులు నిస్తరింపనేర్తు?'రని యడిగిన సురనదీసూనుం డిట్లనియె. 46

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; కౌంతేయ+అగ్రజుండు= కుంతి పెద్దకుమారుడు - ధర్మరాజు; ఎట్టివారు= ఎట్లాంటివారు; దురితంబులు= పాపాలు; నిస్తరింపన్+నేర్తురు= నెట్టుకొనగలరు; అని+అడిగినన్= అని అడుగగా; సురనదీసూనుండు= దేవనది పుత్రుడైన భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు చెప్పగానే ధర్మరాజు 'ఎట్లాంటి వారు తమ పాపాలను దాటగలరు?' అనగానే భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

సీ. 'వర్ణాశ్రమాచారవంతులు నవిషయా । సక్తులుఁ బ్రతికారశక్తు లయ్యుఁ
దిట్టాటవడి సైఁచు ధీరు లుదారులు । నతిథి పూజకులు నధ్యయనరతులు
నగ్నిహోత్రపరులు నాజిఁ బిఱిందికి । నడుగు వెట్టక తెగి నడచువారు
సత్యవాదులు సాధుజన పోషకులు సర్వ । దేవతా సములు నై భావ మెందు

తే. నిలిచె నమ్మూర్తి భక్తిమైఁ గొలుచువారు । దురిత దుర్గముల్ నిస్తరింతురు పురాణ
పురుషుఁ డవిచింత్యుఁ డచలుండు పుండరీక । లోచనుండు సద్భక్తులఁ గాచు నధిప! 47

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వర్ణ+ఆశ్రమ+ఆచారవంతులున్= వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించేవారు; అవిషయ+ఆసక్తులున్= ఇంద్రియ విషయాల్లో ఆసక్తి కనబరచని వారు; ప్రతికారశక్తులు++అయ్యున్= తిరిగి ఎదుర్కొనగల సామర్థ్యం కలిగి ఉన్నా; తిట్టాట+పడి= నిందలు పొంది; సైఁచు= భరించే; ధీరులు= దిట్టతనం కలవారు; ఉదారులున్= ఔదార్యం కలవారు; అతిథి పూజకులున్= ఇంటికి వచ్చిన వారిని మర్యాదగా చూచేవారు; అధ్యయన= వేదాలు వల్లించటంలో; రతులున్= ఆసక్తి కలవారూ; అగ్నిహోత్రపరులున్= హోమం వేల్చటమంటే ఇష్టపడే వారూ; ఆజిన్= యుద్ధంలో; పిఱిందికిన్= వెనక్కి; అడుగు పెట్టక= తిరగక; తెగి= సాహసించి; నడుచువారు= ముందుకు వెళ్ళేవారు; సత్యవాదులు= అబద్ధాలు ఆడని వారూ; సాధుజన పోషకులు= మంచివారిని పోషించే వారూ; సర్వదేవతాసములును= అంతమంది దేవతలపట్ల సమభావం (సమానత్వం) కలవారునూ; ఐ= అయి; భావము= ఆలోచన; ఎందున్= ఎక్కడ; నిలిచెన్= ఉంటుందో; ఆ+మూర్తిన్= ఆ రూపాన్ని; భక్తిమైన్= భక్తితో; కొలుచువారు= సేవించేవారునూ;

దురిత= పాపాలనే; దుర్గముల్= మిట్టలను; నిస్తరింతురు= దాటగలుగుతారు; పురాణపురుషుఁడు= ఆదిపురుషుడును; అవిచింత్యుఁడు= ఆలోచనల కందనివాడునూ; అచలుండు= శాశ్వతమైన వాడునూ; పుండరీకలోచనుండు= తెల్లతామరలవంటి కళ్ళు కలవాడునూ అయిన విష్ణువు; సద్భక్తులన్= ఉత్తమ భక్తులను; కాచున్= రక్షిస్తాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! వర్ణాశ్రమ ఆచార నియమాలను పాటించేవారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, నిందించగా నిందించనివారు, ఉదారగుణం కలవారు, అతిథులను ఆదరించేవారు, వేదాలు వల్లించేవారు, యుద్ధంలో తెగించి పోరాడేవారు, ఏ దేవతల నైనా ఒకేవిధంగా చూస్తూ మనసుకు నచ్చిన రూపాన్ని కొలిచేవారు, పాపం అనే మిట్టలను అనాయాసంగా దాటగలుగుతారు. ఆది పరమేశ్వరుడు, ఆలోచనాతీతుడు, చంచలభావం లేనివాడూ, పద్మాక్షుడు అయిన విష్ణువు భాగవతోత్తముడిని సదా కాపాడుతూనే ఉంటాడు.

క. విను మగ్గోవిందుఁడు సఖుఁ డును బంధుఁడుఁ గార్యకర్మకుఁడు నై నిన్నుం
గొనియాడుచుండ దురితం బను పేరును గలదె నీకు ననఘుచరిత్రా!. 48

ప్రతిపదార్థం: అనఘ చరిత్రా!= పాపంలేని నడవడి కలవాడా!; వినుము= వినుము; ఆ+గోవిందుఁడు= ఆ కృష్ణుడు; సఖుఁడును= స్నేహితుడును; బంధుఁడు= చుట్టమును; కార్యకర్మకుఁడును+ఐ= పనులలో పోటు బంటూ అయి; నిన్నున్= నిన్ను; కొనియాడుచున్+ఉండన్= ఆదరిస్తూ ఉండగా; నీకున్= నీకు (ధర్మరాజు); దురితంబు+అను= పాపం అనే; పేరును= నామమాత్రం అయినా; కలదె?= ఉంటుందా? ఉండ దని భావం.

తాత్పర్యం: ఓ పుణ్యాత్ముడా! ధర్మరాజా! వినవలసింది. నీకు కృష్ణుడు మిత్రుడు, ఆత్మీయుడు, కార్యశూరుడు. ఇట్లాంటివాడు నిన్ను పొగుడుతూ ఉంటే పాపం అనేది పేరునకైనా సరే నీ దరికి రాదు.

ఆ. ఇంద్రుఁ డజుఁడు విష్ణుఁ డెవ్వాని వైదిక ప్రస్తోత్రములఁ బ్రసాదితునిగఁ జేసి
యెలమిఁ గొలుతు రమ్మహేశ్వరుఁ గొలుచు వా రెందు నెపుడుఁ గీడు నొంద రధిప! 49

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; ఇంద్రుఁడు= దేవేంద్రుడు; అజుఁడు= బ్రహ్మ; విష్ణుఁడు= విష్ణువు; ఏ+వానిన్= ఎవరిని; వైదికస్తోత్రములన్= వేదమంత్రాలతో; ప్రసాదితునిగన్+చేసి= అలంకరింపబడినవానిగా చేసి; ఎలమిన్= ప్రీతితో; కొలుతురు= సేవింతురో; ఆ+మహేశ్వరున్= ఆ శివుడిని; కొలుచువారు= సేవించేవారు; ఎందున్= ఎక్కడైనా; ఎపుడున్= ఎప్పుడైనా; కీడున్= కష్టాన్ని; ఒందరు= పొందరు.

తాత్పర్యం: ధర్మరాజా! ఎవరిని వేదమంత్రాలతో పూజించి ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువు అలంకరించబడినవానిగా ఆ శివుడిని కొలిచేవారు ఎపుడును ఎక్కడా ఎట్లాంటి ఆపదలూ పొందరు.

క. విను మివ్వాక్యము లెవ్వఁడు గొనియాడుఁ బఠించు విప్రకోటికిఁ జెప్పున్
జననాథ! వాఁడు దురితం బను దుర్గము నిస్తరించు నక్లేశమునన్.' 50

ప్రతిపదార్థం: జననాథ!= ఓ రాజా!; వినుము= వినవలసింది; ఈ+వాక్యములు= ఈ వచనాలు; ఎవ్వఁడు= ఎవ్వరు; కొనియాడున్= మెచ్చుకొనునో; పఠించున్= వల్లించునో; విప్రకోటికిన్= బ్రాహ్మణు లకు; చెప్పున్= నేర్పునో; వాఁడు= అట్లాంటివాడు; అ+క్లేశమునన్= ఏమీ కష్టపడకుండా; దురితంబు+అను= పాపం అనే; దుర్గమున్= కొండను; నిస్తరించున్= దాటగలడు.

తాత్పర్యం: ఓ రాజా! వినుము. ఈ పై వాక్యాలను ఎవరైతే మెచ్చుకొంటారో, అదే పనిగా వల్లిస్తారో, బ్రాహ్మణు లందరికీ నేర్పిస్తారో, అట్లాంటివారు ఏ మాత్రం అలసిపోకుండానే పాపం అనే కొండను అవలీలగా దాటుతారు'.

వ. అనిన విని ధర్మనందనుఁడు. 51

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగానే; విని= విని; ధర్మనందనుఁడు= యమధర్మరాజు పుత్రుడైన ధర్మరాజు.

తాత్పర్యం: అని చెప్పగానే ధర్మరాజు.

వ్యాఘ్రగోమాయు సంవాదము (సం. 12-112-2)

క. 'సౌమ్యు లసౌమ్యుల భంగి న । సౌమ్యులు సౌమ్యుల విధమున జనవర! చిత్తా
గమ్యతఁ దోఁతురు; వారిని । సమ్యఙ్నిశ్చయతఁ గాంచు చందము సెపుమా! 52

ప్రతిపదార్థం: జనవర!= రాజా! సౌమ్యులు= తిన్ననివారు; అసౌమ్యుల భంగిన్= తిన్నగా లేనివారివలె; అసౌమ్యులు= తిన్నగా లేనివారు; సౌమ్యుల విధమునన్= తిన్నని వారుగానూ; చిత్త+అగమ్యతన్= మనస్సుకు తెలియరాని రీతిలో; తోఁతురు= అగుపిస్తారు; వారినిన్= అట్లాంటివారిని; సమ్యక్+నిశ్చయతన్= సరిగ్గా ఇట్లాంటివారు అనే గట్టి నిర్ణయంతో; కాంచు చందమున్= తెలిసికొనే తీరును; చెపుమా!= చెప్పుము.

తాత్పర్యం: 'ఓ తాతా! సౌమ్యులు అసౌమ్యులుగాను, అసౌమ్యులు సౌమ్యులుగాను కనిపిస్తుంటారు. మనసుకు ఏమీ అంతుబట్టకున్నది. వీరు ఇట్లాంటివారని వేర్పాటుచేసి తెలిసికొనాలంటే సులువైన మార్గం ఏమిటో చెప్పుము.'

వ. అనుటయు నాపగాతనయుం 'డేతత్ప్రయోజనం బైన వ్యాఘ్రగోమాయు సంవాదం బను నితిహాసంబు గల; దాకర్ణింపు'మని యిట్లనియె. 53

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఆపగా తనయుండు= భీష్ముడు; ఏతద్+ప్రయోజనంబు+ఐన= దీనికి ఉపయోగపడేది అయిన; వ్యాఘ్ర= పులి; గోమాయు= నక్కలనడుమ నడచిన; సంవాదంబు+అను= సంభాషణ వృత్తాంతం కలది అయిన; ఇతిహాసంబు= పరంపరగా వస్తున్న కథ; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= ఆలకించుము; అని+ఇట్లు= అని ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'సరిగ్గా నీవడిగిన దానికి పులి నక్కా సంవాద కథ సమాధానమవుతుంది. జాగ్రత్తగా వినుము' అంటూ భీష్ముడు ఈ విధంగా అన్నాడు.

ఆ. 'పురిక యనఁగఁ నెగడు పురిఁ బౌరికుం డను । నృపతి క్రూరకర్మనిష్ఠఁ బరఁగు;
నవ్విభుండు సచ్చి యధిప! గోమాయువై । పుట్టెఁ బుట్టెఱుంగు బుద్ధితోడ. 54

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; పురిక+అనఁగన్= పురిక అనే పేరుతో; నెగడు= ప్రసిద్ధికెక్కిన; పురిన్= పట్టణంలో; పౌరికుండు+అను= పౌరికుడనే పేరుగల; నృపతి= రాజు; క్రూరకర్మనిష్ఠన్= కనికరం లేని పనులు చేయటంలో; పరఁగున్= ప్రసిద్ధి చెందాడు; ఆ+విభుండు= ఆ రాజు; చచ్చి= చనిపోయి; పుట్టు+ఎఱుంగు= మునుపటి జన్మ ఎరుకగల; బుద్ధితోడన్= జ్ఞానంతో (తెలివితో); గోమాయువు+ఐ= నక్కగా; పుట్టెన్= పుట్టాడు.

తాత్పర్యం: పురిక అనే నగరాన్ని పౌరికుడు అనే రాజు పాలించేవాడు. అతడు క్రూరకార్యాలు చేయటంలో పేరు పడ్డాడు. కాలవశాన చచ్చిపోయి పూర్వజన్మ జ్ఞాపకాలతో నక్కగా, మరోజన్మ ఎత్తాడు.

వ. ఇబ్భంగిం బుట్టిన యా నక్క మహితవ్రతశీలం బయి మాంసంబు దినక, హింస సేయక వనంబునం బతిత ఫలంబులుఁ బత్త్రంబులు నాహారంబులుగా వర్తించుచుండఁ, దోడి నక్క 'లిది యేటి వ్రతంబు? మాంసం బేము దెచ్చియిచ్చెద; ముపయోగించి సుఖివై యుండు' మని ప్రార్థించిన, నమ్మెయికిం జొరక దృఢనిశ్చయంబై యుండె; నంత నొక్కనాఁడు మృగంబుల కెల్ల ముఖ్యంబైన శార్దూలం బత్తెఱం గెఱింగి వచ్చి యగ్గోమాయువుతో నిట్లనియె. 55

ప్రతిపదార్థం: ఈ+భంగిన్= ఈ విధంగా; పుట్టిన= జన్మించిన; ఆ+నక్క= ఆ నక్క; మహిత= గొప్పదైన; వ్రతశీలంబు+అయి= నియమ స్వభావం కలదై; మాంసంబు= మాంసాహారాన్ని; తినక= తీసికొనకుండా; హింస+చేయక= సాటిజీవులను చంపకుండా; వనంబునన్= అడవిలో; పతిత ఫలంబులున్= ముగ్గి రాలిపడ్డ పళ్ళనూ; పత్రంబులున్= ఆకులనూ; ఆహారంబులుగాన్= తింటూ; వర్తించుచున్+ఉండన్= తిరుగుతుండగా; తోడి నక్కలు= సాటినక్కలు; ఇది= ఇది (ఈ కాయగసరులు తినటం); ఏటి వ్రతంబు?= ఏమి నియమం?; మాంసంబున్= మాంసాన్ని; ఏము= మేము; తెచ్చి+ఇచ్చెదము= తీసికొని వస్తాం; ఉపయోగించి= తిని; సుఖివి+ఐ= సంతోషివై; ఉండుము= ఉండాల్సింది; అని= అని; ప్రార్థించినన్= వేడుకొనగా; ఆ+మెయికిన్= ఆ వైనానికి; చొరక= ఒప్పుకొనక; దృఢ నిశ్చయంబు+ఐ= గట్టి అభిప్రాయం కలదై; ఉండెన్= ఉన్నది; అంతన్= అంతలో; ఒక్కనాఁడు= ఒకరోజున; మృగంబులకున్+ఎల్లన్= జంతువులలో కెల్ల; ముఖ్యంబు+ఐన= ప్రధానమైన; శార్దూలంబు= పెద్దపులి; ఆ+తెఱంగున్= ఆ తీరు అంతా; ఎఱింగి వచ్చి= తెలిసికొని వచ్చి; ఆ+గోమాయువుతోన్= ఆ నక్కతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ రాజు అట్లా నక్కగా రూపం ఎత్తి మాంసం ముట్టుకొననని, సాటి జీవులను చంపననీ వ్రతం పట్టింది. అడవిలో రాలిపడ్డ ఫలాలూ ఆకులూ అలములూ తింటూ బ్రతుకుగడుపసాగింది. ఇది చూచిన తోడినక్కలు 'ఇదెక్కడి నియమం? మేమంతా మాంసాన్ని తెచ్చి పెట్టుతాం - హాయిగా తిని సుఖించు'మన్నాయి. అయినా నక్క ఆ మాటలు పట్టించుకొనకూడదనే నిర్ణయించుకొన్నది. అంతలో ఇదంతా ఆ అడవి పులిరాజుకు తెలిసి నక్క దగ్గరకు వచ్చి ఈ విధంగా అన్నది.

క. 'నిను సౌమ్యుఁడ వని యెఱిఁగితి; । ననఘా! ననుఁ జెంది నిలిచి యతుల సుఖము లం
దిన మేలు; నన్నుఁ గ్రూరుం । డను లోకం; బిదియు నుడుప నగు నీశిక్షన్. 56

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పుణ్యాత్ముడా!; నినున్= నిన్ను; సౌమ్యుఁడవు+అని= తిన్ననివాడవని; ఎఱిఁగితిన్= గుర్తించాను; ననున్= నాతో; చెంది= కూడి; నిలిచి= ఉండి; అతుల సుఖములు= సాటిలేని సౌఖ్యాలు; అందినన్= పొందితే; మేలు= మంచిది; లోకంబు= జనం; నన్నున్= నన్ను; క్రూరుండు+అనున్= క్రూరమృగం అని అంటున్నది; ఇదియున్= ఈ వాదును; నీ శిక్షన్= నీ ఉపదేశాలతో; ఉడుపన్+అగున్= పోగొట్టవలసింది.

తాత్పర్యం: 'ఓ పుణ్యవంతుడా! నీవు చాలా మంచివాడ వని విన్నాను. నాతో కలిసి ఉండుము. ఎన్నో సౌఖ్యాలు అనుభవించుము. లోకం నన్ను క్రూరజంతు వనుకొంటున్నది. దానిని నీ ఉపదేశాలతో తరిమిగొట్టుము.

వ. నా తోడి బాంధవంబు సేయు'మనిన నగ్గోమాయు విట్లనియె. 57

ప్రతిపదార్థం: నాతోడి= నాతో; బాంధవంబున్= స్నేహాన్ని; చేయుము= కావించుము; అనినన్= అనగానే; ఆ+గోమాయువు= ఆ నక్క; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: నాతో మిత్రుడిగా ఉండుము' అనగానే ఆ నక్క ఈ విధంగా చెప్పింది.

క. 'నీ వాశ్రయణీయుండవు । గావే! విను భోగపరము గా కున్నది మ
ద్భావం బటు గావున నా । కీ వచనము లింపు సేయ విద్ధగుణాఢ్యా! 58

ప్రతిపదార్థం: ఇద్ధగుణ+ఆఢ్యా!= ప్రకాశించే గుణ సంపదగల ఓ పులిరాజా!; నీవు= నీవు; ఆశ్రయణీయుండవు= అండగొనదగినవాడవు; కావే!= కావా!; వినుము= వినుము; మత్= నాయొక్క; భావంబు= తలంపు; భోగపరము+కాక+ఉన్నది= సుఖంవైపునకు మళ్ళకున్నది; అటు+కావునన్= కాబట్టి; నాకున్= నాకు; ఈ+వచనములు= ఈ మాటలు; ఇంపు+చేయవు= రుచించవు.

తాత్పర్యం: 'ఓ గుణవంతుడా! పులిరాజా! నిజానికి నీవు ఆశ్రయించదగ్గవాడవే. కాని, నా మనస్సు సుఖాలమీదికి పోకుండా ఉన్నది. అందువలన నీ మాటలు నాకు నచ్చటం లేదు.

వ. అది యట్లుండె; భోగంబులు గాకున్న నేమి? నీకుం గార్యాకార్యంబులు నా యెఱింగిన తెఱంగున నుపదేశించుచు మైత్రి వాటించియునికి గర్హణీయంబై భవదీయ మూలభృత్యులసూయ సేసి భేదింతురు; దాన నొప్పమి వచ్చు; నీవు వారలు గలంచినఁ గలంగ కుండుటకును నా బుద్ధి పాటించుటకును సమయంబు సేసి నన్ను మన్నించికొని యుండు; మట్లైన నీకడ వర్తించియుండెద' ననుటయు నావ్యాఘ్రుం బా భంగి నడపంగల యది యై యియ్యకొని. 59

ప్రతిపదార్థం: అది= అది; అట్లు+ఉండెన్= ఆ విషయం అట్లా ఉండనిమ్ము; భోగంబులు= సౌఖ్యాలు; కాక+ఉన్నన్+ఏమి?= పొందకుంటే ఏమి?; నీకున్= నీకు; కార్య+అకార్యంబులు= చేయదగ్గ, చేయకూడని పనులను; నా+ఎఱింగిన తెఱంగునన్= నాకు తెలిసినట్లుగా; ఉపదేశించుచున్= బోధిస్తూ; మైత్రి పాటించి= స్నేహం చేసి; ఉనికి= ఉండటం; గర్హణీయంబు+ఐ= ఆక్షేపించదగినదై; భవదీయ= నీకు సంబంధించిన; మూల భృత్యులు= తాత ముత్తాతలనాటి నుండి వస్తున్న సేవకులు; అసూయ చేసి= ఓర్వ లేక; భేదింతురు= వేరవుతారు; దానన్= అందువలన; ఒప్పమి= వైరం; వచ్చున్= కలుగుతుంది; నీవు= నీవు (పులి); వారలు= ఆ మూలభృత్యులు; కలంచినన్= కలవరపెట్టినా; కలంగక= చలించకుండా; ఉండుటకున్= ఉండటానికీ; నా బుద్ధి= నా ఆలోచనలను; పాటించుటకున్= ఆచరించటానికీ; సమయంబు+చేసి= ప్రతిజ్ఞ చేసి; నన్నున్= నన్ను; మన్నించికొని ఉండుము= గౌరవిస్తూ ఉండుము; అట్లు+ఐనన్= అట్లా అయితేనే; నీ కడన్= నీ దగ్గర; వర్తించి+ఉండెదన్= మసలుకొంటాను; అనుటయున్= అనగానే; ఆ+వ్యాఘ్రుంబు= ఆ పులి; ఆ+భంగిన్= అట్లాగే; నడపంగల+అది+ఐ= జరపా లనుకొన్నదై; ఇయ్యకొని= సమ్మతించి.

తాత్పర్యం: అది అట్లా ఉండనిమ్ము, సౌఖ్యాలు అనుభవించకపోతే నేమి? నాకు తెలిసినంత మట్టుకు నీకు మంచీ చెడ్డలు తెలియచెప్పుతూ స్నేహంగా ఉంటాను. మన స్నేహాన్ని నీ మూలభృత్యులు ఓర్వలేక నిందిస్తారు. నిన్ను కలవరపరచి వైరం పెట్టుకుంటారు. అందువలన నీవు వారి మాటలకు చెవి ఒగ్గకుండా నేను చెప్పినట్లు నడచుకొంటేనే నీ దగ్గర ఉంటాను. అట్లాగని బాసచేసి నన్నాదరించుము.' అనగానే పులి అట్లాగే నడుచుకొంటానని అంగీకరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. సంతసంబుతోడ సమయంబు సేసిన । నెలమిఁబొంది నక్క పులికి బుద్ధి
సెప్పికొనుచుఁ దగ వసించెఁ దదీయ ని । కేతనమునఁ బులియుఁ బ్రీతి సలిపె. 60

ప్రతిపదార్థం: సంతసంబుతోడన్= సంతోషంగా; సమయంబు+చేసినన్= ప్రతిజ్ఞచేయగా; ఎలమిన్= ఆనందాన్ని; పొంది= అనుభవించి; నక్క= నక్క; పులికిన్= పెద్ద పులికి; బుద్ధి+చెప్పికొనుచున్= ఉపదేశిస్తూ; తదీయ= పులికి చెందిన; నికేతనమునన్= నివాసస్థానం (గుహ)లో; తగన్= ఒప్పేటట్లుగా; వసించెన్= నివసించింది; పులియున్= పులికూడా; ప్రీతిన్=సంతోషంతో; సలిపెన్= మెలగింది.

తాత్పర్యం: పులి ఎంతో సంతోషంగా బాసచేసింది. దానికి నక్క సంతృప్తిచెందింది. పులికి హితవులు చెపుతూ పులిగుహలోనే ఉండిపోయింది. పులికూడా సంతోషంగా మెలగింది.

వ. కొండొక కాలంబునకు నమ్మృగరాజు మన్నించు విధంబును, నగ్గోమాయువు దదీయ హితాహితంబు లరసి బుద్ధి సాచివ్యంబు సేయు తెఱంగును జూచి చూపోపక యప్పులి మూలభృత్యులు దమలోనం గూడికొని యొక్కనాఁడు. 61

ప్రతిపదార్థం: కొండొక కాలంబునకున్= కొంతకాలానికి; ఆ+మృగరాజు= ఆ పెద్దపులి; మన్నించు విధంబును= ఆదరించే తీరూ; ఆ+గోమాయువు= ఆ నక్క; తదీయ= ఆ పులికి సంబంధించిన; హిత+అహితంబులు= మంచి చెబ్బరలూ; అరసి= విచారించి, తెలిసికొని; బుద్ధి= ఆలోచనతో; సాచివ్యంబు= మంత్రిత్వం; చేయు తెఱంగును= నడిపిన తీరునూ; చూచి= పరిశీలించి; చూపు+ఓపక= చూడలేక; ఆ+పులి= ఆ పెద్దపులి యొక్క; మూలభృత్యులు= తాతముత్తాలనాటి నుండి వస్తున్న సేవకులు; తమలోనన్= వాళ్ళల్లో వాళ్ళు; కూడికొని= గుమికూడి; ఒక్కనాఁడు= ఒకరోజున.

తాత్పర్యం: కొంతకాలం గడిచేసరికి నక్కను పులి ఆప్యాయంగా ఆదరించటమూ, నక్క ఎంతో విచక్షణతో మంత్రిత్వాన్ని నిర్వహించటమూ మూలభృత్యులకు గిట్టలేదు. వాళ్ళంతా అనుకొని ఒకనాడు ఒకచోట సమావేశం అయ్యారు.

క. 'పులి నమలెడు మాంసము వెర, వలవడఁ దా మపహరించి యా నక్కకు ని
మ్ముల నిల్వం గావించిన, నిలయంబున గొందిఁ బెట్టి నేర్పారంగన్. 62

ప్రతిపదార్థం: పులి= పెద్దపులి; నమలెడు= తినే; మాంసమున్= మాంసాన్ని; తాము= ఆ మూలభృత్యులు; వెరపు= ఉపాయం; అలవడన్= ఒప్పగా; అపహరించి= దొంగిలించి; ఆ నక్కకున్= ఆనక్క కొరకు; ఇమ్ములన్= సంతోషంగా; నిల్పన్= నివసించటానికి (ఉండటానికి); కావించిన= ఏర్పాటు చేసిన (సిద్ధంచేసిన); నిలయంబునన్= నివాసంలో (కొండగుహలో); గొందిన్= మూలగా; పెట్టి= దాచిపెట్టి; నేర్పు+ఆరంగన్= గొప్పదిట్ట తనంతో.

తాత్పర్యం: 'ఒకనాడు పెద్దపులి తినే మాంసాన్ని మూలభృత్యులు ఎంతో చాకచక్యంగా ఎత్తుకెళ్ళాయి. నక్క ఉండే కొండగుహలో ఓ మూల దాచిపెట్టాయి. ఎంతో దిట్టతనంతో మసలుకొంటూ ఉండగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఉన్నంత భక్ష్యపదార్థ పరిరక్షణంబును దానచేయునది గావున నగ్గోమాయు వప్పనికిం జొచ్చి మాంసంబుగానక యెవ్వరేని మ్రుచ్చిలి కొనుటగా నెఱింగినదియై శార్దూలంబున కెఱింగించిన నామ్రుచ్చిమి యప్పులి యరయం దొడంగిన నెప్పటి కపటభృత్యులు గపటోపాయంబు పన్ని. 63

ప్రతిపదార్థం: ఉన్నంతన్= ఉంటున్నంతలో; భక్ష్యపదార్థ= తినుబండారాలను; పరిరక్షణంబు= భద్రపరచటమూ; తాను+అ= తానే; చేయునది+కావునన్= చేస్తుంది కనుక; ఆ+గోమాయువు= ఆ నక్క; ఆ పనికిన్= మాంసాన్ని జాగ్రత్తచేసే పనిమీద; చొచ్చి= వెళ్ళి; మాంసంబు= మాంసం; కానక= కనిపించక; ఎవ్వరేని= ఎవ్వరో; మ్రుచ్చిలి కొనుటగాన్= దొంగతనం చేసిందిగా; ఎఱింగినది+ఐ= తెలిసికొన్నదిఅయి (గమనించినదై); శార్దూలంబునకున్= పెద్దపులికి; ఎఱింగించినన్= తెలుపగా; ఆ మ్రుచ్చిమి= ఆ దొంగతనం గూర్చి; ఆ+పులి= ఆ పెద్దపులి; అరయన్= విచారించటానికి (వెదకటానికి); తొడంగినన్= పూనుకొనగానే; ఎప్పటి కపట భృత్యులు= ఎప్పటివలెనే, మోసగాళ్ళైన సేవకులు; కపట+ఉపాయాన్ని= మాయోపాయాన్ని; పన్ని= పుట్టించి.

తాత్పర్యం: రాజు తినే పదార్థాలను భద్రపరిచే పని నక్కదే. కనుక ఎప్పటివలె మాంసాన్ని దాచబోగా కనిపించలేదు. ఎవరో ఎత్తుకుపోయి ఉంటారని గ్రహించుకొని ఆ సంగతి పులి దృష్టికి తెచ్చింది. పులి వెంటనే వెదకటానికి పురమాయించింది. అది పసికట్టిన కపట సేవకులు కుట్ర పన్నినవారై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నెమకు పరివార మమ్మాం । సము గను తెఱఁగును ఘటింప శార్దూలము చి
త్తము నక్కవలన విరస । త్వమునొందిన నెఱిఁగి భృత్యతతి యిట్లనియెన్. 64

ప్రతిపదార్థం: ఆ+మాంసమున్= ఆ మాంసాన్ని; నెమకు= వెదకే; పరివారము= సేవకులకు; కను తెఱఁగును= కనపడే విధంగా; ఘటింపన్= చేయగా (కలిగించగా); శార్దూలము= పులి; చిత్తమునన్= మనసులో; నక్కవలన= నక్కమీద; విరసత్వమున్= మైత్రీభేదాన్ని; ఒందినన్= పొందగా; ఎఱిఁగి= తెలిసికొని; భృత్యతతి= సేవకులంతా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: మాంసం వెదకే పరివారానికి అది కంటబడేటట్లు చేశాయి. దానితో పులికి నక్కమీద మనస్సు విరిగిపోయింది. అది కనిపెట్టిన సేవకులు ఈ విధంగా అన్నారు.

ఆ. 'నక్క కేటి వ్రతము? స్రుక్కక యిమ్మాంస । మపహరించినపుడ యబ్బె నేని
నేమి యైనఁ జేయు నిది పాపశీలంబు । గపట ధర్మకంచుకంబు సువ్వె! 65

ప్రతిపదార్థం: నక్కకున్= నక్కకు; ఏటి వ్రతంబు?= ఏమి నియమం?; స్రుక్కక= జంకులేకుండా; ఈ+మాంసమున్= ఈ మాంసాన్ని; అపహరించిన+అపుడ= దొంగలించినపుడే; అబ్బెనేనిన్= దొరికినట్లైతే; ఏమి+ఐనన్+చేయున్= ఇంకా ఏమైనా చేయగలదు; ఇది= ఈ నక్క; పాపశీలంబు= పాపస్వభావం కలది; కపట= మాయదైన; ధర్మకంచుకంబు= ధర్మమనే కవచం కలది; సువ్వె!= సుమా!

తాత్పర్యం: 'నక్కఏమిటి? వ్రతంఏమిటి? నీ మాంసం కాజేసినపుడే చేతికి అందుబాటులో ఉన్నట్లైతే సంకోచించకుండా ఇంకా ఏమైనా చేసేది. ఈ నక్క పాపభావాలు కలది. ధర్మమనే మాయతొడుగు తొడుక్కున్నది సుమా!

క. తా నటె మాంసముఁ దినదటె! । యీ నక్కయు బేలుపెట్టె నిన్నాళ్ళును నీ
యాన మఱుమాట వలుకం । గా నోడితి మిదియ నడపఁ గార్యములయెడన్.' 66

ప్రతిపదార్థం: తాను+అటె= నక్క అట; మాంసమున్= మాంసాన్ని; తినదు+అటె= నమలదట; ఈ నక్కయున్= ఈ నక్క; ఇన్నాళ్ళును= ఇంతకాలమూ; బేలుపెట్టెన్= మోసపుచ్చింది; ఇదియ= ఈ నక్కే; నడపన్= జరుపుతుండగా; కార్యముల+ఎడన్= రాచకార్యాలపట్ల; నీ+ఆనన్= నీ ఆజ్ఞచే; మఱుమాట= మరొకమాట; పలుకంగాన్= చెప్పటానికి; ఓడితిమి= వెరచాము.

తాత్పర్యం: నక్క అట మాంసాహారి కాదట - ఇంతకాలం ఎంత మోసగించింది! ఈ నక్కే అన్ని రాచకార్యాలు చూచుకొంటుంది కదా! అని మేము మీ శాసనానికి కట్టుబడి పల్లెత్తు మాట అనాలంటే భయపడేవారం'.

క. అనుటయు మృగపతి మనమునఁ । గన లడరిన నక్కఁ బట్టఁగాఁ బంచి వధిం
పను బుచ్చె; దాని నంతయు । విని యప్పులితల్లి గరము వెసఁ జనుదెంచెన్. 67

ప్రతిపదార్థం: అనుటయున్= అన్నదే తడవుగా; మృగపతి= పెద్దపులి; మనమునన్= మనస్సున; కనలు+అడరినన్= కోపం ఎక్కువకాగా; నక్కన్= నక్కను; పట్టఁగాన్= బంధించటానికి; పంచి= నియోగించి; వధింపను= చంపేయటానికి; పుచ్చెన్=

ఆజ్ఞాపించింది; దానిన్+అంతయున్= ఇదంతా; విని= ఆలకించి; ఆ+పులి తల్లి= ఆ పెద్దపులి తల్లి; కరము= ఎంతో; వెసన్= తొందరగా; చనుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: ఆ మాటలు చెవిని పడగానే పులి కోపంతో మండిపడుతూ 'నక్కను వెంటనే పట్టుకురండి. చంపండి' అంటూ ఆదేశించింది. ఇదంతా పులి తల్లి విని చప్పున కుమారుడి దగ్గరకు వచ్చింది.

వ. చనుదెంచి యా వ్యాఘ్రువరునితో నిట్లనియె. 68

తాత్పర్యం: వచ్చి, ఆ పులి తల్లి కొడుకుతో ఇట్లా అన్నది.

క. ఇట్టివి కృత్రిమములు గల । వట్టిదె యానక్క? బేల వైతివి భృత్యుల్
పుట్టినకోలెను గుటిలత । లె ట్టెట్టివి సేయ? రకట! యెఱుక గలఁగెనే? 69

ప్రతిపదార్థం: ఇట్టివి= ఇట్లాంటివి; కృత్రిమములు= కల్పితాలు; కలవు= ఉంటాయి; ఆ+నక్క= ఆ నక్క; అట్టిదె?= అట్లాంటిదా?; బేలవు+ఐతివి= వెర్రివాడవయ్యావు; భృత్యుల్= సేవకులు; పుట్టిన కోలెను= పుట్టిననాటినుండి; కుటిలతలు= కపటాలు; ఎట్టు+ఎట్టివి= ఎట్లాంటివి ఎట్లాంటివి; చేయరు= చేయలేదు?; అకట!= అయ్యో! ఎఱుక= తెలివి; కలఁగెనే?= కలవర పడిందా?

తాత్పర్యం: ఇట్లాంటి లేనిపోని కల్పితాలు కల్పించటం నక్కకు చేతనవుతుందా! ఎంత మూర్ఖుడివి? సేవకులు పుట్టుకతోనే వంచకులు. ఏమి చేయరు? వీరు ఎన్నైనా చేస్తారు. అయ్యో! నీ తెలివి తెల్లారిపోయిందా!

తే. బుద్ధిమంతునివలన దుర్బుద్ధ లధికు । వలన హీనులు రూపసివలనఁ గొనటి
వా రసూయలు సేయుదు రీరసమున । నింత యెఱుఁగంగవలవదే? యీవు గొడుక! 70

ప్రతిపదార్థం: కొడుక!= కుమారుడా!; బుద్ధిమంతునివలనన్= మంచివాడివలన; దుర్బుద్ధులు= చెడ్డవారు; అధికు వలనన్= గొప్పవాడివలన; హీనులు= అల్పులు; రూపసివలనన్= అందగాడివలన; కొనటివారు= కురూపులు; ఈరసమునన్= ఓర్వలేక; అసూయలు+చేయుదురు= లేనివి అంటగడతారు; ఈవు= నీవు; ఇంత= ఇంతమాత్రం; ఎఱుఁగంగన్+వలవదే?= తెలిసికొనవద్దా?

తాత్పర్యం: ఓ బిడ్డా! మంచివాళ్ళను చూచి చెడ్డవాళ్ళు, గొప్పవాళ్ళను చూచి తక్కువవాళ్ళు, అందగాళ్ళను చూచి అందం లేనివాళ్ళు సహించలేరు. లేనిపోని దోషాలు ఆరోపిస్తారు. ఈ పాటి విషయాలు నీకు నీవు గ్రహించుకొనవద్దా? (ఎదుటివాళ్ళ ఔన్నత్యాన్ని చూచి సహించలేకపోవటం సంస్కారవంతుల పని కాదని భావం).

క. ధర్మ మధర్మము భంగి న । ధర్మము ధర్మంబు మాడ్కిఁ దనయా! తోఁచున్
నిర్మలమతి నరయవలయు । ధార్మికతన కోరువాఁడు తన కేర్పడఁగన్. 71

ప్రతిపదార్థం: తనయా!= ఓ కొడుకా!; ధర్మము= న్యాయం; అధర్మము భంగిన్= అన్యాయంవలె; అధర్మము= అన్యాయం; ధర్మంబు మాడ్కిన్= న్యాయంవలె; తోఁచున్= కనబడుతుంది; ధార్మికతన+కోరువాఁడు= ధర్మాన్నే తెలిసికొనవలెననుకొనేవాడు; నిర్మలమతిన్= తేటగలబుద్ధితో; తనకున్= తనకు తాను; ఏర్పడఁగన్= స్పష్టపడేటట్లు; అరయన్ వలయున్= పరిశీలించుకొనాలి.

తాత్పర్యం: ఓ కొడుకా! ధర్మం అధర్మంవలె, అధర్మం ధర్మంవలె అనిపించవచ్చును. 'ధర్మం ఇదీ' అని తెలిసికొనదలచినవాడు తనకు తేటతెల్లమయ్యేదాకా మంచిమనసుతో ఆలోచించుకొనాలి.

క. వినుమీగోమాయువు వ । చ్చిన యంతటనుండి మనకుఁ జేసిన హితముల్
గనికొన వలవదె? యీతర । మున వాఁ డిటు సేయఁ డను సమూహయు వలదే? 72

ప్రతిపదార్థం: వినుము= విను; ఈ+గోమాయువు= ఈ నక్క; వచ్చిన+అంతటన్+ఉండి= వచ్చినప్పటినుండి; మనకున్= మనకు; చేసిన హితముల్= చేసిన మంచిపనులను; కని కొనవలవదె?= విచారించవద్దా?; ఈ తరమునవాఁడు= ఇట్లాంటి మంచివాడు; ఇటు+చేయఁడు= ఈ విధంగా చేయడు; అను+సమూహయున్= అనే మంచి యోచన; వలదే?= వద్దా?

తాత్పర్యం: ఈ నక్క వచ్చిన దగ్గరినుండి చేసిన ఉపకారాన్ని చూచి అయినా ఇట్లాంటివాడు ఇట్లా చేస్తాడా? అని ఒక్క క్షణం యోచించుకొనవద్దా?

క. హితుఁ డగు మంత్రిం గుటిలుల । యతి కపటోపాయములకు నగపడి చెఱుపన్
మతిఁ దలఁతురె? పతి సుపరీ । క్షితంబు గావింప కొకటి సేయం దగునే?' 73

ప్రతిపదార్థం: హితుఁడు+అగు= మేలుకోరేవా డైన; మంత్రిన్= మంత్రిని; కుటిలుల= మాయగాళ్ళ; అతి కపట+ఉపాయములకున్= మిక్కిలి మాయోపాయాలకు; అగపడి= లోబడిపోయి; చెఱుపన్= చంపటానికి; మతిన్= మనస్సులో; తలఁతురె?= భావిస్తారా? పతి= రాజు; సుపరీక్షితంబు+కావింపక= సరిగ్గా పరిశీలించకుండానే; ఒకటి= కీడు; చేయన్= తలపెట్టటం; తగునే?= ఒప్పునా? ఒప్పుకాదని భావం.

తాత్పర్యం: వంచకుల మాయమాటలలో పడి మన మంచిని కోరే మంత్రిని చంపాలనుకొనటం భావ్యమేనా? రాజైనవాడు వెనుకా ముందూ పరిశీలించుకొనకుండా హానిచేయ పూనుకొనటం సరైన నిర్ణయం కాదు. పరిపాలకుడు ప్రతి పనీ విచారించి అమలు పరచాలి'.

చ. అనవుడు నక్క రాఁబనిచి యప్పులి గౌఁగిటఁ జేర్చి బాష్పము
ల్గనుఁగవఁ గ్రమ్మనుం బలుకులం దగఁ బెద్దయు గారవించిన
'న్వినుము మృగేంద్ర! మున్నటుల నీవు సభన్ ననుఁ వీఁడు మంచివాఁ
డని కొనియాడి యిప్పు డెగటార్చితి పెంపును నాదు మానమున్.' 74

ప్రతిపదార్థం: అనవుడున్= తల్లి చెప్పగానే; నక్క= నక్కను; రాన్ పనిచి= పిలిపించి; ఆ+పులి= ఆ పెద్దపులి; కౌఁగిటన్ చేర్చి= ఆలింగనం చేసి; బాష్పముల్= కన్నీరు; కనుఁగవన్= రెండు కళ్ళను; క్రమ్మనున్= కప్పగా; పలుకులన్= మాటలతో; తగన్ పెద్దయున్= ఎంతో ఎక్కువగా; గారవించినన్= గౌరవించగా; మృగ+ఇంద్ర!= మృగరాజా!; వినుము= వినవలసింది; నీవు; మున్ను+అటులన్= ఇంతకు క్రితం ఆ విధంగా; సభన్= కొలువులో; ననున్= నన్ను; వీఁడు= ఇతడు (ఈ నక్క); మంచివాఁడు= యోగ్యుడు; అని కొనియాడి= అని పొగడి; ఇప్పు= ఈనాడు; నాదు మానమున్= నా ఆత్మాభిమానాన్ని; పెంపును= గౌరవాన్ని; తెగటార్చితి(వి)= మంటగలిపావు. (నాశనం చేశావు).

తాత్పర్యం: తల్లి బోధలకు బుద్ధి తెచ్చుకొని పులి నక్కను రమ్మని కబురంపింది. వచ్చిన నక్కను అక్కున చేర్చుకొన్నది. కంటనీరు పెట్టుకొంటూ ఆత్మీయంగా మాట్లాడింది. ఆదరించింది. 'ఓ పులిరాజా! ఒక విషయం వినుము. నీవు ముందు ఒకనాటి సభలో అందరి ఎదుటా నన్ను మంచివాడ వని మెచ్చుకొన్నావు. ఈ రోజున నా అభిమానాన్ని, నా పరువునూ చివరంటా చెరిపేశావు.'

వ. అని పలికి యగ్గోమాయువు వెండియు. 75

ప్రతిపదార్థం: అనిపలికి= అని చెప్పి; ఆ+గోమాయువు= ఆ నక్క; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని చెప్పి నక్క మళ్ళీ చెప్పటం మొదలు పెట్టింది.

క. 'నను నీవు పదస్థునిఁగా । ననఘా! చేయంగఁ దలఁచినప్పుడ నీ భృ
త్యనికాయము కఱపులఁ బడ । కునికియు నా బుద్ధి వినుటయును మఱవమికిన్. 76

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పుణ్యవంతుడా!; ననున్= నన్ను; నీవు= నీవు; పదస్థునిఁగాన్= పదవి కలవాడినిగా; చేయంగన్= చేయటానికి; తలంచినపుడ= భావించినపుడే; నీ భృత్యనికాయము= నీ పరిజనంయొక్క; కఱపులన్= చెడ్డ బోధనలలో; పడక+ఉనికియున్= చిక్కకుండా ఉండటం; నా బుద్ధిన్= నా అభిప్రాయాన్ని; వినుటయును= చెవిని పెట్టటం; మఱవమికిన్= మరచిపోకుండా ఉండటానికి.

తాత్పర్యం: 'ఓ ధర్మాత్ముడా! నీవు నన్ను అధికారిని చేయాలని నిర్ణయించుకొన్నప్పుడే నీ భృత్యుల దురాలోచనలో తలదూర్చక పోవటమూ నా అభిప్రాయాల ప్రకారం నడచుకొనటమూ మర్చిపోకుండా ఉండేటట్లు ప్రమాణం చేశావు కదా! (తరువాతి వచనంతో అన్వయం).

వ. బాస సేయవే యట్లుంగాక. 77

ప్రతిపదార్థం: బాస+చేయవు+ఏ= ఒట్టుపెట్టుకొనలేదా?; అట్లున్+కాక= అంతేకాకుండా.

తాత్పర్యం: ఒట్టుపెట్టుకొనలేదా? అంతే కాకుండా.

ఆ. ఎఱిఁగి యైన నెఱుఁగ కేనియు నొక్కని । భంగపెట్టి పిదప సంగతుఁడుగఁ
జేసికొనుట మేలె సిరిగలవారికి? । నట్టి నిలుపువాని కగునె హితము?' 78

ప్రతిపదార్థం: ఎఱిఁగి+ఐనన్= తెలిసి అయినా; ఎఱుఁగక+ఏనియున్= తెలియకుండా అయినా; ఒక్కనిన్= ఒక్కడిని; భంగపెట్టి= అవమాన పరిచి; పిదపన్= ఆ తరువాత; సంగతుఁడుగన్= నేస్తగాడిగా; చేసికొనుట= చేసుకొనటం; సిరిగలవారికిన్= డబ్బుగలవారికి; మేలె?= మంచిదా?; అట్టినిలుపు= అట్టి ఉనికి; వానికిన్= ఉన్నవాడికి; హితము= మేలు; శుభం; అగునె?= కలుగుతుందా?

తాత్పర్యం: తెలిసో తెలియకో మరొకడిని చిన్నబుచ్చి ఆ తరువాత స్నేహితుడిగా చేసికొనటం ధనవంతుడికి మంచిదేనా? అట్లా బ్రతికేవాడికీ (అవమానించబడీ తిరిగి ఉండేవాడికి) మంచి జరుగుతుందా?'

క. అని పాసి యరణ్యమునకుఁ । జని యనశన దీక్ష నొంది సద్భావ ఖ్యా
తి నెఱయఁ బరమస్థానం । బున కగ్గోమాయు వరిగెఁ బురుషవరేణ్యా! 79

ప్రతిపదార్థం: పురుషవరేణ్యా!= ధర్మరాజా! అని= అని; ఆ+గోమాయువు= ఆ నక్క; పాసి= ఆ పులిరాజును విడిచి; అరణ్యమునకున్= అడవులలోకి; చని= వెళ్ళి; అనశనదీక్షన్= నిరాహార వ్రతాన్ని; ఒంది= పొంది; సద్భావఖ్యాతి= మంచివాడనే పొగడ్త; నెఱయన్= వెల్లడి కాగా; పరమస్థానంబునకున్= వైకుంఠానికి; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: ధర్మరాజా! అట్లా పలికి ఆ నక్క పులిని వదలిపెట్టి అడవులలోకి వెళ్ళింది. నిరాహారదీక్ష పూనింది. తన మంచితనంతో పైలోకాలకు చేరుకొన్నది.

వ. ఈ కథ పూర్వాపరవాక్యంబుల యందలి తాత్పర్యంబు నిరూపించి. 80

ప్రతిపదార్థం: ఈ కథ= ఈ పులి నక్కా వృత్తాంతం; పూర్వ+అపర వాక్యంబుల అందలి= ముందూ వెనుకా మాటలలోని; తాత్పర్యమును= ఉద్దేశాన్ని; నిరూపించి= నిశ్చయించి.

తాత్పర్యం: ఈ పులి నక్కా సంవాదంలోని సారాంశాన్ని వివరంగా తెలిపి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వావిరి మాటలఁ దేలక । భావంబునఁ గీడు మేలుఁ బరికించి యస
ద్భావుని సద్భావుని నవ । నీవర! యేర్పఱుప నెఱుఁగ నేరఁగ వలయున్.' 81

ప్రతిపదార్థం: అవనీవర!= ఓ రాజా!; వావిరి మాటలన్= మాయమాటలచేత; తేలక= మోసపోకుండా; భావంబునన్= ఆలోచనలో; కీడు మేలున్= మంచి చెడ్డలను; పరికించి= పరీక్షించి; అసద్భావునిన్= చెడ్డవాడిని; సద్భావునిన్= మంచివాడిని; ఏర్పఱుపన్= వేరు పరచటం; ఎఱుఁగన్ నేరఁగవలయున్= తెలిసికొనే శక్తి కలిగి ఉండాలి.

తాత్పర్యం: ఓ రాజా! రాజయినవాడు ఇతరుల మాయమాటలలో పడి మోసపోకుండా మంచీ చెడ్డా యోచించుకొనాలి. ఇది మంచిది ఇది మంచిది కాదు అని విడివిడిగా తెలిసికొనగల సామర్థ్యం కలిగి ఉండాలి. అపుడే పరిపాలకుడు సరైన నిర్ణయాలు తీసికొనగలుగుతాడు'.

భీష్ముండు ధర్మజునకు సహాయ సంపన్నత్వం బావశ్యకం బగుట సెప్పుట (సం. 12-113-1,2)

వ. అనినవిని సంతోషించి కౌంతేయాగ్రజుం 'డేమిభంగివర్తనంబున భూపాలుండు సుఖియై యుండు' ననుటయు నన్నరపతికిం గురుపితామహుం డిట్లనియె. 82

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; సంతోషించి= ఆనందపడి; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; ఏమి భంగిన్= ఎట్లాంటి; వర్తనంబునన్= నడతచేత; భూపాలుండు= రాజు; సుఖి+ఐ+ఉండున్?= సుఖిస్తాడు?; అనుటయున్= అని మాటలాడగానే; ఆ+నరపతికిన్= ఆ ధర్మరాజుతో; కురుపితామహుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'రాజు ఎట్లా నడచుకుంటే సుఖపడతాడు' అని ధర్మరాజు కోరగానే భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

సీ. 'ఆలస్యమును నసహాయత్వమును నొప్ప; । వవిలేని పతి సుఖియై చరించు;
విను తొల్లి యొక యుష్ట్ర మనితరసాధ్య త । పంబు సేయఁగ మెచ్చి బ్రహ్మ వచ్చి
యర్థించినది 'యేమి?' యనిన నా లొట్టియ । యొప్ప 'నా మెడ శతయోజన ప్ర
మాణం బగుట కోర్కి వాణీశ!' నావుడు । న ట్లగుంగా కని యతఁడు సనియె;

తే. నదియు వరగర్వమున సహాయంబు నొల్ల । కలసభావంబుతో నుండి వలచియొక్క
నాఁడు దన యట్టుసాఁచి కాననములోన । దీను కొని మేయఁగాఁ బెనువాన వచ్చె. 83

ప్రతిపదార్థం: ఆలస్యమునున్= మాంద్యమునూ; అసహాయత్వమునున్= ఒకరి తోడ్పాటును ఆశించకపోవటం; ఒప్పవు= తగ్గవికావు; అవి లేని పతి= అవి లేని రాజు; సుఖి+ఐ= భోగిఅయి; చరించున్= తిరుగుతాడు; విను= వినవలసింది; తొల్లి= ఒకప్పుడు; ఒక ఉష్ట్రము= ఒక ఒంటె; అనితరసాధ్య తపంబు= ఇతరు లెవ్వరూ చేయ వీలుకానంతగా తపస్సు; చేయఁగన్= చేయగా; మెచ్చి= పొగడి; బ్రహ్మ వచ్చి= బ్రహ్మ ఎదుటకు వచ్చి; అర్థించినది= కోరుకొనేది; ఏమి+అనిన్= ఏమిటి అని అడుగగా; ఆ లొట్టియ= ఆ ఒంటె; వాణీ+ఈశ!= ఓ బ్రహ్మా!; ఒప్పన్= ఒప్పగా; నామెడ= నా మెడకాయ; శతయోజన ప్రమాణంబు= నూరామడల మేరదాకా;

అగుట= పొడవుకావటం; కోర్కి= ఆశ; నావుడున్= అనగానే; అట్లు= అట్లాగే; అగున్+కాక= నెరవేరుతుంది కాక; అని= అని చెప్పి; అతఁడు= బ్రహ్మ; చనియెన్= తనలోకానికి వెళ్ళిపోయాడు; అదియున్= ఆ ఒంటెకూడా; వరగర్వమునన్= బ్రహ్మవలన కోరిక తీరిందనే అహంకారంతో; సహాయంబున్= సాటివాడి సహకారాన్ని; ఒల్లక= కోరక; అలసభావంబుతోన్= సోమరితనంతో; ఉండి= ఉండి; వలచి= కోరి; ఒక్కనాఁడు= ఒకరోజున తన అట్టు+చాఁచి= తన మెడను సాగించి; కాననములోనన్= అడవిలో; దీనుకొని= చక్కగా; మేయఁగాన్= మేత తినగా; పెనువాన= పెద్ద వర్షం; వచ్చెన్= కురిసింది.

తాత్పర్యం: ఏమరుపాటు లేకుండా ఎదుటివాడి సాయం కావాలనుకొనే రాజు తప్పక సుఖాలు పొందుతాడు. వెనకటికి ఒక ఒంటె మరెవరికీ అలవికానంత తపస్సుచేసింది. దానికి బ్రహ్మ మెచ్చుకొని ఎదుటపడి 'నీ కేం కావాలో కోరుకో' మ్మన్నాడు. 'నా మెడ నూరామడల దాకా సాగాలని నా కోరిక' అన్నది. బ్రహ్మ 'అట్లాగే అవుతుం'దని చెప్పి వెళ్ళిపోయాడు. వరం పొందిన ఒంటె అహంభావంతో సాటివాడి సాయాన్ని ఆశించక సోమరితనంతో ఉన్నది. ఒకరోజున కావాలని మరీ తన మెడకాయను పొడిగించి అడవిలో చక్కగా మేత మేస్తున్నది. అంతలో పెద్ద గాలివాన వచ్చింది.

క. వచ్చినఁ, దన మెడ సాఁగిన । యచ్చటి గుహలోన నుత్తమాంగం బిడి తా
నిచ్చమెయి నిదురపోవఁగ । విచ్చలవిడి నొక్క నక్క వెలఁదియుఁ దానున్. 84

ప్రతిపదార్థం: వచ్చినన్= వాన రాగానే; తనమెడ= తన మెడకాయ; సాగిన= సాగినటువంటి; అచ్చటి= అక్కడి; గుహలోనన్= అక్కడే ఉన్న గుహలో; ఉత్తమాంగంబున్= తలను; ఇడి= ఉంచి (పెట్టి); తాన్= తాను; ఇచ్చమెయిన్= ఇష్టం వచ్చినట్లు; నిదుర+పోవఁగన్= నిద్రించగా; ఒక్క నక్క= ఒక నక్క; వెలఁదియున్= దాని భార్యా (ఆడనక్క); తానున్= తానూ; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా.

తాత్పర్యం: వాన పడీ పడంగానే ఆ ఒంటె తన మెడకాయను చాచి ఒక గుహలోనికి తలను పెట్టింది. ఆదమరచి హాయిగా నిద్రపోయింది. అంతలో ఒక నక్క దంపతులు ఎలాంటి అడ్డూ ఆపూ లేకుండా. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ఆ గుహ సొచ్చెం; జొచ్చి యాఁకటిపెల్లున నాలుందానును నొక్కట నాలొట్టేనుఁగు కుత్తుక కబళించి నెత్తురు గండలు నొండొండ మ్రింగందొడంగిన, నదిమేలుకని ఆ లొట్టియ మెడ పారల్చునంతకు నా నక్కలు నరంబులు ద్రెవ్వం గఱచిన, నెటి దప్పి యయ్యుష్ట్రంబు నిర్గత ప్రాణం బయ్యె; నట్టి చందంబు గాక నీ వనాలస్యుండవును సహాయ సంపన్నుండవును నై నెగడు' మనిన నజ్జగతీశుం డతనితో 'శత్రుం డధికుం డైన నల్పబలుం డగు రాజేయోజ నాపద నిస్తరించు?' ననవుడు నతండు 'సముద్ర సరిత్సంవాదం బాకర్ణింపుము; దాన నీ యడిగిన యర్థంబు దేటపడియెడు' నని పలికి యిట్లనియె. 85

ప్రతిపదార్థం: ఆ గుహ= ఆ బిలం లోపలకు; చొచ్చెన్= దూరాయి; చొచ్చి= లోనికి వెళ్ళి; ఆఁకటిపెల్లునన్= ఎక్కువ ఆకలితో; ఆలున్+తానున్= పెళ్ళామూ తానూ (ఆ నక్క దంపతులు); ఒక్కటన్= ఒక్కమారుగా; ఆ లొట్టేనుఁగు= ఆ ఒంటె; కుత్తుక= పీకను; కబళించి= పట్టుకొని; నెత్తురున్= రక్తాన్నీ; కండలున్= మాంసపు ముద్దలనూ; ఒండొండన్= ఒకటొకటిగా; మ్రింగన్ తొడంగినన్= తినటం మొదలుపెట్టగా; అది= ఆ ఒంటె; మేలుకని= నిద్రలేచి; ఆ+లొట్టియ మెడ= ఆ ఒంటె మెడకాయను; పారల్చున్+అంతకున్= అటూ ఇటూ తిప్పుకునేలోగా; ఆ నక్కలు= ఆ జంట నక్కలు; నరంబులు= నాడులు; ద్రెవ్వన్= తెగేలా; కఱచినన్= కొరకగా; నెటి+తప్పి= సత్తువపోయి; ఆ+ఉష్ట్రంబు= ఆ ఒంటె; నిర్గతప్రాణంబు= ప్రాణంపోయింది; అయ్యెన్= అయింది; అట్టి చందంబుగాక= ఆ విధంగా గాక; నీవు= నీవు (ధర్మరాజు); అనాలస్యుండవును= అలస్యం చేయనివాడవుగానూ, సహాయ సంపన్నుండవును= ఇతరుల సాయాన్ని సమకూర్చుకొనే వాడవుగానూ; ఐ= అయి; నెగడుము= నడుచుకొనుము; అనినన్=

అనగానే; ఆ+జగతీ+ఈశుండు= ఆ ధర్మరాజు; అతనితోన్= ఆ భీష్ముడితో; శత్రుండు= పగవాడు; అధికుండు+ఐనన్= ఎక్కువ బలం కలవాడైతే; అల్పబలుండు+అగు రాజు= తక్కువ బలం కల రాజు; ఏ యోజన్= ఏ తీరుగా; ఆపదన్= విపత్తును (కష్టాన్ని); నిస్తరించున్?= దాటగలుగుతాడు?; అనవుడున్= అని అడుగగానే; అతండు= భీష్ముడు; సముద్ర సరిత్+సంవాదంబు= సముద్రం నదుల మధ్య జరిగిన వృత్తాంతాన్ని; ఆకర్ణింపుము= ఆలకించుము; దానన్= అది విన్నందువలన; నీ అడిగిన= నీవు కోరిన; అర్థంబు= ప్రయోజనం; తేటపడియెడున్= స్పష్టం కాగలదు; అని పలికెన్= అని చెప్పాడు.

తాత్పర్యం: గుహలోకి అడుగుపెట్టిన నక్కలు అప్పటికే ఆకలి మండిపోతూ ఉండటం వలన ఒక్క ఉదుటున ఆ ఒంటె పీకను పట్టుకున్నాయి. నెత్తురును త్రాగుతూ, మాంసం ముక్కలను క్రమక్రమంగా మింగుతుండగా దానికి మెలకువ వచ్చింది. అది మెడను తిప్పుకొంటుండగానే ఆ నక్కలు మెడ నరాలు తెగిపడేటట్లు పటుక్కున కొరికాయి. పట్టుతప్పి ప్రాణాలు విడిచింది ఒంటె. అందువలన నీవు జాగరూకుడవై సాటివారి సాయాన్ని అందుకొంటూ నడుచుకొమ్ము' అన్నాడు. అనగానే ధర్మరాజు 'శత్రురాజు అధికబలం గలవాడైతే, అల్పబలంగల రాజు ఆపదలనుండి ఎట్లా గట్టెక్కగలుగుతాడు?' అని ప్రశ్నించాడు. భీష్ముడు 'సముద్రానికీ నదికీ నడుమ సాగిన సంభాషణ వింటే నీకే తెలుస్తుంది' అని ఇట్లా చెప్పనారంభించాడు.

సముద్ర సరిత్సంవాదము (సం. 12-114-2)

తే. 'ఉదధి సుఖగోష్ఠి నున్నప్పు నదులతోడ । 'మీ తటంబుల తరువులు మీరు పొంగి
తటిమిపాటినఁ గూలు వేతసము లేల । పెటికిపో వవి మీ కేమి ప్రియ మొనర్చె? 86

ప్రతిపదార్థం: ఉదధి= సముద్రం; నదులతోడన్= నదులతో; సుఖగోష్ఠిన్= ఆనంద సల్లాపంలో; ఉన్న+అప్పు= ఉన్న సమయంలో; మీరు= మీరు(నదులు); పొంగి= ఉప్పొంగి; తటిమి= వెంటాడి (ఉరవడితో); పాటినన్= ప్రవహించేటప్పుడు; మీ తటంబుల= మీ ఒడ్డుమీది; తరువులు= చెట్లు; కూలున్= కుప్పకూలి పోతాయి; వేతసములు= నీటి ప్రబ్బలిచెట్లు (తుంగజాతికి చెందిన మొక్కలు); ఏల= ఎందుకు; పెటికిపోవు?= పెళ్ళగించుకొనిపోవు?; అవి= ఆ వేతసాలు; మీకున్= మీకు; ఏమి= ఎట్లాంటి; ప్రియమున్= ప్రీతిని; ఒనర్చెన్= కలిగించాయి?

తాత్పర్యం: సముద్రం నదులతో ఆనందంగా సల్లాపాలు సాగిస్తూ ఇట్లా అడిగింది 'మీరు మంచి ఉరవడితో పొంగిపొర్లి పారేటప్పుడు మీ గట్లమీది చెట్లు కూలిపడిపోతుంటాయికదా! మరి ప్రబ్బలిచెట్లు పడిపోవేమిటి? అవి మీకు ఏమైనా ఒరగపెట్టాయా ఏమిటి? అవి మిమ్మల్ని ఏమైనా సంతృప్తి పరిచాయా ఏమి?'

వ. వాని నున్మూలింప మీకు శక్యంబు గామిం జేసియో వానికిం జేటు వాటిల్ల; దిది యేమి?' యనవుడు నదులందు
గంగ యిట్లనియె. 87

ప్రతిపదార్థం: వానిన్= ఆ ప్రబ్బలిచెట్లను; ఉన్మూలింపన్= ఊడబెరకటానికి; మీకున్= మీకు; శక్యంబు= సాధ్యం; కామిన్+చేసియో= కాకపోవటం వల్లనో; వానికిన్= ఆ ప్రబ్బలిచెట్లకు; చేటు+పాటిల్లదు= కీడు మూడదు; ఇది+ఏమి?= ఇదేమిటి?; అనవుడున్= అని అడగగానే; నదులందున్ గంగ= నదులలో గంగానది; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: లేక, వాటిని పెల్లగించటం మీవలన కాకపోవటం వలననా? ఏ కారణంగా ఆ ప్రబ్బలిచెట్ల మొదళ్ళు పెకలించబడటం లేదు?' అని అడగగానే గంగానది ఈ విధంగా సమాధానం ఇచ్చింది.

క. 'బిగు వెడలక నిలిచి పడున్ । నగములు వేతసచయంబు నమ్రంబై పె
ల్లగు మా వేగము గడపి యె । నఁగు పూర్వస్థితిన బ్రదుకు సమకూరంగన్. 88

ప్రతిపదార్థం: నగములు= చెట్లు; బిగువు= బింకం; ఎడలక= వదలక; నిలిచి= నిలబడి ఉండి; పడున్= కూలిపోతాయి; వేతసచయంబు= ప్రబ్బలిచెట్ల సముదాయం; నమ్రంబు+ఐ= వంగి ఉండి; పెల్లు+అగు= ఉప్పొంగే; మా వేగము= మా ప్రవాహవేగాన్ని (మా ఉరవడిని); కడపి= దాటించి (ఉద్ధృతి తగ్గాక); పూర్వస్థితిన్= వెనుకటి వలెనే; బ్రదుకు= సుఖజీవనం; సమకూరంగాన్= కలుగగా; ఎసఁగున్= ఒప్పుతాయి.

తాత్పర్యం: 'ఓ సముద్రుడా! మా గట్లమీది చెట్లన్నీ తమ బింకం సడలనీయకుండా నిలబడతాయి. అందువలన నీటి వేగాన్ని తట్టుకోలేక నిట్టనిలువునా కూలిపోతుంటాయి. ప్రబ్బలిచెట్లు ఆ విధంగా కాకుండా నీటి వేగాన్నిబట్టి వంగి ఉండి, ఆ ఉరవడి తగ్గాక ఎప్పటివలె సజీవంగా నిలబడి ఉంటాయి.'

వ. అనియె నా ప్రబ్బలిచెట్ల తెఱంగు కనికొని. 89

ప్రతిపదార్థం: అనియెన్= అని గంగ చెప్పింది; ఆ+ప్రబ్బలిచెట్ల= ఆ తుంగజాతివైన ప్రబ్బలిచెట్లయొక్క; తెఱంగు= తీరును; కనికొని= తెలిసికొని.

తాత్పర్యం: అని గంగ సమాధానం చెప్పింది. కనుక ఆ నీటి ప్రబ్బలిచెట్ల తీరును గ్రహించుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అరి నృపాలు పెంపు నాత్మీయశక్తియు । నెఱిఁగి మూర్ఖవృత్తి నెదురుపడక
యుచిత వృత్తి నతని యుద్ధతి మేవడిఁ । గడపి హీనబలుఁడు సెడక నిలుచు. 90

ప్రతిపదార్థం: హీనబలుఁడు= తక్కువ బలంకల రాజు; అరినృపాలు= శత్రు రాజుయొక్క; పెంపున్= ఆధిక్యాన్ని; ఆత్మీయశక్తియున్= తన లావునూ; ఎఱిఁగి= తెలిసికొని; మూర్ఖవృత్తిన్= మొరటుగా; ఎదురుపడక= ఎదిరించకుండా; ఉచిత వృత్తిన్= తగిన రీతిలో; అతని= పగవాడియొక్క; ఉద్ధతిన్= మిడిసిపాటును (పొగరును); మేవడిన్= ఉపాయంతో; కడపి= అడ్డుకొని; చెడక= పాడవకుండా; నిలుచున్= నిలదొక్కుకొంటాడు.

తాత్పర్యం: బలహీనుడైన రాజు తన బలాన్నీ, ఎదుటివాడి బలాన్నీ అంచనా వేసికొనాలి. మొండిగా పోరుకు దిగకూడదు. పగవాడి మిడిసిపాటును యుక్తిగా తొలగించుకొనాలి (దాటవేయాలి). అపుడే ఆ రాజు ఎట్లాంటి చెరుపూ లేకుండా నిలబడగలుగుతాడు' (సమయానుకూలంగా పనులు చేసుకొనేవాడికి ఎట్లాంటి ఆపదలు రావని భావం).

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'దగుపదంబులకుఁ గులవంతు లగు పరిజనులు దొరకొనకున్న నరనాథుం డేమి సేయం గలవాఁ? డని యడిగిన నప్పుడమితేనికి భీష్ముం డిట్లనియె. 91

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగానే; విని= విన్నవాడై; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; తగుపదంబులకున్= ఆయా పదవులకు తగ్గ; కులవంతులు+అగు= పెద్ద కులంవారైన; పరిజనులు= సేవకులు; దొరకొనక+ఉన్నన్= దొరకకపోతే; నరనాథుండు= రాజు; ఏమి+చేయన్+కలవాఁడు?= ఏమి చేయగలడు?; అని అడిగినన్= అని ధర్మరాజు అడుగగా; ఆ పుడమితేనికిన్= ఆ ధర్మరాజుతో; భీష్ముండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అదంతా ఆలకించిన ధర్మరాజు 'మంచి కులస్థుడైన సేవకుడు పదవికి తగ్గట్టుగా జతపడకపోతే రాజు ఏం చేయాలి?' అని అడిగాడు. దానికి భీష్ముడు ఈ విధంగా చెప్పటం మొదలు పెట్టాడు.

కుర్కుర నీచత్వముం దెలుపునట్టి యితిహాసము (సం. 12-117-2)

సీ. 'వినుమొక్క యితిహాస మనుపమం బగు తపం । బునఁ బేర్చువాఁ డొక్కమునివరేణ్యు
నాశ్రమంబునఁ దద్దయావిశేషంబున । నఖిల జంతువులును నచట నచట
వసియించి సుఖముండు; వానిలో నొక్క కు । క్కుర మెప్ప భక్తిమైఁ గొలిచి తిరుగు;
నమ్మని మెలఁగినయచట నెల్లను । దాను వర్తింప నొక దువ్వు వైరమెత్తి

తే. కఱవ వచ్చిన నమ్మునికడకుఁ బాఱు । తెంచె నా కుక్క నాతఁడు దీప్త రూప
మైన దువ్వుఁ గాఁ జేసిన నది గడంగి । కవియ భయమంది పాఱె మున్నవియు దువ్వు. 92

ప్రతిపదార్థం: ఒక్క+ఇతిహాసము= ఓ వెనుకటి కథను; వినుము= వినుము; అనుపమంబు+అగు= సాటిలేనిదైన (విశేషమైన); తపంబునన్= తపస్సుచేత; పేర్చువాఁడు= అతిశయించేటటువంటి; ఒక్కమునివరేణ్యు= ఒక ముని ముఖ్యుడి యొక్క; ఆశ్రమంబునన్= ముని పల్లెలో (తపోవనంలో); తద్= ఆ మునియొక్క; దయా విశేషంబునన్= ఎంతో దయవలన; అఖిల జంతువులునున్= సమస్త ప్రాణులూ; అచటన్+అచటన్= అక్కడక్కడ; వసియించి= నివసించి; సుఖము= హాయిగా (సంతోషంగా); ఉండున్= ఉంటున్నాయి; వానిలోన్= ఉన్నవాటిలో; ఒక కుర్కురము= ఒక కుక్క; ఎప్పున్= ఎల్లప్పుడూ; భక్తిమైన్= ఆరాధనతో (విశ్వాసంతో); కొలిచి= సేవించి; తిరుగున్= మెలగుతూ ఉన్నది; ఆ+ముని= ఆ ఋషి; మెలఁగిన+అచటన్= తిరిగే చోట; ఎల్లను= అంతటా; తాను వర్తింపన్= తాను నడవగా; ఒకదువ్వు= ఒక పెద్దపులి; వైరము+ఎత్తి= పగబట్టి; కఱవన్= చంపటానికి (కరవటానికి); వచ్చినన్= రాగా; ఆ మునికడకున్= ఆ ముని దగ్గరకు; పాఱుతెంచెన్= పరుగుపెట్టింది; ఆ+కుక్కన్= ఆ కుక్కను; ఆతఁడు= ఆ ముని; దీప్తరూపము+ఐన= ప్రకాశించే రూపంగల; దువ్వుగాన్= పెద్దపులిగా; చేసినన్= చేయగా; అది+కడంగి= అది ధైర్యంగా నిలిచి; కవియన్= కలబడగా; మున్= ముందు; కవియున్= పైబడిన; దువ్వు= పెద్దపులి; భయమున్= పిరికితనాన్ని; అంది= పొంది; పాఱెన్= ఉడాయించింది.

తాత్పర్యం: 'దీని గూర్చి ఓ కథ చెప్పుతాను వినుము. పూర్వం ఒక ముని ఎవరూ చేయనలవి కానంతగా తపస్సు చేశాడు. అతగాడు దయాదాక్షిణ్యాలు కలవాడు. అతడి ఆశ్రమంలో అన్ని జంతువులూ హాయిగా చీకూ చింతా లేకుండా బ్రతుకుతుండేవి. వాటిల్లో ఒక కుక్క ఎంతో విశ్వాసంతో ఆ మునిని సేవిస్తూ ఉండేది. ఆ ముని ఎటు వెళ్ళితే అటు వెంబడించి వెళ్ళుతూ ఉండేది. అది చూచి సహించలేక ఒక పులి కుక్కమీద ద్వేషంపెట్టుకొని పంజాతో కొట్టబోయింది. ప్రాణభయంతో ఆ కుక్క ఆ ముని చాటుకుపోయింది. ఆ ముని దానిమీద జాలిపడి, దానికంటె పెద్దదైన పులిగా మార్చాడు. మొదట మీదపడిన అసలు పులి దీనిని చూచి భయపడి పారిపోయింది.

సీ. అట్లు బెబ్బులి వచ్చి యడరిన బెబ్బులిఁ । గాఁ జేసి గెలిపించెఁ గరుణ మెఱయ,
నొక మత్తకరిఁ జూచి యోటమై నొదిఁగిన । నుద్ధతకరిఁ జేసి యొసఁగె జయము
సింహంబు దెస భీతిఁజెడి పాఱుతెంచిన । ఘనసింహముగఁ జేసి గర్వమిచ్చె,
శరభంబు ధాటికిఁ జకితమైన నుదగ్ర । శరభంబుఁ జేసి యుత్సాహిఁ జేసె

తే. నిట్లు దివసక్రమంబున నెక్కుడైన । సత్త్వముగఁ జేయఁగాఁ గుక్క శరభభావ
మండితంబయి తిరుగుచునుండి పూర్వ । వాసనా నీచమగు మనోవర్తనమున. 93

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; బెబ్బులి= పెద్దపులి; వచ్చి= పైబడి; అడరినన్= చెలరేగగా; కరుణమెఱయన్= దయచూపి; బెబ్బులిఁగాన్+చేసి= పెద్దపులిగా మార్చి; గెలిపించెన్= నెగ్గింపచేశాడు; ఒక మత్తకరిన్= ఒక మదించిన ఏనుగును; చూచి= కాంచి; ఓటమైన్= జంకుతో; ఒదిఁగినన్= దాక్కొనగా (చాటుకురాగా); ఉద్ధతకరిన్= దర్పంగల ఏనుగుగా; చేసి= మారు రూపంచేసి; జయము= గెలుపును; ఒసఁగెన్= కలిగించాడు; సింహంబు దెసన్= సింహం వలన; భీతిఁజెంది= భయంతో; చెడి= వెనుకంజ వేసి; పాఱుతెంచినన్= పరుగుపెట్టి రాగా; ఘన= గొప్పదైన; సింహముఁగన్+చేసి= సింహంగా చేసి; గర్వము= అహంభావాన్ని; ఇచ్చెన్= కలిగించాడు; శరభంబు= మీగండ్ల మెకం (సింహంకంటె బలిష్ఠమైన 8 పాదాలు కల జంతువు); ధాటికిన్= దాడికి; చకితము+ఐనన్= భయపడగా; ఉదగ్ర= భయంకరమైన; శరభంబున్+చేసి= మీగండ్లమెకంగా మార్చి; ఉత్సాహిన్= ఉత్సాహం కలదానినిగా; చేసెన్= చేశాడు; ఇట్లు= ఈ విధంగా; దివసక్రమంబునన్= రోజురోజుకు; ఎక్కుడు+ఐనన్= గొప్పదైన; సత్త్వముగన్+చేయఁగాన్= మృగంగా చేయగా; కుక్క= (ఆ గ్రామసింహం) కుక్క; శరభభావ మండితంబు+అయి= శరభ భావంతో వెలిగిపోతూ; తిరుగుచున్+ఉండి= తిరుగుతూ ఉండి; పూర్వవాసనా= ముందటి జాతి స్మృతితో; నీచము+అగు= తక్కువదైన; మనఃవర్తనమునన్= మనస్సుయొక్క నడవడితో.

తాత్పర్యం: అట్లా ఆ ముని ఆకుక్కను పెద్దపులి వెంబడిస్తే పులిగాను, ఏనుగు వెంటాడితే మదించిన ఏనుగుగానూ, సింహం తరిమితే సింహంగానూ, శరభం దాడిచేస్తే మరింత ఉత్సాహంకల శరభంగానూ మార్చి, ఎప్పటికప్పుడు భయాన్ని పోగొట్టి గెలిపించాడు. ఇట్లా రోజురోజుకూ ఆ కుక్క మరింత బలం పుంజుకొని శరభమృగంగా ఎంతో గర్వంగా తిరుగుతున్నది. అయినా కుక్క ముందటి తన నీచస్వభావాన్ని పోనిచ్చుకొనలేక పోయింది.

వ. ఇట్లని విచారించె. **94**

ప్రతిపదార్థం: ఇట్లు+అని= ఈ విధంగా; విచారించెన్= ఆలోచించుకొన్నది.

తాత్పర్యం: ఈ విధంగా ఆలోచించింది.

చ. 'ననుఁ గని యొండు సత్త్వము మనంబున బెగ్గిలి పాఱునప్పు డి
మ్మునివరుఁ డిట్ల పోలెఁ గృప మొక్కలమై శరభంబుఁ గాఁగఁ జే
యునొ తగ దాని నట్లయిన నుద్ధతి నాకుఁ జరింప లేదు గా
వున నితనిన్ వధింతు వెరవున్ బలమున్ సరి నుల్లసిల్లఁగన్.' **95**

ప్రతిపదార్థం: ననున్+కని= నన్ను చూచి; ఒండు సత్త్వము= మరొక మృగం; మనంబునన్= లోలోపల; బెగ్గిలి= భయపడి; పాఱు+అప్పుడు= పరుగెత్తేటప్పుడు; ఈ మునివరుఁడు= ఈ మునీశ్వరుడు; ఇట్లు+పోలెన్= ఈ విధంగానే; కృప= దయ; మొక్కలమై= ఎక్కువై; శరభంబున్+కాఁగన్= మీగండ్ల మెకంగా; తగన్= తగునట్లు; దానిన్= ఆ భయపడ్డ జంతువును; చేయునొ= చేస్తాడో? ఏమో?; అట్లు+అయినన్= అట్లా అయితే; నాకున్= నాకు; ఉద్ధతిన్= గర్వంగా; చరింపన్ లేదు= తిరగటానికి వీలవదు; కావునన్= కాబట్టి; వెరవున్= ఉపాయమూ; బలమున్= శక్తీ; సరిన్= సరిసమానంగా; ఉల్లసిల్లఁగన్= ప్రకాశించగా; ఇతనిన్= ఈ మునిని; వధింతున్= చంపుతాను.

తాత్పర్యం: 'శరభరూపంలో ఉన్న నన్ను చూచి మరో మృగం భయపడి పారిపోవచ్చును. ఆ జంతువు మీది జాలితో ఈ ముని దానిని నాకంటె మిన్నగా చేయవచ్చును. అట్లా అయితే నేను గర్వంగా తలఎత్తుకొని తిరగలేను. కాబట్టి అట్లాంటి స్థితి రాకుండా నా యుక్తినీ శక్తినీ కలబోసి ఈ మునిని చంపేయాలి' అనుకుంది.

తే. అను విచారంబు దివ్యబోధాఢ్యుఁ డైన । యమ్మునీశ్వరుఁ డెఱిఁగి 'యీ యధమజాతి
యున్నత స్థితి యెఱుఁగునే? మున్నపోలెఁ । గుక్క యయి యుండుఁ గా!' కన్నఁ గుక్క యయ్యె. **96**

ప్రతిపదార్థం: అను= మునిని చంపటం అనే; విచారంబున్= ఆలోచనను; దివ్యబోధ+ఆఢ్యుఁడు+ఐన= దివ్యజ్ఞాన సంపన్నుడైన; ఆ మునీశ్వరుఁడు= ఆ మునివరుడు; ఎఱిఁగి= గ్రహించి; ఈ అధమజాతి= ఇట్లాంటి తక్కువజాతిది; ఉన్నతస్థితి= ఉచ్చదశను; ఎఱుఁగునే?= తెలియునా? (తెలియదని భావం); మున్న పోలెన్= మునుపటివలెనే; కుక్క+అయి= శునక రూపాన్ని పొంది; ఉండున్+కాక= ఉంటుంది కాక; అన్నన్= అని అనగానే; కుక్క+అయ్యెన్= కుక్కగా మారింది.

తాత్పర్యం: ముని దివ్యదృష్టితో కుక్క చెడ్డ తలంపును గ్రహించాడు. 'నీచజాతి కుక్కకు ఉదాత్త స్వభావం తెలియదు. కనుక ముందటి కుక్క రూపాన్ని మళ్ళీ పొందుతుంది కాక' అనగానే శరభరూపంలో ఉన్న కుక్క మామూలు కుక్కగా మారిపోయింది.

వ. కావునం గులహీనులు మాననీయులు గా; రట్లుం గాక విశేషం బాకర్ణింపుము. 97

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కులహీనులు= తక్కువ కులంవారు; మాననీయులు కారు= గౌరవించదగ్గవారు కారు; అట్లున్+కాక= అట్లా కాకుండా; విశేషంబు= వేరయింది; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: కాబట్టి తక్కువ జాతివారిని ఎన్నడూ ఎక్కువగా ఆదరించకూడదు. అంతేకాక, మరో విశేషం చెప్పుతాను వినుము.

చ. కుల మని పట్టి చిత్తమునఁ గూరిన కీ డరయంగ లేక య
గ్గలపు విభూతి దుష్టునకుఁ గల్గఁగఁ జేయుట గర్జ మెట్లు భృ
త్యుల మదియున్న రూ పరసి యుత్తమ మధ్యమ హీనరూప మా
త్రలకుఁ దగంగ నయ్యయి పదంబుల నిల్పుట నీతి భర్తకున్. 98

ప్రతిపదార్థం: చిత్తమునన్= మనస్సులోపల; కూరిన= కలిగిన; కీడు= హానిని; అరయంగన్ లేక= కనిపెట్ట లేక; కులము+అని పట్టి= కులం మాత్రమే కారణంగా; అగ్గలము= ఎక్కువైన; విభూతిన్= సంపదను; దుష్టునకున్= చెడ్డనడత కలవాడికి; కల్గఁగన్+చేయుట= పొందింపచేయటం; ఎట్లు+కర్జము?= ఏ విధంగా చేయదగింది?; భృత్యుల= సేవకుల; మది+ఉన్న రూపు= మానసికస్థితిని; అరసి= జాగ్రత్తగా పట్టి చూచి; ఉత్తమ= ఉన్నతులు; మధ్యమ= మధ్యములు; హీనరూప మాత్రలకున్= నీచులు అయిన వారికి; తగంగన్= ఒప్పుగా; ఆ+ఆ+పదంబులన్= ఆయా స్థానాలలో; నిల్పుట= ఉంచటం; భర్తకున్= రాజునకు; నీతి= ధర్మం.

తాత్పర్యం: ఆంతర్యాన్ని తెలిసికొనకుండా కేవలం తన కులంవాడు కదా అని దుష్టుడిని అందలం ఎక్కించకూడదు. సేవకులు ఎట్లాంటివారో చూచుకొని, వారి వారి యోగ్యతలను బట్టి ఉత్తమ, మధ్యమ, అధమ స్థాయి పదవులలో ఉంచటం రాజధర్మం.

క. శౌర్యము సత్యంబును స । త్కార్య జ్ఞానమును భక్తి తాత్పర్యము గాం
భీర్యముఁ గలిగినఁ గురుకుల । వర్య! కులం బేల? సిరికి వాఁ డుక్తుఁ డగున్. 99

ప్రతిపదార్థం: కురుకులవర్య!= కురువంశోత్తమా!; శౌర్యము= పరాక్రమం; సత్యంబును= నిజాయితీ; సత్+కార్యజ్ఞానమును= మంచి చెడుల వివేకాన్ని; భక్తి తాత్పర్యము= సేవాభావం; గాంభీర్యమున్= గుట్టూ; కల్గినన్= కలిగి ఉంటే; కులంబు= వంశం; ఏల?= ఎందుకు?; సిరికిన్= ఐశ్వర్యానికి (అధికారానికి); వాఁడు= అట్లాంటివాడు; ఉక్తుఁడు= తగినవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: ధర్మరాజా! పరాక్రమం, నిజాయితీ, మంచి చెడుల వివేకం, సేవాభావం, గాంభీర్యం కలవాడు సిరికి యోగ్యుడవుతాడు. అట్లాంటివాడికి కులంతో పని లేదు.

క. ఇది సిద్ధాంతం బనరా । దుదితయశా! యెట్టులైన నున్నత వంశున్
విదితగుణుం డగు పురుషు । న్వెదకి నిలుప వలయు మాననీయపదమునన్. 100

ప్రతిపదార్థం: ఉదితయశా!= ప్రసిద్ధి కెక్కిన కీర్తిమంతుడా!; ఇది= నేను చెప్పినది; సిద్ధాంతంబు= నిర్ణయమైనది; అనరాదు= అనుకోవద్దు; ఎట్టులు+ఐనన్= ఎట్లాగైనా; ఉన్నత వంశున్= గొప్ప కులంవాడిని; విదితగుణుండు+అగు= పేరుపడ్డవాడూ అయిన; పురుషున్= మనిషిని; వెదకి= వెదకి; మాననీయ పదమునన్= గౌరవించదగ్గ స్థానంలో; నిలుప వలయున్= నిలబెట్టాలి,

తాత్పర్యం: ధర్మరాజా! అట్లాగని నీవు దీన్నే పరమ ప్రామాణికం అనుకోవద్దు. ఏ విధంగానైనా మంచిగుణవంతుడిని, మంచి కులవంతుడిని వెదకి మరీ పెద్దపదవిలో నిలపటం చాలా మంచిది.

వ. అది యెట్లంటేని. 101

తాత్పర్యం: అది ఎట్లాగంటే.

ఉ. ఒక్కటి యేను జెప్పెద మహోగ్రపుఁగేసరి కైనఁ దోడుగా
నుక్కును లావునుం గలుగు నుజ్జ్వల సత్త్వచయంబుఁ గొన్నఁ గా
కెక్కుడు కృత్యముల్ నడప నెట్లగు నిట్టివి సాలు నంచుఁ దాఁ
గుక్కలఁ గూర్చి చేయఁ దనకుం దలఁపుల్ దలకూడ నేర్చునే? 102

ప్రతిపదార్థం: ఒక్కటి= ఒక్కమాట; ఏను= నేను; చెప్పెదన్= చెప్పుతాను; మహోగ్రపుఁగేసరికిన్+ఐనన్= గొప్ప బలంకల సింహానికైనా సరే; ఉక్కును= శక్తీ; లావునున్= సామర్థ్యమూ; కలుగు= ఉన్నట్టి; ఉజ్జ్వల సత్త్వచయంబున్= ప్రకాశించే జంతు సమూహాన్ని; తోడుగాన్= సాయంగా; కొన్నన్+కాక= తీసుకుంటేనే కాని; ఎక్కుడు కృత్యముల్= ఎన్నో ఫలితాలు; నడపన్= అందుకోవటానికీ; ఇట్టివి= ఇట్లాంటివి; చాలును= సరిపోతాయి; అంచున్= అనుకొంటూ; తాన్= తాను; (సింహం); కుక్కలన్= కుక్కలను; కూర్చి= కూడబెట్టి; చేయన్= పనులు చేయటానికి; ఎట్లు+అగున్= ఎట్లా అవుతుంది; తనకున్= తన యొక్క (సింహంయొక్క); తలఁపుల్= ఆలోచనలు; తలకూడన్ నేర్చునే?= ఫలిస్తాయా?

తాత్పర్యం: ఇక్క డొకమాట చెప్పుతాను ఆలకించుము. ఎంతో బలంగల సింహం అయినా సరే శక్తిసామర్థ్యాలు ఉండే తమ జాతి సింహాల సహకారంతో ఎన్నో ఫలితాలు సాధిస్తుంది. ఇవి చాల్లే అనుకొని కుక్కలను చుట్టూ చేర్చుకొంటే తా ననుకొన్నవి నెరవేర్చుకొనలేదు.

చ. వలనుఁ గులంబు లేని పరివారము గోటియు నేల? నేర్పు న
గ్గలికయు భక్తి పెంపు మదిఁ గల్గి సుహృజ్జన మిశ్రమౌ బలం
బిలువడి గల్గెనేని నిల యెల్లను నేలఁగఁ జాలు వేయు ర
జ్జులు విను రాజు నేర్పరియు శూరుఁడుఁ గావలయుంజుమీ నృపా!' 103

ప్రతిపదార్థం: నృపా!= ఓ ధర్మరాజా! వినుము= వినవలసింది; వలనున్= నేర్పూ; కులంబు లేని= ఉన్నత కులంలేని; పరివారము= పరిజనం; కోటియున్+ఏల?= కోట్లకొద్దీ ఎందుకు?; నేర్పున్= జాణతనం; అగ్గలికయున్= శౌర్యమూ; భక్తి= సేవ; పెంపు= గొప్పతనమూ;

మదిన్= మనస్సునందు; కల్గి= ఉండి; సుహృద్+జనమిశ్రము+ఔ= స్నేహితులతో కలిసిన; బలంబు= బలగం; ఇలువడి కల్గెన్+ఏనిన్= మంచి నడవడి కలిగి ఉంటే; ఇల+ఎల్లనున్= ఈ ప్రపంచాన్నంతా; ఏలఁగన్+చాలున్= పాలించ సరిపోతాడు; వేయురజ్జులు= పనికిమాలిన మాటలు వేలకొద్దీ ఎందుకు?; రాజు= భూపతి; నేర్పరియున్= సమర్థుడూ; శూరుఁడున్= పౌరుషవంతుడూ; కావలయున్+చుమీ!= కావాలిసుమా!

తాత్పర్యం: రాజా! పరిజనానికి నేర్పూ, కులమూ ఉండాలి. అవి లేనివారు కోట్లకొద్దీ ఉన్నా ప్రయోజనం ఉండదు. చాకచక్యం, పౌరుషం, స్వామిభక్తి, గొప్పతనమూ, మనస్సులో కలిగి, స్నేహితుల బలగం, మంచినడతా ఉంటే - ఆ రాజు ఈ ప్రపంచాన్నంతా ఇట్టే ఏలవచ్చును. అనవసరం అయిన మాటలు ఎందుకుగాని ఒకటి వినుము. రాజైనవాడికి జాణతనం, పోటుతనం తప్పనిసరిగా ఉండాలి సుమా!

వ. అని చెప్పి వెండియు. **104**

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పి మళ్ళీ (అందుకొన్నాడు).

సీ. 'వినుము మయూరంబు విధమున బహు చిత్ర । భంగులఁ బ్రజ యంతరంగ మాత్మ
వశము సేయుచు, మృదువాక్యముల్ వలుకుచు । మంత్రంబునెడఁ దనమాట వెడల
కునికి శరత్సమయోచిత క్రియ చాడ్పు । గాఁగ ధర్మంబు శిఖా ప్రకార
మొంది తనర్ప, సముల్లాస పక్షమై । యానంబు గైకొంచు నధిక తర స

తే. మున్నతత్వంబు సంశ్రయ యోగ్య మగుటఁ । గాంచుచును దఱివచ్చినఁ గారు కాల
మేఁచు తెఱఁగున నేచుచు నీచ కుటిల । గతులఁ దునుముచు నెగడుట పతికి నీతి. **105**

ప్రతిపదార్థం: (ఈ పద్యంలో నెమలి నడత రాజుకు ఆరోపించబడింది) వినుము= వినవలసింది; మయూరంబు విధమునన్= నెమలివలె; బహుచిత్ర భంగులన్= అనేక తీరులైన విచిత్ర ప్రవర్తనలతో; ప్రజ= జనంయొక్క; అంతరంగమున్= మనస్సును; ఆత్మవశము చేయుచున్= లోబరచుకొంటూ; మృదువాక్యముల్= మెత్తని(నొచ్చుకోని) మాటలు (చెవి ఒగ్గి వినా లనిపించే కేకగల నెమలివలె); పలుకుచున్= మాట్లాడుతూ; శరత్సమయ= శరత్కాలానికి; ఉచిత= తగిన; క్రియచాడ్పుకాఁగన్= చేష్టవలె (శరత్కాలంతో కేక పెట్టక గంభీరంగా ఉండే నెమలివలె); మంత్రంబు+ఎడన్= కార్యాలోచనపట్ల; తనమాట= తన వాక్కును; వెడలక= బైటపడనీయకుండా; ఉనికి= ఉండటం; ధర్మంబు= నీతి; శిఖాప్రకారమున్+ఒంది= నెమలి సిగవలె తలమీద పెట్టుకొని; తనర్పన్= ఒప్పగా; సముల్లాస పక్షమై= ఎంతో ఉత్సాహంతో ఉప్పొంగే సేనతో; యానంబు= దండయాత్రకు (రెక్కల తళతళల గతులు గల నెమలివలె); కైకొంచున్= పూనుకొంటూ; అధికతర సమున్నతత్వంబు= ఎంతో గౌరవం; సంశ్రయ= ఆశ్రయించటానికి; యోగ్యము+అగుటన్= తగిన దనే విషయాన్ని (నెమలివలె); కాంచుచున్= గుర్తిస్తూ; తఱివచ్చినన్= సమయం రాగానే; కారుకాలము= వానకాలంలో; ఏఁచు తెఱఁగునన్= రెచ్చిపోయే నెమలివలె; ఏఁచుచున్= (రాజు) చెలరేగుతూ; నీచ కుటిల గతులన్= నీచులయొక్క వక్రమార్గ పద్ధతులు (దుష్టమైన పాములను ముక్కలు ముక్కలు చేసే నెమలివలె); తునుముచున్= తునాతునకలు చేస్తూ; నెగడుట= ప్రసిద్ధి చెందటం; పతికిన్= రాజునకు; నీతి= ధర్మం.

తాత్పర్యం: 'వింత వింతల రంగుల రచనలుగల నెమలివలె రాజు అనేక రకాలైన నడతలతో ప్రజల హృదయాలను చూరగొనాలి. చెవి కింపు కలిగించే కేక (నెమలి కూత)వలె రాజు ప్రజలతో సౌమ్యంగా నెమ్మదిగా మాట్లాడాలి. వానకాలంలో శరత్కాలంలోను ప్రవర్తించే నెమలివలె రాజు తన మంత్రాంగాన్ని పైకి పొక్కనీయకుండాలి. నెత్తిమీద సిగతో ప్రకాశించే నెమలివలె రాజు ధర్మాన్ని నెత్తిమీద పెట్టుకొనేటట్లు చేయాలి. రెక్కల తళతళలతో నడకలు

గల నెమలివలె రాజు ఉత్సాహంతో ఉరకలు పెట్టే సైన్యంతో దండయాత్రకు బయలుదేరాలి. రంగురంగుల వన్నెలతో తన దగ్గరకు రప్పించుకొనే నెమలివలె రాజు ఎంతో పెద్ద ఎత్తున జనం గౌరవంగా తన నీడపట్టున చేరేటట్లు ఉండాలి. వానకాలంలోనే విజృంభించే నెమలివలె రాజు సమయం తెలిసికొని పగవాడిమీద పడిపోవాలి. విషం కక్కే పాములను ముక్కలు చేసే నెమలివలె రాజు తుచ్ఛుల కుట్రలను ఛేదించాలి. ఇదే రాజధర్మం.

విశేషం: అలం: ఉపమ.

క. కిరణముల భంగిఁ జతురపుఁ । బరిజనముల నెందుఁ జొనిపి పరకృత్యంబుల్
నిరతంబును గనుఁగొనుచును । దరణి కరణి వెలుఁగు టొప్పు ధరణీశునకున్. 106

ప్రతిపదార్థం: కిరణముల భంగిన్= కాంతికిరణాలవలె; చతురపు పరిజనములన్= నేర్పరులైన సేవకులను; ఎందున్= ఏ ప్రదేశాలకైనా; చొనిపి= పంపించి; పరకృత్యంబుల్= ఇతరులయొక్క చేతలను; నిరతంబును= ఎల్లప్పుడూ; కనుఁగొనుచును= కనిపెట్టుతూ; తరణి కరణిన్= సూర్యుడివలె; వెలుఁగుట= ప్రకాశించటం; ధరణీశునకున్= రాజునకు; ఒప్పున్= తగును, ఉత్తమం అవుతుంది.

తాత్పర్యం: చిన్నకంతలలోకైనా దూసుకుపోయే కాంతులవలె చాతుర్యంగల పరిజనులను ఎక్కడబడితే అక్కడ ప్రవేశపెట్టాలి. రహస్యంగా ఎదుటివాళ్ళ పనులన్నింటినీ ఎప్పటికప్పుడు చాల మెలకువగా పసికట్టాలి. సూర్యుడివలె వెలగటం రాజుకు తగును.

తే. అలుక గూరిమి ఫలదంబు లగుచునుండఁ । గృత్యములఁ దా నెఱుంగుచు నిత్యవిధుల
నాయములును వ్యయంబులు నరసి కోశ । సంపదలు గాంచి యునికి రాజన్య గుణము.' 107

ప్రతిపదార్థం: అలుక= వైరం; కూరిమి= స్నేహం; ఫలదంబులు= ఫలితాలను ఇచ్చేవి; అగుచున్+ఉండన్= అవుతూ ఉండగా; కృత్యములన్= చేసిన పనులను; తాన్= తనకు తానుగా; ఎఱుంగుచున్= తెలిసికొంటూ; నిత్యవిధులన్= నిత్యం చేయాల్సిన కృత్యాలను; ఆయములును= ఆదాయాలను; వ్యయంబులును= వెచ్చాలను; అరసి= పరిశీలించి చూచి; కోశ= బొక్కసం; సంపదలు= ధనధాన్యాది రూప ఐశ్వర్యాలను; కాంచి= జాగ్రత్తగా చూచి; ఉనికి= ఉండటం; రాజన్యగుణము= రాజ వంశీకుల ధర్మం.

తాత్పర్యం: వైరం, స్నేహం ఎపుడూ మంచో చెడో ఏదో ఒక ఫలితాన్ని అందిస్తూనే ఉంటాయి. తనకు తానుగా చేసిన పనులలోని మంచీచెడ్డా విచారించుకొనాలి. రోజువారీ పనులను ఆదాయవ్యయాలను బొక్కసాన్ని సంపదలను స్వయంగా చూచుకొనటం రాజధర్మం.'

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'రాజులకు దండంబు సర్వసాధారణంబు; తదీయ స్వరూపంబు వినవలతుం జెప్పు'
మనిన న న్నరదేవునకు దేవవ్రతుం డిట్లనియె. 108

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; రాజులకున్= పాలకులకు; దండంబు= రాజనీతి; సర్వసాధారణంబు= అందరికీ తప్పనిసరి; తదీయ స్వరూపంబు= దాని తీరు; వినవలతున్= వినాలని ఉన్నది; చెప్పుము= చెప్పుము; అనినన్= అనగా; ఆ+నరదేవునకున్= ఆ ధర్మరాజునకు; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అదంతా విన్న తరువాత ధర్మరాజు 'దండించటం రాజులకు సామాన్యమైన విషయం కదా! ఆ దండం తీరుతెన్నులను తెలిసికొనాలని అపేక్షగా ఉన్నది' అనగానే భీష్ముడు చెప్పటం మొదలు పెట్టాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు దండనీతి ప్రభావం బెఱిఁగించుట (సం. 12-121-8)

సీ. 'అసితోత్పల చ్ఛాయమై దంష్ట్రికాచతు । ష్టయమును, భుజ చతుష్టయము, జిహ్వా
కలు రెండుఁ, బాదాష్టకంబును, శంకు క । ర్ణములును, బహునయనములుఁ గల్గి
యూర్ధ్వ రోమంబులు నుగ్రారుణాస్యంబుఁ । గపిల జటాజాలకంబు నొప్ప
నసి గదా శక్తి శరాసన ముసల చ । క్ర ప్రాస శర తోమర త్రిశూల

తే. పరశు ముఖ సాధనంబులఁ బాపజనులుఁ । దరతరంబ సంఛేదన తాడనాదు
లైన వివిధ ప్రహతుల నే పడఁచుచును జ । రించు దండంబు సుజనులు ప్రియము నొంద. 109

ప్రతిపదార్థం: అసిత+ఉత్పల= నల్లకలువవంటి; ఛాయమై= శరీరకాంతి; దంష్ట్రికా చతుష్టయమును= నాలుగు కోరలూ; భుజ చతుష్టయమున్= నాలుగు చేతులూ; జిహ్వాకలు రెండున్= రెండు నాలుకలు; పాద+అష్టకంబును= ఎనిమిది పాదాలూ; శంకు కర్ణములును= లెక్కపెట్టలేనన్ని చెవులూ; బహునయనములున్= చాలా కళ్ళూ; కల్గి= ఉండి; ఊర్ధ్వరోమంబులున్= నిక్కబొడుచుకొన్న వెంట్రుకలూ; ఉగ్ర= భయం పుట్టించే; అరుణ+ఆస్యంబున్= ఎఱ్ఱటి ముఖమూ; కపిల జటాజాలకంబున్= గోరోజనం రంగున్న జడల సమూహమూ; ఒప్పన్= ఒప్పుతుండగా; అసి= కత్తి; గదా= గద; శక్తి= తోమరం; శరాసన= విల్లు; ముసల= రోకలి; చక్ర= చక్రాయుధం; ప్రాస= ఈటె; శరం= బాణం; తోమరం= చిల్లకోల, 'కొరడా'); త్రిశూలం= మూడు కొనలు ఉండే శూలం; పరశు= గొడ్డలి; ముఖ= మొదలైన; సాధనంబులన్= పనిముట్లతో; పాపజనులున్= పాపులను; తరతరంబ= క్రమంగా; సంఛేదన= నరకటం; తాడనం= కొట్టటం; ఆదులు+ఐన= మొదలైన; వివిధ= అనేక రకాలైన; ప్రహతులన్= దండనలతో; ఏపు+అడఁచుచున్= పొగరు అణచివేస్తూ; సుజనులు= మంచి వాళ్ళు; ప్రియమున్= ప్రీతిని (సంతోషాన్ని)); ఒందన్= పొందగా; దండంబు= దండనీతి; చరించున్= వర్తిస్తుంది.

తాత్పర్యం: 'దండనీతి మంచివాళ్ళను మెప్పిస్తుంది. చెడ్డవాళ్ళ పొగరును అణచివేస్తుంది. కత్తి, గద, తోమరం, విల్లమ్ములు, రోకలీ, చక్రం, ఈటె, చిల్లకోల, త్రిశూలం, గొడ్డలి మొదలైనవి పదకొండు ధర్మనీతికి పనిముట్లు. దాని ఒంటిరంగు నల్లటి నలుపు. దానికి నాలుగు కోరలూ, నాలుగు చేతులూ, ఎనిమిది కాళ్ళూ ఉంటాయి. (అనేకాలైన చెవులూ, కళ్ళూ ఉంటాయి) చూచీ చూడగానే భయపడేటట్లు ఎఱ్ఱటి ముఖం, గోరోజనం వన్నెతో ఉండే జడలూ ఉంటాయి. ఇవీ దండం రూపరేఖలు.

సీ. పరుఁడసంగుఁడు ధర్మపాలుండు ధర్ముండు । విజయుండు శాస్త్రంబు విశసనుండు
గ్రహమక్షరుఁడు ప్రజాగరము దురాసదుఁ । డతి సత్యగుండు నిత్యగుఁడు శాస్త
ప్రాగ్వచనుండు శస్త్రంబు బ్రహ్మము తీక్ష్ణ । వర్ముండు మనువు శివంకరుండు
కౌమారి సుతుఁడు శ్రీగర్భుండు వ్యవహార । తంత్రంబు సంగుప్త మంత్ర మనఁగఁ

తే. బరఁగు పేకుల నొప్పి యధ్వరమయాత్ముఁ । డైన విష్ణుండ దండమై యావహిల్లు
శ్రీసరస్వతి యనునివి శిష్ట దండ । నీతి నామాంతరంబులు నృపవరేణ్య! 110

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= ఉత్తముడ వైన ఓ రాజా!; పరుఁడు= ఉత్తముడూ; అసంగుఁడు= సంసార బంధంలేనివాడూ; ధర్మపాలుండు= నీతిగా పాలించేవాడూ; ధర్ముండు= న్యాయమూర్తి; విజయుండు= ఓడిపోనివాడూ; శాస్త్రంబు= శిక్షించేవాడూ; విశసనుండు= చంపేవాడూ; గ్రహము= లోకాన్ని ధరించేవాడూ; అక్షరుఁడు= నాశనంలేనివాడూ; ప్రజాగరము= ఎక్కువ జాగరూకుడూ; దురాసదుఁడు= దరిదాపులకు చేరరానివాడూ; అతి సత్యగుండు= ఎంతో సత్యవంతుడూ; నిత్యగుఁడు= ఎప్పటికీ ఒకే విధంగా ఉండేవాడూ; శాస్త= శాసించేవాడూ; ప్రాగ్వచనుండు= వేదవచనాలు వల్లించేవాడూ; శస్త్రంబు= ఆయుధ రూపుడూ;

బ్రహ్మము= తత్త్వం; తీక్ష్ణవర్త్ముండు= వాడియైన కవచం ధరించినవాడూ; మనువు= మనువూ; శివంకరుండు= మేలుచేసేవాడూ; కౌమారి సుతుఁడు= కుమారస్వామీ; శ్రీగర్భుండు= లక్ష్మి గర్భంలో కలవాడూ; వ్యవహారతంత్రంబు= వ్యవహారం నడిపే ఉపాయం కలవాడూ; సంగుప్త= రక్షకుడు; మంత్రము= మంత్రం; అనఁగన్= అన్నట్లు; పరఁగు= ఒప్పునట్టి; పేళులన్= పేర్లతో; ఒప్పి= చక్కగా ఉండి; అధ్వరమయ+ఆత్ముఁడు+ఐన= యజ్ఞమయ స్వరూపుడైన; విష్ణుఁడు= విష్ణువే; దండమై= దండరూపంగా; ఆవహిల్లున్= ఉంటాడు; శ్రీ= లక్ష్మీ; సరస్వతి= సరస్వతి; అనునివి= అనేవి; శిష్ట= ప్రామాణికుల; దండనీతి= దండనీతికి; నామాంతరంబులు= మారు పేర్లు.

తాత్పర్యం: ధర్మరాజా! యజ్ఞరూపధారి విష్ణువే దండరూపంలో ఉంటాడు. ఇతడిని ఉత్తముడూ, సంసారపు తగులాటం లేనివాడూ, న్యాయపాలకుడూ, ధర్మస్వరూపుడూ, ఎపుడూ గెలిచేవాడూ, దగ్గరకు చేరరానివాడూ, శిక్షించేవాడూ, చంపేవాడూ, లోకధారీ, నాశనంలేనివాడూ, ఎక్కువ జాగరూకుడూ, ఎంతో సత్యవంతుడూ, ఎప్పటికీ ఒకేరకంగా ఉండేవాడూ, శాసించేవాడూ, వేదపురుషుడూ, ఆయుధరూపుడూ, తత్త్వం, తీక్ష్ణ కవచధారీ, మనువూ, శుభంకోరేవాడూ, శివకుమారుడూ, లక్ష్మిని గర్భంలో కలవాడూ, వ్యవహార తంత్రం తెలిసినవాడూ, సంరక్షకుడూ, మంత్రమూ అనే పేర్లతో వ్యవహరిస్తారు. శిష్టదండనీతికి శ్రీ, సరస్వతీ అనేవి మారు పేర్లు.

వ. ధర్మాధర్మంబులు సుఖదుఃఖంబులు నయానయంబులు నర్థానర్థంబులు బలాబలంబులుఁ బ్రమాదాప్రమాదంబులు మొదలైన సకలావస్థలును దండంబున సమ్య గసమ్యక్ప్రకారంబులం గలుగుం గావున సమ్యక్ప్రకారంబుచేత దండంబున రక్షింపంబడిన ప్రజ రాజు నభివృద్ధి నొందించు; నట్లగుట దండంబు రాజునకుం బరాయణంబు. 111

ప్రతిపదార్థం: ధర్మ+అధర్మంబులు= న్యాయాన్యాయాలు; సుఖదుఃఖంబులు= సుఖదుఃఖాలు, నయ+అనయంబులు= నీతి అవినీతులు; అర్థ+అనర్థంబులు= లాభనష్టాలు; బల+అబలంబులున్= శక్తి, అశక్తులూ; ప్రమాద+అప్రమాదంబులు= దయ, నిర్ణయాలూ; మొదలు+ఐన= మొదలుగా గల; సకల అవస్థలును= అన్ని స్థితులూ; దండంబునన్= దండనీతిలో; సమ్యక్+అసమ్యక్ ప్రకారంబులన్= తగిన తగని రీతుల వలన; కల్గున్= కలుగుతాయి; కావునన్= కాబట్టి; సమ్యక్+ప్రకారంబుచేతన్= చక్కటి తీరులో; రక్షింపంబడిన= కాపాడిన; ప్రజ= జనం; రాజు= పాలకుని; అభివృద్ధిన్= పెరుగుదలను (పెంపును); ఒందించున్= కలిగిస్తుంది; అట్లు+అగుటన్= అందుచేత; దండంబు= దండనీతి; రాజునకున్= పాలకుడికి; పరాయణంబు= ఆశ్రయం.

తాత్పర్యం: ధర్మం-అధర్మం, కష్టం-సుఖం, నీతి-అవినీతి, లాభం-నష్టం, శక్తి-అశక్తి, ప్రమత్తత-అప్రమత్తత మొదలైన వాటి మొత్తం వివేచన సమస్తమైన అవస్థలూ దండనీతి బాగుగా పాలించటం పాలించకపోవటంవలన పుట్టాయి. బాగా పాలించిన దండనీతివలన ప్రజలు ఎల్లప్పుడూ రాజు అభివృద్ధినే కోరుకొంటారు. అందువలన రాజు తప్పక దండనీతిని ఆశ్రయించాలి.

క. సత్యప్రకార ధర్మము । నిత్యానుష్ఠేయ; మది సునీత మగుచు నా
దిత్యపతిఁ బ్రీతుఁ జేయఁగ । నత్యున్నతి నెసఁగు నాతఁ డన్నప్రదుఁడై. 112

ప్రతిపదార్థం: సత్యప్రకార ధర్మము= సత్యమార్గంగల ధర్మం; నిత్య అనుష్ఠేయము= ఎల్లప్పుడూ ఆచరించ దగింది; అది= ఆ ధర్మం; సునీతము+అగుచున్= సరైన రాజనీతి అవుతూ; ఆదిత్యపతిన్= దేవేంద్రుడిని; ప్రీతున్+చేయఁగన్= సంతుష్టి పరచగా; ఆతఁడు= ఆ ఇంద్రుడు; అతి+ఉన్నతిన్= ఎంతో గొప్పగా; అన్న ప్రదుఁడు+ఐ= అన్నదాత అయి; ఎసఁగున్= ఒప్పుతాడు.

తాత్పర్యం: సత్య మార్గంలో ధర్మాన్ని ఎప్పుడూ ఆచరించాలి. దాన్ని ఎంతో చక్కగా అమలు పరిస్తే ఇంద్రుడు సంతృప్తి పడతాడు. వానలు కురిపించి అన్నపానాదులు సమకూరుస్తాడు.

వ. దానంజేసి దండంబు ప్రసన్నంబై వెలుంగుఁ; దదీయాభిధానంబులు మఱియునుం గల; వాకర్ణింపుము. 113

ప్రతిపదార్థం: దానన్+చేసి= అందువలన; దండంబు= దండనీతి; ప్రసన్నంబు+ఐ= స్వచ్ఛంగా; వెలుంగున్= ఒప్పుతుంది; తదీయ= దండనీతికి సంబంధించిన; అభిధానంబులు= పేర్లు; మఱియున్= ఇంకా; కలవు= ఉన్నాయి; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అందువలననే దండనీతి ఒప్పుతుంది. ఈ నీతిని తెలిపే పేర్లు ఇంకా కొన్ని ఉన్నాయి. ఆలకించుము.

ఆ. పురుషుఁ డీశ్వరుండు భూతాత్మకుండు జీ ।
వుండు ప్రాణుఁ డక్షయుండు సత్త్వ
మనఁగ నేడు పేరు లష్టమంబు ప్రజాప ।
తి యనఁ బరఁగు దండదేవు పేరు. 114

ప్రతిపదార్థం: పురుషుఁడు= పురుషుడు; ఈశ్వరుండు= శివుడూ; భూతాత్మకుండు= భూత స్వరూపుడూ; జీవుండు= జీవుడూ; ప్రాణుఁడు= ప్రాణుడూ; అక్షయుండు= అక్షయుడూ; సత్త్వము= సత్త్వమూ; అనఁగన్= అన్నట్లుగా; ఏడు పేరులు= ఏడు రకాల పేర్లు; అష్టమంబు= ఎనిమిదవది అయిన; దండదేవు పేరు= దండ దేవుడిపేరు; ప్రజాపతి అనన్= ప్రజాపతి అనే పేరుతో; పరఁగున్= ప్రసిద్ధ మవుతుంది.

తాత్పర్యం: పురుషుడూ, ఈశ్వరుడూ, భూతస్వరూపుడూ, జీవుడూ, ప్రాణుడూ, అక్షయుడూ, సత్త్వమూ, ప్రజాపతీ అనే ఎనిమిదీ దండదేవుడి పేర్లు.

వసుహోముఁడు మాంధాతృనకుఁ జెప్పిన దండోత్పత్తి ప్రకారము (సం. 12-122-1)

వ. దండంబు సాక్షాద్దేవుం; డట్లగుటఁ దెలిపెడునది యొక్కయితిహాసంబు గల; దంగదేశాధీశుండు వసుహోముండను రాజు హిమశైలంబున ముంజపృష్ఠం బనం బ్రసిద్ధం బగు శృంగంబునకు దేవీ సహితంబుగాఁ జని యందు వసియించి మునిగణ పూజితంబగు వృత్తంబున నుదాత్తుండయి యుండ నమ్మహీపతి కడకు మాంధాతృండు సనుదెంచి సవినయంబుగాఁ బ్రణమిల్లిన, నబ్భూవల్లభునకు నతం డర్ఘ్యపాద్యాదులగు నుపచారంబు లాచరించి, 'వచ్చిన పని యేమి?' యని యడిగిన నప్పుడమిఱేఁడు 'సవిస్తరంబుగా దండ ప్రకారంబు వినుటకై నిన్నాశ్రయింప వచ్చితి' ననవుడు నమ్మహాత్ముం డతని కిట్లనియె. 115

ప్రతిపదార్థం: దండంబు= దండనీతి; సాక్షాత్+దేవుండు= ప్రత్యక్ష దైవమే; అట్లు+అగుటన్= అట్లా అవటాన్ని; తెలిపెడు+అది= తెలిపేటటువంటి; ఒక్క ఇతిహాసంబు= ఒక వెనకటి కథ; కలదు= ఉన్నది; అంగదేశ+అధీశుండు= అంగదేశపు రాజు; వసుహోముండు+అను రాజు= వసుహోము డనే పేరుగల రాజు; హిమశైలంబునన్= మంచుకొండమీద; ముంజపృష్ఠంబు+అనన్= ముంజపృష్ఠమని; ప్రసిద్ధంబు+అగు= పేరుపడ్డ; శృంగంబునకున్= పర్వతంపై శిఖరానికి; దేవీసహితంబుగాన్= పట్టపురాణితో కూడా; చని= వెళ్ళి (పోయి); అందున్= ఆ కొండ కొమ్మున; వసియించి= ఉండి; మునిగణపూజితంబు+అగు= మునిజనంచేత గౌరవించదగ్గ; వృత్తంబునన్= నడవడికతో; ఉదాత్తుండు+అయి= గొప్పవాడై; ఉండన్= ఉండగా, ఉన్నట్టి; ఆ+మహీపతి కడకున్= ఆ రాజు దగ్గరకు; మాంధాతృండు= మాంధాత; చనుదెంచి= వచ్చి (చేరి); సవినయంబుగాన్= ఎంతో అణకువగా; ఆ+భూవల్లభునకున్= ఆ రాజునకు; ప్రణమిల్లినన్= మ్రొక్కగా; అతండు= ఆ వసుహోముడు; అర్ఘ్యపాద్యాదులు+అగు= చేతులు కాళ్ళు కడుగు కొనటానికి నీళ్ళు ఇవ్వటం వంటి; ఉపచారంబులు= సేవలు; ఆచరించి= చేసి; వచ్చినపని= రాకకు కారణం; ఏమి?= ఏమిటి?; అని; అడిగినన్= అడుగగానే; ఆ+పుడమిఱేఁడు= ఆ రాజు; సవిస్తరంబుగాన్= వివరంగా; దండప్రకారంబు= దండనీతి

విధానం; వినుటకున్+ఐ= ఆలకించటానికి; నిన్నున్+ఆశ్రయింపన్= నీ అండకు; వచ్చితిన్= చేరాను; అనవుడున్= అనగానే; ఆ+మహాత్ముండు= ఆ రాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దండం సాక్షాత్తు దైవమే అనటానికి లోగడ జరిగిన కథ ఒకటి చెప్పుతాను వినుము. అంగదేశపు రాజు వసుహోముడు. ఒకసారి అతడు భార్యతోకూడా 'ముంజపృష్ఠ'మనే మంచుకొండ కొమ్ముమీదికి పోయాడు. అక్కడ కొన్నాళ్ళు ఉన్నాడు. తన నడతతో అక్కడి మునుల ఆదరణ పొందాడు. ఒకనాడు మాంధాత ఆ రాజు దగ్గరకు వచ్చి వినయంగా మ్రొక్కాడు. అతడికి రాజు అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి 'ఏమి పనిపడి వచ్చారు?' అని అడిగాడు. 'దండనీతి శాస్త్రాన్ని తుదముట్టా వివరంగా వినాలనే కోరికతో నీ అండ చేరాను' అన్నాడు. ఆ వసుహోముడు మాంధాతతో ఈ విధంగా అన్నాడు.

సీ. 'అజుఁ డధ్వరంబు సేయంగఁ దలంచి ఋ । త్విజు నాత్మసదృశుని వెదకి యెందుఁ
గానక, తా నొక్క గర్భంబు ధరియించి । వేయేండ్లకును దుమ్మి వెలువరించె;
క్షుతసంభవతఁ జేసి క్షుతుఁడను పేరిట । బరఁగెడు నా ప్రజాపతియు ఋత్వి
జుండుగఁ గ్రతు వొనర్చుచునుండ నంతర్హి । తం బయ్యె వలచు చందమున నడచు

ఆ. నట్టి దగుట దండ మధిప కార్యాకార్య । తంత్ర భేద మెడలె దానఁజేసి
మహి గలంగెఁ గడు నమర్యాద వర్తించెఁ । గమలజుండు విష్ణు కడకుఁ జనియె. 116

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అజుఁడు= బ్రహ్మ; అధ్వరంబు= యాగం; చేయంగన్= చేయటానికి; తలంచి= సంకల్పించి; ఆత్మసదృశునిన్= తనతో తులతూగే; ఋత్విజున్= యాగకర్తను; వెదకి; ఎందున్+కానక= ఎక్కడా తటస్థపడక; తాను= స్వయంగా; ఒక్కగర్భంబు= కడుపును; ధరియించి= పొంది; వేయేండ్లకున్= వేయి సంవత్సరాలకు; తుమ్మి= తుమ్మి; వెలువరించెన్= (కుమారుడిని) బయటపడేశాడు; క్షుతసంభవతన్+చేసి= తుమ్మువలన పుట్టినవా డవటం వలన; క్షుతుఁడు+అనుపేరిటన్= క్షుతుడనే పేరుతో; పరఁగెడు= ఒప్పుతున్నట్టి; ఆ ప్రజాపతియున్= ఆ క్షుత ప్రజాపతిని; ఋత్విజుండుగన్= యజ్ఞపురోహితుడుగా; క్రతువు= యాగం; ఒనర్చుచున్+ఉండఁగన్= చేస్తుండగా; అధిప!= రాజా!; వలచు చందమునన్= కోరినట్లుగా; నడచునట్టిది+అగుటన్= మసలుకొనేది అవటంవలన; దండము= దండనీతి; అంతర్హితంబు+అయ్యెన్= మాయమయింది; దానన్+చేసి= అందువలన; కార్య+అకార్యతంత్ర భేదము= చేయదగింది చేయదగంది అనే తేడా; ఎడలెన్= పోయింది; మహి= భూమి; కలంగెన్= కలతపడింది; కడున్= ఎంతో; అమర్యాద= అగౌరవం; వర్తించెన్= జరిగింది; కమలజుండు= బ్రహ్మ; విష్ణు కడకున్= విష్ణువు దగ్గరకు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: బ్రహ్మ ఒక యాగం చేయతలపెట్టి తనతో దీటైన ఋత్విజుడికొరకు గాలించాడు. ఎక్కడా అట్లాంటివాడే కంటపడలేదు. తానే స్వయంగా వెయ్యేళ్ళు గర్భం మోసి తుమ్మగా ఆ గర్భం బయటపడింది. తుమ్ము కారణంగా పుట్టినవా డవటం వలన అతడికి క్షుతుడనే పేరు పెట్టారు. ఆ క్షుతప్రజాపతి ఋత్విజుడుగా, బ్రహ్మ యాగం చేస్తున్నాడు. ఆ దండం ఇష్టం వచ్చినట్లు నడచుకొనేది కాబట్టి కనబడకుండా పోయింది. దానివలన ఏ పని చేయవచ్చు? ఏ పని చేయకూడ? దనే జ్ఞానం శూన్యమైనది. అందువలన ప్రజలంతా కలవరపడ్డారు. మర్యాద మంటగలిసింది. బ్రహ్మ విష్ణువును ఆశ్రయించాడు.

క. చని సంప్రార్థించి, యతని । గొని రుద్రునిఁ గాంచి 'నీ సఖుం డీతఁడు వ
చ్చిన కార్యము గృపతోడను । విను'మని దండంబు తెఱఁగు వినిపించెఁ దగన్. 117

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; సంప్రార్థించి= వేడుకొని; అతనిన్= విష్ణువును; కొని= తీసికొనివెళ్ళి; రుద్రునిన్= శివుడిని; కాంచి= చూచి; ఈతఁడు= ఇతడు; నీ సఖుండు= నీ మిత్రుడు; వచ్చినకార్యము= వచ్చిన పనిని; కృపతోడను= దయతో; వినుము= వినవలసింది; అని= అని చెప్పి; దండంబు=దండనీతి; తెఱంగు= తీరు; తగన్= ఇంపుగా; వినిపించెన్= వివరించాడు.

తాత్పర్యం: బ్రహ్మ విష్ణువును ప్రార్థించి, అతడిని శివుడి దగ్గరకు తీసికొనిపోయి 'ఇతడు నీ మిత్రుడు. అతడు ఏమి పనిమీద వచ్చాడో చెప్పుతాడు; దయతో వినవలసింది' అంటూ దండనీతి విధానం అంతా చెవికి ఇంపుగా చెప్పాడు.

వ. అట్లు లోకరక్షకుండగు పుండరీకాక్షు దండగొని దండాభావంబున జగంబు గలంగు టెఱింగించిన, నవ్విరించి పలుకులు మనస్కరించి మహాదేవుండు నిజప్రభావంబు దండంబుగాఁ గల్పించి దండనీతి కాశ్రయుండై పరఁగుచుండె. 118

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; లోక రక్షకుండు+అగు= లోకాన్ని కాపాడే పుండరీకాక్షు= విష్ణువుయొక్క; దండగొని= అండకొని; దండ+అభావంబునన్= దండం లేకపోవటంచేత; జగంబు= లోకం; కలంగుట= కలవరపడటం; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+విరించి పలుకులు= ఆ బ్రహ్మ మాటలు; మనస్కరించి= ఇష్టపడి; మహాదేవుండు= శివుడు; నిజప్రభావంబున్= తనదైన మహిమను; దండంబుగాన్= దండంగా; కల్పించి= నిర్మించి (చేసి); దండనీతికిన్= దండనీతికి; ఆశ్రయుండు+ఐ= ఆధారభూతుడై; పరఁగుచున్+ఉండెన్= ఒప్పుతూ ఉన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా విష్ణువును ఆసరాగా చేసికొని బ్రహ్మ దండనీతి మాయమవటంవలన ప్రపంచం ఎట్లా అల్లకల్లోల మయిందో వివరించి చెప్పాడు. ఆ బ్రహ్మమాటలు శివుడికి మనస్కరించాయి. వెంటనే తన మహిమతో దండాన్ని కల్పించాడు. ఆ దండానికి తానే ఆధారం అయ్యాడు.

సీ. వినుము; ఋగ్వేదాది వేదముల్ నాలుగుఁ, । గల్పాదులైన యంగంబు లాఱు,
బెరసి విద్యలు పది పేర్చు; పురాణంబు । లనియును నొక విద్య యధిప! ధర్మ
విదులు సెప్పెడు శాస్త్ర వితతియంతయు నొక । విద్య; సర్వన్యాయ విస్తరంబు
నొకటి, మీమాంస దానొక్కటి; యిట్టులు । వివరింపఁ బదునాల్గు విద్య లయ్యె

తే. వైద్య కోదండ గాంధర్వ విద్య, లర్థ । శాస్త్రమగు నీతివిద్య, తత్సహిత వృత్తి
వెలయఁగాఁ బదునెనిమిది విద్య లభవుఁ । డేర్పరించె జగత్త్రయహితము పొంటె. 119

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; వినుము= ఆలకించుము; ఋగ్వేదాది వేదముల్= ఋగ్వేదం మొదలైన వేదాలు; నాలుగున్= నాలుగు; కల్ప+ఆదులు+ఐన= కల్పం మొదలైన; అంగంబులు+ఆఱు= వేదాంగాలు ఆరూ; బెరసి= వెరసి (కలసి); విద్యలు పది= పది విద్య లవుతాయి; పేర్చు= అతిశయించిన; పురాణంబులు= పద్దెనిమిది పురాణాలు; అనియునున్= అనియు; ఒక విద్య= ఒక విద్య అవుతుంది; ధర్మ విదులు= ధర్మశాస్త్రం తెలిసినవారు; చెప్పెడు= చెప్పే; శాస్త్ర వితతి+అంతయున్= శాస్త్రాలన్నీ; ఒక విద్య= ఒక విద్య అవుతుంది; సర్వన్యాయ విస్తరంబున్= సమస్త తర్కశాస్త్రం అంతా; ఒకటి= ఒక్కటి అవుతుంది; మీమాంస= పూర్వోత్తర మీమాంసా శాస్త్రం అంతా; తాను ఒక్కటి= తనకు తానే ఒక్కటి; ఇట్టులు= ఈ విధంగా; వివరింపన్= బాగా తెలుపగా; పదునాల్గు విద్యలు= పద్నాలుగు విద్యలు; అయ్యెన్= అయ్యాయి; వైద్య= వైద్య విద్య; కోదండ= విలువిద్య; గంధర్వవిద్యలు= సంగీత విద్యలు; అర్థశాస్త్రము+అగు నీతి విద్య= అర్థశాస్త్రమైన నీతి విద్య; తత్సహిత= దానితో కూడుకొన్న; వృత్తి= వివరణా; వెలయఁగాన్= ప్రకాశించగా; పదునెనిమిది విద్యలు= పద్దెనిమిది విద్యలు; జగత్త్రయ= ముల్లోకాల; హితము పొంటెన్= మేలు కొరకు; అభవుఁడు= శివుడు; ఏర్పరించెన్= ఏర్పాటు చేశాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వవేదం అనే నాలుగు వేదాలూ, శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం అనే ఆరు వేదాంగాలూ కలిసి మొత్తం పది విద్యలవుతాయి. పురాణం, ధర్మశాస్త్రం, న్యాయశాస్త్రం, పూర్వోత్తరమీమాంసా శాస్త్రంతో చేర్చుకొని మొత్తం పధ్నాలుగు విద్యలు అవుతాయి. వైద్యవిద్య (ఆయుర్వేదం), విలువిద్య (ధనుర్వేదం), సంగీతం (గాంధర్వవేదం), నీతివిద్య (అర్థశాస్త్రం) అనే ఉపవేదాంగాలతో కలిపితే మొత్తంగా పద్దెనిమిది విద్యలు అవుతాయి. వీటిని శివుడు ముల్లోకాల మేలుకోరి సృష్టించాడు.

వ. ఇట్లు సమకట్టి, దండంబును దండనీతి ప్రపంచంబులయిన యవ్విద్యలను విష్ణు వశగతంబులు సేసె; నాసర్వేశ్వరుం డత్తమ్మిచూలికిఁ దుమ్ము ఘటించి యీ భంగిం బ్రజాపతి ప్రసవంబు గావించె; దండనీతి సమగ్ర రూపమై చెల్లె; నెల్ల జగంబులుం బ్రియంబందె; నరవిందభవుని యాగంబును సుప్రయోగంబై నడచె; విష్ణుండు దండనీతి శాస్త్రంబు సకలంబు నాంగిరసున కిచ్చె; నాంగిరసుం డింద్ర మరీచులకు, మరీచి భృగునకు, భృగుం డనేక మునులకు నిచ్చె; నీక్రమంబున నది జగంబులం బరఁగె; దండంబు జాగరణంబున లోకంబు మర్యాదామహితంబై వర్తిల్లెఁ; గపర్ది శంకరుండు రుద్రుండు భవుండు స్థాణుం డుమాపతి యనుపేళ్ళం బరఁగు నద్దండదేవుని నతులధర్మంబున నయించు భూపాలుం డైహికాముష్మిక సిద్ధులం బొందు. 120

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సమకట్టి= పూనుకొని; దండంబును= దండనీతి శాస్త్రాన్ని; దండనీతి ప్రపంచంబులు+ఐన= దండనీతిని విస్తరింపచేసేవి అయిన; ఆ+విద్యలను= ఆ పద్దెనిమిది విద్యలను; సర్వేశ్వరుండు= ఆ శివుడు; విష్ణువశగతంబులు+చేసెన్= విష్ణుపరం చేశాడు; ఆ తమ్మిచూలికిన్= పద్మంలో పుట్టిన బ్రహ్మకు; తుమ్ము ఘటించి= తుమ్ము కల్పించి; ఈ+భంగిన్= ఈ విధంగా; ప్రజాపతి= క్షుతబ్రహ్మను; ప్రసవంబు కావించెన్= పుట్టించాడు; దండనీతి= దండనీతి; సమగ్రరూపము+ఐ= నిండారిన రూపంతో; చెల్లెన్= చెల్లుబాటయింది; ఎల్లజగంబులున్= సమస్త లోకాలూ; ప్రియంబు= సంతోషాన్ని; అందెన్= పొందాయి; అరవిందభవుని= బ్రహ్మయొక్క; యాగంబును= యాగమూ; సుప్రయోగంబు+ఐ= మంత్ర తంత్రాదులతో; నడచెన్= జరిగింది; విష్ణుండు= విష్ణువు; దండనీతి శాస్త్రంబు= దండనీతి శాస్త్రం; సకలంబున్= మొత్తాన్నీ; ఆంగిరసునికిన్+ఇచ్చెన్= ఆంగిరసుడికి ఇచ్చాడు; ఆంగిరసుడు= ఆ ఆంగిరస మహర్షికి; ఇంద్రమరీచులకున్= ఇంద్రుడికీ, మరీచుడికీ; మరీచి= మరీచి; భృగునకున్= శుక్రాచార్యుడికి; భృగుండు= శుక్రాచార్యుడు; అనేక మునులకున్= ఎంతోమంది మునులకు; ఇచ్చెన్= సమర్పించాడు; ఈ క్రమంబునన్= ఈ రీతిగా; అది= ఆ దండనీతి శాస్త్రం; జగంబులన్= లోకాలన్నిట్లో; పరఁగెన్= ఒప్పింది; దండంబు= దండనీతి; జాగరణంబునన్= ఎచ్చరికతో; లోకంబు= ప్రపంచం; మర్యాదామహితంబు+ఐ= గౌరవంతో ఒప్పినదయి; వర్తిల్లెన్= వ్యవహరించింది; కపర్ది= కపర్దం అనే జటాజూటం కలవాడు; శంకరుండు= సుఖాన్ని కలిగించేవాడూ; రుద్రుండు= శత్రువులను దుఃఖపెట్టేవాడూ; భవుండు= అంతా తానే అయ్యేవాడూ; స్థాణుండు= ప్రళయకాలంలోకూడా ఉండేవాడూ; ఉమాపతి= పార్వతీదేవి భర్త; అనుపేళ్ళన్= అనే ఆరు పేర్లతో; పరఁగు= ఒప్పేటి; ఆ+దండదేవునిన్= ఆ దండదేవుడైన రుద్రుడిని; అతుల ధర్మంబునన్= సాటిలేని ధర్మంతో; నయించు= నడిపే; భూపాలుండు= రాజు; ఐహిక ఆముష్మిక సిద్ధులన్= ఇహలోక పరలోక సంపదలను; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ విధంగా ప్రయత్నించి దండనీతిని పద్దెనిమిది విద్యలను శివుడు విష్ణువునకు అప్పగించాడు. ఆ బ్రహ్మకు తుమ్ము పుట్టించి క్షుతబ్రహ్మను పుట్టించాడు. దండనీతి ప్రపంచంలో వ్యాపించింది. ప్రపంచం మొత్తం సంతోషించింది. బ్రహ్మదేవుడి యాగం శాస్త్రోక్తంగా జరిగింది. తన అధీనంలో ఉన్న దండనీతి శాస్త్రాన్నంతా విష్ణువు ఆంగిరసుడికీ, అతడు దేవేంద్రుడికీ, మరీచికీ, మరీచి భృగుమహర్షికీ తెలియచెప్పారు. భృగుమహర్షి ఎంతో మంది

మునులకు ఉపదేశించాడు. ఇట్లా ఈ దండనీతి శాస్త్రం అన్ని లోకాలలోకి విస్తరించింది. దండనీతితో లోకం ప్రవర్తించటంవలన మర్యాదతో మెలగింది. కపర్ది, శంకరుడు, రుద్రుడు, శివుడు, స్థాణుడు, ఉమాపతి అనే పేళ్ళతో వ్యవహరించే దండనీతిని ధర్మబద్ధంగా నడిపిన రాజు భూలోకంలోనూ, పై లోకంలోనూ సర్వసంపదలను పొందుతాడు'

క. అని వసుహోముఁడు సెప్పిన । విని మాంధాతృండు దండ విభవజ్ఞుండై
యనఘ! మహీపరిపాలన । మొనరించెను నీతిదండయుక్తి వెలయఁగన్. 121

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; అని= ఈ విధంగా; వసుహోముఁడు= అంగదేశపు రాజు; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; మాంధాతృండు= మాంధాత; దండ విభవజ్ఞుండు+ఐ= దండనీతి వైభవాన్ని తెలిసికొన్న వాడై; నీతి దండయుక్తి= దండనీతి శాస్త్రంతో కూడి; వెలయఁగన్= ప్రకాశించగా; మహీపరిపాలనమున్= భూపరిపాలనాన్ని; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: రాజా! ఈ విధంగా వసుహోముడు మాంధాత చెప్పిన దండనీతి శాస్త్రం విని' ఆ దండనీతి వైభవంతో రాజ్యాన్ని పాలించాడు.

క. ఈ యాఖ్యానము విని భూ । నాయకుఁ డెవ్వం డిలాజనంబుల నతుల
న్యాయంబున భావించుఁ జి । రాయుష్మర పుణ్యభాగి యగు నతఁడు నృపా! 122

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; ఈ ఆఖ్యానమున్= ఈ వృత్తాంతాన్ని; ఎవ్వండు భూనాయకుఁడు= ఏ రాజు; విని= విన్నవాడై; ఇలా జనంబులన్= భూప్రజలను; అతులన్యాయంబునన్= సాటిలేని న్యాయంతో; పాలించున్= ఏలుకొంటాడో; అతఁడు= ఆ రాజు; చిరాయుః= చిరంజీవిగా ఉంటాడు; స్థిరపుణ్యభాగి= తరగని పుణ్యసంపదలు కలిగినవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: ఈ కథా వృత్తాంతాన్నంతా విన్న రాజు తన ప్రజలను ధర్మబద్ధంగా పాలిస్తాడు. ఆ రాజు చిరంజీవి అవుతాడు. తరగని పుణ్యసంపదలు అనుభవిస్తాడు'.

భీష్ముఁడు ధర్మరాజునకు ధర్మార్థకామంబుల తెఱం గెఱిఁగించుట (సం. 12-123-3)

వ. అనిన విని ధర్మనందనుండు 'ధర్మార్థ కామంబుల నడవడి యె ట్లయిన మేలై చెల్లు?' నని యడిగిన, భీష్ముం
డిట్లనుఁ 'దొల్లి యాంగరిష్ముం డను నరవరుండు కామందక నాముండైన ముని నిట్లని యడుగ నతం డతనికిఁ
జెప్పిన భంగిం జెప్పెద నాకర్ణింపుము. 123

ప్రతిపదార్థం: అనినన్= భీష్ముడు పలుకగానే; విని= విని; ధర్మనందనుండు= ధర్మరాజు; ధర్మార్థ కామంబులన్= ధర్మ, అర్థ, కామాల; నడవడి= నడత; ఎట్లు+అయినన్= ఏ విధంగా ఉంటే; మేలు+ఐ= మంచిదై; చెల్లును?= కొనసాగుతుంది?; అని+అడిగినన్= అని అడుగగా; భీష్ముండు= భీష్ముడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; తొల్లి= పూర్వం; ఆంగరిష్ముండు= ఆంగరిష్ముడనే; నరవరుండు= రాజు; కామందక నాముండు+అయిన= కామందకుడనే పేరుగల; మునిన్= మునిని; ఇట్లు+అని= ఇట్లాగని; అడుగన్= అడగగా; అతండు= ఆ ముని; అతనికిన్= రాజునకు; చెప్పిన భంగిన్= చెప్పినట్లుగానే; చెప్పెదన్= వినిపిస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: 'ధర్మార్థ కామాలతో ఎట్లా నడచుకొంటే మంచిది?' అని ధర్మరాజు అడుగగా, భీష్ముడు 'లోగడ ఆంగరిష్ముడనే రాజు కామందకు డనే మునిని ఈ విషయం గూర్చే అడిగాడు. అతడు చెప్పినట్లుగానే నీకూ చెప్పుతాను వినుము.

చ. అనయముఁ బేర్చు కామమున నర్థము ధర్ముఁ గ్రాఁగుఁ గామతం
త్ర నిరతుఁ డైనవాఁడు సుపథప్రతిపన్నుఁడు గాఁడు దుష్టదం
డన మొనరింపఁ డట్టిపతి డాయరు సాధులు నార్యులున్ సుహృ
జ్జనులును; దానఁ జేటు నగుఁ, జావును బాటిలు నెల్ల భంగులన్. 124

ప్రతిపదార్థం: అనయమున్= ఎపుడూ; పేర్చు= పెరిగే; కామమునన్= కోరికవలన; అర్థమున్= అర్థమూ; ధర్మమున్= ధర్మమూ; క్రాఁగున్= హరిస్తాయి; కామతంత్ర నిరతుఁడు+ఐనవాఁడు= కామోపాయంపట్ల ఆసక్తి ఉన్నవాడు; సుపథ ప్రతిపన్నుఁడు= మంచి మార్గాన్ని చేపట్టేవాడు; కాఁడు= కానేరడు; దుష్టదండనమున్= చెడ్డవాళ్ళను శిక్షించటాన్ని; ఒనరింపఁడు= చేయడు; అట్టిపతి= అట్లాంటి రాజును; సాధులున్= మంచివారు; ఆర్యులున్= పెద్దవారు; సుహృద్ జనులున్= స్నేహితులూ; డాయరు= దరిచేరరు; దానన్= అందువలన; ఎల్లభంగులన్= అన్నివిధాలా; చేటున్+అగున్= నాశనం కలుగుతుంది; చావున్= మరణంకూడా; పాటిలున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఓ రాజా! ఎపుడూ భోగం అనుభవించాలనుకొనే రాజునకు ధర్మార్థాలు హరించుకుపోతాయి. కామంలో ఆసక్తిగల రాజు మంచి మార్గంలో ఉండడు. దుష్టులను శిక్షించడు. అట్లాంటి రాజు దగ్గరకు మంచివారు, పెద్దవారు, స్నేహితులు చేరరు. చెడ్డవారే చుట్టూ ఉంటారు. అందువలన అట్లాంటి రాజునకు కీడు కలుగుతుంది. చావూ మూడుతుంది.

ఉ. కావున ధర్మసిద్ధికి ముఖంబగు నర్థమునందు నిష్ఠమై
నేవిధినైన ధర్మరతి యెక్కుడుగా మదిఁ జొన్పుటొప్పుఁ గా
మావిలబుద్ధి గాక యుచితాగత సౌఖ్యము లాచరించుచున్
భూవిభుఁ డెప్డు భూమిసతిఁ బొంది రమింప మహోన్నతుం డగున్.' 125

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ధర్మసిద్ధికిన్= ధర్మం ఫలించటానికి; ముఖంబు+అగు= ముఖ్యమైనది అయిన; అర్థమునందున్= పురుషార్థాలలో ఒకటైన అర్థంలో; నిష్ఠమైన్= శ్రద్ధతో; ఏ విధిన్+ఐనన్= ఎట్లా అయినాసరే; ధర్మరతి= ధర్మం మీద ఆపేక్ష; ఎక్కుడుగాన్= ఎక్కువ అగునట్లుగా; మదిన్+చొన్పుట= మనసులో నాటటం; ఒప్పున్= మంచిది అవుతుంది; కామ+ఆవిల బుద్ధి+కాక= కామంతో కలకబారిన మనస్సుతో కాక; ఉచిత+ఆగతసౌఖ్యములు= తగినట్టుగా వచ్చిన సుఖాలను; ఆచరించుచున్= పొందుతూ; భూ విభుఁడు= రాజు; ఎప్డున్= నిత్యమూ; భూమిసతిన్= భూకాంతను; పొంది= కలసి; రమింపన్= క్రీడించగా; మహా+ఉన్నతుండు+అగున్= గొప్పవా డవుతాడు.

తాత్పర్యం: కనుక, ధర్మం దక్కించుకొనటానికి ఆధారం అర్థం. ఆ అర్థంపట్ల నిష్ఠతో ఎట్లాగైనా ధర్మాపేక్షను విడనాడకూడదు. కామబుద్ధితో కాక లభ్యమైన తగిన సౌఖ్యాలను అనుభవిస్తూ రాజ్యాన్ని ఏలుకునే రాజు గొప్పవాడవుతాడు.

క. అన విని ధర్మతనూజుఁడు । 'జనమ్ము శీలమ్ము నధిక సంస్తుత్యముగాఁ
గొనియాడుఁ; దత్స్వరూపం । బనఘా! వివరింపవే దయారతి నాకున్?' 126

ప్రతిపదార్థం: అనన్= అనగానే; విని= ఆలకించి; ధర్మతనూజుఁడు= ధర్మరాజు; అనఘ!= ఓ పుణ్యవంతుడా!; జనమ్ము= లోకులు; శీలమ్మున్= నడవడిని; అధిక సంస్తుత్యముగాన్= ఎంతో పొగడదగినదిగా; కొనియాడున్= మెచ్చుకుంటారు; నాకున్= నాకు; దయారతిన్= కనికరంతో; తద్+స్వరూపంబున్= దాని కలరూపాన్ని; వివరింపవే?= విశదపరచవా?

తాత్పర్యం: 'లోకం శీలాన్ని ఎంతో మెచ్చుకొంటున్నది కదా! దాని స్వరూపాన్ని విప్పిచెప్పు'మని ధర్మరాజు ప్రార్థించాడు.

వ. అనుటయు నాపగాతనయుండు వినుమని యతని కిట్లనియె. 127

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఆపగా తనయుండు= భీష్ముడు; వినుము= ఆలకించుము; అని; అతనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: మళ్ళీ భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు.

క. 'ము న్నింద్రప్రస్థంబున । నున్నతి మెయి ననుజ తనుజయుక్తంబుగ నీ
వున్న తెఱఁగు దుర్యోధను । కన్నులు గమరింప నతఁడు గడు వగ నొందెన్. 128

ప్రతిపదార్థం: మున్ను= పూర్వం; ఇంద్రప్రస్థంబునన్= ఇంద్రప్రస్థ నగరంలో; అనుజ= తమ్ములతోను; తనుజ= కొడుకులతోను; యుక్తంబుగన్= కూడుకొని; ఈవు= నీవు; ఉన్నతిమెయిన్= ఉచ్ఛస్థితిలో; ఉన్న తెఱఁగు= ఉన్నతీరును (చూచి); దుర్యోధను= సుయోధనుడి; కన్నులు= కళ్ళు; కమరింపన్= ఉడుకెత్తగా; అతఁడు= ఆ దుర్యోధనుడు; కడు వగన్= ఎంతో దుఃఖాన్ని; ఒందెన్= పొందాడు.

తాత్పర్యం: 'నీవు నీ కొడుకులతో తమ్ముళ్ళతో కలిసి ఇంద్రప్రస్థంలో బాగా ఉండే రోజులలో దుర్యోధనుడికి కళ్ళుకుట్టి ఎంతో బాధపడ్డాడు.

వ. భవదీయ సభ యొప్పునకును రాజసూయంబు చెల్లిన యుల్లాసంబునకును నట్లసహ్యపడి ధృతరాష్ట్రునితో భవద్గృహంబున నిచ్చలుం బదివేవురు భూసురులు పసిండి పళ్ళెరంబులం బాయసాహారంబులు గొనుట మొదలుగాఁగ లక్ష్మిపెం పుగ్గడించి తనవగపు దోఁపంబలికిన నతం డతని కిట్లను 'మధురాన్నపాన మణిభూషణ వరవాహనాదులం జేసి యుజ్జ్వలంబై యున్నది గాక నీ యైశ్వర్యం బసదే? పాండవాగ్రజుం డెక్కుడు మెఱసి యునికియుం గలదు; వినుము చెప్పెద. 129

ప్రతిపదార్థం: భవదీయ= నీకు సంబంధించిన; సభ= సమావేశం (మయసభ); ఒప్పునకును= చక్కదనానికి; రాజసూయంబు= రాజసూయ యాగం; చెల్లిన= జరిగిన; ఉల్లాసంబునకునున్= వైభవానికీ; అటు= అట్లా; అసహ్యపడి= ఈర్ష్యపడి; ధృతరాష్ట్రునితోన్= తండ్రితో; భవత్+గృహంబునన్= నీ (ధర్మరాజు) ఇంట్లో; నిచ్చలున్= అనునిత్యం; పదివేవురు= పదివేలమంది; భూసురులు= బ్రాహ్మణులు; పసిండి పళ్ళెరంబులన్= బంగారు పళ్ళెములలో; పాయస+ఆహారంబులు= పరమాన్నం మొదలైన పదార్థాలు; కొనుట= తినటం; మొదలుగాఁగన్= మొదలుపెట్టి; లక్ష్మి పెంపున్= మహా ఐశ్వర్యాన్ని; ఉగ్గడించి= చెప్పి; తనవగపు= తన దుఃఖం; తోఁపన్= కనపడేటట్లు; పల్కినన్= పలుకగా; అతండు= ధృతరాష్ట్రుడు; అతనికిన్= దుర్యోధనుడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; మధుర= కమ్మనైన; అన్నపాన= అన్నపానాదులచేత; మణి= మణులచేత; భూషణ= నగలచేత; వరవాహనాదులన్+చేసి= మంచి వాహనాదులచేత; నీ ఐశ్వర్యంబు= నీ సంపద; ఉజ్జ్వలంబు+ఐ ఉన్నది= ప్రకాశిస్తూ ఉన్నది; అసదు+ఏ= తక్కువా; కాక= కాకపోతే; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ఎక్కుడు మెఱసి= ఎక్కువగా ఒప్పి; ఉనికియున్= ఉండుట; కలదు= ఉన్నది; చెప్పెదన్= చెబుతాను వినుము.

తాత్పర్యం: నీ మయసభ అందాన్ని, రాజసూయయాగ ప్రాభవాన్నీ చూచి అసూయపడ్డాడు. ధర్మరాజు ఇంట్లో ఎపుడూ పదివేలమంది బ్రాహ్మణులు బంగారు పళ్ళాలలో పాయసాన్నం తింటుంటారని, ఐశ్వర్యం సంపత్తి అంచనా కట్టుకొని తన దుఃఖాన్ని తండ్రి దగ్గర వెళ్ళబోసుకొన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు 'మధురమైన అన్నపానాలూ,

మణులూ, ఆభరణాలూ, మంచి వాహనాదులచేత నీ ఐశ్వర్యం అంతకన్నా తక్కువదేమీ కాదు. కాకపోతే ధర్మరాజు నీకంటె మిన్నగా ఉండటానికి కారణం చెప్పుతాను వినుము.

ఆ. శీలవంతులైన సిరిఁ బొందుదురు ధర్మ। తనయునింటి సిరికి నెన యనంగ
నెక్కు డనఁగ లక్ష్మి యెసకం బెసఁగ నీవు। శీల మలవరింపు చిత్తమునను. 130

ప్రతిపదార్థం: శీలవంతులు+ఐనన్= మంచి నడత కలవారైతే; సిరిన్= ఐశ్వర్యాన్ని; పొందుదురు= పొందుతారు; ధర్మతనయు= ధర్మరాజు యొక్క; ఇంటి సిరికిన్= ఇంటి సంపదకు; ఎన+అనంగన్= సాటేమో అన్నట్లుగా; ఎక్కుడు+అనఁగన్= ఎక్కువేమో అనేటట్లుగా; లక్ష్మి= సంపద; ఎసకంబు+ఎసఁగన్= పెంపొందటానికి; నీవు= నీవు; చిత్తమునను= మనస్సులో; శీలము= మంచి స్వభావాన్ని; అలవరింపు(ము)= సంపాదించుకొమ్ము.

తాత్పర్యం: మంచి ప్రవర్తన కలవారు ఎన్నో సంపదలతో తులతూగుతుంటారు. కనుక ధర్మరాజు దగ్గర శీలం అధికం. ధర్మరాజు ఇంటి సంపదతో సరిసమాన మయ్యేటట్లు అంతకంటే మరింతగా సంపద పెంపొందటానికి నీవు కూడా మంచి స్వభావాన్ని అలవరుచుకొమ్ము.

వ. మాంధాతృండు, నాభాగుండు మొదలయిన మేదినీపతులు శీలంబునంగాదె యీ లోకంబునం బెంపువడసి; రివ్విషయంబునకు నొక్క యితిహాసంబు గల; దాకర్ణింపుము. 131

ప్రతిపదార్థం: మాంధాతృండు= మాంధాత; నాభాగుండు= నాభాగుడు; మొదలయిన= మొదలైన; మేదినీ పతులు= రాజులు; శీలంబునన్= మంచి ప్రవర్తనచేతనే; కాదె?= కాదా?; ఈ లోకంబునన్= ఈ లోకంలో; పెంపు+పడసిరి= ఎంతో మన్నన పొందారు; ఈ+విషయంబునకున్= ఆ సంగతి తెలిసికొనటానికి; ఒక్క ఇతిహాసంబు= పూర్వం జరిగిన కథ ఒకటి; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: మాంధాతా, నాభాగుడు మొదలైన మహారాజులంతా శీలంవలనే లోకంలో గౌరవం పొందారు. దీనిని గురించి జరిగిన కథ ఒకటి చెప్పుతాను వినుము.

క. దనుజవిభుఁడు ప్రహ్లాదుం। డనిమిష పతి రాజ్యలక్ష్మి యతులిత శీలం
బునఁ గొని త్రైలోక్యంబును। దనకు వశగతంబు సేసె ధర్మం బలరన్. 132

ప్రతిపదార్థం: దనుజ విభుఁడు= రాక్షసరాజైన; ప్రహ్లాదుండు= ప్రహ్లాదుడు; అనిమిషపతి= ఇంద్రుడి; రాజ్యలక్ష్మి= రాజ్యాన్ని; అతులిత= సాటిలేని; శీలంబునన్= సత్ప్రవర్తనచేత; కొని= కైవసం చేసికొని; త్రైలోక్యంబును= ముల్లోకాలను; తనకున్= తనకు; ధర్మంబు+అలరన్= న్యాయం ఒప్పేటట్లు; వశగతంబు+చేసెన్= స్వాధీనం చేసికొన్నాడు.

తాత్పర్యం: శీలం మూలంగానే ఒకపుడు ప్రహ్లాదుడు ఇంద్రుడి రాజ్యాన్ని లోబరచుకొన్నాడు. ధర్మబద్ధంగా ముల్లోకాలను తన గుప్పిట్లో పెట్టుకొన్నాడు.

క. దానికి రోసి బృహస్పతి। తో నమరేంద్రుండు మేలు దొరకొను విధమె
ట్లో నావుడు భార్గవునిం। గానఁగఁజను మతఁడు సెప్పఁ గరుణాన్వితుఁడై. 133

ప్రతిపదార్థం: దానికిన్= దానికి; రోసి= ఏవగించుకొని; బృహస్పతితోన్= దేవతల గురువుతో; అమర+ఇంద్రుండు= దేవేంద్రుడు; మేలు= మంచి; దొరకొను విధము= కలిగే తీరు; ఎట్లో= ఎట్లాంటిదో (చెప్పవలసింది); నావుడున్= అనగానే; భార్గవునిన్+కానఁగన్=

శుక్రాచార్యుడిని; దర్శించటానికి; చనుము= వెళ్ళుము; అతఁడు= శుక్రాచార్యుడు; కరుణా+అన్వితుఁడు+ఐ= దయకలవాడై; చెప్పున్= చెపుతాడు.

తాత్పర్యం: దానికి ఇంద్రుడు రోషపడి దేవతలగురువు బృహస్పతి దగ్గరకు వెళ్ళి 'నాకు మేలు జరిగే ఉపాయం చెప్పు' మన్నాడు. బృహస్పతి 'శుక్రాచార్యుడివలన నీ కన్నీ తెలుస్తాయి వెళ్ళుము అతడు ఎంతో దయతో చెప్పుతాడు'.

క. అని గురుఁడు పంప నింద్రుఁడు । సని భార్గవుఁ గాంచి 'మేలు సమకూరు తెఱం
గనఘా! యుపదేశింపవె' । యనినం 'బ్రహ్లాదుఁ జెందు; మతఁ డెఱిఁగించున్. 134

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; గురుఁడు= బృహస్పతి; పంపన్= పంపగా; ఇంద్రుఁడు= దేవేంద్రుడు; చని= వెళ్ళి; భార్గవున్= శుక్రాచార్యుడిని; కాంచి= చూచి; అనఘా!= ఓ పుణ్యాత్ముడా!; మేలు= శుభం; సమకూరు తెఱంగు= సమకూరే ఉపాయాన్ని; ఉపదేశింపవె?= తెలియచెప్పవా?; అనినన్= అనగానే; ప్రహ్లాదున్= ప్రహ్లాదుడిని; చెందుము= చేరి అడుగుము; అతండు= ఆ ప్రహ్లాదుడు; ఎఱిఁగించున్= బోధ పరుస్తాడు.

తాత్పర్యం: ఇంద్రుడు శుక్రాచార్యుడి దగ్గరకు వెళ్ళి 'అయ్యా! నా రాజ్యలక్ష్మిని తిరిగిపొందే ఉపాయాన్ని చెప్పు' మనగానే అతడు 'ప్రహ్లాదుడి దగ్గరకు వెళ్ళటం శ్రేయస్కరం. అంతా అతడే చెప్పుతాడు' అంటాడు.

ఆ. అతని నాశ్రయించి యవ్వెర విప్పించి । కొనిన మేలు వొందు' ననియె భార్గ
వుండు వజ్రి బ్రాహ్మణుం డయి ప్రహ్లాదుఁ । జేరి శిష్యవిధులు సేయుచుండె. 135

ప్రతిపదార్థం: అతనిన్= ఆ ప్రహ్లాదుడిని; ఆశ్రయించి= అండచేరి; ఆ+వెరవు= ఆ ఉపాయాన్ని; ఇప్పించుకొనినన్= పొందగా; మేలు+పొందున్= శుభం కలుగుతుంది (అని); భార్గవుండు= శుక్రాచార్యుడు; అనియెన్= అన్నాడు; వజ్రి= ఇంద్రుడు; బ్రాహ్మణుండు+అయి= బ్రాహ్మణవేషం వేసికొని; ప్రహ్లాదున్+చేరి= ప్రహ్లాదుడి దగ్గరచేరి; శిష్య విధులు= శిష్యులు చేసే పనులు; చేయుచున్+ఉండెన్= చేస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: 'ప్రహ్లాదుడిని ఆశ్రయించి ఆ ఉపాయాన్ని పొందితే నీకు మంచి జరుగుతుం'దని భార్గవుడు చెప్పాడు. ఇంద్రుడు బ్రాహ్మణవేషంతో ప్రహ్లాదుడి శిష్యుడిగా చేరి శుశ్రూషలు చేస్తూ ఉన్నాడు.

వ. అంత నద్దానవేంద్రుండు ప్రసన్నుండై భూసురాకృతి యయిన సురపతితో సంభాషించిన నతండు 'నీకుఁ
ద్రైలోక్యరాజ్యంబు సంప్రాప్తం బైన కారణం బేమి? యెఱింగింపవే!' యనుటయు. 136

ప్రతిపదార్థం: అంతన్= కొంతకాలం పోయాక; ఆ+దానవ+ఇంద్రుండు= ఆ రాక్షసరాజు ప్రహ్లాదుడు; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహించిన వాడై; భూసుర+ఆకృతి+అయిన= బ్రాహ్మణ వేషంలో ఉన్న; సురపతితోన్= దేవేంద్రుడితో; సంభాషించినన్= మాటాడగా; అతండు= ఇంద్రుడు; నీకున్= నీకు; త్రైలోక్యరాజ్యంబు= ముల్లోకాలు; సంప్రాప్తంబు+ఐన= లభించిన; కారణంబు= హేతువు; ఏమి= ఏమిటో; ఎఱింగింపవే= తెలుపవా; అనుటయున్= అనగానే.

తాత్పర్యం: కొంతకాలం గడిచాక ప్రహ్లాదుడు దేవేంద్రుడి మీద జాలిపడి మాటాడాడు. ఇంద్రుడు 'మూడులోకాలూ మీ ఏలుబడికిందికి ఎట్లా వచ్చాయో తెలిసికొనాలని ఉన్నదని అన్నాడు' - అనగానే (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. దనుజనాథుఁ డిట్టులను 'రాజ ననుఁ గర్వ । మున ధరామరులకు మనసు గందఁ
జేయ నెపుడు నే నసూయాదు లమ్మహా । త్ములకు ధనము లిత్తు నెలమితోడ. 137

ప్రతిపదార్థం: దనుజనాథుఁడు= రాక్షసరాజు; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; ఏన్= నేను; రాజను+అను= రాజును అనే; గర్వమునన్= అహంకారంతో; ధరామరులకున్= బ్రాహ్మణులకు; మనసు+కందన్= మనస్సు బాధపడేటట్లు; అసూయా+ఆదులు= ఈర్ష్య మున్నగువాటిని; చేయన్= చేయను; ఆ+మహాత్ములకున్= ఆ పుణ్యాత్ములకు; ఎలమితోడన్= సంతోషంగా; ధనములు= సంపదలు; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: ప్రహ్లాదుడు ఇట్లా అన్నాడు. 'నేను పాలకుడిని అని చెప్పుకోను. అహంకారంతో, ఈర్ష్యపడి బ్రాహ్మణుల మనస్సును నొప్పించను. ఎంతో భక్తితో ఆ మహానుభావులకు ధనం, ద్రవ్యం ఇచ్చి ఆదరిస్తుంటాను.

వ. వారలు మెచ్చునట్టి శీలంబునం బ్రవర్తిల్లుదు; దానంజేసి మహోన్నతుండ నైతి. 138

ప్రతిపదార్థం: వారలు= ఆ బ్రాహ్మణులు; మెచ్చునట్టి= పొగడే; శీలంబునన్= మంచి ప్రవర్తనతో; ప్రవర్తిల్లుదున్= నడచుకుంటాను; దానన్+చేసి= అందువలననే; మహా+ఉన్నతుండన్+ఐతిన్= గొప్పస్థితిమంతుడ నయ్యాను.

తాత్పర్యం: నా నడవడిని బ్రాహ్మణులంతా మెచ్చుకున్నారు. కాబట్టి ఇంతటి గొప్పవాడినయ్యాను'.

క. అనవుడు 'నీ శీలము నా । కనఘా! దయ నొసఁగవే! మహాత్ములఁ దగఁ జెం
దినవారు బ్రదుకవలదే?'। యని దీనత దోఁప ననిమిషాధిపుఁ డడిగెన్. 139

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; అనఘా!= పాపం అంటనివాడా!; నీ శీలము= నీ మంచి నడత; నాకున్= నాకు; దయన్= దయతో; ఒసఁగవే= సమర్పించవా; మహాత్ములన్= పుణ్యాత్ములను; తగన్= చక్కగా; చెందినవారు= పొందినవారు; బ్రదుకన్ వలదే?= జీవించవద్దా?; అని; అనిమిష+అధిపుఁడు= దేవేంద్రుడు; దీనతతోఁపన్= జాలిగొలిపేటట్లు; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! నీ ధర్మశీలాన్ని నామీద దయతో ఇప్పించవలసింది. అయినా పుణ్యాత్ములను ఆశ్రయించినవారు బాగా బ్రతకవద్దా?' అని ఎంతో దైన్యంతో ఇంద్రుడు అడిగాడు.

క. విని ప్రహ్లాదుఁడు కృప దన । మనమునఁ గదురంగ విప్రమాత్రుఁడు గాఁ డీ
తని భంగిఁ జూడ నను వెఱ । పును బుట్టఁగ నిచ్చె శీలముం బెం పెసఁగన్. 140

ప్రతిపదార్థం: విని= విని; ప్రహ్లాదుఁడు; కృప= దయ; తన మనంబునన్= తన మనస్సులో; కదురంగన్= కలుగగా; ఈతని భంగిన్= ఈతడి తీరును; చూడన్= చూడగా; విప్రమాత్రుఁడు కాఁడు= బ్రాహ్మణుడు మాత్రమే కాడు; అను వెఱపును పుట్టఁగన్= అనే భయంకూడా కలుగగా; పెంపు+ఎసఁగన్= ఎంతో గౌరవంగా; శీలమున్= మంచి నడతను; ఇచ్చెన్= దానం చేశాడు.

తాత్పర్యం: ప్రహ్లాదుడు ఆతడి తీరు చూచి 'ఇతడు బ్రాహ్మణ మాత్రుడు కాడు సుమా!' అనిపించి భయం పుట్టినా, తన శీలాన్ని అతడికి దానం చేశాడు.

తే. పడసి యింద్రుండు శీలసంపన్నుఁ డగుచుఁ । జనియెఁ; దదనంతరంబ యద్దనుజవరుని
తనువునందుండి తేజిష్ఠ తనువిలాసుఁ । డైన పురుషుండు వెడలిన నతఁడు సూచి. 141

ప్రతిపదార్థం: పడసి= శీలాన్ని పొంది; ఇంద్రుండు= దేవేంద్రుడు; శీలసంపన్నుఁడు+అగుచున్= శీలసంపద కలవాడవుతూ; చనియెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాతనే; ఆ దనుజవరుని= ఆ రాక్షసోత్తముడి; తనువునందున్+ఉండి= శరీరంనుండి; తేజిష్ఠ= ఎంతో తేజస్వంతమైన; తను విలాసుఁడు+ఐన= శరీర లావణ్యం కల; పురుషుండు= పురుషాకారం; వెడలినన్= బయటకు రాగా; అతఁడు= ఆ ప్రహ్లాదుడు; చూచి= చూచినవాడై.

తాత్పర్యం: ప్రహ్లాదుడి శీలాన్నిపొంది ఇంద్రుడు వెళ్ళగానే ప్రహ్లాదుడి శరీరంలో నుండి అందంగా మెరిసిపోతున్న పురుషాకారం బయటపడింది. ఆ పురుషుడిని ప్రహ్లాదుడు చూచి.

వ. 'నీ వెవ్వండ?' వన నప్పురుషుం 'డేను శీలంబు; నీ విచ్చిన యవ్విప్రుపాల వసియింపం జనియెద'నని చెప్పి పోయెం; దదనంతరంబ క్రమంబునం దేజోమయ రూపంబులు నిజదేహంబున నుండి నిర్గమింప నద్దానవేశ్వరుం డడుగుచు. 142

ప్రతిపదార్థం: నీవు+ఎవ్వండవు?= నీవు ఎవరివి?; అనన్= అని అడగగానే; ఆ+పురుషుండు= ఆ పురుషుడు; ఏను= నేను; శీలంబన్= శీలాన్ని; నీవు+ఇచ్చిన= నీవు దానంచేసిన; ఆ విప్రుపాలన్= ఆ బ్రాహ్మణుడి దగ్గర; వసియింపన్= ఉండటానికి; చనియెదన్= వెళ్ళుతాను; అని చెప్పి; పోయెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ పిమ్మట; క్రమంబునన్= వరసపెట్టి; తేజోమయ రూపంబులు= ప్రకాశవంతమైన ఆకారాలు; నిజదేహంబునన్+ఉండి= తన శరీర భాగంనుండి; నిర్గమింపన్= వెళ్ళగా (పోగా); ఆ+దానవ+ఈశ్వరుండు= ఆ రాక్షసరాజు; అడుగుచున్= ప్రశ్నిస్తూ.

తాత్పర్యం: 'నీవు ఎవ్వడ?'వని ప్రహ్లాదుడు అడిగాడు. 'నేను శీలాన్ని నీవు దానం చేసిన బ్రాహ్మణుడి దగ్గరకు వెళ్ళిపోతా'నని చెప్పి వెళ్ళిపోయాడు. అట్లా వరసపెట్టి తేజోమయ రూపాలు ప్రహ్లాదుడి శరీరంనుండి వెళ్ళుతుంటే ప్రహ్లాదుడు వారి పేర్లు అడిగి తెలిసికొన్నాడు.

క. ఉత్తమ ధర్మము సత్యము। వృత్తంబు బలంబు నగుట వినఁబడి బడిఁ ద
చ్చిత్తము విషాద మంద మ। హత్తర మూర్తి యొక వారిజానన వెడలెన్. 143

ప్రతిపదార్థం: ఉత్తమ ధర్మము= మేలైన ధర్మం; సత్యము= నిజం; వృత్తంబు= ప్రవర్తన; బలంబును= బలంకూడా; అగుట= కావటం; వినఁబడి= విన్నవాడై; బడిన్= వెంటనే; తద్+చిత్తము= అతడి మనస్సు; విషాదము= దుఃఖాన్ని; అందన్= పొందగా; మహత్తరమూర్తి= మంచిరూపంగల; ఒక వారిజ+ఆనన= ఒక స్త్రీ; వెడలెన్= బయలుదేరింది.

తాత్పర్యం: ఆ తేజోమయరూపాలు ఉత్తమ ధర్మం, సత్యం, సద్వర్తనం, బలం, కావటం విని ప్రహ్లాదుడు ఎంతో దుఃఖించాడు. అంతలో ఒక మంచి రూపవతి అతడి శరీరంనుండి బయటపడింది.

క. వెడలిన 'నీ వెవ్వత?' వని। యడిగిన నాతనికి నిట్టులను దీనత న
ప్పడఁతి 'సిరి నేను; బలమె। క్కడకు నరుగు నందుఁ బోవఁ గడఁగి వెడలితిన్.' 144

ప్రతిపదార్థం: వెడలినన్= బయటపడగా; నీవు+ఎవ్వతవు= నీవు ఎవ్వరిదానవు; అని+అడిగినన్= అని అడగగా; ఆతనికిన్= ఆతడితో; ఆ పడఁతి= ఆ స్త్రీ; దీనతన్= దైన్యంతో; ఇట్టులు+అనున్= ఈ విధంగా పలికింది; ఏను= నేను; సిరిన్= లక్ష్మిని; బలము= బలం; ఎక్కడకున్+అరుగున్= ఎటు వెళ్ళుతుందో; అందున్+పోవన్= అక్కడకు వెళ్ళటానికి; కడఁగి= పూనుకొని; వెడలితిన్= బయటకు వచ్చాను.

తాత్పర్యం: బయటపడ్డ స్త్రీని చూచి 'నీవు ఎవ్వరిదానవు?' అని అడగగానే ఆ స్త్రీ ఎంతో దైన్యంగా ఈ విధంగా అన్నది: 'నేను సిరిని. బలం ఎక్కడకు పోతుందో నేనూ అక్కడికే పోవా లని బయలుదేరాను'.

చ. అనిన భయంబు నొంది యతఁ డా సతితోఁ బరమేశ్వరీ! మహా
వినయమతిన్ ననుం గొలిచె విప్రవరుం; డతఁ డెవ్వఁ?' డన్న న
వ్వనిత 'సురాధినాథుఁడు భవద్ధన రాజ్యవిభూతి యింతయుం
గొనుటకు నిన్నుఁ జెందె; నిటు గోల్పడి తీవును నీదు శీలమున్. 145

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; భయంబున్+ఒంది= భయపడి; అతఁడు= ఆ ప్రహ్లాదుడు; ఆ సతితోన్= ఆ కాంతతో; పరమేశ్వరీ!= ఓ దేవీ!; మహావినయమతిన్= ఎంతో అణకువతో; ననున్= నన్ను; విప్రవరుండు= బ్రాహ్మణోత్తముడు; కొలిచెన్= సేవించాడు; అతఁడు; ఎవ్వఁడు?= ఎవరు?; అన్నన్= అనగానే; ఆ+వనిత= ఆ స్త్రీ; సుర+అధినాథుఁడు= దేవేంద్రుడు; భవత్= నీ యొక్క; ఘన= గొప్పదైన; రాజ్యవిభూతి= రాజ్యసంపద; ఇంతయున్= ఇదంతా; కొనుటకున్= తీసికొనటానికి; నిన్నున్+చెందెన్= నిన్ను చేరాడు; ఈవును= నీవు కూడా; నీదు శీలమున్= నీ మంచి నడతను; ఇటు= ఈ విధంగా; కోల్పడితివి= పోగొట్టుకొన్నావు.

తాత్పర్యం: అది విని ప్రహ్లాదుడు భయపడ్డాడు. ఓ దేవీ! ఎంతో వినయంగా నన్ను సేవించిన 'ఆతడు ఎవరు?' అన్నాడు. 'అతడు ఇంద్రుడు. నీ రాజ్యసంపదను కాజేయటానికే నీ దగ్గరకు వచ్చాడు. నీవూ నీ శీలాన్ని అట్లాగే పోగొట్టుకొన్నావు అన్నది ఆ స్త్రీ.

వ. వినుము చెప్పెద 'శీలంబున ధర్మంబు వెలయు; ధర్మంబున సత్యంబు దొరకొను; సత్యంబున వృత్తంబు సొప్పడు; వృత్తంబున బలంబు వాటిల్లు; బలంబున నేను గలుగుదుం; గావున సమస్తంబునకు మూలంబు శీలం'బని చెప్పి, సిరి పురందరుపాలికి ధర్మాదులతోడఁ గూడంజనియె' ననుటయు దుర్యోధనుండు 'శీలం బెట్టి?' దనిన ధృతరాష్ట్రుం డతని కిట్లనియె. 146

ప్రతిపదార్థం: చెప్పెదన్= ఒక్కటి చెప్పుతాను; వినుము= విను; శీలంబునన్= మంచి ప్రవర్తనవలననే; ధర్మంబు= న్యాయం; వెలయున్= ప్రకాశిస్తుంది; ధర్మంబునన్= ధర్మంతో; సత్యంబు= సత్యం; దొరకొనున్= సిద్ధిస్తుంది; సత్యంబునన్= సత్యంతో; వృత్తంబు= నడవడి; చొప్పడున్= ప్రవేశిస్తుంది; వృత్తంబునన్= నడతవలన; బలంబు= శక్తి; పాటిల్లున్= కలుగుతుంది; బలంబునన్= ఆ శక్తితో; నేను= సిరి; కలుగుదున్= ఉంటాను; కావునన్= కాబట్టి; సమస్తంబునకున్= ఈ మొత్తానికి; మూలంబు= కేంద్రబిందువు; శీలంబు= మంచి ప్రవర్తన; అని చెప్పి= అని పలికి; సిరి= సంపద; పురందరుపాలికిన్= ఇంద్రుడి వద్దకు; ధర్మాదులతోడన్= ధర్మం మొదలైన వాటితో; కూడన్+చనియెన్= కలవటానికి వెళ్ళింది; అనుటయున్= అనగానే; దుర్యోధనుండు= దుర్యోధనుడు; శీలంబు= నడత; ఎట్టిది= ఎటువంటిది; అనినన్= అనగానే; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; అతనికిన్= అతడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అయితే ఒక విషయం చెప్పుతాను వినుము. శీలంవలననే ధర్మం రాణకెక్కుతుంది. ధర్మంవలన సత్యం, ఆ సత్యంవలన ప్రవర్తన, ఆ ప్రవర్తనవలన బలం, ఆ బలంవలన సంపత్తి వెంటనంటి ఉంటాయి. కనుక అన్నిటికీ మూలం శీలమే' అని చెప్పి సిరి ధర్మం మొదలైన వాటితో ఇంద్రుడి దగ్గరకు వెళ్ళిపోయింది, ఇట్లా ధృతరాష్ట్రుడు చెప్పాక దుర్యోధనుడు 'ఇంతకీ శీలం అంటే ఎట్లాంటిది?' అని అడగగానే ధృతరాష్ట్రుడు ఈ విధంగా అన్నాడు.

క. 'ఒలసి మనోవాక్కాయం । బుల ద్రోహాభావ మఖిల భూతముల యెడం
గలిమి విను శీల; మది మే । లొలయించును దాన నుల్ల మూన్పుము పుత్రా! 147

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; మనోవాక్కాయంబులన్= మనస్సూ, వాక్కూ, శరీరం ఈ మూడు; ఒలసి= కలసి; అఖిలభూతముల+ఎడన్= అన్ని జీవులపట్ల; ద్రోహ+అభావము= కీడు కూడదనే ఆలోచన; కలిమి= కలిగి ఉండటం; శీలము= మంచినడత; వినుము= వినుము; అది= ఆ శీలం; మేలు= మంచిని; ఒలయించున్= కలిగిస్తుంది; దానన్= ఆ శీలంపట్ల; ఉల్లమున్= మనస్సును; ఊన్పుము= నిలిపి ఉంచుము.

తాత్పర్యం: 'మనసూ, మాటా, శరీరం ఈ మూటిచేత అన్ని ప్రాణులకూ ఎట్లాంటి హాని చేయకుండా ఉండటమే శీలం. ఇది చాలా మేలు కలిగిస్తుంది. దీన్ని మనస్సులో పెట్టుకొమ్ము.

క. పరహితము సిగ్గుపాటుం । బొరయక యుండంగ నెదిరి బోధించుటయున్
నరసముదయంబు వొగడెడు । చరితము శీలమున కంగసంపద వత్సా!' 148

ప్రతిపదార్థం: వత్సా!= బిడ్డా!; పరహితము= ఇతరులకు మేలు చేయటం; సిగ్గుపాటున్= తలవంచుకొనటం; పొరయక= పొందక; ఉండంగన్= ఉండటానికి; ఎదిరి= ఎదుటివాళ్ళకు; బోధించుటయున్= ఉపదేశించటమూ; నర సముదయంబు= ప్రజలంతా; పొగడెడు= మెచ్చుకొనతగిన; చరితము= నడవడి; శీలమునకున్= మంచి ప్రవర్తనకు; అంగసంపద= అవయవ సంపత్తి.

తాత్పర్యం: కుమారా! సాటివాడికి తోడుపడటం, సిగ్గుపాటు పనులు చేయకూడదని ఎదుటివాళ్ళకు తెలియచెప్పటం, జనం ఇష్టపడేటట్లు నడచుకోవటం ఇవి శీలానికి అవయవ సంపదలు'.

క. అనియె నని చెప్పి భీష్ముం । డను ధర్మజుతోడ 'నీకు నది నైజమ యే
నును బోధించితి శీలము । మనమ్మునం దిరము సేయు మనుజాధీశా!' 149

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అని చెప్పి= అని పలికి; భీష్ముండు; ధర్మజుతోడన్= ధర్మరాజుతో; అనున్= ఇట్లా అన్నాడు; మనుజ+అధీశా!= రాజా!; నీకున్= నీకు; అది= ఆ శీలం; నైజము+అ= సహజగుణమే; ఏనును= నేను కూడా; శీలము= శీలాన్ని గూర్చి; బోధించితిన్= తెలియ చెప్పాను; మనమ్మునన్= మనసులో; తిరము చేయు(ము)= నిలకడగా ఉంచుకో.

తాత్పర్యం: అని ధృతరాష్ట్ర డన్నాడని భీష్ముడు ధర్మరాజుతో ఇంకా ఇట్లా అన్నాడు. 'నీకు శీలం జన్మతః అబ్బిన గుణమే. అయినా నేను శీలాన్ని గూర్చి చెప్పాను కదా! ఆ మంచి ప్రవర్తనను మనసులో స్థిరం చేసికొమ్ము.

వ. అనిన విని యజ్జనపతి భీష్మునితో 'నాశ యనునది యనంతయైయుండు నది నిరర్థకయైన నయ్యెడు దుఃఖం బధికం బది దుర్యోధనుం బేర్చి కలిసి యుండం జూచితి; నమ్మహాత్ముండు దీఱక మదీయాశఁ గుంఠితంబుఁ జేసి నన్ను దుర్బుద్ధిం గావించె; నది విషాదంబు సేయు; నాశ నడంచుట యరిదిగదే!' యనుటయు 'నాశాదోషనిరాసకం బైన యొక్క యితిహాసంబు గలదు; విను'మని య క్కురుసత్తముం డిట్లనియె. 150

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= విని; ఆ+జనపతి= ఆ ధర్మరాజు; భీష్మునితోన్= భీష్ముడితో; ఆశ= కోరిక; అనునది= అనేది; అనంతఐ= అంతుచిక్కనిదై; ఉండును= ఉంటుంది; అది= ఆ కోరిక; నిరర్థక+ఐనన్= ఫలించకపోతే; అయ్యెడు= కలిగే; దుఃఖంబు= బాధ; అధికంబు= ఎక్కువ; అది= ఆ దుఃఖం; దుర్యోధనున్= దుర్యోధనుడిని; పేర్చి= అతిశయించి; కలిసి+ఉండన్= కలిసి ఉండగా; చూచితిన్= చూచాను; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుండు; తీఱక= ఊరడిల్లక; మదీయ+ఆశన్= నా కోరికను; కుంఠితంబున్+చేసి= వ్యర్థంచేసి; నన్నున్= నన్ను; దుర్బుద్ధిన్= చెడ్డ తలంపు కలవాడినిగా; కావించెన్= చేశాడు; అది= అదే; విషాదంబు= దుఃఖాన్ని; చేయున్= కలిగిస్తుంది; ఆశన్= కోరికను; అడంచుట= తొక్కిపెట్టటం; అరిదిగదే= సాధ్యం కాదు కదా; అనుటయున్= అనగానే; ఆశాదోష= కోరిక అనే దోషాన్ని; నిరాసకంబు+ఐన= నిరసించేది అయిన; ఒక్క= ఒక; ఇతిహాసంబు= వెనకటి కథ; కలదు= ఉన్నది; వినుము= వినుము; అని; ఆ+కురుసత్తముండు= ఆ భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలు విన్న ధర్మరాజు భీష్ముడితో 'తాతా! ఆశకు అంతూ పొంతూ ఉండదు. ఆ ఆశ తీరకపోతే దానికన్న మించిన బాధ కలుగుతుంది. దుర్యోధనుడిని మంచి దారిలో పెట్టాలనీ ఉమ్మడిగా ఉండాలనే చూశాను. ఆ మహానుభావుడు నా ఆశను తీర్చకపోగా నన్ను దుర్బుద్ధిగా చేశాడు. అదే నాకు బాధగా ఉన్నది. ఆశను అణచుకొనటం చాలా కష్టం' అనగానే భీష్ముడు 'ఆశ అనే దోషాన్ని పోగొట్టుకొనేందుకు ఒక కథ ఉన్నది చెప్పుతాను వినుము' అన్నాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు సుమిత్రుఁడను రాజు చరిత్రంబు చెప్పుట (సం. 12-125-8)

సీ. 'హైహయుండు సుమిత్రుఁ డనురాజు వేఁట వో । యిన చోటఁ దనచేత నేటు వడిన
మృగ మమ్ముతోఁ బాఱఁ దగిలె వెన్వెంటన; । యదియును నొకమరి యగ్గ మయ్యు
నొకమరి దవ్వయ్యు నొకమరి దృష్టి క । గోచరం బయ్యును ఖురపదంబు
లరసి పాఱిన నింతనంతఁ దోఁచియు నాశఁ । బెనుచుచుఁ జని మహావనము సొచ్చె;

ఆ. నవ్విభుండు డస్సి యచ్చట నొక ముని । పల్లె కేఁగి మునులు ఫలజలములఁ
దృప్తుఁ జేయ డప్పిదేఱి యున్నెడ బుష । భాఖ్యుఁ డైన తపసి యతనితోడ. 151

ప్రతిపదార్థం: హైహయుండు= హైహయ వంశానికి చెందిన; సుమిత్రుఁడు+అనురాజు= సుమిత్రుడనే రాజు; వేఁట+పోయినచోటన్= వేటకొరకు వెళ్లిన అడవిలో; తనచేతన్= తన వలన; ఏటు+పడిన= బాణం దెబ్బతిన్న; మృగము= జంతువు; అమ్ముతోన్= బాణంతో; పాఱన్= పారిపోవగా; వెన్వెంటన= వెంటవెంటనే; తగిలెన్= అనుసరించాడు; అదియునున్= ఆ జంతువునూ; ఒకమరి= ఒకసారి; అగ్గము+అయ్యున్= అందుబాటులో ఉంటూ; ఒకమరి= ఒకసారి; దవ్వు+అయ్యున్= దూరం అవుతూ; ఒకమరి= మరోసారి; దృష్టికిన్= కంటికి; అగోచరంబు+అయ్యును= కనపడని దవుతూ; ఖురపదంబులు= కాలిగిట్టల జాడలు; అరసి= తెలిసికొంటూ; పాఱినన్= పరుగెత్తగా; ఇంతన్+అంతన్= దగ్గరగానూ, దూరంగాను; తోఁచియున్= కంటపడి; ఆశన్= అపేక్షను; పెనుచుచున్= పెంచుతూ; చని= వెళ్ళి; మహావనము= అడవిలోనికి; చొచ్చెన్= చొరబడింది; ఆ+విభుండు= ఆ రాజు; డస్సి= అలసిపోయి; అచ్చటన్= అక్కడ; ఒక మునిపల్లెకున్= ఒక ముని ఆశ్రమానికి; ఏఁగి= వెళ్ళి; మునులు= ఋషులు; ఫలజలములన్= పండ్లచేతా నీటిచేతా; తృప్తున్ చేయన్= సంతుష్టిపరచగా; డప్పి= దప్పికనుండి; తేఱి+ఉన్న+ఎడన్= తెప్పిరిల్లుకొని ఉన్న సమయంలో; ఋషభ+ఆఖ్యుఁడు+ఐన తపసి= ఆ ఋషభుడనే పేరుగల ముని; అతనితోడన్= ఆ రాజుతో.

తాత్పర్యం: 'హైహయ వంశపురాజు సుమిత్రుడు. అతడు ఒకనాడు వేటాడబోయాడు. అక్కడ ఒక జంతువును బాణంతో కొట్టాడు. అది బాణంతో పాటు పారిపోయింది. రాజు దాని వెంటబడ్డాడు. అది చేతి కందినట్లే అందుతూ చాలా దూరం పోయేది. మరి కొంతసేపటికి కంటి కానేది కాదు. కాలిగిట్టలను బట్టి దానిజాడ తెలిసికొంటూ పరుగెత్తగా చిటికెలో కంటపడి ఆశపెడుతూ కారడవిలో కలసిపోయింది. అట్లు ఆ జంతువువెంటపడి బాగా అలసిపోయాడు రాజు. దగ్గరలో ఉన్న ఒక ముని పల్లెకు చేరుకొన్నాడు. ఆ మునులు పళ్ళూ నీళ్ళూ ఇచ్చారు. దప్పిక తీరి తేరుకొన్నాడు. అప్పుడు ఋషభు డనే ముని ఆ రాజుతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వనమున నెక్కటి నీ 'వే । పనికై చనుదెంచి? తేల పరమవిషాదం
బునఁ బొందెఁ దనిన నాతం । డను నొక మృగ మమ్ముతోడ నరుగఁగ వెనుకన్. 152

ప్రతిపదార్థం: నీవు= నీవు; వనమునన్= అడవిలోనికి; ఏ పనికై= ఏ పనిమీద; ఎక్కటి= ఒక్కడివే; చనుదెంచితి?= వచ్చావు?; పరమవిషాదంబునన్= ఎంతో దుఃఖాన్ని; పొందెదు= పొందుతున్నావు; ఏల?= ఎందుకు?; అనినన్= అనగా; ఆతండు= ఆ

సుమిత్రుడు; అనున్= ఇట్లా అన్నాడు; ఒక మృగము= ఒక జింక; అమ్ములతోడన్= (కొట్టిన) బాణంతో కూడా; అరుగఁగన్= పారిపోగా; వెనుకన్= దాని వెనకాలే.

తాత్పర్యం: 'నీవు ఒంటరిగా అరణ్యంలోకి ఎందుకు వచ్చావు? బాగా దిగులుగా కనిపిస్తున్నావు ఏమిటి? అని చెప్పు' మనగానే రాజు ఇట్లా అన్నాడు. ఒక జంతువు నేను కొట్టిన బాణంతోపాటు పారిపోగా దాని వెనకనే పడి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆసాసల వచ్చితి; నను । గాసింబెట్టి యది యడవిఁ గలసెను; మృగయా
వ్యాసక్తుఁడు వగచుం దన । యేసిన మృగ మనఘ! తప్పియేఁగుటకుఁ గడున్. 153

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; ఆసాసలన్= ఎంతో ఆశపడి; వచ్చితిన్= వచ్చాను; ననున్= నన్ను; గాసిన్+పెట్టి= తిప్పటపెట్టి; అది= ఆ జంతువు; అడవిన్+కలసెన్= అడవిలో కలిసిపోయింది; మృగయా= వేటాడటంలో; వ్యాసక్తుఁడు= మిక్కిలి ఆసక్తికలవాడు; తన+ఏసిన= తాను బాణంతో కొట్టిన; మృగము= జంతువు; తప్పి ఏఁగుటకున్= తప్పించుకొని పోతే; కడున్= మిక్కిలి; వగచున్= విలపిస్తాడు.

తాత్పర్యం: ఎంతో ఆశగా దాని వెంబడిపడి వచ్చాను. అది నన్ను నానా తిప్పలుపెట్టి అడవిలో కలసిపోయింది. వేటాడిన జంతువు చేదాటిపోతే ఆ వేటగాడు ఎంతో నొచ్చుకుంటాడు.

వ. ఆశ యింత దుర్నివార యగునే?' యనిన నమ్మునిపతి యమ్మనుజపతి కిట్లనియె. 154

ప్రతిపదార్థం: ఆశ= ఆస; ఇంత+దుర్నివార+అగునే= ఇంత వారించ శక్యం కానిది అవుతుందా; అనినన్= అనగానే; ఆ+మునిపతి= ఆ మునిరాజు; ఆ+మనుజపతికిన్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆశ ఇంత తప్పించుకొనలేనిదా!' అని రాజు అడగగానే ఆ ఋషభముని ఈ విధంగా అన్నాడు.

క. 'వినుఁ తీర్థయాత్ర సని యే । ననుత్తమం బైన బదరికాశ్రమమున నొ
క్కనిఁ గాంచితిఁ గృశగాత్రునిఁ । దనుఁ డను పేరింటివానిఁ దాపసవర్యున్. 155

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము; ఏను= నేను; తీర్థయాత్ర+చని= పుణ్యతీర్థాలకు వెళ్ళి; అనుత్తమంబు+ఐన= అన్నిట్లోకి శ్రేష్ఠమైనదైన; బదరికా+ఆశ్రమమునన్= బదరికా క్షేత్రంలో; కృశగాత్రునిన్= బక్కచిక్కిన శరీరంగల; తనుఁడు అను పేరింటి వానిన్= తనుడని పేరుగల; తాపస వర్యున్= గొప్పమునిని; ఒక్కనిన్= ఒకడిని; కాంచితిన్= చూచాను.

తాత్పర్యం: 'రాజా! నేను పూర్వం ఒకప్పుడు తీర్థయాత్రలు చేస్తూ, బదరికాశ్రమంలో తను డనే పేరుగల ఒక తాపసిని చూచాను. బక్కపలచని వాటం అతడిది.

క. కని భక్తిం బ్రణమిల్లుడు । ముని యాతిథ్యం బొనర్ప మోదంబున నా
తని పాల ధర్మఫణితులు । వినుచుండఁగ నొక్కధరణివిభుఁ డేతెంచెన్. 156

ప్రతిపదార్థం: కని= చూచి; భక్తిన్= వినయంతో; ప్రణమిల్లుడున్= మ్రొక్కగా; ముని= ఆ తనుమహర్షి; ఆతిథ్యంబున్= అతిథి సత్కారం; ఒనర్పన్= చేయగా; మోదంబునన్= సంతోషంగా; అతనిపాలన్= ఆ ముని వద్ద; ధర్మఫణితులు= ధర్మవాక్కులు; వినుచున్+ఉండఁగన్= వింటూ ఉండగా; ఒక్క ధరణి విభుఁడు= ఒక రాజు; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆ మునిని చూడగానే నమస్కరించాను. అతడు చక్కటి ఆతిథ్యం ఇచ్చాడు. చాలా సంతోషించాను. అతడి దగ్గర ధర్మోపదేశాలు వింటూ ఉన్నాను. అంతలో ఒక రాజు అక్కడకు వచ్చాడు.

వ. విషాదవివర్ణుం డగుచు సపరివారంబును సదారంబునుగాఁ జనుదెంచి యజ్జనపతి మునిపతిం గాంచిన నతం డతిథిపూజా సత్కారంబులు సేసి యాగమనకారణం బడిగిన నన్నరనాథుండు. 157

ప్రతిపదార్థం: విషాద వివర్ణుండు+అగుచున్= దుఃఖంతో వెలవెలబోతూ; సపరివారంబును= సేవాజనంతోనూ, సదారంబునుగాన్= భార్యతోనూ; చనుదెంచి= వచ్చి; ఆ+జనపతి= ఆ రాజు; మునిపతిన్= మునిశ్రేష్ఠుడిని; కాంచినన్= చూడగా; అతండు= ఆ తాపసి; అతిథి పూజా సత్కారంబులు+చేసి= అర్ఘ్యపాద్యాదులతో అతిథిని ఆదరించి; ఆగమన కారణంబున్= రాకకు కారణాన్ని; అడిగినన్= తెలుపుమని అడుగగా; ఆ నరనాథుండు= ఆ రాజు.

తాత్పర్యం: ఆ రాజుముఖం దుఃఖంతో వెలవెలబోతున్నది. వెంట భార్యా, పరిజనం ఉన్నారు. రాగానే మునిని చూచాడు. మునిరాజు ఆ రాజునకు అతిథి మర్యాదలు చేశాడు. ఎందుకు వచ్చారో తెలుపుమన్నాడు. ఆ రాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. తనయుఁ డొకండు; వాఁడు గుణధాముఁడు; క్రీడనవాంఛ సాంద్రకా
ననమున కేఁగి కాడుపడినం దడవం జనుదెంచి యెందుఁ గా
నను మది యాశ బ్రిప్పికొనినన్ వెగడందుచు వచ్చినాఁడ' న
న్న, నతఁడు వల్కకుండె వదనం బొకయించుక వాంచి చింతతోన్. 158

ప్రతిపదార్థం: తనయుఁడు+ఒకండు+అ= (నాకు) కొడుకు ఒక్కడే; వాఁడు= ఆ కొడుకు; గుణధాముఁడు= గుణవంతుడు; క్రీడన వాంఛన్= ఆడుకొనాలనే కోరికతో; సాంద్ర= దట్టమైన; కాననమునకున్= అడవిలోనికి; ఏఁగి= వెళ్ళి; కాడుపడినన్= కనపడకపోతే; తడవన్= వెదకటానికి; చనుదెంచి= వచ్చి; ఎందున్= ఎక్కడా; కానను= చూడలేకపోయాను; మదిన్= మనసును; ఆశ= అపేక్ష; త్రిప్పికొనినన్= క్షోభపెట్టగా; వెగడు+అందుచున్= తల్లడపడుతూ; వచ్చినాఁడను= వచ్చాను; అన్నన్= అనగానే; అతండు= ఆ ముని; వదనంబు= ముఖాన్ని; ఒక+ఇంచుక= కొంచెంగా; వాంచి= వంచుకొని; చింతతోన్= ఆలోచనతో; పల్కక+ఉండెన్= మారుమాట్లాడకుండా ఉన్నాడు.

తాత్పర్యం: 'నాకు ఒక్కడే కొడుకు. వాడు చాలా బుద్ధిమంతుడు. ఆడుకొనటానికి ఒకనాడు అడవిలోకి వెళ్ళాడు. తిరిగి రాలేదు. నేను వెతకటానికి వచ్చాను. ఎక్కడా కనపడలేదు. ఆశ తీరలేదనే కలవరపాటుతో ఆదుర్దాపడుతూ వచ్చాను' అన్నాడు. అది విని ముని తలవంచుకొని మౌనం వహించాడు.

క. చింతించు నతనితో భూ । కాంతుం డిట్లనియె మఱియు 'గాఢతరాశా
క్రాంతత దుర్లభఫల యగు । టింత యసహ్య మగునయ్య యెడఁద మునీంద్రా! 159

ప్రతిపదార్థం: చింతించు= విచారించే; అతనితోన్= ఆ మునితో; భూకాంతుండు= రాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; మునీంద్రా!= ఓ మునీశ్వరా!; మఱియున్= మళ్ళీ; గాఢతర ఆశా= ఎంతో ఎక్కువైన ఆశచేత; ఆక్రాంతతన్= ఆక్రమించబడటం వలన; దుర్లభఫల+అగుటన్= అందని ప్రయోజనం కలది అవటం వలన; ఎడఁద= మనస్సు; ఇంత= ఈపాటి; అసహ్యము+అగునయ్య= ఓర్చుకోలేనిదవుతుందా!

తాత్పర్యం: మౌనంగా ఉన్న మునితో రాజు మళ్ళీ ఈ విధంగా అన్నాడు: 'బాగా ఆశపడ్డప్పుడు ఆ ఆశ అడియాస అయితే మనసు ఇంత తట్టుకోలేని దవుతుందా!'

వ. అనుటయు నత్తాపసోత్తముం డమ్మహీపతి యాననం బాలోకించి. **160**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఆ+తాపస+ఉత్తముండు= ఆ మునీశ్వరుడు; ఆ మహీపతి= ఆ రాజు; ఆననంబున్= ముఖాన్ని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: రాజు చెప్పగానే ముని అతడి వైపు చూస్తూ - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఏ నరుఁడు మానసము ధృతి । నూన నుచితవృత్తి నుండు నుదిలగొనక యెం
దైనను నెయ్యది యేనియు । వానికి దుర్లభములేదు వసుధాధీశా! **161**

ప్రతిపదార్థం: వసుధాధీశా!= ఓ రాజా!; ఏ నరుఁడు= ఏ మానవుడు; ఉదిలగొనక= చలించక; మానసము= మనస్సులో; ధృతిన్= ధైర్యాన్ని; ఊనన్= పొందగా; ఉచితవృత్తిన్= తగిన ప్రవర్తనతో; ఉండున్= ఉంటాడో; వానికిన్= వాడికి; ఎందున్+ఐనన్= ఎక్కడైనా; ఏ+అది+ఏనియున్= ఏ విషయంగా అయినా; దుర్లభము= పొందలేనిది; లేదు= ఉండదు.

తాత్పర్యం: 'ఓ రాజా! ఎవడైనా ఎక్కడైనా ఏ విషయంగానైనా మనసును దిటవు పరచుకొని తగిన రీతిలో నడచుకొంటే అతడికి లభ్యం కానిది ఉండదు.

క. అర్థాదులగు ఫలంబులు । ప్రార్థించినచోట సిగ్గువఱుపక తగ న
య్యర్థి సులభార్థుఁజేయు కృ । తార్థుడు దుర్లభుఁడు దలఁప నఖిల జగములన్. **162**

ప్రతిపదార్థం: అర్థ+ఆదులగు= డబ్బు మొదలుగా గల; ఫలంబులు= దానాలు; ప్రార్థించినచోటన్= అడిగినచోట; తగన్= ఒప్పునట్లుగా; ఆ+అర్థిన్= ఆ యాచకుడిని; సిగ్గు+పఱుపక= అవమానించకుండా; సులభ+అర్థున్+చేయు= సులువుగా కోరినది పొందేలా చేసే; కృతార్థుడు= ధన్యుడు; తలఁపన్= ఆలోచించగా; అఖిల జగములన్= ఏడేడు లోకాలలోనూ; దుర్లభుఁడు= లభించడు.

తాత్పర్యం: డబ్బు ఆశించే యాచకుడిని చిన్నబుచ్చకుండా కోరుకున్నది సులభంగా పొందేటట్లు సహాయపడే ధన్యుడు అన్ని లోకాలలో వెతికినా దొరకడు'.

వ. అని పలికి పూర్వాచార స్మారకత్వంబున నిట్లనియె. **163**

ప్రతిపదార్థం: అని పలికి= అని మాట్లాడి; పూర్వ+ఆచార= మునుపటి నడతను (బ్రతుకు తెరువు); స్మారకత్వంబునన్= గుర్తుకు తెచ్చుకొనటంవలన; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి మునుపటి జీవనసరళి తలపునకు వచ్చి ఇట్లా అన్నాడు.

క. 'వినుము గుణవంతుఁ డొకరుఁడు । ధనవంతుం డైన యొక్క ధరణీనాథుం
దన కూడు సీరకై కాం । చన మడిగి తదీయ బాలిశత్వము పేర్మిన్. **164**

ప్రతిపదార్థం: వినుము= వినుము; ఒకరుఁడు గుణవంతుఁడు= ఒక బుద్ధి మంతుడు; ధనవంతుండు+ఐన= బాగా డబ్బుగల; ఒక్క ధరణీనాథున్= ఒక రాజును; తనకూడు చీరకున్+ఐ= తన తిండికీ బట్టకూ; కాంచనమున్= ధనాన్ని; అడిగి= యాచించి; తదీయ= ఆ ధనవంతుడియొక్క; బాలిశత్వము= మూర్ఖత్వం యొక్క; పేర్మిన్= అతిశయం వలన.

తాత్పర్యం: 'ఒక గుణవంతుడు తన తిండికీ బట్టకూ కావలసిన డబ్బును సాయంచేయుమని ఒక ధనవంతుడైన రాజును అడిగాడు. ఆ రాజు అతి మూర్ఖత్వంవలన. (తరువాతి పద్యంతో అన్వయం).

క. విహతాశుండై లజ్జా । మహితం బగు నాశ దొఱఁగు మదితో సకల
స్పృహయును నెవ్వనియందును । వహింప నని యతులమైన వ్రతముం బూనెన్.' 165

ప్రతిపదార్థం: విహత+ఆశుండు+ఐ= నెరవేరని ఆశ కలవాడై; లజ్జా= సిగ్గుచేత, అవమానకరమైన; మహితంబు+అగు+ఆశ= గొప్పదైన ఆశను; తొఱఁగు= వదలుకొనాలనే; మదితోన్= మనస్సుతో; సకల స్పృహయునున్= సమస్త ఆశనూ; ఎవ్వనియందును= ఎవ్వడిని గూర్చి అయినా; వహింపను= తాల్చను; అని; అతులము+ఐన= సాటిలేని; వ్రతమున్= నియమాన్ని; పూనెన్= వహించాడు.

తాత్పర్యం: ఆశ తీరనివాడై లజ్జాకరమైన పేరాసను వదలుకొనాలనుకొన్నాడు. ఎవరినిగూర్చి ఎట్లాంటి కోరికలు కోర ననే వ్రతం పట్టాడు'.

వ. అని చెప్పియప్పార్థివుం దొల్లి తాను ధన మర్థించి యఫలితప్రయత్నుండై తత్కాలజనిత వైరాగ్యంబునం దపస్వి యగుట తేటపఱిచి వెండియు. 166

ప్రతిపదార్థం: అని చెప్పి= అని మాట్లాడి; తొల్లి= ఒకప్పుడు; తాను= తాను; ఆ పార్థివున్= ఆ రాజును; ధనము= డబ్బు; అర్థించి= అడిగి; అఫలితప్రయత్నుండు+ఐ= సిద్ధించని ప్రయత్నం కలవాడై; తద్+కాలజనిత= ఆ సమయంలో కలిగిన; వైరాగ్యంబునన్= విరక్తివలన; తపస్వి+అగుటన్= ముని కావటాన్ని; తేటపఱిచి= స్పష్టంగా తెలిపి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఒకసారి నేను, ఆ రాజును డబ్బు అడిగినా ఫలితం దక్కలేదు. దానితో విరక్తి కలిగి ముని నయ్యాను.' అంటూ స్పష్టపరిచాడు. మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. ఒడఁబడి యీనివానియెడ నుల్లమునందుఁ గృతఘ్నతం గడుం
జెడుగగు దుర్వినీతునెడఁ జిత్తము కోర్కికిఁ బట్టు సేసి లే
వడి యగు నీచకాంతయెడ వారక యాసలు సాఁగు నిట్లు పె
క్కెడలను బాఱు నాసగమియెల్లఁ దొఱంగుము సౌఖ్య మొందెడున్.' 167

ప్రతిపదార్థం: ఒడఁబడి= సమ్మతించి; ఈనివాని+ఎడన్= దానం చేయనివాడి విషయంలో; ఉల్లమునందున్= మనస్సులోని; కృతఘ్నతన్= చేసిన మేలును మరచిపోవటం వలన; కడున్= ఎంతో; చెడుగు+అగు= దుష్టుడైన; దుర్వినీతు+ఎడన్= అవినీతిపరుడి విషయంలోనూ; చిత్తము= మనస్సును; కోర్కికిన్= ఆశకు; పట్టు+చేసి= తావలం చేసి; లేవడి+అగు= పేదరాలైన; నీచ కాంత+ఎడన్= నీచ స్త్రీ పట్ల; వారక= ఎపుడూ; ఆశలు సాఁగున్= కోర్కెలు కొనసాగుతూనే ఉంటాయి; ఇట్లు= ఈ విధంగా; పెక్కు ఎడలన్= అనేక విషయాలలోనూ; పాఱు= పరుగెత్తే; ఆసగమి ఎల్లన్= అన్ని ఆశలను; తొఱంగుము= వదలుకొమ్ము; సౌఖ్యము= సుఖం; ఒందెడున్= పొందుతావు.

తాత్పర్యం: ఇస్తా నని ఇవ్వని వాడిమీద, కృతఘ్నుడైన దుష్టుడిమీద, మనసును ఆశకు వశం చేసిన పేదరాలైన నీచస్త్రీ పట్ల ఆశలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. ఇంకా ఎన్నో విషయాలలో పరుగులు పెట్టే అన్ని ఆశలను వదలుకొమ్ము. సుఖపడతావు'.

వ. అని యాసపజ్జం బోవమి సుఖకరం బగుటం దెలిపి, యవ్వీరద్యుమ్ననకుం గరుణించి, యతని కొడుకు భూరిద్యుమ్నుం దన తపోమహిమ నాకర్షించి వీడుకొలిపె' నని చెప్పి ఋషభుండు సుమిత్రుని చిత్తంబు మృగయాశాయత్తంబు గాకుండునట్లుగా బోధించెఁ; బాండవాగ్రజా! నీవును నివ్వాక్యంబు లాదరించి సుస్థిరుండవై నిరాశత్వంబున సంతాపంబు దక్కి సుఖివి గ'మ్మని పలికిన భీష్మునితో నబ్భూపతి భవదీయ వచనామృతాస్వాదనంబున మనంబు తృప్తి సన; దింకను ధర్మప్రకారంబులు వివరింపు' మనిన నతం డతని కిట్లనియె. 168

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ఆస పజ్జన్= ఆశ వైపునకు; పోవమి= పోకుండటం (మళ్ళకపోవటం); సుఖకరంబు+అగుటన్= ఎంతో సుఖం కలిగిస్తుందని; తెలిపి= తెలియచెప్పి; ఆ+వీరద్యుమ్ననకున్= ఆ వీరద్యుమ్నుడిని; కరుణించి= కనికరించి; అతనికొడుకు= అతడి కుమారుడైన; భూరిద్యుమ్నున్= భూరిద్యుమ్నుడిని; తన తపోమహిమన్= తన తపశ్శక్తిచే; ఆకర్షించి= రప్పించి; వీడుకొలిపెన్= పంపాడు; అని చెప్పి= అని పలికి; ఋషభుండు= ఋషభ ముని; సుమిత్రుని చిత్తంబు= సుమిత్రుడి మనస్సు; మృగయా+ఆశ= వేటాడాలనే కోరికకు; ఆయత్తంబు+కాక+ఉండునట్లుగాన్= లొంగకుండేటట్లు; బోధించెన్= ఉపదేశించాడు; పాండవ+అగ్రజా!= ఓ ధర్మరాజా!; నీవును= నీవు కూడా; ఈ+వాక్యంబులు= ఈ వాక్కులను; ఆదరించి= మన్నించి; సుస్థిరుండవు+ఐ= దిటవుకలవాడవై; నిరాశత్వంబునన్= అడియాస అయినపుడు; సంతాపంబు దక్కి= బాధను విడిచి; సుఖివి కమ్ము= సుఖం పొందుము; అని పలికినన్= అని చెప్పిన; భీష్మునితోన్= భీష్ముడితో; ఆ+భూపతి= ఆ రాజు; భవదీయ= నీయొక్క; వచన+అమృత= అమృత ప్రాయమైన మాటల; ఆస్వాదనంబునన్= ఆస్వాదించటంచేత; మనంబు= మనస్సు; తృప్తిచనదు= సంతుష్టి పొందదు; ఇంకను= ఇంకా; ధర్మప్రకారంబులు= న్యాయ పద్ధతులు; వివరింపుము= వివరంగా చెప్పవలసినది; అనినన్= అనగానే; భీష్ముండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అట్లా ఆశను చంపుకొంటేనే ఎంతో సుఖం' - అని చెప్పి ఆ వీరద్యుమ్నుడి మీద జాలిపడి తన తపోబలంతో ఆతడి కొడుకు భూరిద్యుమ్నుడిని రప్పించాడు. వీడ్కోలుతో సాగనంపాడు. ఓ ధర్మరాజా! ఇట్లా ఋషభముని సుమిత్రుడి మనస్సు మళ్ళీ వేటమీదకు మళ్ళకుండేటట్లు ఉపదేశించాడు. అట్లాగే నీవు కూడా నా వాక్యాలను చెవినిపెట్టుము. మంచిదిట్టవు కమ్ము. ఆశ నెరవేరకపోయినా బాధపడవద్దు సుఖంగా ఉంటావు' అన్నాడు భీష్ముడు. ధర్మరాజు 'నీ వాగమృతాన్ని చవిచూడటం వలన నా మనస్సుకు ఇంకా తనివి తీరలేదు. ఇంకా కొన్ని ధర్మపద్ధతులను వినాలని ఉన్నది. వివరంగా చెప్పవలసిం'దని అనగానే భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

క. 'తన భూమిఁ బరుల భూమిని । ధనము లుపార్జింపవలయు ధరణీశునకున్
ధనములు మూలము రాజ్యం । బునకును మూలమగు ధర్మమునకు నరేంద్రా! 169

ప్రతిపదార్థం: నరేంద్రా!= ధర్మరాజా!; ధరణీశునకున్= రాజునకు; తన భూమిన్= తన దేశంలోనూ; పరులభూమిని= పరాయి దేశంలోనూ; ధనములు= డబ్బులు; ఉపార్జింపవలయున్= గడించాలి; రాజ్యంబునకును= దొరతనానికి; ధనములు= సంపద; మూలము= ఆధారం; ధర్మమునకున్= పుణ్యానికీ; మూలము+అగున్= కారణం అవుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! రాజు తన దేశంలోనూ, శత్రుదేశంలోనూ డబ్బును సంపాదించుకొనాలి. ఏలుబడికీ, పుణ్యం పురుషార్థాలకూ మూలం ఆ ధనమే.

క. అది బెట్టిదంపు వెరవున । మృదుభూతో పాయమునను మెయికొనద ప్రజం
బొదువ వలయు నాజ్ఞా సం । పద గల సాకతముతోడఁ బతి యవహితుడై. 170

ప్రతిపదార్థం: అది= ఆ ధనం; బెట్టిదంపు వెరపునన్= కఠినమైన ఉపాయంచేతగానీ; మృదుభూత= సౌమ్యమైన; ఉపాయమునను= పద్ధతిచేతగానీ; మెయికొనదు+అ= లభించదు; పతి= రాజు; అవహితుఁడు+ఐ= సావధానుడై; ఆజ్ఞా సంపద కల= ఆదేశానుకూలమైన; సాకతముతోడన్= ఊరడింపులతో; ప్రజన్= ప్రజలను; పొదువ వలయున్= చేరదీయాలి.

తాత్పర్యం: ఆ ధనం కాఠిన్యంవలనగాని, మృదుస్వభావంవలనగాని లభించకపోతే. రాజు ప్రజలను ఆదేశిస్తూ ఊరడిస్తూ చేరదీయాలి. ధనార్జనవిషయంలో ఎంతో మెలకువగా ఉండాలి.

క. వినుఁ బండారము పెరుఁగని । జనపతికి బలంబు మిత్రసంపదయును గ
ల్గునె? బలమిత్రవిహీనున । కొనరునె రాజ్యంబు విభవ మున్నత మగునే? 171

ప్రతిపదార్థం: వినుఁ= వినుము; బండారము= బొక్కసం; పెరుగని= పెంపొందని; జనపతికిన్= రాజునకు; బలంబు= సేన; మిత్ర సంపదయును= మిత్రుల సమృద్ధి; కల్గునె?= సమకూరునా?; బలమిత్ర విహీనునకున్= సైన్యం, స్నేహం లేనివాడికి; రాజ్యంబు= ఏలుబడి; ఒనరునె?= కలుగునా?; విభవము= వైభవం; ఉన్నతము+అగునే?= గొప్పది అవుతుందా?

తాత్పర్యం: ధనాగారం పెంపొందని రాజునకు తగినంత సైన్యం ఉండదు. మిత్రుల అండా ఉండదు. బలం మిత్రసంపత్తి లేని ఏలుబడి ఒప్పుకాదు. ఆ రాజ్యవైభవం అంత ఉన్నతంగానూ ఉండదు.

ఉ. కావున నర్థ సంపదలు గల్మియ యింతకు మూలమైన ను
ర్వీవరుఁ డాత్మశక్తి కతిరిక్తము లైన సముద్యమంబులం
దా వెలయం దలంచి సముదగ్రతఁ గైకొను టొప్పఁ; దవ్విధం
బావిభు తొంటి కల్మికిని హాని యొనర్చు, హరించుఁ బ్రాణముల్. 172

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అర్థ సంపదలు= ధనసంపత్తులు; కల్మియ= కలిగి ఉండటమే; ఇంతకున్= దీని కంతకూ; మూలము+ఐనను= ఆధారం అయినా; ఉర్వీవరుఁడు= రాజు; ఆత్మశక్తికిన్= తన శక్తికి; అతిరిక్తములు+ఐన= మించినవి అయిన; సముద్యమంబులన్= చక్కటి పూనికలతో; తాన్= తాను; వెలయన్ తలంచి= ప్రకాశించాలని భావించి; సముదగ్రతన్= ఎంతో గొప్పగా; కైకొనుట= వశపరచుకొనటం; ఒప్పదు= తగదు; ఆ విధంబు= ఆ పద్ధతి; తొంటి కల్మికిని= మూలసంపదకూ; హాని ఒనర్చున్= చేటు కలిగిస్తుంది. ప్రాణముల్= ప్రాణాలను; హరించున్= తీస్తుంది.

తాత్పర్యం: అర్థ సంపత్తి ఉండటమే దీని అంతకూ మూలం. అయినా, రాజునకు తన శక్తికి మించిన గొప్ప ప్రయత్నాలు తగవు. తాను వెల్గొందాలనీ వాళ్ళను ఎంతో గర్వంగా వశపరచుకొనాలనీ అనుకొనటం మంచి పద్ధతి కాదు. ఈ తరహా తీరు మూలధనానికే ముప్పు తెస్తుంది, ప్రాణాలను తీస్తుంది.

క. తన కొలఁది నుపాయంబులు । వొనరిచి ధనవంతుఁ డగుట భూపగుణము ని
ర్ధనుని నిజ ప్రజయును గై । కొనదు విరోధులును సరకుగొనరు కుమారా! 173

ప్రతిపదార్థం: కుమారా!= బిడ్డా!; తన కొలఁదిన్= తన శక్తికొద్దీ; ఉపాయంబులు= సామదానాది ఉపాయములు; పొనరిచి= కూర్చి (చేసి); ధనవంతుఁడు+అగుట= డబ్బుకూడబెట్టటం; భూపగుణము= రాజధర్మం; నిర్ధనునిన్= డబ్బులేనివాడిని; నిజ ప్రజయును= తన ప్రజ అయినా, కన్న సంతానమైనా; కైకొనదు= లెక్కపెట్టదు; విరోధులును= పగవారూ; సరకు గొనరు= లక్ష్యపెట్టరు.

తాత్పర్యం: ఏ ఉపాయంచేతనైనా తన శాయశక్తులా డబ్బు సంపాదించటం రాజధర్మం. డబ్బు లేనివాడిని తన ప్రజ, (కన్నసంతానమూ) లక్ష్యపెట్టదు. పగవారూ ఆదరించరు.

క. తెరవాటున మ్రుచ్చిమి ను । ద్ధురు లగు క్రూరులకు మూఁక దోరంబగు న
న్వెరవరిదొరల బలంబుగ । ధరణీశుఁడు గూర్చుకొనుట ధైన్యము దెచ్చున్. 174

ప్రతిపదార్థం: తెరవాటునన్= దారిదోపిడీ చేత; మ్రుచ్చిమిన్= దొంగతనంచేత; ఉద్ధురులు+అగు= సమర్థులైన; క్రూరులకున్= దుష్టులకు; మూఁక= సేన; తోరంబు+అగున్= అధికంగా ఉన్నది; ఆ+వెరవరి+దొరలన్= దారి దోపిడీలలో; ఆరితేరిన ఆ నాయకులను; ధరణీశుఁడు= రాజు; బలంబుగన్= సైన్యంగా; కూర్చుకొనుట= సమీకరించుకొనటం; ధైన్యము= దీనదశను; తెచ్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: దారిదోపిడీలు, దొంగతనాలు చేసే దుష్టులకు బలగం ఎక్కువే ఉంటున్నది. దారిదోపిడీ దొరలను రాజు తనసైన్యంలో చేర్చుకుంటే దురవస్థను తెచ్చిపెట్టుకొన్నట్లవుతుంది.

క. అన్యాయంబునఁ బొదలిన । సైన్యముచే సమర జయము సమకూర; దనూ
నన్యాయ పరులు గాంతురు । మాన్యత్వము దస్యులైన మనుజాధీశా! 175

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= రాజా!; అన్యాయంబునన్= ధర్మం పాటించకుండా; పొదలిన= ఉన్న; సైన్యముచేన్= సేనచేత; సమరజయము= పోరులో గెలుపు; సమకూరదు= కలుగదు; దస్యులు+ఐనన్= దొంగలైనా; పగవారైనా; అనూనన్యాయ పరులు= అతి ధర్మపరులు (అయితే); మాన్యత్వము= మన్ననను (గౌరవాన్ని); కాంతురు= పొందుతారు.

తాత్పర్యం: న్యాయాన్ని పట్టించుకొనని సైన్యం యుద్ధంలో గెలుపొందదు. ఓ రాజా! దొంగలైనా, విరోధులైనా, అతిధర్మపరులైతే గౌరవించబడతారు.

వ. ఇ ట్లగుటకు నుదాహరణం బగు నొక్క యితిహాసంబు గల; దాకర్ణింపుము. 176

ప్రతిపదార్థం: ఇట్లు+అగుటకున్= ఇట్లా అవటానికి; ఉదాహరణంబు+అగు= దృష్టాంత మైన; ఒక+ఇతిహాసంబు= ఒక పూర్వగాథ; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇట్లు జరగటానికి ఉదాహరణగా ఒక పూర్వగాథ ఉన్నది వినుము.

భీష్ముండు ధర్మరాజునకుఁ గాపవ్యోపాఖ్యానము సెప్పుట (సం. 12-91-1)

సీ. అవనీశ! పారియాత్రాచలంబున నుండు । నొక బోయ ధర్మసంయుక్తబుద్ధి
వింట నేర్పరి మృగవితతిప్రకారజ్ఞుఁ । డారణ్య దేశ సంచారశాలి
తల్లికిఁ దండ్రికిఁ దద్దయు భక్తుఁడై । ఫలమూలమధుమాంసములును మేలి
కూడుగూరలు దొరకొల్పి వారికిఁ దృప్తి । యావహించుచు శయనాసనాదు

తే. లగు పదార్థముల్ హృద్యంబులుగ నొనర్చు; । వలయు నాహారములు మునివరుల కిచ్చుఁ;
బగఱఁ దోఁచినఁ బరిమార్చు భండనమున । నొకఁడ వేవురనైన మహోగ్రగతుల. 177

ప్రతిపదార్థం: అవనీ+ఈశ!= ఓ రాజా!; పారియాత్ర+అచలంబునన్= పారియాత్రం అనే కొండమీద; ఉండున్= ఉండేటటువంటి; ధర్మసంయుక్త= న్యాయంతో కూడిన; బుద్ధి= ఆలోచన కలవాడు; వింటన్= విలువిద్యలో; నేర్పరి= ఆరితేరినవాడు; మృగతతి=

ప్రాణకోటియొక్క; ప్రకారజ్ఞుఁడు= పద్ధతి తెలిసినవాడు; ఆరణ్యదేశ= అటవీ ప్రాంతాలలో; సంచారశాలి= తిరిగే స్వభావంగల; ఒక బోయ= ఒక వేటకాడు; ఉండున్= ఉండేవాడు; (అతడు); తల్లికిన్= తల్లికీ, తండ్రికిన్= తండ్రికీ; తద్దయున్= ఎంతో; భక్తుఁడు+ఐ= సేవకుడై; ఫల= పండ్లు; మూల= కందగడ్డలూ; మధు= తేనె; మాంసములును= మాంసంముక్కలూ; మేలికూడు= మంచి అన్నం; కూరలున్= కూరలు; దొరకొల్పి= సమకూర్చి పెట్టి; వారికిన్= వాళ్ళకు; తృప్తి ఆవహించుచున్= సంతృప్తి కలిగింపచేస్తూ; శయన= పడుకొనటానికి; పక్కలూ; ఆసన= కూర్చొనటానికి పీటలూ; ఆదులు= మొదలైన; పదార్థముల్= వస్తువులను; హృద్యంబులుగన్= మనస్సుకు ఇంపు కలిగించేవిగా; ఒనర్చున్= ఏర్పరుస్తాడు; వలయు= కావాల్సిన; ఆహారములు= భోజనాలు; మునివరులకున్= మునిముఖ్యులకు; ఇచ్చున్= సమర్పిస్తాడు; తోఁచినన్= తడితే; పగఱన్= శత్రువులను; భండనమునన్= యుద్ధంలో; మహా+ఉగ్రగతులన్= ఎంతో భయంకరమైన పోకడలతో; ఒకఁడు+అ= ఒక్కడే; వేవురన్+ఐనన్= వేలమంది నైనా; పరిమార్చున్= చంపుతాడు, రూపుమాపుతాడు.

తాత్పర్యం: రాజా! పారియాత్ర పర్వతం మీద ఒక బోయవాడు ఉండేవాడు. అతడు న్యాయపరుడు. విలువిద్యలో మంచి నేర్పరి. జంతువుల తీరు తెన్నులు బాగా ఎరిగినవాడు. అడవులలో తిరగటానికి అలవాటు పడ్డవాడు. తల్లి దండ్రులంటే అతడికి ఎంతో భక్తి. వాళ్ళు తృప్తిపడేటట్లు వాళ్ళకు కావాల్సిన పండ్లూ, కందమూలాలూ, తేనెలు, మాంసం, అన్నం, కూరలు అన్నీ సమకూర్చి పెట్టేవాడు. వాళ్ళు ఇష్టపడేటట్లు పడుకొనటానికి పక్కలూ, కూర్చోవటానికి పీటలూ అన్నీ ఏర్పాటు చేసేవాడు. అక్కడ ఉండే ముని స్వాములందరికీ కావలసిన ఆహార పదార్థాలు అందించేవాడు. పగవా డనిపిస్తే చాలు యుద్ధంలో రుద్రుడై ఒక్కడే వేయిమందిని చంపేవాడు.

క. కాపవ్యుం డను పేరను । దీపించిన యతని భూరితేజముఁ గని ర
క్షాపరుఁడు వలయు మనకని । యా పొలమునఁ గల్గు దస్యులందఱుఁ దమలోన్. **178**

ప్రతిపదార్థం: కాపవ్యుండు+అనుపేరను= కాపవ్యుడనే పేరుతో; దీపించిన= పేరుపొందిన (ప్రకాశిస్తున్న); అతని= ఆ బోయవాడి; భూరి తేజము= గొప్ప పరాక్రమాన్ని; కని= చూచి; ఆ పొలమునన్= ఆ పారియాత్ర పర్వత ప్రాంతాన; కల్గు= ఉండే; దస్యులు+అందఱున్= దొంగలందరూ; మనకున్= మనకందరికీ; రక్షాపరుఁడు= రక్షించేవాడు; వలయున్= కావాలి; అని= అనుకొని; తమలోన్= తమలో తాము.

తాత్పర్యం: బోయవాడి పేరు కాపవ్యుడు. ఆతడి పరాక్రమాన్ని చూచి ఆ కొండమీద ఉండే దొంగలంతా కూడి మనకందరికీ ఒక రక్షకుడు కావాలనుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అతనిఁ దమకు నెల్ల నాధిపత్యము సేయు । వానిఁగా వరించువారు గాఁగ
నిశ్చయించి కూడి నెమ్మిమైఁ జనుదెంచి । కాంచి యిట్టు లనిరి గారవమున. **179**

ప్రతిపదార్థం: అతనిన్= ఆ కాపవ్యుడిని; తమకున్+ఎల్లన్= తమకందరికీ; ఆధిపత్యము= పెత్తనం; చేయువానిన్+కాన్= చేసే వాడిగా; వరించువారుకాఁగన్= కోరుకొనువారై; నిశ్చయించి= నిర్ణయించుకొని; కూడి= ఏకమై; నెమ్మిమైన్= సంతోషంతో; చనుదెంచి= వచ్చి; కాంచి= ఆ కాపవ్యుడిని చూచి; గారవమునన్= గౌరవంతో; ఇట్టులు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: తమకు అందరికీ నాయకుడిగా ఉండటానికి కాపవ్యుడిని కోరాలనే నిర్ణయానికి వచ్చి దొంగలంతా కలిసి సంతోషంగా అతడి దగ్గరకు వెళ్ళారు. ఎంతో మర్యాదగా ఈ విధంగా అన్నారు.

క. బలవిక్రమసంపన్నుఁడ వ । లఘుచరిత్రుఁడవు మమ్ము నందఱఁ బ్రభువై
తలకొని రక్షింపుము; నీ । వలచిన పనిగొనుము పుత్రవర్గముఁ బోలెన్.' 180

ప్రతిపదార్థం: బలవిక్రమ సంపన్నుఁడవు= శక్తి పరాక్రమాల సంపత్తి కలవాడవు; అలఘు చరిత్రుఁడవు= గొప్పనడవడి కలవాడవు అయిన నీవు; ప్రభువు+ఐ= నాయకుడివై; మమ్మున్+అందఱన్= మమ్మల్నందరినీ; పుత్రవర్గమున్+పోలెన్= కన్న కొడుకులవలె; తలకొని= ఒప్పుకొని; రక్షింపుము= కాపాడుము; నీ వలచినపని= నీకు కావాల్సిన పని; కొనుము= చేయించుకొమ్ము.

తాత్పర్యం: నీవు బలపరాక్రమాలు రెండూ నిండుగా ఉన్నవాడివి, దొడ్డనడవడి కలవాడవు. మా అందరికీ నాయకుడివై మమ్మల్ని కన్నకొడుకులవలె కాపాడుకొమ్ము. మాచేత నీకు కావాల్సిన పనులు చేయించుకొమ్ము'.

వ. అనిన విని యతఁడు వారల కిట్లనియె. 181

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; అతఁడు= ఆ కాపవ్యుడు; వారలకున్= దొంగలతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అది విన్న కాపవ్యుడు దొంగలతో ఈ విధంగా చెప్పాడు.

సీ. శిశుజన మునిజన స్త్రీజనంబులఁ । జంపఁగా; దెట్టివాఁడైనఁ గడఁగి మీఁదఁ
గవియక పాడుచుట కల్మషం; బంగనఁ । జెఱపట్టఁ దగదు; విశేష మొకఁడు
వినుఁ; డెల్ల సత్త్వంబులను బెంటిఁ జంపుట । పాపంబు; గోవుల బ్రాహ్మణులను
సంకటపెట్టంగఁ జనదు; తదీయ హి । తము గోరి పూని యుద్ధంబు సేఁత

తే. యధిక పుణ్యంబు సస్యక్రియావిఘాత । మాచరించుట గడుదోష; మవని ప్రజకు
బాధ గావించి కుడిచి శవంబు దొలుచు । ప్రువ్వుగతి నది పొలియంగఁ బొలియు నతఁడు. 182

ప్రతిపదార్థం: శిశుజన= పసిబిడ్డలను; మునిజన= మునులను; స్త్రీ జనంబులన్= స్త్రీలనూ; చంపన్+కాదు= చంపటం తగదు; ఎట్టివాఁడు+ఐనన్= ఎటువంటివాడైనా; కడఁగి= పూనుకొని; మీఁదన్= పైనబడి; కవియక= కలబడకుండా; పాడుచుట= చంపటం; కల్మషంబు= పాపం; అంగనన్= స్త్రీని; చెఱపట్టన్= బలాత్కరించటం; తగదు= కూడదు; ఒకఁడు విశేషము= ప్రత్యేకమైన మరొక విషయాన్ని; వినుఁడు= వినండి; ఎల్లసత్త్వంబులను= అన్ని జంతువులలోను; పెంటిన్= ఆడజంతువును; చంపుట= చంపటం; పాపంబు= పాపం; గోవులన్= ఆవులను; బ్రాహ్మణులను; సంకటపెట్టంగన్= కష్టపెట్టటం; చనదు= ఒప్పదు; తదీయ= ఆ గో బ్రాహ్మణులయొక్క; హితము కోరి= మేలు కోరుకొని; పూని= తలపెట్టి; యుద్ధంబు+చేఁత= యుద్ధం చేయటం; అధిక పుణ్యంబు= ఎక్కువ పుణ్యం; సస్యక్రియా విఘాతమున్= పంట పైరులకు చెరుపు; ఆచరించుట= చేయటం; కడుదోషము= ఎంతో పాపం; అవని ప్రజకున్= నేలమీది జనాన్ని; బాధ కావించి= హింసపెట్టి; కుడిచి= తిని; శవంబు= పీనుగను; తొలుచు= డొల్లచేసే (తినే); ప్రువ్వుగతిన్= పురుగువలె; అది పొలియంగన్= ఆ సంపాదన నశించగానే; అతఁడు= అతడు (ప్రజలను బాధించి పొట్టపోసికొనేవాడు); పొలియున్= నశిస్తాడు.

తాత్పర్యం: 'పసివాళ్ళనూ, మునులనూ, ఆడవాళ్ళనూ చంపకూడదు. మనపై కలబడనివాడి జోలికి పోవటం మహాపాపం. ఆడవాళ్ళను చెరపట్టటం కూడనిపని. ఇంకొక విశేషం కూడా వినండి. క్రూర సాధు జంతువులన్నిట్లో ఆడ జంతువు ప్రాణం తీయకూడదు. ఆవులను, బ్రాహ్మణులను కష్టపెట్టకూడదు. వారి మేలు కోరి యుద్ధం చేస్తే ఎంతో పుణ్యం. పంటపొలాన్ని నాశనం చేయటం ఎంతో పాపం. ప్రజలను బాధించి తన పొట్టనింపుకొనేవాడు శవాన్ని డొలిచే పురుగు శవం నశించగానే తానూ నాశనమైనట్లే ఆ లబ్ధి నశించగానే తానూ నశిస్తాడు.

వ. అని చెప్పి 'మీర లీధర్మాధర్మంబు లెఱింగి నాపంచిన తెఱంగున బ్రదికెదరేని మీకు ముఖ్యుండ నయి సఖ్యంబు సౌఖ్యంబుఁ బెనుప మీ యోగక్షేమంబు లరసెద' ననియె. దానికి వారలందఱు ప్రీతింబొంది, యాతని వశంబున వర్తించి వర్ధిల్లి; రిట్లు కాపవ్యుండు సాధులకు హితం బగునట్లుగా దస్యులం బాపంబులకుం బాపి తానును వారును నిహపర సిద్ధులం బ్రశస్తి వహించె. 183

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; మీరలు= మీరు; ఈ ధర్మ+అధర్మంబులు= ఈ న్యాయాన్యాయాలు; ఎఱింగి= తెలిసికొని; నాపంచిన తెఱంగునన్= నేను చెప్పినట్టు విధంగా; బ్రదికెదరు+ఏని= జీవించేటట్లయితేనే; మీకున్= మీకు; ముఖ్యుండను+అయి= ప్రధాన నాయకుడనై; సఖ్యంబు= స్నేహం; సౌఖ్యంబున్= సుఖమూ; పెనుపన్= పెంపొందేటట్లు; మీ యోగక్షేమంబులు= మీ క్షేమలాభాలు (మంచి చెడ్డలు); అరసెదన్= విచారిస్తాను; అనియెన్= అన్నాడు; దానికిన్= ఈ విషయానికి; వారలు+అందఱున్= వారంతా; ప్రీతిన్+పొంది= సంతోషపడి; ఆతని వశంబునన్= కాపవ్యుడికి విధేయులై; వర్తించి= ఉండి; వర్ధిల్లిరి= వృద్ధిలోకి వచ్చారు; ఇట్లు= ఈ విధంగా; కాపవ్యుండు= బోయవాడు; సాధులకున్= మంచివాళ్ళకు; హితంబు= మేలు; అగునట్లుగాన్= కలిగేట్లు; దస్యులన్= దొంగలను; పాపంబులకున్= పాపపు పనులనుండి; పాపి= తొలగించి; తానును= తానూ (కాపవ్యుడూ); వారును= ఆ దొంగలూ; ఇహ= ఈ లోక సుఖాలు; పర= పరలోక సుఖాలు; సిద్ధులన్= నెరవేరటంవలన; ప్రశస్తిన్= ప్రఖ్యాతిని; వహించెన్= పొందారు.

తాత్పర్యం: మీ రంతా న్యాయాన్యాయాలు తెలిసికొని నేను చెప్పినట్లు బ్రతకండి. మీకు నాయకుడినై మీలో స్నేహ సౌఖ్యాలు పెంచుతాను; మీ మంచి చెడ్డలు కనుక్కొంటుంటాను' అని చెప్పాడు. దీనికి ఆ దొంగలు ఎంతో సంతోషించారు. ఆతడికి లోబడి నడచుకుంటూ బాగా అభివృద్ధిలోకి వచ్చారు. ఇట్లా కాపవ్యుడు మంచివాళ్ళకు మేలు జరిగేటట్లు దొంగలను పాపపు పనులనుండి మళ్ళించాడు. తానూ వాళ్ళూ ఇహపరలోక సౌఖ్యాలు సాధించుకొని ఎంతో పేరు పొందారు.

క. కాపవ్యోపాఖ్యానము । పాపహరము దీని శ్రవణపఠనము లటవీ
వ్యాపార క్షేమంకర । రూపములగు దస్యుమృగవిరోధము లడఁచున్. 184

ప్రతిపదార్థం: కాపవ్య+ఉపాఖ్యానము= కాపవ్యుడి కథ; పాపహరము= పాపాలను పోగొట్టుతుంది; దీని శ్రవణ పఠనములు= ఈ కథ వినటం చదవటం అనేవి; అటవీవ్యాపార= అడవులలో చేసే కార్యాలలో; క్షేమంకర రూపములు= శుభాన్ని చేకూర్చేవి; అగున్= అవుతాయి; దస్యు= దొంగల; మృగ= క్రూరజంతువుల వలన కలిగే; విరోధములు= అడ్డంకులను; అడఁచున్= ఆపుతాయి.

తాత్పర్యం: ఈ కాపవ్యుడి కథ పాపాలను తుడిచివేస్తుంది. దీనిని విన్నా చదివినా అడవులలో చేసే కార్యాలన్నీ శుభప్రదాలవుతాయి. దొంగలవలనా క్రూరమృగాలవలనా కలిగే ఆటంకాలన్నీ తొలగిపోతాయి.

భీష్ముఁడు ధర్మజునకు దీర్ఘదర్శి మొదలగు మత్స్యముల తెఱం గెఱిఁగించుట (సం. 12-135-1)

వ. అని చెప్పి భీష్ముండు వెండియు నిట్లను 'దీర్ఘదర్శియుఁ బ్రాప్తకాలజ్ఞుండును దీర్ఘసూత్రుండును ననుమత్స్యంబులు మూఁడు జలచర బహుళంబగు సొక్కయేటి మడువునఁ దమలోనం బొందుగలిగి యుండునవి; వేసవిసొచ్చిన దీర్ఘదర్శి దక్కటి రెంటిని గూడం బిలిచి. 185

ప్రతిపదార్థం: అని; భీష్ముండు; చెప్పి= తెలియచెప్పి; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; దీర్ఘదర్శియున్= దీర్ఘదర్శీ (రాబోయేదాన్ని ముందుగా చూసేవాడు); ప్రాప్తకాలజ్ఞుండును= ప్రాప్తకాలజ్ఞుడు (కాలం ప్రాప్తించినపుడు ఉపాయం

తెలిసికొనేవాడు); దీర్ఘసూత్రుండును= దీర్ఘ సూత్రుడు (మెల్లగా పనులు చేసేవాడు); అను మత్స్యంబులు= అనే చేపలు; మూఁడు= మూడును; జలచర= అనేక నీటి ప్రాణులతో; బహుళంబు+అగు= ఎక్కువగా ఉండేటి; ఒక్క+ఏటి మడుపునన్= ఒక్కనది మడుగులో; తమలోనన్= తమలోతాము; పొందు కల్గి= పొత్తు పెట్టుకొని; ఉండున్+అవి= ఉండేటటువంటివి; వేసవి+చొచ్చినన్= ఎండాకాలం రాగానే; దీర్ఘదర్శి= దీర్ఘదర్శి అనే చేప; తక్కటి రెంటిని= మిగతా రెండు చేపలను; కూడన్ పిలిచి= కలుద్దాం రమ్మని.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు మళ్ళీ ఈ విధంగా చెప్పాడు: 'నీటి జంతువులు ఎక్కువగా ఉండే ఒక ఏటి మడుగులో మూడు చేపలు ఉండేవి. అవి దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు అనేవి. ఈ మూడు పరస్పరం ఎంతో స్నేహంగా మెలిగేవి. ఎండాకాలం రాగానే దీర్ఘదర్శి మిగతా రెండు చేపలను కూడగట్టుకొని పిలిచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'మడు వింకఁగఁ బాఱెడు; నీ । రెడ త్రెవ్విన నొండు సోటి కేఁగఁగ రా దె
ప్పుడు నింకని నీళ్ళులు గల । మడువునకుం బోవవలదె మన కిట్టి యెడన్?' 186

ప్రతిపదార్థం: మడువు= చెరువు; ఇంకఁగన్+పాఱెడు= ఇగిరిపోబోతున్న; నీరు= నీళ్ళు; ఎడత్రెవ్వినన్= ఆగిపోతే; ఒండు చోటికిన్= మరొక చోటుకి; ఏఁగఁగరాదు= వెళ్ళలేం; మనకున్= మనకు; ఇట్టి ఎడన్= బాగా ఇంకిపోని ఈ సమయంలో; ఎపుడున్= ఎప్పటికీ; ఇంకని= అడుగంటని; నీళ్ళులు గల= నీళ్ళు ఉండే; మడువునకున్= చెరువులోకి; పోవవలదె= వెళ్ళవద్దా.

తాత్పర్యం: 'మనం ఉండే చెరువు ఎండిపోతూ ఉన్నది. నీళ్ళు ఇంకిపోతే మరోచోటికి వెళ్ళలేం. ఇట్లాంటి సమయంలోనే ఎపుడూ నీళ్ళు నిండుగా ప్రవహించే చెరువులోకి చేరుకొనటం మంచిది'.

తే. అనినఁ బ్రాప్తకాలజ్ఞుఁ డిట్లనియె 'నేది । ప్రాప్తమయ్యె నక్కార్యంబు భంగి నెఱిఁగి
యప్పటికిఁ దగునట్లు సేయంగవలయు । మానితోపాయవృత్తి నేమఱుట లేక. 187

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ప్రాప్తకాలజ్ఞుఁడు= ప్రాప్తకాలజ్ఞుడనే చేప; అనియెన్= ఇట్లా అన్నాడు; ఏది ప్రాప్తము+అయ్యెన్= ఏది (ఎపుడు) సంప్రాప్తిస్తుందో; ఆ+కార్యంబు+భంగిన్= ఆ పనితీరును; ఎఱిఁగి= తెలిసికొని; అప్పటికిన్= ఆ సమయానికి; తగునట్టు= తగిన విధంగా; ఏమఱుట లేక= ఉపేక్షించక; మానిత= సముచితం అయిన; ఉపాయవృత్తిన్= యుక్తిగల నడవడితో; చేయంగ వలయున్= సాధించుకొనాలి.

తాత్పర్యం: అనగానే ప్రాప్తకాలజ్ఞుడు ఇట్లా అన్నాడు. 'ఏది సంభవిస్తుందో దాని తీరును తెలిసికొనాలి. ఏ మాత్రం ఏమరకుండా అప్పటికప్పుడు దానికి తగినట్లుగా ఎంతో ఉపాయంగా ఆ పనిని సాధించుకొనాలి'.

వ. అనిన నయ్యిరుదెఱంగుల పలుకులు విని దీర్ఘసూత్రుం డిట్లనియె. 188

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; ఆ+ఇరు+తెఱంగుల పలుకులు= ఆ చేపల రెండు తీరుల మాటలను; విని= ఆలకించి; దీర్ఘ సూత్రుండు= దీర్ఘసూత్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దీర్ఘదర్శి ప్రాప్తకాలజ్ఞుల మాటలు ఆలకించి దీర్ఘసూత్రుడు వారితో ఈ విధంగా అన్నాడు.

క. 'జడనిధి చందంబున ని । మ్ముడు వొప్పఁగ నిప్పు డేమి మాఁడెనె? యిమ్మై
నడిచిపడ రిత్త నెవ్వగ । లుడుగుఁడు; మఱి చూచికొంద మొయ్యన తఱితోన్.' 189

ప్రతిపదార్థం: ఈ+మడువు= ఈ చెరువు; జడనిధి చందంబునన్= సముద్రంవలె; ఒప్పఁగన్= ఒప్పుతుండగా; ఇపుడు= ఇపుడు; ఈ+మెయిన్= ఈ రీతిగా; అడిచిపడన్= తొందరపడటానికి; మాఁడెనె+ఏమి?= ఎండిపోయెనా ఏమి?; రిత్త= పనికిమాలిన; నెఱ+వగలు= అతి విచారణలు; ఉడుగుఁడు= మానండి; ఒయ్యనన్= మెల్లగా; తఱితోన్= సమయాన్ని బట్టి; మఱి= ఆ తరువాత; చూచికొందము= చూచుకుందాం.

తాత్పర్యం: 'ఇట్లా తొందరపడటానికి ఈ చెరువు ఎండిపోయిందా ఏమి? సముద్రంవలె ఉన్నది. పనికిమాలిన అతి ఆలోచనలను కట్టిపెట్టండి. అవసరాన్నిబట్టి అపుడు చూచుకొందాం'.

క. అనుటయు 'నిది కర్జము గా'। దని పల్కుచు దీర్ఘదర్శి అంబుస్రోతో
జనితాభయ మగు పథమునఁ। జని జొచ్చెం బెద్ద మడువు సమ్మదలీలన్. 190

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఇది= ఈ చెరువులోనే ఉండటం అనేది; కర్జము+కాదు= చేయాల్సిన పనికాదు; అని పల్కుచున్= అని చెప్పుతూ; దీర్ఘదర్శి= దీర్ఘదర్శి అనే చేప; అంబుస్రోతఃన= నీటి ప్రవాహంవలన; జనిత= పుట్టిన; అభయము+అగు= భయంలేని; పథమునన్= త్రోవలో; చని= వెళ్ళి; సమ్మదలీలన్= సంతోషంతో; పెద్దమడువున్= పెద్ద చెరువును; చొచ్చెన్= ప్రవేశించింది.

తాత్పర్యం: ఇంకా ఈ చెరువులోనే ఉండటం మంచిది కాదనుకొన్నది దీర్ఘదర్శి. నీటి జాలు వెంబడి నిర్భయంగా వెళ్ళి పెద్ద చెరువును సంతోషంగా చేరుకొన్నది.

వ. తక్కిన రెండును నంద నిలిచె; నిట్లు నిలిచిన యమ్మత్స్యద్వయంబునకు భయంబు జనియింపం గతిపయది వసంబులకు. 191

ప్రతిపదార్థం: తక్కిన రెండునున్= మిగతా రెండు చేపలు (దీర్ఘసూత్రుడు, ప్రాప్తకాలజ్ఞుడు); అంద= ముందటి చెరువులోనే; నిలిచెన్= ఉండిపోయాయి; ఇట్లు= ఈ విధంగా; నిలిచిన= ఉన్న; ఆ+మత్స్యద్వయంబునకున్= ఆ రెండు చేపలకు; కతిపయదివసంబులకున్= కొన్ని రోజులు గడువగా; భయంబు= భయం; జనియింపన్= కలుగగా (పుట్టగా)

తాత్పర్యం: దీర్ఘదర్శి కాక మిగతా రెండు చేపలూ ముందటి చెరువులోనే ఉన్నాయి. కొంతకాలానికి వాటికి భయం కలుగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. పాఱెడు నీ రెడ త్రెవ్వఁగఁ। దాఱ బెడిద మైన యెండ దనుకఁగ నివురం
బాఱె మడు; వంత వేడుక। కాఱులు జాలరులు సొచ్చి క్రందుకొనంగన్. 192

ప్రతిపదార్థం: పాఱెడు నీరు= పారే నీళ్ళు; ఎడత్రెవ్వఁగన్= ఆగిపోగా; తాఱన్= అడగగా; బెడిదము+ఐన= వేడెక్కిన; ఎండ= ఎండ; తనుకఁగన్= తాకగా; మడువు= చెరువు; ఇవురన్+పాఱెన్= ఇంకిపోసాగింది; అంతన్= అంతలోనే; వేడుకకాఱులు= కుతూహలం గల; జాలరులు= చేపలు పట్టేవారు; చొచ్చి= దిగి; క్రందు కొనంగన్= కమ్ముకొనగా.

తాత్పర్యం: చెరువులోకి పారే నీళ్ళు ఆగిపోయి తగ్గుముఖం పట్టాయి. మండుటెండలు ముదిరాయి. చెరువులో నీళ్ళు ఇంకిపోసాగాయి. అంతలో చేపలు పట్టే జాలరులు చెరువుచుట్టూ ఉత్సాహంగా కమ్ముకొనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వెరవున నూఁతల నెత్తెలఁ । గరముల మత్స్యములఁ బట్టి కడు సంతసముం
బొరయుచుఁ ద్రాళ్ళం గ్రువ్వఁగఁ । గర మూహించి మదిఁ బ్రాప్తకాలజ్ఞుండున్. 193

ప్రతిపదార్థం: వెరవునన్= ఉపాయంతో; ఊఁతలన్= చేపలు పట్టే బుట్టలతో; ఎత్తెలన్= చేపలు పట్టే అడ్డువలలతో; కరములన్= విడి చేతులతోనూ; మత్స్యములన్= చేపలను; పట్టి= పట్టుకొని; కడుసంతసమున్= మిక్కిలి సంతోషాన్ని; పొరయుచున్= పొందుతూ; త్రాళ్ళన్= తాళ్ళను; క్రువ్వఁగన్= కూర్చుతుండగా; ప్రాప్తకాలజ్ఞుండున్= ప్రాప్తకాలజ్ఞుడు; మదిన్= మనసులో; కరము+ఊహించి= ఎంతగానో ఆలోచించి.

తాత్పర్యం: చేపలు పట్టే బుట్టలతో, అడ్డు వలలతో, విడి చేతులతో ఎంతో నేర్పుగా జాలరులు చేపలను పట్టుకొన్నారు. ఎంతో సంతోషిస్తూ తాళ్ళను కూర్చుతున్నారు. అంతలో ప్రాప్తకాలజ్ఞుడు మనసులో చాలాసేపు ఆలోచించుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఇందొక త్రాడు గఱచి యే । నొందంగా గ్రుచ్చినట్ల యుండెద; వీ లీ
క్రందుకొనుట మానంగ న మందత । నది యెడల విడిచి మడువు దఱిసెదన్.' 194

ప్రతిపదార్థం: ఇందున్= ఈ చేపలు కూర్చిన త్రాళ్ళల్లో; ఒకత్రాడు= ఒక తాడును; కఱచి= పళ్ళతో నొక్కిపట్టి; ఏన్= నేను; ఒందంగాన్= చక్కగా గ్రుచ్చిన; అట్ల= గుచ్చినట్లుగానే; ఉండెదన్= ఉంటాను. వీరు= ఈ జాలర్లు; ఈ క్రందుకొనుట= చుట్టూ కమ్ముకొని చేపలు పట్టటం; మానంగన్= ఆపగానే; అమందతన్= ఆలస్యంలేకుండా, వెంటనే; అది= ఆ తాడును; ఎడలవిడిచి= విడిచిపెట్టి, వదలి; మడువు= చెరువును; దఱిసెదన్= చేరుకొంటాను.

తాత్పర్యం: 'చేపలు కూర్చిన తాళ్ళలో చక్కగా గుచ్చిన చేపవలె ఒక తాడును కరచి పట్టుకొంటాను. జాలరులు చేపలు పట్టటం ఆపగానే చటుక్కున ఆ తాడును వదలిపెట్టి మడుగును చేరుకొంటాను.'

క. అని యొక గుదిమీల నడుమ । నెనయంగాఁ దూఱి కఱచి యిరుదొడలఁ ద్రా
డొనరంగ బట్టుకొని గ్రు । చ్చిన చందము దోఁప మూర్ఛఁ జెందిన భంగిన్. 195

ప్రతిపదార్థం: అని= అనుకొని; ఒక గుది= చేపలు గుచ్చిన గుత్తిలోని; మీలనడుమన్= చేపల మధ్యలో; ఎనయంగాన్= పొందికగా; తూఱి= చొరబడి; కఱచి= పళ్ళతో నొక్కిపట్టి; ఇరుదొడలన్= రెండు దవుడలతో; త్రాడు= తాడును; ఒనరంగన్= ఒప్పునట్లుగా; పట్టుకొని= కరచుకొని; గ్రుచ్చిన చందము తోఁపన్= గుచ్చినట్టే అగపడేటట్లు; మూర్ఛన్+చెందిన భంగిన్= సొమ్మసిల్లిన దానివలె.

తాత్పర్యం: అని అనుకొని చేపల గుత్తిలోకి దూరి, రెండు దవుడలతో తాడును కరచి పట్టుకొన్నది. గుచ్చిన చేపలవలె సొమ్మసిల్లిన దానివలె. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ఉన్నంత వేఁట దీఱి యగ్గుబిగల యతండు. 196

ప్రతిపదార్థం: ఉన్న+అంతన్= ఉండినంతలో; వేఁట తీఱి= చేపలు పట్టటం చాలించి; ఆ+గుది+కల+అతండు= ప్రాప్తకాలజ్ఞుడు ఉండు గుత్తి పట్టుకొన్నవాడు.

తాత్పర్యం: ఉండగా ఆ చేపల గుత్తి పట్టుకున్న జాలరివాడు చేపలు పట్టటం ఆపి. (తరువాతి పద్యంతో అన్వయం)

క. తెలినీట రొంపివోవం । దొలుచు నెడం ద్రాడు విడిచి దురితంబునకుం
దొలఁగి పొరదప్పి యందొక । జలచర మున్న యెడకేఁగె సంభ్రాంతగతిన్. 197

ప్రతిపదార్థం: తెలినీటన్= తేటనీళ్ళలో; రొంపి+పోవన్= బురద పోయేటట్లు; తొలుచు+ఎడన్= కడిగేటప్పుడు; త్రాడు= తాడును; విడిచి= వదలి; దురితంబునకున్= ఆపదనుంచి; తొలఁగి= తప్పుకొని; పొర+తప్పి= అపాయాన్ని దాటి; సంభ్రాంతగతిన్= తొట్రుపడుతూ; అందున్= అక్కడ; ఒక జలచరము= మరొక చేప; ఉన్న+ఎడన్= ఉన్నచోటికి; ఏఁగెన్= పోయింది.

తాత్పర్యం: మంచి నీళ్ళల్లో బురద పోయేటట్లు జాడించేటప్పుడు తాడును వదలిపెట్టి ఆపదనుండి తప్పించుకొన్నది. ప్రమాదాన్ని దాటి తత్తరపడుతూ అక్కడే మరోచేప ఉన్నచోటికి పోయింది.

క. ముట్టఁబడి దీర్ఘసూత్రుం డిట్ట । ట్టరుగఁగ నుపాయ మేది యొకనిచేఁ
బట్టువడెఁ దనదు డెందము । పట్టు వదలి చకిత వికల భావేంద్రియుఁడై. 198

ప్రతిపదార్థం: ముట్టన్+పడి= చుట్టుముట్టబడి; దీర్ఘసూత్రుండు= దీర్ఘసూత్రుడు; ఇట్టు+అట్టు= ఇటువైపు, అటువైపు; అరుగఁగన్= వెళ్ళటానికి; ఉపాయము+ఏది= ఉపాయం లేనిదై; చకిత= భయపడి; వికల= చెదరిన; భావ= మనోవికారం; ఇంద్రియుఁడు+ఐ= చర్మం మొదలైన జ్ఞానేంద్రియాలు కలవాడై; తనదు డెందము= తన గుండె; పట్టు వదలి= దిటవు సడలి; ఒకనిచేన్= ఒక జాలరిచేత; పట్టుపడెన్= చిక్కింది.

తాత్పర్యం: జాలర్లు చుట్టుముట్టగా దీర్ఘసూత్రుడు ఎటూ పోయే వీలులేక ఉపాయం తట్టక ఒక జాలరి చేతిలో చిక్కింది. అపుడు భయంతో శరీరం స్వాధీనంలో లేదు. గుండె పట్టు తప్పింది.

క. విను దొదవ్వులఁ గార్యము । గనికొని వలయుపని మున్న కావింపఁగ నే
రనిజడుఁడు దీర్ఘసూత్రుం । డను నమ్మత్స్యంబు భంగి నాపద నొందున్. 199

ప్రతిపదార్థం: విను= ధర్మరాజా! వినవలసింది; దొదవ్వులన్= దూరంలో ఉండగానే (చాలా కాలం ఉండగానే); కార్యము= పనిని; కనికొనివలయున్= తెలిసికొనాలి; పని= పనిని; మున్న= ముందుగానే; కావింపఁగనేరని= చేసికొనలేని; జడుండు= మూర్ఖుడు; దీర్ఘసూత్రుండు+అను= దీర్ఘసూత్రుడనే; ఆ+మత్స్యము+భంగిన్= ఆ చేపవలె; ఆపదన్= విపత్తును; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: దూరదృష్టితో పనిని ముందుగానే తెలిసికొనాలి. అట్లా ముందుగా పనిని చక్కదిద్దుకొనలేని మూర్ఖుడు దీర్ఘసూత్రు డనే చేపవలె ఇబ్బందులు పడతాడు.

తే. అప్పటికిఁ దోఁచినట్టులు దప్పకుండ । ననువుతో ధృతి గల్గి కార్యంబు నడపు
నతఁడు ప్రాప్తకాలజ్ఞాఖ్యు నట్లపోలెఁ । బరమ సంశయ మయ్యెడు బ్రదుకు గాంచు. 200

ప్రతిపదార్థం: అప్పటికిన్= ఆ సమయానికి; తోఁచినట్టులు= తట్టిన విధంగా; తప్పక ఉండన్= తప్పనిసరిగా; అనువుతోన్= ఉపాయంతో; ధృతి+కల్గి= ధైర్యంతో ఉండి; కార్యంబు= పనిని; నడపున్+అతఁడు= జరిపేవాడు; ప్రాప్తకాలజ్ఞ+ఆఖ్య+అట్లపోలెన్= ప్రాప్తకాలజ్ఞుడివలె; పరమ సంశయము+అయ్యెడు= ఎక్కువ సందేహానికి చోటిచ్చే; బ్రదుకు= జీవనాన్ని; కాంచున్= పొందుతాడు.

తాత్పర్యం: అప్పటికి తట్టినట్లు ఉపాయంతో ధైర్యంగా పనిచేసికొనేవాడు ప్రాప్తకాలజ్ఞుడివలె ఎపుడూ సందేహంతో కూడిన బతుకు బతుకుతాడు.

క. ధుర్యత ననాగతము లగు । కార్యము లూహించి పని తగం జేయు నయా
చార్యుఁడు సౌఖ్యముఁ బొరయును । నార్యస్థితి దీర్ఘదర్శి యను మీను క్రియన్.' 201

ప్రతిపదార్థం: ధుర్యతన్= సమర్థంగా; న+ఆగతములు+అగు+కార్యములు= రాబోయే పనులను; ఊహించి= భావించి; పని= పనిని; తగన్+చేయు= తగినట్లుగా చేసే; నయాచార్యుఁడు= నీతివేత్త; ఆర్యస్థితిన్= మన్నించదగ్గట్లు; దీర్ఘదర్శి+అను= దీర్ఘదర్శి అనే; మీనుక్రియన్= చేపవలె; సౌఖ్యమున్= సుఖాన్ని; పొరయున్= పొందుతాడు.

తాత్పర్యం: రాబోయే పనిని ముందుగా ఊహించుకొని సమర్థంగా ఆ పనిని యుక్తిగా చేసికొనే నీతిమంతుడు దీర్ఘదర్శి అనే చేపవలె సుఖంగా ఉంటాడు'.

పలితరోమశు లను మూషిక మార్జాలంబుల సంవాద ప్రకారము (సం. 12-136-18)

వ. అనిన విని ధర్మనందనుండు 'పెక్కండ్రు పగఱకు నగ్గమై హీనబలుం డైన నరపతి యెప్పరుసున నాపద నిస్తరించువాఁ?' డని యడిగిన నప్పుడమిటేనితో భీష్ముండు 'మార్జాల మూషిక సంవాదం బను నితిహాసంబు గల; దది నీదగు ప్రశ్నంబునకు సదుత్తరం బగు వినుఁ' మని యిట్లనియె. 202

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= విని; ధర్మనందనుండు= ధర్మరాజు; పెక్కండ్రు= ఎక్కువమంది; పగఱకున్= పగవాళ్ళకు; అగ్గము+ఐ= లోబడి; హీనబలుండు+ఐన= బలం తగ్గిన; నరపతి= రాజు; ఏ+పరుసునన్= ఏవిధంగా; ఆపదన్= విపత్తును; నిస్తరించువాఁడు?= దాట గలవాడు?; అని; అడిగినన్= అడగగా; ఆ పుడమిటేనితోన్= ఆ ధర్మరాజుతో; భీష్ముండు= భీష్ముడు; మార్జాల= పిల్లీ; మూషిక= ఎలుక; సంవాదంబు+అను= సంభాషణ మనే; ఇతిహాసంబు= మునుపటి కథ; కలదు= ఉన్నది; అది= ఆ కథ; నీదగు= నీకు సంబంధించిన; ప్రశ్నంబునకున్= అడిగినదానికి; సత్+ఉత్తరంబు+అగున్= మంచి సమాధానం అవుతుంది; వినుము= వినవలసింది; అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగానే ధర్మరాజు 'ఎంతో మంది శత్రువులచే చిక్కి బలం కోల్పోయిన రాజు ఆ ఆపదనుండి ఎట్లా గట్టెక్కుతాడు?' అని ప్రశ్నించాడు. భీష్ముడు పిల్లి ఎలుకల సంవాదం అనే పూర్వపు కథ వింటే నీ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. ఆలకించు'మంటూ ఈ విధంగా అన్నాడు.

సీ. 'అడవిలో నొక మట్టియడుగున లాఁగలఁ । బలితుండు నా నొక్క యెలుక యుండు;
నమ్మహీజముమీఁద ననిశంబు రోమశుం । డను పిల్లి వసియించు; నా సమీప
మున సంజకడ నిత్యమును మృగంబుల । కురులొడ్డి వేకువ వచ్చి యొక్క మాలఁ
డగపడ్డ వానిఁ గొం చరుగు; నొకప్పు డా । హారంబునకుఁ బిల్లి యచటఁ దిరుగఁ

తే. బోయి యురిఁ బడియుండఁగఁ బొంచిచూచి । భయము దక్కి యచ్చోటన పలితుఁ డెరకుఁ
గ్రుమ్మరఁగఁ జంద్రకుం డను గూబపులుఁగు । హలికుఁ డను ముంగిసయు నింత నంతఁ దోఁచె. 203

ప్రతిపదార్థం: అడవిలోన్= అటవిలో; ఒక మట్టి= ఒక మర్రిచెట్టు; అడుగునన్= క్రిందిభాగంలో; లాఁగలన్= కలుగులలో; పలితుండునాన్= పలితుడనే పేరుగల; ఒక్క ఎలుక= ఒక ఎలుక; ఉండున్= ఉండేది; ఆ+మహీజముమీఁదన్= ఆ చెట్టు మీద; అనిశంబున్= ఎపుడూ; రోమశుండు అను పిల్లి= రోమశుడనే పేరుగల పిల్లి; వసియించున్= ఉండేది; ఆ సమీపమునన్= ఆ దగ్గరలోనే; సంజకడన్= సాయంవేళలో; నిత్యమును= ప్రతిదినం; మృగంబులకున్= జంతువులకు; ఉరులు= ఉచ్చులు; ఒడ్డి= పన్ని; వేకువ వచ్చి= తెల్లవారుజాముననే వచ్చి; ఒక్కమాలఁడు= ఒక మాలవాడు; అగపడ్డవానిన్= చిక్కిన వాటిని; కొంచున్+అరుగున్=

తీసికొని పోతుండేవాడు; ఒకప్పుడు= ఒకనాడు; ఆహారంబునకున్= తిండికొరకు; పిల్లి; అచటన్= అక్కడకు; తిరుగన్‌పోయి= తిరగటానికి వెళ్ళి; ఉరిన్+పడి= ఉచ్చులో చిక్కుకొని; ఉండఁగన్= ఉండగా; పలితుఁడు= పలితుడనే ఎలుక; పొంచి చూచి= దాగి ఉండి చూచి; భయము దక్కి= భయం వదలి; ఆ+చోటన్+అ= ఆ చెట్టు దగ్గరలోనే; ఎరకున్= తిండికొరకు; క్రుమ్మరఁగన్= తిరుగుతుండగా; చంద్రకుండు+అను= చంద్రకుడనే; గూబపులుఁగు= గుడ్లగూబా; హలికుఁడు+అను= హలికుడనే; ముంగిసయున్= ముంగిసా; ఇంతన్+అంతన్= ఈలోపల; తోఁచెన్= అగపడ్డాయి.

తాత్పర్యం: ఒక అడవిలో మర్రిచెట్టు క్రింద ఉన్న కలుగులో పలితు డనే ఎలుక ఉండేది. ఆ చెట్టుపైన రోమశుడనే పిల్లి ఉంటూ ఉండేది. ఈ చెట్టుకు దగ్గరలోనే ఒక మాలవాడు అనునిత్యం సాయంకాలం జంతువులకు ఉచ్చులు పన్నేవాడు. ఆ ఉచ్చులో చిక్కుకొన్న వాటిని తెల్లవారగానే వచ్చి తీసికొని వెళ్ళుతుండేవాడు. ఒకనాడు పిల్లి తిండికొరకు వచ్చి ఆ ఉరుల్లో చిక్కుకొన్నది. దీన్ని పొంచి చూచిన ఎలుక నిర్భయంగా తన ఆహారం కొరకు తిరుగాడసాగింది. అంతలో చంద్రకు డనే గుడ్లగూబా, హలికు డనే ముంగిసా ఎలుక కంటబడ్డాయి.

వ. ఎరలకై వచ్చి యిట్లు దోఁచిన నయ్యెలుక యా రెంటి బారికిం దప్పిపోవరామి దలంచి బెగ్గలించియు ధైర్యంబు కలిమిం గార్యం బూహించి యప్పిల్లిం గొండొక సేరం జనుచు దానితో నిట్లనియె. 204

ప్రతిపదార్థం: ఎరలకున్+ఐ= మేతలకై; వచ్చి; ఇట్లు తోఁచినన్= ఇట్లా అగపడగా; ఆ+ఎలుక= ఆ పలితుడు; ఆ రెంటి బారికిన్= ఆ గుడ్లగూబా ముంగిసల ఆపదనుండి; తప్పిపోవరామి= తప్పించుకొని వెళ్ళటానికి వీలు కాదని; తలంచి= తలపోసి; బెగ్గలించియున్= భయపడీ; ధైర్యంబు= దిటవుతనం; కలిమిన్= కలిగి ఉండటంవలన; కార్యంబు= చేయాల్సిన పనిని; ఊహించి= ఆలోచించుకొని; ఆ+పిల్లిన్= ఆ పిల్లిని; కొండొక= కొంచెంగా; చేరన్+చనుచున్= దగ్గరకు వెళ్ళుతూ; దానితోన్= ఆ పిల్లితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: తిండికొరకు వచ్చిన ఎలుకకు గుడ్లగూబా, ముంగిసా కంటబడ్డాయి. వాటి బారినుండి తప్పించుకొని పోయే వీలులేదని గ్రహించుకొన్నది. భయపడింది. ధైర్యం కూడదీసికొన్నది. ఏం చేయాలో ఊహించుకొన్నది. మెల్లగా పిల్లిని సమీపిస్తూ ఈ విధంగా అన్నది.

క. 'ఉరి ద్రెవ్వఁ గొఱికి యిప్పుడ । వెరవారఁగ నీకు నేను విడుగర సేయం
దొరకొనుట నీదు భాగ్యం । బరిత్వము దొఱంగి మైత్రి యలవఱుపు మదిన్. 205

ప్రతిపదార్థం: ఉరి= ఉచ్చును; త్రెవ్వన్= తెగి పోయేటట్లు; కొఱికి= పళ్ళతో కరిచి; ఇప్పుడ= ఇపుడే; వెరపు= నేర్పు; ఆరఁగన్= ఒప్పేటట్లు; నీకున్= నీకు (పిల్లికి); నేను= నేను (ఎలుక); విడుగర= విడుదల; చేయన్+దొరకొనుట= చేయటానికి పూనుకొనటం; నీదు భాగ్యంబు= నీ అదృష్టం; మదిన్= మనసులో; అరిత్వము= పగను; తొఱంగి= మాని; మైత్రిన్= మిత్రభావాన్ని; అలవఱుపు(ము)= నేర్చుకొమ్ము.

తాత్పర్యం: 'ఓ రోమశా! నేను నా నేర్పుతో నీ ఉరులను తెగకొరికి నిన్ను విముక్తుడిని చేస్తాను. నేను ఇట్లా చేయటానికి పూనుకొనటం నీ అదృష్టంగా భావించుము. మనస్సులోపలి పగను మానుకొమ్ము. స్నేహభావాన్ని అలవరుచుకొమ్ము.

క. ముంగికి గూబకు నగపడి । యంగంబులు వడఁకుచున్నయవి నా కిమ్మై
సంగతి గలిగిన నీ యు । త్సంగంబున నుండి భయము దక్కుదు నేనున్.' 206

ప్రతిపదార్థం: ముంగికిన్= ముంగిసకూ; గూబకున్= గుడ్లగూబకు; అగపడి= కంటపడి; ఈ+మైన్= ఈ రీతిగా; అంగంబులు= అవయవాలు; వడఁకుచున్+ఉన్నవి= వణకిపోతున్నాయి; నాకున్= నాకు (నీతో); సంగతి= స్నేహం; కల్గినన్= కలిగితే; నీ+ఉత్సంగంబునన్+ఉండి= నీ ఒడిలో ఉండి; నేనున్= నేను; భయము= భయాన్ని; దక్కుదున్= పోగొట్టుకొంటాను.

తాత్పర్యం: ముంగిసా గుడ్లగూబా కంటబడ్డ దగ్గరనుండి నా శరీరం అంతా వణకుతున్నది. నాతో నీవు జట్టుకట్టితే నీ ఒళ్ళో ఉండి భయం పోగొట్టుకొంటాను'.

చ. అనవుడుఁ బిల్లి యిట్టులను 'నార్తశరణ్యుఁడ వయ్యెఁ; బిట్టి నీ
కనఘ! హితంబు సేయ వలదయ్య? జగత్పతిసాక్షిగాఁగ ని
ప్పని దగఁ బూనితిన్; వెఱపుఁ బాచి ననుం గదియంగ రమ్ము; వ
చ్చిన నకులంబు గూబయును జేరఁగ నేరవు నాకు నోడుటన్.' 207

ప్రతిపదార్థం: అనవుడున్= ఎలుక చెప్పగానే; పిల్లి; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నది; ఆర్తశరణ్యుఁడవు= ఆపదలో ఉన్నవాళ్ళను రక్షించేవాడవు; అయ్యెదు= అవుతావు; అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; ఇట్టి= ఇట్లాంటి; నీకున్= నీకు; హితంబు= మేలు; చేయవలదు+అయ్య!= చేయవద్దా!; జగత్పతి సాక్షిగాఁగన్= భగవంతుడి సాక్షిగా; ఈ+పనిన్= నిన్ను కాపాడే పనిని; తగన్= ఒప్పేటట్లు; పూనితిన్= చేయపూనుకొన్నాను; వెఱపున్+పాచి= భయాన్ని వదలి; ననున్= నన్ను; కదియంగన్= నా దరి చేరటానికి; రమ్ము= రావలసింది; వచ్చినన్= అట్లా వస్తే; నకులంబు= ముంగిసా; గూబయును= గుడ్లగూబా; నాకున్= నాకు; ఓడుటన్= భయపడటం వలన; చేరఁగన్+నేరవు= దరిదాపులకు రాలేవు.

తాత్పర్యం: ఎలుకతో పిల్లి ఇట్లా అన్నది. 'నీవు ఆపదలో ఉన్న వాళ్లను ఆదుకునే స్వభావం కలవాడివి. ఓ పుణ్యాత్ముడా! నీకు ఉపకారం చేయాల్సిందే. దేవుడి సాక్షిగా నిన్ను కాపాడాలనుకొన్నాను. భయపడకుండా నా దగ్గరకు రమ్ము. గుడ్లగూబా ముంగిసా నన్ను చూస్తే భయపడతాయి. కాబట్టి దరిదాపులకు రావు. దూరంగా పారిపోతాయి'.

ఆ. అనిన నట్ల యగుట నాత్మ నెఱింగియ । కాదె సంధియైన నాదు బ్రదుకు
నీదు విడుగరయును నిజమగు టూహించి । నిన్నుఁ జెందె బుద్ధి నిశ్చయంబు. 208

ప్రతిపదార్థం: అనినన్= అట్లా అనగానే; అట్లు+అగుటన్= అట్లా అవుతుందని; ఆత్మన్+ఎఱింగియ+కాదె?= మనసులో గ్రహించుకొని కాదా?; సంధి+ఐనన్= పొత్తు కుదిరితే; నా+బ్రదుకున్= నా జీవనం; నీ+విడుగరయును= నీ విడుదలా; నిజము+అగుటన్= నిజం అవుతుందని; ఊహించి= ఆలోచించి; బుద్ధి నిశ్చయంబు= మనస్సులోని నిర్ణయం; నిన్నున్+చెందెన్= నిన్ను పొందింది.

తాత్పర్యం: అట్లా అనగానే ఎలుక, 'అట్లా అవుతుందని గ్రహించుకొనే కదా! నీతో పొత్తు కుదుర్చుకొనాలనుకొన్నాను. దీనివలన నేను బ్రతకటం, నీవు విడుదల అవటం రెండూ తీరతాయని నిర్ణయించుకొనే నిన్ను చేరాను'.

క. అని పలికి పిల్లి పాదిగిట । ననయము నిశ్శంకవృత్తి నయ్యెలుక వసిం
చినఁ జూచి యయ్యూలూకం । బును నకులము నచటు వాసి పోయె నిజేచ్ఛన్. 209

ప్రతిపదార్థం: అని పలికి= అని ఎలుక మాట్లాడి; పిల్లి= పిల్లియొక్క; పాదిగిటన్= పాదిగిలిలో (ప్రక్కకు సందిటికి నడిమి భాగంలో); అనయమున్= ఎపుడూ; నిశ్శంకవృత్తిన్= జంకూ గొంకూ లేని నడవడితో; ఆ+ఎలుక= ఆ పలితుడు; వసించినన్= ఉండగా; చూచి; ఆ+ఉలూకంబును= ఆ గుడ్లగూబా; నకులమున్= ముంగిసా; అచటు= ఆ చోటును; పాసి= వదలి; నిజ+ఇచ్ఛన్= తమ ఇష్టానుసారంగా; పోయెన్= పోయాయి.

తాత్పర్యం: అని పలికి ఎలుక ఏమాత్రం సందేహించకుండా పిల్లి పొదిగిట్లో ఉండటం చూచిన ఆ గుడ్లగూబా, ముంగిసా అక్కడినుండి తమ తోవన వెళ్ళిపోయాయి.

క. నకులము నులూకమును బో । కకు సంతస మందియుండి గ్రక్కున నమ్మూ
షిక మయ్యురి చేరులు గొఱు । కక యలసత నల్లనల్లఁ గఱచుచు నుండెన్. 210

ప్రతిపదార్థం: నకులమున్= ముంగిసా (హలికుడు); ఉలూకమును= గుడ్లగూబా (చంద్రకుడు); పోకకున్= వెళ్ళిపోవటానికి; సంతసమున్= సంతోషాన్ని; అంది+ఉండి= పొంది ఉండి; గ్రక్కునన్= చప్పున; ఆ+మూషికము= ఆ ఎలుక; ఆ+ఉరిచేరులు= ఆ ఉచ్చు తాళ్ళను; కొఱుకక= కొరికివేయక; అలసతన్= ఆలస్యంగా; అల్లన్+అల్లన్= మెల్ల మెల్లగా; కఱచుచున్+ఉండెన్= కొరుకుతూ ఉన్నది.

తాత్పర్యం: ముంగిసా, గుడ్లగూబా వెళ్ళిపోవటం చూచి ఎలుక ఎంతో సంతోషించింది. అనుకున్నట్లుగా పిల్లి ఉచ్చులను గబగబ కొరకకుండా మెల్లమెల్లగా కొరుకుతూ జాప్యం చేస్తూ ఉన్నది.

వ. అమ్మెయిఁ బలితుండు గొనకొని యయ్యురిం గొఱుకకుండుట యెఱింగి రోమశుం డిట్లనియె. 211

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ తీరుగా; పలితుండు= ఎలుక; గొనకొని= మొదలుపెట్టి; ఆ+ఉరిన్= ఆ ఉచ్చుతాళ్ళను; కొఱుకక+ఉండుట= కొరక్కుండా ఉండటం; ఎఱింగి= గ్రహించి; రోమశుండు= పిల్లి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ విధంగా ఎలుక ఉరితాళ్ళను తొందరగా కొరకకపోవటాన్ని పిల్లి పసికట్టి ఎలుకతో ఈ విధంగా అన్నది.

క. 'తగునే యిట్లు? కృతార్థుఁడ । వగు నీ కురి గొఱుక కిట్టు లాలస్యము సేఁ
త గటా! కృతఘ్నతకు నెల । వగు టొప్పునె కొఱుకు కడఁక నద్రోహుఁడవై.' 212

ప్రతిపదార్థం: కృతార్థుడవు+అగు= నెరవేరిన ప్రయోజనం కలవాడవగు; నీకున్= నీకు; ఇట్లు+తగునే?= ఇట్లా ఒప్పుతుందా?; ఉరి కొఱుకక= ఉచ్చులను తెగకొరకకుండా; ఇట్టులు= ఈ తీరున; ఆలస్యము+చేఁత= జాగుచేయటం; కటా!= అయ్యో!; కృతఘ్నతకున్= చేసిన మేలు మరవటమనేదానికి; నెలవు+అగుట= ఉనికి పట్టవటం; ఒప్పునె?= తగుతుందా?; అద్రోహుఁడవై= కీడు చేయాలనే తలంపు లేనివాడవై; కడఁకన్= పట్టుదలతో; కొఱుకు(ము)= కొరకవలసింది.

తాత్పర్యం: నావలన ప్రయోజనం పొందిన నీకు ఇది తగుతుందా? ఉరులను తెగ కొరకకుండా జాప్యం చేయటం ఒప్పుతుందా? చేసిన మేలు మరచిపోవటం న్యాయమా? కీడు తలపెట్టక పట్టుదలపట్టి కొరుకుము'.

చ. అనుటయు నెల్క యిట్టు లను 'నాశ్రితరక్షణశీలు నిన్నుఁ గీ
డునఁ బొరయింతునే? యిది కడుం జెడుగుందన; మేను భీతి నూ
నిన మదితోడ నమ్మమిన నెట్టన యియ్యురిఁద్రెంప నియ్యెడన్
మనమున నెగ్గుగాఁ గొనకు మాలనిఁ గాంచిన యప్డ త్రెంచెదన్. 213

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఎల్క= ఎలుక; ఇట్టులు+అనున్= ఈ విధంగా పలికింది; ఆశ్రిత రక్షణ శీలున్= అండ చేరినవాళ్ళను కాపాడే స్వభావం గల; నిన్నున్= నిన్ను; కీడునన్= ఆపదను; పొరయింతునే?= కలిగిస్తానా?; ఇది= కీడు తలపెట్టటం;

కడున్= ఎంతో; చెడుగుందనము= చెడ్డది; ఏను= నేను; భీతిన్+ఊనిన= భయం పొందిన; మదితోడన్= బుద్ధితో, మనస్సుతో; నమ్మమిన= నమ్మలేకపోవటం వలననే; నెట్టన= వెంటనే; ఈ ఉరిన్= ఈ ఉచ్చును; త్రెంపన్= నుగ్గు చేయను; ఈ+ఎడన్= ఈ సమయంలో; మనమునన్= మనస్సులో; ఎగ్గుగాన్= తప్పుగా ద్రోహంగా (కీడుగా); కొనకు(ము)= తీసికొనకుము; మాలనిన్= మాలవాడిని; కాంచిన+అప్డ= చూచినప్పుడే; త్రెంచెదన్= తెంపుతాను.

తాత్పర్యం: పిల్లి మాటలకు ఎలుక ఇట్లా జవాబిచ్చింది 'ఆశ్రయించినవాళ్ళను కాదనకుండా కాపాడే స్వభావం నీది. అట్లాంటి నీకు ఆపదను కలిగిస్తానా? కీడు తలపెట్టటం మంచిపని కాదు. నా భయంకొద్దీ నిన్ను నేను నమ్మలేక ఉరులు తెంపలేక పోతున్నాను. మనస్సులో తప్పు పట్టవద్దు. మాలవాడిని చూడగానే తాళ్ళను తెగగొరుకుతాను.

క. ఉరిఁ బాసి యేమి దలఁతో । యరిత్వమున వినుము ప్రబలుఁడైన యతనితో
వెరవున సంధి యొనర్చియుఁ । గరంబు నమ్మమియ నీతిగాఁ గొండ్రు బుధుల్. 214

ప్రతిపదార్థం: ఉరిన్ పాసి= ఉచ్చును వదలి; అరిత్వమునన్= శత్రుత్వంతో; ఏమి తలఁతో= ఏం ఆలోచిస్తావో; వినుము= వినవలసింది; బుధుల్= జ్ఞానం కలవారు; ప్రబలుఁడు+ఐన+అతనితోన్= బలవంతుడైన పగవాడితో; వెరవునన్= ఉపాయంగా; సంధి= పొత్తు; ఒనర్చియున్= కుదుర్చుకొని; కరంబు= ఎక్కువ; నమ్మమియ= నమ్మకపోవటమే; బుధుల్= జ్ఞానవంతులు; నీతిగాన్= ధర్మంగా; కొండ్రు= గ్రహిస్తారు.

తాత్పర్యం: నీవు ఉచ్చులనుండి బయటపడి పగవలన ఏం ఆలోచిస్తావో? ఒక మాట వినుము. బలవంతుడైనవాడితో ఎంతో ఉపాయంగా పొత్తు పెట్టుకొన్నా, అతడిమీద ఎక్కువ నమ్మకం ఉంచుకొనటం నీతి కాదంటారు తెలిసినవాళ్ళు.

ఉ. మాలనిరాక చూచి భయమర్దిత మైన మనంబుతోడ న
క్కాలమునందు నీకుఁ జనఁగావలయున్ వెస మ్రానిపైకి నా
యాలయముం జొరన్ సమయ; మప్పుడ నాకును గాన యత్తఱి
న్నేలొనరింతు; నమ్ము మిది నిక్కము గర్జము నీ వెఱుంగవే?' 215

ప్రతిపదార్థం: మాలని రాక చూచి= మాలవాడు రావటం చూచి; భయమర్దితము+ఐన= భయంతో బాధపడుతున్న; మనంబుతోడన్= మనస్సుతో; ఆ+కాలమునందున్= ఆ సమయంలో; నీకున్= నీకు; వెసన్= వెంటనే; మ్రానిపైకిన్= చెట్టుమీదికి; చనఁగాన్+వలయున్= వెళ్ళవలసి ఉంటుంది; నాకును= నాకు కూడా; అప్పుడు+అ= అప్పుడే; నా ఆలయమున్= నా నివాసాన్ని (బొరియను); చొరన్= చేరుకొనటానికి; సమయము= తగిన కాలం; కాన= కాబట్టి; ఆ+తఱిన్= అదే సమయంలో; మేలు= ఉపకారాన్ని; ఒనరింతున్= చేస్తాను; నమ్ము= విశ్వాసం ఉంచుము; ఇది; నిక్కము= నిజంగా; కర్జము= చేయదగిన పని (అని); నీవు; ఎఱుంగవే?= నీకు తెలియదా?

తాత్పర్యం: మాలవాడి రాకను చూచి నీవు వణికిపోతూ చెట్టుపైకి పోతావు. అదే సమయంలో నేను కలుగులోకి పోతాను. అదుగో అపుడే నీకు ఉపకారం చేస్తాను. ఇదే నిజానికి చేయదగిన పని. నీకు తెలియనిది కాదు కదా!'

క. అనవుడు నట్లేల తలఁప వినుము భవత్త్రాణరక్ష వెసఁ జేసితి నే
ననఘా! నీవును నమ్మెయి నను నాపదఁ బాపవలదె నమ్మి రయమునన్. 216

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; అనఘా!= ఓ పుణ్యవంతుడా!; అట్లు= ఆ విధంగా; తలఁపన్+ఏల?= అనుకోవటం ఎందుకు?; వినుము= విను; నేన్= నేను; భవత్= నీ యొక్క; ప్రాణరక్ష= ప్రాణాలను కాపాడటం; వెసన్+చేసితిన్= వేగిరపడి చేశాను; నీవును= నీవు కూడా; ఆ+మెయిన్= అట్లాగే ననున్= నన్ను; నమ్మి= విశ్వసించి; రయమునన్= తొందరగా; ఆపదన్= విపత్తును; పాపవలదె?= తొలగించవద్దా!

తాత్పర్యం: ఎలుకతో పిల్లి ఇట్లా బదులు పలికింది. 'ఓ పుణ్యాత్ముడా! అట్లా ఎందుకు ఆలోచిస్తావు. నేను నీ ప్రాణాలను వెంటనే కాపాడాను కదా! నీవూ అట్లాగే నా మీద నమ్మకంతో చప్పున ఆపదను గట్టెక్కించవద్దా'.

ఆ. అనినఁ బిల్లి కిట్టులను నెల్క 'వేగిర । పడకు; ముచితకాలభావ్య మైన
యత్నవిధి గదా సమగ్ర ఫలత్వంబు । నొందు; నొండు దలఁప కూరకుండు.' 217

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగానే; పిల్లికిన్= పిల్లికి; ఎల్క= ఎలుక; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నది; వేగిరపడకుము= తొందరపడకుము; ఉచితకాల= తగిన సమయంలో; భావ్యము+ఐన= ఉచితమయిన; యత్నవిధి+కదా= ప్రయత్నం తీరు కదా; సమగ్ర ఫలత్వంబున్= సంపూర్ణ ఫలసిద్ధిని; ఒందున్= పొందుతుంది; ఒండు= మరొకటి; తలఁపక= తలపోయక; ఊరక+ఉండు= మిన్నకుండుము.

తాత్పర్యం: తొందరపడవద్దు. 'సరైన తరుణంలో చేసిన ప్రయత్నమే సంపూర్ణంగా సఫలమవుతుంది. మరొకటి ఆలోచించకుండా ఊరుకొమ్ము'.

వ. అని యి ట్లప్పలితుండును రోమశుండును నొండొరులతో మాటలాడుచుండ వేకువ యయ్యెఁ నట్టి యెడ. 218

ప్రతిపదార్థం: అని యిట్లు= అని ఈ విధంగా; ఆ+పలితుండును= ఆ ఎలుకా; రోమశుండును= ఆ పిల్లీ; ఒండొరులతోన్= ఒకళ్ళతో ఒకళ్ళు; మాటలు+ఆడుచున్+ఉండన్= మాట్లాడుకొంటూ ఉండగా; వేకువ+అయ్యెన్= తెల్లవారింది; అట్టి యెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఇట్లా ఎలుకకు పిల్లికి సంవాదం కొనసాగుతుండగానే తెల్లవారింది. అపుడు.

క. తనతోఁ గొందఱు గుక్కలఁ । గొని యేతేరంగఁ గేలఁ గ్రూర కృపాణం
బును భీకరభంగిగ వెసఁ । జనుదెంచెన్ మాలఁ డధికసంరంభమునన్. 219

ప్రతిపదార్థం: తనతోన్= తనతోపాటు; కొందఱు= కొంతమంది వేటగాళ్ళు; కుక్కలన్ కొని= వేటకుక్కలను తీసికొని; ఏతేరంగన్= రాగా; కేలన్= చేతిలో; క్రూరకృపాణంబును= పదునుగల కత్తి; భీకరభంగిగన్= భయం గొలిపేటట్లుండగా; మాలఁడు= మాలవాడు; అధిక సంరంభమునన్= ఎంతో ఆడావుడిగా; వెసన్= వేగంగా; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: కొంతమంది వేటగాళ్ళు వేటకుక్కలను వెంట తీసుకొని తనతోరాగా మాలవాడు చేత కరకు కత్తి పట్టుకొని భయం పుట్టేటట్లు తొందరతొందరగా ఎంతో ఆటోపంగా వచ్చాడు.

ఆ. పరిఘనాముఁ డైన పాపాత్ముఁ । గని భయ మడరఁ బిల్లి యిట్టు లనియె
'నేమి సేయువాఁడ? నిదె వచ్చె జముదూత । వోలె సత్వరముగ మాలవాఁడు. 220

ప్రతిపదార్థం: పరిఘ నాముఁడు+ఐన= పరిఘుడనే పేరుగల; పాపాత్మున్= పాపిష్ఠిని; కని= చూచి; భయము+అడరన్= భీతి ఎక్కువ కాగా; పిల్లి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నది; ఇంకన్= ఇంకా; ఏమిచేయువాఁడన్= ఏంచేసేది; జముదూత+పోలెన్= యముడి బంటువలె; మాలవాఁడు; సత్వరముగన్= వేగిరంగా; ఇదె వచ్చెన్= ఇదుగో వస్తున్నాడు.

తాత్పర్యం: ఆతడిపేరు పరిఘుడు. ఈ పాపిష్ఠిని చూచిన పిల్లి 'యమకింకరుడివలె మాలవాడు ఇటే గబగబా వస్తున్నాడు. ఇంక నేను ఏం చేసేది?' అని మరింత భయపడసాగింది.

క. అనిన విని 'యోడ కోడకు'। మనుచుం దెగఁ గొఱికె వేగ మయ్యుఱిఁ బలితుం
డనయముఁ జకితాత్ముండై। చనియెన్ రోమశుఁడు నవనిజముపైకి వెసన్. 221

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగానే విన్నవాడై; పలితుండు= ఆ ఎలుక; ఓడకు+ఓడకుము; అనుచున్= భయపడకుము భయపడకుము అంటూ; ఆ+ఉరిన్= ఆ ఉచ్చును; వేగము= చకచక; తెగన్ కొఱికెన్= తుక్కుతుక్కుగా తెగిపోయేటట్లు కొరికింది; రోమశుడు= పిల్లి; అనయమున్= ఎంతో; చకిత+ఆత్ముండు+ఐ= కలవరపడ్డదై; అవనిజముపైకిన్= చెట్టుమీదికి; వెసన్= వడివడిగా; చనియెన్= పోయింది.

తాత్పర్యం: ఎలుక అదంతావిన్నది. భయపడకుమని పిల్లితో చెప్పి చకచక ఉచ్చులు కొరికి తెంపేసింది. కలవరపడ్డ మనస్సుతో పిల్లి చకచక చెట్టుమీదకు ఎక్కింది.

చ. ఎలుకయు బొక్కలోపలికి నేఁగి ముదంబునఁ బొంచి చూడ సం
కులముగ నేఁగుదెంచి పరిఘుం డురి నుగ్గగు టెల్లఁ జూచి ని
ష్ఫలతకుఁ జిత్తమెంతయు విషాదము వొందఁగఁ బోయెఁ; బిల్లి య
య్యెలుకకు నిట్లనుం జెవికి నింపగు రీతి నుదాత్త భంగిగన్. 222

ప్రతిపదార్థం: ఎలుకయున్= ఎలుకా; బొక్కలోపలికిన్= కలుగులోకి; ఏఁగి= వెళ్ళి; ముదంబునన్= సంతోషంగా; పొంచిచూడన్= దాగి ఉండి చూస్తుండగా; పరిఘుండు= ఆ మాలవాడు; సంకులముగన్= సందడిగా; ఏఁగుదెంచి= వచ్చి; ఉరి= ఉచ్చు; ఎల్లన్+నుగ్గగుటన్+చూచి= అంతా నజ్జు నజ్జు కావటం చూచి; నిష్ఫలతకున్= ప్రయోజనంలేకపోవటానికి; చిత్తము= మనస్సు; ఎంతయున్= ఎంతో; విషాదము+పొందఁగన్= దుఃఖాన్ని పొందగా; పోయెన్= వెళ్ళిపోయాడు; పిల్లి; ఆ+ఎలుకకున్= ఆ ఎలుకతో; చెవికిన్ ఇంపగు రీతిన్= వినటానికి తియ్యగా ; ఉదాత్తభంగిగన్= గౌరవభావంతో; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఎలుక కలుగులోకి దూరి సంతోషపడుతూ తొంగిచూస్తుండగా పరిఘుడు ఎంతో సందడిచేస్తూ వచ్చాడు. ఉచ్చులన్నీ నుగ్గునుగ్గయి ఉండటం చూచాడు. ఫలం దక్కలేదని ఎంతో బాధపడ్డాడు. వెనుతిరిగి వెళ్ళాడు. అపుడు ఎలుకతో పిల్లి చెవి కింపైన మాటలను ఎంతో గౌరవభావంతో ఇట్లా మాట్లాడింది.

ఆ. 'మేలుసేసి తగిన మిత్రునిఁ బడసి త। త్సుచరితముల వచ్చు సుఖము లనుభ
వింపఁ జూచుటుడిగి వేర్పడి యుండుట। యరయ నీతివిదుల తెరువుగాదు. 223

ప్రతిపదార్థం: మేలు+చేసి= ఉపకారం చేసి; తగిన= తగ్గ; మిత్రునిన్+పడసి= స్నేహితుడిని పొంది; తద్ సుచరితములన్= ఆతడి మంచి నడవడికలచేత; వచ్చు సుఖములు= కలిగే సౌఖ్యాలు; అనుభవింపన్+చూచుట= సుఖించటం; ఉడిగి= మాని; వేర్పడి+ఉండుట= విడివడి ఉండటం; అరయన్= విచారించగా; నీతి విదుల= నీతి శాస్త్ర వేత్తల; తెరువు+కాదు= పద్ధతి కాదు.

తాత్పర్యం: 'మంచి ఉపకారం చేసి మంచి మిత్రుడిని సంపాదించుకొని అతడి నడతలవలన కలిగే సౌఖ్యాలు అనుభవించకుండా వేరువేరుగా ఉండటం నీతివేత్తల పద్ధతి కాదు.

చ. అనఘ! భయంబు నొందు టిది యారయ బేలఁదనంబు; నెమ్మిమై
మును నను నమ్మి చెంది భయమోక్షణముం గని నాకుఁ జాల మే
లొనరఁగ జేసి తీవు; దుది నుల్లమునం దగ విశ్వసింప కి
ట్లునికి సుఖంబె? నాదుసిరి కుక్తుఁడ వయ్యెదు రమ్ము ప్రీతితోన్. 224

ప్రతిపదార్థం: అనఘ!= పాప రహితుడా!; భయంబున్= భయాన్ని; ఒందుట= పొందటం; ఇది; ఆరయన్= విచారించగా; బేలఁదనంబు= పిరికితనం; నెమ్మిమైన్= సంతోషంతో; మును= మునుపు; ననున్ నమ్మి= నన్ను నమ్ముకొని; చెంది= చేరి; భయమోక్షణమున్+కని= భయవిమోచనాన్ని పొంది; ఈవు= నీవు; నాకున్= నాకు; చాల మేలు= ఎంతో ఉపకారాన్ని; ఒనరఁగన్= తగ్గట్టుగా; చేసితి= చేశావు; తుదిన్= చివరకు; ఉల్లమునన్= మనస్సునందు; తగన్= ఒప్పేటట్లు; విశ్వసింపక= నమ్మక; ఇట్లు+ఉనికి= ఇట్లా ఉండటం; సుఖంబె?= సంతోషమా?; నాదు సిరికిన్= నా కలిమికి; ఉక్తుఁడవు= తగినవాడివి, యోగ్యుడవు; అయ్యెదు= అవుతావు; ప్రీతితోన్= ప్రేమతో; రమ్ము= రావలసింది.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! భయం కలగటం అనేది ఆలోచిస్తే అది పిరికితనమే. సంతోషంగా ముందు నన్ను నమ్మి భయాన్ని పోగొట్టుకొని నాకు మేలు చేశావు. చివరకు నన్ను నమ్మకపోవటం సంతోషమేనా? నీవే నాకలిమిని అనుభవించదగ్గవాడవు. ప్రీతితో రమ్ము.

క. బలవంతు లైన చుట్టం । బులు నేనును నీకు మేలు వొనరింపఁగ ని
మ్ముల మనుట యొప్పదే? ననుఁ । గలిసి మెలఁగు; విడువు శంకఁ; గను మభిమతముల్.' 225

ప్రతిపదార్థం: బలవంతులు+ఐన= ప్రబలులైన (ప్రసిద్ధులైన); చుట్టంబులు= బంధువులు; నేనును= నేనుకూడా; నీకున్= నీకు; మేలు= ఉపకారం; ఒనరింపఁగన్= అందించగా; ఇమ్ములన్= చక్కగా; మనుట= బతకటం; ఒప్పదే= తగదా; ననున్= నన్ను; కలిసి= కూడి; మెలఁగు= మసలుకొమ్ము; శంకన్= సంశయాన్ని; విడువు= వదలుకొమ్ము; అభిమతముల్= ఇష్టమైనవి; కనుము= పొందుము.

తాత్పర్యం: బలవంతులైన చుట్టాలూ నేనూ నీకు మంచి చేస్తాం. నాతో కలిసి మెలసి ఉండుము. చక్కగా బ్రదుకుదాం. సందేహించకుము. నీ కోరికలన్నీ తీర్చుకొమ్ము'.

వ. అనిన విని యప్పలితుండు రోమశునితో 'నీ పలుకు లుచితంబులు; నా మాటలు వినుఁ' మని యిట్లనియె. 226

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని; ఆ+పలితుండు= పలితుడనే ఆ ఎలుక; రోమశునితోన్= పిల్లితో; నీ పలుకులు= నీ మాటలు; ఉచితంబులు= న్యాయమైనవే; నా మాటలు= నా వచనాలు; వినుము+అని= ఆలకించుమని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఎలుక పిల్లితో 'నీ వాక్కులు ఉచితమైనవే. నా మాటలు కూడా వినుము' అన్నది.

చ. అరులను మిత్రులం దెలియ నారయు టెంతయు సూక్ష్మకృత్య మ
వ్వెర వతి దుర్లభం; బరులు వీ రన నుండియు మిత్రభావముం
బొరయుటయున్ సుహృజ్జనుల పోలికి గల్గియు శత్రుతాగుణ
స్ఫురణ యొకప్డు సూపుటయుఁ జూతుము గాదె ధరిత్రి నెల్లెడన్. 227

ప్రతిపదార్థం: అరులను= పగవాళ్ళను; మిత్రులన్= స్నేహితులను; తెలియన్+ఆరయుట= స్పష్టంగా కనుక్కొనటం; ఎంతయున్= ఎంతో; సూక్ష్మకృత్యము= అతి సూక్ష్మం అయినపని; ఆ+వెరవు= ఆ ఉపాయం; అతిదుర్లభంబు= పొందటం ఎంతో కష్టం; అరులు= పగవాళ్ళు; వీరు+అనన్+ఉండియున్= వీరే అనదగి ఉన్నా; మిత్రభావమున్= స్నేహాన్ని; పొరయుటయున్= పొందటమూ; సుహృద్ జనుల పోలికి+కల్గియున్= మిత్రులవలె ఉంటూ; శత్రుతాగుణ= పగవాడనే భావం; స్ఫురణమున్= తోచటమున్నూ; ఒకప్డు= ఎపుడైనా; చూపుటయున్= ప్రదర్శించటమున్నూ; ధరిత్రిన్= నేలమీద (లోకంలో); ఎల్ల+ఎడన్= అంతటా; చూతుము+కాదె!= చూస్తున్నాం కదా!

తాత్పర్యం: 'వీడు పగవాడు, వీడు నేస్తగాడని తెలిసికొనటం సూక్ష్మమైన విషయమే. ఆ నేర్పు అందరికీ లభించదు. శత్రువులు అనుకొన్నవారు మిత్రులవటం, మిత్రులనుకొన్నవారు శత్రువులవటం లోకంలో అంతటా చూస్తున్నాం కదా!

వ. కావున నిన్నుఁ బెద్ద గదియుట గర్జంబు గాదు; నీవును మద్వశగతిం బొందుటఁ జూచితేనియు నేమఱంజన; దెట్లంటేని. 228

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నిన్నున్= నీ గురించి; పెద్ద+కదియుట= మరింత చేరువ అవటం; కర్జంబు కాదు= తగిన పని కాదు; నీవును= నీవు కూడా; మత్+వశగతిన్+పొందుట= నాకు వశమై ఉండటం; చూచితేనియున్= చూస్తే; ఏమఱన్+చనదు= అజాగ్రత్తగా ఉండటం తగదు; ఎట్లంటేని= ఎట్లాగంటే.

తాత్పర్యం: కాబట్టి నిన్ను చేరటం తగదు. నీవు నాకు లోబడి ఉండటం చూచి పరాకుపడటం కూడదు.

క. బలవద్రిపులు ప్రయోజన । ములకై లోఁబడుట గల్గుఁ బొలముల నేనుం
గులు దీమంబుల పజ్జఁ ద । గిలి నెట్టన పట్టువడిన క్రియఁ జతురమతీ! 229

ప్రతిపదార్థం: చతురమతీ!= బుద్ధిమంతుడా!; పొలములన్= అడవులలో; ఏనుంగులు= ఏనుగులు; దీమంబుల పజ్జన్= వేటగాళ్ళు మచ్చిక చేసి ఉంచిన పశువుల వెంటపడి; తగిలి= చిక్కి; నెట్టన= వెంటనే; పట్టువడిన క్రియన్= దొరికిపోయినట్లు; బలవత్+రిపులు= బలవంతులైన శత్రువులు; ప్రయోజనములకున్+ఐ= స్వార్థం కొరకు; లోఁబడుట= వశమవటం; కల్గున్= జరుగుతుంది.

తాత్పర్యం: అడవులలో ఏనుగులు వాటిని పట్టుకొనటంకొరకు ఉంచిన ఎరలవలన చిక్కుకొని లొంగినట్లు పగవాళ్ళు తమ స్వార్థం కొద్దీ లోబడుతుంటారు.

చ. అరియెడ మిత్రభావ మొక యప్పుడు కార్యము పొంటెఁ గల్గిన
న్వెరవునఁ బాముఁ బట్టునెడ నిక్కము నమ్మక దానివాతికిం
గరము దొలంగఁ జేయునరు కర్జము వట్టి చరించుటొప్పదే!
పొరుగున నుండి నీకు హితముం దగఁ జేసెద నెప్డు పంచినన్. 230

ప్రతిపదార్థం: కార్యము పొంటెన్= అవసరాల కొరకు; అరిఎడన్= పగవాళ్ళపట్ల; ఒక+అప్పుడు= ఒకసారి; మిత్రభావము= మిత్రుడనే భావం; కల్గినన్= కలుగగా; పామున్ పట్టు+ఎడన్= పామును పట్టుకొనేటప్పుడు; నిక్కము= నిజంగా; నమ్మక= నమ్మకం లేకుండానే; దాని వాతికిన్= దాని నోటికి; కరము= చేయి; తొలంగన్+చేయు= తీసివేసే; నరుకర్జము+పట్టి= మనుష్యుడి పనిననుసరించి; వెరవునన్= ఉపాయంతో; చరించుట= మెలగటం; ఒప్పదే?= తగదా?; పొరుగునన్= ఇరుగున (ప్రక్కన); ఉండి; ఎపుడు పంచినన్= ఎపుడు కోరినా; నీకున్= నీకు; హితమున్= మేలును; తగన్= ఒప్పిదంగా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: అవసరాన్నిబట్టి ఒకొక్కప్పుడు శత్రువు మిత్రుడుగా అనిపించవచ్చును. పామును పట్టుకొనేటప్పుడు దానిని నమ్మక దాని నోటినుండి చేయిని తొలగించే మనిషివలె ఉపాయంతో ఉండాలి. నీవు ఎప్పుడు కోరితే అపుడు నీ ప్రక్కనే ఉండి నీకు మేలు చేస్తాను.

మ. విను! నీ కామిష మేను; నీ యెడఁ గడున్ విశ్వాసముం బూని చే
రిన నీ చిత్త మొకప్పు డుద్ధతవికారీభూతమై దుర్వినో
దనహింసారుచి నొందు; నీ సుతసుహృద్బంధువ్రజంబేని మున్
ననుఁ గన్నన్ వహియింప దాత్మఁ గరుణ; న్మన్నింపు మి ట్లుండెదన్. 231

ప్రతిపదార్థం: వినుఁ= వినుము; ఏను= నేను; నీకున్= నీకు; ఆమిషము= మాంసాహారాన్ని; నీ+ఎడన్= నీ పట్ల; కడున్+విశ్వాసమున్= ఎక్కువ నమ్మకాన్ని; పూని= పొంది; చేరినన్= చేరువగా ఉన్నట్లయితే; ఒకప్పుడు= ఎప్పుడైనా; నీ చిత్తము= నీ మనస్సు; ఉద్ధత= బయటపడ్డ; వికారీ భూతమై= మార్పు చెందినదై; దుర్వినోదన= చెడ్డ ఆట అనే; హింసా= హింసయందు; రుచిన్= కోరికను; ఒందున్= పొందుతుంది; నీ సుత= నీ కొడుకుల; సుహృద్= నీ మిత్రుల; బంధు= నీ చుట్టాల; వ్రజంబు+ఏనిన్= సమూహమైనా; మున్= ముందే; ననున్+కన్నన్= నన్ను చూస్తే; సహియింపదు= ఓర్వలేదు; ఆత్మన్= మనస్సులో; కరుణన్= జాలితో; మన్నింపుము= అనుగ్రహించు; ఇట్లు= ఇపు డున్నట్లే; ఉండెదను= ఉంటాను.

తాత్పర్యం: నేను నీకు మాంసాహారాన్ని. నిన్ను నమ్ముకొని నీతో చేరితే ఎపుడో ఒకప్పుడైనా నీ మనస్సు మారవచ్చును. నాపై హింసాభావం కలగవచ్చును. నీ కొడుకులూ నీ స్నేహితులూ చుట్టాలూ నన్ను చూచి ఓర్చుకొనలేకపోవచ్చును. కాబట్టి నామీద కరుణ చూపి, ఆత్మలో మన్నించుము. నేనిట్లాగే ఉంటాను.'

వ. అని యంత నిలువక. 232

తాత్పర్యం: అని పలికి, అంతటితో ఆగక - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'బలుపుటురిఁ జిక్కి పేరా । కలితో రేయెల్ల నున్నకతమున నీకుం
జలిది వలసి పిలిచెద; విటు । వలయునె? నీ పలుకు నమ్మి వత్తునె చేరన్?' 233

ప్రతిపదార్థం: బలుపుటురిన్= గట్టి ఉచ్చుల్లో; చిక్కి= చిక్కుకొని; పేరాఁకలితోన్= నకనకలాడే ఆకలితో; రేయి+ఎల్లన్= రాత్రంతా; ఉన్న కతమునన్= ఉన్న కారణంచేత; నీకున్= నీకు; చలిది= చద్ది బువ్వ; వలసి= కావలసి; పిలిచెదవు= పిలుస్తున్నావు; ఇటు+వలయునె?= ఇది నీకు తగినదేనా?; నీ పలుకు= నీ మాట; నమ్మి= నమ్ముకొని; చేరన్ వత్తునె?= దరి చేరుతానా?

తాత్పర్యం: 'రాత్రల్లా గట్టి ఉచ్చులో చిక్కుకొని నకనకలాడుతున్నావు. నీకు చద్దితిండి అవసరమై పిలుస్తున్నావు. ఇది నీకు తగునా? నీ మాట నమ్మి నీ దగ్గరకు వస్తానా?'

ఆ. అనుడు 'నిట్టు దలఁప నగునె మత్ప్రాణ ర । క్షకుఁడ వైన నిన్ను శత్రుఁ గాఁగఁ
దలఁతునే? కృతజ్ఞతయుఁ బౌరుషంబును । గలుగ నేను వెఱవ వలవ దనఘ!' 234

ప్రతిపదార్థం: అనుడున్= అనగానే; అనఘ!= పవిత్రుడా!; ఇట్లు= ఈ విధంగా; తలఁపన్+అగునె?= ఆలోచించటం తగునా?; కృతజ్ఞతయున్= చేసిన మేలు మరచిపోకుండటం; పౌరుషంబును కలుగన్= మగతనం కలిగి ఉండగా; ఏను= నేను; మత్ప్రాణ రక్షకుఁడవు+ఐన= నా ప్రాణాన్ని కాపాడిన; నిన్నున్= నిన్ను; శత్రున్+కాఁగన్= పగవాడిగా; తలఁతునే?= భావిస్తానా?; వెఱవ వలదు= భయపడవద్దు.

తాత్పర్యం: అనగానే పిల్లి 'ఓ పాపరహితుడా! ఈ విధంగా ఆలోచించటం తగదు. నీవు చేసిన మేలును మరిచిపోయేవాడిని కాను నేను. పౌరుషం కృతజ్ఞతా కలిగిన వాడిని. నా ప్రాణాన్ని కాపాడిన నిన్ను విరోధిగా భావిస్తానా? భయపడకుము'.

వ. అనిన రోమశునకుఁ బలితుం డిట్లనియె. 235

ప్రతిపదార్థం: అనినన్= అనగా; రోమశునకున్= పిల్లికి; పలితుండు= ఎలుక; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అది విన్న ఎలుక పిల్లితో ఈ విధంగా అంది.

క. నీ వలన నేను బ్రదికితి; । నీవును నాకతన మాలనికి నగపడవై;
తీ విధమునఁ గల్గు సుహృ । ద్భావము చాలు; నినుఁ జేరఁ దగ దిట మీఁదన్. 236

ప్రతిపదార్థం: నీ వలనన్= నీవలన; ఏను= నేను; బ్రదికితిన్= ఉసురుతో ఉన్నాను; నీవును= నీవు కూడా; నాకతనన్= నా మూలంగా; మాలనికిన్= మాలవాడికి; అగపడవు+ఐతి(వి)= కంటబడకపోతివి; ఈ విధమునన్= ఈ రీతిగా; కల్గు= పొందిన; సుహృద్భావము= మైత్రి; చాలున్= చాలు; ఇటమీఁదన్= ఇక మీదట; నినున్= నిన్ను; చేరన్+తగదు= సమీపించటం ఒప్పదు.

తాత్పర్యం: 'నీ వలన నేనూ బ్రతికాను. నా వలన నీవూ మాలవాడి కంటబడలేదు. ఈ పాటి స్నేహం చాలును. ఇక ముందు నీ దగ్గరకు రాకూడదు.

వ. ఇవ్విధంబునకు శుక్రవాక్యంబులుం గల; వాకర్ణింపుము. 237

ప్రతిపదార్థం: ఈ+విధమునకున్= ఈ పద్ధతికి; శుక్రవాక్యంబులున్= శుక్రాచార్యుడి వచనాలు; కలవు= ఉన్నాయి; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఈ విధానానికి శుక్రవాక్యాలు ఉన్నాయి. వినుము.

క. బలవంతుఁ డైన శత్రుని । వలనఁ బ్రయోజనము గలిగి వలను కలిమిఁ దాఁ
గలిసియు నది గడచనఁగాఁ । దొలఁగ వలయు; నమ్మెనేనిఁ దుదిఁ గీడొలయున్. 238

ప్రతిపదార్థం: బలవంతుఁడు+ఐన= మంచి సత్తువగల; శత్రునివలనన్= పగవాడివలన; ప్రయోజనము= లాభం; కలిగి= ఉండి; వలను కలిమిన్= ఆనుకూల్యం కలిగి ఉండటం వలన; తాన్+కలిసియున్= తను కలిసి ఉన్నా; అది కడచనఁగాన్= అది దాటి పోగానే; తొలఁగవలయున్= తప్పుకొనాలి; నమ్మెన్+ఏనిన్= నమ్మితే; తుదిన్= చిట్టచివరకు; కీడు= విపత్తును; ఒలయున్= పొందుతాడు.

తాత్పర్యం: బలవంతుడైన శత్రువుతో అవసరం కొద్దీ స్నేహం చేసినా ఆ అవసరం తీరగానే అతడి స్నేహాన్ని వదలుకొనాలి. ఒకవేళ నమ్మితే కడకు ఆపద పాలవక తప్పదు.

ఆ. నమ్మఁ దగనివారి నమ్మక యున్నది, । తగిన వారి నైనఁ దద్ద నమ్మి
యుండఁ దగదు; తన్ను నొరులు నమ్మెడు నట్ల । యుండి యొరుల నమ్మకునికి నీతి. 239

ప్రతిపదార్థం: నమ్మన్ తగనివారిన్= నమ్మకూడని వారిని; నమ్మక+ఉన్నది= నమ్మకుండా ఉండాలి; తగినవారిని+ఐనన్= నమ్మదగ్గ వారినైనా; తద్ద= పెద్దగా; నమ్మి+ఉండన్ తగదు= నమ్మి ఉండకూడదు; తన్నున్= తనను; ఒరులు=

పరాయివాళ్ళు; నమ్మెడు+అట్ల= నమ్మేటట్లు; ఉండి; ఒరులన్= ఇతరులను; నమ్మక+ఉనికి= తాను నమ్మకుండా ఉండటం; నీతి= ధర్మం.

తాత్పర్యం: నమ్మతగని వాళ్ళను నమ్మనేకూడదు. నమ్మదగ్గవాళ్ళనైనా తగినంతగానే నమ్మాలి. ఇతరులు తనను నమ్మేటట్లు నడుచుకొంటూనే తాను వాళ్ళను నమ్మకపోవటం నీతి.

వ. ఇట్టిద బ్రదుకుఁదెరు వగుటం జేసి. 240

ప్రతిపదార్థం: ఇట్టిద= ఇట్లాంటిదే; బ్రదుకుఁదెరువు+అగుటన్+చేసి= జీవనోపాయం అవటం వలన.

తాత్పర్యం: ఇట్లాంటిదే బ్రతికే మార్గం అవటం వలన. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నినుబోంట్లను నమ్మక యే । నును బ్రదికెద; నఘ! నీవునుం గని చండా
లుని యట్టివారి మాయలు । నినుఁ బొందక యుండ బ్రదుకు; నెఱిఁ బో మ్మింకన్. 241

ప్రతిపదార్థం: నిను బోంట్లను= నీ బోటివాళ్ళను; నమ్మక= విశ్వసించక; ఏనును= నేనూ; బ్రదికెదన్= జీవిస్తాను; అనఘ!= పాపం తాకనివాడా!; నీవునున్= నీవూ; కని= చూచి; చండాలుని అట్టివారి మాయలు= మాలవాడివంటి వాళ్ళ మోసాలు; నినున్+పొందక= నీకు కలుగకుండా; నెఱిన్= నిండుగా; బ్రదుకు= జీవించుము; ఇంకన్= ఇక; పొమ్ము= వెళ్ళుము.

తాత్పర్యం: నీవంటి వారిని నమ్మకుండానే నేనూ బ్రతుకుతాను. నీవు మాలవాడివంటి వారి మాయలలో పడకుండా నిండైన బ్రతుకు బ్రతుకుము. ఇక వెళ్ళుము'.

క. అనిన విని సిగ్గుపడి తన । చనుచోటికిఁ జనియెఁ బిల్లి; సమ్మతిఁ బలితుం
డును వేఱొక తగులాఁగకుఁ । జని సముచిత వర్తనమున సౌఖ్యముఁ బొందెన్. 242

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; పిల్లి; సిగ్గుపడి= లజ్జపడి; తన చనుచోటికిన్= తానుండే తావుకు; సమ్మతిన్= అనుమతితో; చనియెన్= వెళ్ళినది; పలితుండును= ఎలుకా; వేఱొక= మరొక; తగులాఁగకున్= తగినట్టి కలుగులోకి; చని= దూరి; సముచిత వర్తనమునన్= యోగ్యమైన నడవడితో; సౌఖ్యమున్= సుఖాన్ని; పొందెన్= పొందింది.

తాత్పర్యం: అని ఎలుక అనగానే పిల్లి చాల సిగ్గుపడి, ఎలుక అనుమతి తీసికొని తన చోటుకు తాను పోయింది. ఎలుక కూడా మరొక కలుగులోకి దూరి తన చక్కని నడవడితో సౌఖ్యాన్ని పొందింది.

క. బలు పగఱవలని యాపద । దలఁగుటకును రిపుని హీనతరు నైనఁ దనుం
గలిపికొని బ్రదుకుటకు ని । య్యెలుకయుఁ బిల్లియును వెరవు లెఱిఁగించెఁ దగన్.' 243

ప్రతిపదార్థం: బలు పగఱవలని= బలంగల పగవారివలన కలిగే; ఆపద= విపత్తు; తొలఁగుటకును= తొలగటానికీ; హీన తరున్ రిపుని+ఐనన్= అల్పుడైన శత్రువునైనా; తనున్= తాను; కలిపికొని= చేర్చుకొని; బ్రదుకుటకున్= జీవించటానికి; ఈ ఎలుకయున్= ఈ ఎలుకా; పిల్లియును= పిల్లీ; తగన్= ఒప్పేటట్లు; వెరవులు= ఉపాయాలు; ఎఱిఁగించెన్= తెలిపాయి.

తాత్పర్యం: బలంగల శత్రువులవలన కలిగే ఆపదలను తొలగించుకొనటానికీ అల్పుడైన శత్రువునైనా తనతో కలుపుకొని జీవించటానికి తగిన ఉపాయాన్ని ఎలుకా పిల్లీ తెలిపాయి'.

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవునితో 'నెవ్వనియెడ విశ్వసింపకున్నం జిత్తంబునకు విశ్రామంబు గల్గదు; విశ్వసించిన దురితంబులు దొడరు నట్లగుటంజేసి విశ్వసించుటయు విశ్వసింపకయుండుటయు నను రెంటిలోననుం బరమకర్తవ్యం బెయ్యదియో నిశ్చయింప నేర' ననుటయు నమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె 'నీ యర్థంబు' దేటపఱుచునట్టి యితిహాసంబు సెప్పెద నాకర్ణింపుము. 244

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; శాంతనవునితోన్= భీష్ముడితో; ఎవ్వనిఎడన్= ఎవడి పట్లనైనా; విశ్వసింపక+ఉన్ననన్= నమ్మక ఉంటే; చిత్తంబునకున్= మనస్సుకు; విశ్రామంబు= ఊరట; కల్గదు= ప్రాప్తించదు; విశ్వసించినన్= నమ్మితే; దురితంబులు= పాపాలు; తొడరున్= కలుగుతాయి; అట్లు+అగుటన్+చేసి= అట్లా అవటంవలన; విశ్వసించుటయున్= నమ్మటం; విశ్వసింపక+ఉండుటయున్= నమ్మకపోవటం; అను రెంటిలోననున్= అనే రెంటిలోపలా; పరమ కర్తవ్యంబు= ఎక్కువ చేయతగ్గది; ఏ+అది+ఓ= ఏదో; నిశ్చయించనేరను= నిర్ణయించలేను; అనుటయున్= అనగానే; ఆ+మహీపతికిన్= ఆ ధర్మరాజుకు; ఆ+మహాత్ముండు= ఆ భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; ఈ అర్థంబున్= ఈ విధానాన్ని; తేటపఱుచు+అట్టి= తెల్లంజేసేటి; ఇతిహాసంబు= పూర్వ కథ; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగానే ధర్మరాజు ఇట్లా అడిగాడు. 'ఎవడినీ నమ్మకపోతే మనస్సుకు ఊరట కలుగదు. నమ్మితే పాపాలు సంభవిస్తాయి. నమ్మటం, నమ్మకపోవటం అనే రెంటిలో ఏది ముఖ్యంగా ఆచరించ తగ్గదో ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాను' అనగానే భీష్ముడు 'ఈ విషయాన్ని తేటపరిచే కథ ఒకటి విను చెప్పుతాను' అన్నాడు.

బ్రహ్మదత్తునితోఁ బూజని యను శకుని కైన సంవాద ప్రకారము (సం. 12-137-4, 5)

సీ. బ్రహ్మదత్తుం డనఁ బరఁగిన నరపతి । నగరఁ బూజని యను నామ మొప్పఁ
జతురభాషిణి యొక్క శారిక వర్తించు । నది పిల్లఁ బెట్టి యింపారుపండ్లు
దెచ్చి యర్మిలి దాని కిచ్చుచో మేలేఱి । యధిపపుత్త్రున కిచ్చు; నందుఁ గొన్ని
వాఁడును మచ్చిక వచ్చి యప్పిల్లతోఁ । జర్లాటమాడుచు సంచరించు;

ఆ. నొక్కనాఁడు దాది యొద్ద లేకుండ న । ద్దారకుండు పిల్లతల నొగిల్చి
చంపె; దాని తల్లి సనుదెంచి కని మది । నిట్టులనియె శోక మెసక మెసఁగ. 245

ప్రతిపదార్థం: బ్రహ్మదత్తుండు+అనన్= బ్రహ్మదత్తు డనే పేరుతో; పరఁగిన= ఒప్పేటటువంటి; నరపతి నగరన్= రాజు పట్నంలో; పూజని అనునామము= పూజని అనే పేరు; ఒప్పన్= ఒప్పుతుండగా; చతుర భాషిణి= ఇంపుగా మాట్లాడే; ఒక్క శారిక= ఒక గోరువంక; వర్తించున్= ఉండేది; అది= ఆ గోరువంక; పిల్లన్+పెట్టి= పిల్లను కని (పెట్టి); ఇంపారు పండ్లు= తీయటి పండ్లను; తెచ్చి= తీసికొనివచ్చి; అర్మిలిన్= ప్రేమతో; దానికిన్= తన పిల్లకు; ఇచ్చుచోన్= పెట్టేటప్పుడు; అందున్ కొన్ని= ఆ పళ్ళల్లో కొన్నింటిని; మేలు+ఏఱి= మంచివి ఎంచి; అధిప పుత్త్రునకున్= బ్రహ్మదత్తుడి కొడుకుకి; ఇచ్చున్= పెట్టుతూ ఉండేది; వాఁడును= ఆ రాజకుమారుడు; మచ్చికన్ వచ్చి= చనువుగా వచ్చి; ఆ పిల్లతోన్= ఆ గోరువంక పిల్లతో; చర్లాటము ఆడుచున్= విలాసంగా ఆడుతూ; సంచరించున్= తిరుగుతుండేవాడు; ఒక్కనాఁడు= ఒక రోజున; దాది= దాసి; ఒద్దలేకుండన్= దగ్గర లేనప్పుడు; ఆ+దారకుండు= ఆ పిల్లవాడు; పిల్ల తలన్= గోరువంక పిల్ల తలకాయను; నొగిల్చి= పగులగొట్టి; చంపెన్= ప్రాణాలు తీశాడు; దానితల్లి= ఆ పిల్ల తల్లి పూజని; చనుదెంచి= వచ్చి; కని= చూచి; మదిన్= మనసులో; శోకము= ఏడుపు; ఎసకమెసఁగన్= ఎక్కువ అవగా; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఒకప్పుడు బ్రహ్మదత్తు డనే రాజు ఉండేవాడు. అతడి పట్టణంలో పూజని అనే గోరువంక ఉండేది. అది మంచి మాటకారి. అది ఒక పిల్లను పెట్టింది. ఆ పిల్లకు ప్రతిదినం తీయటి పళ్ళను తెచ్చి పెట్టేది. వాటిల్లో మంచివి ఎంచి రాజుకొడుకుకే పెట్టేది. వాడూ ఆ పిల్లను మచ్చిక చేసికొని ఆడుకొనేవాడు. ఒకనాడు ఆ పిల్లవాడు దాది దగ్గరలేనప్పుడు ఆ పిట్ట పిల్ల తలను పగులగొట్టి చంపాడు. కాసేపటికి ఆ పిల్ల తల్లి పూజని వచ్చి చూచి విలవిలలాడింది. పెద్దపెట్టున వాపోతూ ఇట్లా అన్నది.

తే. 'అకట! కూడి మెలంగి యే మొకటి యైన । నర్థి నిదియును దానును ననుభవించుఁ
బట్టి యాడుచునుండు నిప్పాపజాతి । పడుచు సంపునె యిటు దీని మిడుకమిడుక. 246

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; కూడి మెలంగి= కలసి తిరిగి; ఏమి+ఒక్కటి+ఐనన్= ఏ వస్తువు ఒక్కటిపెట్టినా; అర్థిన్= కోరికచేత; ఇదియును= ఈ గోరువంక పిల్లా; తానునున్= తానూ (రాచబిడ్డా); అనుభవించున్= తింటూ ఉండేవాళ్ళు; పట్టి= పట్టుకొని; ఆడుచున్+ఉండున్= ఆటలాడుతూ ఉండేవాడు; ఈ+పాపజాతిపడుచు= పాపం చేసే రాచకులానికి చెందిన ఈ పిల్లవాడు; దీనిన్= ఈ నా పిల్లను; మిడుక మిడుకన్= సంచరిస్తుండగా; ఇటు+చంపునె?= ఇట్లా చంపుతాడా?

తాత్పర్యం: 'అయ్యో! నా పిల్లా, ఆ రాచబిడ్డా కలసి మెలసి తిరిగేవాళ్ళు. ఏది పెట్టినా అరమరికలు లేకుండా తినేవాళ్ళు. ఆడుకొనేవాళ్ళు. అయినా ఈ పాపి నా పిల్లను పొట్టనపెట్టుకున్నాడు.

ఆ. రాచకొడుకుగాఁడె రాచవారికి నేటి । పరిచయంబు వేగ కరుణ విడుచు
హితవు మఱచు రాజు లెందు నమ్మికకుఁ బా । త్రములె సమదమతులు క్రౌర్యరతులు.' 247

ప్రతిపదార్థం: రాచకొడుకు+కాఁడె= రాజుకొడుకు గదా; రాచవారికిన్= రాజులకు; పరిచయంబులు= స్నేహం; ఏటి= ఎట్లాంటిది; వేగన్= తొందరగా; కరుణన్= జాలిని; విడుచున్= వదలుతారు; హితవు= మేలును; మఱచున్= మరచినట్టి; సమదమతులు= గర్వపోతులు; క్రౌర్యరతులు= కఠినాత్ములు (అయిన); రాజులు; ఎందును= ఎపుడూ; నమ్మికకున్= నమ్మటానికి; పాత్రములె!= తగినవారా!

తాత్పర్యం: రాచబిడ్డ కదా! రాజులకు స్నేహం ఎక్కడిది? వాళ్ళకు జాలి ఉండదు. చేసిన మేలు మరచిపోతారు. గర్వపోతులు. కఠినులు, నమ్మదగ్గవారు కారు.

వ. అని నిందించి. 248

తాత్పర్యం: అని దూషించి - (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఈ పగ దీర్చెద నంచుం । గోపంబున రాజు కొడుకు గ్రుడ్డులు రెండుం
బోపడునట్లుగ గోళ్కన్ । వే పెఱికి రయమున గగనవీథికి నెగసెన్. 249

ప్రతిపదార్థం: ఈ పగ= ఈ కచ్చను; తీర్చెదను+అంచున్= తీర్చుకొంటాను అంటూ; కోపంబునన్= కోపంతో; రాజుకొడుకు= రాజకుమారుడి; గ్రుడ్డులు= కంటి గుడ్లు; రెండున్= రెండూ; పోపడునట్లుగన్= పోయేటట్లు; గోళ్ళన్= గోళ్ళతో; వే పెఱికి= చప్పున ఊడబీకి; రయమునన్= వేగంగా; గగనవీథికిన్= ఆకాశంలోకి; ఎగసెన్= ఎగిరిపోయింది.

తాత్పర్యం: ఈ పగను తీర్చుకొంటాను' అంటూ ఆ గోరువంక తన గోళ్ళతో రాజకుమారుడి రెండు కళ్ళూ ఊడబెరికింది. ఎంతో వేగంగా ఆకాశంలోకి ఎగిరిపోయింది.

వ. ఎగసి యచ్చోట నిలిచి బ్రహ్మదత్తుండు విన నిట్లనియె. 250

ప్రతిపదార్థం: ఎగసి= ఎగిరి; ఆ+చోటన్= ఆకాశంలో; నిలిచి= ఉండి; బ్రహ్మదత్తుండు= బ్రహ్మదత్తుడు; వినన్= వినేటట్లు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: ఆకాశంలోకి ఎగిరి అక్కడినుండి బ్రహ్మదత్తుడు వినేటట్లు ఈ విధంగా పలికింది.

క. 'చేసె నఘము; దత్ఫలముం । జేసితం గుడిచెఁ గాని శిశువు నెడన్ నా
చేసిన క్రౌర్యము లే; దేఁ । జేసితి మా; టొండు గీడు సెందదు నన్నున్.' 251

ప్రతిపదార్థం: (నీ బిడ్డ) అఘము= పాపం; చేసెన్= చేశాడు; తత్ఫలమున్= ఆ పాప ఫలాన్ని; చేసేతన్= స్వయంగా; కుడిచెన్= అనుభవించాడు; కాని= అంతేకాని; శిశువు+ఎడన్= పిల్లవాడి పట్ల; నా చేసిన= నేను కోరి చేసిన; క్రౌర్యము లేదు= క్రూరత్వం లేదు; ఏన్= నేను; మాటు= నా బిడ్డను చంపినందుకు బదులుగా; చేసితిన్= చేశాను; ఒండు కీడు= మరే పాపం; నన్నున్ చెందదు= నన్ను పొందదు.

తాత్పర్యం: 'రాజా! నీ బిడ్డ నా బిడ్డను చేజేతులా చంపివేశాడు. దాని ఫలితంగానే కళ్ళు పోగొట్టుకున్నాడు. అంతేకాని నీ కొడుకు పట్ల నేను ఏమీ క్రూరంగా నడచుకొనలేదు. చేసిన దానికి ప్రతీకారం చేశాను. నన్ను ఏ పాపం అంటదు'.

చ. అనవుడు బ్రహ్మదత్తుఁ 'డది యట్టిద; నీ దెసఁ గీడు లేదు; నీ
చనుటకు నా మనం బతివిషాదముఁ బొందెడుఁ; దొంటి యట్ల నె
మ్మిన నిలు 'మన్నఁ బూజని' శమించునె యొండొరుచేతఁ బడ్డ యీ
పెనుపగ నొంచి మాటపస బేల్పడి క్రమ్మఱఁ జేరు టొప్పునే?' 252

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; బ్రహ్మదత్తుఁడు; అది= నీవు చెప్పింది; అట్టిద= అట్లాంటిదే; నీ దెసన్= నీవైపు; కీడు లేదు= పాపం లేదు; నీ చనుటకున్= నీవు వెళ్ళటానికి; నా మనంబు= నా మనస్సు; అతివిషాదమున్= ఎంతో దుఃఖాన్ని; ఒందెడున్= పొందుతున్నది; తొంటి+అట్ల= మునుపటివలెనే; నెమ్మిన్+అ= మిత్రభావంతోనే; నిలుము= ఉండుము; అన్నన్= అనగానే; పూజని= గోరువంక; ఒండొరు చేతన్= ఒకళ్ళ నొకళ్ళం; నొంచి= నొప్పించుకొని; పడ్డ= అనుభవించిన; ఈ+పెనుపగ= ఈ పెద్ద పగ పోతుందా; మాటపసన్= మాటలనేర్పుతో; బేల్పడి= మోసపోయి; క్రమ్మఱన్= తిరిగి; చేరుట= కలిసి ఉండటం; ఒప్పునే?= తగుతుందా?

తాత్పర్యం: అని పూజని చెప్పగానే రాజు 'నీవు అన్నది నిజమే ఈ విషయంగా నీ దోషం ఏమీ లేదు. కాని, నీవు వెళ్ళిపోవటం మాత్రం నా మనస్సుకు ఎంతో బాధగా ఉన్నది. కనుక వెనకటివలెనే స్నేహంగా ఇక్కడే ఉండు' మన్నాడు. దానికి గోరువంక తిరిగి ఈ విధంగా అన్నది. 'ఒకరి నొకరం నొప్పించుకొన్న ఈ పెనుపగ తేలికగా చల్లారిపోదు. అయినా నీ కమ్మని మాటలలో పడి మోసపోయి మళ్ళీకలసి ఉండటం తగినది కాదు'.

వ. అనిన విని యతండు. 253

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; అతండు= బ్రహ్మదత్తుడు.

తాత్పర్యం: అది విన్న బ్రహ్మదత్తుడు - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'చేసిన దానికి మాఱుగఁ । జేసినఁ బగయంతతోడఁ జెడుఁ గాక గుణుల్
డాసిన నమ్మేలు విడిచి । దోసముఁ బట్టుదురె యెట్టి తుచ్ఛులుఁ జతురా! 254

ప్రతిపదార్థం: చతురా!= నేర్పరీ!; చేసిన దానికిన్= నా బిడ్డ చేసిన కీడుకు; మాఱుగన్+చేసినన్= బదులుగా చేసిన; పగ= కచ్చ; అంతతోడన్= అంతటితోనే; చెడున్+కాక= తీరిపోతుంది కాక; ఎట్టి తుచ్ఛులున్= ఎలాంటి నీచులైనా; గుణుల్= బుద్ధిమంతులు మంచివాళ్ళు; డాసినన్= చేరువైతే; ఆ మేలు విడిచి= ఆ ఉపకారాన్ని వదలిపెట్టి; దోసమున్= తప్పును; పట్టుదురే?= మోపుతారా?

తాత్పర్యం: 'నా బిడ్డ చేసినదానికి ప్రతిగా నీవు కనుగుడ్లు పీకావు. ఆ పగ అంతటితో తీరిపోతున్నది. ఎట్లాంటి నీచులైనా దగ్గరకు చేరిన బుద్ధిమంతుల మేలును మరచి నింద మోపుతారా!'

వ. అనిన నతనికి శారిక యిట్లనియె. 255

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; అతనికిన్= అతడితో; శారిక= పూజని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అని అనగా బ్రహ్మదత్తుడితో శారిక ఇట్లా అన్నది.

క. 'నెయ్యము సెడినను మాటల । తియ్యఁదనము వట్టి పగ మదిన్ మఱచినఁ జా
వయ్యెం జేటయ్యె గలఁక । యయ్యె నొకటి మూఁడుఁగాక యది మే లగునే? 256

ప్రతిపదార్థం: నెయ్యము= స్నేహం; చెడినను= చెడిపోయినా; మాటల= పలుకులలోని; తియ్యఁదనము+పట్టి= మాధుర్యాన్నిబట్టి; పగ= వైరం; మదిన్= మనస్సులో; మఱచినన్= మరచిపోతే; చావు+అయ్యెన్= చావు కలుగుతుంది; చేటు+అయ్యెన్= కీడు మూడుతుంది; కలఁక+అయ్యెన్= కలవరం పుడుతుంది; ఒకటి= వీటిల్లో ఒకటి; మూఁడున్+కాక= కలగవచ్చుకాక; అది= అట్లా కలగటం; మేలు+అగునే?= మంచిది అవుతుందా?

తాత్పర్యం: 'స్నేహం చెడిపోయినా తియ్యటి మాటలలో పడిపోయి ఆ పగను మర్చిపోవచ్చును. కాని, దానివలన చావు కలుగవచ్చును, కలత పుట్టవచ్చును, కీడు పొందవచ్చును. అంతే కాని మంచి జరగదు.

ఆ. వినుము! నేల దోఁచికొనినను దాయాదు । లైన మాట మాటకేని నాఁడు
వారి యెడను గీడు వారక చేసినఁ । బగ జనించు నిట్లు భంగు లైదు. 257

ప్రతిపదార్థం: వినుము= వినుము; నేల దోఁచికొనినను= భూమిని కాజేయాలనుకొన్నా; దాయాదులు+ఐనన్= జ్ఞాతుల (ఆస్తిలో పాలుపంచుకొనే అధికారం ఉండే ఆడవాళ్ళు మగవాళ్ళు) వల్లనైనా; మాటకున్ మాటకున్+ఏనిన్= మాటామాట వచ్చినా; ఆఁడువారి యెడను= ఆడవారివల్లనైనా; కీడు= చెడు; వారకచేసినన్= విడవకుండా చేసినా; పగ= వైరం; జనించున్= పుట్టుతుంది; ఇట్లు= ఇటువంటి పగ; ఐదు భంగులు= అయిదు విధాలు.

తాత్పర్యం: భూమి దురాక్రమణంవలన, దాయాదులవలన, ఆడవారివలన, మాటమాటవచ్చినందువలన, అడ్డూ ఆపూ లేని చెడు తలపెట్టటంవలన పగ పుట్టుతుంది. ఇట్లా ఇది అయిదు తీరులు.

ఆ. పగయుఁ గల్గెనేని పాయునె గూఢమై । వ్రూన నగ్నియున్న మాడ్కి నుండుఁ
గాన నమ్మి బేల కాలాంతరంబున । నైనఁ జెడును సందియంబు వలదు. 258

ప్రతిపదార్థం: పగయున్= విరోధం; కల్గెన్+ఏని= కలిగితే; పాయునె?= పోతుందా?; మ్రానన్= చెట్టులో; అగ్ని= నిప్పు; గూఢమై ఉన్నమాడ్కిన్= దాగి ఉన్నట్లుగా; ఉండున్= పగ ఉంటుంది; కానన్= కాబట్టి; నమ్మి= నమ్ముకొని; బేల= తెలివి తక్కువవాడు; కాలాంతరంబునన్+ఐనన్= కొంతకాలం దాటిపోయాక అయినా; చెడును= చెడిపోతాడు (నశిస్తాడు); సందియంబు= సందేహం; వలదు= వద్దు.

తాత్పర్యం: పగ పుట్టాక ఒక పట్టాన పోదు. ఇది చెట్టులో దాగి ఉండే నిప్పువలె మనస్సులో దాగి ఉంటుంది. కాబట్టి నమ్ముకొన్న వెర్రివాడు ఎప్పటికైనా చెడిపోతాడు. ఇందులో ఏమీ సందేహం లేదు.

క. జననీ జనక సహోదర । తనూభవుల సఖుల నమ్మఁ దగ దనినను నె
మ్మనమునఁ బగ గలవారలఁ । జనునే నమ్మంగ విడువు చతురవచనముల్.' 259

ప్రతిపదార్థం: జననీ= తల్లినీ; జనక= తండ్రినీ; సహోదర= తోడబుట్టిన వారినీ; తనూభవులన్= పిల్లలనూ; సఖులన్= నేస్తగాళ్ళనూ; నమ్మన్+తగదు= నమ్ముకొనకూడదు; అనినను= అని నీతి శాస్త్రం అంటూ ఉంటే; నెమ్మనమునన్= నిండు మనస్సుతో; పగ కలవారలన్= విరోధులను; నమ్మంగన్ చనునే?= విశ్వసించవచ్చునా?; చతుర వచనముల్= నేర్పు మాటలను; విడువు= మానుకొమ్ము.

తాత్పర్యం: కన్న తల్లిదండ్రులను, తోడబుట్టినవాళ్ళను, కన్న సంతానాన్నీ, స్నేహితులనూ నమ్మకూడదు అంటున్నది నీతిశాస్త్రం. కనుక, మనస్సు నిండా పగపెట్టుకొన్నవాళ్ళను నమ్మవచ్చునా? ఇక నీ చతురోక్తులు చాలించుము.'

వ. అనుటయు బ్రహ్మదత్తుం డిట్లనియె. 260

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; బ్రహ్మదత్తుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగానే బ్రహ్మదత్తుడు ఈ విధంగా అన్నాడు.

క. 'కాలవశంబునఁ గీడు । న్మేలును జనులకును మూఁడు నీకును నాకున్
వాలి యవి సేయ వచ్చునె? । బేలనె యే నంత యేల పెడఁబాయంగన్. 261

ప్రతిపదార్థం: కాలవశంబునన్= కాలానికి లోబడి; కీడున్= చెడును; మేలును= మంచీ; జనులకును= ప్రజలకు; మూఁడున్= కలుగుతుంటాయి; నీకును= నీకూ; నాకున్= నాకూ; వాలి= మితిమించి; అవి= ఆ మంచీ చెడ్డలు; చేయవచ్చునె= చేయకలుగుతాయా?; అంత+ఏల?= అదంతా ఎందుకు?; పెడఁబాయంగన్= వదలిపెట్టి వెళ్ళటానికి; ఏను= నేను; అంత బేలనె?= అంత వెర్రివాడినా?

తాత్పర్యం: 'కాలాన్నిబట్టి జనానికి మంచీ చెడులు కలుగుతుంటాయి. వాటిని దాటి చేయటం మన వశమా? అంతెందుకు? నిన్ను వదలుకొనటానికి నే నేమైనా వెర్రివాడినా?'

వ. అనిన విని శారిక యతని మొగంబు దేఱుకొనంజూచి. 262

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగానే విని; శారిక= పూజని అనే గోరువంక; అతని మొగంబు= ఆ బ్రహ్మదత్తుడి ముఖాన్ని; తేఱుకొనన్+చూచి= తేరిపార చూచి.

తాత్పర్యం: బ్రహ్మదత్తుడి మాటలు విన్న గోరువంక అతడిని తేరిపార చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'వినుఁ చల్లని మాటలలో । మునిఁగి యలుక గుబ్బతిలు సముద్ర జలములో
నన యుండి యాఁ కెప్పుడు । గనగన మను బాడబాగ్ని కరణి నరేంద్రా!' 263

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; వినుఁ= ఆలకించుము; చల్లని మాటలలోన్= నీ ఊరడింపు పలుకులలో; మునిఁగి= దాగిన; అలుక= కోపం; సముద్ర జలములోనన= సముద్రం లోపలనే; ఉండి; ఆఁకఁ= చల్లారక; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; గనగనము+అను= కణకణమని మండే; బాడబాగ్ని కరణిన్= బడబానలంవలె; గుబ్బతిలున్= అతిశయిస్తుంది.

తాత్పర్యం: 'నీ చల్లని మాటల మాటున దాగిన కోపం సముద్రంలోపల ఎపుడూ కణకణ మండే బడబాగ్నివలె మండుతూనే ఉంటుంది'.

క. అని పలికి యవిశ్వాసము । మనమున నెలకొల్పి రాజు మాటలకుం దే
లని వెరవుతోడ నా పూ । జని దనకిమ్మైన యెడకుఁ జనియెఁ గుమారా! 264

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; కుమారా!= ధర్మరాజా!; మనమునన్= మనస్సులో; అవిశ్వాసమున్= అపనమ్మకాన్ని; నెలకొల్పి= నిలుపుకొని; రాజు మాటలకున్= బ్రహ్మదత్తుడి మాయమాటలకు; తేలని= బయటపడని; వెరవుతోడన్= ఉపాయంతో; ఆ పూజని= ఆ గోరువంక; తనకున్= తనకు; ఇమ్మ్+ఐన ఎడకున్= అనువైన చోటికి; చనియెన్= వెళ్ళింది.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ పూజని రాజుపట్ల తనకుగల అపనమ్మకాన్ని బయటపడనీయలేదు. ఆ రాజు మాటలకు లొంగకుండానే ఎంతో ఉపాయంగా తన కనువైన చోటికి వెళ్ళిపోయింది.

వ. అదియునుం గాక. 265

తాత్పర్యం: అంతే కాకుండా.

క. జననాథునకు నవిశ్వా । స నిరూఢత వలయు నెల్ల జనములయందుం
దనుఁ దనసిరిఁ గాచుటకై । యని నీతులు సెప్పుదురు బృహస్పతిముఖ్యుల్. 266

ప్రతిపదార్థం: జననాథునకున్= రాజైనవాడికి; తనున్= తన్నూ; తనసిరిన్= తన సంపత్తినీ; కాచుటకై= కాపాడుకొనటానికి; ఎల్ల జనములఅందున్= జనులందరిపట్ల; అవిశ్వాస నిరూఢత= గట్టిగా నమ్మకపోవటం; వలయున్= ఉండాలి; అని; బృహస్పతి ముఖ్యుల్= బృహస్పతి మొదలైన పెద్దలు; నీతులు= రాజనీతులు; చెప్పుదురు= చెప్పుతుంటారు.

తాత్పర్యం: ప్రజలెవరినీ రాజు గట్టిగా నమ్మకూడదు. అపుడే తననూ, తన సంపత్తినీ సంరక్షించుకొనగలుగుతాడు. అని బృహస్పతివంటి పెద్దలు రాజనీతులు ఉపదేశిస్తుంటారు.

కణికుఁడు శత్రుంజయున కుపదేశించిన హితవచనముల ప్రకారము (సం. 12-138-4)

వ. అవ్వాక్యంబు లాదరింపవలయు నని పల్కి వెండియు భీష్ముండు పాండవాగ్రజుతో 'సౌవీరపతి యగు శత్రుంజయునకు భారద్వాజ వంశవర్యుండైన కణికుండుపదేశించిన హితవచనంబులు గలవు; వానిం జెప్పెద నాకర్ణింపు మని యిట్లనియె. 267

ప్రతిపదార్థం: ఆ+వాక్యంబులు= ఆ మాటలు; ఆదరింప వలయును= పాటించాలి; అని పల్కి= అని చెప్పి; వెండియున్= మళ్ళీ; భీష్ముండు= భీష్ముడు; పాండవ+అగ్రజుతోన్= పాడవులలో పెద్దవాడైన ధర్మరాజుతో; సౌవీరపతిఅగు= సౌవీర దేశపు రాజయిన; శత్రుంజయునకున్= శత్రుంజయుడికి; భారద్వాజ వంశవర్యుండు+ఐన= భారద్వాజ వంశంలో ఉత్తముడైన; కణికుండు; ఉపదేశించిన= బోధించిన; హితవచనంబులు= మేలు పలుకులు; కలవు= ఉన్నాయి; వానిన్+చెప్పెదన్= వాటిని చెప్పుతాను; ఆకర్ణింపుము+అని= ఆలకించుమని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ నీతిమాటలు ఆదరించు' మంటూ భీష్ముడు ధర్మరాజుతో మళ్ళీ ఈ విధంగా అన్నాడు: 'సౌవీరదేశపు రాజు శత్రుంజయుడికి, భారద్వాజ వంశ శ్రేష్ముడైన కణికుడు ఉపదేశించిన నీతి వాక్యాలను చెప్పుతాను ఆలకించుము.

క. వికచముఖుఁ డగుచు శాత్రవు । లకు హితు లగునట్టి వారలం గని భూపా
లకుఁ డెడ్డ కత్తెరయు నా । లుక బెల్లమునై మనంబులుం గన వలయున్. 268

ప్రతిపదార్థం: భూపాలకుఁడు= రాజు; వికచముఖుఁడు+అగుచున్= విప్పారిన మొగం కలవాడవుతూ; శాత్రవులకున్= పగవారికి; హితులు= ఆప్తులు; అగునట్టి వారలన్= అయినట్టి వారిని; కని= కనిపెట్టి చూచి; ఎడ్డ= హృదయం; కత్తెరయున్= కత్తెరవలె కరకుదనమున్నూ; నాలుక బెల్లమును+ఐ= మాటలు తీపిన్నీ కలిగి; మనంబులున్= మనస్సులను; కనవలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: నవ్వు మొగంతో రాజు పగవాళ్ళకు హితులైనవాళ్ళను కనిపెట్టాలి. వాళ్ళతో తీయని మాటలు మాట్లాడుతూ మనసులో కరుగ్గా ఉండాలి. వాళ్ళ మనస్సులను కనుక్కొనాలి.

ఉ. జ్ఞాతుల నమ్మి తోడుకొని శత్రుల నోర్చి యహీన రాజ్యముం
బ్రీతి యెలర్పఁ జేకొనిన పిమ్మట సౌఖ్య సమృద్ధి తోషిత
జ్ఞాతినికాయుఁడై మది నజస్రము నమ్మక సర్పసంయుతం
బై తనరారు రమ్య నిలయంబున నున్నటు లుండగాఁ దగున్.' 269

ప్రతిపదార్థం: జ్ఞాతులన్= దాయాదులను; నమ్మి= నమ్ముకొని (విశ్వసించి); తోడుకొని= వెంట తీసికొని వెళ్ళి; శత్రులన్= పగవాళ్ళను; ఓర్చి= ఓడించి; అహీన రాజ్యమున్= గొప్ప సామ్రాజ్యాన్ని; ప్రీతి ఎలర్పన్= సంతోషంగా; చేకొనిన పిమ్మట= చేజిక్కించుకొన్న తరువాత; సౌఖ్యసమృద్ధి= సుఖపరంపరచేత; తోషిత= సంతోషపెట్టిన; జ్ఞాతినికాయుఁడు+ఐ= దాయాదుల సముదాయం కలవాడై; మదిన్= మనస్సులో; అజస్రము= ఎప్పుడూ; నమ్మక= నమ్మకుండా; సర్పసంయుతంబు+ఐ= పాముతో కూడినదై; తనరారు= శోభిల్లే; రమ్య నిలయంబునన్= చక్కటి మేడలో; ఉన్నటులు= ఉన్న విధంగా; ఉండగాన్+తగున్= ఉండటం ఒప్పుతుంది.

తాత్పర్యం: దాయాదులను నమ్మి, వాళ్ళతోడుగా శత్రువులను జయించాలి. రాజ్యం సంపాదించిన తరువాత వాళ్ళకు సకలసౌఖ్యాలను సమకూర్చి సంతోషింపచేయాలి. కాని, మనస్సులో మాత్రం వాళ్ళను ఎప్పుడూ నమ్మకుండా ఉండాలి. పామున్న భవనంలో ఉన్నట్టు ఎపుడూ ఏమరక ఉండాలి'.

వ. అని మఱియును. 270

తాత్పర్యం: అని మాట్లాడి భీష్ముడు మళ్ళీ - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'వినుము తఱి వేచి రిపుమూఁ । పున మోవఁగవలయు సమయముం గనికొని గ్ర
క్కునఁ గడవ శిలాస్థలి వై । చిన చాడ్పున నేర్పు మెఱయఁ జెఱుచుట యొప్పున్. 271

ప్రతిపదార్థం: వినుము= వినవలసింది; తఱి వేచి= సమయం చూచి; రిపున్= శత్రువును; మూఁపునన్= భుజం మీద పెట్టుకొని; మోవఁగవలయున్= మొయ్యాలి; సమయమున్= తగిన కాలాన్ని; కనికొని= తెలిసికొని; గ్రక్కునన్= వెంటనే; కడవ= కుండను; శిలాస్థలిన్= రాతినేలమీద; వైచిన చాడ్పునన్= పడేసినట్లు; నేర్పు మెఱయన్= చాకచక్యం కనబరచేటట్లు; చెఱుచుట= నాశనం చెయ్యటం; ఒప్పున్= తగుతుంది.

తాత్పర్యం: సమయాన్నిబట్టి శత్రువును భుజాలమీద ఎక్కించుకొని మొయ్యాలి. సమయం కనిపెట్టి రాతినేలమీద కుండను ఎత్తి బ్రద్దలు కొట్టినట్లు నేర్పుగా శత్రువును నశింపచేయాలి.

క. పానము జూదము వేఁటయు । మానినియును భూపతులకు మధుర వినోద
స్థానము లగు నైనను దగ । వైన విధము దక్కఁ దగుల మాపద దెచ్చున్. 272

ప్రతిపదార్థం: పానము= త్రాగుడు; జూదము= జూదమూ; వేఁటయున్= వేటా; మానినియును= స్త్రీయున్నూ; భూపతులకున్= రాజులకు; మధుర= సొంపైన; వినోదస్థానములు+అగున్= వేడుకలకు ఆటపట్టవుతాయి; ఐనను= అయినా; తగులము= వీటితో సంబంధం; తగవు+ఐన విధము= తగినట్టి రీతిని; తక్కన్= తప్పిపోతే; ఆపద= విపత్తును; తెచ్చున్= తెచ్చిపెట్టుతుంది.

తాత్పర్యం: తాగటం, జూదమాడటం, వేటాడటం, ఆడవాళ్ళను కోరటం - అనేవి రాజవినోదాలకు నెలవులు. వీటితో పొత్తు మేర మీరకూడదు. మేర మీరితే మాత్రం ఆపద తెస్తుంది.

క. విని విననివాఁడ పోలెం, । గని కానని వాఁడపోలెఁ గావలయు విభుం
డొనరింపఁ దలంచిన పని । కనువగు నంతకు నభేద్యుఁడై జనుల యెడన్. 273

ప్రతిపదార్థం: విభుండు= రాజు; ఒనరింపన్+తలంచిన పనికిన్= చేయ తలపెట్టిన కార్యానికి; అనువు+అగునంతకున్= సానుకూలపడే వరకూ; అభేద్యుఁడు+ఐ= తెలిసికొనటానికిశక్యం కానివాడై; జనుల+ఎడన్= ప్రజల పట్ల; విని= విన్నప్పటికీ; విననివాఁడ పోలెన్= విననివాడివలె; కని= చూచి; కాననివాఁడపోలెన్= చూడని వాడివలె; కావలయున్= ఉండాలి.

తాత్పర్యం: రాజు తాను తలపెట్టిన పని సానుకూలపడేదాకా ఎవ్వరూ తనను తెలిసికొనలేనివాడుగా ఉండాలి. ప్రజల విషయంలో విన్నా విననివాడివలె చూచినా చూడనివాడివలె నడచుకొనాలి.

క. ఒల్లని కార్యం బాసల । నల్లన కాలగతిఁ గడపునది కాలముచేఁ
బెల్లొదవు విఘ్నములు భూ । వల్లభునకు నెపము వెట్టవచ్చుం బిదపన్. 274

ప్రతిపదార్థం: భూ వల్లభునకున్= రాజైనవాడికి; ఒల్లని కార్యంబున్= తాను ఇష్టపడని పనిని; ఆసలన్= ఆశలు చూపిస్తూ; అల్లనన్= మెల్లగా; కాలగతిన్= కాలం గడిచేటట్లు; కడపునది= వెళ్ళబుచ్చేది; పిదపన్= ఆ తరువాత; కాలముచేన్= కాలంవలన; పెల్లు ఒదవు= ఎక్కువగా కలిగే; విఘ్నములు= ఆటంకాలను; నెపము= మిషగా; పెట్టవచ్చున్= పెట్టవచ్చును.

తాత్పర్యం: రాజు తనకు ఇష్టంలేని పనిని చేస్తానని ఆశలు చూపిస్తూ కాలం గడపాలి. కాలాంతరంలో ఎదురయ్యే అడ్డంకులను సాకుగా చూపించి ఆ పనికి మొండిచెయ్యి చూపాలి.

తే. బహుళ మగు గర్వమునఁ గార్యభంగియును న । కార్యసరణియు నెఱుఁగక నార్యవృత్తిఁ
గాని తెరువున నడచుచున్నేని గురుని । నైన శాసింపఁగాఁ దగునండ్రు బుధులు. 275

ప్రతిపదార్థం: బహుళము+అగు గర్వమునన్= ఎంతో పొగరుతో; కార్యభంగియునున్= చేయదగ్గ పనితీరూ; అకార్యసరణియున్= చేయతగని పనితీరూ; ఎఱుఁగక= తెలియక; అనార్య వృత్తిన్= శిష్టులు ఒప్పని నడవడిచేత; కాని తెరువునన్= కూడని మార్గంలో; నడచుచున్ ఉన్నన్+ఏని= నడుస్తూ ఉండేటట్లయితే; గురునిన్+ఐనన్= గురువునైనా; శాసింపగాన్ తగును= దండించవచ్చు (అని); బుధులు= పెద్దలు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఇది చేయతగ్గపనీ, ఇది చేయకూడని పనీ అని పొగరుబోతుతనంతో తెలిసికొనలేని వాడిని పెద్దలు పోయే మార్గంలో కాక కానిమార్గంలో నడిచేవాడిని గురువైనా సరే తప్పక దండించాలి అంటారు పెద్దలు.

క. తెగఁ దీర్పక తగ నార్పక । తెగటార్పక కడమ కొంత ద్రిక్కఁగ నున్నన్
జగతీశ! యప్పునగ్నియుఁ । బగయును గడుఁ బెరుఁగుఁ గీడు వాటిల్లు దుదిన్. 276

ప్రతిపదార్థం: జగతీ+ఈశ!= రాజా! తెగన్ తీర్పక= మొత్తం చెల్లించకపోతే; అప్పున్= రుణం; తగన్+ఆర్పక= అంతా (తగ్గట్టుగా); చల్లార్చకపోతే; అగ్నియున్= నిప్పు; తెగటార్పక= చంపకపోతే; పగయున్= పగా; కడమ= చివరకు; కొంత త్రిక్కఁగన్+ఉన్నన్= కొద్దిగా మిగులు ఉంటే; కడున్= ఎంతో; పెరుఁగున్= పెంపొందుతుంది; తుదిన్= చిట్టచివరకు; కీడు= చెరుపు; పాటిల్లున్= కలుగుతుంది.

తాత్పర్యం: పూర్తిగా తీర్చని అప్పూ, సాంతం చల్లార్చని అగ్గీ, సమూలంగా నాశనంచేయని పగా, దిగబడి ఉంటే బాగా పెరిగిపోయి చివరకు ఆపద కలిగించక మానదు.

ఆ. మార్దవమున మృదువు మర్దింపగా వచ్చు । మార్దవమున పర విమర్దనంబుఁ
జెల్లు మార్దవమునఁ జెల్లనియది లేదు । గాన మృదువ తలఁప ఖరము సువ్వె. 277

ప్రతిపదార్థం: మార్దవమునన్= మెతకతనంతో; మృదువున్= మెత్తనైనవాడిని; మర్దింపఁగా వచ్చున్= తుడిచివేయవచ్చు; మార్దవమునన్= మెతకతనంచేత; పర విమర్దనంబున్= శత్రు సంహారమూ; చెల్లున్= జరుగుతుంది; మార్దవమునన్= మెతకదనంచేత; చెల్లని అదిలేదు= నెరవేరనిది ఉండదు; కానన్= కాబట్టి; మృదువు+అ= మెత్తదనమే; తలఁపన్= ఆలోచించగా; ఖరము సువ్వె= వాడిఅయినది సుమా.

తాత్పర్యం: మృదుత్వంతో మెత్తనివాడిని తుడిచివేయవచ్చును. మృదుత్వంతో శత్రువులను చంపవచ్చును. మృదుత్వంతో సాధించరానిదంటూ ఉండదు. కాబట్టి మృదుత్వమే అన్నిటిని మించి వాడిఅయినది సుమా!

వ. అనిన విని యజాతశత్రుండు 'ధర్మంబు నడవక యవగ్రహాది దురితంబులు దుస్తరంబు లయిన నాహారంబులు దొరకొనని యట్టిచో ద్విజాతు లేమిభంగిం బ్రాణంబులు రక్షించుకొను వా?' రనుటయు నాపగానందనుండు 'విశ్వామిత్ర చండాల సంవాదం బను నితిహాసంబు భవత్ప్రశ్నంబునకు నుత్తరంబై యుండు; నాకర్ణింపు' మని యిట్లనియె. 278

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; అజాతశత్రుండు= ధర్మరాజు; ధర్మంబు= న్యాయం; నడవక= ప్రవర్తించక; అవగ్రహ+ఆది= కరువు మొదలైన; దురితంబులు= పాపాలు; దుస్తరంబులు= దాటరానివి; అయినన్= అయితే; ఆహారంబులు= తినేతిళ్ళు; దొరకొనని+అట్టిచోన్= దొరకనపుడు; ద్విజాతులు= రెండు పుట్టుకలుగలవారు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు= వీరికి 'ఉపనయనం' రెండో పుట్టుక); ఏమి భంగిన్= ఏ విధంగా; ప్రాణంబులు= ఊపిరులు; రక్షించుకొనువారు= కాపాడుకొనేవారు; అనుటయున్= అనగానే; ఆపగానందనుండు= భీష్ముడు; విశ్వామిత్ర= విశ్వామిత్రుడికీ; చండాల= చండాలుడికీ (జరిగిన); సంవాదంబు=

సంభాషణ; అను= అనే; ఇతిహాసంబు= పరంపరగా చెప్పుకొంటున్న వెనుకటి కథ; భవత్ప్రశ్నంబునకున్= నీవు అడిగిన దానికి; ఉత్తరంబు+ఐ= సమాధానమై; ఉండున్= ఉంటుంది; ఆకర్ణింపుము= వినుము; అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అదంతా విన్న ధర్మరాజు 'ధర్మం సరిగ్గా నడవకపోతే తప్పించుకొనలేని కరువుకాటకాది పాపాలు కలుగుతాయి. కనుక తిండి దొరకదు. బ్రాహ్మణాదులైన మూడు వర్ణాలూ ఎట్లా మనగల్గుతాయో చెప్పు'మన్నాడు. దానికి భీష్ముడు 'విశ్వామిత్రుడికీ మాలవాడికీ మధ్య నడచిన సంవాద' గాథను వింటే నీవడిగిన సందేహం తీరిపోతుంది. అదే నీ ప్రశ్నకు సరైన సమాధానం' ఆలకించుమంటూ ఇట్లా అన్నాడు:

విశ్వామిత్ర చండాల సంవాదము (సం. 12-139-12)

క. ఏపారి తొల్లి త్రేతా । ద్వాపరముల సంధి నొక్క వఱపు ధరిత్రీ
తాపంబుఁ జేసె జనముల । పాపంబున వత్సరములు పండ్రెం డధిపా! 279

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; తొల్లి= మునుపు; త్రేతా ద్వాపరముల సంధిన్= త్రేతా ద్వాపరయుగాలు కూడినపుడు; ఒక్కవఱపు= ఒక కరువు; ఏ పారి= అధికమై; జనముల పాపంబునన్= జనం చేసికొన్న పాపంవలన; వత్సరములు పండ్రెండు= పన్నెండేళ్ళపాటు; ధరిత్రీ= భూమికి; తాపంబున్+చేసెన్= పీడ కలిగించింది.

తాత్పర్యం: ధర్మరాజా! త్రేతా ద్వాపరయుగాల సంధికాలంలో జనం చేసికొన్న పాపంకొద్దీ ఒక కరువు వచ్చింది. ఇది ప్రజలను పన్నేండేళ్ళపాటు పీడించింది.

సీ. ఏఱులుఁ జెఱువులు నివురఁ గర్సనము లెం । దును జెడఁ, దరులతాదులును గమర,
భూమియుఁ బసమాల, గోమహిషాది జీ । వధనంబు వొలియ, భూవరులు మేర
దప్పి లోకములోని ధాన్యముల్ గొన, నధ । ర్మం బంతకంతకుఁ బ్రబ్బ నధికు
లనదలఁ జెఱుపంగ, యాగముల్ దేవతా । పూజలు నెడలంగ, భూసుర ప్ర

ఆ. ముఖములైన వర్ణముల చొప్పు దప్ప, నా । హార రహితజనము లచట నచటఁ
బడఁగఁ జూడ ఘోర భంగిగాఁ దఱిచయ్యె । డొక్కలున్న వారి కెక్క భయము. 280

ప్రతిపదార్థం: ఏఱులున్= నదులూ; చెఱువులున్= మడుగులూ; ఇవురన్= అడుగంటి పోగా; కర్సనములు= సేద్యాలు; ఎందును= అన్నిచోట్లా; చెడన్= పాడుపడగా; తరులతా+ఆదులును= చెట్లు, తీగలూ మొదలైనవి; కమరన్= ఎండిపోగా; భూమియున్= నేలకూడా; పస తూలన్= సారం పోగా; గో+మహిష+ఆది= ఆవులూ గేదెలూ మొదలైన; జీవధనంబు= పశుసంపద; పొలియన్= చచ్చిపోగా; భూవరులు= రాజులు; మేరదప్పి= మర్యాద మీరి; లోకములోని= రాజ్యంలోని; ధాన్యముల్= వడ్లు, మినుములు, పెసలు మొదలైన ధాన్యాలు; కొనన్= కొల్లకొట్టగా; అధర్మంబు= అవినీతి; అంతకున్+అంతకున్= రాను రాను; ప్రబ్బన్= విస్తరిల్లగా; అధికులు= బలవంతులు; అనదలన్= బలహీనులను; చెఱుపంగన్= బాధపెట్టగా; యాగముల్= యజ్ఞాలు; దేవతా పూజలున్= దేవతార్చనలూ; ఎడలంగన్= దూరం అవుతుండగా; భూసుర ప్రముఖులు+ఐన= బ్రాహ్మణులు మొదలైన; వర్ణముల; చొప్పు=తీరు; తప్పన్= తప్పిపోగా; ఆహార రహిత జనములు= తిండిలేని జనాలు; అచటన్+అచటన్= అక్కడక్కడ; పడఁగన్= పడిపోగా, చచ్చిపోగా; ఉన్నవారికిన్= బ్రతికి ఉన్నవాళ్ళకు; చూడన్= చూడటానికి; భయము ఎక్కన్= భయం కలుగగా; డొక్కలు= పీనుగుల పెంటలు; తఱుచు+అయ్యెన్= దట్టంగా పడ్డాయి.

తాత్పర్యం: ఏరులూ, చెరువులూ అడుగుబట్టాయి. సేద్యం అంతా ఆగిపోయింది. చెట్లూ చేమలూ ఎండిపోయాయి. నేలంతా బీడు పడిపోయింది. గొడ్డూ గోదా చచ్చిపోయాయి. రాజులు మర్యాద తప్పి ప్రజలను కొల్లగొట్టుకొంటున్నారు. అధర్మం అంతకంతకు మితిమీరిపోయింది. బలవంతులు బలహీనులను పీడిస్తున్నారు. యజ్ఞయాగాదులూ దేవతార్చనలూ కట్టిపెట్టారు. బ్రాహ్మణాది కులాలవారు తమ కులధర్మాన్ని తప్పారు. తిండీ తిప్పలూ లేని వాళ్ళు ఎక్కడపడితే అక్కడ పడిపోయారు. బతికి ఉన్నవాళ్ళు భయపడేటట్లు ఎంతో దారుణంగా పీనుగుల కుప్పలు పేరుకుపోయాయి.

వ. అట్టి సమయమున. **281**

తాత్పర్యం: అట్లాంటి తరుణంలో.

క. మునిపతి విశ్వామిత్రుఁడు । దన యాఁకలి కెందు మెలఁగి ధైర్య మెడలి యో
దన మాంస మూల ఫలములు । జనుల నడిగి యెందుఁ బడయఁ జాలక డప్పిన్. **282**

ప్రతిపదార్థం: మునిపతి= మునిరాజు; విశ్వామిత్రుఁడు= విశ్వామిత్ర మహర్షి; తన ఆఁకలికిన్= తన ఆకలికి; ఎందున్ మెలఁగి= ఎక్కడెక్కడో తిరిగి; ధైర్యము+ఎడలి= ధైర్యాన్ని కోల్పోయి; ఓదన= అన్నం; మాంస= మాంసం; మూల= కందమూలాలు; ఫలములు= పండ్లూ; జనులన్= లోకులను, జనాన్ని; అడిగి; ఎందున్= ఎక్కడా; పడయన్+చాలక= పొందలేక; డప్పిన్= దప్పికతో.

తాత్పర్యం: మునులలో చెప్పుకొనదగ్గవాడు విశ్వామిత్రుడు. అతడు ఆకలికి తట్టుకొనలేక ఎక్కడెక్కడో తిరిగాడు. ధైర్యం సడలింది. అన్నం, మాంసం, కందమూలాలూ, పండ్లూ అన్నీ అందరినీ అడిగాడు. ఎక్కడా ఏమీ దొరకలేదు. దప్పికతో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. తూఁగాడుచుం జనువాఁడు. **283**

ప్రతిపదార్థం: తూఁగాడుచున్= తూలుతూ; చనువాఁడు= వెళ్ళువాడై.

తాత్పర్యం: తూలుతూ పోతున్నవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. పసరపు టెంప ప్రోవులును, బందుల డొక్కలుఁ, గుక్కపుట్టెలున్
ముసుఁగువడంగ భూమితలముం దఱచారఁగఁ గప్పుచున్ మదిం
బస యొక యింత లేక పెఱప్రాణులనుం బొరిగొంచు నెప్డు దు
ర్వ్యసనతఁ గూరియున్న వెలివాండ్రుర పల్లియఁ జేరి యయ్యెడన్. **284**

ప్రతిపదార్థం: పసరము= గొడ్ల; ఎమ్ము+ప్రోవులును= ఎముకల గుట్టలూ; పందుల డొక్కలున్= పందుల పొట్టలూ; కుక్కపుట్టెలున్= కుక్కల తలపెంకులూ (కపాలాలూ); ముసుఁగు+పడంగన్= కప్పుపడేటట్లు; భూమితలమున్= నేలను; తఱచు+ఆరఁగన్= బాగా దట్టంగా; కప్పుచున్= కప్పుతూ; మదిన్= మనస్సులో; పస= ప్రేమ; ఒక ఇంతలేక= కొంచెం కూడా లేకుండా; పెఱ ప్రాణులనున్= ఇతర జీవకోటిని; పొరి గొంచున్= చంపివేస్తూ; ఎప్డున్= ఎల్లప్పుడూ; దుర్వ్యసనతన్= చెడ్డ అలవాటుతో; కూరి+ఉన్న= దిగబడి ఉన్న; వెలివాండ్రుర పల్లియన్= మాలపల్లెను; చేరి= సమీపించి; ఆ+ఎడన్= ఆ పల్లెలో.

తాత్పర్యం: గొడ్ల ఎముకల గుట్టలు పడి ఉన్నాయి. పందుల డొక్కలూ, కుక్కల పుర్రెలూ నేలపరపుగా దట్టంగా కప్పివేశాయి. మనసులో కొంచెమైనా ప్రేమ లేకుండా అన్నిరకాల జంతువులను అక్కడివారు చంపేస్తుంటారు. ఇట్లాంటి దుర్వ్యసనంతో కూరుకుపోయిన మాలపల్లెకు విశ్వామిత్రుడు చేరుకొని ఆ పల్లెలో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఆర్తినొంది యిటయట పోవం జాలక నేలం బడియుండి ప్రాణంబులు వోవుట యుపేక్షింపం దగదు ప్రాణరక్షణంబ పరమధర్మం బని వితర్కించి తగునుపాయంబు చింతించువాఁ డప్పుడ చంపి తిత్తొలిచి గాలిగొన వైచిన కుక్కకడిమంబుఁ గనుంగొని. 285

ప్రతిపదార్థం: ఆర్తిన్= ఆకలితో బాధ; ఒంది= పొంది; ఇట,అట పోవన్ చాలక= ఎటూ పోను శక్తిలేక; నేలన్= నేలమీద; పడి ఉండి= సొమ్మసిల్లి; ప్రాణంబులు+పోవుట= ఊపిరిపోవటం; ఉపేక్షింపన్+తగదు= మిన్నక ఉండటం ఒప్పదు; ప్రాణరక్షణంబు+అ= ప్రాణంకాపాడుకోవటమే; పరమ ధర్మంబు= ఉత్తమ న్యాయం; అని; వితర్కించి= తలపోసి; తగన్= తగిన; ఉపాయంబున్= యుక్తిని; చింతించువాఁడు= ఆలోచించుకుంటున్నవాడు; అప్పుడు+అ= ఆప్పుడే; చంపి= ప్రాణంతీసి; తిత్తి ఒలిచి= తోలుతీసి; గాలిగొన వైచినన్= గాలి తగిలేటట్లు ఆరబెట్టిన; కుక్క కడిమంబున్= కుక్క మాంసాన్ని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: బాధపడుతూ ఇటు అడుగు తీసి అటువేయలేక నేలమీద సొమ్మసిల్లి పడిపోయాడు. 'ఊపిరి పోతుంటే ఊరుకొనకూడదు, అనుకొన్నాడు. 'ప్రాణం నిలబెట్టుకొనటమే ఉత్తమ ధర్మం' అని భావించాడు. దానికి తగ్గ ఉపాయాన్ని ఆలోచించుకొంటూ అపుడే చంపి తోలు తీసి, గాలిలో ఆరబెట్టిన కుక్కమాంసాన్ని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఇది దప్ప నిప్పు డియ్యెడ । నొదవదు ప్రాణంబు గావ నొం డొకఁ; డిదియున్
మది నూహింపఁగ మ్రుచ్చిమి । నొదవించి కొనంగవలసియున్నది నాకున్. 286

ప్రతిపదార్థం: ఇది తప్పన్= ఈ కుక్కమాంసం తప్ప; ఇప్పుడు= ఈ సమయంలో; ఈ+ఎడన్= ఇక్కడ; ప్రాణంబు+కావన్= ప్రాణం రక్షించుకొనటానికి; ఒండొకఁడు= మరొకటి; ఒదవదు= దొరకదు; ఇదియున్= ఈ మాంసం కూడా; మదిన్= మనస్సులో; ఊహింపఁగన్= ఆలోచించుకొనగా; మ్రుచ్చిమిన్= దొంగతనంచేత; ఒదవించి కొనంగవలసి+ఉన్నది= చిక్కించుకొనవలసి ఉన్నది.

తాత్పర్యం: 'ఇపు డిక్కడ ప్రాణం కాపాడుకొనటానికి కుక్కమాంసం తప్ప మరొకటి దొరకదు. ఇదైనా దొంగిలించి దక్కించుకొనవలసిందే.

తే. ప్రాణములు వోవకుండంగఁ బరిహరింప । నొం డుపాయ మెయ్యదియు లేకుండెనేని
మ్రుచ్చిమియు ధర్మ మగు; నధముని ధనంబు । గొనుట యెందును ముఖ్యమై చనుట గలదు. 287

ప్రతిపదార్థం: ప్రాణములు= ఉసురు; పోవక+ఉండంగన్= పోకుండా; పరిహరింపన్= తప్పించుకొనేందుకు అంటే ప్రాణాలు నిలుపుకొనటానికి; ఒండు+ఉపాయము= మరొక సాధనం; ఏ+అదియున్= ఏదీ; లేక+ఉండెనేని= ఉండక పోయినట్లయితే; మ్రుచ్చిమియున్= దొంగతనం కూడా; ధర్మము+అగున్= న్యాయమే అవుతుంది; అధముని= నీచుడి; ధనంబున్+కొనుట= సొమ్మును తీసికొనటం; ఎందును= ఎక్కడైనా; ముఖ్యమై చనుట= ప్రధానమై ఒప్పటం; కలదు= ఉన్నది.

తాత్పర్యం: ప్రాణం పోకుండా తప్పించుకొనేందుకు మరే ఉపాయం లేనపుడు దొంగతనంచేసి ఊపిరి నిలుపుకొనటం ధర్మమే అవుతుంది. అపుడు నీచుడి సొమ్మైనా పుచ్చుకొనటం ప్రశస్తమైనదే అవుతుంది.

వ. కావున చండాలధనంబగు సారమేయ మాంసం బపహరించి ప్రాణహాని పరిహరించి కొందు' నని నిశ్చయించియుండ నర్ధరాత్రం బగుటయుఁ జండాలురెల్ల నిద్రింపనల్లన లేచిచని యమ్మాంసంబు వట్టి తిగిచిన నచ్చేరువ నిద్రించు చండాలుండు విధివశంబున మేలుకని 'నీ వెవ్వండవు? మాంసంబు మ్రుచ్చిలించెదవు? నిద్రపోవంజుమ్ము నిన్నుఁ బొరిగొనియెద' ననుటయు భయపడి గ్రక్కున నమ్మునిపతి 'యేను విశ్వామిత్రుండ'నని పలికిన, వాఁడు వినయంబున శయ్య డిగ్గి కరుణం గన్నీ రొలుకం బ్రణమిల్లి కేలు మొగిడ్చి 'మహాత్మా! నీతలం పేమి యని యడిగిన నతండు సాంత్వనవచనంబుల నిట్లనియె. 288

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; చండాల ధనంబు+అగు= చండాలుడి సొమ్ము అయిన; సారమేయ మాంసంబున్= కుక్కమాంసాన్ని; అపహరించి= కాజేసి; ప్రాణహానిన్= ప్రాణానికి వచ్చిన ముప్పును; పరిహరించికొందును= తొలగించుకొంటాను; అని నిశ్చయించి= అని నిర్ణయించుకొని; ఉండన్= ఉండగా; అర్ధరాత్రంబు+అగుటయున్= నడిరేయి అవటంవలన; చండాలురు+ఎల్లన్= చండాలురందరూ; నిద్రింపన్= నిద్రపోగా; అల్లన లేచి= మెల్లగా లేచి; చని= వెళ్ళి; ఆ+మాంసంబున్= ఆ మాంసాన్ని; పట్టి తిగిచినన్= పట్టి లాగగా; ఆ+చేరువన్= ఆ దగ్గరలోనే; నిద్రించు= నిద్రపోయే, కునుకుతీస్తున్న; చండాలుండు= మాలవాడు; విధివశంబునన్= అదృష్టవశాన; మేలుకని= నిద్రలేచి; నీవు; ఎవ్వండవు= ఎవ్వడివి; మాంసంబున్= మాంసాన్ని; మ్రుచ్చిలించెదవు= దొంగిలిస్తున్నావు; నిద్ర+పోవన్+చుమ్ము= నిద్రపోను సుమా; నిన్నున్= నిన్ను; పొరికొనియెదన్= చంపుతాను; అనుటయున్= అనగానే; భయపడి= భీతి చెంది; గ్రక్కునన్= వెంటనే; ఆ+మునిపతి= ఆ మునిరాజు; ఏను= నేను; విశ్వామిత్రుండను= విశ్వామిత్ర మహర్షిని; అని పలికినన్= అని పలుకగానే; వాఁడు= ఆ చండాలుడు; వినయంబునన్= అణకువతో; శయ్యడిగ్గి= మంచం దిగి; కరుణన్= జాలితో; కన్నీరు ఒలుకన్= కంటనీరు కారుస్తూ; ప్రణమిల్లి= మొక్కి; కేలు మొగిడ్చి= చేతులు జోడించి; మహాత్మా!= మహనీయా!; నీతలంపు= నీ ఆలోచన; ఏమి?= ఏమిటి?; అని అడిగినన్= అని అడగగా; అతండు= విశ్వామిత్రుడు; సాంత్వనవచనంబులన్= మెల్లని మాటలతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కాబట్టి 'చండాలుడి సొత్తు అయినా సరే ఈ కుక్కమాంసాన్ని దొంగిలించి చావును తప్పించుకొంటా' నని నిర్ణయించుకొన్నాడు. అప్పటికే అర్ధరాత్రి అయింది. మాలపల్లె అంతా నిద్రలో మునిగిపోయింది. ఆ సమయంలో మెల్లగా లేచి వెళ్ళి ఆ మాంసాన్ని పట్టి గుంజాడు. ఆ పక్కనే కునుకుతీస్తున్న మాలవాడు అనుకోకుండా మేల్కొన్నాడు. 'నీ వెవ్వడివి? మాంసాన్ని దొంగిలిస్తున్నావు. నేను నిద్రపోవటంలేదు సుమా! నిన్ను చంపేస్తాను' అనగానే విశ్వామిత్రముని భయపడ్డాడు. 'నేను విశ్వామిత్రుడిని' అన్నాడు. అది విన్న చండాలుడు ఎంతో వినయంగా మంచం దిగాడు. జాలిపడి కంటతడిపెట్టుకొంటూ చేతులెత్తి మ్రొక్కాడు. 'మహాత్మా! ఇట్లా చేయటంలో నీ ఉద్దేశం ఏమిటి' అన్నాడు. దానికి ఆ ముని నెమ్మదిగా ఇట్లా చెప్పాడు.

చ. 'దరికొను నాఁకలిం దనువిదాహము పుట్టినఁ బ్రాణహానికిం
బరిహరణంబు సేఁత కిది పాపమ యైనను గుక్కనంజుఁడే
భరపడి మ్రుచ్చిలించెద; విభావసుఁ డెంత శుచిత్వ సంపదం
బొరసియు సర్వభక్షకతఁ బొందును; నన్నును జూడు మట్లుగన్.' 289

ప్రతిపదార్థం: దరికొను= మండే; ఆఁకలిన్= ఆకలిచేత; తను విదాహము పుట్టినన్= శరీరం దహించుకుపోతూండగా; ప్రాణహానికిన్= ఊపిరి పోకుండా; పరిహరణంబు+చేఁతకున్= ఆపుకొనాలనే కోరికవలన; ఇది= ఈ కుక్కమాంసం తినటం;

పాపము+ఐనన్= పాతకమే అయినా; ఏన్= నేను; భరపడి= ఒప్పుకొని; కుక్కనంజుఁడు= కుక్కమాంసాన్ని; మ్రుచ్చిలించెదన్= దొంగిలిస్తున్నాను; విభావసుఁడు= అగ్ని; ఎంత శుచిత్వ సంపదన్= ఎంతో పరిశుద్ధమైన సంపత్తిని; పొరసియున్= పొంది ఉన్నా; సర్వభక్షకతన్= అన్నీ తినేవాడి భావాన్ని; పొందును= పొందుతాడు; అట్లుగన్= అట్లాగే; నన్నును= నన్నుకూడా; చూడుము= చూడుము.

తాత్పర్యం: 'ఆకలిమంటతో శరీరం దహించుకుపోతూ ఉన్నది. ప్రాణం నిలుపుకొనాలనే కోరికవలన కుక్కమాంసం తినటం పాపమే అయినా ఇష్టపడే ఈ కుక్కమాంసాన్ని దొంగిలిస్తున్నాను. అగ్ని పావనుడే అయినా అన్నీ తింటుంటాడు కదా! అట్లాగే నన్ను భావించుము'.

వ. అనిన విని చండాలుండు. **290**

ప్రతిపదార్థం: అనినన్= అట్లా ఆ ముని చెప్పగా; విని= ఆలకించి; చండాలుండు= మాలవాడు.

తాత్పర్యం: విశ్వామిత్రుడు చెప్పిన మాటలు ఆలకించిన మాలవాడు - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'కుక్క మృగములలో నెల్లఁ గుత్సితంబు; । దీనిఁ దిని ధర్మమున కేల హాని సేయ?
నొం డుపాయంబు వెదకి కొ మ్ముజ్జ్వలాత్మ!' । యనుడు వానికి ముని యిట్టు లనియె నధిప! **291**

ప్రతిపదార్థం: అధిప!= స్వామి!; మృగములలోన్+ఎల్లన్= జంతువులలోకెల్ల; కుక్క; కుత్సితంబు= నీచమైనది; దీనిన్= కుక్కమాంసాన్ని; తిని; ధర్మమునకున్= పుణ్యానికి; హాని+చేయన్+ఏల?= ముప్పు తేవటం ఎందుకు?; ఉజ్జ్వల+ఆత్మ!= మహాత్మా!; ఒండు+ఉపాయంబున్= మరొక ఉపాయం; వెదకి కొమ్ము= వెతుక్కో; అనుడున్= అనగానే; వానికిన్= ఆ చండాలుడితో; ముని= విశ్వామిత్రుడు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'జంతువు లన్నిట్లోకి కుక్క చాలా నీచజంతువు. కుక్కమాంసాన్ని తిని ధర్మానికి ముప్పు కలిగిస్తావు ఎందుకు? మ రేదైనా ఉపాయాన్ని వెదకుము' అనగానే చండాలుడితో విశ్వామిత్రుడు ఈ విధంగా చెప్పాడు.

క. 'వినుఁ బ్రహ్మవహ్ని నాకుం । బెను ప్రాపై యుండ నేను వెఱతునె యెట్లై
ననుఁ బోవనీక ప్రాణము । దనువున నిల్పుటయ చూవె ధర్మం బరయన్. **292**

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము; బ్రహ్మవహ్ని= బ్రహ్మ సంబంధమైన అగ్ని; నాకున్= నాకు; పెను ప్రాపు+ఐ+ఉండన్= పెద్ద అండగా ఉండగా; నేను; వెఱతునె?= భయపడతానా?; అరయన్= విచారించగా; ఎట్లు+ఐననున్= ఎట్లాగైనా; ప్రాణమున్+పోవనీక= ఊపిరిని పోనీయకుండా; తనువునన్= బొందిలో; నిలుపుటయ= ఉంచటమే; ధర్మంబు+చూవె!= న్యాయం సుమా!

తాత్పర్యం: 'బ్రహ్మాగ్ని నాకు పెద్ద అండగా ఉండగా నేను భయపడను. ఎట్లాగైనా ఈ బొందిలో ప్రాణం నిలబెట్టుకొనటమే న్యాయం సుమా!

ఆ. బ్రదికియున్న నేఁ దపంబున విద్యను । బాచికొనఁగ నేర్తుఁ బాతకంబు;
నట్టు లగుట జీవితాధార మైన యీ । నంజుఁ డిప్పు డెట్లు నమల కుడుగ. **293**

ప్రతిపదార్థం: బ్రదికి+ఉన్నన్= జీవించి ఉంటే; ఏన్= నేను; పాతకంబున్= ఈ పాపాన్ని; తపంబునన్= తపోబలంవలన; విద్యను= బ్రహ్మజ్ఞానం వలన; పాచికొనఁగన్+నేర్తున్= పోగొట్టుకొంటాను; అట్టులు+అగుటన్= అట్లా అవటంవలన; ఇపుడు= ఇప్పుడు;

జీవిత+ఆధారము+ఐన= బ్రతకటానికి మూలం అయిన; ఈ నంజుడు= ఈ మాంసాన్ని; ఎట్లున్= ఎట్లాగైనా; నమలక= తినక; ఉడుగన్= మానను.

తాత్పర్యం: నేను ప్రాణాలతో ఉంటే ఈ పాపాన్ని తపస్సువలన, జ్ఞానంవలన పోగొట్టుకొనగలను. కనుక ప్రాణాధారం అయిన ఈ మాంసాన్ని తినకుండా ఉండను'.

చ. అనుటయు నంత్యజుండు నగి 'యట్టి విధం బధమంబు గాక నె
ట్టన యది ధర్మమే? కటకటా! మిము బోంట్లకు నిట్లు సేయఁగాఁ
జనునొకొ?' యన్న నమ్ముని 'ప్రశస్తుఁ డగస్త్యుఁడు దైత్యు మాంసముం
దినఁడె? నశించెనే యతని తేజముఁ బెంపును నంతనుండియున్?' 294

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; అంత్యజుండు= కడజాతివాడు; నగి= నవ్వి; అట్టివిధంబు= కుక్కమాంసం తినటం అనేది; అధమంబు+కాక= నీచమైనది కాక; నెట్టన= పైపెచ్చు; అది ధర్మమే?= అది పాడియా?; కటకటా!= అయ్యయ్యో!; మిము బోంట్లకున్= మీవంటివాళ్ళకు; ఇట్లు= ఇట్లా; చేయఁగాన్= చేయటం; చనునొకొ?= తగుతుందా?; అన్నన్= అనగానే; ఆ+ముని= ఆ విశ్వామిత్రుడు; ప్రశస్తుఁడు= పేరుపొందిన; అగస్త్యుఁడు= అగస్త్యమహర్షి; దైత్యు మాంసమున్= రాక్షసుడి మాంసాన్ని; తినఁడె?= తినలేదా?; అంతన్+ఉండియున్= అప్పటినుండి; అతని తేజమున్= అతడి తేజస్సు; పెంపున్= గౌరవమున్నూ; నశించెనే?= చెడినాయా?

తాత్పర్యం: విశ్వామిత్రుడి మాటలు విన్న చండాలుడు నవ్వి 'అయ్యో! అది నీచమైన పనికాక న్యాయమైనదా! మీ బోటి మునిసాములు ఇట్లా చేయవచ్చా?' అన్నాడు. దానికి ఆ ముని 'ఎన్నో పొగడ్తలు పొందిన అగస్త్యముని రాక్షసమాంసం తినలేదా! ఆనాటినుండి ఆ ముని తేజస్సుకు, గౌరవానికీ ఏమైనా కొరత వచ్చిందా?'

వ. అనవుడు వాఁ డి ట్లనియె. 295

ప్రతిపదార్థం: అనవుడున్= ముని అనగానే; వాఁడు= ఆ చండాలుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: విశ్వామిత్రుడి మాటలు విన్న చండాలుడు ఈ విధంగా అన్నాడు.

క. 'పరహితము సేయఁ బూనిన । పురుషుఁడు పాపంబు సేసి పొందఁడు కీడుం;
బరమమునియగు నగస్త్యుఁడు । పరోపకారార్థ కృతి నభవ్యుం డగునే?' 296

ప్రతిపదార్థం: పరహితము= ఇతరులకు మేలు; చేయన్+పూనిన= చేయాలని పూనుకొన్న; పురుషుఁడు= మనిషి; పాపంబుచేసి= పాతకం చేసి; కీడున్= చేటును; పొందఁడు= అనుభవించడు; పరమముని+అగు= మునిముఖ్యు డయిన; అగస్త్యుఁడు= అగస్త్యముని; పరోపకారార్థ కృతిన్= ఇతరుల కొరకు చేసే మేలు పనివలన; అభవ్యుండు= దుష్టుడు; అగునే?= అవుతాడా?

తాత్పర్యం: 'మరొకడికి ఉపకారం చేయాలనుకొన్నవాడు పాపం చేసినా వాడికి ఏ కీడూ అంటకపోగా పరమముని అవుతాడు. లోకోపకారంగా చేసిన పనులవలన అగస్త్యముని దుష్టుడవుతాడా?' (కాడని భావం.)

క. నావుడు మదాత్మ బ్రాహ్మణ । తా విద్వత్తాస్పదంబు; దానికిఁగా నే
నీ విధి యొనరించుట పా । పావేశము లేదు; దీని కడ్డపడకువే! 297

ప్రతిపదార్థం: నావుడున్= అనగానే; మత్+ఆత్మ= నా దేహం; బ్రాహ్మణతా= బ్రాహ్మణ ధర్మానికీ; విద్వత్తా= బ్రహ్మజ్ఞానానికీ; ఆస్పదంబు= నిలయం; దానికిన్+కాన్= ఆ దేహం కొరకే; నేను; ఈ విధి= ఈ పని; ఒనరించుట= చేయటం; పాప+ఆవేశము లేదు= పాపానికి ప్రవేశం లేదు; దీనికిన్= మాంసం తినటానికి; అడ్డుపడకువే= ఆటంకపెట్టకుమా.

తాత్పర్యం: 'నా దేహం అటు బ్రాహ్మణధర్మానికీ ఇటు బ్రహ్మజ్ఞానానికీ ఆలవాలమైనది. కనుక ఆ దేహంకొరకే నేను ఈ పని చేయాలనుకొన్నాను. ఏ పాపం చొరబారదు. ఈ మాంసం తినటానికి నీవు అడ్డం పడకుము'.

క. అని ముని పల్కిన నంత్యజుఁ । డను 'మాంసము విడువ నోప కనుటగఁ దలఁపం
జనునె? భవదీయ తేజో । ధన హానికిఁ గరుణ పుట్టదా యెవ్వరికిన్?' 298

ప్రతిపదార్థం: అని ముని పల్కినన్= అని విశ్వామిత్రుడు మాటాడగానే; అంత్యజుఁడు= కడజాతివాడు; అనున్= ఇట్లా అన్నాడు; మాంసమున్= మాంసాన్ని; విడువన్= వదలుకొనటానికి; ఓపక= ఇష్టంలేక; అనుటగన్= అన్నట్లుగా; తలఁపన్+చనునే= ఆలోచించటం తగుతుందా; భవదీయ= నీదైన; తేజోధన= తేజస్సంపత్తియొక్క; హానికిన్= నష్టపోవటానికి; ఎవ్వరికిన్= ఎవరికైనా; కరుణ పుట్టదా?= కనికరం కలుగదా?

తాత్పర్యం: విశ్వామిత్రుడితో అంత్యజుడు ఈ విధంగా అన్నాడు. 'మాంసం వదలుకొనటం ఇష్టంలేక ఇట్లా అంటున్నా ననుకొనకుము. నీ తేజస్సంపద నష్టమవుతుంటే ఎవరికైనా జాలిపుట్టదా?'

వ. అనవుడు గాధినందనుండు. 299

ప్రతిపదార్థం: అనవుడున్= చండాలుడు చెప్పగానే; గాధినందనుండు= గాధి కుమారుడైన విశ్వామిత్రుడు.

తాత్పర్యం: అని పలికిన చండాలుడితో విశ్వామిత్రుడు - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'కరుణ గలవేని బ్రాణంబు గాచికొనఁగఁ । దలఁచు నాకు నిమ్మాంస మి మ్మలఘుచరిత
యట్టు లైన మ్రుచ్చిమియు లే దనృతమెడలి । పడయు వస్తువు సేయదు పాతకంబు.' 300

ప్రతిపదార్థం: అలఘుచరిత!= మహాత్మా!; కరుణ కలవేని= జాలి ఉన్నట్లయితే; ప్రాణంబు+కాచికొనఁగన్= ప్రాణం కాపాడుకొనాలని; తలఁచు= ఆలోచించే; నాకున్= నాకు; ఈ+మాంసము= ఈ కుక్కమాంసాన్ని; ఇమ్ము= ఇవ్వలసినది; అట్టులు+ఐనన్= అట్లా అయితే; మ్రుచ్చిమియున్= దొంగతనమూ; లేదు= ఉండదు; అనృతము= అబద్ధం; ఎడలి= వదలి; పడయు= పొందే; వస్తువు= పదార్థం; పాతకంబు చేయదు= ఎట్లాంటి పాపాన్ని కలిగించదు.

తాత్పర్యం: 'ఓ మహాత్మా! నా మీద నిజంగా జాలికలిగితే బ్రతకాలనుకొంటున్న నాకు ఈ కుక్క మాంసాన్ని ఇవ్వు. అట్లాగైతే నాకు దొంగతనం అంటదు. అబద్ధం ఆడకుండా పొందే వస్తువువలన ఏ పాపం కలగదు'.

వ. అనిన విని చండాలుం డి ట్లనియె. 301

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; చండాలుండు= అంత్యజుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ముని మాటలు విన్న చండాలుడు మళ్ళీ ఈ విధంగా అన్నాడు.

క. 'అతిశయిత పుణ్య దీప్తులు । ప్రతిగ్రహము నీచనరుని పాలం జేయన్
మతిఁ దలఁపఁ గూడునే? వి । శ్రుతగుణ! యే వెఱతు నింకఁ జుఱచుఱఁ బల్కన్. 302

ప్రతిపదార్థం: అతిశయిత= మీరుతున్న; పుణ్యదీప్తులు= పుణ్యంచేత ప్రకాశించేవారు; ప్రతిగ్రహమున్= దానం పుచ్చుకొనటాన్ని; నీచనరుని పాలన్+చేయన్= అధముడివలన చేయటానికి; మతి= మనస్సులో అయినా; తలఁపన్+కూడునే= మంచి చెడ్డలను ఆలోచించవచ్చునా, ఆలోచించకూడదని భావం; విశ్రుతగుణ!= వాసికెక్కినవాడా!; ఇంకన్= ఇంతకంటే; చుఱుచుఱున్= కటువుగా; పల్కన్= మాట్లాడటానికి; వెఱతున్= జంకుతాను.

తాత్పర్యం: 'ఎంతో పుణ్యవంతులైన మీ బోటివారు ఒక అధముడినుండి దానం పుచ్చుకొనాలనే ఆలోచన మనసులోనైనా అనుకొనవచ్చునా? ఓ మహర్షీ! ఇంతకంటె కటువుగా మాట్లాడటానికి జంకుతున్నాను.

వ. నీ వలచిన యట్లు సేయు' మని సారమేయమాంసం బిచ్చినఁ బుచ్చికొని ప్రాణంబులు రక్షించుకొని విశ్వామిత్రుండు సనియె; నింద్రుండు తదనంతరంబ లోకంబుల వడదేఱ వర్షించె; నంత హర్షించి యత్తపస్వివర్యుండు దపోవిశేషంబున దోషంబు నీఁగికొని మనీషిజనస్తుత్యంబగు నిత్యవ్రతంబున విలసిల్లె; నాపత్సమయసమాచారం బిట్టిద' యని చెప్పిన భీష్మునితో భూవల్లభుండు 'ధర్మసూక్ష్మ ప్రకారం బింత దురవగాహం బగునే? యీ యితిహాసం బాకర్ణించుట నాడెందంబు విషాదంబునొందె' ననవుడు నతండు ధర్మంబు బహుశాఖాసమన్వితంబై యుండు; రాజులకు నెల్లతెఱంగులు నెఱంగవలయు; విషాదం బేల?' యనవుడు నజ్జనవిభుండు. 303

ప్రతిపదార్థం: నీ వలచిన+అట్లు= నీకు ఇష్టమైనట్లు; చేయుము= చేయుము; అని; సారమేయ మాంసంబున్= కుక్కమాంసాన్ని; ఇచ్చినన్= ఇవ్వగా; పుచ్చికొని= తీసికొని; ప్రాణంబులు= ప్రాణాలు; రక్షించుకొని= కాపాడుకొని; విశ్వామిత్రుండు= విశ్వామిత్ర ముని; చనియెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబ= ఆ వెంటనే; ఇంద్రుఁడు= ఇంద్రుడు; లోకంబుల= జనుల; వడ+తేఱన్= తాపం తీరగా; వర్షించెన్= వాన కురిపించాడు; అంతన్= ఆ తరువాత; హర్షించి= సంతోషించి; ఆ తపసి వర్యుండు= ఆ ముని శ్రేష్ఠుడు; తపోవిశేషంబునన్= గొప్ప తపస్సుచేత; దోషంబున్= మాంసం తిన్న పాపాన్ని; ఈఁగికొని= పోగొట్టుకొని; మనీషిజన= విద్యావంతులచేత; స్తుత్యంబు+అగు= పొగడదగినదగు; నిత్య వ్రతంబునన్= ఎడతెరిపి లేని తపో నియమాలతో; విలసిల్లెన్= ప్రకాశించాడు; ఆపత్సమయ= విపత్కాలంలో; సమాచారంబు= వృత్తాంతం; ఇట్టిద= ఇట్లాంటిదే; అని చెప్పిన= అని పలికిన; భీష్మునితోన్= భీష్ముడితో; భూవల్లభుండు= ధర్మరాజు; ధర్మసూక్ష్మ ప్రకారంబు= ధర్మంయొక్క సరైన తీరు; ఇంత దురవగాహంబు= ఇంత దుర్బోధమైన; అగునే?= అవుతుందా?; ఈ ఇతిహాసంబు= ఈ కథను; ఆకర్ణించుటన్= వినటంవలన; నా డెందంబు= నా హృదయం; విషాదంబున్= దుఃఖాన్ని; ఒందెన్= పొందింది; అనవుడున్= అనగానే; ధర్మంబు= న్యాయం; బహుశాఖా సమన్వితంబు+ఐ= అనేక విభాగాలతో కూడుకొన్నదై; ఉండున్= ఉంటుంది; రాజులకున్= రాజులకు; ఎల్ల తెఱంగులు= అన్ని ధర్మ విధాలూ; ఎరుంగవలయున్= తెలియాలి; విషాదంబు= చింత; ఏల?= ఎందుకు?; అని బోధించినన్= అని ఉపదేశించగా; ఆ+జనవిభుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: నీకు నచ్చినట్లు చేసికొమ్ము' అంటూ ఆ చండాలుడు కుక్కమాంసాన్ని ఇచ్చాడు. దానిని పుచ్చుకొని విశ్వామిత్రుడు ప్రాణాలు కాపాడుకొని వెళ్ళిపోయాడు. ఆ వెంటనే ఇంద్రుడు ప్రజలందరి తాపం తీరేటట్లు వాన కురిపించాడు. ఆ తరువాత విశ్వామిత్రుడు తన తపోమహిమతో పాపం పోగొట్టుకొన్నాడు. విద్యావంతులంతా మెచ్చుకొనేటట్లు నిత్యవ్రతాలు చేశాడు. ఆపత్కాలంలోని సంగతి ఇట్లాంటిది - అన్నాడు భీష్ముడు. ధర్మరాజు 'సరైన ధర్మంతీరు తెలిసికొనటం ఇంతకష్టమా? ఈ తాతలనాటి కథ విన్న దగ్గరనుండి నాకు చాలా విచారంగా ఉన్నది, అన్నాడు. భీష్ముడు 'ధర్మం ఎన్నో శాఖలతో ఎన్నో తీరులలో ఉంటుంది. వాటన్నిటినీ రాజు తప్పక తెలిసికొనాలి. దానిని గూర్చి చింత ఎందుకు?' అన్నాడు. అప్పుడు ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

భీష్ముఁడు ధర్మజునకు శరణాగత రక్షణ సుకృతం బెఱిఁగించుట (సం. 12-141-4)

క. 'శరణాగతసంరక్షణ । పరులకు సమకూరు నెట్టి పాటి ఫలము? ని
ర్భరకరుణాకర! పరమా । దరమున నెఱిఁగింపు నాకు దాని తెఱంగున్. 304

ప్రతిపదార్థం: నిర్భరకరుణా+ఆకర!= నిలువెల్ల జాలికలవాడా!; శరణాగత= శరణన్న వాడిని; సంరక్షణపరులకున్= ఆదుకునే తత్వం కలవారికి; ఎట్టిపాటి= ఎంతమేర; ఫలము= ప్రయోజనం; సమకూరున్= కలుగుతుంది; నాకున్= నాకు; దాని తెఱంగున్= దాని తీరును; పరమ ఆదరమునన్= ఎంతో దయతో; ఎఱిఁగింపు= తెలియచెప్పుము.

తాత్పర్యం: 'ఓ భీష్ముడా! శరణన్నవారిని ఆదుకొనాలి అనుకొనేవారికి ఏ పాటి ఫలితం దక్కుతుంది? దాని తీరంతా నాకు దయతో చెప్పుము'.

ఆ. అనిన భీష్ముఁ డిట్టులను 'ముచుకుందుండు । నాఁగఁ బరఁగు ధరణినాయకుండు
దనుజమంత్రిచేత వినినది యొక కథ । యఖిలపాపహరణ మాచరించు. 305

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మరాజు అనగానే; భీష్ముఁడు; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; ముచుకుందుండు నాఁగన్= ముచుకుందు డనే పేరుతో; పరఁగు= ఒప్పే; ధరణి నాయకుండు= రాజు; దనుజ మంత్రిచేతన్= రాక్షసుల మంత్రి శుక్రాచార్యుడివలన; వినినది= ఆలకించినట్టిది; ఒక కథ= ఒకానొక ఇతిహాసం; అఖిల పాపహరణమున్= సమస్త పాపాలను పోగొట్టటం; ఆచరించున్= చేస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా చెప్పటం మొదలుపెట్టాడు: 'వెనుకటికి ముచుకుందు డనే రాజు, రాక్షసమంత్రి శుక్రాచార్యుడు చెప్పగా విన్న కథ ఒకటి ఉన్నది. ఆ కథ పాపాలన్నిటిని పోగొట్టుతుంది.

వ. అయ్యితిహాసంబు సెప్పెద; దాన నీ యడిగిన యర్థంబు దెలియు; నవహితుండ వై యాకర్ణింపుము.306

ప్రతిపదార్థం: ఆ+ఇతిహాసంబు= ఆ వెనుకటికతను; చెప్పెదన్= చెప్పుతాను; దానన్= ఆ కథ వినటంవలన; నీ+అడిగిన= నీవు కోరిన; అర్థంబు= ప్రయోజనం; తెలియున్= తెలుస్తుంది; అవహితుండవు+ఐ= మనస్సు పెట్టినవాడవై; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ కథంతా చెప్పుతాను. అది నీవు కోరిన ఫలితాన్ని తెలుపుతుంది. మనస్సుపెట్టి వినుము.

సీ. పాపాత్ముఁ డొకబోయ పక్షుల వధియించి । తినియును బె క్కమ్మికొనియు నదియ
బ్రదుకుగా దానికి బహుసాధనంబులు । సవరించుకొని మహాటవిఁ జరింప
నొకనాఁడు పెనువానయును గాలియును ముట్టి । సకలజీవులకు నాశంబు పుట్టు
నట్టిదియై కానయంతయు జలమయం । బైన బెగ్గిలి యన్నరాధముండు

తే. వేగ వఱ్ఱోడి యెల్లను వెడలి మిఱుత । నొక వనస్పతి జొంపమై యున్న దానిఁ
జెంది రాతిరి యగుటయు శిలయ సెజ్జ । గాఁగ శీతార్తుఁడై యుండెఁ గౌరవేంద్ర! 307

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= ధర్మరాజా!; పాప+ఆత్ముఁడు= పాపస్వభావంగల; ఒక బోయ= ఒక బోయవాడు; పక్షులన్= పిట్టలను; వధియించి= చంపి; తినియును= తినీ; పెక్కు+అమ్మికొనియున్= చాలా అమ్ముకొనీ; అదియ= పిట్టలను చంపితినటమే, అమ్ముకోవటమే; బ్రదుకుగాన్= బతుకు తెరువుగా; దానికిన్= ఆ బతుకు తెరువుకు; బహుసాధనంబులు= అనేకమైన పనిముట్లను; సవరించుకొని= కూర్చుకొని; మహా+అటవిన్= పెద్ద అడవిలో; చరింపన్= తిరుగుతుండగా; ఒకనాఁడు= ఒకరోజు; పెనువానయును=

పెద్ద వానా; గాలియును= గాలీ; ముట్టి= తాకి; సకల జీవులకున్= సమస్తమైన జీవరాశికి; నాశంబు పుట్టునట్టిది+ఐ= విపత్తు కలిగించేదై; కాన+అంతయున్= అడవి అంతా; జలమయంబు+ఐనన్= నీటిమయం కాగా; బెగ్గిలి= బెదరి; ఆ+నరాధముండు= నీచుడైన ఆ బోయవాడు; వేగన్= వడిగా; వఱ్ఱు+ఓడి= వాన ఉరవడినంతటినీ; వెడలి= దాటి; మిఱుతన్= మెరకమీద; ఒక వనస్పతి= ఒక చెట్టు; జొంపము+ఐ ఉన్నదానిన్= గుబురుగా ఉన్నదానిని; చెంది= చేరి; రాతిరి+అగుటయున్= చీకటి పడటంవలన; శిలయ= బండరాయే; సెజ్జ కాఁగన్= పడక కాగా; శీత+ఆర్తుఁడు+ఐ= చలికి బాధపడుతూ; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: పాపభావాలుగల ఒక బోయవాడు ఉండేవాడు. అతడు పిట్టలను పట్టి కొన్నిటితో పొట్టపోసుకొంటూ ఎక్కువగా అమ్ముకొంటూ బ్రతికేవాడు. అందువలన పిట్టలను పట్టుకొనే పనిముట్లను సమకూర్చుకొని అడవిలో తిరుగుతుండగా ఒకనాడు పెద్ద గాలీవానా వచ్చింది. ఆ వానవలన అన్ని రకాల జీవాలకూ ముప్పు ముంచుకొచ్చేటట్లు అడవంతా నీటిమయమైంది. ఆ బోయవాడు బెదరిపోయాడు. వాన ఉరవడిని తట్టుకొని మెరక చేరాడు. గుబురుగా ఉన్న చెట్టు క్రిందికి చేరాడు. రాత్రి అవటంవలన అక్కడే రాతి బండమీద చలిగాలికి గడగడ వణుకుతూ పడుకొన్నాడు.

క. ఆ లుబ్ధకుఁ డత్తరువర । మాలోకించి కడు భక్తి ననియె 'నిచటి భూ
తాలిం గొలిచెదఁ గరుణా । శీలత ననుఁ గాచుటకు విశిష్ట వినీతిన్.' 308

ప్రతిపదార్థం: ఆ లుబ్ధకుఁడు= ఆ బోయవాడు; ఆ+తరువరమున్= గుబురుగా ఉన్న ఆ పెద్ద చెట్టును; ఆలోకించి= చూచి; కడుభక్తిన్= ఎక్కువైన ఆరాధనా భావంతో; అనియెన్= అన్నాడు; కరుణాశీలతన్= జాలిస్వభావంతో; ననున్= నన్ను; కాచుటకున్= రక్షించటానికి; ఇచటి భూతాలిన్= ఈ అడవిలోని ప్రాణికోటిని; విశిష్ట వినీతిన్= మిక్కిలి వినయంతో; కొలిచెదన్= సేవిస్తాను.

తాత్పర్యం: (ఆ బోయవాడు) గుబురుగా ఉన్న ఆ పెద్ద చెట్టును చూచి ఎంతో భక్తితో ఇట్లా అన్నాడు: 'నా మీద కనికరం చూపి నన్ను కాపాడటానికి ఈ అడవిలోని జంతువులన్నింటిని ఎంతో వినయంగా సేవిస్తాను'.

వ. అని యి ట్లప్పక్షిధ్వంసకుండు శయనంబు ప్రాపించియుండ నమ్మహీరుహంబు కోటరంబున వసియించియుండునది యొక్కకపోతంబు దనవల్లభ యెటయేని మేఁతకుం బోయి రాక తడసిన శోకించి. 309

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; ఆ+పక్షిధ్వంసకుండు= పిట్టలను చంపే బోయవాడు; శయనంబు= రాతిపడకను; ప్రాపించి+ఉండన్= పొంది ఉండగా; ఆ+మహీరుహంబు= ఆ చెట్టుయొక్క; కోటరంబునన్= తొర్రలో; వసియించి+ఉండునది= కాపురం ఉండే; ఒక కపోతంబు= ఒక పావురం; తన వల్లభ= తన భార్య; ఎట+ఏని= ఎక్కడకేని; మేఁతకున్ పోయి= తిండి కొరకు పోయి; రాక= రాకుండా; తడసినన్= ఆలసించగా; శోకించి= దుఃఖించి.

తాత్పర్యం: అనుకొంటూ బోయవాడు రాతిమీద పడుకొన్నాడు. ఆ చెట్టు మీదే ఒక తొర్రలో ఒక పావురం కాపురం ఉన్నది. ఆ పావురం మేతకు పోయిన తన భార్య ఎంతకూ రాలేదని విచారిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఎచట నున్నది యొక్కొ యింత ప్రొ? ద్దొకచోట । నుండునే ననుఁ బాసి యుజ్జ్వలాంగి?
యమ్మేను లేకున్న నిమ్మేని కలిమి ని । రర్థకం బధికానురాగయుక్త
యగు సతిగుణముల యైహికాముష్మి క । సుఖసాధనంబులు సువ్వె! పతికి
యేకారణంబున నే మయ్యెనో వాన । యేపునఁ దెగియెఁ గానోపు నకట!

తే. నేమి సేయుదు? మందిరం బిపుడు పాడు । వాఱుచున్నది' యనఁగ నప్పలుకు లెల్ల
బోయవలలోన నున్న కపోతి విని మ । నంబు సంతోషపూరమగ్నంబు గాఁగ. 310

ప్రతిపదార్థం: ఉజ్జ్వల+అంగి= మిలమిల మెరిసే శరీరం గల నా భార్య; ఇంత ప్రొద్దు= ఇంతసేపూ; ఎచటన్= ఎక్కడ; ఉన్నది+ఒక్కొ!= ఉన్నదో గదా!; ననున్ పాసి= నన్ను వదలిపెట్టి; ఒక చోటన్+ఉండునే?= ఎక్కడైనా ఉంటుందా?; ఆ మేను= ఆ శరీరం; లేక+ఉన్నన్= లేకపోతే; ఈ మేని కలిమి= ఈ నా దేహసంపద; నిరర్థకంబు= పనికి రానిది అవుతుంది; అధిక+అనురాగయుక్త+అగు= మిక్కిలి ప్రేమతోకూడి ఉండేది అయిన; సతిగుణములన్= భార్య మంచి స్వభావాలే; పతికిన్= పెనిమిటికి; ఐహిక= ఈ లోకంలోనూ; ఆముష్మిక= పరలోకంలోనూ; సుఖసాధనంబులు సువ్వె!= సౌఖ్యానికి ఉపకరించే వస్తువులు సుమా!; ఏ కారణంబునన్= ఏమి నిమిత్తంగా; ఏమి+అయ్యెనో= ఏమైపోయిందో; అకట!= అయ్యో!; వాన ఏపునన్= వాన జోరువలన, జోరువాన వలన; తెగియెన్ కానోపున్= చచ్చిపోయిందేమో; ఏమి చేయుదున్?= ఏమి చేసేది?; ఇపుడు= భార్యలేనప్పుడు; మందిరంబు= ఇల్లు; పాడు పాఱుచున్+ఉన్నది= పాడుపడి పోయినట్టున్నది; అనినన్= అనగానే; ఆ పలుకులు+ఎల్లన్= ఆ మాటలన్నీ; బోయవలలోనన్= బోయవాడి వలలో; ఉన్న= చిక్కి ఉన్న; కపోతి= పెంటి పావురం; విని; మనంబు= మనస్సు; సంతోష పూరమగ్నంబు+కాఁగన్= సంతోషంతో నిండుగా మునిగి పోగా.

తాత్పర్యం: 'నా భార్య ఇంతసేపూ ఎక్కడుందో, నన్ను వదలి ఎక్కడా ఉండదు. ఆమె లేని నా బ్రతుకు ఎందుకూ పనికిరాదు. అనురాగవతి అయిన భార్య సుగుణాలే మగడికి ఇహపరలోకాల్లో సుఖసాధనాలు. ఏ కారణంగా ఏమైపోయిందో ఏమో! కుండపోతగా వానపడటంవలన చచ్చిపోయిందేమో! నేను ఏమి చేసేది? ఆమె లేని నా ఇల్లు పాడుపడిపోయినట్లున్నది' అని అంటున్న పావురం మాటలన్నీ పెంటి విన్నది. పట్టలేనంత సంతోషంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పతి మదికి నింత యెక్కిన । యతివ గదా పుణ్యవతి; ప్రియాలాపము లీ
గతి వినఁ గాంచిఁ జన్మము । కృతకృత్యం బయ్యె నాకు; గెలిచితి జమునిన్.' 311

ప్రతిపదార్థం: పతి మదికిన్= పెనిమిటి మనస్సుకు; ఇంత ఎక్కిన= ఇంత ఇష్టమైన; అతివ కదా= స్త్రీయే కదా; పుణ్యవతి= పుణ్యాత్మురాలు; ప్రియ+ఆలాపములు= పెనిమిటి మాటలు; ఈ గతిన్= ఇట్లా; వినన్ కాంచితిన్= విన గలిగాను; నాకున్= నాకు; జన్మము= పుట్టుక; కృతకృత్యంబు+అయ్యెన్= ధన్యమైనది; జమునిన్= యముడిని; గెలిచితిన్= జయించాను.

తాత్పర్యం: 'పెనిమిటి మెప్పుపొందిన స్త్రీ ఎంతో పుణ్యవంతురాలు. నన్ను గురించి నా మగడి మాటలు చెవులారా వినగలిగాను. నా జన్మ ధన్యమైనది. యముడిని గెలిచాను'.

వ. అని యుల్లంబునన యుగ్గడించి పతికిం దన తెఱంగెఱింగించి, 'విధి కృతంబునకు వగవంబని లే' దని మఱియు నిట్లనియె. 312

ప్రతిపదార్థం: అని; ఉల్లంబునన్+అ= మనస్సులోనే; ఉగ్గడించి= చెప్పుకొని; పతికిన్= పెనిమిటికి; తన తెఱంగున్= తాను ఉన్న తీరును; ఎఱింగించి= తెలిపి; విధి కృతంబునకున్= బ్రహ్మ చేష్టకు; వగవన్= విచారించటం వలన; పనిలేదు= ప్రయోజనం లేదు; అని; మఱియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పింది.

తాత్పర్యం: అని మనస్సులో అనుకొంటూ తన ఉనికిని తన పెనిమిటికి తెలిపింది. 'బ్రహ్మ చేష్టకు విచారించి ప్రయోజనం లేదు' అని చెప్పుతూ మళ్ళీ ఇట్లా అన్నది.

చ. 'శరణము సొచ్చినం దగఁ బ్రసన్నతఁ గైకొని రక్షణంబు సా
దరముగఁ జేయు టత్యధిక ధర్మముగా బుధకోటి సెప్పు; నీ
వరసి మహార్తు వీని శరణాగతు నోపినభంగి నాపదం
బొరయకయుండఁజేయుము ప్రభూతపు సీతునఁ గొంకు వోయెడున్. 313

ప్రతిపదార్థం: శరణము+చొచ్చినన్= శరణాగతి పొందగా; తగన్= ఒప్పగా; ప్రసన్నతన్= దయతో; కైకొని= అంగీకరించి; రక్షణంబు= ఆశ్రయం; సాదరముగన్= గౌరవంగా; చేయుట= ఆచరించటం; అత్యధిక ధర్మముగాన్= గొప్ప పుణ్యకార్యంగా; బుధకోటి= పండితులు; చెప్పున్= చెప్పుతారు; నీవు; అరసి= విచారించి; మహా+ఆర్తున్= గొప్ప బాధలో ఉన్న; శరణాగతున్= అండ కోరుతున్న; వీనిన్= ఈ బోయవాడిని; ఓపిన భంగిన్= తగినంతలో; ఆపదన్+పొరయక+ఉండన్= ఇక్కట్టు పాలు కాకుండా; చేయుము= చూడుము; ప్రభూతపుసీతునన్= ఎక్కువ అవుతున్న; చలివలన; కొంకుపోయెడున్= కొంకరలు పోతున్నాడు.

తాత్పర్యం: 'ఆదుకొనుమంటూ ఆశ్రయించినవాడిని కనికరంతో ఆదరించి ఆదుకొనటంకన్న మించిన పుణ్యం మరొకటి ఉండదంటారు పెద్దలు. గాలివానలో చలికి వణకిపోతున్న ఈ బోయవాడిని నీకు చేతనయినంతలో కాపాడుము'.

క. అని యేర్పడ భాషిం । చిన విని శోకము డిగ్గ విడిచి విహగము గరుణం
దనజాతి సెప్పి తగ ని । ట్లనియె మనుజభాషణముల నా లుబ్ధకుతోన్. 314

ప్రతిపదార్థం: అని; ఏర్పడన్= తేటతెల్లంగా; భాషించినన్= పెంటి పలుకగా; విని= ఆలకించి; శోకమున్= భార్య ఏమై పోయిందో అనే దుఃఖాన్ని; డిగ్గ విడిచి= వదలిపెట్టి; విహగము= ఆ మగపావురం; కరుణన్= జాలితో; తన జాతిన్= తన (పావురం) తెగను; ఆ+లుబ్ధకుతోన్= ఆ బోయవాడితో; చెప్పి; మనుజ భాషణములన్= మానవుల మాటలతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: పెంటి మాటలు స్పష్టంగా మగపావురం చెవిని బడ్డాయి. భార్య ఏమయిందో అనే విచారాన్ని అది వదలిపెట్టింది. బోయవాడిమీద జాలిపడింది. తాను పావురాన్నని చెప్పుకొన్నది. మానవుల మాటలతో అతడితో ఇట్లా అన్నది.

క. 'ఓ యన్న! డస్సినాఁడవు । మా యింటికి నతిథి వైతి; మసలక నీకుం
జేయవలయు నాతిథ్యం; । బేయది భవదీప్సితార్థ మెఱిఁగింపు తగన్.' 315

ప్రతిపదార్థం: ఓ అన్న!= ఓ బోయన్న!; డస్సినాఁడవు= అలసిపోయి ఉన్నావు; మా ఇంటికిన్= మా మందిరానికి; అతిథివి+ఐతి(వి)= అతిథివయ్యావు (అతిథి= రాత్రి మాత్రం ఉండిపోయేవాడు, అకస్మాత్తుగ అన్నంవేళకు వచ్చినవాడు); మసలక= జాగుచేయకుండా; నీకున్= నీకు; ఆతిథ్యంబు= విందును; ఏ+అది= ఎట్లాంటిది; చేయవలయున్= చేయాలి; భవత్+ఈప్సిత= నీవు కోరుకున్న; అర్థమున్= వస్తువును; తగన్= తగినట్లుగా; ఎఱిఁగింపు(ము)= తెలియచెప్పుము.

తాత్పర్యం: 'ఓ అన్నా! నీవు చాలా బడలికతో ఉన్నావు. మా ఇంటికి వచ్చిన అతిథివి నీవు. నీకు ఆలస్యంలేకుండా వెంటనే అతిథి విందు చేయాలి. నీకు కావలసిన వేవో తెలియచెప్పవలసింది'.

చ. అనవుడు నుల్ల మెంతయుఁ బ్రియంబు వహింపఁగఁ బక్షివైరి 'నీ
తున సకలాంగకంబులుఁ బ్రతున్నము లయ్యెడుఁ; దీనిఁ బాపవే!'
యనిన విహంగమంబు రయమారఁగ నచ్చటి పుల్లలెల్ల ము
క్కునగొని తెచ్చి ప్రోవిడి యకుంఠిత మైన దయాగుణంబునన్. 316

ప్రతిపదార్థం: అనవుడున్= అని మగ పావురం పలుకగానే; ఉల్లము= మనస్సు; ఎంతయున్= ఎంతో; ప్రియంబు= సంతోషం; వహింపఁగన్= పొందగా; పక్షివైరి= పిట్టల విరోధి అయిన బోయవాడు; సీతునన్= చలివలన; సకల+అంగకంబులున్= అన్ని అవయవాలు; ప్రతున్నములు= సలుపుపెట్టబడ్డవి; అయ్యెడున్= అవుతున్నాయి; దీనిన్= ఈ చలిని; పాపవే= పోగొట్టవా; అనినన్= అనగానే; విహంగమంబు= ఆ మగ పావురం; అకుంఠితము+ఐన= మొక్కవోనిదైన; దయాగుణంబునన్= జాలిస్వభావంతో; రయము+ఆరఁగన్= ఎక్కువ వేగంగా, గబగబా; అచ్చటి పుల్లలు+ఎల్లన్= అక్కడి చిదుగు లన్నింటిని; ముక్కునన్= ముక్కుతో; కొనితెచ్చి= కరచితెచ్చి; ప్రోవిడి= కుప్పపోసి.

తాత్పర్యం: ఆ గువ్వ పలుకులు విన్నాడు బోయవాడు. సంతోషించాడు. 'ఈ చలికి నా అవయవాలు తీపు పెడుతున్నాయి. కనుక ఈ చలిని పోగొట్టవలసింది' అని అడిగాడు. ఆ పావురం జాలిపడి గబగబా అక్కడి చిదుగులన్ని ఏరి ముక్కుతో కరచి తెచ్చి పోగుపెట్టి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఆ పాంతపల్లియకు రయంబునం జని పుల్లతల సంగతంబైన యింగలంబు. 317

ప్రతిపదార్థం: ఆ పాంత పల్లియకున్= ఆ ప్రక్కనే ఉన్న పల్లెకు; రయంబునన్= గబగబా; చని= వెళ్ళి, పుల్లతల= చిదుగు చివరన; సంగతంబు+ఐన= కూడి ఉన్నట్టి; ఇంగలంబు= అగ్గిని.

తాత్పర్యం: ఆ పక్కనే ఉన్న పల్లెకు గబగబా పోయింది. చిదుగు చివరన అంటుకొని ఉన్న నిప్పును. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కొని వచ్చి పుల్ల ప్రోవునఁ । దనుకంగాఁ జేసి నెమ్మి దళుకొత్తఁగ ని
ట్లను బోయతోడ 'మే నీ । యనలంబునఁ గాఁచికొనుటకై లె' మ్మనఘా! 318

ప్రతిపదార్థం: కొనివచ్చి= తీసికొని వచ్చి; పుల్లప్రోవునన్= చిదుగుల కుప్పయందు; తనుకంగాన్ చేసి= (రాజుకొనేటట్లు చేసి)మండింప చేసి; నెమ్మి= సంతోషం; తళుకు ఒత్తఁగన్= ప్రకాశించగా; బోయతోడన్= బోయవాడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది; అనఘా!= పుణ్యాత్ముడా!; మేను= ఒంటిని; ఈ అనలంబునన్= ఈ నిప్పుచేత; కాఁచికొనుటకున్+ఐ= చలికాపు కాచుకొనటానికి; లెమ్ము= లేచిరమ్ము.

తాత్పర్యం: తీసికొనివచ్చి పోగేసిన పుల్లలన్నీ ముట్టుకునేటట్లు చేసింది. ఎంతో సంతోషపడుతూ బోయవాడిని చలికాచుకొనటానికి మంట దగ్గరకు రమ్మని పిలిచింది.

చ. అనవుడు వాఁడు గువ్వహృదయం బలరం దనయంగకంబు ల
య్యనలశిఖాకలాపమున నల్లన యల్లన కాఁచి శీత బా
ధన ముడుగంగఁ జేయఁగఁ బదంపడి యాఁకలి చాలఁ దోఁచెఁ; దోఁ
చిన నెఱిఁగించె గువ్వ కది సేయ నుపాయము లేక యాత్మలోన్. 319

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; వాఁడు= ఆ బోయవాడు; గువ్వ= అడవి పావురం; హృదయంబు= మనస్సు; అలరన్= సంతోషించేటట్లు; తన+అంగకంబులు= తన అవయవాలన్నీ; ఆ+అనల శిఖా= ఆ నిప్పుల మంటల; కలాపమునన్= సముదాయంచేత; అల్లన అల్లన= మెల్లమెల్లగా; కాఁచి= కాపుపెట్టుకొని; శీత బాధనము= చలి బాధ; ఉడుగంగన్+చేయఁగన్= తీర్చుకొనగా; పదంపడి= వెంటనే; ఆఁకలి; చాలన్+తోఁచెన్= బాగా అనిపించింది; తోఁచినన్= ఆకలి అనిపించగానే; గువ్వకున్= ఆ పావురానికి; ఎఱిఁగించెన్= తెలిపాడు; అది+చేయన్= ఆకలి తీర్చటానికి; ఉపాయము లేక= మార్గం కనపడక; ఆత్మలోన్= తనలో.

తాత్పర్యం: గువ్వ సంతోషించేటట్లు ఆ బోయవాడు ఆ మంటలో మెల్లమెల్లగా తన ఒంటిని కాచుకొని చలిబాధ తీర్చుకొన్నాడు. అంతలో ఆకలిగా అనిపించింది. పావురంతో అదే చెప్పాడు. ఆ గువ్వకు అతడి ఆకలి తీర్చే మార్గం ఏమి తోచలేదు. తనలో తాను. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. వగచి వెలవెలంబాఱి తలంచికొని వాని కిట్లనియె. 320

ప్రతిపదార్థం: వగచి= విచారించి; వెల వెలన్+పాఱి= తెల తెల బోయి; తలంచికొని= స్మరించి; వానికిన్= ఆ బోయవాడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: దుఃఖించి వెలవెలపోతూ తలచుకొంటూ ఆ బోయవాడితో ఇట్లా చెప్పింది.

తే. ఖగములకు జీవనం బనఁ గలదె సంగ్ర। హించినట్టిది యాఁకలి కేమియైన
మాకు దొరకొన్నఁ దిందుముగాక!; యైన । నీవు డస్సితి వాతిథ్యనియతి వలయు. 321

ప్రతిపదార్థం: ఖగములకున్= పిట్టలకు; జీవనంబు= బతకడానికి కావలసిన తిండి మొదలైనవి; సంగ్రహించినట్టిది= కూడబెట్టుకొన్నట్టిది; అనన్ కలదె= అనేది ఉన్నదా (ఉండదని భావం); ఆఁకలికిన్= ఆకలికి; ఏమి+ఐనన్= ఏదైనా; మాకు దొరకొన్నన్= మాకు లభిస్తే; తిందుము+కాక= తింటాం కాక; ఐనన్= అయినప్పటికీ; నీవు; డస్సితి(వి)= అలసిపోయావు; ఆతిథ్యనియతి= అతిథి నియమం; వలయున్= తప్పనిసరిగా చేయాలి.

తాత్పర్యం: పిట్టల బతుకుల్లో తిండిని కూడబెట్టుకొనటం అనేది ఉండదు. ఆకలికి దొరికింది ఏదైనా తింటాం. అయితే నీవు బాగా అలసిపోయి ఉన్నావు. తప్పనిసరిగా నీ ఆకలి తీర్చాలి.

కపోతంబు దన శరీరమును బోయ కాహారంబుగా నిచ్చుట (సం. 12-142, 143)

వ. నా శరీరం బాహారంబుగా నిచ్చెదఁ గొనుము.' 322

ప్రతిపదార్థం: నా శరీరంబున్= నా ఒంటిని; ఆహారంబుగాన్= తినటానికి గాను; ఇచ్చెదన్= సమర్పిస్తాను; కొనుము= తీసికొమ్ము'.

తాత్పర్యం: నా శరీరాన్ని నీకు ఆహారంగా అర్పిస్తాను. తీసికొమ్ము'.

క. అని పలికి యగ్ని వలగొని । తన దేహము దానిలోనఁ దడయక యిడినం
గని బోయ విస్మయంబున । మనమూనఁగఁ గొంతసేపు మ్రాన్పడి యుండెన్. 323

ప్రతిపదార్థం: అని పలికి= అని మాట్లాడి; అగ్నిన్ వలగొని= మంట చుట్టూ తిరిగి; దానిలోనన్= ఆ నిప్పుల మంటల్లో; తడయక= జాగుచేయకుండా; తన దేహము= తన శరీరం; ఇడినన్= పడవేయగా; కని= చూచి; బోయ= బోయవాడు; మనము= మనస్సు; విస్మయంబునన్= ఆశ్చర్యంలో; ఊనఁగన్= తగుల్కొనగా; కొంతసేపు= కొద్దిసేపు; మ్రాన్పడి+ఉండెన్= కొయ్యబారిపోయి ఉన్నాడు.

తాత్పర్యం: అని గువ్వ చెప్పి వెంటనే మంటచుట్టూ తిరిగి ఆ నిప్పుల మంటల్లో పడిపోయింది. అది చూచి బోయవాడు నివ్వెరపోయాడు. కొంచెంసేపు కొయ్యబారి పోయినట్లు ఉండిపోయాడు.

వ. పదంపడి. 324

తాత్పర్యం: ఆ తరువాత - (తరువాతి పద్యంతో అన్వయం).

మ. 'కలదే యిమ్మెయి పౌరుషంబు జగతిం గారుణ్య మేపార ని
ప్పులఁ గి ట్లిచ్చునె మేను? నాదు చరితంబుల్ నిందకుం బట్టులై
తలఁపన్ వచ్చిన నింత కీ డగునె యేతత్క్రూరతా ఘోర చే
ష్టలు మానంగలవాఁడఁ; బక్షి గురువై సంధించె సద్బోధమున్.' 325

ప్రతిపదార్థం: జగతిన్= లోకంలో; ఈ+మెయి పౌరుషంబు= ఈ రీతి సాహసం; కలదే= ఉన్నదా; కారుణ్యము= దయ; ఏ పారన్= ఎక్కువ కాగా; ఈ+పులుఁగు= ఈ గువ్వ; ఇట్లు= ఇట్లా; మేనున్= శరీరాన్ని; ఇచ్చునె?= ఇస్తుందా?; నా+చరితంబుల్= నా నడవళ్ళు; నిందకున్= దూషణకు; పట్టులు+ఐ= నెలవులై; తలఁపన్+వచ్చినన్= ఆలోచించగా; ఇంతకీడు= ఇంత పాటి ఆపదను; అగునె= తెచ్చిపెట్టుతుందా; ఏతద్= ఇట్లాంటి; క్రూరతా ఘోరచేష్టలు= దయలేని భయంకరమైన చేతలు; మానన్+కలవాఁడన్= నిలిపివేస్తాను; పక్షి= గువ్వ; గురువై= బోధకుడై; సద్బోధమున్= మంచి తెలివిని; సంధించెన్= పొందించింది.

తాత్పర్యం: 'లోకంలో ఇట్లాంటి సాహసం, పురుష ధర్మం ఎక్కడైనా ఉంటుందా? బాగా జాలిపడి ఈ గువ్వ ఈ తీరున తనను అర్పించుకొంటుందా? నా నడవడి ఈ లోకంలో నిందలపాలయింది. ఆలోచించగా నా నడవడి ఇంతటి విపత్తును కలిగిస్తుందా? ఇక ఇట్లాంటి దయాదాక్షిణ్యాలు లేని ఘోరపు పనులు చేయను. ఈ పిట్ట నాకు గురువై మంచి తెలివిని తెప్పించింది'.

వ. అని యంతరంగంబున వైరాగ్యంబు నిరంతరం బగుటయు నంత నిలువక. 326

ప్రతిపదార్థం: అని; అంతరంగంబునన్= మనస్సులో; వైరాగ్యంబు= విరక్తి; నిరంతరంబు= ఎడతెగనిది; అగుటయున్= కావటంవలన; అంతన్= అక్కడ; నిలువక= ఉండలేక.

తాత్పర్యం: అని మనస్సులో వీడని విరక్తిని పొందాడు. అందువలన అక్కడ ఉండలేక. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. 'ఇది యి ట్లాలిని బంధులం దొఱఁగి తా నీ యగ్నిలోఁ గూలె నొ
ప్పిదమై యుండఁగ నిట్టి తెంప యెలయం బెంపారు వైరాగ్య సం
పద పాపంబుల నెల్లఁ ద్రుంపఁగ మహాప్రస్థానపుణ్యత్వ మొం
దెద నే నిప్పుడ' యంచు మానసము శాంతిం బొంద నిర్మోహుఁడై. 327

ప్రతిపదార్థం: ఇది= ఈ గువ్వ; ఇట్లు= ఈ విధంగా; ఆలిని= భార్యను; బంధులన్= చుట్టపక్కాలను; తొఱఁగి= వదలి, విడిచి; ఒప్పిదమై+ఉండఁగన్= యోగ్యమై ఉండగా; తాను= తనకు తానుగా; ఈ అగ్నిలోన్= ఈ నిప్పుల్లోకి; కూలెన్= పడిపోయింది; ఇట్టి= ఇట్లాంటి; తెంపు+అ= తెగువయే; ఎలయన్= కలుగగా; పెంపారు= ఎక్కువవుతున్న; వైరాగ్య సంపదన్= విరక్తి సంపత్తిచేత; పాపంబులన్+ఎల్లన్= పాపాలన్నిటిని; త్రుంపఁగన్= పోగొట్టుకొనటానికి; నేను; ఇప్పుడు+అ= ఇప్పుడే; మహాప్రస్థాన= లోకాంతర యాత్ర అనే; పుణ్యత్వమున్= ధర్మాన్ని; ఒందెదన్= పొందుతాను; అంచున్= అంటూ; మానసము= మనస్సు; శాంతిన్+పొందన్= ఊరట పొందగా; నిర్మోహుఁడు+ఐ= మమకారం లేనివాడై.

తాత్పర్యం: ఈ పావురం ఇట్లా తనవారి నందరిని వదలుకొని తనకు తానుగా ఈ నిప్పుల్లోకి దూకింది. ఇట్లాంటి తెగువతనంతో కూడా పాపం పోగొట్టుకొని వైరాగ్యభావంతో ఇప్పుడే దేహయాత్ర చాలిస్తాను. పుణ్యాత్ముడ నవుతాను' అని మనసులో ఊరటపొందాడు. మమకారం లేనివాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వలలోన నున్న పులుఁగుల । వెలువడఁగా విడిచి వలయు వెండియుఁ దనకుం
గల పక్షి నిహతిసాధన । ములు నచటనె యుండఁ బోయె బోయ నియతుఁడై. 328

ప్రతిపదార్థం: బోయ= బోయవాడు; వలలోనన్= వలలోపల; ఉన్న= ఉన్నట్టి; పులుఁగులన్= పిట్టలను; వెలు పడఁగాన్= బయటపడేటట్లు; విడిచి= వదలి; వలయున్= వలా; వెండియున్= ఇంకా; తనకున్ కల= తనకున్నట్టి; పక్షినిహతిసాధనములున్= పిట్టలను చంపే పరికరాలను; అచటనె+ఉండన్= అక్కడే ఉండగా; నియతుఁడు+ఐ= నియమం కలవాడై; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ బోయవాడు వలలో పట్టి ఉంచిన పిట్టల నన్నిటిని బయటకు వదలిపెట్టాడు. పిట్టలను పట్టి చంపే వలనూ పనిముట్లనూ అక్కడే ఉంచేశాడు. నియమం పూని పోయాడు.

ఆ. అక్కపోతి నాథుఁ డగ్నిలోఁ బడుటకు । శోకవహ్నిఁ జిత్త మాకులముగ
నెలుఁగు రాలుపడఁగ నిట్లని పలవించె । నశ్రుజలతరంగితాస్య యగుచు. 329

ప్రతిపదార్థం: ఆ+కపోతి= ఆ పెంటిపావురం; నాథుఁడు= తన పెనిమిటి; అగ్నిలోన్= నిప్పుల్లో; పడుటకున్= పడినందుకు; శోకవహ్నిన్= దుఃఖాగ్నిచేత; చిత్తము= మనస్సు; ఆకులముగన్= వ్యాకులపాటు చెందగ; ఎలుఁగు= గొంతు; రాలుపడఁగన్= వణకిపోగా; అశ్రుజల తరంగిత= పొంగిపొర్లుతున్న కన్నీరుగల; ఆస్య+అగుచున్= ముఖం కలదవుతూ; ఇట్లు+అని= ఈ విధంగా అని; పలవించెన్= ఏడ్చింది.

తాత్పర్యం: బోయవాడి తిండికొరకు నిప్పుల్లో పడ్డ తన పెనిమిటిని గూర్చిన దుఃఖంతో పెంటి మనస్సు కలవరపడింది. గొంతు వణకిపోయింది. కన్నీరు మున్నీరుగా ఏడ్చింది.

క. 'నా యాఁకలి కోర్వ వెపుడు । వేయైనను నేఁ గొనంగ వెండి యనుభవిం
తాయాసపడుటఁ గనుఁగొని । నోయుదు ననుఁ బాసి యిటు సనుట దగ వగునే?' 330

ప్రతిపదార్థం: ఎపుడున్= ఎల్లప్పుడూ; నా+ఆఁకలికిన్= నా ఆకలికి; ఓర్వవు= తాళలేవు; వేయి+ఐనను= ఏది ఏమైనా; నేన్ కొనంగన్= నేను తినగా; వెండి= ఆ తరువాత; అనుభవింతు(వు)= నీవు తినేవాడివి; ఆయాసపడుటన్= కష్టపడటాన్ని; కనుఁగొని= చూచి; నోయుదు(వు)= నొచ్చుకునేవాడివి; ననున్ పాసి= నన్ను వీడి; ఇటు+చనుట= ఇట్లా వెళ్ళటం; తగవు+అగునే?= న్యాయం అవుతుందా?

తాత్పర్యం: 'నాకు ఆకలి వేస్తే నీవు ఎపుడూ తట్టుకొనలేకపోయేవాడివి. ఆరునూరైనా నూరు ఆరైనా నేను తిన్న తరువాతనే తినేవాడివి. నేను కష్టపడటం చూచి నొచ్చుకొనేవాడివి. అట్లాంటి నీవు నన్ను వదలిపెట్టి ఇట్లా వెళ్ళటం ధర్మమేనా?'

వ. అని వెండియు. 331

తాత్పర్యం: అని మళ్ళీ.

సీ. 'ఇగురు జొంపంబుల నింపారు విరులను । బలుపైన పాదల క్రేవలకుఁ దార్చి,
సెలయేఱులందలి తెలినీటఁ దనువు సాం । పెలసిన గిరుల తెప్పలకుఁ జేర్చి,
మావిమ్రోకల నెలదీవలఁ జెన్నొందు । తోటలకడ నలితోడఁ జెంది,
యలరు నెత్తమ్ముల కలిమిఁ జెల్వగు డిగ్గి । యల తీరభూముల నల్లఁ బొంది,

తే. నన్ను మనమునఁ దేల్చి యానంద మొందఁ । గేలి సలిపెడు నీ దగు లీల మఱువ
నావశంబె ప్రాణేశ! ప్రాణంబు లిపుడ । నిన్న కూర్చి యేతెంతు నీ సన్న కడకు. 332

ప్రతిపదార్థం: ఇగురు= చిగురుటాకుల; జొంపంబులన్= గుత్తులచేత; ఇంపారు= అందమైన; విరులను= పూలచేత; బలుపు+ఐన= గుబురుగాగల; పాదల క్రేవలకున్= గుబుళ్ళ పక్కలకు; తార్చి= చేర్చి; సెలయేఱులందలి= కొండకాలవలలోని; తెలినీటన్= తేట నీళ్ళల్లో; తనువు= ఒళ్ళు; సొంపు ఎలసినన్= అందం పొందగా; గిరుల తెప్పలకున్= కొండలమిట్ట నేలల మీదకు; చేర్చి= పొందించి; మావిమ్రోకలన్= లేత మామిడి చెట్ల చేత; ఎల+తీవలన్= లేత తీగలచేత; చెన్ను+ఒందు= అందంగా చక్కగా ఉండే; తోఁటలకడన్= తోపుల దగ్గర; నలితోడన్= ఉత్సాహంతో; చెంది= చేరి; అలరు= విరబూసిన; నెత్తమ్ముల+కలిమిన్= పెద్ద తామరలు ఉండటంవలన; చెల్వగు= అందమైన; డిగ్గియల= దిగుడు బావుల; తీరభూములన్= గట్టులను; అల్లన్‌పొంది= మెల్లగా చేరి; నన్నున్= నన్ను; మనమునన్= హృదయంలో; ఆనందము= సంతోషం; ఒందన్= పొందేటట్లు; తేల్చి= ముంచెత్తించి (ఓలలాడించి); కేలిసలిపెడు= క్రీడించే; నీదగు లీల= నీదైన విలాసం; మఱువన్= మర్చిపోవటం; నా వశంబె!= నా తరమా!; ప్రాణేశ!= ప్రాణనాథా!; ప్రాణంబులు= నా ఊపిరులు; నిన్ను కూర్చి= నీతో చేర్చి; ఇపుడ= ఇప్పుడే; నీ చన్నకడకున్= నీవు పోయిన దగ్గరకు; ఏతెంతున్= వస్తాను.

తాత్పర్యం: చిగురుటాకుల గుత్తులతో, పూలతో, గుబురుగా ఉండే పాదలమాటుకు చేర్చేవాడివి. కొండకాలవలలోని తేటనీళ్ళల్లో ఒంటివన్నె ఇనుమడించగా కొండల మెరకలమీదకు తీసికొని వెళ్ళేవాడివి. లేత మామిడిచెట్లతో, లేత తీగలతో చూడచక్కగా ఉండే తోపులలోకి ఉత్సాహంగా చేర్చేవాడివి. బాగా విచ్చుకొన్న తామరపూలతో అందంగా కనిపించే దిగుడుబావుల గట్లమీదకు మెల్లగా చేర్చి ఆనందంలో ముంచెత్తించి క్రీడించేవాడివి. నీ లీలలు మర్చిపోవటం నా వల్లకాదు. ఓ నాథా! ఇపుడే నా ప్రాణాలు తీసికొని నిన్ను చేరుకుంటాను.

వ. అట్లుంగాక. 333

తాత్పర్యం: అంతే కాకుండా.

క. ఱేని యనుమరణమునఁ దన । మేను విడిచినట్టి కాంత మేలిపదవికిం
దాను నతండును నరిగి య । నూన స్థిరసుఖము లందుచుండుట విందున్.' 334

ప్రతిపదార్థం: ఱేని అను మరణమునన్= పెనిమిటితో సహగమనంచేత; తన మేనున్= తన తనువును; విడిచినట్టి= చాలించినట్టి; కాంత= వనిత; తానున్= తానూ (భార్య); అతండునున్= పెనిమిటీ; మేలిపదవికిన్= ఉన్నత దశకు; అరిగి= వెళ్ళి; అనూన= తక్కువ కానట్టి; స్థిర= నిలకడ కలిగినట్టి; సుఖములు= భోగాలు, సౌఖ్యాలు; అందుచున్+ఉండుట= పొందుతూ ఉండటం; విందున్= విన్నాను.

తాత్పర్యం: పెనిమిటితోపాటు చితిపొంది చనిపోయిన స్త్రీ అతడితోపాటు ఉత్తమ గతులు పొందుతుందనీ, నిలకడగా అంతులేని భోగాలు అనుభవిస్తుందనీ పెద్దలు చెప్పుతుండగా విన్నాను'.

క. అని పలికి యపుడ యనలము । ఘనముగ దరికొల్పి మది వికాసముఁ బొందం
దన వల్లభుఁ దలఁచుచు వల । గొని లీలం జొచ్చి యతనిఁ గూడం జనియెన్. 335

ప్రతిపదార్థం: అని పలికి= అని మాట్లాడి; అపుడు+అ= ఆ వెంటనే; అనలమున్= నిప్పును; ఘనముగన్= బాగా; దరికొల్పి= రాజుకునేటట్లు చేసి; మది= మనస్సు; వికాసమున్ పొందన్= సంతోషించగా; తనవల్లభున్= తన పెనిమిటిని; తలఁచుచున్=

తలపోసికొంటూ; వలగొని= నిప్పుచుట్టూ ప్రదక్షిణంచేసి; లీలన్= విలాసంగా; చొచ్చి= అగ్గిలోకి దూకి; అతనిన్= పెనిమిటిని; కూడన్= కలియటానికి; చనియెన్= వెళ్ళింది.

తాత్పర్యం: అని మాట్లాడి ఆ వెంటనే నిప్పును బాగా రగులుకొల్పింది. తన పెనిమిటిని తలచుకొంటూ ఆ నిప్పుచుట్టూ తిరిగింది. అతడిని చేరుకొనటానికి ఆనందంగా నిప్పుల్లోకి ఉరికింది.

క. స్ఫురిత విమానము మీఁద న । మరతతి వేష్టింప రత్నమయ భూషణ సుం
దర దివ్యమూర్తి వెలిఁగెడు । వరునిఁ గలిసి పరమ సౌఖ్య వైభవ మెసఁగన్. 336

ప్రతిపదార్థం: స్ఫురిత= ప్రకాశించే; విమానము మీఁదన్= విమానంపై; అమర తతి= దేవతా సమూహం; వేష్టింపన్= చుట్టుకొనగా; రత్నమయ భూషణ= రత్నాలు పొదిగిన నగలచేత; సుందర= మనోహరమైన; దివ్యమూర్తిన్= దేవతా రూపంతో; వెలిఁగెడు= శోభిల్లే; వరునిన్= పెనిమిటిని; కలిసి= కూడి; పరమ సౌఖ్య వైభవము= గొప్ప సుఖసంపత్తి; ఎసఁగన్= ఎక్కువ అవగా.

తాత్పర్యం: దేవతాగణం చుట్టూ ఉండగా రత్నాభరణాలతో మనోహరరూపుడై చక్కటి విమానంమీద దేవత్వంతో ఒప్పే పెనిమిటిని కలుసుకొన్నది. ఎనలేని సుఖసంపదలతో తులతూగుతుండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. లీల మూరిఁబో నచ్చరలేమ పిండు । బలసి యభివందనము సేయఁ బొలిచె నిట్లు
సనిన పక్షియుగ్మంబు వర్తనము దోఁచెఁ । బుణ్యవర్తనుఁ డగుట నా బోయ కపుడు. 337

ప్రతిపదార్థం: లీల= విలాసం; మూరిన్ పోన్= అతిశయించగా; అచ్చరలేమ పిండు= దేవతా స్త్రీల సముదాయం; బలసి= కమ్ముకొని; అభివందనము చేయన్= మొక్కుతుండగా; పొలిచెన్= ఒప్పింది; ఇట్లు= ఇట్లా; చనిన= పై లోకాలకు వెళ్ళిన; పక్షియుగ్మంబు= పావురం పిట్టల జంట; వర్తనము= నడవడి; ఆ బోయకున్= ఆ బోయవాడికి; పుణ్య వర్తనుఁడు+అగుటన్= పవిత్రమైన నడవడి కలవా డవటంవలన; అపుడు తోఁచెన్= అప్పుడే తట్టింది.

తాత్పర్యం: విలాసం ఎక్కువ కాగా, దేవతాస్త్రీలంతా చుట్టూ గుమిగూడి అభినందించటంవలన ఒప్పిదంగా ఉన్నది (కనబడింది). ఇట్లా పై లోకాలకు పోయిన రెండు పిట్టల నడవడి, పవిత్రంగా జీవిస్తున్న బోయవాడికి అపుడే తెలిసింది.

వ. తోఁచిన నతండు. 338

ప్రతిపదార్థం: తోచినన్= తట్టిన వెంటనే; అతండు= ఆ బోయవాడు.

తాత్పర్యం: అట్లా తట్టిన వెంటనే ఆ బోయవాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఏనును ని ట్లగుదు' ననుచు । నూనిన కౌతూహలమున నుల్లము వొదలన్
మే నెల్ల ముండ్లు సింపఁగఁ । గానఁ దఱిసి గళిత రక్త కలితాకృతియై. 339

ప్రతిపదార్థం: ఏనునున్= నేను కూడా; ఇట్లు+అగుదున్= ఇట్లా పుణ్యలోకాలను పొందినవాడను అవుతాను; అనుచున్= అనుకుంటూ; ఊనిన= పొందిన; కౌతూహలమునన్= ఉత్సాహంతో; ఉల్లము= మనస్సు; పొదలన్= ఒప్పగా; మేను+ఎల్లన్= ఒళ్ళంతా; ముండ్లు చింపఁగన్= ముళ్ళు చీరుకోగా; కానన్+తఱిసి= అడవిలోకి కాలిడి; గళిత= కారుతున్న; రక్తకలిత= రక్తంతో కూడుకొన్న; ఆకృతి ఐ= రూపు కలవాడై.

తాత్పర్యం: నేనూ అట్లాగే పుణ్యలోకాలు పొందుతాను అనుకుంటూ ఎంతో ఉత్సాహంతో మనస్సు పొంగిపోగా ఆతడు అడవిలోకి చొరబడ్డాడు. ఒళ్ళంతా ముళ్ళతో చీరుకొనిపోయింది. రక్తం కారుతున్న రూపంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అరుగుచుండు వాఁ డొకచో దవానలంబు । గట్టెదిరి కాననం బెల్ల ముట్టి మండ
సంప్రమోదితచిత్తుఁడై చక్కఁ జొచ్చి । యొడలు దొఱఁగి దేవత్వంబు వడసి యొప్పె. 340

ప్రతిపదార్థం: అరుగుచున్+ఉండువాఁడు= వెళ్ళుతున్నవాడల్లా; ఒకచోన్= ఒకచోట; దవ+అనలంబు= కార్చిచ్చు; కడు+ఎదిరి= ఎట్ట ఎదుట ఉన్న; కాననంబు+ఎల్లన్= అడవంతటిని; ముట్టి= ముట్టుకొని; అంటుకొని; మండన్= కాలుతూ ఉండగా; సంప్రమోదిత చిత్తుఁడు+ఐ= గొప్ప ఉత్సాహం పొందిన మనస్సు కలవాడై; చక్కన్+చొచ్చి= తిన్నగా మంటలలో దూకి; ఒడలు తొఱఁగి= తనువు చాలించి; దేవత్వంబు+వడసి= అమరత్వాన్ని పొంది; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: పోతూ ఉండగా ఒక చోట తన ఎదుటనే కార్చిచ్చు అలముకొని అడవి అంతా మండిపోతూ ఉన్నది. అది చూచి బోయ ఎంతో సంతోషించాడు. తాను ఆ దావాగ్నిలో పడి ప్రాణం వదిలాడు. దేవతారూపాన్ని పొందాడు.

ఉ. ఈ యితిహాస మర్థిమెయి నెజ్జనముల్ వినినం బఠించినం
బాయు నుదాత్త గోహనన పాతకమైనను భూరిసౌఖ్యముల్
వేయి విధంబులం బొరయు విన్ము తగన్ శరణార్థిఁ దోషితుం
జేయనివాఁడు కల్మషముఁ జెందు నొకప్పుడుఁ బాయ దేమిటన్. 341

ప్రతిపదార్థం: ఈ+ఇతిహాసమున్= ఈ వెనుకటి కథను; అర్థిమెయిన్= ఆసక్తితో; ఏ+జనముల్= ఎట్లాంటి జనం అయినా; వినినన్= విన్నా; పఠించినన్= చదివినా; ఉదాత్త గోహనన= గొప్పదైన గోవును చంపాడనే; పాతకము+ఐనను= పాపం అయినా; పాయును= పోతుంది; భూరిసౌఖ్యముల్= గొప్ప సుఖాలు; వేయి విధంబులన్= అనేక రకాలుగా; పొరయున్= పొందుతాడు; విన్ము= వినుము; తగన్= ఒప్పుగా; శరణార్థిన్= శరణన్నవాడిని; తోషితున్+చేయనివాఁడు= సంతోషపెట్టలేనివాడు; కల్మషమున్+చెందున్= పాపం పొందుతాడు; ఏమిటన్= దేనిచేతనైనా; ఒకప్పుడున్= ఎప్పటికీ; పాయదు= (పాపం) నశించదు.

తాత్పర్యం: ఈ కథనంతా ఎవ్వడైనా ఆసక్తిగా విన్నా చదివినా గోవును చంపిన మహాపాపం అయినా పోతుంది. అన్ని విధాలా సుఖంగా ఉంటాడు. కాని, శరణన్నవాడిని ఆదుకోనివాడు మాత్రం పాపం అనుభవిస్తాడు. అతడి పాపం ఏ విధంగానూ ఎన్నటికీ పోదు.'

వ. అని యిట్లు శరణాగత రక్షణ ఫలవిశేష ప్రకటనం బగు లుబ్ధ కపోతాఖ్యానంబు సెప్పిన విని యప్పితామహుని
మీఁదం బ్రీతి వినయ విస్తారవిలోకనం బెలయ నప్పాండవాగ్రజుండు. 342

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఇట్లా; శరణాగత= శరణు కోరినవాడిని; రక్షణ= కాపాడేవాళ్ళకు; ఫలవిశేష= విశిష్ట ప్రయోజనాన్ని; ప్రకటనంబు+అగు= తెలిపేది అయిన; లుబ్ధ కపోత= బోయ, పావురం అనే పేరుగల; ఆఖ్యానంబు= కథను; చెప్పినన్+విని= చెప్పగా విన్నవాడై; ఆ+పితామహుని మీఁదన్= తాత భీష్ముడిమీద; ప్రీతి= సంతోషం; వినయ= అణకువ; విస్తార= విస్తరిల్లిన; విలోకనంబు= చూపు; ఎలయన్= ప్రసరించగా; ఆ+పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడు ధర్మరాజు.

తాత్పర్యం: అని శరణన్న వాడిని ఆదుకొనేవాడికి కలిగే పుణ్యాన్ని తెలిపే 'బోయ - పావురం' కథ చెప్పాడు భీష్ముడు. అది విన్న ధర్మరాజు తాత భీష్ముడిపై ప్రీతీ, అణకువా కలగలిసిన చూపులు సారిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పాపంబు బుద్ధిపూర్వ । వ్యాపారము గాక తొడరినప్పుడు మనుజుం
డేపాట దానినంతయుఁ । బాపికొనంజాలు సుజనబాంధవ! చెపుమా!' 343

ప్రతిపదార్థం: సుజన బాంధవ!= మంచివాళ్ళకు నేస్తమా!; పాపంబు= పాపం; బుద్ధిపూర్వ వ్యాపారము+కాక= తెలిసి చేసింది కాకుండా; తొడరిన+అప్పుడు= కలిగేటప్పుడు; మనుజుండు= మనిషి; ఏ పాటన్= ఏ విధంగా; దానిన్+అంతయున్= ఆ పాపాన్నంతా; పాపికొనన్+చాలున్= పోగొట్టుకొనగలుగుతాడు; చెపుమా!= చెప్పుము'.

తాత్పర్యం: 'సజ్జనులకు నేస్తమా! తెలియకుండా చేసిన పాపాన్ని ఎట్లా పోగొట్టుకొనాలో తెలుపుము'.

వ. అని యడిగిన నయ్యార్యవర్యుం డా ధరణీభరణధుర్యునకు నిట్లనియెఁ: 'దొల్లి పరీక్షిత్తనయుం డగు జనమేజయుం డను మహారాజు దన కబుద్ధిపూర్వకబ్రహ్మహత్య వాటిల్లినం దత్క్లిష్టంబు వాపికొనియె; నది పురాణకథయై మునులవలన వినంబడు; నత్తెఱం గెఱిఁగించెద; నాకర్ణింపుము. 344

ప్రతిపదార్థం: అని; అడిగినన్= అడుగగా; ఆ+ఆర్యవర్యుండు= పెద్దలలో పెద్ద అయిన భీష్ముడు; ఆ ధరణీభరణ ధుర్యునకున్= భూభారాన్ని మోసే ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; తొల్లి= మునుపు; పరీక్షిత్+తనయుండు+అగు=పరీక్షిత్తుడి కొడుకు అయిన; జనమేజయుండు+అను మహారాజు= జనమేజయుడనే మహారాజు; తనకున్= తనకు; అబుద్ధి పూర్వక= తెలియక చేసిన; బ్రహ్మహత్య= బ్రాహ్మణుడిని చంపాడనే పాతకం; పాటిల్లినన్= కలుగగా; తద్+కిల్బిషంబున్= ఆ పాపాన్ని; పాపికొనియెన్= పోగొట్టుకొన్నాడు; అది= ఆ బ్రహ్మహత్యాపాపం పోగొట్టుకొనటం; పురాణ కథఐ= చాలాకాలం నాటి కథగా; మునులవలనన్= ఋషుల వలన; వినంబడున్= ఆలకించబడుతుంది; ఆ+తెఱంగున్= ఆ విధానాన్ని; ఎఱిఁగించెదన్= తెలుపుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని అడిగిన ధర్మరాజుతో ఆ మహానుభావుడైన భీష్ముడు ఇట్లా చెప్పాడు: 'పరీక్షిన్మహారాజు కొడుకు జనమేజయుడు. ఇతడు మునుపు తనకు తెలియకుండానే చుట్టుకొన్న బ్రహ్మహత్యాపాతకాన్ని పోగొట్టుకొన్నాడు. అదే పురాణాలలో ఒక కథ అయింది. దానినే మును లంతా వినిపిస్తుంటారు. అది చెప్పుతాను వినుము'.

క. పాపంబు దొడరుటయు నా । భూపాలకుఁ బ్రజయ విడిచె; భూసురులును నిం
దాపాత్రంబుగఁ జేసిరి; । తాపము మదిఁ గదిరి యతఁడు దల్లడ మందెన్. 345

ప్రతిపదార్థం: పాపంబు= బ్రహ్మహత్యా పాతకం; తొడరుటయున్= కలుగగానే; ఆ+భూపాలకున్= ఆ జనమేజయుడిని; ప్రజయ= జనమే; విడిచెన్= వదలిపెట్టారు; భూసురులును= బ్రాహ్మణులూ; నిందాపాత్రంబుగన్= తిట్టదగ్గవాడినిగా; చేసిరి= చేశారు; అతఁడు= ఆ జనమేజయుడు; మదిన్= మనస్సులో; తాపము కదిరి= దుఃఖాన్ని పొంది; తల్లడము+అందెన్= బాధపడ్డాడు.

తాత్పర్యం: బ్రహ్మహత్యాపాపం చుట్టుకొనగానే ఆ రాజును ప్రజలూ పట్టించుకొనలేదు. బ్రాహ్మణులు దోషి వన్నారు. దానికి జనమేజయుడు లోలోపల కుమిలిపోయాడు.

తే. అట్లు జనమేజయుఁడు వగ నారఁగూరి । పురము వెడలి యొక్కరుఁడును బోయి కాన
నాంతరము సొచ్చి శౌనకుం డను మునీంద్రు । నాశ్రమము రోసికొని చని యమ్మహాత్ము. 346

ప్రతిపదార్థం: అట్లు= అట్లా; జనమేజయుఁడు= జనమేజయుడు; వగన్= దుఃఖాన్ని; ఆరఁగూరి= ఎక్కువగా పొంది; పురము= పట్టణంనుండి; వెడలి= బయటపడి; ఒక్కరుఁడును= ఒంటరిగా; పోయి= వెళ్ళి; కానన+అంతరము= అడవిలోపలికి; చొచ్చి= దూరి; శౌనకుండు+అను= శౌనకు డనే; మునీంద్రు నాశ్రమమున్= మునీశ్వరుడి పర్ణశాలను; రోసికొని= వెతుక్కొని; చని= పోయి; ఆ+మహాత్మున్= ఆ మహానుభావుడిని.

తాత్పర్యం: జనమేజయుడు చాలా దుఃఖించి పట్నంనుండి బయటపడ్డాడు. ఒంటరిగా నట్టడవిలోకి చొరబడ్డాడు. ఆ అడవిలో శౌనకముని కుటీరాన్ని వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆ మహాత్ముడిని. (తరువాతి వచనంతో అన్వయం).

వ. కాంచి దండప్రణామం బాచరించి సవినయంబుగఁ గరంబులు మొగిచి నిల్చినం జూచి యతండు. 347

ప్రతిపదార్థం: కాంచి= చూచి; దండప్రణాంబులు+ఆచరించి= సాగిలపడి మ్రొక్కి; సవినయంబుగన్= అణకువతో; కరంబులు= చేతులు; మొగిచి= మోడ్చి; నిల్చినన్= నిలబడగా; చూచి= కని; అతండు= ఆ శౌనకముని.

తాత్పర్యం: ఆ శౌనకమునిని చూచి సాగిలపడి మ్రొక్కాడు. చేతులు జోడించి నిలబడ్డాడు. అది చూచి ముని. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'పెనుఁ బొల వల్చుచున్న యది పీనుఁగుఁ జూచినయట్టు లయ్యెడున్
నినుఁ గనుఁగొన్న నీ యెడకు నీ విది యేటికి వచ్చె? దెక్కడేఁ
జనుము; శిరంబు క్రిందుగ నజస్రము వ్రేలఁగలాఁడ వీ భవం
బున తుదిఁ గ్రూరకాకచయముల్ దొలువన్ నరకాధివాసివై.' 348

ప్రతిపదార్థం: పెనుపొల వల్చుచున్+ఉన్నయది= ఎంతో నీచుకంపు కొట్టుతున్నది; నినున్= నిన్ను; కనుఁగొన్నన్= చూస్తుంటే; పీనుఁగున్= పీనుగును; చూచిన+అట్టులు= చూచినట్లుగా; అయ్యెడున్= అవుతుంది; ఈ+ఎడకున్= ఇక్కడకు; నీవు= నీవు; ఇది= ఇట్లా; ఏటికిన్ వచ్చెదు?= ఎందుకు వచ్చావు?; ఎక్కడేన్= ఎక్కడికైనా; చనుము= వెళ్ళుము; ఈ భవంబునన్= ఈ జన్మలోనే; క్రూరకాక చయముల్= బొంతకాకుల మూకలు; తొలువన్= తూట్లు తూట్లుగ పొడుస్తుండగా; తుదిన్= చివరకు; నరక అధివాసివి+ఐ= నరకంలో ఉండే వాడివై; అజస్రమున్= ఎప్పుడూ; శిరంబు క్రిందుగన్= తలక్రిందుగా; వ్రేలన్+కలాఁడవు= వేలాడుతూ ఉంటావు.

తాత్పర్యం: నీ వద్ద ఎంతో నీచు వాసన వస్తున్నది. నిన్ను చూస్తుంటే పీనుగును చూసినట్లున్నది. నీవు ఇక్కడికి ఎందుకు వచ్చావు? మరెక్కడికైనా వెళ్ళిపొమ్ము'. బొంతకాకులు తూట్లు పొడుస్తూ ఉండగా తలకిందుగా వేలాడుతుంటావు. (ఈ పుట్టుకలోనే నరకం అనుభవిస్తావు).

చ. అనుటయు 'గర్భకర్ము డగునట్టి దురాత్మునిఁ బూజితవ్రతుల్
గని యిటు లంట యుక్త మటుగాన కదా భవదీయ పాదవం
దన మొనరించి మీవలన దారుణపాపము వాచికొందు నే
నను మది వచ్చినాఁడ సదయంబగు చూడ్కిఁ బరిగ్రహింపవే!' 349

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; గర్హ్యకున్= నిందించటానికి; అర్హుఁడు+అగు+అట్టి= తగినట్టి; దురాత్మునిన్= పాపిష్ఠివాడిని; పూజిత ప్రతుల్= గౌరవించతగ్గ నియమాలు కల మీవంటి వారు; కని= చూచి; ఇటులు= ఇట్లా; అంట= అనటం (దూషించటం); యుక్తము= తగినదే; అటుగాన కదా= అందువలనే (అట్లాంటి నిందితుడిని కావటంవలననే) కదా; భవదీయ= మీ పాదవందనము+ఒనరించి= కాళ్ళకు మొక్కి.; మీవలనన్= మీ కారణంగా; దారుణపాపము= సహించలేని పాపాన్ని; పాచికొందున్= పోగొట్టుకొంటాను; అను మదిన్= అన్న కోరికతో; నేన్= నేను; వచ్చినవాఁడన్= వచ్చాను; సదయంబు+అగు= కనికరం గల; చూడ్కిన్= చూపుతో; పరిగ్రహింపవే= స్వీకరించవా.

తాత్పర్యం: నేను దూషించదగ్గవాడినే. మీబోటి గౌరవార్హులు ఇట్లా నిందించటమూ భావ్యమే. అందువలననే కదా మీ కాళ్ళకు మ్రొక్కుకొని ఈ దారుణమైన పాపాన్ని పోగొట్టుకొనాలని ఆశపడి వచ్చాను. నా మీది దయతో నన్ను స్వీకరించండి'.

వ. అనిన విని కరుణాయత్తచిత్తుం డగు నత్తపోధనసత్తముం డిట్లనియె. 350

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని; కరుణా+ఆయత్త+చిత్తుండు+అగు= దయకు లోబడ్డ మనస్సు కలవాడయిన; ఆ+తపోధన సత్తముండు= ఆ ముని వర్యుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగానే ఆ శౌనకముని జాలిపడి అతడితో ఇట్లా అన్నాడు.

క. వినుఁ కొంద అల్పబుద్ధులు । నను నెంతయు ధిక్కరింప నవ్వఁగ వారిం
గొనక బుధులైన విప్రులు । ననిమిషులును మెచ్చుచుండ' ననియెద నీతోన్. 351

ప్రతిపదార్థం: వినుఁ= వినుము; కొందఱు= కొంతమంది; అల్పబుద్ధులు= తెలివి తక్కువ వాళ్ళు; ననున్= నన్ను; ఎంతయున్= ఎంతో; ధిక్కరింపన్= తిరస్కరించగా; నవ్వఁగన్= గేలిచేయగా; వారిన్= అట్లాంటి వాళ్ళను; కొనక= లెక్కపెట్టక; బుధులు+ఐన= పండితు లైన; విప్రులున్= బ్రాహ్మణులూ; అనిమిషులును= దేవతలూ; మెచ్చుచున్+ఉండన్= ఆహా అంటూ ఉండగా; నీతోన్= నీతో; అనియెదన్= అంటాను.

తాత్పర్యం: కొంతమంది తెలివితక్కువవాళ్ళు నన్ను కాదని గేలిచేసినా, అట్లాంటి వాళ్ళను లెక్కపెట్టను. పండితులైన బ్రాహ్మణులూ, దేవతలూ మెచ్చుకొనేటట్లు నేను నీతో చెప్పుతాను వినుము.

క. హీనప్రజ్ఞఁ డకార్యము । లైనవి సేసి తుది వగచు నతులప్రజ్ఞా
సానుమదారూఢుఁడు వగ । నూనఁడు దురిత మను వఱితి కోడక యునికిన్. 352

ప్రతిపదార్థం: హీన ప్రజ్ఞుఁడు= అల్పబుద్ధి కలవాడు; అకార్యములు+ఐనవి+చేసి= చేయకూడని పనులను చేసి; తుదిన్= చివరకు; వగచున్= పశ్చాత్తాప పడతాడు; అతుల ప్రజ్ఞా= సాటిలేని తెలివితో; సానుమత్+ఆరూఢుఁడు= కొండెక్కినవాడు (ఉన్నతికి పోయేవాడు); దురితము+అను= పాపం అనే; వఱితికిన్= వరదకు; ఓడక ఉనికిన్= భయపడకుండా ఉండటానికి; వగన్= విచారాన్ని; ఊనఁడు= పొందడు.

తాత్పర్యం: తెలివితక్కువవాడు చేయకూడని పనులు చేసి చివరకు విచారిస్తాడు. ఎక్కడలేని తెలివితో ఉన్నతుడయ్యేవాడు మాత్రం పాపం అనే వరదకు వెరవడు, విచారించడు.

వ. ప్రజ్ఞాకార్యంబు లైనవి యనుష్ఠింపవలయు; వానిఁ జెప్పెద; నీకుం బాపంబునెడ ననుతాపంబు గలిగి ధర్మ
ప్రవణుండ వైతే?' యనుటయు నమ్మనుజనాథుండు. 353

ప్రతిపదార్థం: ప్రజ్ఞాకార్యంబులు+ఐనవి= తెలివిగా చేసే పనులు; అనుష్ఠింప వలయున్= ఆచరించాలి; వానిన్= వాటిని; నీకున్= నీకు; చెప్పెదన్= చెప్పుతాను; పాపంబు+ఎడన్= (చేసిన) పాపం విషయంలో; అనుతాపంబు+కలిగి= పశ్చాత్తాపం పొంది; ధర్మ ప్రవణుండవు+ఐతే?= ధర్మంపట్ల ఆసక్తికలవాడవు అయ్యావా?; అనుటయున్= అని అనగానే; ఆ మనుజనాథుండు= ఆ జనమేజయమహారాజు.

తాత్పర్యం: తెలివిగా పనులు చక్కబెట్టుకోవాలి. వాటిగురించి నీకు చెప్పుతాను. అసలు నీవు చేసిన పాపాలకు పశ్చాత్తాపపడుతున్నావా? నీకు ధర్మంపట్ల ఆసక్తి కలిగిందా?' అని ముని అడుగగానే ఆ జనమేజయుడు.

క. 'తాపసవర! తీవ్రం బగు । పాపాగ్నిజ్వాల చయము పాలుపడి పరీ
తాపము నొందుచు ధర్మ । వ్యాపార జలాభిలాషి నై యున్నాఁడన్. 354

ప్రతిపదార్థం: తాపసవర!= మునీశ్వర!; తీవ్రంబు+అగు= ఎక్కువ అవుతున్న; పాప+అగ్నిజ్వాల చయము= పాపం అనే మంటల సముదాయంలో; పాలుపడి= చిక్కుకొని; పరీతాపమున్= సంతాపాన్ని; ఒందుచున్= పొందుతూ; ధర్మవ్యాపార= పుణ్యకర్మలనే; జల= పవిత్రమైన నీటిని; అభిలాషిని+ఐ= కోరుకొంటున్నవాడనై; ఉన్నాఁడన్= ఉన్నాడను.

తాత్పర్యం: 'ఓ మునివర్య! తీవ్రమైన పాపపు మంటలలో చిక్కుకొని ఎంతో తపిస్తున్నాను. పుణ్యకార్యాలనే పవిత్రజలంతో ఆ మంటలను చల్లార్చుకొనాలని అనుకొంటున్నాను.

వ. భవదీయ కృప నాశ్రయింప వచ్చితి; నన్ను రక్షింపవే!' యనవుడు నమ్మునీంద్రుండు. 355

ప్రతిపదార్థం: భవదీయ= మీ; కృపన్= దయను; ఆశ్రయింపన్= అండకోరటానికి; వచ్చితిన్= వచ్చాను; నన్నున్= నన్ను; రక్షింపవే= కాపాడవా; అనవుడున్= జనమేజయుడు అనగానే; ఆ+ముని+ఇంద్రుండు= ఆ శౌనకముని.

తాత్పర్యం: నీ దయకొరకు నిన్ను ఆశ్రయించాను. నన్ను ఆదుకొనవలసినది' అని జనమేజయుడు అనగానే ఆ శౌనకమునివర్యుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'భీతి యొకటి గోరుటయును । నీ తలఁపులలోన దీని కిది గతమనఁగా
నే తెరువును గలుగదు మ । చ్చేతోగతి ధర్మవృత్తిఁ జిక్కుట దక్కన్. 356

ప్రతిపదార్థం: భీతి= భయం (వెరపు); ఒకటి కోరుటయున్= ఒకటి కోరుతుండగా; మత్+చేతఃగతి= నా మనస్సుపోకడ; ధర్మవృత్తిన్= పుణ్యవ్యాపారంలో; చిక్కుట తక్కన్= పట్టువడి ఉండటం తప్ప; దీనికిన్= దీనికి; ఇది; కతము+అనఁగాన్= కారణం అనటానికి; ఏ తెరువును= ఏ ఉపాయమున్నూ; నీ తలఁపులలోనన్= నీ ఊహలలో; కలుగదు= పుట్టదు.

తాత్పర్యం: 'నీవు నీ భయంకొద్దీ ఒకదానిని కోరుకొంటున్నావు. అందువలన దీనికి ఇది కారణం అనే ఉపాయమే నీ ఆలోచనలకు అందదు. నాకు తట్టిన పుణ్యకార్యం ఆచరించాలి తప్ప.

క. ఆతురత నీవు నా కడ । కేతెంచిన దానఁ జేసి యెలసిన ధర్మ
ద్యోతన కౌతూహలమున । నీతోఁ బడవలసె; వినుము నిశ్చలమతివై. 357

ప్రతిపదార్థం: ఆతురతన్= తొందరపాటుతో; నీవు; నా కడకున్= నా దగ్గరకు; ఏతెంచినదానన్+చేసి= వచ్చినందువలన; ఎలసిన= అలముకొన్న; ధర్మద్యోతన= ధర్మం తోచినందువలన కలిగిన; కౌతూహలమునన్= ఉబలాటంతో; నీతోన్= నీతో; పడవలసెన్= అనుభవించవలసి వస్తుంది; నిశ్చలమతివి+ఐ= నిలకడగల బుద్ధికలవాడవై; వినుము= వినుము.

తాత్పర్యం: నీ ఆతురతకొద్దీ నీవు నా దగ్గరకు వచ్చావు కాబట్టి, నాకు ధర్మమార్గం తట్టినందువలన కలిగిన ఉబలాటంకొద్దీ నీతో పడవలసి వచ్చింది. నిలుకడగా వినుము.

క. భూవిబుధుల కెయ్యది హిత । మావిధమున నడచువాఁడవగునది ద్రోహా
భావంబు ప్రతిజ్ఞాతం । బై వెలయఁగవలయు నీకు నా జాతియెడన్.' 358

ప్రతిపదార్థం: భూవిబుధులకున్= బ్రాహ్మణులకు; ఎయ్యది= ఏది; హితము= మేలో; ఆ విధమునన్= అట్లాగున; నడచువాఁడవు= ప్రవర్తించేవాడవు; అగునది= కావాలి; నీకున్= నీకు; ఆ జాతి+ఎడన్= ఆ బ్రాహ్మణుల కులంపట్ల; ద్రోహ+అభావంబు= కీడు తలపెట్టనని; ప్రతిజ్ఞాతంబు+ఐ= ఒట్టుపెట్టుకున్నవాడవై; వెలయఁగవలయున్= ప్రసిద్ధి కెక్కాలి.

తాత్పర్యం: బ్రాహ్మణజాతికి మంచి కలిగేటట్లు నడచుకొమ్ము. వాళ్ళకు ఎప్పుడూ అపకారం తలపెట్టనని ఒట్టు వేసుకొమ్ము. నలుగురి మెప్పులు అందుకొమ్ము.'

చ. అనవుడు 'ధర్మవృత్తము మదాత్మకు నైజము; దోషవృత్తికిన్
మునివర! యేను భీతుఁడ; సముజ్జ్వల విప్రకులంబు నాకు మ
న్ననలకుఁ బాత్ర; మెవ్విధమునం దెగి ద్రోహము దానియందు నా
మనము దలంప; దింతకును మాన్య భవచ్చరణంబు లంటెదన్.' 359

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; మునివర!= మునిసత్తమా!; మత్+ఆత్మకున్= నా మటుకు నాకు; ధర్మవృత్తము= పుణ్యజీవనం; నైజము= సహజం; దోష వృత్తికిన్= పాపపు నడతకు; ఏను= నేను; భీతుఁడన్= భయస్థుడిని; సముజ్జ్వల= వెలిగిపోతున్న; విప్రకులంబు= బ్రాహ్మణ జాతి; నాకున్= నా; మన్ననలకున్= ఆదరణలకు; పాత్రము= తగినది; ఏ విధమునన్= ఎట్లాగైనా; నా మనము= నా మనస్సు; దాని యందున్= ఆ బ్రాహ్మణుల కులమందు; తెగి= సాహసించి; ద్రోహము= కీడు కలిగించాలని; తలంపదు= ఆలోచించదు, తలపోయదు; ఇంతకును= ఈ సమస్తానికీ; మాన్య= మన్నించదగ్గ; భవత్+చరణంబులు= మీ పాదాలను; అంటెదన్= తాకుతాను.

తాత్పర్యం: 'ఓ శౌనకమునివర్యా! ధర్మంగా నడచుకొనటం నాకు పుట్టుకతో వచ్చింది. పాపపు బ్రతుకంటే నాకు వణకు. బ్రాహ్మణజాతి ఎప్పుడూ నా ఆదరణకు తగినది. తెగించి ఎప్పుడూ నా మనస్సు ఆ జాతికి కీడు తలపెట్టదు. ఈ సమస్తానికీ సాక్ష్యంగా నీ పాదాలు తాకి ఒట్టుపెట్టుకొంటాను.'

వ. అనుచుఁ దదీయ పాదస్పర్శనంబు సేసి యవ్విధంబునం గృతశపథుం డగుటయుఁ గరుణాగోచరంబగు
చిత్తంబుతో నత్తపోధనవర్యుం డాదరమేదురావలోకనం బా భూపాలుని మీఁద నొలయ నిట్లను: 'నట్లేనిం
జెప్పెద నవహితుండ వయి యాకర్ణింపుము. 360

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; తదీయపాద= ఆ ముని పాదాలను; స్పర్శనంబు చేసి= తాకి; ఆ+విధంబునన్= ఆ రీతిగా; కృత= చేసిన; శపథుండు+అగుటయున్= ఒట్టుపెట్టుకొన్నవాడవుగా; కరుణాగోచరంబు+అగు= దయకు లోబడ్డ; చిత్తంబుతోన్= మనస్సుతో; ఆ+తపోధనవర్యుండు= ఆ మునివరుడు కౌశికుడు; ఆదరమేదుర= ఎంతో మర్యాదతో కూడిన; అవలోకనంబు= చూపు; ఆ భూపాలుని మీఁదన్= ఆ జనమేజయ రాజుమీద; ఒలయన్= ప్రసరించగా; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అట్లు+ఏనిన్= అట్లాగైతే (బ్రాహ్మణులకు కీడు తలపెట్టనట్లయితే); చెప్పెదన్= చెప్పుతాను; అవహితుండవు+అయి= సావధానుడవై; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: ఆ ముని కాళ్ళు పట్టుకొని అట్లా శపథంచేశాడు. ఆ ముని మనస్సు జాలిపడింది. ఆ జనమేజయుడిని ఎంతో ఆదరంగా చూచి ఇట్లా అన్నాడు. అట్లా బ్రాహ్మణజాతికి కీడు తలపెట్టనన్నావు కనుక చెప్పుతాను. సావధానంగా వినుము.

సీ. శ్రీమంతుఁడును బలశ్రేష్ఠుండు నగు రాజు । భోగంబు దర్పంబుఁ బోవ విడిచి,
ధర్మంబు గైకొని, తపమును దానంబు । నధ్యయనంబును యాగవిధులు
నాచరింపగఁ జూచి యచ్చెరువడి యను । గ్రహము సేయదె భూతరాజి? యతని
కధిప! యయాతివాక్యము నర్థ మెఱిఁగింతు । వినుము! సరస్వతియును దృషద్వ
తే. తియును ననుపుణ్యనదులందుఁ దిరిగి తీర్థ । సేవ సేయుచు నధ్యయనావధాన
దాననిర్ధూతరాగత్వదయలు గలిగి । పరఁగఁ బాపకళంకలేపంబు వాయు. 361

ప్రతిపదార్థం: శ్రీమంతుఁడును= ధనవంతుడునూ; బలశ్రేష్ఠుండును+అగు= మేటి బలశాలిన్నీ అయిన; రాజు= ప్రభువు; భోగంబున్= సౌఖ్యాన్ని; దర్పంబున్= పొగరునూ; పోవవిడిచి= వదలగొట్టుకొని; ధర్మంబు= న్యాయం; కైకొని= పాటించి; తపమును= తపస్సునూ; దానంబున్= దానాన్ని; అధ్యయనంబును= వేదం వల్లించటాన్ని; యాగవిధులును= యజ్ఞకర్మలను; ఆచరింపఁగన్= చేయగా; చూచి; అచ్చెరువడి= ఆశ్చర్యపడి; భూతరాజి= ప్రాణికోటి; అతనికిన్= అతడికి (రాజుకు); అనుగ్రహము+చేయదె?= దయచూపదా; అధిప!= రాజా!; యయాతి వాక్యమున్= యయాతి మాటనూ; అర్థమున్= దాని అర్థాన్ని; ఎఱిఁగింతున్= తెలుపుతాను; వినుము= వినవలసింది; సరస్వతియును= సరస్వతీనదీ; దృషద్వతియునున్= దృషద్వతీనదీ; అనుపుణ్యనదులందున్= అనే పవిత్ర నదులలో; తిరిగి= తిరుగాడి (సంచరించి); తీర్థసేవ చేయుచున్= పుణ్యక్షేత్రాలను సేవిస్తూ (దర్శించుకొంటూ); అధ్యయన= వేదాలు చదవటంలో; అవధాన= ఏకాగ్రత, దాన= దానం; నిర్ధూత రాగత్వ దయలు= వదలిన మమకారమూ, కనికరమూ; కలిగి= ఉండి; పరఁగన్= ఒప్పగా; పాప= పాపం అనే; కళంకలేపంబు= మకిలి పూత; పాయున్= వీడిపోతుంది.

తాత్పర్యం: సంపన్నుడూ, ధీరుడూ అయిన రాజు భోగాన్నీ అహంభావాన్నీ వదలగొట్టుకొనాలి. ధర్మాన్ని పాటించాలి. తపస్సు, దానం, వేదాధ్యయనం, యాగాదికర్మలూ ఆచరించాలి. అప్పుడు ప్రాణికోటి అంతా రాజుమీద దయచూపుతుంది. ఈ విషయంగా యయాతి మాట ఒకటి ఉన్నది. దాని అర్థాన్ని విడమరచి చెప్పుతాను వినుము. సరస్వతి, దృషద్వతివంటి పవిత్ర నదులను సేవించాలి. పుణ్యక్షేత్రాలలో నడయాడాలి. మమకారం వదులుకొనాలి. అధ్యయనమునందే ఏకాగ్రత, దానం, దయలు కలిగి మమకారం లేక ఉండాలి. అపుడు పాపం అనే మకిలి మరక తుడిచిపెట్టుకొనిపోతుంది.

వ. అదియునుంగాక యొక్క పరమస్మృతి సెప్పెద వినుము. 362

ప్రతిపదార్థం: అదియున్+కాక= అంతేకాకుండా; ఒక్క= ఒకటి; పరమస్మృతి= మేలైన ధర్మశాస్త్రం; చెప్పెదన్= చెప్పుతాను; వినుము.

తాత్పర్యం: అంతేకాదు ఒక ధర్మశాస్త్రం చెప్పుతాను వినుము.

చ. దురితము సేసి తాపమునఁ దూలిన నిం కిటు సేయ నన్మతిం
బొరసిన ధర్మ సంచరణ బుద్ధియ మేలని యూఁదినం గ్రియా
పరుఁ డయి మేలుసేసినను బాదము పాదముగాఁ గ్రమంబునన్
విరియు సమస్తముం దదభివిష్టకళంకము నిర్భయంబుగన్. 363

ప్రతిపదార్థం: దురితము+చేసి= పాపం చేసి; తాపమునన్= పశ్చాత్తాపంతో; తూలినన్= దుఃఖించినా; ఇంకన్= ఇకమీదట; ఇటు+చేయన్= ఇట్లాంటి పాపం చేయను; అను మతిన్= అనే బుద్ధిని; పొరసినన్= పొందినా; ధర్మ సంచరణ బుద్ధియ= ధర్మంతో మెలగాలనే ఆలోచనే; మేలు+అని= మంచిదనీ; ఊఁదినన్= అవలంబించినా; క్రియాపరుఁడు+అయి= పుణ్యకార్యాలలో ఆసక్తి కలవాడై; మేలు చేసినను= ఉపకారం చేసినా; తద్+అభివిష్ట= దానిని పొందిన; కళంకము= మకిలి; సమస్తమున్= అంతా; పాదముపాదముగాన్= అంశం అంశంగా; క్రమంబునన్= వరుసగా; నిర్భయంబుగన్= ఏ జడుపు లేకుండా; విరియున్= తొలగుతుంది.

తాత్పర్యం: పాపంచేసి పరితపించినా, ఇకమీదట ఇట్లాంటి పాపాలకు ఒడిగట్టను అనుకున్నా, న్యాయంగా మెలగటం ఉత్తమం అని నిర్ణయించుకొన్నా, పుణ్యం పొందాలని అపేక్షపడి ఉపకారం చేసినా - వీటిల్లో ఏ అంశంవలననైనా పాపపంకిలం క్రమక్రమంగా తుడిచిపెట్టుకొనిపోతుంది. ఇందులో ఏమీ భయపడాల్సింది లేదు.

చ. నరవర! వాసవుం డడిగినన్ గురుఁ డిట్లని చెప్పె బుద్ధితోఁ
బొరయని పాతకంబులు సబుద్ధికపుణ్యములన్ నశించు నం
బరమునఁ బట్టినట్టి మలపంకము గారములోన నద్దఁగా
విరిసిన యట్లు నమ్ము మిది వేదము సెప్పిన నేనుఁ జెప్పితిన్. 364

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; వాసవుండు= ఇంద్రుడు; అడిగినన్= అడుగగా; గురుఁడు= బృహస్పతి; ఇట్లు+అని= ఇట్లాగని; చెప్పెన్= చెప్పాడు; బుద్ధితోన్= ఆలోచనతో; పొరయని= పొందని; పాతకంబులు= పాపాలూ; సబుద్ధిక= బుద్ధి పూర్వకంగా చేసిన; పుణ్యములన్= ధర్మాలవలన; అంబరమునన్= బట్టమీద; పట్టినట్టి= అంటుకొన్నట్టి; మలపంకము= మురికి అనే బురద; కారములోనన్= చౌటి మట్టిలో; అద్దఁగాన్= ముంచగా; విరిసిన+అట్లు= వదులునట్లుగా; నశించున్= పోతాయి; నమ్ముము= విశ్వసించుము; ఇది= ఈ విషయం; వేదము+చెప్పినన్= వేదం చెప్పగా; నేనున్= నేనూ; చెప్పితిన్= చెప్పాను.

తాత్పర్యం: ఓ జనమేజయా! ఇంద్రుడు అడిగిన విషయాన్ని బృహస్పతి ఇట్లా చెప్పాడు. బట్టకుపట్టి ఉన్న మురికి చవుడు కారంలో ముంచినపుడు వదలిపోయినట్లుగా చెయ్యాలని చేయని పాపాలు బుద్ధిపూర్వకంగా చేసిన పుణ్యాలవలన పోతాయి. ఈ సంగతి వేదం చెప్పింది. అదే నేను బోధించాను. నన్ను నమ్ముము'.

విశేషం: అలం: ఉపమ.

కృత్వా పాపం పూర్వమబుద్ధి పూర్వమ్
పుణ్యాని చేత్కురుతే బుద్ధి పూర్వమ్ -శాం-152-34

వ. అని యిట్లు బహుప్రకారంబులం గారుణికోత్తముం డగు నత్తాపసోత్తముం డా భూవరు బోధించి, తీర్థసేవాది పునశ్చరణంబులం బరిపూతాత్ముం గావించి,యశ్వమేధంబు సేయించిన నుజ్జ్వలుండయి యజ్ఞనమేజయుండు నిజరాజ్యంబు పరిపాలనంబు సేసె' నని చెప్పి వెండియు. 365

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఇట్లా; బహుప్రకారంబులన్= అనేక విధాల; కారుణిక+ఉత్తముండు+అగు= గొప్ప జాలికలవాడైన; ఆ+తాపస+ఉత్తముండు= ఆ మునిశ్రేష్ఠుడు; ఆ భూవరున్= ఆ రాజును; బోధించి= మేలుకొలిపి; తీర్థసేవ= పుణ్యక్షేత్రాలు సేవించటం; ఆది= మొదలైనవి; పునశ్చరణంబులు= మాటి మాటికి ఆచరించటంవలన; పరిపూత+ఆత్మున్= మరింత పవిత్రమైన మనస్సు కలవాడినిగా; కావించి= చేసి; అశ్వమేధంబు= అశ్వమేధయాగం; చేయించినన్= చేయించగా; ఉజ్జ్వలుండు+అయి= ప్రకాశించినవాడై; ఆ+జనమేజయుండు= ఆ జనమేజయ మహారాజు; నిజ రాజ్యంబు= తనదేశాన్ని; పరిపాలనంబు+చేసెన్= ఏలాడు; అని చెప్పి= అని పలికి; వెండియున్= మళ్ళీ.

సతతి పాపం నుదతే కర్మశీల:

వాసోయథా మలినం క్షారయుక్తమ్

తాత్పర్యం: జాలిగుండెగల ఆ ముని ఇట్లా ఎన్నో విధాల ఆ జనమేజయుడిని మేలుకొలిపి, ఎన్నో తీర్థయాత్రలు చేయించి, పుణ్యవంతుడిని చేశాడు. అశ్వమేధయాగం చేయించాడు. అట్లా వెలుగొందిన ఆ జనమేజయుడు తన రాజ్యాన్ని ఏలుకొన్నాడు' అని చెప్పి మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

భీష్ముఁడు ధర్మజునకు గృధ్రజంబుకోపాఖ్యానము సెప్పుట (సం. 12-149-1)

సీ. గాంగేయుఁ డిట్లనుఁ గౌంతేయపూర్వజు । నకు 'విదిశాపట్టణమున నొక్క
బాలుండు మృతుఁ డైన బంధులు ప్రేతభూ । మికిఁ గొనిపోయి యమేయశోక
వివశాత్ములై పలవింపఁగా గ్రద్ద యొ । క్కటి వచ్చి మీర లిక్కడ భయంబు
దక్కి యేడ్చుచునుండఁ దగ; దిదె క్రుంకెడుఁ । బ్రొద్దు రాక్షసులును భూతములుఁ బి
తే. శాచములు వ్రచ్చి తిన నిపు డేఁచి వచ్చు; । జనన మరణముల్? వింతలె చన్న శిశువు
తోన యందఱుఁ జనుటకుఁ బూనియుండు । వారలే? పొండు పీనుంగు వైచి వేగ. 366

ప్రతిపదార్థం: గాంగేయుఁడు= భీష్ముడు; కౌంతేయ పూర్వజునకున్= కుంతీ సంతానంలో ముందు పుట్టిన ధర్మరాజుకు; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; విదిశాపట్టణమునన్= విదిశానగరంలో; ఒక్కబాలుండు= ఒక పిల్లవాడు; మృతుఁడు+ఐనన్= చచ్చిపోగా; బంధులు= చుట్టాలు; ప్రేత భూమికిన్= వల్లకాటికి; కొనిపోయి= తీసుకొనిపోయి; అమేయశోక= పట్టరాని దుఃఖంతో; వివశ+ఆత్ములు+ఐ= ఒంటిమీద తెలివి తప్పినవారై; పలవింపఁగాన్= విలపించగా; గ్రద్ద= గద్ద; ఒక్కటి వచ్చి= ఒకటి వచ్చి; మీరలు= మీరు; ఇక్కడన్= ఈ వల్లకాట్లో; భయంబు+తక్కి= భయం వదలి; ఏడ్చుచున్+ఉండన్= ఏడుస్తూ ఉండటం; తగదు= కూడదు; ఇదె= ఇపుడే; పొద్దు= సూర్యుడు; క్రుంకెడున్= కనుమరుగు అవుతున్నాడు; రాక్షసులును= రక్కసులు; భూతములున్= భూతాలూ; పిశాచములున్= పిశాచాలూ; వ్రచ్చి= పీనుగును చీల్చి; తినన్= తినటానికి; ఇపుడు= ఈ సమయంలో; ఏచివచ్చున్= చెలరేగి వస్తాయి; జనన మరణముల్= పుట్టటం, గిట్టటం; వింతలె?= కొత్తవా?; చన్న= పోయిన; శిశువుతోన= బిడ్డతోనే; అందఱున్= అంతమందీ; చనుటకున్= చచ్చిపోవటానికి; పూని+ఉండువారలే?= పట్టుదలగా ఉన్నారా?; పీనుంగున్= పీనుగును; వైచి= పాతిపెట్టి; పొండు= వెళ్ళండి.

తాత్పర్యం: ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా అన్నాడు. విదిశాపట్టణంలో ఒక పిల్లవాడు చచ్చిపోయాడు. వాడిని అతడి చుట్టాలు వల్లకాటికి తీసికొనిపోయారు. వారంతా పట్టలేనంత దుఃఖంతో ఒంటిమీద తెలివితప్పి గోడు గోడుమని ఏడుస్తున్నారు. ఒక గద్ద వచ్చి మీరు ఈ వల్లకాటిలో భయపడకుండా ఏడుస్తూ ఉండటం మంచిదికాదు. చీకటి పడుతున్నది. ఈ సమయంలో రాక్షసులూ, భూతాలూ, పిశాచాలూ పీనుగులను చీల్చుకొని తినటానికి చెలరేగి వస్తాయి. చావుపుట్టుకలు ఇంతకుమునుపు లేనివా ఏమి? చచ్చిపోయిన బిడ్డతో మీరంతా పోవటానికి సిద్ధపడుతున్నారా? తొందరగా పీనుగును పాతేసి వెళ్ళండి.

క. తెగిపోయినవా రేడ్చిన । మగుడుదురే? వెఱ్ఱులార! మానుఁడు మీరుం
దెగుదురు తడసిన' నావుడు । నగు నట్టిద కర్జ' మనుచు నందఱు భీతిన్. 367

ప్రతిపదార్థం: ఏడ్చినన్= ఏడిస్తే; తెగిపోయినవారు= చచ్చిపోయినవారు; మగుడుదురే?= తిరిగివస్తారా?; వెఱ్ఱులార!= పిచ్చివాళ్ళలారా!; మానుఁడు= మానుకొనండి; తడసినన్= ఆలస్యం చేస్తే; మీరున్= మీరూ; తెగుదురు= చచ్చిపోతారు; నావుడున్= గద్ద అనగానే; అట్టిద కర్జము= అట్లాంటిపనే; అగును= జరుగుతుంది; అనుచున్= అంటూ; అందఱున్= అంతమంది; భీతిన్= భయంతో.

తాత్పర్యం: చచ్చిపోయినవారు ఎంత ఏడ్చినా తిరిగిరారు. పిచ్చిగా ఏడవటం మానుకొనండి. జాగు చేశారంటే మీరూ చావగలరు' అన్నది గద్ద. అక్కడకు వచ్చిన చుట్టాలంతా అట్లాగే జరుగుతుందేమో అనుకొంటూ భయపడి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. శవంబు విడిచి పోవంజూచిన, నొక నక్క బొక్కలోనుండి వెడలి వారలతోడ నిట్లనియె. 368

ప్రతిపదార్థం: శవంబున్= పీనుగును; విడచి= వదలి; పోవన్+చూచినన్= వెళ్ళబోగా; ఒక నక్క; బొక్కలోనుండి= బొరియలోనుండి; వెడలి= బయటకు వచ్చి; వారలతోడన్= వాళ్ళతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: పీనుగును విడిచిపెట్టిపోవాలనుకొంటున్నప్పుడు కలుగులోనుండి అపుడే వెలుపలికి వస్తున్న నక్క ఇట్లా అన్నది.

సీ. 'గ్రద్ద మాటల కేల కడు భీతిఁ బొందితి । రక్కటా! బాలుని నబ్జవదను
నిటు వైచి పోవఁ గా ళ్ళెట్లాడె నేడ్వుఁడు । శోకంబు వోవ నిచ్చోటఁ గొంత
ప్రా ద్దంతలో విధి క్రూరుండు గాకున్నఁ । బ్రాణంబు గ్రమ్మఱ రాక గల్గు
నో యెఱుంగుదురే; యినుండును నస్తాద్రిఁ । జేరఁడు; వెఱవక మీరు నిలువుఁ'

తే. డనిన వారును మనమున నాసపుట్టి । మగిడి వచ్చిన గ్రద్ద 'యిమ్మందబుద్ధి
యైన నక్కమాటలు వినగనె? వికృత । మయ్యెఁ బీనుంగు; వచ్చునే యసువు లింక? 369

ప్రతిపదార్థం: గ్రద్ద మాటలకున్= గద్ద పలుకులకు; కడుభీతిన్= మిక్కిలి భయాన్ని; పొందితిరి+ఏల?= పొందారు ఎందుకు?; అక్కట!= అయ్యో!; అబ్జవదనున్= పద్మంవలె విప్పారిన ముఖంగల; బాలునిన్= పిల్లవాడిని; ఇటు వైచి= ఇట్లా పాతిపెట్టి; పోవఁగాన్= వెళ్ళటానికి; కాళ్ళు+ఎట్టాడెన్?=కాళ్ళెట్లావచ్చాయి?;కొంతప్రొద్దు=కొంతసేపు;శోకంబుపోవన్=దుఃఖంపోయేటట్లు;ఇచ్చోటన్=ఈ ఒలుకుల్లోనే(శ్మశానంలోనే); ఏడ్వుఁడు= ఏడ్వండి; అంతలోన్= అంతట్లోకి; విధి= బ్రహ్మ; క్రూరుండు= కసాయి గుండె కలవాడు; కాక+ఉన్నన్= కాకుంటే; ప్రాణంబు= ఊపిరి; క్రమ్మఱన్= తిరిగి; రాక కల్గునో!= రావటం జరుగుతుందేమో!; ఎఱుంగుదురే?= మీకు తెలుసునా?; ఇనుండునున్= సూర్యుడు కూడా; అస్త+అద్రిన్+చేరఁడు= క్రుంకలేదు; వెఱవక= భయపడకుండా; మీరు; నిలువుఁడు= ఆగండి; అనినన్= అని నక్క పలకగానే; వారును= వారూ; (పీనుగు చుట్టాలు); మనమునన్= మనస్సులో; ఆసపుట్టి= ఆశ కలిగి; మగిడి వచ్చినన్= తిరిగి రాగా; గ్రద్ద= గద్ద; ఈ మందబుద్ధిఐన= మందమతి అయిన; నక్కమాటలు= నక్క పలుకులు; వినన్+అగునె?= వినవచ్చునా?; పీనుంగు= పీనుగు వికృతము+అయ్యెన్= వికారం పొందింది; అసువులు= ప్రాణాలు; ఇంకన్= ఇంకా; వచ్చునే?= వస్తాయా?

తాత్పర్యం: 'గద్దమాటలకు అంత భయపడటం దేనికి' అయ్యో! చక్కటి పిల్లవాడిని ఇక్కడ పాతిపెట్టి పోవటానికి మీకు కాళ్ళెట్లావచ్చాయి? మీ కడుపుశోకం తీరిపోయేదాకా ఈ వల్లకాటిలోనే కాసేపు ఏడ్వండి. అంతలో బ్రహ్మ దయ ఉంటే ఈ పిల్లవాడు ఊపిరి మళ్ళీ పోసుకొంటాడేమో? మీ రేమి ఎరుగుదురు? ఇంకా సరిగ్గా పొద్దుగ్రుంకనూ లేదు. మీరు భయపడకుండా ఉండండి' అని నక్క చెప్పింది. అప్పుడు అక్కడ ఉన్నవాళ్ళకు ఆశ పుట్టింది. తిరిగివచ్చారు. గ్రద్ద వాళ్ళను చూచి 'ఈ మందమతి నక్కమాటలు వినవచ్చా? పీనుగు రూపం చెడింది. పోయిన ప్రాణాలు మళ్ళీ వస్తాయా ఏమి?

క. కడు బెట్టిదుండు కాలుఁడు; । మిడుక మిడుక నపహరించు; మీరీ యాసల్
విడువుఁడు; బాలునికి సుగతిఁ । బడయుఁడు దానాదు లైన బహుధర్ములన్. 370

ప్రతిపదార్థం: కాలుఁడు= యముడు; కడుబెట్టిదుండు= కటికవాడు; మిడుక మిడుకన్= పరితపిస్తుండగా; అపహరించున్= (ప్రాణాలు) ఎత్తుకొనిపోతాడు; మీరు; ఈ ఆసల్= ప్రాణాలు తిరిగి వస్తాయి అనే ఆశలు; విడువుఁడు= వదులుకొనండి; దాన+ఆదులు+ఐన= దానం చేయటం మొదలైన; బహుధర్ములన్= అనేక పుణ్యాలచేత; బాలునికిన్= ఈ పిల్లవాడికి; సుగతిన్= ఉత్తమ గతిని; పడయుఁడు= కలిగించండి.

తాత్పర్యం: యముడు చాలా కటికగుండెవాడు. కుయ్యో మొర్రోమని బాధపడుతుండగా ప్రాణాలు తీసికొని వెళ్ళిపోతాడు. మీ పిల్లవాడు ప్రాణాలతో తిరిగి వస్తాడనే ఆశలు పెట్టుకొనకండి. దానధర్మాలు చేసి ఆ పిల్లవాడికి పుణ్యగతులు కలిగించండి'.

వ. అని పలికిన నా గృధ్రంబు వచనంబు లాక్షేపించి యజ్జంబుకంబు వారల నుద్దేశించి. 371

ప్రతిపదార్థం: అని పలికినన్= అని మాటలాడిన; ఆ గృధ్రంబు= ఆ గద్ద; వచనంబులు= మాటలు; ఆక్షేపించి= తోసి రాజని; ఆ జంబుకంబు= ఆ నక్క; వారలన్+ఉద్దేశించి= పీనుగు చుట్టాలను గూర్చి.

తాత్పర్యం: అని చెప్పిన గద్ద మాటలను నక్క కాదని తోసిపుచ్చింది. ఆ పిల్లవాడి చుట్టాలతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'క్రూరంబు గృధ్ర మిట్టి కు । మారకునిం జూచి చూచి మసలకపోవన్
మీ రె ట్లోర్చెదరో క । న్నీ రిటు ననుబోటులకును నిలువ కొలికెడున్. 372

ప్రతిపదార్థం: గృధ్రము= గద్ద; క్రూరంబు= కటికది; ఇట్టి కుమారకునిన్= ఇట్లాంటి బిడ్డను; చూచి చూచి= చూస్తూ చూస్తూ; మసలక= ఉండకుండా; పోవన్= వెళ్ళటానికి; మీరు; ఎట్లు+ఓర్చెదరో= ఎట్లా తట్టుకుంటారో; ఇటు= ఇట్లా; ననుబోటులకును= నా బోటి జంతువులకే; కన్నీరు= కళ్ళనీళ్ళు; నిలువక= ఆగక; ఒలికెడున్= కారుతున్నాయి.

తాత్పర్యం: 'గద్దది రాతిగుండె. మీరు ఇట్లాంటి బిడ్డను చూస్తూ చూస్తూ వదలివెళ్ళటానికి ఎట్లా తట్టుకుంటారో. నావంటి వాళ్ళకే కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి.

క. దయమాలి పోవ నేటికిఁ? । బ్రయత్నమునఁ బొదువ దైవబలమున మీకుం
బ్రియ మెసఁగ బ్రదుకు బ్రదుకం । డయినను మఱి పోవరాదె?' యని చెప్పుటయున్. 373

ప్రతిపదార్థం: దయమాలి= పిల్లవాడి మీద జాలిలేకుండా; పోవన్= వెళ్ళటం; ఏటికిన్?= ఎందులకు?; ప్రయత్నమునన్= వదలని పట్టుదలతో; పొదువన్= తలపడగా; దైవ బలమునన్= దైవశక్తిచేత; మీకున్= మీకు; ప్రియము+ఎసఁగన్= సంతోషం కలుగగా; బ్రదుకున్= బ్రతుకుతాడు; బ్రదుకండు అయినను= బతకకపోతే; మఱి= ఆ తరువాత; పోవరాదె?= వెళ్ళరాదా?; అని చెప్పుటయున్= అని నక్క చెప్పగానే.

తాత్పర్యం: నిర్దయగా పోవటం ఎందుకు? పంతంపట్టి తలపడండి. దైవం కలసివస్తే మీరంతా సంతోషించేటట్లు ఆ పిల్లవాడు లేచి వస్తాడు. అట్లా కాకపోతే అప్పుడే పోవచ్చును' అని చెప్పగానే.

వ. గ్రద్ద యిట్లనియె. 374

ప్రతిపదార్థం: గ్రద్ద= గద్ద; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: గద్ద ఈ విధంగా చెప్పింది.

ఆ. ఏను బుట్టివేయు నిన్నూఱు మున్నూఱు । గలవు వత్సరములు గాన నెందు
బాలు యౌవనస్థుఁ బ్రౌఢుని వృద్ధునిఁ । జచ్చిపోయి మగిడి వచ్చువాని. 375

ప్రతిపదార్థం: ఏను= నేను; పుట్టి= ఈ పుట్టుక పుట్టి; వేయున్+ఇన్నూఱు మున్నూరు= పదిహేనువందల; వత్సరములు= ఏళ్ళు; కలవు= అవుతుంది; చచ్చిపోయి= ప్రాణం పోయి; మగిడి= తిరిగి; వచ్చువానిన్= వచ్చేవాడిని; బాలున్= పసివాడిని; యౌవనస్థున్= కుర్రవాడిని; ప్రౌఢునిన్= వయస్సు వచ్చినవాడిని; వృద్ధునిన్= ముసలివాడిని; ఎందున్= ఎక్కడా; కానను= చూడలేదు.

తాత్పర్యం: 'నేను పుట్టి 1500ల ఏళ్ళయింది. ఇంత సుదీర్ఘకాలంలోనూ చచ్చి తిరిగి బతికివచ్చిన పసివాడినిగానీ, కుర్రవాడినిగానీ, వయసు వచ్చినవాడినిగానీ, ముసలివాడినిగానీ ఎక్కడా చూడలేదు.

క. ఒకటి గలదు; వత్తురు వే । ఱొక గర్భంబునకు మృతులు నుక్కివమౌ న
క్కకు నేటి బుద్ధి పీనుఁగు । నకు బ్రదుకటె! కలుగు నిట్టి నవ్వులు గలవే? 376

ప్రతిపదార్థం: ఒకటి కలదు= ఒకసంగతి ఉన్నది; మృతులు= చచ్చినవారు; వేఱొక గర్భంబునకున్= మరొకరి కడుపులోకి; వత్తురు= వస్తారు; ఉక్కివము+ఔ= మాయలమారి అయిన; నక్కకున్= నక్కకు, ఏటి బుద్ధి?= ఇదేమి ఆలోచన?; పీనుఁగునకున్= పీనుగునకు; బ్రదుకు= ప్రాణం; కలుగునటె!= వస్తుందా!; ఇట్టి= ఇట్లాంటి; నవ్వులు= వింతలు; కలవే?= ఉన్నాయా?

తాత్పర్యం: ఒక సంగతి ఉన్నది. చచ్చిపోయినవారు మరోజన్మ ఎత్తుతారు. బిత్తులమారి నక్కకు ఇదేమి బుద్ధి? పీనుగు ఎక్కడైనా తిరిగి బ్రతుకుతుందా? ఇట్లాంటి వింత లున్నాయా?'

సీ. అనవుడు నెగవెక్కి యా బిడ్డవైచి పో । యెడు వారలకు నడ్డపడుచు నక్క
'వినుఁడు రాఘవుఁడు నేర్పున బ్రదికింపఁడే । మృతుఁడైన భూసుర సుతుని మగుడ?
సృంజయు కొడుకు సచ్చిన నారదుఁడు ప్రభా । వంబునఁ గ్రమ్మఱ వానిఁ దేఁడె?
యట్టుల యొక సిద్ధుఁ డమరుండు మీ యేడ్పు । లాలించి దయ బాలు నసువు లొసఁగె

ఆ. నేని మేల కాదె! యిది యేల పోయెద?' । రనిన వారు మగిడి యరుగుదెంచి
శిశువు శవము చుట్టుఁ జేరి పెల్లేడ్చిరి । పనవిపనవి యంత నినుడుఁ గ్రుంకె. 377

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; ఎగ వెక్కి= పైకి ఎక్కిళ్ళుపెట్టి ఏడ్చి; ఆ బిడ్డన్= ఆ పిల్లవాడిని; వైచి= పాతిపెట్టి; పోయెడు వారలకున్= వెళ్ళేవాళ్ళకు; నక్క; అడ్డపడుచున్= అడ్డంగా వస్తూ; వినుఁడు= ఆలకించండి; మృతుఁడు+ఐన= చచ్చిపోయిన; భూసుర సుతునిన్= బాపడి కొడుకును; రాఘవుఁడు= రాముడు; మగుడన్= తిరిగి; నేర్పునన్= సామర్థ్యంతో; బ్రదికింపఁడే= ప్రాణం పోయలేదా; సృంజయు కొడుకు= సృంజయుడి కుమారుడు; చచ్చినన్= చనిపోగా; నారదుఁడు= నారదుడు; ప్రభావంబునన్= తన మహిమచేత; క్రమ్మఱన్= తిరిగి; వానిన్+తేఁడె?= వాడిని తేలేదా?; అట్టుల= ఆ విధంగానే; సిద్ధుఁడు= అణిమాది సిద్ధులు కల; ఒక అమరుండు= ఒక దివ్య పురుషుడు; మీ ఏడ్పులు= మీరు పెట్టే శోకాలు; ఆలించి= విని; దయన్= జాలితో; బాలు= బాలుడి; అసువులు= ప్రాణాలు; ఒసఁగెన్+ఏని= ఇస్తే; ఇది= మళ్ళీ ఊపిరాడటం; మేల కాదె?= మంచిదే కదా?; పోయెదరు ఏల?= వెళ్ళిపోతారు ఎందుకు?; అనినన్= అనగానే; వారు= వారు (పీనుగ చుట్ట పక్కాలు); మగిడి= వెనక్కి తిరిగి; అరుగుదెంచి= వచ్చి; శిశువు= ఆ పిల్లవాడి; శవము చుట్టున్= పీనుగు చుట్టూ; చేరి= పొంది; పనవి పనవి= తలచుకొని తలచుకొని; పెల్లు= పెద్ద పెట్టున; ఏడ్చిరి= రాగాలు తీశారు; అంతన్= అంతలో; ఇనుఁడున్= సూర్యుడూ; క్రుంకెన్= అస్తమించాడు.

తాత్పర్యం: గ్రద్ద అట్లా అనగానే పైకి వెక్కి వెక్కి ఏడుస్తూ ఆ పిల్లవాడిని అక్కడే పాతిపెట్టి వెళ్ళబోతున్న వాళ్ళకు నక్క అడ్డుపడింది. ఒక్కమాట వినండి అన్నది.'మునుపు రఘురాముడు ప్రాణంపోయిన బాపడి కొడుకును నేర్పుగా

బ్రతికించలేదా? నారదుడు తన మహిమ చూపి సృంజయుడనే రాజకుమారుడికి ప్రాణాలు పోయలేదా? ఆ విధంగానే ఒక సిద్ధుడైన దివ్యపురుషుడు మీ శోకాలు చెవినిబడి మీ పిల్లవాడికి ఊపిరి పోయవచ్చును. ఇది మీకు మంచిదే కదా! వెళ్ళిపోతారేం?' అనగానే ఆ పీనుగు చుట్టపక్కాలు వెనక్కి తిరిగి వచ్చి ఆ పీనుగుచుట్టూ చేరి పేరు పేరున చెప్పుకొంటూ పెద్ద పెట్టున రాగాలు పెట్టి ఏడ్చారు. అంతలో సూర్యుడు అస్తమించాడు.

వ. ఆ గృధ్రంబును జంబుకంబును నాఁకలిచేత వందురుచుండి తాన తాన బాలశవంబు నాహారంబు గొనుటకై యివ్విధంబునం దమ తమ పల్కునేర్పున నజ్జనంబుఁ గ్రమ్మఱించెఁ; బ్రొద్దు గ్రుంకినం దా నచ్చోట నిలువనేరదు గావున గ్రద్ద యటమున్న వారు వోవునట్టి తెఱంగు మాటలాడె; రాత్రియైనం దనకు మేలుగావున నక్కవారలు దడయుటకుం దగిన చందంబుఁ జెప్పె; నది వాని తెఱంగు ప్రేతవనవిహారనిరతుం డగు శంకరుండు కరుణాకింకరుండు నగుట నప్పుడు. 378

ప్రతిపదార్థం: ఆ గృధ్రంబును= ఆ గ్రద్దా; జంబుకంబునున్= నక్కా; ఆఁకలిచేత= ఆకలితో; వందురుచున్+ఉండి= నకనకలాడుతూ; తాన తాన= దేనికి అదే; బాలశవంబున్= పిల్లవాడి పీనుగును; ఆహారంబు+కొనుటకై= తినటానికి; ఈ విధంబునన్= ఈ తీరున; తమ తమ= వారి వారి; పల్కునేర్పునన్= మాటకారితనంతో; ఆ+జనంబున్= ఆ పిల్లవాడి చుట్టాలను; క్రమ్మఱించెన్= మళ్ళించాయి; ప్రొద్దు క్రుంకినన్= చీకటి పడితే; గద్ద; తాను; ఆ చోటన్= ఆ వల్లకాట్లో; నిలువనేరదు= ఉండలేదు; కావునన్= కాబట్టి; అట మున్న= అంతకుముందే (చీకటి పడకముందే); వారు= వారు; పోవునట్టి తెఱంగు= వెళ్ళేవిధంగా; మాటలు+ఆడెన్= మాటలాడింది; రాత్రి+ఐనన్= చీకటి పడితే; నక్క; తనకు; మేలు కావునన్= మంచిది కాబట్టి; వారలు= వారు; తడయుటకున్= జాగు చేయటానికి; తగిన చందంబున్= తగ్గట్టుగా; చెప్పెన్= చెప్పింది; అది= అట్లా చెప్పటం; వాని తెఱంగు= వాటి నైజం; ప్రేతవన= శ్మశానవాటికలో; విహార= విహరించటంలో; నిరతుండు+అగు= ఆసక్తికలవాడైన; శంకరుండు= శివుడు; కరుణాకింకరుఁడు= దయకు అధీనమైనవాడు; అగుటన్= అవటం వలన; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ గద్దా నక్కా ఆకలికి నకనకలాడుతూ దేని మట్టుకు అది ఆ పిల్లవాడి పీనుగును పీక్కుతినాలని ఇట్లా తమ మాటకారితనం చూపాయి. ఆ పీనుగు చుట్టాలను వెనుకకు మళ్ళించాయి. చీకటిపడితే గ్రద్ద ఉండలేదు కాబట్టి చీకటి పడకముందే వారు తిరిగి వెళ్ళేటట్లు మాట్లాడింది. రాత్రి అయితే నక్కకు మేలు కాబట్టి వారు ఆలస్యం చేయటానికి అనువుగా చెప్పింది. ఇట్లా చెప్పటం ఆ జంతువుల స్వభావం. ఒలుకులలో విహరించాలనే అపేక్షకల దయాళువైన శివుడు ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అట్లు పనవియేడ్చు నజ్జనంబులకుఁ బ్ర । త్యక్షమై 'వరంబు లడుగుఁ' డనిన
సంప్రమోద భక్తి సంభ్రమ భరితులై । చక్క నవనిఁ జాఁగి మ్రొక్కి వారు. 379

ప్రతిపదార్థం: అట్లు= అట్లా; పనవి= తలచుకొని; ఏడ్చు= దుఃఖించే ; ఆ+జనంబులకున్= ఆ జనానికి; ప్రత్యక్షము+ఐ= ఎదుటపడి; వరంబులు= కోరికలు; అడుగుఁడు= కోరండి; అనినన్= అనగానే; సంప్రమోద= పట్టరానంత సంతోషంతోనూ; భక్తి= ఆరాధనతోనూ; సంభ్రమ= తొట్రుపాటుతోనూ; భరితులు+ఐ= నిండినవారై; చక్కన్= చక్కగా; అవనిన్= నేలమీద; చాఁగి= సాగిలపడి; మ్రొక్కి= మొక్కి; వారు= ఆ పీనుగు చుట్టాలు.

తాత్పర్యం: తలచుకొని తలచుకొని ఏడుస్తున్న అక్కడి వారి ఎదుటకు వచ్చి 'మీకేం కావాలో కోరుకొనండి' అనగానే

ఎంతో సంతోషించారు. భక్తి సంభ్రమాలలో తేలిపోతూ నేలమీద సాగిలపడి మొక్కి, వారు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. బాల మరణ శోకంబునఁ ; దేలకయుండంగఁ గావు దేవోత్తమ! నీ
వాలించిన బ్రదికితిమి ద ; యాళుహృదయ! పార్వతీప్రియా! చంద్రధరా! 380

ప్రతిపదార్థం: దయాళుహృదయ!= జాలిగుండె కలవాడా!; పార్వతీప్రియా!= గౌరీపతీ!; చంద్రధరా!= చంద్రుడిని తలమీద పెట్టుకొన్నవాడా!; దేవోత్తమ!= దేవతలలో శ్రేష్ఠుడా శివుడా!; నీవు; ఆలించినన్= మా మొర ఆలకించినట్లైతే; బ్రదికితిమి= మేం బతికిపోయినట్టే; బాలమరణ= పిల్లవాడి చావువలన కలిగిన; శోకంబునన్= ఏడ్పులో; తేలక+ఉండంగన్= మునిగి పోకుండేటట్లు; కావు= రక్షించుము.

తాత్పర్యం: 'ఓ శివుడా! నీవు జాలిగుండె కలవాడవు. నెలవంకను నెత్తిన పెట్టుకొన్నవాడవు. పార్వతీపతివి. దేవతలలో ఉన్నతుడివి. ఈ పిల్లవాడి చావు అనే దుఃఖంలో మునిగిపోకుండా మమ్మల్ని రక్షించుము. నీవు మా మొర వింటే మేము బ్రతికిపోయినట్టే'.

వ. అనుచు లేచి నిలుచుటయు శివుం డా శిశుప్రాణంబు లొసంగి 'వీఁడు శతాయుస్సంపన్నుం డగువాఁ'డని యానతిచ్చి, యాగృధ్ర జంబుకంబులకు నాఁకలి యెన్నండును లేకయుండం బ్రసాదించి యంతర్హితుండయ్యెఁ; సంతోషంబున నంతరంగంబులు నంగంబులుం బొదల నజ్జనంబులు బాలునెత్తికొని పలుమఱుం జూచుచు, గౌఁగిలించుచుం జనిరి. గృధ్రంబును జంబుకంబును ముదంబునం బొంగుచుం బోయి తమ తమ కులంబులలోఁ బ్రభూతంబులై ప్రవర్తిల్లె; నార్త జనబాష్ప ప్రమార్జనంబు ప్రభువులకుం గర్తవ్యం బగుటకును నిజకార్యార్థులగు కపటుల నేర్పు మాటల తెరువు లెఱింగికొనుటకును నుదాహరణం బైన యీ గృధ్ర జంబుకోపాఖ్యానంబు. 381

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; లేచి నిలుచుటయున్= వారు లేచి నిలబడగా; శివుండు= శివుడు; ఆశిశు ప్రాణంబులు= ఆ పిల్లవాడి ప్రాణాలు; ఒసంగి= ఇచ్చి; వీఁడు= ఈ పిల్లవాడు; శత= నూరేళ్ళు; ఆయుఃసంపన్నుండు= ఆయుస్సంపద కలవాడు; అగువాఁడు= అవుతాడు; అని; ఆనతి+ఇచ్చి= దయతో చెప్పి; ఆ గృధ్రజంబుకంబులకున్= ఆ గద్ద, నక్కలకు; ఆఁకలి= ఆకలి; ఎన్నండును= ఎప్పటికీ; లేక+ఉండన్= కలగకుండేటట్లు; ప్రసాదించి= కనికరించి; అంతర్హితుండు+అయ్యెన్= కనుమరుగయ్యాడు; ఆ+జనంబులు= ఆ బాలుడి చుట్టాలు; సంతోషంబునన్= సంతోషంతో; అంతరంగంబులున్= మనస్సులున్నూ; అంగంబులున్= శరీరాలున్నూ; పొదలన్= ఉప్పొంగగా; బాలున్= పిల్లవాడిని; ఎత్తికొని= చంకన బెట్టుకొని; పలుమఱున్+చూచుచున్= అదేపనిగా చూచుకొంటూ; చనిరి= వెళ్ళారు; గృధ్రంబును= గద్దా; జంబుకంబును= నక్కా; ముదంబునన్= సంతోషంతో; పొంగుచున్+పోయి= ఉబుకుతూపోయి; తమతమ= వారి వారి; కులంబులలోన్= జాతులలో ప్రభూతంబులై= ముఖ్యులై; ప్రవర్తిల్లెన్= తిరుగాడాయి; ఆర్తజన= బాధలలో ఉన్నవాళ్ళ; బాష్ప= కన్నీటిని; ప్రమార్జనంబు= తుడవటం; ప్రభువులకున్= రాజులకు; కర్తవ్యంబు= చేయవలసినపని; అగుటకున్= అవటానికీ; నిజకార్య+అర్థులు+అగు= తమవైన పనులు చక్కబెట్టుకొనేవారైన; కపటుల= మాయగాళ్ళయొక్క; నేర్పుమాటల= మాటల చాతుర్యం; తెరువులు= తెన్నులు; ఎఱింగికొనుటకునున్= తెలిసికొనటానికిన్నీ; ఉదాహరణంబు+ఐన= మచ్చువంటిదైన; ఈ గృధ్ర జంబుక+ఉపాఖ్యానంబున్= ఈ గద్దా నక్క కథను.

తాత్పర్యం: అంటూ వాళ్ళు లేచి నిలబడ్డారు. శివుడు ఆ పిల్లవాడికి ప్రాణంపోసి 'వీడు నిండుగా నూరేళ్ళు బతుకుతాడు' అని చెప్పాడు. ఆ గద్ద నక్కలను కనికరించి ఎన్నటికీ ఆకలి లేకుండేటట్లు చేసి కనుమరుగయ్యాడు.

చెప్పలేనంత సంతోషంతో ఆ పిల్లవాడి చుట్టాలు ఆ పిల్లవాడిని ఎత్తుకొని పదే పదే చూచుకొంటూ కౌగిలించుకొంటూ వెళ్ళారు. గద్దా, నక్కా పట్టలేనంత సంతోషంతో ఉప్పొంగిపోతూ తమ తమ కులంలో మిన్నలయ్యాయి. కష్టాలలో ఉన్నవాళ్ళ కన్నీరు తుడవటం రాజులు చేయాల్సిన పని అనీ, కడుపే కైలాసం అనుకొని తమ పనులు చక్కబెట్టుకొనే మాయగాళ్ళ మాటకారితనాన్ని తెలిసికొనటానికిన్నీ, మాదిరివంటి ఈ గద్దా నక్క కథను. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినినఁ బఠించిన వ్రాసినఁ । గొనియాడిన దురితపీడకుం దొలఁగి నరుం
డనుపమధర్ములకు భా । జన మగు; నాయుఃప్రవృద్ధి సంపద నొందున్.' 382

ప్రతిపదార్థం: వినినన్= విన్నా; పఠించినన్= చదివినా; వ్రాసినన్= రాసినా; కొనియాడినన్= పొగడినా; దురిత పీడకున్= పాపం వలన కలిగే బాధకు; తొలఁగి= దూరమై; నరుండు= మనిషి; అనుపమ= సాటిలేని; ధర్ములకున్= పుణ్యాలకు; భాజనము+అగున్= పాత్ర మవుతాడు; ఆయుఃప్రవృద్ధి= ఆయువు పెరగటాన్నీ; సంపదన్= ఐశ్వర్యాన్నీ; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ కథ విన్నా, చదివినా, వ్రాసినా, మెచ్చుకొన్నా, ఆ మనిషికి పాపపు పీడ కలుగదు. ఎంతో పుణ్యం వస్తుంది. జీవితకాలం పెరుగుతుంది. సంపత్తి కలుగుతుంది'.

భీష్ముఁడు ధర్మజునకుఁ బవనశాల్మలీతరు సంవాదంబులు సెప్పుట (సం. 12-150-1)

సీ. అని వినతుం డగు నా ధర్మసుతునకు । ముదమునఁ జెప్పి భీష్ముండు మఱియు
నిట్లను నిది యొక్క యితిహాస మధిప! యా । కర్ణింపు: హిమవన్నగంబునందుఁ
గల దొక్క బూరువు; గడుఁ బెద్ద కాలంబు । ముదురు శాఖాశోభ మూలదృఢము
నారదముని యొక్కనాఁ డత్తరువు పాంతఁ । జనిచని వేడ్క నిట్లనియె: 'నెమ్మి

తే. బూరువా! యింతపఱపును బొడవుఁ । గల్గి నీవు మృగపక్షిసంశ్రయణీయ మగుచు
నునికి గని ప్రీతి నడిగెద ననిలుచేతఁ । బడు నొకప్పుడు తరులు నీ పడమి యెట్లు. 383

ప్రతిపదార్థం: అని; వినతుండు+అగు= వినయంకల; ఆ ధర్మసుతునకున్= ఆ ధర్మరాజుకు; భీష్ముండు= భీష్ముడు; ముదమునన్= సంతోషంతో; చెప్పి; మఱియున్= మళ్ళీ; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అధిప!= ధర్మరాజా!; ఇది= ఈ చెప్పబోయేది; ఒక్క+ఇతిహాసము= ఒక వెనుకటి కథ; ఆకర్ణింపు= వినుము; హిమవత్+నగంబునందున్= హిమాలయపర్వతంమీద; కడున్+పెద్ద కాలంబు= ఎన్నో ఏళ్ళనాటిది; ముదురు= బాగా చేవదేలినది; శాఖాశోభి= కొమ్మలతో అందంగా ఉన్నది; మూలధృఢము= గట్టి బోదెకలది అయిన; ఒక్కబూరువు= ఒక బూరుగుచెట్టు; కలదు= ఉన్నది; ఒక్కనాఁడు= ఒక దినం; నారదముని= నారద మహర్షి; ఆ తరువు పాంతన్= ఆ చెట్టు చెంతకు; చని చని= చేరి; వేడ్కన్= ఉబలాటంతో; నెమ్మిన్= ఆదరంగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; బూరువా!= ఓ బూరుగా!; ఇంత పఱపును= ఇంత విశాలమునూ; పొడవున్= ఎత్తునూ; కల్గి= ఉండి; నీవు= నీవు; మృగ= జంతువులకు; పక్షి= పిట్టలకు; సంశ్రయణీయము+అగుచున్= ఆశ్రయించదగ్గ దానివి అవుతూ; ఉనికి= ఉండటం; కని= చూచి; ప్రీతిన్= సంతోషంతో; అడిగెదన్= అడుగుతాను; అనిలుచేతన్= గాలితాకిడికి; తరులు= చెట్లు; ఒక్కప్పుడు= ఒక్కసారైనా; పడున్= కూలతాయి; నీ= నీవు; పడమి= పడకుండటం; ఎట్లు?= ఎట్లా?

తాత్పర్యం: అని వినయశీలుడైన ధర్మరాజుకు భీష్ముడు సంతోషంగా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు: 'ధర్మరాజా!

ఈ చెప్పబోయేది ఒక పురాణగాథ. వినుము హిమాలయాలమీద ఒక బూరుగుచెట్టు ఉండేది. అది చాలా ముదురు చెట్టు. కొమ్మలతో విస్తరించి ఒప్పిదంగా ఉండేది. దాని బోదె చాల గట్టిది. ఒకనాడు నారదముని ఆ చెట్టు దగ్గరకు వెళ్ళి కుతూహలంతో ఇట్లా అన్నాడు. 'ఓ బూరుగు చెట్టా! ఇంత వైశాల్యం, ఇంత ఎత్తూ ఉన్న నీవు జంతువులకూ, పిట్టలకూ, ఆశ్రయం ఇస్తున్నావు. ఇది చూచి సంతోషంతో అడుగుతున్నాను. గాలి తాకిడికి చెట్లు ఒకసారి కాకపోతే ఒకసారైనా కూలిపోతాయి కదా! నీవు కూలకపోవటానికి కారణం ఏమిటి?

క. పవనునకును నీకును బాం । ధవము గలదొ? యతఁడు నిన్ను దయ రక్షింపన్
సవినయవృత్తిని బ్రతికితొ? । చెవులకు నింపెసఁగ నిజము సెప్పుము నాకున్. 384

ప్రతిపదార్థం: అతఁడు= ఆ గాలిదేవుడు; నిన్నున్= నిన్ను; దయన్= జాలితో; రక్షింపన్= కాపాడటానికి; పవనునకును= గాలికినీ; నీకును= నీకూ; బాంధవము= చుట్టరికం; కలదొ?= ఉన్నదా?; సవినయ వృత్తిని= అణకువగల నడవడితో; బ్రతికితి+ఒ?= బతికావా?; చెవులకున్= చెవులకు; ఇంపు+ఎసఁగన్= హితవు కలిగేటట్లు; నాకున్= నాకు; నిజము= ఉన్నది ఉన్నట్లు; చెప్పుము= వచించుము.

తాత్పర్యం: గాలిదేవుడు నిన్ను కాపాడటానికి మీ ఇద్దరికీ చుట్టరికం కలిసిందా? అణకువగా మెలగటంవలన బ్రతికిపోయావా? ఉన్నది ఉన్నట్లుగా నాకు వినాలనిపించేటట్లు చెప్పుము'.

క. అనిన విని బూరు విట్లను । 'ననిలుని బల మస్మదీయమైన బలముతో
నెనగా దేర్పడ; విను పదు । నెనిమిది యగు నంశమునకు నెనయ దరయఁగన్. 385

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని; బూరువు= బూరుగు చెట్టు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది; అనిలుని బలము= గాలిసత్తువ; అస్మదీయము+ఐన= నాదైన; బలముతోన్= బలిమితో; ఎన గాదు= సాటి కాదు; ఏర్పడన్= స్పష్టంగా; వినుమ= వినుము; అరయఁగన్= ఆలోచించగా; పదునెనిమిది+అగు+అంశమునకున్= పద్దెనిమిదవ భాగానికీ; ఎనయదు= (గాలి బలం) సరిపోలదు.

తాత్పర్యం: నారదమునితో బూరుగు చెట్టు ఇట్లా అన్నది. 'గాలిదేవుడి సత్తువ నా సత్తువతో సాటి రాదు. ఇంకా చెప్పాలంటే నా బలంలో 18వ వంతుకు కూడ సరితూగదు'.

వ. అని పలుకుటయు నమ్మునీంద్రుండు. 386

ప్రతిపదార్థం: అని; పలుకుటయున్= పలకగానే; ఆ+మునీంద్రుండు= ఆ నారదుడు.

తాత్పర్యం: అన్న బూరుగుచెట్టుతో నారదముని - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'అమ్మచెల్ల! యిట్టు లనకుము గొండలు । లోనుగాఁగ బవనుచే నపాస్త
మహిమ గలుగు టెఱుఁగుమా భూతముల చేష్టి । తములు వాయువశగతములు గావె? 387

ప్రతిపదార్థం: అమ్మచెల్ల!= అయ్యో!; ఇట్టులు= ఇట్లా; అనకుము= చెప్పకుము; పవనుచేన్= గాలిచేత; కొండలు లోనుగాఁగన్= పర్వతాలు మొదలుగాగలవి; అపాస్త= పోగొట్టబడ్డ; మహిమ కలుగుట= మహాత్మ్యం కలవిగా; ఎఱుఁగుమా!= తెలిసికొనుమా!; భూతముల= అన్ని ప్రాణుల; చేష్టితములు= నడకలు; వాయువశగతములు కావె?= గాలి దేవుడికి లోబడి నడచుకొనేవి కావా?

తాత్పర్యం: 'ఔర! ఇట్లా మాట్లాడకుము. గాలిచేత కొండలు కూడా కొట్టుకుపోతాయని తెలిసికొమ్ము. సమస్త జీవరాశి నడకలన్నీ గాలిదేవుడి కింద ఉండేవి కావా?'

క. అనుటయుఁ 'బెలుచని యెలుఁగున । ఘనమూల ప్రబలశాఖికా దుర్జయు న
న్నును దాఁకిన నతని ప్రభం । జనుఁ డను నామంబునకు నసత్యత వచ్చున్.' 388

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; పెలుచని+ఎలుఁగునన్= పెద్దగొంతుతో; ఘనమూల= పెద్ద బోదె; ప్రబలశాఖికా= దిట్టమైన కొమ్మలూ కలిగి; దుర్జయున్= గెలవరాని; నన్నును= నన్నూ; తాఁకినన్= ఎదుర్కొంటే; అతని= ఆ గాలికిగల; ప్రభంజనుఁడు+అను నామంబునకున్= ప్రభంజనుడు (అతి తేలికగా విరగ్గొట్టేవాడు) అనే పేరుకు; అసత్యత= అబద్ధం; వచ్చున్= వస్తుంది.

తాత్పర్యం: అనగానే ఆ బూరుగుచెట్టు పెద్ద గొంతుతో 'పెద్ద బోదె, పెద్ద పెద్ద కొమ్మలూ ఉండి ఎదిరించ శక్యంకాని నాతో ఢీకొంటే అతడి కున్న ప్రభంజను డనే పేరు అబద్ధం అవుతుంది సుమా!'

వ. అని గర్వంపు మాట లాడిన యా శాల్మలిం జూచి సురమునిప్రవరుండు. 389

ప్రతిపదార్థం: అని; గర్వము+మాటలు= పొగరుబోతు పలుకులు; ఆడిన= పలికిన; ఆ శాల్మలిన్= ఆ బూరుగుచెట్టును; చూచి= కని; సురముని ప్రవరుండు= దేవమునులలో మేటి అయిన నారదుడు.

తాత్పర్యం: అని పొగరుగా మాటలాడిన ఆ బూరుగుచెట్టును చూచి దేవముని నారదముని. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'మఱవకయుండు నీ బిరుదు మాటలు నీ విటు లంట మారుతుం
డెఱిఁగెడు నెట్లు నంచు వెస నేఁగి సమస్తముఁ జెప్ప నాతఁ డే
డ్తెఱఁ జనుదెంచి నీ వటు కడింది మగండవు; నిన్నుఁ దాకినం
జెఱుతటె పేరు? బూరుగ నశించితిగా కిటఁ బల్కు లేటికిన్?' 390

ప్రతిపదార్థం: నీ బిరుదు మాటలు= నీ బీరపు పలుకులు; మఱవక+ఉండు= మర్చిపోకుము; నీవు= నీవు; ఇటులు= ఇట్లా; అంట= అనటం; ఎట్లున్= ఎట్లాగైనా; మారుతుండు= గాలిదేవుడు+ఎఱిఁగెడున్= తెలిసికొనగలుగుతాడు; అంచున్= అంటూ; వెసన్= తొందరగా; ఏఁగి= వెళ్ళి; సమస్తమున్= అంతా; చెప్పన్= చెప్పగా; ఆతఁడు= ఆ గాలిదేవుడు; ఏడ్తెఱన్= విజృంభణంతో; చనుదెంచి= వచ్చి; బూరుగ= ఓ బూరుగా; నీవు= నీవు; అటు= అట్లా; కడింది= గొప్ప; మగండవు= శూరుడివి; నిన్నున్= నిన్ను; తాఁకినన్= ఎదుర్కొంటే; పేరు= నా పేరును; చెఱుతటె= మాపివేస్తానన్నావుట; ఇటన్= ఇక్కడ; పల్కులు= మాటలు; ఏటికిన్?= ఎందుకు?; నశించితి+కాక= రూపుమాసిపోతావు గాక.

తాత్పర్యం: 'నీవు బింకంగా పలికిన మాటలు మర్చిపోకుము. నీవు ఇట్లా అన్నావని గాలిదేవుడు ఎట్లాగైనా తెలిసికొంటాడు' అంటూ నారదుడు వెళ్ళిపోయాడు. అదంతా ఆ వెంటనే గాలిదేవుడి చెవిని వేశాడు. గాలిదేవుడూ విజృంభించి వచ్చాడు. 'నీవు మహామొనగాడివా? నీ జోలికి వస్తే నా పేరు చెరిపేస్తానన్నావుట? నీవు చెడిపోతావు సుమా! ఇట్లాంటి మాటలు ఎందుకంటావు?'

మ. అని కోపంబునఁ బల్క నప్పవనుతో నా భూరుహం 'బింత పె
ల్చన నీ వాడెదు నంత తక్కువనె? బేలా! లోకసామాన్య వృ
క్షనికాయంబును నన్ను నొక్కటిగ నిచ్చం జూచితే?' యన్న న
ల్లని న వ్వొప్పఁగ నా సమీరణుఁడు హేలాస్ఫారుఁ డై యిట్లనున్. 391

ప్రతిపదార్థం: అని; కోపంబునన్= రోషంతో; పల్కున్= మాట్లాడగా; ఆ+పవనుతోన్= ఆ గాలిదేవుడితో; ఆ+భూరుహంబు= ఆ బూరుగు చెట్టు (భూమిలో పుట్టేది భూరుహము); బేలా!= తెలివితక్కువవాడా!; ఇంత= ఇంత; పెల్చున= గట్టిగా; నీవు= నీవు; ఆడెదవు= మాట్లాడుతున్నావు; అంత తక్కువనె?= అంత చవటనా?; లోకసామాన్య= లోకంలో సాధారణం అయిన; వృక్షనికాయంబును= చెట్లన్నిటినీ; నన్నున్= నన్నూ; ఒక్కటిగన్= ఒక్కటిగా; ఇచ్చున్= మనస్సులో; చూచితే?= ఎంచావా?; అన్నన్= అనగానే; అల్లని= మెల్లని; నవ్వు; ఒప్పఁగన్= ప్రకాశించగా; ఆ సమీరణుఁడు= ఆ గాలిదేవుడు; హేలాస్ఫారుఁడు+ఐ= పెద్దగా లెక్కపెట్టనివాడై; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని రోషంగా గాలిదేవుడు మాట్లాడాడు. అతడితో ఆ బూరుగుచెట్టు ఇట్లా అన్నది. 'ఓ వెర్రివాడా! నీవు ఇంత గట్టిగా మాట్లాడుతున్నావు. నేను నీవు అన్నంత బలహీనుడనా? లోకంలోని మిగతా చెట్లవలె నన్నూ ఎంచకుము' అని అనగానే ఆ గాలిదేవుడూ ఆ మాటలను పెద్దగా లెక్కపెట్టకుండా మెల్లగా నవ్వుతూ ఈ విధంగా అన్నాడు.

క. 'ఒకనాఁ డజుండు నీ నీ । డకు డబ్బా టరుగుదెంచుటయు నమ్మే లా
త్మకు వ్రేఁగై మన్నించిన । మెకమెక పడితిట్ల పలుకుమీ తగరేపున్.' 392

ప్రతిపదార్థం: ఒకనాఁడు= ఒక దినం; అజుండు= బ్రహ్మ; నీ నీడకున్= నీ నీడపట్టుకు; డబ్బాటు= అనుకొనకుండా; అరుగుదెంచుటయున్= రావటమున్నూ; ఆ+మేలు= ఆ నీ ఉపకారం; ఆత్మకున్= మనస్సుకు; వ్రేఁగై= బరువై; మన్నించినన్= (నిన్ను) ఆదరించగా; మెకమెక పడితి(వి)= మిడిసి పడ్డావు; తగన్= ఒప్పేటట్లు; రేపున్= మరునాడు కూడా; ఇట్ల పలుకుమీ!= ఇట్లానే మాట్లాడు సుమా!

తాత్పర్యం: 'ఒకనాడు బ్రహ్మ అనుకొనకుండా నీ నీడపట్టుకు వచ్చాడు. ఆ ఉపకారం ఎంతో బరువుగా అనిపించి నిన్ను ఆదరించాడు. అందుకు నీవు మిడిసిపడ్డావు. రేపుకూడా ఇట్లాగే మాట్లాడుము'.

వ. అని పలికి బలుమొగంబుతోడం బోయిన నబ్బూరువు దలంకి. 393

ప్రతిపదార్థం: అని పలికి= అని మాట్లాడి; బలుమొగంబుతోడన్= కోపంతో; పోయినన్= గాలి వెళ్ళగా; ఆ బూరువు= ఆ బూరుగు చెట్టు; తలంకి= బెదరిపోయి.

తాత్పర్యం: అని మాట్లాడి గాలిదేవుడు కోపంగా వెళ్ళిపోయాడు. ఆ బూరుగు చెట్టు భయపడి - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'మనుగడ దప్పు నొక్కొ! మునిమాటలు గైకొన నైతి; నా బలం
బన నది యెంత? యుగ్రత మహాబలురాకకు నోర్వఁ జాల; నా
తని నొక భంగి గెల్తు'నని తాఁ దలపోసి హరించె నాకులుం
గొనలును జొంపముల్ నిడుదకొమ్మలు రే యగుడున్ రయంబునన్. 394

ప్రతిపదార్థం: మనుగడ= నా ఉనికి; తప్పున్+ఒక్కొ!= కోల్పోతానో ఏమో!; ముని మాటలు= నారదముని వాక్కులు; కైకొనన్+ఐతిన్= లెక్కపెట్టకపోయాను; నా బలంబు= నా సత్తువ; అనన్= అనగా; అది+ఎంత?= అది ఎంతపాటిది?; ఉగ్రతన్= హోరుతో వచ్చే; మహాబలురాకకున్= గాలిదేవుడి రాకకు; ఓర్వఁజాలన్= తట్టుకొనలేను; ఆతనిన్= ఆ గాలిదేవుడిని; ఒక భంగిన్=

ఒక విధంగా అయితే; గెల్తున్= జయించగలుగుతాను (అని); అని= అని; తాన్= తాను; తలపోసి= ఆలోచించి; రే+అగుడున్= రాత్రి కాగానే; తాన్= తనకు తానుగా; రయంబునన్= తొందరగా; ఆకులున్= ఆకులను; కొనలును= చిన్న కొమ్మలను; జొంపములన్= ఆకులు మొదలగు వాటి గుబుర్లన్నీ; నిడుదకొమ్మలు= పొడవాటి కొమ్మలను; హరించెన్= విరిచేసికొన్నది.

తాత్పర్యం: నా ఉనికిని కోల్పోతానో ఏమో? నారదముని మాటలు చెవిని పెట్టకపోయాను. నా సత్తువ ఏపాటిది? హోరుమని వచ్చే గాలిదేవుడి రాకను నేను తట్టుకొనలేను. కాని, ఆతడిని ఒక విధంగా అయితే ఓడించగల నని ఆలోచించుకొన్నది. చీకటిపడిన తరువాత ఆకులను, కొమ్మలను, రెమ్మలను, గుబుర్లను, పొడవాటి కొమ్మలను తనకు తానే విరుచుకొన్నది.

వ. అట్లు తన్నుం దాన విఱుచుకొని యున్నంత వేగుటయు. 395

ప్రతిపదార్థం: అట్లు= అట్లా; తన్నున్ తాన= తనను తానే; విఱుచుకొని= త్రుంచుకొని; ఉన్నంతన్= ఉండగా; వేగుటయున్= తెల్లవారగా.

తాత్పర్యం: అట్లా తనకు తానే ఊడ్చుకొని మోడుగా ఉండగా తెల్లగ తెల్లవారింది.

చ. ప్రతినకు నీడుగా భయదభంగిఁ బ్రభంజనుఁ డేఁగుదెంచి యా
క్షితిరుహముం గనుంగొని 'యిసీ! యిది నా పని నీవ చేసి తీ
ధృతి మతి సంతసింపు మిట తేజముఁ బొందుము నీదు బాంధవ
ప్రతతికి నివ్విధంబు సదుపాయము మే లెఱిఁగింపు పెంపునన్.' 396

ప్రతిపదార్థం: ప్రతినకున్= శపథానికి; ఈడుగాన్= దీటుగా; భయద భంగిన్= భయం గొలిపేటట్లు; ప్రభంజనుఁడు= గాలిదేవుడు; ఏఁగుదెంచి= వచ్చి; ఆక్షితిరుహమున్= ఆ బూరుగుచెట్టును; కనుంగొని= చూచి; ఇసీ= ఛీ; ఇది= ఈ మోడురూపం; నా పని= నేను చేయాల్సిన పని; నీవ= నీవే; చేసితి(వి)= చేసికొన్నావు; ఈ ధృతిన్= ఇంతటి దిట్టతనంచేత; మతిన్= మనస్సులో; సంతసింపుము= సంతోషించుము; ఇట= ఈ పని చేసికొన్నందువలన; తేజమున్+పొందుము= వెలుగు వెలుగుము; నీదు బాంధవ ప్రతతికిన్= నీ చుట్ట పక్కాలందరికీ; ఈ+విధంబు= ఇది (ఈ మోడు బారటం అనేది); సదుపాయము= తగినసాధనం; మేలు= మంచిది అని; పెంపునన్= ఇంపుగా; ఎఱిగింపు(ము)= చాటి చెప్పుము.

తాత్పర్యం: తన ప్రతిజ్ఞకు దీటుగా భయంకరంగా గాలిదేవుడు రానే వచ్చాడు. ఆ బూరుగుచెట్టును చూచాడు. 'ఛీ! నేను చేయాల్సిన పనిని నీవే చేసికొన్నావు. ఇంతటి ధైర్యం చేశానని నీకు నీవే సంతోషపడుము. నీ చుట్ట పక్కాలందరికీ ఇదే తగిన సాధనం అనీ, మంచిపని అనీ చాటిచెప్పుము'.

వ. అని యుల్లసంబాడి సముల్లసద్గతి నా సదాగతి సనియె; నట్లు శాల్మలి పవనుచేత భంగంబు నొంది వగం
గుందెఁ; బ్రబలునితోడ దుర్బలుండు దొడరి మత్సరగ్రస్తుం డయిన నపాస్తవిభవుం డగు నని తెల్పు నప్పవన
శాల్మలీ సంవాదంబు పుణ్యప్రదం బయిన యుపాఖ్యానం బని చెప్పిన. 397

ప్రతిపదార్థం: అని ఉల్లసంబు+ఆడి= అని ఎత్తి పొడుపు మాటలు పలికి; సముల్లసత్+గతిన్= మిక్కిలి సంతోషించిన గమనంతో; ఆ సదాగతి= ఆ గాలిదేవుడు; చనియెన్= వెళ్ళాడు; అట్లు= అట్లా; శాల్మలి= బూరుగు చెట్టు; పవను చేతన్= గాలిచేత;

భంగంబున్+ఒంది= అవమానపడి; వగన్= దుఃఖంతో; కుందెన్= కుంగిపోయింది; ప్రబలుతోడన్= మంచి బలవంతుడితో; దుర్బలుండు= బలహీనుడు; తొడరి= తలపడి; మత్సరగ్రస్తుండు+అయినన్= పగబట్టిన వాడయినట్లయితే; అపాస్త= కోల్పోయిన; విభవుండు+అగున్= సంపన్ను డవుతాడు; అని; పుణ్యప్రదంబు+అయిన= పుణ్యం ఇచ్చేటటువంటిది అయిన; ఆ పవన శాల్మలీ సంవాదంబు= ఆ గాలీ - బూరుగు చెట్టూ వాదులాట అనే; ఉపాఖ్యానంబు= కథ; తెల్పును= బోధిస్తుంది.

తాత్పర్యం: అని ఎత్తి పొడిచి, సంతోషంగా వీస్తూ గాలిదేవుడు వెళ్ళాడు. అట్లా ఆ బూరుగుచెట్టు గాలిదేవుడిచేత అవమానం పొందిన దుఃఖంతో కుమిలిపోయింది. మహాబలవంతుడితో బలహీనుడు తలపడి పగపెట్టుకొంటే తన వైభవాన్ని కోల్పోతాడు - అని పుణ్యదాయకం అయిన ఈ గాలీ-బూరుగు చెట్టు అనే కథ తెలుపుతుంది' అని చెప్పగానే - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. పాండవాగ్రజుండు 'పాపంబునకు నధి । ష్ఠాన మెద్ది భరతసత్తమాగ్ర
గణ్య! దాని నెఱుఁగఁగాఁ జెప్పు' మనుడు నా । తనికి భీష్ముఁ డిట్టు లనియెఁ బ్రీతి. 398

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; భరతసత్తమ+అగ్రగణ్య!= భరతవంశపు ఉత్తములలో మొదటగ ఎన్నదగ్గ ఓ తాత!; పాపంబునకున్= పాపానికి; అధిష్ఠానము= మూలం; ఎద్ది?= ఏది?; దానిన్= దానిని; ఎఱుఁగఁగాన్= తెలిసేటట్లుగా; చెప్పుము= చెప్పుము; అనుడున్= అనగానే; ఆతనికిన్= ఆ ధర్మరాజుకు; భీష్ముఁడు= భీష్ముడు; ప్రీతిన్= సంతోషంతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు, 'భరతవంశంలోని ఉత్తములలో మొదట ఎంచదగ్గ భీష్ముడా! పాపానికి మూలం ఏది? ఆ పాపం ఉండే స్థానమేదో తెలియచెప్పుము' అనగానే భీష్ముడు సంతోషంగా ఈ విధంగా చెప్పాడు.

సీ. 'వినుము పాపముల కెల్లను నధిష్ఠానంబు । లోభంబ; యది గామలోలతయును
క్రోధంబు మత్సర ద్రోహంబులును బర । ధన దార వాంఛలు ధైన్యపాటు
వ్రీడాక్షమాసత్య విముఖ భావంబును । గలిగించి ధర్మంబు గలఁచి నరునిఁ
బ్రయి మాలి యేమిటి కయినను గర్దించు । వానిఁగా సమకట్టుఁ గాన లుబ్ధ

ఆ. జనులఁ దొఱఁగి లోభ మను తిరిం బడని స । త్యవ్రతులను బరమధార్మికులను
బాపభీతమతులఁ బనిగొను లోభంబుఁ । జెంద నీకు నీదు చిత్త వృత్తి.' 399

ప్రతిపదార్థం: వినుము= వినుము; పాపములకున్+ఎల్లన్= అన్ని పాపాలకూ; అధిష్ఠానంబు= మూలం; లోభంబ= పేరాసయే; అది= ఆ పేరాస; కామలోలతయును= నిలకడతనం లేని కోరికలూ; క్రోధంబున్= కోపాన్ని; మత్సర ద్రోహంబులును= పగనూ హింసాతత్వాన్నీ; పరధన= మరొకరి ఆస్తిపట్ల; దార= మరొకరి పెళ్ళాం పట్ల; వాంఛలున్= కోరికలునూ; ధైన్యపాటు= దీనత్వమున్నూ; వ్రీడా= సిగ్గుపట్ల; క్షమా= ఓర్పుపట్ల; సత్య= నిజంపట్ల; విముఖభావంబును= ఏవగింపునూ; కల్గించి= పుట్టించి; ధర్మంబు= న్యాయాన్ని; కలఁచి= (కలుషితంచేసి) చెరచి; నరునిన్= మానవుడిని; ప్రయిమాలి= నిందను లక్ష్యపెట్టకుండా; ఏమిటికిన్+అయినన్= ఎందుకయినా; గర్దించువానిఁగన్= పేరాసపడే వాడినిగా; సమకట్టున్= సిద్ధం చేస్తుంది; కానన్= కాబట్టి; లుబ్ధజనులన్= ఆశగలవారిని; తొఱఁగి= వదలి; లోభము+అను= పేరాస అనే; తిరిన్= సుడిలో; పడని= చిక్కుకోని; సత్య వ్రతులను= సత్యమే వ్రతంగా కలిగినవాళ్ళను; పరమధార్మికులను= మిక్కిలి పుణ్యాత్ములను; పాపభీతమతులన్= పాపం అంటేనే వణకిపోయే వారిని; పనిగొను=

నడిపే; లోభంబున్= పేరాసను; నీదు చిత్త వృత్తిన్= నీ మనోవ్యాపారాన్ని; చెంద నీకు= పొందనీయకు, అంటనీయకు.

తాత్పర్యం: 'ధర్మరాజా! పాపాలన్నిటికీ తావలం పేరాసే. అది కోరికలపట్ల నిలకడలేనితనాన్నీ, కోపాన్నీ, పగనూ, హింసాభావాన్నీ, మరొకరి ఆస్తి, మరొకరి పెళ్ళాంపట్ల కోరికనూ దీనత్వాన్నీ, సిగ్గు, ఓర్పు నిజాలపట్ల ఏవగింపునీ పుట్టిస్తుంది. న్యాయాన్ని చెరుస్తుంది. నిందలను లెక్కపెట్టకుండా ప్రతిదానికీ అత్యాశపడే వాడినిగా మనిషిని తయారు చేస్తుంది. కాబట్టి లోభులను విడిచిపెట్టాలి. లోభం అనే సుడిగుండంలో చిక్కుకొనని సత్యవ్రతులను, పుణ్యాత్ములను, పాపభీతులను వశంచేసికొనే లోభాన్ని నీ మనస్సును పొందనీయకుము'.

వ. అనిన విని యజాతశత్రుం 'డజ్ఞానం బాపదలకును దుర్గతికిని మూలం బని విందు; దాని తెఱం గెఱింగింపు' మనిన నాపగాతనయుం డమ్మనుజపతి కిట్లనియె. 400

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; విని= ఆలకించి; అజాతశత్రుండు= పుట్టని పగవారుగల ధర్మరాజు; అజ్ఞానంబు= తెలియనితనం; ఆపదలకును= విపత్తులకు; దుర్గతికిని= చెడ్డనడతకూ; మూలంబు= ఆధారం; అని విందున్= అని వింటాను; దాని తెఱంగున్= దాని స్వభావాన్ని; ఎఱింగింపుము= తెలియ చెప్పుము; అనినన్= అనగానే; ఆపగాతనయుండు= భీష్ముడు; ఆ మనుజపతికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ధర్మరాజు 'విపత్తులకూ, చెడునడతకూ అజ్ఞానమే ఆధారం అని విన్నాను. ఆ అజ్ఞానం తీరు తెన్నులను తెలుపుము' అనగానే భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

క. 'రోషము శోకము రాగ । ద్వేషము లభిమాన దర్ప వేగాలస్యా
శ్లేషము లజ్ఞాన మని మ । నీషి జనము సెప్పు మాననీయచరిత్రా! 401

ప్రతిపదార్థం: మాననీయ చరిత్రా!= మన్నించ దగ్గ నడవడి కలవాడా!; రోషము= కోపం; శోకము= దుఃఖం; రాగద్వేషములు= ప్రేమా పగలూ; అభిమాన= అహంకారం; దర్ప= పొగరూ; వేగ= తొందరపాటు; ఆలస్య= మందకొడితనం; శ్లేషములు= వీటి కలయికలు; అజ్ఞానము+అని= తెలియనితనం అని; మనీషి జనము= పండిత లోకం; చెప్పున్= చెప్పుతుంది.

తాత్పర్యం: 'కోపమూ, దుఃఖం, ప్రేమా, పగా, అహంకారం, గర్వం, తొందరపాటు, మందకొడితనం. వీటి సంపర్కమే అజ్ఞానం అని పండితులంతా చెప్పుతారు.

క. వినుఁ లోభము నజ్ఞానం । బును సదృశ ఫలప్రదముల; పుట్టును లోభం
బున నజ్ఞానము గావున । జననాయక! లోభముడుగ సౌఖ్యము లొందున్.' 402

ప్రతిపదార్థం: జననాయక!= రాజా!; వినుఁ= వినుము; లోభమున్= పేరాసా; అజ్ఞానంబును= తెలియని తనమూ; సదృశ ఫల ప్రదముల= సమాన ప్రయోజనాలను ఇచ్చేవే; లోభంబునన్= పేరాసచేత; అజ్ఞానము= అవివేకం; పుట్టును= పుట్టుతుంది; కావునన్= కాబట్టి; లోభము= పేరాస; ఉడుగన్= వదలగా; సౌఖ్యములు= భోగాలు; ఒందున్= పొందుతాయి.

తాత్పర్యం: పేరాసపడటం, తెలివి లేకపోవటం - ఈ రెండూ సమాన ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. లోభంవలన అజ్ఞానం పుట్టుతుంది. కాబట్టి ధర్మరాజా! లోభం వదలుకొంటే భోగాలు కలుగుతాయి'.

ఆ. అనిన ధర్మపుత్రుఁ 'డనఘ! ధర్మంబు నా । నా ప్రకారగతి వినంగఁబడు; మ

దీయ చిత్తమునకుఁ దేటపడంగ వి । శిష్ట ధర్మ మెద్ది సెప్పు' మనుడు. 403

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ధర్మపుత్రుఁడు= ధర్మరాజు; అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; ధర్మంబు= న్యాయం; నానా ప్రకారగతిన్= అనేక రకాలైన; విధానాలతో; వినంగబడున్= వినబడుతుంది (వాటిల్లో); విశిష్ట ధర్మము= ప్రధానమైన న్యాయం; ఎద్ది= ఏది; మదీయ చిత్తమునకున్= నా మనస్సుకు; తేటపడంగన్= తేటతెల్లమయ్యేటట్లు; చెప్పుము= చెప్పుము; అనుడున్= అనగానే.

తాత్పర్యం: భీష్ముడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు. 'ఓ పుణ్యాత్ముడా! న్యాయాన్ని అనేకవిధాలుగా వింటుంటాం. వాటిల్లో ఉత్తమ ధర్మం ఏదో నాకు బాగా విశదమయ్యేటట్లు చెప్పవలసింది' అనగానే. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ప్రియంబంది భీష్ముఁ డతనికి నిట్లనియె. 404

ప్రతిపదార్థం: ప్రియంబు+అంది= సంతోషాన్ని పొంది; భీష్ముఁడు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సంతోషంగా భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు దమంబు ప్రభావం బెఱిఁగించుట (సం.12-154-6)

క. 'తమతమ కలవడు విజ్ఞా । నముల తెరువు లాదరించి నానాగతులన్
సుమతులు ధర్ముము తెలిపిరి; । దమము పరాయణము ధీరతమ! యన్నిటికిన్. 405

ప్రతిపదార్థం: ధీరతమ!= ధైర్యవంతులలో మేటి అయిన రాజా!; సుమతులు= పండితులు; తమతమకున్= వారి వారికి; అలవడు= అబ్బేటటువంటి; విజ్ఞానముల= ఆయా శాస్త్రాదుల జ్ఞానాల; తెరువులు= విధానాలు; ఆదరించి= మన్నించి; నానాగతులన్= ఎన్నో తీరులలో; ధర్ముము= ధర్మాన్ని; తెలిపిరి= విశదపరిచారు; అన్నిటికిన్= అన్ని ధర్మాలకు; దమము= ఇంద్రియనిగ్రహం; పరాయణము= ఉత్తమమైన ఆశ్రయం.

తాత్పర్యం: 'ధైర్యవంతులలో మేటివైన ధర్మరాజా! పండితులు తాము తెలిసికొన్న శాస్త్రజ్ఞానాన్నిబట్టి ఎన్నో విధాలుగా ధర్మాన్ని గూర్చి తెలిపారు. ఈ ధర్మాలన్నిట్లోకి దమం ఉత్తమమైనది.

తే. దమము నిశ్రేయసము, పుణ్యతమము, ధర్మ । సార; మది వెలిగా ధర్మసంచయంబు
సిద్ధి పొందునె? దమముతో బుద్ధిపొందు । గనినఁ బొందని యున్నతుల్ గలవె? యధిప! 406

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; దమము= ఇంద్రియ నిగ్రహం; నిశ్రేయసము= ముక్తిదాయకం; పుణ్యతమము= గొప్ప పుణ్యం; ధర్మసారము= ధర్మాలలోని నిగ్గు; అది వెలిగాన్= ఆ దమం లేకుండా; ధర్మసంచయంబు= పుణ్యాలమూట; సిద్ధి పొందునె?= సాధ్యమవుతుందా?; దమముతోన్= ఇంద్రియ నిగ్రహంతో; బుద్ధి= జ్ఞానం; పొందు కనినన్= కూడుకొంటే; పొందని+ఉన్నతుల్= కలగని మీది దశలు; కలవె?= ఉంటాయా?

తాత్పర్యం: దమము ముక్తిదాయకం. గొప్ప పుణ్యం. ఇది ధర్మాలలోని నిగ్గు. ఇది లేకుండా పుణ్యాలమూట దొరుకుతుందా? దమానికి జ్ఞానం తోడైతే అందుకోలేని ఉన్నతదశ లుంటాయా? (ఉండవు.)

క. దమముం గడచిన సద్ధ । ర్మము లేదని విందు; నాశ్రమము లన్నిటికిన్
దమవంతుఁడు గామముఁ గ్రో । ధము లోభము మత్సరంబు దర్పము గెల్చున్. 407

ప్రతిపదార్థం: ఆశ్రమములు+అన్నిటికిన్= బ్రహ్మచర్య, గృహస్థ, సన్న్యాస, వానప్రస్థాది ఆశ్రమాలన్నిటికీ; దమమున్= ఇంద్రియ నిగ్రహాన్ని; కడచిన= మించిన; సద్ధర్మము= మంచి ధర్మం; లేదని విందున్= లేదని విన్నాను; దమవంతుఁడు= నిగ్రహం కలవాడు; కామమున్= కోరికనూ; క్రోధమున్= కోపాన్నీ; లోభమున్= పేరాసనూ; మత్సరంబున్= పగనూ; దర్పమున్= మదాన్నీ; గెల్చున్= జయిస్తాడు.

తాత్పర్యం: ఆశ్రమాలు నాలుగింటిలో ఇంద్రియనిగ్రహాన్ని మించిన మంచి ధర్మం లేదని విన్నాను. ఇంద్రియ నిగ్రహం కలవాడు కామ క్రోధ లోభ మద మాత్సర్యాలను జయిస్తాడు.

క. శీలంబు మైత్రి కరుణ య । లోలుపభావము తితిక్ష లోనగు మునిలో
కాలంబనీయ సద్గుణ । జాలంబు దమంబు రూపసంపద యధిపా! 408

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; దమంబు= ఇంద్రియ నిగ్రహం; శీలంబు= నడవడి; మైత్రి= చెలిమి; కరుణ= జాలి; అలోలుపభావము= పేరాస లేకపోవటం; తితిక్ష= ఓరిమి; లోనగు= మొదలైన; మునిలోక= మునులు మొత్తం; ఆలంబనీయ= ఆశ్రయించదగ్గ; సద్గుణ= మంచిస్వభావాల; జాలంబు= సమూహం; రూపసంపద= ఆకార సంపత్తి.

తాత్పర్యం: ఓ రాజా! ఈ దమము, నడవడి, చెలిమి, జాలి, పేరాస లేకపోవటం, ఓర్పు మొదలైన మునులందరిని ఆశ్రయించి ఉన్న మేలుగుణాల సమూహానికి ఊత. రూపసంపత్తి.

క. గుహయందు నిహిత మనియెడు । మహనీయ బ్రహ్మపదము మహిత దమత్వో
పహితుం డగువానికి స । న్నిహితం బని చెప్పుదురు మనీషిజనంబుల్.' 409

ప్రతిపదార్థం: గుహయందున్= హృదయంలో; నిహితము= దాచి ఉంచబడినది; అనియెడు= అనేటి; మహనీయ బ్రహ్మపదము= పరమబ్రహ్మపదం; మహితదమత్వ= పూజించదగ్గ ఇంద్రియ నిగ్రహంతో; ఉపహితుండు+అగు వానికిన్= కూడి ఉన్నవాడికి; సన్నిహితంబు= చేరువగా ఉంటుంది; అని; మనీషిజనంబుల్= పండితులు; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: పరమబ్రహ్మపదం హృదయంలో దాగి ఉన్నదంటారు. అది ఇంద్రియనిగ్రహం కలవాడికి మరింత దగ్గరవుతుందంటారు పండితులు'.

వ. అని విశదంబుగా వివరించె. 410

ప్రతిపదార్థం: అని= అని; విశదంబుగాన్= వివరంగా; వివరించెన్= తెల్లం చేశాడు.

తాత్పర్యం: అని విశదపరిచాడు.

ఆ. అట్లు దమము మహిమ యాదరంబున విని, । యమృతసేవ సేసినట్ల పోలె
హర్షమయ మనస్కుఁడై భీష్ము నడిగె నా । ధర్మనందనుండు తపము విధము. 411

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; దమము మహిమ= ఇంద్రియ నిగ్రహం యొక్క; గొప్పతనాన్ని; ఆదరంబునన్= మన్ననతో; విని= ఆలకించి; అమృతసేవ= అమృతపానం; చేసినట్లపోలె= చేసినట్లుగానే; హర్షమయ= ఆనందంతో నిండిన; మనస్కుఁడు+ఐ=

మనస్సు కలవాడై; ఆ ధర్మనందనుండు= ఆ యమధర్మరాజు కొడుకు ధర్మరాజు; భీష్మున్= భీష్ముడిని; తపము విధమున్= తపస్సు తీరును; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: అట్లా దమం ప్రభావాన్ని ఎంతో గౌరవంగా విన్న ధర్మరాజు అమృతం త్రాగినంతగా ఆనందించాడు. తపస్సు తీరునూ తెల్పుమని భీష్ముడిని అడిగాడు.

వ. అడిగిన నతం డతని కిట్లనియె. 412

ప్రతిపదార్థం: అడిగినన్= అడుగగా; అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ దపంబు విధము సెప్పుట (సం. 12-155-1)

క. తపము నిదానము ధర్మ । ప్రపంచమున కెల్ల; దానిఁ గ్రమమున వ్రతతం
త్రపరాయణు లొనరింతు ర । ధిప! ఫలమూలాంబువృత్తిఁ ధృప్తిఁ బొరయుచున్. 413

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ధర్మ ప్రపంచమునకున్+ఎల్లన్= ధర్మం తీరులలో కెల్లా; తపము= తపస్సు; నిదానము= మూలకారణం; దానిన్= ఆ తపస్సును; వ్రత తంత్ర పరాయణులు= వ్రతాలు చేయాలనే కోరికగలవారు; ఫల= పళ్ళూ; మూల= కందమూలాలు తిని; అంబు= నీళ్ళుత్రాగే; వృత్తిన్= బతకటంవలన; తృప్తిన్= తనివిని; పొరయుచున్= పొందుతూ; క్రమమునన్= వరసగా; దానిన్= ఆ తపస్సును; ఒనరింతురు= చేస్తారు.

తాత్పర్యం: 'రాజా! ధర్మాలన్నిటికీ తపస్సే మూలం. వ్రతాలు శ్రద్ధగా చేయాలనుకొనే వారు పళ్ళూ కందమూలాలు తింటూ నీళ్ళు తాగుతూ తృప్తిగా బ్రతుకుతుంటారు. క్రమం తప్పకుండా తపస్సు చేస్తుంటారు.

క. వినుమశన నిగ్రహము దప । మను నభిధానంబు గల మహాధర్మము త
ద్ధనవంతు చిత్తవశగతిఁ । జను నఖిల స్థావరములు జంగమతతులున్. 414

ప్రతిపదార్థం: వినుము= వినుము; అశన నిగ్రహము= మితమైన తిండి; తపము= తపస్సు; అను+అభిధానంబు+కల= అనేపేరుగల; మహాధర్మము= గొప్ప పుణ్యం; అఖిల స్థావరములు= కదలకుండా ఉండే పుట్టలూ చెట్లూ మొదలగునవన్నీ; జంగమ తతులున్= కదిలేవన్నీ; తద్+ధనవంతు= ఆ తపస్సంపన్నుడి; చిత్తవశగతిన్= మనస్సుకులోబడి; చనున్= నడచుకొంటాయి.

తాత్పర్యం: ఆహారనియమమే తపస్సు. అదే మహాధర్మం. ఆ తపస్సంపన్నుడి ఇష్టప్రకారం సమస్త చరాచరవస్తు సముదాయమూ నడచుకొంటుంది.

తే. పంచవిధవృత్తులగు మహాపాతకములు । లోనుగాఁ గిల్బిషము లెల్ల లుంఠితంబు
లగుఁ దపంబున సత్యశౌచాదు లొలయు । నఖిలసిద్ధులు నఱచేత నావహిల్లు. 415

ప్రతిపదార్థం: తపంబునన్= తపస్సుచేత; పంచవిధ వృత్తులు+అగు= ఐదు రకాలైన; మహాపాతకములు= గొప్ప పాపాలు; లోనుగాన్= మొదలుగా గల; కిల్బిషములు+ఎల్లన్= దోషాలన్నీ; లుంఠితంబులు+అగున్= పటాపంచలయిపోతాయి; సత్యశౌచాదులు=

నిజాయితీ, శుచి మొదలైనవి; ఒలయున్= పొందుతాయి; అఖిలసిద్ధులున్= అన్ని ప్రయోజనాలు; అఱచేతన్+ఆవహిల్లున్= సులభంగా అందుబాటులోకి వస్తాయి.

తాత్పర్యం: తపస్సువలన పంచ మహాపాతకాలు మొదలైన పాపాలన్నీ పటాపంచలవుతాయి. సత్యం, శుచి మొదలైనవి అలవడతాయి. సమస్త కార్యసిద్ధులూ అందుబాటులోకి వస్తాయి'.

వ. అనిన విని 'దేవ పితృ భూదేవగణంబులు సత్యంబు ప్రశంసించుఁ దదీయ స్వరూపంబును నది దొరకొను తెఱంగును నెఱింగింపు'మని యడిగిన నజాతశత్రునకు శంతనుపుత్రుం డిట్లనియె. 416

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; దేవ= దేవతలు; పితృ= పితృదేవతల; భూదేవ= బ్రాహ్మణుల; గణంబులు= సమూహాలు; సత్యంబున్= సత్యాన్ని; ప్రశంసించున్= పొగడుతాయి; తదీయ స్వరూపంబునున్= ఆ సత్యస్వభావాన్నీ; అది= ఆ సత్యం; దొరకొను తెఱంగునున్= పొందే విధానాన్నీ; ఎఱింగింపుము= తెలియచెప్పుము; అని అడిగినన్= అని అడుగగా; అజాత శత్రునకున్= ధర్మరాజుకు; శంతను పుత్రుండు= శంతను మహారాజు కొడుకు భీష్ముడు; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అవన్నీ విన్న ధర్మరాజు 'దేవతలూ, పితృదేవతలూ బ్రాహ్మణులూ మొదలైన వారంతా సత్యాన్ని మెచ్చుకొంటారు. దాని స్వరూపాన్నీ, దానిని అవలంబించే తీరునూ చెప్పుము' అన్నాడు. అపుడు భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

భీష్ముఁడు ధర్మరాజుకు సత్య స్వరూపాదులు సెప్పుట (సం. 12-156-3)

క. సమతయు దమముఁ దితిక్షయు । నమత్సరము హ్రీయు ధృతియు ననసూయార్య
త్వములు నహింసా దాన । క్షమా యజన సూనృతములు సత్యము మూర్తుల్. 417

ప్రతిపదార్థం: సమతయున్= సర్వభూతాలపట్ల సమభావమున్నూ; దమమున్= ఇంద్రియ నిగ్రహమున్నూ; తితిక్షయున్= ఓర్పూ; అమత్సరమున్= పగలేకపోవటమున్నూ; హ్రీయున్= సిగ్గూ; ధృతియున్= ధైర్యమూ; అనసూయ= సద్గుణాలపట్ల ఈర్ష్యలేకపోవటం; ఆర్యత్వములున్= జీవకోటికి శుభం కలిగించటం; అహింసా= హింస చేయకపోవటం; దాన= ఇవ్వటం; క్షమా= ఓర్పు; యజన= యాగం చేయటం; సూనృతములు= నిజాయితీ; సత్యము మూర్తుల్= సత్యంయొక్క రూపాలు.

తాత్పర్యం: అన్ని ప్రాణులపట్ల సమత, ఇంద్రియ నిగ్రహం, ఓర్పు, పగలేకపోవటం, సిగ్గు, ధైర్యం, ఈర్ష్యలేకపోవటం, ప్రాణులకు మేలు చేయటం, హింసకు ఒడిగట్టకపోవటం యాగం చేయటం దానం, ఓర్మి, నిజాయితి - ఇవీ సత్యం స్వరూపాలు.

క. సత్యాకృతు లగు గుణములు । నిత్యానుష్ఠిత సమగ్ర నిర్మలయోగ
స్థిత్యభిముఖునకు సులభము । లత్యంత సుఖప్రదంబు లవి కార్యంబుల్. 418

ప్రతిపదార్థం: సత్య+ఆకృతులు+అగు= సత్యం రూపాలైన; గుణములు= పదమూడు స్వభావాలు; నిత్య+అనుష్ఠిత= ఎల్లప్పుడూ ఆచరించే; సమగ్ర= సంపూర్తిగా; నిర్మల= పవిత్రమైన; యోగస్థితి= ధ్యానదశకు; అభిముఖునకున్= అనుకూలుడైనటువంటి వాడికి; సులభములు= తేలికగా దొరికేవి; అత్యంత సుఖప్రదంబులు= ఎంతో సుఖాన్నిస్తాయి; అవి= ఆ సత్యాకృతి గుణాలు; కార్యంబుల్= చేయాల్సినవి.

తాత్పర్యం: సత్యం రూపాలైన గుణాలు ఎల్లప్పుడూ ఆచరించే సంపూర్ణ ధ్యానస్థితికల యోగికి తేలికగా

అబ్బుతాయి. అవి ఎంతో సుఖాన్ని ఇస్తాయి. కాబట్టి ఆ గుణాలను ఆచరించాలి.

చ. కుదురు సమస్త ధర్మములకున్ వినుఁ సత్యము; యోగమోక్ష స
త్పదములు సత్యకార్యములు; పాప మసత్యముకంటె నొండు లే
దు; దలఁప నశ్వమేధములు దొమ్మిది నూఱులు వెండి నూఱునై
యొదవిన నీడు గావు భరతోత్తమ! సత్యముతోడ నారయన్. 419

ప్రతిపదార్థం: భరత+ఉత్తమ!= భరతవంశీకులలో ఉన్నతుడా!; వినుఁ= వినుము; సత్యము= సత్యం; సమస్త ధర్మములకున్= అన్ని ధర్మాలకు; కుదురు= ఆధారం, ఆలవాలం; యోగమోక్ష సత్పదములు= యోగం, మోక్షం అనే పుణ్యస్థానాలు; సత్యకార్యములు= సత్యంవలన నెరవేరే పనులు; తలఁపన్= ఆలోచించగా; అసత్యము కంటెన్= అబద్ధంకంటె; పాపము= కీడు; ఒండు లేదు= మరొకటి ఉండదు; ఆరయన్= విచారించగా; అశ్వమేధములు= అశ్వమేధయాగాలు; తొమ్మిది నూఱులు= తొమ్మిది వందలు; వెండి= మళ్ళీ; నూఱును+ఐ= వందయై; ఒదవినన్= చేస్తే; సత్యముతోడన్= ఒక్క సత్యంతో; ఈడు+కావు= సాటిరావు.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. సత్యం అన్ని ధర్మాలకూ పాదువంటిది. యోగమోక్షాలనే పుణ్యస్థానాలు సత్యంవలనే ఒనగూడుతాయి. అబద్ధాన్ని మించిన కీడు మరొకటి ఉండదు. ఆలోచిస్తే ఒక్క సత్యంతో వెయ్యి అశ్వమేధయాగాలు చేసిన ఫలం కూడా సాటిరాదు'.

వ. అనిన విని ధర్మతనయుం 'డరిషడ్వర్గం బేమిట నుదయించు? నెట్లు సమయు? నెఱింగింపవే? యనుటయు
ననిమిష నదీనందనుండు ధర్మనందనున కిట్లనియె. 420

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; ధర్మతనయుండు= ధర్మరాజు; అరిషడ్వర్గంబు= అంతశ్శత్రు జాతికి చెందిన కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే ఆరూ; ఏమిటన్= దేనివలన; ఉదయించున్?= పుట్టుతాయి?; ఎట్లు= ఎట్లా; సమయున్?= సమసిపోతాయి?; ఎఱింగింపవే= తెలుపవా; అనుటయున్= అనగానే; అనిమిష నదీనందనుండు= దేవనది అయిన గంగానది కొడుకు భీష్ముడు; ధర్మనందననకున్= ధర్మరాజుతో; ఇట్లు= ఇట్లా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అది విన్న ధర్మరాజు 'కామ క్రోధాది అరిషడ్వర్గాలు దేనివలన పుట్టుతాయో, దేనివలన గిట్టుతాయో తెలుపుము' అని అడిగాడు. భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు అరిషడ్వర్గాదులు దెలుపుట (సం. 12-157-3,4)

సీ. 'మనుజేంద్ర! సంకల్పమునఁ బుట్టుఁ గామంబు । రూపఱు దేహ నిరూపణమునఁ
బరులదోషంబునఁ బ్రభవించుఁ గ్రోధము । క్షీణక్షమాయుక్తిఁ జేసి పాలియు
భూతాస్థిరత్వంబు బుద్ధిఁ గానమి లోభ । మనఘ! జనించుఁ గాంచిన నడంగు
నజ్ఞానమున మోహమావహిల్లు నధర్మ । లేపవర్జనమున లేక తక్కుఁ

తే. గులమునను విద్యధనమునఁ గలుగు మదము । మరలి వాని పెంపూహింప మ్రుందిపోవు
సాత్త్వికుఁడు గామిఁ బొడము మాత్సర్య మదియుఁ । జెడఁ గురూత్తమ సాధు సంసేవనమున. 421

ప్రతిపదార్థం: అనఘ= పుణ్యవంతుడా!; మనుజ+ఇంద్ర!= రాజా!; సంకల్పమునన్= మనోభావనచేతనే; కామంబు= కోరిక; పుట్టున్= కలుగుతుంది; దేహనిరూపణమునన్= దాని స్వరూపాన్ని తెలిసికొంటే; రూపు+అఱున్= నశించిపోతుంది; క్రోధము= రోషం; పరుల దోషంబునన్= ఇతరులు చేసిన తప్పువలన; ప్రభవించున్= పుట్టుతుంది; అక్షీణ= తగ్గని; క్షమాయుక్తిన్+చేసి= ఓర్పు కలిగి

ఉండటంవలన; పాలియున్= పోతుంది; లోభము= అత్యాశ; భూత+అస్థిరత్వంబు= జీవులు ఎప్పుడూ ఉండేవి కావనే; బుద్ధిన్+కానమి= తెలిసికొనలేకపోవటం వలన; జనించున్= కలుగుతుంది; కాంచినన్= ఆ జ్ఞానం ఉంటే; అడంగున్= అణగారి పోతుంది; మోహము= మోహం; అజ్ఞానమునన్= అవివేకంవలన; ఆవహిల్లున్= కలుగుతుంది; అధర్మ= అధర్మం అనే; లేప వర్జనమునన్= పూతను తొలగించటంవలన; లేక తక్కున్= రూపు మాసిపోతుంది; కులమునను= కులంవలన; విద్య= చదువువలన; ధనమునన్= ధనంవలన; మదము= పొగరు; కల్గున్= కలుగుతుంది; మరలి= తిరిగి; వాని పెంపు= వాటి పెరుగుదలను; ఊహింపన్= తలపోయగా; క్రమ్మిపోవున్= దిగిపోతుంది; కురు+ఉత్తమ!= కురువంశంలో శ్రేష్ఠుడా!; సాత్త్వికుఁడు+కామిన్= సత్త్వగుణం లేని వాడవటంవలన; మాత్సర్యము= ద్వేషం; పొడమున్= పుట్టుతుంది; అదియున్= అదికూడా; సాధు సంసేవనమునన్= మంచివాళ్ళను కొలవటంవలన; చెడున్= పోతుంది.

తాత్పర్యం: 'రాజా! మనోభావంవలన కామం పుట్టుతుంది. దాని రూపం ఇట్లాంటిది అని తెలిసికొనగలిగితే ఆ కోరిక పోతుంది. ఇతరులు చేసిన తప్పువలన కోపం వస్తుంది. తరగని ఓర్పువలన అది తగ్గిపోతుంది. ప్రాణికోటి శాశ్వతం కాదు అనే తెలివి లేకపోవటంవలన లోభం పుట్టుతుంది. ఆ తెలివి పొందితే అది పోతుంది. అవివేకంవలన మోహం కలుగుతుంది. అధర్మం జోలికి పోకుంటే అది నశిస్తుంది. కులం, చదువూ, సంపదలవలన గర్వం ఏర్పడుతుంది. వాటి పెంపుదలను తలపోస్తే అదే దూరమవుతుంది. సాత్త్వికగుణం కొరవడటంవలన పగ పుట్టుతుంది. మంచివాళ్ళను సేవించటంవలన అది తొలగుతుంది.

క. ఈ యాఱింటను సకలా । పాయంబులు మానవులకుఁ బాటిలు; వీనిం
బాయంగ జడియనోపిన । ధీయుతునకు శుభము సద్గతియు సమకూరున్. 422

ప్రతిపదార్థం: ఈ+ఆఱింటను= ఈ ఆరింటివలన; సకల= అన్ని; అపాయంబులు= చెరుపులు; మానవులకున్= మనుష్యులకు; పాటిలున్= కలుగుతాయి; వీనిన్= ఈ కామాదులు ఆరింటిని; పాయంగన్= వదులుకొనటానికి; జడియన్+ఓపిన= భయపెట్టజాలిన; ధీయుతునకున్= బుద్ధిమంతుడికి; శుభము= మేలు; సద్గతియున్= ఉత్తమలోకమున్నూ; సమకూరున్= కలుగుతాయి.

తాత్పర్యం: కామం మొదలైన ఈ అరిషడ్వర్గాలవలన మనుష్యులకు అన్ని రకాల చెరుపులు కలుగుతుంటాయి. వీటిని వదలగొట్టుకొనేటట్లు జడుపు పుట్టించగల బుద్ధిమంతుడికి మంచి జరుగుతుంది. ఉత్తమ లోకం సిద్ధిస్తుంది.

క. ఇవి దోఁడేఱుల భంగిం । గవియుఁ బురుషు ధైర్యహానిఁ గనికొని; ధైర్యం
బవలంబించిన నరుఁ జే । రవు; వీనికి నిదియ తెఱఁగు రాజవరేణ్యా! 423

ప్రతిపదార్థం: రాజవరేణ్యా!= రాజోత్తమా! ఇవి= ఈ ఆరూ; ధైర్య= దిట్టతనం; హానిన్+కనికొని= తగ్గిపోవటం చూసి; తోఁడేఱుల భంగిన్= తోడేళ్ళవలె; కవియున్= చుట్టుముట్టుతాయి; ధైర్యంబున్= తెగువతనాన్ని; అవలంబించిన= ఊతచేసికొన్న; నరున్= మానవుడిని; చేరవు= పొందవు; దీనికిన్= ఈ అరిషడ్వర్గానికి; ఇదియ= ఇదే; తెఱఁగు= పద్ధతి.

తాత్పర్యం: ధర్మరాజా! మనిషిలో ధైర్యం కొరవడిం దనిపిస్తే చాలు - ఈ ఆరూ కూడా తోడేళ్ళవలె కలబడతాయి. ధైర్యవంతుల దరిదాపులకు మాత్రం రావు. ఇదీ వీటి సంగతి.

తే. అధిప! యివి ధార్తరాష్ట్రులయందుఁ జాలఁ । గలిగియుండు; నీ బుద్ధి నొక్కండుఁ జొరదు;
సారధీరతా సంప దుదారమతివి । గాన యింకను నిర్జింతు వీని నెల్ల. 424

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఇవి= ఈ అరిషడ్వర్గాలు; ధార్తరాష్ట్రులయందున్= ధృతరాష్ట్రుడి సంతానంలో; చాలన్= ఎక్కువగా; కలిగి+ఉండున్= పొంది ఉన్నాయి; నీ బుద్ధిన్= నీ మతిలో; ఒక్కండున్= ఒక్కటి అయినా; చొరదు= దూరదు; సార= మేటి అయిన; ధీరతాసంపద్= దిటవు అనే సంపదచే; ఉదారమతివి= గొప్ప బుద్ధి కలవాడవు; కాన= కాబట్టి; ఇంకను= ఇకపై; వీనిన్+ఎల్లన్= కామక్రోధాది శత్రువులు ఆరింటినీ; నిర్జింతు(వు)= జయిస్తావు.

తాత్పర్యం: ధర్మరాజా! ధృతరాష్ట్రుడి కొడుకులలో ఈ ఆరుగుణాలూ ఎక్కువ. వీటిలో ఏ ఒక్కటీ నీలో చొరబడదు. నీవు ధైర్యసంపదచేత గొప్పబుద్ధిమంతుడవు. కాబట్టి నీవు ఈ ఆరింటిని గెలుస్తావు.

వ. అని వెండియు. **425**

తాత్పర్యం: అని మళ్ళీ భీష్ముడు.

క. హింసావిహారి యైన నృ। శంసుం డీ యాఱుఁ గలుగు జనుకంటెను గీ
డంసప్రదేశలలితో। త్తంసీ కరణోపలాల్య ధరణీ వలయా! **426**

ప్రతిపదార్థం: అంసప్రదేశ= భుజాలపై; లలిత= మనోహరమై ఉన్న; ఉత్తంసీకరణ= సిగబంతి చేయటం చేత; ఉపలాల్య= లాలించబడుతున్న; ధరణీవలయా!= భూమండలం కలవాడా!; హింసావిహారి+ఐన= ఎపుడూ హింసతో ప్రవర్తించే; నృశంసుండు= క్రూరుడు; ఈ ఆఱున్+కలుగు= ఈ కామక్రోధాదులు ఆరూ ఉన్న; జనుకంటెను= మనిషికంటె; కీడు= చెడ్డవాడు.

తాత్పర్యం: భుజాలమీద మనోహరమైన సిగబంతిగా లాలించబడుతున్న భూమండలం గల ధర్మరాజా! హింసా ప్రవృత్తితో బ్రతికేవాడు ఈ ఆరు గుణాలు కలవారిని మించిన చెడ్డవాడు.

క. మే లనుభవించుఁ జుట్టము। లాలోకింపంగఁ గుజనుఁ డదియు నృశంసా
శీలము; పంచి కుడుచు నతఁ। డే లోకంబుననుఁ బేర్మి యెసఁగ సుఖించున్.' **427**

ప్రతిపదార్థం: కుజనుఁడు= చెడ్డవాడు; చుట్టములు= బంధువులు; ఆలోకింపంగన్= చూస్తుండగా; మేలు+అనుభవించున్= హాయిగా బ్రతుకుతాడు; అదియున్= అట్లా సుఖించటం కూడా; నృశంసాశీలము+అ= క్రూరస్వభావమే; పంచి= నలుగురికీ పెట్టి; కుడుచు+అతఁడు= తాను తినేవాడు; ఏలోకంబుననున్= ఏ లోకంలో అయినా; పేర్మిఎసఁగన్= మరింత గౌరవం పెరగగా; సుఖించున్= సుఖపడతాడు.

తాత్పర్యం: ఇట్లాంటి పాపాత్ముడు చుట్టూ చుట్టాలు చూస్తుండగానే, తాను ఒక్కడే హాయిగా బ్రతుకుతాడు. అట్లా సుఖించటం కూడా క్రూరస్వభావమే. ఉన్నంతలో నలుగురికీ పెట్టి తానూ తినేవాడు ఇహలోకంలో అయినా పరలోకంలో అయినా మరింత గౌరవం పొందుతాడు, సుఖపడతాడు'.

వ. అని చెప్పి వెండియు. **428**

ప్రతిపదార్థం: అని= అని; చెప్పి= పలికి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ.

ఆ. 'వినుఁ కుటుంబ భృత్యజన జీవనంబుఁ ద్రి। వర్షములకుఁ గల్గువాఁడు నధిక
మొదవినట్టి యతఁడు నుర్వీశ! యర్హులు। మాననీయ సోమ పానమునకు. **429**

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ!= రాజా!; వినుఁ= వినుము; కుటుంబ భృత్యజన= కుటుంబమూ, సేవకులా; జీవనంబున్=

జరుగుబాటు; త్రివర్షములకున్= మూడేళ్ళదాకా; కల్గువాఁడును= ఉన్నవాడూ; అధికము= అంతకంటె ఎక్కువ; ఒదవిన+అట్టి+అతఁడును= కలిగినవాడూ; మాననీయ= గౌరవించదగ్గ; సోమ పానమునకున్= యాగం చేసి తాగే సోమపానానికి; అర్హులు= తగ్గవారు.

తాత్పర్యం: 'కుటుంబీకుల, సేవకుల జరుగుబాటుకొరకు మూడేళ్లపాటు సరిపడేటంతగాని, అంతకంటె మించిన స్థితిమంతుడు కాని యాగం చేసి త్రాగే సోమపానానికి అర్హుడు.

క. క్రతువు లొనరించు భూసుర । తతికిఁ గ్రియాశేష యోగదానాదులు దు
ర్గతిఁ గొఱత వడిన ధరణీ । పతి నెఱపఁగవలయు వానిఁ బరికించి తగన్. **430**

ప్రతిపదార్థం: క్రతువులు= యాగాలు; ఒనరించు= చేసే; భూసురతతికిన్= బ్రాహ్మణుల వర్గానికి; క్రియా శేష= పూర్తికాకుండా మిగిలిపోయిన పనులను; యోగ= సంబంధించిన; దానాదులు= దానం మొదలైనవి; దుర్గతిన్= బీదతనంచేత; కొఱఁతవడినన్= లోటువస్తే; వానిన్= వాటిని (ఆ లోటును); పరికించి= పట్టిచూచి; తగన్= ఒప్పేటట్లు; ధరణీపతి= రాజు; నెఱపఁగ వలయున్= ఆచరించాలి (పూర్తిచేయాలి).

తాత్పర్యం: పూర్తికాకుండా నిలిచిపోయిన బ్రాహ్మణుల యాగక్రియలకు సంబంధించిన దానాదుల విషయంలోనూ, బీదరికంవలన లోటు కలిగితేనూ రాజు దానికి తగ్గట్టుగా ఆలోచించి ఆ యాగక్రియలు పూర్తిచేయాలి.

క. ధనధాన్య పశు సమగ్రుం । డనఁ బరఁగెడునట్టి వైశ్యుఁ డధ్వరముం జే
యనినాఁడు బ్రాహ్మణాధ్వర । మునకు నతని సొమ్ము రాజు పుచ్చి యిడఁదగున్. **431**

ప్రతిపదార్థం: ధనధాన్యపశు= ధనధాన్యాలచేతను, పశుసంపదచేతను; సమగ్రుండు+అనన్= సంపూర్ణుడు అనేటట్లు; పరఁగెడు+అట్టి= ఒప్పేటటువంటి; వైశ్యుఁడు= కోమటివాడు; అధ్వరమున్= యాగాన్ని; చేయనినాఁడు= చేయనప్పుడు; అతని సొమ్మున్= ఆ వైశ్యుడి ధనాన్ని; పుచ్చి= గ్రహించి; రాజు= ప్రభువు; బ్రాహ్మణ+అధ్వరమునకున్= బ్రాహ్మణులు చేసే యాగానికి; ఇడన్= ఇవ్వటం; తగున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: ధనం, ధాన్యం, పశుసంపద దండిగా ఉన్న కోమటి యాగం తలపెట్టకపోతే ఆ సొమ్మునంతా రాజు గ్రహించి బ్రాహ్మణులయాగానికి దానం చేయవచ్చును.

క. కుడువక పెట్టక శూద్రుఁడు । కడునెక్కుడు గూర్చినట్టి కనకముఁ గొలుచుం
బుడమిపతి ధర్మకృతులకు । నిడునది సగము గొని మేదినీశ్వరవర్యా! **432**

ప్రతిపదార్థం: మేదినీ+ఈశ్వర వర్యా!= రాజులలో ఉత్తముడా!; శూద్రుఁడు= శూద్రజాతివాడు; కుడువక= తాను తినక; పెట్టక= ఇంకొకరికి ఇవ్వక; కడున్+ఎక్కుడు= ఎంతో ఎక్కువగా; కూర్చిన+అట్టి= కూడబెట్టుకొన్నట్టి; కనకమున్= బంగారాన్నీ; కొలుచున్= ధాన్యాన్నీ; పుడమిపతి= రాజు; సగము+కొని= సగం తీసుకొని; ధర్మకృతులకున్= పుణ్యకార్యాలకు; ఇడునది= ఇవ్వాలి.

తాత్పర్యం: రాజా! శూద్రజాతివాడు తాను తినక, వేరొకరికి పెట్టక, బాగా ఎక్కువగా బంగారాన్నీ ధాన్యాన్నీ పోగేసినట్లైతే వాటిల్లో సగం రాజు పుచ్చుకొని పుణ్యకార్యాలకు వాడాలి.

క. వినుఁ విప్రులు పేద లగుట । మనుజేంద్రుఁడు బుద్ధిలేమి మాతాపితృ భా
వన నతఁడు వారిఁ బ్రోచినఁ । గను మేలున కెల్ల గలదె కౌరవనాథా! **433**

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ధర్మరాజా!; వినుఁ= వినుము; విప్రులు= బ్రాహ్మణులు; పేదలు+అగుట= బీదవారు అవటం అనేది; మనుజ+ఇంద్రుఁడు= మనుష్యులలో ఉత్తముడైన రాజు; బుద్ధిలేమిన్= తెలివిలేనివాడవటంవలననే; అతఁడు= రాజు; వారిన్= వారిని; మాతా పితృభావనన్= తల్లిదండ్రులవలె అనుకొని; ప్రోచినన్= కాపాడితే; కను= పొందే; మేలునకున్= మంచికి; ఎల్లకలదె?= మేర ఉన్నదా?

తాత్పర్యం: ధర్మరాజా! బ్రాహ్మణులు పేదవాళ్ళుగా ఉన్నారంటే అది రాజు తెలివిమాలినతనమే. రాజు వాళ్ళను తల్లిదండ్రులవలె చూచుకొని కాపాడుకొనాలి. అపుడు రాజునకు కలిగే మేలునకు హద్దు ఉండదు.

క. ఆమద్రవ్యము మణియును । రామయు శుచు లగుటఁ గాదె రామారత్నా
రామత దగవగు దుష్కుల । మై మెచ్చమి దోఁచెనేని ననిరి మునీంద్రుల్. 434

ప్రతిపదార్థం: మునీంద్రుల్= మునిముఖ్యులు; ఆమద్రవ్యమున్= పెద్దల పేర్లు చెప్పి పితృకర్మలలో బ్రాహ్మణులకిచ్చే స్వయం పాకము; మణియును= రత్నమును; రామయున్= స్త్రీయునూ; శుచులు+అగుటన్+కాదె= పవిత్రం అవటం వలననే కదా; దుష్కులము+ఐ= నీచకులపుదని; రామారత్న= ఉత్తమ స్త్రీ; మెచ్చమితోఁచెన్+ఏనిన్= నచ్చనట్లుగా అనిపించినా; ఆరామత= క్రీడించటం; తగవు+అగున్= న్యాయమే అవుతుంది; అనిరి= అని అన్నారు.

తాత్పర్యం: పొత్తర్లలో బ్రాహ్మణులకిచ్చే స్వయంపాకం, మణీ, స్త్రీ - ఈ మూడు పవిత్రమైనవే. నీచకులందయినా ఉత్తమ స్త్రీ నచ్చనట్లుగా అనిపించినా సంగమించటం ధర్మమే అవుతుందంటారు మునులు.

క. అమృతము విద్యయుఁ బరమహి । తము సేయుటఁ బుచ్చికొండ్రు దానిని దానిన్
సుమతులు విషము వలన నై । న మహీశ్వర! నీచమగు జనముచే నైనన్. 435

ప్రతిపదార్థం: మహీ+ఈశ్వర!= రాజా!; అమృతమున్= అమృతమూ; విద్యయున్= చదువూ; పరమహితము+చేయుటన్= గొప్పమేలు కలిగించటంవలన; సుమతులు= బుద్ధిమంతులు; దానిని= ఆ అమృతాన్ని; విషమువలన నైనన్= గరళంవలన అయినా; పుచ్చికొండ్రు= గ్రహిస్తారు; దానిన్= ఆ విద్యను; నీచము+అగు+జనముచేన్+ఐనన్= అధముల దగ్గర నుండైనా; పుచ్చికొండ్రు= గ్రహిస్తారు.

తాత్పర్యం: ధర్మరాజా! అమృతం, విద్యా - రెండూ పరోపకారం చేస్తాయి. కాబట్టి బుద్ధిమంతులు విషంలోనుండి పుట్టిందైనా అమృతాన్నీ, నీచుల దగ్గరనుండైనా చదువునూ గ్రహిస్తారు.

క. భూపాలక! వినుఁ పంచమ । హాపాతకకరులుఁ బతితు లక్కీడులఁ బ్రా
ణాపాయాంత ప్రతికృతిఁ । బాపుదు; రత్యధిక పుణ్యపరతను బాయున్. 436

ప్రతిపదార్థం: భూపాలక!= రాజా!; వినుఁ= వినుము; పంచ మహాపాతక కరులున్= పంచ మహా పాపాలు చేసేవారూ; పతితులున్= పాపాత్ములూ; ఆ+కీడులన్= ఆ పాపాలను; ప్రాణ+అపాయ+ అంత ప్రతికృతిన్= ప్రాణాలను విడవడమనే చివరి ప్రతిక్రియచేత; పాపుదురు= పోగొట్టుకుంటారు; (అక్కీడులు); అతి+అధిక పుణ్య పరతను= పుణ్యం చేయటంలో ఎక్కువ ఆసక్తిచేతను; పాయను= పోతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. పంచ మహాపాపాలు చేసేవారూ, పతితులూ, తమ ఆ కీళ్ళను ప్రాణత్యాగంచేత పోగొట్టుకుంటారు. ఆ కీడులు పుణ్యాసక్తి మిక్కిలి ఎక్కువ కావటంచేత కూడా పోతాయి.

విశేషం: పంచమహాపాతకాలు: స్వర్ణస్తేయం, సురాపానం, బ్రహ్మహత్య, గురుదారగమనం, ఆ పాపాలు చేసేవాళ్ళతో స్నేహం చేయటం.

క. యానాసనాన్నపాన వి । ధానాదులఁ బతితు బెరసి తాఁ బతితుఁ డగున్;
మానవుఁడు దపోముఖ ధ । ర్మానుష్ఠానములఁ బాచు న క్కిల్బిషమున్. 437

ప్రతిపదార్థం: మానవుఁడు= మనిషి; యాన= ప్రయాణించేటప్పుడు; ఆసన= కూర్చున్నప్పుడు; అన్న= తిండి తినేటప్పుడు; పాన= నీళ్ళు తాగేటప్పుడు; విధాన+ఆదులన్= మొదలైన తీరులలో; పతితున్= పాపాత్ముడితో; బెరసి= కూడి; తాన్= తాను; పతితుఁడు+అగున్= పాపాత్ము డవుతాడు; ఆ+కిల్బిషమున్= అట్లా వచ్చిన పాపాన్ని; తపోముఖ ధర్మానుష్ఠానములన్= తపస్సు మొదలుగా గల సత్కార్యాలు ఆచరించటంచేత; పాచున్= పోగొట్టుకొంటాడు.

తాత్పర్యం: మనిషి పాపాత్ముడితోపాటు ప్రయాణించినా, కలిసి కూర్చున్నా, ఒకే తడవ తిన్నా, దప్పిక తీర్చుకొన్నా, పతితుడవుతాడు. ఆ పాపాన్ని తపస్సు మొదలైన మంచిపనులద్వారా వదలించుకొంటాడు.

క. అనృతము పాతక మగు; నై । నను వనితల యెడను, బెండ్లి, నవ్వున మృతి వ
చ్చిన సర్వధనముఁ జెడు చో, । విను మది పాపంబు గాదు విమలచరిత్రా! 438

ప్రతిపదార్థం: విమల చరిత్రా!= మచ్చలేని నడవడి కలవాడా!; అనృతము= అబద్ధం చెప్పటం; పాతకము+అగున్= పాపం అవుతుంది; ఐనను= అయినా; వినుము= విను; వనితల ఎడను= ఆడవాళ్ళ విషయంలోనూ; పెండ్లి= పెళ్ళి విషయంలోనూ; నవ్వునన్= నవ్వులాటలోనూ; మృతివచ్చినన్= చావు మూడినప్పుడూ; సర్వధనమున్= ధనమంతా (సర్వస్వం); చెడుచోన్= కోల్పోతుంటే; అది= అబద్ధం చెప్పటం; పాపంబు+కాదు= దోషం కాదు.

తాత్పర్యం: ధర్మరాజా! అబద్ధం ఆడటం పాపమే. అయితే ఆడవాళ్ళ విషయంలోనూ, పెళ్ళిళ్ళప్పుడూ, పరిహాసాలప్పుడూ, చావు కలిగినప్పుడూ, సర్వస్వం కోల్పోతుంటేనూ అబద్ధం చెప్పటం పాప మేమీ కాదు.

క. ఏ పాపమేని లేనిది । కాపురుషత నొకనిమీఁదఁ గలిగించిన న
ప్పాపము సేసినవాఁ డగు । నా పాలువ యనంగ విందు మార్యులచేతన్. 439

ప్రతిపదార్థం: ఏ పాపము+ఏని లేనిది= ఏ పాపమూ లేకపోయినా; ఒకని మీఁదన్= మరియొకనిపై; కాపురుషతన్= చెడ్డవాడనే భావాన్ని; కలిగించినన్= మోపితే; ఆ పాలువ= ఆ దుర్మార్గుడు; ఆ+పాపము చేసినవాఁడు+అగున్= ఆ పాపాన్ని చేసినవా డవుతాడు. అనంగన్= అని; ఆర్యులచేతన్= పెద్దలవలన; విందుము= వింటాము.

తాత్పర్యం: ఏ పాపమూ చేయకపోయినా మరియొకనిపై కుత్సిత పురుషుడనే నిందను మోపితే, ఆ దుర్మార్గుడు ఆ పాపం చేసినవాడవుతాడని పెద్దలనగా వింటాము.

ఆ. తల్లిఁ దండ్రిఁ బాయఁ దగ ద కారణమునఁ । బాసెనేని వాఁడు పతితుఁ డాస
నంబు సెజ్జ భోజనము చీర వటుకుమా । రులకుఁ బ్రీతి నొసఁగఁ బొలియుఁ గీడు. 440

ప్రతిపదార్థం: తల్లిన్ తండ్రిన్= తల్లినీ తండ్రినీ; అకారణమునన్= ఊరకనే; పాయన్+తగదు= వదలి ఉండటం మంచిదికాదు; పాసెన్+ఏని= విడిచినట్లైతే; వాఁడు= వాడు; పతితుఁడు= పాపాత్ముడు; వటుకుమారులకున్= బ్రహ్మచారులకు; ఆసనంబు= పీటా; సెజ్జ= పక్కా; భోజనము= తిండీ; చీర= బట్టా; ఒసఁగన్= ఇవ్వగా; కీడు= ఆ దోషం; పొలియున్= పోతుంది.

తాత్పర్యం: సరైన కారణం ఏమీ లేకుండా తల్లిదండ్రులను కాదని వెళ్ళేవాడు పాపాత్ముడు అవుతాడు. బ్రహ్మచారులకు పీటా, పక్కా, కూడూ, గుడ్డా ఇస్తే ఆ పాపం తొలగిపోతుంది.'

వ. అనియె; నట్టియెడం గృపాణరణ నిపుణుండగు నకులుండు నకలాస్త్రశస్త్ర సారవిశారదుండైన యబ్భాగీరథీసుతునకు సవినయంబుగాఁ బ్రణమిల్లి 'ధను వుత్తమాయుధం బని చెప్పుదు; రది సర్వజన సమ్మతంబు; ధనువునకు బాణంబులకు వైకల్యంబు వాటిల్లినయెడం బరవీరప్రహరణంబునకు నాత్మత్రాణంబునకుం గృపాణంబు మేలని యుండుదు; నా తలంపెట్టిదియో తెలిసికొనవలయుఁ; దత్ప్రభవ ప్రభావంబులుం దదీయ పూర్వాచార్యునిం జెప్పవే' యని యడిగిన. 441

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అట్టి యెడన్= అట్లాంటప్పుడు; కృపాణరణ= కత్తిపోరులో; నిపుణుండు+అగు= మేటి అయిన; నకులుండు= నకులుడు; సకల= సమస్తమైన; అస్త్ర= మంత్రపూత బాణాల; శస్త్ర= ఆయుధాల ప్రయోగంలో; సారవిశారదుండు+ఐన= బాగా తెలిసిఉన్నవాడైన; ఆ+భాగీరథీసుతునకున్= ఆ భీష్ముడికి; సవినయంబుగాన్= అణకువతో; ప్రణమిల్లి= మ్రొక్కి; ధనువు= విల్లు; ఉత్తమ+ఆయుధంబు+అని= మేలైన సాధనం అని; చెప్పుదురు= చెప్పుతారు; అది= అట్లా చెప్పటం; సర్వజన సమ్మతంబు= అందరికీ అంగీకారమే; ధనువునకున్= వింటికీ; బాణంబులకున్= బాణాలకూ; వైకల్యంబు= విరిగిపోవటం; పాటిల్లిన ఎడన్= కలిగినట్లయితే; పరవీర= పగవారి పోటుగాళ్ళని; ప్రహరణంబునకున్= దెబ్బ కొట్టటానికీ; ఆత్మత్రాణంబునకున్= తనను తాను కాపాడుకొనటానికీ; కృపాణంబు= కత్తి; మేలు= మంచిది; అని; ఉండుదున్= తలంచాను; నా తలంపు= నా ఆలోచన; ఎట్టిదియో= ఎలాంటిదో; తెలిసికొనవలయున్= తెలుసుకొనాలి; తత్ప్రభవ= కత్తి పుట్టుక; ప్రభావంబులున్= మహిమలు; తదీయ= దానికి సంబంధించిన పూర్వాచార్యునిన్= మొదటి గురువునీ; చెప్పవే= చెప్పవా; అని; అడిగినన్= అడుగగా.

తాత్పర్యం: అట్లా చెప్పిన తరువాత కత్తిపోరులో కుశలుడైన నకులుడు, మంత్రపూత బాణప్రయోగంలోనూ, ఆయుధాల ప్రయోగంలోనూ, చేయి తిరిగినవాడైన భీష్ముడికి ఎంతో వినయంగా మొక్కాడు. 'అన్నిట్లోకి మేలైన సాధనం 'ధనుస్సు' అని అంతా అంటారు. విల్లూ బాణం విరిగిపోతే శత్రువీరులను చెండాడటానికీ, తనను తాను కాపాడుకొనటానికి కత్తి మేలు - అనే నా ఊహ ఎంతపాటిదో తెలిసికొనాలని ఉన్నది. కత్తిపుట్టుకా దాని మహిమా, దాని తొలి ఉపదేశకుడినీ చెప్పు'మని అడగగా.

భీష్ముఁడు నకులునకు ఖడ్గ ప్రభావంబు తెఱం గెఱిఁగించుట (సం. 12-160-9)

**సీ. అతనికి నాతఁ డిట్లను 'బ్రహ్మ జగములు । సృజియించి భూతసంసృష్టి సేయ
దివిజమర్త్యాది జంతువు లమ్మహాత్ము వి । ధించిన తెరువులఁ దిరిగి బ్రదుకు
చుండ దైత్యులు సముద్దండత నన్యాయ । వర్తులై సురమునివ్రాతములకు
బాధ లొనర్ప నప్పరమేష్ఠి హిమశైల । తటమున వేయువత్సరము లధిక**

**తే. నియతిమెయిఁ దప మొనరించి నిష్ఠఁ గ్రతువు । సేసె నయ్యగ్నిఁ బుట్టె నశేష లోక
భీతికర మగు నుగ్రంపుభూత మొకటి । ప్రాంశుకృష్ణమై దంష్ట్రలు ప్రజ్వరిల్ల. 442**

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ నకులుడికి; ఆతఁడు= భీష్ముడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; బ్రహ్మ= బ్రహ్మదేవుడు;

జగములు= లోకాలను; సృజియించి= పుట్టించి; భూతసంసృష్టి+చేయన్= ప్రాణులను పుట్టించగా; దివిజ= దేవతలూ; మర్త్య= మనుష్యులూ; ఆది= మొదలుగా గల; జంతువులు= ప్రాణులు; ఆ+మహాత్ము= ఆ బ్రహ్మదేవుడు; విధించిన= ఏర్పరచిన; తెరువులన్= తెన్నులలో; తిరిగి= సంచరించి; బ్రదుకుచున్+ఉండన్= జీవిస్తుండగా; దైత్యులు= రాక్షసులు; సముద్దండతన్= పెద్ద ఎత్తున; అన్యాయవర్తులు+ఐ= న్యాయం తప్పినవారై; సుర ముని వ్రాతములకున్= దేవతల, మునుల సమూహానికి; బాధలు+ఒనర్పన్= పీడించగా; ఆ+పరమేష్ఠి= ఆ బ్రహ్మదేవుడు; హిమశైల తటమునన్= మంచుకొండ చరియల్లో; వేయువత్సరములు= వేయ్యేళ్ళు; అధికనియతి మెయిన్= ఎంతో నియమంతో; తపమున్= తపస్సును; ఒనరించి= చేసి; నిష్ఠన్= ఎడతెగని శ్రద్ధతో; క్రతువు చేసెన్= యాగం చేశాడు; అశేషలోక= అన్ని లోకాలకూ; భీతికరము+అగు= అదురు పుట్టించే; ఉగ్రభూతము+ఒకటి= భయంకరమైన ఒక భూతం; ప్రాంశుకృష్ణము+ఐ= పొడవాటి నల్లటి; దంష్ట్రలు= కోరలు; ప్రజ్వరిల్లన్= ఒప్పగా; ఆ+అగ్నిన్= ఆ నిప్పులోనుండి; పుట్టెన్= పైకి వచ్చింది.

తాత్పర్యం: ఆ నకులుడితో భీష్ముడు ఇట్లా అన్నాడు. బ్రహ్మ లోకాలనూ, జంతుజాలాన్నీ పుట్టించాడు. దేవతలూ మనుష్యులూ మొదలుగాగల ప్రాణులన్నీ బ్రహ్మదేవుడు నియమించినట్టుగా బ్రతుకుతున్నాయి. రాక్షసులు న్యాయం తప్పి దేవతలను మునులను పీడించటం ఎక్కువైంది. అందువలన మంచుకొండచరియలలో బ్రహ్మదేవుడు వెయ్యేళ్లపాటు తపస్సు చేశాడు. ఆ తరువాత నిష్ఠగా యాగం చేశాడు. ఆ అగ్నిగుండంలోనుండి మొత్తం ప్రపంచానికి అదురుపుట్టేటట్లు ఒక పెద్ద భూతం పైకి వచ్చింది. ఆ భూతం పొడవాటి నల్లటి కోరలతో ఉన్నది.

ఆ. అప్పు డినుఁడు మాసె, ననిలుండు సుడివడి । వీచె, నుల్క లురలె, వెఱఁ దలంకు
సురల మునులఁ జూచి సరసిజభవుఁ 'డిది । నాదుమతమ యొండు గాదు వినుఁడు. 443

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఇనుఁడు= సూర్యుడు; మాసెన్= మసకబారాడు; అనిలుండు= గాలి; సుడివడి= సుళ్ళు చుట్టుకొని; వీచెన్= విసరింది; ఉల్కలు= నిప్పురవ్వలు; ఉరలెన్= రాలిపడ్డాయి; వెఱన్= భయంతో; తలంకు= వణకుతున్న; సురలన్= దేవతలను; మునులన్= ఋషులను; చూచి; సరసిజభవుఁడు= బ్రహ్మ; ఇది= ఈ పెనుభూతం; నాదుమతము+అ= నా తలపే; ఒండు+కాదు= మరొకటి కాదు; వినుఁడు= ఆలకించండి.

తాత్పర్యం: ఈ భూతం పుట్టిన సమయంలో సూర్యుడు మసకబారాడు, సుడిగాలి విసురుగా కొట్టింది, నిప్పురవ్వలు రాలిపడ్డాయి, దేవతలూ, మునులూ భయంతో వణకిపోతున్నారు. అది చూచి బ్రహ్మదేవుడు 'దీనిని నేనే పుట్టించాను. మరొకటి కాదు. వినండి.

వ. ఇది రాక్షస నాశంబునకుం దోఁచిన యుత్పాతంబు; లోకంబుల రక్షింపను రాక్షసుల వధియింపను సాధనంబుగా ఖడ్గంబుఁ గల్పించితి నని పలుక, నా భూతం బారూపంబు విడిచి ఖడ్గాకృతి గైకొని తన మెఱుంగులు దిక్కులు దీటుకొనం బొల్చిన. 444

ప్రతిపదార్థం: ఇది= ఈ పెద్ద భూతం; రాక్షస నాశంబునకున్= రాక్షసుల చేటుకొరకు; తోఁచిన= పుట్టిన; ఉత్పాతంబు= అరిష్టం; లోకంబులన్= లోకాలన్నిటినీ; రక్షింపను= కాపాడటానికీ; రాక్షసులన్= రక్కసులను; వధియింపను= చంపటానికీ; సాధనంబుగాన్= పనిముట్టుగా; ఖడ్గంబున్= కత్తిని; కల్పించితిని= పుట్టించాను; అని పలుకన్= అని చెప్పగా; ఆ భూతంబు= ఆ భూతం; ఆ రూపంబున్= ఆ ఆకారాన్ని; విడి= వదలి; ఖడ్గాకృతి= కత్తి రూపాన్ని; కైకొని= పొంది; తన మెఱుంగులు= తన కాంతులు; దిక్కులు దీటుకొనన్= అంతటా ప్రసరించేటట్లు; పొల్చినన్= కనబడగా.

తాత్పర్యం: ఈ భూతం రాక్షసుల చావుకొరకు పుట్టిన ఉపద్రవం. లోకాలను ఆదుకొనటానికీ, రాక్షసులను చంపటానికీ తగ్గ పనిముట్టు ఈ కత్తి. అందుకే దీనిని కల్పించాను' అనగానే ఆ భూతం కత్తి రూపం ఎత్తింది. తన కాంతులు నాలుగు దిక్కులకూ విరజిమ్ముతూ కనబడగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కమలాసనుండు నిజ చి । త్తము భక్తి మయంబు సేసి తలఁచె; హరుని ఫా
లము కంటి మంటతో న । య్యమరవరదుఁ డేగుదెంచె నచటికి నెమ్మిన్. 445

ప్రతిపదార్థం: కమలాసనుండు= బ్రహ్మ; నిజచిత్తము= తన మనస్సును; భక్తిమయంబు+చేసి= భక్తిపూరితంచేసి, హరునిన్= శివుడిని; తలఁచెన్= స్మరించాడు; ఆ అమరవరదుఁడు= దేవతలు కోరింది ఇచ్చే శివుడు; ఫాలము= నుదుటిలోని; కంటి మంటతోన్= కంటి సెగతో; అచటికిన్= అక్కడకు (బ్రహ్మ ఉన్నచోటుకు); నెమ్మిన్= ప్రీతితో; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు తన మనస్సును భక్తి పూరితం చేసి శివుడిని ధ్యానించాడు. అప్పుడు దేవతల కోరికలు తీర్చే శివుడు నుదుటి కంటి మంటతో బ్రహ్మ ఎదుటకు ప్రీతితో వచ్చాడు.

ఉ. వచ్చినఁ దత్పదాంబురుహవందనపూర్వముగాఁగఁ బద్మజుం
డిచ్చెఁ గృపాణ; మవ్విభుఁ డహీన సముద్యమలీలఁ గ్రాలుచుం
బుచ్చికొనంగ నా సభ యపూర్వ మనఃప్రమదంబుతోడి పే
రచ్చెరువాటు నొందె నటు లయ్యసిఁ గైకొని మేను వెంచుచున్. 446

ప్రతిపదార్థం: వచ్చినన్= రాగా; తద్= ఆ శివుడి; పద+అంబురుహ= పాద పద్మాలకు; వందన పూర్వము+కాఁగన్= మొక్కటంతో పాటుగా; పద్మజుండు= బ్రహ్మ; కృపాణమున్= కత్తిని; ఇచ్చెన్= ఇచ్చాడు; ఆ విభుఁడు= ఆ శివుడు; అహీన= ఎంతో; సముద్యమలీలన్= పెద్ద ఎత్తున; క్రాలుచున్= వెలిగిపోతూ; పుచ్చికొనంగన్= తీసికొనగా; ఆ సభ= ఆ కొలువు; అపూర్వ= ఇంతకుమునుపు ఎన్నడూ లేని; మనఃప్రమదంబుతోడి= సంతోషించిన మనస్సుతో; పేరు+అచ్చెరువాటున్= ఎంతో వింతను; ఒందెన్= పొందింది; అటులు= అట్లా; ఆ+అసిన్= ఆ కత్తిని; కైకొని= చేతపట్టుకొని; మేను పెంచుచున్= ఒంటిని పెద్దది చేస్తూ.

తాత్పర్యం: అట్లా అగపడగానే ఆ బ్రహ్మ శివుడికి మొక్కాడు. కత్తిని చేతిలో పెట్టాడు. ఆ శివుడూ ఎంతో ఉన్నతంగా వెలిగిపోతూ ఆ కత్తిని తీసికొన్నాడు. ఆ సభ కూడా ఎపుడూ లేనంత ఇదిగా సంతోషపడింది. వింతపడింది. అట్లా ఆ కత్తిని చేతపుచ్చుకొన్న ఆ శివుడు తన ఆకారాన్ని పెంచుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. హరుఁడు బెట్టుగ నవ్వి పెల్లార్చుటయును । విని సముద్ధతరయమున దనుజకోటి
మునుగఁ బఱతెంచి తాఁకిన మునుముకొని వ । ధించి యిల యెల్ల నెత్తుట ముంచె నతఁడు. 447

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు, బెట్టుగన్= బిగ్గరగా; నవ్వి; పెల్లు+ఆర్చుటయును= ఉత్సాహంకొద్దీ పెద్దపెద్దగా కేకలు పెట్టగా; విని= ఆలకించి; దనుజకోటి= రాక్షసులమూక; సముద్ధత రయమునన్= ఎంతో వేగంగా; మునుగన్= ముందుగా; పఱతెంచి= పరుగెత్తి వచ్చి; తాఁకినన్= ఎదుర్కొనగా; అతఁడు= శివుడు; మునుముకొని= వరసపెట్టి; వధించి= చంపి; ఇల+ఎల్లన్= నేలనంతా; నెత్తుటన్= రక్తంతో; ముంచెన్= తడిపాడు.

తాత్పర్యం: శివుడు ఫకాలున నవ్వి పెద్దగా బొబ్బలు పెట్టాడు. ఆ కేకలు రాక్షసుల చెవిన బడ్డాయి. ఆ వెంటనే

రాక్షసులమూక పరుగుపెట్టి వచ్చి ముందుగా ఎదుర్కొనగా శివుడు కత్తితో కలియబడ్డాడు. వరసపెట్టి నరికి నేలనంతా నెత్తురుమయం చేశాడు.

ఉ. దైత్యుల నిట్లు గీటడఁచి ధర్మము నిల్పి ప్రసన్నమూర్తి సాం
గత్యము నొంది యప్పరమకారుణికుండు త్రిలోకరక్షణౌ
దాత్త్యమునన్ వెలుంగు హరిఁ దద్దయు వేడుకఁ బిల్వఁ బంచి సం
ప్రీత్యభరాముఁ డై యొసఁగెఁ బెంపుగ నమ్మహనీయఖడ్గమున్. 448

ప్రతిపదార్థం: అప్పరమకారుణికుండు= గొప్పజాలి చూపే ఆ శివుడు; దైత్యులన్= రాక్షసులను; ఇట్లు= ఇట్లా; గీటు+అడఁచి చంపి; ధర్మము నిల్పి= ధర్మాన్ని నిలబెట్టి; ప్రసన్నమూర్తి= శాంతాకారంతో; సాంగత్యమున్+ఒంది= చేరికపొంది; త్రిలోక రక్షణ= ముల్లోకా (స్వర్గం, భూలోకం, పాతాళం)లను కాపాడే; ఔదాత్త్యమునన్= గొప్పతనంచేత; వెలుంగు= ఒప్పే; హరిన్= విష్ణువును; తద్దయున్ వేడుకన్= ఎంతో ఉత్సాహంతో; పిల్వన్+పంచి= రప్పించి; సంప్రీతి= సంతోషంతో; అభిరాముఁడు+ఐ= ఒప్పేవాడై; ఆ+మహనీయ ఖడ్గమున్= ఆ గొప్పకత్తిని; పెంపుగన్= గౌరవంగా; ఒసఁగెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: అట్లా ఆ శివుడు రాక్షసులను చంపి ధర్మం నిలబెట్టాడు. ప్రసన్న్ డయ్యాడు. స్వర్గ, మర్త్య, పాతాళలోకాలను ఎంతో బాగా కాపాడే విష్ణువును వేడుకపడి పిలిపించాడు. ఎంతో సంతోషంగా ఆ గొప్ప కత్తిని అతడి చేతికి ఇచ్చాడు.

వ. అ ట్లొసంగినం గైకొని దుష్టదమనం బాచరించుచు నుండెడు నవ్విష్ణుండు మహాస్త్రరూపంబగు నయ్యాయుధంబు పదంపడి మరీచి కొసంగె; మరీచి భార్గవునకు, భార్గవుం డనేకమునులకు, మును లింద్రునకు, నింద్రుండు లోకపాలురకు నొసంగెఁ;గ్రమంబున మనుప్రభృతులైన మానవేంద్రులు వడసి నిజసంతతి కినిచ్చుచు వచ్చి; రందు దుష్యంతుండు భరతున కిచ్చె; నా భరతవంశంబునందు ఖడ్గ సంప్రదాయంబు గలిగి వచ్చె; నొక ముని యనుగ్రహింప ద్రోణుం డధిగమించి కృపున కిచ్చెఁ; గృపునిచేత మీ రేవురుం బడసితిరి; విశేషించి యీ విద్యయం దత్యంతాదరణవంతుండ వగుటంజేసి దీనివలన వెలసితివి నిస్త్రింశంబునకు నక్షత్రంబు గృత్తిక యగ్నియధిదేవత గురుండు రుద్రుం' డని చెప్పి వెండియు నిట్లను 'నసి విశసనంబు ఖడ్గంబు తీక్ష్ణధారంబు దురాసదంబు శ్రీగర్భంబు విజయంబు ధర్మపాలనంబన నెనిమిది పూజ్యనామంబులం బరఁగి కృపాణంబు ప్రహరణంబులోనం బ్రధానంబై నెగడుచుండు. 449

ప్రతిపదార్థం: అట్లు= అట్లా; ఒసంగినన్= ఇవ్వగా; కైకొని= పుచ్చుకొని; దుష్టదమనంబు= చెడ్డవాళ్ళను చంపటం; ఆచరించుచున్+ఉండెడు= చేస్తూండే; ఆ+విష్ణుండు= ఆ విష్ణువు; మహా+అస్త్రరూపంబు+అగు= గొప్ప అస్త్రం వంటిది అయిన; ఆ+ఆయుధంబున్= ఆ కత్తిని; పదంపడి= ఆ తరువాత; మరీచికిన్= మరీచిమునికి; ఒసంగెన్= ఇచ్చాడు; మరీచి= మరీచి ముని; భార్గవునకున్= పరశురాముడికి; భార్గవుండు= పరశురాముడు; అనేకమునులకున్= చాలామంది ఋషులకు; మునులు= ఆ మునులు; ఇంద్రునకున్= ఇంద్రుడికీ; ఇంద్రుండు= ఆ ఇంద్రుడు; లోకపాలురకున్= దిక్పాలకులకు; ఒసంగెన్= ఇచ్చాడు; క్రమంబునన్= వరసగా; మనుప్రభృతులు+ఐన= మనువు మొదలైన; మానవేంద్రులు= రాజులు; పడసి= పొంది; నిజసంతతికిన్= తమ వంశీకులకు; ఇచ్చుచున్+వచ్చిరి= ఇచ్చుకుంటూ వచ్చారు; అందున్= వాళ్ళల్లో; దుష్యంతుఁడు= దుష్యంత మహారాజు; భరతునకున్= భరతుడికి; ఇచ్చెన్= ఇచ్చాడు; ఆ భరతవంశంబునందున్= ఆ భరతకులంలో; ఖడ్గ సంప్రదాయంబు= కత్తి ఇచ్చుకొనే ఆచారం; కలిగి వచ్చెన్= ఉంటూ ఉంది; ఒక ముని= ఒక ఋషి; అనుగ్రహింపన్= దయ చూపగా; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు;

అధిగమించి= పొంది; కృపునకున్+ఇచ్చెన్= కృపుడికి ఇచ్చాడు; కృపునిచేతన్= కృపుడివలన; మీరు ఏవురున్= మీ ఐదు మంది; పడసితిరి= పొందారు, విశేషించి= మీదు మిక్కిలి; ఈ విద్యయందున్= ఈ కత్తి విద్యలో; అత్యంత ఆదరణవంతుండవు+అగుటన్+చేసి= ఎక్కువ గౌరవం కలవాడవు కాబట్టి; దీని వలనన్= ఈ విద్యవలన; వెలసితివి= ప్రకాశించావు; నిస్త్రింశంబునకున్= కత్తికి; నక్షత్రంబు= నక్షత్రం; కృత్తిక; అగ్ని= అగ్గి; అధిదేవత= కాపాడే దేవత; గురుండు= ఉపదేశకుడు; రుద్రుండు= శివుడు; అని చెప్పి; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; అసి= కత్తి; విశసనంబు= చంపేది; ఖడ్గంబు= నరికేది; తీక్ష్ణధారంబు= మంచి పదునుతో ఉండేది; దురాసదంబు= ఎదిరించలేనిది; శ్రీగర్భంబు= లోపల సిరులు కలది; విజయంబు= గెలుపు కలిగించేది; ధర్మపాలనంబు= ధర్మాన్ని కాపాడేది; అనన్= అనేటట్లు; ఎనిమిది పూజ్యనామంబులన్= కొల్వదగ్గ ఎనిమిది పేర్ల చేతా; పరఁగి= ఒప్పి; కృపాణంబు= కత్తి; ప్రహరణంబులలోనన్= ఆయుధాలలో; ప్రధానంబు+ఐ= ముఖ్యమై; నెగడుచుండున్= ప్రసిద్ధి కెక్కింది.

తాత్పర్యం: చెడ్డవాళ్ళను రూపుమాపే విష్ణువు ఆ కత్తిని శివుడు ఇవ్వగానే అందుకొన్నాడు. ఆ గొప్ప కత్తిని ఆ తరువాత విష్ణువు మరీచికి ఇచ్చాడు. మరీచి పరశురాముడికీ, పరశురాముడు మునులకూ, ఆ మునులు ఇంద్రుడికీ, ఇంద్రుడు దిక్పాలకులకు ఇచ్చారు; వరసగా మనువు మొదలైన రాజులు తమ సంతానానికి ఇస్తూ వచ్చారు. వాళ్ళల్లో దుష్యంతుడు భరతుడికి ఇచ్చాడు. ఆ భరతకులంలో కత్తిని ఇచ్చుకొనే ఆచారం ఏర్పడింది. దాన్ని ఓ ముని దయవలన ద్రోణుడు సంపాదించాడు. ఆ ద్రోణుడు కృపుడికి ఇచ్చాడు. అతడినుండి మీ ఐదుమందీ పొందారు. ఈ కత్తి విద్యను నీవు మన్నించినవాడ వవటం వలన పేరుపొందావు; ఈ కత్తికి నక్షత్రం కృత్తిక. కాపాడే దేవత అగ్ని. గురువు శివుడు. అని చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు. అసి, విశసనం, ఖడ్గం, తీక్ష్ణ ధారం, దురాసదం, శ్రీగర్భం, విజయం, ధర్మపాలనం - అనే ఎనిమిది మారుపేర్లతో వాడుక పడింది. ఆయుధా లన్నిట్లోకి ముఖ్యమైందిగా పేరు పడింది.

క. సుమహిత మగు నీ ఖడ్గా । గమమగు పుణ్యకథ వినగఁ గాంచిన పురుషుం
డమితయశంబును నధిక । ప్రమదంబును సద్గతియును బడయుఁ గుమారా!' 450

ప్రతిపదార్థం: కుమారా!= బాబూ నకులుడా!; ఈ ఖడ్గ+ఆగమము= ఈ కత్తి రాకకు సంబంధించినది; అగు= అయిన; పుణ్యకథ= పుణ్యం కలిగించే కథ; సుమహితము+అగున్= దివ్యమైనదవుతుంది; వినఁగన్+కాంచిన= విన్న; పురుషుండు= మనిషి; అమితయశంబును= ఎంతో కీర్తినీ; అధిక ప్రమదంబును= ఎంతో సంతోషాన్ని; సద్గతియున్= ఉత్తమలోకాన్నీ (స్వర్గాన్ని); పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: ఖడ్గవిద్యా సంబంధం అయిన (ఖడ్గవేశం అనదగిన) ఈ పుణ్యకథ దివ్యమైనది. ఈ కథను విన్నవాడు ఎంతో కీర్తిమంతు డవుతాడు. సంతోషంగా ఉంటాడు. పుణ్యలోకాలు పొందుతాడు'.

క. అని యిట్లు నకులునకు భీ । ష్ముని చెప్పిన కథ సుచిత్తమున విని కుంతీ
తనయాగ్రజుండు పురికిం । జనియెడు ప్రొ ద్దగుడు వినయ సంభృతుఁ డగుచున్. 451

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఇట్లా; నకులునకున్= నకులుడికి; భీష్ముని చెప్పిన కథ= భీష్ముడు చెప్పిన కథ; సుచిత్తమునన్= మంచి మనస్సుతో; విని= ఆలకించి; కుంతీతనయ+అగ్రజుండు= కుంతీకుమారులలో మొదటివాడు ధర్మరాజు; పురికిన్= పట్టణానికి; చనియెడు= వెళ్ళే; ప్రొద్దు+అగుడున్= వేళ కాగా; వినయసంభృతుఁడు+అగుచున్= అణకువ కలవాడవుతూ.

తాత్పర్యం: ఇట్లా నకులుడికి భీష్ముడు తాత చెప్పిన కథ అంతా ధర్మరాజు మనస్సు పెట్టి విన్నాడు. హస్తినాపురం వెళ్ళే వేళ కావటంతో ఎంతో అణకువగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. సముచితంబుగా నమ్మహాత్ముని వీడ్కొని చని, యోగ్యవర్తనంబు లాచరించి, వినోదగోష్ఠి నుండి విదురునిం

దమ్ముల నుపలక్షించి ధర్మార్థకామంబులయం దుత్తమమధ్యమాధమత్వ నిరూపణంబు సేయుఁడు చూత' మని పల్కిన నవ్విభునకు విదురుం డిట్లనియె. 452

ప్రతిపదార్థం: సముచితంబుగాన్= తగ్గట్లుగా; ఆ+మహాత్మునిన్= ఆ భీష్ముడిని; వీడ్కొని= పోయి వస్తానని చెప్పి; చని= వెళ్ళి; యోగ్యవర్తనంబులు= చేయాల్సిన పనులు; ఆచరించి= చేసి; వినోదగోష్ఠిన్= ఆనంద సల్లాపాలతో; ఉండి; విదురునిన్= విదురుడిని; తమ్ములన్= తమ్ములను; ఉపలక్షించి= చూచి; ధర్మార్థకామంబులయందున్= ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలలో; ఉత్తమ, మధ్యమ, అధమత్వం= ఎక్కువది. నడిమిది, తక్కువది ఏదో; నిరూపణంబు+చేయుఁడు= తీర్పు ఇవ్వండి; చూతము+అని= చూద్దాం అని; పల్కినన్= అడుగగా; ఆ+విభునకున్= ఆ ధర్మరాజుతో; విదురుండు= విదురుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడికి వెళ్ళివస్తా నని చెప్పి ఇంటికిపోయి చేయవలసినపనులన్నీ చేశాడు. ఆనందసల్లాపాలతో విదురుడినీ తమ్ముళ్ళనూ చూచి ధర్మార్థ కామాలలో ఏది ఎక్కువదో, ఏది నడిమిదో, ఏది తక్కువదో తీర్పు ఇవ్వండి చూద్దాం' అన్నాడు. విదురుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

ధర్మజునితో విదురాదులు ధర్మార్థ కామంబుల తారతమ్యంబు సెప్పుట (సం. 12-161-4)

క. 'వినుఁ ధర్మంబున ధనమగు, । ధనమున సిద్ధించుఁ గామతంత్రం, బటు గా
వున మధ్యమంబు నధమము । ధన కామము; లుత్తమంబు ధర్మం బధిపా!' 453

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; వినుఁ(ము)= ఆలకించుము; ధర్మంబునన్= ధర్మంవలన; ధనము= ధనం; అగును= కలుగుతుంది; ధనమునన్= ధనంవలన; కామతంత్రంబు= కామంతంతు; సిద్ధించున్= ఫలిస్తుంది; అటు కావునన్= అందువలన; ధనము= ధనం; మధ్యమంబు= రెంటినడిమిది; కామము= కామం; అధమము= తక్కువది; ధర్మంబు= ధర్మం; ఉత్తమంబు= మేలైనది.

తాత్పర్యం: ధర్మాన్నిబట్టి ధనం, ధనంవలన కామంతంతూ కలుగుతుంది. కాబట్టి ధనం నడిమిది. ధర్మం మేలైనది. కామం నీచమైంది'.

చ. అనవుడుఁ బార్థ డిట్టులను 'నర్థము మూలము ధర్మకామవ
ర్తనముల; కట్లు గాకయు విరక్తతనొంది జటాదిధారణం
బునఁ జరియించువారికిని భూవర! యర్థము దేహకృత్య సా
ధన మసురేజ్య కణ్వులును దానిన మేలని పూని చెప్పరే. 454

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; పార్థుఁడు= అర్జునుడు; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; ధర్మకామవర్తనములకున్= ధర్మం యొక్క, కామంయొక్క ఉనికికి; అర్థము= ధనం; మూలము= ఆధారం; అట్లు+కాకయున్= అట్లా కాకుండా; విరక్తతన్= వైరాగ్యాన్ని; ఒంది= పొంది; జట+ఆదిధారణంబునన్= జడలు మొదలైనవి ధరించి; చరియించువారికిని= తిరిగేవారికీ; భూవర!= రాజా!; అర్థము= ధనం; దేహకృత్యసాధనము= శరీరంచేత చేయదగ్గదానికి ఉపకరణం; అసురేజ్య= రాక్షస గురువగు శుక్రుడూ; కణ్వులును= కణ్వమునీ; దానిన= ధనాన్నే; మేలు+అని= మంచిది అని; పూని= పనిగట్టుకొని; చెప్పరే= చెప్పలేదా.

తాత్పర్యం: అర్జునుడు ఇట్లా అన్నాడు. 'ధర్మకామాల స్థితికి మూలం ధనమే. అట్లాకాకుండా విరక్తిపొంది జటలతో తిరిగే సన్న్యాసుల దేహయాత్రకు పనిముట్టు ధనం. శుక్రుడూ, కణ్వమునీ పనిగట్టుకొని ధనం మేలని చెప్పలేదా?

వ. కావున నర్థంబు ప్రధానం' బనుటయు నకుల సహదేవు లేకవాక్యత నిట్లనిరి. 455

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అర్థంబు= ధనం; ప్రధానంబు= ముఖ్యమయినది; అనుటయున్= అనగానే; నకుల సహదేవులు= నకులుడూ, సహదేవుడూ; ఏకవాక్యతన్= ఒకేమాటగా; ఇట్లు+అనిరి= ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: కాబట్టి ధనం ముఖ్యం' అనగానే నకుల సహదేవు లిద్దరూ ఒక్కసారిగా ఇట్లా అన్నారు.

తే. అర్థ ధర్మంబు లితరేతరాశ్రయములు। గాన వానిలో నొకఁ డూఁదు మానవేంద్రు
జగము పోకులఁ బుచ్చు నసంభృతార్థుఁ। డైన వానికిఁ గామమ ప్రాప్యమరయ. 456

ప్రతిపదార్థం: అర్థధర్మంబులు= అర్థం, ధర్మం; ఇతర+ఇతర= ఒకదానికొకటి; ఆశ్రయములు= ఆధారపడి ఉన్నాయి; కానన్= కాబట్టి; వానిలోన్= ఆ రెంటిలో; ఒకఁడు+ఊఁదు= ఒకదాన్నే పట్టుకొని ఉండే; మానవ+ఇంద్రున్= రాజును; పోకులన్+పుచ్చును= నాశనం చేస్తుంది; అసంభృత+అర్థుఁడు+ఐనవానికిన్= పుష్కలంగా ధనంలేనివాడికి; అరయన్= విచారించగా; కామము= కామం; అప్రాప్యము= పొందరానిది.

తాత్పర్యం: ధర్మార్థాలు రెండూ ఒక దానిమీద మరొకటి ఆధారపడి ఉంటాయి. కాబట్టి ఆ రెంటిలో ఏదో ఒకటి అవలంబించే రాజునకు చేటు కలుగుతుంది. చేతినిండా డబ్బు లేనివాడికి కామం అందనిది.

క. తమలో సరి ధర్మము న। ర్థము నర్థంబునకుఁ గామతంత్రము ఫలరూ
పము గావున నప్పురుషా। ర్థమునుం గొనియాడవలయు ధరణీనాథా!' 457

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా!; ధర్మమున్= ధర్మమూ; అర్థమున్= అర్థమూ; తమలో సరి= వాటికి అవేసాటి; కామతంత్రము= కామంతంతు; అర్థంబునకున్= ధనానికి; ఫలరూపము= ఫలంవంటిది; కావునన్= కాబట్టి; ఆ పురుషార్థమునున్= ఆ ధర్మాన్ని; కొనియాడవలయున్= పొగడాలి.

తాత్పర్యం: ధర్మరాజా! ధర్మానికి అర్థం, అర్థానికి ధర్మం సరిసాటి. ధనానికి ఫలరూపంవంటిది కామంతంతు. కాబట్టి ధర్మం అనే పురుషార్థం అన్నిటికంటె ఉత్తమమైనది'.

వ. అనిన విని పవననందనుం డిట్లనియె. 458

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; పవన నందనుండు= భీముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అది విన్న భీముడు ఇట్లా అన్నాడు.

క. 'దధిసారము చందంబున। నధిపా! ధర్మార్థ సారమగు కామరసం
బధమ మను తలఁపు సుఖసం। విధానబాహ్య మని నీ వివేకమ యెఱుఁగున్. 459

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; దధిసారము చందంబునన్= పెరుగులోని వెన్నవలె; ధర్మ+అర్థ= ధర్మం అర్థం అనే రెండు పురుషార్థాల; సారము+అగు= నిగ్గు అయిన; కామరసంబు= కామసారం; అధమము+అను= నీచమైనది అనే; తలఁపు= భావన; సుఖసంవిధాన= సుఖవర్తనానికి; బాహ్యము= వెలుపలిది, వెలియైనది; అని; నీ వివేకము+అ= నీ తెలివే; ఎఱుఁగున్= తెలియును.

తాత్పర్యం: పెరుగులో సారంగా ఉండే వెన్నవలె ధర్మార్థాలలో కామరసం సారంగా ఉంటుంది. అది చాలా నీచమైనదనే భావన, సుఖంగా బ్రతకటానికి వెలి అయిందని నీ తెలివే నీకు తేటపరుస్తుంది.

క. వినుమళి యలరునఁ దేనియఁ । గొనుగతి నత్యంత సుఖము గొననగుఁ; గామం
బున నధిక సుఖము లొందని । జను సిరి తాఁ గొల్చులేని సస్యమ కాదే! 460

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; అళి= తుమ్మెద; అలరునన్= పువ్వులోని; తేనియన్= తేనెను; కొనుగతిన్= ఆరగించే విధంగా; అత్యంత సుఖము= ఎంతో హాయిని; కొనన్+అగున్= పొందవచ్చును; కామంబునన్= కామంవలన; అధిక సుఖములు= ఎక్కువ సౌఖ్యాలు; తాన్+ఒందని= తాను అనుభవించని; జనుసిరి= మనిషి సంపద; కొల్చులేని= తాలుగింజలు గల (ధాన్యంలేని); సస్యమ కాదే= పైరువంటిదే కదా.

తాత్పర్యం: వినుమా తుమ్మెద పువ్వులోని తేనెను ఆరగించినట్లు మనిషి ఎక్కువ సౌఖ్యం పొందాలి. కామంవలన మరింత సౌఖ్యం పొందనివాడి సొత్తు చచ్చుగింజలు గల పంటవలె ఎందుకూ పనికిరాని దవుతుంది.

తే. అనఘ! ధర్మార్థకామంబు లందు నొకట । నర్థిఁ దగిలిన మానవుం డధముఁ; డొకటి
మాని వర్తించు నాతఁడు మధ్యముండు; । నడపు నన్నింటి నుత్తమనాయకుండు.' 461

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యవంతుడా!; ధర్మ+అర్థ+కామంబులందున్= ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాలలో; ఒకటన్= ఒకదాన్నే; అర్థిన్= కోరికతో; తగిలిన= ఆశ్రయించిన; మానవుండు= మనిషి; అధముఁడు= నీచుడు; ఒకటి మాని= మూడిట్లో ఒకటి వదులుకొని (రెంటిని ఆశ్రయించి); వర్తించు+ఆతఁడు= సంచరించేవాడు; మధ్యముండు= నడిమివాడు; ఉత్తమ నాయకుండు= మేలైనవాడు; అన్నింటిన్= ధర్మార్థ కామాలు మూడిటినీ; నడపున్= ఆచరిస్తాడు.

తాత్పర్యం: పుణ్యవంతుడా! ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాలలో ఒక్కటి అవలంబించేవాడు అధముడు. ఒకటి కాక రెంటిని ఆచరించేవాడు నడిమివాడు; మూటినీ నడిపేవాడు ఉత్తముడు'.

క. అని యిట్లందఱుఁ జెప్పఁగ । విని చిఱునవ్వున ముఖారవిందము చెలువం
బినుమడిగా ధర్మజుఁ డి । ట్లను వారలఁ గలయఁ జూచి యాదర మెసఁగన్. 462

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఇట్లా; అందఱున్= అంతమంది; చెప్పఁగన్= తెలుపగా; విని= ఆలకించి; చిఱునవ్వునన్= పిన్న నవ్వుతో; ముఖారవిందము= మొగం అనే కమలం; చెలువంబు= సొగసు; ఇనుమడిగాన్= రెండింతలు కాగా; ధర్మజుఁడు= ధర్మరాజు; వారలన్= వారిని; కలయన్+చూచి= పారచూచి; ఆదరము= ప్రేమ; ఎసఁగన్= మరింత కలుగగా.

తాత్పర్యం: అంటూ అంతమంది చెప్పగా విన్నాడు. ధర్మరాజు ముఖంలో అందం రెండింతలయింది. చిరునవ్వు నవ్వుతూ వాళ్ళను కలయచూశాడు. మరింత ప్రేమతో. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ఏ నడిగిన తెఱంగునకు విదురుని వాక్యంబు సిద్ధాంతంబు; దక్కటివారి వచనంబులు నొక్కక్కమెయి
నాదరణీయంబు; లదియట్లుండె; నా మతంబు వినుండు. 463

ప్రతిపదార్థం: ఏను= నేను; అడిగిన= తెఱంగునకున్= ప్రశ్నించిన విధానానికి; విదురుని వాక్యంబు= విదురుడి మాట; సిద్ధాంతంబు= తుదిమాట; తక్కటివారి= మిగతావారి; వచనంబులున్= మాటలూ; ఒక్కొక్క మెయిన్= ఒక్కొక్క తీరుగా; ఆదరణీయంబులు= మన్నించదగ్గవి; అది అట్లు+ఉండెన్= అది అట్లా ఉండనిండు; నా మతంబు= నా అభిప్రాయం; వినుండు= ఆలకించండి.

తాత్పర్యం: నే నడిగినదానికి విదురుడి మాటే ప్రమాణం. మిగతావారి మాటలు ఒక్కొక్కరీతిగా ఆచరించదగ్గవి. అది అట్లా ఉండనిండు. నా అభిప్రాయమూ వినండి.

క. భూతములు జరామరణో । పేతంబులు గాన మోక్ష మెదఁ గోరుట మే;
లాతతవర్గ త్రయ సం । జాత మనోదుఃఖభారసహుఁ డగు కంటెన్. 464

ప్రతిపదార్థం: భూతములు= ప్రాణికోటి; జరా= ముసలితనంతోనూ; మరణ= చావుతోనూ; ఉపేతంబులు= కూడినవి; కానన్= కాబట్టి; ఆతత= విస్తరించి ఉన్న; వర్గత్రయజాత= ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాల వలన; సంజాత= పుట్టిన; మనో దుఃఖభార= మనస్సులో పుట్టే బాధల బరువులను; సహుఁడు+అగుకంటెన్= ఓర్చుకొని ఉండటం కంటె; ఎదన్= మనస్సులో; మోక్షమున్+కోరుట= ముక్తిని కోరుకొనటం; మేలు= మంచిది.

తాత్పర్యం: ప్రాణికోటికి అంతా చావు, ముసలితనం తప్పదు. విస్తరించి ఉన్న ధర్మార్థ కామాలు మానసిక వేదనలు కలిగిస్తాయి. వాటిని ఓర్చుకొని ఉండటంకంటె ముక్తిని కోరుకొనటం మంచిది.

వ. అది గోరిన దొరకొనునే? యందు మేని. 465

ప్రతిపదార్థం: అది= ఆ మోక్షం; కోరినన్= కావాలనుకొంటే; దొరకొనునే?= లభిస్తుందా?; అందుము+ఏని= అనుకొనేటట్లయితే.

తాత్పర్యం: మనం కోరుకొన్నంత మాత్రాన మోక్షం దొరుకుతుంది అనుకొంటె. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మనమున ధర్మము నర్థం । బును గామముఁ గీలుకొనక పారపొచ్చెములై
చన సుఖదుఃఖంబుల మద । మును దైన్యముఁ బొందకునికి మోక్షకర మగున్.' 466

ప్రతిపదార్థం: మనమునన్= కోరికలేనివారి మనస్సులో; ధర్మమున్= ధర్మమూ; అర్థంబును= అర్థమూ; కామమున్= కామమూ; కీలుకొనక= నాటుకొనకుండా; పారపొచ్చెములై చనన్= కపటములై చరించు; సుఖ దుఃఖంబులన్= సుఖదుఃఖాలతో; మదమును= పొగరున్నూ; దైన్యమున్= దీనత్వాన్నీ; పొందక+ఉనికి= పొందకుండటం; మోక్షకరము+అగున్= ముక్తిదాయక మవుతుంది.

తాత్పర్యం: మనస్సులో ధర్మార్థ కామాలను నాటుకో నివ్వకూడదు. సుఖదుఃఖాలు అంటీ అంటకుండా వస్తూ పోతూ ఉంటాయి. కాబట్టి సుఖంచేత పొగరూ, దుఃఖంచేత దీనత్వం పొందకపోతే మోక్షం పొందినట్టే'.

వ. అనిన విని వారలందఱు నభినందించిరి; మఱునాఁడు నదీనందనుం గొలిచియుండి ధర్మనందనుండు 'నరపతులకు వలయు వారును, వలవని వారును నెట్టెట్టి వా?' రని యడిగిన నమ్మహాత్ముం డమ్మహీపతి కిట్లనియె. 467

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; వారలు+అందఱున్= వారంతా; అభినందించిరి= పొగిడారు. మఱునాఁడు= మరుసటినాడు; నదీనందనున్= భీష్ముడిని; కొలిచి+ఉండి; సేవించి; ధర్మనందనుండు= ధర్మరాజు; నరపతులకున్= రాజులకు; వలయువారును= కావలసినవారూ; వలవని వారును= అక్కరలేని వారూ; ఎట్టి+ఎట్టివారు+అని= ఎట్లాంటివారని; అడిగినన్= అడుగగా; ఆ+మహాత్ముండు= ఆ భీష్ముడు; ఆ+మహీపతికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజు మాటలు విని వారంతా అతడిని ఎంతో మెచ్చుకొన్నారు. ఆ మరునాడు ధర్మరాజు భీష్ముడిని సేవించాడు. 'రాజునకు కావలసినవారు, అక్కరలేనివారు ఎట్లాంటి వారై ఉంటారో చెప్పు'మని అడిగాడు. భీష్ముడు ఇట్లా చెప్పాడు.

ఉ. తాలిమిఁ బేర్చువారలును, ధర్మవిధిజ్ఞులు, సత్యవంతులున్,
లోలత లేనివారు, మదలోభ నిరర్థక కోపహీనులు

నీ్శల సమేతులుం బలుకనేర్చుట కార్యము కాన్పు పెంపుమైఁ
జాలుట గల్గు భృత్యులును సంపద సేయుదు రాత్మభర్తకున్. **468**

ప్రతిపదార్థం: తాలిమిన్= ఓర్పుచేత; పేర్చువారలును= మీరినవారూ; ధర్మవిధిజ్ఞులు= ధర్మం తెలిసిన వారున్నూ; సత్యవంతులున్= సత్యం మాట్లాడే వారూ; లోలతలేనివారున్= నిలకడ గలవారూ; మద= పొగరును; లోభ= పేరాశయూ; నిరర్థక కోపహీనులున్= ఊరకే కోపమునూ లేనివారు; శీలసమేతులున్= మంచి నడవడి కలవారూ; పలుక నేర్చుట= మాటకారితనం ఉండే; కార్యముకాన్పు= పనులమీద శ్రద్ధ ఉండే; పెంపుమైన్+చాలుట= ఎక్కువ ఆనుకూల్యం; కల్గు= ఉండే; భృత్యులును= పరిజనులూ; ఆత్మభర్తకున్= తమసామికి; సంపద+చేయుదురు= ఐశ్వర్యాన్ని కలిగిస్తారు.

తాత్పర్యం: ఓర్పు కలవారూ, ధర్మశాస్త్రాలు ఎరిగినవారూ, సత్యవంతులూ, చపలబుద్ధిలేనివారూ, పొగరుగానీ, పేరాశగానీ, కోపంగానీ లేనివారూ, చక్కటి నడవడి కలవారూ, మాటకారితనం, పనులలో శ్రద్ధ ఎంతో ఆనుకూల్యం ఉండే సేవకులు తమ యజమానికి సకల సంపదలు పొందిస్తారు.

ఉ. క్రూరుఁడు లోభియున్ శఠుఁడు గొండియుఁడున్ జడుడుం గృతఘ్నుఁడున్
నేరనివాఁడు బొంకరియు నిందకు నోర్చు నతండుఁ బందయున్
ధీరతలేమి దుర్నయ మతివ్యసనత్వముఁ గల్గు వారలుం
జేరువ నున్కి భూపతికిఁ జెట్ట యొనర్చు నరేశ్వరోత్తమా! **469**

ప్రతిపదార్థం: నరేశ్వర+ఉత్తమా!= రాజులలోకెల్ల ఉత్తముడా!; క్రూరుఁడు= కనికరం లేనివాడు; లోభియున్= దురాశాపరుడూ; శఠుఁడున్= మూఢుడూ; కొండియుఁడున్= చాడీలు చెప్పేవాడు; జడుఁడున్= మందకొడిగా ఉండేవాడు; కృతఘ్నుఁడున్= చేసిన మేలు మరచిపోయేవాడు; నేరనివాఁడు= తెలివితేటలు లేనివాడు; బొంకరియున్= అబద్ధాలాడేవాడు; నిందకున్+ఓర్చు+అతండున్= నిందలు పడేవాడూ; పందయున్= పిరికివాడూ; ధీరతలేమి= సాహసం లేనివాడూ; దుర్నయమూ= దుర్నీతీ; అతివ్యసనత్వమున్= మితిమీరిన చెడు అలవాట్లు; కల్గువారలున్= కలవారున్నూ; చేరువన్= దగ్గరగా; ఉన్కి= ఉండటం; భూపతికిన్= రాజునకు; చెట్ట= కీడు; ఒనర్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: క్రూరుడూ, పేరాశపరుడూ, మూర్ఖుడూ, చాడీలు చెప్పేవాడూ, మందగొడి, చేసిన మేలు మర్చిపోయేవాడూ, తెలివి మాలినవాడూ, అబద్ధాలాడేవాడూ, నిందపడేవాడూ, పిరికివాడూ, తెగింపు లేనివాడూ, నీతిమాలినవాడూ, మితిమించిన చెడు అలవాట్లు కలవాడూ రాజునకు దగ్గరగా ఉంటే ఆపద ముంచుకొస్తుంది.

క. ఒప్పని గుణములఁ బరఁగెడు । నిప్పురుషాధములలోన నెల్లఁ గృతఘ్నుం
డొప్పఁడు గడు; నిట్లగుటం । జెప్పెదు నితిహాస మొకటి సెప్పెద నధిపా! **470**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; ఒప్పని గుణములన్= కాని స్వభావాలచేత; పరఁగెడు= నడచుకునేటి; ఈ+పురుషాధములలోనన్+ఎల్లన్= ఈ నీచులందరిలో; కృతఘ్నుండు= చేసినమేలు మరిచేవాడు; కడున్= ఎక్కువగా; ఒప్పఁడు= తగడు; ఇట్లు+అగుటన్= ఇట్లా అవటాన్ని; చెప్పెడు= చెప్పే; ఇతిహాసము= మునుపటి కథ; ఒకటి; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: తగని స్వభావం గల నీచులలోకెల్లా చేసిన మేలు మరిచిపోయేవాడు ఎక్కువ తగనివాడు. దీనిని చెప్పే

పాతకాలంనాటి కథ ఒకటి చెప్పుతాను వినుము.

వ. అది కాశ్యపగౌతమాఖ్యానంబనం బెద్దల గోష్ఠిం బ్రవర్తిల్లు. 471

ప్రతిపదార్థం: అది= ఆ కథ; కాశ్యపగౌతమ+ఆఖ్యానంబు+అనన్= కాశ్యప గౌతముల కథ అనే పేరుతో; పెద్దల గోష్ఠిన్= పెద్దల సల్లాపాలలో; ప్రవర్తిల్లున్= ఉంటుంది.

తాత్పర్యం: ఆ కథ కాశ్యపగౌతమాఖ్యానం అనే పేరుతో పెద్దల వాడుకలో ఉన్నది.

భీష్ముఁడు ధర్మజునకు నాడీజంఘుడి చరిత్రంబు చెప్పుట (సం.12-162-281)

చ. 'వినుమొక బ్రాహ్మణుండు కులవృత్తము పెంపుఁ దొఱంగి బోయదా
నినొకత నాలిఁ జేసికొని, నెమ్మిఁ గిరాతులఁ గూడి వేఁటకుం
జనుఁ దిను మాంస మద్దురితసక్తుఁడు భోగపరుండు గావునన్
ధనము ఘటింపఁగాఁ దగు విధం బని చూచి వణిగ్జనంబుతోన్. 472

ప్రతిపదార్థం: వినుము= విను; ఒక బ్రాహ్మణుండు= ఒక బ్రాహ్మణుడు; కులవృత్తము= కులవృత్తి; పెంపున్= గౌరవాన్ని; తొఱంగి= విడిచిపెట్టి; బోయదానిన్+ఒకతన్= ఒక బోయతను; ఆలిన్+చేసికొని= పెళ్ళాంగా ఉంచుకొని; నెమ్మిన్= సంతోషంతో; కిరాతులన్+కూడి= బోయవారితో కలిసి; వేఁటకున్+చనున్= వేటాడటానికి వెళ్ళుతాడు; మాంసమున్= మాంసాన్ని; తినున్= తింటాడు; ఆ+దురితసక్తుఁడు= పాపాన్ని కూడబెట్టుకొన్న ఆ పాపి; భోగపరుండు= సుఖాన్ని మరిగాడు; కావునన్= కాబట్టి; ధనము= సంపత్తి; ఘటింపఁగాన్= కూడబెట్టుకొనటానికి; తగు విధంబు+అని= సరైన తీరు అని; చూచి= అనుకొని; వణిక్+జనంబుతోన్= వర్తకుల గుంపుతో.

తాత్పర్యం: వెనుకటికి ఓ బాపడు, తన తాతముత్తాతలనాటి నుండి వస్తున్న కులవృత్తి గౌరవాన్ని వదులుకొని ఒక బోయదాన్ని పెళ్ళాడాడు. బోయవారితో కలిసిపోయి వేటాడే వాడు, మాంసం తినేవాడు. ఆ పాపాలపుట్ట బాగా సుఖాలకు మరిగి డబ్బు సంపాదించటానికి తగిన పద్ధతి ఇది అనుకొన్నాడు. వర్తకుల గుంపుతో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. చెలిమిసేసి కొందఱు గోమట్లు బేహారంబు వెంట దేశాంతరంబునకుం జనఁ దానును వారితోడం గూడి పోవం
బోవ గిరిగహన దుర్గమస్థలంబున నొక్క వనగజంబు. 473

ప్రతిపదార్థం: చెలిమి+చేసి= నేస్తంకట్టి; కొందఱు+కోమట్లు= కొంతమంది వైశ్యులు; బేహారంబు+వెంటన్= వర్తకం కొరకు; దేశాంతరంబునకున్= మరొక రాజ్యానికి; చనన్= పోగా; తానును= తాను (బ్రాహ్మణుడు) కూడా; వారితోడన్ కూడి= వారితో కలిసి; పోవన్ పోవన్= పోగా పోగా; గిరి= కొండలలో; గహన= అడవులలో; దుర్గమ= పోవటానికి వీలులేకుండా ఉన్న; స్థలంబునన్= ప్రాంతంలో; ఒక్క వనగజంబు= ఒక అడవి ఏనుగు.

తాత్పర్యం: అందులో కొంతమంది కోమట్లు వ్యాపారం నిమిత్తం మరొకదేశానికి పోగా బ్రాహ్మణుడు వారితో కలిసి పోయాడు. అట్లా పోతుండగా కొండల్లో కోనల్లో ఒక అడవి ఏనుగు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. సాతులోని కుఱికి జనముల నున్మద । లీల నేలఁ బెట్టి కాలఁ జమరఁ
జొచ్చుటయును భీతివిచ్చి నల్దిక్కులఁ । బఱచి రెల్లవారుఁ బటు రయమున. 474

ప్రతిపదార్థం: సాతులోనికిన్+ఉటికి= వర్తకజనసమూహంమీద పడి; జనములన్= జనాన్ని; ఉన్మదలీలన్= వెర్రెత్తినట్లు; నేలన్+పెట్టి= నేలమీద పడేసి; కాలన్= కాలితో; చమరన్= తొక్కి చంపటం; చొచ్చుటయును= మొదలుపెట్టగా; భీతిన్= భయంతో; విచ్చి= విడివడి; ఎల్లవారున్= అంతమంది; పటురయమునన్= గబగబా; నల్దిక్కులన్= నాలుగు మూలలకు; పఱచిరి= పరుగెత్తిపోయారు.

తాత్పర్యం: ఆ బిడారులోని జనాన్ని పిచ్చెత్తినట్టు నేలమీదపడేసి కాలితో తొక్కి చంపటం మొదలు పెట్టింది. ఆ గుంపంతా బెదరిపోయి తలో దిక్కుకు చెల్లాచెద రయింది.

క. ఆయనయుఁ గాందిశీకుం। డై యుత్తర దిక్కు వాఱె నతి దూరముగా;
నా యెడ నొక మార్గము గని। పోయెను దాను నట పోవఁ బోవం గెలనన్. 475

ప్రతిపదార్థం: ఆయనయున్= ఆ బ్రాహ్మణుడూ; కాందిశీకుండు+ఐ= జడిసిపోయి తోవా తెన్నూ తెలియకుండా పరుగెత్తినవాడై; ఉత్తరదిక్కు= ఉత్తరం వైపునకు; అతిదూరముగాన్= చాలా దూరంగా; పాఱెన్= పరుగుతీశాడు; ఆ+ఎడన్= అపుడు; ఒక మార్గము+కని= ఒక తోవ చూచి; పోయెన్= వెళ్ళాడు; తానున్= ఆ బ్రాహ్మణుడు; అట= అక్కడి నుండి; పోవన్ పోవన్= పోగా పోగా; కెలనన్= ప్రక్కనే.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణుడూ భయంకొద్దీ దిక్కుతోచక పరుగెత్తాడు. ఉత్తరం వైపుగా చాలా దూరం పోయి ఒక దోవ చూచాడు. అతడు ఆ త్రోవలో వెళ్ళగా ఆ ప్రక్కనే. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. పాదల తఱచున జొంపమై పాడవుఁ బఱపుఁ। గలిగి వట్రువఁదనమునఁ జెలువు మిగిలి
యున్న వటభూరుహముఁ గని యుల్ల మచట। నిలువఁ గోరిన నామ్రూని నీడఁ జేరి. 476

ప్రతిపదార్థం: పాదల తఱచునన్= చిత్తొత్తుగా ఉన్న తుప్పలతో; జొంపమై= జీబుగా ఉండి; పాడవున్= ఎత్తూ; పఱపున్= వెడల్పూ; కలిగి= ఉండి; వట్రువ+తనమునన్= గుండ్రంగా ఉండటంచేత; చెలువు మిగిలి= అందగించి; ఉన్న; వట భూరుహమున్= ఒక మర్రిచెట్టును; కని= చూచి; ఉల్లము= మనస్సు; అచటన్= ఆ చెట్టు దగ్గర; నిలువన్+కోరినన్= ఉండాలనిపించగా; ఆమ్రూని నీడన్+చేరి= ఆ మర్రినీడకు పోయి.

తాత్పర్యం: దట్టంగా ఉన్న డొంకలమధ్య గుబురుగా ఉన్న ఓ మర్రిచెట్టును చూచాడు. అది చాలా ఎత్తుగా బాగా వెడల్పుగా ఎంతో గుండ్రంగా అందంగా ఉన్నది. అక్కడ కాసేపు నిలబడా లనిపించి ఆ చెట్టుక్రిందకు పోగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వనలతల కుసుమగంధము। గొని సుడివడు గాడ్పు డప్పిఁ గొండొక దేర్పం
దనుపార నచటఁ గూర్చుం। డె నతం డట్లుండ నచ్చటికి లలితగతిన్. 477

ప్రతిపదార్థం: వనలతల= అడవి తీగెల; కుసుమ గంధము= పూలసువాసన; కొని= గ్రహించి; సుడివడు= చుట్టుకొంటున్న; గాడ్పు= గాలి; డప్పిన్= అలసటను; కొండొక తేర్పన్= కొద్దిగా ఊరట కలిగించగా; అతండు= ఆ బ్రాహ్మణుడు; తనుపారన్= తృప్తిగా; అచటన్= ఆ మర్రినీడన; కూర్చుండెను= చతికిలపడ్డాడు; అట్లు+ఉండన్= అట్లా కూర్చుని ఉండగా; అచ్చటికిన్= ఆ చెట్టుదగ్గరకు; లలితగతిన్= అందంగా నడుచుకుంటూ.

తాత్పర్యం: అడవిపూలవాసనను ఇముడ్చుకొన్న సుడిగాలి అతడి అలసటను కొంచెం పోగొట్టింది. ఆ బ్రాహ్మణుడు తనివితీరా ఆ చెట్టు నీడన కూర్చున్నాడు. అంతలో అక్కడికి చక్కగా నడుచుకుంటూ. (తరువాతి వచనంతో

అన్వయం).

వ. ఒక్క మహాబకంబు వచ్చె; నది పద్మభవునకుం బ్రసాద పాత్రం బగుచు నాడీజంఘుండును రాజధర్ముండు ననుపేళ్ళం బరఁగు; నాకొక్కెరకు నమ్మట్టి నివాసంబై యుండు నప్పక్షి యట్లేతెంచి యవ్విప్రునిం గాంచి ప్రియంబు దలకొను చూడ్కి నాదరించి. 478

ప్రతిపదార్థం: ఒక్కమహాబకంబు= ఒక పెద్ద కొంగ; వచ్చెన్= వచ్చింది; అది= ఆ కొక్కెర; పద్మభవునకున్= బ్రహ్మకు; ప్రసాద పాత్రంబు+అగుచున్= దయకు నోచుకున్నదవుతూ; నాడీజంఘుండును= నాడీజంఘుడు; రాజధర్ముండున్= రాజధర్ముడు; అనుపేళ్ళన్+పరఁగు= అనే పేర్లతో ఒప్పే; ఆ కొక్కెరకున్= ఆ కొంగకు; ఆ+మట్టి= ఆ మర్రిచెట్టు; నివాసంబు+ఐ+ఉండున్= కాపురంగా ఉన్నది; ఆ పక్షి= ఆ కొంగ; అట్లు+ఏతెంచి= అట్లా వచ్చి; ఆ విప్రునిన్+కాంచి= ఆ బ్రాహ్మణుడిని చూచి; ప్రియంబు తలకొను= ఇష్టం తెలిపే; చూడ్కిన్= చూపుతో; ఆదరించి= ఆదరణ చూపి.

తాత్పర్యం: ఒక పెద్ద కొంగ వచ్చింది. ఆ కొంగ బ్రహ్మదయను నోచుకొన్నది. నాడీజంఘుడు, రాజధర్ముడూ అనేవి ఆ కొక్కెర పేర్లు. ఆ మర్రిచెట్టు మీదే ఆ కొంగ ఉండేది. ఆ కొంగ అట్లా వచ్చి బ్రాహ్మణుడిని చూచింది. ప్రేమతో ఆదరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఎందుండి యేమి పనికై । యెందుల కరిగెదవు భూసురేశ్వర! ప్రీతిం
బొందితి నినుఁ గని; తగియెడు । విందవయితి నాకు; నీదు విధముం జెపుమా!' 479

ప్రతిపదార్థం: భూసుర+ఈశ్వర!= ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా!; ఎందున్+ఉండి= ఎక్కడినుండి; ఏమిపనికై= ఏం పనిమీద; ఎందులకున్= ఎక్కడకు; అరిగెదవు?= వెళ్ళుతున్నావు?; నినున్+కని= నిన్ను చూచి; ప్రీతిన్= సంతోషాన్ని; పొందితిన్= అనుభవించాను; నాకున్= నాకు; తగియెడు= తగ్గ; విందవు+అయితి= అతిథివి అయ్యావు; నీదు విధమున్= నీ తీరును; చెపుమా!= చెప్పవలసినది.

తాత్పర్యం: 'ఓ బ్రాహ్మణోత్తమా! ఎక్కడినుండి ఎక్కడికి ఏం పనిమీద వెళ్ళుతున్నావు? నిన్ను చూచి సంతోషించాను. నాకు తగ్గ అతిథివి. నీ సంగతులు తెలియజెప్పుము'.

వ. అని యడిగిన నతం 'డేను మధ్యదేశీయుండ' గౌతముండ నొక్క మహనీయ చరిత్రుని పుత్త్రుండ; నాలస్యంబున వేదాధ్యయనాది విప్రకర్మ విరహితుండ నయి కామలోలత్వంబున బోయత యిల్లాలుగా బోయలం గలిసియుండి, పేదఱికంబునకు నలసి బేహారంబు వెంట నొక్కసాతుం గూడి పరదేశంబున కరుగుచోట గిరి గహన దుర్గమ ప్రదేశంబున. 480

ప్రతిపదార్థం: అని అడిగినన్= అని అడుగగా; అతండు= ఆ బ్రాహ్మణుడు; ఏను= నేను; మధ్యదేశీయుండన్= మధ్యదేశ నివాసిని; గౌతముండన్= గౌతముడు అనే వాడిని; ఒక్క మహనీయ చరిత్రుని= మంచినడవడికలవాడి; పుత్త్రుండన్= కొడుకును; ఆలస్యంబునన్= సోమరితనంవలన; వేద+అధ్యయన+ఆది= వేదం వల్లించటం మొదలైన; విప్రకర్మ= బ్రాహ్మణ కర్మలు; విరహితుండను+అయి= మానివేసిన వాడినై; కామలోలత్వంబునన్= కామంమీద తృష్ణతో; బోయత= బోయకాంత; ఇల్లాలుగాన్= పెళ్ళాంగా; బోయలన్= బోయవాళ్ళతో; కలిసి+ఉండి= కూడి ఉండి; పేదఱికంబునకున్= పేదతనానికి; అలసి= వేసారి; బేహారంబు వెంటన్= వ్యాపారం వెంబడి; ఒక్కసాతున్+కూడి= ఒక వర్తకులగుంపుతో కలసి; పరదేశంబునకున్= మరొక రాజ్యానికి; అరుగుచోటన్= వెళ్ళే ప్రదేశంలో; గిరి= కొండలవలన; గహన= అడవులవలనా; దుర్గమ= కాలుపెట్టలేని; ప్రదేశంబున= తావులో.

తాత్పర్యం: అని అడుగగా 'నాది మధ్యదేశం. నా పేరు గౌతముడు. నేను ఉత్తమ బ్రాహ్మణుడి కొడుకును. నేను

సోమరిపోతునై వేదాలు వల్లించటం వంటి మా జాతికర్మలను మానివేశాను. కామంలో పడి ఒక బోయదాన్ని పెళ్ళాడాను. బీదరికంతో విసిగిపోయి వర్తకం వెంబడి ఒక బిడారుతో కలిసి మరో దేశానికి వెళ్ళుతున్నాను. కాలుతీసి కాలుపెట్టలేనంత దట్టంగా ఉన్న కొండలలో అడవులలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వనకరియొక్కటి యా సా । తునకుఁ గవిసి జనచయంబుఁ ద్రుంపఁ దొడఁగుడున్
విను మెల్లవారునుం గను । కనిఁ బఱచిరి భీతి నేను గాననభూమిన్. 481

ప్రతిపదార్థం: వనకరి= అడవి ఏనుగు; ఒక్కటి; ఆ సాతునకున్= ఆ వర్తకుల గుంపుమీదికి; కవిసి= ఉరికి; జనచయంబున్= గుంపును; త్రుంపన్= చంపటానికి; తొడఁగుడున్= మొదలు పెట్టగా; వినుము= వినుము; ఎల్లవారునున్= ఆ జనమంతా; కనుకనిన్= తత్తరపాటుతో; పఱచిరి= పారిపోయారు; ఏను= నేనూ; భీతిన్= భయంతో; కానన భూమిన్= అడవిలో.

తాత్పర్యం: ఒక అడవి ఏనుగు ఆ బిడారుమీద పడి చంపబోయింది. ఆ గుంపులోని వారంతా తత్తరపడి పరుగెత్తారు. నేనూ భయపడి అడవిలో. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. పఱచి దిక్కు దప్పి భాగ్యంబు కల్మి నీ । దైన నిలయమునకు నరుగుదేరఁ
గంటి' ననిన 'మేలుగాక! నీ దారిద్ర్య । మపనయింతుఁ; జింత యపనయింపు. 482

ప్రతిపదార్థం: పఱచి= పరుగెత్తి; దిక్కు తప్పి= దారి తప్పి; అరుగుదేరన్= రాగా; భాగ్యంబు కల్మి= అదృష్టంకొద్ది; నీదైన= నీకు సంబంధించినది అయిన; నిలయమునకున్= తావలాన్ని; కంటిన్= చూచాను; అనినన్= అనగానే; మేలు+కాక= (కొంగ) మంచి జరుగుగాక; నీ దారిద్ర్యమున్= నీ లేమిని; అపనయింతున్= పోగొట్టుతాను; చింత= దుఃఖాన్ని; అపనయింపు(ము)= వదలిపెట్టుము.

తాత్పర్యం: పరుగెత్తి త్రోవ తప్పాను. నా అదృష్టంకొద్దీ నీవు ఉండే ఈ మర్రిని చూచాను.' అనగానే ఆ కొంగ, 'మంచిదే నీ బీదతనాన్ని పోగొట్టుతాను. నీవు బాధపడకుము.

వ. అంతకు నియ్యాతిథ్యంబుఁ గయికొను' మని రుచిమంతంబులగు మందాకినీ మీనంబులు సుపక్వంబులు సేసి, మధురంబు లగు వన్యఫలంబులు దెచ్చి తృప్తియగునట్లుగా నతనికి నాహారవిధి యొనర్చి, రాత్రి యగుటయుం బల్లవ పుష్పసాంద్రం బగు శయనంబు గల్పించి యబ్బకపతి యద్ధరణీసురుని తోడి సముచిత సల్లాపంబులను సుఖనిద్రను నా రాత్రి గడపి వేగుటయు, నవ్విప్రు నాలోకించి. 483

ప్రతిపదార్థం: అంతకున్= అంతలోపల; ఈ ఆతిథ్యంబున్= ఈ నా అతిథిసేవను; కయికొనుము+అని= పొందుమని; రుచిమంతంబులు+అగు= చవులూరించే; మందాకినీ= గంగానదిలోని; మీనంబులు= చేపలను; సుపక్వంబులు+చేసి= బాగా నిప్పులమీద కాల్చి; మధురంబులు+అగు= తీయటి; వన్యఫలంబులు= అడవి పళ్ళు; తెచ్చి= తీసికొని వచ్చి; తృప్తి+అగునట్లుగాన్= తనివితీరేటట్లు; అతనికిన్= బ్రాహ్మణుడికి; ఆహారవిధి= భోజన కార్యక్రమం; ఒనర్చి= చేసి (ముగించి); రాత్రి అగుటయున్= పొద్దుపోవటంవలన; పల్లవ= చిగురుటాకులతో; పుష్ప= పూలతో; సాంద్రంబు+అగు= ఒత్తుగా పరచిన; శయనంబు= పడకను; కల్పించి= కూర్చి, ఏర్పరచి; ఆ+బకపతి= ఆ కొంగలరాజు రాజధర్ముడు; ఆ+ధరణీసురునితోన్= ఆ బ్రాహ్మణుడితో; సముచిత= తగిన; సల్లాపంబులనున్= సంభాషణలతోనూ; సుఖనిద్రనున్= ఆదమరచిన నిద్రతోనూ; ఆ+రాత్రి= ఆ రేయి; కడపి= వెళ్ళబుచ్చి; వేగుటయున్= తెల్లగా తెల్లవారగానే; ఆ+విప్రున్= ఆ బ్రాహ్మణుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: తన ఆతిథ్యాన్ని అందుకొనుమన్నది. మంచిరుచిగా ఉండే గంగానదిలోని చేపలను కాల్చి తెచ్చింది. తీయటి

అడవిపళ్ళు పెట్టింది. అతిథి బ్రాహ్మణుడు తృప్తి పడేటట్లు భోజనం పెట్టింది. పొద్దు పోవటంతో చిగురుటాకులతోనూ, పూలతోనూ, ఒత్తుగా పక్కను సిద్ధం చేసింది. ఆ కొంగలరాజు ఆ బ్రాహ్మణుడు ముచ్చటలతోనూ హాయి అయిన నిద్రతోనూ ఆ రాత్రి గడిపారు. తెల్లవారగానే ఆ బ్రాహ్మణుడిని చూచి కొంగ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'వినుఁ! మిత్రుండును రజతముఁ । గనకము బుద్ధియును నాల్గుకారణములు మ
ర్త్యుని దారిద్ర్యము వాయుట । కని దేవగురుండు సెప్పె నన్నిటిలోనన్. 484

ప్రతిపదార్థం: వినుఁ= వినుము; మిత్రుండును= చెలిమికాడూ; రజతమున్= వెండీ; కనకమున్= బంగారమున్నూ; బుద్ధియును= ఆలోచనా; మర్త్యుని= మనిషి; దారిద్ర్యము= లేమితనం; పాయుటకున్= పోగొట్టటానికి; నాల్గు కారణములు= నాలుగు హేతువులు; అని; దేవగురుండు= బృహస్పతి; చెప్పెన్= చెప్పాడు; అన్నిటిలోనన్= ఈ నాలుగింటిలో.

తాత్పర్యం: 'వినుము. మనిషి పేదరికం పోవటానికి స్నేహితుడూ, వెండీ, బంగారమూ, ఆలోచనా అనే నాలుగింటిని కారణాలుగా దేవగురువు బృహస్పతి చెప్పాడు. వీటి అన్నింటిలోనూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మిత్రుం డెక్కుడు కాశ్యప । పుత్రుఁడనగు నేను నీకు భూసురవర! స
న్మైత్రి యనుష్ఠించెద నటె । పాత్రము గాకుండుదే యపార శ్రీకిన్. 485

ప్రతిపదార్థం: భూసురవర!= బ్రాహ్మణోత్తముడా!; మిత్రుండు= స్నేహితుడు; ఎక్కుడు= దొడ్డవాడు; కాశ్యప పుత్రుఁడను+అగు= కశ్యపుడి కొడుకునైన; నేను= నేను (నాడీజంఘుడిని); నీకున్= నీతో; సన్మైత్రి= మంచి స్నేహం; అనుష్ఠించెదను+అటె= చేస్తున్నవాడిని అవుతుండగా; అపార శ్రీకిన్= అంతులేని సిరులకు; పాత్రము+కాకుండుదే= తగినవాడివి కాకపోతావా!

తాత్పర్యం: ఓ బాపనయ్యా! మిత్రుడు గొప్పవాడు. కశ్యపుడి సంతానంలోని వాడనైన నేను నీతో చెలిమి చేస్తూ ఉంటే అంతులేని సిరిసంపదలకు యోగ్యుడివి కాకుండా పోతావా?

తే. నా సఖుండు విరూపాక్ష నామధేయుఁ; । డతని పురము మధువ్రజ; మదియు మూఁడు
యోజనము లిచ్చటికి; దాని కుల్ల తెరువు । వట్టి వేచని యాదైత్యభర్తఁ గనుము. 486

ప్రతిపదార్థం: విరూపాక్ష నామధేయుఁడు= విరూపాక్షుడనే పేరుగలవాడు; నా సఖుండు= నా చెలిమికాడు; అతని పురము= అతడి పట్టణం; మధు వ్రజము= మధు వ్రజం; అదియున్= ఆ పట్టణం కూడా; ఇచ్చటికిన్= ఇక్కడకు; మూఁడు యోజనములు= మూడామడల దూరం; దానికిన్= మధు వ్రజానికి; ఉల్ల తెరువుపట్టి= అంతదూరం అంత దగ్గరా కానీ తోవను బట్టి; వేచని= వడిగా వెళ్ళి; ఆ దైత్యభర్తన్= ఆ రాక్షస రాజును; కనుము= చూడుము.

తాత్పర్యం: నాకు విరూపాక్షుడనే మిత్రు డొకడు ఉన్నాడు. మధువ్రజం అతడిపట్టణం. అది ఇక్కడకు మూడామడల దూరంలో ఉంటుంది. దానికి మరీ దూరం మరీ దగ్గర కాని త్రోవ వెంబడే గబగబా వెళ్ళుము. ఆ రాక్షసరాజును ఆశ్రయించుము.

క. కాంచి యతనితో నేఁ బు । త్తెంచితినని చెప్పు; మతఁ డతిప్రీతుండై
కాంచనమును రత్నంబులు । నించితుఁగాఁ జేసి యిచ్చు నప్పుడ నీకున్.' 487

ప్రతిపదార్థం: కాంచి= చూచి; అతనితోన్= ఆ విరూపాక్షుడితో; ఏన్= నేను; పుత్తెంచితిని+అని= పంపించాను అని; చెప్పుము= చెప్పుము; అతఁడు= ఆ రక్కసిదొర; అతి ప్రీతుండు+ఐ= ఎంతో సంతోషించినవాడై; కాంచనమును= బంగారమూ; రత్నంబులున్=

మణులూ; అంచితుఁగాన్+చేసి= గౌరవించినవాడిగా చేసి; నీకున్= నీకు; అప్పుడ= అప్పటికప్పుడే; ఇచ్చున్= ఇస్తాడు.

తాత్పర్యం: విరూపాక్షుడిని చూచి అతడితో నేను పంపించినట్లు చెప్పుము. అతడు ఎంతో సంతోషిస్తాడు. బంగారం, మణులూ ఇచ్చి నిన్ను సత్కరిస్తాడు'.

క. అని యప్పురి దెస సెప్పినఁ । జని యాతం డతనిఁ గాంచి సముచిత భంగిన్
వినిపించె రాజధర్మున । కనుగలమగు సఖుఁడ ననియు నతని పనుపునన్. 488

ప్రతిపదార్థం: అని= అని; ఆ+పురిదెస= ఆ పట్టణం పోయే దిక్కును; చెప్పినన్= తెలుపగా; చని= వెళ్ళి; ఆతండు= ఆ బ్రాహ్మణుడు; అతనిన్= ఆ రక్కసి దొరను; కాంచి= చూచి; సముచిత భంగిన్= తగిన రీతిలో; రాజధర్మునకున్= నాడీజంఘుడికి; అనుగలము+అగు= అనుకూలుడనైన; సఖుఁడన్= మిత్రుడిని; అనియున్= అని కూడా; వినిపించెన్= చెప్పాడు; అతని పనుపునన్= నాడీజంఘుడు పంపటంవలన.

తాత్పర్యం: అంటూ ఆ కొంగ మధువ్రజం పోయే దిక్కును చెప్పింది. ఆ దారివెంబడి వెళ్ళి ఆ బ్రాహ్మణుడు విరూపాక్షుడిని చూచాడు. నేను నాడీజంఘుడికి ఆప్తమిత్రుడిని అని చెప్పాడు. అతడు పంపబట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అరుగుదెంచితి ననియు, ధనార్థిననియు, । నిట్లు వినిపించుటయు, రాక్షసేశ్వరుండు
దేఱకొనఁజూచి, యాత్మ నిప్పాఱుఁ డధముఁ । డగుట దోఁచుచు నున్నది; యడుగ వలయు. 489

ప్రతిపదార్థం: అరుగుదెంచితిని= వచ్చాను; అనియున్= అనీ; ధన+అర్థిన్+అనియున్= ధనాన్ని కోరివచ్చాననీ; ఇట్లు= ఇట్లా; వినిపించుటయున్= చెప్పగానే; రాక్షస+ఈశ్వరుండు= రాక్షసరాజు; తేఱకొనన్+చూచి= తేరిపార చూచి; ఆత్మన్= మనస్సులో; ఈ+పాఱుఁడు= ఈ బ్రాహ్మణుడు, అధముఁడు+అగుటన్= నీచుడు అని; తోఁచుచున్+ఉన్నది= అనిపిస్తున్నది; అడుగవలయున్= అడిగి చూడాలి.

తాత్పర్యం: డబ్బుకోరి వచ్చాను' అని బ్రాహ్మణుడు చెప్పగానే విరూపాక్షుడు అతడిని తేరిపార చూచాడు. లోలోపల 'ఈ బ్రాహ్మణుడు నీచుడుగా అనిపిస్తున్నాడు. సంగతేమిటో అడిగి తెలిసికొనాలి.'

వ. అని తలంచి. 490

తాత్పర్యం: అని అనుకొని.

క. 'కులమును విద్యయు వృత్తముఁ । గల రూ పెఱిఁగింపు' మనినఁ గలఁగక తన్నుం
దెలియంగఁ జెప్పె విప్రుం । డలఘుం డగు నసురపతియు నవికృతుఁ డగుచున్. 491

ప్రతిపదార్థం: కులమును= వంశాన్నీ; విద్యయున్= చదువునూ; వృత్తమున్= నడతనూ; కలరూపు= ఉన్నదున్నట్లుగా; ఎఱిఁగింపుము= తెలుపుము; అనినన్= అని అడగగానే; విప్రుండు= బ్రాహ్మణుడు; కలఁగక= కలతచెందక; తన్నున్= తన సంగతిని; తెలియంగన్ చెప్పెను= ఎరుకపరిచాడు; అలఘుండు+అగున్= గొప్పవాడవటంవలన; అసురపతియున్= రాక్షసరాజు విరూపాక్షుడు కూడా; అవికృతుఁడు+అగుచున్= ఎట్లాంటి (శారీరక, మానసిక) వికారాలకు లోనుకానివాడవుతూ.

తాత్పర్యం: 'నీ వంశం, నీ చదువు, నీ నడవడి ఉన్నదున్నట్లుగా చెప్పుము' అని అడిగాడు. అందుకు ఆ బ్రాహ్మణుడు

ఏ మాత్రం జంకలేదు. తన సంగతి అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. అపుడు విరూపాక్షుడు కూడా ఎట్లాంటి (మానసిక, శారీరక) వికారాలకు లోబడనివాడవుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఇతఁ డెట్టిఁ డైన నేమగు? । నతనికి సఖుఁ డట్టె బకమహత్తర సఖ్యం
బితనిం బాత్రముఁ జేయదె! । యితనికిఁ దృప్తి యగునట్టు లిత్తు ధనంబుల్.' 492

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ బాపడు; ఎట్టిఁడు+ఐనన్= ఎట్లాంటివాడైనా; ఏమి+అగున్?= ఏమవుతుంది?; అతనికిన్= అతడికి (రాజధర్మ్మడికి); సఖుఁడు+అట్టె= స్నేహితుడట; బక= కొంగ; మహత్తర సఖ్యంబు= గొప్ప చెలిమి; ఇతనిన్= ఈ బ్రాహ్మణుడిని; పాత్రమున్= యోగ్యుడిని; చేయదె!= చేస్తుంది కదా!; ఇతనికిన్= ఇతడికి; ధనంబుల్= సిరులు; తృప్తి+అగునట్టులు= కరువుతీరా; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: ఈ బ్రాహ్మణుడు ఎట్లాంటివాడైతే ఏమిలే. నాడీజంఘుడితో స్నేహమే ఈ బ్రాహ్మణుడి యోగ్యతను తెలుపుతుంది. కాబట్టి ఇతడికి కరువుతీరా ధనం ఇస్తాను'.

వ. అని నిశ్చయించి యతనికి నాహార సంఛాదనంబులు సమీచీనంబుగా నిర్వర్తింపఁ దగువారి నియోగించి, మఱునాఁడు కార్తికపౌర్ణమాసియైన భూసుర సహస్రంబులు దన గృహంబునం బసిండిపళ్ళెరంబుల భోజనంబులు సేయను, బహుళ దక్షిణలు ప్రతిగ్రహింపనుం గల నైమిత్తిక క్రియానుష్ఠానంబులు గలిగిన నమ్మహాజనంబులలోఁ గలిపి యత్యంతాదరంబున. 493

ప్రతిపదార్థం: అని; నిశ్చయించి= నిర్ణయించి; అతనికిన్= ఆ బాపడికి; ఆహార= తిండీ; సంఛాదనంబులు= మంచి బట్టలూ; సమీచీనంబుగాన్= తగ్గట్టుగా; నిర్వర్తింపన్+తగువారిన్= సిద్ధం చేయగలవాళ్ళను; నియోగించి= నియమించి; మఱునాఁడు= మర్నాడు; కార్తికపౌర్ణమాసి+ఐనన్= కార్తీక పౌర్ణమి కాగా; తన గృహంబునన్= తన (విరూపాక్షుడి) ఇంట్లో; భూసుర సహస్రంబులు= వేలకొద్ది బ్రాహ్మణులు; పసిండి పళ్ళెరంబులన్= బంగారు పళ్ళాల్లో; భోజనంబులు+చేయను= తినటానికీ; బహుళదక్షిణలు= చాలా కానుకలు; ప్రతిగ్రహింపనున్+కల= పుచ్చుకొనగల; నైమిత్తిక క్రియ= ఏదో ఒక కారణం పెట్టి చేసే కర్మల; అనుష్ఠానంబులు+కలిగినన్= ఆచరించవలసి ఉండగా; ఆ మహాజనంబులలోన్+కలిపి= వేలకొద్ది వచ్చిన బ్రాహ్మణులతోపాటు; అత్యంత+ఆదరంబునన్= ఎక్కువగా మన్నించి.

తాత్పర్యం: అని నిర్ణయించుకొని ఆ బ్రాహ్మణుడికి అవసరానికి తగ్గట్టుగా తిండీ, బట్టలూ సమకూర్చిపెట్టటానికి కొంతమందిని నియమించాడు. ఆ మరునాడు కార్తీకపౌర్ణమి. విరూపాక్షుడు తన ఇంట్లో వేలకొద్ది బ్రాహ్మణులు బంగారు పళ్ళాలలో భోజనాలు ఆరగించటానికీ, కానుకలు ఎక్కువగా పుచ్చుకొనటానికీ అనువుగా గల కర్మలు ఆచరించాడు. ఆ మహాజనంతోపాటు ఎంతో ఆదరణతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మహనీయ బహుళపూజా । సహితంబుగ భోజనంబు సంతృప్తిగ న
మ్మహితాత్ముండు నడపి దు । ర్వహ భారముగాఁగ గనకరాశియు మణులున్. 494

ప్రతిపదార్థం: మహిత+ఆత్ముండు= దొడ్డ మనస్సు కలవాడు; మహనీయ= గొప్పవైన; బహుళపూజా సహితంబుగన్= అనేకమైన సేవలతో కూడా; భోజనంబు= తిండిని; సంతృప్తిగన్= తుష్టిగా; నడపి= జరిపి; దుర్వహ= మోయలేనంత; భారముకాఁగన్= బరువు అయ్యేటట్లు; కనకరాశియున్= బంగారం ముద్దా; మణులున్= రత్నాలు.

తాత్పర్యం: దొడ్డమనస్సుగల ఆ విరూపాక్షుడు ఆ బ్రాహ్మణుడికి ఎన్నో సేవలు చేశాడు. కడుపునిండా కమ్మని తిండి పెట్టాడు. మొయ్యలేనంత బంగారం, రత్నాలు ఇచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. కుడిచిన పళ్ళెరంబును నకుంఠిత హర్షముతోడ నిచ్చినం
గడుముదమంది యెత్తికొని గాఢభరంబున మార్చి మోవఁగా
మెడయును వీఁపు మూఁపులును మిక్కిలి నొవ్వునఁ గొంకు వోవ నె
క్కుడు వెస నేఁగుదెంచెఁ గని కొక్కెర సమ్మదమంద మట్టికిన్. 495

ప్రతిపదార్థం: కుడిచిన పళ్ళెరంబునున్= తిన్న బంగారు పళ్ళాన్నికూడా; అకుంఠిత= మొక్కవోని; హర్షముతోడన్= సంతోషంతో; ఇచ్చినన్= ఇవ్వగా; కడు ముదమున్+అంది= ఎంతో సంతోషించి; ఎత్తుకొని= తీసికొని; గాఢభరంబునన్= బరువు ఎక్కువ అవటంచేత; మార్చి= అటుదిటూ, ఇటుది అటూ మార్చుకొని; మోవఁగాన్= మొయ్యగా; మెడయును= మెడకాయా; వీఁపు= వీపూ; మూఁపులును= భూజాలూ; మిక్కిలి నొవ్వునన్= ఎక్కువ నొప్పివలన; కొంకుపోవన్= కొంకరలుపోగా; కొక్కెర= కొంగ; కని= చూచి; సమ్మదము+అందన్= సంతోషించగా; ఎక్కుడు వెసన్= తొందర తొందరగా; మట్టికిన్= మర్రిచెట్టు దగ్గరకు; ఏగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: తిన్న బంగారు పళ్ళాన్ని కూడా మనసారా ఇచ్చాడు. బ్రాహ్మణుడు ఆనందంగా దాన్నీ పుచ్చుకొన్నాడు. బరువు ఎక్కువ అవటంతో భుజాలూ చేతులూ మార్చుకొంటూ మోస్తున్నాడు. బరువువలన మెడా, వీపూ, రెక్కలూ చాలా నొప్పిపెట్టాయి. ఆ నొప్పివలన వంగిపోతున్నాడు. గబగబా అంగలువేస్తూ నాడీజంఘుడు ఉండే మర్రి చెట్టును చేరుకొన్నాడు. అతడిని చూచి కొంగ సంతోషించింది.

తే. అట్లు సంతోషమునఁ దేలి యతని డప్పి ، వోవ బకవల్లభుఁడు పక్షపుటయుగమున
నల్ల వీచి యాహార సమర్పణంబు ، సేసి నిసి యైన, సుఖనిద్ర సేయుచుండ. 496

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; సంతోషమునన్= ఆనందంతో; తేలి= తృప్తిపడి; బకవల్లభుఁడు= కొంగలరాజు నాడీజంఘుడు; పక్షపుటయుగమునన్= దొప్పల్లాంటి రెండు రెక్కలచేతా; అతని= ఆ బ్రాహ్మణుడి; డప్పి= అలుపు; పోవన్= పోయేటట్లు; అల్లన్ వీచి= మెల్లగా విసరి; ఆహార సమర్పణంబు+చేసి= తిండిపెట్టి; నిసి+ఐనన్= రాత్రి కాగా; సుఖనిద్ర చేయుచున్+ఉండఁగాన్= హాయిగా కునుకు తీస్తుండగా.

తాత్పర్యం: అట్లా వచ్చిన బ్రాహ్మణుడిని చూచి కొంగ తృప్తిపడింది. దొప్పలవంటి తన రెండు రెక్కలతో మెల్లగా విసరి అతడి బడలిక పోగొట్టింది. ఆకలి తీర్చింది. రాత్రి అయింది. ఆదమరిచి నిద్రపోతుండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

నాడీజంఘుఁడు దుష్టబ్రాహ్మణునిచే మృతుండై, మరల జీవించుట (సం.12-166-2,3)

వ. ఆ దుర్బ్రాహ్మణుండు దనరేపటి పయనంబునకు నాహారంబు చింతించి 'యిమ్మహాబకంబు శరీరంబు గ్రొవ్వియున్నది; దీనియందు మాంసంబు సాలం గల; దిది యేమఱి నిద్రవోయెడుఁ; జావనడిచి చెండికొని పోయెదంగాక!' యని పాపనిశ్చయుండై చీర సక్కంగట్టికొని యొక్క కాష్ఠంబు గర యుగంబునం జిక్క నమర్చికొని. 497

ప్రతిపదార్థం: ఆ దుర్బ్రాహ్మణుండు= ఆ చెడ్డ బ్రాహ్మణుడు; తన= తన; రేపటి= మర్నాటి; పయనంబునకున్= ప్రయాణానికి; ఆహారంబు= తిండిని గురించి; చింతించి= ఆలోచించి; ఈ+మహాబకంబు= ఈ పెద్ద కొంగ; శరీరంబు= ఒళ్ళు; క్రొవ్వి+ఉన్నది=

బలిసి ఉన్నది; దీనియందు= కొంగ ఒంట్లో; మాంసంబు= కండ; చాలన్+కలదు= ఎక్కువగా ఉన్నది; ఇది= ఈ కొంగ; ఏమఱి= మైమరచి; నిద్రపోయెడున్= కునుకుతీస్తున్నది; చావన్+అడిచి= చావమోది; చెండి= చంపి ముక్కలు ముక్కలు చేసికొని; కొని పోయెదన్+కాక= ఎత్తుకెళ్ళుతాను; అని= అని; పాపనిశ్చయుండు+ఐ= చెడ్డగా తలపోసినవాడై; చీర= బట్ట; చక్కన్+కట్టికొని= బాగా బిర్రుగా లాగి కట్టుకొని; ఒక్కకాష్ఠంబున్= ఒక బడితను; కరయుగంబునన్= రెండు చేతులలో; చిక్కన్= గట్టిగా; అమర్చికొని= పొందికగా పెట్టుకొని.

తాత్పర్యం: ఆ పాడు బాపడు మర్నాటి ప్రయాణంలో తిండిని గురించి ఆలోచించాడు. ఈ కొంగ ఒళ్ళు బాగా కొవ్వి కండపట్టి ఉన్నది. ఇది ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నది. దీన్ని చావమోది మాంసాన్ని ముక్కలు ముక్కలు చేసి పట్టుకుపోవాలని దుర్మార్గంగా ఆలోచించాడు. బట్టను లాగి బిగించి కట్టుకొని రెండు చేతులతోనూ కర్రను బాగా గట్టిగా పట్టుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అందంద మెడయుఁ దలయు న । మందాటోపమునఁ బెక్కు మాఱు లడిచి చావుం
దెలియఁ జూచి యలరెడు । డెందముతో నీఁకలన్నిటిని వెస నూడ్చెన్. **498**

ప్రతిపదార్థం: అందందన్= అప్పటికప్పుడే; మెడయున్= మెడకాయా; తలయున్= తలకాయా; అమంద ఆటోపమునన్= గొప్ప తొందరపాటుతో; పెక్కుమాఱులు= పలుసార్లు; అడిచి= బాది(కొట్టి); చావున్= ప్రాణం పోవటాన్ని; తెలియన్+చూచి= నిక్కం చేసుకొని; అలరెడు= ఆనందించే; డెందముతోన్= మనస్సుతో; ఈఁకలన్నిటిని= అన్ని ఈకలను; వెసన్= తొందరగా; ఊడ్చెన్= ఊడ పెరికివేశాడు.

తాత్పర్యం: అప్పటికప్పుడే మెడమీదా తలమీదా దబదబా చితకబాదాడు. ప్రాణంపోయిందని రూఢి చేసికొన్నాడు. ఈకలన్నీ గబగబా పెరికేశాడు.

తే. ఊడ్చి బొండువు వ్రచ్చి ప్రేవురివి నంజు । డంతయును బుచ్చి పాదుకగా నమరఁ గట్టి
కొనుచు వేగుఁ బోకగుటయుఁ జనియె; నట్టి । సమయమున మేలుకని దనుజప్రభుండు. **499**

ప్రతిపదార్థం: ఊడ్చి= ఈకలు పెరికి; బొండువు= పీక; వ్రచ్చి= చీల్చి; ప్రేవు+ఉరివి= పేగులు బయటకు లాగి; నంజుఁడు+అంతయును= మాంసాన్ని అంతా; పుచ్చి= వేరుచేసి; పాదుకగాన్= మూటగా; అమరన్+కట్టికొనుచున్= పొందికగా కట్టుకొంటూ; వేఁగు బోకగుటయున్= తెల్లవారగా; అట్టి సమయమునన్= అపుడు; దనుజ ప్రభుండు= రాక్షసరాజు; మేలుకని= నిద్రనుండి లేచి.

తాత్పర్యం: ఈకలన్నీ పెరికేశాడు. పీకను చీల్చాడు; పేగులు బయటకులాగి మాంసాన్ని పొందికగా మూటకట్టుకొన్నాడు. అంతలో తెల్లవారగా విరూపాక్షుడు నిద్రనుండి లేచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పాల వలచె నేమి గీడొకొ । కలిగెడు!' నని తలఁచి మనసు గలఁగఁగఁ దనవా
రలతోడ నుగ్గడించుచుఁ । జలియించుచునుండఁ బ్రొద్దు జామెక్కుటయున్. **500**

ప్రతిపదార్థం: పాలవలచెన్= నీచుకంపు కొడుతున్నది; ఏమి కీడు= ఏమి ఆపద; కలిగెడున్+ఒకొ= రానున్నదో; అని తలఁచి= అని తలపోసి; మనసు= మనస్సు; కలఁగఁగన్= కలత చెందగా; తనవారలతోడన్= తన వారితో (రాక్షసులతో); ఉగ్గడించుచున్= చెప్పుతూ; చలియించుచున్+ఉండన్= వణకుతూ ఉండగా; ప్రొద్దుజాము ఎక్కుటయున్= జాము పొద్దెక్కగా.

తాత్పర్యం: మాంసం కంపు కొడుతున్నది. ఏం ముప్పు ముంచుకొస్తుందో ఏమో! మనస్సులో కలతగా ఉన్నది' అని తన వారితో చెప్పుతూ భయంతో వణకిపోతున్నాడు. జాము పొద్దెక్కగా.

వ. రాజధర్ముని ం దలంచి. **501**

ప్రతిపదార్థం: రాజధర్మునిన్= రాజధర్ముడిని; తలంచి= తలచుకొని.

తాత్పర్యం: రాజధర్ముడిని గుర్తుకు తెచ్చుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. నిచ్చలు వచ్చు రేపకడ నెయ్య మెలర్పఁగ మత్సఖుండు; నేఁ
డిచ్చటి కేల రాఁడు? గుణహీనత విప్రునియందుఁ గల్మి నా
యిచ్చఁ దలంచితిం; దులువ యేమి దలంచెనొ? యక్కటా! మదిం
బొచ్చెము లేదు నమ్ము బకపుంగవుఁ; డెట్లగు నొక్కొ దైవమా! **502**

ప్రతిపదార్థం: నెయ్యము= స్నేహం; ఎలర్పఁగన్= పెంపొందగా; మత్+సఖుండు= నా నేస్తగాడు; రేపకడన్= పొద్దున్నే; నిచ్చలున్= ప్రతినిత్యమూ; వచ్చున్= వస్తాడు; నేఁడు= ఈనాడు; ఇచ్చటికిన్= నా దగ్గరకు; ఏల రాడు?= ఎందుకురాలేదో; విప్రుని+అందున్= బాపనయ్యలో; గుణహీనత= నీచస్వభావం; కల్మిన్= ఉండటం; నా+ఇచ్చన్= నా మనస్సులో; తలంచితిన్= అనుకొన్నాను; తులువ= తుంటరి; ఏమి తలంచెనొ= ఏం తలపెట్టాడో; అకటా!= అయ్యో!; దైవమా!= దేవుడా!; బక పుంగవుఁడు= బకోత్తముడు; ఎట్లు+అగున్+ఒక్కొ= ఏమవుతాడో ఏమో; మదిన్= మనస్సులో; పొచ్చెము లేదు= కల్మషం ఉండదు; నమ్ము= నామాట నమ్ము.

తాత్పర్యం: నా మిత్రుడు ప్రతినిత్యం పొద్దున్నే వచ్చేవాడు. ఇవాళ ఎందుకు రాలేదో ఏమో! బ్రాహ్మణుడు నీచుడని అపుడే అనుకొన్నాను. ఈ తుచ్ఛుడు ఏం తలపెట్టాడో ఏమో? అయ్యో! దైవమా! నాడీజంఘుడు ఏం కానున్నాడో ఏమో? ఏమీ కల్మషం ఎరగనివాడు. అందరినీ నమ్ముతాడు'.

క. అని తూరవగచి యారయఁ। బనిచెం బనిగఱపి భటులఁ బలుపుర వారుం
జని బకము డొక్క యేర్పడఁ। గని యతనికిఁ జెప్పి పుచ్చి కడు వేగమునన్. **503**

ప్రతిపదార్థం: అని= అని; తూరవగచి= విచారించి; పలుపురన్= చాలా మంది; భటులన్= సేవకులను; పని+కఱపి= పురమాయించి; ఆరయన్= కొంగను వెదకటానికి; పనిచెన్= పంపాడు; వారున్= ఆ సేవకులున్నూ; చని= వెళ్ళి; బకము= కొంగ; డొక్క= ఎముకల గూడు; ఏర్పడన్+కని= కళ్ళారా చూచి; కడువేగమునన్= ఆ వెనువెంటనే; అతనికిన్= రక్కసి దొరకు; చెప్పిపుచ్చి= కబురుపెట్టి.

తాత్పర్యం: లోతుగా ఆలోచించాడు. తన పరివారానికి కొంగను వెదకండని పురమాయించాడు. ఆ పరిజనం వెళ్ళి వెదకి, కొంగ డొక్కను గుర్తు పట్టి వెంటనే ఆ సంగతి రాజునకు కబురు పంపి. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. అవ్విప్రుని చొప్పువట్టి. **504**

ప్రతిపదార్థం: ఆ+విప్రుని= ఆ బ్రాహ్మణుడి; చొప్పు+పట్టి= జాడను తెలిసికొని.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణుడు ఎటువైపుగా వెళ్ళాడో ఏమిటో తెలిసికొని. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. పరిమెయిఁ బాఱి వానిఁగని పట్టి వడిం బెడగేలు గట్టి తె
చ్చి రసురభర్త సూచి 'యిటు సేరఁగఁ దేవల దీ కృతఘ్ననిం;
బొరిగొని వే తినుం' డనినఁ బోకడ మాలిన వార మయ్య! యి
ద్దురిత శరీరముం దినఁగ దోసము మా' కని వార లొల్లమిన్. 505

ప్రతిపదార్థం: పరిమెయిన్= బాగా వేగంగా; పాఱి= పరుగెత్తి; వానిన్= ఆ బ్రాహ్మణుడిని; కనిపెట్టి= వెదకి పట్టుకొని; వడిన్= వేగిరంగా; పెడ కేలు కట్టి= చేతులు వెనక్కి విరిచికట్టి; తెచ్చిరి= రాజువద్దకు తీసికొనివచ్చారు; అసురభర్త= రాక్షసరాజు విరూపాక్షుడు; చూచి= కని; ఈ కృతఘ్ననిన్= చేసిన మేలు మరచి చంపిన ఈ బాపనయ్యను; ఇటు+చేరఁగన్= ఇట్లా నా దరిదాపులకు; తేవలదు= తీసికొని రావద్దు; పొరిగొని= చంపి; వే తినుండు= వెంటనే తినండి; అనినన్= అనగానే; ఈ దురిత శరీరమున్= ఈ పాపి బొందిని; తినఁగన్= నమలటానికి; పోకడ మాలిన వారము+అయ్య= నీతిలేని వాళ్ళమా; మాకు= మాకు; దోసము= పాపం; అని= అని; వారలు= ఆ సేవకులు; ఒల్లమిన్= ఇష్టపడకపోవటం వలన.

తాత్పర్యం: వడి వడిగా పరుగెత్తి ఆ బ్రాహ్మణుడిని వెదకి పట్టుకొన్నారు. వెంటనే రెక్కలు విరిచికట్టి రాజు ముందుకు తెచ్చారు. విరూపాక్షుడు 'ఇతడు చేసినమేలు మరచినవాడు, వీడిని నా చాయలకు తేకండి, వీడిని వెంటనే చంపి తినండి' అని సేవకులతో చెప్పాడు. ఆ మాటలు విన్న భటులు 'ఈ పాపిష్ఠి శరీరాన్ని తినటానికి మేమంత నీతిలేని వాళ్ళమా? ఇట్లాంటివి తింటే మాకు పాపం అంటుకుంటుంది' - అని ఇష్టపడకపోవటంవలన.

వ. అతండు. 506

తాత్పర్యం: ఆ విరూపాక్షుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'తినుఁడు తినకుఁ; డొం డేమై । నను జేయుఁడు; వీని నేల నా ముందటికిం
గొని వచ్చితి?' రని పలికిన । దనుజులు పురి వెడలఁ దెచ్చి తద్గాత్రంబున్. 507

ప్రతిపదార్థం: తినుఁడు= తింటే తినండి; తినకుఁడు= తినకపోతే మానండి; ఒండు+ఏమైనను= మరేమైనా మీ ఇష్టం వచ్చినట్లు; చేయుఁడు= చేయండి; వీనిన్= ఈ కృతఘ్నుడిని; నా ముందటికిన్= నా ఎదుటకు; ఏల?= ఎందుకు?; కొనివచ్చితిరి?= తీసికొని వచ్చారు?; అని పలికినన్= అని అనగా; దనుజులు= రాక్షసులు; పురి= పట్నం (మధువ్రజం); వెడలన్= వెలుపలికి; తెచ్చి= తీసికొని వచ్చి; తద్+గాత్రంబున్= ఆ బ్రాహ్మణుడి శరీరాన్ని.

తాత్పర్యం: 'తింటే తినండి లేకపోతే మానెయ్యండి. ఏం చేసినా సరే. ఈ కృతఘ్నుడిని నా ఎదుటికి ఎందుకు తెచ్చారు?' అని రాజు అనగానే ఆ రాక్షసులు మధువ్రజం వెలుపలికి తీసికొనివెళ్ళి అతడి శరీరాన్ని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వెడ గోఁతల నెత్తు రొలుక । బడఁ ద్రోచిన వచ్చి కుక్క పదుపు వెనుకకున్
జడిసెఁ గబళింప నొల్లక । కడుపులు నకనకఁ బడంగఁ గౌరవముఖ్యా!' 508

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= ధర్మరాజా!; వెడ= చిన్న చిన్న కండలుగా; గోఁతలన్= కోసిన గాయాలనుండి; నెత్తురు+ఒలుకన్= రక్తం కారుతుండగా; పడన్+త్రోచినన్= పడనెట్టగా; కడుపులు= డొక్కలు; నకనకపడంగన్= ఆకలి నొప్పితో; కుక్కపదుపు= కుక్కలమంద; వచ్చి= వచ్చిపడి; కబళింపన్= ఆ పాపి శరీరాన్ని తినటానికి; ఒల్లక= ఇష్టపడక; వెనుకకున్= వెనక్కి; జడిసెన్= మళ్ళింది.

తాత్పర్యం: రాజా! చిన్న చిన్న కండలుగా కోసిన గాయాలనుండి రక్తం చిందుతూ ఉండగా పడదోశారు. అంతలో ఆ పాపిశరీరాన్ని తినటానికి నకనకలాడుతున్న కడుపులతో కుక్కలమంద వచ్చిపడింది. అంత ఆకలితోనూ అవి ఆ పాపాత్ముడి శరీరాన్ని ముట్టకుండానే వెనక్కి తిరిగి వెళ్ళిపోయాయి'.

వ. అని చెప్పి భీష్ముండు. **509**

ప్రతిపదార్థం: అని= అని; చెప్పి= పలికి; భీష్ముండు= భీష్ముడు.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'వినుమది యట్టిద; కుక్కలుఁ, దినగా రోయుం గృతఘ్ను దేహము మాంసం
బని చెప్ప నాగమంబులు, మనుజేశ్వర! తెల్లమయ్యె మన కిచ్చోటన్.' **510**

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= ధర్మరాజా!; వినుము= వినుము; అది= ఆ తినకపోవటం; అట్టిద= అట్లాంటిదే; కృతఘ్ను దేహము= చేసిన మేలును మరిచేవాడి శరీరం; మాంసంబు= కండను; కుక్కలు; తినఁగాన్= తినటానికి; రోయున్= రోత పడతాయి; అని; ఆగమంబులు= వేదాలు; చెప్పన్= పలుకగా; మనకున్= మనక్కూడా; ఇచ్చోటన్= ఇక్కడనే ఈ విషయంగా; తెల్లము+అయ్యెన్= తేట పడింది, విశదపడింది.

తాత్పర్యం: వినుము - అది అటువంటిదే. కృతఘ్నుడి మాంసాన్ని కుక్కలు కూడా ముట్టవు, రోతపడతాయి' అని వేదాలే ఘోషిస్తున్నాయి. ఆ విషయం ఈ కథవలన మనకూ తేటతెల్లమయింది కదా!'

వ. అని పలికి వెండియు నిట్లనియె. **511**

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= భీష్ముడు ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ భీష్ముడు ఇట్లా అన్నాడు.

క. పురపురఁ బొక్కుచు బకపతి, కరంకముం దేరఁ బనిచి గారవమున నె
య్యురుఁ దాను నగ్ని యిచ్చి య, సురపతి యున్నంత వచ్చె సురపతి నెమ్మిన్. **512**

ప్రతిపదార్థం: పురపురన్+పొక్కుచున్= ఎంతో ఏడుస్తూ; బకపతి= నాడీ జంఘుడి; కరంకమున్= డొక్కను; తేరన్= తేవటానికి; పనిచి= పంపించి; నెయ్యురున్= స్నేహితులున్నూ; తానున్= తానూ (విరూపాక్షుడూ); గారవమునన్= గౌరవంతో; అగ్ని+ఇచ్చి= తలకొరివి పెట్టి; అసురపతి= రాక్షస రాజు; ఉన్నంతన్= ఉండటంతో; నెమ్మిన్= ప్రేమతో; సురపతి= దేవేంద్రుడు; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: విలవిల ఏడుస్తూ నాడీజంఘుడి డొక్కను తెప్పించాడు. స్నేహితులతో కలిసి, తాను గౌరవంగా తలకొరివి పెట్టాడు. అపుడు దేవేంద్రుడు వచ్చాడు.

క. కని యతఁడు సంభ్రమంబును, వినయంబును బెరయ గారవించి యడిగె నా
తని 'రాజధర్ము నీవే', యని దైన్యము దోప వగచి యశ్రులు దొరఁగన్. **513**

ప్రతిపదార్థం: కని= ఇంద్రుడిని చూచి; అతఁడు= విరూపాక్షుడు; సంభ్రమంబును= తత్తరపాటున్నూ; వినయంబును= అణకువా; బెరయన్= కూడుకోగా; గారవించి= గౌరవించి; దైన్యము= దీనత్వం; తోఁపన్= అవుపడగా; వగచి= దుఃఖించి; అశ్రులు= కన్నీరు;

తొరఁగన్= రాలగా; రాజధర్మున్= రాజధర్ముడిని; ఈవే= తిరిగి బ్రతికించవా; అని; అతనిన్= ఇంద్రుడిని; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: ఇంద్రుడిని చూచాడు విరూపాక్షుడు. అతడిలో తత్తరపాటు వినయం కలగలుపుగా దీనత్వం తోపగా, విలవిల ఏడుస్తూ 'నా రాజధర్ముడిని తిరిగి బ్రతికించవా' అంటూ వేడుకొన్నాడు.

వ. అడిగిన నమరవిభుండు 'నీ సఖుండు చతుర్ముఖునకు సఖుం డగుట యెఱుంగవే? వానికి వగవనేల? యవ్వారిజాసనుండు దనపాలికి ననుదినంబు వాఁడు వచ్చుటం గోరుచుండుం గావున. 514

ప్రతిపదార్థం: అడిగినన్= ప్రార్థించగా; అమర విభుండు= దేవేంద్రుడు; నీ సఖుండు= నీ చెలికాడు; చతుర్ముఖునకున్= బ్రహ్మకు; సఖుండు+అగుట= స్నేహితుడవటం; ఎఱుంగవే?= తెలియదా?; వానికిన్= నాడీజంఘుడి కొరకు; వగవన్+ఏల?= ఏడ్వటం ఎందుకు?; ఆ+వారిజ+ఆసనుండు= ఆ బ్రహ్మ; తనపాలికిన్= తన వద్దకు; అనుదినంబు= ప్రతినిత్యం; వాఁడు వచ్చుటన్= నాడీ జంఘుడి రాకను; కోరుచున్+ఉండున్= కోరుతూ ఉంటాడు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: విరూపాక్షుడి ప్రార్థన విన్న ఇంద్రుడు 'నీ చెలికాడు నాడీజంఘుడు బ్రహ్మకూ స్నేహితుడని నీకింతవరకూ తెలియదా? అతడి గురించి ఏడవటం ఎందుకు? అతడు ప్రతినిత్యమూ తన దగ్గరకు రావాలని బ్రహ్మకోరుకుంటాడు. కాబట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. పలుమాఱును రామికి ను । త్తలపడియెను; దాన నిట్టి దశ నతఁ డొందెం;
జెలి యగుట నితని డొక్కకు । నలఘువిధిన్ వహ్ని యిచ్చి తది మేల కదా! 515

ప్రతిపదార్థం: పలుమాఱును= తరుచుగా; రామికిన్= రానందుకు; ఉత్తలపడియెను= బాధపడుతుండేవాడు; దానన్= అందువలననే; అతఁడు= నాడీజంఘుడు; ఇట్టిదశన్= పైలోకాన్ని; ఒందెన్= పొందాడు; చెలి+అగుటన్= స్నేహితుడు అవటంవలన; ఇతని డొక్కకున్= ఈ కొంగ ఎముకల గూడుకు; అలఘు విధిన్= గొప్పగా; వహ్ని+ఇచ్చితి=(వి) తలకొరివి పెట్టావు; అదిమేలకదా!= అది మంచిది కదా!

తాత్పర్యం: తరచూ రానందుకు బ్రహ్మ విచారించేవాడు. అతడికి ఇట్లాంటి దశ పట్టిందంటే అతడి స్నేహితు డవటంవలననే నీ స్నేహితుడవటంవలన నీవు ఈ కొంగకు తలకొరివి పెట్టావు. అది చాలా మంచి పనికదా!

వ. అ ట్లగ్నిసంస్కారంబు సేసి నీవు వచ్చిన యనంతరంబ తచ్చితాసమీపంబున. 516

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; అగ్నిసంస్కారంబు+చేసి= దహన సంస్కారం చేసి; నీవు= నీవు; వచ్చిన+అనంతరంబ= వచ్చిన వెంటనే; తద్+చితా సమీపంబునన్= ఆ కాటినిప్పు దగ్గరలో.

తాత్పర్యం: అట్లా దహన సంస్కారం ముగించిన నీవు ఇట్లా వచ్చావో లేదో ఆ వెంటనే ఆ చితిమంట దగ్గరలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కడు నర్మిలిఁ గ్రేపుం జను । గుడుపఁ దొడఁగె నొక్క సురభి గుఱుపా లైరయం
బడు వత్స వక్త్ర ఫేనము । సుడిగాలిం దూలిపడియె సాదపై ననఘా! 517

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; ఒక్కసురభి= ఒక ఆవు; కడున్= మిక్కిలి; అర్మిలిన్= ప్రేమచేత; క్రేపున్= దూడను; చనుకుడుపన్= పాలు ఇవ్వటానికి; తొడఁగెన్= మొదలుపెట్టింది; కుఱుపాల్= చిన్న చేపువలన; బెరయన్‌పడు= చిందిపడే; వత్స=

దూడ; వక్త్రఫేనము= నోటి నురగ తుంపర; సుడిగాలిన్= సుడిగాలిచేత; సొదపైన్= చితి మీదికి; తూలిపడియెన్= చెదరిపడింది.

తాత్పర్యం: ఒక ఆవు తన దూడకు ఎంతో ప్రేమగా పాలిస్తుండగా చిన్న పాలచేపు రాగానే దూడ నోటినుండి నురగ తుంపర జారిపడింది. అది సుడిగాలికి ఎగిరి చితిమీద పడింది.

వ. దానంజేసి యన్నాడీజంఘుండు సంజీవితుం డయి యెప్పటియట్ల యొప్పెడు నాకారంబుతో నరుగుదెంచుచున్నవాఁ; డి ట్లగుటకుం గారణంబును నద్దేవుని దివ్యచిత్తంబు మహానుభావంబ.' 518

ప్రతిపదార్థం: దానన్+చేసి= నురగ పడటంవలన; ఆ+నాడీజంఘుండు= ఆ రాజధర్ముడు; సంజీవితుండు+అయి= మళ్ళీ బతికినవాడై; ఎప్పటి+అట్ల= ఎప్పటిమాదిరిగానే; ఒప్పెడున్= శోభిల్లే; ఆకారంబుతోన్= రూపంతో; అరుగుదెంచుచున్+ఉన్నవాఁడు= వస్తూ ఉన్నాడు; ఇట్లు+అగుటకున్= ఇట్లా జరగటానికి (తిరిగి బతికి రావటానికి); కారణంబు= నిమిత్తం, మిష; ఆ+దేవుని= ఆ బ్రహ్మదేవుడి; దివ్యచిత్తంబు= లోకాతీతమైన దయా; మహాను భావంబ= మహిమే.

తాత్పర్యం: ఆ నురగ పడిందో లేదో నాడీజంఘుడు తిరిగి బ్రతికాడు. మునుపటి మాదిరిగానే అదే రూపంతో వస్తూ ఉన్నాడు. ఇట్లా జరిగిందీ అంటే అది ఆ బ్రహ్మదేవుడి లోకాతీతమైన దయామహిమే!'

క. అని చెప్పె నంత బకపతి। సనుదెంచెను దనుజపతికి సమ్మద మెసఁగన్
మును వాసవుఁ డజువాక్యము। నన పాశ నిబద్ధుఁ జేసినాఁ డవ్విప్రున్. 519

ప్రతిపదార్థం: అని= అని; చెప్పెన్= చెప్పాడు; అంతన్= అంతలో; బకపతి= కొంగలరాజు నాడీజంఘుడు; దనుజపతికిన్= రాక్షస రాజు విరూపాక్షుడికి; సమ్మదము= ఆనందం; ఎసఁగన్= ఎక్కువయ్యేటట్లు; చనుదెంచెన్= వచ్చాడు; మును= కొంగ రాకముందే; వాసవుఁడు= దేవేంద్రుడు; అజువాక్యమునన= బ్రహ్మమాటమీద; ఆ+విప్రున్= ఆ బ్రాహ్మణుడిని; పాశనిబద్ధున్= తాళ్ళతో కట్టినవాడిగా; చేసినాఁడు= చేశాడు.

తాత్పర్యం: అని ఇంద్రుడు చెప్పగానే కొంగలరాజు రానేవచ్చాడు. అతడి రాకకు విరూపాక్షుడు మరింత సంతోషించాడు. అంతకు మునుపే ఇంద్రుడు బ్రహ్మ మాట ప్రకారం ఆ బ్రాహ్మణుడిని తాళ్ళతో కట్టించాడు.

క. ఆ నాడీజంఘుండును। దాని నెఱిఁగి భూసురునకుఁ దనకతమున న
ద్దీనదశయగుట కోర్వక। వాని విడుపు గోరి వేఁడె వరముగ నింద్రున్. 520

ప్రతిపదార్థం: దానిని= బ్రాహ్మణుడిని కట్టేశాడని; ఎఱిఁగి= తెలిసికొని; ఆ నాడీజంఘుండును= ఆ కొంగ; భూసురునకున్= ఆ బ్రాహ్మణుడికి; తన కతమునన్= తనకారణంగా; ఆ+దీనదశ+అగుటకున్= ఆ దైన్యస్థితి కలిగినందుకు; ఓర్వక= సహించలేక; వాని విడుపున్= ఆ బ్రాహ్మణుడి విడుదలను; కోరి= కోరుకొని; ఇంద్రున్= ఇంద్రుడిని; వరముగన్= వరంగా; వేఁడెన్= ప్రార్థించాడు.

తాత్పర్యం: ఆ రాజధర్ముడు, బ్రాహ్మణుడికి తనవలన కలిగిన దురవస్థకు తట్టుకొనలేకపోయాడు. అతడిని విడిపించుమని ఇంద్రుడిని వరం అడిగాడు.

చ. అతఁడును దివ్యబోధమున నా సమయంబున బ్రహ్మ సత్కృపా
న్వితుఁ డగు టేర్పడం గని వినీతతముం డగు రాజధర్ము వాం
ఛిత మొనరించె విప్రునకుఁ జేర్చిరి తెచ్చినవారు తద్ధన
ప్రతతియు దైత్యనాయకుఁడు పంప బకాధిపుఁ బ్రస్తుతించుచున్. 521

ప్రతిపదార్థం: అతఁడును= ఆ ఇంద్రుడూ; ఆ సమయంబునన్= వరం అడిగేటప్పుడు; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; సత్కృపా+అన్వితుఁడు+అగుట= మంచి దయతో కూడినవాడవటం; దివ్యబోధనమునన్= అతీంద్రియ జ్ఞానంచేత; ఏర్పడన్+కని= తెల్లంగా తెలిసికొని; వినీతతముండు+అగు= ఎక్కువ వినయవంతుడైన; రాజధర్ము= కొంగ; వాంఛితమున్= కోరికను; ఒనరించెన్= తీర్చాడు; దైత్యనాయకుఁడు= రాక్షసరాజు విరూపాక్షుడు; పంపన్= పంపగా; తద్= ఆ బ్రాహ్మణుడి; ధనప్రతతియున్= ధనం మొత్తాన్ని; తెచ్చినవారు= తీసికొని వచ్చినవారు (రాక్షసులు); విప్రునకున్= బ్రాహ్మణుడికే; చేర్చిరి= తిరిగి చేరవేశారు; బకాధిపున్= కొంగలరాజు నాడీజంఘుడిని; ప్రస్తుతించుచున్= పొగడుతూ.

తాత్పర్యం: ఈ వరం ఇవ్వటంలో బ్రహ్మదేవుడి దయ ఉన్నదని ఇంద్రుడు దివ్యజ్ఞానంతో తెలిసికొన్నాడు. వెంటనే బ్రాహ్మణుడిని విడిచిపెట్టి, కొంగ కోరిక తీర్చాడు. రాక్షసరాజు ఆజ్ఞతో బ్రాహ్మణధనాన్ని తెచ్చినవారు తిరిగి అతడికి ముద్రశుద్ధిగా ముట్టచెప్పారు. నాడీజంఘుడిని కొనియాడుతూ. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అవ్విప్రుండు ధనసంచయంబు మోచికొని మరలి మరలి చూచుచు సంభ్రమంబునం బోయెఁ; దదనంతరంబ. 522

ప్రతిపదార్థం: ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ధన సంచయంబున్= ధనం మొత్తాన్ని; మోచికొని= మోస్తూ; మరలి మరలి చూచుచున్= మళ్ళీ మళ్ళీ తిరిగి చూస్తూ; సంభ్రమంబునన్= తత్తరపాటుతో; పోయెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబ= ఆ తరువాత.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణుడు ధనం మూటను మోసుకొంటూ వెనక్కి తిరిగి చూస్తూ తత్తరపడుతూ పోయాడు. ఆ తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సురపతియుఁ ద్రివిష్టపమున । కరిగె; బకాధీశుఁడును నిజాలయమునకున్
గరిమంబు మెఱయఁ జనియెం । బరితుష్టుం డగుచు దైత్యపాలుం డనుపన్.' 523

ప్రతిపదార్థం: సురపతియున్= ఇంద్రుడూ; త్రివిష్టపమునకున్= దేవలోకానికి; అరిగెన్= వెళ్ళాడు; బక+అధీశుఁడును= కొంగలరాజునూ; దైత్యపాలుండు= రాక్షసరాజు; పరితుష్టుండు+అగుచున్= బాగా సంతోషించినవాడవుతూ; అనుపన్= పంపగా; గరిమంబు= గొప్పతనం; మెఱయన్= ఒప్పగా; నిజ+ఆలయమునకున్= తా నుండే తావుకు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఇంద్రుడూ స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు. విరూపాక్షుడు ఆ బకరాజు రాజధర్ముడిని సంతోషంగా సాగనంపాడు. అతడూ గొప్పగా తానుండే మర్రిచెట్టును చేరుకొన్నాడు'.

క. అని చెప్పి తాత యిట్లను । మనుమనితో నాదరమున మఱియును 'బ్రహ్మ
ఘ్ననకును నిష్కృతి గలుగును; । వినుము కృతఘ్ననకు లేదు విమలచరిత్రా! 524

ప్రతిపదార్థం: అని చెప్పి; తాత= భీష్మయ్య తాత; మనుమనితోన్= మనుమడైన ధర్మరాజుతో; మఱియును= మళ్ళీ; ఆదరమునన్= ఆపేక్షతో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; విమల చరిత్రా!= మచ్చలేని నడతకలవాడా!; బ్రహ్మఘ్ననకును= బ్రాహ్మణుడిని చంపినవాడికైనా; నిష్కృతి= పాపవిముక్తి; కలుగును= కలుగుతుంది; కృతఘ్ననకున్= చేసిన మేలు మరిచేవాడికి; లేదు= ఉండదు; వినుము= వినుము.

తాత్పర్యం: భీష్ముడు మనుమడికి కాశ్యప గౌతమోపాఖ్యానం అంతా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు. 'ధర్మరాజా! బాపనవాడిని చంపినవాడికైనా పాపనిష్కృతి ఉంటుంది కాని చేసిన మేలు మరచిపోయినవాడికి మాత్రం పాపవిముక్తి

ఉండదు.

క. ఆరయ మిత్ర ద్రోహము । దారుణమగు పాతకము కృతఘ్నత కంటెన్;
వైరము గొని విడువవలయు । నా రెండు దెఱఁగుల వారి నాప్తుల నైనన్. 525

ప్రతిపదార్థం: ఆరయన్= విచారించగా; మిత్రద్రోహము= స్నేహితుడికి కీడు తలపెట్టటం; కృతఘ్నతకంటెన్= చేసిన మేలు మరిచినదానికంటే; దారుణము+అగు= భయంకరమైన; పాతకము= పాపం; ఆ రెండు+తెఱంగులవారిన్= ఈ రెండు రకాల (మిత్రద్రోహులు - కృతఘ్నులు) వారిని; ఆప్తులనైనన్= క్షేమం కోరేవారైనప్పటికీ; వైరము కొని= విరోధం పెట్టుకొని; విడువ వలయున్= వదలిపెట్టాలి.

తాత్పర్యం: నిజానికి ఆలోచిస్తే స్నేహితుడికి కీడు తలపెట్టటం, చేసిన మేలు మరచిపోవటం కన్నా మించిన మహాపాపం. ఈ రెండు రకాల వారు మన మంచికోరుకునేవారైనా సరే - వైరం పెట్టుకొని వారిని వదలుకొనటం మంచిది.

క. మిత్రుం డైహికములు నా । ముత్రికములు నైన భద్రములు దలకొలుపున్;
మిత్ర ధనంబులలోనను । మిత్రుఁడ యెక్కు డనుమాట మెత్తురు ప్రాజ్ఞుల్. 526

ప్రతిపదార్థం: మిత్రుండు= చెలిమికాడు; ఐహికములున్= ఈ లోకానికి సంబంధించినవీ; ఆముత్రికములును+ఐన= పై లోకానికి సంబంధించినవి అయిన; భద్రములు= శుభాలు; తలకొలుపున్= కలిగిస్తాడు; మిత్ర ధనంబులలోనను= మిత్రుడూ, ధనం అనే రెంటిలోకూడా; మిత్రుఁడ= నేస్తగాడే; ఎక్కుడు= ఎక్కువ; అనుమాటన్= అనే వాక్కును; ప్రాజ్ఞుల్= పెద్దలు; మెత్తురు= మెచ్చుకొంటారు.

తాత్పర్యం: స్నేహితుడు ఇహపరలోక సౌఖ్యాలు రెంటినీ సమకూర్చగలడు. మిత్రుడూ, ధనం - ఈ రెంటిలో మిత్రుడే మిన్న - అంటూ మెచ్చుకుంటారు పెద్దలు.

క. ఉత్తమ కులజుఁడు సుగుణా । యత్తుఁడు సస్నేహమతియు నగు మిత్రునకుం
చిత్తమెలర్చు తెఱంగునఁ । బొత్తు మనఁగవలయు శుభము పొందవలసినన్.' 527

ప్రతిపదార్థం: శుభము= మేలు; పొందవలసినన్= కలగాలంటే; ఉత్తమ కులజుఁడు= ఉన్నత వంశంలో పుట్టినవాడూ; సుగుణ+ఆయత్తుఁడు= మంచి గుణాలకు వశమైనవాడూ; సస్నేహమతియున్= స్నేహాన్నికోరే బుద్ధికలవాడూ; అగు= అయినట్టి; మిత్రునకున్= స్నేహితుడికి; చిత్తము= మనస్సు; ఎలర్చు తెఱంగునన్= అలరించేటట్లు; పొత్తు= కలసి మెలసి; మనఁగవలయున్= నడచుకొనాలి.

తాత్పర్యం: ఎవరైనా మేలు పొందాలంటే మంచికులంలో పుట్టినవాడూ, సుగుణాలు కలవాడూ, మంచి స్నేహం కావాలనుకొనేవాడూ అయిన స్నేహితుడితో పొత్తు పెట్టుకొనాలి. అతడు నొచ్చుకోని రీతిలో నడచుకొనాలి'.

వ. అని యిట్లు కృతఘ్నతయు మిత్రద్రోహంబును నధిక పాతకంబు లగుటయు సన్మిత్రుఁ బాటించుట శుభంబు చేయుటయు భీష్ముండు భీమాగ్రజునకుం జెప్పె' ననిన విని 'యయ్యుత్తమ పురుషుల యడుగుటలును, నుత్తరం బిచ్చుటలును నింత లెస్సలై చెల్లెడునే? యటమీఁదఁ జెల్లిన తెఱంగు లెఱింగింపు' మనుటయు. 528

ప్రతిపదార్థం: అని= అని; ఇట్లు= ఇట్లా; కృతఘ్నతయున్= చేసిన మేలు మరిచిపోవటమున్నూ; మిత్రద్రోహంబునున్= స్నేహితుడికి

కీడు తలపెట్టటమున్నూ; అధికపాతకంబులు= మహాపాపాలు; అగుటయున్= అవటంవలన; సన్మిత్రున్= మంచి స్నేహితుడిని; పాటించుట= పొందటం; శుభంబు చేయుటయున్= మేలు చేయటమున్నూ; భీష్ముండు= భీష్ముడు; భీమ+అగ్రజునకున్= భీముడికంటె ముందు పుట్టిన ధర్మరాజుకు; చెప్పెన్= చెప్పాడు; అనినన్= అని వైశంపాయనుడు చెప్పగా; విని= జనమేజయుడు ఆలకించి; ఆ ఉత్తమ పురుషుల= మగవారిలో మొనగాళ్ళైన ధర్మరాజు భీష్ముల; అడుగుటలును= ప్రశ్నించటాలు; ఉత్తరంబు ఇచ్చుటలునున్= జవాబు చెప్పటాలు; ఇంత లెస్సలై= ఇంతటి మేలు కలవై; చెల్లెడునే= సాగుబాటవుతున్నాయా; అటమీఁదన్= ఆ పైన అవి; చెల్లిన తెఱంగులు= చలామణి అయిన తీరులు; ఎఱిఁగింపుము= తెలియ చెప్పుము; అనుటయున్= అనగానే.

తాత్పర్యం: చేసిన మేలు మరచిపోవటం, మిత్రుడికి కీడు తలపెట్టటం - అనేవి రెండూ మహాపాపాలు. అందుచేత మంచి మిత్రుడిని సంపాదించటం మేలుచేయటం - అనేవాటిని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు. ధర్మరాజు అడగగానే భీష్ముడు చెప్పిన విషయాలు లోకంలో మంచివిగా చలామణి అవుతున్నాయా? అయితే ఆ చెల్లుబాటయిన తీరులూ తెలియచెప్పవలసింది.

ఆశ్వాసాంతము

చ. స్మయభయ దర్పిత క్షుభిత సామజమర్దన రక్షణ క్రియా
శ్రయణ విలాస భాసుర భుజా! చరణ ప్రణతామర వ్రజా!
జయ విభవ ప్రభుత్వ ధనసంప దుదాత్త చరిత్ర కీర్త్యుపా
నయన కృతార్థ సేవక జనా! మునిసంభృత యోగపూజనా! 529

ప్రతిపదార్థం: స్మయ= కండకావరంతో; దర్పిత= పొగరెక్కిన; సామజ= ఏనుగు (గజాసురుడు)ను; మర్దన= చంపటం; భయ= వెఱపుతో; క్షుభిత= కలతచెందిన; సామజ= ఏనుగు (గజరాజు)ను; రక్షణ= కాపాడటం అనే; క్రియా= వ్యాపారాన్ని; ఆశ్రయణ= ఆశ్రయించటం అనే; విలాస= లీలతో; భాసుర= ప్రకాశిస్తున్న; భుజా!= చేతులు కలవాడా!; చరణ= కాళ్ళకు; ప్రణత= మొక్కుతుండే; అమర= దేవతల; వ్రజా!= సముదాయం కలవాడా!; జయ= గెలుపునూ; విభవ= వైభవాన్నీ; ప్రభుత్వ= సామర్థ్యాన్నీ; ధన= సిరినీ; సంపద్= ఐశ్వర్యాన్నీ; ఉదాత్త చరిత్ర= గొప్పనడవడినీ; కీర్తి= కీర్తినీ; ఉపానయన= పొందించటం చేత; కృతార్థ= కృతకృత్యులైన; సేవక జనా!= పరిచారకులు కలవాడా!; ముని సంభృత= ఋషులు పోషించిన; యోగ= ధ్యానంతో; పూజనా= కొలిచేవాడా!

తాత్పర్యం: పొగరుబోతు అయిన గజాసురుడిని చంపి, చెడును తుదముట్టించటం, భయంతో కలతపడ్డ గజరాజుని కాపాడి మంచిని నిలబెట్టటం వంటి చేతలను విలాసంగా చేసి చూపే చేతులు కలవాడా! దేవతలంతా ఎపుడూ మ్రొక్కుకొంటూ ఉండే పాదాలు కలవాడా! విజయాన్నీ, వైభవాన్నీ, సామర్థ్యాన్నీ, సిరులనూ. ఐశ్వర్యాన్నీ, మంచి శీలాన్ని, కీర్తినీ సమకూర్చి పెట్టటం వలన ధన్యులైన పరిచారక వర్గం కలవాడా! ధ్యానంతో కొలిచే ఋషులు కలవాడా!

క. తరణి శశినేత్ర! జగదుప । కరణీయ చరిత్ర! బోధగాత్ర! తపస్సం
భరితశమ ముని మనోజ్ఞా! । భరణీయ ప్రాజ్ఞ! విశ్వభార విధిజ్ఞా! 530

ప్రతిపదార్థం: తరణి= సూర్యుడూ; శశి= చంద్రుడూ; నేత్ర= కన్నులుగా కలవాడా!; జగత్= లోక ప్రవృత్తికి; ఉపకరణీయ= ఉపకరించే వాటిచేత; చరిత్ర!= నడవడికలవాడా!; బోధ= జ్ఞానమే; గాత్ర!= శరీరంగా కలవాడా!; తపస్= తపస్సుచే; సంభరిత=

నిండిన; శమ= అంతరింద్రియ నిగ్రహంకల; ముని= ఋషులకు; మనోజ్ఞా!= మనోహరమైనవాడా!; భరణీయ= పోషించదగ్గ; ప్రాజ్ఞ= వివేకులు కలవాడా!; విశ్వభార= ప్రపంచభారాన్నీ; విధి= బ్రహ్మను (బ్రహ్మతత్వాన్ని); జ్ఞా!= తెలిసినవాడా!, విశ్వభార విధానాన్ని తెలిసినవాడా!

తాత్పర్యం: సూర్యచంద్రులు కన్నులుగా కలవాడా! లోకపు వృత్తికి ఉపయోగించే నడవడి కలవాడా! జ్ఞానమే ఆకారంగా తాల్చినవాడా! తపోనిధులూ, నిగ్రహవంతులూ అయిన మునులకు మనోహరమైనవాడా! పోషించదగ్గ వివేకులు కలవాడా! ప్రపంచ భారాన్నీ, బ్రహ్మతత్వాన్నీ తెలిసినవాడా! ప్రపంచభారం వహించే విధానం తెలిసినవాడా!

మాలిని:

వరద చరణ లీలా! వైకృతాగమ్య శీలా!
విరతి నిరతి సేవ్యా! వేదవిద్యా విభావ్యా!
నిరవధిక విభూతీ! నిశ్చయాతీతరీతీ!
భరిత కరుణ దృష్టీ! భక్తమాధ్వీక వృష్టీ! **531**

ప్రతిపదార్థం: వరద= కోరికలను తీర్చేటటువంటి; చరణ= పాదాల; లీలా!= విలాసం కలవాడా!; వైకృత= మనోవికారులచేత; అగమ్య= తెలిసికొనరాని; శీలా!= మంచి నడతకలవాడా!; విరతి= విరాగంపట్ల; నిరతి= ఎక్కువ ఆసక్తి కలవారిచేత; సేవ్యా!= పూజించదగినవాడా!; వేద= శ్రుతుల; విద్యా= విజ్ఞానంతోనే; విభావ్యా!= తెలుసుకోదగినవాడా!; నిరవధిక= మేరలేని; విభూతీ!= ఐశ్వర్యం కలవాడా!; నిశ్చయ+అతీత= నిర్ధారించ వీలుకాని; రీతీ!= తీరు కలవాడా!; భరితకరుణ= దయతో నిండిన; దృష్టీ!= చూపులు కలవాడా!; భక్త= భక్తులకు; మాధ్వీక వృష్టీ!= ద్రాక్షావర్ష రూపమైనవాడా!

తాత్పర్యం: భక్తుల కోరికలు తీర్చే పాదలీలలు కలవాడా! మనోవికారులు తెలిసికొనలేని మంచి నడత కలవాడా! విరాగులచేత కొల్వబడేవాడా!ః వేదవిజ్ఞానంతోనే తెలియబడేవాడా! అపారమైన ఐశ్వర్యం కలవాడా! నిర్ధారించవీలుకాని తీరు కలవాడా! దయగల చూపులు కలవాడా! భక్తులపాలిట ద్రాక్షావర్ష రూపమైనవాడా! హరిహరనాథా!

విశేషం: మాలిని వృత్తంలో ప్రతిపాదంలోనూ న, న, మ, య, య అనే గణాలుంటాయి. 9వ అక్షరం యతి స్థానం. ప్రాస నియమం ఉన్నది.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బైన శ్రీ మహాభారతంబున శాంతిపర్వంబునందు తృతీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరమైన ఉభయకవిమిత్రుడనే బిరుదం కలవాడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, పండితుల ఆరాధనలచేత ప్రకాశించేవాడూ (పండితులను ఆరాధించటంచేత ప్రకాశించేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలోని శాంతిపర్వంలో మూడవ ఆశ్వాసం.

శాంతిపర్వంలోని మూడవ ఆశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము

(మొదటి భాగం)

గద్యపద్య ప్రథమపాద సూచి

పద్యము	పుట
అ	
అంగనాజనమ్ములకు	20
అంటి మట్టియెడ నింద్ర	106
అంతకు నియ్యాతిథ్యంబు	490
అంత నద్దానవేంద్రుండు	387
అంత నాభిషేచనిక	151
అంత నిక్కడ	192
అంతశ్చరమారుతములు	182
అందంద మెడయుఁ దలయు	494
అందు	282
అంబరీషుండు నానా	329
అంబుదంబులు గేశంబు	183
అకట! కూడి మెలంగి	420
అక్కపోతినాథుఁ డగ్నిలో	443
అక్కాలంబునందు	198
అక్కుమారుండు నిజ	107
అచల భక్తినిత్యంబు	215
అజుఁ డధ్వరంబు	380
అటరాముఁ డెఱిఁగి	200
అటవీదేశములందు	161
అటుగాక కర్మగతి	28
అట్టి దశఁ బుట్టు రుద్రుని	291
అట్టి పురవరంబునందు	314
అట్టి యవసరమున	111
అట్టియెడ	16
అట్టియెడఁ జూడం	142
అట్టివి దైవకృతంబులు	85
అట్టి సమయమున	429
అట్లగ్ని సంస్కారంబు	499
అట్లింద్రుండు ప్రత్యక్షం	265
అట్లుంగాక	18
అట్లుంగాక	60
అట్లుంగాక	444
అట్లు కాముబారిం	103
అట్లు జనమేజయుఁడు	448
అట్లు తన్నుందాన	464
అట్లు దండ ప్రణామంబులు	265
అట్లు దమము మహిమ	468
అట్లు నియోగుల	308
అట్లు పనవి యేడ్చు	458
అట్లు బెబ్బులి వచ్చి	371
అట్లు లోకరక్షకుం	381
అట్లు సంతోషమున	494
అట్లు సంయమివర	224
అట్లు హరిఁ బ్రస్తుతించి	192
అట్లెఱింగి	202
అట్లొసంగినం గైకొని	480
అడలున రాజధర్మ	29
అడలెదఁ బొందఁగా	79
అడవి గోవులకై కాల్చు	122
అడవిలో నొక మట్టి	407
అడవుల మీరున్న	68
అడిగిన నతండతని	468
అడిగిన నమర విభుండు	498
అడుగుటయు నమ్మహీ	328
అతండు	496
అతండును గురునకు	12
అతఁడును దివ్యబోధ	500
అతఁడును మందహాస	272
అతఁడు సమిత్కుశాభి	201
అతఁ డొడఁబడి	270
అతనిఁ దమకు నెల్ల	400
అతని కిట్టి లనియె	295
అతనికి నాతఁడిట్లను	477
అతనికి నీపయిం గరుణ	135
అతని నాశ్రయించి	387
అతని మేను కుంతి	7
అతని వీడ్కొని సంప్రీతి	109
అతిథి పితృదేవతా	130
అతిథుల దీనకోటుల	268
అతిశయిత పుణ్య	434
అదికారణంబుగా ధరణి	205
అది కాశ్యప గౌతమాఖ్యానం	486
అది గోరిన దొరకొనునే	484
అది బెట్టిదంపు వెరవున	397
అది యట్లుండె భోగంబులు	361
అదియునుంగాక	264
అదియునుంగాక	424

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అదియునుంగాక యొక్క	452	అనవుడు నక్క రాఁబనిచి	365	అని చెప్పి వెండియు	375
అదియును బుద్ధిమంతులు	236	అనవుడు నజాకశత్రుండు	356	అని చెప్పి వెండియు	473
అదియును వినవలతు	247	అనవుడు నట్లేల	411	అని చెప్పి వైశంపాయ	192
అది యెట్లంటేని	305	అనవుడు నీశీలము	388	అని చెప్పె నంత బకపతి	499
అది యెట్లంటేని	374	అనవుడు నుల్ల మెంతయు	439	అని చెప్పె ననిచెప్పి	352
అది యెకఁడేల వేద	267	అనవుడు నెగువెక్కి	457	అని చెప్పె నప్పుడు	33
అది రత్నరుచుల	177	అనవుడు బ్రహ్మదత్తు	421	అని తన మహాత్మ్యంబునం	336
అధికతపంబున నగ్ని	96	అనవుడు భయసంభ్రమ	146	అని తన వచనంబులం	323
అధిప త్రైవర్ణికుల	260	అనవుడు వాఁ డిట్లనియె	433	అని తలంచి	492
అధిప! నారదు చెలియలి	100	అనవుడు వాఁడు గువ్వ	440	అని తూర వగచి యారయ	496
అధిప! పరశురాము	14	అనవుడు సాంసారిక	265	అనిన	303
అధిప! మీతల్లి యుల్లంబు	53	అని కోపంబునఁ బల్క	462	అనిన ధర్మపుత్రుడు	466
అధిప! యివి ధార్తరాష్ట్ర	472	అని గర్వంపుమాట	462	అనిన గొంతేయాగ్రజు	357
అధ్యయన దానయజ్ఞంబు	259	అని గురుఁడు పంప	387	అనిన బాంచాలితో	44
అధ్వరంబు కంటె నధికంబు	303	అని చెప్పి	310	అనిన సంగ్రామకేళీ	331
అనఘచరిత! యిట్లు	65	అని చెప్పి తాత యిట్లను	501	అనినఁ బిల్లి కిట్టులను	412
అనఘ! ధర్మార్థ కామంబు	483	అని చెప్పి దేవేంద్రుండు	267	అనినఁ బ్రాప్త కాలుఁజ్ఞ	403
అనఘ నాలుగువర్ణము	257	అని చెప్పిన యప్పుండరీ	100	అనిన నచ్యుతుండు	87
అనఘ! నీదు బుద్ధి	233	అని చెప్పి నిజేచ్ఛ	155	అనిన నజాతశత్రుం	112
అనఘ! నీరు వట్టు	218	అని చెప్పి పురోహితుని	291	అనిన నట్ల యగుట	409
అనఘ! భయంబు నొందు	414	అని చెప్పి భీష్ముండు	312	అనిన నతనికి శారిక	422
అనఘ! యనేక దోష	297	అని చెప్పి భీష్ముండు	497	అనిన నప్పాండవోత్తముండు	346
అనఘ! యినుఁ ఢింక	216	అని చెప్పి భీష్ముండు వెండియు	402	అనిన నయ్యురు దెఱంగుల	403
అనఘ! శ్రేయస్సునకు	227	అని చెప్పి భీష్ముం డేను	246	అనిన నా ధర్మతనయుతో	287
అనదతనంబును	348	అని చెప్పి మఱియు నత	345	అనిన భయంబునొంది	389
అనధీయానుం డితఁ	244	అని చెప్పి మఱియు నిట్ల	68	అనిన భీష్ముఁ డిట్టులను	436
అనయముఁ బేర్చు కామ	384	అని చెప్పి మీర లీధర్మా	402	అనిన రోమశునకు	417
అనలము శమించు	174	అని చెప్పి యప్పార్థివుం	396	అనిన విని కరుణాయత్త	449
అన విని ధర్మితనూజుఁడు	384	అని చెప్పి యిది యుప	351	అనిన విని కౌంతేయా	309
అన విని ధర్మసూనుఁడు	231	అని చెప్పి యేను నీకు	133	అనిన విని కౌంతేయా	419
అన విని యమ్మనుజేశ్వరుఁడు	328	అని చెప్పి యేనును	109	అనిన విని చండాలుండు	432
అనవుడుఁ బార్థుఁడిట్టులను	482	అని చెప్పి వెండియు	127	అనిన విని చండాలుం డిట్ల	434
అనవుడుఁ బిల్లి యిట్టు	409	అని చెప్పి వెండియు	284	అనిన విని జనమేజయుం	224
అనవుడు గాధినందనుండు	434	అని చెప్పి వెండియు	304	అనిన విని దేవపితృ	469
అనవుడు ధర్మవృత్తము	451	అని చెప్పి వెండియు	327	అనిన విని దేవస్థానుం	56

పద్యము	పుట
అనిన విని ధర్మతనయుం	49
అనిన విని ధర్మతనయుం	302
అనిన విని ధర్మతనయుండరి	471
అనిన విని ధర్మనందనుండు	295
అనిన విని ధర్మనందనుండు	383
అనిన విని ధర్మనందనుండు	407
అనిన విని ధర్మనందనుఁడు	359
అనిన విని నిర్విణ్ణ	59
అనిన విని పవన	483
అనిన విని పాండవా	313
అనిన విని పాండవా	316
అనిన విని పౌలస్త్యుండు	294
అనిన విని ప్రీతి ధర్మ	282
అనిన విని బూరు విట్లను	461
అనిన విని యంకిలి	118
అనిన విని యజాత	268
అనిన విని యజాత	328
అనిన విని యజాత	427
అనిన విని యజాత	466
అనిన విని యజ్ఞనపతి	391
అనిన విని యజ్ఞనవిభుం	4
అనిన విని యతండు	421
అనిన విని యతఁడు	401
అనిన విని యప్పలితుండు	414
అనిన విని యమ్మునిపతి	113
అనిన విని యవ్విప్రు	146
అనిన విని యుధిష్ఠిరుండు	370
అనిన విని యుధిష్ఠిరుండు	376
అనిన విని యోడకోడకు	413
అనిన విని వార లందఱు	485
అనిన విని వారలు	254
అనిన విని వారి రావించి	208
అనిన విని వాసుదేవునకు	230
అనిన విని శారిక	423
అనిన విని శోక	19
అనిన విని సంతోషించి	367
అనిన విని సిగ్గువడి	418
అనిన శంతనుపుత్రుతో	348
అని నిందించి	420
అని నిశ్చయకుఁడై రణం	331
అని పలికి పిల్లి	409
అని పలికిన నాగృధ్రంబు	456
అని పలికిన నాపృథ్వీపతి	101
అని పలికి పాండవా	213
అని పలికి పురందరుం	266
అని పలికి పూర్వాచార	395
అని పలికి బంధుమరణ	80
అని పలికి బలు	463
అని పలికి మఱి పలుక	51
అని పలికి మఱియు	314
అని పలికి మునీంద్రా!	8
అని పలికి యగ్గోమాయువు	365
అని పలికి యగ్ని	441
అని పలికి యద్దేవి	206
అని పలికి యపుడ	444
అని పలికి యప్పారా	82
అని పలికి యవిశ్వాసము	424
అని పలికి యిట్లనియె	43
అని పలికి యెందేని	204
అని పలికి విష్ణు విశ్వాత్మ	161
అని పలికి వెండియు	88
అని పలికి వెండియు నిట్ల	497
అని పలికి సఖ్యంబుచేసి	301
అని పలికె నని చెప్పి	191
అని పలుకు జనకు	51
అని పలుకుటయు నమ్మునీం	461
అని పలుకు పార్థ	47
అని పాసి యరణ్యము	366
అని మరుత్తుండను	241
అని మఱియు ననేక	215
అని మఱియును	159
అని మఱియును	425
అని ముట్టనాడి	39
అని ముని పల్కిన	434
అనిమిషాసురయుద్ధ	94
అనిమిషులున్ విభీతు	320
అని యంత నిలువక	42
అని యంత నిలువక	416
అని యంతరంగంబున	442
అని యడిగిన నతం	489
అని యడిగిన నప్పుడమి	282
అని యడిగిన నమ్మహీ	225
అని యడిగిన నయ్యార్య	447
అని యడిగిన నాతం	82
అని యడిగిన నాదేవ	258
అని యత్తెఱంగున	325
అని యప్పురి దెస సెప్పిన	491
అని యాస పజ్జం బోవమి	397
అని యిట్లందఱుఁ జెప్పఁగ	484
అని యిట్లతుల స్తోత్రం	191
అని యిట్లప్పక్షి ధ్వంస	437
అని యిట్లప్పలితుండును	412
అని యిట్లు కృతఘ్నతయు	502
అని యిట్లు చెప్పి యపాత్ర	131
అని యిట్లు ధర్మనంద	172
అని యిట్లు నకులునకు	481
అని యిట్లు బహుప్రకారం	453
అని యిట్లు బృహస్పతి	276
అని యిట్లు శరణాగత	446
అని యిట్లు సల్లాపంబు	209
అని యిట్లు సెప్పిన వాక్య	321
అని యుల్లంబునన	438
అని యుల్లసంబాడి సముల్ల	464
అని యూఁది పలికి	65
అని యూఱడిల్లఁబలికిన	107

పద్యము	పుట
అనియె నట్టియెడం	476
అనియె నని చెప్పి భీష్ముం	391
అనియె నా ప్రబ్బలి	370
అనియె నాసేనజితుం	75
అనియె నిట్లు దమ్ములం	38
అనియె మఱియు	58
అని యెఱింగించి	88
అని యేర్పడ భాషించిన	439
అనియొక గుదిమీల	405
అని వసుహోముఁడు	383
అని వాయుదేవుఁడిట్ల	287
అని వినతుండగు నా	460
అని విశదంబుగా వివరించె	468
అని వీడ్కొల్పిన నీత	333
అని వెండియు	43
అని వెండియు	130
అని వెండియు	211
అని వెండియు	295
అని వెండియు	443
అని వెండియు	472
అనుచుఁ దదీయపాద	451
అనుచు లేచి నిలుచుటయు	459
అనుటయుం గొంతేయా	272
అనుటయుం దెలిసి	86
అనుటయుఁ గొంతేయా	114
అనుటయుఁ గొంతేయా	342
అనుటయుఁ బెలుచని	461
అనుటయు ధనదుండు	293
అనుటయు ధర్మజుండు	306
అనుటయు ధర్మజుండు	355
అనుటయు ధర్మతనయుం	311
అనుటయు నంత్యజుండు	433
అనుటయు నచ్యుతుండు	194
అనుటయు నచ్యుతుండు	226
అనుటయు నట్లకాక	11
అనుటయు నతనితో	230
అనుటయు నత్తాపసో	395
అనుటయు నమ్మహా	300
అనుటయు నమ్మునివరుం	72
అనుటయు నవ్వచనం	19
అనుటయు నాపగా	359
అనుటయు నాపగా	385
అనుటయు నాపగేయుఁడు	234
అనుటయు నిది కర్జము	404
అనుటయు నెట్టివాఁడైన	284
అనుటయు నెల్క	410
అనుటయు బ్రహ్మదత్తుం	423
అనుటయు మృగపతి	363
అనుడు నిట్టు దలఁప	416
అనుమని రని పలికి	145
అనుమానింపకు తోడ	117
అను విచారంబు దివ్య	372
అనుష్ఠించి ద్రోణాచార్య	157
అనృతము పాతకమగు	476
అనృతోపచారకలనం	125
అన్న పతితుఁడైన	121
అన్నరనాథుండు నడచి	141
అన్నరపాలుఁడు దానున్	265
అన్నలుఁ దమ్ములుఁ గలుగుట	305
అన్యాయంబునఁ బొదలిన	399
అప్పటికిఁ దోఁచినట్టలు	406
అప్పరుసునఁ బెరిఁగిన	208
అప్పుడినుఁడు మాసె	478
అప్పుడు చిత్తంబుత్తమ	153
అప్పుడు దొడంగి యంత	5
అమర గరుడ గంధర్వ	288
అమల భవదీయ	159
అమృతమథనమున	186
అమృతమయు ఋగ్యజు	179
అమృతము విద్యయు	475
అమ్మచెల్ల! యిట్టులన	461
అమ్మహాత్ముని సాత్యకి	156
అమ్మహీపతి పూజ్యరాజ్యం	52
అమ్ముగ్ధ యతని కిట్లనియె	197
అమ్మెయిఁ బలితుండు	410
అయ్యితిహాసంబు సెప్పెద	436
అయ్యుత్తమొత్తమునకు	136
అరణి నగ్ని వొడము	180
అరదము వన్నిననా	222
అరయఁగ రాజధర్మము	232
అరయుం దప్పు కృతం	284
అరయుటఁ బ్రజ వర్ధిం	317
అరి నృపాలు పెంపు	370
అరిపయిఁ బోయి వాని	327
అరిపయి వీఁకనెత్తి	347
అరి మిగులఁగొనుట	315
అరి యాఱవపాలు	69
అరియెడ మిత్రభావ	415
అరివధము పాపమని	114
అరివీరుల ఘోరంబగు	46
అరుగుచుండు వాఁడొక	446
అరుగుదెంచితి ననియు	492
అరులకడ నిజ భూమి	278
అరులను మిత్రులం	414
అర్జును పలుకు సత్యంబు	61
అర్థధర్మంబు లితరేత	482
అర్థములు బంధువులుఁ	82
అర్థవంతుఁడై భోగంబు	349
అర్థసిద్ధికంటె నరయ	322
అర్థాదులగు ఫలంబులు	395
అర్థి విశ్వాసుండాదిగా	93
అలుక గూరిమి ఫల	376
అల్పకాల భోగ్యమైన	77
అల్లఁదనంబున యనువు	102

పద్యము	పుట
అవధరింపుము	47
అవనీశ పారి యాత్రా	399
అవనీశ! యశ్వమేధము	123
అవలేపంబునఁ గర్తవ్య	241
అవహిత మతియై	235
అవు బేహారముఁ గృషి	315
అవ్యాక్యంబు లాదరింప	424
అవ్విధంబున నేను నల్లుండు	106
అవ్విప్రుండు ధనసంచ	500
అవ్విప్రుని చొప్పువట్టి	496
అశ్వమేధయాగంబున	203
అసితోత్పలచ్ఛాయమై	377
ఆ	
ఆకర్ణింపుము	264
ఆగమోక్త కర్మమాచ	119
ఆ గుహసొచ్చెం జొచ్చి	368
ఆ గృధ్రంబును జంబుకం	458
ఆతఁడు దుర్యోధనునకు	6
ఆతురత నీవు నా కడ	450
ఆదటఁ బూర్వశాస్త్రి	55
ఆదిత్యమరుద్వసు	185
ఆదిత్యు నుదయాస్తమయ	119
ఆదిమ పురుషుఁడు వగుట	160
ఆ దివిజాపగాతనయు	192
ఆ దుర్జనుండు కర్జం	22
ఆ దుర్బ్రాహ్మణుండు దన	494
ఆ నాడీజంఘుడును	500
ఆ నృపుల వంశముల	208
ఆ పనికిఁ గీడు రోయుచు	317
ఆ పరమేశ్వరుం డితని	332
ఆ పాంతపల్లియకు	440
ఆ భృగునందనుం డచ్చ	195
ఆమద్రవ్యము మణి	474
ఆయతికాఁడు వలయు	306
ఆయతి కిమ్మొయిఁ	318
ఆయనయుఁ గాంది	487
ఆ యను దన పుత్రుఁడవుట	5
ఆ యుపాయముల్ మూఁటి	325
ఆరయ మిత్రద్రోహము	501
ఆ రాక్షసుఁ గనుఁగొని	147
ఆ రాజు నగ్నిదేవుఁడు	199
ఆ రాజునట్ల చేసి మహా	309
ఆ రాజనట్ల చేసి మహా	309
ఆ రాత్రి యవ్విభుని	307
ఆరామాదిక నిజ సం	277
ఆరోగ్యము గల యుత్తము	289
ఆర్తినొంది యిటయట	430
ఆలస్యమును నసహా	367
ఆలును బిడ్డలు బంధులు	130
ఆ లుబ్ధకుఁ డత్తరువర	437
ఆశ యింత దుర్నివార	393
ఆశ్రమధర్మంబు లాకర్ణిం	260
ఆ సభలోఁ బడినట్టి	48
ఆ సమయంబున నక్కడం	177
ఆసాసల వచ్చితి నను	393
ఆస్తికతా శ్రద్ధావినయం	128
ఇ	
ఇంత నిర్బంధమేటికి	136
ఇందొక త్రాడు గఱచి	405
ఇంద్రుఁ డజుఁడు విష్ణు	358
ఇగురు జొంపంబుల	443
ఇచ్చిన నగ్నిదేవుం డాహా	199
ఇచ్చు కృప	116
ఇట్టిద బ్రదుకుఁ	418
ఇట్టివి కృత్రిమములు	364
ఇట్లగుటం దెలుపునది	299
ఇట్లగుటకు నుదాహరణం	399
ఇట్లనంగఁ దగునె	80
ఇట్టని విచారించె	372
ఇట్లుత్తముండైన విప్రుం	32
ఇట్లుదయించిన సుధా	220
ఇట్లు నారదుండును	105
ఇట్లు నితాంత కాంతి	140
ఇట్లు నిశ్శేషంబుగా	334
ఇట్లు పతివ్రతయై	104
ఇట్లు పెల్లయిన మ్రోఁతను	144
ఇట్లు ప్రీతుండై యజాత	148
ఇట్లు మహనీయ ప్రభుత్వ	255
ఇట్లు మహాతేజోధనుం	20
ఇట్లు విధాతృవశంబున	334
ఇట్లు శిష్టజనము	145
ఇట్లు సకలబాంధవ	158
ఇట్లు సేసి పరమకృపా	202
ఇతఁ డెట్టిఁడైన నేమగు	492
ఇది కల్మష సామాన్య	119
ఇది తదీయ	10
ఇది దప్పినిప్పు డియ్యెడ	430
ఇది ధర్మవిరోధంబు	54
ఇది మదీయ ధ్యానంబు	174
ఇది యిట్లాలిని బంధులం	442
ఇది రాక్షస నాశనం	478
ఇది సిద్ధాంతంబన	374
ఇనుము ఱాత నీర	237
ఇబ్బంగిం బుట్టిఁ యానక్క	360
ఇమ్మహాపాతకంబు లే	67
ఇరువది వేవురు పరి	97
ఇల నీకై కొన్న తెఱఁగు	46
ఇవి దోఁడేళులభంగి	472
ఇవి మీయన్న వోయిన	14
ఇవ్విధంబు గాక క్రొవ్వి	70
ఇవ్విధంబునకు శుక్ర	417
ఇవ్విధంబున విక్రమించు	16
ఇవ్విధంబున సదముం	333

పద్యము	పుట
ఈ	
ఈఁగకాలి యంత యేనియు	298
ఈ కథ పూర్వాపర	367
ఈ గతియెఱింగి చేసిన	302
ఈగియును బ్రియవచన	310
ఈ తాల్మిలేదు బ్రాహ్మణ	13
ఈ నాలుగాశ్రమములకు	263
ఈ పగ దీర్చెద	420
ఈ భంగియైనం	319
ఈ మూఁడు వర్ణములకును	260
ఈ యర్థంబునం దైల	290
ఈ యాఖ్యానము విని	383
ఈ యాఱింటను	472
ఈ యితిహాస మర్థి	446
ఈ రెండవదానంబులు	17
ఈ వాక్యంబులం	289
ఈ వాక్యంబులు రెండుఁ	237
ఈ సర్వజనంబుల	137
ఉ	
ఉచిత దండవృత్తి	42
ఉచిత సల్లాపంబుల	111
ఉత్తమ కులజుఁడు	502
ఉత్తమ ధర్మము సత్యము	389
ఉత్తరాయణంబు వేచి	176
ఉదధి సుఖగోష్ఠి	369
ఉన్నంత భక్ష్య	362
ఉన్నంత వేఁట దీఱి	405
ఉపరమముం	182
ఉరగాదులవలని	255
ఉరిఁ బాసియేమి	411
ఉరిద్రవ్వఁ గొఱికి	408
ఊ	
ఊడ్చి బొండువు వ్రచ్చి	495
ఎందుండి యేమి	489
ఎందునుం జరియించు	200
ఎక్కటెక్కటి పోరి	17
ఎక్కార్యములను గణ	355
ఎక్కువ తక్కువ మాటలు	305
ఎగసి యచ్చోట నిలిచి	421
ఎచయనున్నవి యొక్కొ	437
ఎచ్చోనైనను నిల్చు	262
ఎరలకై వచ్చి యిట్లు	408
ఎలుకయు బొక్క	413
ఎవ్వఁడు పుట్టిన	229
ఎఱిఁగియైన నెఱుఁగ	366
ఏ	
ఏడు దీవులయందు	91
ఏనడిగిన తెఱుంగు	484
ఏ నరుఁడు మానసము	395
ఏనుంగు హజ్జలో నెల్ల	264
ఏనుఁ గేనుంగుఁ	342
ఏనును నిట్లగుదు	445
ఏను బుట్టివేయు	457
ఏను బోయిన కొండొక	109
ఏ పాపమేని లేనిది	476
ఏపారి తొల్లి త్రేతా	428
ఏఱులుఁ జెఱువులు	428
ఏవాని బంధుమిత్రులు	25
ఒ	
ఒండొరులకు రక్షకులై	248
ఒకటి గలదు వత్తురు	457
ఒకటి దెసను దృష్ణ	51
ఒకఁడు పండ్రెండు	180
ఒకనాఁ డజుండు	463
ఒకరునికి నలిగి యాతని	274
ఒక్కటి యేను జెప్పెద	374
ఒక్క మహాబకంబు	488
ఒడఁబడి యీనివాని	396
ఒప్పకున్నను నాత్మ	114
ఒలసి మనోవాక్కాయ	390
ఒల్లనికార్యం బాసల	426
ఓ	
ఓయన్న డస్సినాఁడవు	439
ఓర్వక పెక్కండ్రు	95
ఓహో యిట్టివిగలవే	23
క	
కడపితే రాత్రిసులభ	170
కడిదిఁ మగండు కుంభజుఁడు	79
కడు నమ్మి యునికియును	243
కడు నర్మిలిఁ	499
కడు బెట్టిదుండు కాలుఁడు	455
కని భక్తిం బ్రణమిల్లుడు	393
కని యతఁడు సంభ్రమంబు	498
కపటద్యూతమునం	48
కపటము లేక వైభవము	244
కమలంబులుఁ దొవలు	73
కమలాసనుండు నిజ	478
కయ్యమునకు వలదు	278
కరుణగలవేనిఁ బ్రాణంబు	434
కర్ణసుత్సంగ	12
కర్తయును భర్తయును	214
కర్మఫలం బీశ్వరుని	114
కర్మము మేలు నా విగత	58
కలఁగిన పెద్ద మడువు	351
కలఁడు జహ్నుండనఁగాఁ	195
కలదే యిమ్మెయి పౌరుషంబు	442
కలలోనఁ జరమధాతు	121

పద్యము	పుట
కలహంబుల్ దమలోన	325
కలికాల చలిత ధర్మము	188
కలిగె లేకుండె నిట్లలఘు	154
కలిమియు చుట్టలఁ జేర్చుం	25
కల్లు ద్రావిన పాతకం	124
కల్లు ద్రావుట గురుపత్నిఁ	66
కాంచనాలంకార కాంతంబు	90
కాంచి దండప్రణామం	448
కాంచి యతనితోనేఁ	491
కాని చెయిదములు సేయక	32
కాని యటులుండి నెటి	349
కాపవ్యుం డను పేరను	400
కాపవ్యోపాఖ్యానము	402
కామము గ్రోధమున్	58
కామ భోగముల్	50
కాయలఁ బండ్ల నీళులను	45
కాలప్రభావం బిట్టిది	283
కాలమున ఘటింపఁగా	73
కాలవశంబునఁ గీడు	423
కాల విపర్యయమున	347
కావున	42
కావున	70
కావున	297
కావునం గర్మహీనత్వం	31
కావునం గులహీనులు	373
కావునఁ గామ రోషములు	267
కావున గృహస్థ ధర్మం	35
కావున చండాల	431
కావున ధర్మసిద్ధి	384
కావున నర్థసంపదలు	398
కావున నర్థసంపదలు	398
కావున నర్థంబు	482
కావున నర్థోపార్జనంబును	25
కావున నాకు దొరకొన్న	28
కావున నిట్లు సేసితి	228
కావున నిన్నుఁ బెద్ద	415
కావున నెవ్వగ నొందం	81
కావున నెవ్వగల్ విడుపు	86
కావున భృత్యులయెడ	240
కావున మేలు సేయదె	271
కావున వర్ణాశ్రమముల	299
కావున విను పాత్రము	133
కావున సకలజన	76
కావున సిద్ధసిద్ధుల	59
కాళింగుఁ డాత్మీయకన్యా	15
కిరణముల భంగి	376
కుక్క మృగములలోనెల్ల	432
కుడిచిన పళ్ళెరంబును	493
కుడువక పెట్టక శూద్రుఁడు	474
కుదురు సమస్త ధర్మములకున్	470
కురుపితామహుండు	134
కురువంశ ధురంధరుఁడగు	218
కులమని పట్టి చిత్తమున	373
కులము శీలంబు హిత	312
కులమును విద్యయు	492
కుల మొక్కఁడైనఁ దేఁకువ	354
కృష్ణుండు మా మీఁద	4
కేవల నిష్కర్మత	31
కొండొక కాలంబునకు	362
కొందఱు బ్రాహ్మణుల్	32
కొడుకు లేనిచోటఁ గూఁతు	117
కొని వచ్చి పుల్లప్రోవునఁ	440
కోట యేమఱు కెప్డు	279
కోపంబు లేమి సత్యా	258
కోరి తోఁటవాఁడు కుసుమ	285
కౌరవులు దమ దురితమున	44
కౌరవులు సేయు నవమతి	7
క్రతువు లొనరించు	473
క్రమమునఁ గామము	248
క్రమముననైన శాత్రవుల	70
క్రూరంబు గృధ్రమిట్టి	456
క్రూరుండగు కొడుకుం	197
క్రూరుఁడు లోభియున్	486
క్షత్రమునకుఁ బుట్టఁగాఁ	290
క్షత్రాత్ముఁ గొలుతు దశరథ	187
క్షత్రియ ధర్మ నిష్ఠా	59
క్షత్రియులకుఁ బ్రజా	112
క్షమ మేలగు నైన నతి	345
క్షరము నక్షరమును నీవ	172
క్షరము లైన భూతసంఘం	188
క్షితి నెందుం జరియించి	194

ఖ

ఖగములకు జీవనం	441

గ

గంగ యెవ్వనిఁ దన గర్భంబు	173
గతమునకును వగవ	350
గరదుని గృహదాహకు	41
గర్భంబుల నున్నయర్భ	203
గాంగేయుడిట్లనుఁ గౌంతేయ	454
గాండివి నొవ్వఁ బల్కితిటు	7
గురుతల్పగుండు రణమున	125
గురుతల్పగు భ్రూణహనున్	238
గురులను బంధుమిత్రుల	230
గురువునకు మాఱుపల్కుటఁ	125
గురు శుశ్రూషయు	261
గురుసంరక్షణమునకును	121
గుహయందు నిహిత	468
గోవిందుం డనిశంబు	3
గోవులను ఘోటకంబులఁ	36
గ్రద్ద మాటలకేల కడు	455
గ్రద్ద యిట్లనియె	456
గ్రస్తుండను పేర	13

పద్యము	పుట
ఘ	
ఘనభుజ విక్రమోన్నతుఁడు	4
చ	
చని యద్దేవునిం గని	249
చని సంప్రార్థించి యతని	380
చనుదెంచి యా వ్యాఘ్రవరుని	364
చనునే సాహసమిట్లు	332
చరణనాభిశీర్షంబులు	183
చరులఁబనిచి యరుల	340
చలిపందిరి చందంబున	53
చలిపందిరులును సత్రం	158
చారచక్షుఁడై కనునెల్ల	274
చాలుదురు వారు నృపతికి	306
చింతించు నతనితో	394
చెట్టును ఱాయియు మిట్టయుఁ	341
చెప్పినట్లు యేను జేసెద	64
చెఱువు నడు మవిసినను	345
చెలిమి చేసి కొందఱు	487
చేసిన దానికి మాఱుగఁ	422
చేసె నఘము దత్ఫలముం	421
చొరకున్న నజ్ఞనంబు	270
చోరులచేఁ జెడకుండ	315
చ్యవనుఁడు మార్కండేయుం	135
జ	
జడనిధి చందంబున	403
జతనంబున నర్థము	35
జనకుఁడు ప్రతర్దనునకుం	336
జనకుఁడుఁబోలె నర్మిలి	279
జనకుని వచనంబులు	50
జనన జరామరణ గ్రాహ	85
జనన మాదిగఁ బాక	94
జననముఁ దెల్పియేఁ బిలువ	19
జననాథ! నీవు సెప్పిన	52
జననాథునకు నవిశ్వాస	424
జననీజనక సహోదర	423
జననీజనకులును	350
జనమత నీవునుం దగ	68
జనమేజయనృప యంతకు	223
జన సంపూజ్య పదార	78
జను లొక్క తఱిఁ దొల్లి	269
జమదగ్ని సర్వవిద్యా	198
జీవిత సంశయవేళను	120
జ్ఞాతి నాశనమునఁ గాదె	26
జ్ఞాతివధ మట్లు సేసియు	154
జ్ఞాతుల నందఱుఁ జంపితి	21
జ్ఞాతుల నమ్మి తోడుకొని	425
జ్ఞానపరుడుఁ బౌర జాన	309
త	
తక్కిన మూఁడాశ్రమములు	34
తక్కిన రెండును నంద	404
తగునే యిట్లు?	410
తత్త్వబోధంబు గలుగు	54
తత్సంతతి జాతులెల్లను	255
తత్సమీపమునకు	224
తద్దయుశాంతుఁడై తక్కువ	352
తథ్యములైనను దలఁప	38
తన కడకు వచ్చి మొగమోడని	312
తనకీడు వైదికపు	242
తనకుం దోడ్పడి యని	327
తనకు మేలొనరించు	304
తన కొలఁది నుపాయంబులు	398
తనతోఁ గొందఱు గుక్కల	412
తన ధన మిదియని	273
తన భటులు గలఁగి	324
తన భూమిఁ బరులభూమిని	397
తనయుఁ డొకండ వాఁడు	170
తనయులనైను నమ్మిన	313
తనయొడ లెరవనినను	86
తనవారు పెద్ద సేయని	271
తనుఁ దాన తొలుత గెలువన్	276
తను హీనుం డని యెఱుఁగక	278
తపంబుల దానంబుల	122
తపమునకు విద్యకును	190
తపము నిదానము ధర్మ	469
తమతమ కలవడు	467
తమలో సరి ధర్మము	483
తమలోనఁ బొందుగల	290
తమ్ములును విప్రవరులును	137
తరణి వొడిచి తమము	233
తరణి శశాంకులతేజ	273
తరణి శశినేత్ర! జగదుప	503
తల్లిదండ్రిఁ బాయఁదగ	476
తా నటె మాంసముఁ దినదటె	363
తానున్ భార్యయు నేగుఁ	262
తాపసవర! తీవ్రంబగు	450
తారు గొందఱుకు బాధకు	74
తాలిమిఁబేర్చువారలును	485
తినుఁడు తినకుఁ డొండేమైనను	497
తురగియు నుష్ట్రియు ఖరియు	129
తూఁగాడుచుం జనువాఁడు	429
తెగఁదీర్పక తననార్పక	427
తెగిపోయిన వారేడ్చిన	454
తెరవాయున మ్రుచ్చిమి	399
తెలినీట రొంపివోవం	406
తేఁకువలేక మెలంగితిమి	159
తొడలపై నర్మిలి నిడికొని	77
తొల్లి తాన దాఁచెఁదల్లి	6
తొల్లి మాంధాతృఁడను మహీ	88
తొల్లి సృంజయుఁడను మహీ	264
తోఁచిన నతండు	445
త్రిభువన వ్యాప్త విక్రముం	170
త్రైవిద్యులగు మహాత్ములు	53

పద్యము	పుట
ద	
దండంబున సకలజన	45
దండంబు సాక్షాద్దేవుం	379
దండార్హులైనవారల	42
దండించుట దానును	311
దక్షుండై తిటు బ్రహ్మశక్తిన	293
దక్షుఁడై భూపతిదండ	44
దధిసారము చందంబున	483
దనుజనాథుఁ డిట్టులను	387
దనుజవిభుఁడు ప్రహ్లాదం	386
దనుజుం దాఁకి కృపాణ	334
దమముం గడచిన సద్ధర్మ	467
దమమునిశ్రేయసము	467
దమమును సత్యముం	212
దమియింపఁ దగినవార	317
దయఁ బ్రజ రక్షించుటకు	285
దయమాలి పోవనేటికిఁ	456
దరికొను నాఁకలిం దను	431
దాంతియు విజితాత్మత్వము	236
దానంజేసి యన్నాడీజంఘుండు	499
దానవిధి యరయ	132
దానాధ్యయన యజనము	298
దానికి రోసి బృహస్పతి	386
దాని శుక్రుండు సహస్రాధ్యాయ	250
దారుకుఁడు వన్నితెచ్చిన	223
దిగ్విజయంబునం దేజస్వి	142
దినముననెల్ల నుష్ణకర	220
దివంబుననుండి దండ	257
దివికిం జనినను నెవ్వని	76
దుఃఖంబుఁ బొమ్మని త్రోవ	72
దుఃఖంబు సుఖమును దోడివ	82
దురమునఁ గైదువుఁగొని	120
దురితములఁ జెఱుప	160
దురితము సేసి తాపము	452
దుర్గంబు లనేక	238
దుర్జయ విక్రమోజ్జ్వలుఁడు	198
దుర్జయులగు విరోధుల	48
దుర్మతు లామిష గతమగు	50
దూరమున నైదు మడువులు	193
దేవతల్ వేదవిధి	34
దేవ! భవత్ప్రసాదమునఁ	226
దేవభూదేవ పూజావిశేష	138
దేవర దివ్యచిత్తంబున	227
దేవా! వైశంపాయనుండు	1
దేవా! వైశంపాయనుండు	167
దేవా! వైశంపాయనుండు	339
దేశ విశేషంబు లాకర్ణింపు	343
దైత్యుల నిట్లు గీటడఁచి	479
ద్విరదంబుల నరదంబులఁ	140
ధ	
ధన దారాదికముల	244
ధనధాన్యంబులు కూర్చు	260
ధనధాన్య పశుసమగ్రం	474
ధన మపహరించుటయు	243
ధనమునకై ధర్మము	322
ధనములకు ధాన్యములకు	316
ధనము లుత్కృష్టంబు	56
ధనము సవరించినఁ	318
ధరణియును ఋక్షములుఁ	209
ధరణి యెందాఁక నుండు	228
ధరణీశా! నృపధర్మ	266
ధరణీసుర విత్తము	120
ధరణీసురుస్వర్ణము	125
ధర్మంబు పెరుఁగు వైదిక	282
ధర్మజునకు నీ చెప్పెడు	228
ధర్మపథంబున ధరణి	24
ధర్మప్రవృత్తి యయ్యును	323
ధర్మ మధర్మముభంగి	364
ధర్మమార్గ	66
ధర్మమునకు సిరికిఁ	320
ధర్మరతులు నర్థ	243
ధర్మవిదులు రాజు	233
ధర్మాధర్మంబులు సుఖ	378
ధాత నిన్ను నేమి ధర్మంబు	81
ధుర్యత నానాగతములగు	407
ధృతరాష్ట్రుండు దనూజు	22
న	
నకులము నులూకమును	410
నకుల సహదేవ నయ	9
నక్కకేటి వ్రతము?	363
నగుచుఁ బర్వతుండు	105
ననుఁ గని యొండు సత్త్వము	372
నను నీవు పదస్థుని	366
నన్నుం గృతకృత్యునిం	162
నన్ను మనమునఁ	444
నమ్మఁ దగనివారి	417
నమ్మమి మృత్యువు పెద్దయు	303
నరపతి ధర్మోపేక్షా	283
నరరూపంబునఁ బరఁగెడు	40
నరవర! వాసవుం	453
నరవర సరసాన్నంబులుఁ	83
నఱకఁదగని మ్రాను	126
నఱకుట యర్థముఁ	312
నవమగు రథమున	139
నాకును నీకు నేటికి	294
నాతోడి బాంధవంబు	360
నాయం దచట నచట	206
నాయట్లు వడిన యంగన	43
నారదుఁడు మదనబాణా	102
నారసింహవపు రుదార	186
నారాయణ పరములు	190

పద్యము	పుట
నాలుగు వర్ణంబులకును	214
నావుడు మదాత్మబ్రాహ్మణ	433
నా శరీరం బాహారంబు	441
నా సుఖుండు విరూపాక్ష	491
నిచ్చలు వచ్చు రేపకడ	495
నిజదారైకపరత్వముం	261
నిజధర్మవర్తియగు	263
నిదురపోవుచోట నీరు	340
నిను బోంట్లను నమ్మక	418
నిను సౌముఁడవని	360
నిన్నొత్తి చెప్పుటకు	298
నియతిమెయి నెవ్వఁడింద్రియ	275
నిరూపించి యిట్లనియె	171
నిశ్చయించి సముచిత	65
నీకుం బాపంబునకుం	116
నీకు మున్పోలె నవ్యాకుల	210
నీవ చుట్టంబుఁ బక్కంబు	37
నీవడవి కరుగ	30
నీవడిగిన పూర్వవృత్తాంతం	208
నీవలచిన యట్లుసేయు	435
నీవలన నేను బ్రదికితి	417
నీ వార్య బోధితుండవు	62
నీ వాశ్రయణీయుండవు	361
నీవు తపోవిశేషమహ	213
నీవు దక్కంగ మందాకినీ	226
నీవున్ ధర్మవిరోధులైన	118
నీవు బ్రాహ్మణుండవని	14
నీవు సమస్త ధర్మ	47
నీ వెవ్వండ వన నప్పురుషుం	389
నృపతి పరోహితు	292
నృపధర్మము లన్నియు	234
నృపులు గారెవారు?	203
నృపునందు విధి	41
నెమకు పరివారమమ్మా	363
నెయ్యము సెడినను	422
నేమపుఁదెర	27
నేరక చేర నొక్కనిన	40
నేర్పరి పెక్కువిధంబుల	116
న్యాయశాస్త్ర	69

ప

పద్యము	పుట
పంచవిధ వృత్తులగు	469
పంచాత్మకంబైన పవనం	171
పగయుఁ గల్గెనేని	422
పగవాఁడు బలములఁ	326
పట్టినఁ బ్రబలుండగు	299
పడసి యింద్రుండుశీల	388
పతి మదికి నింతయొక్కిన	438
పతులు మృతులైనఁ	72
పదంపడి	441
పదపడి విప్రులు	205
పనివడి త్రవ్వి కూపము	29
పను లేము సేయఁగా	49
పరదారగమనదోష	126
పరనారీ గమనాది	320
పరపురుష సంగమంబు	126
పరపు లోఁతునుగల	313
పరమ నియతిమై	299
పరమమగు యశము	227
పరమాయుఃపరమార్థ	337
పరమేశ పుణ్యసుబ్రహ్మణ్య	189
పరశురాముఁ డనఁగ	187
పరహితము సిగ్గుపాటుం	391
పరహితము సేయఁబూని	433
పరిఘనాముఁ డైన	412
పరిమెయిఁ బాఱి వానిఁ	496
పరిశుద్ధిలేని కుత్సిత	289
పరిమాసంబునఁ దేలి	240
పరుఁ డసంగుఁడు ధర్మ	377
పరుల వధింపక యెవ్వఁడు	35
పరసఁదనము మెయి	285
పఱచి దిక్కుదప్పి	489
పలకలవార లగ్రమునఁ	341
పలుమాఱును రామికి	498
పవనునకును నీకును	461
పసగన్ వే చనిదోర్బలంబు	330
పసరపు టెంప ప్రోవు	429
పాండవాగ్రజుండు పాపంబు	465
పాడియు నాడియు బ్రదుకు	131
పాణిగ్రహణానంతరంబ	103
పానము జూదము వేటయు	426
పాపంబు దొడరుటయు	447
పాపంబు బుద్ధిపూర్వ	447
పాపంబులుంబోలెనుండి	120
పాపాత్ముఁడొక బోయ	436
పాఱెడు నీరెడ త్రెవ్వఁగఁ	404
పుడమి యేలుట డిగ్గ	52
పుణ్యకర్ములఁ జేయుచు	127
పుణ్యతమము భోగా	336
పునుకఁ గుక్కతిత్తిఁ	132
పరపురఁ బొక్కుచు	498
పురిక యనఁగఁ నెగడు	359
పురుషవ్యాఘ్రు మనంబు	87
పురుషుఁ డీశ్వరుండు	379
పులగముఁ బాయస	130
పులి గూనల దినుచందము	317
పులినమలెడు మాంసము	362
పుష్టగోలక్ష	124
పూర్వవంశ్యుల	92
పెక్కుండ్రతోడ నీరస	348
పెనుఁ బొల	448
పేదమనసగుట	40
పేదలకును	42
పొదల తఱచున	488
పొదలు	80

పద్యము	పుట
పొనరిచి యాడెడు	243
పొలవలచె	495
పో రుడుగను	70
ప్రకృతి పురుషయోగీ!	165
ప్రకృతి లేడింటి నెఱి	236
ప్రజ్ఞాకార్యంబు	449
ప్రతినకు నీడుగా	464
ప్రభువుల నుపచారంబుల	318
ప్రయతు లగు	161
ప్రసన్నుండ	172
ప్రాణములు వోవకుండఁగఁ	430
ప్రాణహాని దప్పించుచోఁ	121
ప్రాయోపవేశమున	80
ప్రియంబంది భీష్మం డతని	467
ప్రియమున ధర్మనందనుఁడు	303
ప్రేమ సంప్రీతివినయ	156
ఫలములయెడ బ్రహ్మార్పణ	31
బ	
బంటు లుత్సహించి పగఱ	342
బలఁగముగల భూపాలుఁడు	305
బలవంతుఁడైడన శత్రుని	417
బలవంతులైన చుట్టం	414
బలవద్రిపులు ప్రయోజన	415
బలవిక్రమ సందపన్నుఁడ	401
బలుపగఱ వలని యాపద	418
బలుపుటురిఁ జిక్కి పేరాకలితో	416
బహుబంధు మరణ శోక	87
బహురత్నమయ ఘన	162
బహుళమగు గర్వమునఁ	426
బాల మరణ శోకంబునఁ	459
బావలు మఱఁదులు ననుచు	159
బాససేయవే యట్టుంగాక	366
బాహాగర్వము సూపఁగోరి	330
బాహుదానవియం	67
బిగువెడలక నిలిచి	370
బుద్ధిమంతునివలన	364
బ్రదికియున్ననేఁ దపంబు	432
బ్రహ్మక్షత్రము లొంది	289
బ్రహ్మతేజోనిహతి నిట్లు	147
బ్రహ్మదత్తుండనఁ బరఁగిన	419
బ్రహ్మవిద్వేషంబుఁ బరికించి	99
బ్రహ్మశక్తిఁ బేర్చి రాజు	292
బ్రహ్మణ క్షతసంత్రాణ	255
బ్రహ్మణానుజ్ఞతోఁ గూడ	157
బ్రాహ్మణునకు దమము	258
భ	
భక్తాంభోరుహ బాలసూర్య	164
భక్తియు నార్జవమును	215
భల్లంబుల్ పరఁగించి	16
భవదీయ కృపనాశ్రయింప	450
భవదీయసభ యొప్పు	385
భవదుఃఖ భరనిరాస	165
భావమున నమ్మొయికి	109
భీతి యొకటి గోరుట	450
భీష్మం డాభీమాగ్రజం	231
భీష్మపాలికిం బోదము	193
భువన భయంకరంబు	3
భూతంబుల సంసరణ	211
భూతముల మ్రింగి లోక	183
భూతములు జరామరణోపేతం	484
భూత వృద్ధులు ధనలాభములు	319
భూపాలక! వినుఁ పంచ	475
భూరమణుఁడు కాలము	282
భూవిబుధుల కెయ్యది	451
భూవి స్తారము నాక్రమించి	71
భోగములఁ బాషి నిందా	30
భ్రాతమహాత్ముఁడు గర్ణం	78
మ	
మంగళ ప్రకారంబున	221
మంగళము విష్ణుదేవుఁడు	189
మంచి మగండవైన నిను	330
మంజు పాఠకరవమును	221
మడువింకఁగఁ బాఱెడు	403
మణిహేమ పర్యంకమహి	169
మత్తుఁ బ్రమత్తుని విషయా	278
మత్ప్రసాదంబున నీదృశ	219
మదమును రాగమున్	49
మనకేటి రాజ్యమొండొక	21
మనఁ జను నుప్పు నుప్పులను	301
మనమున ధర్మమునర్థం	485
మన్ననకున్ మదింప	304
మనుగడ దప్పు	463
మనుజులు సేయ నెవ్వరు	113
మనుజేంద్ర! సంకల్పమునఁ	471
మరల గాంగేయుకడకు	137
మఱవకయుండు నీ బిరుదు	462
మఱవవచ్చునె నా కభిమన్యు	76
మఱియు జననమరణం	73
మఱియును	141
మఱియు బృహస్పతి	245
మఱియు రాజునకు	280
మఱియు విదుర యుయుత్సు	163
మఱునాఁడు కల్యంబునం	138
మహనీయ బహుళపూజా	493
మాంధాతృండు నాభాగుండు	386
మాతృ పితృ దారపుత్ర	85
మాన లోభములఁ గామ	253
మానుషీక్షీరంబు నీనిన	129
మార్దవమున మృదువు	427
మాఱుకొన్నవారి నీఱు	149

పద్యము	పుట
మాలని రాక చూచి భయ	41
మాసర్యయ నాబ్దమయో	184
మితభోజియై వివిక్త	127
మిత్రుం డెక్కుడు కాశ్యప	490
మిత్రుం డైహికములు నా	501
మిత్రుం చేఁతలన్ సుఖము	81
మిఱ్ఱు పల్లంబునై మెలఁగ	99
మీనయి తా నతలగతం	185
ముంగికి గూబకు నగపడి	408
ముట్టఁబడి దీర్ఘసూత్రుం	406
మునిదత్తమగు మంత్రమున	9
మునిదివిజాదిక లోకము	184
మునిపతి వాశ్వామిత్రుడు	429
మున్నింద్రప్రస్థంబున	385
మూఢతమబుద్ధ లగు	75
మూలబలమున సంతుష్టంబై	323
మృగములుఁ బక్షులు	344
మృతీఁబొంది రాక్షసుండై	13
మృదు మధుర వాక్యముల	310
మేది నీపతి యతిమృదు	239
మేలనుభవించుఁ జుట్టము	473
మేలు దనకుఁ గోరు	235
మేలు వేఱు తలంపనేల	215
మేలుసేసి తగినమిత్రుని	413
మొనదీర్చు వెరవు	313
మ్రుచ్చిమియును అంకు	300
మ్రుచ్చుల మూఢత్వమునం	108
మ్రొక్కివేఁడెద	146

య

పద్యము	పుట
యజనము దానకర్మము	259
యదువంశంబున వాసు	188
యమనియమాద్యష్టాంగ	33
యాగములును భోగములు	274
యానాసనాన్నపాన	475
యుచితవర్తన	101
యౌవనంబున దప	92
యజ్ఞపరిశిష్ట	57

ర

పద్యము	పుట
రక్ష ప్రజగోడు	36
రక్షఃపిశాచగుహ్యక	288
రథగమనరవంబు	223
రయంబున రాజసన్నిధి	64
రసగంధాద్యనుభవములు	287
రాచకూఁతుమీఁద రాగంబు	103
రాచకొడుకు గాఁడె	420
రాజటె రాగహీనుఁడటె	211
రాజధర్మునిం దలంచి	495
రాజధర్మోపాత్తంబై	61
రాజనామమునకు భాజనం	247
రాజునకుఁ బ్రజ శరీరము	276
రాజు నుత్తమగుణ	268
రాజు మూడు భాగముల	283
రాజ్యలాభ లోభ	78
రాముం డుద్ధతరోషపావక	202
రోషము శోకము రాగ	466

ఱ

పద్యము	పుట
ఱేని యమమరణమునఁ	444

ల

పద్యము	పుట
లక్షభార్యల నుపలాలించి	96
లాభంబు ధర్మముఖ్యము	322
లావులు వెరవులుఁ దాల్మిలుఁ	143
లీలమూరిఁబో నచ్చర	445
లోకపాలాత్ములరు మీరు	266
లోకమునఁ గలుగు భూసుర	158
లోకములు లోకధర్మంబు	273
లోపలరాఁజుచుఁ	305

వ

పద్యము	పుట
వందిజనులుఁ బాఠకులుం	141
వగచి వెలవెలంబాఱి	441
వచ్చినఁ దన మెడ సాఁగిన	368
వచ్చినఁ దత్పదాంబురుహ	479
వచ్చి ముట్టి కయ్యమిచ్చిన	201
వచ్చి యరుణకమలం	67
వడముడియును నీవు	55
వదన బాహారుపదము	184
వనకరి యొక్కటి	489
వనమున నెక్కటి నీవే	392
వనలతల కుసుమగంధము	488
వరద చరణలీలా!	503
వర్ణముల నాశ్రమంబుల	76
వర్ణములు నాశ్రమంబులు	263
వర్ణాశ్రమాచారవంతులు	357
వలదు శంకింప నింద్రుని	107
వల నధికంబుగాఁ గలుగు	83
వలనుఁ గులంబులేని	374
వలయునేని యధిప!	118
వలలోననున్న పులుఁగుల	443
వసువులందును బెద్దవు	212
వాఁడియగు నలుక	29
వాఁడును మలమూత్ర	108
వాగ్విభుఁడవైన నీ	217
వానయు సీతును వర్జించి	340
వానింజూచి యాబుషులు	252
వానినున్మూలింప మీకు	369
వామన రూపంబున	187
వారల పెద్దలు నాకై	207
వారలు మెచ్చునట్టి	388
వారాహ రూపమున	186
వారి యాశ్రమముల	63

పద్యము	పుట
వారు గదాగణములు	253
వారునుం దత్సమయ	253
వాని గాని యట్టివనిత	126
వావిరిమాటలఁ దేలక	367
వాహనాసన శయ్యా	271
వికచముఖుఁడగుచు	425
విడువు ముమ్మలికంబు	115
విద్వత్సమూహంబు	150
వినఁ బఠించిన	460
విని ప్రహ్లాదుఁడు గృప	388
విని వారు దెలిసి మరలం	33
విని వినివాఁడపోలెం	426
విని సృంజయుండును	111
వినుఁ కర్షకులును	316
వినుఁ కాలిన కొఱవి	252
వినుఁ కుటుంబ భృత్య	473
వినుఁ కొంద ఱల్పబుద్ధులు	449
వినుఁ కొందఱినఁ గడు	345
వినుఁ గర్భిణి ప్రజ	240
వినుఁ చల్లని మాటలలో	424
వినుఁ చిల్లియిడిన	327
వినుఁ జనమేజయ	191
వినుఁడీ సుఖమును	75
వినుఁడు! ధర్మార్థ	252
వినుఁ తల్లియును దండ్రి	355
వినుఁ తీర్థయాత్ర సని	393
వినుఁ తొల్లి కృతయుగం	247
వినుఁ దొదవ్వులఁ గార్యము	406
వినుఁ ధర్మంబున ధనమగు	482
వినుఁ ధర్మమునకు	320
వినుఁ! నీకామిష మేను	416
వినుఁ నృప! రాజ్యామిషముం	245
వినుఁ నృప! సమ్రాట్టు	275
వినుఁ! పర్జన్యుఁడు భూతము	295
వినుఁ పశుహింసాకృత	46
వినుఁ బండారము పెరుఁగని	398
వినుఁ బ్రహ్మవహ్ని నాకుం	432
వినుఁ మగ్గోవిందుఁడు	358
వినుఁ మట్టి మంత్రి	304
వినుఁ మది యట్టిద	497
వినుఁ మరిఁ జంపనుం	346
వినుఁ మర్థార్జకులును	353
వినుఁ మశననిగ్రహము	469
వినుమళి యలరునఁ	483
వినుఁ మారాజు సమస్త	292
వినుఁ మాస్తికతా శ్రద్ధా	127
వినుఁ! మిత్రుండును	490
వినుఁ మివ్వాక్యము లెవ్వఁడు	358
వినుఁ మీగోమాయువు	365
వినుము	66
వినుము	269
వినుము ఋగ్వేదాది	381
వినుము కర్మము దెల్పుచు	122
వినుము గుణవంతు	395
వినుము చెప్పెద శీలంబు	390
వినుము! తన్ను గెలుచు	277
వినుము తమోమయం	35
వినుము తఱివేచి	425
వినుము దివస్పతి	58
వినుఁ ముద్యోగము రెంటి	235
వినుము నరేంద్ర విప్రుఁ	18
వినుము నరేంద్ర సర్వ	145
వినుము! నేల దోఁచికొని	422
వినుము! ప్రజ్ఞాధిరూఢుఁడై	51
వినుము పాపముల కెల్లను	465
వినుము మయూరంబు	375
వినుము మహాభూతము	222
వినుము వివిధ సుఖము	297
వినుము విశేషించి జనన	291
వినుఁ మొక బ్రాహ్మణుండు	486
వినుఁ మొక్క యితిహాస	371
వినుఁ లోభమునజ్ఞానం	466
వినుఁ విప్రులు వేదలగుట	474
వినుఁ శంఖుండును	63
వినుఁ సకల భూతముల	219
వినుఁ సురతోఁ గూడఁగ	129
విప్రుని దండించు నెడలునుం	238
విప్రుల కధ్వయన ప్రదానా	230
విభుఁడు లేకున్న జనములు	273
విభుని సకలధర్మ	283
విమల జ్ఞానులు శమమును	56
వివిధోత్పాతంబులకున్	288
విశేషించి పురోహితుం	286
విశ్వసృజులను మునులచే	181
విషాద వివర్ణుండగుచు	394
విషానల సదృశంబులగు	217
విష్ణుఁజూడ నీవు వేడుక	265
విష్ణుమయ మగ్ని	190
విహతాశుండై లజ్జా	396
వీని నన్నింటి రిత్తవో విడిచి	36
వీరె వసువులు విమానంబులతో	216
వీరోదారోగ్రలీలన్ విదముఁడు	333
వీర్యవంతములగు వివిధ	152
వెడ గోఁడలనెత్తురొలుక	497
వెడలిన నీవెవ్వతవని	389
వెడలి సమరంబు	293
వెడవెడ నప్పలుకుల	27
వెనుఁబడు చిత్తవృత్తియును	103
వెరవును లావును గలిగిన	350
వెరవున నూఁతల	405
వెలుఁడు నెడఁ దెలివితో	344
వెలివెలి వస్తువుల్ విడిచె	37
వేదంబులు నిట్లుసెప్పు	26
వేమఱు శత్రునిం	347
వేయేల? సంభవించునె	212

పద్యము	పుట
వైదికధర్మచారి జన	43
వైరివధంబు నీకును	60
వ్యవహారశుద్ధి సర్వ	311
వ్రతచర్యయు భాగ్యం	143
వ్రతసమన్విత భూసుర!	10
వ్యాకులతఁబొంది రూపఱు	232
శ	
శంతనుసూను గౌరవము	175
శంతను నందనుఁడపర	225
శతశృంగుం డనియోడి	329
శరణముసొచ్చినం దగ	439
శరణాగతసంరక్షణ	436
శరణాగతుండ భక్తుఁడ	190
శరణాగతుఁ గాచియు	328
శరతల్పంబునఁ బొల్చు	224
శరతల్పగతుం డతఁడే	174
శరభ సింహాత్యుగ్ర	98
శరముల వలనను	218
శవంబు విడిచిపోవం	455
శాంత మనసుఁడైన	135
శాంతుఁడు గాకని నాయుధ	238
శాపప్రాప్తికి నోర్చి	104
శాపము గారణముగ	200
శిలఁ ద్రెంపఁబోయి	237
శిల చేవమ్రాను దెప్పగ	132
శివ! నారాయణ! యచ్యుత!	217
శిశుజన మునిజన	401
శీలంబు మైత్రి కరుణ	468
శీలవంతులైన సిరి	386
శుచియును హంసుండు	178
శుక్రమతంబునం బంచమో	325
శోకాగ్నిదనికిన	39
శౌర్యము సత్యంబును	373

పద్యము	పుట
శ్రద్ధ వలయు మిథ్య	302
శ్రీధుర్యకరణ	339
శ్రీమంతుఁడును బల	452
శ్రీ శుచితాధృతి కరణ	167
శ్రీ సంక్రామణ నిపుణ	1
శ్రుతి వాక్యంబులు కర్మ	54
శ్రుతివిహిత కర్మజాత	28
ష	
షండునకు బిడ్డనిచ్చిన	132
స	
సంగరంబునం జంపుట	71
సంతతోత్సాహవంతుఁడై	245
సంతసంబుతోడ	361
సంవర్తుఁడను మహా	89
సకలధర్మ ప్రకారంబు	225
సకలవర్ణ ధర్మసంకర	242
సత్యంబు వలుకుట	356
సత్యప్రకార ధర్మము	378
సత్యాకృతులగు గుణ	470
సద్వంశ జన్మంబు	84
సన్మార్గమున రాజ్య	90
సమతయు దమము	470
సమధిక నిరవద్య	338
సమరము సాహసం బధిక	324
సముచితంబుగా నమ్మహా	481
సరిగా నెన్నుదు రార్యులు	24
సర్వమునందును దానున్	185
సాంగ వేదవేదియగు	284
సాతులోని కుటికి	487
సారథ్యంబు వహింప	139
సారపుసిరి చేటు	350
సారహీనములగు సంసార	27

పద్యము	పుట
సిరి విడుచును బురుషుని	351
సుద్యుమ్నుండను ధరణీ	62
సుమతిఁ ద్రైవర్ణికులకు	263
సుమహితమగు నీ	481
సురగురుఁడును శుక్రుం	44
సురతటినీ పుణ్యతమో	134
సురపతియుఁ ద్రివిష్ట	500
సురపతి విభవము	254
సురపితృకోట్లం	180
సురలును నసురులు	211
సువ్యక్త క్షేత్రంబున	181
స్పృంజయుం డుజ్జ్వలశ్రీ	110
సైనికుల మనములు	349
సౌమ్యు లసౌమ్యులభంగి	359
స్తవరాజం బనఁగ ముని	191
స్థల ముఖ్యములయ్యెడు	315
స్ఫురితవిమానము	445
స్మయభయ దర్పితక్షుభిత	502
హ	
హర సురపతిమయ	18
హరిఫాలంబునఁ బుట్టి	256
హరియుఁ బరాశరాత్మ	112
హరి సహస్ర శీర్ష	179
హరుఁడును సర్వమేధ	57
హరుఁడు బెట్టుగ నవ్వి	479
హరునివలనఁ బడసి	250
హర్మ్యములనుండి పణ్య	142
హల ముసల ధరుని	187
హింసాదోషంబు	35
హింసావిహారియైన	473
హితుఁడగు మంత్రి	365
హీనప్రజ్ఞుఁ డకార్యము	449
హైహయుండు	392